రామాయణ విషవృక్షం

2

రంగనాయకమ్మ

(1)

RSKOJG

రామాయణ విష్కల్పవృక్షం

(రెండవ భాగం)

రంగనాయకమ్మ


నవోదయ పబ్లికేషన్స్
హైదరాబాద్

స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్
ప్రచురణ నెం. 19
"రామాయణ విషవృక్షం – 2"
మొదటి ముద్రణ : ఆగస్టు – 1975
రచనాకాలం : జనవరి, 1975 నుంచి
ఆగస్టు, 1975 వరకూ.

ముఖచిత్రం : త్రిగుణ్

అట్టమీద అక్షరాలు : సత్యారాం

వెల రు. 16-00



ముద్రణ :
సుబ్రహ్మణ్యేశ్వర ప్రింటింగ్ ప్రెస్,
విజయవాడ–2.

ఇందులో....

పేజీ నం.

1. మొదటిభాగం గురించి కొంచెం .... పీఠిక – 1

2. కల్పనా – వాస్తవం .... పీఠిక – 3

3. ప్రక్షిప్తాల ఘోష .... పీఠిక – 27

4. పవిత్ర రామాయణం .... పీఠిక – 83

5. రామాయణం సాహిత్యం కాదా ? .... పీఠిక – 97

6. కొన్ని ప్రశ్నలూ —

కొన్ని సందేహాలూ —

కొన్ని వ్యతిరేక విమర్శలూ — .... పీఠిక – 139

7. కొన్ని అనుకూల విమర్శలు .... పీఠిక – 175

8. మూడో కథ తర్వాత నాలుగోకథవరకూ — (లింకు–1) 1

9. అతనికంటె ఘనుడు ! (కథ) ... 11

10. నాలుగో కథ తర్వాత ఐదోకథవరకూ — (లింకు–2) 43

11. రావొద్దంటే విన్నదా ? (కథ) 60

12. ఐదో కథ తర్వాత ఆరోకథవరకూ — (లింకు_3) 109

13. కామశాస్త్రిలు (కథ) 125

14. తోడు దొంగలు (రాముడూ – సుగ్రీవుడూ) – (కథ) 151

15. స్నేహ బండారం (కథ) 265

16. ఎనిమిదో కథ తర్వాత తొమ్మిదో కథవరకూ (లింకు_4) 330

17. సీతా రావణులు (కథ) 380

18. తొమ్మిదో కథ తర్వాత పదో కథ వరకూ – (లింకు_5) 436

19. కాణీ ఖర్చులేని బహుమానం (కథ) 465

"సమాజంలో విప్లవం తెచ్చే భావాలు — అని ఎవరైనా అన్నారంటే, పాత సమాజంలో కొత్త సమాజ బీజాలు మొలకెత్తాయన్నమాట; పాత సమాజ పరిస్థితులతోపాటు పాత భావాలుకూడా క్షీణిస్తున్నాయన్నమాట."

— మార్క్స్
— ఏంగెల్స్

"When people speak of ideas that revolutionise society, they do but express the fact, that within the old society, the elements of a new one have been created and that the dissolution of the old ideas keeps even pace with the dissolution of the old conditions of existence."

— MARX
— ENGELS

వెందటిభాగం గురించి కొంచెం....

"రా"మాయణ విషవృక్షం" — మొదటి భాగాన్ని కొందరు చాలా ఇష్టంతో మెచ్చుకున్నారు.

కొందరు చాలా తీవ్రంగా విమర్శించారు. కొన్ని పత్రికలు హర్షించి అనుకూలమైన సమీక్షలు రాశాయి.

ఒకటి రెండు పత్రికలు మండిపడుతూ వ్యతిరేకించాయి.

కొన్ని "గొప్ప పత్రికలు" సమీక్షలకోసం పంపిన పుస్తకాలు దిగమింగి వూరుకున్నాయి. రేడియో సమీక్షకులు కూడా మౌనం వహించారు.

నాకు వొచ్చిన వుత్తరాలలో కూడా అన్నిరకాలూ వున్నాయి. చాలా సంతోషించినవీ, చాలా వ్యతిరేకించినవీ, కొంచెం సంతోషించినవీ, కొంచెం వ్యతిరేకించినవీ, వ్యంగ్యాలూ, వెటకారాలూ, వ్యక్తి ధూషణలూ, వ్యక్తి కీర్తనలూ — అన్నీ.

వ్యక్తులద్వారా విన్న అభిప్రాయాలలో కూడా రెండు రకాలూ వున్నాయి.

మొత్తంగా చూస్తే మాత్రం "విషవృక్షాన్ని" నేనుకూడా అనుకోనంతగా ఇష్టపడ్డారు పాఠకులు. విషవృక్షానికి పాఠకుల ఆమోదం ఏ మాత్రం లభించినా అది పాఠకుల చైతన్యానికి రుజువే. అది వర్గ చైతన్యం కావొచ్చు. హేతువాద చైతన్యం కావొచ్చు. కేవలం సమాజ మూఢత్వాన్ని వ్యతిరేకించడం మాత్రమే కావొచ్చు.

అయితే కొంతమంది పాఠకుల ఆమోదం మాత్రమే ప్రజలందరి ఆమోదం కాదు. రెండో పక్షంలో తీవ్రమైన వ్యతిరేకత వుండవచ్చు. ఆ విషయం విస్మరించదగ్గది కాదు.

కానీ, వర్గభేధాలున్న సమాజంలో ఏ పుస్తకానికీ రెండు వర్గాల ఆమోదమూ ఏకగ్రీవంగా, ఎన్నడూ లభించదు.

ఒక వర్గం విషవృక్షాన్ని ఇష్టపడదు. పైగా కాయకల్పంలా వ్యతిరేకిస్తుంది.

ఇక రెండోవర్గంలో కూడా అనేకమంది ఇది తమ పక్షమేనని గ్రహించే చైతన్యం లేక, జరగకూడని ఘోరం జరిగినట్లు విముఖత చూపిస్తారు. (స్త్రీలనుంచీ, సాంఘికంగా "తక్కువ" స్థితికి చెందిన పురుషులనుంచీ కూడా నాకు వొచ్చిన వుత్తరాలే దీనికి రుజువు. — అన్నిరకాల అభిప్రాయాలూ వొకేచోట జతపరుస్తున్నాను.)

విషవృక్షమే కాదు, ఇంకే వృక్షమైనా ఏ గ్రంథమైనా, సమాజంలో ఒక వర్గానికే ప్రయోజనకరంగా వుండి, రెండో వర్గానికి వ్యతిరేకం అవుతుంది. ఒక పుస్తకం ప్రజల్ని ప్రభావితుల్ని చెయ్యవొచ్చు, చెయ్యక పోవొచ్చు. అందులో విషయం మాత్రం ఒక వర్గానికే అనుకూలంగా వుంటుంది.

"రెండు వర్గాల శ్రేయస్సూ ఆశించే పుస్తకం ఏదీ వుండదా?" — అంటే — వుండదు. వర్గ బేధాలున్న సమాజంలో ఏదీ వుండదు. అసలు రెండు వర్గాల శ్రేయస్సే వొకటిగా వుండదు. పైగా ఒకడాని హాని ఇంకోడానికి క్షేమం అవుతుంది. ఒకడాని నష్టం ఇంకోడానికి లాభం అవుతుంది. అలాంటి విరుద్ధ స్థితిలో, సమాజంలో అందరి శ్రేయస్సూ వొకటిగా సాధించే పుస్తకం ఏదీ వుండదు.

అందుచేత "రామాయణ విషవృక్షం" కూడా ఒక్కవర్గానికి మాత్రమే అనుకూలంగా వున్న పుస్తకం. ఇది ఎవరికి అనుకూలమో వారే — అందులోనూ చైతన్యం గలవారే దీన్ని అంగీకరించ గలుగుతారు. దీనికి ఆమోదంతోపాటు వ్యతిరేకత వుండడంకూడా చాలా సహజమైన విషయం. అది గ్రహించడమే శాస్త్రీయ దృక్పథం.

* * *

మొదటి భాగంలో శ్రీరాముడు శూర్పణఖని

బాధించే ఘట్టంవరకూ జరిగింది. అంటే, బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండలో కొంచెం.

ఈ రెండో భాగంలో — అరణ్యకాండ, కిష్కింధాకాండ, సుందరకాండలలో కథ పూర్తిగా వొచ్చింది.

హర్షణఖ అన్నగారి దగ్గిరికి వెళ్ళి తనకు జరిగిన సంగతి చెప్పడంతో ప్రారంభించి, రావణుడు సీతని తీసుకుపోవడం, రాముడు అడవులు వెతుకుతూ తిరగడం, సుగ్రీవుడితో వొప్పందం, వాలిని చంపడం, వర్షాకాల విరహం, సుగ్రీవుడి సైన్యాలు సీతకోసం బయల్దేరడం, హనుమంతుడు సీతని కలుసుకోవడం, లంకా దహనం, హనుమంతుడు తిరిగి వొచ్చి రాముడికి సీత విశేషాలు చెప్పడం వరకూ వున్న విషయాలన్నీ 7 కథల్లోనూ, 6 లింకుల్లోనూ వొచ్చాయి.

తర్వాత, 'విషవృక్షం' ఆఖరి భాగంలో యుద్ధకాండ, వుత్తర కాండల్లో, కథ పూర్తిగా వొస్తుంది.

ఇప్పుడీ రెండో భాగంలో ఎంతవరకూ కథ జరిగిందో, అంతవరకే, దానికి సంబంధించి నంతవరకే ఈ పీఠికలో ప్రస్తావన వుంటుంది. అందుచేత, మొత్తం రామాయణానికి సంబంధించి చూస్తే ఈ పీఠిక కూడా అసమగ్రంగానే వుంటుంది. రాముణ్ణిగానీ, రావణుణ్ణిగానీ, ఇంకో పాత్రని గానీ, క్షుణ్ణంగా పరిశీలించడానికి ఇందులో కూడా పీఠి వుండదు.

కల్పనా — వాస్తవం

ఈ కథల్లో కొత్తగా "వానరులు" వొస్తారు. వారికి తోకలుంటాయి. (పురుషులకే. స్త్రీలకు వున్నట్టు ఎక్కడా చెప్పలేదు.) వారు చాలా వికారంగా వుంటారు. — ఈ రెండు లక్షణాలూ తప్ప అంతా

మానవుల్లాగానే వుంటారు. చక్కగా మాట్లాడతారు. రాజ్యాలు చేస్తారు. వేదాలు కూడా చదువుతారు.

కథలోకి 'రాక్షసులు' ఇదివరకే వొచ్చారు. వారికి రెండేసి తలలూ, మూడేసి తలలూ, పదేసి తలలూ, ఎద్దు మొహాలూ, గాడిద మొహాలూ, పంది మొహాలూ, కుక్క మొహాలూ, నక్క మొహాలూ, పిల్లి మొహాలూ, ఎలక మొహాలూ, ఆ మొహాలూ, ఈ మొహాలూ, అన్నిరకాల మొహాలూ వుంటాయి. వీరిలో కొందరు గొప్ప సౌందర్యవంతులుగా కూడా వుంటారు. (మనిషి మొహాలతో)

ఇక యక్షులూ, గంధర్వులూ, నాగులూ, కిన్నరులూ, కింపురుషులూ, వగైరాలంతా గొప్ప సౌందర్య రాసులుగా వుంటారు. ఎప్పుడూ ఎగురుతూ, దూకుతూ, వుంటారు.

వానరులూ, రాక్షసులూ, ఈ గంధర్వులూ, అందరూ ఎప్పుడే రూపం కావాలంటే ఆ రూపం ధరించగలరు. (కామరూపులు.) మళ్ళీ తమ అసల రూపాల్లోకి మారిపోగలరు — (ఇదంతా నమ్ముతోన్న వాళ్ళు ఇప్పటికీ వున్నారు. పామరులు కాదు. పండితులు కూడా. పామర పండితులు:)

ఇంతకీ ఈ వానరులూ, రాక్షసులూ, దేవతలూ వీరంతా ఎవరు? — ప్రకృతిలో ఈరకం జీవులు వున్నాయా ? — అనే పరిశోధన ఇవ్వాళ కొత్తగా అవసరం లేదు. ఇదంతా అశాస్త్రీయమనీ, కవి కల్పనా చాతుర్యమనీ, ఇంతకు పూర్వమే హేతువాదులు తేల్చేశారు.

హేతువాదం జోలికి పోకుండానే, పాత కథల్లో అంశాలతోనే, వానరులూ, రాక్షసులూ, దేవతలూ, మానవులూ, అందరూ వొకేరకం శరీర ధర్మాలు కలవారని అర్థం చేసుకోవొచ్చును.

జాంబవంతుడు ఎలుగ్గొడ్డు. ఆయన కూతురు జాంబవతి. ఆమెని మానవుడైన శ్రీకృష్ణుడు పెళ్ళి చేసుకున్నాడు.

అంజన వానర స్త్రీ. వాయుదేవుడు దేవత. వారిద్దరికీ హనుమంతుడు పుట్టాడు.

అలాగే వాలి ఇంద్రుడికీ, సుగ్రీవుడు సూర్యుడికీ పుట్టారు. —

భీముడికీ, హిడింబి అనే రాక్షసస్త్రీకీ ఘటోత్కచుడు పుట్టాడు. అర్జునుడికీ, ఉలూచి అనే నాగస్త్రీకీ ఇలావంతుడు పుట్టాడు. * రాక్షసస్త్రీ అయిన శూర్పణఖ రాముణ్ణి పెళ్ళి చేసుకోమని కోరింది. రావణుడు సీతని పెళ్ళి చేసుకోమని కోరాడు. — ఈ రకంగా వందలకొద్దీ వుదాహరణలు చూడవొచ్చును. పోటివల్ల — మానవులకూ వానరులకూ — వానరులకూ దేవతలకూ — దేవతలకూ రాక్షసులకూ — రాక్షసులకూ మానవులకూ — ఎటునుంచి ఎటు చూసినా అందరికీ మధ్య చాలా సహజమైన శరీర సంబంధా లున్నాయనే విషయం అర్థమవుతుంది.

మనిషికీ కోతికీ — కోతికీ పక్షికీ — పక్షికీ పాముకీ — పాముకీ మనిషికీ — శరీర సంబంధా లుండడం, పిల్లలు పుట్టడం సాధ్యంకాదు గదా ?

"ఇప్పుడు సాధ్యంకాదు గానీ, ఆ రోజుల్లో సాధ్యమేనేమో !" — అని వూగిసలాడతారు కొందరు అమాయకంగానే.

కానీ, ఆ రోజులూ, ఈ రోజులూ, అనే తేడా మానవ సమాజం అభివృద్ధి చెందడంలోనే గానీ, ప్రకృతి ధర్మాలలో కాదు. — అంటే, ఆ రోజుల్లో మానవులు గుహల్లో జీవిస్తే, ఈ రోజుల్లో గొప్ప గొప్ప భవనాల్లో నివసిస్తున్నారు. ఆ రోజుల్లో దిగంబరంగా తిరిగితే ఈ రోజుల్లో అన్నిరకాల బట్టలూ కట్టుకుంటున్నారు. — ఈ రకం విషయాలలోనే అప్పటికీ, ఇప్పటికీ తేడా.

---

* వానరస్త్రీకీ, దేవతా పురుషుడికీ పుటిన హనుమంతుడు తల్లిలాగే వానరు డయ్యాడు. రాక్షసస్త్రీకీ మానవుడికీ పుటిన ఘటోత్కచుడు తల్లిలాగానే రాక్షసు డయ్యాడు. నాగస్త్రీకీ, మానవుడిక్రి పుట్టిన ఇలావంతుడు తల్లిలాగానే నాగుడయ్యాడు.

ఇలాంటి కథల్ని, గణ వ్యవస్థలో పిల్లలు తల్లి గణానికి చెందడం అనే విషయంతో పోల్చుకో వొచ్చును.

ఈ పిల్లలు తండ్రుల దగ్గిర గాక తల్లుల దగ్గిరే వున్నారు.

కోతికీ మనిషికీ పిల్లలు పుట్టడం, ఆ రోజుల్లోనూ జరగదు. ఈ రోజుల్లోనూ జరగదు. ఏ రోజుల్లోనూ జరగదు.

దీన్నిబట్టి, రాక్షసులూ, వానరులూ, దేవతలూ, నాగులూ, యక్షులూ, గంధర్వులూ, అందరూ మానవులేనని అర్థం అవుతుంది. అందరూ వేరేవేరే జాతులవారో, తెగలవారో, దూరదూర ప్రదేశాల వారో అయివుంటారు. ఎవరు ఏ తెగకి, ఏ జాతికి, చెందుతారనే పరిశోధనతో ఈ 'విషవృక్షం' కథలకు సంబంధం లేదు.

రాముడి జాతికీ రావణుడి జాతికీ మాత్రం బద్ధ శత్రుత్వం వుంది.

రాముడి జాతికీ, ఇతర జాతులకూ అంత స్పష్టమైన శత్రుత్వం లేదు.

కవి మాత్రం (వాల్మీకి) రాముడి పక్షంవాడు. రాముడు రక్షించే సాంప్రదాయాలవేపూ, సమాజ ధర్మాలవేపూ నిలబడ్డవాడు.

రామాయణంలో కవి, రాక్షస జాతివార్ని మహా వికృతమైన వారిగా, మహా దుర్మార్గులుగా చిత్రించాడు.

వానరుల్ని కూడా వికృతులుగానే చిత్రించి, కొన్ని సందర్భాలలో పరిహాసాలు కూడా చేశాడు.

ఎటువంటి విమర్శ లేకుండా, చాలా గౌరవంతో, భక్తితో చూసింది రాముడి వంశంవారిని మాత్రమే.

ఈ విషవృక్షం కథల్లో అందరూ మానవులే.

రాక్షసులు అంటే రాక్షస జాతివారు అనీ, వానరులు అంటే వానర జాతివారు అనీ, గంధర్వులు అంటే గంధర్వ జాతివారు అనీ, — ఈ రకంగా మాత్రమే అర్థం చేసుకోవాలి. "దేవతల్నీ, వానరుల్నీ, రాక్షసుల్నీ, అందర్నీ మానవులుగానే పరిగణించడం వాల్మీకికి విరుద్ధం కాదా ?" — అనవొచ్చు.

విరుద్ధం కాదు. — తోక వున్న హనుమంతుడు "వాల్మీకి రామాయణం"లో ఏ రకం పాత్ర నిర్వహిస్తాడో, మానవుడైన హనుమంతుడు కూడా అదేరకం పాత్ర నిర్వహిస్తాడు. పది తలల రావణుడు ఎలా ప్రవర్తిస్తాడో, మానవుడైన రావణుడు కూడా అలాగే ప్రవర్తిస్తాడు.

అసలు కథనిగానీ, పాత్రల నడకనిగానీ, వారి స్వభావాల్ని గానీ మార్చిందేమీ లేదు.అందుచేత ఇది వాల్మీకికి విరుద్ధం కాదు.

• • •

శాస్త్రీయ దృక్పథం అంటే ఏమిటి?

మారీచుడు బంగారు లేడిగా అయ్యాడంటే నమ్మవొచ్చునా? కోతులూ, పక్షులూ, మాట్లాడతాయంటే నమ్మవొచ్చునా? ఎందుచేత నమ్మకూడదు? ఇలాంటి విషయాల్ని ఎలా అర్థం చేసుకోవాలి?

(ఇక్కడ — ఇదివరకు చెప్పిన విషయమే వొకటి మళ్ళీ చెప్పాలి. ఈ పుస్తకం మేధావుల కోసమూ, సర్వజ్ఞుల కోసమూ కాదు. "ఇంత చిన్న విషయాలు కూడా వొకరు చెప్పాలా?" — అని నిజంగానే తమకె తాము తెలుసుకునే వారికోసం కాదు. స్త్రీలైనా, పురుషులైనా, పిల్లలైనా, పెద్దలైనా సామాన్య లోకజ్ఞానం తప్ప ఏ మాత్రం శాస్త్రజ్ఞానం ఎరగని వారికోసం. ఈ విషయాలు ఇష్టంతో చదవాలనుకునే వారికోసం. అందుచేత కొన్ని కొన్ని విషయాలు చాలా స్పష్టంగా వివరించవలసిన అవసరం వుంది.)

మారీచుడు రాక్షసుడు. ఏ రూపంలోకి కావాలంటే ఆ రూపంలోకి మారిపోగలడు. రావణుడి ఆజ్ఞవల్ల చాలా అందమైన లేడిగా అయ్యాడు.

జటాయువు పక్షి. హనుమంతుడు కోతి. అయినా చక్కగా మాట్లాడతాడు.

రాత్రులు వెన్నెల్లో పడుకుని ఇలాంటి కథలు చిన్నపిల్లలకు చెపుతాం. వాటి సహజా సహజాల గురించి వాళ్ళేమీ ప్రశ్నలు వెయ్యరు. —"ఒక జీవి ఇంకో జీవిగా ఎలా మారుతుంది? పువ్వు పక్షిగా మారుతుందా? కోతి ఎలా మాట్లాడుతుంది? మనం చూసే పక్షులన్నీ అరుస్తాయి గానీ మాట్లాడవేం?" — అని హేతువాదంతో ప్రశ్నించరు. పిల్లల మెదడు బాల్యావస్థలోనే వుంటుంది. దానికి ఆలోచించి తర్కించే శక్తి వుండదు. వారికి లోకజ్ఞానం కూడా వుండదు. అందుచేత, తర్కించ

కుండా, చాలా సరదాగా, ఆనందంగా వింటారు. కథలో వున్నది వున్నట్టు నమ్ముతారు. పెద్దవాళ్ళు కూడా ఈ కథల్ని చిన్న పిల్లలు నమ్మినట్టే నమ్మితే, వారు చిన్నపిల్లల దశలో వున్నట్టే. కానీ, ఆ పెద్ద వారికి చిన్నపిల్లలకు లేని లోకజ్ఞానం కూడా వుంటుంది. వారు నిత్యమూ చూసే లోకంలో కోతులు మాటాడవని తెలుసు. అయినా, వెనకటి రోజుల్లో, కోతులు మాటాడేవనే నమ్ముతారు. అంటే ఒక విషయం అర్థం చేసుకోవటానికి లోకజ్ఞానం సరిపోదన్నమాట. "కోతులు మాట్లాడడం అసహజం. అసలు ప్రకృతిలో జరగడానికి సాధ్యం కాదు." — అనే సంగతి తెలియాలంటే, కోతి శరీర నిర్మాణం, మనిషి శరీర నిర్మాణం, రెండూ తెలియాలి. మనుషులు ఎందుచేత మాట్లాడగలరో, జంతువులూ, పక్షులూ, ఎందుచేత మాట్లాడలేవో, వాటి శరీర నిర్మాణాలద్వారా కారణాలు తెలియాలి. ఈ రీతిగా ఒక విషయానికి సంబంధించిన "అసలు కారణాలు" తెలియడం అనేదే "శాస్త్రజ్ఞానం." — (ఇది ప్రకృతికి సంబంధించిన శాస్త్రజ్ఞానం.)

ఒక వ్యక్తి, ఒక విషయాన్ని ఎంతో గాఢంగా నమ్మినంత మాత్రాన ఆ విషయం ఆ వ్యక్తి నమ్ముతోన్న విధంగానే వుండదు.

కోతులు మాట్లాడతాయని ఎంతో గాఢంగా నమ్మినప్పటికీ, కోతులు మాట్లాడవు. అవి, వాటి శరీరధర్మాల ప్రకారమే వుంటాయి.

చీకట్లో తాడుని చూసి పాము అనుకుని ఎంతో గాఢంగా నమ్మినప్పటికి, ఆ తాడు పాముగా మారదు. దానికి, ఎవరి నమ్మకాలతోటీ, వూహలతోటీ, కల్పనలతోటీ, కవిత్వాలతోటీ సంబంధం లేదు. తాడు తాడుగానే వుంటుంది.

అయితే తాడుని చూసి పాము అని నమ్మిన వ్యక్తి అసలు నిజం గ్రహించడానికి చిన్న దీపం తెచ్చుకుంటే సరిపోతుంది. కానీ, అన్ని విషయాలూ ఇంత తేలిగ్గా అర్థం చేసుకోవటానికి వీలుండదు. "భూమి బల్లలా లేదు. గుండ్రంగా వుంది." — అన్నే విషయం అర్థం చేసుకోవటం తేలిక కాదు. ఎందుచేత? — భూమి బల్లలా వుండడం

అనేది కళ్ళారా చూస్తోన్న విషయం. (లోక జ్ఞానం) భూమి గుండ్రంగా వుండడం కళ్ళకు కనపడే విషయం కాదు. (లోకజ్ఞానం కాదు)

భూమి ఎలా వుందో 'అనలు విషయం' గ్రహించడానికి లోక జ్ఞానం సరిపోదు. లోక జ్ఞానానికి విరుద్ధంగా, భూమి వొక బ్రహ్మాండమైన బంతి అనీ, అది వొక శూన్యంలో గిరగిరా తిరుగుతోందనీ, అర్థం చేసుకోవాలంటే, కొంత వూహా శక్తి కావాలి.

"భూమి గుండ్రంగా వుంటుంది. నేను చెప్పాను. నమ్ము." — అంటే నమ్మడానికి వీలుండదు. ఎవరికి వారికే స్వతంత్రమైన ఆలోచన కావాలి. సూర్యుడికీ, భూమికీ వున్న సంబంధం తెలియాలి. రాత్రీ, పగలూ, ఏర్పడడం అనే సత్యంతో, భూమి గుండ్రాన్నీ, భూమి తిరగడాన్నీ, రుజువు చేసుకోవాలి.

అప్పుడుగానీ, భూమి గుండ్రంగా వుందనే వొక సహజ విషయం అర్థం చేసుకోవడం సాధ్యం కాదు అలాగే, ప్రకృతిలో ఇంకే విషయాన్ని అర్థం చేసుకోవటానికైనా సామాన్య లోకజ్ఞానం చాలదు. కనీసపు 'శాస్త్రజ్ఞానం' వుండాలి.

కోడిగుడ్డు కోడిపిల్లగా మారుతుంది గానీ, రాయి కోడిపిల్లగా మారదు. ఎందుచేత?

కోడిపిల్లకు కావలసిన అనుకూల పరిస్థితులు కోడిగ్రుడ్డులోనే వున్నాయి. రాయిలో లేవు. ఎటువంటి పరిస్థితుల్లోనూ రాయి కోడిపిల్లగా మారదు. కోడి పిల్లగానే కాదు. తన సహజ ధర్మాలకు విరుద్ధమైన ఏ ఇతర పదార్థంగా గానీ, ప్రాణిగా గానీ, వొస్తువుగా గానీ మారదు. ఏ దేవుళ్ళో, రుషులో, మాంత్రికులో, గొప్ప మహిమలతో, తపశ్శక్తులతో, రాయిని పువ్వుగానో, పిట్టగానో, మిఠాయి వుండగానో మార్చడం అనేది నూటికి నూరుపాళ్ళూ అసాధ్యమైన విషయం. అనలు దేవుళ్ళూ, రుషులూ, ప్రకృతి విరుద్ధమైన కార్యాలు చెయ్యగలిగే మహిమలూ, తపశ్శక్తులూ సంపాదించడం అనేదే అసహజమైన విషయం. (అంటే

ముందు దేవుళ్లే అసహజం. ఆ దేవుళ్ళని నమ్మి రుషులు తపస్సులు చేసారు. వారు ఏ విద్యలైనా సాధించ గలిగితే, అవి ప్రకృతిలో జరగ డానికి వీలైనవే. మిగిలిన మానవులకు మాత్రం తెలియనివి — అంతే గానీ, ప్రకృతి విరుద్ధమైన కార్యాలు మాత్రం ఏ రుషులూ చెయ్య లేరు.)

మానవుడు ఎన్నోవేల సంవత్సరాలు ఎంతో ఘోరమైన అసహ జాలతో "కట్టు కథలు" (మైథాలజీ) సృష్టించుకున్నాడు. వాటినే ఆరా ధించాడు.

మానవ చరిత్రని భౌతిక దృక్పథంతో చూసే శాస్త్రాన్ని సమా జానికి నేర్పిన "మార్క్స్" ఈ విషయం గురించి ఏమంటున్నాడో చూడండి — "కల్పిత గాథలన్నీ (మైథాలజీ) తమ వూహలతో ప్రకృతి శక్తుల్ని జయిస్తాయి. వూహలతో ప్రకృతి శక్తులమీద ఆధి పత్యం వహిస్తాయి. వూహలలో ప్రకృతినంతా తమ కిష్టమైనట్టు మార్చేసుకుంటాయి.

మానవుడు వూహల్లో మాత్రమే గాకుండా, నిజంగానే, ప్రకృతి శక్తుల్ని జయించగలిగినప్పుడు ఈ కల్పనలన్నీ ఎక్కడివక్కడ అంత రించిపోతాయి. *

కట్టు కథలు చదివి — "ఆ ఏదో మూర్ఖులు. అలా రాసేశారు." — అనుకున్నామంటే, మానవ సమాజంలో కట్టుకథల సృష్టికి మూల కారణం ఏమిటో శాస్త్రీయంగా గ్రహించలేక పోతున్నా మన్నమాట.

ఒక కథలో కథానాయకుడు పక్షి అయిపోయి ఆకాశంలో ప్రయాణం చేస్తే లేదా పక్షివాహనం మీద సుఖంగా తిరిగితే, ఆనాటి

---

* "All mythology a subdues, controls and fashions the forces of nature in the imagination and through imagination; it disappears therefore when real control over these forces is established." (Marx, Karl. 1859. A contribution to the critique of Political Economy. (Page — 216.) Moscow : Progress Publishers, 1970.)

మానవుడికి చాలా సంతోషం. వాస్తవంలో చెయ్యలేని పని చేస్తున్నామనే సంతోషం. *

ఈనాడు మానవులు భూమిమీదా, నీటిలోనూ, ఆకాశంలోనూ, అన్ని మార్గాలలోనూ ప్రయాణాలు చెయ్యగలరు. ఇప్పుడు మనకు

---

* మన విష్ణుమూర్తి పక్షులమీదే తిరుగుతాడు. కట్టు కథలకు ఈ దేశం ఆ దేశం అనే తేడాలేదు. అన్నిచోట్లా మానవుడు ప్రకృతిని జయించినట్టే కథలు రాసుకున్నాడు. మన రాముడు కోపం వొచ్చినప్పుడల్లా, సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ "పడగొట్టేస్తా, పడగొట్టేస్తా." — అంటాడే గానీ వొక్కసారీ పడగొట్టలేదు.

ప్రాచీన చైనా పురాణాల్లో, చక్కగా వొక వీరుడేం చేశాడో చూడండి — అప్పుడు ఆకాశంమీద 10 మంది సూర్యుళ్ళు వుండేవారు. ఆ వేడికి భూమిమీద పచ్చదనం అంతా హరించి పోయేది. రాజుగారికి కోపం వొచ్చేసి, 'ఈ' అనే గొప్ప విలుకాణ్ణి పిలిచి — "సూర్యుళ్ళని పడగొట్టెయ్యి," అన్నాడు. అప్పుడు "ఈ" తొమ్మిదిమంది సూర్యుళ్ళని పడగొట్టేసి, "లోకం బొత్తిగా చీకటై పోతుందిరా" — అని వొక్క సూర్యుణ్ణీ వుండనిచ్చాడు. ఆ పాత చైనా వీరుడు అంత సాహసం చెయ్యకపోతే ఈ పాటికి లోకాలు భస్మమైపోయి వుండేవి.

మన హనుమంతుడు పర్వతంలాగ పెద్దవాడిగానూ, పిల్లిలాగ చిన్నవాడిగానూ అయిపోగలడు. అంతే. అదే సన్ - వూ - కుంగ్ అనే చైనా వానరుడైతే, మనిషిగా, చెట్టుగా, కొండగా, పాముగా, పిట్టగా పువ్వుగా, మొత్తం 72 రూపాలోకి మారిపోగలడు. 73 రూపాల్లోకి మారే వీరుడెవ్వడూ లేకపోవడంచేత, ఈయన్ని ఎవ్వరూ జయించలేక పోయారు.

మన జటాయువూ, సంపాతీ, హనుమంతుడూ సూర్యుడి దగ్గిరికి వెళ్ళాలని సరదాపడి, మధ్యలోనే కింద పడ్డారుగానీ, కువాపూ అనే ఇంకో చైనా వీరుడు సూర్యుడితో — "నువ్వు తొందరగా నడుస్తావో, నేను తొందరగా నడుస్తానో." అని పందెంవేసి, సూర్యుణ్ణే ఓడించేశాడు, సూర్యుడే నడవలేక వెనకబడి పోయాడు.

నదులో మునిగి పాతాళానికి పోయే నాగకన్యల మీదో, ఆకాశంలో ఎగిరి స్వర్గానికి పోయే రెక్కల దేవతలమీదో పూర్వం వున్నంత ఆసక్తి వుండదు. (ఆ కథలూ, ఇప్పుడూ, ఎప్పుడూ చాలా ఆనందం కలిగిస్తాయి. — అంతవరకే.) ఈనాడు మాయ తివాచీలు ఎక్కాలని కలలు గనం. విమానాలు ఎక్కాలని కోరుకుంటాం. రాకెట్‌లో చంద్రుడి దగ్గిరికి పోవాలని ఆశపడతాం. అంటే మన ఆలోచనలు "కల్పన" ని వోదిలి (మాయ తివాచీలనీ, క్షీరసాగరాలనీ వోదిలి) జరగడానికి వీలున్న వాస్తవ స్థితికి వొస్తున్నాయి. కొంతైనా శాస్త్రీయ దృక్పథం ఏర్పడుతోంది. కానీ, అది నిత్య జీవితంలో చాలా తక్కువ కోణాలలో మాత్రమే.

శాస్త్రజ్ఞానం ఎరగని మానవుడు, వర్షాలు లేక, నదులు ఎండి, జీవితాలు దుర్భరం అయిపోయినప్పుడు, వ్యూహలతో వర్షాలు కురిపించుకుని సంతోషపడతాడు. ఆ వ్యూహలే కథారూపం ధరిస్తాయి. — ఆ కథలో మహర్షికి సమస్త శక్తులూ వుంటాయి. ప్రజలందరూ ఆయన్ని వర్షాలు కురిపించమని ప్రార్థిస్తారు. రుషిగారు గొప్ప కరుణతో చిరునవ్వుతో చెయ్యి అటూ, ఇటూ తిప్పుతారు. ఇక చూసుకోండి. వర్షాలు, ఏళ్ళూ పూళ్ళూ ఏకమైపోతాయి. నదులు పొంగి పొర్లిపోతాయి. మరుక్షణంలోనే చెట్లన్నీ పళ్ళగుత్తులతో భారంగా వొంగిపోతాయి. పూలతోటలన్నీ నేల కనపడకుండా విరగబూస్తాయి.

"ఇక చాలు. చాలు."— అని ప్రజలంతా వర్షం వొద్దని గోల పెడతారు. మళ్ళీ రుషిని ప్రార్థిస్తారు ఆయన మళ్ళీ అంత చక్కని చిరునవ్వుతో, చెయ్యి ఎత్తి— "ఆగు" అని వర్షాన్ని ఆజ్ఞాపిస్తాడు.

ఈనాడు కూడా కుండెడు నీళ్ళకోసం మైళ్ళకొద్దీ దూరం పోవలసిన మనుషులకు రుషిగారు వర్షాలు కురిపించే కథ సంతోషం కలిగించకుండా ఎలా వుంటుంది? 'వారిని శాస్త్రజ్ఞానం లేని మూర్ఖులు' అనడంలో అర్థమేమీ లేదు. శాస్త్రజ్ఞానం అనేది కేవలం సమాజానికి తెలియడం మాత్రమే చాలదు శాస్త్రజ్ఞానం వల్ల నిత్య జీవితావసరాలు తీరుతూ వున్నప్పుడే శాస్త్రజ్ఞానం జీవితాలలో కలిసిపోతుంది.

రామాయణంలాంటి కథలు గొప్ప ఇష్టంతో చదువుతున్నాం అంటే, ఆ కథల్లో అడుగడుగునా ఎన్నెన్నో పాత్రలద్వారా జరిగే అద్భుతాలు ఇంకా మనల్ని ఆకట్టుకుంటూనే వున్నాయన్నమాట. మన జీవితాలకు ఇంకా దేవుళ్ళమీదా, అద్భుతాల మీదా ఆశలు పెట్టుకుని, బతకవలసిన అవసరం వుందన్నమాట.

సమాజ పరిస్థితుల్ని గ్రహించడంకూడా వొక శాస్త్రమే. కోతి మాట్లాడలేక పోవడానికీ, మనిషి మాట్లాడ గలగడానికి, అసలే నకారణాలెల్లా వున్నాయో, సమాజంలో ప్రతి చిన్న విషయానికీ శాస్త్రీయమైన కారణాలున్నాయి. కులభేధాలకి శాస్త్రీయమైన కారణం వుంది. వ్యభిచారానికి శాస్త్రీయమైన కారణం వుంది. మనం పాటించే సంస్కృతికి శాస్త్రీయమైన కారణాలున్నాయి.

భూమి గుండ్రంగా వుందనే విషయం మనం లోకజ్ఞానంతో ఎలా అర్థం చేసుకోలేమో సమాజంలో అనేక విషయాలు సామాన్య జ్ఞానంతో అరం చేసుకోలేము.

ఒక స్త్రీకీ, పురుషుడికీ పెళ్ళయినప్పుడు స్త్రీయే అత్తవారింటికి వెళుందని మనకు తెలుసు. ఇది సామాన్య సమాజ జ్ఞానం. కానీ. స్త్రీయే ఎందుకు వెళుంది? పురుషుడు ఎందుకు వెళ్ళడు? — అనే విషయం తెలుసుకోవటానికి సామాన్య జ్ఞానం సరిపోదు. సమాజానికి సంబంధించిన శాస్త్రజ్ఞానం కావాలి.

కొన్ని ప్రదేశాల్లోగానీ, కొన్ని జాతుల్లోగానీ, పురుషుడే అత్తవారింటికి వెళ్ళాడనుకోండి. అప్పుడు కూడా — స్త్రీ యెందుకు వెళ్ళదు? పురుషుడే ఎందుకు వెళ్ళాడు? అనే సంగతి తెలుసుకోడానికైనా శాస్త్రజ్ఞానం కావాలి. కన్యాశుల్కం గానీ, వరకట్నం గానీ సమాజంలో ఆచారాలుగా వున్నాయనే సంగతి మనకు తెలుసుగానీ, ఎందుకు వున్నాయో తెలీదు. తెలుసుకోవాలంటే ఆ ఆచారాల పుటకకి సంబంధించిన మూల కారణాలూ, అవి కొనసాగడానికి అనుకూలంగా వున్న సమాజ పరిస్థితులూ తెలియ వలసిందే.

'చదువు' సంగతి తీసుకోండి. మానవ సమాజంలో రాయడం,

చదవడం ప్రారంభమై, వేలకొద్దీ సంవత్సరాలు అయింది. ఎన్నో విద్యలూ, ఎన్నో శాస్త్రాలూ అభివృద్ధి అయ్యాయి. అయినా ఈ నాటికీ, సమాజంలో చదువుమొహం ఎరగని కుటుంబాలు వున్నాయంటే ఎందుకు వున్నాయో మనకి తెలియదు. (మన దేశంలో నూటికి 70 మందికి చదువు లేదు.)

మాదిగ "అప్పిగాడికి" చదువు రాదు అతని తండ్రికీ రాదు. తాతకీ రాదు. ముత్తాతకీ రాదు రేపు, అతని పిల్లలకీ రాదు. మనవలకీ రాదు. —

రామశాస్త్రిలు గారింట్లో అందరూ పండితులే. ఆయన తండ్రి కలెక్టరు. ఆయన తాత వేద పండితుడు. ఆయన ముత్తాత వొక రాజు గారి దగ్గిర పౌరోహిత్యం చేశాడు — ఇప్పుడు రామశాస్త్రిల కొడుకు డాక్టరీ చదువుతున్నాడు. కూతురు మొన్నే అమెరికా వెళ్ళింది. పెద్ద మనవడు కాన్వెంటులో చదువుతున్నాడు.

ఈ వాస్తవాలు మనం సమాజంలో నిత్యం చూస్తూనే వుంటాం. గుడ్డి బిచ్చగత్తె, చంటిబిడ్డని తుక్కుడబ్బా పక్కన పడుకో బెట్టి గిన్ని గలగలాడిస్తూ అరుస్తూ వుంటుంది. ఆమె ముందుని చీ, వందలకొద్దీ కార్లు, బట్టల షాపులవేపూ, హోటళ్ళ వేపూ, సినిమాల వేపూ, కబ్బిలవేపూ, పార్కు వేపూ దూసుకుపోతూ వుంటాయి. ఇవన్నీ కొత్త విషయాలు కావు. ఇదంతా సామాన్య సమాజ జ్ఞానం.

వాటిలో రహస్యం చెప్పడానికి, ఆ తేడాల ఆంతర్యం చెప్పడానికి, సామాన్య జ్ఞానం చాలదు. శాస్త్రజ్ఞానం కావాలి.

శాస్త్రజ్ఞానం అంటే ఎప్పుడూ రెండు విషయాలు గుర్తు పెట్టుకోవాలి.

1 —ప్రకృతికి సంబంధించిన శాస్త్రజ్ఞానం.

2 —సమాజానికి సంబంధించిన శాస్త్రజ్ఞానం.

ప్రకృతిలో ఎన్నో శక్తులున్నాయి. సమస్తమైన సంపదలూ వున్నాయి. వాటన్నిటినీ మానవుడు శాస్త్రజ్ఞానంతో సాధించ గలుగుతూనే వున్నాడు.

కానీ అవి, సమాజంలో అందరికీ అందుబాటులో లేవు. మానవుడు "గాలిలో ఎగరడం" కనిపెట్టాడు కానీ, విమానాలు సమాజంలో ఎవరికి అందుబాటులో వున్నాయి? ఎన్ని వందల, వేల మైళ్ళ దూరం నించి అయినా మాటాడుకోవడం కనిపెట్టాడు. కానీ, టెలిఫోను, రేడియోలూ, ఎవరికి అందుబాటులో వున్నాయి?—అందుచేత, ప్రకృతి విషయాలు కనిపెట్టడం వొక్కటే చాలదు.

విద్యలూ, సంపదలూ సమాజంలో అందరికీ అందుబాటులోవుండే పరిస్థితుల్లో మాత్రమే, సమాజానికి శాస్త్రీయ దృక్పథం ఏర్పడుతుంది.

కల్పనలో స్ఫురించే వాస్తవికత —

కథలో ఒక ఘట్టం అసహజ రూపంలో వున్నప్పటికీ, అక్కడ జరిగిన కథని బట్టి, ఆ విషయాన్ని వాస్తవ రూపంతో అర్థంచేసుకోవొచ్చును.

బంగారు లేడి

"రామాయణం" లో బంగారు లేడి పాత్ర ఏమిటి? ఏం చేసింది? ముందు రాముణ్ణీ, తర్వాత లక్ష్మణుణ్ణీ, సీతనించి దూరంగా తీసుకుపోవటానికి వుపయోగ పడింది.

'బంగారు లేడి' అనే కల్పన లేకుండానే, ఈ ఘట్టం ఇలాగే జరగడానికి వీలుంది.

రాముడూ, లక్ష్మణుడూ ఇంటిదగ్గిర లేనప్పుడు, సీత వొంటరిగా వుండడం కనిపెట్టి వొక శత్రువు ఆమెని ఎత్తుకుపోయాడు అనేదే ఇందులో వాస్తవం.

మారీచుడు రావణుడి పక్షం మనిషి. రాముడు వున్న అడవిలోనే జీవిస్తున్నాడు. పైగా రుషివేషంతో జీవిస్తున్నాడు. రాముడు వేటకు పోయినప్పుడు మారీచుడు వెంటబడి, రాముణ్ణి మాటల్లో పెట్టి — దూరంగా పోతే మంచి మంచి పక్షులున్నాయనో, బలిసిన జంతువు లున్నాయనో, మభ్యపెట్టి దూరంగా తీసుకు పోవొచ్చును.

లేకపోతే, వేటకు వెళ్ళే రాముడు ఎలాగైనా కొంతదూరం వెళ్తాడు కాబట్టి, మారీచుడు ఆశ్రమ ప్రాంతాల్లోనే దాక్కుని వుండి, రాముడికేదో ప్రమాదం ముంచుకొచ్చినట్టు, కేకలు పెట్టి, లక్ష్మణుణ్ణి కూడా బయటకు వొచ్చేట్టు చెయ్యవొచ్చును.

లేకపోతే మారీచుడు కేవలం రాముడూ, లక్ష్మణుడూ బయటకి పోయిన సమయం కనిపెట్టి, ఆ సంగతి కొంత దూరంలో కాచుకుని వున్న రావణుడికి చెప్పడానికి వుపయోగ పడవొచ్చును.

ఈ రకంగా బంగారులేడి ఘట్టాన్ని కల్పనగా చెప్పినప్పటికీ, అందులో అసలువిషయం మారీచుడు ఏదో విధంగా రావణుడికి సహాయం చేశాడన్నదే.— మారీచుణ్ణి మనిషిగానే అర్థం చేసుకున్నప్పటికీ కథలో తేడా ఏమీరాదు. (బంగారులేడి ఘట్టం వుండకూడదని అర్థంకాదు. అది వుండాలి. అందులో స్ఫురించే వాస్తవికతని చూడాలి.)

జటాయుపక్షి —

జటాయువు వొక బ్రహ్మాండమైన పక్షి. కొండలంతంత ఏనుగుల్నీ, చెరువు లంతంత తాబేళ్ళనీ తన్నుకుపోయి తినగలిగే పక్షి. కథలో ఈ పక్షి చేసిన పనేమిటి? — రావణుడితో యుద్ధం చెయ్యడం. రావణుడు మహా బలవంతుడైన రాక్షసుడు. అంత బలవంతుడితో కొంత సేపు యుద్ధం చెయ్యాలి కాబట్టి వొక బ్రహ్మాండమైన పక్షిని సృష్టించాడు కవి.

కానీ, రావణుడు మానవుడే అయితే, జటాయువు కూడా మానవుడే. అతడొక ఆటవికుడు. దండకారణ్యంలో రాముడికి సాయంగా వుంటున్నాడు. ముఖ్యంగా సీత వొంటరిగా వున్నప్పుడు ఆశ్రమం కనిపెట్టుకుని వుంటున్నాడు. రావణుడు సీతని ఎత్తుకుపోవడం చూసి తన శక్తికొద్దీ అడ్డగించాడు. తీవ్రంగా గాయపడి, కింద పడిపోయాడు. రాముడు రాగానే జరిగిందంతా చెప్పి చచ్చిపోయాడు.

జటాయువు పక్షి గాకుండా మానవుడైతే కథలో ఏమీ తేడా రాదు.

హనుమంతుడు సముద్రం దాటడం —

హనుమంతుడు సీత దగ్గిరికి వెళ్ళి సీతని రహస్యంగా కలుసుకుని మాట్లాడి వొచ్చాడనే విషయంలో ఏమీ అభ్యంతరం వుండక్కర్లేదు. ఎగురుతూ 100 యోజనాల సముద్రం దాటడంలోనే అభ్యంతరమంతా, — అయితే, హనుమంతుడు సముద్రం ఏలా దాటాడు?

కిష్కింధకూ, లంకకూ మధ్య అసలు సముద్రమే లేని ప్రదేశాలె వుండాలి. మహా వుంటే నది వుండవొచ్చు. హనుమంతుడు దాన్ని పడవమీద దాటవొచ్చు. ఈది అయినా దాటవొచ్చు.

లేకపోతే, కిష్కింధకీ, లంకకీ మధ్య సముద్రమే వుందనుకుంటే, హనుమంతుడు తప్పకుండా ఓడ ద్వారానే సముద్రం దాటాడను కోవాలి.

మైనాకుడి అతిథ్యం —

హనుమంతుడు సముద్రం దాటుతోంటే, సముద్రుడు మైనాకుడనే పర్వతాన్ని పిలిచి — "శ్రీరాముడి పూర్వులు నాకు వుపకారం చేశారు. నువ్వు నాలో వున్నవాడివి కాబట్టి రామకార్యం మీద పోతూవున్న హనుమంతుడికి ఆతిథ్యం యిచ్చి సహాయం చెయ్యి," — అంటాడు.

అంటే — సముద్రుడనే ఆయన చేతికింద మనిషి మైనాకుడు సముద్రుడికీ, శ్రీరాముడి బంధువర్గానికీ స్నేహ సంబంధాలున్నాయి.

హనుమంతుడు లంకకుపోయే దారిలో సముద్రుణ్ణి కలుసుకున్నాడు. సముద్రుడు, హనుమంతుడికి మంచీ చెడ్డా చూడమని మైనాకుణ్ణి ఆజ్ఞాపించాడు.

కథలో — సముద్రుడు చెప్పగానే మైనాకుడు (పర్వతం) రయ్యన పైకి పెరిగి, — "హనుమంతుడా! కాస్సేపు నామీద నించుని విశ్రాంతి తీసుకో. పళ్ళూ అవీ తిని వెళ్ళు. — నీ తండ్రి నాకు తెలుసు. గతంలో నాకు చాలా వుపకారం చేశాడు," — అంటాడు.

అంటే, వాస్తవంలో — హనుమంతుడి తండ్రి మైనాకుడికి తెలుసు. ఏదో వుపకారం పొందాననే కృతజ్ఞత కూడా వుంది మైనాకుడికి. ఆ ప్రేమతో హనుమంతుణ్ణి పిలిచి, కాస్సేపు తన ఇంట్లో ఆగి, తను పెట్టిందేదో తిని, వెళ్ళమని మర్యాద చేశాడన్నమాట.

పర్వతం మాటాడడం అవాస్తవమే గానీ, ఆ మాట్లాడిన విషయం, (తనకు తెలిసిన వొక బాటసారికి ఆతిథ్యం ఇవ్వడం అనేది) అవాస్తవం కాదు.

హనుమంతుడికి సముద్రం దాటుతో వుండగానే, 'సింహిక' అనే రాక్షసి కూడా ఎదురు పడుతుంది. ఇది దుష్టపాత్ర. హనుమంతుణ్ణి మింగుతా నంటుంది. —దీనికి కూడా వాస్తవికత వుంది. అడవుల్లోంచి ప్రయాణాలు చేస్తూ వున్నప్పుడు, ఎన్నో క్రూరమృగాలు ఎదురుపడ వొచ్చును. ప్రయాణీకుడు ఎన్నో ప్రమాదాలలో చిక్కుకో వొచ్చును. ఇది జీవితంలో వాస్తవికతే. ప్రయాణీకుడికి జీవన్మరణ సమస్యగా తయారయ్యే వాస్తవాన్ని, అవాస్తవ రూపంలో సింహికగా మార్చడం జరిగింది.

కవికి, వొక అవాస్తవ విషయం కల్పించడానికి సమాజ జీవితంలో వాస్తవికతే ప్రోత్సాహం ఇస్తుంది. కల్పనల్ని యథాతథంగా నమ్మకుండా, ఆ కల్పనలో వాస్తవం ఏమై వుంటుందో, ఎలా జరగడానికి వీలుందో, ఆలోచించినప్పుడు కల్పనని ఆనందించ వొచ్చును. వాస్తవికతనీ అర్థం చేసుకోవొచ్చును.

కవిహృదయ అర్థ నమ్మకం—

కిష్కింధకీ, లంకకీ మధ్య వున్న సముద్రం వెడల్పు 100 యోజనాలు — కథలో.

(యోజనం అంటే ఎంత దూరమో, వాల్మీకి ఎంత దూరాన్ని యోజనం అన్నాడో ఎవరికీ తెలీదు. — కొందరు యోజనాన్ని 'ఆమడ' అంటున్నారు. ఆమడకు 8½ మైళ్ళట.)

ఇప్పుడు 'శ్రీలంక' గా వున్న దేశాన్నే రావణుడు పాలించిన లంక అనుకుంటారు మనలో చాలామంది.

అయితే కొందరు విమర్శకులు — "భారత దేశానికీ, లంకకీ మధ్య వున్న సముద్రం వెడల్పు చాలా తక్కువే. కానీ, కథలో 100 యోజనాలని కవి చెప్పాడు. అందుచేత రావణుడు పాలించిన లంక ఈ లంక కాదు." — అని వాదిస్తారు. అంటే — కవి చెప్పిన 100 యోజనాల దూరాన్ని యథాతథంగా నమ్మడం, కవి చెప్పిన ప్రదేశాన్ని మాత్రం నమ్మకపోవడం.

ఆ 100 యోజనాల వెడల్పు గల సముద్రం ఏ రెండు ప్రదేశాల మధ్య వుంటుందో కనిపెట్టి — "ఇదే కవి చెప్పిన సముద్రం. దీనికి ఒకవైపు వున్నది కిష్కింధ, ఒకవైపు వున్నది లంకా" — అంటారన్నమాట.

అసలు కవి చెప్పిన 100 యోజనాల దూరాన్ని యథాతథంగా నమ్మడం ఎందుకు ? — దాన్ని నమ్మితే పరశధుని 60 వేల సంవత్సరాల వయస్సూ, రుషుల వేలకొద్దీ సంవత్సరాల తపస్సులూ కూడా నమ్మవలసిందే కదా ?

సముద్రం వెడల్పు గురించి ఇంకో వాదం — వీరికి కవి చెప్పిన "దూరం" మీద నమ్మకం లేదు. కవి చెప్పిన "ప్రదేశాల" మీద మాత్రం నమ్మకం వుంది.

దక్షిణ సముద్రంలో వున్న లంకని రావణుడు పాలించాడని కవి చెప్పాడు కాబట్టి ఇప్పటి శ్రీలంకనే ఆనాటి లంక అని నమ్ముతారు. మరి 100 యోజనాల వెడల్పు గల సముద్రం లేదు కదా ? — అనే సందేహానికి — "కవికి దక్షిణాపథం గురించి సరిగ్గా తెలియక అక్కడి సముద్రం అంత వెడల్పు వుందనుకున్నాడు" — అని జవాబు చెపుతారు.

త్రిపురనేని రామస్వామి చౌదరిగారు కూడా 'శంబుక వధ' నాటకానికి రాసిన పీఠికలో భారత దేశానికీ, లంకకూ మధ్యవున్న దూరం

గురించి చర్చించారు. ఈయన కవి చెప్పిన దూరాన్ని నమ్మడం లేదు. నమ్మకపోవడం అనే విషయంలో రెండు లక్షణా లున్నాయి.

దశరథుడి 60 వేల సంవత్సరాల వయస్సునీ ఎందుకు నమ్మం ? — అది కల్పన కాబట్టి.

ఈ 100 యోజనాలనీ అదే పద్ధతిగా భావించి నమ్మకపోవడం వొకటీ — (వేలకొద్దీ సంవత్సరాల వయస్సు అయితే కల్పన అనుకోవొచ్చుగానీ రెండు ప్రదేశాల మధ్య దూరం విషయంలో కల్పన ఏముంది? — అనొచ్చు. ఈ దూరం రెండు ప్రదేశాల మధ్య వుండటానికి వీలుకానిదని కాదు. ఆ "వంద యోజనాలు" — అనే మాట కేవలం కథ కోసం కల్పన రూపంలో తయారుచేసిన మాట.)

ఆ 100 యోజనాల దూరం (యోజనానికి మనం చెప్పుకున్న అర్థం ప్రకారం) మనం అనుకున్నచోట లేదు కాబట్టి నమ్మకం పోవటం ఇంకొకటీ.

రామస్వామి చౌదరిగారు కూడా కవి చెప్పిన దూరాన్ని నమ్మడం కేదంటే, — 100 యోజనాల దూరాన్ని "మిత్" గా భావించి నమ్మకపోవడం కాదు. అంత మారం హిందూదేశానికీ, లంకకీ లేదు కాబట్టి మాత్రమే నమ్మడం లేదు.

కవి చెప్పిన "దూరాన్ని" నమ్మడం లేదు కవి చెప్పిన ప్రదేశాల్ని మాత్రమే నమ్ముతున్నారు. — "లంకా ద్వీపము హిందూ దేశమునకు నెనిమిది వందల యేబది మైళ్ళ దూరము నందుండ వలయును. (యోజనానికి 8½ మైళ్ళు అనేదాని ప్రకారం.) కానీ, యట్టు లేక ఇరువది మూడు మైళ్ళన్నరలో నున్నది. ఈ తారతమ్యమును సమర్థించు టెట్లు ? .. .... వాల్మీకి మహాముని దక్షిణాపథ మెరుంగని వాడగుటచే వారి వలన, వీరివలన విని, పొరపడి యుండునని చెప్పి రామభక్తులకు గోపము రగుల్పవలసి వచ్చినందులకు మిగుల జింతించుచుంటిమి," అంటున్నారు. అంటే — "వాల్మీకి కేవలం హిందూ దేశానికీ, లంకకీ వున్న దూరం ఎరగక మాత్రమే అలా రాశాడు గానీ, ఆ దూరం 23½ మైళ్ళన్న సంగతి తెలిసివుంటే అంతే రాసేవాడు. 100యోజ

నాలని రాసేవాడు కాదు. 100 యోజనాలని ఎవరో చెప్పడం వల్ల అలా రాశాడు." — అని అర్థం.

ఇది చాలా పొరపాటు అభిప్రాయం. వాల్మీకికి 23⅓ మైళ్ళ సంగతి తెలిసినా వంద యోజనాలనే రాసేవాడు, హనుమంతుడు మహా వీరుడనే సంగతి చెప్పడం కోసం ముతికల్‌గా సృష్టించిన ఘట్టం అది.

"సముద్రం ఎవరు దాటగలరు?" — అనే ప్రశ్న వొచ్చినప్పుడు — కొందరు వానరులు "10 యోజనాలు దాటగలం." — అంటారు. — కొందరు ఇరవై యోజనా లంటారు. కొందరు ముప్పై, కొందరు నలభై. ఈ రకంగా జాంబవంతుడు తొంభైకి చేరతాడు. అంగదుడు "వంద యోజనాలూ దాటగలను గానీ, తిరిగి రాలేను." — అంటాడు. చివరికి హనుమంతుడు వొక్కడే వంద యోజనాలూ దాటి, తిరిగి రాగల వీరుడుగా కనపడతాడు. — ఇలాంటి ఘట్టం వాల్మీకి కేవలం 23⅓ మైళ్ళు అనే సంగతి" తెలీకే రాశాడా ? తెలిస్తే, హనుమంతుడితో 23⅓ మైళ్ళు మాత్రమే ఎగిరిస్తాడా ? (23 మైళ్ళెగిరిన భాగ్యానికి హనుమంతుడు మాత్రం ఏం గొప్ప వీరుడవుతాడు లెండి.)

23⅓ మైళ్ళ "వాస్తవం" పాటించవలసి వొచ్చినప్పుడు కవి, ఆ "ఎగిరించడం" కూడా మానుకుని వాస్తవ ప్రయాణ పద్ధతిలోకి దించుతాడా కథని?

ఈ దూరం అయితే తెలీక 100 యోజనాలని రాశాడనుకుందాం. మరి 'ఎగరడం' సంగతి కూడా తెలీకే రాశాడా? కోతులు మాత్రం అంత దూరం ఎగురుతాయా ? మనుషులు వేలకొద్దీ సంవత్సరాలు జీవించారనీ, కోతులూ పక్షులూ మాటాడవనీ తెలీకే రాశాడా ? లోకజ్ఞానం వల ఎంతో స్పష్టంగా తెలిసిన విషయాలు మాత్రం సహజ విరుద్ధంగా రాయలేదా ? అలాగే, సముద్రం వెడల్పు గురించి కూడా కల్పనా రూపంలో వంద యోజనాలుగా చిత్రించాడు.

కవి రాసిన విషయం, మన తర్కానికీ, రుజువులకీ, సరిపడనప్పుడు — "కవి తెలియక రాశాడు." — అని అభిప్రాయ పడడం సరైంది కాదు. వాల్మీకి రాసిన అవాస్తవాలన్నీ తెలీకే రాశాడా ?

మనం ఓక సందేహానికి సమాధానం చెప్పుకున్నప్పుడు, ఆ సమాధానం వల్ల ఇంకో సందేహం పుట్టుకు రాకూడదు.

సముద్రం వెడల్పు 100 యోజనాలు — అనేది కల్పన. హనుమంతుడు ఎగిరి దాటడం — అనేది కూడా కల్పనే.

ఆ కల్పనకీ, ఈ కల్పనకీ సరిపోతుంది. ఇందులో హనుమంతుడు "ఎగిరి దాటాడనే" విషయాన్ని విమర్శకులు వొప్పుకోరు. పదవల ద్వారా వాస్తవ పద్ధతిలోనే దాటాడంటారు. అంటే ఒక విషయాన్ని, ఏమీ తర్కం లేకుండా "వాస్తవం" లోకి మార్చేసుకున్నారు. అప్పుడు రెండోదాన్ని కూడా తర్కం లేకుండానే మార్చుకోవాలి. దూరం తగ్గించేసుకోవాలి. కానీ, అసలు ఆ వంద యోజనాలనీ కల్పనగానే అర్థం చేసుకోవడం లేదు. అది నిజమైన దూరమే అనుకుంటున్నారు. అంత దూరం ఎక్కడ వుంటుందో అక్కడే హనుమంతుడు ఓడలో సముద్రం దాటాడంటున్నారు. (కల్పనకీ, వాస్తవికతకీ లంకె పెట్టడం.)....

అలాగే రెండో పక్షంవారు కూడా, —హనుమంతుడు వాస్తవ పద్ధతిలోనే సముద్రం దాటాడంటారు. ఆ వంద యోజనాల కల్పనని, కూడా వాస్తవంలోకి మార్చుకోకుండానే, ఆ వంద యోజనాలనే వాస్తవంగా నమ్మి-వాల్మీకి దూరం సంగతి తెలియక మాత్రమే రాశాడంటారు. అంటే ఇది కూడా కల్పనకీ, వాస్తవానికీ లంకె పెట్టడమే. — ఈ రెండు అభిప్రాయాలూ శుద్ధ తప్పే.

కవి బంగారులేడి గురించి రాశాడు కాబట్టి అలాంటి లేళ్ళు తప్పకుండా వుంటాయనడం ఎలాంటిదో, కవిచెప్పిన దూరాలూ, స్థలాలూ, సముద్రాలూ, నమ్మి కవి రాసింది రాసినట్టు వాస్తవ పరిస్థితులకు సరిపోవాలనడం అలాంటిది.

(వాస్తవానికీ, కల్పనకూ లంకె పెట్టడం గురించి ఇంకో చోట చర్చిస్తాను.)

హిందూ దేశానికీ, లంకకీ మధ్యవున్న దూరం గురించి చర్చించే ముందు అసలు కవి చెప్పిన "దక్షిణ సముద్రం" సంగతి వొకటి తేల్చుకోవాలి.

హనుమంతుడు చాటిన సముద్రం ఏది ?

సీతని వెతకడానికి దక్షిణంవేపు బయల్దేరిన వానరులు, స్వయంప్రభ బిలంలో జొరబడి, మళ్ళీ బయట పడ్డప్పుడు, వింధ్యపర్వత పాదాన్న నిలబడ్డాయి. అక్కడే కెరటాలతో పొంగుతూ వున్న సముద్రం చూచారు ఆ వింధ్య పర్వతాల దగ్గిరే అంగదుడు చచ్చిపోతానని పడుకున్నాడు. (ఇవంతా ఈ పుస్తకంలోనే వొక లింకులో చూస్తారు.) అక్కడికే సంపాతి వొచ్చి సీత లంకలో వుందని చెప్పాడు. అప్పుడు వానరులందరూ సముద్రం వేపు బయల్దేరారు. హనుమంతుడు అక్కడినించీ ఎగిరాడు — ఇదంతా వింధ్య పర్వతాల దగ్గిరే.

వింధ్య పర్వతాల దగ్గిర సముద్రం వుండడం ఏమిటి ? పోనీ అది పడమటి దిక్కు సముద్రమా ? (ఇప్పటి అరేబియా సముద్రమా?) హనుమంతుడు పడమటి సముద్రం అంచున వింధ్య దగ్గిర బయల్దేరి, భారతదేశానికి పడమటి అంచు వెంట సముద్రంలో ప్రయాణం చేసి, పడమరనించి దక్షిణానికి తిరిగి లంక చేరాడా ?

కానీ, అలా అనుకోడానికి వీల్లేదు. కవి, చాలా ఖచ్చితంగా, — "వానరులు అప్పుడు (హనుమంతుడు బయల్దేరే ముందు) దక్షిణ సముద్రపు వుత్తరగట్టున నిలబడ్డారు." — అని చెప్పాడు.

దక్షిణ సముద్రం అంటే ఇప్పటి హిందూమహా సముద్రమే అయితే, అది వింధ్య పర్వతాల దగ్గిర వుండడం ఏమిటి? వింధ్య పర్వతాలనించీ, దక్షిణం వేపు లంక వరకూ అంతా సముద్రమే నన్నమాట. మరి వింధ్య పర్వతాల తర్వాత వుండవలసిన దక్షిణాపథం మాటేమిటి?

రామస్వామి చౌదరిగారు — హనుమంతుడు భారత దేశంలో పూర్తిగా దక్షిణానికి వెళ్ళి (అంటే ఈ నాటి కన్యాకుమారి అనుకోవొచ్చు) లంకకు ప్రయాణ మయ్యాడనే అభిప్రాయంతోనే చర్చించాడు. కానీ అది పొరపాటు. హనుమంతుడు వింధ్యపర్వతాల దగ్గిరే బయల్దేరాడు.

ఆ సంగతి గమనించకుండానే హిందూదేశానికీ — లంకకీ మధ్య ప్రాంతం గురించి ఎలా చర్చిస్తాం? వింధ్య దగ్గిర వున్నది ఈ దక్షిణ

సముద్రం గాకపోతే, (హనుమంతుడు ప్రయాణం చేసింది ఈ హిందూ మహాసముద్రం గాకపోతే) అప్పుడు లంకకూడా మనం అనుకునే లంక కాదు గదా? అప్పుడు ఇంకేదో లంకకోసం వెతకవలసిందే కదా?

ప్రాచీన గ్రంథాలలో వున్న కల్పనలన్నిట్నీ ఈనాటి వాస్తవాలతో పోల్చుకోవాలని చూస్తే (ప్రకృతికి సంబంధించిన విషయాలలో) ఈ రకంపాట్లు తప్పవు. తప్పు మనదేగానీ, శాస్త్రజ్ఞానంలేని రోజుల్లో కథలు రాసిన పూర్వులదికాదు.

కానీ, సమాజానికీ, నీతులకీ, సాంప్రదాయాలకీ, (సంస్కృతికి) సంబంధించిన విషయాలలో పరిశీలించడానికి, కల్పనలేమీ అడ్డురావు. (ఈ విషయం తర్వాత చూడవచ్చును.)

* * *

కల్పనలో వాస్తవికతకోసం

కవి పెనుగులాట —

కల్పనకీ, వాస్తవానికీ, లంకె పెట్టేపని కవి చాలాచోట్ల చేశాడు. (ఆ నాడు మనమే చెయ్యగాలేంది, ఆనాడు వాల్మీకి చెయ్యడానికేమిటి లెండి.)

కవి ఓక కల్పిత ఘట్టం చెపుతూ, అందులో వాస్తవికత వుంది సుమా! అని చెప్పడానికి ప్రయత్నిస్తూ వుంటాడు.

—రాముడు ఖరుడితో యుద్ధం చేసినప్పుడు 14వేలమంది వీరాధి వీరుల్ని ఓక్కడే చంపేస్తాడు. ఇది అసహజమే. కానీ, ఆ చంపడం, ఏదో మంత్రంపెట్టి, చెయ్యి అటూ ఇటూ తిప్పి అసహజంగా చంపడు. రాముడు 14వేల మందినీ యుద్ధంలోనే చంపుతాడు.

"రాముడు తన వీరత్వంతో యుద్ధంచేసే చంపాడు సుమా!"— అనేది కవి చూపించే వాస్తవికత.

—హనుమంతుడు సముద్రంమీద ఎగిరి దాటటం అసహజమే. ఎలాగూ అసహజమైన విషయం చెపుతూ వున్నప్పుడు, హనుమంతుడు

ఏ దేవతల్నో ప్రార్థించికుని, ఈ వొడ్డున మాయమై, ఆ వొడ్డున వున్నాడని ఎందుకు చెప్పకూడదు?— కానీ, అలా చెప్పలేదు. ఈ వొడ్డుకీ, ఆ వొడ్డుకీ మధ్య కొంతదూరం వుందనీ, ఆ దూరం మీదనుంచి ఈ శరీరం దాటితేనే అవతల వొడ్డుకి చేరుతుంచనీ, కవి వాస్తవ దృష్టితోనే అనుకున్నాడు. అందుచేత— "హనుమంతుడు తన శక్తి సామర్థ్యాలతో" 'ఎగిరే దాటాడు సుమా!' అని వాస్తవికతతోనేచెప్పినట్టు భావిస్తాడు.

—మైనాకుడు పర్వతంగావుండి మాట్లాడడం అసహజమని కవికి తెలుసు.

"ఏ-ండీ! పర్వతం ఎక్కడన్న మాట్లాడుతుందా?"— అని అడిగితే,

ఆయన చిరునవ్వుతో— "పర్వతం మాట్లాడుతుందని నేను మాత్రం అన్నానా? అందుకేగా అది మనిషిగామారి మాటాడింది!"— అని —"ఇప్పుడేం చెయ్యగలరూ"— అన్నట్టు చూస్తాడు.

—అంజనని (వానర స్త్రీ) వాయుదేవుడు మోహిస్తాడు. "కోతిని ఎలా మోహిస్తాడు?"— అనే ప్రశ్న వొస్తుందని,

"అప్పుడు అంజన అందమైన మానవస్త్రీగా మారిందిగా?.... అందుకని మోహించాడుగానీ....లేకపోతే మోహిస్తాడా?"— అని జవాబు.

మళ్ళీ కవికి గిట్టనివాళ్ళ విషయంలో అయితే ఈ తర్కం ఏమీ వుండదు. హేతువాదులు వెర్రి మొహం వేసుకుని, రాక్షసిలాగే వికారంగా, వొచ్చింది రాముడి దగ్గిరికి.

కవి ఎంత అసహజమైన ఘట్టం కల్పించినా, లోకజ్ఞానం, సమాజ జ్ఞానం పూర్తిగా విస్మరించలేదు. కల్పనకూడా వాస్తవికత చుట్టూనే సాగుతుంది.

మానవ సమాజంలో సాహిత్యంలో హేతువాద విరుద్ధమైన కల్పన ఎందుకు సృష్టి అయిందో, కల్పనల్లో వాస్తవికతని, ఎలా అర్థంచేసుకోవొచ్చునో, ఈ భాగంలో చూడడానికి వీలైంది.

* *

రామాయణంలో వున్న అవాస్తవిక ఘట్టాలు కొన్ని "విష వృక్షం"లో లింకులుగా విభజించాను. కానీ, కథ పొడుగునా అవాస్త వాలే వుండడంచేత, చాలా విషయాలు కథలలోకికూడా వొచ్చాయి. అటు వంటి సందర్భాలలో వివరంగా ఫుట్‌నోట్లు ఇచ్చి వాటిని అలాగే వుంచాను.

ఈ రెండో భాగంలో వందలకొద్దీ ఫుట్‌నోట్లు ఇవ్వవలసి వొచ్చింది. మొదటి భాగంలో ఫుట్‌నోట్లు లేని విషయాలమీద కొందరు చాలా సందేహాలు వెలిబుచ్చారు. ఫుట్‌నోట్లు వున్నచోట్లకూడా — "రాముడు నిజంగానే తండ్రిని మోసించాడా?" "నిజంగానే మాంసం తిన్నాడా?"— అని చాలా సందేహించారు.

అటువంటివే ఇంకా చాలా విషయాలు దృష్టిలో పెట్టుకుని, ఎక్కడికక్కడ ఫుట్‌నోట్స్ ఇవ్వవలసి వొచ్చింది.

ప్రక్షిప్తాల ఘోష

[ప్రక్షిప్తాల గురించి కొందరు పాఠకులు— "ఫలానా ఘట్టం ప్రక్షిప్తం అటకదా?" "ప్రక్షిప్తాలవల్ల అవకతవకగా తయారైన కథల్లో పాత్రల మంచి చెడ్డలు ఏలా నిర్ణయించగలరు?"

"ఒక సంచర్భం ప్రక్షిప్తం వల్లనే చెడిపోయినప్పుడు, వాల్మీకి సందర్భశుద్ధి లేకుండా రాశాడంటే వాల్మీకికి ద్రోహం చెయ్యడంకాదా?" —అంటూ కొన్నిరకాల ప్రశ్నలు అడిగారు.

రామాయణం గురించి చదివేప్పుడు 'ప్రక్షిప్తాలవాదం' గురించి తెలుసుకోవలసిన అవసరం వుంది. పాఠకుల ప్రశ్నలకు నే నేమైనా చెప్పాలంటే ముందు 'ప్రక్షిప్తాల వాదం' గురించి కొంచెం చెప్పాలి. ప్రశ్నలకు మాత్రమే జవాబుచెప్తే, ప్రక్షిప్తాల గురించి తెలియని పాఠకు లేమీ అర్థం చేసుకోలేరు.]

వాల్మీకి రామాయణం సంస్కృతంలో
7 కాండలుగా (భాగాలుగా) వుంది.

1. బాలకాండ
2. అయోధ్యకాండ
3. అరణ్యకాండ
4. కిష్కింధాకాండ
5. సుందరకాండ
6. యుద్ధకాండ
7. ఉత్తరకాండ

ఈ 7 కాండల్లోనూ కలిసి మొత్తం 21 వేల శ్లోకాలున్నాయని పండితులు అంటున్నారు. (లెక్కపెడితే ఇది ఎవరికైనా తెలిసే విషయమే. నేను లెక్కపెట్టలేదు.)

అసలు 'రామాయణంలో కథ ఏ కొంచెమైనా జరిగిందా? జరిగితే ఏ కాలంలో జరిగిందీ? ఏ దేశంలో జరిగిందీ? అనే విషయాలమీద రకరకాల అభిప్రాయాలున్నాయి. రామాయణం భారతదేశంలోనే

జరిగిందని కొందరు ఎంతో గాఢంగా నమ్మితే, కొందరు ఈజిప్టులో అనీ, కొందరు లెబనాన్‌లో అనీ, కొందరు ఇంకెక్కడో అనీ అంత గాఢంగానూ నమ్ముతారు. ఎవరి నమ్మకానికి తగ్గ ఆధారాలు వారు చూపిస్తారు.

"రామాయణం" ఏ కాలంలో పుస్తక రూపంగా రాయడం జరిగిందనే విషయం గురించి కూడా ఏకాభిప్రాయం లేదు (పుస్తకరూపంగా అంటే తాటాకుల వంటి ఆకులమీద అనే అర్థం.)

రామాయణం ఇంకా ఎవ్వరూ రాయక పూర్వంనించీ కూడా ప్రజలలో ప్రచారంలో వుందనే విషయం మాత్రం అందరూ అంగీకరిస్తారు.

(ప్రచారంలో అంటే చిన్న చిన్న కథల రూపంలోనూ, ఎవరికెలా చేతనైతే అలా తయారు చేసుకున్న పాటల రూపంలోనూ రామాయణం కథని ప్రజలు చెప్పుకుంటూనే వున్నారన్నమాట. ఈనాడు మనం చెప్పుకునే కథలాగానే ఆనాడు చెప్పుకునే వారని అర్థం చేసుకోకూడదు. అనేక లేదా లండవొచ్చును.)

రామాయణం కథని మొట్టమొదట పుస్తక రూపంలో రాసిన వాడు వాల్మీకి — అనే అభిప్రాయం దాదాపు అందరికీ వుంది. మొట మొదట రాయడం అంటే, ప్రజలు చెప్పుకునే కథల్నీ, పాడుకునే పాటల్నీ, ఎలా వున్నవాటిని అలాగే రాత రూపంలో "ఎక్కించడం" మాత్రమే చేశాడని అర్థం కాదు.

కథనంతా, వొక ఛందస్సుతో, వ్యాకరణ యుక్తంగా రెండేసి పదాలు గల శ్లోకాలుగా తయారుచేస్తూ రాశాడు.

అలా పుస్తక రూపంలో రాయడం అనేది ఏ కాలంలో జరిగిందనే విషయం మీద కూడా రకరకాల అభిప్రాయాలున్నాయి.

మన మూఢాగ్రేసర పండితోత్తములైతే — "శ్రీ మహావిష్ణువు రామావతారం ఎత్తింది త్రేతాయుగంలో కదా? రాముడు రాజ్యం చేస్తూ వున్నప్పుడే వాల్మీకి రామకథ రాశాడు కదా?

ఆ రకంగా లెక్కలు కడితే రామాయణం రాసి దాదాపు 9 లక్షల సంవత్సరాలై వుంటుంది," — అంటారు.

బ్రహ్మలోకం, విష్ణులోకం, గోలోకం, శివలోకం లాంటి లోకాల్లాగ కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం లాంటి యుగాలు కూడా శుద్ధ అవాస్తవికమైన అభిప్రాయాలే. — అందుచేత ఈ 9 లక్షల వాదం నవ్వుకోడానికి మాత్రమే పనికి వొస్తుంది.

రామాయణ, భారతాల గురించి కష్టపడి పరిశోధనలు చేసిన విమర్శకులలో –"రామాయణం రాసి 2 వేల్ట, 6 వందల సంవత్సరాలై వుంటుంది," — అన్నావారూ వున్నారు.

"వెయ్యి సంవత్సరాలై వుంటుంది," – అన్నవారూ వున్నారు. ఈ రెంటికీ మధ్య కాలాలు చెప్పేవారూ వున్నారు.

మొత్తానికి వందలమీదా, వేలమీదా సంగతే. అసలు "రాయడం" అనేది ఎప్పుడో వొకప్పుడు జరిగింది కదా ? — అప్పటినుంచీ, ఈ వందలకొద్దీ వేలకొద్దీ సంవంత్సరాల కాలంలో ఎంతోమంది కవులు రామాయణం పొడుగునా ఎవరికి తోచినట్టు వారు కొత్త కొత్త ఘట్టాలు చేర్చేసి (సంస్కృతంలోనే) కథ చాలా పెంచుతూ వొచ్చారని విమర్శకులు అంటున్నారు. అలా కొత్తగా చేర్చిన ఘట్టాలనే "ప్రక్షిప్తాలు" అంటారు. "ప్రక్షిప్తం" అంటే "చేర్చబడ్డది" — అని అర్థం.

ఈ ప్రక్షిప్తాలు చేర్చడం ఎలా జరిగి వుంటుందనే విషయం గురించి ఎవరి వూహకు తోచినట్టు వారు నిర్ణయించుకోవలసిందే.

ఒక కవిగారి ఇంట్లో వాల్మీకి రామాయణం (కాటాకుల గ్రంథం.) వుండిందనుకుందాం. ఆయన దాన్ని నిత్యం చదువుతూ వుంటాడు కదా ? ఒక ఘట్టం కొంచెం పెంచాలనో, కొత్త ఘట్టం ఏదైనా రాయాలనో బుద్ధి పుట్టవొచ్చును. ఆయన వొక్కడూ గానీ, కొందరు కవులు కలిసిగానీ, ఆ పని చేస్తారు. ఆ కొత్త భాగం పాత గ్రంథం మధ్యలో చేరుతుంది. అప్పటినుంచీ పాత కథతోపాటు కొత్తది కూడా కలిపి చదువుతూ వుంటారు. కొంత కాలానికి ఆ గ్రంథం గానీ దాని నకలు గానీ ఇంకో కవి చేతిలో పడుతుంది. .... ఆయనకు కూడా ఏమైనా చేర్చాలని వుత్సాహం కలిగితే చేరుస్తాడు.

(ప్రక్షిప్తాలు ఎలా చేరివుంటాయనే విషయంలో నాకు వొచ్చిన వ్యూహ ఇది. ఇలాగే జరిగిందని కాదు.)

ప్రక్షిప్తాలు చేరిన రామాయణం, అసలు దానికి రెండు రెట్లో, మూడు రెట్లో పెద్దది అయిపోయిందట. అంతేగాక, భారత దేశంలో, వాల్మీకి పేరుతోనే మూడో, నాలుగో రకాల రామాయణా లున్నాయట. వాటన్నిటిలోనూ సుమారు వెయ్యి శ్లోకాల వరకూ వొక్కలాగే వుంది, మిగిలినవి వొక గ్రంథానికీ ఇంకో గ్రంథానికీ సంబంధం లేకుండా వున్నాయట.

ఇప్పుడు మనం చదువుతోన్న 'వాల్మీకి రామాయణం' కూడా వాటిలో వొకటి.

వాల్మీకి మొదట్లో రాసిన "చిన్నకథ", వందలకొద్దీ, వేలకొద్దీ సంవత్సరాల కాలంలో "చాలా పెద్దకథ" గా మారడం నిజమే అయితే, అది ఒక సహజ పరిణామం. తాటాకుల మీద రాసే కాలం కొబట్టి అలా జరిగింది. ఈ కాలంలో అయితే, అన్ని వివరాలతోటీ ప్రింటు చేసి, లైబ్రరీలలో జాగ్రత్త చేసే అవకాశాలు వున్నప్పుడైతే అలా జరగదు. — భారత, భాగవతాలలో కూడా ప్రక్షిప్తాలు వున్నాయనే వాదం వుంది. ప్రక్షిప్తాలు చేరడం ఆనాటి సమాజ పరిస్థితిని బట్టి జరిగిన సహజ విషయం.

కానీ, వాల్మీకి భక్తులెవ్వరూ "ప్రక్షిప్తాల్ని" అంత సహజంగా తీసుకోరు.

వాల్మీకి భక్తుల్లో రెండు రకాల వారున్నారు.

మొదటి రకంవారు.

— రామాయణంలో ఎక్కువగా ప్రక్షిప్తా లున్నాయంటే వొప్పుకోరు. ఒకటో, అరో వొప్పుకుంటారు. దాదాపు రామాయణం అంతా వాల్మీకి రాసిందే అంటారు.

రెండో రకంవారు.

— రామాయణంలో వున్న కథంతా ప్రక్షిప్తాలే నంటారు. వాల్మీకి మొదట్లో రాసింది ఏదీ మిగల్లేదంటారు. మిగిలినా, ప్రక్షిప్తాల

మధ్యపడి అ సవ్య సం లయిపోయిం దంటారు. ప్రక్షిప్తాలన్నీ కలిసి వాల్మీకి కావ్య గౌరవాన్ని సర్వనాశనం చేసేశా యంటారు. — పీఠికి ప్రక్షిప్తాలమీద చెప్పలేనంత పీకుఖత.

ముందు రామాయణం గురించి ఒక విషయం చెప్పాలి. ఈనాడు, మన ప్రాంతంలో, మనకు అందుబాటులో వున్న వాల్మీకి రామాయణం చదివితే కథ పొడుగునా ఎన్నెన్నో అవక తవకలూ, అసందర్భాలూ, అసహజ సంఘటనలూ, అభూత కల్పనలూ కొల్లలుగా కనపడతాయి.

రామాయణం అలా ఎందుకు వుందనే విషయంలో అడుగడుగునా సందేహాలు వొస్తూ వుంటాయి.

కానీ, వాల్మీకి భక్తుల్లో మొదటికకం వారు — అసలు రామాయణంలో అవక తవక లున్నాయనే వొప్పుకోరు. ఏ సందేహానికీ తావు ఇవ్వరు. దేన్నీ విమర్శనా దృష్టితో చూడరు. ప్రతి అవక తవకకీ గొప్ప ఆధ్యాత్మిక అర్థాలు చెప్పుకుని, అందులో ఏదో అద్భుత రహస్యం ఇమిడి వుందంటారు. అసలు దాన్ని అర్థం చేసుకోవడమే సాధ్యంకాదు పొమ్మంటారు.

ఇక రెండోరకం వారు — రామాయణంలో వున్న ప్రతి అవక తవకనీ ప్రతి లోపాన్నీ, ప్రతి అసందర్భాన్నీ, ప్రతి విమర్శనీ వొప్పు కుంటారు. అయితే వాటన్నిటికీ ఏకైక కారణం ప్రక్షిప్తాలేనని, సమస్త మైన తప్పులూ ప్రక్షిప్తాల మీదకి గెంటేస్తారు. "వాల్మీకి మొదట చాలా గొప్పగా, వుదాత్తంగా, రమ్యంగా, సహజంగా రాస్తే, తర్వాత కవులే అంతా తప్పులతడక చేసేశారు. రామాయణంలో ఏ విమర్శకీ వాల్మీకి బాధ్యత లేదు." — అని వాల్మీకిని వెనకేసుకొచ్చి ప్రక్షిప్తాల మీద కత్తి కడతారు.

"వాల్మీకి కూడా ఏమైనా తప్పులు చేశాడేమో :" అనే అభిప్రాయం వూహామాత్రంగా కూడా కలగనివ్వరు.

"రామాయణంలో లోపాలకి ప్రక్షిప్తాలే కాకుండా ఇంకేమైనా కారణా లున్నాయేమో!" — అన్న ఆలోచనకే తావు ఇవ్వరు.

ఈ రెండు రకాలవారూ వాల్మీకి భక్తులే. మొదటి రకంవారు మూఢభక్తులు.

రెండో రకంవారు గడుసు భక్తులు.

ఈ ప్రక్షిప్తాల చర్చలో మొదటిరకం భక్తుల్ని వొదిలేద్దాం. — అది తర్కానికి లొంగే వ్యవహారం కాదు.

రెండోరకం భక్తుల అభిప్రాయాల గురించి కొంచెం తెలుసుకోవలసిన అవసరం వుంది.

ప్రక్షిప్తాల విమర్శకుల ప్రకారం అయితే —

— అసలు వాల్మీకి రాసింది దశరథుడు రాముడికి పట్టాభిషేకం చెయ్యాలని నిశ్చయించిన దగ్గిర్నుంచీ ..... రాముడు మళ్ళీ అయోధ్యకు వొచ్చి పట్టాభిషేకం చేసుకునే వరకే. మొదట బాలకాండ అంతా ఎవరో కవులు రాసిందే. (ప్రక్షిప్తమే.) — చివర వుత్తరకాండ అంతా ప్రక్షిప్తమే. మధ్యలో ప్రతీ కాండలోనూ సగానికి పైగా ప్రక్షిప్తమే.

ప్రక్షిప్తాలు లేని అసలు రామాయణం ఏమిటో తెలుసుకోవాలంటే, ఈనాడు మనకు తెలిసిన రామాయణం నాలుగు భాగాలు చేసి, మూడు భాగాలు తీసెయ్యాలి. రాముడు పుట్టడం వుండదు. విశ్వామిత్ర యాగం వుండదు. తాటకిని చంపడం వుండదు. శివ ధనుర్భంగం వుండదు. సీతారాముల పెళ్ళి వుండదు. బంగారులేడి వుండదు. లంకా దహనం వుండదు. కుశలవులు పుట్టడం వుండదు. అన్నిటినీ మించిన ఘోర ప్రమాదం "రామరాజ్యం" కూడా వుండదు.

అంతేగాక, ఇక కథ పొడుగునా అహల్యా శాపం, గంగావతరణం, క్షీరసాగర మథనం, త్రిశంకుస్వర్గం, విశ్వామిత్ర వశిష్టుల యుద్ధం, మొదలైన కథలు వందలకొద్దీ ఎగిరిపోతాయి. ఈ రకంగా ప్రక్షిప్తా లన్నీ తీసేసిం తర్వాత మిగిలే "అసలు కథ" చాలా వుదాత్తంగా, సహజ సుందరంగా వుంటుందని విమర్శకుల అభిప్రాయం.

— ఈ విమర్శలో ఏమైనా నిజం వుందా?

ప్రక్షిప్తాలు లేవని నిర్ణయించిన ఘట్టాలలో మాత్రం అవక తపకలూ, అభూత కల్పనలూ లేవా?

— ప్రక్షిప్తాలను కూడా రామాయణంలో భాగంగా స్వీకరించవలసిన అవసరం లేదా?

— ప్రక్షిప్తాల వల్ల మూలకథ కేమైనా ద్రోహం జరిగిందా? అసలు కథ స్వభావం ఏమైనా మారిందా?

— రామాయణం వంటి కల్పిత గాథలలో అవక తపకలకూ, అవాస్తవ సంఘటనలకూ శాస్త్రీయమైన కారణాలేమైనా వున్నాయా? — మొదలైన విషయాల గురించి పాఠకులు ఆలోచించవలసిన అవసరం వుంది.

• • •

అసలు ప్రక్షిప్తాల విమర్శకులు, ఏది ప్రక్షిప్తమో, ఏది కాదో ఏ ఆధారాలతో నిర్ణయిస్తున్నారు?

వాల్మీకి పేరుతోనే మూడు, నాలుగు రకాల రామాయణాలు వున్నాయి కదా? — అన్నిటినీ పరిశీలించి, వాటిలో కనీసం రెండింటిలోనైనా వొక్కలాగే వున్న శ్లోకాలు వేరుచేసి — "ఇవిగో, వాల్మీకి పేరుతో వున్న అన్ని గ్రంథాలలోనూ వొక్కలాగే వున్న శ్లోకాలు ఇవి. ఇవే మూలానికి సంబంధించినవి. మిగిలినవన్నీ తర్వాత చేర్చినవే." — అని ఎవరైనా అంటే ఆ వాదం చాలావరకు సబబుగానే వుంటుంది. (ప్రక్షిప్తాలు నిర్ణయించడానికి ఈ పద్ధతి కూడా సాధ్యం కాకపోవచ్చు.)

కానీ, ప్రక్షిప్తాల విమర్శకు లందరూ ఈ రకంగా చెయ్యడం లేదు. తమ ప్రాంతంలో అందుబాటులో వున్న రామాయణం వొక్కటే చదివి తమకు ఏది సమంజసంగా తోచకపోతే, దాన్ని "ప్రక్షిప్తం" అని

కొటిపారేస్తూ వుంటారు. నిజానికి అది ప్రక్షిప్తమే కావొచ్చు. కాక పోనూవొచ్చు.

ఈ విమర్శకుల్లో కూడా ప్రక్షిప్తాలమీద ఏకాభిప్రాయం లేదు. వొకరు — "బంగారులేడి ప్రక్షిప్తమే" — అంటే ఇంకొకరు — "అబ్బే, బంగారులేడి ప్రక్షిప్తం కాదుగానీ, లంకాదహనం మాత్రం ప్రక్షిప్తమే" — అంటారు. వొకరికి సమంజసంగానే తోచింది రెండో వారికి సమంజసంగా తోచదు. ఇద్దరికీ బాగుంటే, మూడో ఆయనకి బాగుండదు. అంటే ఎవరి తర్కజ్ఞానాన్నిబట్టి వారు ప్రక్షిప్తాలు నిర్ణయిస్తారన్నమాట.

"రామాయణం చదువుతూ వున్నప్పుడు మనకు కనపడే అవకతవకల్ని బట్టి ఏది తర్వాత చేరిన ఘట్టమో సులభంగానే నిర్ణయించవొచ్చు గదా?" — అనవొచ్చు. కానీ, అది ఎక్కడో రెండుమూడు చోట్ల తప్ప ప్రతిచోటా సాధ్యం కాదు. ఎందుచేతంటే ప్రక్షిప్తాలు లేని ఘట్టాల్లో కూడా కావలసినన్ని అసందర్భాలూ, అవకతవకలూ వున్నాయి. ఒక విషయం అసహజంగా వుంది కాబట్టి "ఇది వాల్మీకి రాసింది కాదు" — అని తీసిపారేస్తే అది వాల్మీకి రాసిందే కావొచ్చును.

"దశరథుడికి 60 వేల సంవత్సరాల వయస్సు," — అన్నది అసహజమైన విషయమే.

"వాల్మీకి ఇంత అజ్ఞానంగా రాశాడేమిటి?" — అనుకోవడం చాలా తప్పు. ఆ అసహజాన్ని ఒకకాలం నాటి "కథా రూపం" గా మాత్రమే తీసుకోవాలి. శాస్త్రజ్ఞానం లేని సమాజంలో ఆ పద్ధతిగా కథలు చెప్పుకోవడం ప్రారంభమైంది. మనుషులు వేలకొద్దీ సంవత్సరాలు జీవించరని వాల్మీకికి తెలియని విషయం కాదు. కానీ, తనకన్న పూర్వం నించీ సమాజంలో కథలు చెప్పే సాంప్రదాయాన్నే ఆయనా పాటించాడు. అంటే, అప్పటికి కూడా "హేతువాదం" అనేది (శాస్త్రజ్ఞానం) లేదు. — అప్పటి సమాజంలో నాస్తికులు లేరని కాదు. వారి జ్ఞానం కూడా ఎక్కువ అభివృద్ధి చెందింది కాదు.

ఆనాటి సమాజం మీద ఏ కోశానా హేతువాద ప్రభావం లేదు.

రచనలో తర్కానికీ, సందేహాలకీ స్థానం లేదు. సమాజం వాటిగురించి పట్టించుకోదు.

ఈ కాలంలో అయితే ఏ రచయితైనా, "దశరథ రామయ్యకు 2 వేల సంవత్సరాల వయస్సు" — అని రాయగలడా ?

"హనుమంతరావు కన్యాకుమారిలో సముద్ర తీరాన కొంతపేపు కూర్చుని ఎగిరి కొలంబో వెళ్ళాడు." — అని రాయగలడా? — ఆ రచయిత దేవుణ్ణి నమ్మేవాడైనా మహిమల మీద నమ్మకం వున్నవాడైనా ఆ నమ్మకాలన్నీ బుర్రలో వుంచుకోవలసిందే గానీ అలా ఎందుకు రాయలేదు ? ఈ నాటి సమాజానికి కొన్ని విషయాలలో కథల్లో కూడా రాయడానికి వీల్లేనంత శాస్త్రజ్ఞానం కలిగింది. *

అలాంటి శాస్త్రజ్ఞానం ఎరగని సమాజంలో, వాల్మీకి అయినా, ఇంకో కవి అయినా, ప్రాచీన సాంప్రదాయాల ప్రకారమే, దశరథుడికి 60 వేల సంవత్సరాలనీ, విశ్వామిత్రుడు 10 వేల సంవత్సరాలు తపస్సు చేశాడనీ, రాయడానికేమీ సంకోచించరు. ఒక విషయాన్ని కల్పనగా చెప్పడంలోనే గాదు, వాస్తవంగా చెప్పే విషయంలో కూడా "తర్కం" వుండదు.

కథలో రుషులెవరూ వేటాడలేదు గదా ? రాముడు రుషివేషంతో వేటాడా డెందుకు ? రాముడు ఆభరణాలన్నీ తీసేసి, వనవాసానికి వొచ్చాడు కదా? —సీతకి పంపిన వుంగరం (రాముడి పేరు చెక్కింది) ఎక్కడిది ? — ఈ రకంగా, ఎవరికైనా సందేహాలు వొస్తే దానికి సమాజం విలువ ఇవ్వదు. రచనలోంచి అలాంటి విషయాలన్నీ మార్చెయ్యాలని ప్రయత్నించదు. — అంటే ఆనాటి సమాజంలో తర్కానికి అధికమైన స్థానం లేదన్నమాట.

ప్రక్షిప్తాల విమర్శకులు ఈ సంగతులేమీ అర్థం చేసుకోరు. — దశరథుడికి 60 వేల సంవత్సరాలని రాయడం తప్పే అనుకుని —

---

* అలాంటి శాస్త్రజ్ఞానం "మహిమల" విషయంలో కూడా కలిగినప్పుడు దేవుడు కూడా అంతరించి పోతాడు.

"అబ్బే! వాల్మీకి అంత అనహజంగా ఎందుకు రాస్తాడు, తర్వాత ఎవరో ఇలాంటి విషయాలన్నీ కథలో చేర్చేశారు. ప్రక్షిప్తాల పనే అది." — అని వాదిస్తారు.

అంత అసహజమైన విషయం వాల్మీకి రాయడు గానీ, తర్వాత కవి మాత్రం ఎందుకు రాస్తాడు? (ప్రక్షిప్తాల కవికి వొక పేరు పెట్టుకుంటే బాగుంటుంది. ప్రక్షిప్తాల కవులు వొకరికన్నా ఎక్కువ మందే అయినా అందరికీ ప్రతినిధిగా వొక పేరు చాలు. —ఆయన్ని "గిల్మీకి" అందాం. వాల్మీకి భక్తులు కూడా సంతోషిస్తారు.)

మనుషులు వేలకొద్దీ సంవత్సరాలు జీవించరని వాల్మీకికి తెలుసు గానీ, గిల్మీకికి మాత్రం తెలీదా?— అని అడిగితే ప్రక్షిప్తాల విమర్శకులేమీ జవాబు చెప్పరు. అసలు ఆ కోణంలోనే ఆలోచించరు. తమకు తప్పుగా తోచినవన్నీ (తమ ఆలోచనకి అందినంత వరకే) ప్రక్షిప్తాల మీదకి తోసెయ్యడం తప్ప అందులో నిజానిజాలు చూసే పద్ధతేమీ లేదు.

"ఈ సహజ ఘట్టం వాల్మీకి రాయలేదు," — అంటే సరిపోదు. ఎందుకు రాసివుండదో చెప్పాలి. వాల్మీకి జీవించిన సమాజం అవాస్తవాన్ని ధిక్కరించే హేతువాద సమాజమా?

అలాగే, ఆ అసహజ ఘట్టం గిల్మీకే ఎందుకు రాసివుంటాడో కూడా చెప్పాలి.

వాల్మీకి తర్వాత కవులందరూ కల్పనలూ, అవాస్తవ సంఘటనలూ, కొల్లలుగా రాసేశారట గానీ, వారికన్నా, ఎన్నో వందల, వేల సంవత్సరాల పూర్వం వాడైన వాల్మీకి మాత్రం "ఎంతో సహజంగా, వాస్తవికంగా రాశాడట." — ఎంత అశాస్త్రీయమైన వాదం!

మానవ సమాజం ఈ నాటికీ హేతువాదం జీర్ణించుకోలేదు. ఇంకా మాయలూ, మంత్రాలూ, మహత్యాలూ, జ్యోతిష్యాలూ, ఇంకా జీవితాల్ని పాలిస్తున్నాయి. — "తర్కం" దేవుడి విగ్రహాల వెనక్కి తప్పుకుంటోంది. —

బాబాలు కక్కి బయటికి తీసే శివలింగాలా (ముందు మింగి పెట్టు

కున్నవి) మనుషుల్ని భక్తిరసంలో ముంచెత్తుతున్నాయి. నిన్న గాక మొన్న పోతన ఇంటికి శ్రీరాముడు వొచ్చి పద్యం పూరించి వెళ్లాడు. తానీషా దగ్గిరికి కూడా వొచ్చి రామదాసుని విడిపించి వెళ్ళాడు. — నిత్యమూ రాముడు మనల్ని కరుణతో కాపాడుతోనే వున్నాడు.

ఈ నాటి మన జీవితాలూ, మన రచనలూ, ఇంత అవాస్తవిక రొంపిలో కూరుకు పోయివ్వంటే ఏనాడో వేల సంవత్సరాల కిందటి వాల్మీకి మాత్రం రామాయణం అంతా ఎంతో సహజత్వంతో రాశాడట! — ఎంత దురభిమానం !

* * *

రామాయణంలో లోపాలన్నిటికీ ప్రక్షిప్తాలే కారణమా ?

ఈ విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలంటే కొన్ని సందర్భాలు చూడాలి.

రామాయణ రచనలో ఎక్కడ చూసినా ఒక ముఖ్య లక్షణం కనపడుతుంది. రెండు పాత్రలు మాట్లాడుకోవడం, సంభాషణరూపంలో జరగదు. ఒక పాత్ర చెప్పవలసినదంతా పూర్తిగా అయిపోయిం తర్వాతే రెండో పాత్ర మాట్లాడుతుంది. రెండో పాత్ర మధ్యలోనే జవాబు చెప్పవలసిన అవసరం వున్నా సరే, మొదటి పాత్ర చెప్పేదంతా అయిపోయే వరకూ నోరు విప్పదు.

రచన పొడుగునా ముఖ్యమైన ఘట్టాలలో ఈ పద్ధతే సాగుతుంది. దీనివల్ల కొన్ని ఘట్టాలలో పెద్ద ఇబ్బందేమీ వుండదు. కొన్నిచోట్ల మాత్రం చాలా అపహాస్యంగా తయారౌతుంది. — అలా అపహాస్యంగా తయారైన చోట్ల వాల్మీకిని రక్షించడానికి చక్కటి మంత్రదండం వుండనే వుంది. — ప్రక్షిప్తాల మంత్రదండం !

— చిత్రకూటంలో రాముడి దగ్గిరికి భరతుడు వొచ్చిన ఘట్టం చూడండి. రాముడు తండ్రి గురించి అడుగుతాడే గానీ, దానికి భరతుడు

జవాబు చెప్పడం వుండనే వుండదు. రాముడే మాట్లాడేసుకుంటూ పోతాడు రాజనీతులు కూడా చెప్పేస్తాడు. తండ్రి గురించే వినకుండానే, రాజనీతులు మాట్లాడుతూ కూర్చోవడం, సందర్భ శుద్ధి లేకపోవడమే కదా ? —

"వాల్మీకి ఇంత సందర్భం చూసుకోకుండా రాశాడేమిటి ?"— అనే ప్రశ్నకి అవకాశం వుంది గదా ? — అందుచేత, వాల్మీకి భక్తులు వాల్మీకిని రక్షించాలని — "అబ్బే! అది ప్రక్షిప్తం. ఆ రాజనీతులన్నీ ఎవరో అక్కడ చేర్చారు. వాల్మీకి అయితే అంత అవకతవకగా రాస్తాడా ?" —అని మొహం చిట్లిస్తారు.

ఆ ప్రక్షిప్తాల కవి మాత్రం అలా ఎందుకు రాస్తాడు ? — తండ్రి గురించి క్షేమ సమాచారాలు వినకుండానే, వొచ్చిన వాళ్ళని పట్టుకుని రాజనీతులు మాట్లాడితే, ఏవన్నా సందర్భంగా వుంటుందా ? వాల్మీకికి వున్న జ్ఞానం గీల్మీకికి మాత్రం వుండదా ?

పోనీ ఈ వొక్క ఘట్టంలోనే ఇలా జరగడం అయితే, ఇది ప్రక్షిప్తమేనేమో అనుకోవొచ్చు. అయోధ్య కాండలో దాదాపు ప్రక్షిప్తాలేమీ లేవని అందరూ వొప్పుకున్నదే. కానీ, అక్కడ కూడా ఈ రకం సందర్భాలు అనేకం వున్నాయి. (అయోధ్య కాండలో కథ అంతా — "చెప్పులపాలైన సింహాసనం" లో వొచ్చింది.

రాముడికి పట్టాభిషేకం చేస్తానని దశరథుడు సభలో ప్రకటించి, తర్వాత రాముడితో వొంటరిగా మాట్లాడినప్పుడు, మొత్తం ఆ ఘట్టంలో దశరథుడు వొక్కడే మాట్లాడతాడు. రాముడు వొక్క మాటన్నా మాట్లాడడు. తండ్రి భరతుణ్ణి శంకిస్తూ వుంటే, కారణమేమీ అడగడు. కిక్కురు మనడు. తండ్రి మాట్లాడడం అయిపోయిన తర్వాత, తన మందిరానికి వెళ్ళిపోతాడు. — తండ్రి భరతుణ్ణి శంకిస్తూ వుంటే రాముడు మాట్లాడకుండా నించోడం అసందర్భం కాదా? — ఇది వాల్మీకి రాసిందే గదా ! — ఇంత అసందర్భం ఎందుకు రశాడు? —

పిచ్చివాడై రాయలేదు — రాముడు మాట్లాడవలసి వొస్తే —

"భరతుణ్ణి ఎందుకు శంకిస్తున్నావు ?" — అని అడగాలి. అప్పుడు దశరథుడు కారణం చెపుతాడు. (రాజ్యం భరతుడికే హక్కని.) ఆ సంగతి తండ్రి నోట అంత స్పష్టంగా విని కూడా రాముడు పట్టాభిషేకానికి సిద్ధపడడం న్యాయంగా వుండదు. రాజ్యం భరతుడికి హక్కనే సంగతి అప్పుడే బయట పడిపోతే, రామాయణం చదివే పాఠకులకు కూడా రాముడి మీద సానుభూతి వుండదు. అందుచేత, ఆ ఘట్టంలో రాముడు మౌనంగా, వినయంగా నించోడమే మంచిదని కవి అభిప్రాయం.

అసలు కవి దశరథుడి రహస్య సమాలోచనల గురించి రాయకుండానే వుండవొచ్చు గదా ? — అనుకుందాం. — కానీ, "రాముడికి పట్టాభిషేకం అవుతాందా ? లేదా? ఏ దుర్మార్గులైనా అడ్డగిస్తారా ?" — అనే ఆత్రుత పాఠకులకు కలిగించి, కథని ఆసక్తికరంగా నడపాలనే కవి ప్రయత్నం.

రెండు అభిప్రాయాల మధ్య, రెండు సంఘటనల మధ్య సమన్వయం చూసుకునే తర్కజ్ఞానం లేకపోవడం రామాయణంలో ఎక్కడైనా కనపడే ముఖ్యమైన విషయం

— రాముడూ, లక్ష్మణుడూ, సీతా అడవుల్లోకి వొస్తూ వున్నప్పుడు గంగ దాటిన తర్వాత రాత్రి రాముడు తండ్రి మీద కోపంతో ఎంతోసేపు మాట్లాడతాడు.

లక్ష్మణుడు వొక్క ముక్కయినా జవాబు చెపుతాడా ? మరి ఇది అసందర్భం గాదూ? వాల్మీకి రాసిందేగా ?

— సీతని ఎత్తుకు పోవాలని రావణుడు ఋషి వేషంతో వొచ్చి సీత అందాలు పొగుడుతూ సనాలనీ, పిరుదుల్నీ కూడా వర్ణిస్తాడు. వెంటనే సీత జవాబు గానీ, సీత కోపం గానీ రాయకు కవి. రావణుడు మాట్లాడడం పూర్తి అయిన తర్వాత సీత మాట్లాడుతుంది.

"పరపురుషుడు వొచ్చి సనాల గురించి పొగిడినా వూరుకోవడం ఏమిటీ ?" — అనే ప్రశ్న వొస్తే, "అబ్బే! అది ప్రక్షిప్తం. ఎవరో రాశారు. వాల్మీకి అయితే అలా రాస్తాడా ?" —

— రాముడు బంగారు లేడికోసం పోయినప్పుడు మారీచుడి

కేకలు విని, సీతకేదో ప్రమాదం జరిగి వుంటుందని శంకిస్తూనే ఇంకో జింకని చంపి మాంసం పట్టుకు బయల్దేరతాడు.

"ఒకవైపున అంత భయం కల్దిగి కూడా మళ్ళీ మాంసం గోల ఎందుకు ? తొందరగా వెళ్ళాలి కదా ? — తొందరగా వెళ్ళినట్టు కవి రాయాలి కదా ?" — అనే ప్రశ్న వొస్తుంది కొబట్టి —

"అబ్బే! అది ప్రక్షిప్తం ! ఎవరో ఆ మాంసం సంగతి కల్పించారు .... వాల్మీకి అయితే అలా రాస్తాడా ?"

వొక్కటే మాట. ఎక్కడ ఏది బాగా లేకపోతే అది ప్రక్షిప్తం. దాన్ని ఇంకెవరి మీదకో తోసేసి వాల్మీకి కీర్తి కాపాడాలనే ప్రయత్నం.

సరే ! సీతకి ప్రమాదం వొచ్చిందనే ఆలోచన రాగానే రాముడు ఇక వేట సంగతి పట్టించుకోకుండా ఇంటికి బయల్దేరతాడే అనుకుందాం. ఆ సందర్భాన్ని బట్టి అంత వాస్తవికంగా, అంత సందర్భోచితంగా రాసిన కవి (వాల్మీకి) రాముడు ఆశ్రమానికి చేరాక, సీతకోసం వెతికే ఘటం అంత అవాసవంగా రాశాడేం ? సీతకోసం, పువ్వుల్ని అడగడం, ఆకుల్ని అడగడం, చెట్లని అడగడం, పిట్టల్ని అడగడం, గోదావరిని అడగడం, కొండల్ని అడగడం — ఇదంతా ఏమిటి ?

రాముడు తొందరగా ఇంటికి రాకుండా కొంత ఆలశ్యం చేస్తేనే అది అసందర్భంగా వుంది కొబట్టి ప్రక్షిప్తం అయింది.

మరి ఈ "వెతుకుడు", సందర్భానికి తగ్గట్టు చక్కగా వుందా ? జటాయువు ఆశ్రమ ప్రాంతాల్లోనే పడివున్నాడు కదా ? — పువ్వు పువ్వు దగ్గిరా ఆగకుండా వుంటే జటాయువు తొందరగానే కనపడేవాడు కదా ? జటాయువుని చూసేశ్లోపలే ఇంత విరహ శృంగారం వొలక బొయ్యడం, చక్కగా సందర్భంగా, సహజంగానే వుందా ? — లేక పోతే సీత కోసం రాముడు ఆశ్రమం చుట్టూ వెతికిన వెతుకుడంతా ప్రక్షిప్తమేనా ? ఈ రకంగా ఎక్కడి కక్కడే ప్రక్షిప్తం అయితే, ఇక వాల్మీకి పేరెందుకు ? — "రామాయణంలో వాల్మీకి రాసింది వొక్క ముక్కన్నా లేదు." — అని వాల్మీకినే బయటికి గెంటరాదా ?

సీత కోసం చెట్లనీ, పుట్లనీ అడుగుతూ అసహజంగా వెతికే

ఘట్టం ప్రక్షిప్తం అయితే, వాల్మీకి "సహజంగా" వెతికినట్టు రాసిన ఘట్టం కూడా వుండాలి గదా ? అలాంటి ఘటం వొక్కచోటన్నా లేదేం? ప్రక్షిప్తాల కవులు కొత్తవి చేర్చి కథ పెంచేశారే గానీ వున్నవి తీసెయ్యలేదు గదా ?

జటాయువు ఆశ్రమానికి చాలా దగ్గర్లోనే పడివున్నాడు. రాముడు పరిసరాలన్నీ వెతుకుతూనే వున్నాడు. కానీ, జటాయువుని తొందరగా చూసినట్టు రాయలేదు కవి. ఎందుచేత ?

ఎందుచేతంటే, జటాయువుని తొందరగా చూసేస్తే, సీతని రావణుడెత్తుకు పోయాడన్న సంగతి రాముడికి తెలిసిపోతుంది. ఇక రాముడు చెట్లవెంటా, పిట్టలవెంటా బడి — "ఓ కవంబిమా ! నా సీతని నువ్వు చూశావా? ఓ అశోకమా! నా సీతని నువ్వన్నా చూశావా?" — అంటూ పరుగు లెత్తడం కుదరదు. — సీత సంగతి చెప్పనందుకు గోదావరి మీద కోప్పడ్డానికీ, కొండల మీద బాణా లెత్తడానికీ వీల్లేదు. — జటాయువు చెప్పేసిం తర్వాత రాముడి కోపం అంతా రావణుడి మీదే వుండాలి. కానీ, సీత గురించి తెలియక ముందే రాముడు "విరహశృంగారం" లో అనేక అవస్థలు అభినయించాలి కాబట్టి, ఆ అభినయం అంతా ముగిసే వరకూ, జటాయువుని కబురుకునే ఘట్టం రాయనేలేదు కవి. (వగ్గిల్లో వున్నా సరే)

వేన్నెబట్టి చూస్తే ఈ ఘట్టంలో, అవాస్తవానికీ, అసందర్భానికీ, ప్రక్షిప్తాలే కారణం అనడానికి వీల్లుందా? అసలు కారణం ఏమిటి?

శృంగార రసం అనే పైత్యరసం తలకెక్కి కవి వొలకబోసిన కవితా చాతుర్యం అది.

స్త్రీల అంగాంగ వర్ణనలూ, స్త్రీలతో సంయోగ వియోగాలూ, వొక్క పురుషుడికి అనేకమంది ప్రియురాళ్ళతో ప్రేమలూ, విరహాలూ, — ఎంత సేపూ ఓటి చుట్టూ తిరుగుతూ వుంటుంది ఈ శృంగార కవిత్వం. శాస్త్రజ్ఞానం ఎరగని సమాజంలో "ముట్" ఎలా బయలు దేరిందో, స్త్రీలు అస్వతంత్రులై కేవలం కామానికి మాత్రమే వుపయోగ

పడుతూ, పురుషుడి ఆధీనంలో వుండడం ప్రారంభమైన సమాజంలో ఈ "శృంగార కవిత్వం" బయలుదేరింది.

మిత్ వల్ల (కల్పన వల్ల) సమాజానికి జరిగే ఘోర ప్రమాదం ఏమీ లేదు. కానీ, ఈ శృంగార కవిత్వం కల్పన అంత నిరపాయకర మైంది కాదు. ఈ నాటికీ, దాని రూపం మారిందే గానీ, స్వభావం మారలేదు.

రాముడు విరహం అభినయిస్తూ సీతని వెతికే ఘట్టం శృంగార కవిత్వ సాంప్రదాయాలకు సంబంధించిందే. ఈ సాంప్రదాయానికి వాస్తవికత తోటీ, ప్రశ్నలతోటి సంబంధం లేదు.

ఒక ఘట్టం అస్తవ్యస్తంగా కనపడిందంటే దాన్ని కవి ఏ దృష్టితో రాశాడనే విషయం గ్రహించకుండా పిచ్చి పిచ్చి కారణాలు చెప్పడం శాస్త్రీయమైన విమర్శ కాదు.

* * *

— రావణుడికి పుష్పక విమానం వుంది. దాని గొప్పతనం ఇంతా అంతా కాదు. అలాంటి విమానం వుంచుకుని రావణుడు సీతని తీసుకు పోడానికి గాడిదల రథం మీద వొచ్చాడు.

"అబ్బే ! అది ప్రక్షిప్తం. వాల్మీకి అయితే అంత తెలివి తక్కువగా రాస్తాడా ? రావణుడు పుష్పక విమానం మీద వొచ్చినట్టే రాసే వాడు." — అంటారు విమర్శకులు.

కానీ, రావణుడు పుష్పక విమానం మీద వొచ్చినట్టు రాయడమే చాలా తెలివి తక్కువ. ఎందుకంటే — రావణుడు సీతని తీసుకుని రయ్యిన లంకకి వెళ్ళిపోవడమే కాదు జరగవలసింది: రావణుడు సీతని తీసుకుని బయల్దేరగానే జటాయువు అడ్డు రావాలి. రావణుడితో యుద్ధం చెయ్యాలి. రావణు డెక్కిన రథం విరగ్గొట్టెయ్యాలి. గాడిదల్ని చంపెయ్యాలి. (తర్వాత రాముడు వెతుక్కుంటూ వొచ్చినప్పుడు, గాడిదల శవాలూ, రథ చక్రాలూ, వగైరాలన్నీ కనపడాలి.) — రథం విరిగిపోయిం తర్వాత రావణుడు సీతని చంకనేసుకుని ఎగురుతూ వుంటే,

సీత తలలో పూలూ, నగలూ. రత్నాలూ, ముత్యాలూ, దారి పొడుగునా రాలిపడాలి. (వాటిని కూడా రాముడు చూడాలి.) సీత కంఠంలోంచి హారాలు ఎలా జారుతున్నాయో, సీత చీర చెంగు ఎట్లా ఎగురుతోందో, కవి వర్ణించడానికి అవకాశం వుండాలి. రుష్యమూకం మీదనించి సీతని సుగ్రీవుడూ, హనుమంతుడూ చూడాలి (హనుమంతుడు అప్పుడు సీతని చూడటం చేతనే లంకకు వెళ్ళినప్పుడు సీతని పోల్చ గలుగుతాడు. సీత నగలమూట రుష్యమూకం మీద పడెయ్యాలి. — రావణుడు సీతని తీసుకుపోతూ వున్నప్పుడు ఇన్ని వ్యవహారాలు జరగాలి. పుష్పక విమానంమీద వోస్తే ఈ వ్యవహారాలన్నీ కుదరవని కవి అభిప్రాయం. ఆ విమానానికి వున్న శక్తి సామర్థ్యాల ప్రకారం, రావణుడు అందులో వుంటే జటాయువు ఏమీ చెయ్యలేడు. సీత మొహం హనుమంతుడు చూడలేడు. — అందుకే రావణుడు పుష్పక విమానం మీద గాకుండా ఇంకో రథం మీద వొచ్చినట్టు రాశాడు కవి. (ఇదే కల్పనలో వాస్తవికత కోసం పెనుగులాట.)

అయితే, రావణుడు సీతకోసం బయల్దేరే సమయానికి పుష్పక విమానం లంకలో లేనట్టు కవి వొక కారణం సృష్టించ వలసింది. ఏ ఇంద్రజిత్తో ఆ విమానంమీద ఎక్కడికో వెళ్ళినట్టు (తండ్రి అనుమతి మీదే) ఒక కారణం వుంటే, రావణుడు పుష్పక విమానం మీద రాక పోవడానికి సందర్భం సరిపోతుంది. అప్పుడు ప్రక్షిప్తాల విమర్శకులు— "రావణుడు గాడిదల రథం మీద వొచ్చిన ఘట్టం ప్రక్షిప్తం." — అనే ప్రమాదం తప్పేది. అయితే, రావణుడు పుష్పక విమానం మీద రాక పోవడానికి కారణం ఏమిటో తెలిశాక "అయితే ఈ ఘట్టం ప్రక్షిప్తం కాదు. వాల్మీకి రాసిందే. ఆయనే అంత తెలివిగా రాయగలడు. ఇంకేవరైనా అయితేనా ? విమానం మీద వొచ్చినట్టే రాసేవారు." — అని విమర్శకులు తరఫున తాతమూరు చేసెయ్య వొచ్చును.

• • •

వాల్మీకి ఏ మాత్రం విమర్శకు గురి అవుతాడనే సందేహం

కోచినా, వాల్మీకి భక్తులు "ప్రక్షిప్తాల వాదం" ముందుకు తెస్తారు. ఒక ఘట్టంలో అంతగా ఆవక తవకలు లేనప్పుడు (వున్నట్టు వారికి తోచనప్పుడు) మాట్లాడకుండా వూరుకుంటారు.

— బాణందెబ్బ తిని వాలి పడిపోయిం తర్వాత రాముడు వాలి దగ్గిరికి వెళ్ళినప్పుడు, వాలి తను మాట్లాడ వలసిందంతా సుదీర్ఘంగా మాట్లాడేసాడు. తర్వాత రాముడు తన జవాబు కూడా అంత సుదీర్ఘంగానూ చెప్పుతాడు. అయితే, వాలి మాట్లాడుతూ వున్నప్పుడే, రాముడు కలగజేసుకుని మధ్యలోనే మాట్లాడకపోయినా ఫర్వాలేని సందర్భం అది.

— అలాగే, అశోక వనంలో సీతతో రావణుడు మాట్లాడే సందర్భంలో కూడా, రావణుడు మాట్లాడ వలసిందంతా ముందు మాట్లాడేసాడు. తర్వాత సీత తను మాట్లాడ వలసింది మాట్లాడుతుంది. సీత, రావణుడి మాటలకు మధ్యలోనే కలగజేసుకుని జవాబులు చెప్పకపోయినా ఫర్వాలేని సందర్భం అది. అందుచేత విమర్శకులు ఇలాంటి ఘట్టాల మీదికి ప్రక్షిప్తాల కత్తి ఎత్తరు.

చిత్రకూటంలో రాముడు రాజనీతులు చెప్పిన ఘట్టం కూడా రామాయణంలో ఏన్నో ఇతర ఘట్టాల లాంటిదే. ఇక్కడ కూడా ఒక పాత్ర మాట్లాడినప్పుడు, రెండో పాత్ర జవాబు చెప్పని పద్ధతిలోనే నడిచింది. అయితే, దీని సందర్భం వేరు అవండచేత, ఇది అపహాస్యం పాలైంది.

కొన్ని ఘట్టాలు ప్రక్షిప్తాల కవులు చేర్చినప్పటికీ (చేర్చేనప్పుడు) — వాల్మీకి రాసిన పద్ధతిలోనే (ఒక పాత్ర మాట్లాడడం రాసిన తర్వాతే ఇంకో పాత్ర మాట్లాడడం.) రాశారు.

* * *

— రాముడు వాలిని చంపి, ఏం కారణాలు చెప్పాడో, ఆ కారణాలు శుద్ధ తప్పు. మన దృష్టితో కాదు. రాముడు చెప్పిన కారణాల దృష్టితో చూస్తేనే తప్పు. (ఈ విషయం "తోడు దొంగలు" కథలో చూడవొచ్చును.)

వాల్మీకి అజ్ఞానంగా రాయలేదని వాదించే వారికోసం ఇలాంటి ఘట్టాలు గుర్తు చెయ్యాలి.

• • •

లక్ష్మణుడికి పెళ్ళి కాలేదా ?

లక్ష్మణుడికి పెళ్ళి కాలేదని నార్ల వెంకటేశ్వరరావుగారు (తమ 'జాతి' పీఠికలో) అభిప్రాయపడ్డారు. దానికి కొన్ని కారణాలు చెప్పారు.

1) లక్ష్మణుడి భార్యగురించి రెండు చోట్ల తప్ప ఎంత ముఖ్యమైన సందర్భాలలో కూడా చెప్పలేదు కవి.

2) సీత లక్ష్మణుడి గురించి ఒక సందర్భంలో 'బ్రహ్మచారి' అన్నది.

3) వనవాసానికి బయలేరేముందు రాముడు, తమ మందిరాల రక్షణ గురించి దాసీలతో మాత్రమే చెప్పాడు.

4) శూర్పణఖ రాముడి దగ్గిరికి వొచ్చిన సందర్భంలో రాముడు శూర్పణఖతో — లక్ష్మణుడికి పెళ్ళికాలేదన్నాడు.

లక్ష్మణుడి భార్య గురించి కవి స్పష్టంగా చెప్పిన సందర్భాన్ని వెంకటేశ్వర్రావుగారు "ప్రక్షిప్తం" అని కొట్టేస్తున్నారు. అందుచేత లక్ష్మణుడికి పెళ్ళికాలేదనడానికి ఆయన చెప్పిన అంశాలు తర్కానికెంత వరకూ నిలబడతాయో చూడవలసిన అవసరం వుంది.

1) — రాముడితో పాటు, మిగిలిన ముగ్గురూ కూడా వొక్కరోజు వాళ్ళే. రాముడికి పెళ్ళయిందే కాబట్టి, మిగిలిన వాళ్ళకి కూడా పెళ్ళిళ్ళయ్యాయనే విషయాన్ని సామాన్యంగా అయితే, సందేహించవలసిన అవసరంలేదు.

దశరథుడు కొడుకులందరికీ పెళ్ళిళ్ళు చెయ్యాలని పురోహితులతో ఆలోచించడం, తర్వాత అందరికీ పెళ్ళిళ్ళు జరగడం "బాలకాండ"లో వుంది. అయితే, విమర్శకుల దృష్టిలో "బాలకాండ" పూర్తిగా ప్రక్షిప్తం

అయిపోయింది. (అందుచేత, ఈ నలుగురన్నదమ్ముల్లోనూ ఎవరికి పెళ్ళయిందో, ఎవరికి కాలేదో, అనే సంగతేదీ వాల్మీకి చెప్పలేదు అని అర్థం. కథ పొడుగునా సీత కనపడుతోంది గాబట్టి రాముడికి పెళ్ళయి నట్టే. లక్ష్మణుడి భార్య కనపడడంలేదు కాబట్టి అసలు వాల్మీకి లక్ష్మణుడి పెళ్ళి గురించి రాయలేదని ఈ వాదంలో అర్థం.)

ప్రక్షిప్తాలు ఎక్కువగా లేవని, అందరూ వొప్పుకున్న అయోధ్యా కాండలోనే సీత అనసూయతో మాట్లాడినప్పుడు, ఊర్మిళ పెళ్ళి సంగతి కూడా చెప్పింది. (తర్వాత కథలో ఇంకెక్కడా ఊర్మిళ సంగతి రాలేదు.)

ఇంకెక్కడా చెప్పలేదుకాబట్టి ఇక్క చెప్పిన సందర్భాన్ని కూడా—ఇది ప్రక్షిప్తమే, అసలు లక్ష్మణుడికి పెళ్లే కాలేదు. పెళ్ళయితే వాల్మీకి లక్ష్మణుడి భార్య సంగతి ఇంకెక్కడా ఎత్తకుండా వుంటాడా?—వాల్మీకి అంతజ్ఞానం లేని వాడా?—అన్నది వెంకటేశ్వర్రావుగారి వాదం

కవి, ఒక్కచోటే చెప్పి, మిగతా చోట్ల చెప్పక పోవడానికి కారణం ఏమైవుంటుందో చూడడం లేదు. అంటే, చెప్పినదానిమీద ఆధారపడి, చెప్పని దానికి కారణం వెతకడంలేదు. చెప్పనివానిమీద ఆధారపడి, చెప్పినదానికే కారణం వెతికి, అది ప్రక్షిప్తమే అని కని పెట్టి తోసిపారేస్తున్నారు.—(కని చెప్పిన దాని మీద నమ్మకం లేదు. ఎక్కడా చెప్పనిదానిమీద నమ్మకం. దానికే విలువ.)

సీత అనసూయతో చెప్పిన ఘట్టం ప్రక్షిప్తం అని ఎందుకనుకోవాలి? ఈ ఘటాన్ని ఆధారం చేసుకునే బాలకాండలో (బాలకాండ ప్రక్షిప్తం అయితే) పెళ్ళిళ్ళ ఘట్టం సృష్టించారని ఎందుకనుకోగూడదు? —సీత అనసూయతో చెప్పిన ఘట్టం ప్రక్షిప్తమే అనుకుంటే, ప్రక్షిప్తం కవి ఊర్మిళ సంగతి అక్కడ వొక్కచోటే ఎందుకు చేర్చి వూరుకున్నాడు? – కథలో అతి ముఖ్యమైన సందర్భాలలో కూడా ఇక్కడ జేర్చినట్టే చేర్చ వొచ్చుకదా?

"వాల్మీకి అయితే, వొక్కచోటే రాసి, మిగతా చోట్ల వూరుకుంటాడా?—" అన్న ప్రశ్న వొచ్చింది కదా? వాల్మీకి అయితేనే మాత్రం

—ఒక్కచోటే రాసి, మిగతా చోట్ల వూరికుంటాడా?—ఈ ప్రశ్నలకి సమాధానం లేకుండానే ప్రక్షిప్తం అని తోసేస్తే కుదురుతుందా?

2) — సీత రావణుడితో మంచిగా మాట్లాడే సందర్భంలో (రిషివేషంలో వున్నప్పుడు,) లక్ష్మణుణ్ణి గురించి "బ్రహ్మచారి"—అనే మాట వాడినట్టు వాల్మీకి పేరుతో వున్న ఇతర రామాయణాలలో కొన్ని చోట్ల వున్నదట. మనం చదివే రామాయణంలో "ధర్మచారీ" అని వుంది—ఇలాంటి సందర్భంలో మనం "ధర్మచారి"ని సమ్మంగని, "బ్రహ్మచారిని నమ్మతాం అన్నమాట—అంటే మన వాదానికి ఏది అనుకూలంగా వుంటే అదే వాల్మీకి రాసింది. కాని "బ్రహ్మచారి" అనే మాటకు పెళ్ళికాని వాడనే అర్థం వొక్కటే కాదు. నియమనిష్ఠలతో ధర్మ బద్ధంగా భార్యతో గడిపేవాడనే అర్థంలో కూడా ఆమాట రామాయణంలో వాడడం జరిగింది.

హనుమంతుడు అశోక వనంలో సీతతో మాట్లాడే సందర్భంలో రాముడి గుణగణాలు వర్ణిస్తూ — "చతుర్వర్ణాలు కాపాడుతాడు. సాధు వుల్నీ, బ్రాహ్మణుల్నీ, సేవిస్తాడు, బ్రహ్మచర్యవ్రతం పాటిస్తాడు,"—అంటాడు.

అంటే, బ్రహ్మచర్యం ఇప్పుడు పాటిస్తున్నాడని కాదు. చతుర్వర్ణాలు ఇప్పుడు కాపాడుతున్నాడనా? ఎప్పుడూ కాపాడతాడని ఎప్పుడూ బ్రహ్మచర్య వ్రతం పాటిస్తాడని.

ఒకవేళ ఇప్పుడనే అర్థం తీసినాసరే, సీత కూడా అలాగే లక్ష్మణుణ్ణి ఇప్పుడు బ్రహ్మచారిగా వున్నాడనే అర్థంతో మాటాడిందన వొచ్చును, (రావణుడితో).

అంతేకాదు. అశోక వనంలో సీత హనుమంతుడితో మాట్లాడే సందర్భంలో లక్ష్మణుణ్ణి గురించి దుఃఖపడుతూ—"లక్ష్మణుడు అన్నగారి సేవ కోస- ప్రియురాళ్ళ నెందర్నో విడిచి వొచ్చాడు."—అంటుంది.

స్త్రీలతో శారీరక సంబంధాలున్న వాడు బ్రహ్మచారి అవుతాడా?

3) — వనవాసానికి బయల్దేరే ముందు రాముడు పరిచారికలతో — "నా మందిరం, లక్ష్మణుడి మందిరం శ్రద్ధగా కాపాడుతూ వుండండి"—అని చెప్పాడు. కాబట్టి, లక్ష్మణుడికి భార్యే వుంటే, ఇంటి బాధ్యత ఇల్లాలికి చెప్పకుండా నౌకర్లకీ, చాకర్లకీ చెపుతారా?—అనేది మరో సందేహం.

రాజ మందిరాల్నీ, అంతఃపురాల్నీ కనిపెట్టుకు వుండడం, వాటికి చాకిరీ చెయ్యడం, వాటికి సంబంధించిన రక్షణ వ్యవహారాలన్నీ చూడడం దాస దాసీలు చేసేపనే కదా?—అతి సామాన్యమైన దాసీల దగ్గిర్నుంచీ, మందిరాల రక్షణ చూసే పెద్ద పెద్ద అధికారుల వరకూ అందరూ దాస దాసీలే.

రాముడు, చాలాకాలం వరకూ వనవాసానికి వెళ్తూవున్నప్పుడు, మందిరాల రక్షణ వ్యవహారాలు చూసే ఏ ముఖ్య వుద్యోగులనో పిలిచి —"మందిరాలు జాగ్రత్తగా కాపాడుతూ వుండండి"— అని చెప్పడంలో అసందర్భమేముంది?

సామాన్యకుటుంబీకుడు ఎవరన్నా పోతూ — "వాసే! వెళ్తున్నాను తలుపేసుకో, ఇల్లు జాగ్రత్త."— అనే పద్ధతిలో చెప్పడానికి, రాముడూ, లక్ష్మణుడూ సామాన్య కుటుంబీకులా?

రాముడు దాసీలకు చెప్పాడంటే, చీపురు కట్టలు పట్టుకునే దాసీలకు చెప్పాడని అర్థం కాదు. రాజకుమారుడి ముందు నిలబడే హోదాలో వున్న అతి ముఖ్యమైన వుద్యోగులకు చెప్పాడన్నమాట. — మందిరాల గురించి వుద్యోగులకు చెపుతూ వున్నప్పుడు రాముడు, లక్ష్మణుడి భార్య గురించి ఎత్తక పోవడంలో అనుచితం ఏమీ లేదు.

4) — పంచవటిలో రాముడి దగ్గిరికి శూర్పణఖ వొచ్చినప్పుడు, రాముడు శూర్పణఖతో — "నా తమ్ముడు ఇల్లాలు లేనివాడనీ, పెళ్ళి కానివాడనీ అన్నాడు కదా? — పోనీ పరిహాసానికి అన్నాడేమో అనుకుంటే, — "రాముడు అసత్యా లాడడు. పైగా తపోవనంలో వుంటున్నాడు. ఆడదానితో మాట్లాడుతున్నాడు. ఆ పరిస్థితిలో అబద్ధా లాడతాడా?" — అని కవి ప్రత్యేకించి చెప్పాడు కదా?" —

మన వాదానికి అనుకూలంగా వున్నప్పుడు కవి చెప్పింది చక్కగా వొప్పుకుంటాం. లేకపోతే — "అబ్బే! అది ప్రక్షిప్తం" — అని కొట్టి పారేస్తాం.

"రాముడు అబద్ధాలాడడు" — అన్న శ్లోకమే ప్రక్షిప్తం అని ఎవరన్నా అంటే? — రాముడు అబద్ధాలాడతాడనే చాలా రుజువులు చూపిస్తే?

అసలు, ఆ శ్లోకం ప్రక్షిప్తం అనకుండానే, అందులో కవి చెప్పిన మాటల్లోనే ఇంకో అర్థం చూడవొచ్చును.—"రాముడి కెప్పుడూ అసత్య మాడడం సమ్మతంకాదు. విశేషించి, ఆశ్రమవాసిగా వున్నాడు. స్త్రీల సమీపంలో కూడా వున్నాడు" — అన్నది ఆ శ్లోకానికి అర్థం. (విశేషణం అనే మాట వాడాడు కవి.)

అంటే — "రాము డెప్పుడూ అబద్ధాలాడడు. అందులోనూ ఆశ్రమవాసిగా వున్నప్పుడూ, ఆడవాళ్ళదగ్గిర వున్నప్పుడూ అడతాడా? ఇంకెప్పుడన్నా ఆడతాడేమోగానీ ...."— అనే అర్థం రావడంలేదూ?

లక్ష్మణుడికి పెళ్ళి కాలేదని రాముడన్న మాటలు పరిహాసానికి కాకపోతే, శూర్పణఖతో తర్వాత అన్న మాటలన్నీకూడా నిజంగా అన్నవేనా? — "ఓ విశాలాక్షీ! లక్ష్మణుడు అందగాడు. నీ రూపమునకు తగిన భర్త. (శూర్పణఖ కూడా అందగత్తె అనడం!) వరారోహా! సూర్యకాంతి మేరు పర్వతంమీద ప్రసరించినట్టు నువ్వు ఇతన్ని భర్తగా పొందు" — అన్నాడు రాముడు.

నిజంగా శూర్పణఖ లక్ష్మణుణ్ణి పెళ్ళి చేసుకోవాలనే రాముడి అభిప్రాయమా? "అతి వికృతమైన రాక్షసి" లక్ష్మణుడికి భార్య అవ్వాలని రాముడు నిజంగా అన్నట్టేనా?

తర్వాత లక్ష్మణు డేమంటున్నాడో చూడండి — "ఓ విశాలాక్షీ! (వెటకారం) నేనే శ్రీరాముడికి దాసుణ్ణి. దాసుడికి భార్యవై నువ్వుకూడా దాసి వెందుకవుతావు? (అంటే తను అన్నగారికి దాస్యం చేస్తూ వున్నం

దుకు బాధ పడుతున్నాడా ?) ఎంతో చక్కని దేహకాంతిగల నువ్వు రాముడికే చిన్న భార్యగా వుండు. సీత కురూపి. దుష్టురాలు. వృద్ధురాలు. పెద్ద బానపొట్ట. తెలివయినవా డెవడయినా నీలాంటి సౌందర్యరాశిని కాదని, మానవ స్త్రీతో ఉంటాడా ? రాముడు సీతని విడిచి తప్పకుండా నిన్నే వరిస్తాడు" — అన్నాడు.

సీత కురూపేననీ, రాముడు శూర్పణఖనే వరిస్తాడనీ లక్ష్మణుడి అభిప్రాయమేనా ? — ప్రతీ మాటా వెటకారమే.

ఈ అన్నదమ్ములిద్దరూ, ఒక స్త్రీని పట్టుకుని ఎంత నీచంగా పరిహాసాలు చేశారో గ్రహించడానికి బదులు కొండని తవ్వి ఎలుకని పటినట్టు వెంకటేశ్వర్రావుగారికి రాముడి మాటల్లో లక్ష్మణుడికి భార్య లేదనే "పాయింటు" మాత్రం దొరికింది.

"మరి రాముడు చేసింది పరిహాసం అయితే, అబద్ధ మాడినట్టు అవలేదా ?" — అనవొచ్చు. అవును. అయింది.

రాముడు సత్యసంధుడని కవి పక్షపాతంకొద్దీ (కావ్య నాయకుణ్ణి అలా వర్ణించాలి గాబట్టి) అంటాడేగానీ, అలాంటి సత్యసంధుణ్ణి కవి తన జీవితంలో ఎన్నడూ చూడడం సాధ్యంకాదు. "సత్యం ఆచరించడానికి పరిస్థితులు పీలుపడని సమాజంలో" సత్య సంధత అనేది కేవలం ఒక ఆదర్శం మాత్రమే. (ఈ ఆదర్శం నిజ జీవితాల్లో నిత్య కృత్యంగా వుండాలంటే సమాజంలో అబద్ధాలాడవలసిన పరిస్థితులూ, చేసిన పనులు పైకి చెప్పుకోవటానికి సిగ్గుపడే పరిస్థితులూ వుండకూడదు.) — కవి తన కళ్ళెదుట సమాజంలో లేనిదాన్ని వూహలో తప్ప జీవితాల్లో చూడలేదు. రచనలో చూపించలేడు. అందుకే—"విశేషించి, స్త్రీల దగ్గిర అబద్ధమాడతాడా?—పోసి ఇంకెక్కడన్నా ఆడతాడేమోగానీ అనే 'భావం' కవికి తెలియకుండానే అతని మాటల్లో బయట పడిపోయింది. అంటే—ఎక్కడా, ఎప్పుడూ అబద్ధ మాడకుండా వుండడం సాధ్యంకాదనే అభిప్రాయం కవి మనసులో వుందన్నమాట — అదే సమాజ ప్రభావం.

పరిహాసాని కయినా అబద్ధమాడని మనిషి సమాజంలో లేడు. సమాజంలో లేని "సత్య సంధత" కవి ఎక్కడినించి తెచ్చి చూపించ

గలడు : అందుకే అలాంటి మనిషిని చూపించలేక పోయాడు. చూపించాలనే ప్రయత్నంచేసి, తనకు తెలీకుండానే విఫలమయ్యాడు.

లక్ష్మణుడికి పెళ్ళికాలేదనడానికి వెంకటేశ్వర్రావుగారు చూపించిన ఆధారాలు తర్కానికి నిలబడవు. సీత, అనసూయతో లక్ష్మణుడి పెళ్ళి గురించి చెప్పిన ఘట్టం ప్రక్షిప్తం అనుకోనక్కర్లేదు. అయితే, కవి లక్ష్మణుడి భార్య సంగతి ఎంత ముఖ్య సందర్భాలలో అయినా ఎందుకు ఎత్తలేదనే ప్రశ్న గురించి చూడాలి.

సమాజంలో 'భార్యల' స్థానం ఏమిటి? సత్య సంధత ఎంత అబద్ధమో, సమాజంలో భార్యల్ని గురించడం కూడా అంత అబద్ధం.

కవి చెప్పనిది లక్ష్మణుడి భార్య సంగతే కాదు. భరతుడి భార్య సంగతీ చెప్పలేదు. శత్రుఘ్నుడి భార్య సంగతీ చెప్పలేదు. రావణుడి భార్య సంగతి చెప్పినా ముఖ్య సందర్భాలలో చెప్పలేదు.

లక్ష్మణుడికన్నా కథలో భరతుడే ముఖ్యమైన పాత్ర. లక్ష్మణుడు అడవికి వెళ్ళినా, వెళ్ళకపోయినా కథ స్వభావం ఎక్కువ మారదు. రాముడు వొంటరిగానే వనవాసం చెయ్యవచ్చు. వొంటరిగానే సుగ్రీవుణ్ణి కలుసుకోవచ్చు. యుద్ధంచేసి అయోధ్యకు తిరిగి రావచ్చు. — భరతుడి పాత్ర అలాంటిది కాదు. అనేకచోట్ల అతనిమీదే కథ ఆధారపడివుంది. తల్లి చెప్పినట్టు రాజ్యం తనే తీసుకుంటే కథ అక్కడే ఆఖరు. — రాముడు రాజ్యం వొద్దన్నప్పుడు ఆ పాదుకలు తేకుండా, మాట్లాడకుండా తిరిగివొచ్చి సింహాసనం ఎక్కితే కథ గొప్ప మలుపు తిరుగుతుంది. ఈ రకంగా చివర వరకూ కూడా భరతుడి పాత్రకి, లక్ష్మణుడి పాత్రకులేని వొక ప్రత్యేకత వుంది. అంత ముఖ్యమైన భరతుడి భార్య సంగతి కూడా కవి ఎక్కడా చెప్పలేదు. — భరతుడికే రాజ్యం వొచ్చినప్పుడు అతని భార్య ఏమనుకుందో, భర్త రాజ్యం వదిలేస్తాడంటే ఏమనుకుందో, తన భర్త రాముడికి ప్రతినిధిగా వుండి రాజ్యం చేస్తాడంటే ఏమనుకుందో — ఈ రకంగా భర్త జీవితానికి సంబంధించిన ముఖ్య విషయాలలో నైనా ఆమె అభిప్రాయాలు చెప్పాడా? ఎందుకు చెప్పలేదు? — అసలు

సమాజంలో భార్య అభిప్రాయాలకు స్థానం లేదు కాబట్టి, భరతుడు రాజ్యం రాముడి కిచ్చెయ్యాలనుకున్నప్పుడు గానీ, రాముడికి ప్రతినిధిగా పనిచెయ్యాలనుకున్నప్పుడుగానీ, అతని నిర్ణయాలలో భార్య ఇష్టా ఇష్టాలేమీ వుండవు.

భరతుడితో ఒక దాసీ — రాముడికి రాజ్యం ఇవ్వమనో, ఇవ్వద్దనో చెప్తే వింటాడా? అసలు దాసీ చెపుతుందా? — అలాగే భార్య కూడా చెప్పదు.

కవి భరతుడి దాసీల సంగతి రాయక పోవడం ఎంత సహజమో భరతుడి భార్య సంగతి రాయక పోవడంకూడా అంత సహజం.

దాసి యజమానికి నమస్కారం పెట్టడం సమాజంలో ఉంటుంది గానీ, యజమాని దాసీకి నమస్కారం పెట్టడం సమాజంలో వుండదు. అందుచేత— కవి — "ఆ యజమాని, దాసీకి నమస్కారం చేసి ఇలా అన్నాడు" అని రాయడు.

జీవితాలలో లేనిదాన్ని కవిగానీ, ఇంకో కళాకారుడుగానీ తాము సృష్టించే వాటిలో చూపించలేరు. చూపించాలనే వూహే రాదు.

రాముడి తర్వాత ముఖ్యమైన పాత్ర రావణుడిదే కదా?— రావణుడి భార్య సంగతి మాత్రం ఎప్పుడు చెప్పాడు? రావణుడు చచ్చిపోయిం తర్వాత చక్కగా శోకాలు పెట్టడానికి మాత్రం అవసరం అయ్యింది భార్య. అప్పుడు ఎత్తాడు మండోదరి సంగతి. (హనుమంతుడు లంక వెతికేప్పుడు మండోదరి నిద్రపోవడం తప్ప.)

రావణుడు అనేకమంది భార్యల్ని తెస్తూవుంటే మండోదరి ఏమనుకుంటుందో, కొత్త భార్యని తేగానే పాత భార్యలు ఏమనుకుంటారో, సీతని తెచ్చినప్పుడు మండోదరి ఏమనుకుందో, భర్తతో ఏమందో, ఆమె అభిప్రాయం ఎలావుందో ఏమీ చెప్పలేదు. చెప్పవలసిన అవసరం ఏమిటి? కొత్త భార్యని తెచ్చినప్పుడు పాత భార్య కిక్కురుమనకుండా నోరు మూసుకుంటుందిగానీ, ఇంకే మంటుంది? ఏమన్నా అంటే, భర్త తనని నవతులఘుందు మరీ చులకన చేస్తాడేమోనని భర్తకు ఇంకా

వినయ విధేయతలు చూపిస్తూ — "నువ్వు చేసిన పని నాకు చాలా సంతోషం నాధా ! ఈ లోకంలో అందగత్తె లందరూ నీ కోసమే వున్నారు. ఇంకా తెచ్చుకో. మళ్ళీ తెచ్చుకో. వారం రోజులై పోయిందిగా భార్యని తెచ్చి. తొందరగా మళ్ళీ తెచ్చుకో," — అంటుంది.

అసలు రావణుడి నిర్ణయాలలో మండోదరి అభిప్రాయాలకు విలువేముంది ? — అదే ఒక స్త్రీ గురించీ, ఆమె నిర్ణయాల గురించీ రాయవలసివొస్తే, ఆమె భర్త ప్రస్తి లేకుండా రాయగలడా కవి ?

ఈ కాలంలో అయితే రచయితలు కొన్ని కొన్ని సందర్భాలలో అయినా భార్యల గురించి ఎత్తక తప్పదు. భర్త రెండో భార్యని తెచ్చినప్పుడు మొదటి భార్య "ఏడ్చిందని" చెప్పక తప్పదు. ఏడవకుండా పతివ్రతగా వుండే స్థితినించి, ఏడ్చి అయిష్టం వ్యక్తంచేసే స్థితికి ఎదిగింది స్త్రీ. సమాజంలో ఈ మార్పు జరిగింది కాబట్టి రచయితలంతా దాన్ని రాయక తప్పదు.

కవి, సుగ్రీవుడి భార్య గురించి కూడా చెప్పలేదు. భర్త దేశభ్రష్టుడై తను వాలి దగ్గిర వుండవలసి వొచ్చినందుకు ఆమె అభిప్రాయం ఏమిటో చెప్పవలసిన అవసరం కనపడలేదు కవికి. ఆమె వొక వ్యక్తిగా కవి దృష్టిలోకి రాదు, ఆమె అభిప్రాయం వేపు కవి ఆలోచన పోదు.

కౌసల్యా, కైకా, సీతా, తారా — వంటి స్త్రీలు కథకి అవసరం కాబట్టి, వారు ఏ సందర్భాలలో కలగ జేసుకుని మాట్లాడ వొచ్చునో, ఆ సందర్భాలలోనే వారి గురించి చెప్పాడు.

ఎంతో ముఖ్యులైన, భరతుడి భార్యనీ, రావణుడి భార్యనీ కూడా చెప్పని కవి, విభీషణుడి భార్య గురించి చెప్పాడు. ఎందుచేత ? కథకి తప్పనిసరి కాబట్టి.

కథకి తప్పనిసరి అయినచోట మాత్రమే స్త్రీల సంగతి చెప్పడం స్త్రీలని గుర్తించినట్టా ?

("ఏయ్ దాసీ! ఇలారా! గది శుభ్రం చెయ్యి." — అని దాసీని పిలిస్తే, దాసీని గౌరవంతో గుర్తించినట్టా ? గది బాగా లేదు కాబట్టి

దాసీ అవసరం అయింది. గది తుడవడం అయ్యాక అవతలికి పోవలసిందే.)

వశిష్ఠుడు చిత్రకూటంలో రాముడికి వంశక్రమం గురించి చెప్పినప్పుడు పురుష పుంగవుల దండకం చదివాడే గానీ, భార్యల సంగతి చెప్పాడా? అయితే రాముడి తాతలకీ, ముత్తాతలకీ పెళ్ళిళ్ళు కానట్టేనా? ఒక బిడ్డ పుట్టినప్పుడు ఏ కథలోనైనా తల్లి పేరు చెప్పడం వుందా? (అవసరం అయితే తప్ప.) తల్లుల గురించి చెప్పినా, తండ్రుల తర్వాతే గద?

సమాజంలో, భార్య స్థానంకన్నా, తల్లి స్థానం ఎక్కువ కాబట్టి, అప్పుడప్పుడూ తల్లుల గురించి చెపుతూ వుంటాడు.

భార్యల విషయం అలా వుంచుదాం. కవి, రాముడి కష్టసుఖాలు చెప్పే సందర్భాలలో లక్ష్మణుడి గురించి చెప్పాడా? — లక్ష్మణుణ్ణి వొక వ్యక్తిగా గురించి అతని విరహం గురించి చెప్పాడా? రాముడు తల్లిని వొదిలేసిన దురదృష్ట వంతుణ్ణని ఏడుస్తాడే గానీ, లక్ష్మణుడు మాత్రం తల్లిని వొదల్లేదూ?— లక్ష్మణుడు బాధపడుతూ వున్నట్టు ఎక్కడైనా రాశాడా? — ఎందుకు రాస్తాడు? — లక్ష్మణుడు రాముడికి దాసుడు. సేవకుడు. సేవకుడికి కష్టసుఖా లేమిటి? సేవకుడికి అనుభూతు లేమిటి? రాత్రింబవళ్ళూ యజమాని సుఖంకోసం సేవ చెయ్యడమే దాసుడి ధర్మం. ఇళ్ళు కట్టడం, కట్టెలు కొట్టడం, అడివిలో తిరిగ పేడ తెచ్చి పిడకలు చెయ్యడం, — ఇలాంటి పనులు చెయ్యడం మాత్రమే లక్ష్మణుడి ధర్మాలు.

అందుచేత, భార్యల గురించి చెప్పకపోయినా, దాసుల గురించి చెప్పకపోయినా కవి చాలా తప్పు చేశాడనుకో నవసరం లేదు. వాల్మీకిని విమర్శకు గురి కాకుండా చెయ్యాలనే తాపత్రయంతో, ఆయన — "లక్ష్మణుడికి పెళ్ళయింది మొర్రో" అంటున్నా సరే వినకుండా ఆమాట ఎగరగొట్టెయ్యడమా విమిర్శకులు చెయ్యవలసింది?

ఒక ప్రశ్న వొచ్చినప్పుడు దానికి జవాబు వెతకడం మానేసి,

అసలు ప్రశ్న కలిగే పరిస్థితులే మార్చేసి, "ఇప్పుడు ప్రశ్న లేదు. జవాబు ఎందుకూ ?" — అనడమూ ?

సాహిత్యపరంగా చూసినప్పటికీ, ప్రారంభ దశలో రాసిన కవి గొప్ప రచనా చాతుర్యం చూపించాలనీ, అన్ని పాత్రల్నీ చాకచక్యంతో నడిపించాలనీ అనుకోవడంలో అర్థం లేదు.

(మనం, రచనలో నేర్పు చూడడం వేరూ, రచన స్వభావం చూడడం వేరూ.

రచన స్వభావం సంకుచితంగా వున్నప్పుడు దాన్ని గుర్తించి విమర్శించకుండా వుండవలసిన అవసరంలేదు.)

* * *

లంకాదహనం ప్రక్షిప్తమేనా ?

ప్రక్షిప్తమే అంటున్నారు వెంకటేశ్వర్రావుగారు. దానికి రెండు కారణాలు చెప్పారు.

1 — హనుమంతుడు లంకనించి తిరిగి వొచ్చి రాముడితో విశేషాలు చెప్పేటప్పుడు లంకా దహనం గురించి చెప్పలేదు. లంకలో చేసిన పనులేవీ చెప్పలేదు.

2 — హనుమంతుడు లంకని తగలబెట్టి సర్వనాశనం చేస్తే, మళ్ళీ నెల రోజులకే లంక యథాస్థితిగా బాగుపడిందా ?

కానీ, ఈ రెండు అభిప్రాయాలూ పొరపాటే.

1) — హనుమంతుడు లంకనించి తిరిగి వొచ్చిం తర్వాత, రాముడితో తనే స్వయంగా చాలా స్పష్టంగా లంకా దహనం గురించీ, ఇతర కార్యాల గురించి కూడా చెప్పాడు.

హనుమంతుడు లంకనించి బయల్దేరి సముద్రం దాటి తనకోసం ఎదురుచూస్తూ వున్న వానరుల్ని కలుసుకున్నప్పుడు లంకలో జరిగిన విషయాలన్నీ, (లంకాదహనం కూడా) చెప్పాడు.

తర్వాత అందరూ రుష్యమూకం చేరగానే వానర అందరూ

రాముడితో — సీత లంకలో వుండడం, రాక్షస స్త్రీలు ఆమెని బెదిరిస్తూ వుండడం, రావణుడు గడువు పెట్టడం వగైరా విషయాలు చెపుతూ వుండగా రాముడు — "సీత ప్రవర్తన నా విషయంలో ఎలా వుందో చెప్పండి." — అని అడిగాడు. (సీత పూర్వంలాగే వుందో, ఏమైనా మారిందో తెలుసుకోవాలనే ఆత్రత.)

హనుమంతుడు వొచ్చాడనగానే రాముడికి ముందు ఏం తెలుసుకోవాలని వుంటుంది ?— సీత గురించి. క్షేమం గురించి కాదు. శీలం గురించి. పతివ్రతగానే వుందా?. చెడిపోయిందా? — అది కావాలి ముందు. రాముడికి సీత శీలం గురించి తెలుసుకోవాలనే ఆత్రత వుంటుందని కవికి తెలుసు. (సమాజంలో ప్రతి భర్తకీ అలా వుండడం సహజం కాబట్టి.)

అందుకే — "నా విషయంలో సీత ప్రవర్తన ఎలా వుందో చెప్పండి." — అన్నాడు రాముడు.

అప్పుడు హనుమంతుడు మిగతా సంగతులన్నీ వెనకబెట్టి సీత సంగతే ముందు మాట్లాడాడు. సీత చాలా పవిత్రంగా వుందనే సంగతి చెప్పడానికే ఇక్కడ కవి ఎక్కువ ప్రత్యేకత ఇచ్చాడు.

రాముడు అడిగిందానికి హనుమంతుడు ఈ రకంగా ప్రారంభించి చెప్పాడు — "నేను సీతని వెతుకుతూ సముద్రం దాటాను. రావణాంతఃపురంలో సీత కనపడింది. (అశోకవనం కూడా అంతఃపురంలో భాగమే.) నిన్నే స్మరిస్తూ వుంది. రావణుణ్ణి అసహ్యించుకుంటూ, ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచిస్తూ వుంది. నీ మీద ఎంతో భక్తితో వుంది. నీ కోసం వుగ్రమైన తపస్సుతో వుంది. సదాచారం విడిచిపెట్టలేదు. శీలం మరిచిపోలేదు. నీ గురించి విని చాలా సంతోషించింది. ఇంతకాలం రక్షించ లేదేమని వాపోయింది. నీ భర్త నిన్ను తప్పకుండా రక్షిస్తాడని ధైర్యం చెప్పాను," అని ఆగాడు.

ఇక్కడ లంకాదహనం గురించి చెప్పలేదు కాబట్టి, అది వాల్మీకి రాసిందే కాదనీ, వాల్మీకి రాసిందైతే ఆ ప్రసక్తి ఇక్కడ కూడా వొచ్చే దనీ, వెంకటేశ్వరరావుగారి అభిప్రాయం.

ఇంకా చెప్పవలసిన విషయం పూర్తి కానేలేదు. — (దాని సందర్భం వొచ్చినప్పుడు అదీ చెప్పాడు.) అసలు లంకాదహనం దాకా ఎందుకు ? అంతకుముందు విషయాలెన్నో చెప్పలేదు. మైనాకుడి సంగతీ, సురస సంగతీ, సింహిక సింగతీ చెప్పకుండానే — "నేను సీతని వెతుకుతూ సముద్రందాటాను," అన్నాడు.

లంకిణిని చంపడం, సీత కోసం లంకంతా గాలించడం చెప్పకుండానే, — "రావణాంతఃపురంలో సీతని చూశాను," — అన్నాడు.

ఆ విధంగా అసలు విషయం తొందరగా చెప్పకుండా, తీరిగ్గా సముద్రంలో మైనాకుడు అడ్డురావడం, సురస అడ్డురావడం, సింహిక అడ్డురావడం, లంకిణి అడ్డురావడం, వర్ణించుకుంటూ కూర్చుంటే, రాముడు నోరు మూసుకుని వింటూ వుంటే ఏవన్నా బాగుంటుందా?"

"ముందు సీత సంగతులు తెలుసుకోవాలి గానీ, ఆ గోలంతా ఎందుకు ?" తర్వాత చెప్పుకోరాదా ?" — అన్న విమర్శ రాదూ?

అందుకే కవి ముందు సీత సంగతి చెప్పి తర్వాత లంకలో సంగతులన్నీ చెప్పాడు.

(ప్రతి ఘట్టంలోనూ ఇంత తెలివిగా, సందర్భోచితంగా రాశాడని కాదు. ముఖ్యంగా అది గమనించాలి)

హనుమంతుడు రాముడికి సీత సంగతులన్నీ చెప్పి — "నీ భర్త నిన్ను తప్పకుండా రక్షిస్తాడని సీతకి ధైర్యం చెప్పాను." — అన్నాడే గానీ, "ధైర్యం చెప్పి బయల్దేరి సముద్రం దాటి వొచ్చేశాను." — అనలేదు. — అంటే ఇంకా చెప్పడం పూర్తి కాలేదన్నమాట.

(ఇక్కడితో "సుందరకాండ" ముగిసి కథ యుద్ధకాండలోకి వెళ్ళింది. కానీ ఘట్టం వొకటే. రాముడు చూడామణి చూసిన విషయం సుందర కాండలోనే వొచ్చింది.)

రాముడు కాస్సేపు దుఃఖించి, హనుమంతుడికి గొప్ప బహుమానం ఇచ్చాడు. (అదేవిటో మీరే చూస్తారు.)

తర్వాత కొంచెం శాంతపడి — "లంక వివరాలన్నీ చెప్పు"– అన్నాడు.

అప్పుడు హనుమంతుడు తను చేసిన ఘనకార్యాలన్నీ చెప్పాడు– "లంక నేనే సగం ధ్వంసం చేసేసి వొచ్చాను. అగడ్తలన్నీ కూలగొట్టేశాను. లంకంతా తగలబెట్టేశాను. బోలెడుమంది రాక్షసుల్ని చంపేశాను" — అలి జరిగిందంతా చెప్పాడు.

రామాయణం ఎన్నోసార్లు చదివానని చెప్పుకున్నారు వెంకటేశ్వర్రావుగారు, — "....రామాయణాన్ని మీరు చదవడం లేదు. మీవలె గాక నేను దాన్ని చదివాను. ఒకసారీ, రెండుసార్లు, మూడుసార్లు గాక పదే పదే చదివాను...."– అంటున్నారు. పదేపదే చదివికూడా లంకలో జరిగిన సంగతులేవీ హనుమంతుడు రాముడికి చెప్పనే లేదంటున్నారు.

ఇక్కడ వొక్కచోటే కాదు, మిగిలిన కథలోకూడా లంకా దహనం సంగతి బోలెడుసార్లు వచ్చింది.

—లంకలో యుద్ధం జరుగుతూ వున్నప్పుడు, కుంభకర్ణుణ్ణి నిద్ర లేపేటప్పుడు — "తొందరగా లే. యుద్ధం జరుగుతోంది. ఒక వానరుడొచ్చి లంకంతా తగలబెట్టి వెళ్లాడు" — అని చెపుతారు రాక్షసులు.

— రాముడు యుద్ధంలో జయించి అయోధ్యకు తిరిగిపోతూ భరద్వాజ ఆశ్రమంలో ఆగినప్పుడు ఆయన సంతోషించి — "నాయనా! ఇప్పుడు నువ్వు సుఖంగా వున్నావు. నీ వనవాసంలో జరిగిన సంగతులన్నీ విన్నాను. సీతాపహరణం, సుగ్రీవుడితో నీ స్నేహం ...." — ఈ రకంగా ఏమేమి విన్నాడో చెప్పినప్పుడు బంగారు లేడీ, లంకా దహనం, సంగతులుకూడా ఎత్తాడు.

— రాముడికి పట్టాభిషేకం అయింతర్వాత హనుమంతుణ్ణి కీర్తించే సమయంలో — "నువ్వు అంత వాడివి. ఇంత వాడివి, ఆ కార్యం చేశావ్. ఈ కార్యం చేశావ్" — అంటూ లంకాదహనం సంగతికూడా ఎత్తి ప్రశంసించాడు.

ఈ రకంగా అవసరమైన ప్రతీచోటా దాని ప్రస్తి వుంది.

లక్ష్మణుడి భార్య సంగతి కథలో ఎక్కడాలేదు కాబట్టి ప్రక్షిప్తం అయింది.

ఇది కథ పొడుగునా వుండికూడా ప్రక్షిప్తం అయింది. ఆంటే ప్రక్షిప్తం అవడానికి ఒక రూలేమీ లేదు వున్నా ప్రక్షిప్తమే. లేకపోయినా ప్రక్షిప్తమే.

లంకాదహనం ప్రక్షిప్తమే అయితే, గిల్మీకి చాలా తెలివయిన వాడే ; చాలా జాగ్రత్తలు తీసుకుని, దాని ప్రస్తక్తి కథ పొడుగునా సర్దాడు.

2) లంకా దహనం ప్రక్షిప్తమే అనడానికి వెంకటేశ్వర్రావుగారు చెప్పిన రెండో కారణం —

"హనుమంతుడు లంకనుంచి తిరిగి వొచ్చిన తర్వాత నెల రోజులకే దానిపై దండయాత్ర జరిగింది. అప్పుడు లంకానగరం చెక్కుచెదరకుండా నిలిచివుంది. హనుమంతుడు బూదె పోగులుగా విడిచివెళ్ళిన నగరాన్ని రావణుడు తన మంత్ర శక్తిచే దాని యథా పూర్వ స్థితికి నెల లోపలనే తిరిగి తెచ్చాడు కాబోలు" — ఇదీ ఆయన అభ్యంతరం.

("మంత్ర శక్తి"తో అయితే, "నెల లోపలనే" అనే సందేహం ఎందుకూ ? వొక్క క్షణంలోనే కావచ్చు) ఒక కోతి తోక నిప్పుతో లంకానగరంమీద ఎగిరి ఇళ్ళన్నీ తగల బెట్టెయ్యడం — అనేది కల్పన — (కల్పన రూపంలో కథ చెప్పడం — మిథికల్‌గా చెప్పడం.)

లంక నెల రోజుల్లోనే యథాస్థితికి వచ్చిందా ?— అనేది వాస్తవ దృష్టితో అడిగే ప్రశ్న.

కల్పనమీద వాస్తవికమైన ప్రశ్న వెయ్యకూడదు కల్పన మీద కల్పనకు సంబంధించిన ప్రశ్నే వెయ్యాలి.— "రావణుడు కూడా మహిమలు గలవాడే గదా ? హనుమంతుడు నిప్పు అంటించగానే రావణుడు ఆర్పెయ్యలేడా ?" అని అడగవొచ్చును.

5 బిస్కట్లలోంచి — 2 వంకాయలు తీసేస్తే ఎన్ని మిగులు తాయి ?— అనడం ఎలా కుదరదో కల్పనకీ, వాస్తవానికీ అలా కుదరదు.

రాజకుమారుడు కీలుగుర్రం ఎక్కే కథ గురించి —

"రాజ కుమారుడు మనిషే కదా ; మనుషులు కీలుగుర్రంమీద వెళ్ళగలరా ;" — అనడం తప్పు.

అలాగే — "కథలో రాజకుమారుడు వెళ్ళాడు గదా ; మనం మాత్రం కీలుగుర్రం మీద వెళ్ళలేమా ?" — అనడంకూడా తప్పే.

కల్పనని వాస్తవ దృష్టితో చూడడంగానీ, వాస్తవాన్ని కల్పన దృష్టితో చూడడంగానీ రెండూ తప్పే. వెంకటేశ్వర్రావుగారు కల్పనకీ, వాస్తవానికీ వున్న భేదం గురించి పట్టించుకోలేదు.

మారీచుడు రాముణ్ణి చాలా దూరం తీసుకుపోయాడు గదా ? — అంత దూరంనించి కేకలేస్తే సీత కెలా వినపడింది ? అనడం కూడా కల్పనని వాస్తవ దృష్టితో చూసే ప్రశ్న.

మారీచుడు లేడి అవ్వడం బాగానేవుండిగానీ అంత దూరం నించి కేకలు వినపడడం మాత్రమే బాగాలేదా ?

కల్పన గురించి సరదాగా, హాస్యంగా ఎన్ని వాస్తవ విమర్శలైనా చెయ్యవొచ్చును. సామాన్య తర్కజ్ఞానం లేనివారికోసం, కల్పన గురించి సహేతుకంగా వివరించ వచ్చును అంతేగానీ, కల్పనకీ, వాస్తవానికీ లంకె పెట్టి సీరియస్‌గా చర్చించకూడదు.

హిందూ దేశానికీ, లంకకూ మధ్యవున్న దూరం విషయంలో రామస్వామి చౌదరిగారు చేసిన పోరపాటు కూడా ఇలాంటిదే. కవి చెప్పిన దూరం, మనకు తెలిసిన దూరంతో సరిపోలేదేమని చర్చించడం అంటే కల్పనకూ, వాస్తవానికీ లంకె పెట్టడమే.

* * *

రాజ్యాధికారం :

తనకు రాజ్యాధికారం లేదనేసంగతి తెలిసికూడా రాముడు రాజ్యం తీసుకోవడానికి ఇష్టపడడం బాగులేదు కాబట్టి (చెప్పుకుంటే సిగ్గు కాబట్టి)

రాముడి కసలు రాజ్యం నంగతి తెలీనే తెలీదు పొమ్మంటున్నారు విమర్శకులు.

రాముడే భరతుడితో స్వయంగా చెప్పిన విషయం — "మన తండ్రి నీ తాతకు వాగ్దానం చేశాడు. అందువల్లనే నీ తల్లి రాజ్యం కోరింది" — అనే శ్లోకం ప్రక్షిప్తం అని ఎగిరగొట్టేసి రామున్ణి రక్షించాలని చూస్తున్నారు.

దశరథుడు రాముడికి నిర్భయంగా రాజ్యం ఇవ్వగలిగే పరిస్థితే వుంటే పట్టాభిషేకానికి ముందు రహస్య మందిరంలో ఆ గుసగుస లెందుకూ? — "భరతుడు మంచివాడే అనుకో. అయినా నమ్మలేం. అతడు రాకుండానే నువ్వు పట్టాభిషేకం చేసుకో. నీ శత్రువుల విషయంలో జాగ్రత్తగా వుండు" — అనే హెచ్చరిక లెందుకూ? రాముడికి శత్రువులుండడం ఏమిటి? కౌసల్య తన కొడుక్కి రాజ్యం వస్తుందో రాదోనని భయపడుతూ వుండడం ఎందుకు? కౌసల్యకి కైకతోనేవైరం ఎందుకు? సుమిత్రతో ఎందుకు లేదు? — ఈ సంఘటనలన్నీ ప్రక్షిప్తాలు లేవని పదిమందీ అంగీకరించిన అయోధ్యకాండలోనే గదా? — రాముడి పాత్రకి వొక స్వభావం ఏర్పడిందికూడా అయోధ్య కాండలోనే. — రాజ్యం తనకు రాదని తెలిసిన్నుడు కృంగిపోవడం, ఏడవటం, తండ్రినీ పినతల్లినీ తిట్టడం, వనవాసంలో ప్రతీ క్షణం రాజ్యం గురించి కలలు గనడం — ఈ సంఘటనలన్నీ వాల్మీకి చిత్రించినవే. — మొత్తం రామాయణానికి వెన్నెముకవంటి కథ అంతా అయోధ్య కాండలోనే జరిగిపోతుంది. అక్కడే పాత్రల కన్నిటికీ స్పష్టమైన స్వభావాలు ఏర్పడిపోతాయి. ఇంత నగ్నంగా కనపడే విషయాలుకూడా తారుమారు చేసెయ్యాలని విమర్శకుల తాపత్రయం.

• • •

కథా గమనం :

రామాయణంలో అనేక విషయాలు ముఖ్య కథకి అడ్డువొస్తున్నాయనే అభిప్రాయం దాదాపు ప్రక్షిప్తాల విమర్శకుల కందరికీ వుంది.

ఆ విషయం వెంకటేశ్వర్రావుగారు చాలా స్పష్టంగా బయట పెట్టారు. —"బాలకాండలో గల విశ్వామిత్రుని పుట్టు పూర్వోత్తరాలు, వశిష్ఠునితో ఆయనకు కలహం, సగర చక్రవర్తి, ఆయన పుత్రుల వృత్తాంతం, గంగావతరణ గాథ మొదలయిన వన్నీ రామకథ ముందుకు సాగటానికి ఏ విధంగాను తోడ్పడవని గుర్తిస్తారా? కథా గమనాన్ని నిరోధిస్తున్న ఈ భాగాలన్నీ ప్రక్షిప్తా లనుకోవడం ఏ విధంగా తప్పు?" — అంటున్నారు.

బాలకాండలో కథలన్నీ, విశ్వామిత్రుడు రామున్నీ, లక్ష్మణున్నీ అయోధ్యనించి తన ఆశ్రమానికి తీసుకు వెళ్తూ వున్నప్పుడూ, తర్వాత మిధిలకు తీసుకువెళ్తూ వున్నప్పుడూ చెప్పినవే. అడవుల్లో రోజులకొద్దీ నడిచి ప్రయాణాలు చేసేప్పుడు .... అందులోనూ చిన్న పిల్లలకి పెద్దవాళ్ళు కథలు చెప్పడం .... ఎంత సహజమైన విషయం!

"రామకథ" అంటే— రాముడి పూర్వుల గురించి చెప్పడం— రాముడి గురువు గురించి చెప్పడం, రాముడి తండ్రి చేసిన యజ్ఞయాగాల గురించి చెప్పడం మాత్రం రామకథకు సంబంధించిన విషయాలు కావా? ఆ కథలే లేకపోతే — "వారు అయోధ్యనించి విశ్వామిత్రుడి ఆశ్రమానికి చేరారు." — "వారు ఆశ్రమంనించి మిధిలకు చేరారు." — అని మాత్రం చెప్పవలసి వొస్తుంది. దారి పొడుగునా, రాముడు ఏ ప్రదేశాన్నో, ఏ నదినో చూసి వివరా లడగడం, విశ్వామిత్రుడు చెప్పడం జరుగుతుంది. అది కథకేమి అవసరం కాదా? ఈ దారిలో చెప్పుకున్న కథలన్నీ ప్రక్షిప్తమే అయితే, ఇది ఎంతో వుపకారం కథకి.

"కథా గమనాన్ని నిరోధిస్తోన్న భాగాలన్నీ ప్రక్షిప్తా లనుకోవడం ఏ విధంగా తప్పు?" — అంటున్నారు.

ఒక్కతప్పు కాదు. రెండు తప్పులు.

అసలు ఈ భాగాలన్నీ కథాగమనాన్ని నిరోధిస్తున్నా యకోను వడం మొదటి తప్పు.

ఏది కథాగమనాన్ని నిరోధిస్తే అది ప్రక్షిప్తం అనుకోవడం రెండో తప్పు.

ప్రక్షిప్తాల మీద ఇంత కక్ష, వాల్మీకి మీద అంత భక్తీ లేకుండా నిష్పక్షపాతంగా పరిశీలిస్తే ఈ విమర్శల స్వభావం ఇంకోరకంగా వుండడానికి వీలయ్యేది.

* * *

వాల్మీకి కూడా వొక్కోచోట తెలివితేటలు ప్రదర్శించి, వొక్కోచోట తెలివి తక్కువగా ప్రవర్తించాడు. అలాగే ప్రక్షిప్తాల కవులు కూడా రెండురకాలగానూ చేశారు.

రాముడు ఖరుణ్ణి చంపిన సంగతి రావణుడికి శూర్పణఖ ద్వారా తెలిసిందా ? అంతకుముందే గూఢచారి ద్వారా తెలిసిందా? —అంటే, శూర్పణఖ ద్వారా తెలియడమే మొదట రాసినట్టు చాలా స్పష్టంగా కనపడుతుంది.

కానీ, శూర్పణఖ చెప్పకముందే ఒక గూఢచారి లంకకు పోయి రాముడు, ఖరుణ్ణి చంపిన సంగతి చెప్పడం, రావణుడు సీత కోసం రావడం, మారీచుడు రావణుణ్ణి మందలించడం, రావణుడు తిరిగి వెళ్ళిపోవడం — ప్రక్షిప్తం అని చాలా స్పష్టంగా తెలుస్తూ వుంటుంది.

శూర్పణఖ వెళ్ళి చెప్పేవరకూ, తన రాజ్యంలో వొకచోట జరిగిన విషయం రావణుడికి తెలియకపోతే, రావణుడికి గూఢచారులే లేరా? అన్న ప్రశ్న రాదా? అందుచేత, ఒక గూఢచారి వెళ్ళి రావణుడికి చెప్పడం, రావణుడు వెంటనే ప్రతీకారానికి బయల్దేరడం, బాగుంటుందని గీల్మీకి అనుకున్నాడు. కానీ, రావణుడు జరిగిందంతా గూఢచారి ద్వారా వినడంకన్నా, శూర్పణఖని స్వయంగా చూసి శూర్పణఖ ద్వారా వినడం, రాముడిమీద కోపం తెచ్చుకోవడం, సందర్భోచితంగా వుంటుంది. దండకారణ్యం నించి శూర్పణఖ కన్నా, గూఢచారి ముందు వెళ్ళగలిగేదేమీ లేదు.

ప్రక్షిప్తాల కవి తెలివిగా చేసినప్పటికీ, అది తెలివి తక్కువ ఘట్టంగానే మారింది.

కొన్ని ఘట్టాలు చాలా అవక తవకగా కనపడినా ప్రక్షిప్తమేఅని నిర్ణయించడం చాలా కష్టం అవుతుంది.

సుగ్రీవుడికి భూమండల జ్ఞానం అంతా తెలిసిన ఘట్టం ఒకటి వుంది. అందులో రావణుడి నివాసం సుగ్రీవుడికి తెలుసు. కానీ, కథ మొదటినించీ రావణుడి గురించి సుగ్రీవుడికి తేలియనట్టే సాగుతుంది. తీరా సీతకోసం వానరుల్ని నాలుగు దిక్కులికీ పంపేటప్పుడు, దక్షిణం వేపు వెళ్ళేవాళ్ళకి రావణుణ్ణి గురించి చెప్పాడు. కానీ, ఆ దక్షిణం వేపు వెళ్ళిన వాళ్ళకి సంపాతి చెప్పేవరకూ రావణు డెక్కడుంటాడో తెలీలేదు. — "సుగ్రీవుడు చెప్పే పంపాడుకదా ?" — అన్న ప్రశ్న వొస్తుంది. కానీ, "సుగ్రీవుడు చెప్పింది ప్రక్షిప్తమే. అందుచేత వానరులు లంక గురించి తెలియనట్టే ప్రవర్తిస్తున్నారు." — అనుకోవలసి వొస్తుంది. — కానీ, హనుమంతుడు సీతతో — "సుగ్రీవుడు నిన్ను వెతకడానికి వానరుల్ని అన్ని దిక్కులకీ పంపాడు." — అని చెపుతాడు.

"అవును. అన్ని దిక్కులకీ పంపడం వాల్మీకి రాసిందే. వారికి ఆ దిక్కుల్లో, ఏవేవి కనపడతాయో చెప్పడం (సుగ్రీవుడి భూమండల జ్ఞానం.) మాత్రమే ప్రక్షిప్తం." — అనుకోవొచ్చు.

సుగ్రీవుడు సైనికుల్ని అన్ని దిక్కులకీ పంపిస్తూ వున్నప్పుడు వారికి ఆ దిక్కుల గురించి చెప్పడం బాగుంటుందని ప్రక్షిప్తాల కవి అనుకున్నాడు. తన భూమండల జ్ఞానంతో ఆ ఘట్టం కల్పించాడు. దాని వల "సుగ్రీవుడికి రావణుడి సంగతి మొదటే తెలుసుగా ?" — అనే ప్రశ్న వొచ్చి పడుతుంది. — దానికి జవాబు చెప్పుకుంటే మళ్ళీ ఇంకో ప్రశ్న.

సుగ్రీవుడు వానరుల్ని అన్ని దిక్కులకీ పంపడం వాల్మీకిరాసిందే అనుకోండి. (వివరాలేమీ చెప్పకుండా.) —

దక్షిణం దిక్కుకి వెళ్ళే హనుమంతుడి చేతికే వుంగరం ఎందుకు ఇవ్వాలి?

అసలు వాల్మీకి రాసిందాంట్లో — ఒక్క దక్షిణం వేపు పంపడం మాత్రమే జరిగిందనుకుందాం. — హనుమంతుడు సీతతో — "అన్ని

దిక్కులకీ వానరులు వెళ్లారు." — అని ఎందుకు చెప్పాడు ? —(బాల కాండ ప్రారంభంలో కథ అంతా క్లుప్తంగా చెప్పేచోట కూడా వానరులు అన్ని దిక్కులకీ వెళ్ళారనే సంగతి వుంది.) —

సుగ్రీవుడి భూమండల జ్ఞానం, వానరుల్ని నాలుగు దిక్కులకీ పంపడం, ఆ సంగతి సీతకి చెప్పడం, రావణుడి గురించి సుగ్రీవుడు చెప్పగలడని కదింధు దనడం — ఈ రకంగా అన్నీ తీసేస్తే రావణుడి గురించి సుగ్రీవుడికి తెలియక పోవడానికీ, హనుమంతుడి చేతికే వుంగరం ఇవ్వడానికీ కారణాలు సరిపోతాయి.

ఇంత చేసి, వొక ప్రక్షిప్తాన్ని కనిపెట్టినంత మాత్రాన (ఇంతకీ అది ప్రక్షిప్తమో, కాదో) — ప్రతీచోటా చక్కగా రాశాడనడానికి వీలుందా ? — ప్రక్షిప్తాలు లేని ఘట్టాలు కూడా గొప్ప నేర్పుతో నడిచా యనుకోవక్కర్లేదు.

బంగారులేడి కోసం లక్ష్మణుడే వెళ్తే ? (ఒక ఫుట్‌నోట్‌లో చూడవొచ్చు.)

భార్యణఖ రాముడి దగ్గిరికి రాకపోతే, రావణుడు సీతని ఎత్తుకు పోకపోతే, — రాముడు పంచవటి దాటి అవతలికి వెళ్లే అవసరం లేదు. అక్కడే ఇంకో సంవత్సరం వనవాసం ముగించి అయోధ్యకి వొచ్చే వాడు కదా ? —

రాముడు పుట్టడం రావణుణ్ణి చంపడానికే కాబట్టి, రాముడు కూడా రుషులందరికీ వాగ్దానం చేశాడు కాబట్టి, సీతని ఎత్తుకుపోవడం జరగక పోయినా రాముడు రావణుణ్ణి చంపే పద్ధతిలో కథ నడవాలి. కానీ అలా నడవదు. ఎక్కడికక్కడ ఏదో వొక అనుకోని సంఘటన జరిగితేనే పాత్రలు ముందుకు కదులుతాయి. — ఈనాడు కళాత్మకంగా ఎంతో అభివృద్ధి చెందిన సమాజంలో మనమే మన రచనల్లో ఎన్నో పొరపాట్లు చేస్తున్నాం. ఇక వేలకొద్దీ సంవత్సరాల కిందటి కవి గొప్ప సహజత్వంతో చక్కగా, నేర్పుగా, చాతుర్యంతో రాశాడనుకోవడంలో

అర్థమేముంది ? సామాన్య తర్కమే లేని కల్పిత గాథలో ఎంతో అభివృద్ధి చెందిన కథాగమనం ఎలా ఆశిస్తాం ?

అందుచేత, ప్రక్షిప్తాల కవుల్ని పట్టుకోవాలని ప్రయత్నించి నప్పుడల్లా వాల్మీకి కూడా దొరికిపోతూ వుంటాడు. ఈ కవులంతా వెళ్ళి ఆయన చుట్టూ దాక్కుంటారు. (ఆయన వొరవడిలోనే రాశారు.) ఆయన్ని వొదిలేసి వీరిని మాత్రమే పట్టుకోవడం ఎప్పుడో గాని సాధ్యంకాదు.

రామాయణం అనే గ్రంథాన్ని వొక కవి రాయడం దాన్ని మరి కొందరు కవులు పెంచడం అనేది, మనకు నచ్చినా నచ్చకపోయినా చరిత్రలో జరిగిన నగ్న సత్యం.

"సంస్కృత రామాయణంనించి ప్రక్షిప్తాలన్నీ ఏరివెయ్యడం." "తీసివెయ్యడం," — అనే అభిప్రాయాలు కలగడం అంటే చరిత్రలో జరిగిన విషయాన్ని తిరస్కరించడం అన్నమాట. బ్రిటిష్ వాళ్ళు పరిపాలించిన రెండు, మూడు వందల సంవత్సరాల కాలాన్నీ లెక్కపెట్టుకోక పోవడం ఎలాంటిదో, రామాయణం లోంచి ప్రక్షిప్తాలు తీసెయ్యడం అలాంటిది.

చరిత్రలో ఏం జరిగినా, అది మంచి అయినా, చెడ్డ అయినా దాని ఫలితాలు అనుభవిస్తాం. దాన్నుంచి అనుభవాలు తీసుకుంటాం. —అంతే గానీ దాన్ని తిరస్కరించలేము.

ప్రక్షిప్తాలు లేని వాల్మీకి రామాయణం కావాలంటే అది వాల్మీకి కాలంలో మాత్రమే సాధ్యమౌతుంది.

"ప్రక్షిప్తాలు లేని రామాయణమే కావాలి" అనడం అంటే — "వాల్మీకి కాలానికే వెళ్దాం. తర్వాత జరిగిన కాలం మనకు వొద్దు." — అనడమే.

"మనం వాల్మీకి కాలంలోనే ఆగవలసింది...."

"అబ్బే! .... అసలు వేదకాలంలోనే ఆగితే ఎంత బాగుండేదండీ! .... ఆ అరణ్యాల్లో .... గుహల్లో...."

"పొత్తిగా గుహల కాలం బాగుండదు గానీ .... చక్కగా

గృహాలు నిర్మించుకుని, ... ఆవుల మందల్ని పెంచుకుంటూ — యజ్ఞ యాగాలు చేసుకుంటూ ...."

మన అభ్యుదయం అంతా, మరీ వెనక్కి నడుద్దామా; కొంచెం తక్కువ వెనక్కి నడుద్దామా? అన్న దాంట్లోనే — మొత్తానికి వెనక్కే.

—"అయ్యా! వెనక కాలం గొప్పదే. వాల్మీకులూ, వ్యాసులూ, వేదవేత్తలూ, రుషులూ, శ్రీరాములూ వున్నారు .... నరే! ఆ కాలం గడిచిపోయిందనే నంగతి మీరు మరిచి పోయినట్టున్నారు; ఇక మనం ముందుచూపు పెట్టుకుని ముందుకే ....."

"ఏవిటీ? ఇంకా ముందుకా? .... మంచి మాటే! ఇప్పటికే బోలెడు ముందు కొచ్చేశాం ... అసలు మనం వాల్మీకి దగ్గిరే ఆగితే.... ఎంత ...."

* * *

"రామాయణంలో ప్రక్షిప్తాలు లేకపోతేనే వాల్మీకికి న్యాయం జరుగుతుంది"— అనే అభిప్రాయం వున్న వెంకటేశ్వరరావుగారు, ప్రక్షిప్తం అని ఆయనే వాదించిన ఘట్టాన్నే తీసుకుని "జాబాలి" నాటిక రాశారు. (దానికి ఆయన కారణం చెప్పుకున్నారు.)—

ఎందుకు రాశారనే ప్రశ్నకాదు ఇది. ప్రక్షిప్తం ఘట్టమే తీసుకున్నారంటే ప్రక్షిప్తాలకున్న స్థానం గుర్తించడమే గదా?

ప్రక్షిప్తాల కవులు రాముడి పాత్రని చెడగొట్టారని అభిప్రాయపడిన వెంకటేశ్వరరావుగారు జాబాలి పాత్రకు ప్రక్షిప్తాల కవులు కూడా చెయ్యని అన్యాయం చేశారు.

జాబాలి వసిష్ఠుడి ముందే నాస్తికత్వం మాట్లాడాడు — రామాయణంలో

వీరి నాటికలో జాబాలి వసిష్ఠుడి ముందు మాట్లాడానికే ధైర్యం లేనివాడు. — "సాంప్రదాయిక మత విశ్వాసాలకు, సాంఘికాచారాలకు ప్రాతినిధ్యం వహించే వసిష్ఠుని పరోక్షంలో మాట్లాడినంత నిర్భయంగా,

నిష్కర్షగా, ఆయన సమక్షంలో జాబాలి మాట్లాడలేడని నేనూహించడం అసంబద్ధం కాదనుకుంటాను." — అన్నారు.

(జాబాలి పీఠిక)

ప్రక్షిప్తాల కవుల జాబాలే పిరికి వాడనుకుంటే వెంకటేశ్వరరావు గారి జాబాలి ఇంకా ఎక్కువ పిరికివాడు. నాస్తికత్వం వోడినట్టు చూపించడంకోసం రామాయణం ఒక పిరికి నాస్తిక పాత్రని సృష్టించింది. కానీ, జాబిలి 'నాస్తికత్వం' వొదిలి పెట్టలేదని (రామాయణ పాత్ర స్వభావానికి విరుద్ధంగా) — నమ్మి కూడా, వెంకటేశ్వరరావుగారు జాబాలిని పూర్వపు స్థాయిలోనైనా వుంచకుండా, మరింత పతనం చెయ్యడంలో అర్థం ఏమిటి? — కాలక్రమంలో ఇలాగే జరుగుతుంది పాత్రల చిత్రణలో మార్పు. దీన్ని తిరస్కరించం, సాహిత్య చరిత్రలో వొక నగ్న సత్యంగా స్వీకరిస్తాం.

* * *

రామాయణం రాసింది ఎవరు?

వాల్మీకి రామాయణం కథ తయారు చెయ్యడమే గానీ, ఆయనే స్వయంగా రాయలే దంటున్నారు వెంకటేశ్వర్రావుగారు — "వాల్మీకి మహాముని చెప్పిన రామాయణ కావ్యం చాలా చిన్నదే. ఇక్కడ కావాలనే "చెప్పిన" అనే మాటను నేను ప్రయోగిస్తున్నాను. దాన్ని ఆయన వ్రాయలేదు. ఒక పాటగా చెప్పాడు."— అన్నారు.

పాటగా అంటే ఇంకేదో పద్ధతిలో అని కాదు. ఇప్పుడు మనం చదివే రామాయణం (ప్రక్షిప్తాలు కానిది) అయన తయారు చేసిందే అనీ దాన్ని తర్వాత కవులెవరో తాటాకుల మీదకి ఎక్కించారనీ (వాల్మీకి పేరనే) వెంకటేశ్వర్రావుగారి అభిప్రాయం.

వాల్మీకికి సంబంధించినవి కనీసం 10 వేల శ్లోకాలు కదా? కనీసం అందులో సగమే అనుకున్నా సరే, అన్ని వేల శ్లోకాలు చక్కగాకూర్చి రాయకుండా వుండడానికి కారణం ఏమిటి? వాల్మీకి చదువు రాని వాడను

కోవాలా ? చదువురాని వ్యక్తికి, ఛందోబద్ధంగా, వ్యాకరణ యుక్తంగా, అన్ని వేల శ్లోకాలు తయారు చెయ్యడం సాధ్యమౌతుందా ? వాల్మీకి, చదవడం, రాయడం వొచ్చినవాడే అయితే, తను తయారుచేసిన కథ రాయకుండా వుండడానికి కారణం ఏమిటి ?

వాల్మీకి రామాయణం రాయలేదని వెంకటేశ్వర్రావుగారు ఎందుకు అనుకున్నారో రెండు కారణాలు చెప్పారు.

1) — బాలకాండ మొదట్లోనూ, యుద్ధకాండ చివర 'ఫలశ్రుతి' లోనూ — "నేను ఇది రాస్తున్నాను." — అనే పద్ధతిలో చెప్పడం గాకుండా "ఉత్తమోత్తముడైన వాల్మీకి రచించిన ఈ కావ్యం .. " అనడం జరిగింది కాబట్టి, వాల్మీకి పాటని ఎవరో కవి "ఎక్కించాడని", వెంకటేశ్వర్రావుగారి అభిప్రాయం.

కానీ, బాలకాండ ప్రక్షిప్తమే అంటున్నారు.

ఫలశ్రుతి కూడా ప్రక్షిప్తమే అంటున్నారు. వొకవేపున ప్రక్షిప్తాలని చెపుతూనే వాటిలో వున్న విషయం మీద ఆధారపడడం ఎందుకు? — బాలకాండ ప్రక్షిప్తం కాదనేవారు కూడా, కథ ప్రారంభానికి మొదట వుపోద్ఘాతం ఎవరో చేర్చిందనే నమ్ముతారు. "కథా ప్రారంభం" దగ్గర్నుంచీ వాల్మీకి రాసిందే కావొచ్చు గదా?

2) —రామాయణం వాల్మీకి రాయలేదనడానికి రెండో కారణం- "వాల్మీకి కూర్చగా దీన్ని (రామాయణాన్ని) మొట్టమొదట పాడినవారు కుశలవులు గనకనే — "కుశీలవుడు" అన్న మాటకు వూళ్ళ వెంట తిరిగి వీర గాథలను పాడి వినిపించే వాడన్న అర్థం వచ్చినట్టు చెపుతారు. అన్నట్టు "కుశీలవుడు" అంటే "వాల్మీకి" అని కూడా నిఘంటువులు పేర్కొంటున్నాయి." — అన్నారు.

వాల్మీకి పాడి వినిపించే వాడే కావొచ్చును. పాడేవాడు అంటే "రాసేవాడు కాడు" అనే అర్థం వొస్తుందా ? తను రాసుకున్న ఘట్టాలు తనే వూళ్ళ వెంట తిరిగి పాడి వినిపించకూడదా ?

ఈ కారణాలు మాత్రం వాల్మీకి రామాయణం రాయలేదనటానికి కెంత మాత్రం పనికిరావు.

ఇక అన్నివేల శ్లోకాలు తయారు చేసినవాడు, రాయకుండా వుండటానికి కారణం ఏమిటనే ప్రశ్న వుండనే వుంది.

వాల్మీకి రాయలేదని ఎందుకు అనుకున్నారో చెప్పారే గానీ, ఎందుకు రాసివుండడో చెప్పలేదు. రామాయణ శ్లోకాలన్నీ తయారు చేసింది వొకరూ, ఎక్కించింది వొకరూ అనుకోడానికి ఆస్కారం లేదు. ఆ కథ ఎవరు తయారుచేశారో, ఆయనే రాశాడు. ఆయనే వాల్మీకి అనుకోడాని కెవరికీ అభ్యంతరం వుండక్కర్లేదు.

• • •

కొన్ని ఇతర రామాయణాలలో విశేషాలు

(ఈ రామాయణాలేవీ నేను చదవలేదు. వీటికి సంబంధించిన వ్యాసాలు చదివాను.)

భాస్కర రామాయణంలో—

తార రాముణ్ణి శపిస్తుందట. కవి ఈ మార్పు ఎందుకు చేసినట్టు? తన భర్తని చంపిన వాణ్ణి ఏమీ అనకుండా నమస్కారాలు పెట్టడం (వాల్మీకి పెట్టించినట్టు) బొత్తిగా బాగుండదు కాబట్టి. (రాముడికి శాపం పెడితే మాత్రం నిలుస్తుందా? కవే మళ్ళీ ఏ రుషిద్వారానో ఆ శాపాన్ని వరంగా మార్పించే వుంటాడు.)

శ్రీకృష్ణ రామాయణంలో—

సీతాదేవి మీద అభాండాలు వేసిన చాకలిని ఆ స్థానానికి పిలిపించి అడిగితే అతడు పిచ్చివాడని తేలింది. పిచ్చివాడి మాటలు లక్ష్యపెట్టక్కర్లేదనీ, సీతని విడిచి పెట్టక్కర్లేదనీ పురోహితులు చెపితే రాముడు సీతని అడవికి పంపించకుండా వూరుకుంటాడు.

రాముణ్ణి మంచివాడని చెయ్యడానికే ఈ మార్పు. కానీ, పిచ్చి

వాడు గాకుండా మంచివాడే ఆ మాటలంటే విడిచి పెట్టేవాడే గద? (వుత్తరకాండలో ఆ మాటలన్నది చాకలి వొకడే కాదు. చాలామంది అన్నారని చారులు చెపుతారు.) ఎవరివల్లా ఏ ప్రమాదం రాకుండా వుండాలంటే దేశంలో ప్రజలందరూ పిచ్చివాళ్ళైపోవాలి. అప్పుడు రాముడు సీతనీ, రాజ్యాన్నీ కూడా వొదలకుండా వుండవొచ్చు.

ఈ రామాయణంలోనే రాముడు శంబుకుణ్ణి చంపకుండా తపస్సు మాత్రం మాన్పించి విడిచి పెడతాడట. రాముడి మీద విమర్శలకు తావు లేకుండా రాముణ్ణి వుత్తముణ్ణి చెయ్యాలని కవుల తాపత్రయం.

రాముడు వొక శూద్రుణ్ణి చంపాడనే విషయం ఈ మారుతోన్న సమాజానికి అంత సమంజసంగా తోచదు కదా? అందుకని కవి శంబుకుణ్ణి చంపించలేదు.

కానీ పూర్వం కవులలాగే ఈ కవికి కూడా శూద్రుడు తపస్సు చెయ్యడం ఇష్టం లేదు. తపస్సు జరగకుండా మానిపించేశాడు.

కవికి ఎంతవరకూ ఇష్టమైతే అంత వరకే రాముడు వుత్తముడవుతాడు.

రేపు సమాజం ఇంకా చైతన్యవంతంగా మారినప్పుడు ఈ కవుల వ్యవహారం ఇంకా కొంచెం మారుతుంది. అప్పుడు రాసే కొత్త రామాయణంలో రాముడు శంబుకుణ్ణి తపస్సు కూడా చేసుకోనిస్తాడు. (అయితే విష్ణువు గురించే చెయ్యమని ఆజ్ఞాపిస్తాడనుకోండీ.) — "చూశారా? రాముడు అన్ని వర్ణాల వారినీ సమానంగా చూశాడు." — అనే కొత్త ప్రచారం ప్రారంభమౌతుంది.

అధ్యాత్మ రామాయణంలో—

రాముడు పుట్టగానే కౌసల్యకి భగవత్ స్వరూపం చూపిస్తాడట. అడవుల్లో వున్నప్పుడు అసలు సీతని అగ్నిలో దాచేసి, మాయ సీతని ఆశ్రమంలో వుంచుతాడట. రావణుడు రాముడి చేతిలో మరణించడం కోసమే సీతని ఎత్తుకు పోతాడట. (రాముడు యుద్ధం ఎందుకు చేస్తాడో మరి.)

అద్భుతోత్తర రామాయణంలో—

రాముడు రావణుణ్ణి చంపేసి రాజ్యం చేస్తూ వున్నప్పుడు ఇంకో రాక్షసుడి మీదకి యుద్ధానికి వెళ్ళి రాముడే చచ్చిపోతాడు. (అద్భుతం గానే వుంది.) — అప్పుడు సీతే యుద్ధం చేసి ఆ రాక్షసుణ్ణి చంపేస్తుంది. అంతలో బ్రహ్మ వొచ్చి రాముణ్ణి బతికిస్తాడు.

వందలకొద్దీ రామాయణాల్లో ఇలాంటి మార్పులూ చేర్పులూ ఎన్నో. — పెద్ద పెద్ద కవులు రాసిన పుస్తకాల్లోవే గాకుండా, ప్రజల్లో ఎన్నెన్నో కల్పనలున్నాయి. మొత్తంగా చూస్తే అన్నిటి లక్ష్యమూ వొక్కటే. రాముణ్ణి కీర్తించడం, రాముడు పాటించే ధర్మాల్ని కీర్తించడం. ఈ లక్ష్యానికి హాని కలగకుండా రాసినదాన్ని దేన్నయినా రాముడికి అనుకూలంగానే తీసుకో వొచ్చును.

విస్పన్న చెప్పిందే వేదం అన్నట్టు వాల్మీకి చెప్పిందే రామాయణం కాదు.

ఈ మార్పులవల్లా ప్రక్షిప్తాలవల్లా సమాజంలో మారుతోన్న స్థితిగతులు తెలియడానికి కూడా అవకాశం కలుగుతుంది.

శివ ధనుర్భంగం ప్రక్షిప్తం అనుకుందాం. విష్ణు ధనుర్భంగం అనక, శివ ధనుర్భంగం అని ఎందుకు అన్నారు? విష్ణు భక్తులికీ, శివ భక్తులికీ వున్న వైరం, చివరికి విష్ణువే గొప్పవాడని విష్ణుభక్తులు నిర్ణయించుకోవడం, — ఈ ప్రక్షిప్తం వల్ల అర్థమవుతాయి.

అలాగే రాముడు బుద్ధుణ్ణి తిట్టే ప్రక్షిప్తం వల్ల బౌద్ధమత ప్రభావం వల్ల ప్రజల్లో నాస్తిక భావాలు ఎక్కువగా వ్యాప్తిలో వున్నాయనీ, రామాయణం ద్వారా నాస్తికత్వం అణిచే ప్రచారం జరిగిందనీ అర్థం చేసుకోవచ్చు.

ఇంత స్పష్టంగా ఏ పరిస్థితినీ వెల్లడించని ప్రక్షిప్తాలు అనేకం వుంటే వుండవొచ్చు. వాటివల్ల లాభం లేకపోయినా నష్టమేమీ లేదు.

ఒక సందర్భం నిజంగా ప్రక్షిప్తం వల్లనే చెడిపోయింది అను

కుండాం. అది ప్రక్షిప్తం అనే సంగతి మనకు తెలీక, — "వాల్మీకి ఇలా చేశాడేమిటి ? ఇంత అవక తవకగా రాశాడేమిటి ?" — అని వాల్మీకినే విమర్శిస్తాం అనుకుందాం. మనం విమర్శించేది "విషయాన్నే" గాని "వ్యక్తిని" కాదు. అందుచేత ఆ తప్పుకి ఎవరు కారకులైతే, ఆ విమర్శ కూడా వారికే చెందుతుంది. వాల్మీకే అనుకుని విమర్శించినా సరే, అది ఆయన రాసిన ఘట్టం కాకపోతే, ఆ విమర్శకి కూడా ఆయన బాధ్యుడు కాడు. ఒక సందర్భంలో ఏదైనా విమర్శించ వలసిన అవసరం వుంటే —"ఇది వాల్మీకి రాశాడో లేదో ; మనం అన్యాయంగా ఆయన్ని తప్పు పడుతున్నామేమో !" — అని సందేహించ వలసిన అవసరం లేదు. ఎక్కడ ఎలా అవసరం అయితే అలా విమర్శించ వలసిందే.

ఇంకో కవి పేరు తెలియదు కాబట్టి ప్రతిచోటా వాల్మీకి పేరే వుపయోగిస్తాం. అంత మాత్రాన ఆయనకి అన్యాయం జరగదు. ఆ ఘట్టం ఎవరు రాశారో, ఆ తప్పు ఎవరు చేశారో వారే దానికి బాధ్యులవుతారు. మనం ఆ కవిని విమర్శించినట్టే.

• • •

రామాయణంలో ప్రక్షిప్తాలు లేవనేవారి వాదం

గాయత్రీ మంత్రానికి 24 అక్షరాలట. రామాయణంలో 24 వేల శ్లోకాలు.

మొట్టమొదటి శ్లోకం తర్వాత ప్రతీ వెయ్యో శ్లోకం గాయత్రీ మంత్రంలో వరస అక్షరాలతోనే ప్రారంభమౌతాయట. —అందుచేత ఈ 24 వేల శ్లోకాలూ వొక్కసారి రాసినవే — అని వారి వాదం.

నిజంగా రామాయణంలో ప్రతీ వెయ్యో శ్లోకమూ గాయత్రీ మంత్రంలో అక్షరాల ప్రకారమే ప్రారంభమై వుంటే ;; వాదానికి

కొంతన్నా బలం వుంటుంది. కానీ, అలా అనడమే గానీ, ఆ విధంగా లేదన్న సంగతి కూడా పండితులు చెప్పిందే. అయినా వాల్మీకి భక్తులు గాయత్రీ మంత్రాక్షరాల మీదే చలించకుండా నిలబడతారు.

— బాలకాండలో కథా ప్రారంభానికి ముందు, వాల్మీకి నదికి వెళ్ళడనీ, బోయవాడు పక్షిని కొట్టాడనీ, — వాల్మీకి గాక ఎవరో రాసి నట్లు రాయడం జరిగింది. ఎందుచేత ? — అనే ప్రశ్నకి పేరి జవాబు —"ఏ తాళపత్ర గ్రంథమో జాగ్రత్త కోసం తిరిగి రాయవలసి వొచ్చినప్పుడు ఎవరో ఆ విధంగా రాసి వుండవొచ్చు. కథా ప్రారంభంనించి మాత్రం వాల్మీకి రాసిందే."

— యుద్ధకాండ అయిపోయిన తర్వాత, కథ అయిపోయినట్లు ఫలశ్రుతి రాశారు. ఎందుచేత ?

రాముడు జన్మ ఎత్తింది రావణ వధకే కాబట్టి ఆ కార్యం ముగిసి సంతోషంగా తన రాజ్యానికి వొచ్చేశాడు కాబట్టి అక్కడే ఫలశ్రుతి చెప్పారు. లేకపోతే, మొదట వాల్మీకి యుద్ధకాండ వరకే రాసి, తర్వాత కొంతకాలానికి, దాన్ని ఇంకా పెంచాలని మళ్ళీ వుత్తరకాండ రాసి వుండవొచ్చు. లేకపోతే వుత్తరకాండ మాత్రం ప్రక్షిప్తమే కావొచ్చు.

* * *

రామాయణంలో తప్పుల్లో స్వభావ భేదాలు

రామాయణం చదివేప్పుడు అనేకమైన తప్పులూ, అవక తవ కలూ కనపడతాయి. కానీ అన్నీ వొకేరకం కాదు. వొకే రకం అయిన వాటిలో కూడా ఎక్కువ తక్కువ స్థాయిలున్నాయి. కొన్ని తప్పులు పూర్తిగా వేరు వేరు స్వభావాలకు చెంది వున్నాయి. — అన్నిట్నీ వొకే గాటిన కట్టకూడదు.

అసలు కథ చెప్పిన విధానం కల్పన రూపంలో (మితికల్ ఫామ్) సాగిందనే విషయం ముందు స్పష్టం చేసుకుంటే దాని మీద

చర్చకు అవకాశం వుండదు. (అసలు మాట్లాడ కూడదని నా వుద్దేశ్యం కాదు. దాన్ని సీరియస్ చర్చగా తీసుకోకూడదు.) దశరథుడికి 60 వేల సంవత్సరాల వయసనే విషయం మీద చర్చలు జరప కూడదు.— అది కథా రూపానికి సంబంధించిన విషయం.

మతిమరుపు పొరపాట్లు —

ప్రస్రవణ పర్వతం పంచవటి దగ్గిర వుంది. రుష్యమూక పర్వతం కిష్కింధ దగ్గిర వుంది.

అయినా ఈ సంగతి కవి ఎప్పుడూ గుర్తు పెట్టుకోడు. రుష్యమూక పర్వతాన్ని ప్రస్రవణ పర్వతం అనడమే చాలా ఎక్కువసార్లు జరిగింది.

అలాగే — 'అంగారక' అనే రాక్షసి గురించి మళ్ళీ చెప్పవలసి వొచ్చినప్పుడు 'సింహిక' అనడం, మాయావి గురించి చెప్పా దుందుభి అనడం. ఈ రకమైన విషయాలన్నీ "పొరపాట్ల కోవ" లోకి వొస్తాయి. ఇవి కేవలం కవి వెనక రాసిన దాన్ని మర్చిపోవడం వల్లనో శ్రద్ధ లేకపోవడం వల్లనో జరిగిన పొరపాటు. ఇవి ఎవరికీ, ఏ పేధం గానూ హాని కలిగించి, అవమానం చేసే తప్పులు కావు. వొక్కసారి వెనక్కి తిరిగి చూస్తే వీటిని సర్దుకోడానికి వీలుంది. రుష్యమూకం ప్రసక్తి వొచ్చినప్పుడల్లా, ఆ పేరే రాస్తే సరిపోతుంది. అలాగే, అంగారకని కూడా సింహిక చేసినా, లేకపోతే సింహికనే అంగారక చేసినా సరిపోతుంది. ఇవి మతిమరుపు వల్లా, అశ్రద్ధ వల్లా జరిగిన పొరపాట్లే గానీ తప్పులు కావు.

— రాముడు ఖరుడితో యుద్ధం చేసినప్పుడు (జనస్థానంలో) త్రిశేరుడు అనే పేరు గల ఒక వ్యక్తి చచ్చిపోతాడు. లంకలో జరిగిన యుద్ధంలో కూడా త్రిశేరుడనే పేరు గల వ్యక్తి చచ్చిపోతాడు. ఇలాగే, అకంపనుడు, నరాంతకుడు అనే పేర్ల విషయంలో కూడా జరుగుతుంది. —ఈ వ్యక్తులు వేరు వేరు కాదనీ నిర్ణయించ

డానికి పేర్ల ఆధారం గాకుండా ఇతర ఆధారా లేమైనా వుంటే తప్ప ఆ త్రిశేరుడూ, ఈ త్రిశేరుడూ వొక్కడే అని వాదించడానికి వీలు లేదు. ఒక్క పేరు గలవాళ్ళు అనేకమంది వుండవొచ్చు. — ఒకవేళ ఆ త్రిశేరుడూ ఈ త్రిశేరుడూ వొక్కడే అని రుజువైనా, అది పొరపాట్ల కోవలోకి మాత్రమే వొస్తుంది.

తెలివితక్కువ పొరపాట్లు —

హనుమంతుడు అశోక వనంలో చెట్టెక్కి దాక్కుని, రావణుణ్ణి చూస్తూవున్నప్పుడు, రావణుడు సీతని బెదిరిస్తోవుంటే ధాన్యమాలిని అనే భార్య రావణుణ్ణి కోపం తగ్గించుకోమని కోరుతుంది.

హనుమంతుడు లంకనించి రాముడి దగ్గిరికి వెళ్ళి చెప్పేటప్పుడు— "రావణుడు సీతని కొట్టబోతే మండోదరి అడ్డగించింది." —అంటాడు (కవి వెనక ఘట్టంలో ఏం రాశాడో మరిచే పోయాడు.)

ఇంతకీ ఆభార్య ఎవరు?— మొదటి పేరుకే విలువ ఇవ్వాలి. కథలో మొదట వొచ్చిన పేరు ధాన్యమాలిని, పైగా అదే కవిచెప్పిన ఘట్టం— హనుమంతుడికి రావణుడి భార్య పేరు (ఏ పేరైనా) ఎలా తెలుస్తుంది? "వొక భార్య రావణుణ్ణి మందలించింది.—" అనవొచ్చుగదా?— ఇది కవి కొంచెం తెలివిగా ఆలోచించకుండా చేసినపొరపాటు.

— సీతని హనుమంతుడు పీపు మీద ఎక్కించి తీసుకు పోతానంటే రానంటుంది. అలా రావడం తనకి కీర్తి కాదంటుంది. హనుమంతుడు సముద్రందాటి వెళ్ళిపోయి, అక్కడ వానరులతో సంగతులన్నీ చెప్పి — "మళ్ళీ లంకకి వెళ్ళి సీతని తెచ్చేద్దేమా? ఏకంగా సీతని తీసుకునే రాముడి దగ్గిరికి వెళ్ళవొచ్చు," — అంటాడు. ఇది పొరపాటుకి చెందదు. వెనక సందర్భానికీ, ముందు సందర్భానికీ లంకె చూసుకోకుండా, తెలివి తక్కువగా రాయడమే. అయినప్పటికీ ఇది కూడా శత్రు పక్షానికో స్త్రీలకో, శూద్రులకో, హానిగలిగించే తప్పు కాదు.

రామ పక్ష పాతం—

హనుమంతుడు వానరులతో చెప్పే సందర్భంలోనే—"రావణుడు సీతకి సాష్టాంగ నమస్కారం చేసి కోపంగా—"నువ్వు నన్ను అంగీకరించక పొతే నీరక్తం తాగుతాను, అన్నాడు."—అని చెపుతాడు. చంపాలన్నంత కోపంలో సాష్టాంగ నమస్కారం! ఈతప్పులో తెలివి తక్కువ తనం మాత్రమేకాదు. కావలసినంత రామ పక్షపాతం. కధపొడుగునా రాముడి శత్రువులందరూ రాముణ్ణి "ఆ మహానుభావుడు," "ఆ పుణ్యపురుషుడు", "ఆ సుందరాంగుడు...." అంటూ వుంటారు. శత్రువులచేత కూడా రామ భజనచేయించి, రాముడికీ, రాముడి పక్షం వారికీ నమస్కారాలు పెట్టిస్తూ వుంటాడు.

స్త్రీలమీద కామకదృష్టి—

హనుమంతుడు సీత గురించి వానరులకు చెప్తూ—"రావణుణ్ణి చూసి సీత తొడలు ముడుచుకుని, చక్కగా బలిసిన స్తనాలు చేతులతో మూసుకుని భయపడుతూ కూర్చుంది."—అని చెప్తాడు సీత. అవయవాల గురించి రాముడు మాట్లాడ వొచ్చును. రావణుడూ మాట్లాడవచ్చును. (దుష్టుడు కాబట్టి) కవి కూడా మాట్లాడవొచ్చును. (అదే రచనా విధానం కాబట్టి—అవసరమైనంత వరకే) మిగిలిన పాత్ర లేవీ సీత అవయవాలు వర్ణించ కూడదు. సీతని లక్ష్మణుడూ వర్ణిస్తాడు. హనుమంతుడూ వర్ణిస్తాడు. ఇది కవి పరాకుగాచేసిన పొరపాటు కాదు. తెలివి తక్కువ తనమూ కాదు. స్త్రీని కాముక దృష్టితో మాత్రమే చూడడం.

సీత ఎంత దుఖంలో వున్న ఘట్టమైనా సరే, చిక్కుశల్యం అయిపోయినా సరే, ఆమె స్తనాలు మాత్రం పూర్ణ కలశాల మల్లే బలిసే వుంటాయి. పిరుదులు ఇసక తిన్నెల్లా వుంటాయి.

పురుషుడికి ఆనందం కలిగించడమే స్త్రీ శరీరానికి అర్థం. మహా పతివ్రతల్నీ, దేవతా మూర్తుల్నీ కవులు తమ కిష్టమైన అందాలతో వర్ణించుకుని నిత్యం నెమరు వేసుకుంటూ ఆనందం పొందుతారు,

సీత స్తనాలు హనుమంతుడు వర్ణించడం చిన్న తప్పుగాను, కాస్త అవకతవకగాను మాత్రమే తీసుకోకూడదు.

పవిత్ర భారత దేశం స్త్రీలకు ప్రత్యేకంగా యిచ్చే అపారమైన గౌరవం అది. సీతాదేవినికూడా కాముక దృష్టితో మాత్రమే చూడగల మన కవులు సృష్టించిన ఘనతర భారత సంస్కృతి అది.

వాల్మీకి భక్తులందరికీ వాల్మీకి కవిత్వంలో గొప్ప ఔన్నత్యమే గానీ, భయంకరమైన హీనత్వం కనపడదు.

అశోకవనంలో దుఃఖసాగరంలో మునిగి వున్న సీతని, పూలు లేని తీగతోటీ, తీగలు లేని పీఠతోటీ పోల్చడంలో గొప్ప సౌందర్యం చూస్తారేగానీ ఆ సీతనే "శూద్రుడు" ముట్టుకున్న అగ్ని వేదిక తోటీ, మంచి కులంలో పుట్టి "నీచకులం"లో కలిసిన కన్యతోటీ పోల్చడంలో ఏమీ వికృతం చూడలేరు.

వాల్మీకి విరజిమ్మిన కవిత "సౌరభాలే"గానీ, వాటిలో మిళితమై వున్న సామాజిక పక్షపాత నీతి దుర్గంధాలు గ్రహించలేరు.

వీరికి —వాల్మీకి కవిత సరస్సులో తామర పువ్వులేగానీ, వాటి చుట్టూ పరుచుకున్న నాచు తెప్పలూ, నల్లగుల్లలూ కనపడవు. వాల్మీకి కవిత స్రవంతిలో 'మధుర సంగీతాలేగానీ, ఎన్నడూ అపస్వరాలు వినపడవు.

నిజానికి వాల్మీకి రచనలో సామాజిక స్థితిగతులు చూడగల అవకాశాలెన్నో వున్నాయి. కానీ, విమర్శకులు కవిత్వం సొగసులు తప్ప, ఇక ఏ ఇతర కోణమూ చూడలేక పోవడానికి కారణం, కనీసపు సామాజిక స్పృహలేని జడత్వమే.

* * *

వాల్మీకి నాటి రామాయణానికీ — నేటి రామాయణానికీఏమిటి తేడా ?

ప్రక్షిప్తాలు లేని రామాయణానికీ-ప్రక్షిప్తాలు వున్న రామాయ

కానికీ, ఇంకా అనేక రకాల రామాయణాలకీ మూలకథలోగానీ, కథ స్వభావంలోగానీ ఏమైనా తేడా వుందా?

ప్రక్షిప్తాలు లేని రామాయణంలో కూడా రాముడికి రాజ్యార్హత లేదు. పనవాసం చెయ్యక తప్పదు. తండ్రినీ, పినతల్లిని, తిట్టుకుంటూనే కాలం గడుపుతాడు. సుగ్రీవుడితోటీ, విభీషణుడి తోటీ, రాజకీయపు పొత్తులతో స్నేహాలు చేస్తాడు. రావణుణ్ణి చంపి తిరిగి రాజ్యానికి వొస్తాడు.

ప్రక్షిప్తాలు వున్న రామాయణంలో కూడా ఇదే కథ, ప్రక్షిప్తాల వల్ల "మూలకథ" ఏమీ మారలేదు.

తలిమీదగాక తండ్రి మీదే ప్రత్యేక భక్తి, స్త్రీలు, పురుషుల ఆధీనంలో విధేయతగా జీవించడం, తన ప్రాణాలు కూడా భర్త హక్కేనని భార్య నమ్మడం, వర్ణ భేదాలలో శూద్రుల హీన్యం—ఈ సమాజ స్వభావం అంతా, ప్రక్షిప్తాలు వున్న రామాయణంలోనూ, లేని రామాయణంలోనూ వొకటే.

ఇప్పటి రామాయణంలోంచి ప్రక్షిప్తాల పేరుతో అంతా తీసేసి, పట్టుమని 10 శ్లోకాలే మిగిల్చినా ఆ 10 శ్లోకాల్లో కూడా ఇదే కథ, ఇదే స్వభావం.

ప్రక్షిప్తాలు వున్న రామాయణంలో దశరథుడు వొకరకంగానూ, లేని రామాయణంలో ఇంకోరకంగానూ వుండడు—" నరకానికే పోతాను గానీ, నా కొడుకుని అడవుల్లోకి పంపను. ఏడిసింది వెధవ సత్యవ్రతం—" అనడు.

అలాగే — రాముడు కూడా —" ఈ ముసిలాణి చావగొట్టి రాజ్యం లాక్కుంటాను."— అనడు. సీత కూడా— "ఎవడొస్తాడు అడవుల్లోకి? నే నసలే నడవలేను. నువ్వెళ్ళు నాథా!" అనదు.

ప్రక్షిప్తాలు ఎన్నిచేరినా కథ నడకగానీ, పాత్రల స్వభావాలుగానీ మారలేదు. ప్రక్షిప్తాలు లేని రామాయణం ఏ ధర్మాల ప్రకారం నడిచిందో, ప్రక్షిప్తాలు వున్న రామాయణం కూడా ఆ ధర్మాల ప్రకారమే నడిచింది. ప్రక్షిప్తాలు మూల కథకేమీ ద్రోహం చెయ్యలేదు. కొన్ని

కొన్ని సందర్భాలలో ప్రక్షిప్తాల వల్లనే అవకతవకలు వొచ్చాయి అనుకున్నప్పటికీ, అవి కథ కేమీహాని కలిగించవు.

రాముడు వనవాసానికి బయల్దేరేప్పటికి 17 సంవత్సరాల వయస్సుగలవాడని వాల్మీకి రాశాడనుకోండి. ఎక్కడో ఇంకో సందర్భంలో, "రాముడు వనవాసానికి బయల్దేరేటప్పటికి 25 సంవత్సరాల వయస్సుగలవాడని గిల్మీకి రాశాడనుకుందాం— ఇది అవకతవకే. అలా జరగకుండా వుంటే బాగానే వుండేది. ఆ కాలంలో ఎంతెంత వయసులో పెళ్ళిళ్లుచేసేవారో, ఎప్పుడు వుపనయనాలు చేసేవారో, వగైరా విషయాలుతెలిసేవి.

కానీ, ఆ విషయాలు సరిగ్గా తెలియనంత మాత్రానకథకు వొచ్చిపడ్డ నష్టమేమీలేదు.

రాముడి వయస్సు 17 గాక 20 అయితే, కథలో ఏమైనా తేడా వొస్తుందా? 25 అయితే తండ్రి ఆజ్ఞ చొప్పున గాక, తల్లి ఆజ్ఞ చొప్పున ప్రవర్తిస్తాడా? సీత వయస్సు 18 గాక 22 అయితే పాతివ్రత్యం మానుకుంటుందా? 23 అయితే మానుకుంటుందా?

పాత్రల స్వభావాలూ, వారు ఆచరించేధర్మాలూ, సమాజం నడకా ఈ వయస్సు లెక్కల మీద ఆధారపడి వుంటే వాటికోసం తలలుబాదుకోవచ్చు. రామాయణానికంతటికీ ఈ వయస్సు లెక్కలే కీలకమైన విషయాలన్నట్టు విమర్శకులందరూ రాముడి వయస్సు గురించీ సీత వయస్సు గురించీ (కృష్ణుడి గిరజాల గురించీ, అర్జునుడి మీసాల గురించీ) బ్రహ్మాండమైన చర్చలు చేస్తారు.

ప్రజల ఆలోచనా సరళిని పక్కదారులు పట్టించడానికి తప్ప కొన్ని కొన్ని విషయాలమీద చర్చలు ఎందుకూ పనికిరావు.

ప్రక్షిప్తాల కవులు కథలో కొత్త సంఘటనలు సృష్టించారేమోగానీ, కొత్త స్వభావాలు సృష్టించలేదు.—శంబుకుడు తపస్సు చేస్తోండగా రాముడు చంపేసే సంఘటన కొత్తదే. (ప్రక్షిప్తమే.) కానీ, దాని స్వభావం, వాల్మీకి సృష్టించిన సంఘటనల స్వభావానికివిరుద్ధమైంది కాదు. శూద్రుణ్ణి చంపిన దశరథుడికి, బ్రాహ్మణ్ణి చంపితే రావలసినంత పాపం రాలేదు. వర్ణాశ్రమ ధర్మాల ప్రకారం శూద్రుడు తపస్సు చెయ్యడానికి

అనర్హుడనే సంగతి వాల్మీకికి విరుద్ధం కాదు. ఎన్ని ప్రక్షిప్తాలు చేరినప్పటికీ వాటివల్ల వాల్మీకికి జరిగిన ద్రోహం ఏమీ లేదు.

* * *

ప్రక్షిప్తాలవీాద పాఠకులకు వున్న అనేక సందేహాలు దృష్టిలో పెట్టుకుని ఇంత రాయవలసి వొచ్చింది.

ప్రక్షిప్తాలు వున్న రామాయణం కన్నా, లేని రామాయణం ఏ విధంగానూ, ఏ కోణంలోనూ గొప్ప విలువలు కలది గాదు.

రామాయణంలో ప్రక్షిప్తాలు వున్నాయా ? లేవా? అనే విషయం మీాద మన దృష్టి వుంచనవసరం లేదు. వున్నా వొకటే. లేకపోయినా వొకటే.

మన దృష్టి ఎంతసేపూ 'సంస్కృతి' మీాద వుండాలి. ఆనాటి సంస్కృతి ఈనాడు ఎంతవరకూ మారింది? ఆనాటి ధర్మాలు ఈనాడు ఏ రూపాల్లో చెలామణీ అవుతున్నాయి ? ఆనాటి పాతివ్రత్యం ఈనాడు ఏ రూపంలో వుంది? ఆనాటి వర్ణభేధాలు ఈనాడు ఏ రూపంలోవున్నాయి? ఆనాటి "రాచరికం" ఈనాడు ఏ రూపంలో వుంది ? ఆనాటి యుద్ధాలు

ఈవాడు ఏ రూపంలో సాగుతువ్నాయి? —ఈ విష యాలలో రూపం మాత్రమే మారిందా ? 'గుణం' కూడా మారిందా? — ఏ విషయం ఎందుచేత మారింది? లేకపోతే ఎందుచేత మారలేదు?

రామాయణం ఈనాటి సమాజానికి చేసే మేలు ఎమైవా వుందా ? రామాయణంపంటి ఫ్యూడల్ సాహిత్య గ్రంథాల మీద మన దృక్పథం ఏలా వుండాలి? — ఈ రకం విషయాల మీదే ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలి.

పవిత్ర రామాయణం

(దీనికోసం .... వ్యక్తులెవర్నీ దృష్టిలో పెట్టుకోలేదు. విమర్శలు మాత్రమే దృష్టిలో పెట్టుకున్నాని పాఠకులు గ్రహించాలి.)

సుబ్బయ్య పంతులు ప్రక్షిప్తాలు లేని అసలైన పవిత్ర వాల్మీకి రామాయణం తయారు చెయ్యాలని ఆరు నెలలు అహోరాత్రులూ శ్రమ పడి చివరికి గత అర్ధరాత్రితో పని పూర్తి చేశాడు. ఆయనకిక తెల్ల వార్లూ నిద్ర పట్టలేదు. ఎవరికైనా చదివి వినిపించాలని వొకటే తొందరగా వుంది. ప్రక్షిప్తాలు లేని రామాయణాన్నే ప్రజల్లో ప్రచారం చెయ్యాలనీ, ప్రక్షిప్తాల మీద అందరికీ అయిష్టం కలిగించాలనీ సుబ్బయ్యకి చాలా కాలంనించీ కోరిక.

చీకట్నే చాకలి వెంకన్న బట్టల కొచ్చాడు. సుబ్బయ్య పంతులు తెల్లారుఝామునించీ పవిత్ర రామాయణం పారాయణం చేస్తూ పొంగి పోతున్నాడు. వెంకన్నని చూడగానే పుట్టెడు సంతోషంతో — "వొరే వెంకన్నా ! ఇలారా ! రామాయణం చదువుతాను. వింటావా ?" — అన్నాడు.

"ఆయ్ ! అంతకంటేనాయ్యా ! .... సదవండి." — అంటూ వెంకన్న కొంచెం దగ్గిరి కొచ్చాడు.

"ఏవన్నా తొందరపని వుందా ?"

"అబ్బే ! పనేవుంది లేండి .... సాకిరేవే ...." — అంటూ చతికిలబడ్డాడు వెంకన్న.

"సరేలే, తొందరగానే అయిపోతుందిలే,"

వెంకన్న తెల్లబోయాడు — రామాయణం తొందరగా అయిపోవడం ఏవిటని.

"మొదలు పెడుతున్నాను విను. — శ్రీరాముడికి పట్టాభిషేకం చెయ్యాలని దశరథ మహారాజు నిశ్చయించుకున్నాడు....."

వెంకన్న తెల్లబోతూ — "అదేంటయ్యా? రావయ్యింకా పుట్టందే! దశరథ మహారాజు యగ్నెయాగాలు సెయ్యాల. కవుసల్యా దేవి సీళ్ళాడాల. రవ్వలాడితో పాటు లచ్చనుడు .... భరతుడు ..... సెత్ ...."

"వారే! నేను చెప్పేది విను. అసలు మొట్టమొదట వాల్మీకి అనే ఆయన .... ఇలాగే రాశాడు. ఇక్కణ్ణించే మొదలుపెట్టాడు. ఆ మహానుభావుడు అంత గొప్పగా రాస్తే తర్వాత కవులు ఏం చేశారో తెలుసా? వాళ్ళ ఇష్టం వొచ్చినట్టు రాసేసి కలిపేశారు...."

"మంచి పనే గదండయ్యా! రవులోరు పుట్టడం పెరగటం అన్నీ రాసుకొచ్చారు ...."

"అబ్బే! అలా కాదురా! .... మన ఇష్టం వొచ్చినట్టు మనం రాస్తే మొదట రాసినాయనకి ద్రోహం చేసినట్టు కాదూ?"

"ఆయ్ బాబా! ఇందులో దోహవేటండీ? రాములోరు పుట్టకం డానే పట్టాబిసేకం అవ్వద్దా ఏటండీ? .... కథ సెప్పేవోరు నక్కగా పుట్టటం, పెరగటం అన్నీ సెప్పాలి గానీ ఎక్కడో మద్దినించి మొదలెట్టడం ఏంటండీ మిట్ట మద్దేన్నం సాకిరేవు మొదలెట్టినట్టు...."

సుబ్బయ్య పంతులు కొంచెం దిగులు పడ్డాడు. మొదట్లోనే ఇలా అయిందేవిటి? రాముడు పుట్టి తీరాలంటాడేవిటి వీడు? — దశరథుడి యజ్ఞం రాముడు పుట్టడం వుంచాలా ఏవిటి? — బాలకాండ వుంచక తప్పదా ఏవిటి?

ఛ! విడి మాటా లెక్కేనా?

"సదవండయ్యా! కూకున్నారేంటి?"

"చదువుతాను గానీ ...." — అని కొంచెం సందేహంగా మొదలెట్టాడు.

పట్టాభిషేకం ఆగిపోయి రాముడు వనవాసానికి వెళ్ళిపోయే వరకూ వొచ్చేసింది — కాస్సేపట్లోనే.

"అదేంటయ్యా? ... రాముల్లోరు ఆడేదో రాచ్చసిని .... అదేం టమ్మా .... పేర్లు మరిసిపోయి సత్తాను .... ఆ రాచ్చసిని చంపుతారు. ఫెడీలుమని ఇల్లు ఇరిత్తే, సీతమ్మ తల్లి సిగ్గు మొగ్గయిపోయి పూల దండ తెచ్చి ... ఆ పెళ్ళి సదవండయ్యా!"

"వాల్మీకి పెళ్ళి కూడా రాయలేదురా!"

"ఆఁ ... ఎందుకు రాయక్కుండి .... రాసే వుంటాడు .... ఆ కాయితా లెక్కడ పడేశారో సరిగ్గా ఎతకండయ్యా: అయ్యో దొరుకు తయ్యి."

"వొరే: అసలు ముందు నేను చదివినట్టు విను. ఈ సారెప్పు డన్నా, నీకు కావలసినట్టు చదివి వినిపిస్తాలే. ముందు ఇదివిను."

వెంకన్న అయిష్టంగానే వూరుకున్నాడు. సుబ్బయ్య మళ్ళీ ప్రారం భించాడు —

రాముడు చిత్రకూటంలో సుఖంగా వుంటున్నాడు. తండ్రిని పన్నెత్తు మాట అనలేదు. పినతల్లిని కూడా వొక్క తిట్టు తిట్టలేదు. భరతుడు వెళ్ళి పాదుకలు తీసుకొచ్చాడు .... రాముడు దండకారణ్యా లకు వెళ్ళిపోయాడు.

కథ లేడిమల్లే పెద్ద పెద్ద గంతులేసుకుంటూ వెళ్ళిపోతోంది. — విరాధుడు లేడు — కబంధుడు లేడు — జటాయువు లేడు.

పూర్వం విమర్శకులు నిర్ణయించిన ప్రక్షిప్తాలే గాక, సుబ్బయ్య పంతులు కూడా కొన్ని ప్రక్షిప్తాలు కనిపెట్టి తీసేశాడు.

"ఆ .... పొట్టలో మొక్కం వుంటది సూడండి .... నల్లగా .... కాటుకొండ లాగ .... సెట్టు కొమ్మలంతంత సేతుల్తో .... ఆడూ లేడా?"

"వాడు కబంధుడురా. అవన్నీ తర్వాత కవులు కల్పించి రాసేసి, వాల్మీకి పరువు పోగొట్టారు. పొట్టలో మొహం వుండడం ఏవిట్రా పిచ్చి సన్యాసివి గానీ ...."

"మాకేం తెలుసుద్దయ్యా, ... మీలాంటి పంతుల్లోర్లు సెపితేనే, నోర్లు తెరుసుకు ఇంటాం."

"అలా వినకూడదురా. నమ్మవొచ్చునో లేదో ఆలోచించాలి."

"వొకమాటు మా అప్పారావు కత సెప్పే పంతులుగోర్ని ఏం చేటో ప్రశ్న లడిగాడయ్యా! ఆలా ఆడగ్గూడదని కూకలేశారు పంతులు గోరు.

కలికాలం వొచ్చేసి రోజులు పాడై పోయినై గానీ, ఆ కాలంలో .... ఆ ఇసిత్రాలన్నీ అలాగే జరిగేయంట గదయ్యా?"

"అవన్నీ పిచ్చి మాటలురా. మీ లాంటి పామర జనం ఏం చెప్పినా నమ్మేస్తారు. ఆసలు వాల్మీకి మాత్రం నమ్మలేని అద్భుతాలేమీ రాయలేదనుకో."

"అద్భుతా లేంటయ్యా! రాములోరు రాచ్చసుల్ని సంపలేరా ఏంటి? .... నమ్మక పోటాని కేంటుంది లెండి."

సుబ్బయ్య పంతులికి ఆర్నెల్ల శ్రమా బూడిదలో పోసిన పన్నీరై పోయినట్టు తోచింది. పుట్టెడు దిగులు ముంచుకొచ్చింది.

— వీడికి కొంచెం జ్ఞానం వుంటే తను చేసిన పనిలో గొప్ప తనం ఏంటో తెలిసేది కదా — అని జ్ఞానం లేని వెంకన్న మీద చాలా కోపం వొచ్చింది.

— "వారే! మీకు బుర్ర లుండవురా! .... దేవుడు మెదడిస్తే మాత్రం ఏం లాభం? .. కాసయినా ఆలోచించరు. దశరథుడు వేల కొద్దీ సంవత్సరాలు బతికాడంటే నమ్ముతారు. హనుమంతుడికి తోక వుందంటే నమ్ముతారు. రావణుడికి పది తలలంటే నమ్ముతారు .... ఛీ! బుద్ధి వుండదురా మీకూ .. "

వెంకన్న కొంచెం చిన్న బుచ్చుకున్నాడు. సిగ్గుపడ్డాడు — కొంచెం వినయంగా — "మనకేం తెలుస్తదయ్యా! సదువుకున్నోళ్ళవా? సచ్చి నోళ్ళవా సెప్పండి? .... మీలాంటోరు సెపితేనే గదా ఇనేది? .... నా సిన్నప్పట్నించీ ఇంటన్నాను .... రాములోరు పుట్టటం ... పెరగటం

.... పెద్ద పెద్ద రాచ్చసుల్ని చంపటం ..... మీరు సెప్పే కదేటో ఇచిత్రంగా వుంది.

సుబ్బయ్యకి చాలా కఠినమైన ప్రశ్న ఎదురైంది. — అందరూ ఇలాగే అంటారా ఏవిటి? ఛ! ఇలా ఎందుకంటారూ? — ఈ పామర వెధవతో ఏవిటీ? — మూర్ఖుడు — పొట్ట చింపితే అక్షరం ముక్క లేదు — వీడు వొప్పుకుంటే ఎంత? — వొప్పుకోకపోతే ఎంత?

"అమ్మగారూ! బిట్ట లడెయ్యండీ. మడుసుకుంటాను." — అని కేకేసి లేస్తున్నాడు వెంకన్న.

సుబ్బయ్య కంగారు పడ్డాడు — "కూర్చోరా! కూర్చో. అంత తొందరేం? పనేం లేదన్నావుగా?"

."పనెందుకు లేదండయ్యా! .... అదొక్కటే సాకిరేవులో మిడుకుద్ది ...."

"సరేలేరా! వెళ్ళవుగానిలే. పుగాకు కాడ పట్టుకు పోదువుగానిలే. కాస్సేపు కూర్చో."

వెంకన్న మొహం చేటంత చేసుకుని కూర్చున్నాడు.

సుబ్బయ్య పంతులు మనస్సు చివుక్కుమంది. పవిత్ర రామాయణం వినిపించడానికి లంచా లివ్వవలసిందేనా ఏవిటి?

"ఎందాకా వొచ్చాం? .... 'ఆఁ .... శ్రీరాముడు ఆ విధంగా బాధలు పడుతున్నాడు గదూ? అప్పుడు శూర్పణఖ వొచ్చింది. ..... రాముడు దాన్ని దండించి పంపించాడు...."

"అంటే ముక్కూ సెవులూ కోసెయ్యమన్నాడు. అంతే గదయ్యా? ...." — అది కూడా మారిందేమోనని వెంకన్న సందేహంగా చూశాడు.

సుబ్బయ్య పంతులు కొంచెం ఇబ్బందిలో పడ్డాడు. శ్రీరాముడికి — అపకీర్తి కలిగించే ఘట్టాలు కొన్నిటిని, కొందరు కవులు చక్కగా మార్చుచేశారు కదా అని తను శూర్పణఖ ఘట్టం కూడా మార్చాలని తీవ్రంగా ఆలోచించి చూశాడు — శ్రీరాముడు దయామయుడు. స్త్రీని అంత బాధ పెడతాడా? వాల్మీకి అలా రాసి వుంటాడా? — అబ్బే!

రాసి వుండడు. అది తప్పకుండా ప్రక్షిప్తమే —" — అని నిశ్చయించుకుని —

"రాముడు శూర్పణఖని దండించి విడిచిపెట్టాడు." — అని మాత్రం రాసి వూరుకున్నాడు. తన గడుసనానికి తనే మురిసిపోయాడు.

"రాములోరు ఇక్కడే కసింత తప్పు చేశాడయ్యా! .... రొండు తన్ని పంపి తే సరిపోయే దానికి .... ముక్కూ చెవులూ కోసేసి, అందం చెడగొట్టెయ్యమని లచ్చనా సామికి ఆగ్గినాపించేశాడు. ఎంతైనా ఆడకూతురు గదా ?"

"వొరే! అసలు వాల్మీకి అలా రాయలేదురా ?"

"ఆయ్!"

"తర్వాత రాసిన వాళ్ళు ఎన్నెన్ని కల్పించా రనుకున్నావూ?"

"ఆయ్ ?"

"శ్రీరాముడు అంత కరోకటకమైన పని చేయిస్తాడంటే నువ్వు నమ్ముతావురా ?"

"ఆయ్! .... ఏం చెపుతాం లెండి. ఎంత తెలిసినోరైనా వొక్కోసారి తప్పులు చేత్తారు .... మరిగంటే...."

"ఏవిటో అడుగు, సందేహించకు."

"పుగాకాకూడ పడేత్తే ఎల్తాను. ఇంకా శానా ...."

సుబ్బయ్య తొణకకుండా గాంభీర్యం వహించి — "ఓరి నీ ఇలు దొంగల్లోలా! ఒకటే కంగారా? ఎప్పుడీ సాకిరేవేనా? ... పుణ్యం పురుషార్థం వొద్దురా?"

"మాకెట్టా కుదురుద్దయ్యా? రెకాకూడితేగానీ దొకాకూడ నోళ్ళం ...."

"దొంగ వెధవల్లా మీరూ! కాస్సేపు కూర్చుని శ్రీరామకథ వింటే నీ సొమ్మేం పోతుంది? సాకిరేవులో నీ పెళ్ళాం వుండనే వుందిగా?"

"రేత్తిర్నించీ దానికి నడుం నొప్పయ్యా! ముక్కుతూ, మూలుగుతూ ఎల్లింది. పంతులోరి గుడ్డలు తెత్తానని నెప్పొచ్చాను."

"సరే : పోదువుగానిలే. ఇంకొక్క అరగంట కూర్చో....అయి పోతుందిలే. గబగబా చదివేస్తాను....ఆఁ.... ఎందాకా వొచ్చాం ? .... శూర్పణఖ సంగతి కాదూ ? — అది కుయ్యో, మొర్రో అని ఏడుస్తూ వెళ్ళి అన్నగారితో చెప్పుకుని ఏడ్చింది. రావణుడు చాలా కోపం వొచ్చి దండకారణ్యానికి వచ్చాడు. రాముడి ఆశ్రమం దగ్గిరే చెట్లలో దాక్కున్నాడు. రాముడూ, లక్ష్మణుడూ ఎప్పుడు బయటికి పోతారో అని కని పెట్టుకూర్చున్నాడు ...."

వెంకన్న ఆశ్చర్యంగా — "ఏంటీ ? బంగారు లేడి కూడా లేదేంటి ?" అన్నాడు.

లేదని చెప్పడానికి సుబ్బయ్యకి ధైర్యం చాలలేదు—"వొరే...."

"సాలెండి .... మా బాగా రాశాడు వోల్మీకి. చెప్పుకుంటే సిగ్గు .... ఆ లేడిమీద ఎంత ముద్దు ముద్దుగా తిరుగుద్ది ! .... సీతమ్మతల్లి దాని టక్కులు చూసి నమ్మేసి .... దాన్ని తెచ్చిపెట్టమని కోరుద్ది. అప్పుడు కదా రాములోరు బయటికి పోయేది ...."

"లేకపోతే బయటికి వెళ్ళడా ఏవిట్రా ? రోజూ వేటకి వెళ్ళడూ ?"

"ఎ లే మాత్తరం ? మారీసుడు లేకపోతే .... అంత గోరం జరుగుద్దేంటి ?"

"నువ్వన్నదీ బాగానే వుంది. నే నెందుకు కాదనాలి గానీ .... ముందు ఇది విను. తర్వాత రాస్తానుగానీ ...."

"ఏంటీ ? మళ్ళీ రాత్తారా ? ఇంతకు ముందు వున్నయ్యేగా ?...."

"ఇంతకుముందు వున్నవన్నీ వాల్మీకి రాయలేదన్నానుగా ? .... అందుకే నీ అభిప్రాయా లేమిటో తెలుసుకుని ...."

"నా అభిప్రేయాలేంటయ్యా ? అందరి అభిప్రేయాలూ అయ్యే. వోల్మీకి అభిప్రేయాలే తలతిక్కగా వున్నయ్యి."

సుబ్బయ్యకి కోపమూ, దుఃఖమూ ముంచుకొచ్చాయి. ఎన్నడూ వూహించని వుపద్రవం ఏదో మీద కురికినట్టు నిర్ఘాంతపోతున్నాడు. రేప టినించీ ఈ పవిత్ర రామాయణం వినిపిస్తే ప్రతివొక్కరూ ఇలాగే అంటా

రే మో ! ఇంకా తను అప్పో సప్పో చేసి అచ్చుకూడా వేయించాలను కుంటున్నాడు.

వెంకన్న లేచి వసారాలో బట్టలు మడుచుకుంటున్నాడు.

సుబ్బయ్య పంతులు వ్రాత ప్రతి చేత్తో పట్టుకుని వసారాలోకి వెళ్లాడు.

వెంకన్నకి వుత్సాహం వొస్తుందేమోనని హనుమంతుడు లంకకి బయల్దేరే ఘట్టంనించి ప్రారంభించాడు.

వెంకన్న నిజంగానే సంతోషిస్తూ చతికిలబడి కూర్చున్నాడు.

హనుమంతుడు సీతతో మాట్లాడి, శెలవు తీసుకుని బుద్ధిగా నము ద్రం దాటి వొచ్చేశాడు.

వెంకన్న అదిరిపోయాడు. — "మరి లంకా దహనవో ?"

"నువ్వు అడుగుతావని నాకు తెలుసురా...." — కొంచెం ధైర్యం తెచ్చుకుని నవ్వాడు సుబ్బయ్య.

"ఏంటీ ? లంకాదహనంకూడా లేనట్టే ? ఏం వోల్మీకి దొరికా డయ్యా ? ఎక్కడెట్టా రాసుకోవాలో బొత్తిగా తెలవదన్నమాట. మా అప్పిగాడు వుత్తరంముక్క రాత్తేనే, ఆ ముక్కా ఈ ముక్కా కాయించి సక్కగా రాత్తాడే ! .... రాములోరి కతంటే ఎంతందంగా రాయాల !" — వెంకన్నకి బాగా కోపం వచ్చేసింది. మూట బిగించి కట్టేశాడు.

"వారే ! వెంకన్నా ! రామకథ వింటూ వింటూ వొదిలేసిపోతే .... హనుమంతుడు నిన్ను దండిస్తాడు సుమా !...."

వెంకన్న నిజంగానే కొంచెం భయపడ్డాడు — "అదికాదయ్యా ! .... అప్పుడే బారిడు పొద్దెక్కిపోయింది. తర్వా తెప్పుడన్నా ఇంటా నయ్యా ! .... అమ్మ తోడు ...."

సుబ్బయ్య పంతులికి చాలా సిగ్గేసింది. "ఛ ! వీణ్ణో నిర్బంధించి వినిపించడం ఏవిటి ? ఇష్టమైతేనే వింటాడు .... లేకపోతే .... పోతాడు — "సరే ! పోరా వెధవా ! పో ! నీకీ విషయాలన్నీ అర్థంకావులే. పో."

వెంకన్నకి హనుమంతుడి భయం వొదల్లేదు. — "కాసేపు కూకుంటాగానీ, కుసిలవుల కత నెప్పండయ్యా ; ఇనేసి పోతాను."

సుబ్బయ్య మండిపడ్డాడు — "ఫొమ్మంటే నీక్కాదూ ? ఫో ; ఆ పనేదో చేసుకో."

"కుసిలవులుకూడా లేరేంటయ్యా ? మా గొప్ప వోల్మీకి దొరికాడు. సదువుకోలేదేటయ్యా ? .. సదువుకోకపోతే ఎలా రాత్తాళ్ళే.... మరదేం ఎవ్వారం ? నాలాంటి ఎర్రిముండాకొడుక్కే తెలుత్తాదే మంచీ సెడ్డా. — సదువుకున్నోడికంటే సాకలోడు మేలంటారు. అందుకే గావాలు .... నాకు సెపితే సెప్పారుగానీ ఇంకెక్కడా అనకండయ్యా ; .... సాలుగానీ ...." — వెంకన్న గుండిగంత మూట భుజాన్నేసుకుని ఇల్లు దాటాడు.

సుబ్బయ్య పంతులు ఏడతెరిపిలేని ఆలోచనల్లో మునిగిపోయాడు — పోనీ మరీ అవసరం అయితే వొకటి రెండు ప్రక్షిప్తాలు వుంచవచ్చు అనుకున్నాడుగానీ, ప్రతిదీ కావాలంటే ఎలా కుదురుతుందీ ? — ఇక రామాయణంలో పవిత్ర తెక్కడుంటుందీ ? — అయినా ఈ వెర్రిముండాకొడుకుతో ఏవిటి ? చదువా ? చట్టుబండలా ? .... పదిమంది పండితుల్ని కూడగట్టి వినిపిస్తే, సెభాషనరూ ? — అన్నట్టు ఆదిశేషయ్యగారికి ఇప్పుడే చదివి వినిపిస్తాను. ఆయన గొప్ప జ్ఞాని. శాంత పురుషుడు .... పొద్దున్నే .... ఈ వెర్రి వెధవని పట్టుకున్నానుగానీ ....

సుబ్బయ్య పంతులు ఒక్క క్షణంకూడా ఆలశ్యం చెయ్యకుండా పవిత్ర రామాయణం చంకన పెట్టుకుని ఆదిశేషయ్య ఇంటికి బయల్దేరాడు.

ఆదిశేషయ్య గాంధేయవాది. ఎన్నోసార్లు జైయిలుకి వెళ్ళాడు.

సుబ్బయ్య పంతులు వెళ్ళేసరికి ఆదిశేషయ్య అప్పుడే పూజ ముగించుకుని చిద్విలాసంగా బుద్ధుడు బోధివృక్షం కింద కూర్చున్నట్టు, ఖద్దరు మడత కుర్చీలో కూర్చుని పేపరు చూస్తూ వున్నాడు. —

"రండి. రండి. సుబ్బయ్యగారూ ;" — అంటూ సుబ్బయ్యని పరమానందంతో ఆహ్వానించాడు.

సుబ్బయ్య బొంగిపోతూ— "అయ్యా ! .... తమకేపీ కొండర షని లేదుగదా ?" — అని వినయంగా అడిగాడు.

"లేదులెండి .... కైలపీయండి."

"తమతో కొంచెం పనిపడి వొచ్చాను .... రాత్రే పవిత్ర రామా యణం పూర్తి చేశాను. తమరికి చదివి వినిపించుదామనీ ...."

"ఎంతమాట ! తప్పకుండా వింటాను. కూర్చోండి... ప్రక్షిప్తాలు ఏమిటేమిటి తీసి వేశారు ?"

సుబ్బయ్య కొంచెం గడుసనంగా, ముందే చెప్పడం ఎందుకులెమ్మని — "చాలా ప్రక్షిప్తాలు పోయిందిలెండి వాల్మీకి పరువు తియ్యడానికి గాకపోతే ప్రతీ వొక్కడూ రామాయణంలో వేలు పెట్టడమేనా ?— అసలు నాలుగింట మూడు వంతులు ప్రక్షిప్తమే గదండీ."

"అలాగా ? మంచిపని చేశారు .... దాహం పుచ్చుకుని ప్రారంభించ వచ్చును. ముందు ఒక్కసారి "రామరాజ్యం" ఘట్టం చదవండి. తర్వాత అంతా మొదటినుంచీ వింటాను."

సుబ్బయ్య గుండెల్లో పిడుగుపడింది "అయ్యా ! ఉత్తరకాండ అంతా ప్రక్షిప్తమే గదండీ...."

"అంతానా ?...."

"అయ్యా ! .... అంతా ప్రక్షిప్తమేనండీ ! ప్రక్షిప్తాలేవీ లేందులో ...."

"రామరాజ్యం కూడా తీసేశారా ఏవిటీ ?"

సుబ్బయ్య పంతులు భయంభయంగా నవ్వుతూ — "తీసెయ్యక తప్పుతుందాండీ ?...."

"ఏవిటీ ? రామరాజ్యం తీసెయ్యడవే ?"

సుబ్బయ్య గుటకలు మింగుతున్నాడు.

ఆదిశేషయ్య చాలా ఆవేశపడుతున్నాడు.

"గాంధీగారు బోధించిందంతా ఏవిటంటారూ ? భారతదేశంలో రామరాజ్యం స్థాపించాలనికాదూ ? .... మీ రిప్పుడు రామరాజ్యమే ప్రక్షిప్తం పొమ్మంటే ...."

"మన్నించాలి. అది ప్రక్షిప్తమే సుమండీ! ఈమాట నే నొక్కణ్ణే అంటున్నది కాదు. పండితులందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు...."

"అయితే మాత్రం? దానివల్ల రామకథ కేమి నష్టం జరిగింది? రామరాజ్యం లేకపోతే అసలు రామాయణం పవిత్రం ఎలా అవుతుం దండీ? రాముడు రాజ్యం చెయ్యాడంకూడా రాయకపోవడం ఏమిటి వాల్మీకి? — ఈ విషయంలో మాత్రం నేను వాల్మీకిని క్షమించను సుమండీ!"

"తమరు .... కొంచెం .... శాంతంగా వించే..." సుబ్బయ్య ఒక్కసారి అటూ ఇటూ చూసి కొంచెం కంఠం తగ్గించి — "మనలో మన మాట. పైకి అనుకోకూడదు గానీ .... రామరాజ్యంలో ఏమంత గొప్పతనం లేదు సుమండీ! .... అది లేకపోవడమే రాముడి కీర్తికి .... మిక్కిలి ...."

"ఏవిటీ? రామరాజ్యంలో గొప్పతనం లేదా? కుక్కకి కూడా న్యాయం జరిగే విధంగా రాజ్యం పాలించిన ...."

"అయ్యో! కుక్క సంగతీ, నక్క సంగతీ అసలు కథలో లేనే లేదండీ!"....

"పోనీ లేకపోతే మీరు పెట్టండి .... కుక్కకి కూడా న్యాయం చేశాడంటే రాముడి కెంత కీర్తి!"

సుబ్బయ్య పంతులికి కొంచెం కోపం వొచ్చింది.— మహారాజుతో చెపితే మరి రెండు తన్నమన్నాడట. — అలావుంది. ఇంకా ప్రక్షిప్తాలు తెచ్చిపెట్ట మంటున్నా డీయన.

"అసలు రామరాజ్యమే ప్రక్షిప్తం అయితే, ఆ ప్రక్షిప్తంలోకూడా ప్రక్షిప్తం పెట్టనా?"

"మీరు ఎన్ని చెప్పినా సరే! .... రామరాజ్యం మాత్రం వుంచి తీరవలసిందె."

"మీరు రామరాజ్యం వుంచమంటే, ఇంకోరు ఇంకోటి వుంచ మంటారు. చివరికి అన్నీ వుంచవలసి వొస్తుంది."

"వుంచితే వుంచండి. ఏం ముంచుకు పోయింది?" — అంటూ ఖద్దరు కుర్చీలోంచి లేచాడు ఆదిశేషయ్య.

సుబ్బయ్య పంతులు కుప్ప కూలిపోయాడు —"అయ్యా! అన్నీ తెలిసిన వారు మిరే ఇలాగంటే...."

ఆదిశేషయ్య ఇంకేం వినిపించుకోలేదు. ఖద్దరు బట్టలు వేసుకుంటూ — "అమ్మాయ్! రామరాజ్యలక్ష్మీ! సుబ్బయ్య పంతులుగారికి కొంచెం మజ్జిగ పట్టుకురామ్మా!" — అని ఓ గావు కేక పెట్టాడు.

సుబ్బయ్య పంతులు నిరుత్సాహం నదిలో మునిగిపోయాడు.

"అయ్యా: మరొక్కసారి రెప్పుడైనా వింటాను. ఇప్పుడు కుదరదు.... ఆ రామరాజ్యం చేర్చి పట్టుకు వోస్తిరా...."

"మన్నించండి .... నేనా పని మాత్రం చెయ్యను. వాల్మీకి కెన్నడూ ద్రోహం చెయ్యను."

"అందుకని రాముడికి ద్రోహం చేస్తారా? రాముడి మొహం చూస్తారా, వాల్మీకి మొహం చూస్తారా?...."

సుబ్బయ్య పంతులు మారు మాట్లాడకుండా, మజ్జిగ తెచ్చిన రామరాజ్యలక్ష్మి మొహం చూడకుండా బయట పడ్డాడు.

వీధినా పడి నడుస్తున్నాడు. ఎండ నడినెత్తి కొచ్చింది.

రాముడి మీద పాటలేవో చెవిన బడితే హఠాత్తుగా ఆగాడు. అక్కడేదో కథా కాలక్షేపం జరుగుతోంది. జనం బాగానే వున్నారు. తన్మయత్వంతో వింటున్నారు. ఓ మూల చాకలి వెంకన్న కూడా ...!

సుబ్బయ్య పంతులికి వొళ్ళు మండిపోయింది. దొంగ పీనుగు.... చాకిరేవు .... చాకిరేవు .... అనీ .... "వారే! మూట రోడ్డుమీద పారేసి నువ్విక్కడ కూర్చున్నావా?" —

"ఏం భయం లేదయ్యా! ఆంజనేయుడే కాపలా కాత్తాడు మూటకి."

"ఇంకా నయం. వుతికి పెడతా దన్నావు కాదు. మిట్ట మధ్యాన్నం అయితే ఇంకెప్పుడెళ్తావు చాకిరేవుకి? సాయంత్రానికి దుప్పట్లన్నీ కావాలి, తెలుసా?"

"ఏంటో.... పొద్దే మరిసి పోయాను. ఎంతసేపు లెండి : సిటికిలో తెచ్చేత్తాను గానీ .... ఏం ముచ్చటగా సెపుతున్నాడయ్యా : .... వోల్మీకి ఇంటేనా ; కతయ్యేదాకా కదుల్తాడేంటి ; రాసినో డెవడో మా బాగా రాశాడని తెగ మెచ్చుకుంటాడు ..." — అని వెంకన్న, కథ వినే తొందరలో — "....సందేలకి గుడ్డలన్నీ తెచ్చేత్తాను గానీ .... మీరెల్లండి...." — అని విసుక్కుని మొహం తిప్పేశాడు.

పవిత్ర రామాయణం సుబ్బయ్య పంతులు .... చంకలో .... చెమటలో ....

• • •

ఇప్పుడు విషవృక్షం మీదకి వొక ప్రశ్న పెద్దపులి మల్లే వురుకుతుంది.

"రామాయణంలో కొన్ని ఘట్టాలు తీసేస్తేనే వొప్పుకోని ప్రజలు దాన్ని విషవృక్షం చేస్తే ఎలా వొప్పుకుంటారు;" — అనే ప్రశ్న.

కానీ, ఈ రెండు పనుల స్వభావమూ వొకటి కాదు.

ప్రక్షిప్తాల వాదం చేసేదేమిటంటే — ప్రజలకు తెలిసిన కథలోంచి అనేక విషయాలు మాయం చేసి, ప్రజల జ్ఞాపకాలు తుడిచెయ్యాలని చూస్తుంది. ప్రజలందరూ పిచ్చి వాళ్ళయితే తప్ప అది — సాధ్యం కాదు. ఈ మార్పు వల్ల ప్రజల ఆనందం కొరవవడమే గానీ, వారికి కొత్తగా కలిగే లాభమేమీ లేదు. ప్రక్షిప్తాలు లేని రామాయణం వల్ల వారికి కొత్తగా ఏ ప్రయోజనమూ లేనప్పుడు, పాత ఆనందాన్ని కూడా వొదులుకునే నష్ట పోవలసిన అవసరం కనపడదు.

విషవృక్షం చేసే పని అది కాదు.

ప్రజల అభిప్రాయాల్ని తిరస్కరించడం గానీ, వారికి తెలిసిన విషయాలు మాయం చెయ్యడం గానీ చెయ్యదు.

రామాయణం మీద ప్రజలకు వున్న అభిప్రాయాలు మార్చవలసి వొచ్చినా, వాటి స్థానంలో అంతకన్నా ప్రయోజనకరమైన అభిప్రాయాలు కలిగించే ప్రయత్నం చేస్తుంది.

అసలు రామాయణాన్ని విషవృక్షంగా ఎవరో ప్రత్యేకంగా ప్రయత్నించి చెయ్యడం లేదు. దానిలో వున్న "విషయాలే" దాన్ని విష వృక్షంగా చేస్తున్నాయి. సమాజంలో మానవుల్ని, అనేక అసమానతలతో చూపేదాని "పక్షపాత ధోరణే" దాన్ని విషవృక్షంగా చేస్తోంది.

రామాయణానికి "కల్పవృక్షం" అనో "అమృతభాండం" అనో గొప్ప పేరు పెట్టినంత మాత్రాన దాని స్వభావం మారదు. అది ఈనాటి సమాజానికి విషవృక్షమే.

ఈ విషయాలే ప్రజల ముందు పెడుతుంది "విషవృక్షం." — రామాయణం మీద ప్రజలకు వున్న భావాలు తారుమారు చేసుకోవలసి రావడం వారికి చాలా కష్టంగానే తోచినప్పటికీ, ఈ కొత్త భావాలు వారి మేలునే, వారి ప్రయోజనాలనే ఆశిస్తాయి గాబట్టి, ప్రజలు విష వృక్షాన్ని తిరస్కరించరు.

రామాయణం సాహిత్యం కాదా?

"విషవృక్షం" మొదటి భాగాన్ని సమీక్ష చేస్తూ (27-12-74 తేదీ ఆంధ్రజ్యోతి వారపత్రికలో) కొడవటిగంటి కుటుంబరావుగారు — "…. సోషల్ ఆంత్రోపాలజీ అధ్యయనం చెయ్యడానికి రామాయణం (వాల్మీకి పేర ప్రచారంలో వున్నది) సరి అయిన గ్రంథం కాదు."

"….సాహిత్యంగానే కాదు. అది సమాజ శాస్త్ర పరిశీలనకుకూడా పనికిరాని గ్రంథమని నా వుద్దేశం" — అన్నారు.

దానికి ఆయన 3 కారణాలు చెప్పారు.

1 — అందులో చాలా ప్రక్షిప్తాలున్నాయి.

2 — ప్రక్షిప్తాల కారణంగా నైతేనేం, మూల రచనలో అవకతవకలవల్లనైతేనేం అనేక సందర్భాలలో ఒకదాని కొకటి అతకవు.

3 — రామాయణంలో పాత్రపోషణ ఏమీ బాగాలేదు. — ఇవీ ఆ కారణాలు.

ఈ సమీక్షమీద నేను చాలా విషయాలలో వ్యతిరేకించి ఒక సమాధానం రాశాను (24-1-75).

దానికి కుటుంబరావుగారు (31-1-75) తిరిగి సమాధానం రాస్తూ — "రామాయణం సమాజ పరిణామాన్ని విశ్లేషించడానికి పనికిరాదనే నేను ఇప్పటికీ అభిప్రాయ పడుతున్నాను" — అన్నారు.

"రామాయణం సాహిత్యంగానే కాదు. సమాజ శాస్త్ర పరిశీలనకు కూడా పనికిరాదు" — అనడంలో — రామాయణం సాహిత్యంకాదు.

పోసీ, కొన్ని పుస్తకాలు సాహిత్యం కాకపోయినా, సమాజ పరిశీలనకైనా పనికివొస్తాయి. ఇది అందుకూ పనికిరాదు" అని అర్థం.

దీనివల్ల 2 ప్రశ్నలు వొస్తాయి.

1 — రామాయణం సాహిత్యం కాదా ?

2 — రామాయణం సమాజ పరిశీలనకు పనికిరాదా ?

అసలు సమాజ పరిశీలన అంటే యేమిటి ?

క్లుప్తంగా చెప్పాలంటే ఒక సమాజం తాలూకు ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులో పరిశీలించడమే.

ఆర్థిక విధానాలూ, ఆ సమానతలూ, పరిపాలనా పద్ధతులూ, కుటుంబ వ్యవస్థా, వివాహ వ్యవస్థా, వ్యభిచారం, భిక్షుకవృత్తీ, నేరాలూ పెదరికం, ఆచారాలూ, చట్టాలూ, నీతులూ, వాటి వరసలూ, సంస్కృతీ, ప్రత్యేక తెగల ఆచార వ్యవహారాలూ — ఈ రకంగా ఏ విషయం తీసుకున్నా అది ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితుల్లో దేనికో ఒక దానికి చెంది వుంటుంది.

ఒక ఆటవిక తెగలోగానీ, ఒక నాగరిక జాతిలోగానీ, "వివాహ పద్ధతి" అనే ఒక్క అంశాన్నే తీసుకు పరిశీలించినా అది సమాజ పరిశీలనలో భాగమే. కానీ, అదే సమాజానికి సంబంధించిన మొత్తం పరిశీలన కాదు.

అయితే ఈ సమాజ పరిశీలన అనేదాన్ని పరిశీలకులందరూ వొకే విధంగా చెయ్యరు.

ఒక సమాజాన్ని మొత్తంగాగానీ, అందులో ఒక ప్రత్యేక విషయాన్నిగానీ పరిశీలించడంలో మార్క్సిస్టు దృక్పథం వేరూ, (మార్క్సిస్టు కాని (నాన్ మార్క్సిస్టు) పరిశీలకుల దృక్పథం వేరూ.

ముష్టితనాన్నిగానీ, కటిక సమస్యనిగానీ, ఇంకో విషయాన్ని గానీ పరిశీలించేప్పుడు, నాన్ మార్క్సిస్టులు ఆ ఒక్క విషయాన్ని మాత్రమే పరిశీలిస్తారు.

మార్క్సిస్టులు అలా చెయ్యరు. సమాజంలో ఏ విషయాన్నీ సమాజంనించి విడదీసి పరిశీలించరు. ఏదో ఒక విషయాన్ని మాత్రమే పరిశీలించవలసి వొచ్చినప్పుడుకూడా, ఆ విషయానికీ, సమాజంలో ఇతర విషయాలకీ తప్పనిసరి సంబంధం వుంటుందనే సిద్ధాంతంతో పరిశీలిస్తారు.

మొత్తంగా ఒక సమాజాన్ని పరిశీలించినా, అందులో ఒక విషయాన్నే పరిశీలించినా — ఆ సమాజంలో వుత్పత్తి విధానం, వుత్పత్తి సంబంధాలూ ముఖ్య విషయంగా చూస్తారు. అదే సమాజానికి ఆర్థిక పునాది. ఆ సమాజంలో వున్న రాజకీయ, సాంఘిక విషయాలన్నీ ఈ ఆర్థిక పునాదికి అనుకూలంగా వుండేవే.

ఉత్పత్తి సంబంధాల్నిబట్టే వర్గాలూ, వర్గ వైరుధ్యాలూ ఏర్పడతాయి. ఆ వైరుధ్యాల తీవ్రతనిబట్టీ వర్గ పోరాటాలు జరుగుతాయి.

సామాజిక సంఘటనల్లో కనపడే వ్యక్తులు వర్గాలకు ప్రతినిధులుగా వున్నవారే.

ఒక సమాజంగానీ, ఒక దశగానీ, ఎప్పుడూ పరిణామం చెందుతూ ఇంకా అభివృద్ధివేపు, పునాదినుంచీ జరిగే మార్పువేపు (విప్లవాత్మకమైన మార్పు వేపు) సాగుతూ ఉంటుంది.)

ఈ సిద్ధాంతాన్ని ఆధారం చేసుకునే మార్క్సిస్టులు, ఒక సమాజంలో ఆర్థిక అసమానతలూ, పరిపాలనా విధానాలూ, సాంఘిక భేదాలూ, కళలూ, సంస్కృతీ — వంటి విషయాలన్నీ పరిశీలిస్తారు — చరిత్రని దాని భౌతిక పరిస్థితులద్వారా చూడడమే మార్క్సిస్టులు చేసే సమాజ పరిశీలన. (మార్క్సిస్టు ఆచరించే శాస్త్రీయ సిద్ధాంతం చారిత్రక భౌతిక వాదం.)

అయితే రామాయణంలో ఈ కోణాలన్నీ పరిశీలించడానికి వీలుందా? ఆనాటి వుత్పత్తి విధానం ఏమిటో, వుత్పత్తి సంబంధాలెలా వున్నాయో, భూస్వామికీ ప్రభువులకూ, రైతులకూ మధ్య సంబంధాలూ, వైరుధ్యాలూ ఏ స్థితిలో వున్నాయో తెలుస్తుందా? — అనే ప్రశ్న వొస్తుంది.

రామాయణంలో ఆనాటి వుత్పత్తి సంబంధాలెలా వున్నాయో తెలియవు. కానీ, వాటిని ప్రతిబింబించే సమాజ జీవితం కావలసినంత వుంది. ఆ సమాజ జీవితంద్వారా, అది వర్గ భేదాలుగల సమాజం అనే విషయం చాలా స్పష్టంగా అర్థంచేసుకోవచ్చు.

మానవ చరిత్రలో ఒక దశ గురించిగానీ, ఒక యుగం (epoch – ఎపోక్) గురించిగానీ పరిశీలించేప్పుడు దాని ప్రారంభం, అభివృద్ధి, దానికి సంబంధించిన సామాజిక పరిస్థితులు అన్నీ చూడవలసి వుంటుంది గానీ, ఏదో వొక "రచన" గురించో, వొక "రచయిత" గురించో మాత్రమే పరిశీలించేప్పుడు, ఆ సమాజంలో అప్పుడు వున్న ఆర్థిక పరిస్థితులన్నీ (ఉత్పత్తి సంబంధాలన్నీ) చెప్పి తీరవలసిన అవసరంలేదు. (చెప్పడానికి వీలుంటే చాలా మంచిదే కానీ, సాధారణంగా అలాంటి వీలు వుండదు.) — ఎందుకంటే కళలు ఎప్పుడూ సమాజంమీద పైఅంతస్తుల్ని (సంస్కృతిని) మాత్రమే చూపిస్తాయి. సమాజానికి సంబంధించిన ఆర్థిక పునాదిని తాకవు. పునాదితో సంబంధం లేకుండా వుంటాయని అర్థంకాదు. పునాదితో సంబంధంగల సంస్కృతినే చూపిస్తాయి. కానీ, ఆర్థిక పునాదితో డైరెక్టుగా సంబంధం కలిగి వుండడం చాలా తక్కువమేర వరకే జరుగుతుంది.

అంటే వొక రచనలో ఆనాటి సమాజానికి సంబంధించిన వుత్పత్తి సంబంధాలు వాటికవే ప్రత్యక్షంగా కనపడవు. రచనలో కథ ద్వారా, పాత్రల స్వభావాల ద్వారా, వారి చేష్టలద్వారా, సంభాషణద్వారా ఇంకా అనేకమైన ఇతర విషయాల ద్వారా (ఇంటర్ మీడియట్ లింకుల ద్వారా) ఆనాటి సమాజానికి సంబంధించిన ఆర్థిక విషయాలు పరోక్షంగా కనపడుతూ వుంటాయి. రచనలో వాటి ఫలితాలనే, ప్రభావాన్నే చూడగలుగుతాము. *

---

* రష్యన్ మార్క్సిస్టూ, గొప్ప సాహిత్య విమర్శకుడూఅయిన లునచర్‌స్కీ మాటల్లో —

(తరువాయి 101 వ పేజీలో)

అలాగే రామాయణంలో కూడా వుత్పత్తి సంబంధాలే స్థితిలో వున్నాయో ఎక్కడా కనపడదు రామాయణం కథ దాసి అర్థిక పునాదిని చూపించను. కానీ, కథలో అనేక పాత్రల స్వభావాల్ని బట్టీ, సంభాషణల్ని బట్టీ, వర్ణనల్ని బట్టీ, నీతుల్ని బట్టీ, ఆనాటి సమాజంలో (ఆ కథ ప్రతిబింబించే సమాజంలో) వర్గభేదాలున్నాయనీ, వొక వర్గం ఇంకో వర్గం మీద అన్నివిధాలా పెత్తనం చేస్తోందనీ, రామాయణంలో కనపడే సంస్కృతి, పెత్తనం చేసే వర్గానికి మాత్రమే అనుకూలంగా వున్న సంస్కృతనీ చాలా స్పష్టంగా అర్థం అవుతుంది.

అందుచేత మార్క్సిస్టు విమర్శకులు, వొక రచనని — (అది ఎంత ప్రాచీనమైంది అయినా, ఎంత ఆధునికమైంది అయినా) — పరిశీలించేప్పుడు ముందు అందులో విషయం (కన్‌టెంట్) చూడాలి. అది సమాజంలో ఎవరికి అనుకూలంగా వుంది? ఎవరికి వ్యతిరేకంగా వుంది? ఆ రచన సమాజం మీద ఎటువంటి ప్రభావం చూపుతోంది? — అనే విషయం చూడడం మొట్టమొదట చెయ్యాలి.

(ఫుట్‌నోట్ : 100 వ పేజీ తరువాయి)

"In a general analysis of an epoch ... the Marxist critic must strive to give a complete picture of the entire social development of that epoch. When one single writer or work is being discussed, there is no essential need for an analysis of the basic economic conditions, for here the ever – valid principal, which may be called Plekhanov's principle, comes into its own with particular force. It states that only to an extremely insignificant extent do artistic works depend directly upon the forms of production in a given society. They depend on them through such intermidiate links as the class structure of society and the class Psychology which has formed as a result of class interests." [Lunacharsky, Anatoly 1928. Theses on the problems of Marxist criticism. In "Lunacharsky, Anatoly. On Literature and art." Moscow: progress Publishers, 1973.]

తర్వాత రచనా విధానం (ఫామ్) చూడాలి. — పద్యాలుగా రాశారా, నాటకంగా రాశారా, ఇంకో విధానమా, — అందులో కూడా శిల్పం, శైలీ వంటి ఇతర కోణాలూ. (రామాయణంలో వొక పాత్ర మాట్లాడిం తర్వాతే, ఇంకో పాత్ర మాట్లాడడం అనే పద్ధతి రచనా విధానంలోకే వొస్తుంది.) ఆ రచనా విధానం తను చెప్పదల్చుకున్న విషయం విజయవంతంగా చెప్పగలిగిందా, లేదా, అన్నది చూడాలి. *

రామాయణం కట్టు కథల రూపంలో వున్నా, దాన్నిండా లక్ష అవక తవకలు వున్నా, దాంట్లో అసలు విషయం (సోషల్ ఎస్సెన్స్) ఏమిటి, అది సమాజం మీద ఎలాంటి ప్రభావం చూపుతోంది ? — అనేదే అసలు విషయం.

కుటుంబరావుగారు రామాయణం గురించి విమర్శిస్తూ, దాంట్లో వున్న అవక తవకల గురించీ అసందర్భాల గురించీ పాత్ర చిత్రణ బాగా లేకపోవడం గురించీ మాట్లాడడం అంటే, రామాయణంలో కథా వొస్తువు గురించి గాక, దాని రచనా విధానం గురించి (ఫామ్ గురించి) మాట్లాడడం అన్నమాట.

ఈ విషయం ఇప్పుడు ఇంకా స్పష్టంగా చూడవొచ్చును.

(ఒక రచన గురించి వొక విమర్శ విన్నప్పుడు, అది కథా వొస్తువుకి సంబంధించిందా, ఫామ్‌కి సంబంధించిందా, — అనే విషయం ముందు నిర్ణయించుకోవాలి.)

రామాయణం సాహిత్యం కాదనటానికీ, సమాజ పరిశీలనకు పనికి

"... the Marxist critic takes first of all as the object of his analysis the content of the work, the social essence which it embodies. He determines its connection with this or that social group and the influence which the impact of the work can have on social life; and then he turns to the form, primarily from the point of view of explaining how this form fulfils its aims, that is, serves to make the work as expressive and convincing as possible." [Lunacharsky].

రాదనటానికీ కుటుంబరావుగారు చెప్పిన కారణాలు ఎంత శాస్త్రీయంగా వున్నాయో చూడవలసి వుంది.

1 — "రామాయణంలో చాలా ప్రక్షిప్తా లున్నాయి." అని చెప్తూ, విరాధుడి సంగతి ఎత్తి, అతని శాపం సంగతి ప్రక్షిప్తమేనని తేల్చి, "రాముడు విరాధుడి కంఠం మీద కాలుపెట్టి నించుని లక్ష్మణుడి చేత గుంట తవ్వించ నక్కర్లేదు" — అన్నారు.

ఈ విమర్శ అంతా రచనా విధానానికి సంబంధించిందే. — ఈ ఘట్టంలో కథా వొస్తువు ఏమిటో చూడండి.

అసలు విరాధుడు తుంబురుడనే గంధర్వుడు. కుబేరుడి దగ్గిర దాస్యం చేసూ వుండేవాడు. ఒకసారి కుబేరుడు తుంబురుణ్ణి రాక్షసుడివై పొమ్మని శపించాడు. ఎందుకో తెలుసా ? — సమయానికి సేవ చెయ్యలేదని.

తర్వాత తుంబురుడు యజమానిని వేడుకుంటే "శ్రీరాముడు నిన్ను యుద్ధంలో చంపినప్పుడు నీ శాపం పోయి స్వర్గానికి వెళ్తావు" — అని శాప విముక్తి చెప్పాడు.

అప్పటినుంచీ తుంబురుడు రాక్షసుడిగానే వున్నాడు.

ఈ సంగతంతా విరాధుడు రాముడికి చెప్పి — "నా కళేబరం గుంటలో పూడ్చిపెట్టు. చచ్చిపోయిం తర్వాత కళేబరాన్ని పూడ్చడం రాక్షసుల ఆచారం." —అని చెప్పి ప్రాణాలు విడిచాడు.

ఇదీ కథ. ఇందులో ముఖ్య విషయాలు ఏమిటి ? — (1) ఒక యజమాని సేవకుడికి వినయ విధేయతలతో సేవ చెయ్యనందుకు చాలా పెద్ద శిక్ష విధించాడు.

సమాజంలో శూద్రుల్ని భయభక్తులతో వుంచడానికీ, వినయంగా సేవ చెయ్యకపోతే రాక్షస జన్మ ఎత్తుతారని నమ్మించడానికీ ఈ కథ పనికి వొస్తుంది. — ఈ శాపం సంగతి ప్రక్షిప్తం అయితే ఏమిటి ? దానివల్ల సమాజ పరిశీలనకు ఎంతో అవకాశం వుంది. ప్రక్షిప్తం కావడంవల్లనే పనికి రాకపోవడం ఎలా జరిగింది?

2) — కవి రాముడి ద్వారా విరాధుడికి శాప విముక్తి చెప్పి, "రాముడు ఎవర్ని చంపినా సరే వారికి స్వర్గమే వొస్తుంది. రాముడి చేతిలో మరణించడమే గొప్ప భాగ్యం." — అని రామున్ణి దేవున్ణి చేశాడు.

3) — రాక్షస జాతిలో శవాల్ని దహనం చేసే పద్ధతి లేదు. పూడ్చిపెట్టే పద్ధతే సనాతనాచారంగా వుంది — అనే సంగతి తెలుస్తుంది దీనివల్ల.

తర్వాత కాలంలో రాముడు కబంధుడనే ఇంకో రాక్షసున్ణి కూడా చంపుతాడు. కానీ, ఆ రాక్షసుడు రామున్ణి — "నన్ను దహనం చెయ్యి. దహనం చేస్తేనే నాకు శాప విముక్తి కలుగుతుంది. అప్పుడు నీకు ముఖ్యమైన విషయం వొకటి చెపుతాను. తప్పకుండా దహనం చెయ్యాలి సుమా!" — అని తన శవాన్ని దహనం చేయించుకోవాలని రామున్ణి ఎంతో ప్రార్థిస్తాడు. ఇంతకీ రాక్షస జాతిలో శవాలని పూడ్చి పెడతారా? దహనం చేస్తారా? మొదట్లో పూడ్చిపెట్టే ఆచారం వుండేదనీ, తర్వాత రాక్షసులు దహనం చేయించుకునే ఆచారాన్నే ఇష్టపడ్డారనీ తెలుస్తుంది. — విరాధుడు తన శవాన్ని పూడ్చిపెట్టమని కోరడంలో వారి జాతి ఆచారం కనపడడం లేదా? — అది సామాజిక శాస్త్ర పరిశీలనకు సంబంధించిన విషయం కాదా? —

విరాధుడి కథలో కొంత భాగం ప్రక్షిప్తం వుందనే అనుకుందాం. అది సమాజాన్ని పరిశీలించడానికి వుపయోగ పడిందా? మొత్తం పనికి రాకుండానే పోయిందా? — కుటుంబరావుగారు ఈ ఘట్టంలో అసలు కథా వొసువునీ ముట్టుకోనే లేదు. కేవలం రచనా విధానాన్ని గురించి మాత్రమే మాట్లాడారు.

రామాయణంలో ఇంకో ప్రక్షిప్తం సంగతి చూడండి. శంబుకుడు శూద్రుడు. అతడు తపస్సు చేస్తున్నాడని తెలిసి రాముడు చంపేశాడు. అంటే సమాజంలో బ్రాహ్మణుడికి వున్న హక్కు తనకూ కావాలని కోరే శూద్రుడికి (ఆ హక్కు తపస్సు చెయ్యడం కావొచ్చు. ఇంకొకటి కావొచ్చు.) మరణ దండన విధిస్తాడన్నమాట రాజు.

అలా విధి వాలని చెపుతోంది రామాయణం. శంబుక వధ ప్రక్షిప్తమే అయినా, దానివల్ల సమాజ పరిస్థితులు గ్రహించడానికి పీలైందా? పీలుగాకుండా పోయిందా?

మహాభారతం మాత్రం మూర్ఖంగా దృక్పథంతో పరిశీలించడానికి పనికి వొస్తుందన్నారు కుటుంబరావుగారు. కానీ, మహాభారతంలో ప్రక్షిప్తా లున్నాయనే వాదం వుంది.

ప్రక్షిప్తా లుండడం వల్ల రామాయణం సాహిత్యం గాకుండా పోయి, సమాజ పరిశీలనకూ పనికిరాకుండా పోయినప్పుడు, అదే స్థితిలో వున్న భారతం ఎలా పనికి వొస్తుంది?

2 — రామాయణంలో అవకతపకలకు ఒక వుదాహరణ ఇస్తూ రాముడి వయస్సు గురించీ, సీత వయస్సు గురించీ ప్రస్తావించి, (ఇది కూడా రచనా విధానానికి సంబంధించిన విషయమే. కథావస్తువుకి సంబంధించింది కాదు.) ఈ వయస్సుల గురించి చెప్పిన సందర్భాలు ఒకదానికొకటి కుదరడం లేదన్నారు. ఏం కుదరకపోతే? కథలో విషయాలన్నీ ఈ వయస్సు లెక్కలమీదే ఆధారపడి వున్నాయా? రాముడి వయస్సు వనవాసానికి బయల్దేరినప్పుడు ఎంతో, రావణుడు సీత దగ్గిరికి వచ్చినప్పుడు ఎంతో సరిగ్గా తేల్చకపోవడంవల్ల రామాయణంలో స్త్రీల స్థితీ, శూద్రుల స్థితీ గ్రహించడానికి పీలుగాకుండా పోయిందా? ఈ వయస్సు లెక్కలు సరిపోకపోవడంవల్లనే రామాయణం సాహిత్యం అవకుండాపోయినప్పుడు, ఈ లెక్కలు సరిపోయివుంటే రామాయణం సాహిత్యమే అయేదన్న మాట. సమాజ పరిశీలనకు పనికివచ్చే దన్నమాట.

రాముడి వయసు గురించి చెప్పిన సందర్భాలు వొకదానికొకటి సరిపోకపోతే (అలాంటి అవకతవకలు ఎన్ని వున్నా) అవి రచనా విధానంలో పొరపాట్లు అవుతాయిగానీ, మొత్తం రచనే సాహిత్యంగాకుండా, సమాజ పరిశీలనకు పనికిరాకుండా ఎందుకు పోతుంది?

3 — "పాత్ర చిత్రణ ఏమీ బాగా లేదు."

(ఇదికూడా రచనా విధానానికి సంబంధించిందే. కథా వస్తువుకి సంబంధించింది కాదు.) —

పాత్ర చిత్రణ బాగాలేకపోతే సాహిత్యం అవదా?— రామాయణంలో పాత్ర చిత్రణ బాగాలేకపోవడానికి కారణం, అది సాహిత్యం సృష్టి అయిన ప్రారంభదశలో రాసింది కావడమే. సాహిత్య సృష్టిలో ఒక బాల్యదశ లేకుండానే, ప్రారంభంనించే సాహిత్యం వున్నతస్థాయికి చేరుతుందా? మనిషి పుట్టగానే, పెద్దవాడై జ్ఞానిగా వుంటాడా? పాత్ర చిత్రణ చక్కగా వుండి, కళాత్మక విలువలతో ఉన్నతస్థాయికి చేరే వరకూ — ఈలోగా సృష్టి అయిన రచనలేవీ సాహిత్యం కాదా? అయితే తప్పటడుగులు వేసే చిన్నపిల్లలెవ్వరూ మనుషులు కాదన్నమాట. (పెద్దవాళ్ళయ్యాకే మనుషులు!)

కుటుంబరావుగారు రామాయణం ఆదికావ్యం అని ఒప్పుకుంటూనే అంత ప్రారంభ దశలో జరిగిన రచనలో పాత్రపోషణ బాగాలేకపోవడానికి కారణాలేమీ చూడలేక పోయారు.

కళలు సృష్టి అవుతోన్న ప్రారంభ దశలో రచనలన్నీ కట్టుకథల రూపంలో (మైథాలజీ) సాగాయి.

దానికి కారణం "ఎదగని సామాజిక పరిస్థితులే (ఇమ్మెచ్యూర్ సోషల్ కండిషన్స్)" — అన్నాడు మార్క్స్. *

ఆనాటి మానవుడికి ప్రకృతి పట్లా, సమాజం పట్లా ఎలాంటి దృక్పథం వుందో అదే అతని కళ్ళల్లో ప్రతిఫలించింది. † ప్రకృతిశక్తు

---

* "... the immature social conditions which gave rise, and which alone could give rise, to this art cannot recur." [Marx, Karl. 1859. A contribution to the critique of Political Economy. Moscow : Progress Publishers, 1970.]

† "... natural and social phenomena are already assimilated in an unintentionally artistic manner by the imagination of the people." [Marx].

లన్నిట్నీ దేవుళ్ళనుకుని అలాగే కథలు చెప్పుకున్నాడు. కొందరు మను షులమీద అధికారం చేసే మనిషినే (రాజుని) దేవుడనుకుని, కళల్లో రాజుకి దేవుడి కిచ్చిన స్థానం యిచ్చాడు. (ఇలా ఇచ్చేటట్టు చేసుకున్నాడు రాజు.) పూర్వ మానవుడి ఆలోచనలేవీ అసలు నిజాలద్వారా పుట్టినవి కాకపోవడంవల్ల, అతడు సృష్టించుకున్న కళలనిండా ఎక్కడి కక్కడ అవకతవకలే వచ్చాయి.

సూర్యుడూ, చంద్రుడూ ఒక్కోసారి హఠాత్తుగా కనపడకుండా ఎందుకు పోతారో (గ్రహణాలు పటినప్పుడు) తెలియని కాలంలో ఎలాంటి కథ సృష్టి అయిందో మనకు తెలుసు.

రాక్షసులూ, దేవతలూ కలిసి అమృతంకోసం పాలసముద్రం చిలికారు. అమృతం పుట్టింది. దేవతలు దాన్ని రాక్షసులకు దక్కకుండా చెయ్యాలని చూశారు. రెండు పక్షాలవారికీ ఘోర యుదం జరిగింది. విష్ణువు (దేవత) జగన్మోహినీ అవతారం ఎత్తి అమృతం తీసుకుపోయి దేవతలకు పంచడం మొదలు పెట్టాడు. రాహువూ, కేతువూ అనే రాక్షసు లిద్దరు దేవతల్లో కలిసిపోయి అమృతం తాగటానికి కూర్చున్నారు. విష్ణువు వారికి కూడా అమృతం పోశాడు. వాళ్ళిద్దరూ తాగుతూ వుండగా సూర్యుడూ, చంద్రుడూ (వీళ్ళిద్దరూ దేవతలు) విష్ణువుకి సైగ చేశారు. విష్ణువు వెంటనే చక్రంతో ఆ రాక్షసుల తలలు నరికేశాడు. అప్పటికి అమృతం వారి కడుపుల్లోకి దిగలేదు. అందుచేత వారి శరీరాలు చచ్చిపోయి తలలుమాత్రం బతికాయి అప్పట్నించీ రాహువుకీ, కేతు వుకీ సూర్యుడిమీదా, చంద్రుడిమీదా కోపం. ఇద్దరూ చెరొకళ్ళనీ మింగుతూ వుంటారు. కానీ వాళ్ళకి పొట్టలు లేవుగదా? సూర్యుడూ, చంద్రుడూ చక్కగా బయటికి వచ్చేస్తూ వుంటారు. కానీ, ఆ రాక్షసుల నోళ్ళలో వున్నప్పుడు మాత్రం కనపడకుండా పోతారు. అదే నన్నమాట గ్రహణం అంటే.

ఈ కథ ఇంత అవకతవకగా వుండటానికి కారణం ఏమిటి?— ప్రకృతికి సంబంధించిన ఒక విషయం గురించి అసలు నిజం తెలియక కేవలం ఊహలతో రాయడం వల్లనే.

అయితే, అసలు నిజం ఏమిటి?— సూర్యుడికీ, చంద్రుడికీమధ్యలోకి భూమి వచ్చినప్పుడు, సూర్యకిరణాలు చంద్రుడిమీద పడక భూమిమీద వాళ్ళకు చంద్రుడు కనపడకుండా పోతాడు—ఇది చంద్రగ్రహణం.

సూర్యుడికీ, భూమికీ మధ్యలోకి చంద్రుడు వచ్చినప్పుడు సూర్యకిరణాలు చంద్రుడు ఉన్నంతమేరా భూమిమీద పడక సూర్యుడు కనపడకుండా పోతాడు — ఇది సూర్యగ్రహణం.

ఈ అసలు విషయాలు తెలిసి, సూర్య చంద్రుల్నీ, భూమినీ పాత్రలుగా చేసి ఒక కథ రాస్తే అందులో అవకతవకలు రావడానికి విలుండదు. ఆ పాత్రలు వాటి సహజ స్వభావాల ప్రకారమే నడుస్తాయి గానీ ఇతరుల వూహల ప్రకారం నడవ్వు. కానీ అజ్ఞానదశలో రాసిన రాహు కేతువుల కథకూడా సాహిత్యమే. ఆ కథలో రెండు శత్రుపక్షాలున్నాయి. ఒక పక్షానికి మోసం జరిగింది. ఓడిపోయాడు. ఏదోవిధంగా శత్రువులమీద పగ తీర్చుకుంటున్నారు. — అదే దాని కథా వస్తువు.

ప్రకృతి జ్ఞానం విషయంలోనే కాదు. రచనలో ప్రతీ కోణంలోనూ స్పష్టమైన జ్ఞానం లేనప్పుడు అవకతవకలకూ, అసందర్భాలకూ అంతు వుండదు. (పల్లెటూరి జీవితం గురించీ, వ్యవసాయం గురించీ ఏమీ తెలియని రచయిత కొంత వినీ, కొంత వూహించీ ఒక కథ రాస్తే అందులో ఎన్నో అవకతవక లుంటాలు.)

సమాజానికి శాస్త్ర జ్ఞానం లేనప్పుడు కళల సృష్టి ఊహలమీదే సాగింది. (ఇప్పుడు ప్రకృతికి సంబంధించిన ఊహలు అంతరించాయి గానీ, ఇంకా సమాజానికి సంబంధించిన జ్ఞానం కలగక పోవడంవల్ల, పేదా, గొప్పా, కర్మా, దేవుడూ, కట్నాలూ, లంచాలూ, నేరాలూ వంటి నిత్య జీవితానికి సంబంధించిన ఏ పరిస్థితి గురించైనా అసలు కారణం గ్రహించని ఊహలే సాగుతున్నాయి.)

సమాజానికి లేని తర్కం (జ్ఞానం) కళల సృష్టిలోకూడా ఉండదు.

రాముడు మహావీరుడై వుండి, ప్రతీ క్షణం నిరాశా నిస్పృహల్లో మునిగిపోతూ వుంటాడు. సీత కోసం దుఃఖించడమే కాదు. రావణుణ్ణి

చంపలేనని దుఃఖమే. సముద్రం దాటలేనని దుఃఖమే.—దీనివల్ల రాముడి పాత్ర చిత్రణ ఏమీ బాగాలేనట్టే తోస్తుంది. కానీ, రాముణ్ణి పిరికివాడిగా చిత్రించాలని కవి అభిప్రాయం కాదు. గొప్ప సాహసవంతుడిగా చిత్రించాలనే తాపత్రయం. కానీ కవి అనుసరించిన రచనా విధానం తర్కానికి విలువ ఇవ్వక పోవడం (ఇచ్చే సమంజం కాకపోవడంవల్ల) వంటి ముఖ్య కారణాలవల్ల కథలో పాత్ర చిత్రణ అవకతవకగా తయారైంది.

విరాధుడు సీతని ఎత్తుకుపోతూ వుంటే రాముడు దుఃఖించినట్టు కవి రాయడం — "రాముడు ఎంత గొప్ప కష్టంలో చిక్కుకున్నాడో చూడండి" — అని చెప్పడానికే. ఎంత కష్టం అయితేమాత్రం అంత గొప్ప వీరుడు దుఃఖించడం ఏమిటి?— అనే తర్కాన్ని కవి పట్టించుకోడు. ధైర్యం పడడం సాహసానికి విరుద్ధమనే తర్కానికి కవి విలువ ఇవ్వడు. దానికి ఏదో ఒక కారణం చెపితే సరిపోతుందనుకుంటాడు.

సీతని రావణుడెత్తుకుపోయింతర్వాత మళ్ళీ సీతని చూసేవరకూ రాముడికి వొకటే దుఃఖం. అందులోనే విరహం. అందులోనే నిరాశ. అందులోనే కోపం. అందులోనే అధైర్యం —

ఇదంతా ఒక కోణంలోచూస్తే కవి అనుసరించిన రచనా విధానం. ఇంకో కోణంలో చూస్తే — "శ్రీరాముడు పురుషోత్తముడు సుమా! ఏకపత్నివ్రతుడు సుమా! తన ధర్మపత్ని కోసమే దుఃఖిస్తున్నాడు సుమా!" — అని చెప్పడం.

కవి కథ పొడుగునా ఏ ఘట్టానికి తగ్గ సూక్తులు ఆ ఘట్టంలో చెపుతూ వున్నట్టే, రాముడు దుఃఖపడే ఘట్టాలద్వారాకూడా "దుఃఖం" గురించీ, "అధైర్యం" గురించీ సీతులు చెపుతో వుంటాడు.

రాముడు దుఃఖిస్తోవుంటే లక్ష్మణుడు — "పురుషుడు దుఃఖపడకూడదు దుఃఖం వినాశ హేతువు. దుఃఖంవల్ల ప్రాణహానికూడా సంభవిస్తుంది. ఎప్పుడూ దుఃఖిస్తూ వుండేవాడు ఏ కార్యమూ సాధించలేడు. వీరుడు ధైర్యం వహించాలి. నువ్వు మహా వీరుడివి" — అంటాడు.

మహావీరుడు మొదట్నే దుఃఖించకుండా వుండాలిగానీ, ఎవరో చెప్పింతర్వాత — "ఓహో! నేను మహా వీరుణ్ణా? అయితే దుఃఖించన్నే"—

అని ఆప్పుడు దుఃఖం మానడంలో కవి కేమీ అసందర్భం కనపడదు. తను 'దుఃఖం' మీద కొన్ని సూక్తులు చెప్పాలి కాబట్టి, రాము డెలాగూ దుఃఖించవలసిన సందర్భమే కాబట్టి — అవన్నీ చెప్పుకొస్తాడు

అయితే, ఆ సూక్తులు రాముడే లక్ష్మణుడికి చెపితే బాగుంటుంది గానీ, రాముడు చెప్పాలంటే లక్ష్మణుడు దుఃఖిస్తూ వుండాలి సీత పోయి నందుకు రాముడు ధైర్యంగా వుండి, లక్ష్మణుడు దుఃఖించడం ఏమిటి? శ్రీరామచంద్రుడి అనురాగం మాటేమిటి? అ సమానూ లక్ష్మణుడు దుఃఖించి, రాముడు ఓదారుస్తూ వుంటే లక్ష్మణుడే కథానాయకుడై పోడా?

అంచేత అలా కుదరదు. రాముడే కథానాయకుడుగా వుండాలి. రాముడి మూర్ఛలూ, రాముడి విరహం కవి వర్ణించాలి. అంచేత రాముడు దుఃఖిస్తోంటే, లక్ష్మణుడు ఓదారుస్తూ వుంటాడు.

అయితే రాముడు చీటికీ మాటికీ దుఃఖించి లక్ష్మణుడు ఓదారుస్తూ వుండడంవల్ల రాముడి పాత్రకు లోపం జరుగుతోందనే అభిప్రాయం కవికి బొత్తిగా లేదనుకోకూడదు. లక్ష్మణుడు రాముడికి చెప్పవలసిం దంతా చెప్పేంతర్వాత (కవి చెప్పదల్చుకున్న సూక్తులన్నీ అయిపోయిం తర్వాత) "నేను నీకు చెప్పగల యోగ్యుణ్ణి కాదుసుమా; నమ సజ్ఞానమూ నీకే తెలుసు. మహానుభావుడివి నువ్వు. నువ్వు సాధించలేని కార్యం లేదు. నీ దుఃఖం చూడలేక చెప్పాను. అంతే." — అంటూ వుంటాడు.

లక్ష్మణుడు, రాముడికి ఎన్ని నీతులు చెప్పినా రాముణ్ణి మించిన ధైర్యంతో మాట్లాడినా, చివరికి తన అల్పత్వం, శ్రీరాముడి ఔన్నత్యం, హెచ్చుకుంటూ ఉండడం వల్ల శ్రీరాముడి పాత్రకేమీ హాని కలగదని కవి అభిప్రాయం.

ఏ కాజుకో, గొప్ప అధికారికో ఆపదలు కలిగినప్పుడు, చుట్టూ మందీ మార్బలం ఆ గొప్ప వ్యక్తిని రక్షిస్తూ వుంటారు. అలాగే, రాము డికి లక్ష్మణుడు అండగా, రక్షగా వుంటూ, కష్టంలో ఓదార్చి ధైర్యం చెపుతూ వుంటాడు. సేవకుడు ఓదార్చడం కూడా సేవలో భాగమే.

సుగ్రీవుడు ఋష్యమూకం మీదనుంచి రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ చూసి భయపడ్డప్పుడు హనుమంతుడు సుగ్రీవుణ్ణి ఓదారుస్తూ — (ఇక్కడ

సుగ్రీవుడు యజమానీ, హనుమంతుడు దాసుడూ) ఎలా చెపుతున్నాడో చూడండి—

—"రాజా! భయపడవొద్దు. బుద్ధీ, ఇంగిత జ్ఞానం లేని రాజు ప్రజల్ని పరిపాలించలేడు. నువ్వు వానరుడవు కావడంచేత, చక్కగా ఆలోచించడానికి తగ్గ జ్ఞానం లేక, చపలత్వం వల్ల భయపడుతున్నావు." — ఈ మాటలు చెప్పేవాడు వానరుడే. ఇతడు మాత్రం చక్కగానే ఆలోచిస్తున్నాడు. ధైర్యంగానూ వున్నాడు. ఒక వానరుణ్ణి ఇంకో వానరుడి చేత —"నువ్వు వానరుడివి కాబట్టి నీకు జ్ఞానం లేకుండా వున్నావు." —అనిపించడం — బాగుంటుందో, లేదో కవి పట్టించుకోడు. వానరుల గురించి తనకు వున్న అభిప్రాయాలు, వొక వానరుడి ద్వారానే బయట పెట్టి, వానరులు తమ చపలత్వాన్నీ, తమ అల్పత్వాన్నీ తామే వొప్పుకునేట్టు చేస్తాడు.

హనుమంతుడి చేత ధైర్యం చెప్పించుకున్న సుగ్రీవుడు రాముడు దుఖిస్తోన్నప్పుడు తనే రాముడికి ధైర్యం చెపుతాడు —"నేనూ భార్యకి దూరమయ్యాను. కష్టాలు పడుతున్నాను. వానరుణ్ణి అయినా దుఖం ఓర్చుకుంటూ వున్నాను. నువ్వు మానవుడివి మహా జ్ఞానివి. వీరుడివి. నువ్వు దుఖించడం ఏమిటి? ఎన్ని ఆపదలు వొచ్చినా, మరణ భయం కలిగినా, దరిద్రం చుట్టుకున్నా ధైర్యశాలి కర్తవ్యం ఆలోచించాలి గానీ దుఖించి ఏం సాధించగలడు? ఇదంతా నీకు తెలియనిది కాదు. నీ దుఖం చూడలేక చెపుతున్నాను అంతే." — అంటాడు. — ఇక్కడ శ్రీరాముడు అధికుడూ — సుగ్రీవుడు అల్పుడూ.

ఈ రకంగా కథలో ఎక్కడ చూసినా తక్కువవాళ్ళు, ఎక్కువ వాళ్ళకి వినయంగా ధైర్యం చెప్పి ఓదారుస్తూ వుంటారు. గొప్పవారు కష్టాలో పడ్డప్పుడు తమతో సరి సమానమైన వారితో ధైర్యం చెప్పించుకుంటే అవమానం గానీ, తమ కన్నా తక్కువ వారితో ధైర్యం చెప్పించుకోవొచ్చు. అందుచేత, రాముణ్ణి లక్ష్మణుడు ఓదార్చినా, హనుమంతుడు ఓదార్చినా, ఇంకెవరు ఓదార్చినా రాముడికి అవమానం కలగదని కవి అభిప్రాయం.

రామాయణంలో పాత్ర చిత్రణ ఇలా సాగడానికి ఏదో వొకే కారణం చూపించలేము. అనేక కోణాలలో చూస్తే అనేక కారణాలు కనపడతాయి. చివరికి అన్నీ తర్కం ముందు ఎగిరిపోయి, పాత్ర చిత్రణ అవక తవకగానే మిగులుతుంది — అన్నిటికీ మూలం అది తర్కం లేని సమాజ పరిస్థితుల్లో రాసింది కావడమే.

రామాయణం సాహిత్యం కాదనటానికీ, కుటుంబరావుగారు చెప్పిన కారణాలు కేవలం దాని రచనా విధానానికి సంబంధించినవి మాత్రమే. వొక రచనలో కథా వొస్తువుని ముట్టుకోకుండానే, కేవలం రాసిన పద్ధతి చూసి అది సాహిత్యం అనో, కాదనో, సమాజ పరిశీలనకు పనికి వొస్తుందనో రాదనో చెప్తే, అది అసలు విమర్శ అవుతుందా ? (పైగా మార్క్సిస్టు విమర్శ!)

ఆ రచనా విధానం అయినా అన్ని అవక తవకలతో ఎందుకు వుందో పరిశీలించకుండానే— (అది పరిశీలించడం కూడా సమాజ శాస్త్ర పరిశీలనే.) —

"రామాయణం బాగా లేదు కాబట్టి అది అసలు సాహిత్యమే కాదు" — అనడం ఆటవిక మానవుణ్ణి చూసి —"వీడు జ్ఞానవంతుడిగా లేడు కాబట్టి వీడసలు మానవుడే కాడు."— అనడమే.

ఆటవిక మానవుడే కాలక్రమంలో జ్ఞానవంతుడైన మానవుడు అవుతాడు. ఇక సమాజంలో ఎన్నటికీ ఆటవిక దశ తిరిగిరాదు.

అలాగే, కల్పనతో, అవక తవకలతో, అజ్ఞానంతో ప్రారంభమైన సాహిత్యం, — మానవుడి జ్ఞానంతో పాటే ఎదిగి కాలక్రమంలో వున్నతమైన స్థాయి చేరింది.

"అంత వున్నత స్థాయికి ఎప్పుడు చేరిందో అప్పటినుంచే సాహిత్యం గానీ అంతకు పూర్వం రాసిన అజ్ఞాన రచనలేవీ సాహిత్యం కాదు" — అనడం — కళాస్పష్టిలో ప్రారంభ దశల్ని తిరస్కరించడమే. "పరిణామ సిద్ధాంతాన్ని" తోసి పుచ్చడమే.

శాస్త్రజ్ఞానం తెలిసిన సమాజం మళ్ళీ ఆటవిక దశకు ఎలా వెళ్ళదో, అలాగే, వున్నతస్థాయి చేరిన సాహిత్యం మళ్ళీ కట్టుకథల

స్థాయికి వెళ్ళదు. చంద్రుడు భూమి లాంటి గ్రహమే అని తెలిసిపోయిం తర్వాత ఇక ఎంతో కాలం శివుడి జటాఝూటంలో కూర్చోలేడు. కార్లూ, రైళ్ళూ, విమానాలూ మానవ జీవితంలోకి జొరబడి పోయిం తర్వాత ఇక గుర్రపు స్వారీలకూ, పల్లకీ ప్రయాణాలకూ, సమాజంలోనూ, సాహిత్యంలోనూ కూడా చోటు లేదు. తుపాకులే ఆయుధాలుగా వుప యోగపడడం ప్రారంభమైన తర్వాత బాణాల విలుకాడు కథానాయకుడు కాలేడు. (వెనకటి కథలు తిరగ రాసుకోవడం సంగతి కాదు. కొత్తగా మాత్రం బాణాల నాయకుడు సృష్టి కాడు.) *

సమాజంలో శాస్త్ర జ్ఞానం పెరిగిన కొద్దీ తర్కానికి విలువ ఇచ్చే దృష్టి పెరుగుతుంది.

(ప్రతీవ్యక్తీ పాత నమ్మకాలు వొదిలేస్తాడనీ, ప్రతీ కళాకారుడూ శాస్త్రీయమైన దృష్టితోనే ఆలోచిస్తాడనీ కాదు. అది సమాజం కలిగించే అవకాశాల మీదా, వ్యక్తుల చైతన్యం మీదా ఆధారపడి వుంటుంది.— వ్యక్తిని గాక, సమాజాన్ని దృష్టిలో పెట్టుకు చూస్తే మాత్రం శాస్త్ర జ్ఞానం పెరగడంతో, సాహిత్యంలో కూడా అజ్ఞాన దశ అంతరిస్తుంది.)

కానీ, వొక వ్యక్తి పెద్దవాడై ఎంత జ్ఞానవంతుడయినా, తను చిన్నతనం తల్చుకున్నప్పుడు (అల్లరీ, అజ్ఞానం, అమాయకత్వం, బిండ తనం — లాంటి లక్షణాలతో వున్న చిన్నతనం) ఎలాంటి అనుభూతి పొందుతాడో, మానవ సమాజంలో (సాహిత్యంలో కూడా) బాల్యదశ (హిస్టారికల్ ఛైల్డ్ హుడ్) చూసినప్పుడు "ఎదిగిన" సమాజానికికూడా

---

* Is Achilles possible when powder and shot have been invented ?" [Marx].

అలాంటి వింత అనుభూతి కలుగుతుంది. ఆ అనుభూతిని "ఎటర్నల్ ఛార్మ్" (శాశ్వితాకర్షణ)" — అన్నాడు మార్క్స్. *

* * *

రామాయణంలో "సమాజం" కనపడడంలేదా ?

ఒక రచనలో వుండే సమాజాన్ని చూడాలంటే ఆ రచనలో అవకతవకలూ, అసందర్భాలూ, పాత్ర పోషణ బాగా లేకపోవడాలూ ఏ విధంగానూ అడ్డురావు.

రామాయణం పొడుగునా సమాజంలో వాస్తవాలు కొల్లలుగా కనపడుతోనే వున్నాయి.

— హనుమంతుడు లంకకు పోయినప్పుడు శరీరం తగ్గించేసుకుని రావణుడి అంతఃపురంలో జొరబడతాడు — ఇది కల్పనే.

రావణుడి కోటచుట్టూ వేలకొద్దీ రాక్షసులు (వారూ కామరూపులే) కాపలా కాస్తూ వుండికూడా హనుమంతుణ్ణి చూడలేరు. — ఇది అవకతవకే.

కానీ, ఆ ఘట్టంలో కవి — "రావణుడి భార్య లందరూ రావణుడి కాళ్ళవేపున పడుకున్నారు" — అని చెప్పడంలో ఏం అర్థముంది?

సమాజంలో భార్య స్థానం భర్త పాదాల దగ్గిరే. (సుఖవుగా తన్న

* "An adult cannot become a child again, or he becomes childish. But does the naivete of the child not give him pleasure, and does not he himself endeavour to reproduce the child's veracity on a higher level ? Does not the child in every epoch represent the character of the period in its natural veracity ? Why should not the historical childhood of humanity, where it attained its most beautiful form, exert an eternal charm because it is a stage that will never recur ?" [Marx]

డానికి.) స్త్రీ, భర్త పాదాలు పూజిస్తూ, భర్తకు సేవచేస్తూ, భర్త ఆధీనంలో బ్రతుకుతుంది.

"రావణుడి భార్యలు" — అన్న మాటలోనే ఒక పురుషుడికి అనేకమంది భార్యలుగల సమాజం కనపడుతుంది. ఆ భార్యలు భర్త పాదాల దిక్కున పడుకున్నారంటే — సమాజంలో పురుషుడి వున్నత స్థితీ, స్త్రీల నీచ స్థితీ మహా చక్కగా అర్థమౌతాయి. (ఇది ఈనాటి దృక్పథంతో పరిశీలించడం కాదు. ఆనాడు కూడా ఆ స్థితులమధ్య తేడా వుంది. స్త్రీ పురుషుల స్థితి సమానంగా లేదు.)

— రావణుడు సీతని తీసుకుపోవటానికి దండకారణ్యానికి రథంలో వస్తూ దారిలో ఒక బ్రహ్మాండమైన మర్రిచెట్టు చూశాడు. దాని కొమ్మలు నూరేసి యోజనాల పొడవు. ఒక కొమ్మ మాత్రం విరిగిపోయి మోడులా వుంది. దానికో కథ చెప్పాడు కవి. —

పూర్వం గరుత్మంతుడు ఒక పెద్ద తాబేలునీ, ఒక ఏనుగునీ పట్టి తెచ్చుకుని తినడానికి ఆ మర్రిచెట్టుకొమ్మమీద కూర్చున్నాడు. అతని బరువుకి ఆ కొమ్మ ఫెళఫెళా విరిగిపోయింది. ఆ కొమ్మనిండా మహర్షులు తపస్సు చేసుకుంటూ • వున్నారు. కొమ్మ కింద పడిపోతే మహర్షులందరూ చచ్చిపోతారని గరుత్మంతుడు చప్పున దాన్ని ముక్కుతో పట్టుకుని ఏనుగునీ, తాబేలునీ కాలి గోళ్ళలో ఇరికించుకుని ఆకాశంలో కెగిరాడు. కొంతదూరంపోయి ఒంటికాలిమీద నిలబడి, ఏనుగునీ, తాబేలునీ తినేసి, ఆ కొమ్మతో కొందరు బోయవాళ్ళని బాది చంపేసి, మహర్షుల్ని రక్షించి చాలా సంతోషించాడు. — ఇదీ కథ.

మహర్షుల్ని రక్షించాలంటె బోయవాళ్ళని చంపడం ఎందుకు ? — కవి ఈ ఘట్టం ఎంత పొంగుతూ రాశాడో, ఎవరి క్షేమం దృష్టిలో పెట్టుకున్నాడో చూడండి.

"ధర్మాత్ముడును, పక్షులలో శ్రేష్ఠుడును నగు గరుడుడు బోయవాండ్రను గొట్టిచంపి, మహర్షులను గాపాడి మిగుల సంతోషించెను."

• మానవులు చెట్లమీదే నివాసా లేర్పరుచుకుని క్యాక జంతువులనుంచి రక్షణకోసం చెట్లమీదే జీవించిన దశలున్నాయి చరిత్రలో.

ఈ కథవల్ల రుషులకు (బ్రాహ్మణులకు) వుండే ఉన్నతస్థానం, శూద్రులకు వుండే నీచస్థానం అర్థంకావడం లేదా ?

— రాముడు భరతుడికి రాజనీతులు చెప్పే ఘట్టం గురించి నేను రాసిన పదతిని విమర్శిస్తూ కుటుంబరావుగారు— "రాముడు అరణ్యాలలో భరతుణ్ణి కలుసుకున్నప్పుడు రాజ ధర్మాలను గురించి, బోరుకొట్టడం గురించి రంగనాయకమ్మగారు అదిక్షేపించడం వృధా .... ఆ ఘట్టం నిజంగా జరిగితే రాముణ్ణి గురించి మిగిలిన పాత్రలకు ఎలాంటి వికారాలు కలుగుతాయో వివరంగా రాయడం బొత్తిగా నిరుపయోగం. రామాయణ మూలాన్ని అంత లిటరల్‌గా (మక్కీకి మక్కీగా అనిఅర్థం) తీసుకోవడంలో రచయిత్రి ఆశించిందేమిటో అర్థంకాదు" — అన్నారు.

రాముడు రాజనీతులు చెప్పే ఘట్టంలో నేను కేవలం "రచనా విధానాన్ని" వివరించడానికి మాత్రమే అంత మాట మాటా చొప్పునా రాశానని కుటుంబరావుగారి అభిప్రాయం.

రాముడు ఇతర పాత్రల్ని బోరుకొడుతున్నాడే అని చెప్పడానికి మాత్రమేనా ఆ ఘట్టం రాసింది? ఫుట్‌నోట్లలో అనేక విషయాలు వివరించింది ఎందుకు ?

ఆ ఘట్టంలో ఒక సమాజానికి సంబంధించిన విషయాలెన్నో వున్నాయి. కావ్య నాయకుడి మనస్తత్వం ఎంతో స్పష్టంగా కనపడుతోంది. అవన్నీ కథా వస్తువుకి సంబంధించినవే.

రాముడు భరతుడితో — "నీ అసమర్థతవల్ల రాజ్యం పోగొట్టుకున్నావా? నేనయితే పోగొట్టుకునేవాణ్ణి కాను. ప్రజలు నిన్ను రాజుగా అంగీకరించారా ? నన్నయితే అంగీకరించేవారే. ప్రజల్ని క్రూరంగా దండిస్తున్నావా ? నేనయితే దండించేవాణ్ణికాను తెలివిగా రాజ్య పరిపాలన చేస్తున్నావా ? నేనయితే చక్కగా చేసేవాణ్ణి"— అంటూ "నీకన్నా నేను చాలా వుత్తముణ్ణి. సమర్థుణ్ణి. రాజ్యంచెయ్యడానికి నేనే యోగ్యుణ్ణి" — అనే ధోరణితో మాట్లాడుతోంటే — అందులోవున్న హ్యూమర్స్ దర్పం, అహంకారం, ఏదటివాళ్ళని అల్పులకింద జమకట్టడం అనే కావ్యనాయకుడి లక్షణాలు పాఠకులకు వివరించవలసిన అవసరంలేదా?

రాముడు చెప్పిన రాజనీతుల్లో — వుత్తములకీ, మధ్యములకీ, అధములకీ, ఏ రకం వుద్యోగాలివ్వాలో — స్త్రీలని ఎప్పుడూ శంకిస్తూ, ఏమీ రహస్యాలు చెప్పకుండా ఎన్ని కట్టుదిట్టాలో వుంచాలో — నాస్తికుల్ని ఎంత కఠినంగా దండిస్తూ వుండాలో—ఎప్పుడూ సైన్యం, బొక్కసం ఆశ్వికదళాలూ, గజదళాలూ వృద్ధి చేసుకుంటూ యుద్ధాలకెలా సిద్ధంగా వుండాలో — రాజు వ్యాపారులకు ప్రత్యేకంగా ఎలా అనుకూలించాలో — వుద్యోగులకు శెలవులు తగ్గించి పని ఎలా ఎక్కువ చేయించాలో— రాజు ఎప్పుడూ గొప్ప అలంకారాలతో ఆడంబరంగా వుంటూ, ప్రజలకు అరుదుగా కనపడుతూ, ప్రజల్ని ఎలా భయభక్తుల్లో వుంచాలో — ఈ రకం జాగ్రత్తలే గాక, రాజే లంచాలకు లొంగడం, రాజోద్యోగులు ధనవంతుల పక్షాన నిలబడి పేదవార్ని అన్యాయం చెయ్యడం, బ్రాహ్మణులకు ప్రత్యేక సదుపాయాలూ హక్కులూ కలిగించడం — ఈ రకమైన ఫ్యూడల్ ధర్మాలతో నిండిన రామాయణాన్ని (ఇంకా అటువంటి గ్రంథాలని) ఈనాడు కూడా గొప్పగా, పరమ పవిత్రంగా భావించి మనకు మనం ఎంత ద్రోహం చేసుకుంటున్నామో, వొక వర్గం పాఠకులకు స్పష్టం చెయ్యాలని అంత వివరంగా చెప్తే — రచయిత్రి ఆశించిందేమిటో అర్థమే కాలేదట మార్క్సిస్టు అయిన కుటుంబరావుగారికి. రామాయణంలో ఏ ఘట్టంలోనూ కథా వొస్తువుని కన్నెత్తి చూడని కుటుంబరావుగారికి అర్థం గాకపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

రామాయణంలో పెద్ద పెద్ద ఘట్టాలలోనే కాదు— వర్ణనల్లో, పోలికల్లో కూడా "సమాజం" కనపడుతూ వుంటుంది.

పువ్వులు పూసిన చెట్లు, ఆభరణాలు ధరించిన వుత్తమ పురుషులమల్లే వుంటాయి. ఆ వుత్తమత్వం ఆభరణాల వల్ల వొచ్చిందే. అంటే సిరిసంపదల వల్ల. ఆ సంపదలు, ఆభరణాలు లేనివాళ్ళు వుత్తములు కారు. నీచులో, క్షుద్రులో, శూద్రులో.

సీత రావణుడితో — "బ్రాహ్మణుడు శూద్రుడికి మంత్రం ఎలా వుపదేశించడో, అలాగే నేను నా శరీరం నీకు ఇవ్వను." — అంటుంది. —(ఈ పోలికలో విషయం చూడండి.)

అడవిలో మొగ ఏనుగుకి కూడా వందల కొద్దీ ప్రియురాళ్ళుంటారు. (ఆడ ఏనుగుకి మాత్రం ప్రియులు వుండరు.)

ఒక పుస్తకంలో సమాజాన్ని పరిశీలించడం అంటే ఇదంతా పరిశీలించడం కాదా?

మొత్తం మానవ సమాజ పరిణామం అంతా వొక్క పుస్తకంలోనే కనపడాలి అంటే _ అలాంటి పుస్తకం ఏదీ వుండదు. ఏ పుస్తకం అయినా కొన్ని దశలూ, కొన్ని పరిస్థితులూ మాత్రమే చూపించగలుగుతుంది.

రామాయణంలో సేవకుల్ని దానాలిచ్చేసిన సందర్భాలున్నాయి. నరబలికి సంబంధించిన సంఘటనలున్నాయి. (ఋనశ్శేపుడు) స్త్రీలకు వివాహాలే లేని కథలున్నాయి. వివాహాలుండి కూడా ఇంకో పురుషుడితో బిడ్డల్ని కన్న కథలున్నాయి. పర పురుష సంబంధం కొంత నేరమైన కథలూ, పూర్తిగా నేరమైన కథలూ వున్నాయి. — ఇవన్నీ చరిత్రలో వొకే దశకి సంబంధించిన పరిస్థితులు కావు. చరిత్ర పరిణామాన్ని చూపించే దశలే.

అయితే కేవలం వీటిమీదే ఆధారపడి చరిత్రని నిర్ణయించలేరు. నిర్ణయించాలని ఎవ్వరూ అనరు.

రామాయణం సాహిత్యం కాదనటానికి కుటుంబరావుగారు ఏం కారణాలు చెప్పారో, ఆ కారణాల వల్ల అది సాహిత్యం కాకుండా పోదు. పైగా ఆ కారణాల వల్లనే, అదీ వొక దశకు సంబంధించిన సాహిత్యం అవుతుంది.

రామాయణం సాహిత్యం కాదనడం గానీ, సమాజ పరిశీలనకు పనికి రాదనడం గానీ, ఎంత మాత్రం శాస్త్రీయ దృక్పథం కాదు.

రామాయణం సాహిత్యమే.

సాహితీ చరిత్ర బాల్య దశలో సృష్టి అయిన సాహిత్యం. వెనకటి దశల అవశేషాలు కలుపుకుని, ఎక్కువగా ఫ్యూడల్ విలువలు ప్రతిబింబించే సాహిత్యం.

* * *

సాహిత్యం గురించి మార్క్సిస్టు దృక్పథం ఎలా వుంటుంది ?

శాస్త్రజ్ఞానం వృద్ధిపొందినకొద్దీ "మిత్" అంతరించినప్పటికీ, ఇంకా అనేకమైన మూఢనమ్మకాలనీ, అజ్ఞానాన్నీ పంచిపెట్టే రచనలూ, నిలువెల్లా అనారోగ్య లక్షణాలతో నిండిన రచనలూ, సమాజానికేమీ అభివృద్ధి కల్గించని రచనలూ ఉత్పత్తి అవుతోనే వున్నాయి. సెక్సు సాహిత్యాలూ, క్రైమ్ సాహిత్యాలూ ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలోవున్న చెత్త లక్షణాలనుబట్టి వాటిని సాహిత్యం కాదనటానికి వీలు లేదు. ఆ 'చెత్త' వాటికి సమాజంనించి వచ్చిందేగానీ, సమాజంతో సంబంధం లేకుండా ఎక్కడినించో వచ్చింది కాదు.

రోడ్డుపక్క మూలిగే దీర్ఘ రోగులూ, పడుపు వృత్తితో జీవించే స్త్రీలూ, తుక్కు కుండీలో పదార్థాలు ఏరుకునే తినే బిచ్చగాళ్ళూ, జూదరులూ, దొంగలూ, లంచగొండులూ, దురాశాపరులూ, అసూయాపరులూ, దోపిడీదారులూ — వీరందరూ మానవులు కారా ?

"మరి మానవు లయితే అంతంత భయంకరమైన జబ్బులతో పుచ్చిపోయి వుంటారా ? దుమ్ములో, మురికిలో, అశుభ్రంలో దొర్లుతారా ? చెడ్డపనులు చేస్తూ వికృతంగా, అసహ్యంగా జీవిస్తారా ? లంచాలు తీసుకుంటూ ఇతరుల్ని బాధ పెడతారా ? దోపిడీ సాగిస్తూ తమ స్వార్థం తామే చూసుకుంటారా ? — అందుచేత వీళ్లెవ్వరూ మానవులు కారు" — అంటే ఎలా వుంటుందో, సెక్స్ సాహిత్యాన్నో, క్రైమ్ సాహిత్యాన్నో — ఇంకోరకం సాహిత్యాన్నో చూసి — "సాహిత్యం ఇంత సిగ్గుచేటుగా, ఇంత జుగుప్సాకరంగా వుంటుందా ? ఇంత మూర్ఖంగా, ఇంత అజ్ఞానంగా, ఇంత అభివృద్ధి నిరోధకంగా వుంటుందా ? అందుచేత ఇది సాహిత్యంకాదు" — అనడం కూడా అలాగే వుంటుంది.

బిచ్చగాళ్ళూ, లంచగొండులూ, వ్యభిచారులూ, అసూయాపరులూ, తన్నే భర్తలూ, దోపిడీ దారులూ కూడా మానవులే. — వర్గ సమాజం సృష్టించే మానవులు.

సిగ్గుచేటు రచనలూ, అభివృద్ధి నిరోధక రచనలూ, మూర్ఖాగ్రేసర రచనలూ కూడా సాహిత్యమే. — వర్గ సమాజం సృష్టించే సాహిత్యం.

సమాజం దేవుణ్ణి నమ్మినప్పుడు సాహిత్యంకూడా దేవుడిచుట్టూ తిరుగుతుంది.

సమాజం కుల భేదాలు పాటిస్తూ వున్నప్పుడు సాహిత్యంకూడా అదే ధోరణి ప్రదర్శిస్తుంది.

సమాజం స్త్రీని కామానికి మాత్రమే ఉపయోగించినప్పుడు సాహిత్యంకూడా స్త్రీని నీచ స్థాయిలోనే చిత్రిస్తుంది

స్త్రీ పురుష సంబంధాలూ, వివాహ వ్యవస్థా అనేకమైన అవకతవకలతో, కపటాలతో నిండివున్న సమాజంలో, వ్యభిచారం ఒక వృత్తిగా (ఫ్యూడల్ సమాజంలో అయితే అది ధర్మం కూడా) సాగుతోన్న సమాజంలో — జుగుప్సాకరమైన సెక్సు సాహిత్యం సృష్టిగావటం, దానికి ప్రోత్సాహం లభించటంలో అసహజ మేముంది? — సమాజంలో ఒక కోణానికి సంబంధించిన జీవితానికి ప్రతిబింబమే సెక్సు సాహిత్యం. (రామాయణం వంటి ఫ్యూడల్ గ్రంధాలలో శృంగార వర్ణనలకీ, స్త్రీల అంగాంగాల వర్ణనలకీ, నాగరిక సమాజపు సెక్సు సాహిత్యానికీ రూప భేదమేగానీ, గుణభేదం లేదు. కారణం రెండు సమాజాలలోనూ స్త్రీలు అధమ స్థాయిలో వుండడమే.)

అలాగే, సమాజంలో ఎందరికో తప్పులూ, నేరాలూ చెయ్యకుండా జీవించే అవకాశాలు లేవు. మరికొందరికి దోపిడీ చెయ్యడానికీ, ఎన్నెన్నో అక్రమాలతో సాటి మనుషుల్ని పీడించడానికీ అవకాశాలున్నాయి. నేరం చేసే పరిస్థితుల్నీ, నేర మనస్తత్వాన్నీ సమాజమే కల్పిస్తూ ఉన్నప్పుడు దాని ప్రభావంతో కొన్ని రచనలు సృష్టి అయితే (అవి ఎంత చెత్తగావున్నా) అది సమాజానికి సంబంధించిన సాహిత్యం కాదా?

"భౌతిక విశ్లేషణకు పనికిరాని చెత్త రచనలు నేను చాలా చదివాను. సినిమాలు చాలా చూశాను" — అన్నారు కుటుంబరావుగారు.

చెత్త రచనలూ, చెత్త సినిమాలూ, అనడంలో పొరపాటేమీ లేదు. కానీ "అవి భౌతిక విశ్లేషణకు పనికిరావు" — అనడం మాత్రం చాలా పొరపాటు.

జుగుప్సాకరమైన సాహిత్యం సృష్టి అవుతోంది అంటే సమాజంలో అంత జుగుప్సాకరమైన పరిస్థితులు వున్నాయన్నమాట. పరమ చెత్త కథలూ, నవలలూ, సినిమాలు తయారౌతున్నాయంటే సమాజంలో పరిస్థితులు పరమ చెత్తగా వున్నాయన్నమాట.

ఎంత చెత్త సినిమాలయినా, ఎంత చెత్త పుస్తకాలయినా సమాజ పరిస్థితులతో సంబంధం లేకుండా "శూన్యం"లోంచి రావు. వాటిలో కథ ఏదో ఒక కోణంలో సమాజానికి సంబంధించే వుంటుంది. పాత్రలన్నీ సమాజ స్వభావాలనే ప్రదర్శిస్తాయి. సమాజంలో ఏర్పడ్డ అభిప్రాయాలతోటే మాట్లాడతాయి. సమాజంలోంచే తయారయిన పుస్తకాలూ, సినిమాలూ ఎందుచేత సమాజ పరిశీలనకు పనికిరాకుండా పోతాయి?

'భౌతిక విశ్లేషణ' అంటే మార్క్సిస్టు దృక్పథంతో చేసే సమాజ పరిశీలనే అయితే దానికి ఎంత చెత్త సినిమా అయినా, ఎంత చెత్త పుస్తకం అయినా, వాటిలో కథా వస్తువూ, రచనా విధానం ఎంత జుగుప్సాకరంగా వున్నా, ఎంత సిగ్గుచేటుగా వున్నా సమాజ పరిశీలనకు తప్పకుండా పనికివస్తాయి.

వాటిలో ఫ్యూడల్ అభిప్రాయాల ప్రభావం వుందా? కేపిటలిస్టు అభిప్రాయాల ప్రభావం వుందా? రెండూ కలిసి వున్నాయా? ఏది దేన్ని అధిగమించి వుంది? కథా వస్తువు ఏ వర్గానికి అనుకూలంగా వుంది? ఏ రకంగా అనుకూలంగా వుంది? ఆ రచన (లేక సినిమా) ప్రస్తుత సమాజానికి అభివృద్ధి కారకంగా వుందా? అభివృద్ధి నిరోధకంగా ఉందా? ఇటువంటి విషయాలు గ్రహించడానికి అందులో ఎంత చెత్త వున్నా అడ్డురాదు పైగా ఆ చెత్తకూడా పరిశీలనకే ఉపయోగపడుతుంది.

ఉదాహరణకి — ఒక సినిమా కథ చూడండి. అందులో కథా

నాయిక నాగేంద్రుడి భక్తురాలు. పాము పుట్టముందు నిలబడి పూజలు చేసి చేసి వొకరోజు పామునిచూసి, పాముతో మాట్లాడింది. అప్పటినించీ పాము ఆమెని రక్షిస్తూ వుంది.

కథా నాయకుడికి పాములంటే కోపం. అతని తల్లి పాముకాటు వల్లనే చచ్చిపోయిందట.

ఒకసారి ఆ పాము కథా నాయకురాలిని తన వెంట తీసుకువెళ్ళి కారులో వస్తోన్న కథానాయకుడితో కలిసే అవకాశం కలిగించింది. కథా నాయకుడు రోడ్డుమీద పామునిచూసి కారు ఆపి, దాన్ని చంపాలనే అభిప్రాయంతో కారు మళ్ళీ నడపబోయాడు. అది కదల్లేదు. కథా నాయకుడు తుపాకీ పట్టుకుని కిందకి దిగుతాడుగానీ, పాము చెట్లలోకి తప్పుకుంది. హీరో, హీరోయినూ కలుసుకుని కారులో వెళుతూ, శత్రువుల పన్నాగంవల్ల వొక రాత్రంతా వొక భవనంలో చిక్కుబడిపోయి, మర్నాడు కథానాయిక తాత దగ్గిరికి వొచ్చారు. ఆ తాత మనవరాల్ని శంకించి, ఇక నిన్నెవరు పెళ్ళి చేసుకుంటారని కొట్టబోయాడు. కథా నాయకుడు అభయమిచ్చి తనే పెళ్ళి చేసుకుంటా నన్నాడు.

తర్వాత పెళ్ళినాడు, పెళ్ళికూతురు తరుపువా రందరూ ఒక బస్సులో ఎక్కి ప్రయాణం చేస్తోంటే, అందులో శత్రువులు వొక బాంబు పెట్టారు.

ఆ సంగతి "నాగేంద్రుడు" గ్రహించి తన భక్తురాల్ని రక్షించాలి కాబట్టి బస్సు టాపుమీదనించి డ్రైవరు దగ్గిరికి జారాడు. ఆ డ్రైవరు బస్సు ఆపేసి కిందకి పరిగెత్తుతోంటే అందరూ దిగిపోయారు బాంబు పేలినా బస్సుకి తప్ప ఎవ్వరికీ ప్రమాదం జరగలేదు. తర్వాత పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది. పెళ్ళిలోకూడా నాగేంద్రుడు భక్తురాలికి కన పడ్డాడు. పెళ్ళికొడుకు నాగేంద్రుణ్ణి చంపే ప్రయత్నాలు చేస్తోంటే భక్తురాలు మూర్ఛబోయింది.

ఆ నాగేంద్రుడు ఆమె పొట్టమీదకి పాకి ఆమె మూర్ఛ పోగొట్టాడు. భక్తురాలు నాగేంద్రుణ్ణి వారం వారం వొచ్చి పాలుతాగి వెళ్ళమని ప్రార్థించింది. అప్పటినించీ హీరోకి, హీరోయిన్‌కీ నాగే

ద్రుడి గురించి దెబ్బలాటలు ఉధృతం అయ్యాయి. చివరికి నాగేంద్రుడు భక్తురాలి భర్తని చావునించి కాపాడి, అతని శత్రువు లందర్నీ చంపేశాడు. కథానాయకుడికి తన తల్లి పాముకాటువల్ల గాక, ఇంకో విధంగా మరణించిందని తెలిసింది. అప్పటినుంచీ కథా నాయకుడు కూడా భక్తుడై పోయాడు. — ఇదీ కథ.

ఈ కథ పరమ చెత్తగా వుందనటాని కేమీ సందేహం లేదు. అయినా ఇది భౌతిక విశ్లేషణకు పనికిరాకపోవడం వుండదు.

ఈ కథా వొస్తువు సమాజంలోంచి వచ్చిందే. పాముని నాగేంద్రుడనే దేవుడిగా భావించి పూజించడం, తనను పూజించేవారిని నాగేంద్రుడు ఎప్పుడూ కాపాడుతూ వుంటాడని నమ్మడం సమాజానికి సంబంధించిన విషయమే. ఫ్యూడల్ దశకన్నా వెనకటి దశలలో పుట్టిన మూఢనమ్మకం ఇది. తర్వాత కాలంలో ఇది ఫ్యూడల్ సంస్కృతిలో భాగం అయింది.

ఈ కథలో ముఖ్యవిషయం అంతా కల్పనే. (మిత్) అసాధ్యమైన విషయాలని సాధ్యంగా వూహించుకునే అవకాశం కలిగిస్తుంది కల్పన.

ఈనాడు సమాజానికి తగినంత శాస్త్రజ్ఞానం తెలిసినా అది సమాజంలో అనేకమందికి అందుబాటులో లేక సమాజం ఇంకా మూఢ నమ్మకాలలో (సూపర్ స్టిషన్) మునిగే వుంది. (మూఢ నమ్మకాలు పోవడానికి శాస్త్రజ్ఞానం తెలియడం మాత్రమే సరిపోదు.)

ఈ కథ అంతా, కారులూ, తుపాకులూ, పిక్నిక్‌లూ, బాంబులూ వంటి లక్షణాలతో కేపిటలిస్టు వాతావరణంలో సాగింది.

నాగేంద్రుడి మహిమ ముందు (ఫ్యూడల్ నమ్మకం ముందు) కారు కదలని (శాస్త్రజ్ఞానం పనికిరాని) స్థితి వొచ్చింది.

బాంబుల ప్రమాదం ముందు (శాస్త్రజ్ఞానం ముందు) నాగేంద్రుడి మహిమే (మూఢ నమ్మకమే) బలీయమైంది అయింది. మొ తం కథనిండా శాస్త్రజ్ఞానానికి చోటులేని మూఢత్వం ఆక్రమించింది. కథలో కేపిటలిస్టు వాతావరణం వుండి కూడా ఇంత మూఢనమ్మకాల మీద కథ

వడిచింది అంటే— ఈ కథ ప్రతిబింబించే సమాజంలో హ్యూడల్ సంస్కృతి ప్రభావం ఎంత బలంగా వుందో గ్రహించవొచ్చు. ఈ సంగతి భక్తురాలి పాతివ్రత్యం ద్వారా, ఇంకా ఇతర విషయాల ద్వారా కూడా చూడవొచ్చును.

ఇది ఖచ్చితంగా దోపిడీ వర్గాలకు అనుకూలంగా వున్న కథే. ఏ రకంగా ?— కనీసపు తర్కానికైనా తావు ఇవ్వని కథ ఇది. ప్రజలకు ఏమీ చైతన్యం కలిగించకపోగా, వారిని మూఢ నమ్మకాలలోయధాతథంగా వుంచి, ఆలోచించే శక్తి లేకుండా చేసి, వారు తిరగబడని పరిస్థితిలో, దోపిడీ కొనసాగించడానికి సహకరించే కథ ఇది.

ప్రస్తుత సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే ఇది సమాజాన్ని ముందుకు నడపకుండా ఆపేది మాత్రమే కాదు. వెనక్కి వడపటానికి కూడా ప్రయత్నం చేస్తోన్న లక్షణం వుంది దీంట్లో. స్త్రీలకూ, వేద వర్గాలకూ ద్రోహం చెయ్యడమే దీని స్వభావం.

ఇంత మూఢత్వానికి ప్రోత్సాహం దొరికే సమాజంలో కొన్ని అభ్యుదయకరమైన సినిమాలు కూడా ఎందుచేత వొస్తున్నాయి? — ఈ మూఢత్వానికి అవకాశం ఇచ్చిన సమాజం, ఆ అభ్యుదయానికి అవకాశం ఇచ్చిన సమాజం వొక్కటే కదా ? వొకే సమాజంలో ఇదెలా సాధ్యమౌతుంది? —అనే ప్రశ్నలు కూడా చూడాలి.

మనకు, అభ్యుదయకరంగా కనపడే సినిమాలు నిజంగా అభ్యుదయకరమైనవి కావు. అందులో పాములూ, తేళ్ళూ, దేవుళ్ళూ, మహత్యాలూ వుండక పోవొచ్చును. కానీ దానికి కథావొస్తువు కూడా దోపిడీ వర్గాలకు సహకరించేదే.

ఫ్యాక్టరీ యజమానుల కూతుళ్ళు కార్మిక యువకుల్ని ప్రేమించి తండ్రుల్ని ధిక్కరించి పెళ్ళిళ్ళు చేసుకుంటారు. సమ్మెల్లో కూడా పాల్గొంటారు. కథానాయకుడు చచ్చిపోతే, మిగిలిన కథ అంతా ఆ కార్మికుడి భార్య తాలూకు వ్యక్తిగతమైన కథ మాత్రమే అవుతుంది. ఇతర కార్మికు లెవ్వరూ విప్లవకారులుగా నిలబడరు.

వొక్కో సినిమాలో అయితే చచ్చిపోయిన కార్మికుడి చంటి కొడుకు పెరిగి పెద్దవాడై తే గానీ సమ్మె అయినా ముందుకు కదిలే ఆశ వుండదు.

మరికొన్ని సినిమాల్లో భూస్వాములోను, ఫ్యాక్టరీ యజమానుల్లోనూ కూడా వొక్కో మంచివ్యక్తి వుంటాడు. అలాగే కార్మికుల్లో పరమ చెడవాడు వుంటాడు. "అందులోనూ మంచి వాళ్ళుంటారు. ఇందులోనూ చెడ్డ వాళ్ళుంటారు." — అనే అభిప్రాయం కలిగించి, "వర్గస్వభావం" అనే విషయాన్ని "వ్యక్తి స్వభావం" కిందకి మారుస్తారు. ఒక ఫ్యాక్టరీ యజమాని వొక కార్మికుడికి ఏ అవసరానికో దయతో ఏదో సహాయం చేశాడే అనుకోండి. ఈ కార్మికుడికే ఫ్యాక్టరీలో కూలి ఇచ్చేప్పుడు తనకు లాభం లేని పద్ధతిలో, "అదనపు విలువ" మిగలని పద్ధతిలో కూలి ఇవ్వడు. అంటే, ఆ యజమాని మంచితనం అతని వర్గ స్వభావాన్ని, వర్గ ప్రయోజనాలని ఏమీ మార్చదు.

అలాగే, ఒక కార్మికుడు ఎంత దుర్మార్గుడైనా, ఎంత మూర్ఖుడైనా, ఈ చెడ్డతనానికీ, అతని శ్రమతో "అదనపు విలువ" సృష్టించి ఫ్యాక్టరీ యజమానికి అప్పగించడానికీ ఏమీ సంబంధం లేదు. — అతని శ్రమ దోచుకోబడటం మాత్రమే అక్కడ ముఖ్యవిషయం.— ఇవన్నీ వర్గసామరస్యం బోధించి ప్రజల చైతన్యాన్ని సర్వనాశనం చేసే కథలుగా మారి వూరుకుంటాయి. పాము సినిమాకీ, వీటికీ మౌలికమైన తేడా ఏమీ వుండదు. రూపభేదం మాత్రమే.

ఏ రచననైనా భౌతిక దృష్టితో విశ్లేషించాలంటే, (ఎంత చెత్తగా వున్నా) ఆ రచనలో విషయం స్పష్టంగా తెలిసివుండాలి. ఒక పేషంటుకి సంబంధించిన కథ అయితే, ఆ జబ్బు సంగతి అంతా తెలియాలి. కొన్ని జబ్బులు పేదతనం వల్లే వొస్తాయి. కొన్ని జబ్బులు కేవలం సోమరితనం వల్లే వొస్తాయి. కొన్ని మానసిక ఆందోళనల వల్ల వొస్తాయి.

అలాగే, కేబరే డాన్సుల గురించి అయినా, చౌకబారు డిటెక్టివ్

పు స్తకాల గురించి అయినా, మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించ వొచ్చును.

ఈ పరిశీలన కోసమే నేను "రామాయణం" తీసుకున్నాను.(నేను పరిశీలించిన విధానంలో ఎన్నో లోపాలు వుండవొచ్చును. అది వేరే సంగతి.)

కానీ, దానికి కుటుంబరావుగారు — "మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించాలంటే కౌటిల్యుడి అర్థశాస్త్రం ధర్మశాస్త్రాలూ, మహా భారతం హరివంశం వంటి పురాణాలూ వున్నాయి. రామాయణం దేనికి ?" — అన్నారు.

దానికి నా సమాధానంలో — "కుటుంబరావుగా రన్నది ఎలా వుందంటే— వైద్యా చెయ్యాలంటే న్యూమోనియా వుంది. వుబ్బసం వుంది. గుండె జబ్బులున్నాయి. పోలియో వుంది. టైఫాయిడ్ దేనికి?" —అన్నట్టుంది — అన్నాను.

దానికి కుటుంబరావుగారు సమాధానం ఇస్తూ — "వైద్యంచేసే వారు అన్ని రోగాలకూ వేరువేరు చికిత్సలు చేస్తారు. సోషల్ ఆంత్రోపాలజీలో అనేక రకా లుంటాయని నాకు తెలీదు" — అన్నారు.

రోగాలకు వైద్యం వేరు వేరుగా చేసినా అసలు అన్ని రోగాలకూ చెయ్యాలి గద ? "ఈ రోగానికి వైద్యం కుదరదు" .... అనగూడదు కదా ? (ఇంకా వైద్యం కనిపెట్టని రోగాలు వుండవొచ్చును. వాటికైనా వైద్యం అంటూ ఉండాలి గద ?)

"సోషల్ ఆంత్రోపాలజీలో అనేక రకాలు ఉంటాయని నాకు తెలీదు" — అంటున్నారు కుటుంబరావుగారు.

కానీ, మార్క్సిస్టులూ, నాన్ మార్క్సిస్టులూ ఒకే దృక్పథంతో పరిశీలిస్తారా? — మార్క్సిస్టులు సమాజ పరిశీలనకు చారిత్రక భౌతిక వాదాన్ని మాత్రమే శాస్త్రీయ దృక్పథంగా పరిగణిస్తారు. "సోషల్ ఆంత్రోపాలజీ" —అనే శాస్త్రాన్నే బూర్జువా శాస్త్రంగానెంచుతారు.

సమాజాన్ని మార్క్సిస్టులు ఒక దృక్పథంతోనూ, నాన్ మార్క్సి

స్టులు వేరొకకం దృక్పథంతోనూ పరిశీలించుతూ వున్నప్పుడు సమాజ శాస్త్ర పరిశీలన రెండు రకాలుగా వున్నట్టు కాదా?

అటు ఫ్యూడల్, బూర్వా దృక్పథాలతో చూసినా, ఇటు మార్క్సిస్టు దృక్పథంతో చూసినా రామాయణాన్ని నిక్షేపంలా పరిశీలించ వచ్చును. దానికేమీ సందేహం లేదు.

"నేను సాహిత్యంగా రామాయణాన్ని మెచ్చుకోలేను" — అన్నారు కుటుంబరావుగారు.

సాహిత్యంగా మెచ్చుకోవడం, సాహిత్యంగా ఒప్పుకోవడం — రెండూ వొకటి కాదు. ఎవరు మెచ్చుకున్నా, మెచ్చుకోకపోయినా రామాయణం సాహిత్యమే. అది వొప్పుకోవలసిందే.

ఒక వ్యక్తికి గానీ, ఒక వర్గానికిగానీ నచ్చడాన్నిబట్టీ, నచ్చకపోవడాన్నిబట్టీ ఒక పుస్తకాన్ని సాహిత్యం అనో, కాదనో నిర్ణయించడం శాస్త్రీయ దృక్పథం కాదు.

వొక హేతువాది ఒక మత గ్రంథాన్ని సాహిత్యం కాదన్నా, వొక దైవభక్తుడు వొకనాస్తిక రచనని సాహిత్యం కాదన్నా — ఈ రెండు అభిప్రాయాలూ శాస్త్రీయమైనవి కావు.

"పాత్ర చిత్రణలోగానీ, మిగతా కళాత్మక విలువలలోగానీ వొక పుస్తకం ఉత్తమంగానే వుండాలి. అలా వుంటేనే సాహిత్యం" — అనడం మార్క్సిస్టు విమర్శ కాదు.

మార్క్సిస్టు విమర్శ అంటే వొక విషయం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో చెప్పడం కాదు.

ఎలా ఉంటుందో, ఎలా ఉండదో చెప్పడం.

భౌతికవాదం అంటే — "కోతిగుడ్డుకోంచి కోడిపిల్ల రావాలి. రాయిలోంచి రాకూడదు" — అని చెప్పడం కాదు.

"కోడి గుడ్డులోంచే వస్తుంది. రాయిలోంచి రాదు" — అని చెప్పడం.

మార్క్సిస్టు విమర్శ — వొక రచనగానీ, వొక విషయంగానీ

ఎలా వుందో, అలా ఎందుకు ఉందో, దానికి సంబంధించిన సహజమైన కారణాలు వివరిస్తుంది. (వివరించాలి.) *

అందుచేత రామాయణం ఎలా వుందో, అలా ఉండడానికి సహజమైన కారణా లేమిటో చూడకుండా — "రామాయణాన్ని సాహిత్యంగా నేను మెచ్చుకోలేను" — అనడం మార్క్సిస్టు విమర్శకాదు. మెచ్చుకోవడమా ? మెచ్చుకోకపోవడమా ? అన్నదికాదు ప్రశ్న.

రామాయణం ఎన్నో వేల సంవత్సరాలనించీ సమాజంలో వుంది. — అది వొక వాస్తవం. అది ప్రజల్ని ప్రభావితం చేస్తోంది — అది ఇంకో వాస్తవం.

మందు ఈ వాస్తవాలు గ్రహించాలి. గ్రహించడం మాత్రమే కాదు.

తన భౌతిక దృక్పథంతో చారిత్రకంగా రామాయణం పాత్ర ఏమిటో పరిశీలించాలి. అంటే, ప్రతీ మార్క్సిస్టూ తనే పరిశీలించాలని కాదు. అలా పరిశీలించే విధానాన్ని శాస్త్రీయ విధానం అని అర్థం చేసుకోవాలి — దానికి వ్యక్తిగతమైన ఇష్టా ఇష్టాలతో పనేముంది ? కుటుంబరావుగారు దాన్ని మెచ్చుకోరు కాబట్టి అది పరిశీలనకే పనికి రాకుండా పోతుందా?

రామాయణంలో అవక తవకలూ, అసందర్భాలూ లేకుండా, పాత్ర చిత్రణ చక్కగా వుంటే కుటుంబరావుగారు దాన్ని సాహిత్యంగా మెచ్చుకునేవారే కదా ? — అంటే, ఎంతో ప్రాచీన కాలంలో రాసిన వొక గ్రంథంలో రచనా విధానం, ఈ కాలం రచనా విధానం లాగ ఎంతో అభివృద్ధి చెంది వుండాలనడమే కదా?

---

* "... the Marxist is distinguished from the "enlightener", for example, by the fact that the "enlightner" assigns to literature specific aims and specific demands; whereas the "enlightner" judges it from the point of view of specific ideals, the Marxist elucidates the natural causes of the appearance of this or that work." [Lunacharsky].

పైగా 'విషవృక్షం' గురించి విమర్శిస్తూ వొకచోట —"ఇంకోటి పట్టిచ్చేది ఏమిటంటే రామాయణంలో ఆచార వ్యవహారాలను ఈ కాలపు సామాజిక విలువలతో అంచనా కట్టడం." — అన్నారు.

రామాయణంలో ఆచార వ్యవహారాలని ఈ కాలపు విలువలతో అంచనా కట్టడం జరిగిందా విషవృక్షంలో ?

రామాయణంలో స్త్రీలని గానీ, శూద్రుల్ని గానీ గౌరవించడం వుండాలనీ, ఎందుకు లేదని నే నెక్కడా అడగలేదు. వుండదని స్పష్టంగా చెప్పి, ఎందుకు వుండదో కారణాలు చెప్పాను.

రామాయణం ప్రాచీన గ్రంథమనే విషయం అర్థం చేసుకోకుండా, "రాసిన తీరు ఏమీ బాగాలేదు, బాగా వుంటేనే సాహిత్యంగా వొప్పుకుంటాను." —అనే అభిప్రాయం వెలిబుచ్చి, రామాయణంలో రచనా విధానాన్ని ఈ కాలపు రచనా విధానంతో అంచనా కట్టింది కుటుంబరావుగారే.

—"జన బాహుళ్యం ఆరాధించే రాముడి కథ "విషవృక్షం" కు ప్రేరణ ఇచ్చింది కానే కాదని నా వుద్దేశ్యం." — అన్నారు కుటుంబరావుగారు. (అంటే, జనం వుత్తముడైన రాముడి పాత్రనే ఆరాధిస్తున్నారు. విషవృక్షంలో రాముడి వంటి పాత్రని కాదు. "విషవృక్షం" లో రాముడు ఆరాధనీయంగా కనపడడు. జనం వినే కథలో రాముడు ఆరాధనీయంగానే వుంటాడు — అని అర్థం.)

జనబాహుళ్యం ఆరాధించే రాముడి కథకీ, 'విషవృక్షం' లో కథకీ, కథ నడకలో గానీ, ముఖ్య సంఘటనల్లో గానీ తేడా వుందా ? రాముడు రుషివేషంలో వుండి వేటాడిన సంగతి ప్రజలకు తెలీదా ? వాలిని చాటుగా చంపిన సంగతి ప్రజలకు తెలీదా ? భార్యని శీల పరీక్ష కోరిన సంగతి ప్రజలకు తెలీదా? చివరికి భార్యని విడిచిపెట్టిన సంగతి ప్రజలకు తెలీదా :— ఇన్నీ తెలిసి కూడా ఎందుకు ఆరాధిస్తున్నారు ? రాముడు చేసిన కార్యాలన్నీ చాలా వుత్తమంగా కనపడి మాత్రమే కాదు.

పుట్టిన దగ్గిరనుంచీ చుట్టుకున్న సమాజ ప్రభావం. కష్ట సుఖాలకు దేవుణ్ణి నమ్మవలసిన సమాజ పరిస్థితులు.

ప్రజల జీవన పరిస్థితులు అద్భుతంగా మారి, రాముడి పాత్రనీ, రామాయణ స్వభావాన్నీ విమర్శించి చూడగల చైతన్యమే కలిగినప్పుడు, పూర్వం వారికెంతో ఆరాధనీయంగా కనపడే కథనే విన్నప్పటికీ (విషవృక్షం కథని కాదు.) పూర్వపు అమాయకత్వంతోనే పూర్వపు భయభక్తులతోనే ఆరాధిస్తారా ?

ఇప్పటికీ చైతన్యం కలిగినవారు చాలామంది, హ్యూడల్ గ్రంథాల మీద భయభక్తులు వొదిలెయ్యడం మనం నిత్యం చూస్తోన్న విషయమే. చైతన్యం కలగకముందు రాముడి కథమీద వున్న ఆరాధనా భావం తర్వాత ఎందుకు విడిచిపెట్టాలి? — ఆ కథ అలాగే వుందికదా? ఏమీ మారలేదు కదా ?

రామాయణం మీద విమర్శలు చేసిన వారందరూ ఎవరి ధోరణిలో వారు, వేరే వేరే రాశారు గానీ, అసలు కథని ఏమీ మార్చలేదు. ఆ వుత్తమ కథ ఇప్పటికీ అలాగే వుంది. ఒకసారి దాన్ని ఆరాధించినవాళ్ళే, తర్వాత ఆరాధించక పోవడానికి కారణం ఏమిటి?

ఆ వుత్తమ రాముడు తర్వాత కాలంలో వారికి అసంతృప్తి కలిగించడం వల్లనే. అంటే ఆ "వుత్తమత్వం" ఆ పాత్రలో వున్నదికాదు. ప్రజల అమాయకత్వం వల్లా, భయం వల్లా దానికా వుత్తమత్వం వొచ్చింది.

భరతుడి పాత్రా, లక్ష్మణుడి పాత్రా రాముడి పాత్రకన్నా వుత్తమంగా వుంటాయి చైతన్యంతో పరిశీలించినా ఈ అభిప్రాయంమారదు. అంటే ఆ రెండు పాత్రల్లో నిజంగానే వుత్తమత్వం వుందన్నమాట. దానికి కారణం _ వారిద్దరూ రాముడికి దాసులు కావడమే. సమాజంలో దాసుడు యజమాని దగ్గిర ఎలాంటి పాత్ర నిర్వహిస్తాడో అలాంటి పాత్రలకు ప్రతిబింబాలు కావడమే.

(యజమానిలో లేని వుత్తమత్వం దాసుడిలో వుండడం చాలా సహజమైన విషయం.)

— కుటుంబరావుగారు 'విషవృక్షం' లోపాలను. విమర్శిస్తూ— (ముఖ్యమైనవి ఇందులో ప్రస్తావించాను.)

—"మార్క్సిస్టుకి గతి తార్కిక భౌతిక వాదం తెలిసివుండాలి." — అన్నారు.

"గతి తార్కిక భౌతిక వాదం" అంటే మార్క్సిస్టులు ప్రకృతిని (ప్రకృతి గతిని) చూసే విధానం. "ప్రకృతిలో వొస్తువులూ, విషయాలూ అన్నీ, ఇసకరేణువు నించీ, సూర్యబింబం వరకూ పరస్పర సంబంధం కలిగి వుంటాయి. వొకదాని మీద వొకటి ఆధారపడి వుంటాయి. వొకదాని చేత వొకటి నిర్ణయించబడుతూ వుంటాయి. అంతేగాని, దేనికదే విడిపోయి, స్వతంత్రమైన వునికితో వొకదానితో వొకటి సంబంధం లేకుండా అస్తవ్యస్తంగా వుండవు.

అంతేగాదు ప్రకృతిలో ప్రతీ వస్తువూ ప్రతీ విషయమూ, ఎదుగుతూ అభివృద్ధి చెందుతూ గతంలోకన్నా మేలైన స్వభావంతో, గుణాత్మకమైన మార్పు చెందుతూ పాతది నశించిపోతూ, క్షీణించిపోతూ వుంటుంది. ఇది చక్రం మళ్ళీ మళ్ళీ తిరగడం లాంటి కార్యం కాదు. పాత దానికన్నా మేలైన, స్వభావంలోనే అభివృద్ధికరమైన పరిణామం జరుగుతూ వుంటుంది. అందుచేత వెనకటి జీవరాసులూ, వెనకటి భౌతిక పరిస్థితులూ మళ్ళీ మళ్ళీ వొస్తాయి అనుకోవడదు. వాటికన్నా మెరుగైన, అభివృద్ధి చెందిన జీవులూ, పరిస్థితులూ మాత్రమే వొస్తాయి.

నశించిపోయే దానికన్నా, కొత్తగా తలఎత్తే దానికే ప్రకృతి ఎక్కువ అనుకూలంగా వుంటుంది.

(వొక వృద్ధుడి శరీరంకన్నా, వొక చంటిబిడ్డ శరీరంలో

జీవళక్తి, చైతన్యం, అధికంగా వుంటాయి.) — ఇవీ 'గతితర్కం'లో ముఖ్యమైన సూత్రాలు. *

మార్క్సులు గతితార్కిక దృష్టితోనే మానవ చరిత్రని పరిశీలించడం వల్ల అది "చారిత్రక భౌతికవాదం" అవుతోంది.

"మార్క్సులకు గతితర్కం తెలిసివుండాలి" అన్న కుటుంబరావుగారికి అది ఎంత బాగా తెలుసో ఇప్పటికి చాలా వరకు చూశాం. ఇంకా వొకటి రెండు విషయాలు చూడవలసిన అవసరం వుంది.

కుటుంబరావుగారు వెలిబుచ్చిన అభిప్రాయాలలో ఏ వొక్కటీ గతితార్కిక దృష్టితో చూసింది కాదు.

చెత్త సినిమాల గురించీ, చెత్త పుస్తకాల గురించీ ప్రస్తావించిన చోట కుటుంబరావుగారు — "నేను మార్క్సిస్టుగా, భౌతిక వాదిగా ఏ కోవకు చెందుతానో ఏమోగానీ ...." — అన్నారు.

అంటే — "నేను మార్క్సిస్టుని కానా? నేను భౌతికవాదిని కానా?" — అనడమే.

ఒక వ్యక్తి భౌతికవాది అవునో కాదో, మార్క్సిస్టు అవునో కాదో ఎవ్వరూ నిర్ణయించరు. ఆ వ్యక్తి సంఘటనలను ఏ దృక్పథంతో చూస్తాడో, ఆ దృక్పథమే ఆ వ్యక్తి దేనికి చెందుతాడో నిర్ణయిస్తుంది.

రాళ్ళని పొదిగించి కోడిపిల్లల్ని చేశారంటే భౌతికవాది నమ్మడు. నమ్మితే భౌతికవాది అవడు. ఆ సంఘటనని అతను చూసిన విధానమే అతడు భౌతికవాది అవునో కాదో నిర్ణయిస్తుంది.

అలాగే ఒక మార్క్సిస్టు సామాజికమైన సంఘటనల్ని చూసిన విధానమే అతడు మార్క్సిస్టు అవునో కాదో నిర్ణయిస్తుంది.

---

* గతితర్కం = డైలెక్టిక్స్.

గతితార్కిక భౌతిక వాదం = డైలెక్టికల్ మెటీరియలిజమ్.

ఇక్కడ సందర్భాన్ని బట్టి, దీన్ని గురించి చాలా క్లుప్తంగా ప్రస్తావించాను. ఇదే "మొత్తం సారాంశం" అనుకోకూడదు.

రామాయణంలో ప్రక్షిప్తా లున్నాయని పండితు లేనాడో నిర్ణయించారు కబట్టి, ఆ ప్రక్షిప్తాలవల్లనే రామాయణం చెడిపోయిందనే పండితుల దృక్పథాన్నే మార్క్సిస్టు అనుసరించ వచ్చునా? ప్రక్షిప్తాలకూ, రామాయణానికీ ఉన్న సంబంధం, ప్రక్షిప్తాలు రామాయణంలో చేరడానికీ, ఆనాటి సమాజ పరిస్థితులకీ ఉన్న సంబంధం. పాత్ర పోషణ అవకతవకగా ఉండడానికీ, ప్రాచీన రచనా విధానానికీ ఉన్న సంబంధం, రామాయణానికీ ఈనాటి సమాజానికీ ఉన్న సంబంధం — ఇటువంటి విషయాలన్నీ గతి తార్కిక దృష్టితో చూసే విమర్శించారా కుటుంబరావుగారు?

రామాయణం ప్రక్షిప్తాలవల్ల చెడిపోయిందని పండితులు నిర్ణయించినట్టే వొక మార్క్సిస్టుకూడా నిర్ణయించ వచ్చునా? దేవుడున్నాడని కూడా పండితు లేనాడో నిర్ణయించారు. పండితులు నిర్ణయించిందే మార్క్సిస్టు అంగీకరిస్తాడా?

అలాగే అహల్య విషయం ప్రస్తావిస్తూ — కుటుంబరావుగారు — "రుషి పత్నుల వ్యభిచారాలకు అంతేలేదు" — అన్నారు.

దానికి నేను సమాధానంగా — "చరిత్ర దశల్ని అర్థం చేసుకున్న వాళ్ళు అహల్య వంటి రుషి పత్నుల చర్యల్ని వ్యభిచారం అనరు. అది పాత నీతికీ, కొత్త నీతికీ సంఘర్షణ. నీతులు అలా మారడానికిమాత్రమే కారణం చూడాలి" — అన్నాను.

మళ్ళీ దానికి సమాధానంగా కుటుంబరావుగారు — "అహల్య వంటి రుషిపత్నులు చేసినదాన్ని పౌరాణికులు వ్యభిచారం అన్నారు. వాళ్ళ మొగుళ్ళు, వాళ్ళనూ, వాళ్ళ పిల్లలనూ శపించారు. నేను వ్యభిచారం అంటే దానికి తప్పు పట్టాలా?" — అన్నారు.

అహల్య విషయాన్ని పౌరాణికులు ఏ దృష్టితో చూశారో "గతి తార్కిక భౌతికవాది" అయిన కుటుంబరావుగారుకూడా ఆ దృష్టితోనే చూస్తారా?

కథ ప్రకారం చూస్తే రంభ వేశ్యగానీ, అహల్య వేశ్య (లేదా వ్యభిచారి) అవుతుందా? అహల్య ఇంకో పురుషుడితో సంభంధా

ఇష్టపడడం వ్యభిచారం అవుతుందా ? అహల్య చర్యకీ, ఆనాటి సమాజానికీ వున్న సంబంధం ఏమిటి ? తన చర్య భర్తకు తెలుస్తుందని అహల్య ఎందుకు జంకవలసి వచ్చింది ? తన చర్య భార్యకు తెలుస్తుందేమోనని దేవేంద్రుడు ఎందుకు జంకలేదు ? పర పురుషుడితో సంబంధం స్త్రీకే నేరం ఎందుకు అయింది ? పురుషుడికి లేని శిక్ష స్త్రీయే ఎందుకు అనుభవించింది ? ఆ భర్తే ఆమెని మళ్ళీ ఎందుకు స్వీకరించాడు ? ఆమె కొడుకు కూడా (శతానందుడు) తల్లిని ఎందుకు గౌరవించాడు ? బాల రాముడితో విశ్వామిత్రుడు అహల్యకు ఎందుకు నమస్కారం చేయించాడు ? — ఈ విషయాలేమీ కన్నెత్తి చూడకుండా, ఆనాటి అహల్య చర్యని తర్వాత కాలంనాటి వ్యభిచారంతో పోలుస్తూ, 'గతి తర్కం' మాట్లాడుతూ — "వాళ్ళన్నారు. కాబట్టి నే నన్నానూ. నన్ను తప్పు పట్టాలా ?" అంటున్నారు.

అదే ఒక సంఘ సంస్కర్తో, సాధారణ నాస్తికుడో అంటే తప్పు పట్టక్కర్లేదుగానీ, మార్క్సిస్టునని చెప్పుకునే వ్యక్తి అంటే తప్పు పట్టకుండా వూరుకుంటారా ?

అహల్య భర్త గౌతమ మహర్షి, అహల్యని వ్యభిచారి అన్నాడు కాబట్టి కుటుంబరావుగారుకూడ ఆ మాటే అంటారా ? అప్పుడు కుటుంబరావుగారుకూడా "కుటుంబరావు మహర్షి" అవుతారుగానీ, మార్క్సిస్టు ఎలా అవుతారు ? గతి తార్కిక భౌతికవాది ఎలా అవుతారు ?

మార్క్సిస్టు విమర్శకుడు "సంఘటనలను" తన దృక్పథంనించి చూడకుండా దేవుళ్ళని నమ్మే పండితుల దృక్పథంనించీ, తపస్సులుచేసే మహర్షుల దృక్పథంనించీ చూస్తే ఆ వ్యక్తి మార్క్సిస్టుగా "ఫినిష్" (ఆఖరు) ఐపోతాడు. •

---

* "If a Marxist cannot objectively sense the ties between the phenomena which surround him, then he is finished as a Marxist." [Lunacharsky]

— "రామాయణాన్ని చెత్త పుస్తకంకింద ఏనాడో జమకట్టాను. నలభై ఏళ్ళ క్రితమే విశ్వనాథవారు రామాయణ కల్పవృక్షం రాస్తున్నందుకు విమర్శించాను" — అన్నారు కుటుంబరావుగారు.

నలభై ఏళ్ళ తర్వాత ఈనాడు కల్పవృక్ష స్వభావానికి విరుద్ధమైన 'విషవృక్షాన్ని' కూడా అదే వ్యతిరేకతతో విపుర్శించారు. రామాయణం చదవడం మానేసినా, తగలబెట్టినా అర్థంవుందిగానీ, ఈ విధంగా తిరగ రాయడం ఏమీ అర్థంలేని పని అని తేల్చారు. విషవృక్షం కేవలం "ఉబలాటం"తో రాసింది మాత్రమే నన్నారు.

గతి తార్కిక దృక్పథంతో సామాజిక సంఘటనలను చూడవలసిన మార్క్సిస్టు — దీర్ఘ కాలంగా వునికిలోవుండి ఇక అభివృద్ధి చెందలేని సహజ స్వభావంతో నాశనం కావడం మొదలుపెట్టిన విషయానికన్నా అప్పుడే తలఎత్తి, అభివృద్ధి చెందే స్వభావం కలిగిన నూతన శక్తినే ప్రధాన విషయంగా ఎంచాలి.

కానీ కుటుంబరావుగారు చేసింది ఏమిటి?

ఆయన దృష్టికి — కల్పవృక్షమూ అనవసరమే.

— విషవృక్షమూ అనవసరమే.

మార్క్సిస్టు అయిన వ్యక్తి, పరస్పర విరుద్ధమైన రెండు విషయాలనూ ఒకే దృష్టితో చూస్తాడా? రెండింటికీ ఒకే రకం స్థానం ఇస్తాడా?

విరుద్ధ విషయాలను ఒకేరకంగా చూడడం కనీసపు లోకజ్ఞానం ఉన్నవాళ్ళుకూడా చెయ్యరు. అలాంటి తల తిరుగుడు వ్యవహారం ఫ్యూడల్ వేదాంతులకు మాత్రమే చెల్లుతుంది. వాళ్ళు మట్టినీ, బంగారాన్ని ఒక్కలాగే చూస్తారు. కష్టాన్నీ, సుఖాన్నీ ఒక్కలాగే చూస్తారు. (కల్ప వృక్షాన్నీ, విష వృక్షాన్నీ ఒక్కలాగే చూస్తారు.)

మార్క్సిస్టు అయిన వ్యక్తి అలా ఎన్నటికీ చెయ్యడు. అభివృద్ధి నిరోధకమైనదాన్ని చూసి — "చెత్త" అని మొహం తిప్పెయ్యడమే పరిష్కారంగా చెప్పడు.

అభివృద్ధి నిరోధకమైనవాటి విషయంలో మార్క్సిస్టు ఏ రకంగా ప్రవర్తించాలో "మావో" మాటల్లో చూడండి —

"అభివృద్ధి నిరోధకమైందేదయినా ఒకటే. దాన్ని కొట్టందే పడదు. ఆ పని నేలమీద దుమ్ము తుడవడం లాంటిదే. చీపురు ఏ మూల తగలకపోతే ఆమూల దుమ్ము ఉండిపోతుందేగానీ, దానికదే పోదు." *

• • •

ఏ ఒక్క విషయాన్నీ గతి తార్కిక భౌతిక దృక్పథంతో పరిశీలించని వ్యక్తి — నేను మార్క్సిస్టుని కానా?" — అనడం ఎలాంటిదంటే —

"డాక్టరుగారూ! పిల్లాడికి జ్వరం తగ్గలేదండీ."

"మందిచ్చానా? లేదా?"

"ఇచ్చారండీ."

"మరి తగలేదంటావేం?"

"మరి తగ్గలేదు గదండీ?"

"అసలు నేను డాక్టర్‌నా? కానా?"

"అయ్యో! డాక్టరు గాకపోవడం ఏమిటండీ?"

"మరి తగలేదంటావేం?"

"మరి తగ్గలేదు గదండీ? .... దగ్గూ .... రొంపా ... తల పోటూ .... పిల్లాణి ...."

"మందిచ్చానా? లేదా?"

"అయ్యో! ఇచ్చారండీ! మీ రిచ్చిన మందు .... ఏవన్నా .... తప్పేమో ..."

---

* "Everything reactionary is the same; if you don't hit it, it won't fall. This is also like sweeping the floor; as a rule, where the broom does not reach, the dust will not vanish off itself."

[Requoted from "Chinese Literature." No. 6. 1974]

"ఏపిటీ ? నా మందు తప్పా ? నేను డాక్టర్‌నా ? కాదా ?"

"ఎంతమాట ! తమరు డాక్టరు గాకపోవటం ఏవిటండీ ?"

"మరి మందు తప్పంటావేం ?"

"మరి జ్వరం తగ్గలేదు గదండీ ? .... తల పోటూ, రొంపా.... నడుం ...."

"అసలు మీ జబ్బే పరమ చెత్త. ఒక్క జబ్బు అన్ని రకాలుగా వుండడం ఏవిటి ? వుంటే జ్వరం ఒక్కటే ఉండాలి. మహా వుంటే కాస్త తలనొప్పి వుండొచ్చు. అంతేగానీ, జ్వరంలో దగ్గేవిటి ? దగ్గులో నడుం నొప్పేవిటి ? నడుం నొప్పిలో రొంపేవిటి ? రొంపలో .... అబ్బ !.... ఇన్ని అసందర్భాలతో, అవకతవకలతో .... అసలు ఇది ఎలా కుదురు తుంది వైద్యానికి ?"

"మరి జబ్బొస్తే ఏం చెయ్యాలండీ ? — అన్నిటికీ పనికొచ్చే మందు ఏవన్నా వుందేమో మీరే చూడాలి."

"ఏం చూడక్కర్లేదు. మాట్లాడకుండా ఊరుకో."

"అమ్మో ! పిల్లాడు పాడై పోడా అండీ ? ఇప్పటికే చాలా రోజు ల్నించీ .... ఒంట్లో బాగాలేక .... ఏదో విధానం మీరే చూడాలి."

"ఏమో ! పరమ చెత్త జబ్బు ! నాకు నచ్చలేదు సుమా ! నేను దీన్ని నరయిన జబ్బుగా మెచ్చుకోలేను."

"అయ్యో ! వైద్యం చెయ్యడానికి జబ్బు నచ్చడం నచ్చకపోవడం ఏవిటండీ ? .... డాక్టరుగారూ ! నేనేం చెయ్యనండీ ! నా కర్మగావున్ను. నా పిల్లాడు .... జబ్బుతో ...."

"సరే ! మొన్న మందిచ్చానుగా ? మళ్ళీ అదే ఇస్తాను. అదే వాడు. తెలిసిందా ?"

"అయ్యో ! అది పనికిరాలేదు కదండీ ?"

"ఎందుకు పనికిరాదూ ? అదే పనికొస్తుంది. నేను డాక్టర్ని. నే నేదిస్తే అదే మందు. ఎందుకు పనికిరాదూ ?"

"....."

"ఏవిటి అలా చూస్తావు ? నీ కొడుకు జబ్బుమీద ఇప్పటికీ నా అభిప్రాయం మార్చుకోను. నేను మందు మాత్రం మార్చను. ఏమంటావు ?.... మాట్లాడకుండా వెళుతున్నా వేమిటి ? మందక్కర్లేదా ?"

★

కొన్ని ప్రశ్నలూ—
కొన్ని పందేహాలూ—
కొన్ని వ్యతిరేక వివఁర్శలూ—

రామాయణం ఫ్యూడల్ సంస్కృతిని చాటుతోంది అన్నారు. ఆ విషయం వ్యాసాల ద్వారా చెప్పవచ్చును. రామాయణం అంతా తిరిగి రాయటం ఎందుకు!

— ఫ్యూడల్ సంస్కృతి మీద వ్యాసాలు రాసినప్పుడు కూడా ఫ్యూడల్ సాహిత్యం నించే వుదాహరణలు తీసుకోవాలి. "ఫ్యూడల్ సంస్కృతీ అంటే ఇలా వుంటుంది. అలా వుంటుంది. స్త్రీని పాతివ్రత్యం ముసుగులో వుంచుతుంది. శూద్రుల్ని నీచస్థాయిలో వుంచుతుంది." — అని సిద్ధాంతీకరిస్తూ ఎన్ని వ్యాసాలు రాసినా, అవన్నీ వొక్క కథలో కనిపించేపాటి వాతావరణాన్ని అయినా చూపించలేవు. కథల్లో పాత్రలుంటాయి. వ్యాసాల్లో పాత్రలుండవు. కథల్లో జీవితం వుంటుంది. వ్యాసాల్లో సిద్ధాంతం మాత్రమే వుంటుంది. సంస్కృతిని సిద్ధాంతీకరించడం కన్నా జీవితానుభూతుల్లో చూపించడమే సరైన పద్ధతి. అంటే చదివే వారికి ఎక్కువగా వుపకరించే పద్ధతి. — 'విష వృక్షం' లో ఫుట్‌నోట్సు అన్నీ వ్యాసాల్లాంటివే విషవృక్షం చెప్పదలుచుకున్నది కథల రూపంలోనూ, వ్యాసాల రూపంలోనూ కూడా చెప్పినట్టే.

• • •

రామాయణ కల్పవృక్షానికి వ్యతిరేకంగా విష వృక్షం అని పేరు పెట్టారా?

— విషవృక్షం చదివితే ఇలా అడుగుతా రనుకోను. ప్రతీ దోపిడీ వ్యవస్థా వొక విషవృక్షమే. రామాయణానికి దోపిడీ సమాజ లక్షణాలన్నీ వున్నాయి. వాల్మీకి కథలో మరుగున పడ్డ రహస్య సత్యాలూ, (అందులో వున్నవే. వైకి అంతగా తెలియనివి.) పరస్పర వ్యతిరేకాలూ, కపటాలూ స్పష్టంగా వెలుడిలోకి తీసి చూసినప్పుడు దాని స్వరూపం విషవృక్షమే. అందుకే దానికా పేరు.

* * *

ఏనాడో రాయబడ్డ రామాయణాన్ని నిన్న మొన్నటి మార్క్సిస్టు దృష్టితో విమర్శించడం ఏమిటి? ఆశ్చర్యంగా వుంది.

— ఈ సందేహం చాలా ఎక్కువమంది వ్యక్తం చేశారు. రామాయణానికీ, మార్క్సిజానికీ లంకె పెట్టడం వినగానే సాధారణంగా ఈ సందేహం కలగడానికి అవకాశం వుంది.

భూమి గుండ్రంగా వుందనే సంగతి మానవులకు ఎంతోకాలం తెలియదుకదా? తర్వాతే కనిపెట్టారు. అయితే భూమి గుండ్రంగా వుందని కనిపెట్టిం తర్వాతే అది గుండ్రంగా ఉన్నట్టా? అంతకుపూర్వం నించీ ఉన్నట్టేనా? సరిగ్గా అదే సూత్రం మానవ చరిత్రకీ మార్క్సిజానికీ వర్తిస్తుంది.

మార్క్సు నిన్న మొన్నటివాడే. ఆయనకు పూర్వంకూడా సోషలిస్టు భావాలున్నాయి. ప్రకృతికీ, సమాజానికీ సంబంధించిన తత్వశాస్త్రాలున్నాయి. కానీ, మార్క్సు వాటిలోవున్న అశాస్త్రీయ, భావ వాద లక్షణాలు విమర్శించి వాటిని పూర్తి శాస్త్ర దృష్టితో సమన్వయంచేశాడు.

అంతేగాక, కేపిటలిస్టు సమాజానికి సంబంధించిన పుట్టుకా, అభివృద్ధి, దాని వర్గ సంబంధాలూ, వర్గ వైరుధ్యాలూ, శాస్త్రీయ సోషలిస్టు సమాజానికి సంబంధించిన బీజాలు కేపిటలిస్టు సమాజంలోనే ఏరకంగా ప్రారంభమైందీ, కేపిటలిస్టు సమాజంలో అంతర్గతంగా వున్న దాని వైరుధ్యమే దాని స్థిరత్వానికి ఏ రకంగా ఆటంక మయ్యేదీ — మొదలయిన విషయాలు ఎంతో క్షుణ్ణంగా పరిశీలించాడు. — ఒక్క మాటలో చెప్పాలంటే మార్క్స్ కేపిటలిస్టు సమాజం గురించి మాత్రమే పరిశీలించాడు. అయితే, ఆ వ్యవస్థకు సంబంధించివున్న గత వ్యవస్థల అవశేషాలూ, రానున్న వ్యవస్థ మొలకలూ కూడా అంచనా వెయ్యగలిగాడు.

ఈ పరిశీలనా క్రమంలో — మానవ చరిత్ర ఏ దశలోనయినా దాని వుత్పత్తి సంబంధాలమీదే ఆధారపడి, ఒక క్రమ పద్ధతి ప్రకారమే నడుస్తోందనే విషయం గమనించాడు.

ఏ సమాజానికయినా దాని వుత్పత్తి సంబంధాలే (రెండు వర్గాల మధ్య నున్న ఆర్థిక స్థితిగతులే) దాని పునాది. ఆ సంబంధాలు చెక్కు చెదరకుండా వుండేట్టుగానే (రెండు వర్గాల ఆర్థిక స్థితిగతులూ, ఎలా ఉన్నవి అలాగే వుండేట్టుగా) ఆ పునాదికి అనుకూలమైన పరిపాలనా యంత్రాంగం (రాజకీయాలు) సాంఘిక విషయాలూ (సంస్కృతి) పై అంతస్థులుగా ఏర్పడతాయి.

వర్గ వైరుధ్యాల ఫలితంగా వర్గ పోరాటాలు జరిగి (పూనిన తిరుగుబాట్లూ, రైతు తిరగబాట్లూ, కార్మికుల సమ్మెలూ కూడా వర్గ పోరాటాలే) ఈ ఆర్థిక సంబంధాల పునాదిలో ఏరకమైన మార్పు వొస్తే, ఎంత మేరకు వొస్తే, ఆ రకంగా అంత మేరకు ఆ సమాజ రాజకీయ, సాంఘిక పరిస్థితులుకూడా మారతాయి — ఈ ఆర్థిక పునాదిలో కొందరి శ్రమను మరికొందరు అనుభవించే దోపిడీ లక్షణమే లేకుండా పోయేంతటిమార్పు వస్తే, దాని రాజకీయ, సాంఘిక పరిస్థితులుకూడా "వర్గ రహిత సమాజానికి" అనుకూలంగా మారతాయి. — ఇదే మార్క్స్ గమనించిన విషయం ఇదే చారిత్రక భౌతికవాదం అయింది.

ఈ సిద్ధాంతం కేపిటలిష్టు సమాజానికి మాత్రమే అన్వయిస్తుందని అర్థం కాదు. జరిగిపోయిన వ్యవస్థలకూ, రానున్న వ్యవస్థలకూ కూడా అన్వయిస్తుంది.

మానవ చరిత్ర అంటే రామాయణం తర్వాత ప్రారంభమైంది కాదు. రామాయణంకన్నా ముందు వున్నదే. మానవులు ప్రారంభమైన దగ్గిర్నుంచీ వారు జీవించిన విధానమే మానవ చరిత్ర. ఆ చరిత్ర ఏ సిద్ధాంతం ప్రకారం నడిచిందో, నడుస్తోందో చెప్పిన సిద్ధాంతమే మార్క్సిజం.

రామాయణ సంస్కృతి మన కళ్ళముందు ఉంది దాని నీతుల్నీ, ధర్మాల్నీ బట్టి ఆ సమాజం పునాది ఏమై వుంటుందో, ఎందుచేత దానికి ఇటువంటి సంస్కృతి వచ్చిందో పరిశీలించడమే — రామాయణాన్ని మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించడం.

చారిత్ర భౌతికవాదాన్ని "కనిపెట్టడం" మాత్రమే నిన్న మొన్న జరిగిందిగానీ, అందులో సూత్రాలు రామాయణంకన్నా లక్షరెట్లు పురాతన మైనది.

* * *

తాటకికీ, రావణుడికీ సంబంధం వుందా ?

— ఇద్దరూ ఒకే జాతి. అదే సంబంధం. బంగారు లేడిగా వెళ్ళమని రావణుడు పంపిన మారీచుడు తాటకి కొడుకే. అంతకన్నా తాటకికీ, రావణుడికీ సంబంధించిన ప్రసక్తి లేదు.

* * *

విషవృక్షంలో మీరు చెప్పిన విషయాలలో నాకేమీ అభ్యంతరం లేదు. కానీ కొన్ని సందర్భాల్లో కొంచెం "అతి" అనిపించింది.

— ఎక్కడో, ఎందుకో మీరు వివరంగా రాస్తే బాగుండేది. విషవృక్షం మీకు "కొంచెం అతిగా కనిపించింది కొంతమందికి "చాలా

అతి"గా కనిపించింది. దానికీ, దీనికీ తేడా ఏమీ లేదు. ఈ రెండు అభిప్రాయాల అర్థమూ రామాయణ సంస్కృతితో రాజీ పడడమే. ఫ్యూడల్ సంస్కృతిని గౌరవించడమే. అందులోనే కొన్ని ఎక్కువ తక్కువ తేడాలు. అంతే.

* * *

కావ్యం అంటేనే దాని కథా వస్తువు సమాజ ధర్మాలకు దూరంగా వుంటుంది. దాన్ని సామాన్య వాస్తవదృష్టితో పరిశీలించడం చాలా పొరపాటు.

— సమాజానికి దూరమైన కథా వస్తువు సమాజానికి ఇవ్వగలిగే సందేశం ఏమిటి? ఆ కావ్యానికి విలువ ఇవ్వవలసిన అవసరంమాత్రం ఏమిటి? — కావ్యమేగాదు, ఇంకే రచన అయినా సమాజ ప్రభావానికి అతీతంగా పోలేదు. కవులు, సమాజానికి దూరంగా రాయాలనే ప్రయత్నిస్తారు. కానీ రాయలేరు. (కవులు వారు నమర్థించే వర్గం కథలే రాస్తారు. ప్రజల కథలు రాయరు. ప్రజల కథలు రాయకపోయినా, "గొప్పవారి" కథలే రాసినా అది పూర్తిగా సమాజానికీ, వాస్తవానికీ దూరంకాదు.) సీతకోసం ఏడుస్తోన్న రాముడికి, అంత అనురాగంలోనూ, అంత విరహంలోనూ ఆకలి దప్పులు కలుగుతున్నాయనే సంగతి కవి విస్మరించలేక పోయాడు. సీత కోసం లంకంతా వెతుకుతోన్న హనుమంతుడికి "కంటి చూపు బాగానేవుంది సుమా"—అని చెప్పకుండా ఊరుకోలేక పోయాడు. మనం భూమి ఆకర్షణ శక్తినించి ఎలా దూరంగా వెళ్ళలేమో, అలాగే కళలు సమాజ ప్రభావంనించి దూరంగా వెళ్ళలేవు.

— మీరు చెప్పే "దూరం" కథా వస్తువు విషయంలో కాదు. రచనా విధానం విషయంలో. "మితికల్ ఫామ్"లో ఉన్న రచనా విధానాన్ని నేను జోక్ చెయ్యడం తప్ప ప్రశ్నించలేదు. కానీ, మారీచుడు బంగారు లేడిగా మారడమూ, రాముడు సీతకోసం పూలనీ, పిట్టల్నీ అడుగుతూ విరహం వొలక బొయ్యటమూ, రెండూ ఒకేరకం కాదు. మొదటిది మిత్ గానీ, రెండోది మిత్ కాదు. ఉత్తముడయిన పురుషుడు శృంగా

రాన్ని ఇన్ని రకాలుగా అనుభవించాలి" — అని చెప్పడం. (ఎక్కడయినా దాసుడి కామ జీవితం గురించి చెప్పవలసి వొచ్చినా ఈ రకం శృంగార వర్ణన వుండదు. వాడు మృగంలాగ ప్రవర్తిస్తాడు. అంతే.) ఒక కావ్యంలో కథా వస్తువుని పరిశీలించేప్పుడు, అవాస్తవిక కవితా రీతుల్ని కూడా పరిహసించవలసిన అవసరం వుంది.

* * *

బాలరామున్ణి విశ్వామిత్రుడు రాక్షసుల్ని చంపడానికి తీసుకువెళ్ళాడు కదా ? సైన్యం లేకుండా అంత చిన్నవాడు యెలా యుద్ధం చేస్తాడని తీసుకు వెళ్లాడు ?

— కథ పరిధిలో మాత్రమే మనం ఆలోచించాలి. రాముడు విష్ణువు అంశ అని కదా కవి అభిప్రాయం ? రుషులందరూ అదే నమ్ముతున్నారు కదా ? రాముడు ఎంత చిన్నవాడయినా గొప్ప గొప్ప కార్యాలు చెయ్యగలడనే విశ్వామిత్రుడి అభిప్రాయం. అంత చిన్నవాడు రాక్షసుల్ని చంపడం అనేది రచనా విధానానికి (ఫామ్‌కి) సంబంధించిన విషయం. అది ప్రతీచోటా కల్పనగానే సాగిందికాబట్టి దాన్ని వాస్తవ జ్ఞానంతో ప్రశ్నించకూడదు. — ఆ సందర్భంలో కథా వస్తువు ఏమిటో అది చూడాలి. తాటకి ఏం తప్పు చేస్తే రాముడితో చంపించారు ? — అనే సంగతి ముఖ్యం.

* * *

రామాయణం ఆర్య ద్రావిడ జాతులమధ్య జరిగిన కథ అనే అనేవిషయానికి మీరు తగినంత స్థానం ఇవ్వలేదు. ఎందుచేత ?

— రామాయణం రెండు కత్తి జాతులకో రెండు తెగలకో సంబంధించిన కథ అనడంలో సందేహం ఎంతమాత్రం లేదు. ఆ విషయం ఇప్పుడు కొత్తగా చెప్పవలసిన అవసరం కూడా లేదు.

అయితే రామాయణం అనగానే "జాతుల యుద్ధం." — అనే అభిప్రాయం వొక్కటే ప్రధానమైందిగా వుంటే, అది సమగ్రమైన పరిశీలన కాదు.

ఒక వుమ్మడి కుటుంబాన్ని చూడండి. అందులో అత్తా—కోడళ్ళ మధ్య కలహాలుంటాయి. తోటికోడళ్ళ మధ్య కలహాలుంటాయి. కోడళ్ళకీ, ఆడబిడ్డలకీ మధ్య కలహాలుంటాయి. అందులో మళ్ళీ రెండో కోడలికీ, మూడో ఆడబిడ్డకీ మధ్య ప్రత్యేక కలహం వుంటుంది. ఆఖరి మరిదికీ, పెద్ద వదినకీ మధ్య స్నేహం వుంటుంది. అత్తగారికీ, పెద్ద కోడలికీ మధ్య భయంకర శత్రుత్వం వుంటుంది. ఈ రకంగా వొక్క కుటుంబంలో అనేక కలహాలుండడం అనేది వుమ్మడి కుటుంబం పరిస్థితి.

అది ఏదో వొక్క కుటుంబం పరిస్థితి మాత్రమే కాదు. ఇంచుమించు ప్రతీ వుమ్మడి కుటుంబం పరిస్థితీ అదే. అంటే సమాజం పరిస్థితి అది. అలాంటి పరిస్థితిలో ఇద్దరు లోటికోడళ్ళ కలహం అనేది వారి వ్యక్తిగత విషయం మాత్రమే కాదు. వ్యక్తిగత విషయమూ అవుతుంది. దానితోపాటు సమాజ విషయమూ అవుతుంది.

ఆ కుటుంబానికి కొన్ని వ్యక్తిగత లక్షణాలూ వుంటాయి. — కొన్ని సామాజిక లక్షణాలూ వుంటాయి. కొంత ప్రత్యేక సంస్కృతీ వుంటుంది. కొంత సామాజిక సంస్కృతీ వుంటుంది.

ఆ రకంగానే, రామాయణంలో "జాతుల యుద్ధం" దాని ప్రత్యేక లక్షణం. అదే సంపూర్ణ లక్షణం కాదు.

జాతుల యుద్ధం గురించి చెప్పేకథ వెనక, — జాతుల మధ్య శత్రుత్వానికి అవకాశం ఇచ్చే సమాజం వొకటి వుంది. (ఏ సమాజంలోనైనా జాతులు పోట్లాడుకుంటాయి అనుకోకూడదు. వర్గ రహిత సమాజంలో, అన్ని సమస్యల లాగానే, జాతుల శత్రుత్వాల సమస్యలు కూడా నశిస్తాయి.)

రామాయణానికి మూలాధారమైన సమాజంలో జాతుల యుద్ధాలు మాత్రమే కాదు. వొక్క జాతిలోనే ఆస్తికోసం అన్నదమ్ముల కలహాలున్నాయి. (వాలి సుగ్రీవులూ, రావణ విభీషణులూ) ఆస్తి కోసమే జీవితాలు తల్లకిందులైన సంఘటన లున్నాయి. స్త్రీల స్థితిగతులు చూపించే సమాజం వుంది. దీనికి జాతులతో సంబంధం లేదు. ఏ జాతిలో స్త్రీల స్థితి అయినా వొకటే. అంటే అది సమాజంలో మొత్తంగా వున్న స్థితి. అలాగే సమాజంలో అడుగు వర్గాల స్థితి కూడా.

అందుచేత, రామాయణాన్ని జాతుల యుద్ధంగా మాత్రమే చూడడం సమగ్రం కాదు. అతి ముఖ్యమైన కోణాలన్నీ వొదిలిపెట్టి, ఏదో వొక్క కోణం మాత్రమే చూసినట్టు. ఒక జాతి తరుపున వాల్మీకి నిలబడి రామాయణం రాసినట్టుగా, ఇంకో జాతి తరుపున ఇంకో రచయిత నిలబడి ఇంకో పుస్తకం రాస్తే, రామాయణానికీ, దీనికీ తేడా ఏమీ వుండదు. రెండిటి స్వభావమూ వొక్కటే.

* * *

'విషవృక్షం' లో అసలు రామాయణం కథ అంతా తిరగబడ్డది. తల్లకిందులుగా నించుని చదవాలా మీ పుస్తకం ?

— రామాయణం కథ తిరగబడి విషవృక్షం అవడంలో నా బాధ్యతేమీ లేదు. దాని నిజ స్వభావమే అది. ఫలానా ఘట్టంలో ఫలానా విధంగా ఎందుకు రాయవలసి వొచ్చింది ? ఫలానా పాత్రచేత ఫలానా మాటలు ఎందుకు అనిపించ వలసి వొచ్చింది ? — అని ఆడగండి. లేకపోతే ఆ దృష్టితో ఆలోచించండి. జవాబు దొరుకుతుంది.

కొందరికి కూర్చుని చదివినా, పడుకుని చదివినా విషవృక్షం బానే అర్థమైంది. మీరు తల్లకిందుగా నిలుచుని చదివితేనే అర్థ

మయేట్టు అయితే అలాగే చదవండి. లేకపోతే మానెయ్యండి. అది మీ ఇష్టం.

* * *

మంధర పాత్ర చాలా ముఖ్యమైంది. దాన్ని వది లేశా రెందుకు? ఆ. పాత్ర గురించి మీ అభిప్రాయం ఏమిటి?

— రామాయణంలో ప్రతీ పాత్రనీ నా కథల్లోకి తీసుకోవాలని మొదట్లో అనుకోలేదు. అందుకే అలా జరిగింది.

మంధర కైకతో — కైక పుట్టింటినుంచి వొచ్చిన దాసి. కౌసల్య పెంపుడు పక్షులకు కూడా కైక మీద ద్వేషం నూరిపోసినప్పుడు, కైక దాసీ — కైక క్షేమం కోరే మాటలు చెప్పడంలో అన్యాయం ఏమీ లేదు.

కైక మంధరతో కష్ట సుఖాలు సంప్రదించింది. అంతే గానీ, మంధర ఎలా నూరిపోస్తే అలాగే నమ్మి, తన స్వంత ఆలోచనేమీ లేకుండా కేవలం మంధర చెప్పింది కాబట్టే, కైక అలా ప్రవర్తించింది అనడంలో అర్థం లేదు.

కైక తన నిర్ణయం తనే చేసుకుంది అనే అభిప్రాయంతోనే (మంధరతో సంప్రదించే) మంధరని పరోక్షంలో వొదిలేశాను. కానీ, కైక మంధరతో సంప్రదించిందనే విషయం చెపితేనే బాగుండేది.

* * *

భౌతిక వాదికీ, మార్క్సిస్టుకీ తేడా వుందా? ఏమిటి?

— మార్క్సిస్టు కూడా భౌతికవాదే. కానీ, ప్రతీ భౌతికవాదీ మార్క్సిస్టు కాడు. అంటే, మార్క్సిస్టు అయిన భౌతికవాదీ, మార్క్సిస్టు కాని భౌతికవాదీ అని మాత్రమే ఈ తేడాని అర్థం చేసుకోగలం.

మార్క్సిస్టు భౌతిక పరిస్థితుల్ని (ప్రకృతిలో గానీ, సమాజంలో గానీ) గతి తార్కిక దృక్పథంతో చూస్తాము. — కొందరు భౌతిక

వాదులు ఈ రకంగా చూడరు. అలాంటివారు వృత్త భౌతికవాదులు మాత్రమే అవుతారు. మార్క్సిస్టులు అవరు. — ఈ మార్క్సిస్టు సిద్ధాంతం అంతా ఎవరు ఆచరించినా వొకటే. (దాన్ని తమ చుట్టూ పరిసితులకు అన్వయించుకోవడంలో, వారి వారి అవగాహనని బట్టి ఎన్ని తేడాలైనా వుండవొచ్చును. కానీ, మూల సిద్ధాంతంతో తేడా లేదు.) కానీ, భౌతిక వాదంలో మాత్రం అనేక తేడాలున్నాయి. "దేవుడు లేడు" అనడం మాత్రమే కొందరి భౌతిక వాదం. విగ్రహారాధన వ్యతిరేకించడం కొందరి భౌతిక వాదం. అతీతశక్తి కూడా లేదనే వరకూ కొందరి భౌతిక వాదం — వారి భౌతిక వాదం ఏ స్థాయివరకూ వుంటే ఆస్థాయి వరకే దాన్ని సమాజ సమస్యలకు అన్వయిస్తూ వుంటారు. సమాజంలో అన్ని సమస్యల మధ్యా వొక ఎడతెగని సంబంధం చూడక పోవడం వల్లనే దేనికి దాన్నే విడివిడిగా చూసి, విడి విడి పరిష్కారాలు చెపుతారు.

అదుక్కునే వృత్తిని చూసి భౌతిక వాదులు ("కర్మ" అనరు.) "సోమరితనం" అంటారు. మార్క్సిస్టు అయితే, "వర్గ సమాజం సృష్టించిన లక్షణం" అంటాడు. — అలాగే ప్రజల మూఢ నమ్మకాలని దెవభక్తిని చూసి, భౌతిక వాదులు — "ప్రజలకు శాస్త్రజ్ఞానం తెలియక మాత్రమే దేవుణ్ణి నమ్ముతున్నారు." — అంటారు.

మార్క్సిస్టు అయితే —"శాస్త్రజ్ఞానం తెలియక మాత్రమే కాదు. వారి జీవన పరిస్థితుల్లో వున్న అవసరాల వల్ల, దుర్భరత్వం వల్ల, దేవుణ్ణి నమ్ముతారు. ఆ పరిస్థితులు పూర్తిగా చక్కబడి వారికి భౌతిక జీవితం మీద నమ్మకం కలిగితే గానీ దేవుణ్ణి విశ్వసించడం మానరు. (శాస్త్రజ్ఞానం తెలిసిన వారు కూడా దేవుణ్ణి విశ్వసించడానికి ఇదే కారణం.)" — అంటారు.

ఈ రకంగా సమాజంలో ఏ సమస్యకైనా భౌతిక వాదులు, మార్క్సిస్టుల మట్టే, సమాజం తాలూకు ఆర్థిక సంబంధాలలోంచి (పునాదిలోంచి) మార్పుల్లో కోరరు. సమాజం అలాగేవుండి, పై పై మార్పులు

జరగా లంటారు. ఇవే సంస్కరణలు. మాట్లు. ఒక్కో భౌతికవాది చిన్నమాటు వేస్తే, వొక్కో భౌతికవాది కాస్త పెద్దమాటే వేస్తాడు. వాటివల కాస్త ఫలితం వుంటుంది. కానీ, ఆ మూలే వుంటుంది. ఆ క్షణమే వుంటుంది.

వ్యవస్థ మార్పుని తప్ప మార్క్సిస్టులు ఏ తాత్కాలిక సమస్యనీ పట్టించుకోరు అని అర్థం చేసుకోకూడదు. మార్క్సిస్టులు కూడా నాస్తిక ప్రచారాలు చేస్తారు. కుల నిర్మూలన ప్రచారాలు చేస్తారు. ప్రజలకు ఏది తక్షణ అవసరం అయితే దాన్నే పరిశీలిస్తారు. అయితే, ఏ కార్యక్రమాన్నీ, వర్గ చైతన్యం కలిగించడంతో సంబంధం లేకుండా పాటించరు. — ఒక సమ్మె నిర్వహించవలసి వొచ్చినప్పుడు — "నాస్తికులే సమ్మెలోకి రావాలి. భక్తులు రాకూడదు." — అనరు. ముందు వర్గ చైతన్యం ముఖ్యం గానీ, నాస్తికత్వం ముఖ్యం కాదు. అవసరమైతే దాన్నే వెనక్కి పెడతారు.

ఈ రకమైన విషయాల ద్వారా సామాన్య భౌతిక వాదికీ, మార్క్సిస్టుకీ తేడా గ్రహించ వొచ్చును.

* * *

రామాయణం – క్షత్రియులకూ, రాజులకూ రేగిన కలహాలకు ప్రతిబింబమనీ, జనక మహారాజు క్షత్రియుల పక్షాన్న నిలబడ్డ ప్రతినిధి అనీ, విశ్వామిత్రుడు క్షత్రియుడే గనక, రాముణ్ణి జనక మహారాజుకి అల్లుణ్ణి చేసి, తిరగబాటు నడపాలని చూశాడనీ, ఈ రకంగా నేను కొన్ని పుస్తకాలలో చదివాను. దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి ?

— వాల్మీకి రామాయణం పరిధులు దాటకుండా చూస్తే, బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ కలహాలు సంభవించింది, విశ్వామిత్ర వశిష్టుల విషయంలోనూ, రామ – పరశురాముల విషయంలోనూ మాత్రమే. విశ్వా

మిత్రుడు చివరికి బ్రహ్మణుడై బ్రాహ్మణ్యాన్నే గౌరవించే స్థితికి మారాడు.

అంటే విశ్వామిత్రుడి క్షత్రియ స్వభావం మారింది. అలాగే, పరశురాముడు రాముడితో రాజీపడి వూరుకున్నాడు. జనక మహారాజుకి బ్రాహ్మణులతో వైరం వుందనడానికి ఎటువంటి ఆధారం లేదు కథలో. తన కూతుళ్ళకు పెళ్ళి సంబంధాలు కుదుర్చుకునేప్పుడు, విశ్వామిత్రుడితో —"నా రాజ్యం, నా తమ్ముడి రాజ్యం, దశరథుడి రాజ్యం కూడా మీరే స్వీకరించండి." — అంటాడు.

పురోహితుల పట్ల అంత వినయ విధేయతలు గల పాత్ర అది. విశ్వామిత్రుడు బ్రాహ్మణుడిగా మారిం తర్వాత రాముడితో బ్రాహ్మణుల మీద తిరగబాటు చేయించాలని ప్రయత్నించా డనడంలో ఏమీ అర్థంలేదు. — బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ విరోధాలుంటే వుండ వొచ్చును. వాటిని గుర్తించడానికి వీలుగా కథలో ఆధారాలేమీ లేవు.

* * *

విప్లవ కవిత్వాలలో చదువుతోన్నది చాలలేదనా రామాయణంలోకి కూడా పేదవాళ్ళని దించారు !

రామాయణంలోకి పేదవాళ్ళని ఎవరో తెచ్చి దించలేదు. శ్రీరాముడి పక్కనే బిచ్చగాళ్ళూ వున్నారు. సీతాదేవి సరసనే వేశ్యలూ వున్నారు. రామాయణ పవిత్రత వారినేమీ వుద్ధరించ లేకపోయింది.

* * *

రామాయణాన్ని ఆధ్యాత్మిక గ్రంథంగా చూడాలి.

— చూసే వాళ్ళమే. ఆ ఆధ్యాత్మికత ఎక్కడుందో. మచ్చు కైనా కనపడలేదు. కనపడ్డదంతా రాజ్యకాంక్ష, సిరిసంపదల కాంక్ష, అధికార కాంక్ష, స్త్రీల అవయవాల కాంక్ష. ఇన్ని కాంక్షల మధ్య

ఆధ్యాత్మికతని చూసే శక్తి పిచ్చివాళ్ళకీ, మోసగాళ్ళకీ మాత్రమే వుంటుంది.

* * *

వాల్మీకి వంటి కవులు ఒక సమాజానికి కలాల సైన్యంగా పని చేశారని మీ అభిప్రాయం. మీరు కూడా ఇంకో సమాజానికి అదే పని చేస్తున్నారని మా అభిప్రాయం.

— ఏ కాలంలో అయినా, ఏ సమాజంలో అయినా ప్రతీ రచయిత కలం సైనికుడే. అయితే ఎవరి పక్షాన్న నిలబడ్డ సైనికుడు? — అన్నదే ప్రశ్న.

సమాజంలో ఎప్పుడూ నగంమంది స్త్రీలు, మిగలిన సగం మందిలో నాలుగింట మూడు వొంతులు అన్ని విధాలా అల్పాలుగా జమ కట్టబడ్డ వాళ్ళు. అంటే, నూటికి పదిమంది మాత్రమే ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా వుచ్ఛ స్థితిలో వుండే సమాజం వొకటి అయితే, నూటికి నూరుమందీ సమాన స్థాయిలో వుండే సమాజం రెండోది. మొదటి సమాజాన్ని నిలబెట్టాలని ప్రయత్నించే రచయిత, రెండో సమాజానికి సహకరించాలని ప్రయత్నించే రచయిత ఇద్దరూ వొకటే అవుతారా?

* * *

మానవునకు తిండి ముఖ్యమే. కానీ, జీవితం అంతా తిండి సమస్య అనుకోవటం విడ్డూరం. రామాయణం వంటి సుందరమైన కావ్యాన్ని నిత్యజీవిత సమస్యలతో ముడిపెట్టడం వింతయిన విషయం.

— నాలుగు రోజులవరకూ సరిపడే తిండంతా ఈ పూటే తినేసి,

నాలుగు తరాలవరకూ సరిపడే సిరి సంపదలు కూడబెట్టుకున్న వాళ్ళు మాట్లాడే మాటలివి. "తిండి ముఖ్యమా ? కొంచెం ముఖ్యమేగానీ మరీ అంత ముఖ్యమా ?" — అనే మాటలు ఏ నిరుపేద నోట్లోంచైనా వస్తాయా ? — పొట్ట కూటికి తడుముకోవలసిన పరిస్థితి వస్తే "కృష్ణ శాస్త్రి" కూడా రిక్షా బేరాల కోసమే చూస్తాడు. — విషవృక్షంలో చెప్పిం దంతా తిండి సమస్య ఒక్కటేనా ?

• • •

మీరు మార్క్సిజానికి కమిట్ అయినట్టు కనపడు తూంది. ఒక ఇజానికి కమిట్ అయిన రచయిత చెప్పేది సరు గ్రంగా ఎలా వుంటుంది ?

— కమిట్‌మెంట్ అనేది ఆ వ్యక్తికిగల వర్గ స్వభావమే. ప్రతీ రచయితా, ప్రతీ కళాకారుడూ, ప్రతీ వ్యక్తీ ఏదో ఒక ఇజానికి — ఫ్యూడలిజానికో, కేపిటలిజానికో, సోషలిజానికో — కమిట్ అయ్యే వుంటాడు. కొందరు తెలిసీ (కాన్షియస్‌గా) — కొందరు తెలీకా (అన్ కాన్షియస్‌గా). ఏ ఇజానికీ కమిట్ కాని, అంటే ఏ సమాజ ధర్మాలనీ అంగీకరించని రచయితా, వ్యక్తీ ఎక్కడా వుండరు. ఎవరి పుస్తకమైనా చూడండి. ఏదో ఒక వర్గానికే అనుకూలంగా ఉండడం జరుగుతుంది. అలా వుండేటు రాయాలనీ ఆ రచయిత అనుకోకపోయినా సరే, అది ఏదో ఒక వర్గానికే అనుకూలంగా వుంటుంది. అంటే ఆ రచయిత ఏ వర్గానికి అనుకూలమైన రచన చేశాడో, దాన్నిబట్టి అతను ఏ ఇజానికి కమిట్ అయివున్నాడో తెలుస్తుంది. (జమీందారీ కుటుంబాన్ని కథా వస్తు వుగా తీసుకుని, వారి ఆడంబరాన్నీ, ఆర్భికమైన దొన్నత్యాన్నీ, విలాస జీవితాన్నీ మెచ్చుకుంటూ, మెచ్చుకోకపోయినా ఏమీ వ్యతిరేకత లేకుండా కథ నడిపే రచయిత ఫ్యూడలిజానికి కమిట్ — అయివున్నట్టే.)

ఒక బూర్జువా రచయిత దోపిడీ గురించి చెప్పడు. దోపిడీదారు స్వభావాన్ని మరుగు పరిచి రెండో వర్గం స్వభావాన్ని వక్రీకరిస్తాడు. —

ఒక మార్క్సిస్టు రచయిత అయితే, దోపిడీ వర్గం దోపిడీకే ఎలా ప్రయత్నిస్తుందో, దానికి వ్యతిరేకంగా శ్రామికవర్గం దోపిడీని వ్యతిరేకించడానికే ఎలా ప్రయత్నాలు చేస్తుందో రెండు విషయాలూ బట్టబయలుగా చెపుతాడు.

ఇలా చెప్పడం అనేది సమగ్రంగా వుంటుందా? లేదా?— అనే అభిప్రాయమే పొరపాటు. సమాజం రెండు వర్గాలుగా వున్నప్పుడు, ఇద్దరికీ అనుకూలించేట్టు చెప్పడం అనేది అశాస్త్రీయమైన విషయం. ఫ్యూడల్, బూర్జువా రచయితలు దోపిడీకి అనుకూలంగా చెపితే, మార్క్సిస్టు రచయితలు దోపిడీకి వ్యతిరేకంగా చెపుతారు. ఇది కూడా ఒక వర్గానికి అనుకూలంగా చెప్పడమే అయినప్పటికీ దీని స్వభావం వేరు. దీనివల్ల దోపిడీ వ్యతిరేక సమాజం ఏర్పడితే, తర్వాత కొంత కాలానికి దోపిడీ వర్గ స్వభావం పూర్తిగా వునికిలో లేకుండా పోతే, అప్పుడు సమాజంలో అందరి ప్రయోజనమూ ఒకటిగానే వుంటుంది. అప్పుడు ఒక రచయిత ఏం చెప్పినా అందరికీ అనుకూలించే సమగ్ర దృష్టి అవుతుంది. అంతవరకూ "సమగ్ర దృష్టితో చూడడం" అనే అభిప్రాయమే కుద్ర అవాస్తవికమైన, అశాస్త్రీయమైన అభిప్రాయం. అంటే సమగ్రదృష్టితో చూడడానికి అవకాశం కలగాలంటే, అసలు మార్గం శ్రామిక వర్గ ప్రయోజనాలవేపునించి ప్రారంభం కావలసిందే. అదే న్యాయమైన, శాస్త్రీయమయిన, ముందు ముందు సమగ్ర దృష్టికి అవకాశం యిచ్చే మార్గం. అంతవరకూ సమగ్రత అనేదే బూటకం.

* * *

"..... ఈనాడు వాల్మీకిని విమర్శించి లాభం ఏమిటి?"

— వాల్మీకి వున్నాడా? లేడా? అన్నదికాదు ప్రశ్న. వాల్మీకి ఒక వ్యక్తి కాదు. ఒక వర్గ ప్రతినిధి. వాల్మీకిని విమర్శించడం అంటే

వాల్మీకి వర్గ స్వభావాన్ని విమర్శించడం. వాల్మీకి చెప్పే సమాజ ధర్మాల్ని విమర్శించడం.

• • •

"సమాజంలో కష్టాలన్నీ పేదవాళ్ళకే వున్నట్టు ఎందుకు ఆలోచిస్తారు ! యెవరికి తగ్గ కష్టాలు వారికి వున్నాయి. ధనవంతులకు మాత్రం కష్టాలు లేవా ?"

— "ధనవంతులు" అనే మాటని మీరు ఏ దృక్పథంతో వాడారో నాకు తెలియదు. కొంచెం సుఖంగా జీవించే వాళ్ళందరూ ధనవంతులు కారు. ఇతరులతో శ్రమ చేయించుకుని దోపిడీకి అవకాశం ఇచ్చే భూస్వాములన్నీ, పెట్టుబడిదారుల్నీ మాత్రమే "ధనవంతులు" గా భావించి ఈ జవాబు చెపుతున్నాను.

కార ధర పెరగడం, సూకల ధర పెరగడం ఒకేరకం సమస్య కాదు. ఈ సమాజంవల్ల ధనవంతులకు కూడా కష్టాలే వుంటే, దీన్ని మారకుండా చెయ్యాలని ప్రయత్నాలు చేస్తారెందుకు ? ఈ సమాజంవల్ల వారికి ప్రత్యేక లాభం ఉండడంవల్లనే కదా ? — వారిని కష్టపెట్టే సమస్య అంతా ఏమిటంటే "ఎప్పటికైనా ప్రజలకు చైతన్యం కలుగుతుందేమో ! ఈ సమాజం ఎంతోకాలం దోపిడీకి అనుకూలంగా వుండదేమో !" — అనేదే. ఈ రకం కష్టానికి కూడా సానుభూతి చూపించ వలసిందేనా ?

మీరు చెప్పే ధనవంతులు ఆర్థికంగా సుఖంగా వుండి, ఇతర సమస్యలవల్ల ఇబ్బంది పడుతోన్నవారే అనుకోండి — అప్పుడు కూడా ఈ ధనవంతులమీదకన్నా పేదవారిమీదే ఎక్కువ సానుభూతి అవసరం. ఈ ధనవంతులకు ఉన్నపాటి సుఖజీవనంకూడా పేదవారికి వుండదుకదా ? ఇద్దరి సమస్యలూ ఒక్కలాగ ఎలా చూస్తాం ?— జీవ కారుణ్య సంఘం ప్రసిడెంటులాగ ఉన్నారు మీరు.

• • •

మీరు చెప్పాలనుకున్న విషయాలు ఇంకా మృదువుగా చెప్పవచ్చును. కొందర్ని గాయపరిచే విధంగా రాయడంవల్ల ఏం సాధించగలరు ?

— రామాయణంలో విషయాలన్నీ చాలా మృదువుగానే ఉన్నాయి కదూ ? — "స్త్రీలు నీచులు .... అల్పులు .... చపల చిత్తులు .... ఎప్పుడూ కలహాలకే చూస్తారు. స్నేహాలు విడదియ్యడానికే చూస్తారు. స్త్రీలను ఎప్పుడూ శంకిస్తూ వుండాలి"— అనే మాటలు ఎంతో మృదువు కదూ ? అవి ఎవ్వర్నీ గాయపరచవుకదూ ?

"శూద్రుడికి మంత్రం నిషిద్ధం. శూద్రుడికి విద్య నిషిద్ధం. శూద్రుడు పై వర్ణాలవారికి సేవచేసుకుంటూ వినయ విధేయతలతో బ్రతకాలి." — అన్న మాటలు కూడా చెప్పలేనంత మృదువు కదూ ? — ఇవికూడా ఎవ్వర్నీ గాయపరచవే కదూ ?

మృదుత్వం అనేది, సంస్కృత భాషలోనూ ఛందోబద్ధమయిన కవిత్వంలోనూ ఉంటుందనుకుంటున్నారా ? వేలకొద్దీ సంవత్సరాలనుంచీ హృదయాల్ని గ్రుచ్చిన గాయాలేమీ కనపడలే దెందుచేత మీకు ? దాన్నిబట్టే తెలుస్తోంది మీ మృదుత్వం ఏ కోవకు చెందిందో.

మృదుత్వాలూ, కాఠిన్యాలూ భాషకో, కవిత్వానికో సంబంధించినవి కావు. న్యాయాన్యాయాలకు సంబంధించినవి. ఒక పక్షపాత నీతీ, కపట నీతీ, సొగసైన మాటలతో శ్లోకంలో చెప్పినంత మాత్రాన మృదువై పోదు. దాని నీచత్వం, దాని క్రూరత్వం దానికి ఉండనే ఉన్నాయి.

• • •

రామాయణంలో ఎక్కువభాగం కట్టుకథలే. వాటిని ఆధారం చేసుకుని సంస్కృతిని చూడగలమా ?

— రచనా విధానమే కల్పిత పద్ధతిగానీ అందులో విషయం కల్పించింది కాదు. ఇంగారుపైడి అవాస్తవిక రచనా విధానమేగానీ,

స్త్రీలని ఎత్తుకుపోవడం కల్పితం కాదు. లంకా దహనం కల్పితమేగానీ, శత్రువుల్ని బాధ పెట్టడం కల్పితం కాదు. అగ్ని పరీక్ష కల్పితమేగానీ ఉత్తర భార్య శీలాన్ని శంకించడం కల్పితం కాదు. సమాజాన్ని చూడడానికి రచనా విధానంతో సంబంధంలేదు.

చిత్రకూటానికి భరతుడూ, కౌసల్యా వగైరాలందరూ వచ్చినప్పుడు కైక కూడా వచ్చిందా?

— వాల్మీకి కథలో అయితే వచ్చింది. కానీ, రాముడికీ, కైకకీ ఏమీ సంభాషణ లేదు. చిత్రకూటానికి కైక వచ్చిన తర్వాతకూడా రాముడు కైకని ప్రతీక్షణం తిడుతోనే వున్నాడు.

పావురాల జంటలో మొగపిట్టని ఒకకిరాతకుడు కొట్టగా వాల్మీకి హృదయం శోకభారంతో బరువై ఆ మహాముని నోటివెంట అప్రయత్నంగా కవిత్వం వచ్చిందంటారు. ఈ విషయం రామాయణం చదివిన మీకు తెలియదనికాదు. వాల్మీకి అంత చలించి రాయడంవల్లనే రామాయణం అంత.....

— రాముడు అడవుల్లో అన్నేళ్ళు వుండి అన్ని పిట్టల్ని కొట్టాడే: ఆడ పిట్టనో, మొగపిట్టనో, ఆడ జంతువునో, మొగ జంతువునో కొట్టకుండా, ఏ జంటనీ విడదియ్యకుండానే ఏం తిన్నాడు?

రాముడు పక్షుల్ని, జంతువుల్ని భయపెట్టే భీకరాకారుడని వాల్మీకే పొంగుతూ రాశాడేం?

రాముడు పిట్టల్ని కొట్టినప్పుడు వాల్మీకికే కాదు, ఏ రుషికీ శోకం పొంగలేదేం? ఒక ఆటవికుడు కేవలం జీవనోపాధికి పిట్టల్ని చంప

డంలో అంత కిరాతకత్వమే వుంటే, రాముడు (రాజులు) విలాసంగా వేటాడడం మాటేమిటి ?

• • •

"..... రామాయణంమీదే కాదు, ఎంతో ప్రాచీన మైన, పవిత్రమైన వేద సంస్కృతిమీదకూడా వ్యతిరేకత కన పడింది మీ పుస్తకంలో..."

— విషవృక్షంలో వేద సంస్కృతి ప్రసక్తి ఏమైనా వస్తే, రామాయణంలో దొరికిన ఆధారాలవల్ల తీసుకున్నదే. వ్యతిరేకత అనేది వేదాల సృష్టి మీదో, రామాయణం సృష్టిమీదో కాదు. ఈనాటి సమాజం కూడా వాటికి ఇచ్చే "పవిత్ర స్థానం" మీదే.

వేదాలూ, రామాయణాలూ పవిత్రంకదా అని ఈనాడుకూడా పూర్వంమల్లే తాళపత్ర గ్రంథాలమీదే పవిత్రంగా రాసుకోరేం ? కాయితం కావాలి. ప్రెస్సు కావాలి. ఈ ఆధునిక పరికరాల సహాయంతోమాత్రం మళ్ళీ పాత పాటే పాడాలి. ఈ కాయితం, ఈ ప్రెస్సూ, ఈ వర్కర్లూ — వీటికి సంబంధించిన సమాజానికి వేరే సమస్యలు వున్నాయనే దృష్టే లేదు. సమాజంలో ఉత్పత్తి విధానం ఏ రకంగా మార్పులు చెందుతూ వున్నా సరే, మనం పవిత్ర ప్రాచీన కాలంలో కూర్చుని యజ్ఞాలూ, వేద పఠనాలూ చెయ్యాలి.

భూగర్భ తవ్వకాలలో దొరికిన పాత రాతి గదను చూసి — "ఇది ప్రాచీనమైంది కాబట్టి చాలా పవిత్రం" — అని దాంతో నెత్తి బద్దలు కొట్టుకుంటే ఎలా వుంటుందో, ప్రాచీనమైన ప్రతీ సంస్కృతినీ ఈనాటి జీవితాలకు అన్వయించుకోవడం అలాగే ఉంటుంది.

• • •

రావణుణ్ణి కథానాయకుణ్ణిచేసి, రాముణ్ణి అతని శత్రువుని చేసి, రావణుడి జాతివారు రాసుకున్న గ్రంథం ఏదయినా వుందా ?

— నాకు తెలీదు. గోండులు అనే జాతి వారు రావణుణ్ణి పూజిస్తారని వొక పాఠకుడు రాశారు. అంతకన్నా నాకు తెలీదు.

* * *

రామాయణంలో పాతివ్రత్యం ఈనాడు ఎక్కడా లేదు. అదీ ఇదీ ఒకటే సంస్కృతి అని వాదించడం ఆశ్చర్యంగా వుంది.

— పాతివ్రత్యం అంటే అంతఃపురాల్లోనే ఉండడంకాదు. రాముడికీ, సీతకీ మధ్యవున్న సాంఘిక సంబంధం ఎలాంటిదో ఈనాటి భార్యాభర్తలమధ్య సంబంధమూ అలాంటిదే. సీతకీ, రాముడి మధ్య సంబంధం ఏ ధర్మాల ప్రకారం నడిచిందో, ఈనాటి దాంపత్యాలూ ఆ ధర్మాల ప్రకారమే నడుస్తున్నాయి.

రామాయణ సంస్కృతిలో భార్యని "ఫలానా పురుషుడి భార్య" — అని భర్తద్వారా మాత్రమే గుర్తిస్తుంది సమాజం. ఈనాడూ అంతే.

రామాయణ సంస్కృతిలో స్త్రీకి ఏ రకమైన వ్యక్తిత్వమూ లేదు. ఈనాడూ అంతే. కేపిటలిస్టు సమాజం తాలూకు ప్రభావం వల్ల, స్త్రీలు చదువుకోవడం, వుద్యోగం చెయ్యడంలాంటి మార్పు నాటికి ఎంత మంది విషయంలో? — అదికూడా ఎంతవరకూ మార్పు? ఆ మార్పు స్వభావం ఏమిటి? కొంచెం డబ్బు సంపాదించడమేగానీ, సాంఘికంగా పురుషుడిద్వారా గుర్తించబడని వ్యక్తిత్వాన్ని సాధించడమా? పురుషుడికి సీదగా గాక అన్ని విధాలా స్వతంత్రమైన వ్యక్తిగా జీవించగలగడమా?

రామాయణంలో స్త్రీ స్థితిగతులకు సంబంధించిన పరిస్థితులన్నీ ఈనాడూ వున్నాయి. రాముడి అండలోనో, లక్ష్మణుడి అండలోనే లేక పోవడంవల్ల సీతకు రక్షణ లేకుండా పోయింది. ఈనాడూ అంతే. పురుషుడి అండ లేకుండా స్త్రీ సురక్షితంగా ఉండగలిగే సమాజ వాతావరణం లేదు. ఇక వేశ్యావృత్తికి అనాటికీ ఈనాటికీ ఏమీ తేడా లేదు. ఆనాటి

స్త్రీలు భర్తల సంపాదనమీద ఆధారపడి జీవించినట్టే, ఈనాటి స్త్రీలుకూడా భర్తల దయా ధర్మాలమీదే జీవిస్తున్నారు. సీత తప్పేమీ లేకపోయినా పరపురుషుడు ఎత్తుకుపోయి, కొంతకాలం తర్వాత భర్త దగ్గిరికి చేరినందుకు సీత కెలాంటి గతి పట్టిందో, ఈనాడు ఏ స్త్రీ విషయంలోనైనా అలా జరిగితే అలాంటిగతే పడుతుంది. భర విడిచిపెట్టిన సీత అడవుల పాలై పోయినట్టు, ఈనాడు భర వొదిలిపెట్టిన స్త్రీ కష్టాలపాలయిపోతుంది. అనాధ శరణాలయాలకి చేరడమో, అంట్లు తోముకుంటూ బతకడమో తప్ప, సుఖంగా, నిశ్చింతగా తననూ, తన పిల్లలనూ పోషించుకోగలిగే సమాజ పరిస్థితులు లేవు.

ఈ పరిస్థితులన్నీ కలిసి ఇంకా స్త్రీని పురుషుడి అందదండలో వుంచాయనడానికేమీ సందేహం లేదు. మార్పు ఎక్కడో మీరే పరిశీలించండి.

* * *

మా అమ్మగారు సాధారణంగా పుస్తకాలన్నీ చదువుతారు. మీ పుస్తకాలన్నీ ఆవిడకు ఇష్టమే. విషవృక్షం విషయంలో మాత్రం ఆవిడ చాలా వ్యతిరేకంగా మాట్లాడతారు. మనదేశంలో స్త్రీలకు ఉన్న స్థానం ఎక్కడా లేదు అంటారు. ఆవిడకు సీతకన్నా రాముడే ఎక్కువ యిష్టం.

— ఇలాంటి మాటలు ఈనాడు కొత్తకాదు లెండి. ఫ్యూడల్ సమాజం దృష్టిలో దేశాభిమానం అంటే దేశద్రోహమే. ఇప్పటికి ప్రపంచంలో వున్న సంస్కృతి అంతా రెండే రెండు రకాలు. దోపిడీ సంస్కృతీ, దోపిడీ వ్యతిరేక సంస్కృతీ. ఈ దోపిడీ సంస్కృతి ఏ దేశంలో అయినా ఒకటే. రూపంలో భేదాలు మాత్రమే. స్వభావంలో భేదం లేదు.

కొందరు చిన్నతనంనుంచీ తమ చుట్టూవున్న వాతావరణాన్నిబట్టి కొన్ని అభిప్రాయాలతో బిగుసుకుపోతారు. ఏ మార్పునీ స్వీకరించలేరు

నంతగా కరడుగట్టుకు పోతాయి. చిన్న చిన్న శక్తులేవీ వారిని కదపలేవు. ఈ సమాజంలో ఒక వ్యక్తి తన స్థానం ఏమిటో గ్రహించగలిగే జ్ఞానాన్ని మార్క్సిస్టు పరిభాషలో "చైతన్యం" అంటారు. ఈ సమాజం స్త్రీలని ఎంతో గౌరవిస్తోంది అని స్త్రీలే నమ్మడం అంటే, ఈ సమాజం స్త్రీలని ఎంత మభ్యపెట్టి గలుగుతోందో ఆలోచించండి: — తర తరాలనించీ, ప్రాచీన సంస్కృతి పేరుతో కలాల సైన్యం స్త్రీలని ఎంత చైతన్య రహితుల్ని చేసిందో గ్రహించడానికి ఇంతకన్నా ఏం నిదర్శనాలు కావాలి:

పెద వయసు స్త్రీల విషయంలోనూ, చదువుకోని స్త్రీ పురుషుల విషయంలోనూ వారేం మాట్లాడినా కొంత సానుభూతి చూపించవచ్చును. అన్నీ తెలిసి "మా సంస్కృతి ఇంత పవిత్రం" "అంత పవిత్రం" — అని విర్రవీగే వాళ్ళుంటారే అటువంటి — వ్యక్తుల మాటలకుమాత్రం ఏ మాత్రం విలువ ఇవ్వవలసిన అవసరం లేదు.

• • •

మీరు సంస్కృతం చదివారా? అనువాదాలమీద ఆధారపడి విమర్శలు చెయ్యడం సద్విమర్శకుల లక్షణంకాదు. భాగవతాన్ని అర్థం చేసుకోవటానికి భక్తి చాలు. భారతాన్ని అర్థం చేసుకోవటానికి భక్తితోపాటు యుక్తికూడా కావాలి. రామాయణాన్ని అర్థం చేసుకోవటానికి మాత్రం భక్తియుక్తులతోపాటు శక్తికూడా కావాలి. అపారమయిన సంస్కృత పరిజ్ఞానం లేనిదే రామాయణం అర్థం చేసుకోవటానికి ఎవ్వరి తరమూ కాదు.

— నేను సంస్కృతం ఏమీ చదవలేదు. అనువాదాలమీదే ఆధారపడాను. మూడు రకాల అనువాదాలమీద. — ఆ మూడు అనువాదాలూ ఏకీభవించని చోట సంస్కృతం తెలిసిన మిత్రుల సహాయం తీసు

కున్నాను. ఎంత పెద్ద విషయమైనా ఎంత చిన్న విషయమైనా స్పష్టంగా అర్థం చేసుకోకుండా నేను రాయలేదు. ఈ విషయం కూడా కొన్ని ఫుట్ నోట్సు ద్వారా అర్థం అవుతుంది. వాల్మీకి చేసిన వర్ణనలేమీ పాడుచెయ్యలేదు నేను. (విషవృక్షంలో వున్న వర్ణనలన్నీ రామాయణంలోవి మాత్రమే కావు)

ఇంతకీ నే నడిగే దేమిటంటే — రాముడికి రాజ్యార్హత లేదు కదా? — అని అడగడానికి సంస్కృతం గొప్పగా తెలిసి వుండాలా? వాలిని చంపడంలో రాముడికి స్వార్థం లేదా? — అని అడగడానికి సంస్కృతం గొప్పగా తెలిసి వుండాలా? రామాయణంలో కథనీ, ధర్మాలనీ ప్రశ్నించడానికి సంస్కృతం గొప్పగా తెలిసి వుండాలా? రామాయణానికి అనుకూలంగా మాట్లాడే వారందరూ గొప్ప సంస్కృత పాండిత్యంతో, స్వయంగా సంస్కృతంలో చదివి మాట్లాడుతోన్న వారేనా? భక్తీ, యుక్తీ, శక్తీ వున్న అనువాదకులే గదా ఎంతో శ్రమకోర్చి రామాయణం అనువాదాలు చేశారు. అందరికీ తెలిసిన కథని సంస్కృత భాష ముసుగులో దాచేసి "అబ్బో! ఇది మీకు అర్థమే కాదు_" అని రక్షించాలని చూస్తే ఏం లాభం? — అర్థం అయినంతవరకే ఏవో పిచ్చి ప్రశ్నలు అడుగుతాం కదా? — పోనీ వాటికే మీ జవాబు చెప్పండి.

* * *

భారతదేశంలోనే గాక అనేక దేశాలలో చిలవలు పలవలుగా అల్లుకుపోయిన ఒక గాథ మీద విమర్శలు చేస్తే మీకు కూడా అంత పేరు వస్తుందని మీ అభిప్రాయం అనుకుంటాను.

చాలా దేశాల్లో వుంది కాబట్టి దాన్నేమీ అనకూడదు. అంతేనా? ఒక విషయం వుత్తమత్వం అంతా దాని వ్యాపకత్వం మీద ఆధారపడి

వుంటుందన్నమాట ..... వొకసారి ప్లేగు వ్యాధి బెంగాల్ అంతా వ్యాపించి పోయింది. హైదరాబాదు నిండా దోమలెప్పుడూ వ్యాపించే వుంటాయి.

ప్రపంచంలో అనేక దేశాల్లో నిరుద్యోగం వ్యాపించి వుంది. వ్యాపించడమే మంచికి చిహ్నం అయితే చాలా వాటిని అలాగే రక్షించి వుంచుకోవాలి.

* * *

విషవృక్షాన్ని తూచి అమ్ముతారో ... ఏ లెక్కన అమ్ముతారో చూడాలి.

— ఏ పుస్తకాన్నయినా తూచి అమ్మకక్కర్లేకుండా పాఠకులు ఇష్టంగానే కొనుక్కున్నప్పటికీ, పుస్తకాల అమ్మకమే పుస్తకం విలువని నిర్ణయిస్తుం దనుకోవడం చాలా పొరపాటు. పుస్తకం ఎంత ఎక్కువగా అమ్మితే అంత విలువైంది అవదు.

* * *

శ్రీరామచంద్రుడు తానీషా నవాబునకు డబ్బు చెల్లించి రాముదాసుని విడిపించె నంటారు. అంత మహత్యం కనపడు అవకాశము లున్నవా? దయచేసి మీ అభిప్రాయము చెప్పగలరు.

— మీరే దయచేసి వినాలి గానీ, జవాబు ఎవరైనా చెప్పగలరు. మీ ప్రశ్నకి జవాబు చాలా చిన్నదే. "ఆ కట్టు కథలన్నీ నమ్మకండి" — అంతే చాలు. — కానీ, ఈ వొక్క మాటతో సందేహం వొదిలించుకో గలిగే స్థితిలో మీరు లేరు.

రాముడు తానీషాకు డబ్బు ఎప్పుడు చెల్లించాడో (కథలో) తెలుసా ? రామదాసుని బందిఖానాలో పెట్టిన తర్వాత 12 సం॥లకి.

అప్పటికి ఆయన చేసుకున్న పాపం తీరిందట. ఇక అప్పుడు దేవుడు రక్షించే దేముంది? ఆయన శిక్ష ఎలాగూ పూర్తయిపోతుంది. రామదాసు వంటి మహా భక్తుణ్ణి చెరలో పెడితే, రాముడు రక్షించలేదే మనే ప్రశ్న భక్తులకైనా వొస్తుంది కదా? అందుకని రాముడి పరువు కాపాడి, ప్రజల్లో దేవుడి నమ్మకాలు నిలబడేట్టు చెయ్యడానికి తర్వాత కాలం కవులెవరో ఇలాంటి కథలు సృష్టిస్తూ వుంటారు. రామదాసు కొంత కాలం చెరలో వున్నాడనే సంగతి అందరికీ తెలిసిందే కాబట్టి రాముడు వెంటనే విడిపించా డనడం కుదరదు కదా? — అంచేత కొంత కాలం రామదాసు కర్మఫలం అనుభవించడం, అప్పటికి శ్రీరాముడి దయ రావడం, ఆయన వొక చేత్తో విల్లూ, వొక చేత్తో డబ్బు మూటా పట్టుకుని తానీషా దగ్గిరికి రావడం, తానీషాకి డబ్బిచ్చి రామదాసుని వొదులుతాడో లేదోనని జాగ్రత్తకోసం రశీదు తీసుకోవడం — అదండీ సంగతి. ప్రకృతి ఇచ్చిన లోకజ్ఞానంతో, సమాజం ఇచ్చిన అనుభవ జ్ఞానంతో ఇక మీరే ఆలోచించుకోండి.

• • •

'విషవృక్షం' కొందరు స్త్రీలకు కూడా నచ్చలేదు. దానికేం చెపుతారు?

— ఏం చెపుతాం? ఏం చెప్పం. — అది సరే! విషవృక్షం కొందరు స్త్రీలకు నచ్చకపోతే మీ కంత సంబరం ఎందుకూ? — చాలా మంది పురుషులకే నచ్చింది. దానికి మీరేం చెపుతారు?

• • •

రాముడి పాత్రలో ఏమైనా లోపాలు వుంటే అలా రాసినందుకు కవి బాధ్యుడు. రాముడి పొరపాటు ఎలా అవ్వుతుంది!

— కవే తప్పుల రాముణ్ణి చూపిస్తే, కవితో సంబంధం లేని ఒప్పుల రాముడు మీకు ఎక్కణ్ణించి వొచ్చాడు? వాల్మీకి కంటే పూర్వం ప్రచారంలో వున్న రామాయణం కథ మీకు తెలుసా?

మీరు రాముణ్ణి ఎవరి రచన ఆధారంతో తెలుసుకున్నారు? రాముడిలో తప్పులకు కవి బాధ్యుడైతే రాముడిలో వుత్తమత్వానికి కూడా కవే బాధ్యుడు. అంతే గానీ, మంచితనం అంతా రాముడి స్వంతమూనూ, చెడ్డతనం మాత్రం కవి పొరపాటంటే కుదురుతుందా? రాముణ్ణి కవి ఏ క్షణంలోనూ చెడ్డవాణ్ణి చెయ్యాలని అనుకోలేదు. ఫ్యూడల్ సమాజ లక్షణాలన్నీ రాముడిలో చూపించాడు కవి. అవి గొప్ప ధర్మాలనుకునే చూపించాడు.

కపటం, మర్మం, అహంకారం, క్రూరత్వం, అధికార దాహం, ఇవన్నీ ఫ్యూడల్ సమాజానికి గొప్ప ధర్మాలే. వాటి వ్యవహారం ఈనాడు కొంతైనా తేటతెల్లం అవుతోంది కాబట్టి, తప్పులన్నీ ఎవరిమీదకి గెంటాలో తోచడం లేదు రామ దాసులకి. రాముడే వ్యక్తిగతంగా దోషి కాడు. అలాగే సమాజ ప్రభావంతోటే రాముడి పాత్ర చిత్రించిన వాల్మీకి దోషి కాడు. — ఫ్యూడల్ సమాజ ధర్మాలని ఇంకా నెత్తి కెక్కించుకుని వూరేగుతోన్న రామదాసునిదే దోషం అంతా. రామాయణాన్ని వొక కాలంనాటి సాహిత్యంగా మాత్రమే ఎంచి, అది ఈనాడు చాలా అభివృద్ధి నిరోధకంగా వుందనే సంగతి గ్రహించి, దాని పవిత్రతకు నీరాజనాలు పట్టకుండా, లైబ్రరీలలో జాగ్రత్తగా దాచి వుంచుకోవాలి. గత చరిత్రనీ, ప్రాచీన కవితా రీతుల్నీ నెమరు వేసుకోవడానికి మాత్రమే దాన్ని తెరవాలి.

* * *

పెద్ద పెద్ద లెందరో అనేకులు రామాయణాన్ని పరిశీలించారు గతంలో. రకరకాల పద్ధతుల్లో రాశారు గానీ, ఎవ్వరూ దాన్ని విషవృక్ష మనలేదు. ఈ నాటికి దాన్ని

విషవృక్షం చేసిన ఘనత మీకు దక్కింది ... మీ పరిశీలనలో మీరొక విషవృక్షం చూశారు ...

— ఎవ్వరూ అనని మాట ఈనాడు వొక వ్యక్తి అన్నంత మాత్రాన దానికి పిలువ ఇవ్వకండి. లేదా, ఆ మాట ఎందుకు అనవలసి వొచ్చిందో, ఆ వ్యక్తి ఆర్గ్యుమెంటు ఏమిటో పరిశీలించండి. అంతే గానీ, "ఇన్నాళ్ళూ ఎవ్వరూ అనలేదు కాబట్టి .... ఇక ముందు కూడా ఎవ్వరూ అనకండి. (దాని పవిత్రత కలకాలం అలాగే వుంచండి)" — అనడం అనాగరిక మనస్తత్వమే గానీ, సిద్ధాంతచర్చ కాదు. కనీస తర్కజ్ఞానమూ కాదు.

* * *

రామున్ణి మానవ మాత్రుడిగా చూడాలని ఎంత తర్కం మాట్లాడినా రాముడికి సంబంధించిన ఏ కథ చదివినా రాముడు మానవోత్తముడనే భోస్తుంది తప్పకుండా.

— ఆ మహానుభావుడు .... ఆ పురుషోత్తముడు .... ఆ కరుణా సముద్రుడు .... ఆ పాప సంహారకుడు .... అంటూ మీ చుట్టూ వూదర గొడుతోంటే ఆలా అనిపించక ఏం చేస్తుంది? — అదే సమాజ ప్రభావం. మీకు "నలుగురు దొంగలూ, నల్లమేకా" కథ తెలుసా? నలుగురు దొంగలూ మేకని కుక్క అన్నారని అది కుక్కే అని నమ్మి దాన్ని వొదిలిపెట్టిపోయాడు వొకాయన.

పది మందీ ఏ మాటంటే ఆ మాట మీదే విశ్వాసం ఏర్పడుతుంది. అది నిజమో, కాదో గ్రహించడానికి కొంత చైతన్యం కావాలి. — ఆ చైతన్యం వున్నవారికి, రాముడు రాజ్యభ్రష్టుడై రాజ్యం కోసం తహతహలాడుతూ తిరిగిన సాధారణ రాజకుమారుడి లాగ మాత్రమే కనపడతాడు.

* * *

రామాయణం గురించి ఇంత తతంగం చెయ్యవలసిన అవసరం వుందని నే ననుకోను. ఇద్దరు మొగాళ్లు ఒక ఆడ దానికోసం కొట్టుకున్న కథ అది.

— ఇద్దరు మొగాళ్ళు వొక ఆడదానికోసం కొట్టుకోవడంలోనే వొక సమాజ పరిస్థితి వుంది ఆ మొగాళ్ళ దెబ్బలాటలో ఆ స్త్రీ పాత్ర ఏమిటి? ఆ స్త్రీ ఏ మొగాణ్ణి ఇష్టపడింది? ఎందుచేత?

స్త్రీ ఇష్టా యిష్టాలతో పని లేకుండా ఆ ఇద్దరు మొగాళ్ళూ కొట్టు కోవడం ఏమిటి?—

రామాయణానికి కేవలం మీరు చెప్పిన లక్షణమే వున్నప్పుడైనా ఈ విషయాలన్నీ పరిశీలించ వలసిన అవసరం వుంది.

* * *

ప్రాచీన సంస్కృతి మీద ఎందుకీ దాడి? మీరు చెప్పదల్చుకున్న కొత్త దేమిటో అది చెప్పరాదూ?

— కొత్తదాన్ని వొకరు చెప్పడం ఏమిటి? చాలా పొరపాటు మీ అభిప్రాయం, చరిత్రగతిలో దానికదే సృష్టి అవుతుంది. — ప్రాచీన సంస్కృతి అని మీరనేది ప్రాచీన సంస్కృతి మాత్రమే కాదు. అదే ప్రస్తుత సంస్కృతి కూడా. దాంట్లో మంచేవిటో, చెడ్డేవిటో ఎంతవరకూ స్వీకరించాలో, ఎంత వరకూ తిరస్కరించాలో పరిశీలించు కునే మార్గంలోనే కొత్త సంస్కృతిని ఏర్పర్చుకో గలుగుతాము.

ప్రాత సమాజంలోనూ స్త్రీ పురుష సంబంధాలుంటాయి (భార్యా భర్తల సంబంధాలు.)

కొత్త సమాజంలోనూ స్త్రీ పురుష సంబంధాలుంటాయి. అయితే, ఇంతవరకూ వున్న సమాజంలో ఆ సంబంధాలు, ఆర్థిక పిలువలమీదా, కులం మీదా, పురుషుడి పోషణాధికారంమీదా, స్త్రీ శీలం మీదా, మతం మీదా, దేవుడి మీదా ఆధారపడి వుంటాయి.

(వర్ణరహిత సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు కేవలం స్నేహం మీదా, సహాన భావాలమీదా, అభిరుచులు కలవడం మీదా, ప్రేమ మీదా ఆధారపడి వుంటాయి.)

వీటి మంచిచెడ్డలు పరిశీలించి చూసుకున్నప్పుడే దీన్ని తిరస్కరించి, దాని స్థానంలో ఏ కొత్త భావాన్ని తెచ్చుకోవాలో తెలుస్తుంది. కొత్తసమాజం గానీ, కొత్త సంస్కృతిగానీ (కొత్త జీవంగానీ) పాత దానితో సంబంధం లేకుండా రాదు. పాతది వొక చోట ఆగిపోయి, తెగిపోయి, అక్కణ్ణించి హఠాత్తుగా కొత్తది ప్రారంభం కాదు.

అందుచేత, పాత సంస్కృతిని విమర్శ లేకుండా వొదిలేసి, కొత్త దాన్ని సృష్టించుకోలేము. పాతదాన్ని విమర్శించుకునే క్రమంలోనే కొత్తది సృష్టి అవుతుంది.

* * *

ఊర్మిళ వాసంతితో మాట్లాడుతూ తమ ఫుట్టింట్లో సీతకు నాస్తిక బ్రాహ్మణుడు పతివ్రత వవుతావని జోస్యం చెప్పేవాడని చెపుతుంది. నాస్తికులకు జోస్యం మీద నమ్మకం వుండదుకదా ?

— జోస్యం అంటే గ్రహాల నడకల్నిబట్టి చెప్పే జోస్యం అని అర్థం కాదు. సీత స్వభావాన్నీ, సీత అభిరుచుల్నీ పరిశీలించి "నువ్వు పతివ్రతగానే ఉండడానికి ఇష్టపడతావు" — అని చెప్పాడని అర్థం.

* * *

లక్ష్మణుడు ఊర్మిళని అమ్మా అని పిలిస్తే మూర్ఛ పోయి మళ్ళీ లేవలేదని ఒకచోటా, ఊర్మిళ మామూలుగానే ఉన్నట్టు ఇంకోచోటా రాశారు. ఇది ఒకదాని కొకటి కుదరడం లేదు.

— ఊర్మిళ పధ్నాలుగేళ్ళు నిద్రలో వుందని ఒక రామాయణం చెపుతోంది (వాల్మీకి కాదు). ఆ విషయం దృష్టిలో పెట్టుకుని, లక్ష్మణుడి స్వభావంకూడా భార్యమీద ధ్యాసలేని స్వభావం కాబట్టి, కేవలం జోక్ చెయ్యటానికి మాత్రమే రాసింది అది. దాన్నే సీరియస్‌గా తీసుకున్నట్టున్నారు మీరు.

• • •

శూర్పణఖ సీతని చంపటానికి ప్రయత్నిస్తేనే కదా రాముడు ముక్కూ-చెవులూ కోయించింది?

— శూర్పణఖ మొదట మామూలుగానే మాట్లాడింది. "నువ్వు చాలా అందంగా ఉన్నావు. నన్ను పెళ్ళి చేసుకో" — అని అడిగింది. దానికి రాముడు తన నియమం సంగతి చెప్పి ఊరుకోవచ్చుగదా? తనని కోరిన స్త్రీని వెక్కిరించడం, అన్నదమ్ములిద్దరూ కలిసి ఆట పట్టించి, ఆమెకు కోపం వచ్చేట్టు చెయ్యడంలో శ్రీరామచంద్రుడి వుత్తమత్వం ఏమిటో తేల్చండి ముందు.

• • •

"రామాయణ భారతాలు పవిత్ర గ్రంథాలు. దేవుణ్ణి నమ్మకపోయినా వాటిని నమ్మొతాము"ని మొక్కినట్టులుకూడా అంటారు....

— దేవుణ్ణి నమ్మకపోయినా, రామాయణ భారతాలు నమ్మడం ఎలాంటిదంటే "సైన్సుని నమ్మకపోయినా డాక్టర్ని నమ్ముతాం" — అనడం లాంటిందే. డాక్టర్ని నమ్మడం అంటే సైన్సుని నమ్మడమే. రామాయణ భారతాలు నమ్మడం అంటే దేవుళ్ళనీ, కర్మల్నీ, పునర్జన్మల్నీ నమ్మడమే.

వర్గ సమాజంలో పవిత్రతా, అపవిత్రతా అనేవి ఏమీ లేవు. వ్యక్తి

అస్తి నిలబెట్టే దోపిడీకి పనికొచ్చిందంతా పవిత్రతా. కానిదంతా అపవిత్రతా. దోపిడీ సంస్కృతిలోకూడా పవిత్రత చూడగల మార్క్సిస్టులు-మార్క్సిజానికి వీపు తిప్పినవాళ్ళు.

* * *

రామాయణంలోనైనా, ఏ కథలోనయినా కొంత అధర్మంగా కనపడే విషయాలను విమర్శించడం తప్పులేదు. రాముడి ప్రవర్తనను వ్యక్తిగతంగాకూడా విమర్శించడం ఏ పద్ధతికి చెందుతుంది?

— రాముడి ప్రవర్తన రాముడి వ్యక్తిగతంగా సాధించుకున్న సొత్తు కాదు. రాముడు ఎప్పుడూ గంభీరంగా మందహాసం చిందిస్తూ వుంటాడు. ఒక దాసుడి పాత్ర అంత గంభీరంగా నించోదేం? రాముడి ముందు లక్ష్మణుడుగానీ, ఇంకో దాసుడుగానీ భుజాలూ, నడుములూ వొంచి మెలికలుబడి నించుంటారుగానీ, ఎన్నడూ గాంభీర్యం ప్రదర్శించరేం?

"దాసులు ఎప్పుడూ హీనంగానే ప్రవర్తిస్తారు. యజమానులు ఎప్పుడూ ఉత్తమంగానే ప్రవర్తిస్తారు" — అనడానికి వీలుందా? ఎంత గొప్పవాళ్ళయినా, ఎంత పేదవాళ్ళయినా ఒక్కో సందర్భాన్నిబట్టి గంభీరంగానూ వుంటారు. ఆందోళనగానూ ఉంటారు. అధైర్యంగానూ వుంటారు. (దాసులే ఎక్కువగా కష్టాలలో ఆరితేరి, ఆపదలు సంభవించినప్పుడు యజమానులకన్నా గంభీరంగా వుంటారు.) కానీ కవుల దృష్టిలో (ఈనాటి రచయితల దృష్టిలోకూడా) సాంఘికంగా వుత్తమ స్థితిలోవున్న పాత్రలే గంభీరంగా ప్రవర్తిస్తాయి. గాంభీర్యం ఎప్పుడూ కులీనుల సొత్తే. వారే ఎప్పుడూ ఉన్నతంగా ప్రవర్తిస్తారు. అంచే గాంభీర్యం అనేది ఏ పాత్రకైనా వుండే వ్యక్తిగత లక్షణం కాదు. అది యజమానులకే వుంటుంది. దాసులకు ఉండదు. అంటే ఒక పాత్రని వర్ణించే లక్షణాలనుబట్టి ఆ పాత్రకు ఉండే సాంఘికస్థాయి గ్రహించ వొచ్చును.

ఆ పాత్ర సాంఘికంగా గొప్ప స్థాయిలో ఉంటేనే రచయిత ఆ పాత్రకు "గాంభీర్యం" అద్దుతాడు. సమాజంలో సిరి సంపదలూ, ఉత్తమత్వాలూ స్వంతం చేసుకున్నవాళ్ళే ఈ "గాంభీర్యాలూ" "మందహాసాలూ" కూడా స్వంతం చేసుకున్నారు.

అందుచేత ఉత్తమ పాత్రలకు కవి ఇచ్చే ప్రత్యేక లక్షణాలన్నీ వూడబీక వలసిందే. వీపుమీద చీమలు పాకుతోన్నప్పుడు ఎంత రాము డైనా గాంభీర్యం చెదరగొట్టుకోక తప్పదు. దానివల్ల రాముణ్ణి కించ పరచిందేమీ లేదు. "ఉత్తములు ఎల్లవేళలా గంభీరంగానే ప్రవర్తిస్తారు" — అనే రచనా సాంప్రదాయాన్ని తిరస్కరించడమే.

• • •

ఫ్యూడల్ ధర్మాలలో అంతా చెడ్డేగానీ, ఏమీ మంచి లేదా? — అసూయ చెందరాదు అనే నీతి వుందనుకోండి. దాన్ని ఫ్యూడల్ నీతి అనో, బూర్జువా నీతి అనో అనడం ఎందుకు? — ఏ సమాజానికీ సంబంధం లేకుండా చూస్తే అది మంచిదేనా? కాదా?

— ఒక నీతి గానీ, ఒక ధర్మంగానీ, ఒక న్యాయంగానీ ఏ సమాజానికీ సంబంధించకుండా వుండడం అన్నదే అసహజం. ఒక మానవుణ్ణి—"నువ్వు ఏ దేశంలో, ఏ ప్రాంతంలో, ఎక్కడ వుంటున్నావు?" —అని అడిగినప్పుడు—"నేనీ భూగోళంమీద ఏ ప్రాంతానికీ చెందను. నేనీ లోకం మనిషిని కాను" — అంటే ఎలా వుంటుంది? ఒక నీతి ఏ సమాజానికీ సంబంధం లేకుండా వుండడం అలాగే ఉంటుంది.

అసూయ చెందరాదనడం బాగానేవుంది. అసలు అసూయ అంటే ఏమిటి? అది ఎవరికి కలుగుతుంది? ఎందుకు కలుగుతుంది? — మేడలో చక్కటి పరుపుల కుర్చీలో కూర్చుని ఫలహారాలు తింటూ, రేడియో వింటూ, పేపరు చదువుకుంటూ వున్న వ్యక్తికి — ఎదరింటి గుమ్మం ముందు నిలబడ్డ కుష్టు బిచ్చగాడిమీద అసూయ కలుగుతుందా? ఎందుచేత కలగదు? ఆ బిచ్చగాడికే ఆ మేడలో వ్యక్తిమీద అసూయ

కలిగితే ఎందుచేత కలుగుతుంది ? ఇద్దరు వ్యక్తులమధ్య ఉన్న స్థితిగతుల భేదమే అసూయ కలగడానికయినా, కలగక పోవడానికయినా కారణం. సమానస్థాయిలో ఉన్నవారిమధ్యకూడా అసూయకలగడం చూస్తూవుంటాం. దాన్నికూడా పరిశీలించి చూసినప్పుడు వారి మధ్య స్థాయి సమానమేంది కాదనే అర్థమౌతుంది. ఒక్కోసారి తక్కువస్థాయి గలవారిమీదే ఎక్కువ స్థాయి గలవారికి అసూయ కలుగుతుంది. దానికి కారణం చిన్నతనం నుంచీ అనుభవించే సమాజ ప్రభావమే. అసూయకి మూలం సమాజంలోనే వుంది. అసూయే కాదు, ఒక దురుణమయినా, ఒక సద్గుణమైనా, సమాజ పరిస్థితులవల్లనే మనిషి ఆలోచనలలో చోటు చేసుకుంటుంది. "ఆకలి మంచిది కాదు" — అని చెప్పి ఆకల్ని ఒప్పించగలిగితే, "అసూయ చెందరాదు"—అని చెప్పి అసూయని కూడా ఒప్పించవచ్చు. — ఆకలి పోవడానికి ఏదో జరగాలి. అలాగే అసూయ పోవడానికికూడా ఏదో జరగాలి. ఏ వ్యక్తికీ అసూయ కలగవలసిన అవసరంలేని సమాజంలో అసూయ చెందరాదని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. క్రమక్రమంగా అది అంతర్ధానమై పోతుంది.

ఫ్యూడల్ ధర్మాలలో ఏమీ మంచి లేదా ? అని అడిగారు. ఎందుకు లేదు ? — అయితే ఆ మంచి అంతా ఫ్యూడల్ సమాజంలోని పేద వర్గంలోనే వుంటుంది. — ఎలాగంటే అసూయనే తీసుకోండి

ఒక భూస్వామి వున్నాడు. ఒక కూలీ వున్నాడు. అసూయ చెందరాదనే ఒక నీతి వుంది. — ఇక్కడ అసూయ చెందకుండా దేవుడిచ్చిన దానితో తృప్తి పడవలసిన అవసరం ఎవరికి కలుగుతుంది ? తప్పకుండా పేదవాడికే. ఆ నీతి పేదవాడిమీదే పనిచేస్తుంది. ఒకవేపు అసూయ కలుగుతోన్నా, దాన్ని అణుచుకోవడానికీ, మనసు మంచిగా వుంచుకోవటానికీ, పేదవాడే ప్రయత్నిస్తాడు. అంటే ఆ నీతి పేదవాడే ఒంట పట్టించుకుంటాడు. భూస్వామికి ఈ నీతిని ఒంటపట్టించుకోవలసిన అవసరం ఉండదు. అంటే — ఏ సమాజంలోనైనా అది వర్గసమాజక అయితే మాత్రం నీతీ, నియమం, న్యాయం, నిజాయితీ — అనేవి వుంటే పేద వర్గానికే ఉంటాయి. ఆ ధర్మాలు వారినే ప్రభావితం చేస్తాయి గనం,

అందుచేత ఫ్యూడల్, బూర్జువా ధర్మాలలో వుండే "మంచి" యొక్క పాత్ర ఏమిటో, అది ఎవరి ప్రయోజనాలకు వుపయోగపడు తోందో మీరే నిర్ణయించుకోవచ్చును.

• • •

"కల్పవృక్షమని ఒకటున్నది. (ఎక్కడో?) అది ఏది కావాలంటే అది ఇస్తుంది. నేను నా రామాయణానికి దాని పేరు పెట్టుకున్నాను.

ఒక స్త్రీ రత్నము "విషవృక్షం" అనీ ఒక రామాయణం వ్రాసింది. మంచిదే. విషం కూడా షడ్రసములలో ఒకటే. జీవులకు పనికి వచ్చేదే. కొన్ని జీవులు కొన్ని రసములలో బ్రతికితే, విష జీవులు విషంలోనే బ్రతుకుతాయి...."

— అవును. దోపిడీ జీవులు దోపిడీ రసంలోనే బతుకుతాయి. దాన్ని వ్యతిరేకించే జీవులు చైతన్యరసంలో బతుకుతాయి.

"... రామాయణాన్ని ఎవరు ఎలా విమర్శించినా, అది ఆ కావ్యకథకు కళంకం కాదు. ... జీవుని చిత్తవృత్తి ఎలా వుంటే ఆ కావ్య కథ అలాగే అర్థమవుతుంది..."

— చిత్తవృత్తి అనేది వర్గ స్వభావమే. దోపిడీ వర్గ స్వభావం వున్నవారికి రామాయణం కల్పవృక్షం లాగే ఆర్థమవుతుంది. దోపిడీ వ్యతిరేక స్వభావం వున్నవారికి విషవృక్షం లాగ అర్థమవుతుంది. అంత కన్నా "రహస్యం" లేదు.

"....పరమేశ్వరుని అనుగ్రహం పొందడానికి జీవుడు మిత్రభావంతోనూ మెలగవచ్చు. ద్వేషభావంతోనూ మెలగవచ్చు. ఎలా ప్రవర్తించినా జీవుడు పరమేశ్వరుని దగ్గరకు

చేరేవాడే. సనక సనందులు శపిస్తే, జయ విజయులు వైర భక్తితో మూడు జన్మలలోనే విష్ణుమూర్తిని చేరుకున్నారు. నేను మిత్రభావంతో పరమేశ్వరుని చేరుకుందామని కల్ప వృక్షం వ్రాశాను. ఆ స్త్రీ రత్నం వైరభావంతో ద్వేష మార్గంలో పరమేశ్వరుణ్ణి చేరుకోవడం కోసమే "విషవృక్షం" వ్రాసిందేమో! ..."

— విషవృక్షం రాసినా పరమేశ్వరుణ్ణి చేరుకోక తప్పదన్న మాట. సరే! ఏం చేస్తాం? ఆ పరమేశ్వరుడు నన్నుచూసి .... సంతోషించి —

"వొచ్చావా? తొందరగా రావాలనే విషవృక్షం రాశావా?"

"అబ్బే! ఇక్కడికి రావాలని నాకేం లేదు. పాతకులికి ఏదో చెపుదామని రాశానంతే."

"సరేలే. ఎలాగూ వొచ్చావు. మంచిదే. విషవృక్షం రాసిన దానివే వొచ్చావు, కల్పవృక్షం రాసినాయన రాలేదేం?"

"వొస్తారు. వొస్తారు. ఇక్కడికి చేరాలనే ఆయన కోరిక. అందుకే కల్పవృక్షం రాశానని సభల్లో కూడా చెపుతూ వుంటారు."

"అలాగా? నువ్వే ముందొచ్చావే! — ఆయనకు మాత్రం దేవుడి దగ్గిరికి తొందరగా చేరాలనే తొందర లేదా? — నా భక్తుడు కాడా?"

"భక్తుడు కాబట్టే ఆలశ్యంగా వొస్తారట. నా లాగ మూడు జన్మల్లో కాదు .. ఇంకా ఆలశ్యంగా ..... ఆరు జన్మల్లో ....అంత గొప్ప భక్తి!"

• • •

ఈ రామాయణ విషవృక్షము శాఖోప శాఖలుగా అభివృద్ధి చెంది భావి భారత బాలల హృదయాలలో నిలిస్తే!

నిలవకూడదు. నిలిస్తే ఏముండిక. సర్వ భారతీయ సంస్కృతి, సభ్యత మంటలో కలిసిపోతుంది.

— భావి భారత బాలలకు పోయేదేమీ లేదు — దోపిడీ సంస్కృతి తగిలించే బానిస భావాల సంకెళ్ళు తప్ప.

* * *

కొన్ని అనుకూల విమర్శలు

"…. ఎంతో కనువిప్పుగా వున్నది …. రాసిన రామాయణమే మళ్ళీ మళ్ళీ ఎందుకు రాయబడుతున్నదో, అంత తీవ్రమైన వర్గ విశ్లేషణలతో చూస్తే తప్ప ఆ విషవృక్షాన్ని సమూలంగా కూల్చలేం."

* * *

"…. ఒక వర్గం పరమ పవిత్రంగా నిత్యపారాయణ గ్రంథంగా భావించే రామాయణ నిజస్వరూపం తెలిసిన వాళ్ళు చాలా తక్కువమంది. నిష్కల్మష హృదయంతో, నిజాన్ని తెలుసుకొనగోరే జిజ్ఞాసువులకు, అబాల గోపాలానికి, ఇది వుపకరిసుంది."

* * *

"…. విప్లవవాదుల మనుకునే వాళ్ళల్లో కూడా రామాయణ భారతాది గ్రంథాల గూర్చి ఒక తరహా చూపు వుంది. అనవసరంగా వాటి విషయంలో కాలం దుబారా చేయడం దేనికి? …. అని వీరంటారు.

భారతీయ సంస్కృతిపై వీటి ప్రభావాన్ని వీళ్ళు అంచనా వేయలేకపోతున్నారనే చెప్పాలి. మన సమాజంలో వీటి స్థానం అమోఘమైంది. వీటి సత్తా అబ్బురమైంది. వీటి పవిత్రతనూ – ప్రతిభనూ కదలించకపోతే – శంకించకపోతే — కాల రాయకపోతే మనం చేయగలిగిన ఘనకార్యం ఏమీ లేదు."

* * *

"…. దశరథుడు మరణించిన తరువాత ఏమయ్యాడో చెప్పే ఘట్టం పూర్తిగా కల్పితం మాత్రమే అయి రచయిత్రి వూహాశక్తికీ, కల్పనా సామర్థ్యానికీ తార్కాణంగా నిలుస్తుంది. అయితే ఈ ఘట్టానికి

సంబంధించిన వర్ణన పురాణాలలోని అభూత కల్పనలను పోలివుంది. అందులో రాజులూ, వ్యాపారులూ, ఋషులూ, పతివ్రతలూ వగైరాల స్వర్గ కాంక్షలోని హేన్యదైన్యాలు చక్కగా వ్యక్తమయినాయి. భౌతికవాదుల ఆత్మ స్వేచ్ఛలోని విశిష్టత వెల్లడించబడింది. అభూత కల్పనయిన స్వర్గాన్ని అభూత కల్పనల ద్వారానే అపహాస్యం చేసే శిల్పం అవలంబించ బడింది. కథాత్మక విమర్శనా పద్ధతిలో ఈ శిల్పం అవాంఛనీయమేమీ కాదు."

• • •

"....రామాయణం ఒక వర్గానికి కల్పవృక్షంగా కోరిన కోరిక లీడేరిస్తే, ఇంకో వర్గానికి విషవృక్షంగా ఎన్నో విషపూరిత ఫలాలను ప్రసాదించి, వాళ్ళను మనుషులుగా కాకుండా జంతువులకంటే హీనంగా నికృష్టంగా తయారు చేసింది నూటికి పదిమందికిది కల్పవృక్షం. తక్కిన తొంబదిమందికీ విషవృక్షం. అందుకే ఆలోచించి రచయిత్రి ఈ పేరు పెట్టారు."

• • •

"స్త్రీజాతిని ఈ వ్యవస్థ ఎట్లా చూసిందో, తయారు చేసిందో రచయిత్రి స్పష్టంగా వివరించారు."

• • •

"ఇతర భాషల్లోకి దింపితే చాలా బాగుంటుంది. ఇందులో మంచి బాణానంచా వుంది. అరవం, హిందీలు చాలు నిప్పు పెట్టడానికి."

• • •

"....అధిక సంఖ్యాక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని శాస్త్రీయంగా పరిశీలిస్తే రామాయణం అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ గూడా దోపిడీవర్గాల కొమ్ము కాసే భర్మపన్నాలు వల్లిస్తూ, శ్రమజీవులందరినీ శాశ్వత బానిసత్వంలో ప్రుగ్గించేందుకు ఉద్దేశించి రచించబడిన

ఆదర్శ గ్రంథమని ఖచ్చితంగా రుజువవుతుంది. అది దోపిడీ వర్గాలకు మాత్రమే కల్పవృక్షమనీ, పీడిత వర్గాలకు మాత్రం విషవృక్షమేననీ స్పష్ట పడుతుంది. పై సత్యాలను నిరూపించడానికి రంగనాయకమ్మగారు వాల్మీకి రామాయణంలోని శ్లోకాలను ఆధారం చేసుకునే తమ కృషి సాగించారు."

* * *

".... మొన్నీమధ్య మా వూర్లో .... అనే తెలుగు మాస పత్రికను విడుదల చెయ్యడానికి .... వొచ్చారు. విషవృక్షంమీద చర్చ జరిగింది. ఆమె చాలా హేళనగా మాట్లాడారు — "ఆ విషవృక్షం పెరిగి, దాని కొమ్మలు విస్తరించి, దాని వేళ్ళు విస్తరించి విశాలమైతే ఇలాంటి పిల్లలు ఏమౌతారో" — అందామె నన్ను చూపించి. మేం ఊరుకోలేదనుకోండి. గట్టిగా ప్రతిఘటించాం. కొంత రగడ జరిగింది. మేమంతా పాడయిపోతున్నామని తెగ బాధపడిందావిడ."

* * *

".... అట్టడుగు వర్గాల పీడిత ప్రజానీకపు ప్రయోజనాలపెన ఆసక్తి. ఆవేదనగల ప్రతీ అభ్యుదయశీలి — ముఖ్యంగా మార్క్సిస్టు ననుకునే ప్రతి ఆలోచనా పరుడు, సామాజిక విప్లవానికి పునాదిపైన సాంస్కృతిక విప్లవంపై పు దృష్టి సారించవలసిన అవసరం ఎంతయినా వుంది. అందుకు నిజమయినకృషి ఇప్పుడిప్పుడే సాగుతూంది అందులో ఒక భాగమే మార్క్సిస్టు అవగాహనకు దగ్గరగా సాగిన రంగనాయకమ్మగారి రామాయణ విషవృక్షం...."

* * *

".... రామాయణగాథమొక్క ఆత్మ సారాంశంలో ఫ్యూడల్ రాచరిక దోపిడీ వ్యవస్థను కాపాడటమేనన్నది స్పష్టం. అందువల్ల రామా

యణాన్ని సామాజిక పరిణామదృష్ట్యా విశ్లేషించడంద్వారా 'ఈనాటికీ దాని విష ప్రభావాలకు బలియెపోతున్న ప్రజలకు దాని నిజ స్వరూపాన్ని బట్టబయలు చేయటం ఎంతయినా అవసరం."

• • •

".... రంగనాయకమ్మగారి ఈ కృషి మాత్రమే సామాజిక విప్లవాన్ని సాధించలేని విషయం నిజమయినా ఇది అందుకు దోహదం చేస్తుందేగానీ, అవరోధం కాదు...."

• • •

".... ఇక మరొక బాపతు అభ్యుదయ విమర్శకులున్నారు. వారూ మార్క్సిజం గురించే మాట్లాడుతూంటారు. వారి దృష్టిలో రామాయణంలో రాముని విజయం మంచికీ చెడుకీ జరిగిన సంఘర్షణలో మంచికి విజయం. రామాయణం భారతదేశాన్ని ఏక సంస్కృతిలోకి మలచిన మహా కావ్యం. రామాయణ సంస్కృతి భారతజాతి మొత్తం గర్వించదగిన సంస్కృతి ! భారతజాతి అంటే — అది వర్గాతీతమైన దని వారి భావం కాబోలు ! ....

చరిత్రను, మార్క్సిస్టు మూలసూత్రాలను తారుమారు చెయ్యటానికి వెనుకాడరు వారు. అందువల్ల రామాయణ విషవృక్షంపై ఈ సృజనాత్మక కుహనా మార్క్సిస్టుల విమర్శను రంగనాయకమ్మగారేకాదు, ఏ నిజమైన మార్క్సిస్టు విమర్శకుడూ పట్టించుకోవలసిన పనిలేదు."

• • •

"ఆ రామాయణ కల్పవృక్షం దేశంలోని అధికసంఖ్యాక ప్రజలకు దోపిడీ విషఫలాలను అందిస్తే, ఈ రామాయణ "విషవృక్షం" వారికి వర్గ చైతన్యామృత ఫలాలను అందిస్తుందనడం అక్షరాలా నిజం."

• • •

".... నేను రామాయణ విషవృక్షం చదువుతున్నానని తెలిసి ఒకా

యిన నన్ను మందలించి—"మన సంస్కృతి .... మన సంప్రదాయం" — అన్నాడు.

"అది తెలుసుకోవడానికే చదువుతున్నాను. మీరూ చదువుతారా?" అన్నాను.

"వద్దు. వద్దు" — అన్నాడు. "ఏం? చదవగానే నాస్తికుడనై పోతానని భయమా?" — అన్నాను నవ్వుతూ. అతనే మళ్ళీ చాలా రోజుల తర్వాత ఈవేళ చదవటానికి తీసుకెళ్ళాడు.

* * *

".... ఆమె తన పీఠికలో అన్నట్లు భారత చరిత్ర పరిణామాలను గురించి మనకున్న ఆధారాలు చాలా తక్కువ. ఈ విషయంలో ఇంకా వివరంగా పరిశోధనలు జరుగవలసివుంది. ఈ పుస్తకంలో ఆమె అభిప్రాయాలన్నీ సమగ్రంగా ఉండకపోవచ్చు. రామాయణ దోపిడీ సంస్కృతికి బలియైపోతున్న అసంఖ్యాక పీడిత ప్రజల విముక్తికిపట్ల ఆమెకుగల శ్రద్ధానక్తులకొద్దీ, ఆమె తనకు చేతనయిన ప్రయత్నం మాత్రం చేశారు.

సత్యాన్వేషణకై సాగే చరిత్ర సాగర మధనంలో, భవిష్యత్తులో లభించగల కొత్త ఆధారాలు, అనుభవాలనుబట్టి ప్రస్తుత లోపాలను సవరించుకునే అవకాశం ఎప్పుడూ వుంటుంది. అందువల రంగనాయకమ్మగారు వివిధ పెడ విమర్శలకు చలించక దీక్షతో త్వరలోనే రెండవ భాగంకూడ వెలువరించగలదని ఎదురుచూస్తున్నాం."

* * *

ఈ రెండోభాగం కథల్లో అచ్చుతప్పులు ఎక్కువగానే ఉన్నాయి. ముఖ్యంగా "తోడుదొంగలు" కథలో చాలాచోట్ల నటుడు నలుడయ్యాడు. ఒక్కచోట నటుడికీ, నీలుడికీ తేడా లేకుండా పోయింది. — పాఠకులు ఈ విషయం గమనిస్తారని ఆశిస్తాను

మహాడో కథ తర్వాత నాలుగో కథ వరకూ

("రామాయణ విషవృక్షం" — మొదటి భాగంలో చివరి కథ-లక్ష్మణుడు రాముడి ఆజ్ఞతో శూర్పణఖని ముక్కూ-చెవులూ కోసి విడిచి పెట్టడంతో ముగుస్తుంది.

ఈ పుస్తకంలో మొదటి కథ శూర్పణఖ రావణుడి దగ్గరికి వెళ్ళడంతో ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య వున్న కథా భాగం ఇది.)

శూర్పణఖ వొంటినిండా రక్తధారలతో అక్కడికి పదిహేనే వున్న ఖరుడి దగ్గిరికి వెళ్ళింది. *

ఆమెని చూడగానే ఖరుడు నిర్ఘాంతపడి— "ఎవడీ ఘోరం? ఏ దుర్మార్గుడు చేశాడు నిన్నీ విధంగా?"—అని గర్జించాడు.

శూర్పణఖ తను రాముణ్ణి చూసి మోహించడం, అతణ్ణి వివాహం

---

*ఉత్తర కాండలో 23వ సర్గలో –18, 19 శ్లోకాలు
24 వ సర్గలో – 35 నించి 44 శ్లోకాల వరకూ

—ఖరుడు శూర్పణఖ పినతల్లి కొడుకు. రావణుడు గతంలో అనేక ప్రదేశాలు జయించి, దండకారణ్యంలో "జనస్థానం" అనేచోట ఖరుణ్ణి కొంత సైన్యంతో తన తరపున రాజప్రతినిధిగా వుంచాడు. రావణుడు గతంలో చేసిన ఒక యుద్ధంలో శూర్పణఖ భర్త అయిన విద్యుజ్జిహ్వుణ్ణి తెలిసే చంపేశాడు. తర్వాత శూర్పణఖ దుఃఖపడుతోంటే తను ఆ యుద్ధోన్మాదంలో తెలీక చంపేశాననీ, విచారించవద్దనీ శూర్పణఖ కేమీ లోటులేకుండా చూచుకుంటాననీ రావణుడు చెప్పి ఓదార్చి జనస్థానంలో వుండమని చెప్పాడు. అప్పటి నించీ శూర్పణఖ జనస్థానంలో వుంటోంది. ఖరుడు ఆమెని ప్రేమగా చూసుకుంటున్నాడు. రావణుడు ఆమె భర్తని చంపాడు. రాముడు ఆమె అవయవాలు సరి కించాడు. ఇవ్వరిస్తే సర్వనాశనం అయింది శూర్పణఖ.

చేసుకొమ్మని కోరడం, ఆ అన్నదమ్ములిద్దరూ తనని పరిహసించడం క్రూరంగా తన ముక్కూ, చెవులూ కొయ్యడం అంతా చెప్పింది. *

---

* అరణ్య కాండలో 19వ సర్గలో 14, 15, 16 శ్లోకాలూ, 34వ సర్గలో - 11వ శ్లోకం.

శూర్పణఖ రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ గొప్పగా పొగుడుతూ — "ఆ మహానుభావులు దేవతలవలె వెలిగిపోతూ వున్నారు. సౌందర్యరాసులు. ఆత్మ నిగ్రహులు. తపస్సంపన్నులు. పుణ్యాత్ముడైన రాముడు స్త్రీని చంపగూడదని సందేహించే నన్ను చంపకుండా, అవమానించేసి విడిచి పెట్టాడు" — అని చెప్పింది.

ముక్కూ, చెవులూ కోసి బాధించిన వాళ్ళని ఎవరైనా పొగుడుతారా? శూర్పణఖేకాదు, మొత్తం రామాయణం చివరివరకూ రాముడి శత్రువులందరూ రాముణ్ణి కీర్తిస్తూనే వుంటారు. రావణుడుసహా రాముడిమీద కోపంతోనే — "ఆ మహానుభావుణ్ణి సంహరిస్తాను" — [అంటూవుంటాడు. ఇదీ కవిగారి పాత్ర చిత్రణా ప్రతిభ —] ఏ పాత్ర ఏ విధంగా మాట్లాడాలో, శత్రువుని అయినా ఏ సందర్భంలో పొగిడి ఏ సందర్భంలో తిట్టాలో కవి బొత్తిగా పట్టించుకోడు. — రాముడిమీద కవికి భక్తి వుండొచ్చు. పాఠకులకీ వుండొచ్చు. రాముడి శత్రువులకి మాత్రం, రాముణ్ణి తిట్టిపొయ్యాలనీ, నవ్వాలనీ, చంపాలనీ ద్వేషమే వుండకతీరదూ వుంటుంది.

ఇంకో విషయం — శూర్పణఖ తను రాముణ్ణి ప్రేమించి అది గురించి మొదట్లోగానీ, రావణుడి దగ్గరగానీ చెప్పలేదు. కానీ, రాముడికీ, రావణుడికీ యుద్ధం జరుగుతోండగా, — రావణుడి తరుపు జనం చచ్చిపోతూ వున్నప్పుడు లంకలో స్త్రీలు — "అయ్యో! అసలు శూర్పణఖ రాముణ్ణి మోహించడం ఎందుకూ? మనకీ కష్టాలన్నీ రావటం ఎందుకూ?" — అని ఏడుస్తారు. (యుద్ధకాండలో - 95వ సర్గలో — 7 నించి 11 శ్లో॥) - దీన్నిబట్టి శూర్పణఖ రాముణ్ణి పెళ్ళి చేసుకోమని అడిగిన విషయం లంక ప్రజలందరికీ తెలిసిందే అని స్పష్టం అవుతోంది. అందుచేత నేను శూర్పణఖ చెప్పినట్టే రాశాను.

ఖుమ్ము పట్టరాని కోపంతో 14 మంది దీపుల్ని పిల్చి– 'కాప్పణ ఖరు దుర్మార్గుణ్ణి వధించడం మనం సహించరానిది, మీరు వెంటనే వెళ్ళి ఆ దుర్మార్గుణ్ణి అంతం చేసిరండి–" అని ఆజ్ఞాపించాడు.

ఆ సైనికులు రాముడిమీదకు యుద్ధానికి వెళ్ళారు. రాముడు బంగారుకవచం తీసుకుని (దుష్టకి బంగారుకవచం ఎల్లో!)—రాక్షసుల కెదురుగా నించున్నాడు.— "మీ మొహమో తెల్లోడే వచ్చారా? చశ్రధ మహారాజ పుత్రులం. తప్పోధర్మంతో కందమూలాలు తింటూ ఆత్మ నిగ్రహంతో కాలం గడుపుతున్నాం. మా వంటి నిర్దోషుల్ని హింసించ డానికి వొచ్చారా?" — అన్నాడు.

"మా రాజు ఖరుడికి కోపం తెప్పించావు. నిన్ను చంపకుండా మేం తిరిగి పోతామా?" — అన్నారు రాక్షస దీపులు.

"ఎనలు మిమ్మల్ని హతమార్చి, రుషుల్ని రక్షించాలనే నేను ఆయుధాలతో ఎదుర్కొన్నాను. ప్రాణాలమీద ఆశవుంటే పారి పోండి" — అన్నాడు రాముడు.

రాక్షస సైనికులు రాజు ఆజ్ఞ గుర్తు తెచ్చుకుని యుద్ధానికి తల పడ్డారు.

కొంతసేపు యుద్ధం జరిగింది.

రాముడు నెగ్గాడు. (కవిగారి దయవల్ల) బంగారు ముళుకులుగల బాణాలతో ఆ సైనికు లందర్నీ చంపేశాడు. *

ఈ సంగతి విని శూర్పణఖ కోపం పట్టలేక — ఖరుడితో— "నువ్వే స్వయంగా వెళ్ళి ఆ దుర్మార్గుణ్ణి చంపి, లేకపోతే నువ్వేం వీరుడివి? —

---

* ఇది "ఫ్యూడల్ సాహిత్యం" అనే విషయం ప్రతీ నిముషం గుర్తు పెట్టుకుంటూ వుండాలి. ఇందులో ప్రతీ విషయమూ అతిశయంగా చిత్రీకరణ జరుగుతుంది. వేలకొద్దీ సంవత్సరాలు జీవించడం ఎంత సహజమైన విషయమో, ఒక్కో వ్యక్తి వేలాది మందితో యుద్ధాలు చేసి జయించడంకూడా అలాంటి సహజమే. సంఖ్యపెరగాక మనం కథా గమనంలో స్పష్టంగా కనబడే "విషయాల"మీద దృష్టి వుంచాలి.

ఇక్కడ చేరిన శత్రువుని నాశనం చెయ్యలేకపోతే, ఇక ఈ జనస్థానం ఎలా రక్షిస్తావు? లేకపోతే ఈచోటు వొదిలిపెట్టి పారిపో" -అంది.

ఖరుడు 14 వేల మంది సైనికుల్ని తీసుకుని బయల్దేరాడు.

- ఖరుడికి దారిలో చాలా అపశకునాలు కనిపించాయి. మేఘాల్లోంచి ఎర్రటి నీళ్లు కురిశాయి. ఖరుడి రథంమీద గద్దవొచ్చి వాలింది. జంతువులన్నీ భయంకరంగా కూశాయి. సరస్సుల్లో తామరపూలన్నీ ఎండిపోయాయి. సైన్యం వెళ్తున్న దారి పొడుగునా చెట్లకి పళ్ళూ, పువ్వులూ లేకుండా మోడయం అయిపోయాయి. *

ఆకాశంలో దేవతలూ, ఋషులూ, విమానాలలో గుంపులు గుంపులుగా కూడి — "ఈ యుద్ధంలో రాముడే జయించాలి. ఈ రాక్షసులందరూ నశించిపోవాలి. బ్రాహ్మణులు, గోవులు క్షేమంగా వుండాలి-" అంటూ మాట్లాడుకోవడం ప్రారంభించారు.

రాముడుండే ప్రదేశంలో పక్షులు మధురంగా కూస్తున్నాయి. గాలి చల్లగా వీస్తోంది. రాముడు లక్ష్మణుడితో—"లక్ష్మణా! దూరంగా కనబడుతోన్న వృక్షాలూ....ఇక్కడ ఈ శుభ శకునాలూ చూశావా? రాక్షసులంతా నశించిపోతారనీ .... మనకే జయం కలుగుతుందనీ ఈ శకునాలు సూచిస్తున్నాయి. అందుకేమీ సందేహంలేదు. నువ్వు

---

* ఫ్యూడల్ సాహిత్యంలో — జరిగే ఘట్టాన్ని బట్టి దుశ్శకునాలో, శుభ శకునాలో ఏదో వొకటి వర్ణించడం ఒక లక్షణం.

ప్రకృతిని జయించి - శాస్త్రజ్ఞానం సంపాదించిన కాలం గాక పోవడంచేత, ఫ్యూడల్ వ్యవస్థలో - మానవులు ప్రతీక్షణం "శకునాల్ని" నమ్ముతూ వుంటారు.

అయితే సాహిత్యంలో, కవి - తను సమర్థించే పాత్రల విషయంలో శుభ శకునాలూ - తను వ్యతిరేకించే పాత్రల విషయంలో అపశకునాలూ వర్ణిస్తాడు.

ఒక్కోసందర్భంలో ఆ పాత్రలు చెయ్యబోయే కార్యం జరిగేట్టయితే శుభ శకునాలూ, జరగనిదైతే అపశకునాలూ వర్ణిస్తాడు. — ఈ శకునాల వర్ణన ఫ్యూడల్ సాహిత్యానికి ఒక లక్షణం.

వెంటనే సీతని .... ఆ చెట్ల పధ్య గుహలోకి తీసుకెళ్ళి కాపాడుతూ వుండు. ఈ శత్రువు లందర్నీ నేనే సంహరిస్తాను. నువ్వుకూడా వీరిని సంహరించగల వీరుడివేగానీ .... నువ్వు సీతని రక్షించే కార్యం చూడు. ఇక ఎదురు చెప్పవద్దు. నా పాదాలు నిన్ను శాసిస్తున్నాయి. * —అంటూ లక్ష్మణుణ్ణి తొందరచేశాడు.

లక్ష్మణుడు సీతని వెంట బెట్టుకుని వేరే గుహలోకివెళ్ళి, గుమ్మం దగ్గిర కాపలా వున్నాడు. రాముడు కవచం తొడుక్కొని, కత్తి నడుంకి కట్టుకుని, ధనుస్సు పట్టుకుని సిద్ధంగా వున్నాడు.

ఖరుడి సైన్యం వొచ్చి పడింది. ఘోర యుద్ధం ప్రారంభమైంది. 14 వేలమంది రాక్షసులు, రాముడి చుట్టూ జేరి, కత్తులూ, ఈటెలూ, బల్లేలూ, గండ్రగొడ్డళ్ళూ, చక్రాలూ, గదలూ, రోకళ్ళూ, బాణాలూ, గుప్పించినా రాముడు అన్నీ ఎగరగొట్టేశాడు. పైగా, రాక్షస సైన్యాన్నంతటినీ— వారి గుర్రాల్నీ, గుర్రాలమీద యోధుల్నీ, ఏనుగుల్నీ, ఏనుగులమీద వీరుల్నీ, ఏనుగుల్ని నడిపే మావటివాళ్ళనీ, రథాల్నీ, రథాలమీద సేనాపతుల్నీ, రథ సారథుల్నీ, భుజాలూ, తొడలూ, నడుములూ, వీపులూ, కంఠాలూ, శిరస్సులూ, ముక్కలు ముక్కలుగా ఎగరగొట్టేస్తూ యుద్ధం సాగించాడు.

నూరుమంది శత్రువుల గుంపుమీద నూరుబాణాలూ, వెయ్యిమంది వున్న గుంపుమీద వెయ్యి బాణాలూ, ఐదువేలమంది గుంపుమీద ఐదువేల బాణాలూ వేసి చంపేశాడు. (ముందు ఆ గుంపులో ఎంతమంది

---

* 24 వ సర్గలో — 13 వ శ్లోకం.

రాముడు లక్ష్మణుణ్ణి — "నేను నిన్ను శాసిస్తున్నాను"— అంటే బాగానే వుండేది. "నా పాదాలు నిన్ను శాసిస్తున్నాయి—" అంటున్నాడు. రాముడి పాదాలు రాముడికే పూజనీయంగా వున్నాయి — "ఆహా ! ఇవి శ్రీరామచంద్రుడి పాదాలు కదా !" — అని.

ఇటువంటి ఆత్మస్తుతి తన పాదాలకు తనే నమస్కారం పెట్టుకోవడం లాంటిది.

వున్నాడో శత్రువుల్ని లెక్కపెట్టుకుని .... తర్వాత బాణాలు లెక్కపెట్టుకుని .... ఆహా : శ్రీరామచంద్రుడు పురి.)

ఆకాశంలో దేవతలూ, బ్రాహ్మణోత్తములూ మహా సంతోషంతో యుద్ధం చూస్తున్నారు.

(రాక్షసులు నాలుగు కత్తులు పెకి విసిరితే బాగుణ్ణు.)

రాముడు ఒకచేత కత్తితో యుద్ధం చేస్తోన్నే, రెండో చేత్తో బాణాలు గుప్పించేస్తున్నాడు.

రాక్షస సైన్యంలో చావగా మిగిలినవాళ్ళు "శరణు, శరణు"—అంటూ ఖరుడివద్దకి (రాజుదగ్గరికి) పారిపోయారు.

ఖరుడి ముఖ్య సేనాధిపతి దూషణుడు — సైనికులకి మంచి మాటలు చెప్పి ప్రోత్సహించి,* — మళ్ళీ యుద్ధంలోకి పంపించాడు.

సైనికులు నూతనోత్సాహంతో, రాముడి చుట్టూ జేరి ఆయుధాలు విసురుతూ పట్టడించారు. రాముడు చిరునవ్వుతో గాంధర్వాస్త్రం వేశాడు. (రాముడికి ఋషులంతా మూటగట్టి యిచ్చిన మంత్ర తంత్రాలున్నాయి. ఎన్నివేల బాణాలుతీసినా తరగని అమ్ములపొదులున్నాయి. రాక్షసులకి అవేమీ లేవుమరి)—సైనికులో చాలామంది చచ్చిపోయారు. మిగతావాళ్ళ నూతనోత్సాహం మళ్ళీ పోతబడిపోయి ప్రాణభయంతో వెనక్కి పరిగెత్తారు.

---

* 25 వ సర్గలో – 29, 30, 31 శ్లోకాలు.

సైనికులు పారిపోవడం, సేనాపతి వారికి మంచి మాటలు చెప్పడం, మళ్ళీ సైనికులు పుత్సాహంతో పొంగి యుద్ధంలోకి పురకడం చూడండి.

మంచి మాటలంటే — "అసలు ఇప్పుడే మనం ధైర్యం వహించాలి. ఎవరు బాగా యుద్ధం చేస్తే వాళ్ళకి రాజు గొప్ప గొప్ప బహుమతు లిస్తాడు. ఒకవేళ యుద్ధం చేస్తూ నేల కొరిగినా వీర స్వర్గం లభిస్తుంది. ఔ....రండి. కదలండి. విజయమో : వీర స్వర్గమో!" —అని వుద్రేకపర్చడం అన్నమాట. కాలాన్నిబట్టి యుద్ధాలు చేసే పద్ధతులు మారినా, — సైనికుడికి బోధించేవిషయాలు ఇదే.

ఈసారి భీముడికి సైనికులమీద అమితమైన కోపం వచ్చేసింది. (ఈసారి మంచిమాటలు కాదు. బెదిరింపు) — కోపంతో ఎందర్నో హతమార్చి మళ్ళీ యుద్ధంలో కొచ్చాడు. *

కౌరవుల్లోకెల్లా భీష్ముడి సేనాపతుడూ, సైన్యం అంతా పోయారు. త్రిశిరస్సును చంపే సేనాపతీ, భీముడూ మాత్రం మిగిలారు. (రావణుడికి త్రిశిరస్సును చంపే కొడుకు వొకడున్నాడు. ఆ త్రిశిరస్సు వేరు. ఈ త్రిశిరస్సు వేరు.)

త్రిశిరస్సు భీముడితో—"రాజా! నే నుండగా నువ్వు యుద్ధం చెయ్యడం ఏమిటి?" — అని తనే రాముడితో యుద్ధంచేసి, అందర్నీ చెల్లాచెదురు చేసి వెళ్ళిపోయాడు.

భీముడు ఒక్కడూ మిగిలాడు. కొంత జంకినప్పటికీ యుద్ధానికే ప్రయత్నిస్తాడు. త్వరలోనే, రథం పోయి, సారథిపోయి, ఆయుధాలుపోయి, భూమిమీద నిలబడ్డాడు.

రాముడు గర్వంతో— "దుష్ట పుంగవుల్నీ, నిరపరాధుల్నీ హింసించే నీలాంటి మిత్యాష్టుల్నీ, నీచుల్నీ చంపడానికే నేను రాజ్యాన్ని వొచ్చాను. నువ్వు ఎన్నాళ్ళు నీ సైన్యం చెనకాలే పోతావు—" అంటూ అగస్త్యమహర్షి ఇచ్చిన వైష్ణవ ధనుస్సుతో యుద్ధం ప్రారంభించాడు.

భీముడు పెద్ద చెట్టు పీకితెచ్చి వాంతో యుద్ధం చేశాడు. రాముడా చెట్టుని తునాతునకలు చేసేశాడు.

---

* 27 వ సర్గలో — ఆఖరి శ్లోకం.

భీముడు కోపంతో సైన్యాన్ని యుద్ధంలోకి మళ్ళించాడు.

• 29 వ సర్గలో — 10 వ శ్లోకం.

భరతుడి ఆజ్ఞతో లోకంలో ధర్మం స్థాపిస్తూ తిరుగుతున్నాడట రాముడు. ఈ సంగతి "వాలి" దగ్గర ఇంకా స్పష్టంగా చెబుతాడు. ఒక్కడ భరతుడేమో, రాముడే రాజని, రాముడికి ప్రతినిధిగా రాజ్యం చేస్తున్నాడు. ఇక్కడ ఈయన భరతుడి ఆజ్ఞల ప్రకారం సంచరిస్తున్నా నంటున్నాడు. రాముడి కత్తికి రెండుపైపులా పదునుంటుంది.

"ఇక నీపని ముగిసింది. నీ భార్యలంతా కాపుభోగాలు లేనివారై పోయినట్టే. నీవంటి దుష్టుడు హతమారిపోగానే, బ్రాహ్మణులంతా క్షేమంగా వుంటారు,"— అంటూ మళ్ళీ బాణాలు గుప్పించాడు.

ఖరుడు కూడా చచ్చిపోయాడు. — (కవిగారూ, దేవతలూ, బ్రాహ్మణోత్తములూ అంతా రాముడి పక్షాన వున్న తర్వాత ఖరుడు చచ్చిపోక రాముడు చచ్చిపోతాడా ? — ఇంకా నయం)

ఆకాశంలో వారంతా ఆనందంతో పొంగిపోయి రాముణ్ణి స్తుతిస్తూ పూలవాన కురిపించారు. దేవదుందుభులు మోగించారు. — "రామా ! ఈ రాక్షసుల్ని చంపే విషయం గురించి ఋషులతో మాట్లాడానికే ఇంద్రుడు ఒకసారి శరభంగుడి ఆశ్రమానికి వొచ్చాడు. నీపని నువ్వే చెయ్యాలని నిన్ను ఈ ప్రదేశానికి పిల్చుకుని వొచ్చాము. ఆహా ! గొప్ప కార్యం చేశావు" — అంటూ కీర్తించారు. *

సీత గుహలోంచి బయటికి వొచ్చి, తన భర్తకేమి ఆపద సంభవించ నందుకు చాలా సంతోషించింది. — (ఆ ఆపదలన్నీ ఇతరులకే సంభవించినందుకు) — ఇతరులు ఎన్నివేలమంది చచ్చిపోయినా సరే — తన భర్త వొక్కడూ క్షేమంగా వుండాలి పతివ్రతలకి.)

అకంపనుడనే గూఢచారి వొక్కడూ రావణుడి దగ్గిరికి వెళ్ళి జనస్థానంలో జరిగిన యుద్ధం గురించి చెప్పాడు.

---

* 30 వ సర్గలో — 30, 31 శ్లోకాలు.

ఆకాశంలో దేవతలు — ఇంద్రుడు శరభంగుడి ఆశ్రమానికి వొచ్చిన సంగతి ముచ్చటిస్తున్నారు రాముడితో.

ఈ కథాగమనం ప్రకారం అలా ఇంద్రుడు రావడం జరిగి 12 సంవత్సరాలైంది. ఇంతకాలం రాముడు రాక్షసుల్ని చంపే ప్రయత్నాలేవీ చెయ్యలేదేం ? శూర్పణఖ రావడంచేతనే గదా, ఈ యుద్ధం జరిగింది ! — అంటే రాముడు రాక్షసులతో యుద్ధంకోసం ఎదురు చూస్తూ, దానికి శూర్పణఖని ఉపయోగించుకున్నాడు. అది యుద్ధంలోకి దిగగానే — "నేను ధర్మాన్ని కాపాడుతూ రాజాజ్ఞతో తిరుగుతున్నాను" — అని చెప్తున్నాడు.

(అకంపనుడు రామునిగురించి చెప్తూ — "ఆ మహానుభావుడు.... రాక్షసుల్ని చంపేశాడు. ఆ తపశ్శాలి .... ఖరుణ్ణి చంపేశాడు." — అంటూ పొగుడుతూ చెప్పాడు. .... పైగా, అకంపనుడే సీత అందం వర్ణించి సీతని ఎత్తుకుపోమ్మని సలహా యిచ్చాడు. సీతని అకంపనుడు చూడనేలేదు — రావణుడు వెంటనే మారీచుడి వద్దకి రావడం — తనకి సహాయం చేయమనడం — మారీచుడు రాముణ్ణి పొగిడి రావణుణ్ణి చీవాట్లు పెట్టడం — రావణుడు రాముడి పరాక్రమం విని హడిలిపోయి వెనక్కి వెళ్ళిపోవడం — తర్వాత రావణుడి దగ్గరికి శూర్పణఖ వెళ్ళడం జరుగుతుంది.

శూర్పణఖ వెళ్ళి అంతా చెప్తోవున్నప్పుడు రావణుడు మళ్ళీ కొత్తవిషయం ఏన్నట్టు వింటాడు. రావణుడు మారీచుణ్ణి సహాయం అడిగినప్పుడు, మారీచుడుకూడా కొత్త విషయం విన్నట్టే వింటాడు. అందుచేత — శూర్పణఖ వెళ్ళి చెప్పేఘట్టమే మొదటి ఘట్టం అవుతుంది. — అంతకు ముందే రావణుడు సీతకోసం రావడం — రాముడి పరాక్రమం ఎరిగిపోవడం .... అనేది — కొత్త కవులు జొప్పించిన తెలివి తక్కువ ఘట్టాల్లో ఒకటి అనుకోవొచ్చు.)

★

10

అతని కంటె ఘనుడు!

శరీరాత్మలు ఆత్మలో-దేహంలో ప్రతీ అణువూ శత్రువుమీద ప్రతీకారం కోరుతోంది. ఇప్పుడు తనకు చాలా స్పష్టంగా తెలుసు. రాముడు తమ జాతికే శత్రువు. ఆ ఋషివేషం పుట్టి కపట వేషం మాత్రమే.

భర్తని మర్చిపోయిన తర్వాత....ఇంతకాలానికి - మళ్ళీ ప్రేమ - పూతనానుభవం కలిగే, తనని తన్మయత్వంతో వెర్రిదాన్నిచేసింది. తన హృదయంనించి వెన్నెల్లలుకులే ఆపుకోలేని ఎదురాగం ఆ నీచుడిమీద కురిసింది. - పురుషణంలో ఏంత విషాదం!

రాముడి మీద కలిగిన అంత తీవ్రమైన మోహం గురించి ఆలోచిస్తోంటే, ఇప్పుడు సిగ్గుతో శరీరం కుంచుకుపోతోంది. దుఃఖంతో ఆత్మ కంపిస్తోంది.

ఆ దుర్మార్గుడు తన శరీరానికేకాదు - తమ జాతి ఆత్మాభిమానానికే హాయనిగాయం కలిగించాడు. - తనకెంతో ప్రియమైన ఎన్న మరణం - జనస్థానంలో సర్వనాశనం - అంతా తన తెలివి తక్కువ మూలంగానే, తమ శత్రువుని గుర్తించ లేకపోవడం చేతనే.

అంతా నగరంలో ఎన్న కీర్తి తెలిసింది? ద్వేషంతో బుసకొడుతున్నాడా? ఎన్న శత్రువుని ఉపేక్షచేసే అజ్ఞాని కాదు - ఏరాజు మాత్రం శత్రువుని ఉపేక్షచేసి వ్రాపరుంటాడు? రాజ్య లాభమో, ధన లాభమో, స్త్రీ లాభమో వుంటే ప్రతీ రాజూ మిత్రుల్నిహాగా శత్రువుల్ని చేసుకుంటాడు. ఇక తన ఎన్నసంగతా? - ఎంత వీరుడో ఎంత నిరంకుశుడు! ఎంత స్త్రీ లోలుడు! ఎన్నో యుద్ధాలతో జయాలు సాధించినవాడు, ఇక ఏ రాముడిమీద ఎగ తీర్చుకోలేడా విడిచి పెడతాడా?

అన్నని తల్చుకోగానే శూర్పణఖ మనసు కొంచెం శాంతించింది.

శూర్పణఖ వెళ్ళక పూర్వమే రావణుడు చారులద్వారా జనస్థానంలో జరిగిన విషయాలన్నీ విన్నాడు. శత్రువుమీద బుసలు కొడుతోన్నే వున్నాడు.

దుఖపడుతోన్న శూర్పణఖని ఓదార్చి - ''అంతా వివరంగా చెప్పు. పగ సాధించేవాణ్ణో నే నుండగా నువ్వింత బెంబేలు పడుతున్నా వెందుకు?'' - అంటూ మీసాలు మెలిదిప్పాడు.

శూర్పణఖ ఖరుడికి చెప్పినట్టే అంతా చెప్పి-"అన్నా: జనస్థానంలో నన్ను క్షేమంగా వుండమన్నావు. అక్కడంతా నీ శత్రువు ఆక్రమించాడు. ఇక ఇప్పుడు నువ్వేం చెయ్యాలో నిర్ణయించుకున్నావా?" అని అడిగింది.

రావణుడు అంతా విని, కొంతసేపు మౌనం వహించి- "ఆలోచనేమీ లేదు. శత్రువుని హతమార్చడమే....ఎదిసరే: ఆ రాముడి భార్య మహా అందగత్తె అని విన్నాను నిజమేనా? చూశావా నువ్వు?'' అని అడిగాడు.

శూర్పణఖ కఠినంగా చూస్తూ - "ఈ స్త్రీ వాంఛ చేతనే ఎప్పుడే ఆపద సంభవిస్తుందో తెలుసుకోలేకుండా వున్నావు. నువ్వింత కామకుడివై సుఖ భోగాలలో తేలుతూ వుంటే ప్రజలు ఎంతోకాలం గౌరవించరు నిన్ను'' - అని మందలించింది.

రావణుడు నిర్లక్ష్యంగా నవ్వి - "ప్రజల గౌరవం కోసమూ, ప్రజల ఇష్టాఇష్టాల ప్రకారమూ, రాజు రాజ్యపాలన చేస్తాడా? ఒకరు చెప్పినట్టు చేసే రాజుని పవిత్రం ప్రజలు గౌరవిస్తారా? సైన్యం, బొక్కసం సమృద్ధిగా వుంచుకునే రాజు దేనికీ జంకనవసరం లేదు. రాజు శాసించే నీతే నీతి. సర్వ స్వతంత్రుడు కాని రాజు, సామాన్య జనులతో సమానం అయిపోతాడు - రావణుడి కాగతి ఎన్నడూ పట్టదు. ....ఇంతకీ సీత సంగతి చెప్పవేం? "అంత చక్కనిదా?"- అని ఆత్మగతగా చూశాడు.

"చక్కనిదే. కానీ పతివ్రత అని మాత్రం అనొచ్చును."

"ఆమె పతివ్రత కాదా? .... అయితే తప్పకుండా సాధించవలసిందే!"

"అన్నా : రావణుణ్ణి చంపకుండా ఆమె కొనగోరు తాకడానికి కూడా సాధ్యం కాదు ఎవ్వరికీ."

రావణుడు శూర్పణఖ మాటల్లో ఏమి లక్ష్యం లేనట్లు నవ్వుతూ— "ఎందుకు అంత వీరుడా?" అంటూ మళ్ళీ మీసాలు తిప్పాడు.

అన్నగారి ధోరణి చూస్తే, ఎదటి దృష్టి అంతా సీతమీదే పున్నట్లు తోచింది శూర్పణఖకి—

—"రాముడిమీద పగతీర్చుకోవాలని నీకేమి ఆరాటం పున్నట్లు లేదే!"— అని ఏమ్మయంగా చూసింది అన్నని.

"అందుకే గదా తగిన ఉపాయాలు ఆలోచిస్తున్నాను."

"ఉపాయాలా: వెంటనే బయల్దేరిపోయి, యుద్ధం చేసి రాముణ్ణి చంపక —ఇంకా ఉపాయా లాలోచిస్తున్నావా?"— సమయానుకూలంగా త్వరపడి కార్యాలు చేసుకోని రాజు రాజ్యభ్రష్టుడై గడ్డిపరకతో సమానం అయిపోతా డంటారే!

గడ్డీ, గాదం — దుమ్మూ, ధూళీ అయినా పనికివస్తాయిగాని ఎంత వీరుడైనా, ఎంత సమర్థుడైనా రాజ్యం పోయిన రాజు *ఎందుకూ పనికి రాడంటారే! రాముడు నీకు ఎంత నష్టంచేశాడో, నీ తోబుట్టువుని ఎంత అవమానం చేశాడో తెలిసికూడా నువ్వింకా ఉపాయాలు ఆలోచిస్తున్నావా? రాముడితో యుద్ధంచేసి చంపడానికి ఇంకా వెనకముందు కాపు తున్నావా?"

"తొందరపడకు. ఎదుడు వీరుడని నువ్వే చెబుతున్నావు."

---

* అరణ్యకాండలో — 33 వ సర్గలో 17, 18, 19 శ్లోకాలు

శూర్పణఖ రావణుణ్ణి హెచ్చరిస్తోంది. రాజు బలం అంతా ఆ వ్యక్తి స్వంత వీరత్వంలోనూ, స్వంత సామర్థ్యంలోనూ లేదు. రాజ్యం అనే "సంపదలో" వుంది. ఆ స్థానం ఇచ్చే అధికారంలో వుంది.

"నువ్వు అతణ్ణి మించిన వీరుడివి కావా? అన్నా! రాముడిమీద కక్షతో నా హృదయం మండిపోతోంది. నువ్వు వెంటనే బయల్దేరి వెళ్ళి ఆ దుర్మార్గుణ్ణి చంపెయ్యాలి.

"తొందరపడకు నువ్వు. చచ్చినవాడితో సమానం చేస్తాను. సరేనా?"

"కాదు. ఆ దుష్టుడు చచ్చి తీరాలి."

"సరే అదంతా నాకు విడిచిపెట్టు నువ్వు నిశ్చింతగా పుడు."

"ఆ రాముణ్ణి, అతని తమ్ముణ్ణి చంపేవానని నువ్వునాకు చెప్పినప్పుడే నేను నిశ్చింతంగా వుంటాను." "పిచ్చితల్లీ! నా పరాక్రమాన్ని శంకిస్తున్నట్టున్నావే! అనేక యుద్ధాలలో, పోరాటాలలో నా శరీరమంతా పుచ్చలతో, బొడిపెలతో ఎలా తయారయిందో చూడు. రణ చేతులు బల ప్రదర్శనతో బండబారి ఎంత ఆరితేరాయో చూడు"- అంటూ రాళ్ళపుల్లే వున్న అరిచేతులూ, తొడలూ, భుజాలూ చూపించాడు రావణుడు.

"మరి రాముడితో వీరోచితంగా యుద్ధం చెయ్యక వుపాయా లెందుకు ఆలోచిస్తున్నావు?"

"పిచ్చిదానా! వుపాయాలుకూడా యుద్ధంలో భాగమే. కత్తులతో కలబడడమే యుద్ధం అనుకుంటున్నావా? శత్రువుని వంచించే ఏ కార్యమైనా యుద్ధమే"- అని ఆలోచనలో పునిగాడు.

శూర్పణఖ అసంతృప్తిగా చూసి లోపలికి వెళ్ళిపోయింది.

* * *

దండకారణ్యంలో చెట్ల గుబుర మధ్య ఒక మారుమూల పాకలో ఇద్దరు రుషులు కూర్చుని రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. అందులో ఒక వ్యక్తి లంకాధిపతి రావణుడు. రెండో వ్యక్తి అతని బంధువు మారీచుడు.

---

* 34 వ సర్గలో- 13½, 14½ శ్లోకాలు.

శూర్పణఖ రావణుడికి మరీ మరీ చెప్పడం - రాముణ్ణి మాయ చంపేసి, తర్వాత సీతని తెచ్చుకోమనే, ఆమె పగ రాముడి మీదనే,

మారీచుడు వినయంగా చేతులు కట్టుకుని రావణుడి మాటలు వింటున్నాడు.

రావణుడు కోపంతో వూగుతున్నాడు –

"జనస్థానం ఆక్రమించడానికి నాకు కొన్ని గుండెలు? తనే గొప్ప వీరుణ్ణనే మిడిసిపాటుతో – శూర్పణఖ నా తోబుట్టువని తెలిసికూడా, నిష్కారణంగా ఆమె అంగాలు ఛేదించి నాతో యుద్ధానికి కాలు దువ్వుతున్నాడు. తనని దేవతలు రావణ వధకే పుట్టించారని బీరాలు పలుకుతున్నాడట. ఆ దేవత లంచర్మీ నా పరిచారకుల్ని చేసుకున్నాననే సంగతి ఆ రాముడికి తెలిసినట్లులేదు. నా గుండెలు పౌరుషంతో మండిపోతున్నాయి. నా శత్రువుకి పరాభవం చెయ్యకుండా నే నూరుకోను. అతని భార్యని ఎత్తుకొస్తాను. నా తమ్ముడూ, నా బంధుమిత్రులూ అందరూ నాకు అండగా నిలబడితే నే నెవ్వరికీ జంకను. ఈ కార్యంలో నువ్వు నాకు సహాయం చెయ్యాలి" అని ఆగాడు.

మారీచుడు గజగజ వణుకుతున్నాడు. సగం రావణుడి మీద భయంతో, సగం రాముడిమీద భయంతో – "నీవంటి అభాగ్యుడు నీ వంటి మహారాజుకేం సేవ చెయ్యగలడు?" – అంటూ మోకరిల్లాడు రావణుడి కాళ్ళమీద.

"సీతకు పక్షులన్నా, జంతువులన్నా ప్రీతి లని వినాను. నువ్వు * బంగారు లేడివై సీత కంటబడాలి. సీత నిన్ను పట్టుకోవాలని ప్రయ

---

* 36 వ సర్గలో 18, 19 శ్లోకాలు.

మారీచుణ్ణి అందమైన లేడిగా మారమని రావణుడు చెప్పడం – ఫ్యాంటసీ సాహిత్యం నిండి, – ఇటువంటి "కల్పనల్ని" వేరుచెయ్యడం సాధ్యంకాదు. – సీత ఒంటరిగా వున్న సమయం కనిపెట్టి, రావణుడు ఆమెని తీసుకుపోయాడు – అన్న విషయాన్ని మాత్రమే మనం వాస్తవ దృష్టితో అర్థంచేసుకోవచ్చు.

ఈ విషయం నేను "ముందుమాట"లోనే వివరంగా ప్రస్తావించాను.

తిన్నుంది. నువ్వు చొరకచూడకు. తర్వాత రాముడు నిన్ను పట్టుకోవాలని పెంటబడతాడు. నువ్వు రాముణ్ణి లడవిలో చాలా దూరం తీసుకుపోవాలి. తర్వాత ఎతడికేదో గొప్ప ప్రమాదం వొచ్చినట్టు భ్రమ కల్పించాలి. "లక్ష్మణా: సీతా: రక్షించండి...." అని కేకలు పెట్టాలి. లక్ష్మణుడు ఎలా రాముణ్ణి వెదుకుతూ బయటికి పోతాడు. సీత వొంటరిగా చిక్కుతుంది. వెంటనే ఆమెని నా రథంమీద ఎక్కించుకుని...."

మారీచుడు వెలవెల బోయాడు.

ధైర్యం చూడగట్టుకుని — "మహారాజా: నేను నీ బంధువుని. నీ హితం కోరేవాడిని. రాముడి గురించి నీ కెవరో చాలా ద్వేషం నిండే చెప్పారు. రాముడంటే ఏమనుకుంటున్నావు: సాక్షాత్తూ ధర్మ దేవత. సాధు పుంగవుడు. ఇంద్రుడు దేవతల కెట్లా రాజో — రాముడు సర్వ ప్రపంచానికీ రాజు కాదగిన వాడు. అటువంటి మహానుభావుడి భార్యని ఎత్తుకు పోతావా? రాముడితో వైరం పెట్టుకుంటావా? నీకీ ఆలోచన ఎవరు చెప్పారు? విభీషణుడితోటీ, మిగిలిన మంత్రులతోటీ శ్రద్ధగా ఆలోచించావా? నా మాట విని ఈ కార్యం విరమించి...." — అంటూ వొణుకుతూ హితబోధ ప్రారంభించాడు.

ఈ మారీచుడు ఎవరో కాదు — రుషుల కుట్రలకు బలై, ప్రాణాలు పిడిచిన తాటకి కొడుకే. రాముడు తన తల్లిని చంపాడనే ద్వేషమైనా లేకుండా, ఈ నాటికి రాముడి దాసుడై రాముణ్ణి కీర్తిస్తున్నాడు.

మారీచుడి పొగడ్తలు భరించలేక రావణుడు కళ్ళెర్రజేసి మండిపడుతూ — "నీచుడా! నాముందే నా శత్రువుని కీర్తించడానికి నీకెన్ని గుండెలు?" — అంటూ కత్తి తీశాడు.

మారీచుడు వినయంతో వొణుకుతూ — "మహారాజా: పన్నించు. శాంతించు. నీకన్నా ఎవ్వరూ అధికులు గాడు నాకు. రాముడి వీరత్వం కళ్ళారా చూసినవాణ్ణి గనక, ఆ మంచి చెడ్డలు నీకు విన్నవిస్తున్నాను. నేను కేవలం రాముడి పరాక్రమానికి మాత్రమే జంకుతున్నాను. రాముడు చిన్నతనంలో ఒకసారి విశ్వామిత్ర యాగాన్ని రక్షించడానికి వొచ్చినప్పుడు నా తల్లినీ, సుబాహుణ్ణీ బాణాలువేసి చంపేశాడు. నేనుమాత్రం

ఎలాగో తప్పించుకుని బయటపడ్డాను. — రాముడు దండకారణ్యానికి వొచ్చిన తర్వాత కూడా నేను పాత పగవల్ల, ఇద్దరు అనుచరుల్ని తోడు తీసుకుని రాముడి మీదకి యుద్ధానికి పోయాను. అప్పుడు కూడా అతడి వీరత్వానికి తాళలేక పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాను. నాతో వచ్చిన వాళ్ళిద్దరూ రాముడి చేతిలో ప్రాణాలు విడిచారు. అప్పట్నించీ నేను రాముడిమీద వైరం విడిచిపెట్టేసి ఈ ఋషి వేషంతో ఋషులకు సేవ చేసుకుంటూ జీవిస్తున్నాను. రాముడి వీరత్వం ఒక్కసారి చవిచూసిన వాళ్ళు మళ్ళీ రాముడి జోలికి పోరు. ఎటుచూస్తే అటు రాముడి బాణాలే కనపడతాయి నాకు. నిత్యం, కలలోకూడా రాముడి భీకరత్వమే"— అంటూ చుట్టూ చూశాడు.

రావణుడు మళ్ళీ మండిపడుతూ — "మూర్ఖుడా! నా శత్రువుని కీర్తించడం మానలేదు కదా? నువ్వు పిరికి పందవై వీర కార్యాలన్నీ విడిచి పెట్టావుగానీ, రాముడు ఎంత వీరుడే అయితేనేం, సిగ్గులేక ఆడదాని మాట ప్రకారం రాజ్యం వొదులుకొని అరణ్యాలలో కెందుకొస్తాడు?"* — అని వెటకారంగా నవ్వాడు.

మారీచుడు కొంచెం ధైర్యం పుంజుకున్నాడు. — "రాముడు తండ్రి సత్యవ్రతం కాపాడడానికే అరణ్యాలకు వొచ్చాడుగానీ అస

---

* 40 వ సర్గలో 5 వ శ్లోకం.

రాముడు "ఆడదాని మాట విని" అడవులకు రావడం పౌరుషం లేని పని అని రావణుడు పరిహాసం చేస్తున్నాడు.

"ఆడదాని మాట వినడం" —అనే విషయం గురించి, రాముడి కెలాంటి తేలిక అభిప్రాయం వుందో రావణుడికీ అలాంటి అభిప్రాయమే వుంది. 'తండ్రిమాట వినడం'లోగానీ, లేకపోతే ఇంకో పురుషుడి మాట వినడంలోగానీ ఇద్దరికీ వ్యత్యాసం లేదు. 'స్త్రీ మాట' ప్రకారం ప్రవర్తించడంలోనే అవమానం అంతా.

మరుడై కాదు సుమా : నా మాట విను. రాముడితో శత్రుత్వం వొద్దు. నీ రాజ్యం రక్షించుకుని, నీ ప్రాణాలు రక్షించుకుని సుఖంగా బ్రతుకు. 'నీకీ మాటలు ఇష్టంగా వుండవని తెలిసి కూడా నీ హితం కోరి...."

"ఇక చాలించు నీ హితబోధ. నేను సీతని అపహరించి తీరాలి. ఒకసారి నిర్ణయించుకున్న తర్వాత ఇక నా నిర్ణయం ఇంద్రుడైనా మార్చలేడు. నేను నిన్ను నా కార్యం పుంచిదా ? చెడ్డదా ? అని సలహా లడగలేదు. అడిగితే చెప్పినా సబబే"—అంటూ వుగ్రుడయ్యాడు రావణుడు.

"నువ్వుచెప్పేది నాకు హితం అయినాసరే—క్షేమం అయినా నరే గౌరవంగల రాజు ఇతరుల నిర్ణయాల ప్రకారం నడవడు. రాజు అంటే ఏమిటనుకుంటున్నావు? యముడూ, అగ్ని, ఇంద్రుడూ, చంద్రుడూ, వరుణుడూవంటి దేవతలందరి శక్తి సామర్థ్యాలూ, తేజస్సూ రాజుకి వుంటాయి. అందుకే రాజుని గౌరవించి పూజించాలి. రాజు వొచ్చి స్వయంగా నీ పల్ల ఒక కార్యం జరగాలని అడుగుతూవుంటే .... మూర్ఖుడా !.... నాకే నీతులు చెప్తున్నావు. నా గుణ దోషాలు వల్లిస్తున్నావు. నీ ధిక్కార మసు నేను సహించను. వెంటనే బయలేరు" — అంటూ వురిమాడు.

మారీచుడు రావణుడి కాళ్ళమీద పడ్డాడు.— "నన్నీ మారుమూల ప్రాణాలతో బ్రతకనివ్వాలంటే .... నాకీ పని చెప్పకు. రాజా ! నన్ను కనికరించు. నన్ను విడిచిపెట్టు .... నన్ను ...."

"పోలేదు. నీ కిష్టం లేకపోయినా నరే నువ్వీ కార్యం ఎలా చెయ్యవో చూస్తాను. రాజుకి హితం చెయ్యనివాడు ఏ కాలంలోనూ సుఖ

• 40 వ సర్గలో — 12 వ శ్లోకం.
రాజు ప్రైవేటు సంభూతుడనే అభిప్రాయం రాముడికి వున్నట్టే రావణుడికి కూడా వుంది.

రాజు మహనీయుడనీ, రాజు పూజనీయుడనీ, రాజుని ధిక్కరించ రాదనీ — నూరిపోసి, ప్రజలు వారికై వారే పనసుల్లోంచి లొంగి వినయంగా వుండేందుకు సాగే ప్రచారం ఇది. ఏ దేశం రాజైనా, ఏ జాతి రాజైనా ఇదే చేస్తాడు.

పడలేదు. రాముడితో విరోధం పెట్టుకుంటే ఏప్పుడు ఫలితమో గాని, నాతో విరోధం పెట్టుకుంటే ఇప్పుడే చస్తావు. నిన్ను చంపిన తర్వాతే లంకకి తిరిగి వెళ్తాను. నువ్వేపని చక్కగా పూర్తిచేశావా నా రాజ్యంలో • నగం రాజ్యం ఇస్తాను. నా రథంలో ఎక్కించుకుని నిన్నుకూడా లంకకి తీసుకు పోతాను. ఆలోచించుకో. నాకు మంచి చెడలన్నీ చెప్పావు. నీ కేది మంచో నువ్వెప్పుడు ఆలోచించుకో"— అని భీకరంగా చూశాడు.

మారీచుడు రావణుడి మాటలేవీ నమ్మలేదు. ఉభరాజ్యం సంగతి అసలే నమ్మలేదు. నమ్మకం అంతా రావణుడి కత్తిదెబ్బ మీదే. — లేచి నిలబడి చేతులు కట్టుకున్నాడు.— "రాజు కార్యంలో నా ప్రాణాలు పోయినా నాకు సంతోషమే"— అని తల వొంచుకున్నాడు.

రావణుడు సంతోషించి — "ఇప్పుడు నువ్వు వీర మారీచుడివి. పిరికిపందవు కావు"— అని మెచ్చుకున్నాడు.

"నిన్ను మించిన పిరికిపంద లెవరు? వీరుడివై తే రాముడితో యుద్ధం చెయ్యరాదా?"— అని లోపల కేకలు పెట్టాడు మారీచుడు.

* * *

ఇంటిముందు మొక్కల్లో తిరుగుతూ పూలు కోస్తోంది సీత.

గాజులూ, అందెలూ చప్పుడవుతోంటే చురుగా చెట్లమీద పక్షులు సీతవేపు చూస్తున్నాయి.

అరిటి చెట్లలో పరుగులు వినబడితే సీత అటు చూసింది. కొత్త లేడి వొకటి చిన్నితోక ఎత్తుకుని గంతులేస్తోంది. పచ్చగడ్డి మీదకి మూతి వొంచి, అంతలోనే ఇంకో చోటికి పురుకుతోంది. కొత్త

• 40 వ సర్గలో — 23 వ శ్లోకం, 25 వ శ్లోకం.

రావణుడు మారీచుడికి సగం రాజ్యం ఇస్తానన్నాడు. తనతో లంకకి తీసుకువెళ్తా నన్నాడు. రాజులు ఎంత నీచులై — ఎంత నిరంకుశంగా — ఎన్ని దుర్మార్గాలు తప్పు, తప్పు పనులు చేయించుకుంటారో దీనివల్ల చూడవొచ్చు.

మొక్కల్నీ, కొత్త పూలనీ, కొత్త యింటినీ బెదిరే కళ్ళతో ఆశ్చర్యంగా చూస్తోంది. మొక్కల్లో గంతులేస్తూ, లేత చిగుళ్ళన్నీ కొరుకుతోంది. పాకలో ఏదో చప్పుడయితే మట్టి అరుగులవరకూ వెళ్ళి వెనక్కి పరిగెత్తింది. సీత పువ్వులు కొయ్యడం ఆపి నవ్వు మొహంతో లేడిని చూస్తోంటే, అదికూడా దూరంగా నిలబడి — "నువ్వేనా సీతవి?" — అన్నట్టు కదలకుండా చూసింది.

నించుంది కదా అని సీత రెండడుగులు వెయ్యబోతే పది బారలు పరిగెత్తి — "ఇప్పుడు పట్టుకో. ఇక పరిగెత్తన్లే" — అన్నట్టు కదలకుండా నించుంది మళ్ళీ.

సీతకి ఆ లేడిని చూస్తోంటే ఎంతో ముచ్చటేసింది. దాని కాళ్ళు, మేడ, కళ్ళు, శరీరం చక్కగా, పొందిగ్గా వున్నాయి. రోజూ దూరంగా అక్కడక్కడా చక్కచక్కని లేళ్ళు, జింకలూ కనబడుతోనే వుంటాయిగానీ, ఇది దారి తప్పి దడి దాటిపచ్చినట్టుంది. క్షణంచెం చొరవచేసి పట్టుకుంటే దొరుకుతుం దనిపించింది.

సీత నవ్వు మొహంతో నెమ్మదిగా ఆడుగులేస్తూ — "రా! రా! రావూ? రావాలి మరి. ఎందుకు అంత బెదురుతావూ? ఇలా రా! నీ కళ్ళెంత బాగున్నాయో! ఏదీ చూడనీ బాగా .... నా దగ్గిర వుండిపోతావా?....అయ్యో! పారిపోతున్నావు కదూ? సరేలే—నీతో పరిగెత్తి పట్టుకుంటాను చూడు. పారిజాతం చెట్టుకి కట్టేసి అసలు విడిచిపెడతానేమో చూడు. మొక్కల చిగుళ్ళన్నీ కొరికి పాడు చేస్తున్నావు కదూ?" అంటూ లేడివేపు పరిగెత్తింది.

లేడి సీతని ఆట పట్టిస్తోన్నట్టు పచ్చికంతా గంతులేసింది. సీత, నవ్వుతూ, పరిగెడుతూ, కొంగులో పూలన్నీ వాకిటినిండా పారబోసింది.

సీత నవ్వుతూ మధ్య మధ్య — "లక్ష్మణా! ఏం చేస్తున్నావోయా?.... చప్పున రావాలి. మన ఆశ్రమాని కెవరొచ్చారో చూడు .... మీ అన్నగార్నికూడా తొందరగా పిల్చుకురా! తొందరగా రావాలి మరి. ఈ దొంగ దొరకడంలేదు" — అంటూ కేకలు పెట్టింది.

సీత నవ్వులూ, కేకలూ విని మొహం చిటిస్తూ, విల్లు నరుకుంటూ బయటికొచ్చాడు రాముడు. అప్పటికీ సీతకి ఆందకుండా గంతు లేస్తోన్న లేడి, రాముడి విల్లుచూసి వొక్క పరుగు తీసింది దూరంగా చెట్లలోకి.

సీత భర్తని చూడగానే తప్పు చేసినదానిపల్లే పరుగులూ, నవ్వులూ ఆపి, బిడియపడుతూ నెమ్మదిగా దగ్గిరికొచ్చి— "ఇంతసేపూ ఇక్కడే గంతులేసింది. మిమ్మల్ని చూడగానే బెదిరి పరిగెత్తింది. అదిగో ! ఆ చూత వృక్షం కించ నించుంది చూడండి. అబ్బ ! ఎంత బాగుందో ! ఏ రుషి ఆశ్రమంనుంచో తప్పించుకు వొచ్చినట్టుంది పెంపుడు లేడే అనుకుంటాను. దారి తప్పినట్టుంది. లక్ష్మణా ! కనిపిస్తోందా నీకు ?" — అంటూ అటు చూపించింది.

లక్ష్మణుడు అటు చూసి — "వదిన తలుపు కట్టేస్తే ఇక్కడే వుండేదిగా వొదినగారూ !" అన్నాడు.

"అయ్యో ! నాకా వుపాయం తోచలేదే—" అని నొచ్చుకుంది సీత.

రాముడేమి వుత్సాహం చూపించలేదు లేడి గురించి.

సీత రాముడికి నచ్చజెప్తోన్నట్టు— "ఎంత చక్కగా, పొందిగ్గా, ఒందంగా వుందనుకున్నారూ ? ఇంద్ర నీలాలపల్లే వున్నాయి కొమ్ములు. కుంద వుష్పం పల్లే తెల్లగావుంది పొట్ట. లేతగా, ఎర్రగా పగ్డాలపల్లే వున్నాయి గిట్టలు. మోకాళ్ళెంత సన్నగా వున్నాయనీ ? ధనుస్సులపల్లే వొంగుతున్నాయి. ఆ రాగిచర్మంమీద ఎర్రని చుక్కలు— రత్నాలపల్లే ధగధగ మెరుస్తున్నాయి. మధూక పుష్పం పల్లే నున్నగా జారుతోంది వీపు. పద్మాలంత కళ్ళు. ఎవరో మొహంమీద పసుపు పెటుకుంటే ఒక్కడ పసుపు కరిగిపోయిందేమో— నుదుటిమీద తెల్లని పచ్చ వుంది. మెడ కొంచెం ఎత్తు. — ఎండలో అది గంతు లేస్తోంటే, వజ్రం మీద సూర్య కిరణాలు పడ్డట్టు కళ్ళు మిరిమిట్లు గొలిపాయి. లక్ష్మణా : నువ్వు చూడలేదుగానీ, అది ఇక్కడ గంతులేస్తోంటే మన ఇంటికే అందం

వొచ్చింది సుమా !" — అంటూ సంతోషంతో పొంగుతూ, లేడి అంద చందాలు వర్ణిస్తూ, ఒక్కొమాట రాముడికీ, వొక్కొమాట లక్ష్మణుడికీ చెప్తోంది.

ఇద్దరూ దూరంగా చూశారు. చెట్ల నీడలో పడుకుంది లేడి సీత వర్ణనలేవీ కనపడలేదు. లక్ష్మణుడు అరిటిచెట్ల దగ్గర బోడెలు సరిచేస్తూ — "ఏదో ఒక్కసారి ఎండలో చూస్తే అలా అనిపించిందేమో వొదిన గారూ !" అన్నాడు.

"లేదోయీ : వొక్కసారి కాదు. చాలాసార్లు చూశాను. అందుకే నిన్ను చప్పున రమ్మని కేక లేశాను. ఎంత అందంగా వుందను కున్నావూ ?"

"అంత అందంగా వుందంటే అదేదో రాక్షస మాయే. అసలు రాక్షసులే లేళ్ళ రూపాలు ధరించి రాజులు వేటకి వొచ్చినప్పుడు చూసి దూరంగా * తీసుకుపోయి చంపేసారు వొదినగారూ !"

సీతకి లక్ష్మణుడిమీద కోపం వొచ్చింది — "ఏం మాటలు లక్ష్మణా : ఎంతెంతో అందమైన పూలనీ, పక్షుల్నీ, జంతువుల్నీ చూడ్డం లేదూ మనం ? మనుషుల్లో చక్కగా, పొందిగ్గా, కనుముక్కు తీరుతో, ఎంతో అందమైనవాళ్ళు వుండరూ ? — అలాగే, అది అందమైన తల్లి దండ్రులకు పుట్టి వుంటుంది"— అంటూ నవ్వుతూ రాముడివేపు చూస్తూ — "లక్ష్మణుడి మాటలకేంగానీ .... మీరు చూస్తే నా మాట కాదనరు. ఆ లేడి మన ఇంట్లో వుంటే .... చక్కగా ఎప్పుడూ దాంతో ...." అంటూ ఆగింది.

"బాగుంది. ఇంకా చిన్నపిల్లలమల్లే ఆటలేనా ఏమిటి నీకు ?"

---

* 43 వ సర్గలో — 4 వ శ్లోకం.

"ఆ లేడి రూపంలో వచ్చింది మారీచుడే" — అంటాడు లక్ష్మణుడు. ఈ సంగతి రాముడికి మాత్రం తెలీదు. "పరకన్నర" దేవుడికే తెలిసినప్పుడు, అక్క దేవుడికి తెలీకపోవడం ఆశ్చర్యంగానే వుంది.

సీత సిగ్గుపడింది — "నాకోసం కాదు. దాని కోసం. దాన్ని ఆడించాలిగా మరి : మన పనవానం అయిపోయిం తర్వాత దాన్ని మనతో అయోధ్యకు ఎలాగా తీసుకుపోవొచ్చును. మన వుద్యానవనంలో పెట్టి కుండాం. అందరూ దాన్ని చూసి — "ఎంత బాగుందో : ఎంత బాగుందో : ఎంత బాగుందో ! ఎక్కడ దొరికింది ?" అంటూ అత్తలూ, భరతుడూ అందరూ ముచ్చట పడతారు * " — అని కొంచెం సేపు ఆగి — "దాన్ని మరు తేలేరూ ?" — అని సందేహంగా చూసింది.

"ఎందుకు తేలేనూ ? గురిచూసి వొక్క బాణం వేస్తే సరి" — అంటూ చెట్టుకింద లేడివేపు చూశాడు.

ఆ లేడి — "రాములు విల్లు పట్టుకోడం ఎక్కడా చూడలేదే !" — అని కొ తగా సందేహంలో పడటు చూస్తోంది.

సీత ఆయిష్టంగా — "అయ్యో : ఎంత అందమైనదాన్ని గాయ పరుస్తారా ? నెమ్మదిగా పొదివిపట్టుకుని తెస్తే ...." — అంటూ ఆగింది — "వొరుకుతుందా ?" అన్న సందేహంతో. భర్తని ఇబ్బంది పెడుతున్నా నేమో నన్న జంకుతో — కొంచెం బిడియంగా — "పతివ్రతలు భర్తల్ని — "ఇది కావాలి, ఇది కావాలి" అని కోరగూడదని ఎరుగు

---

* 43 వ సర్గలో 9, 15, 16 శ్లోకాలు.

"ఆ లేడితో ఆడుకుంటాను. దాన్ని అయోధ్యకు తీసుకుపోదాం" ఉంబోంది సీత.

భరతుడు రాజ ప్రతినిధిగా, ఒక గొప్ప పదవిలో వుండడంచేత, ప్రతీ విషయానికీ భరతుణ్ణి తలుస్తూ వుంటారు. శత్రుఘ్నుణ్ణి ఎక్కడా, ఎప్పుడూ తలచరు.

దును గానీ * " — అంటూ తల వొంచుకుంది.

శ్రీరామునికి భార్య భయభక్తులూ, వినయ విధేయతలూ చాలా ఆనందం కలిగించాయి. భార్య కోరిక తీర్చి. ఆమె సంతోషపడుతోంటే గంభీరంగా చూడవొచ్చుగానీ .... ఇదేం కోరిక ? పువ్వో, కాయో అడిగితే శ్రమ లేకుండా తెచ్చిపెట్టవొచ్చుగానీ .... పరిగెత్తే — లేడిని పొదివి పట్టుకుని తెచ్చిపెట్టమంటుందేమిటి ? — మెరుపులా మాయ మయ్యే జంతువు దొరుకుతుందా పట్టుకోడానికి ? ఆ మాటంటే — "మీ అంతటి మహానుభావులు లేడిని పట్టుకోలేరా ?" అంటుందేమో కూడా. ప్రశ్నలు వెయ్యడంమాత్రం మహా చక్కగా నేర్చుకుంది గానీ, భర్తకి ఎటువంటి కార్యాలు చెప్పాలో, ఎటువంటి కార్యాలు చెప్పగూడదో మాత్రం పతివ్రతలు నేర్చుకోవద్దా ?

— రాముడు కొంచెం నుదురు చిట్లించి — "సీతా : లేడిని పట్టుకోవడం మాటలా ? ఇలా కనబడి అలా మాయమవుతుంది. దొరుకుతుందా ప్రాణాలతో ?" — అన్నాడు.

---

* 43 వ సర్గలో — 20 వ శ్లోకం.
వుత్తమ స్త్రీలు భర్తల్ని ఏమీ కోరరాదట.
ఎంత సిగ్గులేదో ఈ భర్తలకి :

"ఇదిగో : నువ్వు నన్నేమున్నా కోరితే చెడ్డదానివి. కోరకుండా వుంటే మంచిదానివి" — అని చెప్పడం అన్నమాట : చచ్చు భర్తలు: ఈ భర్తల కేది సుఖం కలిగిస్తుందో అది గొప్ప ధర్మం అయి పోతుంది. చచ్చు భర్త ధర్మం :

భార్యలు కోరినా చక్కగా ముచ్చటేసే కోరికలు కోరాలి. ఎలా గంటే — "చక్కగా, సన్నగా, ధగధగా, సూర్యకిరణంమల్లే మెరిసే "సూది" తెచ్చి పెట్టరూ ? పాత బట్టలన్నీ కుట్టేస్తాను" — "కొత్త కొబ్బరిపీచు తెచ్చిపెట్టగలరా ? అంట్లన్నీ తోమేస్తాను" — "పట్టుకుచ్చు లాంటి బూజుల కర్రకోసం నా మనసు ఆరాట పడుతోందండీ :" — ఈ పకంగా అన్నమాట.

సీత ఆలోచనలో పడింది.

భరకి తన కోరిక అయిష్టంగా వున్నట్టు తోస్తోంది. ఆ లేడిని ప్రాణాలతో తెచ్చిపెట్టలేడని అర్థమవుతోంది. "లేడిని బాణంతో కొట్టకుండా తెచ్చిపెట్టు, లేకపోతే నాకు వొద్దు"—అని కోరితే, అది దొరక్కపోతే,—తన కోరిక తీర్చలేనందుకు ఆయన అవమానపడే స్థితి సంభవిస్తుంది.—పోనీ "ఆ లేడి నాకు వొద్దు" అంటే, ఇంతసేపూ దాని కోసం ఎంతో ఆశపడి, ఎంతో సంబరపడి— "నువ్వు తెచ్చిపెట్టలేవు కాబట్టి, నా కోరిక విరమించుకుంటున్నాను సుమా:"—అన్న అర్థం వొస్తుంది. అందుచేత, ఇప్పుడు తన కోరిక మానుకోవడానికీ వీలులేదు. దాన్ని గాయపర్చకుండా తెమ్మని అడగడానికీ వీలులేదు. అసలు పతివ్రతలు భర్తల్ని కోరికలు కోరడమే దోషం, ఇక కష్టసాధ్యమైన కోరికలు కోరడం కూడానా? అలాంటి పని తను ఎన్నడూ చెయ్యకూడదు. ఆ లేడిని తన భర్త ఏ విధంగా తేగలిగితే ఆ విధంగానే కోరాలి. ఇప్పుడు ఆయనకి భార్య కోరిక తీర్చలేని పరిస్థితి కలగదు గదా?

సీత ఎంతో ఆశగా ఆ లేడివేపు చూపిస్తూ— "అదిగో! అది లేచి ఎండలోకి వొచ్చింది. చూడండి. దాని చర్మం ఎంత కాంతిగా మెరుస్తోందో! నా మనసంతా దాని చర్మంమీదే వుంది. అది ప్రాణాలతో దొరక్కపోతే, చంపేసి అయినా సరే....ఆ చర్మం నాకు తెచ్చిపెడితే చాలు. ఆ చర్మం * మన దర్భాసనం మీద వేసుకుని కూర్చుంటే ఎంతో

---

* 43వ సర్గలో 18, 19 శ్లోకాలు.

సీత ప్రాణం అంతా ఆ లేడి చర్మం మీదే వున్నట్టు అనుగుతోంది. చర్మం మీదే ఇష్టం అయితే, మరి ముందు లేడితో ఆగకుండా, దాన్ని అయోధ్యకు తీసికెళ్దామనీ సరదాపడింది ఎందుకు?

ఒక లేడిని ప్రాణాలతో తెచ్చియిచ్చే సమర్థత లేదా శ్రీరాముచంద్రుడికి?— చిన్నతనం నుంచీ ఎవులందరి దగ్గరా నేర్చుకున్న రక

బాగుంటుంది. నిత్యం మన ఆశ్రమానికొచ్చే ఋషులందరూ చూసి మెచ్చుకుంటారు"—అంది నవ్వుతూ.

లక్ష్మణుడు సీతని ఆశ్చర్యంగా చూశాడు. సీత ధోరణే చాలా విషయాల్లో చాలాసార్లు లక్ష్మణుడికి అంతుపట్టకుండా వుంటోంది.

ఒక్కోసారి ఎంత ప్రేమగా ప్రవర్తిస్తుందో, మరుక్షణంలోనే అంత కఠినంగానూ ప్రవర్తిస్తుంది.

సీత ఈ పది పన్నెండేళ్ళ కాలంలో చాలా మారింది. ఆమె హృదయంలో సౌకుమార్యం చాలా వరకు అంతరించి పోయింది. పక్షుల్నీ, జంతువుల్నీ చూసి ఎంత సంతోషించినా, పూర్వంమల్లే అవి కళ్ళముందు చచ్చిపోతున్నా దిగులుపడడంలేదు—అదీగాక, నిత్యం ఋషులు, వొస్తూ, పోతూ—సీత చేసే సేవలన్నీ మెచ్చుకుంటూ "మహా పతివ్రతవు తల్లీ:....నీకు నువ్వేసాటి తల్లీ!"అని కీర్తిస్తూ వుండడంచేత సీత తన గొప్పతనానికి తనే ఆశ్చర్యపోతూ వుంటుంది. తన పాతివ్రత్యానికి తనే గర్వపడుతూ వుంటుంది.—"నేను సామాన్య స్త్రీల వంటి దాన్ని కానుసుమా!"—అంటూ వుంటుంది, రోజూ ఏదో వొక సందర్భంలో.

రాముడు కూర్చున్నా, పడుకున్నా సీత రాముడి పాదాల దగ్గిరే కూర్చోడమో, పడుకోడమో చేస్తుంది—"మీ పాదాల దగ్గిర నే నిలా కళ్ళుమూసి వెళ్ళిపోతే ఈ జన్మకు చాలు"—అని నిట్టూరుస్తుంది. సీత ఎన్నడైనా ఆ మాటలు అనడం మర్చిపోయి నిద్రపోతే, ఇక రాముడికి సుఖంగా నిద్రపట్టదు. సీత మళ్ళీ ఆ మాటలు అనే

(ఫుట్‌నోట్ : 25 వ పేజీ తరువాయి)

రక్తాల మంత్రాలూ, కట్టిపడేసే సమ్మోహనాస్త్రాలూ, బ్రహ్మాస్త్రాలూ, ఏమయ్యాయి?

ముందు లేడి కావాలని కోరిన సీత, తర్వాత చర్మం కోరింది—అంటే, ఋషుల గొప్ప చలామణీ అయ్యేది, భార్యలు తమ కోరికలు బయటపెట్టకుండా అణుచుకోవడం వల్లనే వస్తుమాట.

వరకూ రాజ్యభ్రష్టుడైనప్పుడు కలిగినంత ఆందోళన కలుగుతూ వుంటుంది. అందుకే సీత తను చూసిన లేడిగురించి ఎంత సంబర పడినా—"పతివ్రతలు భర్త నేమి కోరగూడదని నాకు తెలుసు..కానీ...." అంటూ వినయం ప్రకటించేవరకూ ఆ వాక్యం మీదికి రాముడి మనసు పోలేదు.

సీత ఆ లేడిని ప్రాణాలతో తెచ్చిపెట్టమంటుందేమోనని రాముడు భయపడ్డాడుగానీ—"నా మనసంతా దాని చర్మంమీదే వుంది"—అనేసరికి రాముడికి అంతులేని వుత్సాహం వొచ్చింది—బాణాలేసి జంతువుల్నీ, పిట్టల్నీ చంపడం అంటే....వుత్సాహానికీ, వీరత్వానికీ లోటేముంది? పదేళ్ళకుపైగా రాముడికి అడవి జీవితం బాగానే అలవాటైంది.—"లక్ష్మణా! అదిగో ఈ సారి స్పష్టంగా కనబడుతోంది. చూడు, బలిసిన తొడలూ....ఒదీ, ... అందంగానే వుంది. చిక్కక ఎక్కడికి పోతుంది? నువ్వన్నట్టు రాక్షసమాయ అయినా దాన్ని చంపాలిగా?"—అంటూ కతికాడా అందుకుని * "నరే: నేను వెళ్తాను. నువ్వు ఎక్కడికీ వెళ్ళకు. రుషులెవరైనా వొస్తారు. సీత వొక్కతే వుంటుంది"—అంటూ వాకిలిదాటి లేడికి కనబడని పొదలచాటుగా నడక సాగించాడు.

---

* చీటికీ మాటికీ అపశకునాలో, శుభశకునాలో కనబడే రాముడికి— ఈ మాయలేడికోసం బయల్దేరుతున్నప్పుడు మాత్రం ఏ శకునాలూ కనబడలేదు. ఎంచేతంటే కనబడితే అపశకునాలే కనబడాలికదా? అలా కనబడిపోతే రాముడు బయల్దేరనొడదుగదా?— అప్పుడిక కథ జరగదు కదా?— అంచేత కవిగారు ఇక్కడ శకునాలు వర్ణించే ప్రయత్నం అంతా అణగదొక్కుకుని కిక్కురుమనకుండా కూర్చున్నారు. చదివే వెధవలకి తలకాయలుకూడా వుంటాయా ఏవిటే అని. ఏం?....రాముడు వెనక్కి వొచ్చేప్పుడు మాత్రం పాపం అపశకునాలన్నీ కనబడ్డాయి. (అప్పటికి పని జరిగిపోయింది కాబట్టి) "అసలు శకునాలు ఎప్పుడు కనబడతాయి?" అని తలలు బద్దలు గొట్టుకోకండి. కవిగారి ఇష్టప్రకారమే కనబడతాయి,

సీత అరుగుమీద నించుని కొంచెంసేపు చూసి లోపలికి వెళ్ళింది. లక్ష్మణుడు అరిటిచెట్ల కన్నిటికీ బోదెలుచేసి గాలికి వొంగిపోయిన పూలమొక్కలు సరిజేస్తున్నాడు.

* * *

సీత ఆందోళన పడుతూ లక్ష్మణుడి దగ్గిరికొచ్చి "లక్ష్మణా! మీ అన్నగారి కంఠస్వరం వినబడలేదూ నీకు?.... అయ్యో! నువ్వింకా ఇక్కడే వున్నావే!" అంటూ కంగారుపడింది.

లక్ష్మణుడు వినయంగా— "శాంతించండి వొదినగారూ! శాంతించండి. ఎందుకు మీరింతగా భయపడుతున్నారు?" అంటూ పనిలోంచి లేచాడు.

సీత వెలవెలబోతూ — "మీ అన్నగారి కేదో గొప్ప ఆపద సంభవించి వుంటుందీ అడవిలో. "సీతా! లక్ష్మణా! రక్షించండి — రక్షించండి" అంటూ ఆర్తనాదాలు చేశారే! నువ్వు వినలేదా? అయ్యో! ఏం జరిగిందో!.... నా ప్రాణాలు తల్లడిల్లి పోతున్నాయే" —అంటూ బొటబొటా కన్నీళ్ళు కార్చింది.

లక్ష్మణుడు చెక్కుచెదరకుండా — "శాంతించండి వొదినగారూ! నా మాట ఆలకించండి. ఎవరో శత్రువులు మనకు భీతి కలిగించాలని ఆవిధంగా అరిచి వుంటారు. శ్రీరామచంద్రుడికి ఆపద సంభవిస్తుందా ఎన్నడైనా? ఆయన మహా వీరులని మీ రెరగరా? ఎందుకింత బెంబేలు పడుతున్నారు?" అని నచ్చజెప్పబోయాడు.

ఒక్క క్షణం సీతకికూడా లక్ష్మణుడి మాటలు సబబుగానే తోచాయి. — అయినా భయం తగ్గక — "అయ్యో! ఆయన నిజంగానే ఆపదలో చిక్కుకున్నారేమో లక్ష్మణా!....'రక్షించు సీతా! లక్ష్మణా!' అని ఆర్తనాదాలు చేశారే!...." — అని బేలగా చూసింది.

లక్ష్మణుడు నిర్లక్ష్యంగా — "భ్రమపడుతున్నారు వొదినగారూ! శ్రీరామచంద్రుడంతటి మహావీరుడు — ఇక్ష్వాకు వంశంలో పుట్టిన పురు

షుడు ఎంత ఆపదలో చిక్కితే మాత్రం "సీతా, రక్షించు" — అని ఒక స్త్రీని అడుగుతాడా ? • దాన్నిబట్టి అయినా, అలా అరిచింది మా అన్నగారు కాదని మీకు తోచడంలేదా ? నన్ను నమ్మండి వొదినగారూ : అదంతా రాక్షస మాయ. ఖరుడితో యుద్ధం జరిగినప్పటినించీ, మన చుట్టూ శత్రువుల కుట్రలు ఎక్కువగా వున్నాయి."

"అందుకే నేనింతగా భయపడుతున్నాను లక్ష్మణా ! మీ అన్నగార్ని ఆ శత్రువులేం ఇబ్బంది పెడుతున్నారో .... పోయి చూడాలికదా ? వెళ్ళు. తక్షణం బయల్దేరి వెళ్ళు."

"ధైర్యం వహించండి. అన్నగారు ఇక కొంత సేపటికి ఆ దుర్మార్గులందర్నీ చీల్చి చెండాడి ఆశ్రమానికి క్షేమంగా వొస్తారు. ఏమీ

• 59 వ సర్గలో — 11 వ శ్లోకం.

"దేవతల్నికూడా రక్షించే రాముడు ఒక స్త్రీని రక్షించమని అడిగి — గొప్ప వంశంలో పుట్టినవాడు చెయ్యగూడని పని చేస్తాడా ?" అంటున్నాడు లక్ష్మణుడు గొప్ప తర్కంతో.

దేవతల్ని కూడా రక్షించే రాముడు "లక్ష్మణా ! నన్ను రక్షించు" — అని లక్ష్మణుణ్ణికూడా అడగవలసిన అవసరం లేదు. "రాముడు నన్నుమాత్రం రక్షించమని అడుగుతాడా ?" అని కూడా లక్ష్మణుడు అంటే — పోనీ ఇవంతా రాముడి గొప్పతనంగా వొదిలెయ్యవచ్చును. — ఎటొచ్చీ స్త్రీని రక్షించమని అడగడమే ఇక్కడ మహా అవమానకరంగా వుంది. — స్త్రీ ఎన్నడూ పురుషుణ్ణి రక్షించకూడదు. అసలు రక్షించమని అడగటమే గొప్ప సిగ్గుచేటు. — పురుషుడు మాత్రమే స్త్రీలని రక్షిస్తూ వుండాలి. అలా రక్షించని స్త్రీలు పురుషుల కాళ్ళు పట్టుకుని వేళ్ళాడుతూ వుండాలి. అలా వేళ్ళాడకపోతేనే చాలా తప్పు. పైగా గొప్పవంశ వ్యవహారం వొకటి వుంది ఇక్కడ. ఏదో చెత్తాకారే వంశం పాడయితే, అంటే రాజవంశం కానివాడయితే — పోనీ ఆడదాన్ని ఏప్పుడన్నా నోరుజారి అడిగితే అడగవొచ్చునేమో : — ఎంతైనా చెత్త వంశం పురుషుడైనా, పురుషుడు పురుషుడేకదా ? — బ్బే : ఆడదాన్ని అడగడం తప్పేననుకుంటాను.

భయంలేదు. దేవతలైనా తేరిచూడలేని శ్రీరామచంద్రుణ్ణి శత్రువులు జయించగలరా ?"

"లక్ష్మణా ! నీ అలక్ష్యం నాకు కంపరం కలిగిస్తోంది. మీ అన్న గారి కేమి ఆపద గలిగిందో పోయి చూడమంటే ... కాలు కదపకుండా వున్నావే ! ఇంతకాలం అన్నమీద ప్రేమ వొలకబోశావుగానీ .... నిజంగా ఆపదలో చిక్కుకున్నప్పుడు అన్నని రక్షించాలని నీకేకోశానా ఆతృత లేదు. దుర్మార్గుడా ! నా భర్త క్షేమంకోసం నా హృదయం ఇంత కలవరపడుతోందిగానీ, అన్నగారికోసం నీకు ఆందోళనే లేకుండా వుంది. నువ్వింటువంటి దుష్టుడవని ఇంతకాలానికిగానీ బోధపడలేదు. నీచుడా ! నా భర్తని వీరోచితంగా ఎదిరించలేక ఆ మహానుభావుడు శత్రువుల చేతుల్లోపడి, సర్వ నాశనం అయిపోయే రోజుకోసం ఎదురుచూస్తున్నావు. ఎలాగయినా నన్ను నీ వశం చేసుకోవాలని ఇంత కుట్రపన్నే దుర్బుద్ధితో మాటెంట బయల్దేరావు. నువ్వూ, భరతుడూ పన్నిన కుట్రే ఇది. ఇప్పుడు నాకంతా విశదంగా తెలిసింది" — అంటూ పతివ్రతల పూనకంలోకి దిగింది సీత. *

---

* 45 వ సర్గలో — 24, 25 శ్లోకాలు.

సీత, లక్ష్మణుణ్ణీ, భరతుణ్ణీ తిడుతోంది. — అసలు పుట్టినా, కాయడిగినా, ఏదడిగినా వెంటనే ఇవ్వమని రాముడు లక్ష్మణుడికే పురమాయించాడు పదేళ్ళకిందటే. అప్పట్నించీ లక్ష్మణుడే ఆ వ్యవహారం చూస్తున్నాడు. లేడికోసం లక్ష్మణుడే ఎందుకు బయల్దేరలేదు ? — లక్ష్మణుడే వెళితే ఏమయ్యేది ? — లక్ష్మణుడి కేదో ప్రమాదం ముంచుకొచ్చినట్టు — "రామా ! రక్షించు - రక్షించు" - అని కేకలు వినబడేవి. సీత కంగారుపడినా - రాముడు కదలకుండా - "అది రాక్షసమాయే. ఏమీ భయంలేదు. లక్ష్మణుడు మహా వీరుడు" - అంటాడు. సీత వూరుకుంటుంది గానీ - "దుర్మార్గుడా: నీ ఎత్తు నాకు తెలుసు" - అని తిట్టదు కదా ? — అప్పుడు రాముడే కంగారుపడి పరిగెత్తినట్టు కవి రాస్తాడు.

అలాగే ఇక్కడ సీత భయం చూసి లక్ష్మణుడే కంగారుపడి పరి

సీత మాటలు వింటూ లక్ష్మణుడు కొయ్యబారిపోయాడు. వాడి అసలం పూ రిగా బోధపడేసరికి లంతులేనంత కోపం వచ్చింది. అతి కష్టంమీద వినయం ప్రదర్శిస్తూ – "వదినగారూ : శాంతించండి.– మా అన్నగారి ఆజ్ఞ పాటించడమే నా ధర్మం అని భావించాను. మా అన్న గారి పరాక్రమంమీది నా కెటువంటి సందేహమూ లేదు. నేనిలా సమాధానం చెపుతున్నానని ఆగ్రహించ వద్దు. మీరు నాకు దైవసమానులు. ఇంత కఠోరమైన నిందలు పల్కడం మీకు ధర్మంకాదు. శ్రీరామ చంద్రుడి కెటువంటి ఆపదా కలగదని నమ్మండి" – అంటూ ప్రార్థించాడు.

సీత ఆత్మ ఇంకా పాతివ్రత్యపు పూనకంతో వూగుతోనేవుంది.

"ఛీ : మూర్ఖుడా : నీ కపటవేషం ఇంక చాలించు" అంటూ పురి మీంది.

"మూర్ఖుడా : నీ ప్రయత్నాలేమీ నెరవేరవని తెలుసుకో. నా భర్తని తప్ప అన్య పురుషుణ్ణి కన్నెత్తిసైతా చూడను. నా నాథుణ్ణి పిలిచి పొక్కి క్షణంసేపైనా జీవించను" – అంటూ కన్నెర్రజేసింది.

ఆమె ఆత్మలో ఒకపక్క – "లక్ష్మణుణ్ణి ఈ మాట లంటున్నది నేనేనా ? నేనేనా :" – అని తన నోటినించి వచ్చిన మాటలకు తనే

(ఫుట్‌నోట్ : 30 వ పేజీ తరువాయి)

గీత తనట్టు రాయవచ్చుకదా ? సీతకోసం ఇప్పుడయినా అన్న ఆజ్ఞ ధిక్కరించక తప్పలేదు కదా ? – ఈ ప్రశ్నానికి సీతచేత లక్ష్మణుణ్ణీ, భరతుణ్ణీ కాదుకూతలు కూయించడం ఎందుకు ? – ఎందుకంటే, – ఇక తర్వాత సీతని రావణుడు ఎత్తుకుపోయే ఘట్టం రాబోతోంది. అందుచేత సీతతో పతివ్రతల మాటలు చెప్పించెయ్యాలని కవికి మహా ఆరాటంగా వుంది. ఇది రచనకి సంబంధించిన విషయం. – ఇక పతివ్రతా ధర్మాలు జీర్ణించుకున్న సీత పునస్తత్వం అర్థం చేసుకోవడం అనేదికూడా ఒక ముఖ్య విషయం. దాన్ని కథలోనే చూడవచ్చును.

విస్మయంతో మునిగిపోతోంది. ఇంకోపక్క-- "నేను మహా పతివ్రతని. నా పాతివ్రత్య మహత్యం ఏమిటో ఈ మూర్ఖుడికి చాటి చెబుతాను" - అని తెగ ఆరాట పడుతోంది.

సీత పాతివ్రత్యపు వ్యాధి కొంతకాలంనించీ అహంకారపు వ్యాధి లోకి మారింది. పర పురుషు లందరూ తననే కోరతారనే అహంకారపు వ్యాధి అది : లక్ష్మణుడూ .... భరతుడూ .... శత్రుఘ్నుడూ .... అందరూ తన పాతివ్రత్యం పాడు చెయ్యటానికే కుట్ర పన్నుతున్నారనే విచిత్రమైన ఆలోచనలు : పర పురుషులు తనని కోరాలనీ - తను వారిని తిరస్కరించి తన పాతివ్రత్యం లోకానికి స్పష్టం చెయ్యాలనీ నిత్యం తహతహ :

ఆ ఆరాటంవల్లనే సీతకి నిష్కారణంగానే లక్ష్మణుడిమీద సందేహం ప్రారంభమై - పురుషణంలోనే కొండంత ప్రమాణానికి పెరిగిపోయింది. లక్ష్మణుడి ప్రార్థనకి మరింత రెచ్చిపోతూ - "కల్ల బొల్లి మాటలతో నన్నెన్నటికీ మభ్యపెట్టలేవు. నీ అన్నమీద నీ కెన్నడూ భక్తి లేదు - నా భరకే ఆపద వచ్చినప్పుడు నేను గోదావరిలోపడి ప్రాణాలు విడుస్తాను. విషం తినో - పురిబోసుకునో - అగ్నిలోబడో - కొండమీదనించి పురికో ప్రాణత్యాగం చేస్తానుగానీ - పర పురుషుణ్ణి మాత్రం కాలితోనయినా ముట్టను * " అంటూ పైటచెంగు భుజం నిండా తీసి కప్పుకుంది.

లక్ష్మణుడికి సీత మాటలు అయోమయంగా వున్నాయి. తన చెవుల్ని తనే నమ్మలేకుండా వున్నాడు. ఒకవేపు అపనమ్మకంతోనే వదినగారిమీద పట్టలేని కోపం వచ్చేసింది - "స్త్రీల స్వభావం ఎంత నీచ

---

* 45 వ సర్గలో - 36, 37 శ్లోకాలు.

రాముడు లేకపోతే, ఎలా ఎలా చచ్చిపోతుందో చెప్తోంది సీత. "నా నాథుణ్ణి విడిచి ఒక్క క్షణంకూడా జీవించను" - అన్న సీత ఆ నాథుణ్ణి ఓడించి ఎన్ని నెలలు జీవించిందో తర్వాత చూడండి.

మైందో నాకు బాగా తెలుసు. స్త్రీలకు వినయ విధేయతలుండవు. బుద్ధి చపలచిత్తాలు. ఎప్పుడూ కఠినంగానే ప్రవర్తిస్తారు. ఏ విషయంలో నయినా ఉచితానుచితాలు గ్రహించకుండా దుష్టపు మాటలు మాట్లాడడం ఆడవాళ్ళకు అలవాటే. ఇద్దరు అన్నదమ్ముల్లో, రక్త బంధువుల్లో స్నేహంగా వుండే వారిమధ్య కలతలుపెట్టి వారి స్నేహం భంగంచేసే ఎవరినా వూరుకోరు" * అంటూ లోకంలో పురుషుల తరుపున స్త్రీ లంచ రినీ తిట్టిపోసి, – "నేను వెళ్తున్నాను" – అని విల్లు పట్టుకుని గబగబా లంగలేసుకుంటూ దడి దాటి వెళ్ళిపోయాడు.

* * *

---

* 45 వ సరళో – 28½, 29½ శ్లోకాలు.

స్త్రీయు ఎంత నీచురో, ఎంత మూర్ఖురో, ఏంత లుబ్ధములో, ఎంత దుష్టులో .... ఎంతెంత ఘోర కార్యాలు చేస్తారో కవిగారు నేప్పుగా వర్ణిస్తున్నారు. – స్త్రీలని దుయ్యబట్టినాడికే, సీతతో అసలు అన్ని మాట లనిపించడం. "అవును మరి. లేకపోతే పాపం లక్ష్మణుణ్ణి పట్టుకుని ఆ మాటలేవిటి ?" – అని పురుష పుంగవులకు అనిపించేట్టు. – గతంలో అనేకసార్లు రాముడు లక్ష్మణుణ్ణి నానా మాటలూ అన్నాడు. "నువ్వు భరతుణ్ణి చంపాలని చూస్తున్నావు" అన్నాడు. "నీచుడిమల్లే వాగుతున్నావు" – అన్నాడు. ఇంకా చాలాసార్లు చాలా అన్నాడు అన్యాయంగా. అప్పుడు ఈ సిగులేని కవిగారు రాముణ్ణి ఒక్క మాటన్నా అనలేదు. "ఉచితానుచితాలు తెలీకుండా మాట్లాడుతున్నావే : ఇంత చాకిరీ చేస్తోంటే నన్ను శంకిస్తున్నావే :" – అని లక్ష్మణుడు అన్నగార్ని ఒక్క మాటన్నా అనలేదు – పడినగారి మాటలకికూడా అలాగే ఊరుకోవచ్చుగదా ? – అబ్బే, ఈవిడ ఆడది కదా ? ఆడది దుర్మార్గురాలు కదా ?

ఎరగందేమిటో తనకే అర్థంకానట్టు విస్మయంగా చూచ్చున్న సీత — ఉషోషద్వారాల్యాలు వర్షవేస్తూ ఆపరణలోకి వస్తోన్న పురుష పుంగవుణ్ణి చూచి కన్నీళ్ళు తుడుచుకుంటూ తడబడుతూ లేచింది. — "దయచేయండి స్వామీ : దయచేయండి" — అంటూ వొంగి ఋషి పాదాలకు నమస్కరించింది. చప్పున లోపలికి వెళ్ళి కాళ్ళు కడుక్కునే నీళ్ళు తెచ్చి భక్తితో అందించింది.

"ఈ ఆసనంమీద విశ్రమించండి స్వామీ !" — అంటూ మెత్తని దర్భాసనాలు వేసి వినయంగా ప్రార్థించింది. * ఇంట్లో సిద్ధంగా వున్న పళ్ళపళ్ళాల పళ్ళు అరిటాకులోంచి సరి తెచ్చి ఆసనంముందు పెట్టి — "భుజించండి స్వామీ : అన్నం సిద్ధంగానే వుంది. నా భర్త వేటకు వెళ్ళాడు. ఎడతెగని హింస, వుసురు హింస తీసుకొస్తాడు...." అంటూ ఎదురుగా నిలబడి వినయంగా తల వొంచుకుంది.

రావణుడు వచ్చినప్పట్నించీ సీతని తీక్షణంగా తేరిపార చూస్తూనే వున్నాడు. ఆమె సౌందర్యంలోంతో ప్రత్యేకమైనదిగానే కనిపించింది. నఖశిఖపర్యంతం సీతని పరీక్షిస్తోన్నట్టు చూస్తూ మందహాసంతో — "అమ్మాయీ: ఇంత చిన్నవిలో ఒంటరిగా వున్నావు. ఏమిరా నువ్వు ? నీ భర్త పేరే మిటి ? సౌందర్య దేవతవలే మెరిసిపోతున్నావు. ఎంతో సుకుమారంగా వున్నావు. కుంచ పుష్పాలమాల వంటి మలువవనసా — విశాలమైన కళ్ళూ .... సన్నని నడుమూ .... బంగారంవంటి శరీరచ్ఛాయా .... నీ వంటి స్త్రీ నే నెక్కడా చూడలేదే ! .... ఏమిరా నువ్వు ? భూదేవివా ?

---

* 46 వ సర్గలో — 2 వ శ్లోకం.

రావణుడు మిక్ష వేషంలో వచ్చాడు. రామునితనాకా మిక్ష వేషం తోటే రాచకీయలు నడుపుతున్నాడు. (ఈవిషయం ముందు ముందు తెలుస్తుంది స్పష్టంగానే.)

మోసగించడానా, రహస్య వ్యవహారాలూ జరిగించాలంటే — మిక్ష వేషమే మహా చక్కని వేషం అన్నమాట. ఈ వొంగ సన్యాసుల వ్యవహారాలు మనకి గొప్ప సాంప్రదాయంగా వస్తోంది.

శ్రీదేవిని : .... చక్కిలాలా? ని చేతేమిటి?" అంటూ సంభాషణ ప్రారంభించాము. *

---

* 46 వ పుట — 17 నించి 22 శ్లోకాల వరకూ.

రావణుడు సీత ఎవరయితే బాగుంటుందని ఎలా వర్ణిస్తున్నాడో నే నిక్కడ రాయక తప్పదు. వాటిగురించి కొంచెం చర్చించాలి కూడ.

కళ్ళూ, ఒళ్ళూ, చెంపలూ .... అన్నీ వర్ణించడం అయ్యాక — "సుందరీ! లక్ష్మీదేవిపలే ప్రకాశిస్తూ వున్నావు. నీ పిరుదులు ఇసుక తిన్నెలవలే ఎత్తుగా వున్నాయి. నీ హొ త్రికవుక్ష ప్రదేశం విశాలంగానూ, వున్నతంగానూ వుంది. నీ నుదుటి పెడికెబ్బో ఇనుడే విధంగా వుంది. నీ తొడలు బలిసి ఏనుగు తొండాలవలే వున్నాయి. నీ రొమ్ములు గుండ్రంగా, ఎత్తుగా, పెద్దపెద్ద మొనలతో ఒకదాన్ని ఒకటి వొరుసుకుంటూ తాపిపండ్లవలే బిరుసుగా కదులుతూ వున్నాయి. నీ రొమ్ములు చక్కని పెండ్లుకోలతో నిండి, మనోహరంగా కదులుతూ నా మనసు నెంతో ఆకర్షిస్తున్నాయి...." — ఏమి, ఈ ఘట్టంలో ఇంతవరకూ ఆగింది ఈ వర్ణన.

సీతని ఈ రకంగా వివస్త్రని చేసి చూసినవాడు రావణుడు కాదు. కవి భంగపడతాడు. కవులు పతివ్రతల్ని — "లక్ష్మీదేవులు" "పార్వతీ దేవులు" అంటూనే నిందిస్తారు, వారి రత్నహారాలూ, పట్టుచీరలూ, బలహీనతలూ తప్పించుకుంటూ ఎక్కడో కళ్ళతో వారి స్తనాలూ, భుజాలూ, పొ త్తికపుష్ఠాలూ, తొడలూ, నడుములూ, పిరుదులూ చూసి పచ్చి, చక్కగా వర్ణించి అందరికీ చెప్పి ఆనంద పెడుతూ వుంటారు. ఏది చూడని స్థలాలుంటాగా కవి చూస్తాడంటే ఇదే ఎర్రం అన్నమాట.

ఈ ఘట్టంలో, రావణుడు కాముకుడు కాబట్టి, కవి ఈ రకంగా రాశాడా: — ఏనడానికి వీల్లేదు. నేను నా కథల్లో ఈ వర్ణనలన్నీ వదిలెయ్యడంవల్ల, ఇవి మొదట్లోంచీ వున్నాయనే సంగతి పాఠకులకు తెలీదు. — సీతతో లక్ష్మణుడు మాట్లాడినా సరే, హనుమంతుడు మాట్లాడినా సరే, విభీషణుడు మాట్లాడినా సరే — "మంచి పిల్లలు గోళ్ళు

(ఫుట్‌నోట్ : 35 వ పేజీ తరువాయి)

దానా !" (సుశ్రోణీ :); "మంచి నడుము గలదానా !" (సుమధ్యే :) అనవలసిందే.

ఈ కావ్యం శ్లోకాలతో రాయడంచేత, ఛందస్సుకి అనువుగా వుండడంకోసం; శ్లోకపాదాలు పూరించడంకోసం — ఆ సందర్భాన్ని బట్టీ, మాట్లాడుకునే పాత్రల సంబంధాన్నిబట్టీ అవసరమైనప్పుడు — "సుందరీ ! మానినీ ; సుకేశినీ" లాంటి మాటలు వుంటే ఏదో కొంత అర్థం చేసుకోవచ్చును. అంతేగానీ, లక్ష్మణుడు సీత తొడల్నీ, హనుమంతుడు సీత నడుమునీ వరిస్తోంటే—మనం కవిగార్ని ఏం చెయ్యాలో ఆలోచించక్కర్లేదు. (ఏదైనా చెయ్యవచ్చును.)

ఎంతసేవూ — "నీ తొడలు బలిసి వున్నాయి. నీ పిరుదులు బలిసి వున్నాయి. నీ స్తనాలు బలిసి వున్నాయి" — ఇదీ కవిత్వం. స్త్రీ అవయవాలు బలిసివుండాలి. కవులూ; పండితులూ లొట్టలేస్తూ, కావ్యాల్లో, ప్రబంధాల్లో స్త్రీల అవయవాలవెంట వూహా విహారాలు చేస్తూ — "ఆ పతివ్రతామణి !" "ఆ లక్ష్మీదేవి !" అని పేలుతూ వుంటారు. — పైగా దీనికి "శృంగారం" అని వొక దొంగపేరు. — ఈ హ్యూడల్ కవులు ఊరపందులమల్లే బలిసి, కొవ్వెక్కి, ఈ కొవ్వు కవిత్వం రాస్తారు.

ఇంతకీ, పురుషుడి అవయవాల్ని మాత్రం ఈ రకంగా చీల్చి వర్ణించడం ఎక్కడా లేదు.

దీనికి కారణం ఏమిటని ఆలోచిస్తే— స్పష్టంగా తేలేదేమిటంటే — ఇది హ్యూడల్ సంస్కృతి లక్షణం. ఈ సంస్కృతి స్త్రీని, కామానికీ, చాకిరీకీ, పురుషుడి ఆధీనంలో అస్వతంత్రంగా వుండడానికీ నిర్దేశిస్తుంది అందుచేతనే, హ్యూడల్ సాహిత్యం స్త్రీలని పతివ్రతలుగా, భోగ వస్తువులుగా, చాకిరీచేసే బానిసలుగా చిత్రిస్తూ వుంటుంది.

పురుషుల్ని మాత్రం వీరులుగా, సమర్థులుగా, సాహసికులుగా వర్ణిస్తుంది. వారి శరీరావయవాల్ని కొంచెం వర్ణించినా, వారి గుణ

సీత కొంచెం సిగ్గుపడింది. రుషులెవరు వచ్చినా ఆమెనిచూసి — "లక్ష్మీదేవిమలే వున్నావు తల్లీ : పార్వతీదేవి మలే వున్నావు తల్లీ : .... నీవంటి సౌందర్యరాశికి కష్టాలేమిటి ? నీవంటి పతివ్రతకి వనవాసం ఏమిటి ?" — అని ఆమె అందాన్ని ప్రశంసించి, ఆమె దుర దృష్టానికి విచారించడం పరిపాటే.

ఆ విధంగానే సీత ఈ రుషి పొగడ్తలు వింటూ తలుపు. నాను కుని నిలబడి వినయంగా — "దశరథ మహారాజు కోడలిని స్వామీ : నేను : శ్రీరామచంద్రుడి భార్యని. నన్ను సీత అంటారు. మా మామ గారు ఆఖరిభార్య మాట విని నా భర్తకు రాజ్యం ఇవ్వలేదు. పైగా 14

(ఫుట్‌నోట్ : 36 వ పేజీ తరువాయి)

గణాల్ని, శక్తి సామర్థ్యాల్ని. అధికంగా చిత్రిస్తుంది. — బూర్వా వ్యవస్థలోకూడా స్త్రీకి గౌరవస్థానం వుండే అవకాశం వుండదు. అందుకే బూర్జ్వా సాహిత్యంలోకూడా స్త్రీ పాత్రల్ని, ఆత్మ గౌరవంగలవారుగా, వ్యక్తిత్వం గలవారుగా చిత్రించడానికి వీలుండదు.

అందుచేత -- ఫ్యూడల్ సంస్కృతినీ, బూర్జువా సంస్కృతినీ అసహ్యించుకునే చైతన్యం కలిగింతర్వాత, పురుషులు స్త్రీల అవయవాల అందం మీద దృష్టి నిల్పకూడదు. స్త్రీని శృంగార వస్తువుగా చూడకూడదు. ఆమె అభిప్రాయాన్నిబట్టీ, ఆలోచనా విధానాన్నిబట్టీ ఆమె వ్యక్తిత్వం గుర్తించాలి.

"నువ్వెంతో అందంగా వున్నావు. నీ కళ్ళు .... నీ చెంపలు .... నీ నడుము .... ఎంతో చక్కగా పుంటాయి. నీ నవ్వు .... నీ నడక ఎంతో నచ్చుతాయి నాకు" — అని పురుషుడు చన్నా స్త్రీ మురిసి పోగూడదు. తన శరీరావయవాల్ని, శరీర లక్షణాల్ని, పాత్రమే గుర్తించడం ఎంతో అవమానంగా భావించాలి.

"నువ్వు చాలా అందగత్తెవి" — అని ఒక అబ్బాయి అనగానే, ఆ అమ్మాయి అతన్ని లాగి చెంపకాయ కొట్టాలి. చెప్పుతో అయితే ఇంకా మంచిది.

సం॥లు వనవాసం విధించారు. నేను నా భర్తను విడిచి సుఖ భోగాలతో జీవించలేక, నా భర్తతోపాటే వనవాసానికి వొచ్చాను స్వామీ! మరి మరిది కూడా మాతో వచ్చాడు"— అంటూ ఆతృతగా బయట చెట్ల వేపు చూస్తూ — "నా భర్త ఎవరివారు కోరింది ఇస్తారేగానీ, ఎవరివారినించి ఏమీ పుచ్చుకోరు స్వామీ! ఎల్లప్పుడూ సత్యమేగానీ.... అసత్యం పలకరు...." అంటూ మళ్ళీ బయటవేపు చూసింది — "కడుపునిండా పళ్ళు భుజించండి స్వామీ! ఇంతకుపూర్వం తమ దర్శనం ఎన్నడూ చేసుకోలేదు మేము. నా భర్తా, నా మరిదీ తమని చూసి ఎంతగానో సంతోషిస్తారు స్వామీ! .... తమ నామధేయం .... వంశం ... గోత్రం .... చెలవివ్వనే లేదు స్వామీ!" — అంటూ వినయంగా మాట్లాడుతూనించుంది.

రావణుడికి వొచ్చిన కార్యం ముగించాలని తొందరగా వుంది. సీతని గంభీరంగా చూసి మందహాసం చిందిస్తూ — "సుందరీ! నీ సౌందర్యం నా మనసుని అమితంగా ఆకర్షిస్తోంది. నీవంటి సుకుమారి నగరాలలో, వుద్యానవనాలలో విహరించాలి. అక్కడ సిరిసంపదలు అనుభవించాలి" అంటూ ఆసనంమీదనించి లేచి నించున్నాడు.

"సుందరీ! లంకాధిపతి రావణుణ్ణి గురించి విన్నావా?.... ఆ రావణుణ్ణి నేనే. దేవతలందర్ని జయించినవాణ్ణి నేనే. ఇంతకు పూర్వమే నీ సౌందర్యం గురించి విని, ముగ్ధుణయి, నిన్ను నాతో తీసుకుపోవడానికే ఈ వేషంతో వచ్చాను. నేను ఎంతటి సౌందర్య రాసుల్ని అపహరించి తెచ్చి, నా భార్యల్ని చేసుకున్నాను. కానీ, నిన్ను చూడగానే నా స్త్రీలందరిమీదా వుండే ప్రీతి పోయింది. నిన్నే నా ప్రియ భార్యగా చేసుకుంటాను. వెంటనే నాతో బయల్దేరి వచ్చెయ్యి" — అంటూ సీతకి దగ్గిరిగా నడిచాడు.

సీత నిశ్చాంతపోతూ రావణుడి మాటలు విని. ఎంత ఆశ్చర్యంలోకూడా ఒకలు విషయం ఆమెకు వెంటనే అర్థమైంది. తను భర్త లేకుండా ఒంటరిగా వున్న సమయంలో ... దురదృష్టుడు ... కపటపు

ఘుడు ... మిగా పతివ్రత యైన తనని వాంఛిస్తున్నాడు — ని గ్రహించింది.

సీత భయంతో కంపిస్తూ — కోపంతో వుద్రేకపడుతూ — తలుపువైనక్కి తప్పుకుంటూ — "మర్యాదస్తుడా ! యతి వేషంలోవొచ్చి, అతిథ్యం పొంది, ఒంటరిగావున్న స్త్రీతో ఇంత మర్యాద లాడతావా ? శ్రీరామచంద్రుడంటే ఏమనుకున్నావు ? మిగా పీడుడు. పురుషోత్తముడు. మహేంద్రుడితో సమానుడు. అటువంటి యిటి భార్యని — పర పురుషుడు కోరి సాధించగలడా ? నా భర్తతో వైరం సాక్షాత్తూ యమునితో వైరమేనని తెలుసుకో" — అంటూ కళ్ళెర్రజేసి కంపిస్తూనే రావణుణ్ణి భయపెట్టాలని చూసింది.

అనయంతో వొణుకుతోన్న లక్ష్మణుణ్ణి నిందిస్తోన్నప్పుడు — పర పురుషుడే తిరస్కరిస్తున్నానన్నే సంతృప్తేమీ కలగలేదు సీతకి. భీకరంగా వున్న రావణుణ్ణి కోరిక ని, అతణ్ణి తిరస్కరిస్తూ, సీత వుద్వేగంతో ఎదురుగా కనిపిస్తున్న భయంతో కంపించిపోతూ నించుంది.

రావణుడు నిర్దాక్షిణ్యంగా నవ్వుతూ — "నీ భర్త పౌరుషం పరిస్తూన్నావు. నా పౌరుషంచూడా విను. నా పేరు వినగానే శత్రువులంతా బాణం చూసిన పిట్టలమీదే చెల్లాచెదురైపోతారు. కుబేరుడే నాకోసం లంక వదిలి కైలాసానికి పారిపోయాడు. ఇంద్రుడితో యుద్ధంచేసి, పుష్పక విమానం గెల్చుకున్నాను. నా ప్రతాపం నీకేమి తెలుసు ? నేను చెయ్యి యించి నడుస్తోంటే, భయంతో ఆకులు కదలవు. నదుల పక్కనించి నడుస్తోంటే ఏలం ప్రవహించదు. సూర్యచంద్రులే నాకు వూడిగం చేస్తారు. ఒక్కసారి నా లంక చూశావంటే, నువ్వింక భర్తనీ, బంధు మిత్రుల్నీ తలచనే తలచవు. దశరథుడు తన ముద్దుల కొడుక్కి రాజ్యం ఇచ్చి, నీ భర్తని అడవులకి సాగనంపాడు. రాజ్య భ్రష్టుడితో నువ్వేం సుఖపడతావు ?

నేను నిన్ను కోరడం నీ భాగ్యం అనుకో. నిన్ను తిరస్కరించడం చేతకాదు. నీ భర్త నా చిటికెన వేలికైనా సమానుడు కాడు.

సుందరీ : జాప్యం చెయ్యకు. వెంటనే బయల్దేరు"— అంటూ రావణుడు కామోద్రేకం చిందే చూపుతో సీతని ఆలింగనం చేసుకోబోయాడు.

సీత భయంతో వణుకుతూ, తన పాతివ్రత్య మహత్యం ఆత్మలో మెదిలి కుపితురాలవుతూ వుద్వేగంతో — "నీచుడా ! నీ ప్రేలాపన చాలించు. ఇంద్రుడి భార్యని కోరినా ఇంద్రుడు నిన్నేమీ చెయ్యలేడేమో గానీ, నన్ను కోరితే నా భర్త నిన్ను బడిచిపెట్టడు. నావంటి పతివ్రతని తాకడానికైనా నీకు సాధ్యమవుతుందనుకోకు. దుర్మార్గుడా : ... వెంటనే వెళ్ళిపో ! లేకపోతే నా భర్త నిన్ను బ్రతకనివ్వడు..." అని కొంచెం వెనక్కి జరిగింది.

రావణుడు ధిక్కారంగా చూస్తూ— "నా వీరత్వం నీకింకా బోధపడలేదు. భూమిని భుజాలతో పైకెత్తేస్తాను. సముద్రాలు పీల్చేస్తాను. మరణ మేపతనే చంపేస్తాను. సూర్య గమనాన్నే అడ్డగిస్తాను. * లోకాలన్నీ వెదికినా, నీకు తగిన భర్తని నేనే" — అంటూ సీత చుట్టూ చేతులువేసి అదిమి పట్టుకున్నాడు.

భయంతో కెవ్వున అరిచింది సీత.

రావణుడి వీరత్వంమీద ఆమెకి వీసమెత్తయినా నమ్మకం లేదు. తన భర్త వీరత్వంముందు ఎవరి వీరత్వమైనా గడ్డిపరకతో సమానమనే ఆమె విశ్వాసం. కానీ హఠాత్తుగా ... ఈ పర పురుషుడు చేస్తోన్న దౌర్జన్యాన్ని నమ్మక తప్పలేదు. సీత భయంతో, ఛీత్కారంతో, వాదించుకోవాలని పెనుగులాడింది.

రావణుడు భీకరంగా పట్టుదలతో, సీత జుట్టు ఎడంచేత్తో పట్టి—

---

* 49 వ సరలో — 3, 4 శ్లోకాలు.

రావణుడు, తన వీరత్వం వర్ణించుకుంటున్నాడు. కథలో ప్రతీ పాత్రా తనని తను పొగుడుకుంటూనే వుంటుంది—మాటల్లోనే వీరత్వం అంతా. తీరా పనిచెయ్యబోతే ఏ సమర్థతా వుండదు. — "నే నింత వాణ్ణి, అంతవాణ్ణి" — అని డాంబికాలు చెప్పుకోడం హ్యూడల్ మనస్తత్వం.

—ఎడిచెయ్యి ఆసి * తొడలకిందవేసి, జింకపిల్లని ఎత్తిపుచ్చు ఎత్తి, గబ గబ నడుస్తూ — కాలికి అడ్డంవచ్చిన దర్భాపనాసా...పూజా ద్రవ్యాలా — చెల్లాచెదురుగా తన్ని, చెట్లచాటున వున్న రథం దారి తీశాడు.

సీత పరిస్థితి గ్రహించి భయంతో — "అయ్యో! అయ్యో! రక్షించండి! రక్షించండి" — అంటూ కేకలు పెట్టింది.

రావణుడు రథంలో ఎక్కగానే, సీతని తొడమీద కూర్చోబెట్టు కున్నాడు. రథం సాగింది. సీత వున్మత్తురాలిమల్లే పలవలా ఏడుస్తూ, రథంలోంచి దూకాలని పెనుగులాడుతోంది.

తనని తాకీ తాకగానే పర పురుషుణ్ణి భస్మం చెయ్యవలసిన పుణ్య పతివ్రత — పర పురుషుడి రాక్షస పట్టులోంచి తప్పుకోలేక "రక్షించండి రక్షించండి! — అయ్యో! నన్నెవరూ రక్షించేవారే లేరా?"— అంటూ నిస్సహాయంగా కేకలేస్తోంది.

సీతకి చలవాపైన పక్షులు కొన్ని కొంతదూరం సీతవెంట ఎగిరి చెట్లమీద వాలి అయోమయంగా చూస్తున్నాయి.

* * *

---

* 49 వ సర్గలో — 17½ శ్లోకం.
సీతని రావణుడు ఏ విధంగా తీసికెళ్ళాడో చూడవొచ్చును.

వాలాగో కథ తర్వాత
ఐదో కథ వరకూ —

(రావణుడు సీతని బలవంతంమీద పల్లకిలోకి ఎక్కించుకుని బయల్దేరడంతో నాలుగో కథ ముగిసింది. సీతగురించి రామునకు శాస్త్రోక్తంగా ప్రస్తుతించడంతో ఐదో కథ ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకీ మధ్యవున్న భాగం ఇది.)

క్రించన గాడిదల పథం ఆకాశమార్గాన పోతూవుంది.

రావణుడు సీతని బలవంతంగా తొడమీదకి లాక్కుని, విడిపించుకోడానికి వీలులేకుండా ఆలింగనం చేసుకొని కూర్చున్నాడు.

సీత, ఏడుస్తూ, రావణుణ్ణి తిడుతూ, కేకలు పెడుతోంది—"రామా! లక్ష్మణా! ఈ దుర్మార్గుడు నన్ను ఎత్తుకు పోతున్నాడు. అయ్యో! నన్ను రావణుడు ఎత్తుకుపోయాడని మీకెలా తెలుస్తుంది? ఈ దుష్టుడు చెప్పడు నిస్తాడు? కాలం ఇంకా ఆసన్నం కాలేదా? * ఆ దుష్టుడు

* అరణ్య కాండలో—49వ సర్గలో 27½ శ్లోకం:

"దుష్టుడి పాపకార్యమునకు ఫలము వెంటనే కలుగదు. కాలము రావలయును."—అని దుఃఖిస్తోంది సీత. "రాముని చైవత్వమూ, సీత పాతివ్రత్యమూ ఎందుకో పనికిరావా?"—అనే ప్రశ్న వొచ్చే అవకాశం వుంది కాబట్టి—"దుష్టుడు నశించటానికి కాలం రావాలి. అందుచేతనే రావణుడు చేసిన దుష్కృత్యానికి తక్షణమే శిక్ష పుండలేదు"—అనే విషయం మీదకే మన దృష్టి మళ్ళిస్తున్నాడు కవి. అంటే—సీత—భర్తని తల్చుకుని దుఃఖిస్తూ—"దుష్టుల్ని శిక్షించడానికి దేవుడు నడుంకట్టే కన్నా, ఫలమైనా....దుష్టుడికి....కాలం రావాలి"—అని సరిపెట్టుకుంటోంది.

కైకేయి కోరికతీరింది. ఇక ఆమె క్షేమంగా, సంతోషంగా వుంటుంది"- అంటూ, ఏడుస్తూ చుట్టూ చూసింది.

"ఓ కర్ణికా వృక్షమా: నన్ను రావణుడెత్తుకుపోయాడని నా భర్తకు చెప్పాలీ సుమా!" అని, ప్రస్రవణ పర్వతాన్ని చూసి నమస్కరిస్తూ- "ప్రస్రవణమా: ఈ దుఃఖ వార్త నా పెనిమిటికి చెప్పు తండ్రీ!" అని, గోదావరిని చూస్తూ- "గోదావరీ తల్లీ: ఈ నీచుడు నన్నెత్తుకు పోతున్నాడని నువ్వయినా నా భర్తకి చెప్పు తల్లీ!"- (ఆ పర్వతంగానీ దేలాగూ చెప్పడనా?) అంటూ, వన దేవతలందర్నీ గుర్తొచ్చి- "వన దేవతలారా: మీరైనా చెప్పాలిసుమా!" (ఈ సారి గోదావరి మీద కూడా అనుమానమే) అంటూ, చుట్టూ భయంతో చూసింది. (అనలు వీళ్ళు చెపుతారా అని గావును) "ఓ పక్షులారా: నా భర్తకు నేను ప్రాణాల కన్నా ఎక్కువ దానిని. అసలీ వార్త నా భర్తకు తెలియాలేకానీ, రావణుడు నన్ను స్వర్గంలో పెట్టినా, నరకంలో పెట్టినా, నా భర్త ఈ సీచుణ్ణి జయించి నన్ను రక్షించి తీసుకువొచ్చేస్తాడు."-*

ఆ విధంగా దుఖిస్తూ మంచి పిరుదులుగల సీత దూరంగా చెట్టు మీద నిద్రపోతోన్న జటాయువుని చూసింది. (పిరుదులతో చూసింది దాపున్న. దూరంగా వున్నవాళ్ళని చూడాలంటే స్త్రీకి మంచి పిరుదులు వుండాలన్నమాట!)

"ఓ జటాయు పక్షీ: ఈ దుర్మార్గుడు, రావణుడు నన్ను తీసుకు పోతున్నాడు. నా మీద నీకు జాలి కలిగినా ప్రయోజనంలేదు. ఇతణ్ణి

---

* 49వ సర్గలో - 34½, 35½ శ్లోకాలు.

"నా భర్తకు నేను ప్రాణములకన్నా ఎక్కువయిన దానిని"- అంటోంది సీత. రాముడు చాలా సార్లు సీత ఎవరెవరికన్నా తక్కువో, నిర్మొహమాటంగానే చెప్పాడు. సీతకి అవన్నీ పరగడుపు అయిపోయాయి. ఈ పాత్రల మధ్య భ్రమలు- నటనలు-ఆత్మవంచనలు- చాలా స్పష్టంగా చూడవచ్చును:

• 49వ సర్గలో - 38½ శ్లోకం.

సీత జటాయువుని ఏ విధంగా చూసిందో చూడండి.

ఎడ్డగించడం నీవల్ల కాదులే. ఈ నీచుడి దగ్గర ఆయుధాలన్నీ వున్నాయి. ఈ సంగతి మాత్రం నా భర్తకు చెప్పు"—అని కేకలు పెట్టింది. (జటాయువు తననెక్కడ విడిపిస్తాడోనని భయంగా వున్నట్టుంది సీతకి. రావణుడి తొడ, కూల్చడానికి సదుపాయంగానే వున్నట్టుంది.)

జటాయువు సీత కేకలికి వులిక్కిపడి లేచాడు. రథంలో వ్యవహారం చూశాడు. కోపంతో రెక్కలు కొంచెం కదిలించి, మెడ సాగదీసి కొమ్ముమీదనించి రథంవద్దగ్గరికి పెట్టాడు.

"రావణా! నువ్వు తీసుకుపోతోన్న స్త్రీ ఎవరనుకున్నావు? లోకాలన్నిటికీ ప్రభువైన శ్రీరామచంద్రుడి భార్య. శ్రీరాముడు లోకాలన్నిటికీ హితమే చేస్తాడు.

నేను జటాయువుని. సనాతనంగా వొస్తోన్న దాస్య ధర్మంతో శ్రీరాముడికి సేవచేసుకుంటూ వున్నాను. * శ్రీరాముడికి ఉపచారం జరుగుతూ వుంటే చూస్తు వూరుకుంటానా?

---

* 49వ సర్గలో— 40 శ్లోకం—

జటాయువు చీపరికి ఓడిపోతాడు కాబట్టి, "మరి జటాయువుకి ఆయుధాలు లేవుకదా;" అనీ, జటాయువు సీతని విడిపించలేక పోవటానికి కారణం ముందే చెప్పడం అన్నమాట.

సీత, చెట్లనీ, పుట్లనీ, చివరికి జటాయువునీ "నా భర్తకీవార్త చెప్పండి"—అంటోందేగాని, "నన్ను రక్షించండి"—అనడంలేదు. ఎంచేతంటే, పతివ్రతలు భర్తల్ని తప్ప, ఇతరుని రక్షించమని అడగకూడదు— తనని తను రక్షించుకోకూడదు. పోని, మీవంటి చీలుస్తోన్నా సరే— ఆ భర్తే రావాలి తీరిగ్గా. అలాగా పులిగారు తేన్చుకుంటూ పోతారు.

* 51వ సర్గలో— 31వ శ్లోకం.

జటాయువు—"సనాతన మగు దాస్య ధర్మములో నుండుచాడను."—అంటున్నాడు. దాస్య ధర్మం! అదీ సనాతనం! పూర్వకాలం నించీవున్న దాస్య ధర్మం ఏమిటీ? ఇది "వానిస వ్యవస్థ"కి సంబంధించిన ధర్మం! ఏని అర్థంచేసుకోవాలి.

పురుషుడు తన భార్య నెంత జాగ్రత్తగా రక్షించుకుంటాడో ఇరుల భార్యల్ని కూడా అలాగే రక్షించాలి కదా? సత్పురుషులు ధర్మ శాస్త్రాల్లో చెప్పని, ధర్మార్థకామాలు అనుభవించ వచ్చునా?- రాజు, ముఖ్యంగా రాచస్త్రీలను కాపాడాలికదా? • నువ్వో రాజువేకదా?

శ్రీరాముడు, నీ విషయంలో గానీ, నీ రాజ్యం విషయంలోగానీ అధర్మం చేశాడా?

ఖరుడేగదా శూర్పణఖ మాట విని ముందు యుద్ధానికొచ్చాడు! మీది మీది కొచ్చిన శత్రువుని రాముడు చంపాడు. అందులో తప్పేముంది?

వెంటనే సీతని విడిచిపెట్టు. లేకపోతే....మహాసర్పాన్ని కంఠానికి చుట్టుకున్నట్టే. నాకిప్పుడు 60 వేల సంవత్సరాలు. కాస పెదవాణియిన మాట నిజమేగాని, నిన్ను మాత్రం క్షేమంగా పోనిస్తానను కోకు. నా కళ్ళముందే సీతని తీసుకుపోనిస్తానా? ఖరుడికి పట్టిన గతే నీకూ పడుతుంది. రా: యుద్ధంతో విందుచేస్తాను నీకు" — అంటూ జటాయువు చెటుమీదనించి ఎగిరి రావణుడిమీదకి వురికాడు.

రావణుడు బాణాలతో; జటాయువు గోళ్ళతో — ఇద్దరికీ పెద్ద యుద్ధం జరిగింది.

• 50వ సర్గలో- 7½ శ్లోకం.

పురుషుడు తన భార్యని జాగ్రత్తగా ఎందుకు రక్షించుకుంటాడు?- పర పురుషుల భయంవలనే కదా?- పర స్త్రీలనికూడా రక్షించే పరిస్థితిలో అసలు తన భార్యనే రక్షించుకోవడం ఎందుకు? పురుషులంచరూ, పరస్త్రీలకు హాని చెయ్యకపోతే, అసలు తన భార్యల్ని రక్షించుకోవలసిన అవసరమే లేదు.- ప్రతీ విషయంలోనూ రఘు నీతులు ఇలాగే "వైరుధ్యాలతో" వుంటాయి.

• 50వ సర్గలో- 6వ శ్లోకం.

రాజు పరస్త్రీలని కాపాడాలిగానీ,- ముఖ్యంగా "రాచస్త్రీలని" కాపాడాలట. ముగతా వాళ్ళని అంతగా కాపాడక పోయినా ఫర్వాలేదు. తక్కువ కులం వాళ్ళేకదా?

జటాయువు రావణుడి ధనుస్సు కాళ్ళతో విరిచేశాడు. రావణుడు రథంలోంచి ఇంకో ధనుస్సు అందుకున్నాడు. జటాయువు చుట్టూ గూడు కట్టినట్టు బాణాలు గుప్పించాడు.

జటాయువు రెక్కలతో ఆ బాణాల గూడు చెల్లాచెదురు చేసి, ఆ ధనుస్సునూ విరిచేశాడు. గోళ్ళతో లాగి, రావణుడి కవచం ఎక్కడికక్కడ చీల్చేశాడు. కంచర గాడిదల్ని చంపేశాడు.

రథంలో రావణుడి వెనక నించుని గొడుగు పట్టుకున్న పరిచారకుణ్ణీ, చామరాలతో విసిరే వాళ్ళనీ చంపేశాడు. * రథ సారథిని చంపేసి కిందకి తోశాడు. రథ చక్రాలు వూడదీసి, రథం విరగ్గొట్టేశాడు. (సీత ముందు ఎంత అవమానమో రావణుడికి పాపం : బోత్తిగా మోటుగా చేస్తున్నాడుకదూ జటాయువు :)

రథం విరిగిపోగానే రావణుడు సీతని వడిలో పెట్టుకుని కిందపడ్డాడు. (తొడమీద కూర్చోడం సీతకి చాలా మంచిదైంది. లేకపోతే ఎంత దెబ్బ తగిలేదో :)

రావణుడు కిందపడగానే, సకల ప్రాణులూ "మంచిపని చేశావు, మంచిపని చేశావు"— అని పక్షిరాజుని పొగిడాయి.

జటాయువు అలిసిపోయాడని రావణుడికి అర్థమైంది. ధైర్యంగా సీతని ఎత్తుకొని ఆకాశంలో కెగిరాడు. గాలిలో బాసింపట్టు వేసుకుని, సీతని మళ్ళీ చూళ్ళో పెట్టుకుని ఎగురుతూ ప్రయాణం సాగించాడు.

---

51 వ సర్గలో — 18 వ శ్లోకం.

రాజుకి రథంలోనూ పరిచారకులు గొడుగు పట్టడం — విసరడం ఉంటుంది. ఆ పరిచారకులు బోత్తిగా పిచ్చిమొహాలు గానీ,— ఆ జటాయువు పీనుగొచ్చేంతదాకా, ఆ గొడుగుతోనూ, పిననకర్రలతోనూ అవతలపారేసి, రథం మూకి, కాసేపాగి పరిగెత్తవొద్దా ? — అలాచెయ్యరు. విసురుతూ — పీనుగుతూ — పీనుగుతూ — విసురుతూనే (సేవలోనే) మునిగిస్తారు రాజుకోసం.

"దుష్టుడా : రావణా : ఆగు. నిలబడు. (బాసింపట్టు తియ్యి) శ్రీరాముడంటే ఎవరనుకుంటున్నావు ? కకుత్స్థవంశస్థుడు. — వీడితో పెట్టుకుంటే, నాతో యుద్ధంచేసి పెళ్ళు" — అని అరుస్తూ జటాయువు వెనకే ఎగురుతూ వచ్చి రావణుడి పీపుమీద చటీమని తన్నాడు. (అబ్బ ! మరీ మోటు).

మావటివాడు, మాటవినని ఏనుగు అంకుశంపోట్లు పొడిచినట్టు, రావణుడి పీపంతా ముక్కుతో పొడిచి చీల్చేశాడు. (రాముడు చంపడానికే మిగల్చకుండా రావణుడి వ్యవహారం జటాయువే తేల్చేసేట్టున్నాడు. ఈ కథ ఇక్కడే అయిపోతుందేమోనని భయం వేస్తోంది.)

జటాయువు రావణుడి ఇరవై తలలమీది జుట్టంతా పీకేశాడు. (రధం విరగొట్టినా ఫర్వాలేదు, పీపు చీరేసినా ఫర్వాలేదుగానీ తలలు చెరిపేస్తే మళ్ళీ కోపం వొస్తుంది కదూ ? పక్కన సీతకూడా వుంచయ్యే ! తలలు చెరిగితే ఏం బాగుంటుంది ?)

రావణుడికి అప్పటికి కోపం వచ్చి (తలలు చెరిపేసినందుకు. నే నన్నానా ?) జటాయువుతో యుద్ధానికి వెనక్కి తిరిగాడు. (జటాయువు రావణుడి పీపుమీదే వున్నాడు.)

రావణుడు ఎడం భుజం కింద, 10 చేతుల్తో సీతని అదిమి పట్టుకుని, కుడి చేతుల్తో పీపుమీద జటాయువుతో యుద్ధం ప్రారంభించాడు.

జటాయువు రావణుడి ఎడం భుజంమీద ముక్కుతో పొడిచి, పొడిచి ఆ పది చేతుల్నీ గుతిమల్లే వూడదీసేశాడు. (ఆశ్చర్యం : సీత కింద పడలేదు) — ఆ చేతుల గుత్తి ఇలా వూడిందో లేదో, పుట్టలోంచి పాములు బుస్సున లేచివొచ్చినట్టు మళ్ళీ 10 చేతులు అలా పుట్టుకొచ్చేశాయి. (ఇలా అయితే ఎవరు యుద్ధం చెయ్యగలరు బాబూ ? — చక్కగా యుద్ధాల్లో చచ్చిన చచ్చిపోవాలి గానీ .... నరికేసినవన్నీ మళ్ళీ పుట్టుకొచ్చేయ్యడాలుంటే, అవతలి వాళ్ళకి వుసుకుమోతనం వొస్తుందా ? రాదా ? — ఇల్లా అయితే ఈ యుద్ధం కలియుగం అంతా జరుగుతుందో ఏవిటో !) — ఇక లాభంలేదని రావణుడు సీతని కిందకిదించి, జటాయువుతో కాళ్ళా చేతులా యుద్ధం ప్రారంభించాడు.

జటాయువు రెక్కలూ, కాళ్ళూ కత్తితో నరికేశాడు.

జటాయువు భూమిమీద పడిపోయాడు.

సీత పరిగెత్తుకొచ్చి జటాయువుని కౌగలించుకుని ఏడ్చింది — "అయ్యో! నన్ను రక్షించాలని వొచ్చి ఈ పక్షిరాజు నాశనం అయిపోయాడే! రామా! ఈ సంగతి నీకింకా తెలియనేలేదా? నీ కే అపశకునాలూ కనబడలేదా? నీ ఎడమకన్ను అదరలేదా? పక్షులు విక్రమంగా అరవలేదా?" — అంటూ, చంద్రునివంటి ముఖం గల సీత, శోభనాంగి అయిన సీత, చాలా ఏడ్చింది.

జటాయువు పడిపోయాక రావణుడు సీత దగ్గరికి వొచ్చాడు. సీత చెట్లవెంబడి పరిగెత్తి పెద్దపెద్ద చెట్లని గట్టిగా కౌగలించుకుంటోంది.

రావణుడు — "వొదులు, వొదులు" — అని సీత జుట్టు పట్టుకుని గుంజుతున్నాడు.

జగములన్నీ చీకట్లు కమ్మాయి. గాలి ఆగింది. సూర్యకాంతి తగ్గింది.

బ్రహ్మ దివ్యదృష్టితో చూశాడు. అసలు సంగతి తెలిసింది — రావణుడు సీతని ఎత్తుకుపోతున్నాడని. — చాలా సంతోషించాడు — ఇక రావణుడి చావు దగ్గిర పడింది కదా అని.

దండకారణ్యంలో ఋషులంతా రావణుడు సీతని తీసుకుపోతోంటే పిక్కటిల్లి ఆనందించారు. *

---

* 52 వ సర్గలో — 13, 14 శ్లోకాలు.

"దండకారణ్యములో నుండిన ఋషులందరూ రావణుడపహరించుకొనిపోవుచుండు సీతని జూసి, దుఃఖించి .... రావణునికి వినాశకాలము వచ్చినదని తలచి సంతోషించిరి." —

మహానుభావులయిన ఋషులంతా మొత్తుకుంటూ పొవలో దూరి పుంటారు. — ఇంతకీ సీతని రావణుడు తీసుకుపోతున్నాడనే సంగతి, సీత కేకలవల్ల ఋషులందరికీ తెలుసు. వాళ్ళంతా వాడుడే ఇంటికి చుట్టుపక్కల వాళ్ళే.

"రామా ! లక్ష్మణా ! రక్షించండి, రక్షించండి"- అంటూ. ఎల విలాపతోన్న సీతని మళ్ళీ నందితేసుకుని రావణుడు ఆకాశంలో కెగి రాడ్లే. బాణంమల్లే దూసుకుపోతున్నాడు.

సీత రాముడో, లక్ష్మణుడో కనబడతారని కిందకి చూస్తోంది.

సీత అందెలూ, గాజులూ, కాసులపేర్లూ చప్పుడు చేస్తున్నాయి. ఆ చప్పుడుతో రావణుడు ఎగురుతోంటే మేఘం గర్జిస్తూ ఎగురుతోన్నట్టుంది.

సీత జడలో పూలదండ తెగి, ఘుమఘుమలాడే ఎన్నని పూల రేకులన్నీ రావణుడి భుజంమీదనించి కిందకి పూలవాన కురిశాయి.

సీత ఎడంకాలి గజ్జెలు వూడి ఘల్లుమంటూ కిందపడాయి. ఇంకా కొన్ని నగలు జారి, ఆకాశంనించి నక్షత్రాలు తెగి రాలుతోన్నట్టు కింద పడ్డాయి.

సీత నడుంమీద వుండే రత్నహారం తెగి కింద పడుతూ, (సీత కంఠంలో మెరిసే రత్నహారం అని చెప్పవచ్చు కదా ? కవిగారి దృష్టి "సీత మహాతల్లి" మీదుంటే, నడుంన్ని వదిలి ఇవతలికి రాదు — ఎందుచేత ?) ఆకాశంనుంచి దిగుతోన్న గంగానది మల్లే మెరిసింది.

బంగారపు శరీరచ్ఛాయ గల సీత, మేఘాలలో మెరుపుమల్లే తళుక్కు తళుక్కున మెరుస్తోంది.

ఎండమైన ముక్కుగల సీత మొహం చుక్కలతో వాడిపోయింది- (హనుమయ్య : సీత ముక్కు అందంగానే వుంటుందన్నమాట, ఏమో .... ఏలా వుంటుందో ఏవిటో అని బెంగపెట్టేసుకున్నాం.) సీత జుట్టు అందంగా, నొక్కులుగా, జుట్టు కొనలు వుంగరాలు తిరిగి వుంది. సీత పెదిమలు ఎర్రగా, పళ్లు తెల్లగా .... మొహం పగటి చంద్రుడిమల్లే కాంతి తగ్గి వుంది.

నల్లని రావణుడి చెయ్యి సీత నడుంచుట్టూ చుట్టుకుని, — నీలాలు పోసిగిన వడ్డాణం పెట్టుకున్నట్టు సీత నడుము అందంగా ప్రకా

ఉంచింది. — (ఇహనేం మరీ: సీత నడుంచుట్టూ రావణుడు చెయ్యి ఎప్పుడూ పుండేనే బాగుంటుంది.) *

కింద చెట్టు గాలికి తలూపుతూ — "సీతా: భయపడకు సుమా!" — అని చెప్తోన్నట్టున్నాయి.

సీత రావుడికోసం కిందకి చూస్తోనేవుంది.

ఎరణ్యంలోవున్న సింహాలూ, పులులూ, రావణుడిమీద దాడిలో కింద సీతవెంట పరిగెత్తాయి. (సీత ఇప్పుడన్నా సింహాల్ని చూసి వుంటుంది.)

పర్వతాలన్నీ జలపాతాలతో సీతకోసం ఏడుస్తోన్నట్టున్నాయి.

సప్త ఋషులూ ఆకాశంలో చేరి — "అయ్యో: రావణుడు సీత నెత్తుకు పోతున్నాడే: లోకంలో ధర్మం ఎక్కడుంది: సత్యం ఎక్కడుంది?" — అని దుఃఖించాయి.

---

* 52 వ సరళ — 25 వ శ్లోకం.

"నీలమణులు పొదిగిన బంగారము వర్ణము ప్రకాశించినటుల .... సీత రావణుని నల్లని అంగములు నాశ్రయించి ప్రకాశించినది." — చదండీ విషయం. సీతకి ఇష్టం లేకుండా, ఆమె నడుం చుట్టూ రావణుడి చెయ్యి చుట్టుకోడం ఎలాంటి విషయం: ఆమె — శరీరం ఆసహ్యంతో జలదరించే విషయం. చూసేవాళ్ళకి మాత్రం అసహ్యంగా కనబడే విషయం.

"సీత నడుముచుట్టూ నల్లని రాచు చుట్టుకున్నట్టు భయంతో వాణి కించి" అనో, ఇంకేదో రాసాల్సిందానీ ప్రకాశించినట: కవిగారికి 'ప్రకాశం' కనబడుతోంది. పురుషులు స్త్రీలని బలాత్కారాలు చేస్తో వుంటే కవిగారికి మహా సొగసుగా, ముచ్చటగా కనబడుతుంటన్నమాట. సీత నడుము అంతలావుగా పెరిసిపోతోంటే ఆ పెరుపు ఎలా వుండాల్సిందే కదా: రామునివి చెయ్యి ఒక నీలాల వర్ణం. రావణుడి చెయ్యి ఇంకో నీలాల వర్ణం. "సీతకి రెండు వర్ణాలో రెండుకదా:" — అని ఎవరన్నా అంటారా?

సిద్ధులూ, చారణులూ — "ఇక రావణుడి జీవితం పుగిసి పోయింది" — అని చెప్పుకున్నారు సంతోషంగా.

వనదేవతలంతా రావణుణ్ణిచూసి పారిపోతున్నారు ఎక్కడికక్కడ.

సీత జుట్టంతా చిక్కులు పడింది. బొట్టు చెదిరింది — "రావణా! దుర్మార్గుడా! సిగ్గులేని వాడా! మాయోపాయంతో ఎత్తుకుపోతున్నావే. ఇంత వేగంగా పోతోవుంటే నా భర్త మాత్రం ఏం చెయ్యగలడు? కొంచెం నిలబడావంటే నా పెనిమిటి వీరత్వం చూస్తావు. రాపు లక్ష్మణుల బాణాల వేడి నువ్వోరగవు. నీకు వినాశకాలం దాపురించింది. యమలోకంలో కణకణమండే అగ్ని స్థంభాన్ని కావలించుకుంటావు. తప్పదు" — అని దూషిస్తూ కింద ఒక పర్వతంమీద కొందరు వానరుల్ని చూసింది. చీర చింపి కొన్ని ఆభరణాలు వూడదీసి, మూటగట్టి కింద పడేసింది — రాముడు తనని వెతుక్కుంటూ వస్తే సంగతి తెలుస్తుందని.

రావణుడు బాణంమల్లే దూసుకుపోతూ సపుష్పకం దాటాడు. లంకలో ప్రవేశించాడు. రాజమార్గంలో ఎగురుకుంటూ — (ఎగిరేవాళ్ళకి రాజమార్గాలు! ఇళ్ళమీదనించి ఎగుసుకుంటూపోక — వీధివెంట ఎగురుకుంటూ పోతున్నాడు. బొత్తిగా తెలివి తక్కువ ఎగురుడు!)

గుమ్మాలవెంట ఎగురుకుంటూ సీతని అంతఃపురంలోకి తీసుకొచ్చి దించాడు. (పోనీలే. ఎక్కడా పడెయ్యకుండా బాగానే తీసుకొచ్చాడు. ఎక్కడో అక్కడ బతికుంటే అంతేచాలు.)

రావణుడు దాసీల్ని పిల్చి — "ఈ సీతని నా ఆజ్ఞ లేకుండా, పురుషులుగానీ, స్త్రీలు గానీ ఎవ్వరూ చూడకూడదు. తెలిసిందా? ఈమె — బంగారం, నగలూ, పట్టుబట్టలూ, రత్నాలూ, ముత్యాలూ ఏం అడిగితే అది చప్పున ఇచ్చెయ్యండి. ఈమె కిష్టంలేని మాట లెవరన్నా మాట్లాడారో. ఇక వాళ్ళు చచ్చినట్టే" — అని హూంకరించి అంతఃపురంలోంచి బయటికి వెళ్ళాడు.

8 మంది వీరుల్ని పిల్చి — "మీరు వెంటనే ఆయుధాలతో జన స్థానానికి వెళ్ళండి. ఇక రాముడికీ నాకూ విరోధం ప్రారంభమైంది. మీరు రాముడికి సంబంధించిన వార్తలు ఎప్పటికప్పుడు నాకు తెలియ జేస్తూ వుండండి. (అదెంత భాగ్యం: రాకలూ, పోకలూ ఎగురుళ్ళ కదా?) — రాముడు నా శత్రువు. ప్రతీక్షణం రాముణ్ణి చంపడానికే మీరు ప్రయత్నిస్తూ వుండాలి. (ఎవరి శత్రువుని వాళ్ళే చంపుకోవాలిగానీ, ఇదేం చంపుళ్ళమ్మా: వొకరి శత్రువు నింకొకరు చంపడాలుంటే కథేం బాగుంటుందీ?) *

"మీరు మహా వీరులు. అనేక యుద్ధాలలో మీ వీరత్వం నే నెరుగుదును. అందుకే మిమ్మల్ని జనస్థానం పంపుతున్నాను. భయపడకండి. ధైర్యంగా వుండండి. మీరు పౌరుషం ప్రదర్శించగలరు" — అంటూ

---

* 54 వ సరలో 22, 23 శ్లోకాలు.

రావణుడు వీరుల్ని పిల్చి — "నేను జనస్థానంలో వుంచిన నా సేనని రాముడు చంపేశాడు. నాకూ, రాముడికీ వైరం కలిగింది" — అంటున్నాడు.

"మన సేనని రాముడు చంపేశాడు. రాముడు మన శత్రువు" — అనడంలేదు. ఎంతెంత యుద్ధాలు జరిగినా అదంతా రాజు వొక్కడికీ సంబంధించిన వ్యవహారమే. "ఫలానా రాజు జయించాడు", "ఫలానా రాజు ఓడిపోయాడు" అంటారు. మేలకొన్న సైన్యం చచ్చిపోయినా సరే, పోయినా సరే — రాజు వొక్కడి వ్యవహారమే. ఇది ఫ్యూడల్ వ్యవస్థ లక్షణం.

అదే బూర్జువా వ్యవస్థ అయితే — ఈ మోసం ఇంత స్పష్టంగా వుండదు. "మన జాతి', 'మన దేశం' అనే ముసుగులు వేస్తారు. సైనికులకి జాతి రక్షణా, దేశ రక్షణా మతు ఎక్కిస్తారు. బూర్జువా యుద్ధాల వల్ల హతుడా సైనికులకు జరిగే మేలేమీ లేదు. లాభపడేది పరిపాలించే వర్గాలే.

దేశాలకోసం, జాతుల కోసం సైనికులు మాత్రం ప్రాణాలు ఇచ్చేయ్యాలి.

పొగిడాడు. (వుబ్బేశాడన్నమాట. పీలలక్కి ఎగురుళ్ళూ, దూకుళ్ళేగాక .... వుబ్బుళ్ళు కూడా వుంటాయి గావున్ను.)

పీలలు వుబ్బుకుంటూ వెళ్ళిపోయారు. రావణుడు నవ్వుకుంటూ — మళ్ళీ సీత దగ్గిరికి వొచ్చాడు. సీత ఏడుస్తూ వుంది.

రావణుడు ఏడ్చే సీతని వెంటబెట్టుకుని, తన సిరి సంపదలన్నీ చూపించడానికి అంతఃపురాలన్నీ తిప్పాడు. (సీత చూసినట్టు చెప్పాలి: అవున్లే. రానంటే వూరుకుంటాడా ఏమున్నాడా? మళ్ళీ నడుంచుట్టూ వడ్డాణం పెట్టితీసుకుపోతాడయ్యే!)

అంతఃపురాలనిండా వేలకొద్దీ స్త్రీలున్నారు. (అందరూ ఈరకంగా ఎత్తుకొచ్చినవాళ్ళే.) ఆ అంతఃపురాలన్నీ వెండి స్తంభాలతో, బంగారపు ద్వారబంధాలతో, అరుగులతో, మెట్లతో ధగధగ మెరిసిపోతున్నాయి.- ఆవరణనిండా ఎన్నెన్నో పెద్ద విమానాలూ, చిన్న విమానాలూ, వాటికి బంగారంతో చేసిన కిటికీలు!

(అన్ని విమానాలు పెట్టుకుని గాడిదల రథం ఎక్కడానికా ఎవడన్నా: పిచ్చోడిమల్లే వున్నాడు రావణుడు.)

నేలంతా ముత్యాలపొడీ, మణులూ తాపడం చేశారు. (ఏం బాగుంటుందమ్మా! లరికాళ్లు చీరుకుపోవూ?)

వుద్యాన వనాలలో ఎక్కడికక్కడే సరోవరాలు: (ఓస్: అవల్లో ఎన్ని చూసిందో సీత.)

రావణుడు గర్వంగా — "చూశావుగా నా భోగ భాగ్యాలు. 32 కోట రాక్షస జాతికి నేను ప్రభువుని. ఏ కార్యానికయినా వేలకొద్దీ వీరుల్ని నియోగించగలను. నన్ను ఎవ్వరూ జయించలేరు. ఇక రాముడెంత? అసలు రాము డిక్కడికి ఎలా రాగలడు? (ఆ మాట నిజమే, దేనికదే అనుకోవాలి) — నిన్ను ఇక్కణ్ణించి ఎప్పుడూ తీసుకుపోలేడు. — నీ పిరుదులు చక్కగా బలిసి వున్నాయి — ఏం పాపం చేశావో ఇంతకాలం వనవాసం చేశావు. ఇక సుఖానుభవించు. నీ తొడలు బలిసి చక్కగా వున్నాయి — నా దగ్గిర పుష్పక విమానం వుంది. దాంట్లో

మన మిద్దరం విహరించుదాం. యౌవ్వనం అస్థిరం సుమా ! నాతో * కామ భోగాలతో సుఖించు.

ఈ రాజ్యమంతా నా ఆధీనం ; నేను నీ ఆధీనం ; నువ్వు తిరస్కరిస్తే నా ప్రాణాలు నిలబడవు సుమా !" — అన్నాడు. (ఎన్ని వేల మంది స్త్రీలకు చెప్పాడో ఈ మాటలు ! కంఠతా వొచ్చేశాయి.)

సీత జలజలా కన్నీళ్లు రాలుస్తూ కొంగుతో మొహం కప్పుకుని ఏడ్చింది.

"సీతా : భర్త పడిచిపెట్టిన పర పురుషుణ్ణి ఏలా స్వీకరించనని సిగ్గుపడుతున్నట్టున్నావు, ఇందులో దోషం లేదు. ఇది దైవ నిర్ణయమే. ఋషులు చెప్పిందే. నన్ను వివాహం చేసుకుని నా భార్యలందరి

---

* 55 వ సర్గలో — 22 వ శ్లోకం.

"యౌవ్వనము అస్థిరమైనది. ఈ గృహములో నాతోడి భోగించుము" — అంటున్నాడు రావణుడు.

రావణుడు సీతని "సీతమ్మ తల్లి" లా చూశాడనీ, "భూదేవి"లా భావించాడనీ, మన పిలక పండితులు దొంగ అర్థాలు చెబుతారు.

ఏవిగారే సీతని తల్లిలా చూడలేక పోయారే ! సీత పెరుమాళ్ళా, తొడమీద వాపల్లేక పోతున్నారే ! ఇక రావణుడెలా చూస్తాడో ! (తల్లిని ఎత్తుకురావడం ఎందుకట ?)

* 56 వ సర్గలో — 34½ శ్లోకం.

"ఇందులో దోషం లేదు. ఇది దైవ నిర్ణయమే" — అనడంలో ఎట్లా — స్త్రీలని బలాత్కారంగా పురుషులు (పీరత్వంతో) గెల్చుకుని తెచ్చుకోడం తప్పులేదని. (ఇటువంటి సాంప్రదాయాలూ, ఆచారాలూ మాలా జాతుల్లో వుండేవి.)

- మీదా పెద్దభార్యపై నా పట్టమహిషిగా వుండు. *

"నా కోరిక ఈడేర్చు. నీ పాదాలకు మొక్కుతాను. నీ సౌందర్యము మీద కాంక్షతో .... నీకు మొక్కుతా నంటున్నానుగానీ లంకాధిపతి రావణుడు ఒక స్త్రీకి మొక్కుతా ననడమా? ఇంత నీచమైన మాటలు నా నోటినించి ఏలా వచ్చాయో నాకే • ఆశ్చర్యంగా వుంది" — అని ఇక సీత సంతోషంగా వొప్పుకుంటుందని అహంకారంగా చూశాడు.

సీత దుఃఖంతో తల వొంచుకునే వుంది. పతివ్రతలు పర పురుషు

---

* 55 వ సర్గలో — 26, 26½ శ్లోకాలు.

సీతని — "నా పట్టమహిషిగా వుండు" అంటున్నాడు రావణుడు. ఏన్నాళ్ళు? — ఇంకో వారంలో ఇంకో సీతని తెచ్చేవరకే. ఇవ్వాళ పెద్దభార్య, రేపు చిన్న భార్య అవుతుంది. రోజు రోజుకీ ఇంకా ఇంకా చిన్నదై పోయి, కొన్నాళ్ళకి రాజుగారికి కనపడకుండా పోతుంది. మళ్ళీ వొచ్చిన స్త్రీ అందరిమీదా పెద్దభార్య అవుతూ వుంటుంది.

• 55 వ సర్గలో — 38 వ శ్లోకం —

"రావణుడు ఒక స్త్రీకి అతని శిరముచే నమస్కరించడు. ఇట్టి నీచపుగు మాటలు చెప్పితిని. ఆశ్చర్యము" — అంటున్నాడు రావణుడు. దీన్నిబట్టి రావణుడు స్త్రీలకు ఏ రకమైన విలువ ఇస్తున్నాడో తెలుస్తుంది. (రామణ్ణి తిట్టి, రావణుణ్ణి పొగిడేవారు ఇలాంటి విషయాలు గమనిస్తూ వుండాలి. అన్ని విలువల్లోనూ ఇద్దరూ వొకటే అనే విషయం స్పష్టమవుతూ వుంటుంది.) కవికి, — సీతమ్మవంటి మహా పతివ్రతకి అయినా, రావణుడివంటి దుర్మార్గుడితో అయినా నమస్కారం చేయించడం ఇష్టంలేదు. "ఇటువంటి నీచమైన మాటలు అన్నాను. — ఒక స్త్రీకి నమస్కరించడమా?" — అనిపించి ఎంత చెత వెధవ పురుషుడయినా సరే, ఎంత వున్నతురాలయిన స్త్రీకి అయినా సరే నమస్కారం చేయడం ఎంత నీచమో వర్ణిస్తున్నాడు.

చితో సంభాషించడానికి సీతకి తెలుసు. ఒక గడ్డిపరక తీసి ఎదురుగా వెట్టి దానికి చెప్పడం ప్రారంభించింది. *

"నీచుడా ! నువ్వు పిరుదివా ? నా భర్త లేని సమయంలో నన్నెత్తుకు వచ్చావు. నా భర్త సూర్యచంద్రుల్నెనా ఆకాశంనించి కిందకి పడగొడతాడు. ఎవరైనా పీరుడు తన భార్యని శత్రు హస్తాలనుంచి రక్షించలేడా ? యజ్ఞ వేదికను భండాలుడెలా పుట్టుకోలేదో, అలాగే నన్ను నువ్వు పుట్టుకోలేవు. నన్ను ఎన్ని చిత్రహింసలయినా పెట్టు.

---

56 వ పద్యంలో — మొదటి శ్లోకం.

"సీత .... శోకముచే .... పతివ్రతలు పర పురుషునితో ముఖాముఖిగ సంభాషింపరాదను భావముతో మధ్యలో నొక తృణమును వుంచుకొని ఇటులనెను."

పతివ్రతలు అనలు పర పురుషుడితో మాట్లాడనే కూడదు. ఇలాగే బొత్తిగా తప్పనిసరి అయితే, ముఖాముఖీగా మాత్రం మాట్లాడ కూడదు.

అందుకే మంచి స్త్రీలు పర పురుషుణ్ణి చూడగానే తలుపుల చాటుకో, బల్ల ల చాటుకో, కుర్చీల చాటుకో, అక్కడ ఏది వుంటే దాని చాటుకి తప్పుకోవాలి.

ఏదీ లేకపోతే ఆ పరపురుషుడి చాటుకే తప్పుకోవాలి. — పర. పురుషుడి వీపు వెనక దాక్కుని మాట్లాడాలి. వాడు దుర్మార్గుడయి వెనక్కి తిరిగితే పతివ్రత అలాగే, దుర్మార్గుడి వీపునే ఆశ్రయించుకొని వుండాలి.

నా ప్రాణాలు రక్షించుకోవాలని నాకు కాంక్ష లేదు. ఇంతకుముంచి నేను సీతో సంభాషించేదేమీ లేదు" — అని మౌనం వహించింది. *

రావణుడు కోపంతో — "నామాట ధిక్కరిస్తున్నావు. ఒక్క సంవత్సరం మాత్రమే నీకు గడువు ఇస్తాను. అప్పటికీ నీ మనసు మార్చుకోకపోతే ఇక నీకు చావే గతి. ఆలోచించు" — అని అక్కడి నించి కదిలాడు. •

కొందరు దాసీ స్త్రీలని పిల్చి — "సీతని అశోకవనంలో వుంచండి. అది రహస్య సలం. జాగ్రత్తగా కాపలా కాస్తూ వుండండి. ఆమె ఎలాగయినా నాకు వశం అయ్యేట్టు ఎన్ని విధాలా ప్రయత్నించి చూడండి. మంచిగా నచ్చ చెప్పండి. భయపెట్టండి. చాలా అహం కారంతో వుంది. దయదల్చవద్దు. క్రూరంగా బెదిరించండి" — అంటూ ఖీకరంగా చూశాడు దాసీల్ని.

---

* 58 వ సర్గలో — 21వ శ్లోకం.

సీతకి ప్రాణభయమూ లేదు — చిత్రహింసల భయమూ లేదు. సీత మళ్ళీ ఈ కాలంలో పుడితే, మనస్తత్వం చదివి (రామాయణం కూడా చదివి) — విప్లవకారిణి ఎవుతుంది. ఫ్యూడల్ వ్యవస్థలో పుట్టి బట్టి అంత "పతివ్రత" అయింది.

(58 వ సర్గలో సీత రావణుడితో చాలా మాట్లాడింది, ఇదే విషయాలు మళ్ళీ సుందరకాండలో మాట్లాడింది హనుమంతుడు వచ్చినప్పుడు. అవంతా ఒక కథగా వుంది. అందుచేత సీత మాట్లాడిన విషయాలు ఇక్కడ ఎక్కువ చెప్పలేదు.)

• 58 వ సర్గలో — 24, 25 శ్లోకాలు.

రావణుడు పరస్త్రీని ముట్టుకోకుండా గిడుపు ఇవ్వాడం ఏమిటో ? ఆశ్చర్యంగా లేదండీ ! ఆపెనుడిమీద గౌరవం పుడుతోందిగానీ ..... ఇందులో ఏం కిటుకు వుందో అప్పుడే నమ్మటానికి వీల్లేదు.

దాసీలంతా — "చిత్తం ప్రభూ! తమ ఆజ్ఞ అక్షరాలా పాటిస్తాము" — అంటూ వొంగి నమస్కారాలు పెట్టారు.

రావణుడు సీతని దూరంనించి చూసి — వెళ్ళిపోయాడు.

దాసీలంతా సీత చుట్టూచేరి, అశోకవనానికి తీసుకువెళ్ళారు.

చెట్లనిండా పక్షులు గోలగోలగా వున్నాయి. ఎన్నడూ చూడని కొత్తరకం పూలున్నాయి. చుట్టూచూస్తే ఆ ప్రదేశం కొంచెం సంతోషం కలిగించింది సీతకి.

రావొద్దంటే విన్నదా?

చెట్లు – పచ్చని పర్వతాలమధ్యే కదలకుండా నించున్నాయి. సూర్యుడు వాలు చూపులతో చెట్లకిందకి తొంగిచూస్తున్నాడు. పక్షులు మేతకోసం బయల్దేరడానికి హడావుడి పడిపోతున్నాయి. గూళ్ళల్లో వుండడానికి ఏర్పాటు చేస్తోన్న పిల్లలకి నచ్చజెప్పలేక కోప్పడి, ముద్దెట్టుకుని ఎగురుతున్నాయి. ఎగిరే ఎగిరే పక్షులు కొన్ని దూరంగా రాముణ్ణి చూసి చప్పున దొరికిన చెట్టుమీద వాలి ఆకులో దాక్కుంటున్నాయి.

"నల రుషి .... నల రుషి .... దాక్కోండి, దాక్కోండి" — అంటూ కొన్ని వీరపక్షులు, రాముణ్ణి చూసుకోకుండా ఎగురుతోన్న వాటి కోసం కేకవేశాయి.

చెట్లన్నీ దయతో ఆకాశందాకా చేతులుచాచి దొరికిన పిట్టల్ని కొమ్మల్లో దాచేశాయి.

ఆకులో దాక్కున్న పిట్టలు గుసగుసలాడుకుంటున్నాయి. — "రోజూ బయల్దేరతాడు ఆ బాణాలేసుకుని ..... ఎంత తింటాడోగానీ ..... పాడు తిండి."

"ఎలా బలిశాడో చూడరాదూ? — ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టడు. పాపం చాకిరీ అంతా ఆ లక్ష్మణుడే ...."

"వాడూ ఏం కరుణాత్ముడు కాడు. ఇద్దరూ ఇద్దరే. మొన్న వాలి నీళ్ళకొచ్చి — నేను దూరంగా నీళ్ళు తాగుతోంటే నామీద బాణం కొట్టాడు. ఒక్క రెప్పపాటులో తప్పుకున్నా ననుకో. అబ్బ : ..... ఇప్పటికీ ప్రాణం దడదడ లాడుతోంది."

"అసలు పీళ్ళిద్దరూ రాకపుందు ఈ కీకారణ్యంలోకి వేటగా ళ్ళివరూ వచ్చేవారు కారు సుమా ! .. .... ఎప్పుడన్నా వచ్చినా ఏ నెలకో – ఆర్నెల్లకో. ఆ క్లాస్సేవూ దాక్కుంటే సరిపోయేది. పీళ్ళతో రోజూ చావొచ్చి పడిందే !"

"ఆ దుషులున్నారుగానీ .... ఎందుకొచ్చిన పాపం మాటలు వాళ్ళమీద .... దేనికదే చెప్పుకోవాలి. ఏ గడ్డో, గాదమో తింటారు. ఏ కాయలో గర్రలో నములారు. తల్లకిందులుగా వేళ్ళాడమో, అడ్డదిడంగా నించోడమో, పుడతే లేసుకుంటే కూర్చోడమో — ఏదో వాళ్ళ తపస్సేవిటో వాళ్ళేవిటో ... గానీ – పున జోలికీ సొంతికీ రారు సుమా !"

"పిచ్చిదానిలాగున్నావే ! వాళ్ళు పునల్ని బాణాలేసి చంపరుగానీ .... హింస పుక్కిలు కొచ్చిపెడితే లొట్టలేసుకుంటూ తింటారు తెలుసా ? .... నేను అప్పుడప్పుడు సీతని చూడ్డానికని వాళ్ళ ఇంటివేపు వెళ్తూ పుంటానులే. వాళ్ళ ఇంటిపుందు పుల్లిచెట్టు లేదూ ? పై కొమ్మల్లో ఏచ్చుంటే సీత పెట్లో పక్కడ తిరిగినా కనబడ్తూతో వుంటుంది. లక్ష్మీ ణుడు రుషులికి — హింస పుక్కిలు కొచ్చి పెట్టడం చాలాసార్లు చూశాను. తెలుసా ?"

"అలాగా ? — పోనీలే. వాళ్ళ చేతులతో వాళ్ళు చంపరుకదా ? వాళ్ళు వొచ్చినా దాక్కోనక్కరలేదుగా ? అది కొంచెం నయంకాదూ ? — ఈ నల్లవాడు మరీ పిచ్చికని. ఆకులు మాసిపోసినట్టు మాసి పోనీ స్తాడు పిట్టల్నీ జంతువుల్నీ...."

"అవునమ్మా ! నా బిడ్డని ఈ పాపిష్టివాడే పొట్టన పెట్టుకున్నాడు. పీడికి పోయేకాలం రాసూ ! . పీడు కొట్టిన బాణం నా బిడ్డ గుండెకి తగిలి ఎగరేసుకు పోయింది. పిల్లాడు మళ్ళీ నా కంట బడలేదు ... పీడికి నా వుసురెప్పుడు తగులుతుందోగానీ ..."

"ఊరుకోవమ్మా ! వూరుకో ! .... ఏం చేస్తాం ? పుట్టినప్పట్నించీ

చూస్తున్నాం. పిట్టలేవిటి ? మనుషు లేవిటి ? ఎవరి పొట్టకి వాళ్లు తాప త్రయపడతారు. తప్పదు."

"పొట్టకే అనుకున్నావా ? పీడనలు ఆటకే చంపుతాడు."

"ష్ ! వూరుకోండి ! .... పున చెట్టుకిందకే వొస్తున్నాడు. ఇంక కోసమో, దేనికోసమో, పాట వేస్తున్నాడు."

"ఆ కళ్లు చూడు. ఎలా చిట్లించి చూస్తాడో !"

"ఇక్కడికి రానిచ్చి రెట్ట వెయ్యనా మీద ?"

"చాల్లే ! ప్రాణాలమీదికి తెచ్చేట్టున్నావు. వేటగాడితో ఆట లేవిటి ?"

అంతా నిశ్శబ్దం ! రాముడు చెట్టు కిందకి వొచ్చాడు. చెట్టు — "ఇక్కడెవరూలేరు. ఇంకెక్కడికన్నా పెళ్ళు" — అన్నట్టు రాముడి వ్యవహారం తనకేం పట్టనట్టు నించుంది.

రాముడు చెట్టుకింద నిలబడి కళ్లు చిట్లించి చుట్టూ చూస్తున్నాడు, ఆశ్చర్య పడుతున్నాడు. ఎంతో స్పష్టంగా కనబడిందే ! మెరుపులా తప్పుకుపోయింది. ఈ పొదలో జొరబడి, ఆ పొదలో తేలుతుంది. ఈ చెట్టుకింద నిలబడి, ఆ చెట్టుకింద కనబడుతుంది. దీని అంతు తేల్చక వదలను. ఎవరనుకుందో ! శ్రీరాముడనుకుందో — శ్రీరాముడు కాదనుకుందో ! పక్క పొదలోంచి కుందేలుపిల్ల బయటికి దూకబోతే వాళ్ళమ్మ వెనక్కిలాగి చావగొట్టి చెవులు మూసింది — "ఇందాకట్నించీ చెబుతున్నానా కదల్లొద్దనీ ! వెధవ అల్లరీ నువ్వూనూ. నీకు పరుగు వొచ్చిందగ్గిర్నించీ భస్తున్నాను నీతో. అదుగో ! చూసు ! ఆ బాణాల వాడు ..... ఏం కనబడ్డాడా ?"

కుందేలుపిల్ల పొద కంతలోంచి రాముణ్ణి చూసింది. భయంగా వాళ్ళమ్మకి ఎంచుకుని — "ఎంత నల్లగావుందో ! దెయ్యమేనా ?" అని బిక్కమొహం పెట్టింది.

"ఛీ ! వెధవ పాటలు. ఎక్కడ నేర్చుకుంటున్నావు ? మీ నాన్న చెప్పే వెధవ కథలన్నీ నమ్మకు. ఏదో నరకాకి చెబుతాడు, దెయ్యాలూ

భూతాలా వుండవు. మనుషులే వుంటాయి. ఇన్నాళ్ళనుంచీ వొక్క చెయ్యినీ చూడలేదు. మనుషుల్ని చూశాసుగానీ. తెలిసిందా ?" — అని కసిరింది వాళ్ళమ్మ.

పిండేలు పిల్లకుండ తలవూపి కంతిల్లోంచి మళ్ళీ చూసింది. రాముడి చేతిలో బాణాల్నీ, విల్లూ చూసింది. — "అమ్మా ! ఎల్లాంటివి నాకూ కావాలే ! నే నాడుకుంటానే !" — అని వాళ్ళమ్మని బాదుతూ రాగం మొదలెట్టింది.

పొదలో ఎలికిడికి రాముడు చటుచూసి బాణం ఎక్కుపెట్టాడు.

పిండేలు గజగజ వొణుకుతూ "పడుకో, పడుకో, చంపేస్తాడు, చంపేస్తాడు" — అంటూ పిల్లనోరు మూసి నేల కంటుకు పడుకుంది.

రాముడు కళ్ళు చిట్లించి, దూరంగా ఎలికిడి పని కొంచెం గురి చూర్చి ఇంకో వేపుకి బాణం వొదిలాడు. అది రయ్యిన కొమ్మల్లోంచి చూసుకుపోగానే, కెవ్వున లేడి కేక చెడవంతా ఆక్రమించింది.

కుందేలుపిల్ల మురిసిపోతూ — "ఎంత బాగుందోనే ఆట ! అమ్మా, అల్లాంటి పుల్లలు నాకూ కావాలే" అని మళ్ళీ పట్టు కుంది రాగం.

ఆపూటకి చావు తప్పిందని వాళ్ళమ్మ నీరసంగా సిట్టూర్చింది.

* * *

రాముడు చుట్టూ పరికిస్తూ ఆలోచిస్తూ నడుస్తున్నాడు. లక్ష్మణుడు తన్నుకొచ్చే ఎయింది. మారీచుడు చావబోతూ నిజ స్వరూపం చూపించాడు. "సీతా ! లక్ష్మణా ! .... రక్షించండి .... రక్షించండి" అని అరిచాడే నా కంఠంవంటి కంఠంతో. నేను ఆనస్థానంలో నివసిస్తూ

వున్నందుకే ఈ రాక్షసులకు నామీద విరోధం కలిగింది. * నాకు ఏ ని కలిగించాలనేసుమా ఈ పన్నాగం .... మారీచుడి కేకలు విని సీతా, లక్ష్మణుడూ చాలా భయపడి వుంటారు. సీత నాకోసం వెళ్ళమంటుం దేమో లక్ష్మణుణ్ణి ? • వస్తాడా లక్ష్మణుడు నా ఆజ్ఞ మీరి ? అంత స్వతంత్రించుతాడా ? ఎన్నడూ చెయ్యడు .... సీత క్షేమంగా వుందో లేదో....! .. ఏంత బలిసిందో ఆ జింక ! .... దాన్ని వదలకూడదు".

— రాముడి మనసంతా సీత క్షేమంమీదనించి ఆ బలిసిన జంతువు తొడలమీదకి తిరిగింది. బాణం ఎక్కుపెట్టి దాని వెంటపడాడు. చుట్టు పక్కల జంతువులన్నీ ప్రాణభయంతో అరుస్తూ చెల్లా చెదురుగా పరుగు లెత్తాయి.

నక్కలు రాముణ్ణి చూసి సంతోషంగా ఏడ్చాయి. రాముడు జంతు వుల్ని చంపి కొన్ని భాగాలు మాత్రం పట్టుకుపోతాడు. తర్వాత నక్కలు సంతోషంగా విందు చేసుకుంటాయి.

రాముడు తరుముతోనే వున్నాడు — జింకని.

---

* 57 వ సర్గలో — 9 వ శ్లోకం.

"జనస్థానములో నివసించు నిమి త్తములచే రాక్షసులతో నాకు వైరము కలిగినది" — అనుకుంటున్నాడు రాముడు.

శూర్పణఖ విషయంతో తనకేం సంబంధం లేనట్టు వ్యవహారం.

• 57 వ సర్గలో — 5, 6 శ్లోకాలు.

"మారీచుడి కేకలు సీతా, లక్ష్మణుడూ కూడా విన్నట్టయితే, అది నా కంఠమే అని తలచి లక్ష్మణుడు సీతచే పంపబడి శీఘ్రముగా నా వద్దకు వచ్చును" — అనుకుంటున్నాడు రాముడు.

తన కంఠస్వరంలాగే వున్న కేకలు విని సీత భయపడడం — లక్ష్మణుడు రావడం చాలా సహజంగానే తోస్తోంది రాముడి మనసుకి.

కానీ అలాగే జరిగితే మాత్రం వూరుకోడు.

చివరికి ఆ జింక భయంతో వొక పొదలో చిక్కుకుని తప్పుకో లేకపోయింది. రాముడు దాని వ్యవహారం ముగించి, గబగబా మాంసం కండలు కోసి ఆకుల్లో చుటబెట్టి * అది లేముకు బయల్దేరాడు — "బాగా కొవ్వు పట్టింది. ఎంత రుచో ఇంత కొవ్వితే ! .. పెళ్ళగానే ఈ కార్యం ముక్కలు కాల్చుకునాలి సీతని. .....సీత క్షేమంగా వుందా అనలు ? .. అదేమిటి నక్కలు కూస్తున్నాయి ? ఆశ్చర్యంగా వుందే ! .... అపుధానికి గాకపోతే నక్కలెందుకు కూస్తాయి ? ... సీత ఇంకెక్కడ క్షేమంగా వుంటుంది ! .. రాక్షసుడి కేకల కేమిటి ? ఆశ్చర్యం లేదు. ఈ నక్క ఏడుపులేమిటి ? ముక్కలి వింతగా వుంది. చక్కని పిరుదులు గల సీత .... అయ్యో ! ఈ పక్షులు ఎడంవేపునించి ఎగుస్తున్నాయేమిటి ?

ఎదురుగా లక్ష్మణుడు అంగలేసుకుంటూ వొస్తున్నాడు. రాముడు నిర్ఘాంతపోయి చూస్తున్నాడు. ఏమిటీ ? ఇతను నా ఆజ్ఞ ధిక్కరించాడే ! .... భాతృవాక్య పరిపాలనా వ్రతం వమ్ము చేశాడే ! .... ఎంత సాహసం ! ... నేను ఆశ్రమం కదలవొద్దని చెప్పానే !

అంగలేసుకుంటూ వొస్తోన్న లక్ష్మణుడు రాముడి సమీపానికి రాగానే విల్లమ్ములే వొంగి నడుంవొంచి వినయంగా నమస్కరించి దూరంగా నించున్నాడు.

---

* అరణ్యకాండలో — 44 వ సర్గలో 27 వ శ్లోకం.

"శ్రీరాముడు మారీచుని చంపి, దాని ధ్వనిని విని, ఇంకొక మృగమును చంపి దాని మాంసమును బుచ్చుకొని త్వరగా జనస్థానమున కభిముఖముగ బోయెను."

మారీచుడి కేకలవిని .... అక్కడ సీతకేమైనా ప్రమాదం జరిగిందేమోనని భయపడికూడా — మళ్ళీ జింకని తెలుపు, వేటాడి, చంపి, కోసి, మాంసం పట్టుకుని బయల్దేరాడు రాముడు —

"మంచివాడి బుద్ధి మాంసం దగ్గిర తెలుస్తుంది" అంటారు మునుండీ పెద్దలు.

రాముడు లక్ష్మణుణ్ణి నిష్ఠురాలు కురిపించే గాంభీర్యంతో చూస్తూ — "లక్ష్మణా ! .... ఆశ్రమం విడిచి వచ్చావే ! ఇంత నిందార్హమైన పని చెయ్యగలవని నే నెన్నడూ తలచలేదే ! * నా చుట్టూ ఏన్ని అపశకునాలో చూశావా ? నక్కలు కూస్తున్నాయి ఆశ్చర్యంగా. పడుతులు నన్ను చూసి వికృతంగా అరుస్తున్నాయి. ఎంతగా వుంది. ఇంకా సీత క్షేమంగా వుంటుందా ? నాకు విశ్వాసంలేదు. రాక్షసు లామెని చంపి తినేసి వుంటారు. అయ్యో ! చక్కని తొడలు గల సీత ...." అంటూ తల వాల్చి దుఃఖిస్తూ నడక సాగించాడు.

లక్ష్మణుడు కంగారుపడ్డాడు — సీతని రాక్షసులు తినెయ్యడ మేమిటి ? ఆశ్రమంలో క్షేమంగా వుందే ! — లక్ష్మణుడు కంగారుతో వెనకబడ్డాడు. తను ఆశ్రమం విడిచి వచ్చినందుకు అన్నగారికి చాలా కోపం వచ్చిందని అర్థమైంది. తన దోషం లేదని అన్నగారికి చెప్పుకోవాలని చేతులు కట్టుకుని గొంతు సరుకుంటూ నెమ్మదిగా, వినయంగా వెంట నడిచాడు — అన్నగారు మాటలాడగానే చెప్పుకోవాలని ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు.

లక్ష్మణుడు చెప్పేదానిమీద దృష్టి లేకుండా చెప్పుకుపోతున్నాడు రాముడు.

కుడిచేతిలో ధనుస్సు కొన్నె ఎడంచేతిలోకి మార్చుకుని గబగబా నడుచుకుంటూ — "లక్ష్మణా ! ఆ లేడి మాయలేడి సుమా ! నన్ను బహు దూరం తీసుకుపోయి నా వలుకు బాణం దెబ్బతో మారీచుడు చచ్చి నేల

---

* 57 వ సర్గలో 18½ శ్లోకం.

లక్ష్మణుడు రాగానే రాముడు కోపంగా — "అయ్యో ! ఆశ్రమం విడిచి వొచ్చావే !" అన్నాడు.

ఇక లక్ష్మణుడు ఎప్పటికి జవాబు చెప్పాడో చూడండి. లక్ష్మణుడు నోరుతెరిచి ఏమీ చెప్పకుండానే రాముడు .... నక్క వినయాల ఆధారంతో ఏవిధంగా వాపోతున్నాడో కూడా చూడండి.

రాముడు మనకి కొత్తగాదుగదా ?

కరిచాము .... అయ్యో : నా ఎడమకన్ను అదురుతోంది. * ఇంకెక్కడి సీత ? సందేహంలేదు. రాక్షసులు చంపేసి కమ్మగా తినేసి వుంటారు. ఆమెను రక్షించేవారెవరూ లేరు గదా ? నావంటి పుణ్యవీరుడికి భార్య అయిపోవాలా దీనురాలయిపోయింది సీత .... ఆమెని ఒంటరిగా చూసి .... రాక్షసులు చుట్టూ చేరి .... అవును. ఇంత అవకాశమే వారికి .... అయ్యో ! చక్కని సుందరాంగి నా సీత ....” పూర్తిచేసేలోనే వున్నాడు రాముడు.

— లక్ష్మణుడు తన చేతిలో హంసం దొన్నె అందుకోడేం ? ఇని ఆశ్చర్య పడిపోతున్నాడు — ఇతడు స్వతంత్రుడవుతున్నాడా ? దాస్యగుణం విడిచిపెడుతున్నాడా ?....

లక్ష్మణుడు స్వతంత్రించి తన ఆజ్ఞ మీరడం ఎంత దోషమో రుజువు కావడానికి తప్పకుండా సీత కేదన్నా జరిగితేనే సంతోషించేట్టున్నాడు రాముడు. ఒకవేళ ప్రస్తుతానికేమి జరక్కపోయినా అసలు తన ఆజ్ఞ మీరడంవల్ల ఎంత ఘోరం జరగవలసిందో .... అలా జరక్కపోతే ఎంత ప్రమాదం తప్పిపోయినట్లో .... విశదంగా వర్ణిస్తున్నాడు—

“.... సందేహంలేదు నాకిక. ఇంకెక్కడి సీత ? .... ఏ కృూర మృగాలో ... పీచబడి, చీల్చి చెండాడి....తినేసి వుంటాయి. అయ్యో : నాథుడు వుండికూడా ఎంత అనాథ అయిపోయిందో సీత !” అని వాపోతున్నాడు.

రాక్షసులు అంత మంచి అవకాశం చక్కగా వినియోగించుకున్నందుకు మెచ్చుకుంటోన్నట్టు — “... సీతని రాక్షసులందరూ కలిసి .... కాళ్ళూ చేతులూ విరిచి .... అవును .... పెడ విరిచి .... కమ్మగా రక్తం తాగి .... ముక్కలు ముక్కలుచేసి మంచుకునే వుంటారు. అయ్యో ! నా సీత .... నాకు ....”

---

* రాముడు పట్టాభిషేకానికి సిద్ధమైంది మొదలూ ఈ ఎడమకన్ను అదరడమే. ఒకరోజూ, రెండు రోజులూ కాదు. ఏడ్నెలుగు సంవత్సరాలు. ఎన్నెవరన్నా కాస్త ప్రత్యం చేసినా వాగుణ్ణి. పాపం వాళ్ళకే అదుపుతోనే వుంటాయి — పోకాళ్లో, గూడరో.

లక్ష్మణుడికి కంగారెక్కువయి పోతోంది. అన్నగారి దుఃఖం చూడలేక పోతున్నాడు. తను ఆశ్రమం విడిచి రావడం తప్పే అయిందేమో నని సందేహంలో పడిపోయాడు. తను వొచ్చేవరకూ వదినగారు క్షేమంగానే వుంది — ఆ తర్వాత నిజంగానే ఏమన్నా జరిగిందేమో : .... "అలా జరక్కూడదు, అలా జరక్కూడదు" — అని వెయ్యి దేవుళ్ళకు మొక్కాడు. అసలు సంగతి చెప్పాలని "అన్నగా... " అంటూ నోరు తెరవబోయాడు.

— "అయ్యో ! నా ఎడంభుజం అదురుతోంది" — అంటూ రాముడు ఎప్పుడూ బరువు మోసే అలవాటు లేక ఘడియకోసారి మారుస్తూ దొన్నె చేతులు మార్చుకుంటున్నాడు.

లక్ష్మణుడు చటుక్కున మాంసం దొన్నె అందుకుని — అంత సేపూ పరధ్యాన్నంలో పడిపోయి ఆ దొన్నె అన్నగారితో మోయించి నందుకు పశ్చాత్తాపంతో కుంచించుకుపోతున్నాడు.

రాముడు గాఢంగా నిట్టూర్పుమీద నిట్టూర్పు విడుస్తూ— "లక్ష్మణా : సీత నాతో ఘోరారణ్యాలకు వచ్చింది. రాజ్యభ్రష్టుణయి దుఃఖాల పాలయినా, సీత నన్ను వదలక నా దుఃఖమంతా తనూ అనుభవిస్తోంది. నన్నని నడుముగల సుందరాంగి నా సీత. సీతను విడిచి ఇంద్రపదవి కూడా కోరను సుమా ! * సీత నా ప్రాణాలకన్న మిన్న సుమా ! పితృ ఆజ్ఞ చొప్పున పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తానని వొచ్చాను. నా వాగ్దానం అబద్ధమైపోదుగదా ?" — అంటూ నిట్టూర్చి — "సీత కోసం నేను వెంటనే మరణించకుండా జీవించలేను సుమా : నువ్వు అయోధ్యకు పోక తప్పదు లక్ష్మణా : ఇక కైక వాంఛితం కలకాలం ఈడేరు

---

* 58 వ సర్గలో ... 5 వ శ్లోకం.

"లక్ష్మణా : సీతను విడిచి దేవాధిపత్యమునూ, భూపతీత్వమునూ గోరను" — అంటున్నాడు రాముడు.

భూపతీత్వంకోసం (రాజరికం కోసం) సీతను వదలుతాడో లేదో అందరికీ తెలిసిందే.

తుంది. నా తల్లే దురదృష్టవంతురాలవుతుంది. పుత్రుడు పోయి, మళ్ళీ రాజ్యంపోయి, దుఖ్ఖ సాగరంలో మునిగిపోతుంది. ఇక కైకకే అన్నీ దక్కుతాయి. నా తల్లి ఇక సవతి చెప్పుచేతల్లో బ్రతకవలసిందేగదా : .... మళ్ళీ ఎంత కష్టం సంభవించిందో నీ మూలంగా" అని మళ్ళీ నిట్టూర్చాడు.

లక్ష్మణుడి ఇంగితానికి రాముడిమీదా, లక్ష్మణుడిమీదా కూడా కోపం ముంచుకొచ్చేసింది. — "ఏవిటి వ్యవహారం ? — నోరు తెరవనివ్వడు మాట జొరబడనివ్వడు. నించోబెట్టి దులిపేస్తున్నాడు. అసలు ఎందుకొచ్చావో ఏమిటో మాట వినడేం ? అన్యాయంగా నింద మోపుతోంటే ఎంతసేపు నోరు మూసుకు వూరుకుంటావు ? ఎక్కడో అక్కడ సందు చేసుకుని కాస్త ధైర్యంగా జొరబడు. నీ పాడు నసుగుడు పాడుగానూ : ఎన్నేళ్లొచ్చినా బుద్ధి రాకుండా వుంది నీకు !" — అని ఛెడా మడా చివాట్లు పెట్టింది.

లక్ష్మణుడు ధైర్యంగానే మాట్లాడాలనుకున్నాడు.

"అన్నగా ....."

"లక్ష్మణా : సీత జీవించి వుంటేనే ఆశ్రమానికి పోతాను. లేకపోతే...." అంటూ రాముడు అంతవరకూ దుఖిస్తూ మందగమనంతో నడుస్తోన్న వాడల్లా ఆ నడక మాత్రం ఆపి ఒక చెట్టుకింద నించున్నాడు. "సీత చచ్చిపోయినట్టయితే ఇక్కడే .... ఈ చెట్టుకిందే .... ప్రాణాలు విడుస్తాను సుమా !" — "చూస్కో : నువ్వు నా ఆజ్ఞ మీరడంవల్ల ఎంత ప్రమాదం జరుగుతోందో !" అన్నట్టు చూశాడు. *

---

* 58 వ సకలో — 9 వ శ్లోకం.

"సీత జీవించి వుంటేనే ఆశ్రమానికి పోతాను .... లేకపోతే ప్రాణాలు విడుస్తాను."

అంటున్నాడు రాముడు. లక్ష్మణుడు నోరు తెరవనేలేదు. అసలేం జరిగిందో వినలేదు. ఇక్కడే చచ్చిపోతాట్ట.

లక్ష్మణుడు హడిలిపోయాడు. ఏమీ తోచక నడుం. ఇంకా కిందకి వొంచి నేలచూపులు ప్రారంభించాడు.

"సీత ఉందో లేదో అనలు వెళ్ళి చూస్తే తెలుస్తుందా ? ఇక్కడ కూర్చుంటే తెలుస్తుందా ? అబ్బ ! ఏం తిరకాసో నీ అన్నతో....."
— అని విసుక్కుంది ఇంగితం.

రాముడు వంగిన కొమ్మమీదికి తలవాల్చి — "లక్ష్మణా : ఆశ్రమానికి పోగానే సీత నవ్వుమొహంతో కనబడకపోతే సర్వనాశనమే నోయీ !" అంటూ కళ్ళు మూశాడు.

"హమ్మ ! ఆశ్రమానికి వస్తాడన్నమాట. ఇక ఇక్కణ్ణించి కదల్నే కదలడేమో అనుకున్నాను. కానీ .... అక్కడ సీత క్షేమంగా వుంటే సరి. లేకపోతే నీ ప్రాణాలు తోడేశాడన్నమాటే. వూఁ .... బెంబేలు పడిపోకు. ధైర్యంగా వుండు. నీ తప్పేవీ లేదు. నేను చెప్పినట్టు వింటే నువ్వెప్పుడో బాగుపడేవాడివి" — అని మళ్ళీ విసుక్కుంది ఇంగితం.

లక్ష్మణుడికి ఇంగితం చివాట్లు మహా ప్రసాదంలా వున్నాయి. వాటివల్లే కొంచెం ధైర్యం కూడుతోంది.

రాముడు కొమ్మమీదనించి హఠాత్తుగా తలెత్తి కళ్ళు తెరిచి — "లక్ష్మణా ! .... నిజం చెప్పు .... నిజం చెప్పు. సీత జీవించేవుందా ? .... నీ అజాగ్రత్తవల్ల రాక్షసులు తినేశారా ? అయ్యో ! నా ప్రియురాలికీ నాకూ ఎడబాటు కలిగింది. సత్యం. వియోగమే ఇది. సీతని నువ్వు రక్షిస్తావనే విశ్వాసంతో వచ్చానే ! .... సర్వనాశనం అయిపోయానే," — అనిమళ్ళీ పూర్తిగా కొమ్మమీదకి వాలాడు.

ఆ కొమ్మ వొణుకుతూ వాళ్ళమ్మతో — "అమ్మా : ఈ రాముడు చూడవే . .ఎంత బరువో ! నన్ను విసిగదీసేట్టున్నాడే ! .... చచ్చిపోతున్నానే !" — అంటూ ఏడిచింది.

కొమ్మ విరుగుతోందని చెట్టు గ్రహించుకుంది — "లేదమ్మా ! నీకేం భయంలేదు. నిన్ను నేను గట్టిగా పట్టుకున్నాను. కొంచెం ఓర్చుకో.

రామునికి చెంపలు కుట్టడానికి కండ చీమల్ని పంపిస్తాను. ధైర్యంగా ఎవరు వెళ్తారో చెప్పుగుతాను" — అని ఓదార్చింది కౌమ్మ వాళ్ళమ్మ.

చెట్టుచుట్టూ తిరుగుతోన్న చీమలు — "నే వెళ్తాను" "నే వెళ్తాను" — అంటూ ముందుకొచ్చాయి. రాముని వాసన కొమ్మ వెంట శర వేగంతో పాకుతున్నాయి.

రాముడు కళ్ళుమూసుకుని కొమ్మమీద వాలి వున్నాడు. లోపల ఆత్మ తొంచెం నలుగుతూ — ".... పోనీ లక్ష్మణుడు ఎందుకొచ్చాడో .... కొంచెం చెప్పరాచ్చ .... అబ్బే : నీకు చెప్పేపాటిదాన్ని కాదు. పూరికే ... వున్నాను .. పూరికే .... అంతే" — అంటూ అంతర్ధాన మైంది.

చెంపకి తేలు కుట్టినట్టు ఎగిరిపడ్డాడు రాముడు. చెంప రుద్దు కున్నాడు. గంభీరంగా పీపూ, చంకలూ దులుపుకున్నాడు. — ఆ పోరా బంలో నాలుగయిదు కండచీమలు వీరమరణం చెందాయి.

రాముడు కొమ్మవేపు చూశాడు. తెలివయిన సేనాధిపతి యుద్ధారంభం విన్నినట్టు — కొమ్మ పొడుగునా సైనికుల బారులమల్లే చీమల బారులు : రాముడు గబగబా చెట్టుకిందకించి బయటికి నడిచాడు.

రాముడి ఎడంచెంపమీద కప్పపిల్ల మల్లే దద్దురు తేలింది. ఆ సంగతి కప్పపిల్ల లక్ష్మణుడికి కనపడలేదు. రాముడికి చీమలమీద కోపం, ఎప్పుడో అంతర్ధానమైపోయిన ఆత్మ మొదకి తిరిగింది. — "లక్ష్మణుడు చెప్పేది వినాలా ? .... ఏం వినాలి : .... ఎందుకు వినాలి ? .... నా ఆజ్ఞ మీరాడు. అంతే. ఇంకేం వినాలి ? .... అని కేకలేశాడు. — లక్ష్మణుడ్ని రౌద్రంగా చూస్తూ — "ఆ రాక్షసుడి కేకలువిని సీత భయ

పడి నిన్ను పంపి వుంటుంది. లంతేకదా ? ఇంకేం చెబుతావు నువ్వు మాత్రం ? * ఎంత దుష్కార్యం చేశావోయీ : ఖరుణ్ణి చంపినప్పటి నుంచీ నాకు రాక్షసులతో ప్రత్యక్ష వైరం మొదలయింది. నా శత్రువులు నాకు తిరిగి అపకారం చెయ్యడానికి చక్కగా వీలు కలిగించావు. • అయ్యో ! నా హృదయంలో ఎడమ పార్శ్వం అదురుతోంది. ఎన్ని కష్టాలలో పడిగిపోయానో ! ఇప్పుడు నేనేం చెయ్యగలను ? కార్యం చెడిపోయింది. అనుభవించవలసిందే గదా ?" — అంటూ నిష్ఠూరంగా లక్ష్మణుణ్ణి చూసి, నడక ప్రారంభించాడు.

---

*58 వ సర్గలో — 13, 14 శ్లోకాలు.

రాముడు లక్ష్మణుడితో అంటున్నాడు.

"మారీచుని కేకలు విని సీత భయపడి వుండును. బహుశా ఆమె నిన్ను పంపివుండును. బహుశా నీవు వచ్చి వుందువు. అని నేను వూహించుచున్నాను."

ఇంత వూహించినవాడు సీత కేమైందో వూహించరాదా ? — బహుశా తెలిసి వుండదు.

భార్యా వియోగం గురించి చక్కగా దుఃఖించాలని రాముడికి చాలా వుత్సాహంగా వున్నట్టుంది. తీరా ఆశ్రమానికి వెళ్ళేప్పటికి సీత బాగానే వుంటే దుఃఖించడం కుదరదు గాబట్టి .... ఈ లోపలే వైన వైనాలు దుఃఖిస్తున్నాడు.

• 58 వ సర్గలో 15 వ శ్లోకం.

"పాపులగు రాక్షసులు నాకు తిరిగి అపకారము చేయుటకు వీలు కలిగించినావు" అంటున్నాడు. తను జనస్థానంలో నివసించడంవల్ల ఖరుడు యుద్ధానికి వొచ్చాడనీ — తను ఖరుణ్ణి చంపడంవల్ల మళ్ళీ ఈ విధంగా సీతని చంపి అపకారం చేస్తారనీ రాముడి అభిప్రాయాలు.

— ఇంకో సంగతేవిటంటే — ఈ వైరం తనకీ రాక్షసులకే. లక్ష్మణుడికేం సంబంధం లేదు. అతడు దాసుడు, జరిగేదంతా యజమానికి సంబంధించిన వ్యవహారం.

అన్నగారి చీనత్వం చూస్తోంటే లక్ష్మణుడికి తప్పే చేశానని పూర్తిగా నమ్మకం కలిగింది. దుఃఖం ఆపుకోలేకపోయాడు — అక్కడ పడినగారు — వినలేని మాటలు — తాల్చిన శలాకలు చెవులకి అంటించినట్లు — "నీచుడా : నువ్వు అన్నగారి చావు కోరుతున్నావు. నా కోసం మంత్రాలు పన్ని మాపెంచి వచ్చావు" అన్నందుకే గుండె చుక్కలంలో ఈపిలాడుతోంది. — ఇక ఇప్పుడే దోషారోపణ — "నా ఆజ్ఞ ధిక్కరించావే : ఆశ్రమం ఎడిచి వచ్చావే !" — అని అన్నగారు నిర్దయగా దూషిస్తోంటే — లక్ష్మణుడు భరించలేక జలజల కన్నీళ్ళు రాలుస్తూ — అన్నగారి పాదాలకు నమస్కారం చేస్తూ "మన్నించండి అన్నగారా : మీ పవిత్రమైన పాదాలపై ఒట్టుపేసి చెబుతున్నాను నేను స్వతంత్రుణ్ణి కాను. నాకై నేనుగా మీ పవిత్ర మైన ఆజ్ఞ ధిక్కరించి ఇక్కడికి * రాలేదు. — "సీతా ! లక్ష్మణా : .... రక్షించండి .... రక్షించండి" అంటూ జాలి గొలిపే ఆర్తనాదాలు

---

* 59 వ సభలో — 5, 6 శ్లోకాలు.

"లక్ష్మణుడు పూర్వము సీత పలికిన పలుకులు విని దుఃఖాక్రాంతుడుగ నుండి ఇపుడు శ్రీరాముడు "నీవు అకృత్యము చేసితివి" అని చెప్పగా, విశేషముగ దుఃఖించినవాడై రామునితో నిట్టులనెను — "నేను నా స్వాతంత్ర్యముచే సీతను విడిచి ఇచటకు రాలేదు ....."

అదీ సంగతి. — లక్ష్మణుడు స్వతంత్రించాడా ? అన్నగారి ఆజ్ఞకి బద్ధుడయి వున్నాడా ? అన్నదే ఇక్కడి సమస్య.

హ్యూడర్ సంస్కృతిలో ఇది ఒక ముఖ్య విషయం. భార్యా, బిడ్డలూ, తమ్ముళ్ళూ, సేవకులూ, స్వతంత్రిస్తారేమోనని క్షణ క్షణం హడలు .... !

ధర్మాలతో, నీతులతో, వ్రతాలతో .... వాళ్ళ కాళ్ళూ చేతులూ, నోళ్ళూ కట్టెయ్యాలనే ప్రయత్నం.

వినిపించగానే వదినగారు మిక్కిలి భయపడిపోయారు. మీకు ఘోరమైన ప్రపూదం సంభవించి వుండుందని ఆమె మభ్యపడుతూ – "లక్ష్మణా : తొందరగా మీ అన్నగారి దగ్గరికి వెళ్ళు, వెళ్ళు" – అని తొందర పెట్టారు. – నేను మీ శౌర్య ధైర్యాల గురించి ఎంతగానో చెప్పాను.– "శ్రీరామచంద్రుడు దేవేంద్రుణ్ణయినా జయించగలడు కదా ? – నీచ రాక్షసుడి చేతిలో హతుడవుతాడా ? – ఆ కేకలు మా అన్నగారు పిల్చినవి కావు సుమా : రఘు వంశంలో బుట్టిన శ్రీరాముడు ఒక స్త్రీని రక్షించమని నీచంగా అడుగుతాడా ? ధైర్యంగా వుండంచి వదినగారూ : మా అన్నగారి కేమీ హాని జరగదు. మా అన్నగారిని యుద్ధంలో జయించేవారు ఇప్పటికి పుట్టలేదు. ఇకముందు పుట్టబోరు"– అని ఎన్ని విధాల చెప్పినా ...." – లక్ష్మణుడు నమస్కారం విప్పకుండా చెప్తూనే వున్నాడు.

రావుడి మొహం తామరాకులల్లే వికసిస్తూ .... వికసిస్తూ .... వికసిస్తూ .... వికసిస్తూ దాని కొలతలు కూడా దాటిపోయింది.

"..... వదినగారు నా మాటలు విశ్వసించనేలేదు. పైగా నా మీద ఎన్నెన్నో అభాండాలు వేసి...." – లక్ష్మణుడు బొంగురుపోతోన్న కంఠం సవరించుకుంటూ — "..... నేను ఆమెతో పొందుకే వచ్చాననీ "

తృళ్ళిపడ్డాడు రాముడు – "ఏమన్నదీ :"

లక్ష్మణుడు సిగ్గుపడిపోయాడు – "..... ఆ మాటలు నా నోట చెప్పలేను .... నేను మష్ట తలంపుతోనే మీవెంట వచ్చానట. ఆమె పొందుకోసమే నిరీక్షిస్తూ వున్నానట. – "నీచుడా : నీ మష్టత్వం ఇంత కాలానికి తెలిసింది. అన్నగార్ని రక్షించడానికి పోకుండా వున్నావు" – అంటూ వదినగారు దూషిస్తోంటే నేనిక నిలబడలేక వెంటనే బయలుదేరి వచ్చాను అన్నగారూ : .... నా దోషం వుంటే శిక్షించండి. మీ ఆజ్ఞ మీరే సాహసం చెయ్య...."

రామునికి చేసి వినిపించడంలేదు. సీత, లక్ష్మణుణ్ణి అంత మాట అన్నదా ? ఎందుచేత ఆని వుంటుంది ? పుత్తపుణ్యానికే ఆని వుంటుందా ? .... ఎప్పుడయినా .... ఈ దుష్టుడు .... ఆమెని .... ఏకాంతంలో .... లేకపోతే అంత మాట అంటుందా ? .... సీత ఎన్నడూ చెప్పలేదే తనకి ! .... తన ఆగ్రహానికి జంకిందా ? లక్ష్మణుడు దుశ్చింత గలవాడయితే .... సీత ఏన్నవన్నీ తనంత తనే విన్నవిస్తున్నాడే ! .... సీత చెప్పక ముందే తను చెప్పుకోవాలనా ? ....

రామునికి తల తిరుగుతోంది. లక్ష్మణుణ్ణి చూస్తోంటే కలబడి, కంఠం నొక్కి చంపెయ్యాలనిపిస్తోంది — "నిజం చెప్పు. దుర్మార్గుడా ! .... నా చాటున .... సీత నెప్పుడయినా .... వశం చేసుకోవాలని ప్రయత్నించావా ? .... అవును. ప్రయత్నించావు కదూ ? ..... ఆమె కొంగుపట్టి గుంజావు కదూ ?" — అని నిలదీసి అడగాలని మనసు పురకలు వేస్తోంది.

భూమి అదిరేట్టు అడుగులువేస్తూ నడుస్తున్నాడు. లక్ష్మణుడు వినయంగా పక్కన వొస్తూ — "ఈ దాసుడు స్వతంత్రించి మీ ఆజ్ఞ మీర ..... మీ పాదసేవ చేసుకు తరించడమే ఈ జన్మకు సార్థ ....." — అంటూ మాటలు మింగుతున్నాడు.

రాముడు రౌద్రంగా — "లక్ష్మణా ! నా ఆజ్ఞ మీరిందేగాక .... ఈ ప్రార్థనలూ, విన్నపాలూ ఎందుకు ? వ్యర్థమోయీ ! నా ధైర్య సాహసాలు నీకు తెలిసినవే గదా ! స్త్రీలు కోపంలో ఏదో అన్నారని .... వారికి మాని కలిగే విధంగా ప్రవర్తిస్తావా వివేకవంతుడు ? — సీత మాటలకు కోపం ఎందుకు కలిగింది నీకు ? — నా ఆజ్ఞ మీరి సీతను వొంటరిగా విడిచి వొచ్చావే ! ఎంత పొరపాటు ! నాకు సర్వ విధా

అన్యాయం చేశావే!" — అని నిప్పులు కురిపిస్తూ మందలించాడు. *

లక్ష్మణుడు ఖిన్నుడయి — ఆ మహా పతివ్రతకి, ఈ మహా వీరుడికీ మధ్య నలిగి — గుడ్డ నీడ గుడ్డ గుక్కుకుంటూ తల వంచుకున్నాడు. 'ఇంగితం' కూడా ఏమీ తోచక పళ్ళు నూరి వూరుకుంది. — నడుస్తోన్నంతసేపూ ఆశ్రమంలో సీత వుందో, లేదోనని లక్ష్మణుడి గుండే "వుందా? లేదా? — వుందా? లేదా? —" అని దడదడ కొట్టుకుంటోంది.

రాముడు ఆశ్రమానికి వెళ్ళేవరకూ తర్జన భర్జన పడుతోనే వున్నాడు. లక్ష్మణుణ్ణి వారకంట చూస్తోంటే — రాముడి ఆత్మ చీమ తలకాయంత చొరవచేసి — "లక్ష్మణుడిమీద అపోహ .... పొరపాటు

---

* 59 వ సర్గలో — 23, 24 శ్లోకాలు.

లక్ష్మణుడు అసలు సంగతంతా చెప్పింతర్వాత కూడా రాముడు — "నీ విషయములో నేను సంతోషించలేదు. సీత మాటలవల కోపమునకు వశమై నా యాజ్ఞ నుల్లంఘించితివి. నీవు లేని విధములలోనూ అన్యాయము చేసితివి" — అంటున్నాడు. —

అంటే చివరికి లక్ష్మణుడు తప్పు చేసినట్టు తేల్చాడు కవి. — తిట్టడం సీత తప్పు. తిట్టినా అన్నగారి ఆజ్ఞ మీరడం లక్ష్మణుడి తప్పు. రామునిది మాత్రం ఎన్నడూ ఏ తప్పూ లేదు.

పూర్చుడి కేకలు విన్నప్పుడే రాముడికి మిక్కిలి భయంకలిగింది. సీతకూడా మిక్కిలిభయపడి లక్ష్మణుణ్ణి తనకోసం పంపుతుందని రామునికి సహజంగానే అనిపించింది. — కానీ అలా వస్తే అది — ఆజ్ఞ మీరడం అయింది. — అలా రాకపోతే "అక్కడ నేను చచ్చినా అంతేనా? నన్ను రాక్షసులు ముక్క ముక్కలుచేసినా అంతేనా?....ఆ కేకలు నేను వేసినా నువ్వు కదిలేవాడివి కావుగదా?" — అని నిందించకుండా వూరుకోడు. ఏమో బాబూ! రాముడి మనస్తత్వం బయటపడుతోన్నకొద్దీ రావణుళ్ళా అయిపోతున్నాడు. "రామాంజనేయ యుద్ధం" — నాటకం రాసినట్టుగానే — రామునికీ, లక్ష్మణుడికీ వొకరిమీద వొకరికి కోపాలొచ్చే ఈ ఘట్టం పురస్కరించుకునే "రామ లక్ష్మణ యుద్ధం" రాయవచ్చును చక్కగా.

సుమా ! తొందరపాటు సుమా ! ... " — అని కొంచెం నసుగుతూ, జంకుతూ, బెదురుతూ గొణిగింది.

రాముడు కూడా తల పంకించి వూరుకున్నాడు.

"నా పాద సేవకుడే మరి .... విశ్వాసపాత్రుడే మరి .... స్త్రీలను నమ్మరాదు. మూర్ఖులు. చపల చిత్తులు. అన్యాయమైన నిందారోపణలు చేస్తారు. అంతే ... అంతే ...."

* * *

ఇల్లంతా చిందర వందరగా వుంది. దర్భాసనాలన్నీ ఇటూ అటూ పడగొట్టి వున్నాయి. పూలూ, పళ్ళూ నేలంతా జిమ్మి వున్నాయి. సీత ఎక్కడా లేదు. పెరట్లో మొక్కల్లోకూడా లేదు.

లక్ష్మణుడికి మతి పోయినట్టుగా వుంది.

రాముడు బాణాలు విడిచినట్టు ప్రశ్నలు గుప్పిస్తున్నాడు. — "సీతని రాక్షసు లెత్తుకుపోయారేమో ? చచ్చిపోయిందేమో ? భయపడి ఎక్కడయినా దాక్కుందేమో ? లేకపోతే, ఏ పూలయినా కోసుకోడానికి పోయిందేమో ! * స్నానానికి వెళ్ళిందా ? నీళ్ళు తేవడానికి వెళ్ళిందా ? బట్టలుతకడానికి వెళ్ళిందా ! ఆశ్రమం సప్తకోకుండా, తలుపు లయినా చేకవెయ్యకుండా వెళ్ళిందే !"

ఇద్దరూ ఇంటి చుట్టుపట్ల తిరుగుతూ "సీతా ! సీతా !"

"వదిన గారూ ! వదినగారూ !" అంటూ కేకలు వేశారు కొంతసేపు.

సీత కిష్కమైన చెట్లదగ్గిర చూశారు.

---

* 60 వ సర్గలో – 8, 9 శ్లోకాలు.

రామునికి సందేహాలు – "సీత పూలు కోయటకు పోయినదా ? జలపు తెచ్చుటకు పోయినదా ? స్నానమునకు పోయినదా ? ... ఎచటనయిన భయముతో దాగినదా ?" – చక చకంగా. "పరి రాక్షసులు తినే రాలో....మక్క మక్కలు చేసేశారో " అని గోల ఎందుకు లక్ష్మణుణ్ణి సాధించనానికి కాకపోతే ?

లక్ష్మణుడికి భయంగా వుంది. ఏవిటిది : నిజంగా ఏమైనా జరిగిందా ? .... అయ్యో ! వదినగారికి ప్రమాదం జరిగిందా ? తన దోషం వల్ల ...: తన అపరాధంవల్ల . వదినగారు ఆపదలో చిక్కుకున్నారా ? .... ఎంత ఘోరపాటు జరిగింది !

రాముడికి ఆశ్చర్యంగా వుంది ఎన్నడూ లేని విధంగా జరగలేదే ! .... ఎక్కడికీ సీత వంటరిగా పోయేది కాదే ! ... పొరపాటంతా లక్ష్మణుడిదే !— ఇప్పుడు సీత ఎట్లా కనబడుతుంది ?... వియోగమేనా ఇది ? .... సీతకూ, తనకూ ఎడబాటేనా ఇక ? — హా సీతా ! !

సర్వ శాస్త్రాలూ చదివిన రాముడు శృంగార శాస్త్రం కూడా చదివిన వాడే. ఇంతకాలమూ సంయోగ శృంగారమే గానీ, వియోగ శృంగారం చవిచూడలేక పోయాడు. వివాహమైంది మొదలూ సీత తనని అంటిపెట్టుకునే వుంది. ఇద్దరి మధ్యా వియోగమూ లేదు. విరహమూ లేదు. విరహ శృంగారమూ లేదు. — ఇప్పుడు ఇది నియోగమే.

• అరణ్యకాండలో 57 వ సర్గ నుంచీ రాముడికి పట్టాభిషేకం అయ్యి మనస్సు స్థిమితపడేవరకూ కిష్కింధకాండ మీదుగా — సుందరకాండ మీదుగా, యుద్ధకాండ మీదుగా — రాముడు సీతకోసం వియోగ శృంగారం అనుభవించే ఘట్టాలు కొల్లలుగా చూస్తాం.

వియోగం అంటే ఎడబాటు. స్త్రీ పురుషులిద్దరూ అనివార్యమైన కారణాలచేత విడిపోతారు. కానీ, ఎవ రెక్కడున్నారో ఇద్దరికీ తెలియాలి. కొంతకాలం తర్వాత తప్పకుండా కలిసే పరిస్థితి వుండాలి. ఎలాగా, ఎవ్వరికీ ఏ ప్రమాదమూ ముంచుకురాదనే విశ్వాసం వుండాలి. అలాంటి వియోగాన్ని, కష్టంగా అయినా విరహ శృంగారంలాగ అనుభవించ వచ్చును. కానీ — ఇక్కడ పరిస్థితి అదికాదు. సీత ఏమయి పోయిందో రామునికి తెలీదు. రాముడేమైపోయాడో సీతకి తెలీదు. (లేడిని తెస్తానని వెళ్ళినవాడు రానేలేదు. పైగా చావుకేకలు) — సీతని రాక్షసులు చంపేసి .... తినేసి ... జీర్ణం చేసేసుకున్నారని రాముడి గాఢ నమ్మకం. — అలాంటి స్థితిలో కవిగారు "విరహం" ఒలకబోస్తున్నారు.

రాముడు ఒక్క క్షణం ఆలోచించి వియోగ శృంగార లక్షణాలు గుర్తు తెచ్చుకున్నాడు.

ఎడబాటు కలిగిన ప్రేయసీ ప్రియులుగానీ, భార్యాభర్తలుగానీ, ఆ వియోగాన్ని పది రకాలుగా అనుభవించాలి. — అభిలాష – చిన్తా స్మరణము – సంకల్పము – గుణ వర్ణనము – ప్రద్వేషము – తాపము అభిమత త్యాగము – ఉన్మాదము – మోహ – మూర్ఛ – మూ .... ర్ఛ " ఎంత ఆలోచించినా ఆ పదో అవస్థ గుర్తు రావడంలేదు. మళ్ళీ మొదటినించీ .... "అభిలా ... మనస్సం .... .. సంకల్ప .... గుణ వర్ణ .... ప్రద్వేష్ ....." అంటూ గబగబా వల్లించాడు. ఈ సారి ఇంకా కొన్ని మర్చిపోయాడు. చివరిది గుర్తు రానేలేదు.

పోనీ మొదట ఈ తొమ్మిది అవస్థలూ అభినయిస్తూపుంటే ఆ పదోది ఎప్పటికి గుర్తు రాకపోతుందా అనుకున్నాడు.

మళ్ళీ ఒకసారి ప్రయత్నించి చూద్దామని ... కళ్ళు మూసుకుని — కొంచెం శాంతంగా — అభిలాషా – మనస్సంగమమూ – సంక ల్పమూ – ...." అంటూ యోగిలా జపం చేశాడు. చటుక్కున — మధ్యలోనే గుర్తొచ్చింది ఆ పదో అవస్థ – "మరణము .... మరణము – మరణము. చావును. మూర్ఛ తర్వాత మరణమే. తొమ్మిది రకాలుగా దుఃఖించినా ప్రియురాలు సమీపానికి రాకపోతే .... చివరికి మర ణించాలి. ఎక్కడ ప్రియురాలు ఎలా అలాగే మరణించాలి. కానీ, సీత ఈ శాస్త్రాలేవీ అంతగా చదువుకోలేదు. తను మాత్రం ఈ శాస్త్ర పదులన్నీ పాటించాడు. ఇప్పటికే .... కొన్ని అవస్థలలో కొంత కొంత భాగం శాస్త్రాల్లో చెప్పిన పద్ధతిలోనే పాటించాడు. సీత కోసం అభిలాష చూపించాడు. సీత గుణగణాలు చక్కగా వర్ణించాడు. సీతకోసం తన అభిమతాలన్నీ త్యాగం చేస్తానన్నాడు. ఎవోధ్యకే పోనన్నాడు ..... ఇప్పటికే మిగిలిన అవస్థలన్నీ పాటించాడు; శాస్త్ర పదులు నిర్దుష్టం చెయ్యబడినవి.

"హా : సీతా :" అని కేక పెట్టాడు గట్టిగా చేతులెత్తి.

అశ్రుగుండికి దుఃఖం ఆగడంలేదు. తన పొరపాటువల్లే ఇదంతా

జరిగించని పుధన పడిపోతున్నాడు. – వదినగార్ని శత్రువులు ఎక్కడికో తీసుకుపోయి వుంటారు. లేకపోతే పరిసరాల్లోనే ఏ గుహలోనో దాచి వుంటారు. తొందరగా వెదికితే దొరకవచ్చును.

అన్నగారి మోహం చూడడానికే సిగ్గుపడుతూ – తల వొంచి రాముడి పాదాలకు నమస్కరిస్తూ – "అన్నగారూ! మనం వెంటనే...." విన్నవించబోయాడు.•

రాముని – భార్యకోసం శోకంతో మోహాతిరేకంతో అచేతనాలను చేతనాలుగా భావించి వాటితో సంభాషించే అవస్థ అభినయిస్తున్నాడు – "ఓ కదంబ వృక్షమా! నీ పువ్వులు కొయ్యడానికి వొచ్చిందా సీత? ఓ అర్జున వృక్షమా! నీ పువ్వులపైన మిక్కిలి ప్రీతిగల సీతను ఎరుగుదువా? బిల్వ వృక్షమా! బిల్వ ఫలాలవంటి కొమ్ములుగల సీతను చూశావా? అయ్యో! ఎటు మర్రి చెట్టుకి తెలిసే వుంటుంది. చెప్పడం లేదే! అశోకమా! నా శోకం పోగొట్టవా? తాళ వృక్షమా? తాపి

• రామదాసులు రాముడి పక్షాన నిలబడి – "రాముడు సీత కోసం అడవులన్నీ ఎంతో శ్రద్ధగా గాలించాడు సుమా! కావాలంటే 60 పసర్గలో – ఆఖరి శ్లోకాలు చూడండి" అంటారు. ఆ శ్లోకాలు –

"శ్రీరాముడు అరణ్యములలోనూ, నదులలోనూ, కొండల లోనూ సెలయేళ్ళలోనూ, ప్రవేశించుటకు సాధ్యముగాని ప్రదేశములలోనూ పదే పదే తిరిగి సీత కొరకె గాలించెను" అంటున్నాయి.

– అంత శ్రద్ధగా, చక్కగా గాలిస్తే .... ఆశ్రమం సమీపంలోనే పడివున్న జటాయు వెందుకు కనిపించలేదు మొదట్లోనే? – వెదకడం మానేసి చక్కగా, వుత్సాహంగా శోకాలు పెడుతూ కూర్చోవడం అన్నమాట వియోగ శృంగారం అంటే. –

61 వ సర్గలో – ఆఖరిశ్లోకం చూడండి.

"లక్ష్మణుని పలుకులు లక్ష్యపెట్టక ... రాముడు "ఓ ప్రియురాలా!" అని మరియు మరియు గొంతెత్తి బిలుచుచుండెను."

లక్ష్మణుడు చెప్పింది వినేదీలేదు. వెతికేదీ లేదు. కొంత సేపటికి కవిగారే వెతికిపెడతారని రాముడికి తెలుసు.

పండ్లవంటి సనాలు గల నా భార్య .... మర్రి మొవలు వంటి తొడలు గల్గి నా సీత .... సంపెంగ వంటి ఛాయగల నా సీత....ఏం జరిగింది ? నిర్భయంగా చెప్పండి నాతో. భయపడకండి. మీ భయమే నే పోగొడతాను. నా దుఖం మీరు పోగొట్టండి."

"ఎన్నగారూ : ఆ పరిసరాలన్నీ గాంచాం. మీను కొంచెం తొందరగా ... దూరంగా...."

"ఓ మూధవీలతా : నా సీతని చూశావా ?" – అని రాముడు ఎడం పక్కకి తిరిగాడు. — "మల్లె తీగా : .... ఎర్రయిన పెదమలుగల సీత కనబడలేదా నీకు :" – అని కుడి పక్కకి తిరిగాడు. "సన్నజాజీ : .... నీవలె మృదువుగా వూగిసలాడే నడుములుగల సీతని చూడలేదా నువ్వు ?" అని ఆరాటపడుతూ అడిగాడు. అక్కడేవున్న మూధవీలత చూడని సీతని, అక్కడేవున్న మల్లెతీగ చూసిందేమోనని, అక్కడే వున్న మల్లెతీగ చూడని సీతని, అక్కడేవున్న సన్నజాజి చూసిందేమోనని.

అక్కడ గుబురుగావున్న మొక్కలన్నిటినీ కామ్మ కొమ్మనీ, తీగ తీగనీ, పేరు పేరునా అడుగుతూ నించున్నాడు.

రాముడి ఆత్మ కొంచెం జంకుతూ, బెదురుతూ "....మొక్కల్ని .... అడగడం .... ఎందుకూ ? .... చెప్పుతాయా ? పెతతాయా ? .... అబ్బే : .... మొక్కలెప్పుడూ .... మనతో మాట్లాడవు గదాని .... వూరికే .... సందేహంవొచ్చి ...." అనేసి సిగ్గుపడిపోయింది.

రాముడు కఠినంగా — "అవును. నీ కెప్పుడూ సందేహాలే : .... వియోగ శృంగారం ఇలాగే అనుభవించాలని శాస్త్రాల్లో రాశారు .... తెలీనట్టు నసుగుతావేం ? ముందు మొక్కల్ని అడగాలి. తర్వాత పిట్టల్ని – జంతువుల్ని అడగాలి. ఏనాడో పెద్దలు చెప్పినతర్వాత ఇక సందేహా లెందుకూ ? శాస్త్ర ధర్మాలు ధిక్కరించ మంటావా ఏమిటి నన్ను ?" – అని జగడానికి దిగాడు – ఆత్మతో.

"ఛ : ఛ : ఎంతమాట !.... అబ్బే ! నే నంటానా అంతమాట? ఛ ! .... పాపికే ...."

"లేకపోతే ఏవిటి ? నీకు సందేహం ఎందుకూ ?"

"అబ్బే ! ..... ఎప్పుడో పోయింది. పూర్తిగా పోయింది. అపుడు మరి .... శాస్త్రాలు చెప్పినట్టు నడవాలి గానీ .... అదుగో ! .... ఆ సంపెంగ పూలనడుగు. సీతని చూసే వుంటాయి" – అని రాముడికి సంపెంగపూలు చూపించి, తప్పుకుంది ఆత్మ.

రాముడు అటు చూశాడు. పసుపుపచ్చ సంపెగలు....వాళ్ళమ్మ వొళ్లో పూగుతున్నాయి: రాముడు ఒక పువ్వు వేపు చూశాడు.

– "సంపెంగ పుష్పమా ! నీ ఛాయా, సీత ఛాయా ఒకటే. సీతని రాక్షసులు కమ్మగా తినేశారు సుమా !"

'నిన్నుకూడా తినలేదే' అన్నట్టు చూశాడా పువ్వుని.

రాముడు అంత దీక్షగా చూస్తోంటే ఆ పువ్వుకి భయం వేసి – "అమ్మా ! .... రాముడు చూడవే. ఎలా జడిపిస్తున్నాడో !" – అని బావురుమంది.

రాముడు ఇంకో పువ్వు దగ్గిర నించున్నాడు.

లక్ష్మణుడు ఆతృతగా చుట్టూ చూస్తున్నాడు. హఠాత్తుగా సీత కనబడుతుందేమోనని.

రాముడు చూత, విప్ప, పనస కర్ణికార, బాదీన, కరక, లవంగ, పద్మిని, వావిలి చెట్ల నన్నింటినీ అడిగాడు.

అన్నీ ఊరుకున్నాయి.

మర్రిచెట్టు మీదకి పాకిన ఎర్రపూల తీగ మర్రితో గుసగుస లాడుతూ – "పాపం రాముడు దుఃఖపడుతున్నాడు. చెప్పేద్దామా ?" అంది.

"వద్దు. ఏలా విడిపిస్తాడో చూద్దాం సీతని. ఇంతవాణ్ణి, అంత వాణ్ణి" అని గొప్పలు చెప్పుకుంటాడుగా ?

"గొప్పలేవిటి ? వీరుడేగా ?"

"పీరుడయితే ఏమస్తాడేం ?"

"పాపం సీత సంగతి తెలిసే తెలీదుగా ?"

"తెలిసిపోతే తెలుసుకోదూ ? దేవుడేగా ?"

ఏవ్రహ్మలతీగ కొంచెం ఆలోచించి - "రాముడికోసం కామోసి - సీత కోసమన్నా చెప్పొద్దూ ? .... ఆ రావణుడు సీతని చంపేస్తాడో ఏమో...." అని భయపడింది.

"ఛ ! ఎందుకు చంపుతాడూ ? పెళ్ళి చేసుకోవాలని ఎత్తుకు పోయాడు గానీ .... చంపడానికయితే .. ఇక్కడికే చంపేవాడు కదూ ?"

"పెళ్ళేలా చేసుకుంటాడేం ? సీతకి భర్త వున్నాడుగా ?"

"ఏం వుంటే ? ఎవడు పీరుడయితే వాడే భర్త. అబ్బో ! .... ఇలాంటివి ఎన్ని చూశానో ! నీకేం తెలుసు ? నిన్నటిక మొన్న పుట్టావు...."

"నువ్వెప్పుడు పుట్టావేమిటి ?"

"నేనా ? .... పెద్దయ్యాక్ష్ణ దాటింది. నా కళ్ళముందు ఎంత ప్రపంచం మారిందో ! .... నా చిన్నతనంలో మనుషులు ఎంత నిర్మలంగా బ్రతికేవారు ! మా తాత చెప్పేవాడు. ఏ పాతివ్రత్యాలూ .... సింగినాదాలూ అప్పుడు లేనేలేవు తెలుసా ?"

"పాపం రాముడి పిట్టల్ని అడుగుతున్నాడు.... నాకు జాలేస్తోంది సుమా !"

రాముడు ఆకులపధ్య ఝుమ్మంటోన్న తుమ్మెదల్ని అడుగుతున్నాడు. — కొమ్మలపేపు చేతులుజాపి పక్షుల్ని అడుగుతున్నాడు. పక్షులు తొడ్రుపడి ఎగిరిపోతున్నాయి. - "లక్ష్మణా ! ఏ దిక్కులన్నీ,

రాక్షసులు సీతను తినేశారని చెప్పుకుంటూ వున్నట్టున్నాయి. చూడు." * అని లక్ష్మణుడికి చెప్పి రాముడు జింకల్ని అడుగుతున్నాడు. - "జింకా ! నీ కన్నులవంటి కన్నులుగల ప్రియురాలు నా సీత. లేడివలే బెదిరే, సుకుమారి నా సీత. మీ జింకల గుంపులో చేరి వుంటుంది. నీ నాథుడు వొచ్చాడని చెప్పవా సీతకి ?"

జింకలు భయంతో పరుగుదీస్తున్నాయి.

రాముడు ఏనుగుల్ని అడిగాడు - సీత తొడలు మీ తొండాల్లాగే వుంటాయన్నాడు. సీత మీ గుంపులోనే వుంటుందన్నాడు.

ఏనుగులకు బొత్తిగా వియోగ శృంగార శాస్త్రాలమీద గౌరవం వున్నట్టే లేదు. చెవులు టపటప కొట్టుకుంటూ రాముడి మాటలు చెవుల్లో జొరబడకముందే ఎగరగొట్టి నదివేపుకు దారితీశాయి.

"రాముడు రాజట కదూ ?"

"ఔను. ఇప్పుడు ఋషి వేషంలో వున్నాడుగానీ, రేపు రాజ్యానికి పోయాడంటే, మనల్నందర్నీ తోలించుకు పోతాడు, ఏనుగుల సైన్యం పెంచుకోడానికి"

---

* 62 వ సర్గలో - 9 వ శ్లోకం.

"ఈ జింకలగుంపు, నిశాచరులు సీతను భక్షించిరి అని చెప్పి నటులున్నది" - అంటున్నాడు రాముడు.

లన అభిప్రాయాలే, పక్షులూ, జంతువులూ, చెట్లూ, పుట్టలూ అన్నీ మాట్లాడతాయి అనుకుంటాడు. తను సంతోషంగా వుంటే - "రాముడికి శుభం" అనుకుంటాయి. తనకి రాజ్యం పోతే - "రాముడికి వనవాసమా ?" అనుకుంటాయి.

జింకలేవన్నా అభిప్రాయపడితే, "అయ్యో ! సీతని రావణు డెత్తుకుపోయాడే" - అని అభిప్రాయ పడతాయి. అది రాము డెలాగూ గ్రహించలేదు. - అంటే, ఏ సందర్భంలోనయినా పక్షులూ, జంతువులూ అనుకునేది వొకటీ - రాముడు వూహించుకునేది వొకటీ అని రుజువవుతోంది గదా ?

"అమ్మో ! రాజుల్ని నమ్మకూడదు. ఎంత ప్రమాదమో !"

"అ సమానూ యుద్ధాలే వాళ్ళకి. రాజూ రాజూ గుద్దుకునో, తన్నుకునో, పోట్లాడుకోరదూ ? బలవంతంగా మన్ని తీసుకుపోయి యుద్ధాలు చేయించుకుంటారు. ఛీ : ఎంత సిగుండదోగానీ...."

"అయ్యో ! వాళ్ళలాంటి మనుషుల్తోటీ హాయిగా యుద్ధాలు చేయించుకుంటారు. ఇక మనల్ని వదులుతారా ?"

"రేపట్నించీ రామునికి ఇంటిపేరు చెప్పుకుంటి. మనమీద కన్నెత్తి చూచే తోలించుకు పోతాడు. ఎందుకయినా మంచిది. కీడెంచి మేలెంచాలి" – అంది ఒక మునలి ఏనుగు.

"చెళ్ళం, చెళ్ళం" లని వొప్పుకున్నాయి అన్నీ.

సరిగా సరిపడకుండా గంతులేస్తోన్న పిల్లమనుషులతోటీ హాయిగా చెప్పాయి ఆ పెద్ద ఏనుగులు.

– "నలరుషి ఇంటిపేరు చెప్పుకుంటి. ఏం ?"

"ఏం చెప్తే .... ?"

"అమ్మో ! వాళ్ళ రాజ్యం తీసుకుపోతాడు."

"ఏం తీసుకుపోతే ?"

"అమ్మో ! యుద్ధాలు చేయించుకుంటాడు."

"ఏం చేయించుకుంటే ?"

"అమ్మో ! చచ్చిపోతాం."

"ఏం చచ్చిపోతే ?"

"ఏమోనన్నా ? మీతో రాగలే."

"అమ్మా ! మనం చక్కగా రామునితో వూరెళ్తామే .... చచ్చిపోదామే .... అమ్మా ! చచ్చిపోదామే . " అని ఏడుపు లంకించుకుంది వొక పిల్లమనిషి. వాళ్ళమ్మకి కోపంవచ్చి తొందరతో వొక్కటేసింది. పక్క ఏనుగులు – "అయ్యో ! దానికేం తెలుసు ? కుర్ర సన్నాసి. చాల్లే వూరుకో" – అని కోప్పడ్డాయి.

రాముడు దుఃఖిస్తూ పెద్ద పెద్ద ప్రమాణాల్ని అనుకుంటున్నాడు సీత గురించి.

చూపుడువేలుమీద చిలకపిల్ల వాళ్ళమ్మని — "అమ్మా! సీత చెప్పమందిగా రాముడితో! పాపం చాలా ఏడుస్తూ చెప్పిందిగా? — రాముడికి చెప్పవేం మరీ?" — అని విసిగించి చంపుతోంది.

చిలక కోపంగా — "ఇవ్వాళ ఆపద వచ్చిందని అట్లా ఏడుస్తూ చెప్పిందిగానీ .. రోజూ రాముడు బాణాలు వేసి మనల్ని చంపుతోంటే చూస్తూ వూరుకోడూ సీత? ఆ లేడి .... పాపం .... ఎంత అందంగా వుందీ! .... దాన్ని చంపి చర్మం తీసుకురమ్మని చెప్పలేదూ సీత? .... ఏడుస్తూ చెపితేమాత్రం మనకెందుకూ చాలి? .... రాముడు సీతని వెతుక్కుంటూ .... వెతుక్కుంటూ ఇక్కణ్ణించి పోతే చాలు. రేపట్నించీ మనం చక్కగా వుండొచ్చు" — అంది.

చిలకపిల్ల ఎర్రని ముక్కు గూబోంచి బయటికి పెట్టి — "రాముడూ! సీత సంగతి మాకు తెలుస్తుగానీ .... మేం చెప్పం. నువ్వే వెతుక్కోవాలోచ్!" — అని అరిచింది.

రాముడు విన్నాడేమోనని వాళ్ళమ్మ జడుసుకుని, పిల్లను తిట్టి రెక్కల్లో దాచుకుంది.

దూరంగా జింకలు పొదల్లో గుంపుగూడి ఆశ్చర్యంగా చెప్పుకుంటున్నాయి. — "చెట్లనీ, పుట్లనీ, రాళ్ళనీ, పిచికల్నీ, అడుగుతాడుగానీ .... రుషుల్ని అడగగల్డేం?"

"అసలు వాళ్ళయినా పిచ్చి, వాళ్ళు చూసిందంతా చెప్పరేం? ఇదెక్కడి చోద్యమయ్యా?" *

---

* "రాముడు సీత గురించి రుషుల్ని అడగడేం?" అనే ప్రశ్న జంతువులకయినా వస్తుందిగానీ మనుషులకు మాత్రం రాదు. ఆ దండకారణ్యం నిండా రుషులే. వాళ్ళు సీతని రావణు డెత్తుకుపోవడం చూశారు కూడాను. రాముడు అంత ఏడుస్తోంటే వొక్కరూ చెప్పరు — కథ అంతా కవిగారి ఇష్టాయిష్టాల ప్రకారమే నడుస్తుంది. నిరంకుశులయిన రాజుల కథలు రాసేప్పుడు కవులుకూడా నిరంకుశులే అయిపోతారు, చదివేవాళ్ళు మాత్రం క్రిములో, కీటకాలో అవుతారు. ఏంచెప్పినా నమ్మేస్తారు. ప్రశ్నించే ప్రశ్నే లేదు.

"వాళ్ళగోల మనకెందుకుగానీ .... ఇక రాముడి పీడ విరగడై పోతుంది మనకి. రుషులంతా రావణుడి పీడ వదిలించమంటారుగానీ.... అసలు రాముడే ...."

"అవును. నదిలో దిగి నీళ్ళు తాగడానికీ భయమే, చాలికాటీ పరిగెత్తి మేత మెయ్యడానికీ భయమే — ఎంత మూటిగా కొడతాడో బాణాలు !"

"మంచిమని అయ్యిందిలే ఇన్నాళ్ళకి."

లక్ష్మణుడికి గబగబా అడివంతా చెదికి ఏదో చెయ్యాలని ఆరాటంగా వుంది. రాముడు చెట్టు చెట్టు దగ్గిరా ఆగుతున్నాడు. పిట్ట ఎగురుతోందే దాన్ని అడుగుతున్నాడు — "సీతా ! నీ పలువరస ..... నీ ముక్కు .... నీ చెవులు .... నీ అధరాలు ...." — అంటున్నాడు.

"అన్నగారూ ! మనం తొందరగా....."

రాముడు వినిపించుకునే ధోరణిలో లేడు. "సీతా ! ఇంత అధికంగా పరిహాసం చెయ్యలేదే ఎన్నడూ ! దాగితేమాత్రం ఇంత జాగు చేస్తావా ? భరనికూడా వుపేక్ష చేస్తున్నావే ! .... లక్ష్మణా ! రాక్షసులు సీతకాళ్ళూ చేతులూ పంచుకుని తినేసి వుంటారోయీ !" .... అన్నగారూ ! ... నన్ను దండించండి. శిక్షించండి. శిక్షరుణీ, శిక్షరుణీ" — అంటూ బొటా బొటా కన్నీళ్ళు కార్చాడు లక్ష్మణుడు.

"నా ప్రియురాలి ముఖం ఎంత సుందరమైనది ! ఆమె ధరించిన కర్ణాభరణాలు ఎంత ధగధగ మెరిసేవి ! ఆ కంఠాభరణం.... ఆ రత్న హారాలు .... ఆ దండ కడియాలు.... అదిగో నా సీత ! ప్రియురాలా ! ఆగవేల ? .... వృక్షాలలో దాగినావే !" — అంటూ ఒక చెట్టు దగ్గిరికి పరిగెత్తాడు.

లక్ష్మణుడు రాముడి వెనకాల పరిగెత్తాడు.

రాముడు గిర్రున వెనక్కి తిరిగి — "లక్ష్మణా ! నా ప్రియురాలిని చూశావా !...." — అని లక్ష్మణుణ్ణి పట్టుకున్నాడు.

లక్ష్మణుడు దుఃఖంతో తలవంచుకున్నాడు.

రాముడికి పున్మాదావస్థ ఎప్పుడు అభినయించాలో కొంచెం సంకోచంగా వున్నప్పటికీ, సీతా వియోగాన్ని శృంగారపాత్ర సమ్మతంగా అనుభవిస్తున్నాననే సంతృప్తితో, వుద్వేగంతో తొందరగానే వున్మాదాపస్థలోకి దిగిపోయాడు — "ఎచటిగో ! నా ప్రియురాలు ! నా సీత ! .... హా ప్రేయసీ ! హా సీతా !...." అని కేకలు పెడుతూ చెట్టుచెట్టుకీ పరిగెడుతున్నాడు. రాముడు ఏ చెట్టుకింద కెళితే ఆ చెట్టుమీద పక్షులు గోలగోలగా లేస్తున్నాయి. చెల్లాచెదురవుతున్నాయి. ఏడుపులు ! కూతలు ! తిట్లు ! అరుపులు !

అన్నగారి స్థితి చూస్తే లక్ష్మణుడికి కళ్ళు రెండూ వూట బావుల మాదే నీళ్ళూరుతున్నాయి. అన్నగార్ని వదలలేక తనూ అన్నగారివెంట పరిగెడుతున్నాడు. అంతకన్నా ఏం చెయ్యాలో తోచడంలేదు. ముందు ఆశ్రమానికిపోయి అన్నగారికి నాలుగు మాంసం ముక్కలు కాల్చి పెట్టాలా ? .... వదినగార్ని చెతుకుతూ వెళ్ళిపోవడమేనా ? వెళ్ళవలసి వస్తే .... ఆశ్రమంలో వదినగారి నగలూ, చీరలూ .... వదిలెయ్యడమేనా ? — ఎటూ తోచక సతమతమవుతున్నాడు.

— "ఈ రకంగానే వెతకడం అయితే మీరు ఆశ్రమం దాటిపోయేది లేదులే. నగల గురించీ, చీరల గురించీ బెంగపడకు. ఇంటి వేపు ఓ కన్ను వేసే వుంచవచ్చును" — అంది ఇంగితం.

లక్ష్మణుడు వినిపించుకోలేదు.

అన్నగారితో సంభాషిస్తే ఏం చెయ్యాలో నిర్ణయించుకోవచ్చును. కాని, అన్నగారీ లోకంలో లేరు. దుఃఖసాగరంలో మునిగిపోయారు.

ఆలోచిస్తూ నించున్న లక్ష్మణుడు — రాముడు పరిగెత్తడం చూసి తనూ పరిగెత్తాడు .... కొంతసేపు పరుగులతో ఇంటిచుట్టూ, చెట్లచుట్టూ, గుట్టలచుట్టూ తిరిగారు. తిరిగి తిరిగి మళ్ళీ మొదటికొచ్చారు.

ఎండ మండుతోంది. సూర్యుడు నడినెత్తి కొచ్చాడు.

రాముడికి ఆకలితో .... పసుగులతో బలసటగా వుంది. * సీత అంతసేపు కనబడక పోయేసరికి రాముడికి కొంచెం కోపం ప్రారంభమైంది. లక్ష్మణుణ్ణి కోపంగా చూశాడు. "స్త్రీలు వొంటరిగా పోవచ్చునా? సీతని ఆశ్రమం వొదిలి పోవద్దని నువ్వు చెప్పలేదా?"

లక్ష్మణుడికి చెప్పినట్టు గుర్తులేదు. గజగజ వణికాడు.

హఠాత్తుగా రాముడికి విషాద శృంగారంలో ఒక అపస్వరం గుర్తొచ్చింది. — కొంచెం కఠినంగా — "సీతా : ఇక నీ పరిహాసం చాలు. క్రమంతప్పి వచ్చిన భర్తతో వివిధంగా ప్రవర్తించడం మానలేమ సుమా ! యమునుండే ఆశ్రమాల్లో .... ఇంత మితిమీరి భర్తతో పరిహాసాలాడడం పనియంగా, మర్యాదగా వుండదు. ఇక నీ ఆటలు చాలించి బయటికి రా !" — అని ఒక పొదని కేకలేశాడు.

పొద కదల్లేదు.

"పదినగారూ ! మేం వచ్చాం. మీకేం భయంలేదు. ఎక్కడైనా దాక్కొనివుంటే బయటికి వచ్చెయ్యండి" — అంటూ లక్ష్మణుడు దుఃఖంతో పూడుకొన్న కంఠం పెగుల్చుకుని శక్తికొద్దీ గావుకేక లేశాడు.

రాముడు విశాలమైన ఫాలభాగం కుంచించి, చిట్లించి — "సీతా: నీ పరిహాసం పూర్వం ప్రియంగా వుండేది. ఇప్పుడు రుచించడంలేదు సుమా :" — అంటూ ఆ చిట్లింపు మొహమంతా పాకనిచ్చాడు.

పొదని వదిలి — నాలుగడుగులు వేసి ఒక పర్వతం మీదు

---

* 58 వ సర్గలో — 19 వ శ్లోకం.
పాపం రాముడి ఆకలి బాగానే గ్రహించారు కవిగారు.
"దీనుడైయుండు లక్ష్మణుని నిందించుచూ .... ఆకలి .... శ్రమ .... దాహముచే .... నిట్టూర్పులు విడుచుచూ — ముఖము వాచి .... కాంతి హీనుడై రాముడు...." — అంటూ రాముడి కష్టం వర్ణించాడు.
రాముడి అవస్థ లేపి నేను కల్పించినవి కావు. ఆయన కల్పించుకున్నవే.

సించున్నాడు. దాన్ని గంభీరంగా అడిగాడు. "చెప్పు. సీతని చూశావా?"

పర్వతం అంత గంభీరంగానూ అడిగింది రాముణ్ణి —

— "చెప్పు. సీతని చూశావా?"

రాముడు రుద్రుడయ్యాడు — "ఏమిటీ? నాతో పరిహాసమా సీకు? నా చక్కని సీతని నా కవ్వగించక పోయావో .... కాచుకో, నా బాణముల దెబ్బలతో నిన్ను ముక్క ముక్కలుగా విడగొట్టేస్తాను. చెట్టూ, చేమా మొలవనివ్వకుండా చేసేస్తాను. గ్రహించావా?" సీతని చూపించు" — గర్జించాడు.

రాముడితోపాటే పుట్టాడంది పర్వతం. చిట్టచివర భీకరంగా — "సీతని చూపించు" అనే గర్జించింది రాముణ్ణి.

పర్వతంతో తలపడేప్పుడన్నా అన్నగార్ని చూసి బెదిరిపోయి లక్ష్మణుడు నమస్కరిస్తూ విన్నవించాడు. — "అన్నగారూ: శాంతించండి. మిమ్మల్ని పరిహసించడానికి పర్వతాని కెన్ని గుండెలు? దాని సహజ ధర్మంతో అది ప్రతిధ్వనిస్తోంది."

"అంతేనా లక్ష్మణా?"

"అంతే. అంతే. అంతే అన్నగారూ! అంతే."

రాముడు భీకరంగా అంగలువేస్తూ కొంతదూరం నడిచి గోదావరి ఒడ్డున నిలబడ్డాడు. — "గోదావరీ: అరిటి బోదెలవంటి తొడలుగల సీతే .... నిన్ను దర్శించడానికి వచ్చిందా? .... నీలో స్నానమాడిందా? .... తొందరగా చెప్పు" — అని చేతులుచాపి అడిగాడు.

ఆటలో పసిగిపోయిన బాలికలపల్లే గోదావరి — తీరం పొడుగునా ఎప్పటికప్పుడు కెరటాలలోకి రాలిపడుతోన్న పూలని పదుదు లాపుతూ, పురిసిపోతూ వాటితో కబుర్లాడుతూ తన్మయత్వంతో రాముణ్ణి చూడకుండా వుండలేక పోతోంది.

రాముడు వుగ్రుడయ్యాడు — "లక్ష్మణా: ఈనది గర్వంతో పలకకుండా వుంది. నా బాణముల దెబ్బలతో ఈ నదిని ఇంకిస్తాను సుమా!"

"శాంతించండి అన్నగారూ: గోదావరిని కరుణించండి. ఈ వేనురాలు మీతో సంభాషించడానికే భయపడుతోంది."

"అంతేనా లక్ష్మణా !"

"అంతే. అంతే. అంతే అన్నగారూ ! అంతే."

— లక్ష్మణుడి ఇంగితానికి నోళ్ళు మూతపడిపోతోంది — కాస్త ఓర్చుకోవాలని చూసిందిగానీ .... ఇక ఓర్చుకోలేక పళ్ళు పటపటా కొరుకుతూ —

"మీ అన్నకి బుద్ధి లేకపోతే లేకపోయింది. నీకన్నా లేదూ ? .... ఇద్దరూ కలిసి ఆ సీతని పెడితేదేమన్నా వుందా ? లేదా ? — నీ అన్నకి వుగ్గుపాలనించీ ఆ సంస్కృత పుస్తకాల పెట్టి పెరవ కవిత్వం అలవాటయిపోయిందని నీకు తెలీదూ ? ఆయన అలాగే విరహ వేదనతో మెలికలు తిరుగుతూ వుంటాడు. సువ్వన్నా పోయి మాపంగా పెట్టకరాదూ ?" — అంటూ చివాట్లు పెట్టింది.

లక్ష్మణుడు నసుగుతూ — "మరి అన్నగార్ని వదలిపోతే .... భార్యా వియోగంతో మతి చలించివున్న స్థితిలో ...."

"మతి చలించిందా ? నీ మొహం చలించిందా ? మతి చలిస్తే ఆ కవిత్వం ఏపిటీ ? .... గతి తప్పకుండా, ప్రాస తప్పకుండా, చందో బద్ధంగా ...."

"అపునపుకో. అపునపుకో. అపునుగానీ...."

ఎండ మండుతోందేమో రాముడు చెట్టు నీడలోకి తప్పుకుని కళ్ళు చిట్లించి చూస్తూ సూర్యుణ్ణి అపుగపుతున్నాడు సీత గురించి. ఏయ్యన గారి వీర్తనే గాలిని అడిగాడు సీత జాడలు.

"అన్నగారూ : మనం రెండడుగా...."

రాముడు మందగమనంతో సాగుతూ నిట్టూర్చి — "లక్ష్మణా ! ఈ పూల పొద చూసి .... ఎత్తయిన రక్ష తిన్నెలు చూసి. ఇక్కడేకదా సీత నా సరసన చేరువుని నీతో మాట్లాడింది" — అని ఆ పొద వద్దిరించుకున్నాడు.

లక్ష్మణుడికి దుఃఖం ముంచుకొచ్చింది — అయ్యో ! ఇంకా ఆశ్రమ ప్రాంతాలే దాటలేదే ! ఇంత విశాలమయిన రక్ష హోరణ్యంలో .... ఎప్పటికి .... వదినగార్ని చూస్తాం !

"అన్నాగారూ ! .... తొందరగా వెత ...."

— "లక్ష్మణా : సీతను విడిచి నేను బ్రతకలేనోయీ :" — అని పనస చెట్టు మొదలుపేపూ, కొమ్మలపేపూ, తీక్షణంగా చూసి, మొదలుకు చేరబడి కూర్చున్నాడు.

లక్ష్మణుడు చేతులు కట్టుకుని వచ్చి ఎదరగా వంగున్నాడు.

"లక్ష్మణా : నేను తండ్రిగారి సన్నిధికే చేరతాను. అప్పుడు తండ్రిగారు కోపంతో — "దుష్టుడా : పదునాలుగు సంవత్సరాలు వన వాసం చేస్తానని నాకు వాగ్దానం చేసి, వాగ్దానం పూర్తిచెయ్యకుండానే వచ్చావు కదా : నువ్వు స్వతంత్రుడివి. పితృభక్తి లేనివాడివి. అబద్ధీకుడివి" అని దూషించ వచ్చును. — అయ్యో ! సీతా : నన్ను అసత్య వాదిని చేశావుగదా :" — అని తలవంచుకున్నాడు రాముడు.

లక్ష్మణుడు సాహసంచేసి వినయంగా — "అన్నగారూ : దుఃఖించి ప్రయోజనం లేదు. మీరు ధైర్యంగా వుండాలి. ఈ అడవి అంతా గుహలతో, పొదలతో నిండివుంది. వదినగారికి చెట్లన్నా, నదులన్నా ప్రాణం ... ఏ సరస్సులన్నా చూడాలని వెళ్ళి దారి తప్పారో...."

"ఏవిటీ ? .... సీత వంటరిగా తిరుగుతూ పుంటుందా ? ఏం? .... నేను లేనప్పుడు ఎప్పుడయినా వెళ్ళిందా :"

"లేదు. లేదు. ఎన్నడూ వెళ్ళలేదు. నేనే... సందేహించి .. "

"హా : . సందేహం ! .... ఇంకెక్కడి సీత ? కృత్రిమమృగాలో .... రాక్షసులో . "

"అన్నగారూ : నిరాశపడవద్దు. మీరు మహా వీరులు. మహా విషపు బిలిని అణిచి భూమి పొందలేదా ? అలాగే మీరు వదినగారు ఎక్కడవున్నా శోధించి .... సాధించి పొందగలరు. మనం తొందరగా ఈ అడవి నలుమూలలా వెదకాలి."

రాముడు అయోమయంగా చూశాడు. ఏవిటీ ? సీత నిజంగానే పోయిందా ఏవిటీ ? — దుఃఖిస్తే చాలదూ కవిత్వంతో ? — వెదకాలి కూడానా ? — దీర్ఘంగా నిట్టూర్చాడు. — అలసటతో, ఆకలితో కళ్ళు భూతలు పడుతున్నాయి. శరీరం నిద్రావస్థ కోరుతోంది. — "లక్ష్మణా !"

లన్నాడు బలవంతంగా కళ్ళు విప్పుదామా — "ఇక నువ్వు అయోధ్యకు తిరిగిపోవోయీ ! నేనిక్కడ కళ్ళు మూస్తాను. కోసలరాజ్యం భరతుడే పరిపాలించమన్నానని చెప్పు. తల్లి లంచర్ని గౌరవించమని శ్రీరాముడే ఆజ్ఞగా చెప్పు. నా కోసం నా తల్లి నిరీక్షిస్తూ వుంటుంది. చివరికి కైక కోరికే నెరవేరింది. హా కైకా !" అంటూ మూర్ఛిల్లాడు.

లక్ష్మణుడు కంగారు పడిపోయాడు — రాముడు శోకంతో ప్రాణాలు విడుస్తాడని. కైకమీద ద్రోహంతో మూర్ఛిల్లాడో, సీత మీద మోహంతో మూర్ఛిల్లాడో తెలీక తపన భపన పడుతూ లక్ష్మణుడు నెమ్మదిగా, పంగునే ఒవపల్లోంచి రహస్యంగా మార్చునే ఆవపల్లోకి పారిపోయాడు. ప్రాణం లేచివచ్చినట్లు అయింది. మిగిలిన సవ్వాలేదును కుంటున్నాడు. మూర్ఛలోంచి రాముడు తృళ్ళిపడుతూ కళ్ళు తెరిచాడు. లక్ష్మణుడు బంతిపుల్లే పగిరి పంగున్నాడు.

రాముడు — తనకి నిర్వహించిన సంగతి లక్ష్మణుడికి తెలిసిందేమో నని తికమకపడుతూ బలవంతంగా తెప్పరిల్లి నిర్వికల్పతో గంభీరంగా చూడాలని ప్రయత్నిస్తూ విఫలుడౌతున్నాడు.

లక్ష్మణుడు — తను కూర్చున్న సంగతి అన్నగారికి తెలిసి పోయిందేమోనని సిగ్గుపడిపోతూ పశ్చాత్తాపంతో —"అన్నగారిముందు కూర్చున్నానే !" — అని మధనపడిపోతున్నాడు.

రాముడు మూర్ఛావస్థలోంచి తొందరగానే శోకావస్థలోకి వచ్చాడు. — "లక్ష్మణా ! నావంటి దురదృష్టవంతు లెవరయినా వుంటారా ? — పూర్వజన్మంలో ఎన్ని పాపాలు చేశానో ! రాజ్యం పోయింది — తండ్రిపోయాడు — బంధు మిత్రులకు దూరమయ్యాను — కతినమైన పనవాసం గడుపుతున్నాను ... ఇప్పుడీ భార్యా వియోగం ! అయ్యో ! ఎన్ని కష్టాలో నాకు ! . కష్టం మీద కష్టం ! దుఃఖం మీద దుఃఖం !—

* పూర్వ జన్మంలో ఎన్ని పాపాలు చేశానో ! (పుటం 63 పంక్తిలో — 4 వ శ్లోకం.

రాముడుకూడా పూర్వజన్మంలో పాపాలుచేశానని చింతిస్తున్నాడు ఆ పాపాల గురించి ఇంకో పాఠ పీఠికలో వివరంగా చదువుతారు.)

న్నాను. అయోధ్య చేరినపుడు .... సీత గురించి జనక మహారాజు కేపుని చెప్పను ? సీత లేకుండా అంతఃపురంలో ఎలా ప్రవేశించను ?''

లక్ష్మణుడు తెల్లబోతూ చూశాడు.

''చచ్చిపోతానన్నాడు. అప్పగింతలు పెట్టాడు. ఇప్పుడీ అంత పురాల గోల ఎందుకంట : ... సీతని వెదకటం మానేసి....'' — అంది లక్ష్మణుడి ఇంగితం చిరాకుపడిపోతూ.

''లక్ష్మణా ! అయ్యో ! సీత లేకపోతే స్వర్గం మాత్రం ఎందుకు నాకు ?....'' అంటూ రాముడు తల వాల్చేశాడు. ''సీత రొమ్ములకు మంచి గంధం పూత పూసుకునేది. అయ్యో ! ఆ రొమ్ముల్ని చీలికలు చేసి ఏ రాక్షసుడో తింటూ వుంటాడా ? కాదు .... కాదు.''

లక్ష్మణుడు ధైర్యంచేసి — ''అన్నగారూ ! ధైర్యం వహించండి. వదినగారికి ఎవరు హాని కలిగించినా ఆ దుర్మార్గుల్ని మీరు చీల్చి చెండాడగలరు .... మహా శూరులు మీరు .... మనం వదినగార్ని అన్వేషిస్తూ అడవి అంతా .... తిరుగుదాం.''

• 63 వ సర్గలో — 8 వ శ్లోకం —

ఈ ఒక్క శ్లోకానికే తాత్పర్యం రాయలేమ నేషనాచార్యులుగారు. ''ఈ శ్లోకమున కర్థము స్పష్టముగనే యున్నది.'' అని రాసి వూరుకున్నారు.—చెప్పడం ఇష్టంలేకనే కావచ్చు. ఇదీ పండితుల నిజాయితీ.

ఈ శ్లోకం అర్థం — శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి అనువాదంలో — ''కుంకుమపువ్వు కలిసిన మంచిగంధం పూతకు తగినవీ, గుండ్రనివీ అయిన నా సీత శోణిత దగ్ధస్తనాలు (రక్తంతో తడిసిన స్తనాలు) ఏ రాక్షసుడో భక్షిస్తూ వుంటాడు'' — అని వుంది.

దీని అర్థం సంస్కృతం తెలిసిన ఒక మిత్రుణ్ణి అడిగితే—''అలా జరుగుతుందా? అలా జరుగుతుందని అనుకోను''— అని రాముడు సందేహిస్తున్నాడు—అని చెప్పారు. అందుచేత అదే అర్థం వచ్చేట్టు రాశాను.

ఇంత దుఃఖంలోకూడా సీత సనాలకు జరిగే ప్రమాదాన్ని కవి వర్ణించకుండా విడిచిపెట్టలేక పోయాడు.

"సీతా ! .... సీతా ! .... అయోధ్యా ! నాకిప్పుడు రాజ్యమెందుకు ? భోగ భాగ్యమెందుకు ?" .... అంటూ లేచాడు రాముడు.

* * *

గబ గబా కొంతదూరం నడిచారు.

దూరంగా — విరిగి పడివున్న రథం కనిపించింది. కంచర గాడిదలు చచ్చిపడివున్నాయి. రథ సారథి చచ్చిపోయి వున్నాడు. వీరులు ధరించే కవచం — రథంమీద వుండే గొడుగూ, ధనుస్సు, బాణాలూ.... అన్నీ చెల్లాచెదురుగా కనబడ్డాయి. అక్కడక్కడా నేలంతా రక్తంతో తడిసివుంది.

లక్ష్మణుడు నిర్ఘాంతపోతూ అన్నీ చూస్తున్నాడు.

"లక్ష్మణా ! సీతని తినాలని ఇద్దరు రాక్షసులు పోట్లాడివుంటారు. సీతని ముక్కా ముక్కలుచేసి తిని * పుంటారు" — అన్నాడు రాముడు ధైర్యంగా. చుట్టూ చూశాడు — "రాక్షసులు సీతని చంపుతోంటే వనదేవత లేంచేస్తున్నారు ? .... పోనీ ధర్మదేవత ఏం చేస్తోంది ? — నా కెంత అప్రియం చేయగలిగిన సమర్థు డెవ్వడు ? లోకాలన్నిటికీ ప్రభువనీ, పరాక్రమవంతుణ్ణీ అయిన నన్ను దేవతలందరూ అసమర్థునిగా భావించినట్టున్నారు. మే తని హృదయంగల • వాడిని ! సర్వ లోకాలకూ హితం కోరేవాడిని ! ఈ నదులూ, కొండలూ, సర్వ భూతాలూ నన్ను నిర్లక్ష్యం చేసి, నా శత్రువులకే సహాయం చేయాలని చూసు

---

* సీతని ముక్కా ముక్కలుగా వూహించు కుంటున్నాడు రాముడు. సీత అవయవాలన్నీ భేదించేవాడు రాముడే. రాక్షసులు కారు.

• 64 వ సర్గలో — $54\frac{1}{2}$, $55\frac{1}{2}$ శ్లోకాలు.

న్నాయి. లక్ష్మణా ! నా బాణాలతో లోకాలన్నీ కప్పి, ప్రాణుల సంచా రం ఆపేస్తాను నేను కోపంతో ఎర్రతామర చెలి వరహా లాగ ఎఱ్ఱి బాణం పడిలానో .. గ్రహాలన్నీ భీయంతో ఒక్కచోటే గుమిగూడ తాయి. నా బాణ నముద్రంలో సూర్యచంద్రులు కనపడకుండా పునిగి పోతారు. అగ్ని, వాయువూ కంపించి హరించిపోతారు.పర్వతాలన్నీ గజ గజ వణికి పూలపోతాయి. నముద్రాలూ, నరస్సులూ ఆవిరై ఇంకిపోతాయి. మహా వృక్షాలన్నీ ఫెళ్ళున విరిగి నేలకూలతాయి. నముద్రాలు కల్లోలమై నశించిపోతాయి. పక్షులూ, మృగాలూ, క్రిమికీటకాలూ నర్వనాశనం అయి పోతాయి.... నేను బాణం విడిచానంటేనా ?...."

లక్ష్మణుడికి ఆ ఎరిగిన రభం .... శవాలూ .... నెత్తురూ చూసి నప్పటినించీ చాలా ఆందోళనగా వుంది. తొందరగా పుండుకుపోతే ఇంక నమాచారం తెలుస్తుందని తృప్తిగా వుంది. రామునకు ఒక్క అడుగు కూడా ముందుకే పదిలేదు లేదు. ప్రేతాపాపస్తరో పునిగి వున్నాడు. లక్ష్మణుడు కొంచెం పుండుకు నడుస్తూ పరిసరాలు గాపిు న్నాడు.

"లక్ష్మణా !"

"చిత్తం : అన్నగారూ...." — వెనక్కి పరిగెత్తుకొచ్చాడు లక్ష్మణుడు.

"ఇదిగో : ఈ బాణం క్రోధంతో విడిచానంటేనా .... ఇది జగ తులో రాక్షసులే లేకుండా చేసేస్తాను. బహు నుందరమైన పెరుపులుగల నా సీతని నాకు తెచ్చి ఇవ్వకపోతేనా ... ? ఈ లోకాలకు నాథుడెవరో గానీ...." — ఆ కోపంలో లోకాలకి నాథుడు తనేనని మర్చిపోయాడు రాముడు.

"నా సీతని నాకు తెచ్చి ఇవ్వకపోతే ఈ లోకనాథుడు నా పరా క్రమం చవిచూస్తాడు. దేవతలు నా వీర్య ధైర్యాలు గ్రహించ లేకుండా వున్నారు. శ్రీరామ చంద్రుడంటే ఏవిటో అనుకుంటున్నారు. మృత్యువునీ, విధినీ ఎలా తప్పించుకోలేరో అలాగే నా క్రోధాగ్నిని కూడా తప్పించుకోలేరు. ఈ లోకాధిపతులు, రాక్షసులు తినేసిన నా

సీతను నాకు పెండ్లిచేసి ఇవ్వకపోతే లోకాలన్నీ * అస్తవ్యస్తం చేసేస్తాను. చరాచరా లన్నింటినీ నిర్వీర్యం చేసేస్తాను. జగాలన్నీ పుక్కిట పుక్కిలై, తునాతునకలై, దుమ్ములో, ధూళిలో కలిసిపోతాయి .. లక్ష్మణా ! చూచుకోమను. సర్వ భూతాల్నీ చూచుకోమను .... నా బాణా ప్రతాపాల్తో ."

"బుద్ధిపున్న వాగుడేనా ?" — అనేసింది లక్ష్మణుడి ఇంగితం. లక్ష్మణుడు హడిలిపోయి దిక్కులు చూశాడు. "నోటి కెంత వస్తే అంత మాటే !" — అన్నాడు కోపంగా ఇంగితంతో — "నోటి దురుసు తగ్గాలి సుమా నీకు. ఆయన హృదయం ఎంత బాధపడుతోందో నీకేం తెలుసుంది ? ఆయనేం తెలివితక్కువ వాడనుకుంటున్నావా ? ఎన్ని శాస్త్రాల్లో చదివినవాడు. ఎన్ని ధర్మాలో తెలిసినవాడు. ఆయన్ని తప్పు పట్టడం ఎంత తప్పు ! కాస్త నోరు సంభాళించుకుని మాట్లాడుతూ వుండు" అన్నాడు కోపంగా.

---

* 64 వ సర్గలో — 70, 71 శ్లోకాలు.

రాముడు లక్ష్మణుడితో అంటున్నాడు — "లోకాధిపతులు — అపహరించబడిన సీతను, లేక చచ్చిపోయిన సీతను .... అట్టి సౌందర్యముగల నా ప్రియురాలగు సీతను దెచ్చి ఈయక పోయినటులయితే.... చరాచరములతోనూడియుండుమూడులోకములనూ..ధ్వంసం..చేసేస్తాను"

అది సరే ! అట్టి సౌందర్యం అంటే ఎట్టి సౌందర్యం ? ఎత్తయిన పిరుదులూ .... తాళ ఫలములవంటి స్తనములూ వగైరా. — పాపం ఆ సీత కొంతకాలానికి బెంగతో, భయంతో చిక్కిపోయిందంటే — చిక్కిపోయిన సీతనిగాని తెచ్చారంటే — "అబ్బే ! కుదరదు. ఎత్తయిన పిరుదులుగల సీతని తెచ్చివ్వండి.... ఈ సీత నా సీత కాదు. నా సీతకి .... తాళ ఫలములవంటి రొమ్ములే వుండాలి" — అని పేచీ పెట్టేటట్టు కనబడుతున్నాడు రాముడు. సీత చిక్కిపోకుండా వుంటేనే దేవేంద్రుడికి మాట దక్కుతుంది.

ఇంగితం కొంచెం తప్పయిపోయినట్లు — "మని తొందరగా పెతకడేం : అంచుకని అన్నాసూ" అని సిగ్గుపడింది.

"పెతుక్కుంటాము. ఎందుకు పెతుక్కోడూ ? .... పెతుక్కోక ? .... ఆయనే పెతుక్కుంటాడు. పెతుక్కోడా ?" అని నచ్చిచెప్పుకుంటూ రాముడి మొహం ఎగాదిగా చూస్తున్నాడు లక్ష్మణుడు.

"లక్ష్మణా ! చూస్తావేమోయ్ ! సూర్య చంద్రులకి చెప్పు. కాచుకోమను. ఏ బాణం విడిచానంటేనా ...." రాముడు బాణంమాత్రం వదలడంలేదు.

కొత్తగా ప్రేమలోపడ్డ ఒక ఆడజింక ప్రియుడ్ని బేలగా చూస్తూ "రాముడు లోకాలన్నీ ధ్వంసం చేసేస్తానంటున్నాడే ! మనం విడిపోతామా ?" అని భయపడింది.

మొగజింక ఏమీ పట్టనట్టుగా చూస్తూ — "చెయ్యనీ : ధ్వంసం చెయ్యనీ : సూర్య చంద్రుల్ని పడగొట్టనీ : ఆకాశం బద్దలు చెయ్యనీ : .... ఎవ్వరూ మనల్ని వేరు చెయ్యలేరు. నిన్ను నేను రక్షిస్తాను" — అని ధైర్యం చెప్పాడు.

"అవును. మనం కలిసే చచ్చిపోదాం" — అని సంతోషంగా చూసింది ప్రియురాలు జింక.

"లక్ష్మణా : .... ఇదుగో ! .... పిడుస్తున్నాను" — అని గర్జించాడు రాముడు.

అన్నగారు కోపోద్రిక్తులయినప్పుడల్లా — ఆయన్ని శాంత పరచవలసిన కర్తవ్యం తనదని లక్ష్మణుడికి తెలుసు. లక్ష్మణుడు అన్న గారి పాదాలకు నమస్కరిస్తూ స్తోత్రం ప్రారంభించాడు.

— "తమరు ఎంత పరాక్రమవంతులే. జగత్తుని తల్లక్రిందులుగా మార్చెయ్యగలరు. — తమవంటి కరుణాత్ములు, ఆత్మ నిగ్రహులు — ఇంత క్రోధం వహించడం తగదు.

సూర్య చంద్రులకు శాంతి వొక్కటే సుగుణం. గాలికి గమనం మాత్రమే. భూమికి క్షమ ఒక్కటే. తమకు మాత్రం నమస్త సుగు

కొంచా కలిసి వున్నాయి. మహాత్ములయిన తమరే దుఃఖం భరించలేకపోతే ఇక సామాన్యులెంత ? ప్రపంచమంతా ఒకటే సిద్ధించింది.

వశిష్ఠుల వారి నూరుమంది పుత్రులూ, విశ్వామిత్రులవారు ఒక్కరోజునే చంపేశారు. ఆ మహానుభావుడు దుఃఖం ఓర్చుకోలేదా ? — వర్షాలు కురిపించే సూర్యుడూ, ఓషధులు పండించే ఎండ్రిన్‌మూ కూడా రాహువు పట్టి దుఃఖం పొందిచలంలేదా ? మాంధాతా, నలుడూ వంటి మహానుభావులంతా పై వ సంకల్పం మీకలేకపోయారుగదా ? దేవేంద్రుడికి కూడా సుఖ మిష్టాలున్నాయని పిలుస్తున్నాం కదా ? — తపస్సంటే జ్ఞానులూ, యోగులూ ఎప్పుడూ దుఃఖించరు. మన కర్మ వల్లనే మనం ఫలితం పొందుతాము. పూర్వజన్మలో మనం చేసిన పాప పుణ్యాలు 'ఇవీ' అని నిరూపణ చేయడానికి సాధ్యంకాదు. వాటి ఫలితం ప్రత్యక్షంగా చూడడానికి సాధ్యంకాదు. సుఖ దుఃఖాల * రూపంలో అనుభవించక తప్పదు. ఈ సత్యాలన్నీ నావంటి అల్పులకు తపసు బోధించినవే గదా !"

---

* 66 వ పుటలో 7 వ శ్లోకం, 16 వ శ్లోకం.

"ఈ మిశ్ర సంబంధము మనుజులకు పుట్టుకచేతనే కలిగినది — ప్రత్యక్షముగా కూడుటకు సాధ్యముగాని, సుఖ దుఃఖ రూపముగనుండు .... పూర్వజన్మములో నిట్టి కార్యములు చేసినటుల నిర్ధారణ జేయుటకు సాధ్యముగానివియు నగు కర్మములు చేయక, ఇట్టి సుఖ దుఃఖ రూపపుగు ఫలము గలుగదు." —

తెలిసిందిగదా ? చదండీ మరగి. కష్టాలూ, బాధలూ కించిత్ జన్మలోంచి వస్తాయి మనుషులకి. "ఫలానా తప్పు చేశాం" — అని మాత్రం స్పష్టంగా తెలీదు. సుఖ దుఃఖాల రూపంలో వుంటాయి ఫలితాలు. అంటే మనం బాగా డబ్బు వుండి, సుఖంగా వుంటే — "ఓహో ! చాలా పుణ్యం చేశాం" అనుకోవాలి. డబ్బులేక, కూడు లేక, గూడు లేక, ఆరోగ్యం లేక — ఇలాంటివాళ్ళు కనబడితే "వాళ్ళు పాపం చేశారు" అనుకోవాలి. మళ్ళీవాళ్ళా — "మేం పాపం చేశాం మరి — అదీ సంగతి" — అని తెలుసుకోవాలి.

రాముడి మొహం వికసించడం ప్రారంభించింది.

లక్ష్మణుడు మాటలాడుతూ పరధ్యానంగా వళ్ళోకితీసుకున్న చేతులు మళ్ళీ చప్పున రాముడి పాదాలమీద పెడుతూ — "కోసల మహారాజా : రాజులు అపరాధం చేసినవార్ని శిక్షించవలసిందే. చండించవలసిందే. సను సలోకాలకూ శిక్షకులూ, రక్షకులూ కూడా తమరే—కానీ ఒక దుర్మార్గుని అపరాధానికి లోకాలన్నీ సర్వనాశనం చేయడం ధర్మం కాదుగదా ? ముఖ్యంగా దేవతల్నీ, బ్రాహ్మణుల్నీ చంపకూడదు గదా ?— శ్రీరాముడు చంద్రుని భార్యకు ఆపద సంభవించినందుకు లోకంలో ఎవరుమాత్రం సంతోషిస్తారు ? తమ పరాక్రమం అంతా శత్రువులమీద మాత్రమే ప్రయోగించాలి. కొంతకాలం వేచి చూడమని ప్రార్థిస్తున్నాను. తమ సద్గుణాలచేతా, సాధువర్తనచేత కూడా వదినగార్ని పొందలేకపోతే ... అప్పుడు తమరు లోకాలన్నీ సర్వనాశనం... చెయ్యవచ్చును. సూర్యచంద్రుల్ని పడగొట్టి ...సముద్రాలు ఇంకించి .. పర్వతాలు విడగొట్టి.... అప్పుడు అప్పుడుతప్ప కుండా తమరు తలపెట్టిన కార్యం ముగించవచ్చును"అని వినయంతో అన్నగారి పాదాలు నిమిరి నమస్కారంచేశాడు.

లక్ష్మణుడి మాటలు గొప్పగా నచ్చాయి రాముడికి. అంతేగాక లక్ష్మణుడిమీద అపారమయిన ప్రేమ కూడా కలిగింది — ప్రస్తుతానికి సూర్యచంద్రుల్ని పడగొట్టి, సముద్రాలు ఇంకించి.... లోకాలన్నీ సర్వనాశనం చేసే బెడద తప్పించినందుకు. ఏదో వుద్రేకంలో అనేశాడేగానీ తీరా బాణం వదిలితే అది ఏ మిడతనో, వుడతనో చావగొట్టి, ఏ చెట్టు కొమ్మల్లోనో చిక్కుడి వూరుకుంటే .... ? పూర్వం బాణా లేసినప్పుడు

(ఫుట్‌నోట్ : 99 వ పేజీ తరువాయి)

రాములవారి గాథ చక్కగా కవనవులకు జ్ఞానబోధ చేసి చక్కగా వుద్ధరిస్తోంది.

ఎవరికయినా ఆకలి తీరక ఏడుపొస్తే — "అలనాడు శ్రీరాముచంద్రుడే కష్టాలు పడలేదా ?" — అని గుర్తు చేసుకుని వారి గాథ చదువుకుని, కడుపులో కాళ్ళొట్టుకు పడుకోవాలి.

చాలాసారు అలాగే జరిగింది. — కానీ, ... ఇంత తొందరగా విర
ుంచడమేనా ? .... ఇంత భీకరత్వమూ చాలించడమేనా ? .... కుద
రదు. కుదరదు.

"లక్ష్మణా : .... నీ మాటలు ధర్మబద్ధంగానే వున్నాయి. కానీ .... ఉదయించే సూర్యుడు, చల్లని చంద్రకాంతిని ధిక్కరించే విధంగా నా క్రోధం వృద్ధిపొందుతూ, నా సహజ స్వభావాన్నీ, మెత్తని గుణాల్నీ పడిపెడుతోందోయీ : ఈ లోకాలను నా ప్రతాపం చవిచూపక తప్పదు సుమా : .... ఇదిగో : బాణం .... చెవి వరకూ లాగి .... విడిచానంటే ... "

"శాంతించండి. శాంతించండి. ప్రభూ : .... కరుణించండి. లోకాలన్నింటినీ సర్వనాశనం చేసే .... నాబాణం ఉపసంహరించండి .... ఇంద్రుడు సీతాదేవిని తెచ్చి మీ పాదాలముందు సమర్పించకపోతే .... అప్పుడు .... తప్పకుండా .... అప్పుడు.... శాంతించండి ప్రభూ :"
— లక్ష్మణుడు గజగజ వణుకుతూ వంగున్నాడు.

రాముడు గంభీరంగా తల పంకించి .... విల్లు విసాడు. లక్ష్మ
ణుడి విన్నపం మన్నించి మాత్రమే శాంతించినట్లు, రౌద్రంగా చూశాడు.
— "నువ్వు చెప్పింది ధర్మమే లక్ష్మణా : నా కార్యం ఉప సంహా
రించాను. ఇక భయపడకు" — అని చుట్టూ చూసి — "ఇప్పుడు మన
కర్తవ్యమేమిటి ? సీత నెట్లా చూడగలం ? .... ఆలోచించు" — అని
ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు ఇకనయినా వదినగార్ని వెతకవచ్చుననే సంతోషంతో
— "ఈ స్థలమంతా రక్తంతో తడిసి, నలిగి వుంది. ఎవరో ఇక్కడ
యుద్ధంచేశారు. ఈ మార్గం వెంట శీఘ్రంగా వెళుతూ పోదాం. వదిన
గారు కనపడవచ్చును" — అన్నాడు.

రాముడు సీత జాడ చెప్పని చెట్లనీడా, కొండలనీచా కోపంతో
గంభీరంగా అడుగులు వేస్తున్నాడు.

పది అడుగులయినా వెయ్యకముందే కొంత మార్గంలో రెక్కలు

తెగి, పర్వతంమీద్లే పడివున్న జటాయువు, రక్తం మడుగులో కనిపించాడు.

రాముడు జటాయువుని చూడగానే రౌద్రంగా — "లక్ష్మణా! వీడే సీతని తినేసి వుంటాడు. సందేహం లేదు. వీడు రాక్షసుడే. కమ్మగా సీతని తిని ఆదమరిచి నిద్రపోతున్నాడు. ఈ దుర్మార్గుణ్ణి ఇప్పుడే నా కరకు బాణాలతో వీరోచితంగా సంహరిస్తాను" * అంటూ బాణం ఎక్కుపెట్టి, జటాయువు దగ్గరికి నడిచాడు. రాముడికి చాలా సేపట్నించీ బాణం వేసి ఎవర్నో ఒకర్ని చంపెయ్యాలని వుంది. ఇప్పటికి కదలకుండా పడివున్న ప్రాణి దొరికింది.

జటాయువు అతి ప్రయాసమీద తలెత్తి రక్తం కక్కుకుంటూ రాముణ్ణి చూశాడు. — రాముడికి సీత చావైనా అందించగలననే సంతోషంతో ప్రాణం పోకముందే సంగతంతా చెప్పెయ్యాలని ఆత్రుతపడుతూ — "రామా! నువ్వు సీతకోసం వెతుకుతున్నావు. నాకు తెలుసు. సీతని రావణుడెత్తుకుపోయాడు. ఆ దుర్మార్గుడితో కలబడి యుద్ధం చేశాను. వాడి రథం మీదనించి కిందికితోసి రథం ముక్కలుచేశాను. ఈ ధనుస్సూ, కవచం అన్నీ వాటివే. ఆ మృగుడు నా రెక్కలూ, కాళ్ళూ కత్తితో నరికి తప్పించుకున్నాడు. నాయనా! రావణుడే నన్ను చంపేశాడు. నువ్వుకూడా నన్ను చంపుతావా? —" అని దీనంగా చూశాడు.

రాముడు జటాయువు మాటలు వింటూ నిర్ఘాంతపోయాడు .... రావణుడా? .... రాక్షసరాజు! .... పర పురుషుడు! ..... ఎందుకు ఎత్తుకుపోయాడు సీతని? ..... పురుషులు పరస్త్రీలను ఇంకెందుకు

---

* 67 వ సర్గలో — 10½ శ్లోకం.

సీతని రక్షించడానికి జటాయువు వున్నాడన్న సంగతే గుర్తులేదు రాముడికి. అతను కనపడగానే — ఇంతసేపూ అతన్ని అడక్కుండానే దుఖిస్తోన్నందుకు, దుఖించాక — అతను జటాయువే కాదని అనుమానం — అందరిమీదా .... అన్నిటిమీదా అనుమానమే,

ఎక్కుడపోతాము ? .... స్త్రీ లోలత్వం .... కామురత్వం .... సీతని .... పట్టి పుచ్చుకుపోతాము .... కామకుడు ..... — గర్వపు తల తిరిగి పిలు జారవిడిచి మూర్ఛపోయాము. — శత్రు బిడ్డమైన మూర్ఖ రాక్షసుడి కాలం కన్న ఎక్కువసేపు పోనక్కరలేదని రాముడికి తెలుసు. మూర్ఖ లోంచి వెంటనే తేరుకున్నాడు — రావణుడా ? ... కామకుడు .... పిచ్చి స్త్రీ వ్యామోహితుడు ... ఎక్కుకుపోయాడా సీతని ? — నమ్మవచ్చునా ఈ మాటలు ? — నమ్మలేనట్టు చూశాడు జటాయువుని.

అవయవాలు తెగిన జటాయువు బాధతో మూలుగుతున్నాడు. రాముడు వుద్యోగంతో "జటాయు పక్షీ! నా తండ్రితో సమానుడవు నువ్వు. జరిగినదంతా చెప్పు. రావణుణ్ణి నువ్వెప్పుడు చూశావు ? ఎటువంటి పరాక్రమం చాడిది ? .... ఎటు పోయాడు ? ఎక్కడ నివసిస్తాడు ? నేనేం చేశానని నా భార్యని తీసుకుపోయాడు ? * అంతా చెప్పు" — అని ఆత్రుతగా అడిగాడు.

జటాయువు అతి కష్టంతో కళ్ళు తెరిచాడు.

— "పక్షిణంచేత్ర వెళ్ళాడు .... నాయనా ! .... నా శక్తి .. పుడిగిపోతోంది. కళ్ళు .... మూతలు పడిపోతున్నాయి... దుఃఖపడకు..

---

* 68 వ సర్గలో — 5, 7 శ్లోకాలు.

రాముడు జటాయువు నడుగుతున్నాడు — "నేను చేసిన పాపి అపరాధమును చూసి రావణుడు సీత నెందు కపహరించెను ?" —

రావణుడు రాక్షసరాజని తెలుసు ... తనకూ-రాక్షసులకూ శత్రుత్వం సాగుతోందని తెలుసు. .... ఏమీ ఎరగనట్టు ఎరుగనట్టు "నేనేం చేశాననీ ?" అని అడుగుతున్నాడు.

పూర్వజన్మ రాముడితో మాట్లాడినప్పుడు "రావణుడు రాక్షసరాజు అని .... విప్రవసు కొడుకు అని .... తన పేరు అని...." — అన్ని విషయాలూ చెప్పింది. "రావణు డెక్కడ నివసిస్తాడు ?" — అని అడుగుతున్నాడు రాముడు. — రావణుడి దేశం ఏదో తెలీకుండానే ఇంతకాలం నించీ రావణ వధ .... రావణ వధ .... అని హోరు పెడుతున్నాడు రుషులంతా.

నీ భార్య నీకు దక్కుతుంది. రావణుడు విందు మహూర్తంలో సీతని పతుకుపోయాడు. ఆ ముహూర్తబలాన్నిబట్టి చూస్తే పోయిన వస్తువు యజమానికి తొందరగానే దొరుకుతుంది. రావణుడి సంగతి గుర్తించలేదు. సీత వాడి దగ్గర ఎంతోకాలం నిలవదు. * విచారించకు నాయనా : రావణుడు నశించిపోతాడు. నీ భార్యతో నువ్వు ... సుఖంగా వుంటావు."

రాముడు ఆత్మతగా లవిగాడు — "ఇక్కడే రథం విరిగి పడిందే ; వాడు సీతనెలా తీసుకుపోయాడు ? తొందరగా చెప్పు."

".... బాహువులో అదిమిపట్టి, శరీరానికి హత్తుకుని ... నడుం చుట్టు చెయ్యివేసి ... ఎగురుతూ ..."

గిర్రున తల తిరిగి మూర్ఛగిల్లాడు రాముడు. చప్పునలేచి — "ఏదీ ? ఏలా పట్టుకున్నాడు ? ... మళ్ళీ చెప్పు తండ్రీ ! తొందరగా చెప్పు..."

"నడుం చుట్టు చెయ్యి..."

మళ్ళీ గిర్రున తల తిరిగి మూర్ఛగిల్లాడు రాముడు.

జటాయువుమీద రాముడికి పట్టరాని కోపం వచ్చింది — రావణుడి రథం విరగొట్టినందుకు.

"తండ్రీ ! రథంలో సీత ఎక్కడ కూర్చుంది మొదట ?"

"... రావణుడి ... తొడమీద ... నాయనా !"

"మళ్ళీ గిర్రున తలతిప్పుతూ ... మూర్ఛ ... ధర్మబద్ధంగా.

రాముడి ఆవేశం అంతా సీతవేపు తిరిగింది. ఇంతసేపూ, సీతని క్రూరమృగాలు తినేశాయనీ, రాక్షసులు చంపేశారనీ ... ఎంతో భయపడి దుఃఖపడాడు గానీ .... తీరా చేస్తే పర పురుషుడు .... అందునా రావణుడు .... బహు కాపురుషుడు .... శరీరానికి అదిమిపట్టి .... హు ! అసలు రావద్దంటే విన్నడా ?....పురుషులతో సమానంగా....అడవులలో

---

* 68 వ సర్గలో — 12 వ శ్లోకం.

రాముడు సీతని మళ్ళీ తెచ్చుకోగలిగితే అది రాముడి గొప్పేమీ కాదన్నమాట. ఆ ముహూర్తం గొప్ప.

రాచత్రీ....! అంతఃపురాలలో ఎంత రక్షణ! .... విన్నదా రావొద్దంటే ?....

"తండ్రీ! తొందరగా చెప్పు .... సీత ఏంచేస్తోంది? ఆమె మొహం ఏ విధంగా వుంది? మిక్కిలి దుఃఖిస్తోందిగదా? భయపడుతోంది గదా?.... నేనేం?

జటాయువు ప్రాణాలు మరణ వేదనతో సంకట పడుతున్నాయి.

"చెప్పు .... చెప్పు .... తొందరగా చెప్పు .... సీత ముఖం ఎలా వుంది?" *

జటాయువు కళ్ళు విప్పలేకపోతున్నాడు.

"అయ్యో! నావంటి దురదృష్టవంతు డుంటాడా? ఎన్ని కష్టాల పాలై నానో గదా? — రాజ్యం పోయింది. తండ్రి పోయాడు. భార్య పోయింది. ఇప్పుడీ జటాయువు కూడా పోయాడు. ఇంత దుఃఖానికి అగ్ని కూడా దహించుకుపోతాడే!" అని అగ్ని కష్టానికి దుఃఖించాడు రాముడు. కొంతసేపు — తర్వాత — "లక్ష్మణా! నాకూ సీతకూ వియోగం సంభవించిందే! .. ఈ వియోగ తాపం చల్లారడానికి సముద్రంలో మునుగుతాను. ఈ వేడికి అదికూడా ఆవిరై పోతుందేమో! అయ్యో!"— సముద్రం కష్టానికి దుఃఖించాడు కొంతసేపు.

మరణవేదన పడుతూవున్న జటాయువు తలవాలేసి కాళ్ళు సాచాడు.

---

* 68 వ సర్గలో — 6 వ శ్లోకం, 17½ శ్లోకం

"రావణు డపహరించుకొని పోవునపుడు చంద్రునితో సమమై మనోహరముగనుండు సీత ముఖ మెటులుండెను?"

అండలి జేసికొని "చెప్పుము చెప్పుము" అని శ్రీరాముడు దడుగు చుండగా జటాయువు ప్రాణములు శరీరము విడిచిపోయెను.

సీత చాలా దుఃఖిస్తూ వుంటుందనే రాముడనుకోవాలి. "ఎలా వుందో!" అనే సందేహం ఎందుకు?

రాముడి ముఖం ముకుళితమైంది — "లక్ష్మణా! ఎలాయువు పేరు తండ్రిపేరుతో పాడేనుగా! ఈ అరణ్యంలో దివ్యకాలం జీవించి నా కోసమే ప్రాణాలు విడిచాడు. అయ్యో! సీత పోయినా నా కింత దుఃఖం కలగలేదే! నాయనా! .... చితి పేర్చే ప్రయత్నాలు చెయ్యి. నేను అగ్ని సంస్కారం చేస్తాను. దుఃఖంతో నా హృదయం పగిలి పిస్తోంది సుమా!" — అని రాముడు దుఃఖిస్తూ పలవరిస్తున్నాడు.

లక్ష్మణుడు ఎండు కర్రలు కుప్ప వేస్తున్నాడు. రాముడి మనస్సంతా రావణుడి బాహువుల్లో వున్న సీతని తల్చుకుంటూ భగ భగ మండుతోంది.

ఎవరు రావొద్దంటే విన్నడా? .... ఆశ్రమంలో లక్ష్మణుణ్ణి కాపలా పెడితే వుండనిచ్చిందా? .... ఆ దుర్మార్గుడు ఆశ్రమంలో జొర బడి బలాత్కారంగా ఎత్తుకుపోయి వుంటాడా? .... మహా పతివ్రతే కదా? .... నిగ్రహించవొచ్చునే! .... కంచె చూపుతో ఆ నీచుణ్ణి దగ్ధం చెయ్యవొచ్చునే! .... ఇష్టపడే వెళ్ళిందా? ....

ఉలిక్కిపడ్డాడు రాముడు — ఏమిటీ ఆలోచనలు? — మహా పతివ్రత సీత! — పర పురుషుణ్ణి కోరుతుందా? ఏమిటీ నందేహం?

"అన్నగారూ! కాష్ఠం సిద్ధంచేశాను."

"అయ్యో! .... తండ్రీ! .... అయ్యో! ..." — అంటూ లేచాడు రాముడు, వుత్సాహంగా కాష్ఠకర్మ నిర్వహించడానికి.

జటాయువు చుట్టూ ఎండు కర్రలూ, కలపలూ పేర్చి గుట్ట చేశాడు లక్ష్మణుడు. నిప్పు రాజేసి వుంచాడు. రాముడు వలవలా ఏడుస్తూ ఆ గుట్టకి నిప్పు అంటిస్తూ "పక్షీరాజా! నేను నీకు అగ్ని సంస్కారం చేస్తున్నాను. యజ్ఞయాగాలూ, దానధర్మాలూ, తపస్సులూ చేసి పుణ్యాత్ములకు లభించే వుత్తమ లోకాలన్నీ, నేను సంస్కారం

చేయడంచేత నీకు ఏడా లభిస్తాయి. నిన్ను పుణ్యలోకాలకు పొమ్మని నేను ఆజ్ఞాపిస్తున్నాను-" అంటూ మళ్ళించాడు.*

తర్వాత రాముడూ, లక్ష్మణుడూ విల్లులు సద్దుకుని జింకల్ని చంపి జటాయువుకి పిండం పెట్టడానికి మాంసం సిద్ధంచేశారు.

మరణించినవారి ఆత్మలు స్వర్గానికి పోవడానికి బ్రాహ్మలు ఏదు వంది మంత్రాలు చదువుతారో, అవన్నీ రాముడు చదువుతూ పిండ ప్రదానం చేశాడు. గోదావరిలో జలతర్పణాలు విడిచారు. శాస్త్రవిధులు నిర్వర్తించి నంతసేపూ రాముడు నపుస్త దుఃఖాలూ మరిచిపోయాడు. ఆ కార్యక్రమం అంతా ముగిసిం తర్వాత —

"అన్నగారూ! ఏమి వెలపు?" అని అడిగాడు లక్ష్మణుడు వొంగి.

రాముడు చుట్టూ చిక్కులు చూశాడు. ఏమి వెలవెల్లారో ఏమీ తోచలేదు.

రావణుడు .... సీతని ఎత్తుకుని రాముడి మనసంతా ఎగుడు తున్నాడు.

రావణుడితో వైరం .... ఇంత కాలానికి....

రావణ వధ .... రావణ వధ .... అని చిన్నతనంనించీ కలలు కంటున్నాడు. రాక్షసులంటే చంపుతానని ఏనాడో పది పిన్నెడు సంవత్సరాలకింట మాట యిచ్చాడేగానీ .... యుద్ధం! .... రావణుడితో....! ఎంత సైన్యం కావాలి? తనొక్కడూ .... ఈ లక్ష్మణుడు .... ఋషులు అంతా కీర్తిస్తారే! .... ఋషులంతా సైన్యంలో కలిస్తే....? రావణ రాజ్యం జయిస్తే..? ఆ దుర్మార్గుణ్ణి రావణుణ్ణి సంహరిస్తే....!

---

* 68 వ సర్గలో — $29\frac{1}{2}$, $30\frac{1}{2}$ శ్లో॥

"నాచే నంస్కరించబడినవాడవై, నా యాజ్ఞచే సద్గతులగు లోకములకు పొమ్ము," అంటున్నాడు రాముడు.

తనేమో ఎన్నో పాపాలు చేసుకుని కష్టాలనుభవిస్తున్నానని వాపోయాడు. అలాంటి తను ఇతరుని వుత్తమ లోకాలకి పంపిస్తాడు. అంతా తిరకాసు వ్యవహారం — లక్ష్మణుడికి ఇంగితం అన్నట్టు.

సీతని పరపురుషుడు ఎత్తుకుపోయాడంటే ఎంత అపకీర్తి.... లోకం
హర్షిస్తుందా.... సీత శీలం .... లోకం విశ్వసిస్తుందా?....
రాముడు ఆలోచనలతో సతమతమౌతున్నాడు.
లక్ష్మణుడి కేమీ సెలవివ్వలేదు.
తల పంకిస్తూ, ముందు నడుస్తున్నాడు.

(ఈ కథ అయిపోయింది.)

ఐదో కథతర్వాత — ఆరో కథ వరకూ

(సీతని రావణు డెత్తుకుపోయాడన్న విషయం రాముడికి చెప్పి జటాయువు కన్ను మూయడంతో 5 వ కథ ముగిసింది. శ్రీరాముడి మన్మధావస్థ శాస్త్రోక్తంగా వర్ణించడంతో 6 వ కథ ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకీ మధ్య వున్న కథాభాగం ఇది.)

జటాయువుకి కర్మకాండలు చేసి రాముడు, లక్ష్మణుడు ముందు నడుస్తోండగా పడమర దిక్కుగా సీతను వెదుకుతూ బయల్దేరాడు. (రావణుడు దక్షిణంవైపు పోతే వెతకడం పడమర వేపు!)

మహావృక్షాలతో, వెదురు పొదలతో, మిట్ట పల్లాలతో, ఏనుగులతో, సింహాలతో నిండివున్న కీకారణ్యంలో 3 క్రోసులు నడిచి (జనస్థానం నించి 6 మైళ్ళు) చండకారణ్యందాటి క్రౌంచారణ్యంలో ప్రవేశించారు. క్రూర మృగాలతో, సర్పాలతో నిండిన ఆ వనం చూడా దాటి మతంగముని ఆశ్రమ ప్రాంతంలో ఒక చోట చిమ్మ చీకటిగావున్న పాతాళగుహ చూశారు. ఆ గుహ వగిర ఒక భయంకరమైన రాక్షసి కనిపించింది. ఆమెకు పెద్ద పొట్ట .... కోరపళ్ళు .... వంకరచూపు.... మందపాటి చర్మం .... చింపిరి చుబ్బుచుట్టు .... వికారమైన మొహం .... పేయేల? నమస్తమైన రాక్షస లక్షణాలూ వున్నాయి. ఆమె, ముందుగా కనిపించిన లక్ష్మణుణ్ణే చూసి వగ్గిరికి వస్తూ "రమ్మా, సుఖించుదాము"అంటూ ఆలింగనం చేసుకుంది—"వీరుడా! నా పేరు అయోముఖి. నీవు నాకు నచ్చావు. ఈ వననుంతా కలిసి విహరించుదాం," అంటి

లక్ష్మణుడు కుపితుడై సర్రున కత్తి తీసి అయోముఖి పుటుక్కూ, చెవులూ, ప్రాణాలూ కోసేశాడు. (అన్నగారి ఆజ్ఞ లేకుంటానే!) అయోముఖి ఏడుస్తూ పారిపోయింది. *

లక్ష్మణుడూ, రాముడూ ఏముందుకు పోతూ వున్నారు. లక్ష్మణుడు సందేహిస్తూ— శ్రీరామా! • నా ఎడమ భుజం అదురుతోంది. అపశకునాలు తోస్తున్నాయి. (చిత్రం! రాముడి భుజం అదరడంలేదు.) వంజుళక పక్షి మనకు జయం కోరినట్టు కూస్తోంది." (శుభ శుభాల ఐక్యం.)— అన్నాడు.

అంతలో ఆకాశం విరిగి పడిపోయినట్టు ఫెళ్ళున చప్పుడైంది. పొదలో పెద్ద పర్వతంపులే కూర్చున్న రాక్షసుణ్ణి చూశారు. వాడికి తల లేదు. కాళ్ళూ లేవు. మొహం పొట్టలో వుంది. కన్ను రామ్ము మీద వుంది. నల్లగా కాటుక కొండలా వున్నాడు వాడు జుట్టుతో. కోర పళ్ళు కత్తుల్లా వున్నాయి. ఆ వొక్క కన్ను నిప్పు గుండంలా మెరుస్తోంది. చేతులు పొడుగ్గా యోజనం (8 మైళ్ళు) దూరం వున్నాయి. ★

---

* రాక్షసులు కామరూపులు. కోరిన రూపం ధరిస్తారే మరి! కోసూవుంటే చూస్తూ వూరుకుంటారా? ఇంకో రూపంతో తప్పించుకోరూ?— "ముక్కూ చెవులూ కోయ్యడం" కథల్లో విషయంలాగ కనబడుతుంది. కానీ, రాజుల కాలంలో కొన్ని కొన్ని నేరాలకి ముక్కూలూ, చెవులూ, పెదాలూ కోయ్యడం శిక్షగా అమలు జరగడం వుండేది.

• ఈ కథలో — లక్ష్మణుడు రాముణ్ణి అన్నగారూ! అని పిలుస్తాడు. మూల కథల్లో "శ్రీరామా!" అని పిలుస్తాడు. లింకు భాగాలలో మూల కథలో వున్న విషయం వున్నట్టే చెప్పడంచేత —"శ్రీరామా!"— అనే సంబోధనే రాస్తున్నాను.

★ యోజనం అన్నా, ఆమడ(8 మైళ్ళు) అన్నా వొకటే అన్నారు కొందరు. "వొకటి కాదు. యోజనం యోజనమే. ఆమడ ఆమడే" అన్నారు ఇంకొందరు. "యోజనానికి 800 మైళ్ళు అన్నారు మరి కొందరు. ఇది మనకి తెలిసిన వ్యవహారం కాదని వొదిలేస్తున్నాను.

ఆ చేతుల్తో పక్షుల్ని, జంతువుల్ని, పలుగుబంట్లనీ, పీనుగుల్ని, సింహాల్నీ పగ్గానికి లాక్కుంటున్నాడు. (పాపం పక్షిపాతం లేదు.) తతిమా పేరు కబంధుడు.

లక్ష్మణుడూ, రాముడూ, కబంధుణ్ణి చూసేటప్పటికే కబంధుడు ఇద్దర్ని పట్టేసి దగ్గరికి లాక్కున్నాడు.

రాముడు భయపడలేదు. (ఎంత ఎదిగిపోయాడో!) లక్ష్మణుడు భయపడుతూ (ఇంతే అదివరం) "శ్రీరామచంద్రా! కబంధుడికి నన్ను ఇచ్చి నువ్వు తప్పించుకు పో! త్వరలోనే నీ భార్య నీకు లభిస్తుంది. పిత్రార్జితమైన రాజ్యమూ దక్కుతుంది. నన్ను మాత్రం మర్చిపోకు" — అన్నాడు.

"పిచ్చివాడా! భయపడకు." — అని ధైర్యం చెప్పాడు రాముడు. (బహుశా వొణుకుతూ.)

కబంధుడు వేషధారణ్ణి చెక్కుచెదరకుండా నవ్వుతూ — "భలే వున్నావే బాసీ! మరీ పున్నాగపూవులా (పృషదాజ్యమని కూడా అన్నాడు. పృషదాజ్యమంటే మరి.) ఓహో. కబుర్లూ, బాణాలూ కూడా వున్నాయే! ఏం చదువుకున్నావో ఏమేపటి మనిషి? ఇటొచ్చావేం? .. సరే చెప్పు. నా కాకలి దంచుతోంది," అంటూ ఇద్దర్ని పరికించి చూసి — (రాముడి పొట్టి సిగ నిగనిగా.... కొప్పువిప్పేసి ఘనాలు తీరుతీరుగా, బిగి ఏ తియిన పిరుదుల బిగుసుసుగా .... లక్ష్మణ్ణి చూసి మురిసి బూరె రాకినప్పు రాముడి పొట్ట కొరకాలని సరదాపడి వుంటాడు.) — "మరిక నా చేతుల్లోంచి తప్పించుకోలేరు." — అన్నాడు మునిసుమని నవ్వుల్లో.

రాముడి మొహం వెలవెలబోయింది *

---

* 6th వ సర్గ — 47వ శ్లోకం.

"మరాత్మునిగని కబంధుని మాట విని శ్రీరాముడు వాడిన మొగము గలవాడై లక్ష్మణునితో నిటులనెను." —

తెచ్చి పెట్టుకున్న ధైర్యం ఎన్ని నిముషాలుంటుంది చెప్పండి?

"సత్యమైన పరాక్రమంగల లక్ష్మణా! (సత్యమైన పరాక్రమం లక్ష్మణుడిదేనని వొప్పుకుంటున్నాడు) లన్ని దుఃఖాలతోపాటు ఈ ప్రాణ హానికూడానా? అయ్యో! జీవులన్నీ కాలానికి కట్టుబడవలసిందేగదా? మృత్యువును ప్రసాదించడంలో దైవానికి తారతమ్యాలు లేవుసుమా! వీరులైనా, శూరులైనా, అస్త్ర — శాస్త్ర విద్యల్లో పండితులైనా పోయే కాలం సమీపించగానే, ఇసుకతో కట్టిన వారధుల్లాగే కూలిపోవలసిందే గదా? (ఇనక వంతెన్లు ... కాంట్రాక్టర్లు తప్ప ఎవరు కడతారు? అయ్యో! అప్పుడు కూడా....) లక్ష్మణా! అంతా విధివశమోయీ!" అంటూ నిట్టూర్చాడు. కబంధుడికి సరదాగా వుంది. (కొంచెం సేపు ఏడిపించి తినొచ్చులే అని.) — నవ్వుతూ — "భయంగా వుందా? మరి వీరులుగదా? .... విధీ .... దైవమూ .... అంటున్నారే! మిమ్మల్ని నాకా దైవమే ఇచ్చాడు. విధి ప్రసాదమే ఇది. తెలుసా?" — అన్నాడు. (మా బాగా అన్నావు కబంధుడా! *)

లక్ష్మణుడు తొందరగా తేరుకుని ధైర్యం తెచ్చుకుంటూ — "శ్రీరామా! రాక్షసుడు మనల్ని రెప్పపాటులో తినెయ్యబోతున్నాడు సుమా! తొందరగా వీడి చేతులు నరికేద్దాం." — అని కర్తవ్య బోధ చేశాడు శ్రీరాముడికి.

"ఏవిటీ? నా చేతులు నరుకుతారా?" — అని కబంధుడు మండిపడుతూ ఇద్దర్నీ నోట్లో పెట్టుకోబోయాడు.

చేతులు రెండూ తెగిపడ్డాయి. (అరరే! మనీ ఆలశ్యం చేశాడు.) రాక్షసుడు పెద బొబ్బలు పెట్టాడు — ఆ బొబ్బల మధ్యే — "మీరెవరు?" అని ఇంకో బొబ్బ పెట్టాడు.

---

* 70 వ సర్గలో — 2 వ శ్లోకం.

"క్షత్రియ శ్రేష్ఠులుగనుండి మీరు నన్ను జూసి భయపడవలసినది లేదు. ప్రాణములను విడువ బోవుచుండు మిమ్ము దైవమే నాకు ఆహారముగ నిచ్చెను." —

కబంధుడు తర్క పండితుడు.

లక్ష్మణుడు నిదానంగా — అన్నగార్ని చూపిస్తూ — "ఈ మహానుభావుడు దశరథ మహారాజ పుత్రుడు. (తను కాడూ?) నేను ఈ మహానుభావుడి తమ్ముడిని. (చిన్న మహానుభావుడిని.) ఈ మహానుభావుడి భార్యను రాక్షసు డెత్తుకుపోయాడు. మేం వెతుకుతూ ఇటువొచ్చాం. (నువ్వు మా పని పట్టించావు.) నీ సంగతి చెప్పు .... నువ్వెవడివి? ఈ పొట్టలో మొహం ఏమిటి? (నీ మొహంలా వుంది)"—అని అడిగాడు. (రాముడికి ఇంకా నోట మాట రావటం లేనట్టుంది)

కబంధుడు చాలా సంతోషించి బొబ్బలు మానేశాడు. పై పెచ్చు- "వీరులారా! మీరు నా చేతులు నరికేరు. అది నా అదృష్టం." — అని పొంగిపోయాడు. — "నా కథ చెబుతాను వినండి." — అని తనతో మాట్లాడుతోన్న లక్ష్మణుణ్ణి వారించి, రాముడితో మొదలెట్టాడు— —"రామా! పూర్వం నేను కూడా, ఇంద్రుడిలాగ, చంద్రుడిలాగ బహు సుందరంగా వుండేవాణ్ణి (నమ్మలేం.) అంత అందమైన నేను ఈ వికార రూపం వేసుకుని ఋషుల్ని భయపెడుతూ వుండేవాణ్ణి. (ఋషులతో ఆటలేం నకడా? సింహాలతో ఆడుకోవాలి గానీ!) 'స్థూలశిరస్సు' అనే ఋషి పళ్ళు ఏరి తెచ్చుకుంటూంటే, ఆ ఋషిని బెదిరించి పళ్ళు లాక్కున్నాను. (తీసుకోవాలే పళ్ళు లాక్కోవడం! బెదిరించడం అంటే అంతేనా?) — ఆయనకు కోపం వొచ్చి — "సరే! నీకీ వికృత రూపమే శాశ్వతంగా వుంటుందిలే" — అని శపించాడు. నేను భయపడి శాప విమోచనం అడిగాను. — "శ్రీరాముడొచ్చి నీ భుజాలు నరికి, నిన్ను దహనం చేసినప్పుడు నీ సుందర రూపం నీకు మళ్ళీ వస్తుంది" — అని తెలిపాడా ఋషి. (రాముడు వొక్క చెయ్యే నరికాడు మరి.)

(కబంధుడు ఇంతవరకూ చెప్పి, వెంటనే ఇంకో రకం కథ చెప్పాడు.)— "రామా! నా తండ్రి పేరు దనువు. నేను గొప్ప తపస్సు చేసి, బ్రహ్మ వరం వల్ల దీర్ఘాయుస్సు పొంది, మిక్కిలి గర్విష్ఠినై ఇంద్రుడి మీదకు యుద్ధానికి వెళ్ళాను. (రాక్షసులంతా వొక్క బిళ్ళనే

చదువుతాను కావుమ్మ.) ఇంద్రుడు వజ్రాయుధంతో నా నాభి కింద కొట్టాడు. నా తలా, కాళ్ళూ శరీరంలో ఇరుక్కుపోయి ముద్ద అయిపోయాను. బ్రహ్మ నాకు దీర్ఘాయుష్షు ఇచ్చినందువల్ల ఇంద్రుడు నన్ను చంపలేదు. నేను ఇంద్రుణ్ణి — "ఇలా అయిపోయానుగదా ! ఆహారం ఎలా సంపాదించుకోను ? ఎక్కువకాలం జీవించకపోతే బ్రహ్మ వరం అసత్యమైపోతుంది గదా !" — అని అడిగాను. (గొప్ప తర్కం !) ఇంద్రుడు నాకు యోజనం పొడుగున్న చేతులిచ్చి, కడుపులో ఒక కన్ను ఇచ్చి, అందులో సూదులాంటి పళ్ళు ఇచ్చాడు. (అబ్బ ! ఇంద్రుడు చేసే పనులన్నీ ఇంతే) "శ్రీరాముడు నీ బాహువులు ఛేదించినప్పుడు స్వర్గానికి వెళ్ళిపోతావు" — అని చెప్పి తను స్వర్గానికి వెళ్ళిపోయాడు. * అప్పటినించీ ఈ చేతులతో అన్నిటినీ లాక్కుని తింటున్నాను. రామా ! నీకోసం ఎదురు చూస్తున్నాను. (లాక్కు తిందామని.)" — అని రెండో కథ ముగించాడు కబంధుడు. (మీ కేది నచ్చితే అది నచ్చుకోండి. మీ ఇష్టం.)

కథలు ముగించి కబంధుడు రాముణ్ణి చూస్తూ — "రామా ! నువ్వు నన్ను దహనం చేసిన తర్వాత, నేను నీకో ఉపకారం చేస్తాను. నీకు సహాయం చెయ్యగల మిత్రుణ్ణి చెప్తాను" — అని ఆశ పెట్టాడు.

ఆ మాటలు వినగానే రాముడు — (ప్రాణం లేచి వొచ్చి) — "అలాగే దహనం చేస్తామోయీ ! ఏనుగులు పడగొట్టిన ఎండుచెట్లు తెచ్చి, పెద్ద గుంట తవ్వి, అందులో నిన్ను దహనం చేస్తాం సుమా ! (తనేం చెట్లు తేవాలా ? గుంట తవ్వాలా ?) నేనూ, నా తమ్ముడూ సుఖంగా అడవిలోకి పోయినప్పుడు రావణుడు నా భార్య నెత్తుకుపోయాడు. అతని పేరు మాత్రమే నాకు తెలిసింది. నివాస మెక్కడో, ఏమిటో,

---

* 71 వ సర్గలో — 7 శ్లోకాల వరకూ మొదటి కథ. తర్వాత శ్లోకం నించి రెండో కథ. రెండు కథ లెలా వచ్చాయో మనకి అనవసరం. రెంటిలోనూ శ్రీరాముణ్ణి, రుష్యమూకాన్ని గొప్పచేసి, ఇంకోజాతి రాక్షసుల్ని హీనపర్చడం వుంది. అదే ముఖ్యం.

అతడి పరాక్రమం ఎలాంటిదో ఏమీ ఎరగను. కబంధుడా ! నే నెప్పుడూ పరోపకారం చేసే వాడినే సుమా ! (ఉపకారం అంటే నబబు.) ఇప్పుడు నా కెవరూ దిక్కులేక, రక్షించేవారులేక, దుఖంలో మునిగి పోయి వున్నాను. నన్ను నువ్వు కరుణించాలి ! * రాపణుడి వివరాలన్నీ నీకు తెలిస్తే చెప్పు" — అని తొందర పెట్టాడు.

కబంధుడు (గడుసనంగా) — "రామా ! నాకు దివ్యజ్ఞానం వుండేదిగానీ, ఈ శాపం తర్వాత పోయింది. దహనం చేస్తేనేగానీ, నా రూపం నాకు రాదు. నా జ్ఞానం నాకురాదు. సూర్యాస్తమయం లోగానే నన్ను దహనం చెయ్యాలి". (లక్ష్మణుడు బంతిమల్లే ఎగిరి చెట్లు ఈడవడం ప్రారంభించి వుంటాడు.)

"నా జ్ఞానం నాకు వొచ్చాక, రావణుణ్ణి ఎరిగినవాణ్ణి గురించి చెప్తాను. అతడికి తెలియని విషయమేలేదు లోకంలో. (రాముడికన్నా పెద్ద మహానుభావు డన్నమాట ! పాపం ఇంత అవమానం రాముకు కిక్కురుమనకుండా భరిస్తున్నాడు. — ఇంతకీ ఎవరో ఆయన ! — మనంకూడా తొందరగా చెట్లు ఈడ్చి లక్ష్మణుడికి సాయంచేస్తే ..... తొందరగా తెలుసుకోవచ్చు.) ఆయన రావణుడి గురించి అన్ని వివరాలూ చెప్పగలడు. మరి తొందరగా కాల్చండి నన్ను" — అంటూ తొందరపడిపోయాడు కాలడానికి.

లక్ష్మణుడు అప్పటికే అంతా సిద్ధం చేశాడు. పర్వతం పక్క-

---

* 71 వ సర్గలో — 24 వ శ్లోకం.

"పరోపకారం సేయుటలో నాసక్తి గలవారుగనూ, దుఖాక్రాంతులుగనూ, రక్షకులు లేనివారుగనూ నుండి — ఈ విధముగ సీతను వెదుకుచుండు మాకు నీవు కరుణ చూపవలయును" — అంటున్నాడు రాముడు కబంధుడితో.— రక్షించేవారు లేరట. కరుణించాలట. (రాముడు దేవుడు కాబట్టి వూరుకుంటున్నాడుగానీ, కవులు తన పాత్రని ఇంత అవమానం చేస్తోంటే చిత్తుచిత్తుగా తన్నకుండా ఏ మనిషిమాత్రం వూరుకుంటాడు ?)

నున్న గుంటలో కబంధుణ్ణి పడతోసి అన్నగార్ని పిల్చాడు. తర్వాత వని పుగిసేవరకూ కాషం దగ్గిర నించుని కాల్చాడు.

కాంతసేపటికి చక్కగా సుందర రూపంతో కబంధుడు పట్టు బట్టలూ, పూలహారాలూ ధరించి, ఉంగరాలుకూడా పెట్టుకుని — (వుంగరాలు పెటకపోతే కబంధుడికి కోపంవచ్చి ఆ చెబుతానన్న ముక్కేదో చెప్పకపోతే కధ ఇక్కడే పడుకుంటుందేమోనని కవిగారికి భయం వేసినట్టుంది) ప్రకాశించే హంసల రధంమీద — (హంసలతోకూడా రధాలు లాగించుకోవాలనే బుద్ధే.) చితిలోంచి పైకి లేచాడు.

కబంధుడు ఆకాశంలో తేలుతూ — "రామా! సీత దొరికేమార్గం చెబుతానన్నాను, విను." — అని ప్రారంభించాడు. — "లోకంలో నంధీ, విగ్రహం, యానం, ఆసనం, ద్వైదీభావం, సమాశ్రయం, అని ఆరు వుపాయాలున్నాయి. కష్టాలలో వున్నవాడు కష్టాలలో వున్నవాడితోనే స్నేహం చెయ్యాలి. (సమాశ్రయం = సమమైన వాళ్ళనే ఆశ్రయించడం.) నువ్వు భార్యపోయి దీనావస్థలో వుని గవున్నావు. అలాగే సుగ్రీవుడనే వానరరాజు కూడా దేశబహిష్కారం పొంది దురవస్థలో మునిగవున్నాడు. సుగ్రీవుడు రుక్షరజస్సు అనే వానరుడి కొడుకు. సూర్యుడికి ఔరసపుత్రుడు. *

---

* 72 వ సర్గలో — 21 వ శ్లోకం.
"సుగ్రీవుడు రుక్షరజస్సు పుత్రుడు.
సూర్యుని ఔరసపుత్రుడు."
ఈ సర్గలోనే 11 వ శ్లోకం.
"సుగ్రీవుని, — ఇంద్రుని కొడుకగు, అన్నయగు వాలి — రాజ్యమునుండి వెడలగొట్టెను" —

సుగ్రీవుడినీ, వాలినీ ఒకతల్లే కన్నదో, ఇద్దరు తల్లులు కన్నారో వివరం ఇక్కడలేదు. కానీ, వారి తల్లి (లేకపోతే తల్లులు) పెళ్ళి చేసుకున్న భర్తమాత్రం రుక్షరజస్సు. అయితే-వాలీ, సుగ్రీవుడూ రుక్షరజస్సువల్ల పుట్టలేదు. వాలి తల్లి ఇంద్రుడివల్లా, సుగ్రీవుడి తల్లి సూర్యుడి

సుగ్రీవుడు పరాక్రమశాలి, ప్రతాపవంతుడు, సత్యసంధుడు, నీతిమంతుడు, బుద్ధిమంతుడు, ధైర్యశాలి, గొప్పవాడు, సహర్షుడు, ప్రాజ్ఞుడు, యోగ్యుడు. (ఇంకేం దొరకలేదు.) అటువంటి తమ్ముణ్ణి ఇంద్రుడి కొడుకైన వాలి రాజ్యంనించి వెళ్ళగొట్టాడు. ఇప్పుడు సుగ్రీవుడు నలుగురు సహచరులతో, పంపా సరస్సుతీరంలో ఋష్యమూక పర్వతంమీద భీతిలో కాలంగడుపుతూ వున్నాడు. (ధైర్యశాలి_ భీతిశాలి అయిపోయాడు.)

రామా: సుగ్రీవుడు వానరుడని చిన్నచూపు చూడకూడదు సుమా: ఎందుకంటే అతడు వానర ప్రజలకు అధిపతి. (భీతి గుడిచే అధిపతి.) సహాయంకోరుతూ వున్నాడు. చేసినమేలు మరిచేవాడు కాడు. శీఘ్రంగా పోయి సుగ్రీవునితో అగ్నిసాక్షిగా, ఆయుధాల సాక్షిగా స్నేహంచేసుకో. అతడు నీ భార్యను వెదకటానికి సహాయం చేస్తాడు. అతడికి రాక్షసుల సంగతులన్నీ తెలుసు. తన సైన్యానికి ఆజ్ఞాపించి కొండల్లో, కోనల్లో అతడే వెదికిస్తాడు సీతని. (ఇంకా వెతకాలన్నమాట: బాగానేవుంది. వెతక్కుండానే చెప్తాడనుకున్నాం.) నీ భార్య పాతాళంలో వున్నా నీకు తెచ్చి ఇస్తాడు. సుగ్రీవుడికి కావలసిన కార్యం మాత్రం నువ్వు చేసిపెట్టు రామా: నువ్వు చెయ్యగలవు. నువ్వు చేసిన కార్యం ఫలించినా, ఫలించకపోయినా, సుగ్రీవుడు మీకు సహాయం చేయక మానడు. (— ఫలించక పోవడంకూడా జరుగుతుందన్నమాట. మరి ఫలించకపోతే....సుగ్రీవుడు రాజు కాకపోతే .... చేతిలోకి సైన్యం రాకపోతే .... సీతని వెదకడాని కెలా సహాయం చేస్తాడు? — ఫలించకపోయినా చేస్తాట:

(ఫుట్‌నోట్ : 116 పేజీ తరువాయి)

వల్లా బిడ్డల్ని కన్నారు. ఇది రహస్య సంబంధం కాదు. స్త్రీకి ఘోర పాతివ్రత్యం ఏర్పడకముందు ఇది చాలా సామాన్యం: ఆ స్త్రీలు ఋష రజస్సు భార్యలు కావశంవల్ల వారు కనేబిడ్డలు అతని వొంటికుంటే అవుతారు:

(ఇంద్రుని కొడుకూ— సూర్యుడి కొడుకూ కోతులు:)

ఆ నగలూ, బట్టలూ, వొచ్చింతర్వాత కబంధుడు ఉత్త అబద్ధాలకోరు అయిపోయాడు.) — రామా ! దుఃఖించకు. జరిగేది జరక్కమానదు. విధిని మార్చడం సాధ్యంకాదు. (ఇదన్నమాట చివరకి తేల్చింది.) — ఇక రుష్యమూక పర్వతానికి పోయే మార్గం చెబుతాను విను.

అటు పడమర వేపుగా చెట్లన్నిదాటి పోవాలి. ఇంకో వనం తగులుతుంది. అక్కడ చెట్లనిండా ఎప్పుడూ పళ్ళు వుంటాయి. ఆ వనంకూడా దాటింతర్వాత పంపా సరస్సు వస్తుంది. ఆ సరస్సు రక రకాల పూలతో మనోహరంగా ఉంటుంది. అందులో తిరిగే హంసలకూ, క్రౌంచ పక్షులకూ భయం తెలియదు. మిమ్మల్నిచూసి భయపడవు. నేతి ముద్దలమల్లే వుంటాయి కొవ్వుతో. చక్కగా వాటిని కొట్టుకుని తినండి. (అప్పుడన్నా భయం తెలిసి దాక్కోడం నేర్చుకుంటాయి.) ఆ సరస్సులో చక్కని చేపలూ, రొయ్యలూ కూడా ఉంటాయి. వాటిని బాణాలతో కొట్టి ఇనపకాడకు గుచ్చి, నిప్పుల్లో కాల్చి, లక్ష్మణుడు నీకు ఇస్తాడు రామా ! చక్కగా తిను. * — (అయ్యో ! ఎందుకు తినడూ ? — అది నరే ! ఈ రుషి ఇనపకాడ కూడా తెచ్చుకున్నాడన్నమాట ! అట్టపెనం ఒక్కటే తక్కువైనట్టుంది. లేకపోతే అదీ ఉందో ....) అక్కడ్నుంచి పందులు బలిసి

---

* 73 వ సర్గలో — 15, 16 శ్లోకాలు —

"రామా ! పంపాసరస్సులోగల ఉత్తమమైన గండుచేపలూ, సొర చేపలూ, రొయ్యలూ, లక్ష్మణుడు బాణములతో జంపి, వాని చర్మమునూ, రెక్కలనూ దీచివైచి, ఇనపకాడ కొనలోనుంచి, అగ్నిలో పక్వముచేసి, ముండ్లను తీసివైచి, భక్తితో ఇచ్చును" — అంటున్నాడు కబంధుడు.

అంచేత "రాముడూ — రొయ్యలూ" అనో, "రాముడూ — చేపల వేపుడూ :" అనో ఎవరన్నా కథలు రాస్తే అది వాల్మీకి విరుద్ధం అవదు. పంపకు వెళ్ళాక లక్ష్మణుడు ఎలాగూ చేపలకూర వండుతాడు లెండి.

ఎదుట్లా తిరుగుతూ ఉంటాయి. * ఆ సంపాతీకంతో మతంగముని శిష్యులు యోగాభ్యాసం చేస్తూ వుంటారు. ఆ శిష్యులు గురువుకోసం పళ్ళు తెస్తూ వుండగా, నాటి బిసువువల్ల వారికి చెమటలుపట్టి, ఆ చెమట బిందువులు గాల్లో తేలి, చెట్ల మీదపడి పువ్వులయ్యాయి. • అందుచేత ఆ వనంలో పువ్వులు ఎన్నడూ వాడవు. చెట్లనుంచి రాలవు. అక్కడ ఋషులపై ఉపచారాలుచేస్తూ శబరి అనే ఒక వృద్ధ సన్యాసిని చాలాకాలం నించి చిరంజీవిగా ఉంది. రాముణ్ణి ఈ శబరి నిన్ను 'చూసిన తర్వాతే స్వర్గానికి పోతుంది.

పంపకు తూర్పున రుష్యమూక పర్వతంవుంది. బ్రహ్మ పూర్వం దానికొక ప్రభావం కల్గించాడు. పాపాలు చేసుకున్న వారెవ్వరూ

---

* 73 వ సర్గలో — 18, 19 శ్లోకాలు.

"ఋగుల మూలమునగానూ .... వృషభములవలే కూయుచుండు పందులను పంపలో నీవు చూచెదవు."—

రాము లక్ష్మణుల్ని ఎద్దులతో పోల్చి — పందుల్నికూడా ఎద్దుల తోటే పోల్చారు కవిగారు. అబ్బే! తప్పనికాదు.

రామ లక్ష్మణులూ = ఎద్దులు.
పందులూ = ఎద్దులు.
ఎద్దులూ = ఎద్దులు.
రామ లక్ష్మణులూ = పందులు.

అయినా మనికి "పరమార్థం" వుండనే వుండిగదా,

• 73 వ సర్గలో — 13, 14, 15 శ్లోకాలు —

"..... ఋషుల తపఃప్రభావముచే వృక్షములపై బడిన ఆ స్వేద బిందువులు పుష్పములయినవి."

చెమటతో పూలు పూయడం చక్కగానే వుందిగానీ — అది ఋషుల చెమటతో కాదు. క్రౌంచుల చెమట పువ్వులూ పూయిస్తుంది. కాయలూ కాయిస్తుంది. పంటలూ పండిస్తుంది.

ఆ పర్వతం ఎక్కలేరు. జాతి, ఆచారాలు విడిచిన పాపి ఆ పర్వతం ఎక్కితే (ఒసలు ఎక్కగలడన్న మాట.) నిద్రపోయేప్పుడు రాక్షసులు లేపి చావగొడతారు. (పాపపై న రాక్షసులెలా రాగలరు పర్వతం మీదికి ?) ఆ పర్వతంమీద ఎవరికీ ఏ కలవొస్తే అది లేచాక నిజమవుతుంది. కలలో ధనం దొరికితే లేచినతర్వాత నిజంగా దొరుకుతుంది. * (అందరూ ఆ పర్వతంమీదే పక్కలేసుకోవడం పుంచిది.) — ఆ పర్వతంమీద పాములు విపరీతంగా వుంటాయి. పాములే దాన్ని రక్షిస్తూ వుంటాయి. (ఏడిసినట్టేవుంది, ఇంకేం పక్కలు ?) రామా ! ఆ వనమంతా కొవ్విన ఏనుగులూ, ఎలుగుగొడ్లూ, పెద్ద పులులూ, విచ్చలవిడిగా తిరుగుతూ వుంటాయి. వాటిని చూస్తూ నీ దుఃఖం మరిచిపోతావు. (దడలోపడి) మతంగముని మహిమవల్ల ఆ కృూరమృగాలు ఆశ్రమాలు పాడుచెయ్యవు.

ఆ పర్వతంమీదే ఒక గుహలో సుగ్రీవుడు వుంటున్నాడు. అతణ్ణి ఆశ్రయించు. నీకార్యం నెరవేరుతుంది. ఇక పోయి వస్తాను" — అనిచెప్పి కబంధుడు ఎగిరిపోయాడు. (అంతసేపూ మెడలెత్తి ఆకాశంలోకి చూడ్డవే నన్నమాట!) •

కబంధుడు చెప్పినవిధంగా రాముడు లక్ష్మణుడి వెనక— ముందుకు

---

* 73 వ సర్గలో — 32, 33 శ్లోకాలు

"రామా ! ఆ పర్వతముపైన నిద్రించుచుండు పురుషుడు కలలో పిత్తమును బడసినటులైతే, అవి నిద్రలేచిన పిమ్మట వానికి లభించును.

ఋషుల జీవితాలూ, పుణ్యాత్ముల జీవితాలూ కూడా "ధనం" చుట్టూ తిరగడం గమనించండి.

• ఇంతకీ కబంధుడికి కొత్త రూపంతోపాటు నగలూ అవీ వొచ్చాయిగానీ.... కొత్తగా వొచ్చిన జ్ఞానం ఏమిటి ? సుగ్రీవుడిగురించి మొదటే చెప్పాడు. అదే తర్వాత మళ్ళీచెప్పాడు. రావణుడి గురించి వొక్కముక్క చెప్పలేదు. రాముణ్ణి చేపల కలల్లో పుంచి చక్కగా తప్పుకుపోయాడు.

ఎడక సాగించాడు. ఒకరాత్రి గడిచింది. తెల్లవారి పంపకు పడమటి తీరంలో శబరి ఆశ్రమం చూశారు.

శబరి యోగాభ్యాసాలతో వుగ్రమైన తపస్సుచేసిన వృద్ధురాలు. అతిథుల్ని చూడగానే శబరి ముందహాసంతో కాళ్ళకు నీళ్ళిచ్చి శాస్త్రోక్తమైన మర్యాదలన్నీ చేసింది. (కీకారణ్యంలో ఏహార్చనా చుట్టాలే నయ్యే పాడు!)

రాముడు ఏహార్చని గంభీరంగా తల పంకిస్తూ — "నీ తపస్సు వృద్ధి అవుతోందా? బాధలు జయించావా? (అంత వృద్ధురాల్ని పట్టుకుని) కోపం లేకుండా వున్నావా? ఆకలి అరికట్టుకున్నావా? (నేనైతే అరికట్టుకోలేవనుకో — పంటలో రొయ్యలకోసం పోతున్నాను.) వ్రతాలన్నీ ఫలించి నీ మనసు సుఖంగా ఉందా? నీ గురుపూజ సఫలమైందా?" — ఎంతో కుశల ప్రశ్నలు వేశాడు.

శబరి భక్తితో చేతులు జోడించి — "నీ దర్శనంతోనే నా తపస్సు ఫలించింది. ఇప్పుడే నా గురుపూజ లన్నీ సార్థకమయ్యాయి. నా జన్మ ధన్యమైంది. నీ కరుణా కటాక్షంతో పునరావృత్తిలేని (మళ్ళీ మళ్ళీ జన్మలు లేని) పరమపదం పొందుతాను. (కబంధుడు చెప్పేవరకూ "శబరి" అనేది పిట్టో, జంతువో, మనిషో ఏమీ తెలీదు రాముడికి. అయినా కరుణా కటాక్షం!")

రామా! నువ్వు చిత్రకూటంలో ఉన్నప్పుడు, నేను సేవలుచేసే గురువులందరూ విమానాలెక్కి స్వర్గానికి పోయారు. "శబరీ! ఈ ఆశ్రమానికి శ్రీరాముడు వస్తాడు. ఆయనకు ఉపచారాలు చెయ్యి. ఆయన దర్శనంతోనే, నాశనంలేని స్వర్గం పొందుతావు" అని నా గురువులు చెప్పారు. (ఇంతకీ, శబరి భక్తి అంతా స్వర్గం కోసం ఆన్నమాట! అదా సంగతి?) — రామా! నీకోసం ఈ వరిసర వనాలలో దొరికే పళ్ళన్నీ సంపాదించి ఉంచాను" అంది. — (రాముడు చిత్రకూటంలో ఉన్నది కనీసం 13 సంవత్సరాల కిందట. అప్పటినించీ పళ్ళు దాస్తోనే ఉందన్నమాట.)

రాముడు ఆ పళ్ళమాట పట్టించుకోకుండా — (పళ్ళు తిన్నాడని కాదు రాయలేదు.) — "శబరీ! కబంధుడిద్వారా మతంగముని మహిమలు విన్నాను. ఇప్పుడు చూడాలని కోరుతున్నాను" — అన్నాడు.

శబరి— లక్ష్మణుణ్ణీ, రాముణ్ణీ మతంగ వనానికి తీసుకు వెళ్ళింది. "రామా! మతంగ మహర్షి ఇక్కడే యాగాలు చేశాడు. ప్రభావం వలన నదుల దగ్గరికి పోలేక నదుల్నీ, సముద్రాల్నీ ఇక్కడికే పిలిపించాడు. (నదుల్నీ, సముద్రాల్నీ పిలిపించగలడుగానీ, వృద్ధాప్యం జయించలేడు.) అదిగో! ఆ సముద్రాలూ, నదులూ చూడు. (ఆశ్రమం పెట్టో నదులూ, సప్త సముద్రాలూ!) నా గురువుల అంగవస్త్రాలు ఇప్పటికీ చెట్లకి తడిగా మెరుస్తున్నాయి చూడు. (అంత చిడు!) రామా! ఈ ఆశ్రమమంతా చూశావుగదా? ఇక నేను ఈ జీర్ణదేహం విడిచిపెట్టి నా గురువు నేపకే వెళ్ళిపోవాలనుకుంటున్నాను" అని భక్తిగా నమస్కరించింది.

రాముడు గంభీరంగా — "నన్ను భక్తితో పూజించావు. నువ్వు కోరిన లోకానికి వెళ్ళు" — అని అనుమతించాడు.

వృద్ధురాలు శబరి అగ్ని గుండంలో దూకి వెంటనే ఆభరణాలతో పట్టుబట్టలతో చితిలోంచి లేచి ఆకాశంలోకి వెళ్ళిపోయింది. (ఇన్నాళ్ళ తపస్సుకీ ఫలితం — ఆభరణాలూ — పట్టుబట్టలూ — స్వర్గం.)

రాముడూ, లక్ష్మణుడూ మళ్ళీ నడక ప్రారంభించారు.

రాముడు లక్ష్మణుడితో — "లక్ష్మణా! గొప్ప మహిమలుగల మతంగముని ఆశ్రమం చూశాం. జింకలూ, పులులూ కలహించుకోకుండా స్నేహంగా పుండడం చూశాం.* ఆశ్రమంలోవున్న సప్త

---

* 75 వ సర్గలో — 3 వ శ్లోకం.

రాముడు — "లక్ష్మణా! పరస్పరము కలహించుకొనక, విశ్వాసముతో గూడియుండు జింకలు, పులులు గల మహాత్ముల ఆశ్రమమును జూచితిమి" — అంటున్నాడు.

సముద్రాలలో స్నానాలుచేసి పితృదేవతలకు తర్పణాలు విడిచాం. కీడు తొలగిపోయి ఇక శుభం కలుగుతుంది. ఇప్పుడు నా మనసెంతో సంతోషంగా ఉంది.

పనం తొందరగా వానరరాజు సుగ్రీవుణ్ణి కలుసుకోవాలి" — అన్నాడు. *

లక్ష్మణుడు అంతకన్నా తొందరపడుతూ — "అవును శ్రీరామా, పనం తొందరగా పోవాలి."

ఇద్దరూ గబగబా నడుస్తూ పంపా సరస్సు చేరారు. ఋష్యమూక పర్వతం చూశారు.

రాముడు — "లక్ష్మణా! సుగ్రీవుడు ఆ కనిపించే పర్వతం మీదే ఉన్నాడని కబంధుడు చెప్పాడుగదా? అతడి దగ్గరికి ముందు నువ్వు వెళ్ళరా!" అన్నాడు.

(ఫుట్‌నోట్ : 122 వ పేజీ తరువాయి)

పులులూ, జింకలూ కలిసి వుంటున్నాయట. పురి రుషులూ, రాక్షసులూ కలహించుకోకుండా అలాగే ఉండరాదూ? ఈ రుషులు రాక్షసుల్ని చంపించడానికి ఇన్ని ఎత్తులేస్తారేం? ఒక రాక్షసుడికి హాని జరిగితే — "శుభం! శుభం!" అని కేకలు పెడతారేం? రాక్షస జాతిని సర్వనాశనం చెయ్యాలని కంకణాలు కడతారేం? — అయ్యో! ఇలాగే వుంటాయి దొంగ నీతులు.

* 75 వ సర్గలో — 8, 9 శ్లోకాలు.

"సుగ్రీవుని చూచుటకు నేను త్వరపడుచున్నాను" అన్నాడు రాముడు. దానికి లక్ష్మణుడు —

"అచటికి త్వరగ బోవుచుము. నా మనసునూ త్వరపడుచున్నది" — అన్నాడు.

ఇంతకీ రాముడు సుగ్రీవుడి ఎగ్గిట్‌కి "ఎంత త్వరగ బోవునో" చూడంచి;

అంతలోనే — కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ — "లక్ష్మణా ! రాజ్య భ్రష్టుణ్ణయి దీనుణ్ణయిపోయాను. ఆ దుఃఖం మరిచిపోవాలని సీతమీదకు మనస్సు మళ్ళించుకున్నాను. సీతకూడా లేకపోతే ఎలా జీవించగలను ?" — అని కొంతసేపు దుఃఖించాడు. *

చుట్టూ వన సౌందర్యం చూశాడు. పంపా సరోవర సౌందర్యం చూశాడు. పున్మధ పీడా సాగరంలో మునిగిపోయాడు రాముడు.

(ఇక్కడితో అరణ్యకాండ సమాప్తం.
తర్వాతనించీ కిష్కింధాకాండ ప్రారంభం.)

★

---

* 75 వ సర్గలో — 28 వ శ్లోకం.

"లక్ష్మణా ! రాజ్య భ్రష్టుడనై, అందుచేతనే, దీనుడనయి, అట్టి దీనత్వమును పోగొట్టుకొనుటకై, సీత యెడల లయించిన మనసుగల నేను ఆమెను విడిచి యెటుల జీవింతును ?" —

రాముడు సీతతో అంత తీరిగ్గా కాలం గడుపుతున్నాడంటే అదంతా ప్రేమేనా ? వేరే పనేమీ లేకగానీ .... ఈ మాట ఆయనే న్యాయంగా చెప్పుకుంటున్నాడు — దుఃఖం మర్చిపోడానికి "సీత యెడల మనసు లయించాను"- అని చెప్పుకోవడంలో తప్పేమీ లేదనే అభిప్రాయంతో.

కావ్యశాస్త్రులు

గాలి కలవపూల పరిమళాలు మోసుకుంటూ అటేపంతా తిరుగుతోంది. పంపా సరోవరం భూమి అంతా ఆక్రమించినంత విశాలంగా వుంది. జాజులూ, పున్నాగలూ, వాసంతులూ, నాగ మల్లికలూ, నీలాకోళలూ, పూర్ణికలూ, శిరీషలూ, కరవీరలూ .... ఎన్నెన్నో లతలన్నీ జట్టుకట్టి పెనవేసుకుని — "రండర్రా : పంపని చూద్దాం" — అని పంప చుట్టూ చేరి ఇక వెళ్ళడం మర్చిపోయినట్టున్నాయి.

పంపలో నీరు ఎటూ ప్రవహించకుండా నిశ్చలంగా వుంది. ఒడ్డునిండా లతలు పూసి — నీటినిండా ఎర్ర తామరలూ, తెల్ల తామరలూ, నల్ల కలువలూ, సౌగంధికలూ .... విరగబూసి పూలరథంమల్లే ఉంది పంప. రంగురంగుల పూలకాంతులు నీళ్ళలో ప్రతిఫలిస్తూ మణులతో, స్ఫటికాలతో, రత్న కంబళంమలే వుంది పంప. నీళ్ళలో నిలబడ్డ ఎర్ర తామరలు, అలల్లో ప్రతిఫలించే సూర్య బింబాలమల్లే — ఒక్కొక్క అలలో ఒక్కొక్క బింబమై ప్రకాశిస్తున్నాయి. నీటినిండా హంసలూ, నీరుకోళ్ళూ, రకరకాల జలపక్షులూ, అలలలో సూర్య బింబాలు చెదరగొడుతూ పూల మధ్యనించి రెక్కలతో పూలని వొరుసుకుంటూ జోట మల్లే ఈదుతున్నాయి.

నీటిలో అలలు తగ్గి నిశ్చలం అయినప్పుడు నీటి పొరల్లో పక్షులు దాక్కున్నట్టు చేపలు ఈదుతూ పైకి లేస్తున్నాయి.

నరస్సులో అక్కడక్కడా ఇసక దిబ్బలమీద పొదలు విరగబూసి వాటినిండా శతపత్ర పక్షులూ, అర్జున పక్షులూ, సారస పక్షులూ

చిలకలూ చేరి పొదలు రొద చేస్తున్నాయి. కొన్ని దిబ్బలమీద సువాసన లీనే గరిక ఏపుగా పెరిగి దుబ్బులు కట్టింది. చెట్ల తోపులలోంచి జంతువులు నిర్భయంగా వచ్చి దగ్గిర మడుగులో నీళ్ళుతాగి నెమ్మదిగా తలలెత్తి వెనక్కి పోతున్నాయి. నరస్సు ఒడ్డంతా పాకి పూసిన లతలూ, సీటి నిండా వూగే పువ్వులూ, ఈదే పక్షులూ, ఇసక దిబ్బలమీది పొదలూ, గడ్డి దుబ్బులూ అన్నీ నీటి అడుగున ప్రతిఫలిస్తూ పంప గర్భంలో ఇంకో పంప ప్రత్యక్షమౌతోంది.

పంప సౌందర్యం చూడాలని వచ్చిన నేరేడుచెట్లూ, మొరడిచెట్లూ, పనసచెట్లూ, కరికారిచెట్లూ, తొమ్మిరావిచెట్లూ, మామిళ్ళూ, తిలకాలూ, నీలి అశోకాల్లూ, కదంబాల్లూ, రక్తచందనాలూ, స్పందనాలూ-ఎన్నెన్నో మహా వృక్షాలు పంపా సరోవరం చుట్టుపట్ల పరిసరాలన్నీ విశాలంగా ఆక్రమించి విశ్రమించినట్టున్నాయి. చెట్ల కొమ్మలన్నీ చుట్టూ విస్తరించి భూమి పైకి లేచిన పర్వతాలమల్లే, ఆకాశంలో తేలుతోన్న మేఘాల చుల్లే ఉన్నాయి. వృక్షాలన్నీ తమచుట్టూ అల్లుకున్న లతలు పూసి, పూల గొలుసులు కట్టుకున్నాయి. — గాలి చెట్లతో ఆటలాడుతోంది. చెట్ల కొమ్మలు కదిపి పారిపోతోంది. పూలలోతుమ్మెదల్ని లేవగొడుతోంది. కొమ్మలు చివర్ల ఊగుతూ, ఎదటి కొమ్మల్లో చిక్కుకుని కొమ్మలూ, కొమ్మలూ — పూల గుత్తులూ, గుత్తులూ— గాఢాలింగనాలు చేసుకుంటున్నాయి. కొమ్మల కొగిళ్ళలో నలిగిన పూలు ఉక్కిరి బిక్కిరై సొమ్మసిల్లి జలజల రాలుతున్నాయి. ఆటలాడే గాలి, రాలే పూలని మోసుకు పోతూ పూల మేఘాలు సృష్టిస్తోంది. గాలి పట్టు తప్పించుకున్న పూలు రాలి భూమి అంతా పూలశయ్య అవుతోంది. కొమ్మల్ని ఊగించీ, పూలు రాలగొట్టీ, తుమ్మెదల్ని చెదరగొట్టీ, గాలి నవ్వుతూ చెట్లలో జొరబడి కొత్త పరిమళాలతో పారిపోతోంది. తుమ్మెదల రొదతో, పక్షుల కూతలతో చెట్లు సంభాషించుకుంటున్నాయి.

"వకుళా : ఎంత చక్కగా పూశావే ఈపూట !"

"అబ్బే ! నీకంటేనా ! నువ్వు చూడు, ఎంత విరగబూశానో!"

"అవును. ఉద్దాలకే బాగా పూసింది".

"ఏమోనర్రా! ఏం పూశానో! ఈ గాలి గిలిగింతలు పెట్టి ప్రాణాలు నతపుతం చేస్తోంది."

"ఎవర్తో కొట్టవాళ్ళాస్తోన్నట్టుంది!"

చెట్టకిందనించి నుస్తోంకే చట్టంగా మబ్బులుపట్టిన నీలాకాశం కింద నడుస్తోన్నాడు.

లక్ష్మణుడు ఆతృతతో దూరంగా రుష్యమూక పర్వతంవేపు చూస్తున్నాడు— ఎవరైనా కనబడతారా అని. రాముడు పంపనీ-చుట్టూ పరిసరాలన్నీ పరిశీలిస్తున్నాడు.

నరోవరం మొదనించి గాలి సుఖశీతలంగా, పరిమళ భరితంగా గస్తోంది. అడివంతా తొలకరి చినుకులమ్లే పూలవాన కురుస్తోంది. కోయిళ్ళు ఎరామం లేకుండా కూస్తున్నాయి. కూతవేంట ఎగురుతున్నాయి. నెమళ్ళు కొమ్మల్లో పించాలు ఎప్పటోయి చిక్కుపడి చెట్టకిందకి నూకు తున్నాయి. వాటి పించాలు ఏవో సుందరలోకాలకు తీసుకుపోయే మణి ద్వారాలమ్లే ధగధగ మెరిసిపోతున్నాయి.

రాముడు గంభీరంగా — "లక్ష్మణా! ... ఈ పంపానరస్సు .. ఈ కోయిళ్ళు.... నెమళ్ళు.... ఈ పరిపళాలు .. చలగాలులు ముక్కలి కా మోదీపకంగా వున్నాయి సుమా! ఇది ఏనంత ముత్తువోయా!" — అన్నాడు. రాముడికే వసంతరుతు వర్ణనలన్నీ గుర్తువొచ్చాయి.

లక్ష్మణుడు రుష్యమూకపర్వతం చూస్తూ దృష్టి మరల్చకుండా — "చిత్తం! ఉన్నగారూ!"— అని వసంతరుతువుని వొప్పుకున్నాడు.

"లక్ష్మణా! ఈ వసంతరుతు శోభ సీతలేని నాకు ముఖమే కలి గిస్తోందోయా!"

"చిత్తం! దుఃఖమే కలిగిస్తుంది అన్నగారూ!"

"ఈ పంపాసరోవర సౌందర్యం చూసి. ఏంత దుఃఖంలోనైనా సంతోషం కలిగిస్తోంది సుమా!"

"చిత్తం! సంతోషమే కలిగిస్తుంది అన్నగారూ! లక్ష్మణుడు రుష్యమూక పర్వతం ఎక్కలేమని దిగులు పడుతున్నాడు. కించించి

నంత మేర ఎక్కడా పెకిపోయే దారిలేదు. మొత్తుగా చెట్లూ-పొదలూ ! అందులో పాములుతప్ప జంపువులుకూడా కాలుమోపే వీలులేదు. కొండచుట్టూ అక్కడక్కడా ఎర్రపూలచెట్లు విరగబూసి గాలికి వూగుతూ కొండకొనలు అంటుకుని మంటలు నాలికలుచాచి పెకిలేచి భగభగ మండుతోన్నట్టున్నాయి. రెక్కలకోసం తపస్సుచేసి ఎగరగల్గితే తప్ప ఆ పర్వతంమీదకు చేరడం అసాధ్యంగా తోస్తోంది.

"లక్ష్మణా! వనమంతా వృక్షాగ్రాలకు లతలుపాకి కౌగిలించుకుంటున్నాయి చూడు. కొండలన్నీ పూలరాసులవుతున్నాయి చూడు. ఆ పర్వతిని పెనవేసుకున్న కేతకీలత ఎంత విరగబూసిందో చూడు ! అయ్యో ! ఈ వసంతంలో సీతావియోగం నన్నెంతగానో బాధిస్తోంది ! .. ఆ నీరుకోళ్ళు చూడు! సరస్సులో, ఎట్లా ఈదుతున్నాయో ! ఎట్లా కూస్తున్నాయో! జలపక్షుల కూతలు వినగానే సీత నన్ను పిలిచి నవ్వుతూ చూపించేది గదా ?...." — రాముడు చంతమ్మఖుడైనట్లు ఆగి ఆలోచనలో మునిగాడు.

సీత .... పర పురుషుడి బాహువుల్లో .... ఆ దుర్మార్గుడు .... కౌగిలుకుడు .... దుఃఖిస్తో వుంటుందా ? మహా పతివ్రత .... ఆ నీచుణ్ణి వధ్యం చెయ్యవచ్చునే ! .... శక్తిలేదా ? .... ఎంత మాట ! .... మరి ?

ఈ అరణ్య వాసానికీ, కష్టాలకూ విసిగి పోయిందా ? రాజభోగాలకూ .... సౌఖ్యాలకూ లొంగుతుందా ? ... ఇష్టపడే వెళ్ళిందా ? .... ఏమిటీ చుష్క తలంపు ! పాపులు చుట్టుముట్టినట్లు మనసంతా ఈ ఆలోచన లేమిటీ ? ....

వనవాసానికి తనే ఇష్టపడి వచ్చిందే ! అడవుల్లో ఉన్నంతకాలం ఎంతో సంతోషం కనబరిచిందే ! .... ఎన్నడయినా .... అధిక శ్రమతో అలిసిపోయినప్పుడు కొంచెం నిరుత్సాహ పడేదిగానీ .... అంతలోనే ఎంతో సిగ్గుపడేది. నొచ్చుకునేది. ఎప్పుడూ తనకూ, రుషులకూ సేవలు చెయ్యాలనీ తపించేది. ఎప్పుడేం కోటు చేస్తానో అని జంకుతూ తిరిగేది. ఎందరెందరో పతివ్రతల కథలూ, చరిత్రలూ ఎంగొప్ప పతివ్రత

కావాలని కలలు కనేది .... అంతా మరిచిపోతుందా ? గతమంతా విస్మరిస్తుందా ? .... అట్లా జరగదు. ఎన్నటికీ జరగదు. సీతని పరపురుషుడు .... బలాత్కారంగా ఎత్తుకు పోవచ్చుగానీ .... అంతకన్నా ....

— రాముడి మనసు మహా భారం తగ్గి దూదిపింజకన్నా తేలిక అయిపోయింది. మందహాసంతో చుట్టూ చూశాడు. వసంతరుతు సౌందర్యం పదింతలు ఇనుమడించింది. వృక్ష శాఖలన్నీ కోయిళ్ళయి కూస్తున్నాయి. గాలిలో మంచిగంధం పరిమళాలు తేలుతున్నాయి. తుమ్మెదలు పొదలచుట్టూ కావచేస్తూ తిరుగుతున్నాయి.. విరగబూసిన చెట్లు, పట్టు బట్టలూ, ఆభరణాలూ ధరించిన ఉత్తమ పురుషులమల్లే కనిపించాయి. పంప చుట్టూ గుబిందల పొదలనిండా గుత్తులు గుత్తులుగా కాయలు వేళ్ళాడుతున్నాయి. "వనాలు పూచినప్పుడు సీత ఎంతో సంతోషించేది లక్ష్మణా ! ఈ ఎర్రని చిగుళ్ళు చూస్తోంటే సీత పెదిమలే గుర్తు వస్తున్నాయి .... ఆ సన్నని కనురెప్పలూ .... నున్నని చెంపలూ .... మెత్తని కురులూ ..... అయ్యో ! .... అన్నీ గుర్తుచేసి నన్ను బాధిస్తోందీ వసంత ఋతువు."—

సీతవుంటే ఈ అడవులన్నీ తిరిగితే, నిజంగానే పంపనిచూసి చాలా సంతోషించేది. ఆ గుబిందల పొదలన్నీ తిరిగి గుబిందకాయలన్నీ వాలిచి గింజలన్నీ వొలిచి పోసుకునేది. ఆ పచ్చగొట్టం పూలు నోట్లో పెట్టుకుని తేనె పీల్చేది. ఆ కొత్తపూలన్నీ తీగతోకట్టి రాముడి మెడనిండా వేసేది.

మొగలిపొదలంటే మాత్రం సీతకి కొంచెం జంకు.—" మొగలి పొదల్లో నలతామ లుంటాయంటారే !" —అంది ఒకసారి.

"మొగలిపొదల్లో ఏమిటి ? అంతఃపురాలలో కూడా వుంటాయి," — అన్నాడు రాముడు, మరొక ఆలోచనలో. సీతకొంచెం తెల్లబోయి — "నువెంగపొదల్లో కూడా వుంటాయా ?"— అంది.

రాముడు కొంచెం సర్దుకుని "గంభీరంగా వుండిన వుండవొచ్చును. లేకుండిన లేకుండవొచ్చును."— అన్నాడు. సీత నవ్వింది.

రాముడు నిట్టూర్చి — "లక్ష్మణా ! వసంతరుతువు ఎంత క్రూర మోయీ ! నా ప్రియురాలుకూడా క్రూరమైనదే,"— అని మళ్ళీ నిట్టూర్చాడు.

"అన్నగారూ !.... పర్వతంమీదకు దారి .... ఎక్కడా ...."

"అసలే దుఃఖంలోవున్న నన్ను.... అటుచూడు.... ఆ కోయిల ఎట్లా వెక్కిరిస్తోందో !"

లక్ష్మణుడు కోపంగా అటుచూశాడు.

కోయిల మెడసారించి ఎటోచూస్తూ కూస్తోంది. "అది వెక్కిరింతకాదు అన్నగారూ ! వసంతాగమనం చూసి దానికి కలిగిన పులకింత,"— వసంతగాలుల్లో లక్ష్మణుడికి కొంచెం కవిత్వం అబ్బింది.

"అంతేనా లక్ష్మణా ?"

"అంతే. అంతే అన్నగారూ ! అంతే."

"అయ్యో !.... ఆ చందన వృక్షంకింద మొగనెమలి చూడు. పురుషావేశంతో పురివిప్పి ఆడుతూ.... భార్యని సరసన వుంచుకుని దర్పంతో భార్యలేని నన్ను పరిహసిస్తోంది. నా భార్యను పరపురుషుడు తీసుకుపోయినట్టు దాని భార్యను ఎవ్వరూ * తీసుకుపోలేదుగదా ?

---

* 1వ సర్గలో 40 వ శ్లోకం.

"రాక్షసుడు.... ఈ నెమలియొక్క ప్రియురాలిని అపహరించుకొని పోలేదు. అందుచేతనే, మనోహరమగు అరణ్యములో భార్యతో గూడి అది నాట్యము చేయుచున్నది," అని నిట్టూరుస్తున్నాడు రాముడు. ఎవటివాళ్ళు సుఖంగా వున్నందుకు సంతోషిస్తూ వున్నట్టే పైకి కనబడినవప్పటికీ — దాని అంతరార్థం మాత్రం — "మనలాగే వాళ్ళకీ కష్టాలు రాలేదే ! సుఖంగా వున్నారే ! మనం మాత్రమే ఇలా కష్టాలు పడుతున్నామే !" — అనే ఏడుపుగొట్టు గుణం. — సుఖంగా వున్నవాళ్ళందరూ తనని ఎగతాళి చేస్తున్నారనీ, ఏడిపిస్తున్నారనీ అనుకోడం ఎందుకు ? — తనే సుఖంగావుండి, ఎదటివాళ్ళు కష్టంలోవుంటే తను

హా సీతా ! ఈ వసంతంలో నీ ఎడబాటు సహించలేకుండా వున్నాను! .... ఈ విరహాగ్ని నన్ను కాలుస్తోందే!" .

లక్ష్మణుడు బాణంతో గబగబా నెమళ్ళజంటని బెదరగొట్టాడు. — మొగనెమలి వుత్సాహం ఆపుకుని — ఆట కట్టిపెట్టి — చప్పున పింఛం ముడుచుకుని తోక వూపుకుంటూ ఆడనెమలి వెంట పరిగెత్తింది.

ఆడనెమలి మొగనెమలితో — "ప్రియా ! ఈ జంతువులు — ఇంటలు లేకుండా తిరుగుతున్నాయే ! ఆ నల్లజంతువు మనల్ని అనూయగా చూస్తోందే !" .... అని ఆశ్చర్యపడింది.

మొగనెమలి పుళ్ళి పింఛం విప్పుతూ — "వాటి గోడు మనకెందుకు ! రా చెలీ ! నాట్యం చేద్దాము. తలఎత్తి మబ్బుతెరలు చూడు! చల్లగాలులు చూడు ! పూలమేఘాలు చూడు !" — అని ఆటకు దిగింది.

(ఫుట్‌నోట్ : 130 పేజీ తరువాయి)

అలాగే చేస్తాడన్నమాట. ఆ గుణగణాలే ఎదటివాళ్ళకి ఆపాదించి చూస్తున్నాడు రాముడు.

కవి సమాజ ప్రభావంతోటే, పాత్రల చిత్తావృత్తులూ, స్వభావాలూ మలుస్తాడు. రాముడి పాత్ర దానికి అతీతమేంది కాదు. రాముకి మనస్తత్వానికీ, ఆలోచనా విధానానికీ, ఈనాటి మనస్తత్వాలకూ ఎక్కడా ఏమీ తేడా లేకపోవడమే మనం గమనించవలసిన విషయం.

• కిష్కింధ కాండలో —

1 వ సర్గలో — 41 వ శ్లోకం.

"ఈ వసంత మానసములో సీతను నెడబాసి యుండుట మిగుల దుస్సహముగ నున్నది." —.

వసంత ఋతువులో సీత లేకపోవడం రాముడికి చాలా కష్టంగా వుంది. మండుటెండల కాలంలో సీత లేకపోయినా, మన్మధబాధ ఏమీ వుండదు కాబట్టి, కష్టం అదీ ఏమీ వుండదు.ఈ భార్యలు అనలు ఎందుకు కావాలో ఇంతకన్నా రుజువేం కావాలి?

తన దృష్టి ప్రియుడి మీదనుంచి నల్లజంతువు మీదకు మరల్చి ఒక క్షణకాలం వ్యర్థ పరచుకున్నందుకు ఆడనెమలి సిగ్గుపడుతూ ఆటలో కలిసింది.

"లక్ష్మణా ! వసంతకాల వైభవమేమో ఎరుగుదువా ? పక్షులూ, జంతువులూ కూడా కామబాధవల్ల భర్తలకు దూరంగా పోవు, పోలేవు. శృంగారానుభవానికి అనుకూలమైన వాంఛలతో స్త్రీలు ఈ ఋతువులో పురుషుల సమీపానికి చేరతారు... ఈ వసంత...." చెప్తూ చెప్తూ ఆగాడు రాముడు.

సీతకుకూడా ఈ వసంతశోభ కామోద్దీపనం కలిగిస్తుందా ?.... సీతకూడా కామాగ్ని దహించి పురుషాలింగనాలకు తపిస్తుందా? సీతవున్న చోట వసంతఋతువు ఇలాగే వుంటే.... ఇలా వుండదా ? ఎందుకు వుండదు ? .... ఈ ఋతుశోభ లోకాలన్నీ వ్యాపిస్తుంది గదా ? * మరి సీత మన్మధ వశురాలవక తప్పుతుందా ?.... అసలే యౌవ్వనంలో వుంది. కామానుభవానికి దూరంగా వుంది.... పూలనీ, పక్షుల్నీ చూసి మైమరుస్తుంది. ఈ వసంతం ఎంత జడులకైనా చలనం కలిగిస్తుందే !.... సీత నిగ్రహిస్తుందా ?

---

* 1 వ సర్గలో — 47, 48 శ్లోకాలు.

"నా ప్రియురాలుండుచోట వసంత ఋతువు ఇటులనే యుండి నటులైతే, ఆమె మన్మధవశురాలైనా వలెనే దుఃఖించుచుండును,నిజము."

"సీతయుండు ప్రదేశములో వసంత ఋతువు వుండదు, నిజము. అటులది యుండినచో సీత వన్నెడబాసి యెటుల జీవించియుంచును ?"—

సీత వుండేచోట వసంత ఋతువు వుంటుందని కాస్సేపూ, వుండదని కాస్సేపూ, సతమత మవ్వతున్నాడు రాముడు. వుంటే, సీత కామబాధ పడాలి కదా ? —"నన్నెడబాసి సీత యెటుల జీవించియుండును?" — అని ఆశ్చర్య పడుతున్నాడు. సీతనెడబాసి తనెట్లు జీవించి యుండెనో మరి !

ముక్కుపుటాలు వుబ్బి, వీక్షణాలు తీక్షణమై భూమి అదిరే అడుగులతో ముందుకు నడిచాడు రాముడు.

"అన్నగారూ !.... అదే దుష్యమూక...."

"లక్ష్మణా !. గొప్ప పొరపాటే జరిగింది."

"చిత్తం !"

"సీతను అంతఃపురంలో బంధించి రాకపోవడం...."

"చిత్తం !"

"స్త్రీలు భర్తల ఆజ్ఞలు ధిక్కరించడం ఎంత దోషం !"

"చిత్తం !"

"అసలు నేను రావొద్దనే అన్నాను సుమా !"

"చిత్తం ! .... కా...."

"పరపురుషుడి గృహంలో ... నా భార్య.... ఎంత అగౌరవం ! .... ఎంత .. అప్ "

"చిత్తం !.... కానీ.... మన్నించాలి.... అది దైవ నిర్ణయమని .... పెద్దలూ.... రుషులూ...."

"హా ! .... దైవనిర్ణయం !.... సీతలేని నాకీ వనశోభ దేని కోయీ !.... ఆమె పరపురుషుడి గృహంలో దుఃఖిసూవుంటే .... నేనీ రుతుశోభ అనుభవించగలనా !.... అసలు నువ్వు సీతని.... ఆశ్రమంలో విడిచిరావడం.... నా ఆజ్ఞ మీరడం.... అయ్యో ! ఆ దుర్మార్గులు .... నా ప్రియురాలిని ... ముక్కుముక్కలు చేసి ..."

లక్ష్మణుడు మాట లేకుండా శ్రీరాముడి పాదాలమీద మోకరిల్లాడు.

రాముడు కొంచెం శాంతించి ఆలోచనలతో ముందుకు సాగాడు.

గాలి వేపపూత పరిమళాలు మోసుకు తిరుగుతోంది. పూలు పూసినచెట్లూ, అక్కడక్కడ రాసుకున్న విలాస పురుషులవల్లే ఘుమఘుమలాడుతున్నాయి. పూలగుత్తులు ఆకుల్లోంచి బయటకొచ్చి వూగుతూ లక్ష్మణుడి చెంపలకూ భుజాలకూ తగిలి దాక్కుంటున్నాయి.

లక్ష్మణుడు — పంచిదాని చూసుకుని తొందరగా పర్వతం ఎక్కి సుగ్రీవుడితో మాట్లాడాలని ఆరాట పడుతున్నాడు.

"అయ్యో ! ఈ పద్మాలు చూస్తోంటే సీత ముఖపద్మమే గుర్తు వొస్తోందే. ఈ వనమంతా.... పదే పదే సీతనే గుర్తు చెస్తోందే !.... ఈ విరహతాపం భరించలేకుండా వున్నానే !.... సీత ఎన్ని కష్టాలు పడినా ... నా మన్మధబాధ పోగొట్టేది కదా ? ఈ వనంతాగ్నిలో సీత లేకుండా జీవించగలనా ?" అని వాపోయాడు రాముడు.

లక్ష్మణుడు కొండవేపు చూస్తూ పరధ్యాన్నంగా— "చిత్తం ! జీవించగలరు అన్నగారూ !" — అని వొప్పుకున్నాడు. రాముడికి సమాధానాలు వినే అలవాటు లేకపోవడంచేత అన్నిక్షణాల మల్లేనే ఆ క్షణంకూడా నవ్యంగా, బహు దివ్యంగా సాగిపోయింది.

"లక్ష్మణా ! ఆ కాకి చూడు ! ఒకసారి సీతా నేనూ ముచ్చట లాడుకుంటూ వుంటే చుప్పనాతితనంతో కృూరంగా కూసింది. ఇప్పుడు చూడు. ఎంత సంతోషంగా కూస్తోందో !"

లక్ష్మణుడు ఆ కాకిని శ్రద్ధగాచూసి, వినయంగా వొంగి నమస్కరిస్తూ — "ఆ కాకీ, ఈ కాకీ వొకకాకి కాదు అన్నగారూ !" అంటూ విన్నవించాడు.

"అంతేనా లక్ష్మణా ?"

"అంతే అన్నగారూ : అంతే. ఆ కాకి ఆ కాకే. ఈ కాకి ఈ కాకే. నుండనుంచి విడిపోయిన ఏ కాకిలా వుంది అన్నగారూ! ఇది."

"అయ్యో ! ఈ అశోక పూలగుత్తులు చూడు. నన్నుచూసి వూగుతూ ఎలా వెక్కిరిస్తున్నాయో !"

లక్ష్మణుడికి కోపం వచ్చి దారి పొడుగునా అశోక పూలగుత్తలన్నీ ఫెళ ఫెళా విరిచి దూరంగా పారేశాడు.

దారి పొడుగునా మోదుగుచెట్లు కూడా ఆకులు కనబడనంతగా పూశాయి. తురాయి పూలగుత్తులు లక్ష్మణుడికి అందనంత ఎత్తున తలలూపుతున్నాయి. గాలి ఆకతాయి పిల్లమల్లే పువ్వు పువ్వుకీ, చెట్టు చెట్టుకీ కొండ కొండకీ తిరుగుతోంది. గాలి తెరలకు సరస్సులో పూలు అలలు అలలుగా వూగుతున్నాయి. పూలలోనించి తుమ్మెదలు ఝుమ్మంటూ

లేస్తున్నాయి. పూలు వొణికి, వూగి మధురస్మృతులలో మునిగి నిశ్చలం అవుతున్నాయి. ఘడియకో, క్షణానికో విప్పారే మొగ్గలు ఆకుల చాటు నించి అమాయకమైన ఆనందంతో తుమ్మెదల ఝుంకారాలు వింటున్నాయి.

"అబ్బ ! ఈ పూలు.... ఈ పరిమళాలు.... ఈ తుమ్మెదలు .... ఇవన్నీ ఇంతగా బాధించకపోతే ఈ విరహం....ఈ కామం సైచుకునేవాడినే * అయ్యో ! ఈ వసంత రుతువు.... పదేపదే నా భార్యను గుర్తుచేస్తోందే !" అంటూ అగ్నిపర్వతంమల్లే నిట్టూర్చాడు రాముడు — "లక్ష్మణా ! ఈ పంపా సమీపంలో.... ఈ వనశోభలో పతివ్రత అయిన సీత నా సరసన వుంటేనా.... ఇకనేను స్వర్గమైనా కోరను.

---

* 1 వ సర్గలో 69 వ శ్లోకం.

"పూచిన వృక్షములు గల వనంతమైనను నన్ను హింసింపక యుండినటులైతే ఇపుడు కలిగిన కామమును సైచుకొని యుందును." — అని తన ప్రత్యేక గొప్పతనం వెల్లడించుకుంటున్నాడు రాముడు — అసీ ఆయన ఇంద్రియ నిగ్రహం ! తను గొప్ప జితేంద్రియుడే గానీ, చెట్లు ఝాసేస్తున్నాయే మరి — భార్య బతికేపుందో — చచ్చిపోయిందో తెలీదు. ఆమె క్షేమంగురించి ఎటువంటి ఆలోచనా లేదు. "కామబాధో ! కామబాధో !" — అని వొకటే గోల. స్త్రీని పురుషుడు ఎందుకు వుప యోగించుకుంటాడో, ఏందుకోసం, ఆమె తనవద్దిర వుండాలని కోరు కుంటాడో, ఈ ఘట్టంలో మహా స్పష్టంగా, ఎటువంటి దాపరికాలూ లేకుండా తెలుస్తుంది. సీతతో రాముడికి శారీరకమైన అవసరమే, అవ సరం. అంతకుమించి ఆమె కావాలనుకోవడంలో ఇంకో అవసరం ఏమీ లేదు.

అయోధ్యకే తిరిగి పోను."—అంటూ మళ్ళి వడగాల్పుమల్లే నిట్టూర్చాడు. *

చెట్టు పూలు పూయకపోతే.... కోయిళ్ళు కూతలు కూయకపోతే .... తుమ్మెదలు ఎగరకపోతే ధాన్యని మర్చిపోగలిగే రాముడు — ఆ పంపా సరోవరం, గ్రీష్మఋతువులో.... మందుకొండలకు నీళ్ళన్నీ ఎండి.... లతలన్నీ వాడి ... చెట్లన్నీ మోళ్ళై.... వసంత ఋతుశోభ కోల్పోయి నప్పుడు సీతకన్నా అయోధ్యే అధికమవుతుందనే విషయం కూడా మర్చిపోయాడు ....

"అయ్యో ! ఈ వసంతాగ్ని నన్ను క్రూరంగా.... నిర్దయగా కాలుస్తోందే !.... లక్ష్మణా ! పంపాజలం తీసుకురా నాయనా !"

లక్ష్మణుడు గబగబా పంపవొడ్డుమీద పూలు తొక్కుకుంటూ లోపలికి దిగి తామరాకులు తెంచి దొన్నెనిండా నీళ్ళు తెచ్చి అన్నగారికి అందించాడు.

రాముడా నీళ్ళతో మొహం తడుపుకొని — "అయ్యో ! పంపా జలంకూడా ఇంత పరిమళ భరితంగా వుందే !.... నా కామాగ్ని వృద్ధి చేస్తోందే !" — అంటూ పెగలు గక్కాడు. అన్నగారి వ్యవహార మేమీ అర్థంగాక, ఏ అగ్ని తనను కాల్చలేనట్టు భీకరంగా నిల్చున్నాడు లక్ష్మణుడు.

"నువ్వే కామశాస్త్రమూ చదివినట్టు లేదే !" — అని పరిహాసంగా అడిగింది లక్ష్మణుడి ఇంగితం. లక్ష్మణుడు మాట్లాడ దల్చుకోలేదు.

---

* 1 వ సర్గలో — 95 వ శ్లోకం.

"పతివ్రతయగు సీత ఇచట లేకపడి .... ఆమెతోడ ఇచట వసించుటకు గలిగినటులైతే ..... నేను ఇంద్రపదవినీ, అయోధ్యకు పోవుటనూ గోరను." — సీత, పతివ్రత అయిన స్థితిలోనే కనపడాలి. రావణుడు ఆమెని బలాత్కరించి, పొదిలేసిపోయి కనబడితే కుదరదు. ఈ అభిప్రాయం రాముడి ఆలోచనల్లో మొదటినించీ వుంది. ఈ విషయం గమనిస్తూ వుండాలి.

"అవునే ! నీ అన్న పావసేవాశాస్త్రం తప్ప ఇంకేమీ చదివి వుండవు. చదివితే మాత్రం నీకెక్కడ గుర్తు ? నువ్వేం మహానుభావుడివా ?"

"ఏమిటి నీ దురుసుతనం ?"

"ఎందుకంత విసుక్కుంటావు ? ఇదే గోల నీతో. నీ క్షేమం కోసం మాట్లాడితాననన్నా నీకు తెలీదు."

"అక్కడికి నువ్వు నా క్షేమం కోరేదానివీ — నా అన్నగారు నా క్షేమం కోరనివాడూనా ?"

"ఇన్ని ప్రశ్న లెందుకుగానీ ... నిన్నేమీ చెయ్యలేని ఈ పూలూ .... గీలూ.... నీ అన్నని అగ్నిలో పడేసి కాల్చేస్తున్నాయి. ఏమిటీ సంగతి ?"

"బాగుంది. ఆయన అనురాగం అటువంటిదీ భాగ్యమీద."

"నీమీద నాకు చీవర పుడుతోంది గానీ .... ఎందుకులే ; ... నువ్వేం చేస్తావు ? అంత అనురాగం వున్నవాడు తొందరగా సుగ్రీవుడితో మాట్లాడాలని ప్రయత్నమే చెయ్యడేం ?"

"ఎందుకు చెయ్యడూ ? .... ఆయనే చేస్తాడు. చెయ్యక ? చెయ్యకా ? ఈ పువ్వులూ అవీచూసి.... భార్య గుర్తొచ్చి దుఃఖిస్తున్నాడు గానీ...."

ఇంగితం నోరు మూసుకుంది.

"శ్రీరాముణ్ణే తప్పుపడతావేం ?" ....అని కోపంగా విసుక్కున్నాడు లక్ష్మణుడు.

"లక్ష్మణా ! ఈ వియోగ బాధతో నేను జీవించలేను సుమా ! .... అదుగో ! .... ఆ మొగలిపొద సమీపంలో నీలుకోళ్ళు చూడు .... ఆడపక్షి తప్పుకోబోతే .... ఆ పురుష పక్షి .... బలాత్కారంగా ... కుక్కుట న్యాయంతో .... ఎట్లు ...." — నోట్లో మాటలు నోట్లో వుండగానే అదిరిపడ్డాడు రాముడు. నవనాడులూ కృంగిపోయినంత అలసి

జడి కలిగింది. — రావణుడు హరిస్తే ఇంతేనా ! .. సీతని .... బలాత్కారంగా . స్త్రీలు అబలలు ! బలహీనులు ! సీత నిస్సహాయంగా .... లొంగి పోతుందా ? .... మహా పతివ్రత ! .... ఇంకెక్కడి పతివ్రత ! ఆ నీచుడు .... పర పురుషుడు .... నానా శ్రమలకూ వోర్చి .... మృత్యువుకు కూడా వెంచి .... తీసుకుపోయినవాడు కరుణిస్తాడా ? పరస్త్రీ వ్యామోహితుడు వాంఛ పరిపూర్తి చేసుకోక ....

చేతిలో విల్లు పట్టుదప్పిపోయింది. రాముడు నేలమీదికి వొరగ బోతోంటే లక్ష్మణుడు ఆందోళన పడుతూ పట్టుకున్నాడు.

"లక్ష్మణా ! సీతని ...."

"అన్నగారూ ! ధైర్యం వహించండి."

రాముడి కళ్ళవెంట జలజలా కన్నీళ్ళు రాలాయి — "ఇంకెక్కడి ధైర్యం ! లక్ష్మణా ! .... ఆ దుర్మార్గుడు .... సీతని .... బలాత్కరించి .... తినేసి వుంటాడా ?"

"కాదు. అన్నగారూ ! అట్లా ఎన్నటికీ జరగదు. ఆ మహా పూజ్యురాలిని .... ఎవ్వరూ ...."

"ఏమి పూజ్యురాలు ! .... ఎత్తుకుపోతోంటే ఆపగలిగిందా ?"

"మన్నించండి అన్నగారూ ! .... అంతా విధి వశాన .... ఆ మహా పతివ్రతని .... ఎవ్వరూ ...."

"లక్ష్మణా ! నీ మాటలు నా కెంతమాత్రం ఊరటి కలిగించడం లేదోయీ ! .... అనలు సీత రాకుండావుంటే ఎంత బాగుండేది ! అంతఃపురాలలో స్త్రీలకు ఎంత క్షేమం ! .... ఎంత రక్షణ ! ...."

"మన్నించండి అన్నగారూ ! వదినగారు మీ పాద సేవకు దూరమై అంతఃపురాలలో ఉండగలరా ?"

రాముడికి సర్రున కోపం వచ్చింది — "అసలు నువ్వే రమ్మన్నావా ఏమిటీ ? అవును. నాకు తెలుసు. బాగా నూరిపోసి తీసుకొచ్చావు" అన్నట్టు చూశాడు.

లక్ష్మణుడు ఆ చూపులకే జంకి — చేతులు జోడించి మౌనం వహించాడు.

దీర్ఘంగా ఆలోచనల్లో మునిగిన రాముడు హఠాత్తుగా తల ఎత్తి — "పతివ్రతల్ని .... పర పురుషులు ఎత్తుకుపోయిన కథలు .... ఎన్నడయినా విన్నావా ?" .... అని ఆత్మగతంగా చూశాడు.

లక్ష్మణుడు గబగబా ఆలోచించాడు.

ఎందరో స్త్రీలను .... పర పురుషులు బలాత్కారంగా ఎత్తుకు పోయిన చరిత్రలు విన్నాడుగానీ .... ఆ పురుష లెవ్వరూ ఆ స్త్రీలని వదిలినట్టు వినలేదు.

"పూర్వం ...."

"ఊఁ .... పూర్వం ? .... తొందరగా చెప్పు"

"ఇంద్రుడి భార్యని ...."

"ఇంద్రుడి భార్యనే ! రావణుడేనా ?"

"కాదు అన్నగారూ ! .... వేరొక క్షుద్ర రాక్షసుడు...."

"ఊఁ .... ఏం చేశాడు ?"

"ఎత్తుకుపోయాడు."

"ఎత్తుకుపోయి .... ?"

"తర్వాత ఇంద్రుడు ఆ రాక్షసుడిమీద యుద్ధంచేసి .... భార్యని విడిపించి తెచ్చుకున్నాడు."

"తెచ్చుకున్నాడా ? .... అది నరేనోయీ ! .... ఆ రాక్షసుడు ఆ పతివ్రతని ...."

"ఏమీ చెయ్యలేదు అన్నగారూ !"

"ఏమీ చెయ్యలేదా ?.... అయితే ఎత్తుకుపోవడం ఎందుకూ ?"—

ఎందుకో చెప్పలేకపోయాడు లక్ష్మణుడు. తల వంచుకున్నాడు. అన్నగారికి ఇంకే కథలూ చెప్పలేనందుకు చాలా సిగ్గువడ్డాడు.

రాముడి ఆత్మ .... కొంచెం కోపంగానే .... ధైర్యంగానే విసుక్కుంది — "ఇదేం న్యాయం ? ... సీత మహా పతివ్రత అని తెలియదా ? ఆమె ఆత్మహత్య చేసుకుని మరణించనయినా మరణిస్తుంది

గానీ .... వర పురుషుడి వశమవుతుందా ? ఎందుకీ దుష్ట శంకలు ?.... నాకు నచ్చలేదు సుమా !" — అని ఊరుకుంది. *

రాముడికి గొప్ప జ్ఞానోదయం కలిగినట్టు సంతోషం కలిగింది. అవును. సీత పతివ్రత. పతి సేవే .... పతి భక్తే ఆమె వ్రతం. ఆమె ఎన్నడూ రావణుడికి లొంగదు. అంత దుర్మార్గానికి వడిగట్టదు.

రాముడి మనసంతా పండుటాకుమల్లే తేలికై పోయింది. పుట్టెడు బలంతో లేచాడు. జగత్తంతా ఆనంద సముద్రమై గోచరిస్తోంది. గాలి కోవిదార పూల వాసనలు మోసుకుపోతోంది. పంపలో రెండు ఏనుగులు

---

* 1 వ సర్గలో — 51 వ శ్లోకం.

"నా విరహాముగల సీత జీవించుటకు సాధ్యముకాదు. ఏలననగా ఆమె పతివ్రత. నా మనసులో నిటుల దోచుచున్నది" — అని ఆలోచనలు చేస్తున్నాడు రాముడు. — వసంత రుతువులో సీతకూడా విరహ బాధ పడుతుందని రాముడు ఒప్పుకున్నాడు. అయితే మరి, ఆమె ఏం చేస్తుంది ? అన్నదే ప్రశ్న. సీత రావణుడి దగ్గర ఉండడంవల్లనే ఆమె ప్రవర్తన గురించి ఇంత ఆలోచించవలసి వచ్చింది రాముడికి. విరహ బాధవల్ల సీత జీవించడం సాధ్యంగాకపోతే బ్రతికే అవకాశం కూడా ఒకటి వుంది — అది రావణుడికి వశం కావడం. "కానీ అలామాత్రం జరగదు. ఆమె పతివ్రత కాబట్టి చచ్చిపోనయినా చచ్చిపోతుందిగానీ ఇంకో రకంగా ప్రవర్తించదు" — అనే విషయం రాముడు నిర్ధారణ చేసుకుంటున్నాడు.—వసంత రుతువూ— చచ్చిపోయేంత విరహమూ. అన్నీ ఫ్యూడల్ సాహిత్యంలో అతిశయాలే. ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం ఏమిటంటే, పాతివ్రత్యానికి సహజంలో ఉన్న విలువ. — ఒక స్త్రీ చచ్చిపోనయినా చచ్చిపోవాలి గానీ, పర పురుషుడితో సంబంధం పెట్టుకోకూడదు. సీత విరహంతో చచ్చిపోతే రాముడు సంతోషిస్తాడు గానీ, ఆమె మళ్ళీ కంటపడి పతివ్రత కాదని తెలిస్తే ఆమెతో జీవితం ఇష్టపడడు. ఈ "విలువలు" మాత్రమే మనం అర్థం చేసుకోవాలి.

దిగి, తొండాలతో చుట్టూ నీళ్ళు జిమ్ముతున్నాయి. ఒకదానిమీద ఒకటి జిమ్ముకుంటున్నాయి ఆట మల్లే. తుమ్మెదలు పూలచుటి వెదుకుతూ తిరుగుతున్నాయి. చెట్లు గాలికి తలబూపుతూ, కొమ్మలూ, కొమ్మలూ కాకుతూ, చేతులు కలుపుకుని నాట్యం చేస్తున్నాయి.

పిట్టలన్నీ హఠాత్తుగా సంతోషవార్త విన్నట్టు గంతులేస్తున్నాయి. — "పంపలో గడ్డి దుబ్బులనిండా బోలెడు పురుగులున్నాయి. ఇప్పుడే కదుపునిండా తిని వచ్చాను. వెళ్ళండి. తొందరగా వెళ్ళండి."

"మొన్న తినేశాంగా ?"

"కాదు. మళ్ళీ ఉన్నాయి. వెళ్ళండి తొందరగా."

"ఏం పురుగులు ? ఎర్రవేనా ? .... పచిగా వున్నాయా ?"

"అబ్బో ! .... మళ్ళీ నా నోరూరుతోంది. పదండి నేనూ వస్తాను"— పిట్టలు గుంపులు గుంపులుగా అడిపంతా ఎగురుతున్నాయి.

"లక్ష్మణా ! .... అటు చూడు ! పంపకు దక్షిణంవేపు పర్వత పాదంలో మధూక లతలు విరగబూచి నన్ను పీడిస్తున్నాయి సుమా !...."

"అటు చూడకండి అన్నగా ...."

"ఇటు చూడు .... జింకలు జంటలు జంటలుగా .... జింక కన్నుల సీతను గుర్తు చేస్తున్నాయి చూడు" !

"ఇటు చూడకం ..."

"అయ్యో ! .... ఈ పక్షులు నాకు కామోద్దీపనం కలిగించడానికే గుంపులు గుంపులు చేరుతున్నాయే !"

"ఎటూ చూడకండి అన్న ...."

లక్ష్మణుడి నలహాలన్నీ వ్యర్థం అయిపోయాయి.

రాముడు రుష్యమూక పర్వతం తప్ప అన్నీ చూస్తున్నాడు.

చెట్లని అల్లుకున్న తీగలు బలిసిన స్త్రీలమల్లే కనిపించి, రాముడి మన్మధ బాధ వృద్ధి చేస్తున్నాయి. *

"ఈ వసంతరుతువు కుటిల స్వభావం ఆశ్చర్యంగా వుంది. సీతనే మాటిమాటికీ గుర్తు తెస్తోంది."

లక్ష్మణుడు చుట్టూ చూస్తున్నాడు — ఎక్కడయినా ఆశ్చర్యంగా సీత కనపడుతుందేమోనని.

రాముడు వెతకడం మానేశాడు — అదంతా లక్ష్మణుడి పని అయినట్టు.

"ఆ హరిణి చిగుళ్ళు ఎర్రని జ్వాలలై మండుతున్నాయి చూడు .... అయ్యో! లక్ష్మణా!.... ఈ మదనుడు .... మిక్కిలి క్రూరంగా ....హింసిస్తున్నాడే!" అని విలవిల్లాడుతూ మూర్ఛగిల్లాడు భూమి మీద.

లక్ష్మణుడు తుళ్ళిపడి గిర్రున వెనక్కి తిరుగుతూ కత్తి తీశాడు. — "ఎవరు? .... ఎవరు అన్నగారూ? యెవరు మిమ్మల్ని హింసించింది? ... ఎవడా దుర్మార్గుడు"? అంటూ చుట్టూ చూశాడు.

రాముడు నిట్టూర్పులతో — "ఈ మదనుడు .. పూల విలుకాడు .... వసంతాగ్నితో కుమ్మక్కుపడి ...."

---

* 1 వ సర్గలో — 84 వ శ్లోకం.

"ఈ వృక్షములను, మదించిన (బలిసిన) ఉత్తమ స్త్రీల వలే లతలు ఆలింగనము చేసుకొనుచున్నవి".

— హ్యూడల్ సాహిత్యంలో వుత్తమ స్త్రీలు అంటే బలిసిన స్త్రీలు! ఆ బలవడం అస్తవ్యస్తంగా, ఎలా బడితే అలా బలవకూడదు. స్తనాలు బలవాలి. నడుం చిక్కి శల్యం అయిపోవాలి. తొడలూ, పిరుదులూ బలవాలి. పెదాలూ, చెక్కిళ్ళూ, పల్చగా, సన్నగా, ఆకులమల్లే అయిపోవాలి. ఈ రకంగా, చెక్కిళ్ళు చిక్కి, స్తనాలు బలిసి, నడుం చిక్కి, తొడలు బలిసి ... తీగమల్లే మెలికలు తిరిగిపోతూ వుంటే — ఆ స్త్రీ ఉత్తమ స్త్రీ: పద్మినీజాతి స్త్రీ:—పురుషుడు ఈ వుత్తమ స్త్రీనే కోరతాడు. స్త్రీ శరీరం పురుషుడికి అంత ఆనందం కలిగించని విధంగా ఉంటే — ఆమె శంఖినీజాతి స్త్రీ: అధమాధములాలు!

"మదనుడా ? .... మదను డెవరు ? .... ఓహో ! మన్మధుడా ?" — అని ఆవేశం తగ్గి — "సరి. ఇక వాడినేం చేస్తాం ? తుంచరి పన్యాసి" అన్నట్టు కత్తి వొరలోపెట్టి ఆలోచిస్తూ నించున్నాడు.

"లక్ష్మణా ! .... ఈ చల్లగాలి ...."

"అన్నగారూ !.... నాకు శెలవిస్తే .... సుగ్రీవుడికోసం పోయి వస్తాను."

"సుగ్రీవుడా ? సుగ్రీవు డెవరు ?" — అన్నట్టు చూశాడు రాముడు.

లక్ష్మణుడు తన ధోరణిలో — "అన్నగారూ ! ... అదే రుష్య మూక పర్వతం. కబంధుడు చెప్పినట్టు .... అక్కడికి పోవడం కష్టం గానే తోస్తోంచి... అయినా ప్రయత్నించి, కార్యం సాధించుకు వస్తాను. శెలవిప్పించండి" — అని వంగి నమస్కరించాడు.

కబంధుడు .... పొట్టలో మొహం .... దహనం .... వంపా సరస్సు .... చేపలూ కొయ్యలూ .... రుష్యమూకం — ఓహో ! సుగ్రీవుడా ? — అంతా గుర్తొచ్చింది రామునికి.

నిరాశగా నిట్టూర్చాడు — రాజ్యంలేని సుగ్రీవుడెలా సహాయం చెయ్యగలడు ? రాక్షస రాజుతో యుద్ధం మాటలా ? సైన్యం ఉండాలి. బొక్కసం ఉండాలి.

"ఇంతకీ .... మనం సుగ్రీవుడి కేదో సహాయం చెయ్యాలన్నావే కబంధుడు ! అదేమై ఉంటుందో ఆలోచించావా ?"

"అక్కడికిపోయి అన్నీ తెలుసుకుని వస్తాను అన్నగారూ !"

రాముడు చుట్టూ చూశాడు. అంతా ప్రశాంతంగానే వుంది పక్షులూ, జింకలూ తప్ప .... కృత్రిమంగాలేవీ ....

"లక్ష్మణా ! .... నా సీత నాకు దక్కుతుందా ? నేనీ శోకంతో విరహంతో .... కృంగి కృశించి, వశించిపోతానోయీ ! .... నా భార్య

యౌవ్వనవతి. సౌందర్యరాశి. నిర్దోషి. నిర్దోషి * మదించిన ఉత్తమ స్త్రీలవలే వీపుగా పెరిగిన లతలు వృక్షాలను విడువకుండా పెనవేసుకునే ఉన్నాయి చూడు. గాలి రకరకాల సుగంధాలు తాగి.... మత్తెక్కి పిచ్చి వాడివలే సంచరిస్తోంది చూడు .... ఈ శోభలన్నీ కాంతలతో కూడిన పుణ్యపురుషులే అనుభవించగలరు గదా ? ... " —

కాంతలు ! ... పరకాంతలు .... రావణుడు .... ! మళ్ళీ .... ఏమిటీ ఆలోచన ? ... కూడదు. కూడదు.

"నా సీత .... సోయగాలు .... చక్కని కనురెప్పలు .... కురులు .... చెక్కిళ్ళు ..." — భార్యని పర పురుషుడు ఎత్తుకుపోయిన తర్వాతే భార్య అందాలు .... పదే పదే గుర్తు వస్తున్నాయి రాముడికి. అంత అందమైన తన భార్య .... పర పురుషుడి గృహంలో.... — ఈ ఆలోచనలు ఎడిచిపోకుండా ఉన్నాయే తన మనసుని ! ఆశ్చర్యంగా ఉంది. సీతకు తనపట్ల ముక్కలి అనురాగం .... తనూ

---

* 1 వ సర్గలో — 110 వ శ్లోకం.

"మనోహరమైన కనురెప్పలతో గూడిన కన్నులు గలదియూ, సువాసనలు గలదియూ, కాంతి గలదియూ, నిర్దోషి యైనదియూ .... నగు సీత ముఖమును చూడకయుండు నా మనసు దుఃఖించుచున్నది". —

సీతని రావణు డెత్తుకుపోకముందు, సీత గురించి ఎక్కడ వర్ణన వొచ్చినా ఈ "నిర్దోషి" అనే మాట ఎక్కడా రాలేదు. ఇప్పుడీ నిర్దోషి అనే మాటకు అర్థమేమిటి ? "ఆమె దోషం చేసిందా ? చెయ్యలేదా ?" అనే సంశయానికి జవాబు ఇది. "ఆమె దోషం చెయ్యలేదు సుమా ! రావణుడితో ఇష్టపడి వెళ్ళలేదు సుమా !" — అని రాముడు తనకుతను సర్ది చెప్పుకోవడం. లేకపోతే "నిర్దోషి అయిన సీత ..." "నిర్దోషి అయిన సీత ...." — అని అస్తమానూ గుర్తు చేసుకోవలసిన అవసరం ఏముంది ?

భార్య యౌవ్వనవతిగా ఉండాలి. సౌందర్య రాశిగా ఉండాలి. నిర్దోషిగా ఉండాలి. అలా వున్న భార్య పోతే, భర్త వసంతకాలంలో కాస్పైపు ప్రేమగా ఏడుస్తాడు.

ఆమెపట్ల ఆ విధంగానే అనురాగం చూపించాడు. * సీత సామాన్యురాలు కాదు సుమా ! .... మహా పతివ్రత ! నిర్దోషి !

"లక్ష్మణా ! సీత పతివ్రతల మార్గం అనుసరించి కష్ట నిష్ఠూరాల కోర్చి నావెంట వచ్చింది. రాజ్య భ్రష్టుణ్ణయి మతిచెడివున్న నన్ను వొదలకుండా తిరిగింది. అటువంటి సాధ్వి నాకు దూరం అయిపోయిండే !

రేపు అయోధ్యకు పోయిన తర్వాత సభలో "సీత క్షేమంగా వుందా ? ఏదీ ?" — అని జనకమహారా జడిగితే ఏమని చెప్పగలను ? — నా కోడలేదని నా తల్లి అడిగితే ఏమి చెప్పగలను ?"

---

* 1 వ సర్గలో — 52 వ శ్లోకం.

"సీత నా యెడల అనురాగమును బాగుగ నుంచియున్నది. నేను కూడ ఆమెలనే సీత యెడల అనురాగమును సర్వ విధముల చేతనూ యుంచియున్నాను". — ఇది కేవలం వసంతరుతు వర్ణనో, సరస్సు వర్ణనో కాదు. రాముడు తనకూ, తన భార్యకూ మధ్యవున్న సంబంధం ఎట్టువంటిదో ఏమిర్మించుకొలుచున్నాడు. ఆమె తనని ప్రేమించింది. సరే ! తనుకూడా ఆమెని బాగానే ప్రేమించాడు. కష్ట పెట్టలేదు. పోనీ తను ఆమెనేమైనా కష్టపెడితే ఆమె పరపురుషుడిమీద ఇష్టం చూపడానికీ సీతి తప్పడానికీ అర్థం ఉంది. — తను అట్టా చెయ్యలేదే ! — అనే సంఘర్షణ ఇది. "సీత తప్పు చేస్తుందేమో !" — అనే ఆలోచనే దీనికి మూలం.

భార్య పర పురుషుని అధీనంలో ఉన్నప్పుడు భర్తకి యెటువంటి ఆలోచనలూ, సందేహాలూ వస్తాయో, అవన్నీ కవి మనసులోకి వస్తున్నాయి. వాటినే చిత్రిస్తున్నాడు.

పైకి — "ఆదర్శ దాంపత్యం" అనీ, "అనురాగం" అనీ ఎన్ని తెరలు కప్పినా, ఎంత కవిత్వంతో చెప్పినా, సీతకీ రాముడికీ మధ్య ఉన్న సంబంధాన్ని తర్కించి చూసినప్పుడు, అది ప్యూడల్ సమాజంలో సామాన్యమయిన భార్యా భర్తలమధ్య ఉన్న సంబంధం లాంటిది మాత్రమే.

"అక్కడ భరతుడు సుఖ భోగాలు పడిచి మన జీవనంతో కాలం గడుపుతున్నందుకే దుఃఖంతో కృంగిపోతున్నాను. అంతలో ఈ భార్యా వియోగం : .... అదీ చాలక, నిలువెల్లా దహించే ప్రాణాలు వీసే ఈ మన్మథ బాధ ! .... ఇక నేనేమి జీవిస్తాను ? లక్ష్మణా ! నువ్వు అయోధ్యకు వెళ్ళిపో నాయనా ! భరతుడు బహు యోగ్యుడు. సోదర రాజ్యలక్ష్మి గలవాడు. * అతడి దగ్గర సుఖంగా జీవించు. నేనీ వనంలోనే ప్రాణాలు విడుస్తాను. సీత లేకుండా నేను ఒక్క క్షణమైనా జీవించలేను సుమా !" — అని భుజాలు కదిలిస్తూ కుప్పలడం మొదలెట్టాడు.

---

* 1 వ సర్గలో 6వ శ్లోకం — 104 వ శ్లోకం.

"భరతుడు నగరమున్నకు వెలుపల వసించి, వ్రతోపవాసములు చేయుటచే కరిగిన దుఃఖము చేతనూ . సీతాపహరణముచే తనూ .... మఖించుచుండు మన్ను వసంత ఋతువు పీడించుచున్నది" — భరతుడి గురించి రాముడు పడుతోన్న దుఃఖం ఇంతవరకూ మన కళ్ళపడలేదు. వాటుగా కుములుతున్నాడేమో మరి, కవిగారికి కూడా తెలీదుంటా. భర్త క్షేమం గురించి ఏ దుఃఖమూ లేదు. "లక్ష్మణా ! అయోధ్యకు పో సుమ్మా" అంటున్నాడు రాముడు.

నిజంగా పెళ్ళమనే ? లక్ష్మణు డెలాగూ పెళ్ళడుకదా అని. పెళ్ళడని బాగా తెలుసు .... వూరికే పైకి అలా అనడం. పెళ్ళడని తెలిసి నప్పుడు అలా అనడం ఎందుకు ? అంతా నటన : వంచన ! .... తనతో కలిసి జీవిస్తూ, తనతో కష్టాలు పడుతోన్న తమ్ముణ్ణి — "నువ్వెళ్ళిపో నాయనా !" అని మాటపరసకి అన్నంత మాత్రాన వుతమ్ముడెపోతాడా రాముడు ? — "సరే అన్నగారూ ! వెళ్ళేదను" — అని లక్ష్మణుడు పెనక్కి తిరిగితే ఎంత బాగుండును ! (లక్ష్మణుడు అలా చేస్తా డనుకో వటం అశాస్త్రీయమైన ఆలోచన. అది అతని (ఫ్రాయిడ్) మన స్తత్వా నికి విరుద్ధం. అందుచేత అలా జరగదు. సమాజంలో మామూలు మను షులు పైకి మర్యాదకీ, నటనకీ, మొహమాటానికీ మాట్లాడినట్టే రాముడూ మాట్లాడతాడు. ఈ సమాజ ప్రభావాన్ని మించిన "ఆదర్శ జీవితం" కవికీ తెలియదు.

లక్ష్మణుడికి చాలసేపట్నించీ దాహంగా వుంది. పంపలోకి దిగి పంచినీళ్ళు తాగాలని ఆలోచిస్తున్నాడు. అన్నగారి దుఃఖం చూడగానే క్షుద్ర దాహ వాంఛా, పర్వతం ఎక్కాలనే తొందరా, కట్టిపెట్టి చేతులు పట్టి. వినయంగా అన్నగారి పాదాలు పట్టుకొని మోకరిల్లాడు. —

"పన్నించంతి అన్నగారూ : ఈ అల్పుడు మీకు బోధించదగ్గవాడు కాదు. మీరు బహు ఉత్తములు. ధైర్యస్థులు. వీరాధివీరులు. మీ ఉత్తమ గుణాలు మీరు విస్మరించడం న్యాయంకాదు. మీవంటి ధీరులు ఈ విధంగా నిస్పృహ చెందడం ధర్మమేనా ? ప్రియమైనవారు విడిపోయినప్పుడు దుఃఖం కలగడం లోకంలో సహజమే కదా ? అందుచేత కొంతకాలం దూరంగావున్న ఆప్తులమీద విశేషమైన అనురాగం తగ్గించుకొని, ధైర్యం వహించాలి. .... అహా ! .... మీకు చెప్పగలవాడినని కాదు సుమా : కార్యాలు చెడిపోయినప్పుడు పురుష ప్రయత్నం చెయ్యకుండా కార్యాలు సానుకూలపడవు గదా ? ఉత్సాహాన్ని మించిన బలమేముంది? — మీ కెరుగని విషయం కాదు. ఉత్సాహమే వుంటే సాధించలేని కార్యమేముంది ? శక్తి సామర్థ్యాలుగల మీవంటి పురుషోత్తములు కార్య సాధన విషయంలో ఇంతగా దుఃఖించరాదు గదా ?...."

రాముడు గుడగుడమంటూ కుములుతూనే వున్నాడు.

లక్ష్మణుడు నిరుత్సాహపడలేదు. మాటలు వేరూ, చేతలు వేరూ కాని లక్ష్మణుడు ఉత్సాహం కూడగట్టుకున్నాడు — "అన్నగారూ ! ధైర్యం వహించండి. మీరు ఆత్మ నిగ్రహులు. ఇంద్రియాలు జయించిన వారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు కలగవు మీకు. ఈ క్షుద్ర కామ వాంఛకు మీరు లొంగరాదు కదా ! .... ఈ శోకం ..... ఈ కాష్ఠం ..... వెంటనే విడిచి పెట్టెయ్యాలి.

మీరు • ఈ బేలతనం కూడదు. మీ ధైర్యం ఏమైపోయింది ? మీ ధైర్య సాహసాలతో వదినగార్ని వెదికి సాధించగలరు. రావణుడు పాతాళ లోకానికి పోయినా.... ఇంకా లోతయిన లోకానికి పోయినా మీ కరుకు బాణాలు అతణ్ణో విడిచిపెట్టవు గదా ? .... ఆ దుర్మార్గుడు .... తనకు తానుగా వదినగార్ని తెచ్చి అప్పగించక పోయాడో .... నేనే .... అక్కడికిపోయి ... "

రాముడు దుఃఖ సముద్రంలోంచి కొంచెం తలఎత్తి కనులుతూ — "అయ్యో ! .... పిచ్చివాడా ! .... పురుషుడు .... పరస్త్రీని తనకు తానుగా అప్పగిస్తాడా ? ... " అని, "నేనైతే అప్పగించను సుమా !" అన్నట్టు చూసి మళ్ళీ కుమిలడానికి తల వొంచుకున్నాడు.

1వ సర్గలో — 116 నించీ 128 వ శ్లోకం వరకూ —

లక్ష్మణుడు రాముడికి ఏ విధంగా ధైర్యం నూరిపోశాడో చూడండి.

"....దుఃఖం విడిచిపెట్టు. కామం విడిచిపెట్టు.... మంచి మనసు గలవానివిగనూ .... ధైర్యము గలవానివిగనూ నిన్ను నీవు తెలుసుకొనలేదు" — అంటున్నాడు లక్ష్మణుడు. — "....రాముని విషయమై ప్రేమకు చంచలము లేనివాడనూ .... మిగుల ధైర్యము గలవాడునూ అగు లక్ష్మణుడు .... రామునికి రాజనీతినీ, అతని బలమునూ దెలిపి దుఃఖము పోగొట్టెను."

— అదండీ సంగతి ! — రాముడు లక్ష్మణుణ్ణి అయోధ్యకు పొమ్మని ఆజ్ఞాపించాడుగదా ?— లక్ష్మణుడు వెళ్ళలేదుగదా !—చిత్రం ! రాముడికి కోపం రాలా. "నా ఆజ్ఞ ధిక్కరించావే !" — అని వొక్క మాట అనలా. — అసలా సంగతే ఎరగనట్టు వూరుకున్నాడు. తను అయోధ్యకి వెళ్ళిపొమ్మనడం ఆజ్ఞ కాదా ? ... అంటే రాముడికి పని కొచ్చే విషయాలలో మాత్రం చెప్పినట్టు వినాలి. లేకపోతే వినక్కర్లేదన్నమాట ! "మీ ఆజ్ఞ మీరలేను అన్నగారూ ! వెళ్ళుచున్నాను" — అని లక్ష్మణుడు బయల్దేరితే అది లక్ష్మణుడి తప్పు అవుతుందా ?

లక్ష్మణుడు ఉద్వేగంతో — అన్నగారి పాదాల వద్దగ్గర పూగుతూ — "అప్పగించడా ? సరే ! అప్పగించకపోతే సర్వనాశనం అయిపోతాడు. వాడు ఇంద్రుడి తల్లి గర్భంలో దాక్కున్నా నేను విడిచిపెట్టను. నావరకూ ఎందుకు అన్నగారూ ? .... మీ కరుకు బాణాలే...."

"అయ్యో ! ... సీతా ! ... ఎక్కడున్నావో గదా ? .... సీతా ! అయ్యో ! .... నిన్ను చూడకుండా .... ఈ వసంతాన్ని .... అయ్యో ! .... నేనెలా జీవించగల ...."

లక్ష్మణుడి నవనాడులూ కృంగబోయాయి. ధైర్యం వహించాడు. — "అన్నగారూ .... ధైర్యం వహించండి .... మీకు చెప్పగలవాడిని కాను సుమా !"

"చందనా ! .... ఆయనెవరో నీకేమున్నా తెలుసా ?"

"అదే చూస్తున్నాను వకుళా ! ... అన్నదమ్ములా వున్నారు. అన్నగారు అఖండుడిలా వున్నాడు."

"పాపం ఎందుకో దుఃఖపడుతున్నాడే !"

"అవును. చాలా దుఃఖపడుతున్నాడు .... సీతా ! సీతా ! .... అంటున్నాడు. భార్య చచ్చిపోయినట్టుంది."

"పోయివుండదు. పోలేదనే దుఃఖపడుతున్నాడేమో !"

"ఛ ! ఏం మాటలర్రా మీరూ ?" అంది ఇంకోప్రక్క అశోకం.

"ఏం మాటలేవిటి ? .... మానవ పురుషులు భార్యలు పోయినంత మాత్రాన దుఃఖపడతారంటావా ? ... భార్యలేని లోటా వాళ్ళకి ?"

"సరేలే ! ఎప్పుడూ నీ మాట వింతేగానీ ... ఆ అన్నగారేదో అంటున్నాడు. విందాం వుండండి."

"ఏం వింటావు ?.... పాపం ఆ తమ్ముణ్ణి చుప్పు తిప్పలూ పెట్టి పంప నీళ్ళన్నీ తాగించేస్తాడు చూడు".

"అబ్బ ! వూరుకుందూ !"

రాముడు — తల భుజంమీద పెట్టి, చుబుకం మోకాళ్ళమీద పెట్టి — మోకాళ్ళు నేలమీదపెట్టి — కూర్చుండిపోయే వున్నాడు. గడ్డిలో పడ్డ గుళ్ళు రాముడి మోకాళ్ళవేపు చూస్తున్నాయి.

ఎండ మూరుతోన్నకొద్దీ పంప ముస్తాబు చేసుకుంటోంది — కొత్త పూలతో. ఆ పూలు అన్నీ తెల్లపూలే పూశాయి. తుమ్మెదలు అటు పరిగెత్తుతున్నాయి. గాలి కొత్త పరిమళాలు రాముడి మీదుగా మోసుకుపోయింది. — రాముడు తలఎత్తి, భుజం ఎత్తి, మోకాళ్ళు దులుపుకున్నాడు.

"అన్నగారూ ! తమరు జితేంద్రియులు .... ధీరాధివీరులు...."

"అయ్యో ! .... సీతా ! .... ప్రియురాలా !"

"అన్నగారూ ! గాలి తాకిడికి పర్వతాలు చలించవు. మీవంటి ధీరులు కష్టాలకు చలించరు."

"అలాగా లక్ష్మణా !

"అలాగే అన్నగారూ !"

"అయ్యో ! .... సీతా ! .... ప్రియురాలా !.... నువ్వు రాకుండా వుంటే .... ఎంత బాగుం...." — అంటూ లేచి రాముడు వంచె దులుపుకున్నాడు. మళ్ళీ మొదళ్ళవలే బలిసిన తొడలు దులుపుకున్నాడు.

★

తోడు దొంగలు

(రాముడూ – సుగ్రీవుడూ)

కొంత సేపటినించి సుగ్రీవుడు పర్వతంమీద బండల చాటు నించి లక్ష్మణుడ్నీ, రాముడ్నీ చూస్తున్నాడు. వాళ్ళ చేతుల్లో పెద్ద పెద్ద కత్తులూ, బాణాలూ వున్నాయి. పైగా వాళ్ళిద్దరూ పర్వతం మీదికే దారి వెతుక్కుంటూ వస్తున్నారు. ఏరాత్రి పేరుడయిన సుగ్రీవుడికి బాహాటంగా చిన్ని చిన్ని కంపనాలు ప్రారంభమయ్యాయి. — ఎవరు వాళ్ళు ? — ఆయుధాలతో ఈ పర్వతం మీదేం పని ? .... ఇంకేం పని ? — చాలా పంపించి వుంటాడు తనను చంపేసిరమ్మని. లేకపోతే వాళ్ళకేం పని లేకపోద ?

ధీరుడైన సుగ్రీవుడు బండలచాటున కూలబడి, కాళ్ళూ చేతులూ వాటిలో దాచుకొని నుడుచుకుంటున్నాడు. ఇక ఒక్క క్షణంలో తన పని అయిపోతుంది. చావు .... తప్పకుండా పర్వతం ఎక్కి .... తనని వెతికి పట్టేసుకుని ... ఆ కత్తులు . గుండెల్లోంచి వీపులోకో .... వీపులోంచి దొక్కల్లోకో .... వీపులోంచి వీపులోకో ... !

సుగ్రీవుడి హస్తద్వయం తొడుక్కుపడుతూ బండలమీద తాళం వేస్తోంటే — సైగచేసి పిలుస్తున్నాడనుకుని — దూరంగా చుట్టలు కాల్చుకుంటోన్న నీలుడూ, తారుడూ గబగబా లేచి వచ్చారు — "ఏమిటి చేమిటి మహారాజా ?" అంటూ.

పరాక్రమవంతుడు కాబట్టి సుగ్రీవుడు — శక్తి సామర్థ్యాలన్నీ ఉపయోగించి నేర్పుగా తాళాలు అరికట్టి — దవడలు బిగబట్టి — దంతాలు బంధించి — వొక్క వేలు చివ్వి — బండల చాటునించి ఆ "భయంకర దృశ్యం" చూపించాడు.

— "ఎవరో రుషులా వున్నారు మహారాజా !" — అన్నాడు నిర్లక్ష్యంగా తారుడు. తారుడు సుగ్రీవుడి మామగారే. అల్లుడు మహారాజయితే చూడాలని తారుడి కోరిక. అందుకే, తారుడు అల్లుడ్ని 'మహారాజా !' అని పిలుస్తూ వుంటాడు. మహారాజుకి చూపే వినయం చూపిస్తాడు.

సుగ్రీవ మహారాజుకి వొణుకుని మించిన కోపం వచ్చింది — "రుషులా ? ... గిషులా ? దొంగవేషాలన్నీ. ఆ దుర్మార్గుడే పంపి నట్టున్నాడు. ఇక చనం .. " — పట్టుదప్పి రాజుగారి దవడలు టక టకి కొట్టుకున్నాయి.

సుగ్రీవ మహారాజుగారి చుట్టుపట్ల చీమ చిటుక్కుమంటే — ఆ చీమని వాలి దుర్మార్గుడు పంపినట్టే లెక్క. తనని చంపెయ్యడానికి కాకపోతే చీమ ఎందుకొస్తుంది పర్వతాలమీదకి ? ... దానికేం పని పర్వతాల మీద ? .... ఇంతకీ ఆ వొచ్చేవాళ్ళు చీమలూ కారు. దోమలూ కారు. ఆంబోతుల్లా వున్నారు బిసి. పైగా .... చేతుల్లో ..

"అవునను కుంటా. రుషులయితే .... ఆ కత్తి లెందుకూ ?"

"మరే ! ... ఆ బాణా లెందుకూ ?" — సందేహంలో పడ్డారు తారుడూ, నీలుడూ.

నీలుడుకూడా వచ్చి .... కత్తులు చూసి .... సందేహంలో కలి కాడు.

హనుమంతుడు ఆకులు కాల్చి ముక్కుపొడుం నూరుకునే తొందరలో వున్నాడు.

సుగ్రీవుడు దవడలు బిగబట్టి గంభీరంగా బండలోకి చొచ్చుకు పోయే ప్రయత్నం చేస్తూ — "ఇప్పుడేం చెయ్యాలి ? .... తేల్చండి

గమ్మున .... ఆలోచించండి దబ్బున."—అని — "మంత్రులు మీరా? నేనా? .... నేను మంత్రుల్నా ఏవిటి ఆలోచించడానికి? ...." అన్నట్టు చిరాకు పడిపోతూ చుట్టూ చూశాడు.

మంత్రులు చుగ్గురూ ఆలోచన కుపక్రమించారు. కూడబలుక్కున్నారు. —"హఠాత్తుగా శత్రువు మీద కురికినప్పు డేం చెయ్యాలో గురు ందా నీకు?" — అని నీలుడు తాయణిగాడు కంగారుపడుతూ.

"ఊరికే కావయ్యా వుకకడం. కత్తుల్తో !" — అని విసుకున్నాడు సుగ్రీవుడు.

"అదే మహారాజా! అదే ఆలోచిస్తున్నాం. కత్తులు కూడా కలిపే ఆలోచిస్తున్నాం."

"ఊ! .. సరే! .... గమ్మున.... బాణాలు కూడా కలపండి."

మంత్రులు గమ్మగమ్మున రాజనీతులన్నీ గుర్తు తెచ్చుకున్నారు. అందరికీ వొక్క ధర్మమే గుర్తొచ్చింది. చివరికి గొప్ప జ్ఞానంతో, ఏకాభిప్రాయంతో చక్కసి ఆ శాస్త్ర ధర్మం బయట పెట్టారు.

"గమ్మున .. ఎవరి పిక్కబలం వారు చూపించ వలసిందే మహారాజా!"

"కీడెంచి మేలెంచమన్నారు రాజనీతిలో. కొండ గుహల్లో తలలు దాచేసుకుందాం మహా ..."

అప్పటికే బండలమీదనించి దూకుడు ప్రారంభించాడు సుగ్రీవ మహారాజు. గుహలో తల దాచెయ్యాలని రాజనీతిలో వున్నప్పుడు .... ఎవరు మాత్రం చెయ్యగలిగే దేముందీ? — ఆ దూకే మహారాజుకి శత్రు భయంకరుడ"నే" గొప్ప బిరుదు వుంది. "పీరాధి పీరుడనే" ఇంకో బిరుదుకూడా వుంది. "వెన్ను చూపని వాడనే" ఏదో బిరుదు వుంది. "పరాక్రమ వంతుడనే" — పదిహేనో బిరుదు వుంది. "ధైర్య శాలి" అనే ఇరవయ్యేదో బిరుదు వుంది. ఎన్ని బిరుదులయినా కత్తులముందు తీసికట్టే కదా! తలలన్నీ గుహలో దాచెయ్యాలని రాజనీతి హెచ్చ

రిస్తోంటే — నలుడూ, నీలుడూ, తారుడూ శక్తి కొద్దీ వొకర్ని తోసుకుంటూ వొకరు దాటుళ్ళు సాగించారు. *

సుగ్రీవ మహారాజు తల, గుహాద్వారం చేరకముందే నలుడు నీలుడి మీద పడి, నీలుడు తారుడిమీద పడి, తారుడి కాళ్ళల్లో రాజుగారి పట్టు పంచె లుంగలుపడి, రాజుగారు బండలమీద బోర్లా పడ్డారు. రాజుగారి మోకాలిచిప్పలు రెండూ ఎర్రని పద్మాలై, కన్నులు రెండూ నల్లని మేఘాలై — ఆ మేఘాలు బండలమీద జలజలా వర్షించాయి. రాజుగారూ — మంత్రులూ, లుంగలు చుట్టుకొని దొర్లుతోన్న వానరద్రవ దృశ్యం చూసి కంగారు పడిపోతూ పిట్టలన్నీ గోల గోలతో చప్పుళ్ళూ, ఎగుర్తుళ్ళూ — దూకుళ్ళూ ప్రారంభించాయి.

* కిష్కింధాకాండలో – 2 వ సర్గలో 10 శ్లోకాల వరకూ.

"మహాత్ముడగు సుగ్రీవుడు, శ్రేష్ఠమగు ఆయుధములు గల వీరులను, అన్నదమ్ములను నగు రామ లక్ష్మణులను జూచి భయపడి నిక్కులు చూచుచు ఒకచోట నిలువలేక పోయెను.... సుగ్రీవుని మనసు స్థిమితపడలేదు ... మిగుల భయపడిన అతని మనసు దుఃఖించెను.

గొప్ప బలపుగల వానరులందరు ఒక కొండనుండి ఇంకొక కొండకు దాటుచు .... పర్వతములలో పూచియుండిన చెట్లను నాశనము చేసిరి" — అది సంగతి.

సుగ్రీవుడూ, హనుమంతుడూ వగైరాలు ఇప్పుడే కథలోకి వచ్చారు. సుగ్రీవుడు గొప్ప వీరుడని ఇన్నాళ్ళూ మన అభిప్రాయం కదా? ఆయన "వీరత్వం" ఇక మనం కళ్ళారా చూడవచ్చును. — సుగ్రవుడు గొప్ప పరాక్రమవంతుడనే, కవి ఎక్కడికి కక్కడ వర్ణిస్తూ వుంటాడు. అయితే రాముణ్ణి చూసికూడా భయపడకపోతే రాముడి వీరత్వానికి లోపం అవుతుందనే కవిగారి అభిప్రాయం. అవతలి వాడెవరో తెలీకుండానే .. దారే పోతోన్నవాళ్ళని చూసి వణికితే .... అది సుగ్రీవుడి పిరికితనమే అవుతుందని కవి గ్రహించుకోలేదు. — తర్వాత "కథ" కూడా సుగ్రీవుడి "పిరికితనాన్నే" రుజువు చేస్తుంది.

హనుమంతుడు చుట్టూలనించీ పొడుం దట్టించి, మిగిలిన పొడుం ఆకుల్లో చుట్టి బొక్కలో పోపుకుంటూ, దారి పొడుగునా చీదుకుంటూ వచ్చాడు.

సుగ్రీవుడు బందపోవ రాజకీయతో చతికిలబడి కళ్ళనీళ్ళు గంభీరంగా పెట్టుకున్నాడు.

దిగ్గదున్న మంత్రులు చుట్టూరా రాజుగారి మోకాళ్ళు చుట్టూ చేరి శక్తికొద్దీ వాడుకి వైద్యం చేస్తున్నారు.

మోకాళ్ళు మంత్రుల కప్పగించి సుగ్రీవుడు దవడల వ్యవహారం తనే చూసుకుంటూ — ఎదిసి పడుతూ — "వాళ్ళకి కతులూ .... వాటాలూ ఫన్నావయే ! వాణ్ణా మీరూ కలబడితే .... పోనీ నేనుకూడా అనుకుందాం పోన ఎబ్బదుగుపడం .... వాళ్ళిద్దర్నీ చంపెయ్యగలమా ? ... ఆబ్బో ! ... కష్టమే !.... కతులా ? మాటలా ? ..." — అని మోకాళ్ళు ముడవబోయి విలవిల్లాడాడు.

హనుమంతుడు రాగానే సాటి మంత్రులందరూ సెగలుచేసి బంతల చాటునించీ "అసలు ఘోరం" చూపించారు.

లక్ష్మణుడు కత్తితో పొదలమీద చప్పుడు చేస్తూ, పురుగూ పుట్రా లేని దారి వెతుక్కుంటూ ముందు నడుస్తున్నాడు. రాముడు నేర్పుగా లక్ష్మణుడు అడుగు తీసినచోట అడుగు వేస్తూ .... లక్ష్మణుడి అడుగు జాడలు అనుసరిస్తున్నాడు.

హనుమంతుడు బుగ్గలనిండా గాలి పూరించి, మూతి బిగబట్టి కొంతసేపు ఆలోచిస్తూ చూశాడు.

హనుమంతుడు ఆలోచిస్తోంటే అందరి గుండెలూ లేచికపడ్డాయి. హనుమంతుడంటే సుగ్రీవుడికీ, మిగతా వాళ్ళకీ మంచి గురి. ఏదన్నా ఇబ్బంది వస్తే తమందరికన్నా హనుమంతుడు కాస్త నిబ్బరంగానే వుంటాడని వాళ్ళకు తెలుసు. అవసరం అయితే వెనకా ముందూ చూడకుండా ఎదటివాళ్ళనెవ కలబడిపోతాడు. సుగ్రీవ మహారాజుకి మంత్రు లందరిలోనూ హనుమంతుడే పెద్ద అండ.

"ఏం ? .... చూశావా ? .... చెప్పు .... దబ్బున ...."

హనుమంతుడు బుగ్గలోంచి బుస్సున గాలి వొదిలేసి — "ఓస్! ఇంతేనా ? .... మీ కంగారు చూసి వాలే వస్తున్నాడేమో అనుకున్నాను. ఇంకా నయం. దారే పొయ్యే దానయ్యల్ని చూసి భయపడతావేం మహా రాజా ! అనలు వాలి రాడని తెలుసుగా" ... ! — అంటూ ఒక బండ మీద చతికిలబడాడు.

పగిలిన మోకాలి చిప్పలతో రాజఠీవి ప్రదర్శించడానికి ఇబ్బంది పడుతూ సుగ్రీవుడు మొహం చిట్లించి — "వాలి రాడుగానీ .... హనుమంతా ! ఎవరయినా వీరుల్ని పంపొచ్చు గదయ్యా ! లేకపోతే .... మరి వాళ్ళిద్దరూ .... ఎవరంటావూ ?" — అని చెక్కిళ్ళు బిగించాడు.

"ఎవరో ఏంటో కనుక్కుంటాం. అంత మాత్రానికి వొణకటం ఎందుకంటా ?" —

"అబ్బే ! ఏం వొణకాం ? .... వీళ్ళేదో రాజనీతి అన్నారు కదాని ...."

"చాల్లెద్దూ మహారాజా ! నీకు మరీ తొందరెక్కువ" — అని విసుక్కున్నాడు హనుమంతుడు. సుగ్రీవ మహారాజు ఆయుధపట్లన్నీ హనుమంతుడి చేతిలో వున్నాయి. మహారాజుని మందలించడం అంటే హనుమంతుడికి నల్లేరుమీద బండే. — "రాజయినవాడికి .... ఎంత జ్ఞానం వుండాలీ ! .... ఎంత బుద్ధి వుండాలీ ! .... ఆఁ .... ఏదన్నా జరిగితే .... నెమ్మదిగా మంచీ చెడా తెలుసుకోవాలిగానీ ... ఏంటో ఇల్లాగయితే_ నువ్వేం రాజ్యం చేస్తావో .... ప్రజల్నెలా పరిపాలిస్తావో గాపీ ...." *

---

* 2వ సర్గలో — 17, 18 శ్లోకాలు.

హనుమంతుడు సుగ్రీవుణ్ణి చివాట్లు పెడుతున్నాడు వినండి. — "చపలచిత్తుడ వగుటచే నీకు మంచి విచారములో బుద్ధి లేనందున, నీ కార్య మృగత్వము వ్యక్తమగుచున్నది. అయ్యో ! విశేష జ్ఞానముతో పరుల అభిప్రాయమును తెలుసుకొని పనులు చేయవలెను. బుద్ధీ, జ్ఞానమూ, ఇంగితమూ లేని రాజు ప్రజలను రక్షింపనేరడు" —

"అబ్బ ! .... సరే లెద్దూ ! .... రాజొక్కడే రాజ్యం చేస్తాడా ఏంటీ ? .... మీలాంటి గొప్ప గొప్ప మంత్రులు లేరూ నాకు ? .... ఇలారా ! .... వాళ్ళని బాగా చూడు ఈ సందులోంచి. ఎద్దుల్లా బలిసి, అలా కత్తులు తళతళ లాడించుకుంటూ వొస్తోంచే ఎవరుమాత్రం జడవకుండా వుంటారు చెప్పు. అసలే కష్టాల్లో వున్నాం. చెట్టూ, పుట్టలూ పట్టుకు తిరుగుతున్నాం. కాస్త ముందుచూపు వుండాలంటావా ? అక్కర్లేదా ?"

హనుమంతుడు కొంచెం ఆలోచించి — "అయితే వాలే పంపాడంటావా మహారాజా ?" — అని కొంచెం వినయం చూపించాడు.

"ఆఁ .... తప్పకుండా ఆ దుర్మార్గుడి పనే. అబ్బో ! ఎన్ని ఉపాయాలో వాడి పొట్టనిండా. అనలు రాజన్నవాడు శత్రువుల్ని సుఖంగా బతకనిస్తాడంటయ్యా ? తిని తిరగమని మనదార్ని మనల్ని వొదిలి పెడతాడా ? అనలు వ్యవహారం ఏంటో నువ్వెళ్ళి కనిపెట్టి రావాలి మరి" — అని అగాడు సుగ్రీవుడు.

"అవును. వాళ్ళలాగానే నువ్వుకూడా ఆ ఋషి వేషం కట్టుకుని వెళ్ళాలి" — అన్నాడు తారుడు.

సుగ్రీవుడు కంగారుపడుతూ — "ఒకవేళ వాళ్ళ మూలంగా మనకేం చెరుపు లేదనుకో. వాళ్ళసలు మనకు శత్రువులు గారనుకో. సరేలే అని ఊరుకోగూడదు సుమా ! మరి ఎందుకిలా వస్తున్నారో తెలుసుకో. బయల్దేరు తొందరగా. నేర్పుగా మాట్లాడి అసలు కిటుకు కనుక్కో. అటూ ఇటూ మాట తూలేవు సుమా ! .... ఎవళ్ళతో ఎలా మాట్లాడాలో నీకు బాగానే తెలుసులే. బయల్దేరు మరి" — అని తొందర పెట్టాడు. మాటలమధ్య మోకాళ్ళు కూడదీసుకున్నాడు.

(ఫుట్‌నోట్ : 156 పేజీ తరువాయి)

సుగ్రీవుడు గొప్ప జవాబు చెప్పాడనుకోండి — "ఆ పేర్లల్ని చూసి ఎవ్వరు భయపడకుండా వుందురు చెప్పు ?" — అని. అది ఆ పేర్ల గొప్పతనమేగానీ, తన పిరికితనం కాదుట.

హనుమంతుడు ఘనకార్యాలు చేసే ఉత్సాహంతో లేచాడు. ఎంచె వూడదీసి సన్నాసుల కట్టుబట్టే కట్టాడు. బొడ్డోంచి వూడిపడ మక్కుపొడుం మూట చెట్టు తొర్రలో పెట్టబోతే, సీలుడు అందుకొని — "నే చాస్తాలే" — అని మక్కుల్లో కెక్కించాడు.

సీలుడు చుట్టుపక్కల దొరికిన పూల తీగలన్నీ తెచ్చి హనుమంతుడి జుట్టునిండా, మెడనిండా, చేతుల్నించా చుట్టాడు. హనుమంతుడు గుహలోకి పోయి నీళ్ళచిప్ప పట్టుకొని బయటికొచ్చాడు.

"జాగర సుమా ! నేర్పుగా .... చక్కగా .... తెలివిగా .... చక్కగా .... నేర్పుగా మసలాడు "

"వాళ్ళనలే అంబోతుల్లాగున్నారు ..."

"నువ్వొచ్చేవరకూ మా తలలు గుహలో.... దాచేస్తాంలే. రాజనీతి అలాగుంది మరి —"

అందరూ బిండలచాటున వొదిగి హనుమంతుణ్ణి — "ధైర్యంగా పొండు —" _ అంటూ సాగనంపారు.

* * *

లక్ష్మణుడూ రాముడూ అతి ప్రయాసమీద కొండ ఎక్కుతోంటే హనుమంతుడు అలవాటు చొప్పున గబగబా దిగుతూ వాళ్ళకి ఎదురువెళ్ళాడు.

ఆ బిండల్లోంచి పుట్టుకొచ్చిన రుషిని చూడగానే రాముడికి ప్రాణం లేచివొచ్చింది. సుగ్రీవుడి నమూనాలం ఏమున్నా తెలుస్తుందే మోనని లక్ష్మణుడు ఆతృతగా చూస్తున్నాడు.

హనుమంతుడు మొహం విప్పార్చుకుని చేతులు నలుపుకుంటూ — "అయ్యలారా ! .... మీ రెవరోగానీ అందంగా — దేవతల్లాగా — మా చక్కగా వున్నారు. స్వర్గంనించి వొచ్చారో — వైకుంఠం నించి వచ్చారో ! ... పుష్పుల్లాగ వున్నారేగానీ .... మీ రనలు రాజుల్లో

— మహా రాజులా — అబ్బే : .... చాలా గొప్పవారై వుంటారు. మీ పీరత్వం .... మీ పరాక్రమం .... ఆఁ ... చాస్తే దాగుతాయా ? ... అబ్బే ! ఎక్కడ దాగుతాయీ ? ఎవ్వర్ని చూడగానే పిట్ట లేచి .... జంతువు లేచి .... మనుషు లేచి ... గడగడ వొణికే వల సిండే. సింహాల్ని ఏనాడా చూశానుగానీ .. అబ్బే ! మీ ముందు సింహ మెక్కడా ? .... ఏనుగు తొండాల్లాగా మీ భుజాలూ ... మరీ ... " — హనుమంతుడు లక్ష్మణుణ్ణే చూస్తూ మాట్లాడుతున్నాడు.

తనే ముందు నడవనందుకు ఆ క్షణంలో రాముడికి చాలా పశ్చా త్తాపం కలిగింది.

"ఈ వేషా లెందుకు వేసుకున్నారోగానీ .... మీ రసలు మహా రాజుల్లాగ సింహాసనాలమీద కూర్చుని రాజ్యా లేలవలసిన వారే ! ఈ కొండలూ .... కోనలూ ... అడవులూ, అసలు భూమండలం అంతా మీ రేల వలసింది ! మీ ముక్కులూ మొహాలూ వొక్కలాగే ఉన్నాయి కవలకీ పోలికలున్నాయి గుమ్మంటే ! అన్నదమ్ము లనుకుంటాను. పక్కగా సూర్యుడూ ... చంద్రుడూ వున్నట్టున్నారు —"

కొత్త రుషి పొగ డేలు రాముడి కేమంత సంతోషం కలిగించ లేదు. లక్ష్మణుణ్ణీలాగా తనతో చేర్చి, ఇద్దర్నీ వొక్కలాగే పొగడడం రాముడికేమీ నచ్చడంలేదు.

హనుమంతుడు తననే చూసి మాట్లాడుతోంటే లక్ష్మణుడు ఇబ్బంది పడి నెమ్మదిగా వెనక్కి తప్పుకున్నాడు. రాముడు గంభీరంగా ముందుకు అడుగువేశాడు.

"ఎంత కాంతిగా మెరిసిపోతున్నారో ! .... అయ్యో ! వొంటి మీద గోరెడు బంగారమైనా లేదు - ఎంత బోసిగా వున్నారో ! మీ శరీరాలనిండా .... రత్నాలూ, వజ్రాలూ, మణులూ, మాణిక్యాలూ పెట్టి — చక్కగా నగా నట్రా పెట్టి ముస్తాబు చేస్తే మిమ్మల్ని చూడ్డానికి వెయ్యి కళ్ళన్నా చాలవు—"

రాముడి భుజాలు పులకరించాయి నగలు గుర్తొచ్చి.

"నగలు లేకపోతే ఏం చెంపా : మీ వొంటి రంగే మేలిమి బంగారం లాగుంది."

రామిడి హనుమంతుణ్ణి చారకంట చూశాడు, వెటకారం కాదు గదా అని.

"ఆహా : — చుట్టూ చూడండీ. మీ ఒంటి కాంతులు పడి పచ్చ తాలూ, కొండలూ, ఎలా ధగధగా మెరిసిపోతున్నాయో : .... పంపలో నీళ్ళన్నీ బంగారం కలిపినట్టయిపోయాయే : చిత్రంగా వుంది : అనలు మీ విల్లులు మాత్రం : — బంగారపు కట్లతో ఏం అందం : .... ఏం అందం : — చూసేవాళ్ళకు గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఈ బాణాలు బాణాలు కావు సుమా : పుట్టల్లోంచి బుస్సున లేచిన నాగు పాములే : .... ఇక కత్తులా ? .... అబ్బో : .... వాటి మాట చెప్పక్కర్లేదు ...." *

రామిడు పరవశమైపోతూ అరమోడ్పు కన్నులతో ఎటో చూస్తున్నాడు.

---

* శివ సర్గలో — 5 నించి 18 శ్లోకాల వరకూ.

హనుమంతుడు చేసిన పొగడ్తలన్నీ — "మీరు గొప్ప వీరుల్లా వున్నారు. మహారాజుల్లా వున్నారు. ఈ భూమండల మంతా పరిపాలించటకు తగిన వారుగా నున్నారు. — మీ శరీరాలు బంగారాలతో, రత్నాలతో అలంకరించాలి" — అనేగానీ — రుషుల దొన్నత్యాన్ని చెప్పే మాట ఒక్కటన్నా లేదు. — రుషుల్ని పట్టుకుని — "మీరు గొప్ప రాజుల్లా వున్నారు" — అని పొగడడం అంటే రుషి జీవనంకన్నా రాజరికమే ఎవటివాళ్ళకి (మనుషు లందరికీ) సంతోషం కలిగిస్తుందని అర్థం అన్నమాట. రుషుల ధ్యాసకూడా ఎప్పుడూ అధికారం మీదా — సిరి సంపదలమీదా మాత్రమే వుంటుంది. — ఈ దేవుళ్ళాట ప్రతీ రుషి మొహంమీదా చూడవచ్చు. రాముడి మొహంమీద ఇంకా స్పష్టంగా చూడవచ్చు.

హనుమంతుడు చాలాసేపు పొగడ్తలన్నీ గుప్పించేసి, దేహ కాంతులూ, ముఖ కాంతులూ, ధనుస్సు కాంతులూ, కత్తి కాంతులూ — అన్నీ వర్ణించేసి, ఇంకేం చెయ్యాలో తోచక — "అయ్యలారా! మీ రెవరో మహానుభావులే"—అని గుటకలు మింగుతూ నించున్నాడు.

"అబ్బే! ఇద్దరమూ కాదు. నే నొక్కణ్ణే మహానుభావుణ్ణి" — అని చెప్పుకోడానికైనా రాముడు తన్మయత్వంలోంచి తేరుకోలేదు.

లక్ష్మణుడు స్వతంత్రించ కూడదని తను కలగజేసుకోకుండా వూరుకున్నాడు.

హనుమంతుడి కడుపులో రహస్యం .... బియట పడిపోతానని గుండెల కెగవన్నుతోంది. దాన్ని ఎంతోసేపు దాచుకోలేక—"అయ్యా! నేసి వేషం కట్టుకు వచ్చానుగానీ, రుషినిగాను సుమండీ! మేం వానర జాతి వాళ్ళం. సుగ్రీవుడనే .... మా రాజు ... మాయదారి అన్నగారి మూలాన్న నానా బాధలూ పడుతున్నాడు. నేనా సుగ్రీవ మహారాజు దగ్గర మంత్రి వుద్యోగం చేస్తున్నాను లెండి. నన్ను హనుమంతు డంటారు. నేనంటే మా రాజుగారికి చాలా ఇది. మీతో మాట్లాడమని తాయన పంపితేనే వచ్చాను. నా గురించి ఈ చుట్టుపక్కల అందరికీ .... అబ్బో! చాలా బాగా తెలుసు" — హనుమంతుడు తన గురించి వర్ణించుకునే పుత్సాహంలో పడిపోయి ముసిముసి నవ్వులు నవ్వాడు. *

---

* 2వ సర్గలో — 24 నించి 27 వరకూ.

సుగ్రీవుడు హనుమంతుడితో — " ... పరస్పర సంభాషణము చేత వారి కనిపెట్టి వలయును. వారి బుద్ధి శుద్ధ స్వభావమును వారి మాటలద్వారా గ్రహింపుము" — అని చెప్పి పంపించాడు. కానీ, అవతలివాళ్ళు నోరు విప్పి ఒక్క ముక్కన్నా మాట్లాడకముందే, వాళ్ళు ఎవరో, ఏమిటో తెలుసుకోకముందే హనుమంతుడు సుగ్రీవుడి సంగతి చెప్పేశాడు. వాళ్ళు నిజంగా వాలి పంపిన శత్రువులే అయితే? ....

సుగ్రీవుడి కబురు పినగానే లక్ష్మణుడి మొహం కలకల్లాడింది — తొందరగానే వదినగార్ని కలుసుకోవచ్చని.

రాముడి ప్రాణం లేచివొచ్చింది — సీతని వెదికే పని ఇక సుగ్రీవుడే చూసుకుంటాడని.

— "ఈ అన్నదమ్ముల వైరం ఏవిటో .... తనకేవన్నా లాభం కలిగిస్తుందేమో ! — అన్న వల్లనా ? .... తమ్ముడి వల్లనా ? ...." రాముడి అంతరంగంలో — రాజకీయ కోణంలో కొత్త కొత్త ఆలోచనా తరంగాలు — ప్రారంభమవుతున్నాయి.

హనుమంతుడికి రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ చూస్తోంటే ఆ ఇద్దరిలో ఎవరు ఎక్కువో ఏమిటో, తను ఎవరితో ఎలా మాట్లాడాలో ఏమీ అంతు పట్టడంలేదు. ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తూ — "ఈ సుగ్రీవ మహా రాజు మహా పీరుడు. పరాక్రమవంతుడు. వీరితో స్నేహం చెయ్యాలనే నన్ను పంపించాడు" — అని — "ఏవంటారు ?" అన్నట్టు చూశాడు.

సుగ్రీవ మహారాజు మంత్రికి తన ప్రత్యేకత స్పష్టం చెయ్యాలని రాముడు గంభీరంగా తల పంకిస్తూ లక్ష్మణుడివేపు మందహాసంతో చూసి, హనుమంతుణ్ణి మెచ్చుకుంటూ — "లక్ష్మణా ! విన్నావు కదా ? .... ఇతడు సుగ్రీవుడి మంత్రట. చక్కగా మాట్లాడుతున్నాడు సుమా ! .... శాస్త్రాలన్నీ క్షుణ్ణంగా చదివినట్టు వున్నాడు. ఇన్ని మాటలు మాట్లాడాడు గానీ ఎక్కడా ఒక్క అపస్వరంకూడా రాలేదు సుమా ! ... ఉచ్చారణలో తప్పుల్లేవు. శబ్దాడంబరం లేదు .... పటలకోసం తడుముకున్నాడా ? ....ఊహూఁ ! అలా అని బరంగాకుండా దూసి పోసినట్టు మాట్లాడాడా ?"

(ఫుట్‌నోట్ : 161 పేజీ తరువాయి)

శివ సర్గలో — 20 నించి 23 వరకూ —

"మీరు నాతో మాట్లాడకున్నారేమో ?" — అని, వెంటనే "సుగ్రీవు డిక్కడే వున్నాడు. నేను ఫలానా. వాలితో వైరం సుగ్రీవుడికి" — అని అన్నీ చెప్పేశాడు. — హనుమంతుడిలాంటి తెలివి తక్కువ దూత ఇంకెక్కడా వుండడు. ఈ సంగతి ముందు ముందు ఇంకా స్పష్టంగా రుజువవుతుంది.

హనుమంతుడు తలవొంచి సిగ్గుపడుతున్నాడు. రాముడి వేపే భక్తితో చూస్తున్నాడు. ఆ పెద్దలో ఆయన కన్నా ఈయనే గొప్ప తెలివి గల మహానుభావుడని నిర్ధారణ చేసుకుంటున్నాడు.

రాముడు హనుమంతుణ్ణి మెచ్చుకోడం ఇంకా పూర్తి కాలేదు. హనుమంతుణ్ణి గంభీరంగా చూస్తూ —. "వేదాలన్నీ చక్కగా చదివినట్టే వున్నావు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం; .... చదివే వుంటావు. అవును. ఎందుకపోతే ఇంత చక్కగా మాట్లాడడం సాధ్యమౌతుందా ఎవరికయినా? .... వ్యాకరణం కూడా చాలా శ్రద్ధగా నేర్చుకున్నావనుకుంటాను. ఎన్నిసార్లు చదివావు? ... చాలాసార్లు చదివినట్టున్నావు. ఒక్కసారి చదివితే ఇంత చక్కగా గుర్తుంటాయా ఎవరికైనా? .... వేదాలూ .... వ్యాకరణ పాఠాలూ అన్నీ చక్కగా గుర్తుపెట్టుకుంటూ ఇతరులతో శాస్త్రోక్తంగా సంభాషిస్తూ వుంటావనుకుంటాను. ఒక్కొక్క శబ్దం వుచ్చరిస్తోంటే .."

చక్కగా మాట్లాడావని పొగిడితే మొదట ఏమో అనుకున్నాడు గానీ, తీరా వ్యవహారం శాస్త్రాల్లోకీ, వ్యాకరణంలోకి దిగడం చూసే హనుమంతుడికి దడ పుట్టుకుంది. — ఏదో వేదంలోంచి — ఏదో శ్లోకమో, దాని పాదమో చెప్పమంటే?—హఠాత్తుగా... వ్యాకరణంలో ఏ సంధులో విడదియ్యమంటే? .... ఇంకా నయం .... చిన్నప్పుడు వీపంతా వెయ్యి చెక్కలయ్యిందిగానీ పొట్టకి వొక్క ముక్కన్నా అబ్బలేదు. సందులూ, గొడలూ కలేసి దూకడం తప్ప .... విడదియ్యడం అన్నమాటే లేదు.

"ఒక్కొక్క శబ్దం వుచ్చరించేప్పుడు వ్యాకరణ జ్ఞానం లేని అజ్ఞానులు, మొహంలో వికారభావాలు ప్రదర్శిస్తారు. నువ్వు ఆ విధంగా చేయలేదు. మృదువుగా సుభాషించడానికి ఆరు లక్షణాలు తెలిసి వుండాలి. అవన్నీ నీకు చక్కగా తెలిసినట్టే వున్నాయి."

హనుమంతుడు బిత్తరపోయాడు. — "నాకేం తెలీదు మొర్రో మొర్రో" — అనాలనుకున్నాడు—"ఇదేపని? వొచ్చి వొచ్చి వ్యాకర

ణంలో పడ్డాను ; తీరా తెలిసినట్టు వూరుకున్నాక, అవేమిటో చెప్ప మంటే ?" —

ఆ ఆరు లక్షణాలూ చెప్పమని నిజంగా రాముడికి అడగాలఅ వుంది — హనుమంతుడు చెప్పలేకపోతే తను చెప్పెయ్యాలని. నే వ్యాకరణ పాఠం చక్కగా గుర్తు వచ్చేసింది. — "మాధుర్యమూ, అక్షర వ్యక్తమూ, పదచ్ఛేదమూ, అత్వరా, ధైర్యమూ, లయా - ఈ యారున్నూ మాట లుచ్చరించుటలో నుండవలయును"— అని లోపల పాఠం గురగుర లాడుతోంది. వల్లించుకోకపోయినా దానికదే కిందా మీదా తిరుగుతోంది. — "హనుమంతుడా ; నీ మాటలన్నీ .... హృదయంలో ముద్ర స్వరంలో పుట్టి — కంఠస్థానంలో ప్రవేశించి మధ్యమ స్వరంతో బయటకు వస్తున్నాయి సుమా !"

హడుమంతుడు అపస్వరాలతో గుటకలు మింగుతున్నాడు. కంఠం లోంచి వెనక్కి — హృదయం అడుక్కి — పొట్టలోకి.

లక్ష్మణుడి ఇంగితానికి ఒళ్ళు మండిపోతోంది — "సుగ్రీవుడి దగ్గిర్నించీ మనిషివస్తే పుచ్చెడు సంతోషంతో గబగబా అతని వెంటబడి పోవాలిగానీ ఈ వేదా లేవిటీ ? .... వ్యాకరణ పాఠాలేవిటీ ? కంఠస్వరా లేవిటీ ? .. మంద్ర స్వరాలేవిటీ ? యావన్నా బుద్ధుందాని ? .... ఆ వచ్చినవాడు కోయిల్లా కూసి చెపితే ఏవిటి ? .... గాడిదలా అరిచి చెపితే ఏవిటి ? ... అనలు సుగ్రీవుడు దొరకడం ముఖ్యంగానీ .... ఇదుగో ; అనలు నీ అన్నకి సుగ్రీవుడు దొరకడంకన్నా .... ఈ వ్యాకరణ చర్చ తోటే పరమ సంతోషంగా వుంది. .... ఈ శాస్త్రాలు చదువుకున్న వాళ్ళందుకూ పనికిరారనుకో"— అని జాడించేసింది లక్ష్మణుణ్ణి.

లక్ష్మణుడు కిక్కురు మనలేక పోయాడు. "అవును .... మరే .... మరే...." — అని ఇంగితానికే వంతపాడాడు — కాదంటే పేచీగిపోతుందని.

రాముడు చిరునవ్వుతో లక్ష్మణుణ్ణి చూస్తూ— "లక్ష్మణా : ఇంత చక్కగా మాట్లాడితే ఎవరికయినా సంతోషం కలగకుండా వుంటుందా ?

నరకాలని కత్తి ఎత్తి మీదకు వచ్చిన శత్రువయినా మనసు మార్చుకుంటాడు సుమా !" — అని, హనుమంతుడు తన శత్రువయినా తను నరకబోయి మనసు మార్చుకున్నట్టు దయగా చూశాడు.

హనుమంతుడు తెల్లబోయి దిక్కులు చూస్తున్నాడు. శత్రువు లేఎటి ? నరకడం ఏవిటి ? అసలు వీళ్ళు ఎవరో, ఏమిటో కనుక్కోనే లేదే ! — కొంపదీసి చంపుతారా ఏవిటి ? — చేతులు కటుకుంటూ —"అయ్యా ! తమరెవ్వరో తెలవివ్వనేలేదు. మా రాజు మీతో స్నేహం చేసుకోవాలని ...."— ఆగి రామున్ని వినయంగా చూశాడు.

హనుమంతుణ్ణి చూస్తోన్నకొద్దీ రాముడికి ముచ్చటేస్తోంది. — వాళ్ళ రాజు పంపగానే, చక్కగా మారువేషంతో వచ్చాడు. ఎదటివారి మనసులకు చక్కగా సంతోషం కలిగేట్టు కీర్తించాడు ఎంత చక్కని దూత ! ఇలాంటి దూత వుంటేనా రాజుకి ! ఇంకేం లోటు ! .... ఎంతెంత రాచకార్యాలయినా నిర్వర్తించ వచ్చును. భరతుడు ఎటువంటి దూతల్ని పెట్టుకున్నాడో ఏమో ! చిత్రకూటం వచ్చినప్పుడు తను చాలా విషయాలు చెప్పి పంపించాడు గానీ .... చారులమీద చారుల సంగతి మాత్రం.... హు ! అదొక్కటే మర్చిపోయాడు. * ఆలోచనల్లోంచి

---

* 3వ సర్గలో — 34, 35 శ్లోకాలు.

రాముడు హనుమంతుణ్ణి — "ఇట్టి గుణ గణములతో కూడి కార్యము సాధించగల దూత రాజులకు వుండినటులయితే వారికి సకల కార్యములు సిద్ధించును" — అని మెచ్చుకొంటున్నాడు —

సుగ్రీవుడు హనుమంతుడికేం చెప్పి పంపాడో రాముడికి తెలియక పోవచ్చు. — సుగ్రీవుడి దగ్గిర్నుంచి దూతగా వచ్చాడని తెలుసుకదా ? — ఎదటివాళ్ళ సంగతి తెలుసుకోకుండా తమ సంగతులన్నీ చెప్పేసిన వాణ్ణి మంచి దూత అని రాముడు మెచ్చుకోడం ఎందుకు ? — ఆ దూత ఎలాంటివాడో ఈ రాముడూ అలాంటివాడే గనక.

హనుమంతుణ్ణి కవి ప్రత్యేకశ్రద్ధలో పొగుడుతున్నాడు. అపొగడ్తలకు ఆధారాలేమీ లేవు. వూకే మాటలతో వూదరగొట్టి...."ఇంతవాడు,

తేరుకుంటూ రాముడు లక్ష్మణుణ్ణి గంభీరంగా చూస్తూ — "లక్ష్మణా! సుగ్రీవుడి మంత్రి సంభాషించాలని కోరుతూ వున్నాడు. అతనితో చక్కగా, మృదువుగా సంభాషించవోయీ!" — అని ఆజ్ఞాపించి — "నేను రాజుని కదా? నేనే మాట్లాడతానా ఏమిటి? ఆమాత్రం తెలీదా?" — అనుటు చూశాడు.

"చిత్తం!" — అని లక్ష్మణుడు వినయంగా అన్నగారికి నమస్కరించి హనుమంతుడివేపు తిరిగి స్నేహ పూర్వకంగా — "మీ రాజు గురించి మా అన్నగారు ఇంతకు పూర్వమే విన్నారోయీ! ఆయన కోసమే బయల్దేరి వస్తూ వున్నారు. నువ్వు కోరిన విధంగానే మీ రాజుతో మా అన్నగారే చెలిమి చేస్తారు" — అని సంభాషణ ప్రారంభించాడు.

హనుమంతుడి ప్రాణం కుదుటపడింది — ఈ అన్నదమ్ములిద్దరూ వాలి మనుషులు కాదన్నమాట! ఇకనేం .. ఇద్దరూ వీరుల్లాగే

(ఫుట్‌నోట్ : 165 పేజీ తరువాయి)

అంతవాడు. వేదాలు చదివాడు. శాస్త్రాలు చదివాడు. జ్ఞాని. మంచి దూత" — ఈ ఏకంగా హనుమంతుడిమీద పాఠకులకు గొప్ప గౌరవం ప్రారంభ మయ్యేట్టు వాతావరణం సృష్టిస్తున్నాడు. ఈ మహానుభావుడి గొప్పతనం కూడా మనం ముందు ముందు చూస్తాం.

• కిష్కింధలో — 27 వ శ్లోకం.

"సుగ్రీవుని మంత్రియగు నితనితో ఇంపుగనుండు మాటలచే సంభాషింపుము" — అంటున్నాడు రాముడు లక్ష్మణుడితో. — ఈ మాట లన్న తర్వాత తను హనుమంతుణ్ణి పొగిడే వంకతో శాస్త్ర విషయాలు చాలా మాట్లాడాడు. కానీ, అసలు విషయం మాత్రం లక్ష్మణుడు మాట్లాడాలన్నమాట! తనకు తానుగా చెప్పుకోడం చిన్నతనం. పక్కన ఒక దాసుడు వుండి, వినయంగా తనగురించి అవతలివాడికి అన్నీ చెప్పాలి. తను చెప్పుకోడు. కాష్ట్రీయంగా అర్థం చేసుకోవాలంటే ఈ లక్షణాన్ని "ఫ్యూడల్ దర్పం" — అని గ్రహించాలి.

పున్నారు. వాలితో యుద్ధం చేసి గెలుస్తారేమో ! మళ్ళీ సుగ్రీవుడు రాజైతేనే — తమ మంత్రి పదవులు తమకు దక్కుతాయి — హనుమంతుడు ఏనయంగా రాముడ్ని చూస్తూ — "చూచారా ! తమరు .... ఈ కారడవుల్లో తమ్ముడితో కలిసి .... ఎందుచేత తిరుగుతూ వున్నారో ... " — అంటూ ఆగాడు.

రాముడు క్రీగంట లక్ష్మణుడ్ని చూశాడు. లక్ష్మణుడు ఏనయంగా — "హనుమంతుడా ! అంతా నేను చెబుతాను, విను. కోసలరాజ్యాన్ని దశరథుడనే మహానుభావుడు చాలాకాలం శాస్త్రోక్తంగా, ధర్మబద్ధంగా పరిపాలించాడు. సంపూర్ణమైన దక్షిణలిచ్చి గొప్ప గొప్ప యజ్ఞాలూ, యాగాలూ అనేకానేక పుణ్యకార్యాలూ చేయించాడు. అటువంటి మహానుభావుని జ్యేష్ఠపుత్రుడోయీ ఈ మహానుభావుడు. పేరు శ్రీరామచంద్రుడు. నీకు తెలిసివుండదు గానీ సర్వప్రజలకూ తెలిసినవాడే ఈ మహానుభావుడు. దశరథమహారాజు పుత్రులల్లో ఈయనే పెద్దవాడు గుణవంతుడు. పితృవాక్యపరిపాలనలూ, ఇంకా తండ్రిగారి సద్గుణాలన్నీ ఇంచుమించుగా ఈయనకే వొచ్చాయి. ఈయన గొప్ప పరాక్రమవంతుడు, జ్ఞాని ...." — "మేమంతా వున్న పెద్దవాళ్ళం ! ఈ ... ఇంకా చెప్పాలా .... ఆగాపేం ? .... సిగ్గు లేదూ ? నువ్వూ ఆ దశరథమహారాజు పుత్రరత్నానివేగా ? రఘువంశం పేలగబెట్టడానికే పుట్టుకొచ్చావుగా ? ..."

లక్ష్మణుడు, ఇంగితం వాగుడు వినిపించుకోలేదు. ఇంగితానికి చెప్పవలసిన మహోదాసం హనుమంతుడికి చెప్తూ — "నువ్వు ఏనవోయీ హనుమంతుడా ! నేను మా అన్నగారికి సోదరుడినే గానీ .... నా చిన్న ప్రాయంలో రాముడినే నుంచీ ! మా అన్నగారి సద్గుణాలన్నీ చూసి నేను చిన్నతనంలోనే ముగ్ధుణ్ణయిపోయి ఈ మహానుభావుడికి సేవ చేసుకుంటూ

జీవిస్తున్నాను. * అది సరే ; ఇక విను .... ఇలా వుండగా గొప్ప రాజలక్షణాలు గల మా అన్నగారు రాజ్యభ్రష్టులై పోయారు. భార్యతో కలిసి వనవాసం చేస్తూ నానా బాధలూ అనుభవిస్తున్నారు .... తర్వాతేం జరిగిందో విన్నావా ?" — అని ఆగాడు.

"ఆయ్ ! చెప్పండి...." — అంటూ హనుమంతుడు కుతూహలంగా రెండడుగులు దగ్గిరి కొచ్చాడు. గాలి ముక్కుపొడుం పరిమళాలు మోసుకొచ్చింది రాముడి మీదకి. రాముడు గొప్ప రసపత్తర ఘట్టంలో వుండడంచేత గాని చేష్టలు అంతగా పట్టించుకోలేదు.

లక్ష్మణుడికి వొదినగారు గుర్తొచ్చి దిగులు పడుతూ —"మహానుభావుడైన మా అన్నగారూ, నేనూ లేని సమయంలో మహానుభావురాలైన మా వొదినగార్ని.... వొక మహానుభావుడైన రాక్షసుడు .. " — తక్కున ఆగి - సిగ్గు పడిపోయి - తబ్బిబ్బుపడి - నాలిక నరుకుని —" .... పరమ దుర్మార్గుడైన .... రావణుడు ... మా వొదినగార్ని .... ఎత్తుకు పోయాడోయీ ! నవ నవమూ గ్రహించగల మా అన్నగారికి, ఆ రావణుడి సంగతొక్కటే తెలీలేదనుకో.... ఏం చేస్తాం ?.... ఆనాటినించీ మా అన్నగారు కంటికీ మంటికీ ఏకధారగా దుఖిస్తూ కొండలూ కోనలూ,

---

* 4 వ సర్గలో — 5 నించీ 13 శ్లో॥

లక్ష్మణుడు రాముణ్ణి గురించి ఎలా చెబుతున్నాడో చూడండి — హనుమంతుని ప్రశ్న విని లక్ష్మణుడు, రామునిచే ప్రేరేపించబడినవాడై "శ్రీరాముడు మహాత్ముడు" — అని తెలిపెను. మరియు — " .. రాముడు .... సౌజన్యమైన జనులకుకూడ తెలిసినవాడు. సకల ప్రాణి కోటినీ రక్షించువాడు. దశరథుని కొడుకులలో మిక్కిలి గుణవంతుడు. (ఈ మాట లనేవి ఇంకో కొడుకు !) — సుఖము లనుభవించుటకు తగినవాడు (గొప్పవాడు తప్ప, అంచరూ సుఖాలకు తగరని అభిప్రాయం) .... నేను ఇతని గుణములచే వశపడుచుకొనబడినవాడనై ఇతనికి దాసుడుగ నున్నాను" — లక్ష్మణుడు రాముడికి దాసుడే ! (ఈ పాత్ర బాణిన వ్యవస్థలో బానిసలకు ప్రతిబింబం అని మొదటినించీ గ్రహించాలి.)

పట్టుకు తిరుగుతున్నారు .... కబంధుడి పుణ్యమా అని .... మీ రాజు గురించి తెలిసింది. ఆయన్నే వెతుక్కుంటూ వస్తున్నాం" — అని ఆగాడు.

"కబంధు డెవరబ్బా?" అని బుగ్గలు పుబ్బించి ఆశ్చర్య పడుతున్నాడు హనుమంతుడు

లక్ష్మణుడు — హనుమంతుడి అభిప్రాయం కనిపెట్టాలని ఎగాదిగా చూస్తూ — "సుగ్రీవుడు తప్పకుండా సహాయం చేస్తాడని మా అన్నగారికి కొండంత ఆశగావుంది సుమా: మా అన్నగార్ని గురించి ఎంత చెప్పినా ఇంకా చెప్పాలి. అంత గొప్పవారు: పూర్వం మా తండ్రిగారే లోకాలన్నీ రక్షించేవారు గానీ ... ఇప్పుడు మా అన్నగారే లోకాలు రక్షిస్తూ వున్నారు. అలాంటి మహానుభావుడికి ఇంత ఆపద వొచ్చిపడింది" — అని నిట్టూర్చాడు.

ఇతరుల్ని సహాయం అడుగుతున్నప్పుడు అన్నగారి గురించి అంత కన్నా ఎక్కువ చెప్పడం బాగుండదని లక్ష్మణుడు సందేహించి ఆగాడు.

రాముడు నుదురు చిట్లించి — "అంతేనా నా గురించి చెప్పేదీ? .... మొన్న ఖరుణ్ణి చంపానుగా? ఆ సంగతికూడా చెప్పరాదూ? .... చిన్నప్పుడు తాటకిని చంపానుగా? .... అహల్యకి శాప విమోచనం.... శివ ధనుర్భంగం .... ఎన్ని వున్నాయో: వొక్కటీ చెప్పవేం?" — అన్నట్టు చూశాడు.

"కనుసైగల వేవం" అంతగా చదవని లక్ష్మణుడు అన్నగారి ఆశలన్నీ వమ్ముచేసి హనుమంతుడివేపు ఆశగా చూస్తూ .... "హనుమంతుడా: మా అన్నగారికి సహాయం చెయ్యమని నువ్వు కొంచెం మీ రాజుకి నచ్చచెప్పాలోయీ: అసలు కోరిన వారందరికీ .... సిరి సంపదలూ .... భోగ భాగ్యాలూ .... మోక్షం అవీ మా అన్నగారే ఇవ్వగలరు. కబంధుడికి మోక్షం ఇచ్చారు. శబరికి మోక్షం ఇచ్చారు.

సుగ్రీవ మహారాజు మా అన్నగారికి వొక్కమాట యిస్తే అదే పదివేలని సంతోషిస్తారు సుమా ... !"

హనుమంతుడు మూతి బిగించి ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

లక్ష్మణుడు నిట్టూర్చి — "ఎంత కీర్తి వుంటేనేం ? ఎన్ని ధన ధాన్యాలు చేస్తేనేం ? అసలు — మా ఎఱుక వంశంవారు — మా తాతలూ .... ముత్తాతలూ ఎంతెంత కీర్తి సంతు లనుకున్నావూ ? .... ఈ భూమండలం మా ఇక్ష్వాకు వంశంవారి సద్గుణాలవల్లనే ఇలా నిలిచివుందని మా రాజ్యంలో గొప్ప గొప్ప పండితులంచరూ కీర్తిస్తారు ... ఏం చేస్తాం ? .... అంత కీర్తికాంక్షి మా అన్నగారు ఇలా తరగాల్పి వొచ్చింది. హనుమంతుడా ! మా అన్నగారు సుగ్రీవుణ్ణే శరణు కోరుతున్నారోయీ ! లోకాలన్నిటికీ శ్రీరాముడే నాథుడుగానీ — శ్రీరాముడికి మాత్రం సుగ్రీవుడే నాథుడు ... "

రాముడికి చాలా కష్టంగానేవుంది వినడం. సుగ్రీవుడు తనకు నాథుడా ? .... ఏవిటీ ప్రారబ్ధం ? క్రీగంట చూస్తే లక్ష్మణుడి ధోరణి మాటుతుందిగానీ ... సరే ! .... ఎలాగో ఒకలా అసలు పని జరగాలి మరి. ఆ రావణుడితో యుద్ధం అంటే .... సైన్యం ... వొక్కాసలు .... చారులూ .... ఎన్ని కావాలి మరి ! ఎవర్నో ఒకర్ని సహాయం అడగవలసిందే మరి .... ఏంచేస్తాం మరి ? తప్పదు మరి.

రాముడు తేరుకునేసరికి లక్ష్మణుడు హనుమంతుడి చేతులు పట్టుకు దీనుడ్డాడుతున్నాడు.

— "ఎలాగయినా నీవల్ల మాకీ సహాయం జరగాలోయీ ! ఇప్పుడు సుగ్రీవుడు అపునిసకపోతే మా అన్నగారి కింకో దిక్కు లేదు. ఈ దుఃఖసముద్రంలోంచి మా అన్నగార్ని సుగ్రీవుడు రక్షించకపోతే .. " జలజలా కన్నీళ్ళు కారుస్తున్నాడు.

రాముడు మొహంతిప్పి పంపా సరోవర సౌందర్యం ఆపలోకిస్తున్నాడు —

లక్ష్మణుడికి వొదినగార్ని తల్చుకుంటోంటే రాపిడితో చెరలోంచి ఆమెని ఎంతటెంతట విడిపించుకు రాగలమా అని ఆరాటంగా వుంది.

సుగ్రీవుని సహాయం తప్ప ఇంకో మార్గమేదీ కనిపించడం లేదు. దొంగను పోషున్న వరకూ "హనుమంతుడా ! ఇన్నిమాట లెందుకు ? సుగ్రీవుని శ్రీరాముణ్ణి అనుగ్రహించి సహాయం చేసేటు చేసే భారం నీదే !"— అని హనుమంతుని చేతులు విడిచిపెట్టి కళ్ళు తుడుచుకున్నాడు. *

హనుమంతుని ముఖంలో రకరకాల దిగాలు పడిపోయాడు. వీళ్ళేదో మహా సీదులేమో—వారి సీద వదిలిస్తారని ఎంతో ఆశపడితే తీరా వ్యవహారం ఇలా తిరిగిందేమిటి ? మనుషులు ఒడ్డూ పొడుగూ బాగానే వున్నాడు గాని బొత్తిగా సాహస్రాల పున్నట్టు తోచదు .... ఏమోలే ... ఏం

---

* 4 వ సర్గలో — 17 నించీ 25 వరకూ.

హనుమంతుడితో లక్ష్మణుడి మాటలు వినండి —

"కోరినవారికి ఐశ్వర్యమునిచ్చు .... సర్వస్వామి అయిన ఈ రాముడు సుగ్రీవుని తన స్నేహితుగా ఇచ్చగించుచున్నాడు. సర్వ లోకము లకూ శరణ్యుడుగానుండు రాముడు సుగ్రీవునికి శరణాగతి చేయు చున్నాడు. సుగ్రీవుని రక్షకునిగ నమ్ముచున్నాడు. సుగ్రీవుని అను గ్రహము కోరుచున్నాడు. శోక పీడితుడైన రాముని సుగ్రీవుడే అను గ్రహించవలయును"— ఇట్లు లక్ష్మణుడు కంటనీరుబెట్టి జాలి పుట్టునట్లు మాటలాడెను." —

"లోకాలను రక్షించేవాడు — తనను రక్షించమంటున్నాడు.
లోకాలను కాపాడేవాడు — తనను కాపాడమంటున్నాడు.
లోకాలను దయచల్చువాడు—తనను దయచల్చ మంటున్నాడు"

అని చెప్పడంలో కవి తన కవితా చమత్కారమే చూసుకున్నాడు గానీ—అది "శ్రీరాముని పాత్ర" ఎంత చిన్నబిరుస్తుందో పట్టించుకోలేదు.

అంతేగాక — సుగ్రీవుడి స్నేహం సంపాదించడం అనేది చాలా కష్టమైన విషయం అని కూడా కవి అభిప్రాయ పడుతున్నాడు. అందుకే లక్ష్మణుడు అంతగా ప్రాధేయ పడుతున్నాడు హనుమంతుణ్ణి.

చెప్పగలం ; బాణాలు కొట్టడం బాగానే వొచ్చి వుండాలి. ఎందుకన్నా మనికిరాకపోరు.

"ఏమోయీ ! ఏవిటి ఆలోచిస్తున్నావు ?"

"అబ్బే ! అంతగా చెప్పాలా మీలాంటివారు ? మా రాజు మీకు తప్పకుండా సహాయం చేస్తాడు. మీతో స్నేహం చేసుకోవాలనే కదా నన్ను పంపించాడు. రండి. వెళ్దాం."

"అన్నగారూ ! దయచెయ్యండి" — అంటూ లక్ష్మణుడు — పంపా సరోవర సౌందర్యానుభూతుల్లో లీనమైపోయిన అన్నగార్ని బయటికి పిలిచాడు.

రాముడు మొహం తిప్పి చుట్టూ చూస్తూ — "ఈ కొండ ఎక్కడం మహా కష్టంగా వుందోయీ !" అంటూ లక్ష్మణుడి అడుగు జాడల కోసం ఆగాడు.

"నా వెనకే రండి. తేలిగ్గా పోయే దారి చూపిస్తాను" — అంటూ హనుమంతుడు చకచకా బండలమీదనించి అంగలువేస్తూ నడక సాగించాడు.

• • •

సుగ్రీవ మహారాజు ఎందుకైనా మంచిదని రుష్యమూక పర్వతాన్ని కూడా శంకించి — దాని పక్కనేవున్న మలయ పర్వతంమీద గుహలో — మంత్రుల తలల అడుగున తన తల భద్రంచేసి వూపిరి బిగబట్టి ముడుచుకొని కూర్చున్నాడు — రాజనీతి చొప్పున.

హనుమంతుడు రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ రుష్యమూక పర్వతంమీదకు తీసుకొచ్చి, మహారాజ దర్శనం గాకపోవడంచేత చుట్టుపక్కల గుహలు వెదుక్కుంటూ మలయ పర్వతంమీద కొచ్చాడు.

గుహకి కొంచెం దూరంలో రాముణ్ణి ఆగమని సైగజేసి — "అయ్యా ! ఇప్పుడే మా రాజుని వెంటబెట్టుకొస్తాను. ఈ బండలమీద సుఖంగా కూర్చోండి" అని గబగబా గుహవేపు వెళ్ళాడు.

హనుమంతుడి అట్టహాసం ఏసిగట్టి మంత్రి తలలు రాజు తలతో — "వొచ్చినట్టున్నాడు" — అని గుసగుస లాడాయి. గుసగుసలు పూర్తి గాకుండానే గుహలో జొరబడ్డ హనుమంతుణ్ణి చూసి, మహారాజు వులిక్కిపడి — "అబ్బ! .... నువ్వేనా? ... వాలేమో అను...." — అని ఆపేసి, మొహం బిగించి గంభీరం చేశాడు. — "ఓ .. ఏమిటీ విషయం? .... ఎవరు వాళ్ళు....?" —

హనుమంతుడు ఘనకార్యం సాధించుకొచ్చిన ఉత్సాహంతో — "వాళ్ళు మనకి శత్రువులుకారు మహారాజా! అంతా కనుక్కొచ్చాను. చెబుతాగానీ ...." — అంటూ బొడ్లో తడుముకుని — ఏమీ దొరక్క పోయినా నిరుత్సాహ పడకుండా — "అబ్బే! మనం భయపడ్డాంగానీ .. వాలి ముక్కూ మొహం తెలీదు వాళ్ళకి. ఎక్కడో కోసలదేశం వాళ్ళు. దండకారణ్యంనించి వస్తున్నారు. దశరథ మహారాజు కొడుకు లంట. ఇద్దరూ అన్నదమ్ములే. పెద్దాయనపేరు శ్రీరామచంద్రుడు. బాగా చదువుకున్నవాడు. బుద్ధిమంతుడు. చిన్నాయన లక్ష్మణుడు మరీ బుద్ధి మంతుడు. అన్నగారంటే ఆ భక్తీ .... అదీ .... కళ్ళారా చూడ వలసిందే ...." —అని చెప్పుకుపోతున్నాడు.

"అది సరేలే! .... ఆ కత్తులే మోతాయి వాళ్ళకి? .... రుమ లకీ కత్తులకీ చుట్టరికం ఏవిటీ?"

"అదే మహారాజా! .... చెప్పొచ్చే దేవిటంటే .... ఆ రాముడి భార్యని రావణు డనేవాడెవడో ఎత్తుకుపోయాడంట. పాపం మనలాగే వాళ్ళూ కష్టాల్లోపడి మిడుకుతున్నారు. నీ సాయం అడగాలనే పుష్టైదాళతో వచ్చారు."

"నా సాయవా? ఇంకా నయం. కుదరదని చెప్పలేదూ? ఎందుకొచ్చిన తద్దినం మనకి .. ?"

"అబ్బే! మనం అంత తొందర పడకూడదు మహారాజా! శ్రీరాముడు చాలా విషయాలు తెలిసినవాడిలా గున్నాడు. బాగా చదువు కున్నవాడు. గొప్పకులం వాళ్ళు. ఆలాంటి వాళ్ళొచ్చి "నువ్వే దిక్కని శరణుకిగితే ...."

"ఏవిటీ ? .... నేనే దిక్కన్నా ? ."

"అనకపోతే తీసుకొస్తానా ? సుగ్రీవుడే మమ్మల్ని రక్షించాలన్నారు. సుగ్రీవుడే మమ్మల్ని కాపాడాలన్నారు. సుగ్రీవుడే మమ్మల్ని చంపవల్సిలన్నాడు. ఆ చిన్నాయన నా చేతులు పట్టుకుని "వూఁ" అనే దాకా ఒదల్లే ; చెప్పొద్దూ : నాకూ జాలేసిందినుకో".

"ఆఁ ... నీకు కాలెయ్యడాని కేవిలే ; వొళ్ళెవరో ఏపిటో కనుక్కు రమ్మన్నానా ? .... పెంటపెట్టు కొచ్చెయ్య మన్నానా ? ... చూసి రమ్మంటే కాల్చి వొచ్చే రకంలాగున్నావే" — అని విసుక్కున్నాడు సుగ్రీవుడు.

హనుమంతుడు కొంచెం బెంబేలు పడ్డాడు— తను చేసుకొచ్చిన పని రాజుగారు వొప్పుకోడా ఏవిటని.

తారుడు కలగజేసుకుని — "అసలు రాముడికి సుగ్రీవుడేం సాయం చెయ్యాలంటావూ ?" అని అడిగాడు.

"ఆయన భార్యని వెతకాలిగా ?"— అనినసిగాడు హనుమంతుడు.

"ఇది మరీ బాగుంది. నేను వెతుకుతానా ఏమిటి పోయి ? " — అని కస్సుమన్నాడు సుగ్రీవుడు.

"వూళ్ళోవాళ్ళ కెళ్ళాలందర్నీ వెతుకుతూ కూర్చుంటాను. నా కిదే పని".

హనుమంతుడు నచ్చచెప్పే ధోరణిలో, నేర్పుగా — "మహారాజా ; నీ మేలు కోసమే నేనీ కార్యం చేసుకువచ్చాను సుమా ...." అంటూ ప్రారంభించాడు.

"ఏం మేలు ? — నీ మొహం మేలు ...." — అని సుగ్రీవుడు హనుమంతుడి నేర్పంతా ఎగరగొట్టి — "బడితెల్లాగ వాళ్ళ కత్తులూ వాళ్ళూ ... వాళ్ళతో మనకేం స్నేహం ?" — అని కోపంగా చుట్టూ చూశాడు.

హనుమంతుడు కాస్త చొరవచేసి — "వాళ్ళకి కత్తులుండే మనకేం భయం సుగ్రీవరాజా ? వాలికి భయం గానీ...." — అని తర్కానికి దిగాడు.

సుగ్రీవుడు చుట్టుగా మొహం చిట్లించి — "వాలికేం భయం ? ఎందుకు భయం ? .... ఎట్లా భయం ? . ఎప్పుడు భయం ?...." — అంటూ ఎన్నెన్నో ప్రశ్నలు వేశాడు.

"అట్లా అడుగు. చెబుతాను. అసలు మనం వాలిని జయించాలా ? అక్కర్లేదా ? బతికినన్నాళ్ళూ ఈ కొండమీదే వుంటామా ?"

"ఇంక నయం. వుంటే వుండండి ...."

"మరి మనకి ఎప్పటికైనా గొప్ప పీకుడి సహాయం కావాలా ? అక్కర్లేదా ? .. "

"హూఁ అయితే ....?"

"అయితే ఏపిటి ? రాముడితో స్నేహం ...ఎంత బలం...."

"ఏం బలం ? .... ఆ కిత్తు ..."

"అదుగో : మళ్ళీ అదేమాట ? ఆ కత్తులు మనల్నేం చేస్తాయి మరి రాజా ?"

"మరి ఎవర్ని చేస్తాయి ?"

"చెప్పేది వినవుగదా ? — రాముడితో స్నేహం చేసుకున్నా వనుకో. రాముడు వాలిని చంపేశాడనే మో ఎవరికి తెలుసు ?"

"మీరు : చంపెయ్యడమే" — సుగ్రీవుడి మొహం తళుక్కున మెరిసి — వెంటనే చీకట్లు కమ్ముంది — "అబ్బే ! వాలి నెవడు చంప గలడూ ? వుత్తది ...." — అని గాఢంగా నిట్టూర్చాడు.

"మహారాజా ! హనుమంతుడు చెప్పేది బాగానే వున్నట్టుంది" — రామునకు కొంచెం హనుమంతుపైవేపు జరిగాడు.

"కావును. మనం భయపడవలసిందేమీ లేనట్టే వుంది".

— మంత్రులందరూ హనుమంతుడి వేపే వొరిగారు.

"ఏపిటి బాగుండేది ? — మీ అందరి మొహం !" — అని ఏసుక్కుని — "ఇంతకీ ఆ రాము డెలా చంపుతాడేం వాలిని ?" — అని మూలప్రశ్న వేశాడు సుగ్రీవుడు.

"ఎలాగేనిటి ? .... ఆ బాణా ల్లేవూ ?"

సుగ్రీవుడు వెటకారంగా నవ్వి – "ఆ బాణం పుల్లలతో వాలిని చంపుతాడా? ... ఇదుగో! ఇన్నిమాట లెందుగానీ .... ఇదేం జరిగి చచ్చే వ్యవహారం కాదు. ఆయన భార్యని ఆయన్నే వెతుక్కోమను. తొందరగా చెప్పు. నీ వెనకాల తీసుకొచ్చేశావా ఏవిటి వాళ్ళని? .... వెళ్ళమను చెయ్యి. ఇంకెవర్నన్నా చూసుకోమను. నేను వెతకలేను సుమా ఆయన పెళ్లాన్ని." – అంటూ హనుమంతుణ్ణి తొందర పెట్టాడు.

హనుమంతుడు బుగ్గలు వత్తుంచి కోపంగా చూశాడు. – "నాకు తెలవకడుగుతానూ – ఇందాక ఆ బాణం పుల్లలు చూసి కాదూ మనం హడిలి చచ్చిందీ?"

సుగ్రీవుడు తెల్ల బోయి – "అవును సుమా!" అన్నట్టు చూశాడు.

అదునుచూసి హనుమంతుడు చొరవచేసూ – "మహారాజా! ముందు నువ్వు రాముడితో స్నేహం చేసుకుంటే – తర్వాత వ్యవహారాలన్నీ మాట్లాడుకోవచ్చు" – ఒకసారి చుట్టూ చూసి కంఠం తగ్గించి గుసగుసలాడుతూ – "నీ పిచ్చి గానీ .... పనం మాత్రం ఆయనకి వూరికే సాయం చేస్తామా? ఆయన వాలిని చంపిపెడితే, మనం సీతని వెతికి పెడతాం. అంతేకదా? ఇందమ్మా అంటే ఇందమ్మా! నా మాట విని ..."

– "అది సరేలే. నిజంగానే వాలిని చంపగలడంటావా?"

"ముందు నువ్వసలు శ్రీరాముడితో స్నేహం చేసుకో."

"చేసుకుంటానయ్యా! చేసుకుంటే ఏం లాభం? – "నీ శత్రువుని నేనెందుకు చంపుతానూ? .... నాకు పాపం చుట్టుకోదా" అంటా దేమో తీరా ...."

"అబ్బో! ఆయనకి శాస్త్రాలన్నీ తెలుసు. ఏ పాపాని కే ప్రాయశ్చిత్తం చేసుకోవాలో ఆయనకి మరీ చక్కగా తెలుస్తుంది. అయినా ఆయన అంటాడో లేదో మనకెందుకా అనుమానం? అన్నప్పుడు చూద్దాం."

"అవును. హనుమంతు దన్నదే బాగుంది రాజా ! నువ్వు కోసలరాజుతో స్నేహం చేసుకుంటేనే బాగుంటుంది."

సుగ్రీవుడు కాదనలేక పోయాడు. ఒకవేళ శ్రీరాముడు నిజంగానే వాలిని చంపగలడేమో ! ఏమో ! ఎవరు చెప్పగలరు ? ఏ పుట్టలో ఏ పాముందో ! — "ఊఁ ! సరే ! మీ ఇష్టం ! .... మంత్రులందరూ చెప్పిం తర్వాత . పద. బాగా కనుక్కొన్నావా ? .... ఫర్వాలేనుగా ? మనకేం భయం లేదుగా ? " — అంటూ గుహలోంచి తల బయటకు తీశాడు.

"నా మాట నమ్ము. అన్నీ కనుక్కొన్నాను "

"అందుకన్నా మంచిది. మామా ! నువ్వుకూడా ఆ శ్రీరాముణ్ణి ఒక కంట కనిపెడుతూ వుండు సుమా !" — సుగ్రీవుడు తారుడితోకూడా చెప్పి వీరోచితంగా కొమ్ము విరుచుకుని ముందుకు నడిచాడు. *

రాముణ్ణి చూడగానే సుగ్రీవుడు తబ్బిబ్బుపడి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు.

సుగ్రీవుణ్ణి చూసిన రాముడు కూడా నిశ్చలంగా, గంభీరంగా

---

* 31వ సర్గలో — ఆఖరి శ్లోకం.

అసలు సుగ్రీవుడికి రాముడితో స్నేహం చెయ్యాలనే అభిప్రాయమేమీ లేదు మొదట్లో. వాళ్ళెవరో తెలుసుకు రమ్మన్నాడేగానీ తీసుకు రమ్మనికూడా చెప్పలేదు.

రాముడూ, లక్ష్మణుడూ, వాలి మనుషులు కారని తెలిసిం తర్వాత హనుమంతుడే రాముడిచేత వాలిని చంపించాలనే వుపాయం ఆలోచించాడు.

— "లక్ష్మణుని మాటలు విని మిగుల సంతోషము గలవాడగు హనుమంతుడు, మనసుకు సమాధాన పరచుకొని, వాలిని గెలుచు నిమిత్తమై, రామ లక్ష్మణులతో సుగ్రీవునికి స్నేహము గలిగించుటకు అభిప్రాయ పడెను."

కళ్ళు భూమికి దించి ఊరుకున్నాడు. సుగ్రీవుణ్ణి చూసీ చూడగానే రాముడికి చాలా ఏవగింపు కలిగింది. అడవుల్లో నిత్యమూ చూసే మోటు మనుషుల్లాగానే వున్నాడు సుగ్రీవుడు కూడా. వొంటిమీది నగలూ ఏవో వున్నాయిగానీ — అవికూడా ఆటవికులు పెట్టుకునేమాదిరి మోటు నగలే. రాముడికి సుగ్రీవుడి మొహంలో ఎక్కడా అందచందాలుగానీ, కళాకాంతులుగానీ కనపడలేదు. ఈ ఆటవికుడేనా సుగ్రీవ మహారాజు? పైగా ఈయనా తనకు సహాయం చేసేది?

సుగ్రీవ "మహారా జెంత చక్కని వాడో చూడు" — అన్నట్టు రాముడు లక్ష్మణుడివేపు క్రీగంట చూశాడు. లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి గౌరవంగా చూస్తున్నాడు — "ఇతడేనా మా అన్నగారికి సహాయం చేసేది!" — అన్న విస్మయం లక్ష్మణుడి మొహంలో తొణికిసలాడుతోంది.

సుగ్రీవుడు— రాముణ్ణీ, లక్ష్మణుణ్ణీ చూసి చాల ఆశ్చర్యంతో గౌరవంతో తల వొంచుకున్నాడు. వారి కను ముక్కు తీరులూ — అందచందాలూ — సుగ్రీవుడి కెంతో ముచ్చట కలిగించాయి. ఇద్దరికిద్దరూ ఎంతో నాగరీకంగా గొప్పవారిగా కనిపిస్తున్నారు. వారి తండ్రి తాతల గురించీ, వంశ ప్రతిష్ఠల గురించీ హనుమంతుడు చెప్పిందంతా గుర్తొచ్చి సుగ్రీవుడికి ఇంకా గౌరవం కలిగింది.

హనుమంతుడు కలగజేసుకుని సుగ్రీవుడికి రాముణ్ణి చూపించాడు. "మహారాజా! ఈ మహానుభావుడే శ్రీరాముడు. కోసల నేలవలసిన వాడు. సమస్త శాస్త్రాలూ చదివినవాడు. ఈయన ఆపదలో చిక్కుకుని నీ శరణు కోరుతున్నాడు ...." —

రాముడికి తల తీపేసినట్టయింది — సుగ్రీవుణ్ణి చూడకముందు ఏమో అనుకున్నాడు గానీ, ఈ ఆటవికుణ్ణి తను శరణు కోరడం అంటే .... — సుగ్రీవుడు సిగ్గుపడుతూ వినయంగా చేతులు నలుపుకుంటూ — రాముడితో — "అయ్యో! నీ గురించి అంతా పిన్నాను. నా మంత్రి చెప్పాడు. నువ్వు గొప్పదేశానికి రాజువి. గొప్ప కీర్తిమంతుడివి. చదువులన్నీ చదువుకున్నవాడివి. నీవంటి మహానుభావుడు నాలాంటి

అడవి మూర్ఖుడితో నేస్తం కడతాననటం.... నా సాయం అడగటం.... అయ్యో ! .... అది నా అదృష్టం ! .... నా భాగ్యం !" — అనికొంచెం జంకుతో — "నా స్నేహం నీకిష్టమే అయితే...." — అంటూ సందేహంగా చెయ్యిజాపాడు.

సుగ్రీవుడి మాటలూ, వినయం రాముడికి కొంచెం ఇష్టంగానే తోచాయి. ఇషా ఇష్టాలమధ్య వూగిసలాడుతూ రాముడు, సుగ్రీవుడు చెయ్యి చాచేసరికి అప్రయత్నంగా చెయ్యి వట్టుకుని గంభీరంగా చూశాడు. సుగ్రీవుడా గంభీరాన్ని గుర్తించక అమాంతంగా రాముడి మీదబడి కౌగిలించుకున్నాడు. సుగ్రీవుడు వొదిలేవరకూ ఆ పట్టు వొదులుచ్చుకోడం రాముడి తరంకాలేదు.

సుగ్రీవుడి మంత్రులు గబగబా ఎండుకర్రలు పోగేసి నిప్పు రాజేశారు. చుట్టూ పచార్చని వూది వూది పొగలేకుండా మంట తయారు చేశారు. హనుమంతుడు కాసిన్ని పూలు తెచ్చి కర్రల చుట్టూ పడేశాడు.

సుగ్రీవుడూ రాముడూ అగ్నిచుట్టూ ప్రదక్షిణాలు చేశారు. రాముడు అగ్నిదేవుణ్ణి కొలిచే మంత్రాలన్నీ పఠ్చరించాడు. తనతో స్నేహం చేస్తోన్నందుకు సుగ్రీవుడి సంతోషం చూస్తూ, తన ఆధిక్యం మనసం చుకున్నాడు. అగ్నిసాక్షిగా, శాస్త్రోక్తంగా జరుగుతోన్న కార్యం రాముడికి కొంత స్థిమితం కలిగించింది.

ఇంత గొప్పవాడితో స్నేహంచేస్తే వాలికి చావు తప్పదని సుగ్రీవుడికి చాలా సంబరంగా వుంది.

ప్రదక్షిణాలూ.... మంత్రాలూ — కావలింతలూ — అయిం తర్వాత సుగ్రీవుడు చుట్టూ చూసి పూలతో నిండిన కొమ్మ వొకటి వొళ్ళున విరిచి కిందపడేసి రాముణ్ణి లాగి కూర్చోబెట్టి తను సగసగ కూర్చున్నాడు.

హనుమంతుడు లక్ష్మణుడికి కూడా వొక పూల పీట వేశాడు.

సుగ్రీవుడి మంత్రులంతా చుట్టూ జేరారు. "వాళ్ళం మూర్ఖుడు కుంటార్తో వింధాం" — అని పిట్టలన్నీ చప్పుళ్ళు మాని కూచున్నాయి.

"వాళ్ళేం మాట్లాడుకున్నా నేను వొచ్చి మీ కందరికీ చెప్పేస్తాగా?" — అని గాలి దూర దూరంగా చెట్ల కన్నిటికీ మాటలిస్తోంది.

"అయ్యా! మా అన్న .... పరమ దుర్మార్గుడనుకో...."

— సుగ్రీవుడికి గబగబా తన గోడు చెప్పేసుకోవాలని ఆరాటంగా వుంది. రాముడికి కూడా తన దుఖ చరిత్ర వినిపించాలని ఆతృతగానే వుంది. తనే చెబితే బాగుంటుందా? లక్ష్మణుడితో చెప్పిస్తే బాగుంటుందా? — అన్న ఆలోచనలతో సతమత మౌతున్నాడు.

"అయ్యా! చెబితే నమ్మవు. నీ కబద్ధం! .... నాకు నిజం .... మా అన్న .... ఎంత దుర్మార్గుడో ...."

"అవునోయీ! .... మా పినతల్లి కూడా .... అటువంటి దుష్టురాలే .. "

"అసలు నే నే తప్పూ చెయ్యలేదు సుమా! ... వుత్త పుణ్యానికే నన్ను రాజ్యంలోంచి ...."

"సరి. నన్నూ అంతే కాదూ? ... నిష్కారణంగా .... నిర్దోషి .... మా తండ్రి ఆడదాని మాట వినీ ...."

"చెప్పుకుంటే సిగ్గు. నా భార్యని మా అన్నే వుంచేసుకుని .... వన్ను అన్యాయంగా ...."

"అన్యాయం గాకపోతే ఏంవుందోయీ లోకంలో! .... పర స్త్రీ అని ఆలోచించాడా ఆ రావణుడు! అసలా గాధంతా విన్నావంటే .. "

"నా గోడు నువ్వు ఆలకించాలేగానీ .... కడుపు తరుక్కుపోతుం దనుకో...."

"కన్నుమూసి ఎరగననుకో ఈ కష్టాలతో. ఇంత ఘోరం జరుగుతుందని స్వప్నంలో కూడా అనుకోలేదు సుమా!...."

ఈ వ్యవహారం లక్ష్మణుడికి కాస్త ఇబ్బందిగానే తోచింది. మొహం అటూ ఇటూ తిప్పి కొండ కిందకి చూశాడు. ఎంతెంత లోయలో! — "అసలీ కొండ ఎలా ఎక్కాం!" — అన్నంత ఆశ్చర్యం వేసింది. కొండ పక్కనే వొక సీటిపాయ రాళ్ళమీదనించి దూకుతూ ఘోషిస్తోంది. గాలిలో కరకపువ్వు వాసన విచ్చలవిడిగా తిరుగుతోంది.

హనుమంతుడికి హఠాత్తుగా కరకాకు ముక్కపొడుం గుర్తొచ్చి బొడ్లో తడుముకుని, ఏమీ దొరక్కపోవడంతో, పక్కనే నీలుడి బొడ్లో తడిమి, చుట్ట సంపాదించి ఆరిపోతోన్న అగ్ని దేవుణ్ణి అంటించాడు. అగ్ని, చుట్టా స్నేహం చేసుకున్నాయి. పరిమళాలూ, గాలీ స్నేహం చేసుకున్నాయి. అంతవరకూ నిగ్రహంగానే వున్న నీలుడు ముక్కు ఎగబీల్చి నెమ్మదిగా చెయ్యి నీలుడి బొడ్లోకి పోనిచ్చాడు. అక్కడ తచ్చాడుతోన్న తారుడి చెయ్యి నీలుడి చేతితో స్నేహం చేసుకుని నీలుడి బొడ్డు ఖాళీ చేసింది.

"వాళ్ళు చుట్టలు కాల్చుకుంటున్నారు" — అని గాలి అడివంతా చెప్పేసింది.

"వాళ్ళంటే ఎవరెవరు? .... రాముడు కూడానా?" — అన్నాయి చెట్లు ఆశ్చర్యంగా.

వినిపించుకోకుండానే పరిగెత్తింది గాలి. లక్ష్మణుడి దృష్టి లోయల మీదనించీ, సీటిపాయల మీదనించీ యధాస్థానాని కొచ్చేసరికి సుగ్రీవుడే మాట్లాడుతున్నాడు. రాముడు సుగ్రీవుడికే సందు ఇచ్చి తను చాలించుకుని మౌనంగా వింటున్నాడు.

"నా అన్నమూలాన్నే నిత్యం గజగజలాడుతూ ఈ కొండమీద కాలం గడుపుతున్నాను రామయ్యా!" అని సుగ్రీవుడు గబుక్కున రాముడి చేతులు పట్టుకున్నాడు. — "ఆ దుర్మార్గుడివల్ల నాకేమీ భయం లేకుండా చేస్తానని నువ్వు నాకు మాట ఇవ్వాలి సుమా! .... గొప్ప వీరుడవని విన్నాను. ఇవి చేతులు కావు," — అంటూ చేతులు గట్టిగా బిగించాడు.

రాముడు కొంతసేపటినించీ రాజకీయ రంగంలో తర్క వితర్కాలతో సతమత మౌతున్నాడు.

సుగ్రీవుడు స్పష్టంగా పైకి తేల్చిచెప్పడం లేదుగానీ, అతని అభిప్రాయం వాలిని చంపెయ్యమనే. వాలిని చంపేస్తే ... సుగ్రీవుడు రాజవుతాడు. సుగ్రీవుడు రాజైతేనే అతని చేతిలోకి సైన్యం . మొక్కసరి

.... అధికారం వొస్తాయి. అవస్నీ లేకుండా రావణుడితో యుద్ధం చెయ్యడం సాధ్యం కాదు. అంటే — రావణుడితో యుద్ధం చెయ్యాలంటే — సైన్యం కావాలి. సైన్యం కావాలంటే సుగ్రీవుడు రాజు కావాలి. సుగ్రీవుడు రాజు కావాలంటే వాలి చచ్చిపోవాలి. చచ్చిపోవాలంటే చచ్చిపోతాడా నిష్టేపంలా వున్నవాడు ? — మరి ఎలాగో తనే చంపెయ్యాలి. వాలి చచ్చిపోతేనే సుగ్రీవుడు రాజవుతాడు. సుగ్రీవుడు రాజైతేనే...." .... రాముడు చాలాసేపు ఆ విషయాన్నే కిందకీ మీదకీ ఆలోచిస్తోంటే — 'అంతరాత్మ' నెమ్మదిగా నసుగుతూ ముందుకొచ్చి నిలబడి వినయంగానే —"మాటవరస కడుగుతున్నాను సుమా : .... ఇప్పుడు సైన్యం .... బొక్కసం .... అన్నీ వాలి చేతిలో సిద్ధంగానే వున్నాయి కదా ? .... అతణ్ణి చంపడం .... అవన్నీ సుగ్రీవుడికి వొచ్చేట్టు చెయ్యడం .... అప్పుడు మన కార్యం జరిపించుకోవడం .... ఇదంతా ఎందుకు ?.... అప్పటికి చాలా ఆలశ్యం అయిపోతుంది గదా ? .... ఇప్పుడు సుగ్రీవుణ్ణి సహాయం అడిగినదే వాలినే సహాయం అడగ వొచ్చునే ! .... వాలితోనే స్నేహం చేసుకోవొచ్చునే ! .... ఈ మాత్రానికే వాలిని చంపడం .... అబ్బే ! వూరికే అనుమానం వొచ్చి అడిగాను సుమా !" — అని నడుంవొంచి వొకపక్కకి తిరిగి నిలబడింది.

రాముడు గంభీరంగా — "అవును. నువ్వింతా అడుగుతావని నాకు తెలుసు. అన్నీ చెబుతాను. ఈ మాత్రానికే వాలిని చంపడం ఎందుకంటున్నావు కదూ ? — అనలు రాజకీయాల్లో "ఈ మాత్రం" "ఆ మాత్రం" అనే మాత్రాలు వుండవు. మనం చేసే పని ఎంత చిన్నదైనా మనకేమైనా లాభం వొస్తుందా ? లేదా ? అన్న మాత్రం మాత్రమే వుంటుంది. నువ్వన్నట్టు వాలితోటే స్నేహం చేసుకుంటాం అనుకో. అనలు మనకన్నా గొప్ప స్థితిలో వున్నవాడు మనతో స్నేహం చేస్తాడని నమ్మకం ఏమిటి ? .... పోనీ స్నేహం చేస్తే మాత్రం మనం అడిగిన సహాయం చేస్తాడని నమ్మకం ఏమిటీ ? ... వాలికీ, రావణుడికీ వున్న సంబంధం ఎటువంటిదో ! మనకోసం వాలి రావణుడితో వైరానికి సిద్ధపడతాడో లేదో ! .... ఇవన్నీ ఆలోచించాలి గదా....!"

"పోనీ ఎవరిద్వారానన్నా అడిగించి తెలుసుకుంటేనో ? సుగ్రీవుణ్ణి అలాగ అడిగించాం గదా ?"

"సరే ! సువ్వన్నట్టే వాలి పనకు సహాయం చేస్తాడే అనుకో ... ఇక తర్వాత ఎల్లకాలం నేను వాలికి కృతజ్ఞుడిగా వుండవలసిందేకదా ? .... అతడి సహాయానికి ప్రతిఫలంగా నేను మళ్ళీ అతడికి చెయ్యవగ్గ కార్యమేదీ లేదు కదా ? .... సుగ్రీవుడి సంగతి అలా కాదే ! ..... సుగ్రీవుడికి నేను ముందే సహాయం చేస్తాను. వాలిని చంపి, రాజ్యం అప్పగిస్తాను. అప్పుడు సుగ్రీవుడే నాకు ఎల్లకాలం కృతజ్ఞునిగా వుంటాడు. లేక రావణుడితో యుద్ధం చెయ్యడానికి సహాయం చేసినా, అదంతా నేను చేసిన వుపకారానికి ప్రత్యుపకారమే కదా ? తర్వాత కాలంలో కూడా సుగ్రీవుడు నా చెప్పుచేతల్లోనే మసులుతాడు. అంటే కిష్కింధారాజ్యం కోసల రాజ్యాధీనంలో వున్నట్టే. — వాలి వల్లే సహాయం పొందుతా ననుకో. సరిగ్గా దీనికి తారుమారౌతుంది. శ్రీరాముడు ఎల్లకాలం వాలికి వినయ విధేయతలతో బ్రతకవలసిన వాడే ! .... అవునంటావా ? కాదంటావా ? ... "

"....అవును గానీ .... అయినా .... మరి .... వాలిని చంపితే లోకం ...."

"అదే. లోకంతో కొంచెం ఇబ్బందే. అదే ఆలోచిస్తున్నాను. వేదాల్లోంచి ఏమైనా సీతలు దొరుకుతాయేమోనని ఆలోచిస్తున్నాను."

"ఏవిటీ ? .... వేదాల్లో "ఎవరు ఎవర్ని చంపేసినా అన్యులు తప్పులేదనే" సీతు లుంటాయా ?"

"అలా వుండవు గానీ...."మను ధర్మశాస్త్రం"లో కొన్ని మంచి సీతు వున్నట్టున్నాయి. ఈ సందర్భంలో మనకు పనికివచ్చేవి రెండు శ్లోకాలు గుర్తు వస్తున్నాయి. అనలు మను ధర్మశాస్త్రం మన ధర్మశాస్త్రమే గదా ?"

"అయితే వాలిని చంపెయ్యడమేనా ? ...."

"తప్పదు మరి. నేనేం చేస్తాను? అతడికి అట్టా రాసిపెట్టివుంటే నాకీ బుద్ధి కలుగుతోందేమో. నేను చేసే పని తప్పెలా అవుతుంది? ... అంతా విధి విధానం .... నేను నిమిత్త మాత్రుణ్ణే .... అలాగే చెప్పేస్తాను లోకానికి లేకపోతే వాలికి శరణాగతుణ్ణయి ఎల్లకాలం బ్రతకమంటావా? ఒక పని చేస్తున్నాం అంటే ఎంత ముందుచూపు వుండాలి: అప్పటి కాపని అయిపోతే చాలనుకోగూడదు. దానివల్ల ముందుముందు కూడా లాభం చేసుకోవాలి."

".... పోనీ .... ఆ అన్నదమ్ము లిద్దరికీ సఖ్యం చేస్తే ....: వాలి దగ్గరికి లక్ష్మణుణ్ణి పంపి మాట్లాడితే నువ్వు చెప్పినట్టు వింటాడేమో? .... అప్పుడెలాగూ మనకు సహాయం చేస్తారు ఇద్దరూ. ఎవర్నీ చంపక్కర్లేదు కూడాను."

"నా కిలాంటి సలహా లిస్తేనే కోపం వొస్తుంది. వాళ్ళిద్దరూ కలిస్తే ఇంకా బలం వాళ్ళకి. అప్పుడైనా వాలి వల్ల వుపకారం పొందితే నేను వినయంగా వుండవలసిందే కదా: ఇంకో రాజుకి కృతజ్ఞతగా వుండడం నేను ఊహా మాత్రంగా నైనా భరించలేను సుమా: ఒక రాజ్యం మన అధీనంలోకి వొచ్చే అవకాశం వున్నప్పుడు వొదులుకోవడం ఎంత తెలివి తక్కువ: నేనేం చేసినా అన్నీ ఆలోచించే చేస్తాను. నమస్తశాస్త్రాలూ చదివినవాణ్ణి. నన్ను శంకిస్తా వెందుకు మాటి మాటికీ?"

"అబ్బే .... ఏదో .... వూరికే ...."

"సరిగ్గా చెప్పు. నా ఆలోచన ధర్మ బద్ధంగా లేదూ?"

"ఎందుకు లేదూ, నీకు ధర్మాలన్నీ తెలుసు."

"నిజంగా అంటున్నావా, నీ కిష్టమేనా?"

"ఊ.... అ....లా....గే: నీ.... ఇ ....ష్టం....:" దీర్ఘాలోచనలో మునిగిన రాముడు తల అటూ ఇటూ తిప్పుతోంటే సుగ్రీవుడు బిత్తరపోయి రాముడి చేతులు విడిచిపెట్టి వినయంగా కూర్చున్నాడు.

రాముడు తేరుకుని చిరునవ్వుతో — "సుగ్రీవా: మిత్రుల కర్తవ్యం వుపకారం చెయ్యడమే గదా, నీ భార్యను అపహరించిన

దుర్మార్గుడు వాలి. అందుకే అతణ్ణి చంపి తీరతాను." నిశ్చింతగా వుండు — అని తల పంకించాడు. *

సుగ్రీవుడు తన చెవుల్ని తను నమ్మలేక — "నిజమేనా ? .... చంపెయ్యడమే వాలిని ; నీకేం వినబడింది?" — అన్నట్టు హనుమంతుడి చెవులవేపు ఆశతో చూశాడు.

హనుమంతుడు తారుడి చెవులవేపు చూస్తున్నాడు. తారుడు....

సుగ్రీవుడికి వూరిగా నమ్మకం కలిగించాలనే ఆరాటంతో రాముడు — "నా బాణాల శక్తి నీకు తెలియదు. ఇంద్రుడి వజ్రాయుధం

---

* 5 వ సర్గలో — 26 నించి 30 వరకూ.

వాలి సుగ్రీవులమధ్య వైరానికి కారణం ఏమిటో తెలుసుకోకుండానే రాముడు సుగ్రీవుడితో — "వాలిని చంపెదను" — అని చెప్పేశాడు. అలా నిర్ణయించుకోడానికి కారణం కూడా చెప్పాడు — "నీ భార్య నపహరించిన వానిని చంపెదను" —

"వేరే కారణాలేం తెలియాలి ? — వాలి సుగ్రీవుడి భార్యని అపహరించి, సుగ్రీవుణ్ణి రాజ్యంలోంచి వెళ్ళగొట్టిన సంగతి రాముడికి తెలుసు కదా ? — అందుకే అలా వాగ్దానం చేశాడు"— అనుకోవచ్చు. కానీ, తర్వాత కొంతసేపటికి — 8వ సర్గలో — 42 వ శ్లోకంలో — "సుగ్రీవుడా : వాలికీ, నీకూ కలిగిన వైరమునకు కారణము సవిస్తరముగ వినగోరు చున్నాను. అంతయు విని, బలాబలములను విచారించి నీకు మేలు చేస్తాను" — అంటున్నాడు. వైరానికి కారణం ఏమిటో ఇప్పుడు సవిస్తరంగా వినాలనుకుంటున్నాడు గదా ? — విన్న తర్వాత వాగ్దానం చేస్తాడా ? వాగ్దానం చేసిన తర్వాత వింటాడా ?

వాలిని చంపాలనుకోవడంలో రాముడికి స్వార్థం వుందో లేదో తెలియాలంటే — వాలిని చంపడానికి రాముడేం "కారణాలు" చెబుతాడో .... ఆ కారణాల్నిబట్టి ఆలోచించాలి. ఆ కారణాలు "న్యాయమైనవి" అయితే రాముడి నిర్ణయంలో తప్పు లేనట్టే.

పంటివి సుమా నా బాణాలు ; రామ బాణం గురితప్పదు.... ఇన్ని మాట లెందుకు ? నా కరకు బాణాలు గుండెల్లో దిగి, భూమ్మీద పడిదొర్లే నీ అన్నని నువ్వే కళ్లారా చూస్తావు," — అని గంభీరంగా మందహాసం చేశాడు.

సుగ్రీవుడు ఆనందంతో తిన్నగా కూర్చోలేక పోతున్నాడు. వాలిని చంపెయ్యడమే ; ఇక కిష్కింధా రాజ్యానికి.... తనే రాజు ; .... పని జరిగేటట్టే వుంది. ఇతడు గొప్ప విలుకాడులాగే వున్నాడు. బాణా లతో కొడితే వాలీ.... వాలి తాతా కూడా పూడి పడతారు. — సుగ్రీ వుడు మళ్ళీ రాముడి చేతులు లాగి పట్టుకుని —"రామయ్యా ; నీ దయ వల్ల అంతపని జరగాలే గానీ.... నీ ఋణం వుంచుకోను సుమా ! నా భార్య మళ్ళీ నాకు దక్కితే.... రాజ్యం కూడా అనుకో.... అది సరే ; మరి.... వాలిని ఎప్పుడు చంపేస్తావూ ?.... అంత తొందర లేదనుకో, పోనీ బతకనియ్యి కాస్సేపు. మహా విర్రవీగుతున్నాడు దుర్మార్గుడు. ఎంతకాలం బతుకుతాడో నేనూ చూస్తాను," — అంటూ తిన్నగా కూర్చో నివ్వకుండా విర్రకింద తెగ గుచ్చుకుంటోన్న పూలకొమ్మ గబుక్కున లాగి అవతల పారేశాడు. దానిమీదే ఎగిరొచ్చిన రాముడు జర్రున జారి మొహం చిట్లించి నవ్వుకున్నాడు.

రాముడు వాలిని చంపుతాననడం లక్ష్మణుడి కేమంత సమంజ సంగా తోచలేదు. అసలీ అన్నదమ్ముల మధ్య వైరం ఎందుకో, ఏమిటో, ఎవరి పక్షాన న్యాయం వుందో వివరంగా తెలుసుకోవాలి గదా ? సుగ్రీవుడితో స్నేహం చేసుకోవడంలో తప్పులేదు. అతణ్ణి సహాయం కోరడంలోనూ సిగ్గు పడవలసిందేమి లేదు. అంతమాత్రాన అతని శత్రువుని చంపుతానని వాగ్దానం చెయ్యడం.... ఏవిటో మరి. అన్నగారికి అన్నీ తెలుసు.

సుగ్రీవుడు రాముణ్ణి వినయంగా చూస్తూ — "రామా ; .... నీ కష్టాలన్నీ విన్నాను సుమా !.... హనుమంతుడు నాకంతా చెప్పాడు .... నా కడుపు తరుక్కుపోయిందనుకో. ఇంక నీకేం భయంలేదు. నీ భార్య

గురించి దిగులుపడకు సుమా ! నా బలం నీకు తెలీదు. లోకాలన్నీ గాలించి నీ భార్యని తెచ్చిపెట్టే పూచీ నాదీ .... నువ్వు మాత్రం .... నా భార్యని.... తప్పకుండా...."

"సుగ్రీవా ! నీ భార్యని నీకు అప్పగించే భారం నాదే. నిశ్చింతగా వుండు .. నా భార్యకోసం మాత్రం....ఎలాగైనా .... నువ్వు...."

"రామా ! .. నీ భార్యగురించి మర్చిపో. అచంతా నేను చూసుకుంటాను. ఆకాశంలో వున్నా, పాతాళంలో వున్నా నీ భార్యను నీకు తెచ్చి యిచ్చేవాణ్ణి నేనున్నాగా; మరి నా భార్యని .... ఎలాగైనా .... నీదే భారం .."

"నా మాట సత్యం సుమా సుగ్రీవా !.... నీ భార్యని రక్షించే వాడిని నేనుండగా...." *

గాలి చెట్టు చెట్టుకీ తిరుగుతూ — "మనం ఇన్నాళ్ళూ పురుషులు పరస్త్రీలని ఎత్తుకుపోతారనే అనుకున్నాం గానీ .... ఈ మహానుభావుడ్డర్నీ చూడండి. పరస్త్రీలని రక్షించడాని కెంత వుత్సాహపడి పోతున్నారో !...." — అని చాటి చెపుతోంది.

"అంత వుత్సాహం ఎందుకనుకున్నావూ?.... పరస్త్రీలు కాబట్టే. ఎత్తుకుపోవడం కుదరనప్పుడు ఆ స్త్రీలకు సంబంధించిన పనులేవో చేసి

---

* 5 వ సర్గలో – 27 వ శ్లోకం.

రాముడు సుగ్రీవుడితో – "నీ భార్య నపహరించిన వాలిని నేను చంపెదను." (నీ భార్య నీకు దక్కునట్లు చేసెదను.) – అంటున్నాడు.

6 వ సర్గలో – 5 నించి 8 వరకూ.

సుగ్రీవుడు రాముడితో — "రామా ! నీ భార్యను నేను తెచ్చెదను. భార్యావియోగ దుఃఖము విడిచెదవు. పాతాళములోనుండినను, ఆకాశములోనుండినను నీ భార్యను దెచ్చి యిచ్చెదను." — అంటున్నాడు.

ఎవడి పెళ్ళాన్ని వాడు రక్షించుకోకేడు. ఇతర్ల పెళ్ళాల్ని రక్షిస్తామని ప్రగల్భాలు!

వుత్సాహం తీర్చుకుంటారు. అబ్బో ! .... ఎందర్ని చూశామో ! ఈ మానవుల సంగతి మనకు కొత్తేముంది ? పరస్త్రీలని రక్షించినా, శిక్షించినా పురుషులికి కలిసొచ్చేది చేసుకుంటారుగానీ, స్త్రీలమీద దయదల్చి కాదులే" — అని తర్కించాయి చెట్లు.

గాలి — "వొస్తా నుండండి. వాళ్ళం చేస్తున్నారో" అని పరిగెత్తింది.

సుగ్రీవుడు రాముడి కేదో సంగతి చెపుతున్నాడు అంతా గుర్తు చేసుకుంటూ — "... ఒక రాక్షసుడు .... కొంతకాలం కిందట .... ఒక స్త్రీని ఎత్తుకుపోటం చూశాం. వాడే రావణు డయ్యుంటాడు .... ఏం ? మనం చూడలేదూ ?" — అని మంత్రుల్ని అడిగాడు.

"వొక్క-స్త్రీ నేవిటి ? బోలెడుమంది స్త్రీల నెత్తుకుపోటం చూశాం."

"ఒక్క రావణు డేవిటి ? బోలెడుమంది రావణు లెత్తుకుపోటం చూశాం. అబ్బో ! ఎన్నిసార్లో !"

"అవి సర్లే ! అందరిగోలా మనకెందుకు ? .... రావణు డెత్తుకుపోతూ వున్నప్పుడు ఆ స్త్రీ — "రామా ! లక్ష్మణా !" — అని యేడవడం వినలేదూ ? రామా ! .... ఆ స్త్రీ నీ భార్యేనేమో ! .... అయ్యో ! అసలు సంగతి మర్చేపోయానే !— ఆ మహాతల్లి ఏడుస్తూ నగలమూట వొకటి మావేపు విసిరింది సుమా ! అప్పట్నించీ జాగ్రత్తగా దాచిపెట్టాం. తెస్తానుండు" — అంటూ సుగ్రీవుడు రెండంగల్లో గుహలోకిపోయి మూట పట్టుకుని వొక్కంగలో వొచ్చిపడ్డాడు.

రాముడు ఆతృతగా మూట విప్పి నగలు చూశాడు. అన్నీ సీతవే. ఆ మూట కట్టిన గుడ్డ కూడా సీత చీరలోదే ! పసుపుపచ్చ పట్టుచీర పైటచెంగు చింపేసిందన్నమాట !

రాముడికి వొక్క క్షణం సీతని చూసినట్టే అయింది. ఆ నగలు పెట్టుకుని, ఆ చీర కట్టుకుని .... ఆ రోజు వాకిట్లో .... లేచి వెనక పరి

గెత్తుతోన్న సీతే కనబడింది. రాముడు కళ్ళుమూసి రాతి మీదకు వొరిగాడు.

లక్ష్మణుడు తల వొంచుకుని బొటబొటా కన్నీళ్ళు కారుస్తున్నాడు.

"లక్ష్మణా ! చూడు నాయనా ! .... మీ వొదిన ఇదిగో ! చూడు నాయనా !" — అంటూ నగలు గుండెలమీద పరుచుకున్నాడు రాముడు.

లక్ష్మణుడు అన్నగార్ని ఓదార్చడం కోసం గబగబా కళ్ళు తుడుచుకుని — "అన్నగారూ ! .... ఈ భుజ కీర్తులూ — చెవి ఆభరణాలూ వొదినగారివో కావో నేను గుర్తించలేను గానీ .... ఈ అందెలుమాత్రం వొదినగారివే. నాకు బాగా గుర్తు. వీటికి రోజూ నమస్కారం చేసేవాడిని" — అంటూ అందెలకు మాత్రం నమస్కారం చేశాడు. *

---

* 6 వ సర్గలో — 22 వ శ్లోకం.

"సీత యొక్క భుజకీర్తులు నాకు తెలియవు. ఆమె కుండలములను చూసినది లేదు. పాదములే అందెలు మాత్రము నాకు బాగుగా తెలియును" — అంటున్నాడు లక్ష్మణుడు. — లక్ష్మణుడు సీత ముక్కూ మొహం ఎరగనట్టు మాట్లాడుతున్నాడు. కానీ, అనేక సందర్భాలలో సీత అందచందాలు వర్ణిస్తాడు లక్ష్మణుడు. మచ్చుకి — అరణ్య కాండలో 45 వ సర్గలో — 34 శ్లోకంలో — "అందమైన ముఖము గలదానా ! విశాలమైన కన్నులు గలదానా !" — అంటాడు. ఇంకా చాలాచోట్ల ఇలాగే. అంటే కళ్ళూ, ముక్కూ, మొహం చూశాడుగానీ, చెవులూ, భుజాలూ చూడలేదన్నమాట.

"మరిది వొదినగారి మొహం చూడడం తప్పు" — అనే అభిప్రాయంలో కవి లక్ష్మణుణ్ణి ఎన్నడూ వొదినగారి ముక్కూ మొహం చూడని "ఆదర్శ మరిది"గా చిత్రించాలని ప్రయత్నించాడు. బాగానే వుంది. మరి ఆ మరిది నోటే "అందమైన ముఖము గలదానా !"— అనిపించవొచ్చునా ? — ఇంతకీ, — లక్ష్మణుడు అడవుల్లో ఏ నీళ్ళకో, పళ్ళకో వెళ్ళినప్పుడూ, వంటరిగా వున్నప్పుడు కూడా సీతకోసం వెతుకుతున్నాడు గదా ? కనపడితే మాత్రం ఎలా పోలుస్తాడు ? — ఎన్నడూ ముక్కూ మొహం చూడనే లేదయ్యే !

రాముడు నెమ్మదిగా లేచి కూర్చుని, నగలన్నీ దగ్గిర పెట్టుకుంటూ — "సుగ్రీవా ! ఆ రాక్షసాధముడు ఎటు పోయాడు నాయనా ? ...." అని కన్నీళ్ళతో చూశాడు.

సుగ్రీవుడు కాస్సేపు ఆలోచించి అటూ ఇటూ చూసి — "దక్షిణం వేపు ...." అని — "అంతేనా ?" — అని మంత్రుల్ని చూశాడు.

"అవును. అంతే. దక్షిణం వేపే" — అన్నారు హనుమంతుడూ — నలుడూ..

"దక్షిణంవేపు కాదు. ఉత్తరంవేపు కాదూ ?" అని తారుడు వ్యతిరేకించాడు.

నీలుడు తూర్పువేపు కాళ్ళు బారజాపి కునికిపాట్లు పడుతూ, ఉత్తర దక్షిణాల జోలికి పోకుండా వూరుకున్నాడు.

"ఆ ఇప్పచెట్లవేపు పోయాడు తెలుసా ? దాన్ని దక్షిణం అంటారా ? ఉత్తరం అంటారా ? సూర్యుడెటు పొడుస్తున్నా డనుకున్నావూ ?" — అంటూ సుగ్రీవుడు తలెత్తి చూశాడు. పొద్దు తెలీనంత దట్టంగా మేఘాలున్నాయి.

లక్ష్మణుడు అటు చూస్తూ — "ఆ దిక్కు అయితే మాత్రం — దక్షిణమే" — అని సుగ్రీవుడి మాట ఖాయం చేశాడు.

తారుడు నిరుత్సాహపడుతూ — "ఏవిటో ఈ కొండ ఎక్కడం దగ్గిర్నించీ బొత్తిగా దిక్కులే తెలీటంలేదు. కిష్కింధలో అయితే ఏ దిక్కేటో కళ్ళు మూసుకుని చెబుతా" — అని కళ్ళుమూసి తెరిచాడు.

చివరికి రావణుడు దక్షిణంవేపే పోయాడని తేల్చారు.

రాముడు నగలన్నీ పరికించి చూస్తూ దుఃఖ పడుతున్నాడు. — "సుగ్రీవా!.... ఆ దుష్టుడు .. ఆ పరమ పతివ్రతని బాధిస్తున్నాడా నాయనా? .... ఏ విధంగా తీసుకుపోతున్నాడు నాయనా?"

"బలవంతంగా కావిటేసుకున్నాడు. ఇదుగో ఇలాగే ...." .... అంటూ సుగ్రీవుడు దూరంగా విసిరేసిన పూలకొమ్మ అందుకుని దాన్ని కావలించుకుని చూపించబోయాడు.

అప్పటికే రాముడు పక్కకి వొరిగి మూర్ఛిల్లాడు.

"అబ్బే! అలా కాపిడేసుకోలేదు. చంకలో నొక్కిపట్టి తీసుకుపోతున్నాడు. నేను బాగా చూశానుగా? — నా కెందుకని వూరుకున్నానుకో," — అన్నాడు హనుమంతుడు.

రాముడు నెమ్మదిగా లేచాడు.

"చంకకింద పట్టుకునే కాపిడేసుకున్నాడు. కావాలంటే మా పాపు నడుగు. నా పక్కన వున్నాడుగా?" — అని వాదించాడు సుగ్రీవుడు.

"ఏవిటో ఈ కొండ ఎక్కిందగ్గర్నించీ ఏం చూసినా మర్చిపోతున్నాను.... అవును.... రావణుడేనా? ... ఆఁ.... రాముడి భార్యనేనా?.... బాగానే పట్టుకున్నాడు నడుంచుట్టూ చెయ్యేసి...."

గిర్రున తల తిరిగి రాముడు మళ్ళీ మూర్ఛిల్లాడు.

రాముడి కష్టం చూడలేక అందరూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. లక్ష్మణుడు అన్నగారికి పూలకొమ్మతో విసురుతూ దిగాలుపడి కూర్చున్నాడు. *

---

* 6 వ సర్గలో 8 నించి 10 వరకూ.

సుగ్రీవుడు రాముడితో చెప్తున్నాడు — "పాపియగు రావణునిచే అపహరింపబడి, దీన స్వరముతో 'రామ, లక్ష్మణ' అని ఏడ్చుచు రావణుని ఒడిలో ప్రకాశించుచుండు ఒక స్త్రీని జూచితిని.... పర్వతముమీద నలుగురితో నుండిన నన్నుజూచి ఆభరణములు ముడిచి పడవేసెను."

— అందరూ చూశారన్నమాట రావణుడు ఒక స్త్రీని ఎత్తుకుపోతూ వుండడం. ఆ స్త్రీ ఏడుస్తూ వుండడం. కానీ తమకేం పట్టనట్టు వూరుకున్నారు. (రావణుడిలాగే ఈ సుగ్రీవుడూ, హనుమంతుడూ, అందరూ ఎగరగలరు. గొప్ప వీరులు కూడా — అయినా చూస్తూ వూరుకున్నారు.) — సీత ఎక్కడున్నా రక్షించి తెస్తానని వీరాలాపాలు పల్కుతున్నాడు సుగ్రీవుడు. తన కళ్ళముందు ఏడుస్తోన్న స్త్రీని రక్షించే ప్రయత్నం ఎందుకు చెయ్యలేదు? — దారే పోయే వాళ్ళందర్నీ రక్షించడంవల్ల తనకేమీ లాభం వుండదు కాబట్టి.

రాముడు మూర్ఛలోంచి లేస్తోనే కోపోద్రేకంతో — "లక్ష్మణా! .... చంపేస్తానా దుర్మార్గుడిని. నాకు చాలా దుఃఖం కలిగించాడు. కోపం కూడా తెప్పించాడు. నేనిక సంహరించక విడిచేది లేదు. ఇంతకీ ఆ దుష్టుడెక్కడున్నాడో తొందరగా చెప్పవోయీ సుగ్రీవా! నేనిక సహించేదే లేదు సుమా! యమలోకానికి పంపించేస్తాను. ఎక్కడుంటాడో చెప్పు." — అంటూ సుగ్రీవుణ్ణి ఎర్రగా చూశాడు.

"అయ్యో! ఆ దుర్మార్గుణ్ణి గురించి నేనూ విన్నాను గానీ ఎక్కడుంటాడో ఏవిటో నాకు తెలీదు సుమా!"

"తెలీదూ? కబంధుడు నీకంతా తెలుసని చెప్పాడే!"

"కబంధుడెవరు?"

"సరి. ఇది ఇంకా బాగుంది. కబంధు డెవరా? కబంధుడు కబంధుడే. కబంధుడిం కెవరు? రావణుణ్ణి గురించి నీకంతా తెలుసంటేనే కాదూ నిన్ను వెతుక్కుంటూ బయల్దేరిందీ?—" రాముడు నెమ్మదిగా నగలు గుడలో చుట్టి తొడకింద పెట్టుకున్నాడు.

సుగ్రీవుడు జంకుతూ చూశాడు రాముణ్ణి.

ఇదేవిటీ: వాలిని చంపుతాడని ఆశపడుతోంటే ఇంతలో ఇలా కోపం తెచ్చుకుంటున్నాడు! ఆ కబంధుడు పుండా కొడుకెవరు మధ్యలో నా ప్రాణానికి? — కబంధుడిమీద సుగ్రీవుడికి చాలా కోపం వచ్చింది.

"ఆ కబంధు డెవరో, రావణు డెవడో నాకేవీ తెలీదు రామా! నేనంటే గిట్టని వాళ్ళెవరో .... ఇంకెవరు? మా అన్నే .. ఆ దొంగ వెధవ కబంధుణ్ణి నీ దగ్గరికి పంపినట్టున్నాడు .... వాడు నామీద నీకన్నీ నూరిపోసినట్టున్నాడు. జరిగిందంతా మర్చిపో రామా! నీ భార్యని వెతికించి పట్టుకునే పూచీ నాదే నన్నానుగా? రావణుణ్ణి చంపేసి నీ భార్యని నీ కప్పగిస్తానని ఒట్టు పెడుతున్నాను. సరేనా? .... అప్పుడే చూస్తావు నా బలం ఏవిటో."

"హాయ్యో! .... సీతా! .... నువ్వు లేకుండా ఎంతకాలం ఈ దుఃఖ సముద్రంలో .... వొంటరిగా ...."

రాముణ్ణి ఓదార్చడానికి సుగ్రీవు డున్నాడనే ధైర్యంతో లక్ష్మణుడు మౌనం వహించి వూరుకున్నాడు.

"రామయ్యా : దుఃఖం ఓర్చుకో. నీలాగే నాకూ భార్య దూరం అయింది. మరి నేను బావురుమన్నానా ? "వాలి పీఠ ఎలా దొరిలించుకుంటాంరా దేవుడా !" — అన్న ధ్యాసే గానీ వేరే ఆలోచన లేదు నాకు. ఏ్నెటికన్నా ముందు వీరుడికి ధైర్యం వుండాలి సుమా ! .... లేకపోతే ఏములేం జరుగుతాయి ?"—తన ధైర్యం గురించి మంత్రులు గుసగుస లాడుకుంటున్నారేమోనని సుగ్రీవుడికి అధైర్యంగానే వుంది. అటు చూడకుండా ధైర్యంగా చెప్పుకుపోతున్నాడు.— "ఎప్పుడూ మొహం వేళ్ళాడేసుకుని ఈసుకోమంటూ వుండేవా డెందుకు పనికొస్తాడు రామా ? ఏడ్చి ఏడ్చి ప్రాణాలుపోటం తప్ప ఏం కలిసొస్తుంది ? ధైర్యం తెచ్చుకో రామా :.... దుఃఖం మంచిదికాదు."

రాముడు అయిష్టంగా నుదురు చిట్లించాడు. ఈ ఆటవికుడు తనకు నీతులు చెబుతున్నాడే ? భార్యమీద అనురాగంకొద్దీ దుఃఖ పడుతున్నాడు గానీ, ధైర్యం లేక దుఃఖపడుతున్నాడా తను ? "అయినా నే నింత దుఃఖ పడుతోంటే నువ్వు ఓదార్చకుండా హూర్చున్నావేం ?"—అన్నట్టు విసుగ్గా లక్ష్మణుణ్ణి చూశాడు.

"సువ్వు మహా వీరుడివని నాకు తెలుసు. నీ దుఃఖం చూడలేక అంటున్నాను గానీ.... నీకు చెప్పగలిగేవాణ్ణి కాను సుమా ! ఇక నువ్వు కళ్ళనీళ్ళు పెట్టకూడదు. నామీద వొట్టే. వీరుడైన వాడెన్నడైనా నిరుత్సాహ పడవొచ్చునా ?"— సుగ్రీవుడికి ధైర్య సాహసాలన్ని గొప్పగా తెలుసు — ఇతర్లకి చెప్పడానికైతే.

"అయ్యో !.... సీతా !.... ప్రియురాలా !.... నిన్నెన్నటికి చూడగలనో కదా ?" — అంటూ పంచెతో ముఖానికి మొహం తుడుచుకుని నగలు తొడకి గుచ్చుకుంటోంటే మూట బయటికి తీసి గట్టిగా ముడేస్తూ కొంచెం సందేహంలో పడ్డాడు. — ఇంకా చాలా నగలుండాలి. ఎన్ని తీసిందో ! ఎన్ని వుంచుకుందో ! అడిగితే గానీ తెలీదు. సుగ్రీవుడికి దొరికినవన్నీ.... ఇచ్చేసినట్టే వున్నాడు.... ఏమో ! చెప్పలేం. అన్నిటే

చంపించడానికి చూసేవాడు.... బంగారం కళ్ళబడితే .... సుగ్రీవుడి కా బుద్ధి చేకపోయినా.... హనుమంతుడో .... ఎవరో .... వొక వుంగరం మన్నా దాచుకోకుండా వుంటారా? ఏమో! నమ్మలేం.

రాముడు మాటకట్టడం వూ రిచేసి పక్కన పెట్టుకుంటూ — "సుగ్రీవా! .... నువ్వెంతో వుత్తముడివి కాబట్టి స్నేహితుడు కష్టంలో వున్నప్పుడు చెప్పవగ్గ మాటలన్నీ చెప్పావు. మీరందరూ ఇంతగా చెప్తోంటే నేను మాత్రం ఎందుకు దుఖిస్తాను నాయనా? నీలాంటి స్నేహితుడు మాత్రం అందరికీ దొరుకుతాడా? ఇలాంటి కష్టకాలంలో అసలే దొరకడు. అయితే మరి ఆ రావణుణ్ణి చెతకడం అదీ తొందరగా చెయ్యాలి సుమా!.... నీకు నేనేం చెయ్యాలో కూడా చెప్పు. మంచి భూమిలో ఏ పంట అయినా పండుతుంది చూశావా? అలాగే నేను ఏ కార్యమైనా చెయ్యగలను. ఏదో అతిశయంగా అతిశయాలు చెప్తున్నానను కోకు! నేను పుటింతర్వాత ఇంతవరకూ వొక్క అబద్ధమైనా ఆడలేదు. ఇకముందు ఆడేదీ లేదు," — అని గంభీరంగా చూశాడు.*

హనుమంతుడు నెమ్మదిగా — "మనిషి జన్మెత్తాక ఎప్పుడైనా అబద్ధ మాడకా తప్పదు. ఆడితేమాత్రం ఏం పోయిందిలే" — అని వొళ్ళు విరుచుకున్నాడు ఆవలిస్తూ — సుగ్రీవుడికీ ఆవలింత రాబోయింది.

"ఈ అడివి మూర్ఖుల మాటలు వింటున్నావా?" క్రీగంట లక్ష్మణుణ్ణి చూస్తూ నుదురు చిట్లించాడు రాముడు — "సుగ్రీవా! నేను నీ కోసం ఏం చెయ్యవలసి వుందో ...." — అంటూ ఆగాడు.

---

* 7 వ సర్గలో 22 వ శ్లోకం.

తన మాటలన్నీ అబద్ధమని సుగ్రీవు డనుమంటాడేమోనని రాముడికి భయంగా వుంది. — అందుకే" నేను అబద్ధ మెపుడునూ చెప్పినది లేదు. ఇకమీద చెప్పబోను. ఇపుల నీకు సత్యముగ ఒట్టు పెట్టుచున్నాను." — అని తన మాటలు సుగ్రీవుడు నమ్మాలని తాపత్రయపడుతున్నాడు.

సుగ్రీవుడు పొంగిపోతూ — పొంగు దాచుకుని దిగాలుపడుతూ — "రామయ్యా! ఏం చెప్పను? .. అంతా నీకే తెలుసు .... నీ దయ వుంటే దేవతలంతా నా పక్షాన నిలబడతారు. రఘు వంశం రాజుతో స్నేహం చేసుకున్నానంటే మా బంధు మిత్రుల్లో ఎంత గొప్పను కున్నానూ! .... నా సంగతి నేనే చెప్పుకుంటే బాగుండదు కానీ...." — కొంచెం సిగ్గుపడుతూ — "నీలాంటి గొప్ప గొప్ప వీరులకి ధైర్యం ఎలా తొణకదో — నాకూ అలాగే తొణకదు సుమా!" — అంటూ హనుమంతుడిపేపు చూడాలంటే ధైర్యం తోటికి, రాముడి పీపు వెనక్కి మొహం తిప్పాడు.

అక్కడ రెండు పిచికలు అనుపానం కలిగించేటు కనబడాయి — "మారిపోషా లంటావా?" — అని పక్కనేవున్న నీలుటి చెవిలో గుస గుస లాడదామనుకున్నాడు గానీ .... నీలుడు బండకి తన్నిపెట్టి మీద మీద కొరుగుతూ గుర్రు పెడుతున్నాడు.

సుగ్రీవుడు విసుక్కుంటూ రాముడి పేపకు జరిగి — అన్నగారి మీద కోపం గుక్తాచ్చి — "....నన్నూ, నా మంత్రుల్నీ పెళ్ళగొట్టాడా? .... నా భార్యని తన దగ్గరే వుంచుకున్నాడా? .... పోనీ అక్కడితో వూరుకున్నా డనుకున్నాపా? .. నాకు అనుకూలంగా వుండేవాళ్ళందర్నీ చెరలో పెట్టించాడు .... అప్పుడే అయిందా? .... ఓరి నీ దుంపతెగా! .... ఎంత జరిగినా మీద పడుతూనే వున్నావే! .... ఇవతల పెద్ద మనిషితో వ్యవహారం మాట్లాడుతోంటే .... పాడు నిద్రా నువ్వూనూ" అంటూ ఆవలింత రాటోతే బలవంతంగా ఆపుకున్నాడు.

వాలి ఎంత తెలివిగా పరిపాలన చేస్తున్నాడో వింటోంటే రాముడికి ముచ్చటేస్తోంది. అవును. శత్రువు విషయంలో అలాగే చెయ్యాలి. చెరలో పెట్టించినంతమాత్రాన చాలదు. ఆ చెర కాపలావాళ్ళు నమ్మకస్తులో, కాదో చూసుకోవాలి. వాళ్ళమీద చారుల్ని పెట్టాలి. వాలికి తెలుసునో లేదో!

".... ఇక్కడమాత్రం సుఖంగా వుండనిచ్చా డనుకున్నావా?.... ఛో వెయ్యిమంది సైనికుల్ని నాపైన యుద్ధానికి పంపించాడు. నా మంత్రుల్లూ

నేనూ ఎలాగో వాళ్ళని తరిమేశాం అనుకో. అసలు మిమ్మల్ని కూడా వాలే పంపించా డనుకున్నాం. లేచిం దగ్గిర్నించీ భయమే అనుకో, ఎప్పుడేం జరుగుతుందోనని .. ఏవిటో ఈ హనుమంతుడూ వాళ్ళే నన్ను కంటికి రెప్పలా కాపాడు కుంటున్నారు. నేను అడుగు కదపా లంటే, వీళ్ళే ముందు నడుస్తారు. ఎక్కడ కూర్చున్నా చుట్టూ కూర్చుం టారు. నేను రాజయ్యాక వీళ్ళే కదా నా మంత్రులు మరి .... ఇంతకీ చెప్పొచ్చే దేవిటంటే ...." నాభిలోంచి నోరంతా బద్దలు చేస్తూ పెద్ద ఆవలింత రాబోయింది. ఎలాగో దాన్ని అదిమిపట్టి నీలుడివేపు కోపంగా చూసి — "ఇదుగో మావా ! — నీలుడు లేచాక రాజుగారికి చాలా కోపం వచ్చిందని చెప్పు. మంత్రి లిలా నిద్ర మిడుకుతూ వుంటే మనవిక రాజ్యం ఏలినట్టే" — అని మండిపడ్డాడు.

"చిత్తం ! ఇప్పుడే లేవగొట్టి చెప్పమంటావా మహారాజా ?"

"వొద్దు. ఎప్పటికి లేస్తాడో చూడు .... గట్టిగా చివాట్లు పెడ తాను. నువ్వుకూడా నిద్రకి పడకు" — అని మళ్ళీ రాముడివేపు తిరిగి — "మా అన్న సుఖంగా వున్నంతకాలం నాకు యేడుపు తప్పదు రామయ్యా ! ఆ దుర్మార్గుడు పోయిన్నాడే నాకు కష్టాలు పోతాయి. వాడు చచ్చిన్నాడే నిశ్చింత .... ఇంకేం చెప్పమంటావు ? .... నా కడుపులో వున్నదంతా సిగ్గుపడకుండా నీ ముందుపెట్టేశాను. పాల ముంచుతావో.... నీట ముంచుతావో .... అంతా నీదే భారం .... ఆ దుర్మార్గుడు మాచెడ్డ బలవంతుడు. అదే వొచ్చింది చిక్కు-" — అంటూ బొటబొటా కన్నీళ్లు కార్చి, ముక్కుపిండి నీలుని పంచెకు తుడిచి, రాముడేమంటాడోనని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

వాలి తెలివి గురించే గాక, బలం గురించి కూడా వింటే రాము డికి కొంచెం ఆలోచన పట్టుకుంది. వాలి పరాక్రమం యెటువంటిదో యేమిటో తెలీకుండానే .... చంపేస్తానని .... పరే ! .... ఆలోచించే చెయ్యవచ్చును. — "సుగ్రీవా ! ఇంతకీ వాలికీ, నీకూ వైరం ఎందు

కొచ్చిం దంటావూ ? .... అసలు నంగతేవిటో వినాలి గదా ? నాకు వాలి మీద కోపం లేదని కాదు సుమా ! .... అసలు జరిగిందేవిటో...."

సుగ్రీవుడు కొంచెం ఆశ్చర్యంగా — "తీరా నావల్ల కాదంటావా ఏవిటీయన ?" అన్నట్టు హనుమంతుడివేపు చూశాడు.

"ఎందు కంటాడూ ? .... అంతే ఆయన పెళ్ళాన్నెలా తెచ్చు కుంటాడూ ?" — అని హనుమంతుడు కళ్ళతో నమూధానం చెప్పాడు.

సుగ్రీవుడు ధైర్యం తూడగట్టుకుని — "రామా ! జరిగిందంతా పూనగుచ్చినట్టు చెబుతాను. విను" — అంటూ ప్రారంభించాడు.

* * *

"కిష్కింధారాజ్యం మా తండ్రిది. వాలి మా అన్న. అదే విటో మా తండ్రికి మా అన్నమీదే ఎక్కువ ప్రీతి. నాకూ మా అన్నంటే మాచెడ్డ ప్రేమే అనుకో. మా తండ్రి పోయింతర్వాత మా అన్నే రాజ య్యాడు. రామా ! నాకు తెలీ కడుగుతానూ .... పెద్ద కొడుక్కే రాజ్యం ఇచ్చేస్తే .... మరి చిన్న కొడుకు ... అబ్బ ! .." అని చప్పున నోరు మూసి పిర్ర తడుంకున్నాడు సుగ్రీవుడు. హనుమంతుడి గోళ్ళు సుగ్రీ వుడి పిర్ర లోతులు కొలిచి — "ఇదిగో ! ఇంత లోతుంది నీ పిర్ర" అని చూపిస్తున్నాయి సుగ్రీవుడు మాటల ప్రవాహంలో మునిగిపోతూ వున్నప్పుడు, ఆ గోళ్ళ పదవలే అతన్ని రక్షిస్తూ వుంటాయి.

సుగ్రీవుడు తన తప్పు గ్రహించి — రాముడు కూడా వాలి లాగానే తండ్రికి పెద్దకొడుకన్న నంగతి గుర్తు తెచ్చుకుని — నాలిక కరుచుకుంటూ — ".... అవును మరి. పెద్దకొడుకు తర్వాతే కదా చిన్నకొడుకు. అందుకే మా అన్నని నేను భక్తితో సేవించుకుంటూనే వున్నాను సుమా!" — అంటూ ముందుకు సాగాడు.

"ఒకసారేం జరిగిందంటే ...." — అని ఆగి హనుమంతుణ్ణి చూస్తూ — "జాగర్తగానే మాట్లాడతా గానీ మరీ అంత .." —

అంటూ ప్రాధేయపడి తలతిప్పి రామణ్ణి చూశాడు — ".... ఎందాకా చెప్పానూ ?"

"ఒకసారేం జరిగిందో చెబుతున్నావు."

"ఆఁ అవును .... ఏం జరిగిందంటే .... మాయావి అనే రాక్షసుడికీ, మా అన్నకీ వైరం వొచ్చింది."

"ఎందుకూ ?"

"ఎందుకేవిటీ ? .... ఎందుకన్నా రావచ్చు. వొక ఆడదాని మూలంగా అని విన్నాం. మరి నిజం ఏవిటో.... ఆ మాయావి మయుడి కొడుకు. మయుడికి దుందుభి అని ఇంకో కొడుకు కూడా వుండేవాడు. చెప్తా : ఆ సంగతీ చెప్తా : *

ఒకరోజు అర్ధరాత్రి ఈ మాయావి వొచ్చి మా అన్నని యుద్ధానికి పిల్చాడు. వాడి కేకలు చెవిన పడ్డాయో లేదో, మా అన్న మండిపడుతూ యుద్ధానికి బయల్దేరాడు.— "ఈ అర్ధరాత్రి యుద్ధాలేవిటని" ఆడవాళ్ళూ, నేనూ అందరం చెప్పాం. ఎంత చెప్పినా మా అన్న వినలేదు. మహా పట్టుదల మనిషిలెండి. చేసేదేవీలేక నేనూ అన్న వెనకాలే బయల్దేరాను. ఆ మాయావిగాడు మా అన్నని చూడగానే హడిలిపోయి పరుగు లంకించుకున్నాడు. ఆ మాత్రానికి యుద్ధాని కెందుకొచ్చాడో పిరికి సన్నాసి. వింటున్నావా రామా ? .... వాడావిధంగా పోయిపోయి ఒక బిలంలో దూరాడు. "సరే ; బయటికి రాకపోతాడా ?" అని అక్కడే కూర్చున్నాం. ఏంతకీ రాడయ్యే : మా అన్నకి వొళ్ళు మండిపోయి — "నేను లోపలికిపోయి వాడి అంతు తేల్చుకొస్తాను. నువ్వు ఇక్కడే వుండు" అని వెనకా ముందూ చూడకుండా బిలంలో కెళ్ళిపోయాడు. మాచెడ్డ ధైర్యంలే మనిషికి. .... ఇక .... అప్పటినించీ .... చాలాకాలం ఆ బిలం దగ్గిర భయపడుతూ .... మా అన్న కేవన్నా ప్రమాదం జరుగుతుండేమోనని

---

* ఉత్తర కాండలో — 12వ సర్గ — 13, 19 శ్లోకాలు.

రావణుడి భార్య మండోదరి కదా ? ఆమె తండ్రే మయుడు. ఆమె అన్నలే మాయావీ, దుందుభీ. ఈ సంగతి ఉత్తర కాండలో తెలుస్తుంది.

దిగాలు పడుతూనే చూచ్చాన్ను. కొన్నాళ్ళకి ఆ కన్నంలోంచి రక్తం ప్రవహిస్తూ పైకి వచ్చింది. చెవిపెట్టి విందునుగదా లోపల అరుపులూ .... కేకలూ .... గుద్దులూ : మా అన్న బాధగా మూలుగుతున్నాడు. ఆ రాక్షసుడేమో సంతోషంతో అరుస్తున్నాడు. నిజం చెపుతున్నాను. నా కలాగే వినపడింది సుమా : రామా ! .... నా మాట అబద్దం అయితే నేను చచ్చినంత పాటు. నీతో అబద్ధ మాడతానా చెప్పు ? .... మా అన్న ఆర్తనాదాలు చేస్తోంటే, ఆ దుర్మార్గుడు సింహనాదాలు చేస్తున్నాడు"— రామునకు నమ్మాలున్నాడో లేదో సుగ్రీవునకే అర్థంగాక ఆగాడు. *

రాముడు గంభీరమైన చిరునవ్వుతో "తర్వాతేం జరిగిందో ? చెప్పు సుగ్రీవా !" — అన్నాడు.

"ఇంకేం జరిగింది రామా ?.... ఆ కేకలూ అవీ విని మా అన్నే పోయాడని తాన్సేపు ఏడ్చి, గుండె రాయి చేసుకుని.... ఇంకా అక్కడే

---

* 9 వ సర్గలో 18 వ శ్లోకం.

"బిలములోపల సింహనాదము చేయుచుండు రాక్షసుల ధ్వని నా చెవిలోబడెను. యుద్ధములో అపజయముపొంది అరచుచుండు నా అన్న ధ్వని నాకు వినవచ్చెను," — అంటున్నాడు సుగ్రీవుడు. రాక్షసుడు సంతోషంతోటీ, అన్న దుఃఖంతోటీ అరిచినట్టు వినబడిందట. ఈ విషయంలో సుగ్రీవుడు నిజం చెప్పాడో, అబద్ధం చెప్పాడో అనే దానిమీదే "సుగ్రీవుడి పాత్ర విలువ" అంతా ఆధారపడి వుంది. సుగ్రీవుడిదే న్యాయం అని, సుగ్రీవుడికి సహాయం చెయ్యడానికి రాముడు నిదపడాడు కాబట్టి రాముడి నిజాయితీ కూడా ఈ సంఘటనలో నిజానిజాలమీద ఆధారపడి వుంది. వాలి అపజయంతో అరిచివుంటేనే కదా సుగ్రీవుడికి వినపడేది?— వాలి అరవనే లేదనీ, సుగ్రీవుడు చెప్పింది అబద్ధమనీ రుజువైతే, సుగ్రీవుడు మోసగాడన్నమాట. సుగ్రీవుడి మోసం గ్రహించి కూడా సుగ్రీవుడి తరపున నిలబడ్డ రాముడూ మోసగాడే నన్నమాట.

సుగ్రీవుడు చెప్పినదాంట్లో నిజానిజాలు తర్వాత చూడవొచ్చును.

హర్షించే ఆ మాయావిగాడెక్కడబయటికొస్తాడోనని ఆ బిలానికి వొక పెద్ద బండరాయి అడంపెట్టి.... కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ కిష్కింధకి వొచ్చేశాను. మా అన్నపోయిన సంగతి నే నెవ్వరితోటీ చెప్పనే లేదు సుమా! ఠఠ హనుమంతుడూ వాళ్ళూ నా దుఃఖం చూసి ... అసలు విషయం గ్రహించేసి.... "రాజు లేకపోతే ఎల్లా జరుగుతుంది.. ఆవటా? అని" నన్ను రాజుని చేస్తానన్నారు. "నాకే రాజ్యాలూ వొద్దు మొర్రో"— అని గోలపెట్టాను . ఈ మంత్రులు పింటేనా? .... పరేం చెయ్యను?— మా అన్న పోయింతర్వాత నేను రాజ్యం వొద్ద నేసే ... ప్రజలేమై పోతారు? ఎన్ని కష్టాలు పడిపోతారు! .... ప్రజల క్షేమంకోసం వొప్పుకోక తప్పింది కాదు.

నా ఖర్మగాలి.... సింహాసనం ఇలా ఎక్కానో లేదో .... పదే ళ్ళన్నా ఆ ముచ్చట తీరిందా? మా అన్న కాస్తా వొచ్చేశాడు మాయావిని చంపేసి.

సింహాసనంమీద కూర్చున్న నన్ను .... ఎందుకులెండి, ఎంత ఎర్రగా చూశాడనీ! .... అబ్బ! .... ఆ కళ్ళు జ్ఞాపకం వొస్తే ...." అంటూ సుగ్రీవుడు కొంచెం హనుమంతుడి దగ్గిరికి జరిగాడు.

రాముడు కొంచెం వెనక్కి సర్దుకున్నాడు.

లక్ష్మణుడు ఆసక్తిగా— "అప్పుడేం జరిగింది?" — అని ముందుకొచ్చాడు.

సుగ్రీవుడు కాళ్ళూ చేతులూ జాగ్రత్తగా దగ్గిర పెట్టుకుని — "ఏం జరుగుతుంది? బలం కూడదీసుకుని లేచి అన్నకి నమస్కారం చేశాను సుమండీ! .... పోనీ తోడబుట్టినవాడు నమస్కారం పెట్టాడు కదాని చక్కగా సంతోషించి — "వెయ్యేళ్ళు బతకరా తమ్ముడా!"— అని దీవించవొచ్చునా? .... ఎబ్బే! వాడబ్బ సొమ్మేదో నేను దాచుకు పోయినట్టు మండిపడిపోతూ నించున్నాడు .... ఇంకేం చెయ్యను? .... అంతా కంగారయ్యే! తోచి చావదయ్యే! మంత్రులెవరో పైగచేశారు నా

నెత్తిమీదనించేదో తీసెయ్యపని. అసలు నెత్తిమీదేంవుందో గుర్తులే దయ్యా! చూడ్డుము గదా కిరీటం. ఓహో! అదా సంగతనీ ఆ కిరీటం కాస్తా తీసి.... ఆయన పాదాల చగిర పెట్టాను. అయినా కోపం తగ్గిందనుకున్నారా?.... అబ్బే! ఎన్నిపిచాలో నచ్చచెప్పాను సుమండీ! — — "అన్నా! దేవుడి దయవల్ల శత్రువుని చంపి క్షేమంగా వొచ్చావు. అంతేచాలు నాకూ. నిన్ను చూడ్డగానే నా కడుపు నిండిపోయింది .... ఆ బిలంలోంచి కేకలూ అవీ విని వొకవేళ నువ్వే పోయావేమోనని దుఖపడిపోయి ... బాధ పడిపోయి .... రాయి అడ్డంగా పెట్టి వొచ్చేశానూ. రాగానే ఈ మంత్రులు నన్ను బలవంతం చేసి — "రాజులేని ఇతర రాజ్యాలవీ జయించాలంటే మనకీ రాజు వుండాలి గదా .... ఆవటాఁ ఁని" ఎంత వొద్దన్నా వినకుండా .... నగబూ అవీ పెట్టి .... కిరీటం అదీ పెట్టే .... ఈ సింహాసనం ఎక్కించారు గానీ . నే నెనసలు ఎక్కడనే ఎక్కడన్నాను సుమా! ... అన్నా! అసలు నీలాంటివాడే రాజుగా వుండాలి గానీ.... నేను రాజేవిటి నా మొహం! అబ్బే! నువ్వు లేవని .. అలా కొంచెంసేపు గద్దె ఎక్కానే గానీ.... నీ రాజ్యం నీ కివ్వక చస్తానే ఏపిటి?.... నా మీన కోపం పెట్టుకోకు సుమా!" — అంటూ కాళ్ళా వేళ్ళాబడి బతిమాలాను బామాలాను. దణ్ణాలు పెట్టాను. అబ్బే! .... వొక్క పుక్కన్నా విన్నాడా? .... నమ్మాడా? ... చీ కొట్టాడు. నా దణ్ణాలన్నీ ఎగరగొట్టాడు. నన్ను రాజుని చేసిన మంత్రుల్నందర్నీ పిలిపించాడు. వూళ్లో పెద్దలందర్నీ పిలిపించాడు. అసలు కొందరు వాళ్ళి వొచ్చాడని వినగానే .... పారే పోయారనుకో.

ఇక అందరి ముందూ నేనేదో గొప్ప తప్పిదం చేసేసినట్టు విచారణ ప్రారంభించాడు.

—"ఆ రాక్షసుడు నన్ను యుద్ధానికి పిల్చిన సంగతి మీ కందరికీ తెలుసు కదా?.... నేను బయల్దేరితే ఈ దుర్మార్గుడు కూడా నా వెంట బడి వొచ్చాడు. అప్పుడు నిజంగా ప్రేమగానే వొస్తున్నాడనుకున్నాను.

ఆ రాక్షసుడు బిలంలో దూకగానే —"నేను లోపలికి పోయి వాడి అంతు తేల్చుకొస్తాను గాని . వాడు నన్ను తప్పించుకుని పారిపోయి బయటకొస్తాడేమో....నువ్వు గుమ్మం దగ్గిరే వుండు. వాడొస్తే పట్టుకో," —అని చెప్పి లోపలికి పోయాను. వాణ్ణి వెతకటానికే ఎంతో కాలం పట్టింది. మొత్తానికి, వాణ్ణి వాడి బంధువుల్నీ చావగొట్టి బయటికొచ్చి చూద్దును గదా.... గుమ్మానికి పెద్ద రాయి అడ్డం ! "తమ్ముడా! .... తమ్ముడా!" — అని ఎన్ని కేకలు పెట్టానో! .... అక్కడుంటేనా పలకటానికి? ఎలాగో ఆ బండని.... తన్నీ, తోసీ, గుద్దీ, గెంటీ చివరకి బయటపడ్డాను. ఇక్కడ వ్యవహారం చూస్తే ... ఇదుగో.... ఇలావుంది.

"అసలు ఆ రాక్షసుడు నన్ను చూడగానే భయపడి పారిపోయాడే! .... అలాంటి పిరికిపంద నన్ను చంపేశాడని నా తమ్ముడనుకున్నా డంట.... నేను బిలంలో ఆ ప్రయత్నాలు చెయ్యనే లేదే! .... నేను బాధతో అరిచినట్టు నా కంఠస్వరం ఎలా విన్నాడు?" — అంటూ ఏవో అడ్డ దిడ్డం ప్రశ్నలు వేసి నన్ను నిందలపాలు చేశాడు మా అన్న—" — అని ఆగి సుగ్రీవుడు అందరి మొహాలూ చూశాడు — తనని నమ్ము తున్నారా? వాలిని నమ్ముతున్నారా ? అని.

హనుమంతుడు అప్పుడప్పుడూ పరాగ్గా బొడ్లో తడుంకుని చిరాకు పడిపోతూ— "లేనిపోని గోల తెచ్చిపెట్టాడీయన. నిక్షేపంలా వాలిని నమ్ముకుని బతుకున్న వాళ్ళకీ గతి పట్టించాడు." — అని విసుక్కుం టున్నాడు.

సుగ్రీవుడు చెప్పటం ఆపగానే— "అవును మరి బాగానే అడి గాడు వాలి. చచ్చినవాడు రాక్షసుడైతే .... బాధపడే కేకలు వాలెందు కేస్తాడూ!.... వాలే మూలిగాడని నువ్వెలా అనుకున్నావూ?" — అని కొత్తగా ఆశ్చర్యంగా అడిగాడు సుగ్రీవుణ్ణి.

సుగ్రీవుడు బిత్తరపోయి— "హనుమంతుడేనా? మారువేషమా?" అన్నట్టు చూస్తున్నాడు. హనుమంతుడు తారుడికేసి కోపంగా చూసి పిర్ర తడుంకుంటూ— "అబ్బే! ... నాకంతా తెలుసు మహారాజా! .... నే

నెందు కడిగానంటే.... ఈ మాటే రాముడైనా అడగొచ్చు. లక్ష్మణుడైనా అడగొచ్చు. నువ్వేం చెబుతావో అనీ....అంతే....” అని వెనక్కి జరిగాడు. సుగ్రీవుడు చిన్నబుచ్చుకుని— “ఏం చెబుతాసూ వల్లకాడు: అలాగే వినడాయి మరి. ఎవరడిగినా మా మాటే చెబుతాను.”— అని మూతి ముడుచుకున్నాడు.

రాముడు తల పంకిస్తూ — “తర్వాతేం జరిగిందో చెప్పు సుగ్రీవా! నీ దోషమేముంది ఇందులో?.... అంతా చెప్పు. తప్పొప్పులు నేను నిర్ణయిస్తాను,” అంటూ గంభీరంగా చూశాడు.

సుగ్రీవుడు పులెడు ధైర్యంతో — రాముడికి నమస్కారం చేసూ— “రామా ! పురుషోత్తమావుడివి నువ్వు. న్యాయాన్యాయాలన్నీ గ్రహించగలవు ... ఇంక చెప్పటానికేం వుందిలే .... ఆ విధంగా మా అన్న నామీద నానా అభండాలూ వేశాడు. ఆయన రాజ్యం అపహరించాలని ఎత్తువేశా నన్నాడు. తనని బిలంలోనే బంధించి చంపెయ్యాలని చూశానన్నాడు. “ఇలాంటి నమ్మక ద్రోహిని నా రాజ్యంలో వొక్క పూటన్నా వుండనిస్తానా?” – అని రంకెలేశాడు. వెంటనే నాకు సహాయం చేసిన మంత్రుల్ని కొందర్ని చెరలో పెట్టించాడు. నన్నూ మరికొందర్ని రాజ్యంలోంచి వెళ్ళగొట్టాడు. మేం మళ్ళీ ఎక్కడ రాజ్యంలోకి వొస్తామో అని మా వెనక తరుముకుంటూ వొచ్చాడు. నేనూ, వీళ్ళు నలుగురూ వొక గుంపుగా పరిగెత్తాం. మేం ముందూ— ఆ దుర్మార్గుడు వెనకా.... వొకటే పరుగు. అప్పుడే మేము ఈ లోకం అంతా చూశాం. చివరికి హనుమంతుడికి ఈ రుష్యమూక పర్వతం సంగతి గుర్తొచ్చి .... వాలి ఇక్కడికైతే రాడని.... జ్ఞాపకం చేశాడు బతుకుజీవుడా అని అప్పట్నుంచీ కిష్కింధ దగ్గిరే .... ఈ కొండమీద వుంటున్నాం. ... నానా కష్టాలూ పడుతున్నాం అనుకో. భార్యావియోగంతో బెంగపడి పోతున్నాను. నా భార్యే వుంటేనా: నాకింకే భోగ భాగ్యాలూ అక్కర్లేదు .... అబ్బ ” అని పిల్ల తమ్ముకుని హనుమంతుడికేసి కోపంగా చూసి — ‘మళ్ళీ ఏం తప్పు జరిగిందబ్బా’ — అని ఆలోచనలో పడ్డాడు.

"నీ భార్య పతివ్రత కదా? నీతో వొస్తా ననలేదా?"—అనబోయి రాముడు సుగ్రీవుడి మొహం చూసి — "హుఁ ఏం పతివ్రతగా వుంటుందిలే .." అని తల పంకించి వూరుకున్నాడు.

అప్పటికి సుగ్రీవుడికి తన తప్పేవిటో కొంచెం బోధపడింది — భార్య వుంటే తనకే భోగభాగ్యాలూ అక్కర్లేదన్నాడే!—"సరే! వాలితో మాట్లాడి నీ భార్యని నీకు తెచ్చిపెడతాంలే" — అంటే .... ఇంకేవన్నా వుండా? .... ఎల్లకాలం ఈ కొండల్లోపడి యాడవ్వాలసిందేనా ? — సుగ్రీవుడికి— హనుమంతుడి గోళ్ళు చూస్తోంటే ఎంతో ముచ్చటేసింది— వాడిగా పొడుగ్గా.... చక్కగా . కత్తుల్లా ... ఎంత ముద్దొస్తున్నాయో !

రాముడు చాలా సేపట్నించీ వాలి పట్టుదలకీ, తెలివితేటలికీ ఆశ్చర్య పడుతున్నాడు— వాలి బ్రతికివుండగా సుగ్రీవుడికి రాజ్యం రావడం కల్లే. సుగ్రీవుడికి రాజ్యం రాకపోతే తన కార్యం జరగడమూ కల్లే. సుగ్రీవుడికోసం కాకపోయినా, తనకోసం అయినా వాలిని చంపాలి. ఈ అన్నదమ్ముల వైరం తన లాభానికే వుపయోగపడుతుంది. రేపు తను పట్టాభిషేకం చేసుకుని రాజైన తర్వాత సుగ్రీవుడు తనకి సామంత రాజుగా వినయ విధేయతలతో మసులుకుంటాడు. వాలిని కనికరించడం వల్ల ఏం ప్రయోజనం తనకి? .... అనుకున్నవిధంగా ఈ కార్యం ముగిసి .... రావణుడితో యుద్ధం చేసి.... ఆ రాజ్యం కూడా తన ఆధీనంలో వుండే విధంగా .... అవును. అదికూడా సాధించే ప్రయత్నాలు చెయ్యాలి.

నూతనోత్సాహంతో రాముడి మొహం వికసించింది. —"రామా: అంతా విన్నావు కదా?.... ఏ తప్పూ చెయ్యని వాణ్ణి: .... ఎన్ని కష్టాలో చూడు.... మా అన్నని నేను చంపలేక కాదు సుమా: ... నేనూ గొప్ప వీరుణ్ణే: తోడబుట్టినవాణ్ణి ఎలా చంపనా అని వెనకా ముందూ ఆలోచిస్తూ

న్నాను. అంతే. ఎవరన్నా చంపిపెడితే జన్మ జన్మలకీ వాళ్ళ రుణం మర్చిపోను. * రామా ! .... ఆ దుర్మార్గుణ్ణి చంపేసి .... నాకిక వాడి భయం లేకుండా చెయ్యాలి నువ్వు" — అంటూ సుగ్రీవుడు రాముడి చేతులు వాటేసుకున్నాడు.

రాముడు గంభీరమైన చిరునవ్వుతో చూస్తూ — "అంతా విన్నాను. నీ దోషమేమీ లేదు. పరస్త్రిని అపహరించిన దుర్మార్గుడు వాలి. అతణ్ణి చంపకుండా విడిచిపెట్టను. ఇదరం వొకే రకమైన ఆపదలో వున్నాం. నీ కష్టం ఒకటీ, నా కష్టం వొకటీ కాదు. నీ భార్య వొకటీ, నా భార్య వొకటీ కాదు. వాలి పీడ పోగొట్టగలనని నీకు అభయ మిస్తున్నాను. నిశ్చింతగా వుండు" — అన్నాడు.

సుగ్రీవుడు అప్పుడే సింహాసనం ఎక్కినంత సంబరంతో — "అవును రామా ! నువ్వు అంతటి వాడివే ! నే నెరుగుదును. నీ పరాక్రమం ముందు ఇంద్రుడే నిలబడలేడు. ఇక వాలి ఎంత ? నీకు కోపం వొస్తే లోకాలే దహించేస్తావు. అవును. హనుమంతుడు చెప్పాడు" అని హనుమంతుడివేపు చూశాడు.

"ఇది మరీ బాగుంది. నే నెప్పుడు చెప్పానూ ?" — అన్నట్టు చూశాడు హనుమంతుడు బుగ్గలు వుబ్బించి.

"శ్రీరాముణ్ణి గురించి పునం ఎరగని దేముంది ? వాని తప్ప కుండా చంపేస్తాడు. నేను మళ్ళీ రాజునీ — మీరు మళ్ళీ మంత్రులూ...." — సంతోషిస్తూ — సంతోషిస్తూ .... సుగ్రీవుడి మొహం కొంచెం

---

* 9 వ సర్గలో — 24 వ శ్లోకం.

సుగ్రీవుడు వీరుడు కాడని ఎక్కడనుకుంటారోనని — "ఆ పాపిని నిగ్రహించుటకు నాకు శక్తి యుండినను అన్నయను గౌరవముచే నా కట్టిబుద్ధి పుట్టలేదు," — అంటున్నాడు సుగ్రీవుడు. అన్న అనే గౌరవంవల్ల ఎదురుతిరిగి ఓడించలేదట. ఆ అన్నని గూడుపుఠాని చేసి చంపించవొచ్చును. తప్పు లేదు. ఎంత సిగ్గులేని తర్కమో !

కాంతి తగ్గింది .... తను ఇంత సంబర పడుతున్నాడు గానీ .... వాలి అంటే సామాన్యుడా ? .... వాడి దుంప తెగ ! అంత బలం ఎలా వొచ్చిందోగానీ .... ఈ బాణాలూ గీణాలూ వాడినేమన్నా చెయ్యగలవా అనలు ? చాలా దిగాలు పడిపోయాడు సుగ్రీవుడు — "రామా ! .... మనలో మన మాట .... ఆ దుర్మార్గుడు మాచెడ్డ బలవంతుడు సుమా ! .... నువ్వు అంతకన్నా బలవంతుడివనుకో. అబ్బే ! అందుక్కాదు. వాలి గురించి తెలుసుకోటం ఎందుకైనా మంచిదనీ .... వాడు చీకట్నే సంధ్యావందనం ఎక్కడ చేస్తాడనుకున్నావూ ? .... ఇంట్లో కాదు .... నాలుగు దిక్కులకూ పోయి సముద్రాల్లో చేసి .... సూర్యోదయాని కల్లా ఇంటికొచ్చేస్తాడు. వాడు ఆటలాడేదీ వేటితో అనుకున్నావూ ? — బంతుల్లో కాదు. — కొండల్లో ! పర్వతాల్ని గోళీకాయలమల్లే ఎగరేసి పట్టుకుంటాడు. అడవుల్లో మహా వృక్షాల్ని గడ్డిపోచల్లాగ పైకి పీకి పారేసి పోతాడు."

రాముడి లోపలి రాముడు గాంభీర్యమంతా వొక్కవారకి గెంటి— "ఓరి నాయనో ! .... అయ్య బాబో !" — అని నిరాంత పోతున్నాడు.

లక్ష్మణుడు సుగ్రీవుడి మాటల్లో నమ్మకం లేనట్టు చిరునవ్వుతో వింటున్నాడు.

హనుమంతుడు ఎప్పుడు లేచాడో, దూరంగా పొదల్లో ఏవో ఆకులు వెతికి వెతికి తెంపుతున్నాడు.

సుగ్రీవుడు వాలి వీరత్వం వర్ణించే వుత్సాహంలో పడిపోయాడు. — "ఒకసారేమెందో తెలుసా రామా ? .... ఈ మాయదారి మాయావి లేడూ ? .... వాడి అన్న దుందుభి అనేవాడు సముద్రంతో దెబ్బలాటకి వెళ్ళాడు. — "నీ గొప్పేవిటో చూస్తాను. నాతో యుద్ధానికిరా సముద్రుడా !" — అని తొడలుగొట్టి పిలిచాడు...."

"సముద్రుడితో యుద్ధమే !" — రాముడికి సరదా వేసింది. చిన్నప్పుడు విశ్వామిత్ర మహర్షి దగ్గిర ఇలాంటి చక్కా చక్కటి కథలెన్నో విన్నారు. మళ్ళీ అలాంటి కథలు దొరకనేలేదు. — "ఊఁ, సముద్రుడు దుందుభిని చంపేశాడా ? ...."

"అబ్బే ! అసలు జడిసిపోయి యుద్ధానికి దిగందే ! — "నా గొప్పేం వుందిలే నాయనా ! నీతో నే నెక్కడ యుద్ధం చెయ్యగలనూ ? నాలాంటి వాడితో చేస్తే నీకుమాత్రం ఏం కీర్తి ? .... హిమవంతుడనీ ఓక పర్వత రాజున్నాడు. అతడితో చేస్తివా, నీ వుత్సాహమూ తీరుతుంది. కీర్తి దక్కుతుంది. పెళ్ళిరా నాయనా !" అని ఆ పీడ వొదిలించుకున్నాడు.

"సరేలే ! ఈ పీరికివాడితో నా కెందుకులే. యుద్ధం చెయ్యలేనని ముడుకుతున్నాడు" — అని దుందుభి హిమవంతుడి మీదకే పోయాడు. ఆ కొండలనిండా రాళ్ళన్నీ కూలదోసి — "రా ! నాతో యుద్ధానికి రా !" అని కేకలేశాడు.

"వాడి పొగరంతా హిమవంతుడు అణిచేసే వుంటాడు" — అని తలపంకించాడు రాముడు.

"అబ్బే ! .... ఏను మరీ ! .... హిమవంతుడు హడిలిపోయి — నాయనా దుందుభీ ! నేను యుద్ధ వీరుణ్ణి కాను సుమా ! .... గిట్టని వాళ్ళె వరో చెప్పారయ గానీ .... ఆ గుద్దులేవిటో — ఆ యుద్ధా లేవిటో .... నాకేవీ చాతకావు నాయనా ! .... ఇదిగో ! ఇక్కడ తపస్సు చేసుకునే ఈ సన్నాసుల్ని పూజించుకుంటూ....వాళ్ళకో కాయో, పండో అందించి సేవలు చేసుకుంటూ బతుకుతున్నాను. నన్ను బాధ పెడితే నీకు మాత్రం ఏం వొరుగుతుంది ?" — అని గోల పెట్టాడు.

హిమవంతుడు అలా గోల పెట్టడం రాముడికేమి బాగుండలేదు. సుగ్రీవుడు చెప్పుకు పోతున్నాడు — "దుందుభికి కోపం వొచ్చి— "ఏడిసినట్టే వుంది. నువ్వేదో వూడ బొడుస్తావని చెప్పాడే సముద్రుడూ? మీ ఇదరికీ పడిచావదా ఏవిటీ ? వెధవ అబద్ధాలూ వాడూనూ. తెలియక పోతే తెలీచనాలి గానీ నీ పేరు చెప్పడం ఎందుకూ ?" .... అని విసుక్కుని — "సరే గానీ .... ఎవడయినా గొప్ప వీరుడున్నాడేమో ఎరుగుదువా నువ్వు ? నాకు తగిన వాడితో యుద్ధం చెయ్యాలని మాచెడ్డ కోరికగా వుందయ్యా స్వామీ ! —" అని హిమవంతుడి ప్రాణం తీశాడు.

అప్పుడు హేమవంతుడు బాగా ఆలోచించి – "అయ్యో ! లేకేం నాయనా ? .... వాలి అనే వానర రాజు కిష్కింధలో వున్నాడు. గొప్ప బలవంతుడు. వ్వంవ్వ యుద్ధంలో దిట్ట. మీ రిద్దరూ కలబడ్డారంటే మిమ్మల్ని కలబడ్డే. మీ యుద్ధం చూడాలని దేవతల్లుకూడా వొస్తారు : మరి వెంటనే బయల్దేరి వెళ్ళండి" – అని హేమవంతుడు ప్రాణం దక్కించుకున్నాడు. – "నీ తీట వొదుల్లుందిలే"– అని లోపల అనుకునే వుంటాడనుకో.

దుందుభి పొగరుమోతనంగా – "ఓహో ! అంతటి వీరుడా వాలి ? .... చూస్తాను అదేవిటో .... ఆ సముద్రుడిలాగ నువ్వూ అబద్ధాల కోరువేనేమోలే" అని వెంటనే కిష్కింధకి వొచ్చాడు. కోటముందు నిలబడి, అర్ధరాత్రి మా అన్నని యుద్ధానికి పిల్చాడు. మా అన్న వొచ్చే దాకా కూడా ఆగలేక కోట గోడలూ, తలుపులూ బాదుతూ, చెట్లు పీకుతూ నానా సందడీ చేశాడు.

మా అన్న మొదట శాంతంగానే చెప్పాడు సుమండీ ! ఏ మాట చ్చాచూటే చెప్పుకోవాలి .... ముందుకి ముందు కయ్యానికి కాలుదువ్వే రకం కాడు మా అన్న ...."

సుగ్రీవుడి పిర్ర గొప్ప వుపద్రవంలో పడవలసిన క్షణమే అది. కానీ, హనుమంతుడు నిప్పు రాజేసి, ఆకులు కాల్చే తొందరలో వున్నాడు – చుట్టల కోసం.

సుగ్రీవుడు అడ్డూ, ఆపూ లేని వుత్సాహంతో చెప్పుకుపోతున్నాడు.

"మా అన్న ఎంతో న్యాయంగా – "అయ్యో ! ఎవరు నువ్వు ? .... నీకూ నాకూ అనవసరంగా శత్రుత్వం ఎందుకు ?" – అని చెప్తే చెవిన బెట్టాడా ఆ దుందుభి ? వాడికి మూడుతోంటే వాడేం వింటాడు ? .... పై పెచ్చు మా అన్ననే వెటకారాలు పట్టించాడు. – "ఆడవాళ్ళని వొదిలి రాలేక పోతున్నావా ? సరేలే ! తెల్లారేదాకా ఆగుతాలే. చుట్టాల్నీ, పక్కాల్నీ చివరిసారిగా పలకరించి వొచ్చేయ్యి. రాజ్యం అదీ ఎవరికిస్తావో .... ఏర్పాట్లన్నీ చేసెయ్యి" – అంటూ కేకలు పెట్టాడు.

మా అన్నకి వొళ్ళు పుండిపోయింది. పుండదూ పరిః వెంటనే యుద్ధానికి బయలేరి వెళ్ళాడు—" సుగ్రీవుడు అన్నగారితో వైరం లేని పాతక్కాలంలోకి వెళ్ళిపోయి అన్నగారి వీరత్వం సంతోషంగా వర్ణిస్తున్నాడు. అతని సంతోషం చూస్తోంటే— హఠాత్తుగా ఏ క్షణంలోనన్నా "మా అన్నకి నాకూ వైరం ఏమిటీ? .... ఇంతసేపూ ఏదో బుద్ధిలేక వాగాను. మా అన్నమీద ఈగ వాలించంకే వూరుకోను. నీ దారిన నువ్వు దయచెయ్యి"— అనేస్తాడేమోనని రాముడికి భయంగానే వుంది.

వాలి, దుందుభీ ఏ రకంగా యుద్ధం చేశారో — సుగ్రీవుడు లేచి, అక్కడే ఇద్దరి పక్షాలూ అభినయిస్తూ, రాముడి మీది మీది కొచ్చి .... మంత్రుల కాళ్ళన్నీ చితకదొక్కి — రాముడికి కళ్ళకు కట్టినట్టు చూపించాడు. ఆ గంతుల్లో హనుమంతుడు కాల్చిపెట్టిన ఆకులన్నీ వొక్క అడుగుతో తొక్కి చూర్ణం చూర్ణం చేసేశాడు.

ఆ రణరంగంలో సుగ్రీవుడికీ, హనుమంతుడికీ గొప్ప యుద్ధం జరగవలసిందే గానీ, ... హనుమంతుడు సుగ్రీవుణ్ణి మెచ్చుకున్నట్టు చూసి చుట్టపొడుం ముక్కుకిండా దట్టించే కార్యంలో మునిగిపోయాడు.

వాలీ, దుందుభీ ఆ విధంగా యుద్ధం చెయ్యగా.... చెయ్యగా .... చెయ్యగా.... చివరికి వాలే గెల్చాడు. దుందుభి చచ్చిపోయాడు. వాలి దుందుభి కళేబరాన్ని బంతిపుల్లే ఎగరదన్నాడు. అది ఒక యోజనం దూరం పోయి మతంగముని ఆశ్రమం దగ్గిర కొండలో పడింది. ఆశ్రమ పరిసరాలో రక్తం చిందింది. మతంగముని దివ్యదృష్టితో అంతా గ్రహించి — కోపంతో— "నా ఆశ్రమ ప్రాంతాలు కలుషితం చేసిన దుర్మార్గుడు ఇక్కడికి రాగానే మరణిస్తాడు. ఈ శాపం రేపటినించీ పని చేస్తుంది" — అని శపించాడు. ఆ వనంలోవున్న వానరులు కొందరు వాలి దగ్గరికి పోయి సంగతి చెప్పారు. వాలి చాలా దుఃఖపడి వెంటనే మతంగముని దగ్గరికి పోయి క్షమించమని కోరాడు. మతంగముని వాలి

మాటే వినకుండా ఆశ్రమంలోకి పోయాడు. — చేసేదేమీలేక వాలి విచారిస్తూ వెళ్ళిపోయాడు.

సుగ్రీవుడు వుత్సాహంతగ్గి ఎప్పటి స్థానంలో హుషార్చుంటూ — "అందుచేత వాలి ఈ చుట్టుపక్కలకి రాడు. పొచ్చాడో చచ్చాడే! పొచ్చినా బాగుణ్ణు. అబ్బే! ఎందుకొస్తాడూ? ఇంత తెలివి తక్కువవాడా?" —అని నిరుత్సాహంగా నిట్టూర్చాడు. అప్పటికి సుగ్రీవుడికి మళ్ళీ వాలితో వైరం గుర్తొచ్చింది. కొండ గుర్తొచ్చింది. మంత్రులు గుర్తొచ్చారు. చుట్టూ చూశాడు. మంత్రులు చుట్టలు కాలుస్తూ అర్ధనిమీలిత నేత్రాలతో తాత్కాలిక స్వర్గం చూస్తున్నారు. సుగ్రీవుడి మనసుకూడా పీకింది స్వర్గం కోసం. "ఇప్పుడు కాదు. వాలిని చంపి వాడి కాష్ఠంలోనే చుట్ట ముట్టించుకుంటాను," — అని ప్రతిజ్ఞ చేసుకున్నాడు.

— "మా అన్న సామాన్యుడు కాడు రామా! పరమ కిరాతకుడు .... అన్న రూప రాక్షసుడు. ఎన్నడు పిరగడొతాడో గానీ .... వాడి ముంప ఎప్పుడు తెగుతుందో గానీ...."

సుగ్రీవుడు అన్నని తిడుతోంటే రాముడి చెవుల కెంతో ఇంపుగా వుంది గానీ.... ఆ తిట్లన్నీ లక్ష్మణుడు వినడం .... ఏ క్షణంలోనైనా చెప్పలేం ... ఈ ధిక్కారం.... అన్నని తమ్ముడు నిందించడం....అంత మంచిది కాదు.

అన్నగారి బలం అంతా వొకసారి గుర్తుచేసుకున్న తర్వాత సుగ్రీవుడికి రాముడి బాణం పులలమీద బొత్తిగా నమ్మకం పోయింది. పూర్తిగా నిరుత్సాహ పడిపోయాడు — "రామా! వాలి ఇక్కడికి రాలేడు కాబట్టే నిబ్బరంగా కూర్చుని నీతో మాట్లాడుతున్నాను. అదుగో ! .... అటు చూడు. కుంకుడు చెట్టవేపు. కనబడుతోందా? అదే దుందుభి కళేబరం. మా అన్న వొక్కొతన్ను తంతే అది వొచ్చి ఇక్కడ పడింది." — అంటూ అటు చూపించాడు.

రాముడు ఆశ్చర్యపడ్డాడు.

కొండంత అస్థిపంజరం కుప్ప.

"మరి నీ అన్న ఎంత బలవంతుడో తెలుసు కదా? ఆ మాయావే నీ అన్నని చంపేశాడని ఎలా అనుకున్నావోయీ ?" — అందామను కున్నాడు లక్ష్మణుడు.

రాముడు గంభీరంగా వుండడం చూసి వూరుకున్నాడు. "నా సంగ లేవిటో ఇతనికి చెప్పరాదూ?" — అన్నట్టు చూశాడు రాముడు లక్ష్మ ణుడి వేపు.

లక్ష్మణుడు నర్మకుని సుగ్రీవుణ్ణి చూస్తూ — "నీ అన్న పరా క్రమం అంతా చెప్పావు. బాగానే వుంది. ఇంతకీ మా అన్నగారిమీద నీకు నమ్మకం లేనట్టు కనబడుతోందే :" — అంటూ చిరునవ్వు నవ్వాడు.

"అబ్బెబ్బెబ్బెబ్బె ! .... నమ్మకం ఎందుకు లేదూ?"

"సరేలేవోయీ ! ముసుగులో గుద్దులాట లెందుకుగానీ మా అన్నగారేంచేస్తే వాలికన్నా బలవంతుడనీ నీకు నమ్మకం కలుగుతుం ఏంటావూ ?"

"అబ్బెబ్బే !.... ఏం చెయ్యటం ఎందుగ్గానీ .... మనం కాస ముందే బలం చూసుకుని .... రంగంలోకి దిగటం మంచిది కదానీ. అంతే.... అదుగో ! ఆ దుందుభి అస్థిపంజరం వుందిగా, దాన్ని కాస లక్కణ్ణించి .... రెండువందల ధనుస్సుల ఎత్తు ఎగరగొడితే .... అంతే చాలు. ఇక వాలి చచ్చాడన్నమాటే.... రామా!.... నీమీద నాకు నమ్మకం లేక కాదు సుమా, అబ్బే!.... అనలు నువ్వు...."

రాముడు గంభీరంగా లేచాడు. రాముడితోపాటు లక్ష్మణుడులేచాడు. సుగ్రీవుడు లేచాడు.

తారుడు, నిద్రపోతున్న నీలుణ్ణి గబగబా భుజంపట్టి గుంజుతూ — "లే. లే. ఎంతసేపు పాడు నిద్ర! రాముడేదో చేస్తున్నాడు. చూడాం పద .... మళ్ళీ లేపలేదని గోల పెడతావు." — అని లేవగొట్టే ప్రయత్నం చేశాడు.

ఎంతకీ పని జరక్క, ఎలాగైనా లేపాలనే పట్టుదలతో భుండల మీద బరబరా ఈడ్చాడు.

నీలుడు మత్తులో — "అబ్బా ! .... ఏంటీ ? .... ఛీ....ఛో !" — అని విసుక్కున్నాడు.

"రాముడేదో చేస్తున్నాడు."

"ఊఁ "

"ఊఁ ఏంటి ? .... చూడవా ?"

"ఊహూ ! ...."

"నీ ఖర్మ ! నేనేం చెయ్యను ? ...." — అని తారుడు, నీలుణ్ణి వొదిలేసి పరిగెత్తాడు.

నీలుడు కాళ్ళూ చేతులూ ఆరజాపి — "ఆహా ! ఎంత హాయి...." — అన్నట్టు పడుకున్నాడు.

హనుమంతుడు కంగారుగా చుట్టల సరంజామా అంతా కట్టిపెట్టి .... నీలుడి చెయ్యి తొక్కుకుంటూ పరిగెత్తాడు.

నీలుడు తప్ప అందరూ రాముడి చుట్టూ జేరారు. రాముడు గంభీరంగా కళ్ళుమూసి ఏవో మంత్రాలు చదువుకుంటున్నాడు.

నలుడు తారుడి చెవిలో — "మంత్రాలు చదువుకుంటే గొప్పేం లేదు. వాలి చదువుకోడుగా ?" — అని గుచగుడ లాడాడు.

తారుడి చెవి దురదబుట్టి — "అబ్బ ! వూరుకో ! లక్ష్మణుడు చూస్తున్నాడు" — అని విసుక్కున్నాడు.

రాముడు మంత్రాలు పూర్తి చేసి దుందుభి అస్థిపంజరం అడుక్కి కాలు పోనిచ్చి పైకి ఎగరదన్నాడు. అది చెల్లాచెదురై కొండలచుట్టూ వడింది.

సుగ్రీవుడు కొంచెం సంతోషించి .... నెమ్మదిగా సీరసపడ్డాడు.

రాముడు వీర గర్వంతో సుగ్రీవుడి మొహం క్రీగంట చూసి, తెల్ల బోయి లక్ష్మణుడివేపు గంభీరంగా చూశాడు.

లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి — "మా అన్నగారి బలం ఒప్పుకుంటావా ?" — అన్నట్టు చూశాడు.

"అబ్బే ! నేనెందు కొప్పుకుంటానూ ?" — అన్నట్టు సుగ్రీవుడు దిక్కులు చూశాడు, —

"అబ్బో ! .... గొప్ప కార్యమే .... కానీ ...."

"ఊఁ కానీ ? .... ఏమిటి నీ సందేహం సుగ్రీవా ?"

"మనలో మన మాట. మా అన్న కాలితో ఎగరేసినప్పుడు దుందుభి ఎలాగున్నాడనీ ?.... మదపు టేనుగులాగున్నాడు.... ఇప్పుడో ? అబ్బే ! ఎండకి తడిసి .... వాన కెండి .... ఇంకేం మిగిలిం దక్కడ ? కంపలాగా తేలికె పోయిందాన్ని ఎగరదన్నడం ఏం గొప్పలే" — అని నిరుత్సాహ పడిపోయాడు.

రాముడు గంభీరంగా మొహం ముడుచుకున్నాడు.

లక్ష్మణుడు చిరునవ్వుతో నచ్చజెప్తోన్నట్టు — "సుగ్రీవా! నువ్వు కోరిన కార్యమే గదా మా అన్నగారు చేసి చూపించారు ! సరే ! నీకు సంతోషం కలిగే కార్యం మరేదయినా చెయ్యగలరు సుమా ! సందేహిం చకు. అడుగు" — అని సముదాయించాడు.

రాముడు మొహం చిట్లించి చుట్టూ చూస్తున్నాడు— ఇంకేం ఎగర దన్న మంటాడోనని. ఈ ఆటవికుడు తనకు పరీక్షలు పెడతాడా ? .... తాటకి వధ ! .... శివ ధనుర్భంగం ! .... పరశు రాముడితో ....

"అదుగో ! .... ఆ మద్దిచెట్లు చూడు. చూశావా ?" అన్నాడు సుగ్రీవుడు వాటివేపు చూపిస్తూ లక్ష్మణుడితో.

రాముడు పరశురాముణ్ణి వొదిలేసి అటు చూశాడు.

"ఏమా అన్న ... టోలెడుసార్లు ఈ చెట్లన్నీ వూపి వూపి .... ఆకులన్నీ రాలగొట్టి మోళ్ళు చేశాడు. చూసేవాళ్ళకి కళ్ళు గిర్రున తిరిగి పోవలసిందే ! వాడి బలం చల్లగుండ !" — అని కొత్తగా ఆశ్చర్యం వెలిబుచ్చాడు సుగ్రీవుడు.

నళుడు మళ్ళీ తారుడి చెవిలో — "అదేం తిట్టు ?....వాడి బలం కూలా ! అనాలిగానీ .... వాడి బలం చల్లగుండే మన భరతం బాగానే పడతాడు" — అని చిటికు పడ్డాడు.

తారుడు శాంతంగా — "నువ్వన్నది నిజమేగానీ .... ఏదో తొందర్లో .... కంగార్లో అనేవాళ్ళే. వాడి బలం చల్లగుండమంటే చల్లగుంటుందా ఏవిట్లే...." అని చప్పరించాడు.

నళుడుకి కోపంవొచ్చి — "అయితే కూలమంచే కూడా కూల దన్న మాటేగా ? — చల్లగుండమంచే చల్లగుండక, కూలమంచే కూలక, — మరీ తిట్లు తిట్టుకోటం ఎందుకంటావూ ? తిట్లంచే నీకేం నమ్మకం వున్నట్టులేదే !" — అని వాదనకి దిగాడు.

తారుడు విసుక్కుని — "ఊరుకుందూ ! చెవులు దురదలుపుట్టి చస్తున్నాను" — అంటూ పంచె కొసలు మెలిదిప్పి చెప్పుల్లోకి పోనిచ్చాడు.

రాముడు మద్దిచెట్లవేపు బాణం గురిచూసుకుంటున్నాడు. బాణాలతో పరాక్రమం చూపించడంలో అయితే రాముడికి ఎటువంటి సంకోచమూ లేదు. పైగా వుత్సాహం కూడా.

రాముడు బాణం ఎక్కుపెట్టి సుగ్రీవుణ్ణి గంభీరంగా చూస్తూ — "సుగ్రీవా! మీరీ ఆయుధాలక్ష్యానికి నెరుగరు. ఇపుడు మీకొక అద్భుతమైన కార్యం చేసి చూపిస్తాను," — అంటూ అల్లెతాడు బిలంగా లాగి బాణం విడిచిపెట్టాడు.

ఆ కొండల్లో చెట్లూ, పిట్టలూ ఎన్నడూ వినని భయంకరమైన హోరుతో....చప్పుడుతో... ఆ బాణం మద్దిచెట్లని బద్దలుచేస్తూ దూసుకుపోయింది.

పిట్టలు గోల గోలగా లేచాయి. పొదల్లో జంతువులు అయోమయంగా పరుగులెత్తాయి.

సుగ్రీవుడూ, అతని మంత్రులూ స్తంభించిపోయారు. నీలుడు హడలిపోయి లేచి కూర్చుని తేలకళ్ళతో చుట్టూ చూశాడు.

"అంత శక్తిగల బాణం వాలి గుండెలమీద కొడితే ఇంకేమన్నా వుందా?" — సుగ్రీవుడు ఆనందం పట్టలేక మూర్ఛపోయాడు.

హానుమంతుడు బుగ్గలు వుబ్బించి ఆశ్చర్యంగా చెల్లనీ, బాణాన్ని చర్చి చూస్తున్నాడు. *

---

* రామాయణంలో వానరజాతి అంతా — మానవుడు ఏ ఆయుధమూ కనిపెట్టని దశలో, జంతువుల్లో జంతువుమల్లే వున్న స్థితిని ప్రతిబింబిస్తుంది. ఆ దశలో మానవుడికి దేహబలం తప్ప ఇంకో ఆయుధం లేదు. రాళ్ళతోటీ, చెట్ల కొమ్మలతోటీ — మృగాలనించీ శత్రువులనించీ ఆత్మరక్షణ చేసుకునేవాడు. — మానవ సమాజంలో మొట్టమొదట కనిపెట్టిన శక్తివంతమైన ఆయుధం "విల్లు". అది మానవుడికి అపారమైన బలం ఇచ్చింది. సమాజంలో 'విల్లు'కి ఎంతో పవిత్రమైన స్థానం వచ్చింది.

వాలికి ఏ రకమైన ఆయుధమూ లేదు — శరీరబలం తప్ప. "పర్వతాలతో బంతులాడతాడు. చెట్లన్నీ ఏకాకటివేళ్ళతో పెళ్ళగిస్తాడు." — అనేదాన్ని "అంత శక్తివంతమైన కార్యాలు చెయ్యాలి. ప్రకృతి అంచేశక్తి సంపాదించాలి" — అనే కోరికలుగా మాత్రమే అర్థం చేసుకోవాలి. — "వాలి చాలా శరీరబలం గడవాడు" అనేది మాత్రమే అసలు విషయం. పర్వతా లెత్తుతాడనీ కాదు. బిలాల్లో దూరి యుద్ధాలు చేస్తాడనీ కాదు.

"రామునికి "ఆయుధం" వుంది. అదే అతని "బలం" రాముడు వాలికన్నా శారీరకంగా బలవంతుడు కాదు. (బలవంతుడని సుగ్రీవుడు ఒప్పుకోలేదు.) ఆయుధబలం వల్లనే రాముడు వాలికన్నా బలవంతుడయ్యాడు.

12 వ సర్గలో — 3, 4 శ్లోకాల్లో — రామబాణం మహా వృక్షాన్ని పెల్చుకుంటూ పోయి, వెనకవున్న పర్వతాన్నికూడా బద్దలుగొట్టి, ఏడామిలో దూరి, రయ్యిన పైకివొచ్చి, మళ్ళీ రాముడి వీపుమీద అమ్ములపొదిలో నిలబడుతుంది. ఇది "కల్పనే" గానీ "నిజం" కాదనే విషయం అందరూ గ్రహించ గలిగేదే. ఈ ఘట్టం వల్ల — "విల్లు చాలా శక్తి

"ఏమిటి ? ఏవైంది ?" — అని నీలుడు కంగారుగా అడిగాడు తారుణ్ణి.

తారుడు భక్తిగా రాముణ్ణి చూపించి నమస్కారం పెట్టాడు — గోప్యంగా.

"రాముడా ? ఏం చేశాడు ?"

తారుడు మూర్ఖంగా పద్దిచెట్లవేపు చూపించి నమస్కారం పెట్టాడు.

"బద్దలు గొట్టెయ్యడమే ! .... ఎలా కొట్టాడు ?

తారుడు బాణాలవేపు చూపించి కళ్ళు తేలేసి నమస్కారం పెట్టాడు.

నీలుడికి అంతా అర్థమైంది. తారుణ్ణి నిష్ఠూరంగా చూశాడు — "నన్ను కొంచెం లేపకూడదూ ? .... నేనుకూడా చూసేవాణ్ణి కదూ ? .... అమ్మో ! .... మీరేనా ?" ....

తారుడికి వొళ్ళు మండిపోయి నోటిమాట పెగిలింది — "చాల్లే ! ఊరుకో ! పళ్ళు రాలగొడతాను. ఎంత లేపినా లేచిచావవు గానీ .... లేపలేదని నిష్ఠూరాలు మాత్రం బాగా వేస్తావు."

"లేపావా ? .... నే నసలు చీమ చిటుక్కుమన్నా లేస్తానే !"

"నీ నిద్ర సంగతి నాకు చెప్పకు. భేరీలు మోగినా, ఏనుగులు తొక్కినా లేవవు."

(ఫుట్ నోట్ : 215 పేజీ తరువాయి)

గల ఆయుధం" — అనే విషయం మాత్రమే మనం అర్థం చేసుకోవలసింది.

రాముడికి "కత్తి" కూడా వున్నప్పటికీ "విల్లు"కి వున్న పవిత్ర స్థానం "కత్తి"కి లేదు.

వాలి కొన్ని వీర కార్యాలు చేస్తే, రాముడు తన ఆయుధంతో వాలి కన్నా గొప్ప వీర కార్యాలు చేసి చూపించాడన్నమాట. అంతేగానీ, 7 మద్దిచెట్లనీ నిజంగా చీల్చగలడనే ఆలోచన వుండకూడదు.

"అలా అంటేనే నాకు కోపం వొస్తుంది. చిన్నప్పుడు మా అమ్మ నిద్రపోనని తెగ తిట్టేది. "మా నీలుడసలే నిద్రపోడమ్మా ! .... కాల్చుకు తింటున్నాడు" — అని అందరికీ చెప్పేది."

"చిన్నప్పుడు మీ అమ్మని కాల్చుకుతిని, ఆ నిద్రంతా ఇక్కడ పోయినట్టున్నావు మరి. రాజుకి కూడా చచ్చే కోపం వొచ్చింది. ఆగు. నీ భరతం బాగానే పడతాళ్ళే"

నీలుడు కొంచెం జంకి — "నిజంగానే కోపం వొచ్చిందంటావా?" — అంటూ సుగ్రీవుడికేసి వారగా చూశాడు.

సుగ్రీవుడు రాముడి పాదాలమీద బోర్లాపడి ఏడుస్తూంటే అలాగే ఉన్నాడు — " .. నువ్వు రామా ! నీ గొప్పతనం అర్థం చేసుకోలేక పోయాను. ఇంద్రుణ్ణి బదులుగా చీల్చెయ్యగలవు. ఇక వాలి ఎంత ? ఇంతసేపూ నీతో మాట్లాడుతున్నానేగానీ నాకీ పని జరుగుతుందనే నమ్మకం లేనేలేదు సుమా ! ఇప్పుడు మాత్రం నా మనసులో సందేహాలన్నీ పటాపంచలై పోయాయి" — అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నాడు — "ఇతడిపల్ల పని మాత్రం జరుగుతుంది. ఎప్పటి కప్పుడు పొగుడుతూ వుండాలి. అంతే !" — అని తనని తను హెచ్చరించుకున్నాడు లోపల.

రాముడు చిరునవ్వుతో సుగ్రీవుణ్ణి లేవదీస్తూ — "సుగ్రీవా !.... నీకు పూర్తిగా విశ్వాసం కుదిరినట్టేనా ? .... సందేహించకు సుమా ! నిర్భయంగా అడుగు .... ఇంకే కార్యమైనా ...." — అంటూ వోరగా చూశాడు.

సగంవరకూ లేచిన సుగ్రీవుడు — "ఎంత మాట ! .... ఎంత మాట !" — అంటూ మళ్ళీ బోర్లాపడ్డాడు.

చుట్టూ అందరి మొహాల్లోనూ తనపట్ల భక్తి గౌరవాలు చూసి రాముడి మనసు పూర్తిగా సంతృప్తి పడింది.

"శ్రీరామా ! .... మరి ఆ దుష్టుణ్ణి ఎప్పుడు ....?"

"ఎప్పుడో ఎలుకలాయా ?.... ఇప్పుడే. పిల్లకి ఎర్రతాపు బిగించే వుంది. బయలుదేరు. పోదాం. నువ్వు మీ అన్ననీ యుద్ధానికి పిలువు. నేను కిష్కింధ సమీపంలో చెట్లు దట్టంగా వున్నచోట దాక్కుంటాను. మీ అన్నని కవ్విస్తూ నేనున్న సమీపానికే తీసుకురా ! మీ రిద్దరూ యుద్ధం చేస్తోండగా .... ఆ దుర్మార్గుడిమీద .... నా కరకు బాణాలు ... గుప్పిస్తాను."

— సుగ్రీవుడు ఆనందంతో మళ్ళీ మూర్ఛపోయాడు.

* * *

"ఓరే దుష్టుడా ! వాలీ ! .... రారా యుద్ధానికీ ! నాతో యుద్ధం చేసి చూడరా ! ...." — అంటూ తొడలు చరుస్తూ దిక్కులు పిక్కటిల్లేలా కేకలు ప్రారంభించాడు, సుగ్రీవుడు కిష్కింధలో కోటవుండు నిలబడి.

సుగ్రీవుడి కంఠం విన్నదే తడవుగా వాలి కోపోద్రేకంతో కోటలోంచి దూసుకుంటూ వొచ్చేశాడు.

"రారా దుర్మార్గుడా ! అందుకోరా నన్ను !" అంటూ సుగ్రీవుడు వాలిని కవ్విస్తూ, రెచ్చగొడుతూ వెనక్కి పరుగుతీస్తూ అనుకున్న స్థలం వరకూ తీసుకు వొచ్చాడు.

వాలి భరించలేని కోపంతో సుగ్రీవుడిమీద కలబడ్డాడు. అంత రెచ్చగొట్టిన శత్రువు చేతికందగానే వాలి వుత్సాహం హద్దులు దాటి పోయింది. సుగ్రీవుడి వీపుమీద గుద్దుల వాన ప్రారంభమైంది. సుగ్రీవుడు గుద్దు గుద్దుకీ గొప్ప వీరత్వంతో కెవ్వు కెవ్వున అరుస్తున్నాడు. వాలి, సుగ్రీవుడికి వొక్క గుద్దులు మాత్రమేగాక, కాలికొద్దీ తన్నులూ — చేతికొద్దీ చరుపులూ — చెంప పెట్లూ — డొక్క పోట్లూ — శిరో మర్దనాలూ — గుభికీలూ — దప్పళాలూ — ఎన్నెన్నో రకాలు — మార్చి మార్చి — ఉత్సాహంగా ఇస్తోనే వున్నాడు. శత్రు భయంకరు

డెన సుగ్రీవుడు తన పరాక్రమం అంతా తాదాస్తాయిలో అరవడానికే వుపయోగిస్తున్నాడు. గిర్రున తల తిప్పి చెట్లవేపు చూస్తున్నాడు.

చెట్ల చాటున బాణం ఎక్కుపెట్టి నించున్న రాముడికి కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. ఆ గుద్దుల చప్పుళ్ళకీ — ఆ అన్నదమ్ముల అరుపులకీ చెవులు గింగిర్లెత్తుతున్నాయి. అంతా గందరగోళంగా వుంది.

"ఇదరూ మెలిక లేసుకుని గిరగిరా తిరుగుతున్నారు. ఎవరు ఎవరో తెలీకుండా వుందే!" — అని కంగారు పడ్డాడు.

"ఆ గుద్దేవాడు వాలీ .... అరిచేవాడు సుగ్రీవుడూ అయివుంటారు అన్నగారూ!" — అన్నాడు లక్ష్మణుడు.

రాముడు వొప్పుకోలేదు — "అరిచేవాడు కూడా బాదుతోనే వున్నాడోయీ!"

"ఆఁ .... ఏం బాదుడులెండి అన్నగారూ! పది గుద్దులకో గుద్దు! పది తన్నులకో తన్ను! అదీ వొక బాదుడేనా?" ....

రాముడికి బాణం వొదలడానికి సంకోచంగా వుంది. తీరా అది వాలికి తగలకపోతే .. ? .... వాలి వెనక్కి తిరిగి చెట్లలోకి వొక్క వురుకు పరికితే ....?

రాముడు ఆలోచనల్లోనే వున్నాడు.

సుగ్రీవుడు .... అరుస్తూ .... కొండవేపు పరుగుచ్చుకున్నాడు. వెనకాల వాలి తరుముతూపోయి, కొంత దూరంలో ఆగి —"....బతికి పోయావురా దుర్మార్గుడా! .... తప్పించుకున్నావురా" — అని హుంకరించి వెనక్కి తిరిగాడు.

సుగ్రీవుడు కొండల్లోకి పరిగెత్తి పరిగెత్తి కూలబడ్డాడు. కోపంతో వుద్రేకంతో బుసలు గక్కుతున్నాడు. — అందరూ సుగ్రీవుని చుట్టూ చేరారు. సంకోచిస్తూ, తడబడుతూ రాముడు కూడా జేరాడు. రాముణ్ణి చూసీ చూడగానే — సుగ్రీవుడు ఎగిరి జుట్టు పట్టుకుని వొంగదీసి — "దీస్ .. దీస్...." మంటూ కసిదీరా గుద్దుదామనుకున్నాడు. కాళ్ళూ చేతులూ కూడిరాలేదు. చిటికెనవేలు కదిలించే శక్తయినా లేదు. కుప్పలా

కూలబడిపోయి వుక్రోషంతో కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ రాముణ్ణి కోపంగా చూసూ— "మా బాగా చేశావు పెద్దమనిషివి : .... ఇంత మోసం చేస్తావే ?.... గొప్ప సత్యవంతుణ్ణన్నావు. ఎన్నడూ అబద్ధాలాడ నన్నావు. ఇదన్నమాట నీ సత్యం :.... ఆ దుర్మార్గుడితో నన్ను చావ గుద్దించాలనే గానీ ఎతంతా ?.... వాణ్ణి చంపనని మొదటే చెప్పేస్తే.... ఈ కొండ దిగి వాడి ఛాయలకన్నా పోయేవాణ్ణా ?.... మా చక్కగా చేశావు వుపకారం.... ఇంకా నయం. బతికి బయట పడ్డాను.... ఇప్పటి కన్నా తెలిసింది నీ అసలు గుణం. సీతని వెతికే పెట్టాలంట .... సీతని " అంటూ తిట్టవాన కురిపించాడు. *

---

* 12 వ సర్గలో — 25 నించీ 28 వరకూ.

వనమునకు వచ్చియుండు రాముని జూచి సుగ్రీవుడు సిగ్గుపడి తల వొంచుకుని భూమిని జూచుచు దీనుడై యిటులనెను. — "వాలిని యుద్ధమునకు బిలువమని నాతో జెప్పి, నీ పరాక్రమమును నాకు దెలిపి శత్రువుచే నన్ను గొట్టించి, ఇపుడు నీవేమి యోచించుచున్నావు? అపుడే వాలిని జంపనని నాకు జెప్పియుండిన యెడల వాలితో బోరుటకు పోయి యుండను." --

ఈ మాటలనటానికి సుగ్రీవుడికి సిగ్గెందుకూ? పైగా, కోపం అన్నమాట లేకుండా, "తలవొంచుకుని భూమిని జూచుచు దీనుడై" — అన్నాడట.

సుగ్రీవుడి పరిస్థితి ఏమిటి? — రాముడికీ — సుగ్రీవుడికీ మధ్య ఒప్పందం ఏమిటి ? వాలిని చంపాలనే. అది జరగనప్పుడు, అనలు కారణం ఏమిటో సుగ్రీవుడికి తెలియనప్పుడు, —సుగ్రీవుడు రాముడితో కోపంగా మాట్లాడతాడా ?— దీనంగా మాట్లాడతాడా ? కోపంగా మాట్లాడడమే సహజం అయితే—కవి అసలు విషయాన్ని తారుమారు చేసినట్టే కదా? — ఈ కథ పొడుగునా, ఈ విధంగానే ముఖ్యమైన విషయాలన్నీ తారుమారై పోతూ వుంటాయి. కవి ఎప్పుడూ రాముడితరుపునే వుంటాడు. అన్ని విషయాల్నీ రాముడికి అనుకూలంగా మారుస్తూ వుంటాడు.

రాముడు పుట్టింతర్వాత అంత అవమానం ఎన్నడూ ఎరగడు. తన తల తీసేసి ఎవరో పట్టుకుపోతున్నా రనుకున్నాడు .... వొక మూర్ఖుడు ... ఆటవికుడు .... అంతమందిముందు .... ముఖ్యంగా .... లక్ష్మణుడి ముందు .... అలా ఝాడించేస్తోంటే ... చేష్టలుడక్కి స్తంభించి పోయాడు. .... ఈ మూర్ఖుడికి తొందరగా నచ్చచెప్పడం మంచిది .... లేకపోతే .. ఇంకెన్నెన్ని రకాల ..

కొంత గాంభీర్యం తీసి పక్కన పెట్టాడు రాముడు. కొంచెం సిగ్గూ లజ్జా కూడా తీసి గాంభీర్యం సరసన పెట్టాడు. తడబడుతోన్న కంఠంతో — "కొంచెం ధైర్యం వహించు సుగ్రీవా !.... నీవంటి పుత్రుడు మంచిచెడ్డలు తెలుసుకోకుండా .... ఇతరుల్ని నిందించడం ధర్మం కాదు సుమా !.... నా మాట నమ్ము. నేను నిన్ను మోసం చెయ్యలేదు సుమా ! నిన్నూ వాలినీ నే నసలు పోల్చుకోలేక పోయాను. మీ నగలూ .... బట్టలూ.... నడకలూ .... రూపురేఖలూ .... అన్నీ వొక్కలాగే వున్నాయి. వాలి ఎవరో.... నువ్వు ఎవరో పోల్చుకోడం కష్టం అయి పోయింది." — అంటూ ప్రారంభించాడు.

"చాల్లే. వూరుకో. అబద్ధాలే ఆడనన్నావు. బట్టలూ, గిట్టలూ — నగలూ, గిగ్గలూ అన్నీ వొక్కలాగే వున్నాయా? .... ఆ దుర్మార్గుడి మెడలో వజ్రాలహారం లేదూ?.... అసలు మహత్యం అంతా అందులోనే వుంది. నా మెళ్ళో ఎక్కడేడిసిందదీ ?" — అని మండిపడ్డాడు సుగ్రీవుడు. *

---

* రాముడు మొదటిసారి వాలిని కొట్టలేకపోయాడు. దానికి "మీ రిద్దరూ వొక్కలాగే వున్నారు." — అనే కారణం చెప్పాడు. "బట్టల్లోనో, నగల్లోనో, నడకల్లోనో, ఏ చిన్న తేడా అయినా దొరకదా?" — అన్న ప్రశ్న వొస్తుందేమోనని కవి చాలా జాగ్రత్తగా ఇద్దరు వ్యక్తుల్లో వేటివల తేడాలు తెలుస్తాయో అవన్నీ ఇందులో ఇరికించాడు. కిష్కింధ 12 వ సర్గలో — 30, 31, 32 శ్లోకాలు.

"మీ ఆభరణములు, వేషములు, దేహ ప్రమాణములు, నడకలు, కంఠ ధ్వనులు, దేహకాంతులు, చూపులు, పరాక్రమాలు,

రాముడు తెల్లబోయి కొంచెం ఆలోచించాడు. వాలి మెళ్ళో ఆ హారం అదీ చూసినట్లే గుర్తు రావటంలేదు. అంతా అయోమయంగా వుందని కాస్త పరకాయించి చూస్తోండగానే ఈ మూర్ఖుడు కొండవేపు పరిగెత్తాడు. అప్పుడైనా వాలి మీదకి బాణం వొదిలితే బాగుండేదేమో!

— "నా మాట విను సుగ్రీవా! ఆ హారం మిగిలిన నగల్లో కలిసిపోయిందో ఏమో! నే నసలు గుర్తించనే లేదు సుమా!.... తీర్తా నేను బాణం వొదిలానను కో. అది నీకే తగిలితే? — నిన్ను రక్షిస్తా నని వాగానం చేశానా?.... తెలిసో, తెలీకో నిన్ను చంపితే మహా పాపం చుట్టుకోదూ నాకు? — నువ్వు లేకపోయినా, నేను లేకపోయినా మనం

(ఫుట్‌నోట్ : 221 పేజీ తరువాయి)

మాటలు అన్నిటియందునూ ఒకరి నింకొకరు పోలియుండుటచే నేను భ్రమ చెందితిని." — అంటున్నాడు రాముడు. (పరాక్రమం కూడా వొక్కలాగే వుంటే వొకాయన కొండవేపు పరిగెత్తడం ఎందుకో?) —

వాలి యుద్ధానికి వొచ్చేప్పుడు ఎప్పుడూ వొక హారం వేసుకుంటాడు.

11 వ సర్గలో — 39 వ శ్లోకం — దుందుభితో

యుద్ధానికి బయల్దేరుతూ వారి తన తండ్రి తనకు మాత్రమే ఇచ్చిన (ఇంద్రుడిచ్చిన) హారం వేసుకున్నాడు. వాలీ, సుగ్రీవుడూ రెండోసారి యుద్ధం చేసినప్పుడు కూడా ఈ హారం వాలి మెడలో వుంది. వాలి చచ్చిపోయేముందు తన హారం సుగ్రీవుడి కిస్తాడు. —

(22 వ సర్గలో 16 వ శ్లోకం.)

వాలికొక ప్రత్యేకహారం సృష్టించి, దానికొక మహత్యం కల్పించి, అంత గొప్ప వీరుణ్ణి కూడా రాముడితో పడగొట్టించాడు కవి. — "మీ ఆభరణాలూ, అలంకారాలూ వొక్కలాగే వున్నాయి...." — అన్నప్పుడు ఈ ప్రత్యేకహారం సంగతి ఎరగనట్టు దాని సంగతి ఎత్తకుండా వూరుకున్నాడు. "రాముడి మాట ధిక్కరించి ఎవ్వరూ ఆ హారం సంగతి అడగర్లే!" — అని కవి వుద్దేశ్యం.

అనుకున్నవంతా తారుమారై పోవలసిందే గదా ? నీమీద ఎన్నో ఆశలు పెట్టుకొని వున్నాను. నువ్వే లేకపోతే దిక్కెవ్వరు నాకు ?.... నీవంటి స్నేహితుడే పోతే న న్నెవరు రక్షిస్తారు ?" — అంటూ తల వాల్చుకున్నాడు.

అంత కోపంలోనూ సుగ్రీవుడి మనసు కొంచెం మెత్తబడుతోంది.

"ఈసారి అలా జరగనిస్తానా సుగ్రీవా ? లేచి మళ్ళీ బయలుదేరు యుద్ధానికి. ఒక్క బాణంతో వాలి గుండెలు ...."

"మళ్ళీనా ? యుద్ధానికా ?" — ఖిన్నుడయ్యాడు సుగ్రీవుడు — "ఇప్పటికే ఎడం గూడు పీడిపోయింది. ఇక కుడి గూడు వుండిపోయిందనా ఏవిటి ? మళ్ళీ యుద్ధానికి వెళ్ళాలా ? .... యుద్ధానికి ! ...."

సుగ్రీవుణ్ణి చావబాదాలన్నంత కోపం వొచ్చింది లక్ష్మణుడికి.

"ఎంత చెప్పినా మాట నినిపించుకోడేం ? అంత నిర్లక్ష్యం చెయ్యడానికి శ్రీరామచంద్రుడసుమంటున్నాడా ? .... ఎల్లయ్యో, పుల్లయ్యో అనుకుంటున్నాడా ? .... ఈ అటవికులు పరమ మూర్ఖులు !

కోపమంతా లక్ష్మణుణ్ణి ఆవరించి, ఎక్కడలేని శాంతమూ రాముణ్ణి వరించింది — "నా అభిప్రాయం గ్రహించవోయీ సుగ్రీవా ! .... ఈసారి నిన్ను నేను పోల్చడానికి వీలుగా, ఏదయినా గుర్తుపెట్టుకుంటే వాలిని చంపడం క్షణాలమీద పని" — అంటూ చుట్టూ చూసి — "లక్ష్మణా ! ఆ గజ పుష్పలత విరగబూసింది చూడు. అది తెచ్చి సుగ్రీవుడి మెడలో హారంగా వెయ్యి" — అని గంభీరంగా చూశాడు.

"లక్ష్మణుడు అన్నగారు చెప్పినట్టే ఆ పూలతీగ తెచ్చి, దగ్గరికి వెళ్ళితే సుగ్రీవుడేం ఖయ్యిమంటాడోనని దూరంగా చూస్తూ నించున్నాడు.

సుగ్రీవుడికి రాముడి మాటలో బాగానే నమ్మకం కలిగిందిగానీ .... ఎడం భుజం గూడు కరేర్ కరేర్మంటూ — "నమ్మకు, నమ్మకు" అని గోల పెడుతోంది.

"ఆబ్బే ! మళ్ళీ యుద్ధమా ? .... లాభం లేదు. ఎలాగో .... ఈ కొండమీదే బతికినన్నాళ్ళూ ...." — అని కాళ్ళు బారజాపి కూర్చున్నాడు.

రాముడు ఏమీ తోచక .... సుగ్రీవుడి మంత్రు లందరిమీదనించీ దృష్టి అటూ ఇటూ తిప్పి, హనుమంతుడిమీద నిలిపి ప్రాధేయపడుతూ చూశాడు.

మంత్రులందరూ ధైర్యంచేసి సుగ్రీవుడిచుట్టూ చేరి — "మహా రాజా! శ్రీరాముడి మాటలన్నీ ధర్మ బద్ధంగానే వున్నాయి. ఆయన నీ మిత్రుడు. నీకు మేలు చేస్తాడేగానీ కీడు చేస్తాడా? .... మన కష్టాలు గట్టెక్కే సమయం వొచ్చింది. నువ్వు మళ్ళీ యుద్ధానికి పోక తప్పదు. జరిగిందంతా మర్చిపో ...." — అంటూ విన్నపాలు చేశారు.

సుగ్రీవుడు మొహం చిట్లించి — "మర్చిపోదును. ఈ ఎడం గూడో ....?" — అని విసుక్కున్నాడు.

మంత్రుల్ని విసుక్కున్నాడేగానీ.... సుగ్రీవుడికి కూడా ఆశగానే వుంది — ఈసారి వాలి నిజంగానే చచ్చిపోతాడేమోనని. కొంచెం ధైర్యం తెచ్చుకుని బయల్దేరితే — ఆ దుర్మార్గుడు ఈపూటే చచ్చిపోతే .... రాజ వైద్యులు .... ఈ గూడుకి వెచ్చగా.... కాపడాలూ .... మర్దనాలూ .... సింహాసనం .... కిరీటం .... కిష్కింధా రాజ్యం.... శాశ్వతంగా....

మూలుగుతూ లేవబోయాడు. నడుం కూడిరాలేదు. యుద్ధ వ్యథి వేకత కనబరిచింది. "నాతో రాకతప్పదు . హమ్మ....మ్మ....మ్మ "— అంటూ నడుం సాగదీశాడు. సుగ్రీవుడు లేవడానికి మంత్రులతోపాటు రాముడు కూడా వొక చెయ్యి వెయ్యబోయాడు.

"అమ్మ .... మ్మ .... ఎడంగూడు .... మీ దుంప లెగ!" — అని అయ్యమన్నాడు సుగ్రీవుడు. "ఎడం గూడుమీద చెయ్యి వెయ్యకండి సుమా! ... ప్రాణం జిలార్చుకు పోతోంది" — అంటూ లేచాడు.

సుగ్రీవుడి కాళ్ళు "మేం యుద్ధానికి రాం" అని మొరాయించాయి. సుగ్రీవుడు అటుగు ముందుకు వెయ్యబోతే, కాళ్ళు పక్కలికీ ...వెనక్కీ తప్పుకోబోయాయి. యుద్ధానికి కలిసిరాని కాళ్ళతో .... గూళ్ళతో .... సుగ్రీవుడు కాస్సేపు అడ్డదిడ్డంగా నడిచి, నడుం నిలబెట్టుకున్నాడు.

లక్ష్మణుడు పూలతీగ పట్టుకుని దగ్గిరికి వొచ్చాడు.

"పురుగులేవన్నా వున్నాయేమో చూశావా ? పట్టి చంపుతాయి"— లక్ష్మణుడు పళ్ళనూరి — నవ్వు మొహంతో — "పురుగులేమి లేవోయీ !" — అన్నాడు.

"మంచగుండ రెమ్మలేమైనా వున్నాయేమో చూడు. యుద్ధం మానేసి గోక్కోడంతో సరిపోతుంది నాపని" — అంటూ మెడ అప్పగించాడు. లక్ష్మణుడు చేతిలో పూలతీగ సుగ్రీవుడి మెడంతా చుట్టి గట్టిగా ముళ్ళు వేశాడు.

రాముడు సుగ్రీవుణ్ణి తేరిపార చూస్తూ — "ఆహా ! ... ఎంత అందంగా వున్నావోయీ సుగ్రీవా ! దేవతల్లో ఇంద్రుడిలాగు మెరిసిపోతున్నావు. ప్రళయకాలపు సూర్యుడిలాగే వెలిగిపోతున్నావు," — అంటూ చిరునవ్వు చిందించాడు.

"ఈ మాటల కేవలే గానీ ... ఈ సారన్నా.... నిజమేనా?"

"నా మాట నమ్మవోయీ సుగ్రీవా :.... నే నెప్పుడూ అబద్ధాలాడ.... నా మాట నామ్మ."

"నమ్మకతలే పనయ్యాక. ఇందాకటా చేసినవా :.... ఏంమకులే. నువ్వే చూస్తావుగా ? మా అన్న మన భాగోతమంతా కనిపెట్టేస్తాడు. ఇక నిన్ను బతికనిస్తా డనుకుంటున్నావా ?

రాముడు ఎవరి మొహంవేపూ దృష్టి పోనివ్వకుండా వృక్షాగ్రాల సౌందర్యం చూస్తున్నాడు.

లక్ష్మణుడికి సుగ్రీవుడి మీద ఎప్పటికప్పుడే కలబడాలన్నంత కోపం వొస్తోంది. — మూర్ఖుడు : అజ్ఞానంతో పుట్టుకొచ్చిన సాహసం: శ్రీరామచంద్రుడి కీర్తి ప్రతిష్టలేమి ఎరుగును?

సుగ్రీవుడు కుంటుతూ — కుంటు కుంటుకీ మూలుగుతూ — ఎవరన్నా కాలికీ చేతికీ తగిలితే — "మీ దుంప లెగ ! .... మీ జిమ్మ లాగ ! మీద మీదకొచ్చి పడతారేవర్రా ఎద్దుల్లాగ" — అని తిట్టిపోస్తూ అప్పటికో బారెడు దూరం నడిచాడు.

సీలుడు తాయడీ చెవి దొరికించుకుని— "ఇదేం పోల్చనడకా?.... యుద్ధం నడకా?" — అని విసుక్కున్నాడు.

"పాపం ఏం చేస్తాడులే. ఏ కీలు కా కీలు వూడదీసేశాడా చుర్మా ర్యడు."

"నాకు తెలవ కడుగుతానూ.... అసలు రాముడు బాణం ఎందు కెయ్యలేదంటావూ? ... పోల్చలే దంటాడేవిటీ? .... నిజమేనంటావా?"

"ఏమోలే. వీళ్ళిద్దర్నీ కొత్తచాళ్ళు పోల్చడం కష్టమేనేమో! .... ఇద్దరూ పొక్కలాగే వుండి ఏడుస్తారయ్యే!"

"నేన్నమ్మను సుమా! .... ఆ మాత్రం పోలిక దొరకదా? .... అసలు రాముడు వాలిని చూసి హడలిపోయి "ఇంత గొప్పవాడిమీద నా బాణం ఏం పనిచేస్తుందిలే" అనుకున్నాడేమో!"

"చ! ... పెద్ద పెద్ద చెట్లే బదలు గొట్టాడుగా?"

"నేన్నమ్మను సుమా! రాముడే బదలుగొట్టా డంటావా?"

"ఎందుకేగా .... చూసావని ఎంత లేపినా లేచావా?"

"అదుగో! ఆపవే నే నొప్పుకోను. నే ననలు చీమ చిటుక్కుమన్నా లేస్తాను. నా సంగతి నీకు తెలీదు. చిన్నప్పుడు మా అమ్మ ...."

"మీ అమ్మ చల్లగుండ! ఊరుకో. రాజు అసలే కోపంగా వున్నాడు."

"నేను నిద్రపోయినందుకు చాలా కోపం వొచ్చిందన్నావుగా? నన్నేం అడగలేదేం రాజు?"

"ఆడుగుతాళ్ళే. ఎప్పుడో తిక్కరేగుతుంది."

అప్పటికి సుగ్రీవుడు నెమ్మదిగా కొండ దిగాడు. హనుమంతుణ్ణి మాత్రమే కాస సాయం చేయనిస్తున్నాడు. రాముడు సుగ్రీవుణ్ణి మాటల్లోకి దించి కోపం పోగొట్టాలని చాలాసేపట్నించి చూస్తున్నాడు.

"అన్నట్టు సుగ్రీవా! .... రుష్యమూకం మీది ఏ కల వొస్తే, ఆ కల జరుగుతుందని పిన్నాను. నువ్వేమైనా కలలు గన్నావా?" — అని అడిగాడు.

"నా కెప్పుడన్నా నిద్రపట్టి ఛస్తేనా ?"

— వూరుకున్నాడు రాముడు.

"ఇందాక నీలుడు నిద్రపోయాడుగా ?.... ఏమన్నా కల వొచ్చిం దేమో !" — అన్నాడు నళుడు.

సుగ్రీవుడికి నీలుడి "నిద్ర నేరం" జ్ఞాపకం వొచ్చింది.

నీలుణ్ణి కోపంగా చూస్తూ — "అది సరేగానీ నువ్వు మంత్రివి కదా ? .... నిద్రపోవటం ఏంటీ ? .... నాకు చాలా కోపం వచ్చిందని మా మాట చెప్పాడా ?" — అని అడిగాడు.

నీలుడు కంగారుపడి — "చెప్పాడు మహారాజా !.... నే నసలు కళ్ళు మూశానే గానీ శ్రీరాముడు బాణం వెయ్యటం అదీ .... అంతా చూస్తూనే వున్నాను " — అని చేతులు నలిపాడు.

"అదంతా నాకు చెప్పకు. తప్పు వొప్పేసుకో. ఇంకో మహా రాజైతే పరిక్షి వేయించేవాడు. తెలుసా ?...."

"చిత్తం ! .... నిద్రపోయి తప్పేచేశాను మహారాజా !"

"తప్పు వొప్పుకుంటే చాలదయ్యా !.... ఇంకెప్పుడూ చెయ్య కుండా వుండాలి."

"చిత్తం ! ఇంకెప్పుడూ నిద్రపోయి తప్పు చెయ్యను మహారాజా !"

నళుడు హనుమంతుడి చెవిలో — "అసలు రాజు పనల్నెప్పుడూ నిద్రే పోవద్దంటాడా ?" — అని సందేహించాడు.

"ఎప్పుడూ కాదనుకుంటాం. తర్వాత అడుగుదాంలే. ఇప్పుడు కోపంగా వున్నాడు."

"ఎప్పటిదాకా వుంటాడు కోపంగా ?"

"ఏమో ! నాకేం తెలుసు ? వాలి చచ్చిపోయేదాకానేమో."

సుగ్రీవుడు నీలుణ్ణి — "నిద్రపోతే పోయావు గానీ .... కలన్నా వొచ్చిందా ?" — అని కోపంగా చూశాడు.

"ఆఁ.... వొచ్చినట్టేవుంది.... మహారాజా !"

"వొచ్చిందా ?.... మరి చెప్పవేం ?.... చెప్పు దబ్బున...."

"పునఃసుందరం పెద్ద అడవిలో వున్నామంట ..."

"ఇప్పుడున్నాంగా ?"

"అబ్బే ! ఇంకా పెద్ద అడవిలో .. "

"ఏడిసినట్టేవుంది.... ఇంకెంత పెద్ద అడివి ! సర్లే ! అప్పుడేవైంది ? "

"ఏవైందా ?.... సరిగ్గా ... ఏవైందో.... పెద్ద చప్పుడైంది.... నా నిద్రంతా పాడయింది "

"ఇదన్నమాట నువ్వు నిద్రపోయి చేసిన నిర్వాకం ! ఇంకో రాజయితే నీ కొచ్చిన వెధవ కలకి తల తీయించేసేవాడు .... అమ్మ .... అమ్మ .... ఈ మోకాలు చిప్ప ...."

"నెమ్మదిగా నెడువు సుగ్రీవా ! తొందరేముంది ? ఈ చుట్టుపట్ల సౌందర్యాలు చూసుకుంటూ నెమ్మదిగానే పోవచ్చును" — అంటూ రాముడు సుగ్రీవుణ్ణి అనునయిస్తూ, సుగ్రీవుడి సరసనే జాగ్రత్తగా అతని భుజానికి తగలకుండా నడుస్తున్నాడు.

కొంతదూరాన దట్టమైన చెట్టతోపు కనబడింది. దానిచుటూ అరిటి చెట్లే ఎక్కువగా వున్నాయి.

రాముడు ఆ చెట్లతోపుని ఆశ్చర్యంగా చూస్తూ — "సుగ్రీవా ! మొదటిసారి మనం తొంచరలో వెళ్ళడంచేత .... ఈ సౌందర్యమంతా చూడనేలేదు సుమా ! .... ఈ చెట్ల తోపులు....ఆహా ! .... ఆకాశంలో మేఘాలమల్లే ప్రకాశిస్తున్నాయి. ఈ పక్షులు నక్షత్రాలమల్లే మెరిసిపోతున్నాయి. ఈ అరిటిచెట్ల వృత్తాంతం ఏమిటో చెప్పవోయీ !" — అని చిరునవ్వుతో అడిగాడు.

"అరిటిచెట్లకేం వృత్తాంతం వుంటుందయ్యా స్వామీ ! నా బొంద వృత్తాంతం ! .... అడివిలో మొక్క మొలవటానికో వృత్తాంతం కూడానా ? ... అమ్మ .... ఈ ఎడం గూడు కూడి రాదనుకుంటాను. రాజ్యమూలేదు, వల్లకాడూ లేదు. రెక్క పోయింది."

లక్ష్మణుడు — ఆ ఎడంగూడు కాస్సేపు నవ్వరదీస్తే, సుగ్రీవుడికి కోపం తగ్గుతుందనుకున్నాడుగానీ, భుజం ముట్టుకుంటే ఖయ్యిమంటూ ఉడని వూరుకున్నాడు.

సుగ్రీవుడికి ఆ ఆరిటివెట్ట బొంద వృత్తాంతం అంతా జ్ఞాపకం వొచ్చి .... కొంచెం భీతితో గుండెలు పడపడ కొట్టుకున్నాయి. కొస్సెపు మూలుగులు తగ్గించి — "రామా ! ... ఇందాక ఏదో అనేశాంలేగానీ, గూడు నొప్పి మూలాన్న నోరు తడబడిందిలే గాని .... ఈ వనం పూర్వం గొప్ప రుషుల ఆశ్రమం సుమా ! సప్త జనులనీ ఏడుగురు రుషు లుండేవారంట ఇక్కడ. వాళ్ళు .... గొప్పో గొప్ప తపస్సులు చేసి .... అబ్బో ! .... ఎప్పుడూ నీళ్ళల్లో తలయి ముంచుకుని పదుకునే వారంట. ఇంకా ఏంటోనమ్మా ! .... చాలా కబుర్లు చెప్పేవాడు మా తాత ...." — అని ఆగాడు.

నళుడు వుత్సాహంగా అందుకున్నాడు — "అవును. మా తాత కూడా చెప్పేవాడు. సప్తరుషులు ఏడురోజులికి వొక్కసారే గాలి పీల్చు కునే వారంట ...."

"ఇంకా నయం. ఏడుగురికీ వొక్కరే పీల్చుకుంటే బాగుండే దిగా !" అన్నాడు వెటకారంగా నీలుడు.

"ఏవిటి ? నువ్వు నమ్మవా ? మా తాత చెప్తే ...."

"నేన్నమ్మను సుమా ! వొక్కసారి గాలి పీల్చి, ఏడు రోజు లెలా బతుకుతారు ? .... మీ తాత మొహంలాగే వుంది. వెధవ అబద్ధాలు ...."

"షష్ఠ రాలగొడతాను మా తాత నేవన్నా అన్నావంటే .... ఏడు రోజులు కాదు. ఏడువందల సంవత్సరాలు బతికారు. తెలుసా ?"

"ఏడు వందలా ?" సుగ్రీవుడు సందేహంలో పడ్డాడు — "మా తాత షష్ఠాలుగు వందలన్నాడే !"

"చిత్తం ! మహారాజుగారి తాతనే నమ్మండాం లెండి. మహారాజా ! మా తాత పెద్దవాడైపోయి .... చగ్గూ, మతిమరుపూ అన్నీ పట్టు కున్నాయి ...."

"మహారాజు తాతనయినా సరే నమ్మను నేను. వొక్కపూట గాలి పీల్చకుండా బతకండి. చూస్తాను" — అని నీలుడు మొండి చూపు భూశాడు.

"వోరి నన్యాసీ ! .... నీ సంగతీ .... నా సంగతీ కాదురా ! .... వాళ్ళు గొప్ప రుషులు ! .... మహా రుషులు ! నప్త రుషులు !"

నీలుడు బిత్తరపోయి — "అవును సుమా !" — అని నాలి క్కరుచుకున్నాడు. — "అయ్యయ్యో ! రుషులని మర్చిపోయానే !.... ఏదో పరాగ్గా .... పదమూలు వాళ్ళ సంగతేమో అనుకున్నాను. .... అయ్యయ్యో ! .... రుషులు గదా ? ఎంత పనైందీ ?" — అని పశ్చాత్తాపంలో మునిగిపోయాడు.

నళుడు వొకటే చిటచిట్లాడుతున్నాడు.

"అబద్ధాలంట ! అబద్ధాలు ! .... అసలు మా వంశంలో ఇప్పటికి ఎవ్వరూ వొక్క అబద్ధవన్నా ఆడలేదు. తెలుసా ?... మా తాత...."

కిక్కురుమనకోక పోతున్నాడు నీలుడు.

రాముడు మొహం పక్కకి తిప్పుకుని చిట్లించుకున్నాడు. — లోకంలో అబద్ధాలాడని వంశాలు రఘువంశం తప్ప ఇంకేం వుంటాయి ! .... వుత్తది. మూర్ఖులు ! .... అటవికులు !

సుగ్రీవుడు మళ్ళీ కథ కొస్తూ — "అదన్నమాట ! అంత గొప్ప రుషులు .... ఇక్కడ వందలకొద్దీ సంవత్సరాలు బతికి, శరీరాలతోటే స్వర్గాని కెళ్ళిపోయారు. అప్పటినించీ ఈ ఆశ్రమం అంతా చెట్లు పెరిగి, కోటలాగ అయిపోయింది. దేవతలు కూడా ఇందులో దూరలేరు తెలుసా ? తపస్సు చేసుకునే వాళ్ళకి మాత్రం పళ్ళూ గిళ్ళూ — దుంపలూ గింపలూ — గడ్డీ గాదం — కావలసినంత దొరుకుతాయి" — అంటూ చెట్లవేపు తిరిగి — "అమ్మ — ఈ ఎడం చెయ్యి కలిసిరాకుండా వుంది" — అంటూ ఎలాగో చేతులు కలిపి నమస్కారం పెట్టాడు.

ఆ చెట్ల తోపులో రుషులు జీవించారని వింటే, రాముడికి శరీరం పులకరించింది. భక్తితో అరిటి చెట్లకి నమస్కారం చేస్తూ — "నప్త

ఋషులారా! నా కార్యం నిర్విఘ్నంగా జరిగిపోవాలని ఆశీర్వదించండి" — అని ప్రార్థించాడు. *

సప్తఋషుల వనం నించి కిష్కింధవేపు నడిచాడు. వీరు దగ్గర పడుతోన్నకొద్దీ సుగ్రీవుడి నడక ఇంకా మందగించింది.

---

* 13 వ సర్గ అంతా.

రాముడూ, సుగ్రీవుడూ, అతని మంత్రులూ అంతా వాలిని చంపడానికి రెండోసారి వెళ్ళేప్పుడే దారిలో గొప్ప గొప్ప వనాలూ, సరస్సులూ, తరులూ, గిరులూ, చూస్తారు. మొదటిసారి వెళ్ళినప్పుడు కూడా కిష్కింధకు ఆ మార్గంలోనే వెళ్ళారు. అయినా అప్పుడేమీ వర్ణించలేదు కవి. "రెండోసారి మళ్ళీ రావలసి వస్తుంది కాబట్టి అప్పుడు వర్ణిద్దాం." — అని వూరుకున్నాడు.

కవి మొదటిసారే ఆ ఋషుల ఆశ్రమాన్ని వర్ణిస్తే ఉండేదంతా. రాముడు తన కార్యం నెరవేర్చమని ఋషుల్ని ప్రార్థిస్తాడు గదా! (అదే. అందరి చేతనీ.) ఋషుల్ని ప్రార్థించి బయల్దేరిన తర్వాత మార్గం కార్యం జరక్కపోతే బాగుండదు గదా? — పోనీ మొదటిసారే రాముడు వాలిని చంపేసినట్లు రాయవొచ్చును గదా? — కానీ, అలా రాయడం కవి కిష్టంలేదు. ఎందుకంటే — సుగ్రీవుణ్ణి రెండుసార్లు గమనించాలని కాదు. — "వొకేరకం పోలికలున్న వాళ్ళిద్దరూ పోట్లాడుతూ వుండే ఏపర్ని చంపాలో తెలీక తికమక పడే ఘట్టం వర్ణించాలనే వుత్సాహమో, ఆ ఘట్టంలో "నాటకీయత" నీ వొదులుకోవడం కవికి ఇష్టం లేదు. కేవలం ఈ కారణంకోసం గాకపోతే రాముడు వాలిని మొదట్లో చంపలేక పోయినట్లు రాయవలసిన అవసరం ఏమీ లేదు. రాముడు సాక్షాత్తూ విష్ణువనీ, అప్పటికి చాలా ఘనకార్యాలు చేశాడనీ, కొంచంకి మోక్షాలు ఇచ్చాడనీ కవి చెబుతోనే వున్నాడు. అలాంటి రాముడు ఎవరు మనుష్యుల బుద్ధో, జంతువుల మధ్యో తేడా కనుక్కోలేక పోయాడనడం — రాముడికీ, రాముణ్ణి వెనకేసుకొచ్చే కవికీ సిగ్గు చేటే. వాళ్ళిద్దరూ ఎప్పుడో వొదిలేశారనుకోండి సిగ్గూ.

"రామా : ఈసారి తప్పకుండా .... ఆ బాణం ...."

"నన్ను నమ్ము సుగ్రీవా !.... ఇంద్రుడి వజ్రాయుధం కన్నా వాడి అయింది సుమా నా బాణం ."

"ఒబ్బ ! వాడి అయిందేనయ్యా ! ..... ఒసలు దాన్ని వొదిలితేనా ?"

"ఎందుకు వొదలనూ ? ఈసారి నిన్ను పోల్చగలనుకదా ?"

"పరే ! . అందుకే చెబుతున్నాను. ఒసలు వాలి అంత మూరాన్న వుండగానే బాణం కొట్టెయ్యి. ఏం ?"

"అలాగే చేస్తాను. చూస్తాపుగా నువ్వే."

"ఏం చూస్తానో ! .... వాలి నిన్నూ .... ననూ ...."

"సుగ్రీవా ! ఇన్ని మాట లెందుకు ? ఈసారి చంపకపోతే అప్పుడే నిందించ వచ్చును నన్ను." *

"ఏమిటీ ? ఇదొకటా ?" — అంటూ తెల్ల బోయాడు సుగ్రీవుడు — "నిన్ను నిందించటానికి ఇక నేనెక్క డుంటాను ? అదేదో ఇప్పుడే తేల్చు" — అని చతికిల బడ్డాడు.

"అబ్బెబ్బెబ్బెబ్బె ! సుగ్రీవా ! నా మాట విను. ఏదో మాట వరస కన్నాను"— అంటూ రాముడు కంగారుపడి, సుగ్రీవుణ్ణి లేవదీసే ప్రయత్నం చెయ్యబోతే, సుగ్రీవుడు చేతుల్లోంచి కిందికి జారాడు. మళ్ళీ ఎత్తబోతే మళ్ళీ జారాడు.

---

* 14 వ సరలో — 12 వ శ్లోకం.

సుగ్రీవుడు రెండోసారి యుద్ధానికి బయల్దేరి, కిష్కింధకి వెళ్ళడానికి భయపడుతోంటే — రాముడు — "వాలి జీవించి, తిరిగిపోయినట్టు లయితే....అపుడు నన్ను దోషియని నీవు తెలుసుకుని, పిమ్మట నిందించవొచ్చును" — అంటున్నాడు తీరిగా. రెండోసారయినా చంపుతాడో లేదో నమ్మకంలేదు. వాలిని రెండోసారి కూడా చంపలేకపోతే అప్పుడు "నిందించవొచ్చు"నట. ఈసారి కూడా అలా జరిగితే వాలి చేతుల్లో సుగ్రీవుడి పనీ, రాముడి పనీ అయిపోయినట్టే.

"సుగ్రీవా ! మళ్ళీ ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా మాట విశ్వసించు. నే నెన్నడూ అసత్యమా....డను సుమా ! ఎంత ప్రమాదం సంభవించినా సరే ధర్మలోపం జరుగుతుందని అసత్యమాడను. లేవోయీ! లేచి పీరోచితంగా నీ శత్రువుని యుద్ధానికి పిలువు. ఈ కిష్కింధా రాజ్యమంతా నీదే! ఒక్క క్షణకాలంలో నువ్వు సింహాసనం ఎక్కబోతున్నావు. పురోహితులు ధగధగ మెరిసే కిరీటం నీ శిరస్సుమీద అలంకరిస్తారు. ఎందరో సుందరాంగనలు .... నీ చుట్టూ.... నీ సేవలో ...."

సుగ్రీవుడి కాళ్ళలోకీ, చేతుల్లోకీ కొత్త శక్తి జొరబడింది. ముసిముసి నవ్వులు నవ్వుతూ లేచాడు.

• • •

"ఓరీ దుష్టుడా ! వాలీ :.... నాతో యుద్ధానికి రారా ! ఈసారి పచ్చి చూడు ఏం జరుగుతుందో ! .... రా : బయటికి రా !"

"మళ్ళీ వొచ్చాడా ?" — వాలి దిగున లేచాడు. అంతఃపురంలో స్త్రీలంతా మళ్ళీ సుగ్రీవుడి యుద్ధనాదాలు విని ఆశ్చర్యపోయారు.

"రారా యుద్ధానికీ : .. వొక్కసారి ఏదో ఘనకార్యం చేశానని స్త్రీలతో గొప్పలు చెప్పుకుంటూ కూర్చున్నావా ? ఈ సారి రా బయటికి. నీ అంతు చూస్తాను."

వాలి పిడికిళ్ళు బిగించాడు. కళ్ళు ఎరుపెక్కి నిప్పు లయ్యాయి. వొక్క క్షణం కూడా ఆగలేక — "ఓరీ పిరికిపందా ! నీతో ఆట కూడా యుద్ధమేనా ?" — అంటూ బయల్దేరాడు.

తార ఆందోళన పడుతూ భర్త ఆలింగనం చేసుకుంది — "పీనుడా ! ఒక్క క్షణం నిలబడు. తొందరపడకు. ఇంతకుముందే నీతో చావుదెబ్బలు తిని పారిపోయినవాడు .... మళ్ళీ యుద్ధం కోరి వొచ్చాడంటే కారణమేమై వుంటుందో వొక్కసారి ఆలోచించు. నాకు

మాత్రం చాలా సందేహం తోస్తోంది. సుగ్రీవుడి దర్పానికి ఏదో బల వత్తరమైన కారణం వుండి తీరాలి .... అదుగో : ఆ సింహనాదాలు విను. జయం తనదేనని ఎంత విశ్వాసం అతనికి : ఎవరినో గొప్ప వీరుణ్ణి తనకు సహాయంగా తెచ్చుకుని వుండాలి సుగ్రీవుడు...."

"గొప్ప వీరుడా ? ఎవరా గొప్ప వీరుడు ?"— అవమాన పడటం చూశాడు వాలి— "ఎవర్ని తెచ్చుకుంటే నాకేం ? నా శౌర్యాన్ని శంకిస్తున్నావా ?.... ఇంకో వీరుడికి జంకి.... పిరికివందనై ఓటమి అంగీకరిస్తానా ?.... విడిచిపెట్టు. వెళ్ళనియ్యి నన్ను తొందరగా...."

"రావేమిరా వాలీ ?.... పౌరుషం లేదా ? ఈ దెబ్బతో కిష్కింధ ఎవరిదో తేలిపోతుందిలా : ఈ సారి యుద్ధం చేసి సింహాసనం దక్కించుకోరా దుష్టుడా :"

"అవును. దక్కించుకుంటాను. ఈ సారి కిష్కింధ ఎవరిదో తేల్చేస్తాను. వొస్తున్నాను ఆగరా : నీ పద పణచి నిన్ను యమసదనానికి పంపిస్తాను." — అంటూ వాలి కోపోద్రేకంతో తారని పక్కకి తోశాడు.

తార కన్నీళ్ళతో వాలి చేతులు వొదలకుండా — "మన్నించు. నాపైన ఆగ్రహించకు. ఇప్పుడు వెళ్ళవొద్దు." అంగదుడు చారులద్వారా విని నా కంతా చెప్పాడు. సుగ్రీవుడి సింహనాదాలు వ్యర్థ ప్రలాపాలు కావు. అతడి వెనక శ్రీరాముడనే కోసలరాజు అండగా వున్నాడు. ఆయన గొప్ప వీరుడట. ఆయుధాలు ధరిస్తాడట. ధర్మాత్ముడట .... గొప్ప కీర్తి గలవాడట...."

వాలి నిర్లక్ష్యంగా నవ్వాడు — "వీరుడంటున్నావు. ధర్మాత్ముడంటున్నావు. వీరుడైన వాడు శత్రుత్వం లేనివాడితో యుద్ధం చేస్తాడా ? ధర్మజ్ఞానం తెలిసినవాడు నిర్దోషికి హాని కలిగిస్తాడా ? ... తారా !.... అంతా నీ భ్రమ. నన్ను వెళ్ళనియ్యి," — అని చేతులు వొదిలించుకున్నాడు.

"నాథా : నా మాటలు పూర్తిగా విను. రాముడూ, సుగ్రీవుడూ వొకరినొకరు సహాయం చేసుకోవాలని అగ్నిసాక్షిగా స్నేహం చేసు

కున్నారట. రాముడు సుగ్రీవుడిదే న్యాయం అని నిర్ణయించి, అతడికే సహాయం చేసానని ప్రతిజ్ఞ చేశాడట."—

వాలి వుగ్రుడయ్యాడు— "అదే నిజమైతే రాముడు కూడా నాకు శత్రువే. అప్పుడైనా నేను యుద్ధానికి పోక తప్పదు."

"కానీ.... రాముడి బలం తెలుసుకోకుండా ఇంత తొందరపడి నువ్వు వొంటరిగా యుద్ధానికి పోవడం వివేకం కాదు. ఆడదాన్ని చెప్పన్నానని అలక్ష్యం చెయ్యకు. నీ తమ్ముడితో విరోధం నీ కెన్నడూ క్షేమం కాదు. మీ రిద్దరూ సఖ్యంగా వుండడమే ఎంతో బలం నీకు. వెంటనే అతణ్ణి పిలిపించి యువరాజుగా పట్టాభిషేకం చెయ్యి. అప్పుడు రాముడితో నీకు వైరం వుండదు. నీ తమ్ముడిమీద ద్వేషం మర్చిపో. నీ సోదరుణ్ణి నువ్వు మన్నించాలి. ప్రేమించి ఆదరించాలి."

వాలి తారని ఆశ్చర్యపడుతూ చూశాడు — "నేను సుగ్రీవుణ్ణి ప్రేమించలేదా ? అన్యాయంగానే రాజ్యంనించి వెళ్ళగొట్టానా?"

"జరిగించడం తా మర్చిపో. అతడు ఎన్ని తప్పులు చేసినా నీ కన్నా చిన్నవాడే. నీ తోడబుటిన వాడే. నీ తమ్ముణ్ణి సంతోషపెట్టి, నీకు విశ్వాస పాత్రుడిగా, మిత్రుడిగా చేసుకోవటం తెలివైన పని. నేను నీ హితం కోరేదాన్ననే విశ్వాసం నీకుంటే నా మాట పాటించు నీ క్షేమంకోసం అంతకన్నా ఇంకో మార్గం లేదు. ఆయుధాలు గల కోనల రాజుతో వైరం వొద్దు నీకు...."

"రావేమిరా పిరికిపంద !.... యుద్ధం చెయ్యకుండానే సింహాసనం వొదిలేస్తావా ? .... వోడిపోయానని వొప్పేసుకో. నిన్నేమీ చెయ్యను. తొందరగా తేల్చు."

"వింటున్నావా ఆ కారుకూతలు? .... రాముడికి జడిసి ఈ నీచుడితో సఖ్యం చేసుకోనా : ఎన్నటికీ చెయ్యను. శత్రువు నా కోటముందు నిలబడి తొడలు చరిచి వీరాలాపాలు చేస్తోంటే వింటూ సహించమంటావా? .... ఆ పిరికిపంద యుద్ధ సంరంభం నాకు తెలియనిదా ? ఎన్నడూ, ఎవరికీ తలవొంచని నేను ఈ అవమానం సహించి ఛూరు కోవటం మృత్యువుకన్నా భయంకరం కాదా ?

"తారా ! నామీద అమితమైన ప్రేమతో, స్నేహంతో, నీ అభిప్రాయం నువ్వు చెప్పావు. కానీ, నీ మాట పాటించలేను. సుగ్రీవుడి దుర్మార్గం నేనిక సహించను. ఆ రాముడేదో చేస్తాడని నా గురించి భయపడకు. అతడు నన్నేమీ చెయ్యడు. ఇక నా వేంట రాకు .... వెళ్ళు. సుగ్రీవుడి యుద్ధోన్మాదం అణచి నే నిప్పుడే వొస్తాను. వాడిని చంపను. గుద్దుల వరంతో సత్కరించి విడిచిపెడతాను. సరేనా ? దుఃఖపడకు " అని బయల్దేరి వెళ్ళాలనే తొందరలో తారవేపు కొంచెం నవ్వు మొహంతో ప్రియంగా చూశాడు.

తార దుఃఖంతో కంపిస్తూ భరని ఆలింగనం చేసుకుంది. — "ప్రియుడా ! నీ పరాజయం నేను సహించలేను. నువ్వు విజయుడవై రావాలని దేవాన్ని ప్రార్థిస్తాను. మళ్ళీ మనం కలసుకునే శుభ క్షణాల కోసం నిరీక్షిస్తాను. — పోయిరా !" — అని కంపిస్తూ చేతులు తీసి విడిచిపెట్టింది.

వాలి సందించి విడిచిన బాణంలే దూసుకుపోయాడు. *

వాళ్ళిద్దరూ కలబడ్డారు — అరుస్తున్నారు.
వాలి — కోపావేశంతో.
సుగ్రీవుడు — బాధావేశంతో.

---

* 16 వ సర్గలో — 5 వ శ్లోకం, 7, 8

వాలి తారతో — "నా విషయమై రాముడేమైనను చేయునని నీవు దుఃఖించవలదు. ఏలననగా ధర్మజ్ఞుడగు రాముడు నిరపరాధిని వధించునటి పాపము చేయునా ?.... యుద్ధములో సుగ్రీవుని చంపను. అతని అహంకారము నణచెదను. గుద్దులతో సత్కరించి పంపెదను," — అంటున్నాడు.

వాలి ధర్మ యుద్ధానికి కట్టుబడ్డవాడు. ఎవ్వరూ అధర్మ యుద్ధాలు చెయ్యరని అతని అభిప్రాయం.

"ఇందాక తిన్న గుద్దులు చాలలేదా తమ్ముడా నీకు ?— అంటూ వాలి సుగ్రీవుడి వీపు మధ్య గుద్దుల వాన ప్రారంభించాడు. సుగ్రీవుడి నాభిలోంచి రక్త జలపాతం వురికింది. కళ్ళు గిరగిర తిరిగి పైకిపోయి చుక్కలంటాయి. ఎక్కడా రామబాణం జాడలేదు. "చక్కగా పూల తీగల్తో ముస్తాబు కూడా చేసుకువొచ్చావ్; అలా దిక్కులు చూస్తావెందుకురా తమ్ముడా ; .... ఇవిగో అప్పచ్చులు. చక్కగా తిను. వీపు పట్టి నన్ని తిను. కిష్కింధ ఎవరిదో తేల్చి చెప్పు — నోటికొచ్చిన కూతలన్నీ కూశావు గదురా తమ్ముడా ;.... ఇప్పుడు చెయ్యి మరి యుద్ధం;" — అంటూ వాలి సుగ్రీవుడి పూలహారాలన్నీ తెంపి అవతల పారేశాడు.

సుగ్రీవుడి ఆక్రనాచాలతో చుట్టుపట్ల పక్షులూ, జంతువులూ భీతావహంగా పరుగులు తీస్తున్నాయి.

సుగ్రీవుడికి రామబాణంమీద పూర్తిగానమ్మకం పోయింది. వాలి చేతులు తప్పించుకోవడం కూడా అసాధ్యంగా వుంది. తిరగబడకపోతే ప్రాణంనిలిచే దారి తోచలేదు. రాముడిమీద భయంకరమైన కోపం పొంగింది.వాలిమీద తిరగబడి— శక్తికొద్దీ తన్నీ, గుద్దీ, పొడిచీ, చరిచీ, కరిచీ,అరిచీ, గెలిచే విధంకోసం పెనుగులాట ప్రారంభించాడు. సుగ్రీవుడి పరాక్రమం వాలికే విభ్రాంతి కలిగించింది. సుగ్రీవుడు పళ్ళబిగువున కూడదీసుకున్న శక్తి అంతా గుమ్మరించేసి, ఫెళ్ళున కుడిగూడు కూడా విరిగి కెవ్వున మృత్యునాదం చేశాడు.

సుగ్రీవుడు ప్రాణ భయంతో కృంగిపోతోండగా — చెట్లచాటు నించి బాణం వొకటి గాలిని చీలుస్తూ, భయంకరమైన శబ్దంతో రయ్యిన వొచ్చి వాలి గుండెల్లో దిగబడిపోయింది. పర్వతం ఎగిరి వొచ్చి గుండెలమీద కురికినట్లు వాలి నిర్ఘాంతపోతూ భూమిమీద కూలాడు.

సుగ్రీవుడు ఆనందంతో మూర్ఛపోయాడు. రెప్పపాటు కాలంలో — కిష్కింధా నగరం అంతా అక్కడ ప్రత్యక్షమైంది. కిష్కింధ ప్రజల్లో రాముణ్ణి చంపెయ్యాలనే వుద్రేకం బుసబుస పొంగింది. దానికి

అవకాశం లేకుండా సుగ్రీవుడి బలగం విజయోత్సాహంతో ముందు కురికింది.

బలా బలాల మధ్య — వీరత్వం విశ్రాంతికోసం శయనించింది. వాలి — ఏ క్షణాన్నయినా దిగ్గున లేస్తాడనిపించేంత శక్తివంతంగా — సజీవంగా — కఠోరంగా చుట్టూ చూస్తున్నాడు — ఆ సీచుడికోసం ; శ్రీరాముడి కోసం ;

సుగ్రీవుడు మూర్ఛలోంచి తేరి — వక్షం మడుగులో దొర్లుతోన్న వాలిని చూసి ఆనందంతో మళ్ళీ మూర్ఛపోయాడు.

రాముడు చెట్టచాటునించి వీరోచితంగా బయటి కొచ్చాడు. వాలి కన్నుమూసి వుంటాడనే గాఢ నమ్మకంతో. వాలి దగ్గిరికి నడిచి నిప్పు కణికలై వున్న వాలి కళ్ళల్లో బిందీ అయిపోయాడు.

ఆత్మనీ, దేహాన్నీ, వుద్రేక పరుస్తోన్న క్రోధంతో వాలి రాముణ్ణి — "నువ్వేనా శ్రీరాముడివి ? .. సత్యగుణ సంపన్నుడివి ? . లోక ప్రఖ్యాతుడివి ?" — అంటూ తీక్షణంగా చూశాడు.

—"ఇంకొకరితో యుద్ధం చేస్తోన్న నన్ను చాటునించి కొట్టి గొప్ప గౌరవం పొందావు సుమా ! ధర్మాత్ముడివట !.... జ్ఞానివట !.... నీ 'కీర్తంతా' ఈ రకంగా సంపాదించుకున్నదేనా ? రాజు అయినవాడు ప్రత్యక్ష పరాక్రమం చూపిస్తాడు గానీ, పిరికితనం ప్రదర్శిస్తాడా ? దోషిని వొదిలి నిర్దోషిని దండిస్తాడా ? కడుపులో ఇంత కపటం పెట్టుకుని ! పైకి మాత్రం ఈ సాధువేషం ! ఎందుకు?

నీ గురించి నాకు ముందే తెలిసినప్పటికీ, పెద్దకులం వాడివి .... చదువు సంధ్య లెరిగిన వాడివి ఇంత నీచకార్యం చెయ్యవనే విశ్వాసంతో యుద్ధాని కొచ్చాను. నీ కులం గొప్ప ఏవిటో — నీ ధర్మజ్ఞానం ఏవిటో — నీ అసలు రూపం ఏవిటో నా కిప్పుడు తెలిసింది. నేను సర్వనాశనం అయిపోయిం తర్వాత తెలిసింది. నా పెద్ద భార్య ఎంతో విపేకంతో చెప్పిన మాటలన్నీ పెడచెవిని పెట్టి నీవంటి నీచుడి చేతిలో పరాభవం పొందాను...."

చుట్టూ జేరిన ప్రజలందరి ముందూ వాలి వొక్కొక్కమాట అడుగుతోంటే రాముడి తల భూమిలోకి దించుకు పోతోంది. అనలు వాలిని ఎదుర్కొవలసిన పరిస్థితి వొస్తుంచని రాముడు వూహించనే లేదు. తన బాణం దెబ్బ తగిలీ తగ్గలగానే వాలి కన్నుమూస్తా డనుకుంటే .... తీరా.... ఇలా జరిగింది.

"ఈ అడవుల్లో మా బతుకులు మేము బతుకుతోంటే నువ్వెక్కడో కోసలదేశంనించి వొచ్చి నన్ను చంపవలసినంత అగత్యమేమి కలిగింది? ఎన్నడైనా నీకో, నీ బంధు మిత్రులకో గోరెడు అపకారం చేశానా నేను? దుర్మార్గుడా! నాలాంటి నిర్దోషిని చంపి, లోకానికేం సమాధానం చెప్పుకుంటావు?"

రాముడు ధైర్యం కూడగట్టుకుని కళ్లెర్రజేసి — వాలిని కఠినంగా చూశాడు — "మూర్ఖుడా! నువ్వెంతమాత్రం నిర్దోషివి కావు. దోషివే. ధర్మార్థ, కామ స్వరూపమూ, లౌకిక శిష్టాచారమూ తెలుసుకోలేక నన్ను నిందిస్తున్నావు. ధర్మం ఎరిగినవాడు తన్ను తమ్ముల్నీ, శిష్యుల్నీ కూడా కన్నబిడ్డలుగా చూసుకోవాలి. — నువ్వు చేసిందేమిటి? ... ధర్మం అతిక్రమించి సోదరుడి భార్యతో భోగిస్తున్నావ్! — ఇవి నీ దోషాలు కావా? .... అందుకే నిన్ను నా కరకు బాణాల కెరజేశాను. గ్రహించావా?"

వాలి పుగ్రుడయ్యాడు — "నా తప్పొప్పులు నిర్ణయించి, నన్ను చంపే అధికారం నీ కెవరిచ్చారు?"

రాముడు చిరునవ్వుతో గంభీరంగా చూశాడు — "వానరుడా! ఈ భూమి అంతా ఇక్ష్వాకు రాజులదే. ఈ కొండలూ, అడవులూ, నదులూ, సముద్రాలూ, సమస్త ప్రదేశాలూ వారివే. సృష్టిలో సమస్త జీవుల్నీ, పక్షుల్నీ, మృగాల్నీ, మానవుల్నీ అనుగ్రహించినా, ఆగ్రహించినా వారి సర్వాధికారమే. ఆ వంశస్థుడయిన భరతుడు ఇప్పుడు భూమి అంతా పరిపాలిస్తున్నాడు. ఎవరు ధర్మం తప్పినా శిక్షిస్తున్నాడు. భరతుడి ఆజ్ఞ పల్లనే నేనూ, మరికొందరు రాజులూ, ధర్మ స్థాపనకోసం భూ

సంచారం చేస్తున్నాము. పక్షులు గానీ, జంతువులుగానీ, మానవులుగానీ. ఎవరు ధర్మ వ్యతిరేకంగా ప్రవర్తిస్తే, వాళ్ళని దండించడమే మా పని. గొప్ప క్షత్రియ కులంలో పుట్టినవాణ్ణి నేను. ఈ భూమండలం మీద ఎక్కడా అధర్మం జరగనివ్వను. కన్న కూతురుతో — తోబుట్టువుతో — సోదరుని భార్యతో భోగించేవాణ్ణి శిక్షించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ధర్మాధర్మాలు నిర్దేశించే "మను ధర్మ శాస్త్రాన్ని" ధర్మం తెలిసిన వారంతా అంగీకరించారు. ఆ శాస్త్రంలో రాసిన విధంగానే నేను చేశాను. నేనూ శాస్త్రానికి కట్టుబడవలసిన వాడినే. స్వతంత్రుణ్ణీ కాను. లోకాచారాలు ధిక్కరించిన నీకు మరణశిక్ష విధించడంకన్నా వేరే మార్గం లేదు."

వాలికి — వుద్రేకంతో గుండెలు బరువెక్కుతున్నాయి. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి.

రాముడి మాటలు సుగ్రీవుడికి కూడా ఆందోళన కలిగిస్తున్నాయి— స్నేహంగా వుంటానని వొచ్చి, సహాయం చెయ్యమని దేవుళ్ళాడి, ఇప్పుడు — "నేనే రాజుని. అంతా నాదే పెత్తనం" — అంటాడేవిటి? ఇవ్వాళ వాలి అయ్యాడు. రేపు తనే అవుతాడు. ఎవరయినా ఇంతేనా?— "నువ్వు నా ఇష్ట ప్రకారం వుండాలి. లేకపోతే నిన్ను నరకడమే నా ధర్మం" అంటాడా? "ఇదేం ప్రారబ్ధం? ముల్లు తీసి కొర్రు దింపుకున్నట్టున్నాను." —

వాలి రామిణ్ణి తీక్షణంగా చూస్తున్నాడు — "లోకాని కంతటికీ నువ్వే సర్వాధికారివీ అయితే, నేరస్తుల్ని దండించే హక్కులన్నీ నీకే వుంటే, పిరికిపందలాగా చెట్టు చాటున దాక్కున్నా వెందుకు? వీరోచితంగా నా ఎదుటకొచ్చి—"ఇదుగో! నువ్వు ఇన్ని తప్పులు చేశావు. నీకీ శిక్ష విధిస్తున్నాను" — అని అందరిముందూ ప్రకటించి, నన్ను దండించక పోయావా? .... నేరస్థుడికి తెలియకుండా దొంగశిక్షలువేసే దొంగఅధికారమా నీది? నీ బూటకపు సర్వాధికారానికి నేను లొంగనని నీకు తెలిసే ఇంత మాయోపాయం పన్నావు. "ధర్మం" "ధర్మం" అని చిలక పలుకులు పలుకుతున్నావు .... నీకన్నా ధర్మహీను డెవ్వడు?....

నీకన్నా నేరస్థు డెవ్వాడు ? నువ్వు నా ఎదటబడి యుద్ధం చేసివుంటే ఈ పాటి కెవరు భూమి కొరిగేవారో తెలిసేది. దొంగ డెబ్బ కొట్టటం గొప్ప ప్రతిష్ఠాకరమని పిల్లవీగకు."—

రామయ్య చెక్కు చెదరని గాంభీర్యంతో వాలి మాటలు తృణీకరిస్తూ చిన్నవ్వు నవ్వాడు — "మూర్ఖుడా ! నువ్వు తెలుసుకోవడమే లేదు. జంతువు వేటి వాడవు. జంతువుకీ జంతువువంటి మానవుడికీ వ్యత్యాసమేమీ లేదు. జంతువుల్ని మానవులు చాటుగా, మాటుగా, ఏ విధంగానైనా చంపవచ్చును. తప్పు లేదు. పురదరితో కుంకే నీవంటి జంతు ప్రాయుడినీ, దోషినీ చాటుగా వుంటి చంపినందుకు నేను సిగ్గుపడవలసిందేమీ లేదు."

వాలి కోపోద్రేకంతో చామంచి చీత్కరిస్తూ — "నువ్వు పిరికిపందవే అనుకున్నాను. జ్ఞాన హీనుడివి కూడానా ? — నేను జంతువునే అయితే ఇక నా దోషం ఏముంది ? జంతువులకు వావి వరస లేమిటి ? శాస్త్ర ధర్మా లేమిటి ? జంతువుల్లో తల్లే బిడ్డతో కలుస్తుంది. బిడ్డ తల్లితో సుఖిస్తుంది. సృష్టిలో పక్షులకూ, మృగాలకూ కూడా తప్పొప్పులు నిర్దేశిస్తున్నావా నువ్వు ? ఎక్కడే పిట్టలు, ఏ పురుగులు, ఏ మృగాలు వావివరసలు పాటించవో గమనించి, అన్నిటినీ సంహరిస్తున్నావా నువ్వు ? చెట్లకూ, పిట్టలకూ, జంతువులకూ కూడా ధర్మశాస్త్రాలు రచించారా మీ పండితులు ? వావి వరసలు తప్పే జంతువుల్ని చంపటానికి వీనుకుంటే, ఈ లోకంలో సర్వప్రాణుల్నీ నాశనం చేసెయ్యాలి దుష్టుడా : ఎందుకు చెబుతావీ కుంటి సాకులు ?

నేను పురదరితో సంబంధం పెట్టుకున్నానని నువ్వేదో ధర్మపన్నాలు పల్లిస్తున్నావు. తమ్ముణ్ణి కన్నకొడుకుగా చూసుకోలేదని మహా దోషం ఆరోపిస్తున్నావు. ఆ తమ్ముడు నన్ను కన్నతండ్రిగానే చూసుకున్నాడా ? ఎవరి నేరంవల్ల ప్రారంభమైంది మా మధ్య వైరం ? నన్ను బిలంలో బంధించి వొచ్చిన భార్య తారతో సంబంధం పెట్టుకున్నాడు

నా తమ్ముడు. తర్వాత నేను అతణ్ణి వెళ్ళగొట్టి అతడి భార్యతో సంబంధం పెట్టుకున్నాను. ఇప్పుడు నువ్వు ఎవర్ని తప్పుపడతావు?...." *

రాముడు మొహం చిట్లించాడు.

సుగ్రీవుడు, పడుచుకుని హనుమంతుడి వేపు వెనక్కి జరిగాడు— "రాముడు కోపంగా చూస్తున్నట్టున్నాడు. నన్ను చంపేస్తా డంటావా ?"

"ఏమో మరి. ధర్మం కాపాడతానన్నాడు. చంపేస్తా డనుకుం టాను. ఏదో వొకటి అవుతుందిలే. ధైర్యంగా వుండు."

"ఏదో వొకటా?.... ధై....ర్యంగా వుం....డ....నా ?"

"విను. వాలి ఏదో అంటున్నాడు."

"పరదేశీ ! అనలు సంగతి గ్రహించావా ? మా స్త్రీలు వొక్క భరతో వుండవలసిన పతివ్రతలు కాదు. అది మా జాతి ఆచారం. సుగ్రీవుడి నేరానికి అతన్ని రాజ్యంనించి వెళ్ళగొట్టిన తర్వాత —నేను అతని భార్యతో వుండటం నా దోషం కాదు. ఏక్కడినించో మీ దేశా చారాలూ, నీతులూ తెచ్చి మా మీద రుద్దాలని వ్యర్థ ప్రయత్నం చేసు న్నావు. ఎవరి ధర్మం ఏంటో గ్రహించకుండానే నీ సిగ్గులేని లోక పరిపాలన సాగిస్తున్నావు. నీ దుర్మార్గం కప్పిపుచ్చుకోవటానికే నన్ను మూర్ఖుణ్ణనీ, జంతువుననీ, నిందిస్తున్నావు. ఎవడు మూర్ఖుడో, ఎవడు జంతువో, లోకం గ్రహించలేదని మిడిసి పడుతున్నావు...."

---

* 46 వ సర్గలో — 8, 9 శ్లోకాలు.

సుగ్రీవుడు రాజు అయిపోయిన తర్వాత — ఒక సందర్భంలో రాముడితో చెప్తున్నాడు — "... ఆ బిల ద్వారమునకు ఒక బండను అడ్డము వుంచి — వాలి బ్రతికి యుండునను ఆశ విడిచి కిష్కింధకు వచ్చి, తార, రుమలతోడ గొప్ప కపిరాజ్యమును బడసితిని." — దీన్ని బట్టి, వాలి మరదలితో వుంచడంకన్నా ముందే, సుగ్రీవుడే తారతో సంబంధం పెట్టుకున్నాడని అర్థమవుతుంది.

వాలి ధిక్కారం రామునికి గాంభీర్యాన్ని ఎప్పటికప్పుడు చెలా చెదురు చేస్తోంది. ఒక ఆయుధంకూడి ప్రశ్నలూ, పరిహాసాలూ, తన్ను సహించడమా ?.... తనవంటి మహారాజు : కోసలాధిపతి : మొదలు నరికిన చెట్టులాగే కూలిపోయిన వాడు ఎంత తర్కించి మాత్రం ఏం సాధించగలడు ? ప్రాణాలు పంచభూతాలో కలిసే వరకూ ఏదో ఒకటి వాగుతాడు. పాగరియ్యా.

"పామరుడా ! గుడివాడికి గుడివాడే దారి చూపలేడు గదా ? బుద్ధిహీనుడైన వానరులలో పుటి పెరిగిన నీకు ధర్మాధర్మాలేమి తెలు స్తాయి ? ధర్మం అనేది అంత సూక్ష్మ మార్గంతో ఇంద్రియాలకు గోచర మయ్యేది కాదు. దాన్ని తర్కించి ప్రయోజనంలేదు. లోకాని కంతటికీ శుభం కలిగించేవారు రాజులే. రాజులు అష్ట దిక్పాలకుల అంశ కలిగిన దేవతా స్వరూపులు. రాజులు ఏమి చేసినా వారి ఆజ్ఞలు శిరసావహిం చడం తప్ప వానిని తప్పుపట్టి నిందించరాదు. ద్వేషించి, ధిక్కరించ కూడదు."

"మరి నేనూ రాజునే కదా ? కిష్కింధా రాజ్యానికి పాలకుణ్ణే కదా ? .... నా చేష్ట లెందుకు తప్పు పట్టావు ? .... నన్ను ద్వేషించి ఎందుకు దండించావు ? నీ రాజధర్మమూ, నా రాజధర్మమూనా ?"

"నువ్వు రాజువే అయినా .... నేనే నీపై సర్వాధికారిని. నిన్ను కూడా దండించే ధర్మాధికారిని."

"చాలించు నీ సిగ్గూ, లజ్జా లేని ప్రవర్తనం నీ ధర్మం, నీ న్యాయం అందరూ కళ్ళారా చూసిందే. నీకు సర్వాధికారాలూ ఇచ్చింది ధర్మం కాదు. నీ దౌర్బల్యమే. దాని బలంతోటే లోకంమీద సార్వ భౌమాధిపత్యం చెలాయిస్తున్నావు. మాటలతో మాత్రం ధర్మాలూ, నీతులూ మెరిపించి — నీవంటి రాజు అధర్మంతోటీ, స్వార్థపరత్వం తోటీ ప్రజల్ని పాలిస్తాడు. పూల తీగలతో కప్పుబడిపోయిన నేలబావి లాంటి వానిని సుఖ్యం దుర్మార్గులయిన భర్తలవల్ల ఉత్తమస్త్రీ లెలా సుఖపడ

లేరో, అలాగే నీవంటి రాజువల్ల ప్రజలు సుఖపడలేరు. ఆయుధం ఉందనే అహంకారంతో పాపభీతి, లోకభీతి లేకుండా తిరుగుతున్నావు. నన్ను చంపి సుగ్రీవుడిద్వారా నీ కార్యం జరిపించుకోవాలని ఈ నీచానికి వొడిగట్టావు. నీ అజ్ఞానం బయట పెటుకున్నావేగానీ ఆ సహాయం నన్నే కోరితే దయదలచి ఏనాడో చేసిపెట్టేవాడిని."

"నీ దయమీద ఆధార పడవలసిన అగత్యం నాకేమి గల్గింది? నాకు నా తమ్ముడెటువంటివాడో సుగ్రీవుడూ అటువంటివాడే. అతడు నాకు సహాయం చేసినా, నేను అతడికి సహాయం చేసినా అది మా స్నేహ ధర్మం!"

"వానరు లందరూ జంతువు లన్నావు. జంతువులో వొక జంతువు నీకు తమ్ముడెలా అయ్యాడు? లేకపోతే, నువ్వే జంతువై సుగ్రీవుడికి అన్న వయ్యావా? .... ఓ అసత్యవాదీ! మీ ధర్మబద్ధ స్నేహ బండారం నాకు తెలియనిది కాదు. మీ స్నేహం ఏ అవసరాలూ లేని కాలంలో కలిసింది కాదు. ఇద్దరికీ అవసరాలు కలిగి, అవి తీర్చుకోటానికే ఒక వొప్పందం చేసుకున్నారు. దానికే అగ్ని సాక్షి! అదే మీ స్నేహ బంధం! నీ అవసరం కోసం ఒక జంతువుని స్నేహితుణ్ణిగాక, తమ్ముణ్ణి కూడా చేసుకున్నావు .... అంతేనా? ఇంకా బూకరిస్తావా? .... ఇవ్వాళ వాలి పోతాడు .... రేపు రాముడూ పోతాడు. కానీ వాలిని చంపి, రాముడేం కారణాలు చెప్పాడో విని లోకం నవ్విపోతుంది. యుగ యుగాల పొడుగునా నీ కీర్తి నిలిచిపోతుంది."

"నీవంటి పామరుడితో ధర్మ చర్చ ఈ రకంగానే సాగుతుందని నాకుతెలుసు. బుద్ధిమంతులనీ, జ్ఞాన వృద్ధులనీ, ఆచార్యులనీ మే మంగీకరించిన గురువుల దగ్గిర ధర్మ స్వరూపాలు తెలుసుకోలేదు నువ్వు. నేను సుగ్రీవుడికి కోరిన సహాయం చేస్తానని వాగ్దానం చేశాను. అతడు నిన్ను చంపమని కోరాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పే అసత్య వాదిని కాను నేను. సుగ్రీవుడు ధర్మాత్ముడు. అతడికోసం నిన్ను చంపడంలో నా దోషమేమీ లేదు."

వాలికి— అసహ్యంతో, బాధతో కళ్ళు మూతలు పడుతున్నాయి.

హనుమంతుడు సుగ్రీవుడి చెవికి— "రాముడు నిన్ను చంపడు. నువ్వేం తప్పు చెయ్యలే వనేశాడు—" అని ధైర్యం చెప్పాడు.

"చంపడు గానీ.... వాలిని నేను చంపమన్నానని పైకి చెప్పేశా డేవిటీ?.... ఇందాకట్నించీ తనే— ధర్మంకోసం చంపానంటున్నాడుగా? .... అలాగే అంటే బాగుంటుంది గానీ.... నేనే చంపమన్నానంటే .... రేపట్నించీ ప్రజల్లో ఏమన్నా బాగుంటుందా?...."

"ఏవిటో ఈయన కొంచెం తెలివి తక్కువ మేళంలాగే వున్నాడు." — అని విసుక్కున్నాడు హనుమంతుడు.

నళుడూ, నీలుడూ తారుడికి చెరోపక్క చేరి రెండు చెవులూ తూటు తూటు పెట్టి జబ్బలు చేసేశారు. — "అబ్బ! ఇద్దరూ వొక్క సారి మాట్లాడకండి. నాకే చెవ్వూ వినపడ్డంలేదు." — అంటున్నాడు తారుడు చాలా సేపట్నించీ.

"వాలి మా బాగా అడిగాడు సుమా రాముణ్ణీ?"

"అడగటంకాదు. కడిగేశాడు పట్టుకుని."

"ఎంతైనా వాలి వాలే. జ్ఞానవంతుడు. ఆయన జ్ఞానం పనకెక్కి దొస్తుంది?"

"ఏవిటో ఇదంతా నిష్కారణంగా చేశామేమోనని లోపల .... కొంచెం దిగులేస్తోంది."

"అవును. నాకూ అలాగే వుంది."— అన్నాడు తారుడు దిగులు పడుతూ.

రాముడు గంభీరంగా వాలికి హితోపదేశం జ్ఞానసాగిస్తున్నాడు — " .. నీకు మృత్యువు ఆసన్నమైందని తపించి ప్రయోజనం లేదు. నీ లాగానే పూర్వం ఒక మూర్ఖుడు పాపం చేశాడు. మా వంశీకుడైన మాంధాత చక్రవర్తి అతడికి ఘోరమైన శిక్ష విధించాడు. ఎంతపాపాత్ముడైనా, రాజ దండనకు లోబడిన తర్వాత పుణ్యాత్ములై స్వర్గానికి పోతారు. దోషుల్ని దండించకపోతే ఆ పాపం రాజుకే చుట్టుకుంటుంది.

కొందరు రాజులు దోషుల్ని మొదట నిరక్ష్యం చేసి, సకాలంలో విచారించరు. తర్వాత ఎొక్కసారే మరణశిక్ష వంటి శిక్షలు విధిస్తారు. అయినా అది మంచిదే, శాస్త్ర సమ్మతమే. నేరస్థుడు మరణశిక్ష పడిందని విచారించకూడదు. దాని వలనే అతని పాపం అంతా పోతుంది. నా బాణం దెబ్బతో మరణించడంవల్ల నీకేమీ హాని లేదు. నీ పాపానికి, ప్రాయశ్చిత్తం జరిగినట్టే. నువ్విక స్వర్గానికి పోగలవు. నేను నీకు మోక్షం ఇస్తాను. నీ ఆత్మ గురించి విచారించకు...."

వాలి గుండె బాధతో — వుద్రేకంతో స్పృహ గోల్పోయాడు. *

• • •

---

* 17 వ సర్గలో — 13 నించి 52 శ్లోకాల వరకూ.
18 వ సర్గలో — మొత్తం 68 శ్లోకాలు.

ఈ రెండు సర్గలో వాలికీ, రాముడికీ జరిగిన సంభాషణ చూడవొచ్చును. రాముడి పాత్రను అర్థం చేసుకోవడంలో ముఖ్యంగా చర్చించవలసిన ఘట్టాలలో "వాలి వధ" ఒకటి. అందుచేత దీన్నిగురించి కొంచెం వివరంగా చర్చించవలసిన అవసరం వుంది.

వాలి నేల కొరుగుతూ — "ఆహా! రాముడు చక్కగా బాణం వేశాడే!" — అని సంతోషించాడట. —

"యుద్ధములో వీరుడగు రాముడు మంచి బాణమును ప్రయోగించెనని శ్లాఘించి, అతడెక్కడ అని వాలి మిగుల శ్రమతో వెదుకుచుండెను."

రాముడు దగ్గిరికి వొచ్చాక వాలి — "నిష్ఠురముతోగూడి వినయముగ నుండు మాటలు జెప్పెను."

వాలి రాముణ్ణి చాలాతిట్టు తిట్టాడు (వినయంగా). ఎలాగంటే— "... ధర్మాత్ముడవని వట్టి పేరు పెట్టుకొని, అధార్మికుడుగను, పాపాత్ముడుగను, నీవు వుండినటుల ఇంతవరకూ నాకు దెలియక పోయెను.... నీవు నీచ కార్యములు చేయువాడవు. గూఢముగనుండి, అభిశప్తము

(పుట నోట్ : 246 పేజీ తరువాయి)

జేయువాడవు. కోపము గలవాడవు. మర్యాద లేనివాడవు. కేవలము ధనుస్సు ధరించి యుండువాడవు. కాపురుషుడవై ఇంద్రియములు ఈడ్చినట్లు పోవుచున్నావు" — ఈ రకంగా చాలా తిట్లు తిట్టాడుగానీ, అవన్నీ కోపంగా కాదు. వినయంగా తిట్టాడట. — ఇంతకీ అన్ని తిట్ల మధ్యా వాలి అడిగినవి రెండే రెండు ప్రశ్నలు.

"నన్నెందుకు చంపావు ? — చాటుగా ఎందుకు చంపావు ?"

వాలి మాటలకు రామునకు — "వానిచే ధిక్కరింప బడిన రాముని ధర్మాధ్వమునకోగాడి యుక్తిమయుగు మాటలు జెప్పెను."

అవేమిటంటే — " . వానరత్వము వల్ల గలిగిన బుద్ధి చపలతచే నిన్ను నిందించితివి. (సుగ్రీవుడూ, హనుమంతుడూ కూడా వానరులే. అయినా వారికి 'వానరత్వం' లేదు. వారు ధర్మాత్ములు. పైగా సరస్వతీపుత్రులు .... వ్యాకరణాలూ చదువుకున్నారు.) — "కొండలతోనూ, అడవులతోనూ గూడిన ఈ భూమి ఇక్ష్వాకు వంశములో బుట్టిన రాజులదే. మృగములను, పక్షులను, మనుష్యులను నిగ్రహించుట వారి కార్యమేను. — ధర్మాత్ముడగు భరతుని ఆజ్ఞ చొప్పున నేను, మరికొందరు రాజులు, ధర్మాభివృద్ధిని గోరి భూమిలో నంతయు సంచరించుచున్నాము." (ఇంతకన్నా పెద్ద అబద్ధం వుండా ? భరతుడు ఈయన చెప్పాల కింద పోరోచడం ఏమిటీ ? భరతుడే తనని ఆజ్ఞాపించాడని ఈయన చెప్పడం ఏమిటీ ? ఆ "మరి కొందరు" రాజు లెవరు ?.... వాళ్ళపరెవర్ని చంపుతున్నారో పాపం : — తండ్రి ఆజ్ఞ చొప్పున వనవాసం చేస్తున్నానని చెప్పుకునే రాముడు, కథ మార్చేసి "ధర్మాభివృద్ధికి" మీ సంచారం చేస్తున్నా నంటున్నాడు.)

"కన్న తండ్రితో — తోబుట్టువుతో — సోదరుని భార్యతో భోగించువారికి మరణశిక్ష విధించవలెనని శాస్త్రములు చెప్పుచున్నవి".— (అంటే ఈ శాస్త్రాలు రాయకపూర్వం కూతుళ్ళతోనూ, చెల్లెళ్ళతోనూ, అన్నవదినల భార్యలతోనూ కామ సంబంధాలు పెట్టుకోవడం ఉండేది

(ఫుట్ నోట్ : 247 పేజీ తరువాయి)

అన్నమాట. దాన్ని కొంతకాలానికి శాస్త్రాలు నిషేధించాయి. కాని, కాంచరు పాత సమాజ ధర్మాల ప్రకారమే ప్రవర్తిస్తూ వుంటాయ.)

"నీవు తమ్ముని భార్యతో భోగించు చున్నావు. పాపము చేసిన వాని రాజు దండనకు లోబడినచో పుణ్యాత్ముడగునని మను ధర్మ శాస్త్రము చెప్పుచున్నది. నీవలె లోక మర్యాదలను విడిచియుండు వారిని శిక్షించుటకు సిద్ధముగ నున్నాము."

(న్యాయం పేరుతో, అన్యాయంగా ప్రజల్ని శిక్షించడంలో ఈ నాడూ అంతే. — రాముడికి బదులు — రాముడి వారసులూ, రామ బాణాలకు బదులు తుపాకులూ. తేడా ఏం లేదు.)

"సుగ్రీవుని యెడల నాకుగల స్నేహము, లక్ష్మణుని యెడల గల స్నేహము ఎంటిదై యున్నది. "ధర్మ స్వరూపము నెరిగిన" సుగ్రీవుని సఖుడవు తమై, నేను వానరులయెదుట నిన్ను చంపెదనని ప్రతిజ్ఞ చేసితిని .. నేను ప్రతిజ్ఞ తప్పువాడను గాను."

(అసలు ప్రతిజ్ఞ చెయ్యడంలో ఏం న్యాయం వుందో చెప్పడు. ప్రతిజ్ఞ మాత్రం తప్పనంటాడు. ఇంతవరకు సీతకూడా ఒకసారి — "రాక్షసులతో నీకేమిక్ష్వాకుత్వం లేదుకదా ? .... రాక్షసుల్ని చంపుతా ననడం ఎందుకు ?" — అని అడిగితే, "రుషులకు ప్రతిజ్ఞ చేసితిని. ప్రతిజ్ఞ తప్పువాడను గాను. నోరు మయ్యా" — అన్నాడు. మరి ఈ ప్రతిజ్ఞలో ధర్మమేవుందో, దౌర్జన్యమే వుందో శ్రీరామచంద్రుడికే తెలి యాలి.)

"గూఢముగనుండి కొట్టినందులకు నన్ను నిందించు చున్నావు. మానవులు మృగములను అనేక విధముల కపట వ్యాపారములతో చంపె దరు. పాపము లేదు. నీవు వానరుడుగ నుండుటచే, నిన్ను చాటుగనుండి గొట్టితిని."

("వాల్మీకి వాలిని "జంతువు" గానే రాశాడు. జంతువు గాబట్టే రాముడు చంపాడు. మనిషి అయితే చంపేవాడు కాడు" — అనుకోడా

(ఫుట్ నోట్ : 248 పేజీ తరువాయి)

నికి పిల్లే ము. మనుషులైనా, జంతువులైనా, మనుష్యులయినా వొక్కటే శ్రీరాముడి ధర్మ పరిపాలనకు. మనుషులమీదకూడా సర్వహక్కులూ రఘువంశం వారివే.)

"— రాజులు దేవతా స్వరూపులు. వారిని పీడించరాదు. నిందించ రాదు. వార మీరరాదు. చపలచిత్తులును, ఆత్మజ్ఞానము లేనివారును నగు వానరులతోగూడి, తెలివిలేని వాడవుగ నున్నావు. — (ఇంకో జాతి అంటే హేళన; తన జాతి గొప్పదనే అహంకారం;) — నా దండనచే నీకు పాపము తొలగినది. నిన్ను దండించినది, అన్ని విధముల ధర్మమేనని గ్రహింపుము."—

ఈసరికంగా రాముడు వాలికి జవాబు చెప్పాడు.

"నువ్వు జంతువ్వి కాబట్టి, నా ఇష్టం వొచ్చినట్టు చంపానని రాము డన్న తర్వాత, వాలి — "జంతువులకు వావివరస లేమిటి?"— అనిగానీ — "సుగ్రీవుడు మాత్రం జంతువేగదా? నీకు తమ్ముడెలా అయ్యాడని గానీ వాలి అడగలేదు అసలు కథలో — (వాల్మీకి రామాయణంలో.)

రాముణ్ణి అన్ని తిట్లూ తిట్టినవాడు ఇంత ముఖ్యమైన ప్రశ్న లెందు కడగలేదు? — కవి, వొంతో ఆ ప్రశ్న లడిగించలేదు. అడిగిస్తే రాముడి బండారం బయట పడుతుంది కాబట్టి. రాముడితో వొక దబా యింపు వుపన్యాసం ఇప్పించి, వాణ్ని ఊరుకోబెట్టాడు. కవి రాముడి పక్షాన జేరి వాలి నోరు కట్టేసినంత మాత్రాన — ధర్మ చర్చలో రాముడు నెగ్గినట్టు కాదు. "తక్కం" అంటే ఎవటివాడు ప్రశ్నించే అవకాశం లేనంతవరకూ సాగాలి. "జంతువుకి వావి వరస లేమిటి?.... జంతువు తప్పు చెయ్యడం ఏమిటి?" — అని వాలి అడక్కపోయినా - అలా అడిగే అవకాశం వుందా? లేదా? వాలి గానీ, వాలి పక్షాన ఇంకెవరైనా గానీ అలా అడిగితే, రాముడి కేం జవాబు వుంది చెప్పడానికి? జంతువు

(ఫుట్‌నోట్ : 244 పేజీ తరువాయి)

రాని వనులు పాటించలేదనే కారణం చెప్పి చంపడంలో ఎటువంటి "ధర్మం" వుంది ? — రాముడి చేష్టలూ, మాటలూ ఇంత అక్రమంగా వున్నా సరే—చివరికి వాలి ఏమంటున్నాడో (కవి వాలిచేత ఏ మనిపిస్తున్నాడో) — చూడండి నమస్కారం కూడా పెట్టి —

వాలి అంజలి చేసుకొని ఇట్లనెను — "నరోత్తమా ! నీవు చెప్పినది చక్కగా నున్నది. (నన్ను చావగొట్టడం చక్కగా వుంది.)— ఇందులకు సందేహము లేదు. (వాలితో అలా అనిపించకపోతే బాగుండదు మరి) — మిగుల జ్ఞానివి నీవు. ప్రజలకు హితము చేయువాడవు. ఏ పాపమునకు ఏది చండనమో తెలిసినవాడవు. — నేను నీచుడను. పాపిని. (వాలే ఇలా వాపోయినకుంటే ఇంకేం తగువుంచ దనుకున్నాడు కవి.) "తార అడ్డగించినను నీ చేతిలో మరణించుటకే నేను యుద్ధమునకు వచ్చితిని." (మరి అలా వచ్చినవాడు మొదట తిట్టాడెందుకు ? — అన్న ప్రశ్న వొస్తుందని, దానికీ జవాబు చెప్పిస్తున్నాడు.) — "వాడపుచే గొట్టబడి, మూర్ఛ జెంది, తెలివిలేక నిన్ను మోషించితిని మొదట. అది సరికాదు." (మరే....ఇదే నరి).

రాముడి సామ్రాజ్యాధిపత్యాన్ని వాలే ఎలా వొప్పుకుంటున్నాడో చూడండి. — "సుగ్రీవుడు నీ అనుగ్రహమునకు పాత్రుడై, నీ స్వాధీనములో నుండి, నీ చిత్తము ప్రకారము వుండినటులయిత, రాజ్యమును కూడా పరిపాలించి యుండవచ్చును. (సుగ్రీవుడు రాముడి ఆధీనంలో ఉండే విషయం గురించి వాలితో కూడా అంగీకరింపజేస్తే, రాముడికి ఇంకా బలం కదా ?)

రాముడి బాణం తగిలి తర్వాత వాలి రాముణ్ణి బొత్తిగా ఏమీ అనకుండా "బలే చక్కని పని చేశావు" — అని మెచ్చుకుంటే బాగుండదని కవి, వాలితో రాముణ్ణి కొంచెం తిట్టించి, రెండు ప్రశ్నలు మాత్రం అడిగించి — వాటికేవో పిచ్చి జవాబులు చెప్పించి, వాలికి స్వర్గం చూపించి, సంతోష పెట్టేశాడు.

చివరికి వాలి, రాముణ్ణి — "శ్రీరామా ! నిన్ను దూషించినందుకు

యుద్ధ రంగంలో జరిగిన సంగతి విన్న తార దుఃఖంతో తల్లడిల్లుతూ ఖర్చు పెట్టడానికి బయల్దేరింది. ఆమె అంతఃపురంనించి బయటకు రాగానే ఆమెకోసం వేచివున్న కొందరు వీరులు ఆమెని చుట్టుముట్టి సహోద్రేకంతో — "మహారాణీ ! ఘోరం జరిగిపోయింది. కానీ, మేం పగ తీర్చుకుంటాం. వెంటనే అంగదుడికి పట్టాభిషేకం జరిపించండి. మేమంతా అంగదుణ్ణే రాజుగా కొలుచుకుంటాం. సుగ్రీవుడి అధికారానికి తల వొంచం. త్వరలోనే సుగ్రీవుడి బలగమంతా అన్ని ప్రదేశాలనించీ కిష్కింధకు చేరుతుంది. శత్రువుకి రాజ్యంలో స్థానం లేకుండా చేస్తాం .. అనుమతించండి మహారాణీ ! —" అంటూ ఆవేశం కురిపించారు.

తారకు అంతా గాఢాంధకారంగా వుంది. తన ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనంగా తోచాయి. ఏమీ నిర్ణయించలేని నిస్స్పృహతో — "వీరులారా ! మీ రందరూ ప్రశ్నాస పాత్రులని నే నెరుగుదును. మహారాజూ, ప్రేమపాత్రుడూ అయిన మన మహారాజే పోయిన తర్వాత

(ఫుట్‌నోట్ : 250 పేజీ తరువాయి)

నన్ను క్షమించుము. పాప కార్యములు చేసిన నన్ను క్షమించితినని చెప్పుము" — అని ప్రార్థించి — "నీ ప్రాణం దెబ్బ తినడం నా భాగ్యం !" అని వొప్పేసుకున్నాడు.

ఈ ఘట్టం చదివినప్పుడు కవి న్యాయంగా రాశాడనే నమ్మకం కలుగుతుందా ? రాముడు వాలిని చంపడంలో న్యాయం వుందా ? — ఈ విషయాల గురించి ఎవరికివారు ఆలోచించుకోవలసిందే.

ఈ "తోడుదొంగలు" కథలో మాత్రం వాలి రాముడి మాటల్ని ఆసహ్యించుకున్నాడేగానీ, అంగీకరించలేదు. కారణం — రాముడు చెప్పిన కారణాలు అన్యాయమైనవి కాబట్టి.

ఇక ఈ రాజ్యకాంక్ష లెందుకు ?.... ఈ ప్రతీకార లెందుకు ?" — అని నిరాశలో కూరుకుపోయింది. *

తుఫాను గాలికి వేళ్ళతో కూలిన మహావృక్షంమల్లే, గరిక పోచ లకు బందీ అయిన గజరాజు మల్లే భూమిమీద అస్తవ్యస్తంగా, పడి వున్న భరని తా నమ్మలేని దానివలె విస్మయంతో చూస్తూ— భరించ లేని దుఃఖావేగంతో ఆలింగనం చేసుకుంది. "మహావీరుడా ! ఎన్నడూ పరాజయం ఎరగని నువ్వు శాశ్వతంగా విశ్రమించావా ? బాహుబల ప్రదర్శనంలో శత్రువుల గుండెలు కంపింపజేసే నువ్వు దెబ్బతిన్న సింహానివై నేల కొరిగావా ? చుట్టూ ఇందరు శత్రువుల మధ్య ఎన్నడూ ఇంత నిశ్చలంగా శయనించి ఎరుగవే ! నీ అనమాన శూరత్వం, నీ శత్రు భయంకరత్వం ఏమైపోయినాయి ? అధర్మ యుద్ధంలో మోసపోయి, నిస్సహాయుడివై, దుమ్ములో, ధూళిలో దొర్లి

* 19 వ సర్గలో — 14, 17 శ్లోకాలు.

వాలిని చంపగానే — వాలి పక్షాన వున్నవాళ్ళు ఏమీ ప్రయత్నాలు చెయ్యకుండా వూరుకుంటారా ? సుగ్రీవుడి అధికారాన్ని అంగీకరిస్తారా ? — అనే ప్రశ్నలు వొస్తాయనే వుద్దేశ్యంతో కొందరు వీరులు సుగ్రీవుడి మీద కోపం తెచ్చుకున్నట్టే రాస్తున్నాడు కవి. తారతో కొందరు వీరులు— "పట్టణముయొక్క పెద్ద ద్వారము గాపాడవలయును. అంగదునికి పట్టాభిషేకము జేయవలయును. వాలి స్థానములో నుండు అంగదుని వానరులు ఆశ్రయించి యుందురు," — అంటున్నారు.

కానీ అలా అన్నవాళ్ళు వుత్తములు కారట. అల్పులట. మాట్లాడడానికేదో వొక అవకాశం దొరికితే చాలనుకునే వాళ్ళట— "సంభాషించుటకు కొంత అవకాశము పొందియుండు, అల్పబుద్ధులగు వారికి దోచినటుల జెప్పిన మాటలను తార వినెను."

ఆ వీరులు సుగ్రీవుడి పక్షాన జేరిపోతే, సుగ్రీవుడికే పట్టాభిషేకం జరిపించమని తారకి చెప్తే, చాలా వుత్తములూ, జ్ఞానులూ అయ్యే వారన్నమాట.

తున్నావా ? ప్రియుడా ! నీకోసం దుఖించే నీ భార్యలను విస్మరించి భూదేవిని ప్రేమతో ఆలింగనం చేసుకున్నావా ? ఎన్నడూ మా హృదయాలు దుఖపెట్టలేదు. ఇంత పరాజయంలోనైనా నీ మొహంలో విషాద రేఖలు గోచరించడం లేదు. ఏ క్షణంలోనైనా నువ్వు చిరునవ్వుతో లేస్తావని నా మనసెంతో ఆశ పడుతోంది.

మహారాజా ! పౌరులందరూ నీ చుట్టూ జేరి కన్నీళ్ళతో నిన్ను దయనీయంగా చూస్తూ వున్నారు. చూడు. లేచి మెత్తని శయ్యమీద విశ్రమించు. నీ పరివారాన్నంతా దుఖ సాగరంలో ముంచడానికి ఆ యముడే ఈ రాముడుగా వొచ్చాడని గ్రహించుకోలేవు కదా ?

నాధుడా ! రానున్న ఆపద గ్రహించి కూడా నిన్ను నిలుపుకోలేని చరదృష్టవంతురాలి నయ్యాను. నీతోనే నా సౌభాగ్యమంతా నన్ను విడిచిపోయింది. నిన్నీ దుర్దశలో చూసి కూడా నా హృదయం బద్దలు గాకుండా వుందే ! నీ ముద్దుల కొడుకుని ఎవరి కప్పగించి వెళ్తున్నావు ? ఒక్కసారి కళ్ళు తెరిచి అంగదుణ్ణి ఆలింగనం చేసుకో. అతడి శిరస్సు ముద్దాడి, వూరడించి, మంచిచెడ్డలు నేర్పి వెళ్ళు. ధర్మయుద్ధం చేసిన నువ్వు– స్వర్గంలో కూడా ఇంకో కిష్కింధ స్థాపించుకోగలవు.

నాయనా ! అంగదా ! నీ తండ్రి పుత్తముడు. ధర్మాత్ముడు. ఇక ఎన్నటికీ తిరిగిరాని బహు దూరదేశం పోతూ వున్నాడు. నీ తండ్రి దర్శనం మళ్ళీ దొరకదు సుమా ! ఇప్పుడే తనివితీరా చూడు. నీ తండ్రి పాదాలకు నమస్కరించు.

ప్రియుడా ! నేను కూడా నీకు నమస్కారం చేస్తున్నాను. నే నెన్నడైనా నీకు అప్రియం చేసినటయితే నా అపరాధాలన్నీ మన్నించు. నా సఖుడివీ, ప్రియుడివీ, నాధుడివీ, నా సర్వస్వమూ నువ్వే. నువ్వు లేక నేను దుఖ ప్రవాహంలో కొట్టుకుపోతూ వున్నాను...."

రాముడు గంభీరంగా సుగ్రీవుడి వేపు చూశాడు. సుగ్రీవుడు హనుమంతుడి వేపు చూశాడు. హనుమంతుడు వినయంగా తార దగ్గరికి వొచ్చి— "దుఖపదకు తల్లీ ?.... ఎవరి కర్మ కెవరు కర్తలు ? ఆ

మహానుభావుడు చేసుకున్నదాన్ని బట్టే అంతా జరిగింది. అయినా లోకంలో ఏది శాశ్వతం ? తనువులు నీటి బుడగల్లాగ విచ్చిపోతాయి. సిరిసంపదలు హారతి కర్పూరంలాగ హరించి పోతాయి. అందరం ఆ స్థితికి చేరవలసిన వాళ్ళమే. ఈ దేహాలకోసం చింతించి ఏం ప్రయోజనం? * మంచి చెడ్డలన్నీ తెలిసిన దానివి. నీకు ఇతర్లు చెప్పవలసిం దేముంది ? జరిగి పోయిందానికి విచారించి లాభంలేదు తల్లీ ! జరగవలసిందేమిటో ఆలోచించు. నీ కొడుకు గురించి విచార పడవలసిన అగత్యమేమీ

---

* 21 వ సర్గలో — 11 శ్లోకాల పరకూ.

హనుమంతుడు వేదాంతం వల్లించి తారని ఓదారుస్తున్నాడు — "ఈ శరీరములు నీటి బుడగలవలే అస్థిరములు." — (అవును. "మంత్రి పదవులు" మాత్రమే స్థిరములు, శాశ్వతములు.) — "ఎవరి ఆత్మను గురించి వారు దుఃఖించవలయునే గానీ ఇంకొకరి గురించి వారు దుఃఖించి ప్రయోజనము లేదు." (ఎవరి పదవుల గురించి వారు తాపత్రయ పడవలసిందే గానీ ఇంకొకరి గురించి ఆలోచించి లాభం లేదు— ఈ వేదాంత సారం చక్కగా వొంటబట్టడం చేతనే హనుమంతుడు వాలిని విడిచిపెట్టి "మంత్రిపదవి కోసం" — సుగ్రీవుణ్ణి ఆశ్రయించాడు.) — ఎవరి కర్మ కెవరు కర్తలు తల్లీ ? (ఈ రెండు ముక్కలూ అనలు వ్యవహారాన్ని తల్లకిందులు చేసేసి కూర్చోబెడతాయి. వాలికి అన్యాయం జరిగిన విషయం హనుమంతుడికి తెలిసిందే. అయినా ధైర్యంగా వేదాంతం మాట్లాడుతున్నాడు. వేదాంతం ఎలాంటి అన్యాయాన్నయినా "కర్మ" గా మార్చేస్తుంది. వాలికి జరిగిందాన్ని మాత్రమే "కర్మ" అనుకోవాలి. సుగ్రీవుడు తన దేశ బహిష్కారం "కర్మ" అనుకోడు. రాముడు భార్యా వియోగం "కర్మ" అనుకోడు. వేదాంతం ఎప్పుడూ నష్టపోయే వాళ్ళ నోళ్ళు మూసేసి, లాభపడేవాళ్ళ పక్షాన నిలబడుతుంది. వాళ్ళకే అనుకూలంగా వుండే "ఆధ్యాత్మిక సంపద" సృష్టిస్తుంది. ఈ విషయం మనం అనేక సందర్భాల్లో గమనించవొచ్చును.)

లేదు. తండ్రి పోతేమాత్రం అంగదుడికి లోపం జరుగుతుందా ? యువ రాజు కావలసిన వాడు అతడే కదా ? లేపు నీ కొడుకు సింహాసనంమీద కూర్చోవటం చూశావంటే — భర్త పోయిన దుఃఖం అంతా పరిచే పోతావు." —

తార కోపంగా తలెత్తింది. — వాలిని పొదిలి సుగ్రీవుడి పక్షాన చేరిన హనుమంతుడి కపటత్వం ఆమె ఎరగనిది కాదు. — కొడుకు యువరాజు అయితేనే చాలని సంతోషపడుతుందా తను ? .... తన భర్తే ఉంటే ఆయన మహారాజే కద ? .... అప్పుడు తన కొడుకు ఎలాగూ యువరాజే కదా ? తనకేదో ఎన్నడూ ఎరగని మహాభాగ్యం పొచ్చపడినట్టు పరిభ్రమిస్తున్నాడే ఈ మూర్ఖుడు ! — "హనుమంతుడా ! కొడుకును పదవి చూసుకుని, భర్తలేని వెలితిని విస్మరించే ధూర్తురాలినని భావిస్తున్నావా నన్ను ? సూటిగుడు కొడుకుకైనా, సూడు యువరాజ పదవు లయినా నా భర్త ప్రేమాలింగనానికి సరిరావు సుమా !" — అని వైఖరీవారంగా చూసి, జలజల కన్నీళ్ళు కార్చింది.

వాలి మరణవేదన పడుతూ, మూర్ఛలోంచి కళ్ళు తెరిచాడు. చెప్పపాటులో మృత్యువు కబళిస్తోందని గ్రహించాడు. సుగ్రీవుణ్ణి చూస్తూ — "తమ్ముడా ! సుగ్రీవా నన్ను చంపి, రాజ్యం తీసుకుంటే నేను వీచా రించేవాడికి కాదు. నీకా హక్కు వుంది. రామునికా హక్కు లేదు. — ఆ రాముడి కిచ్చిన వాగ్దానం తొందరగా నెరవేర్చుకో. లేకపోతే నిన్ను హనుమ చంపుతాడు. అంత ఆపద తెచ్చుకోకు. అంగదుణ్ణి నీకు అప్ప గించి పోతున్నాను. నీ బిడ్డలాగే చూసుకో. తార తెలివిగలది. పరిస్థితు లబ్బీ కార్యాకార్యాలు నిర్ణయించుకోగల సమర్థురాలు. ఆమె చెప్పినట్టు వినుకో. నీకు మంచిది" — అని దుఃఖపడుతోన్న కొడుకుని వాత్స ల్యంతో చూశాడు. "నాయనా ! నిన్ను ఆలింగనం చేసుకునే శక్తిలేదు .... నీ పినతండ్రిని ధిక్కరించడాని కెన్నడూ ప్రయత్నించకు. అతడు బలమైన అండ సంపాదించుకున్నాడు. దేశకాల పరిస్థితులు బాగా గ్రహించి మసలుకో" — అని కళ్ళు తిప్పి, తన మనస్సున శోకదేవత

లాగ మిళిసూ కూర్చున్న తారని చూశాడు — "తారా ! .... నువ్వు ప్రేమతో చెప్పిన హితం చెవిన పెట్టలేదు. నా అజ్ఞానానికి నేనే బలై పోయాను .... పుట్టిన ప్రతి జీవికీ మృత్యువు తప్పదు. కానీ ... ఇంత తెలివి తక్కువగా .... ఈ రకమైన ... మృత్యువుకి .... నేను లొంగి పోవటం .. నన్ను .... అమితంగా .... బాధిస్తోంది .... అంటూ ప్రాణాలు విడిచాడు.

నీలుడు ముందుకొచ్చి వాలి రొమ్ములో బాణం తీసేశాడు.

తార మళ్ళీ ఘోరంగా విలవిల్లాడుతూ — "సుగ్రీవుడా ! నీ శత్రువు నశించి పోయాడు. ఇక ఈ రాజ్యం అంతా నువ్వే ఏలుకో. సంతోషంగా ఏలుకో" — అని రాముణ్ణి చూసి — "రాజా ! నా భర్తను చంపిన బాణం తోటి నన్నుకూడా చంపి, పుణ్యం కట్టుకో. నా భర్త స్వర్గానికి పోయినా నాకోసమే దుఃఖిస్తూ ఉంటాడు. భార్యా — భర్తల్ని విడదీసిన పాపం నీ కెందుకు కలగాలి ? నువ్వు చయదలిస్తే మమ్మల్ని వొకర్ని ప్రాణంలో కలపగలవు సుమా ! ప్రేమాస్పదుడయిన నా భర్త దగ్గరకే నన్ను పంపించు" — అంటూ దుఃఖించింది.

తార తననేం మోసిస్తుందోనని, జంకుతోన్న రాముడు ఆమె దీనాలాపాలు విని ధైర్యం తెచ్చుకున్నాడు. గంభీరంగా తారని చూస్తూ —

—" జ్ఞానవంతురాలిగా కనిపిస్తున్నావు. విలపించడం తెలివి తక్కువ కార్యం అని గ్రహించలేవా ? లోకంలో సుఖంతోపాటు దుఃఖం కూడా సహజమైనదే అంటారు. విధి విధానంగానే ఇదంతా జరిగిందని శాంతపడు. ఎవ్వరూ ఏ కార్యమూ చెయ్యడానికీ స్వతంత్రులు కారు. ఒకరి నొజ్ఞాపించడాని కింకొకరికి అధికారం లేదు. అందరూ ధర్మం చొప్పున నడవవలసిన వారే. భర లేకుండా జీవించలేననే దుఃఖం ఎడిచిపెట్టు. నీ భర వీరుడు. నువ్వు వీరపత్నివి. వీరుల భార్యలు దుఃఖించరు. నా చయపల్ల నీ భర్త స్వర్గానికి పోతాడు. నీ కొడుకు యువరాజు అవుతాడు.... ఇక నువ్వు దుఃఖించే అగత్యమేమీ లేదు."— తనలాగే అందర్నీ రాజ్యాలూ, భోగాలూ మాత్రమే సంతృప్తిపరుస్తాయని భావించే రాముడికి....తార కన్నీటిలో విషాదమేమీ గోచరించలేదు.

తారకి అమితమైన అసహ్యం కల్గింది. మనసులో భావం బయట పడనివ్వక తల వొంచుకుంది. — అంతా శత్రువు చేతిలో చిక్కిపోయింది. ఈ దుర్మార్గులు అంగదుణ్ణి కూడా శత్రు శేషంగా భావించి నాశనం చెయ్యకుండా కాపాడుకోవాలి తను.

నిర్లిప్తంగా పడివున్న వాలిని చూస్తూ ప్రజలంతా దుఃఖం ఆపుకోలేక కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నారు.

సుగ్రీవుడు సిగ్గుపడి, తల వొంచుకొని, కళ్ళనీళ్ళు తెప్పించుకుంటున్నాడు. వాలి తనని చంపదగ్గ సమయాలలో కూడా దయతో విడిచిపెట్టాడని ప్రతివుండకీ తెలుసు. అటువంటి అన్నని, తను మోసంతో చంపించిన సంగతికూడా అందరికీ తెలిసిపోయింది. ఇప్పుడు తను పశ్చాత్తాపం ప్రకటించుకోకపోతే, నలుగుర్లో ఏమీ బాగుండదు. అందరూ వాలికోసం ఏడుస్తున్నారు.

సుగ్రీవుడు రాముణ్ణి చూస్తూ — "శ్రీరామా ! నీ ప్రతిజ్ఞ నువ్వు నెరవేర్చుకున్నావు. నాకు రాజ్యం సంపాదించి పెట్టావు గానీ .... నాకిప్పుడు ఏ మాత్రం రాజ్యం మీద కోరికలేదు. కన్నతండ్రిలాంటి నా అన్నే పోగా నాకీ రాజ్యా లెందుకు ? భోగాలెందుకు ? నా అన్న లేకపోతే నాకు స్వర్గం కూడా అక్కరలేదు. సిరిసంపద లెక్కడైనా దొరకవొచ్చును గానీ ... మళ్ళీ తోడబుట్టిన వాడెక్కడ దొరుకుతాడు ? బతికినన్నాళ్ళూ నా అన్న నన్ను ఎంతో దయతో చూసుకున్నాడు. కొంచెం కోపం తెచ్చుకునేవాడు గానీ.... నా అన్న మహానుభావుడు. అటువంటి వుత్తముణ్ణి చంపించుకున్నాను. దుర్మార్గుణ్ణి, నా వంటివాడు తమ్ముడెలా అవుతాడు ? .... అయ్యో ! ... నేనిక బతకను. నా అన్నతోపాటు నేనూ కాష్ఠంలో పడిపోతాను. నా అన్నతో వెళ్ళిపోతాను. రామా ! నా సైన్యమంతా నీ భార్యని వెతికి పెడతారు. నీ కిచ్చిన మాట తప్పను. అయ్యో ! .... నేనిక బతకను...." — అంటూ కుమిలటం మొదలుపెట్టాడు.

సుగ్రీవుడు అంత చక్కగా ఏడవడం చూస్తే రాముడికి నవ్వు తెప్పించింది. అన్నగారి మరణం సుగ్రీవుడి కెంత ఆనందం కలిగిస్తోందో .... సింహాసనం ఎక్కాలని ఎంత తహతహ లాడుతున్నాడో .... రాముడికి చక్కగానే తెలుసు . అన్నగారికోసం లోకాచారంగా దుఃఖిస్తున్నాడు. అవును.... ధర్మబద్ధంగా దుఃఖించవలసిందే. సుగ్రీవుడి అంతరంగం గ్రహించే శక్తి — శక్తిమంతుడైన రాముడి కొక్కడికే వుంది.

"సుగ్రీవుడా ! దుఃఖించి లాభంలేదోయీ ! అంతా దైవ నిర్ణయం అని గ్రహించలేదు నువ్వు. చంపించిన వాడివి నువ్వు కాదు. చంపిన వాడిని నేనూ కాదు. చచ్చిపోయిన వాడు వాలీ కాదు. అందరం నిమిత్తమాత్రులం సుమా :" — అంటూ క్రీకంట లక్ష్మణుణ్ణి చూశాడు.

వాలి చుట్టూ చేరి ఏడుస్తోన్న స్త్రీలనీ, అంగదుణ్ణీ చూసి.... జాలిపడుతోన్న లక్ష్మణుడు అన్నగారి కంటిచూపు హెచ్చరికలతో దీక్షగా నిట్టూర్చి— పని కుపక్రమించాడు.

"సుగ్రీవుడా ! అంగదుణ్ణి ఓదార్చాలి గానీ ... నువ్వో చిన్నపిల్లవాడిలాగ దుఃఖపడతా వేమిటి ? ఇక రాజ్యంలో పంచి పెట్టలన్నీ నువ్వే చూసుకోవాలి. లేచి ప్రయత్నాలన్నీ చెయ్యి. తారా ! మీ రిందరూ వుండి ఇంత ఆలస్యం చేస్తే ఎలాగోయీ ? ఇంకేం చూస్తారు? అంతా అయిపోయింది. ఇలాంటి సమయాల్లో పనులు తొందరగా జరిగిపోవాలి. అన్నగారు తొందర పడుతున్నారు .. శవాన్ని తొందరగా ఎత్తండి చెయ్యండి ..." — అంటూ అందర్నీ తొందర పెట్టాడు.

క్షణాలలో పల్లకీ వొచ్చింది.

సుగ్రీవుడు — పంచెతో కళ్ళు వొత్తుకుంటూ — "హనుమంతుడా ! .... మా అన్నగారికి .. వైభోగంగా కర్మ జరగాలి సుమా ! ఆఁ .... ఏమీ లోటు చెయ్యకండి. గంధం చెక్కలు బళ్ళకొద్దీ తెప్పించండి. నెయ్యి కుండలకొద్దీ గుమ్మరించండి. బ్రాహ్మలందరికీ దానధర్మాలు చెయ్యండి .... అయ్యో ! అన్నా ! .... నువ్వు లేకుండా ఎలా బతకను .... నన్ను కూడా తీసుకుపో.... అయ్యో ! ...." గట్టిగా కంఠం ఎత్తాడు.

అందరూ పల్లకీవెంట ఏడుస్తూ నడుస్తున్నారు. ఆ ఏడుపుల్లో తన కంఠం వినబడుతుండడమే నమ్మకం లేక సుగ్రీవుడు ఏడవడం మొదలు పెట్టుకున్నాడు.

చితి పేర్చారు.

రాముడు దూరంగా నిలబడి పురోహితులకి పౌరోహిత్యం .... ఆదేశాలూ శాస్త్రోక్తంగా ఇస్తున్నాడు.

అంగదుడు చితి అంటించాడు.

తార దుఃఖంతో — "నాథుడా !.... మమ్మల్ని విడిచిపోతున్నావా ? .... ఇక ఎన్నటికీ చూడలేమా ? అయ్యో ! .... నువ్వు లేని మా జన్మ ఎంత దైన్యమో !" — అంటూ మూర్ఛపోయింది.

సుగ్రీవుడు అటూ ఇటూ చూసి — "నేనిక బతకను .... చితిలో పడిపోతాను . దుర్మార్గుణ్ణి. అయ్యో !...." అంటూ చితి దగ్గరికి పరిగెత్తాడు.

హనుమంతుడూ, లక్ష్మణుడూ వెళ్ళి చేరొక వైపూ పట్టుకుని వెనక్కి లాక్కొచ్చారు.

— "వదలండి నన్ను. చచ్చిపోతాను. మా అన్న లేకుండా.... నేను బతకలేను .... వదలండి" — అంటూ మళ్ళీ పరిగెత్తాడు.

"తొయ్యండి గాడిద కొడుకుని మంటల్లోకి. వాణ్ణీ, రాముణ్ణీకూడా కలిపి తొయ్యండి" — అని ఎవరో గుంపులోంచి ఆవేశంగా అరిచారు.

సుగ్రీవుణ్ణి మళ్ళీ లాక్కొచ్చారు.

"నేనిక బతకలేను .... చచ్చిపోతాను" — అంటూ మళ్ళీ చితి దగ్గరికి వెళ్ళకుండా కూలబడ్డాడు సుగ్రీవుడు.

హనుమంతుడు చుట్టూ పదిమందినీ చూస్తూ — "మీ కందరికీ రాముడిమీద కోపంగా వున్నట్టుంది ... ఆయన నిమిత్తమాత్రుడు సుమా ! పరమ సాత్వికుడు. గంగిగోవు లాంటి వాడు. చీమకయినా హాని చేయలేడు .... ఇన్ని మాటలెందుకు ? .... నోట్లో వేలు పెట్టి తోస్తే కొరకలేడు.

కావాలంటే చూడండి" — అని చటుక్కున రాముడి నోట్లో వేలు పెట్టాడు.

రాముడు తెల్ల బోయి, గంభీరంగా హనుమంతుడి వేలు చప్పరించి వూరుకున్నాడు.

, హనుమంతుడు వేలు బయటకు తీసి — "చూశారా ? .... ఎంత సాత్వికుడో ! .... ఇప్పుడన్నా నా మాట నమ్ముతారా ?" — అని ప్రజలందర్నీ చూశాడు.

కొందరు ప్రజలు ఆశ్చర్యంగా — "నిజంగా కొరకలేదా ? ... అబ్బ ! .... ఎంత మంచివాడో ! .... ఏదీ ? .... వేలు చూడనియ్యి" .... అంటూ హనుమంతుడిచుట్టూ జేరారు. బాణం సంగతి మర్చిపోయి వేలు సంగతిలో పడ్డారు.

"రాముడు వేలు కొరుకుతాడా ? లేదా ?" — అనే విషయం మీద కొందరు యువకులు తీవ్రంగా చర్చించుకుంటున్నారు – దూరంగా పోయి.

"కొరుకుతాడ"న్నారు కొందరు.

"కొరకడు. మనం చూశాం కదా ?" — అన్నారు కొందరు.

"హనుమంతుడి వేలు గాబట్టి కొరకలేదు. వాళ్ళూ వాళ్ళూ ఒకటే. మన వేలయితే ఎందుకు కొరకడూ ? కావాలంటే నీ వేలు పెట్టి చూడు."

"ఛీ ! నే నెందుకు పెడతానూ ? .... అడ్డమైనవాళ్ళ నోళ్ళలోనూ నా వేళ్ళు పెడతానా ? మాటలు తీన్నగా రానియ్యి" — అని కోపం తెచ్చుకున్నాడా యువకుడు — పక్కవాడిమీద.

"రాముడి నోట్లో నేను వేలు పెడతానర్రా ! ఏంచేస్తాడో చూద్దాం-"

"నిన్ను కొరక్కపోతే నేనూ పెడతాను."

ఇద్దరు ముగ్గురు వీరులు రాముడి దగ్గిరికి బయల్దేరారు, వేళ్ళు జెండాల్లా ఎత్తి.

ముందు హనుమంతుడి దగ్గిరికి వెళ్ళి — "రాముడి నోట్లో వేళ్లు పెట్టాలి మేం" అన్నారు కోపంగా.

"అయ్యో ! .... అదెంత పని ? ... పెట్టండి. మీకే తెలుస్తుంది. ఎంత సాత్వికుడో ...." — అని వినయంగా నమస్కారం పెట్టాడు హనుమంతుడు.

రాముడు గంభీరంగా చూస్తున్నాడు.

ఒక యువకుడొచ్చి రాముడి నోట్లో కోపంగా వేలు దోపాడు — ఏం చేసుకుంటావో చేసుకో — అన్నట్లు.

రాముడు గుటకమింగి వూరుకున్నాడు.

తర్వాత ఇంకో యువకుడు రెండు వేళ్ళూ పెట్టాడు.

ఇంకా కొందరు ఆశ్చర్యంగా ఎడం వేళ్ళూ, కుడి వేళ్ళూ, చుట్ట వేళ్ళూ, ముక్కులు చీది పంచెకి తుడుచుకున్న వేళ్ళూ — తుడుచుకోని వేళ్ళూ అన్నీ పెట్టారు.

రాముడు వొక్క వేలన్నా కొరకలేదు.

అన్నీ చీకి విడిచిపెట్టాడు.

"ఆశ్చర్యంగానే వుంది" — అని కొందరు రాముణ్ణి భక్తిగా చూశారు.

"ఏం ఆశ్చర్యం లేదు. అదోవేషం. నమ్మకండి" — అని ఒకాయన రహస్యంగా నచ్చజెపుతున్నాడు కొందరికి.

అంతా అయిపోయింది. వాలి .... మట్టిలో .... గాలిలో .... కలిసిపోయాడు. చితి ఆవేశం తగ్గి ఆరిపోయింది. స్మశానం నుంచి ఇవతలికి రాగానే కొందరికి స్మశాన వైరాగ్యమూ పోయింది.

హనుమంతుడు రాముడికి నమస్కారం చేస్తూ — "ప్రభూ ! నీ కరుణ వలనే సుగ్రీవుడు ఇంత దుర్లభమైన రాజ్యం పొందగలిగాడు. ఇక తర్వాతేం జరగాలో నువ్వే ఆజ్ఞాపించు. నీ ఆజ్ఞకు వ్యతిరేకంగా సుగ్రీవు డేమీ చెయ్యడు. పట్టాభిషేకం చేసుకుని, నిన్ను సగౌరవంగా పూజించుకుంటాడు. సుగ్రీవుణ్ణి నీ చేతులతో పట్టే రాజుని చెయ్యి. నువ్వు నిలబడి ఆ పనికూడా జరిపిస్తే . నిన్నెవరూ ధిక్కరించలేరు" — అని వినయంగా చూశాడు.

ప్రజల్లో సుగ్రీవుడికి చాలా వ్యతిరేకత వున్నట్టు రాముడు గమనిస్తూనే వున్నాడు. ఎవ్వరూ స్పష్టంగా వ్యక్తం చేయకపోయినా .... చాలామంది వాలి మరణానికి ఆవేశ పడుతూనే వున్నారు. సుగ్రీవుడి పట్టాభిషేకాని కేమీ ఇబ్బంది కలగక పోవచ్చుగానీ .... వెంటనే రావణుడితో యుద్ధం మాత్రం జరిగేటని కాదు. ముందు సుగ్రీవుడు కొంత సిద్ధపడాలి. సైన్యాన్ని అదుపులోకి తీసుకోవాలి. ప్రజల్ని మచ్చిక చేసుకోవాలి. ఈ రాజ్య వ్యవహారాలు తనుకూడా క్షుణ్ణంగా గ్రహించాలంటే కొంతకాలం పడుతుంది. అంతవరకూ వేచి వుండక తప్పదు.

రాముడు గంభీరమైన చిరునవ్వుతో — హనుమంతుణ్ణి చూస్తూ — "హనుమంతుడా! సుగ్రీవుడి పట్టాభిషేక మహోత్సవం మీరే జరిపించండి. నేను వనాలలో తప్ప గ్రామాలలో గానీ, పట్టణాలలోగానీ ప్రవేశించరాదు. అది నా తండ్రి ఆజ్ఞ. మీరందరూ వుండగా పట్టాభిషేకానికి ఎటువంటి ఇబ్బందులూ సంభవించవు. భయపడవొద్దు.

సుగ్రీవుడా! అంగదుడు నీ అన్న కొడుకు గదా? యువరాజు కావటానికి అతడే అర్హుడు. అంగదుణ్ణే యువరాజుగా చేసుకో.

ఇక త్వరలోనే వర్షాకాలం ప్రారంభ మవుతోంది. సీతని వెదకడాని కిది సమయంగాదు. ఈ నాలుగు మాసాలూ గడిచిపోతే. కార్తీక మాసంలో నాకు చెయ్యవలసిన సహాయం చెయ్యవొచ్చును. అంతవరకూ ...."

ఎవరో వెనక గుంపులోంచి — "ఆ రావణుడితో యుద్ధానికి కుదరదేమో గానీ ... పెళ్ళాన్ని వెతుక్కోటానికి వానాకాలం ఏం అడ్డొచ్చిందీ? వానాకాలంలో అందరూ పనులు మానేసుకుంటారా? ... వానలో తడిస్తే మొక్కలు మొలుస్తాయి గావున్ను" — అంటున్నారు.

రాముడు మాటలాపి .... బాగానే ఏన్నాడు. అసలేమీ వినపడనట్టే మొహం గంభీరంచేసి — "సుగ్రీవుడా! నేను లక్ష్మణుడితో ఋష్యమూక పర్వతంమీద గుహలో కాలం గడుపుకుంటాను. నువ్వు వెంటనే పట్టాభిషేకం చేసుకొని నీ బంధు మిత్రులకు సంతోషం కలిగించు" — అని చిరునవ్వు నవ్వాడు.

"చిత్తం ! నీ ఆజ్ఞ !" — అంటూ సుగ్రీవుడు భక్తితో వొంగి రాముడి పాదాలకు నమస్కారం చేశాడు.

సుగ్రీవుడికి రాముడిమీద భక్తి అధికమై పోతోంది.

బతుకంతా ఆ కొండలమీదే గడిపెయ్యాలేమో అనుకున్నాడుగానీ అంతా హాయవుతుల్లే తారుమారై పోయింది

• • •

సుగ్రీవుడి పట్టాభిషేక మహోత్సవాలు మహా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎప్పుడే అవాంతరం ఎదురవుతుందోనని సుగ్రీవుడు బితుకు బితుకు లాడుతోనే వున్నాడు. కానీ.... ఏమీ జరగలేదు. బహుశా లాభ ఆజ్ఞ అయివుండాలి.

తారని గౌరవించి, తన పక్షం చేసుకోవాలని సుగ్రీవుడు ఆమె అంతఃపురానికి వెళ్లాడు. తార తల వొంచుకుని జలజల కన్నీళ్లు కార్చి వూరుకుంది.

పట్టాభిషేక ముహూర్తం దగ్గిర పడుతోందంటే సుగ్రీవుడికి అందమైన స్త్రీలు సుతారంగా సేలుగులు పెట్టి స్నానాలు చేయించారు. చందనం పూతలు పూశారు. వొళ్ళంతా రాజలాంఛనాలతో అలంకారాలు చేస్తోంటే .... వొంటి నొప్పులన్నీ సర్దుకున్నాయి — గూళ్ళ నొప్పులు తప్ప. నెత్తిమీద కిరీటం ఎక్కేసరికి — ఆ గూళ్ళ నొప్పులు కూడా మాయం అయిపోయాయి.

సింహాసనంమీద అటూ ఇటూ కదిలి పక్కకి చూశాడు సుగ్రీవుడు. భార్య కనబడింది — "అవును సుమా ! నాకు భార్య వుంది సుమా !" — అని ఆశ్చర్యపడాడు. మొహమంతా నవ్వు తెచ్చుకుంటూ — "బాగున్నావా ?.... నీ కోసమే ఇదంతా చేశాను. తెలుసా ?" — అన్నాడు.

పుష్ప సిగ్గుపడి తల వొంచుకుంది. *
తర్వాత బ్రాహ్మలకు దానధర్మాలు విరివిగా జరిగాయి.
రాజ్యంనిండా శ్రీరాముణ్ణి గురించి పూజలూ, భజనలూ, స్తోత్రాలూ సాగుతున్నాయి.

ఆస్థానకవులు, శ్రీరామచంద్రుడి మహోన్నత గుణాలమీదా, అపురూప దేహ సౌందర్యంమీదా, రాత్రింబవళ్ళూ కూర్చుచి రాసిన పాటలు గానం చేస్తున్నారు.

ఆస్థాన పురోహితులు కంఠాలెత్తి— "శ్రీరామచంద్రా ! కోసలాధిపతీ ! పితృవాక్య పరిపాలకుడా ! ఆర్తత్రాణ పరాయణుడా ! దుష్ట శిక్షకుడా ! శిష్ట రక్షకుడా ! కరుణా సముద్రుడా !...." అంటూ రుష్య మూకానికి వినిపించేట్టు గావుకేక లేస్తున్నారు.

---

* 28 వ సర్గలో — ఆఖరి శ్లోకం.

"సుగ్రీవుడు భార్యయగు రుమను బడసి కిష్కింధలో పట్టాభిషేకము జేసికొని శ్రీరాముని సన్నిధిలో నీ విషయము దెలిపి ఇంద్రుని వలె రాజ్యము ననుభవించుచుండెను."—

కొంతకాలం వాలితో వున్న భార్యని సుగ్రీవుడు తిరస్కరించ లేదు. ఆ జాతిలో స్త్రీలకు పాతివ్రత్య నియమం లేదు.

స్నేహబంధం

ఆకాశంనిండా క్రాపిణి మేఘాలు పెళ్ళిమేళం మల్లే సందడి చేస్తున్నాయి.

గాలి అడిపింతా తిప్పుతూ — "వానొస్తోందర్రా: వానొస్తోంది. తెలిసిందా మీకు ?" — అని చెప్పుకుంటూ పరుగులు తీస్తోంది.

"రానియ్య, రానియ్య," — అని చెట్లు సంతోషంతో తల లూపుతున్నాయి.

కొన్ని పిట్టలు ఆకాశంవేపు చూసి — "అబ్బే : చంతా పుత్త ఆర్భాటమే. నిన్నా ఇలాగే పురిమి వూరుకుంది," — అని నిరుత్సాహ పడుతున్నాయి.

"నా ముక్కుమీదో చినుకు పడిందర్రోయ్ :" — అని అరిచిందో చిలకపిల్ల. — నిజంగానే దాని ఎర్రటి ముక్కుమీద ముత్యం మల్లే మెరుస్తోంది సీటి చినుకు.

"వానంటే ఎవరే అమ్మా ?" — అని చిన్నిచిన్ని పావురం పిల్లలు వాళ్ళమ్మని అడుగుతున్నాయి.

వాళ్ళమ్మ పిల్లల మాటలకు మురిసిపోతూ నవ్వి — "వానంటే .... ఎవరంటే.... ఇప్పుడొస్తుందిగా ?.... చూపిస్తాను. ఏం ? ఆకాశం లోంచి టోపెడు నీళ్ళొస్తాయి." — అంటూ పైకి చూపించింది.

"ఎవరింటి కొస్తాయి? :మనింటికేనా?"

"ఛ! అంచరిళ్ళకే పోస్తాయి."

"ఎవరు పోస్తారు? దేవుడేనా?"

"ఛ! ఆ మేఘాలు లేవూ ? .... వర్షాలు. అవి ఎక్కడ్నించో నీళ్ళు తెచ్చి...."

"ఇదుగో! నా దెక్కడివి కూడా చినుకు పడించర్రా ! ఇవ్వాళ తప్పకుండా పానొస్తుంది." — అని అరిచింది పిపీక.

"నరే ! రానివ్వండి అంతకన్నా ఏం గావాలి?" పిట్టల సంచారంతో, చిప్పల మువ్వల్లతో, జంతువుల పరుగులతో, గాలి తీరులతో— అడివంతా సందడి సందడిగా వుంది.

రాముడు గుహ బయటనే తురాయి చెట్టుకింద రుషిమళ్లే కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు— రావణుడితో యుద్ధం గురించో — కైకపుట ఇంకా తీరని కక్ష గురించో.

తురాయిచెట్టు అల్లరి పిల్లమళ్లే వూగుతోంది. గాలి చక్కిలిగింతలు పెడుతోంటే గుక్క తిప్పుకోకుండా నవ్వుతూ, వూగుతూ, కొండకింద వాగు మీదకి విరగబడుతోంది. వూలన్నీ వాగులోకి రాలుస్తోంది.

—"అబ్బ !.... ఈ పాడు గాలి.... నిలవనిప్పడం లేదర్రా!"

"అదుగో! నన్నంటా వెందుకూ? నీ కెప్పుడన్నా కుదురేసిస్తేనా? ఎప్పుడూ నవ్వుతా, కిలకిలమ్మే! బుద్ధీ జ్ఞానం లేకుండా వూలన్నీ వాగులో పారబోసుకుంటావు."

"చాలెదూ ! ఏమి ఎరగనట్టే మాటాడతావు. .... నువ్వసలు నా జోలికి రాకు. అటు మర్రిచెట్టవేపో, మదిచెట్టవేపో పోరాదూ ?.... అ సమా నన్నేడిపిస్తా వెందుకూ?" — అంటూ తురాయిచెట్టు గాలితో పోట్లాడి నిలబడాలని ప్రయత్నం చేస్తోంది.

బండల చాటునించి మోదుగుచెట్టు కలగజేసుకుని తురాయికి నచ్చచెబుతూ — "నువ్వింకా చిన్నదానివని గాలి ఆట పట్టిస్తోంది లేమ్మా : చిన్నప్పుడు నన్నూ ఇలాగే చేసేది. అంతమాత్రాన కోపం

తెచ్చుకోకూడదు మరి," — అని పెద్దతనంతో తల పంకించి వూరుకుంది.

రుష్యమూకంమీద విశాలంగా ఆ గుహ — ఎప్పుడూ కొదవలేనంత గాలీ — గుహ పక్కనే కొండకింద పారే వాగూ — ఇంకో పక్క కొండలమధ్య చక్కని సపసవ్వా — దూరంగా రత్నకంబళం పులే కనబడే పంపా — కిష్కింధవేపు పొలాల్లో నిత్యం పనులు చేసుకునే రైతులూ — అడవిలోకి పశువుల్ని తోలుకొచ్చే పిల్లల ఆట పాటలూ — చుట్టుపక్కల పల్లెలనుంచి కిష్కింధకు వొచ్చే పోయే బాటసారులూ — పెదు చూసినా కాలక్షేపం అవుతూ రామునికి రుష్యమూకం మీద నివాసం సౌఖ్యంగానే వుంది —

దండకారణ్యం నుంచి బయల్దేరింది మొదలూ ఈ ఐదారు నెలలూ .... తిరిగి.... తిరిగి .. ఇంత కాలానికి మళ్ళీ వొక స్థావరం....

రోజులు దొర్లిపోతూనే వున్నాయి.

కిష్కింధలో సుగ్రీవుడి అధికారం స్థిరపడినట్టే ఉంది. — సందేహం లేదు.

ఆలోచనల్లో మునిగివున్న — రాముణ్ణి — గాలి "వొచ్చాన్నోయ్. తెలిసిందా నీకు!" — అని రాచుకుంటూ వొంటరి కిందకిపోయి లక్ష్మణుణ్ణి పలకరిస్తోంది.

లక్ష్మణుడు తాటిపళ్ళు కాలుస్తూ — "నువ్వెటు రాసు" — అని గాలికి అడ్డం కూర్చున్నాడు.

పిట్టల కోలాహలానికి తలెత్తి చుట్టూ చూశాడు.

పిట్టల కూతలన్నీ అర్థమౌతాయి లక్ష్మణుడికి. ఏ పిట్ట ఏ రకంగా కూస్తుందో, వొక్క పిట్టే ఎన్ని రకాల కూస్తుందో బాగా తెలుసుండి. పిట్టలు గూళ్ళలో తీరిగ్గా కూచుని పలకరించుకునే పలకరింపులూ — దూరంలోవున్న స్నేహితుల్ని అరిచి పిలిచే పిలుపులూ — పక్షో, పిల్లగులో చూసి సంతోషంతో చేసే సందళ్ళూ — పెటగాళ్ళనో, గూళ్ళలోకి జొరబడే పాములో చూసి, కెవ్వున భయంతో అరిచే అరుపులూ — అన్నీ స్పష్టంగానే అర్థమౌతాయి.

వాన కోసం పిట్టల సంతోషం అర్థమైంది లక్ష్మణుడికి. — ఆకాశం చూశాడు.

పర్వతాలమీద పర్వతాలు తిరుగుతోన్నట్లు రుష్యమూకంమీద నలటి మేఘాలు తేలుతున్నాయి. మేఘాలు అక్కడక్కడా కిందకుదిగి ప్రశాంతికోసం పర్వత శిఖరాలమీద గుమిగూడు తున్నాయి. చక్కగా మేఘాల మెట్టవెంట ఎక్కిపోయి, సూర్యుడి మెడలో పూలదండ వెయ్యవచ్చు ననిపిస్తోంది.

సన్న సన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి. గాలి చిలిపితనంతో చినుకులు ఎగరగొడుతోంది. పిట్టలు చినుకుల్లో ఎగిరి, రెక్కలు తడుపు కుంటున్నాయి. మేఘాలలోంచి కొంగలు, బారులు బారులుగా తెల్ల తామరపూల హారాలమల్లే ఎగురుతున్నాయి. పువ్వు మల్లే గుంపుగా ఎగిరే పిట్టలు ... పూల రేకులన్నీ విడిపోయినట్టు .... చెల్లాచెదురై గూళ్ళ వేపు పోతున్నాయి.

గొడ్లని మేపుకునే పిల్లలు కేకలతో, నవ్వులతో గొడ్లని కిష్కింధ వేపు తోలుకుపోతున్నారు.

లక్ష్మణుడు ఆకాశం పరికించి — "అన్నగారూ : వర్షం బాగా పడేటే కనబడుతోంది. లేచి పందిరికింద విశ్రమించండి. మీకు చాలా ఇష్టమని చింతచిగురు వేసి చేపలు వొండాను. తాటిబెల్లా, ఎర్ర దుంపలూ కాల్చాను. వేడివేడిగా భుజించండి" — అంటూ అన్నగారికి విన్నవించాడు.

రాముడు — రావణుడితో చెయ్యబోయే యుద్ధంలోంచి కొంచెం తేరుకుని, ఆకాశంవేపు చూసి తల పంకిస్తూ — "అవును. ఇది వర్ష రుతువే నోయీ !" — అని వొప్పుకున్నాడు. — వెంటనే వర్షరుతు వర్ణనలన్నీ గుర్తు వొచ్చాయి.

వర్ష రుతువులో — ఏళ్ళూ వూళ్ళూ ఏకమైపోయే అడవులూ — ప్రియాలింగనాలకోసం పురుకులతో, పరుగులతో పోయే నదులూ — శరకరకాల ఓషధుల సరిమళాలతో .... గుబాళిస్తూ — మదజలం స్రవించే

మదగజాలమల్లే పెలయేళ్ళతో నిండిపోయే పర్వతాలూ — అన్నిటి వర్ణనలూ మనసునిండా మెదిలాయి. — "అవును. వర్షరుతువు బహా సుందరమైనది" — అని తల పంకించాడు.

రాముడి ధ్యాస అంతా యుద్ధాలోచనలమీదే వుంది — "లక్ష్మణా! .... మేఘాలు యుద్ధ భేరీలలాగు గర్జిస్తున్నాయి. చూడు. పర్వతాలు.... యుద్ధాలలో ఏనుగులమల్లే ప్రతిధ్వనులతో ఘీంకరిస్తున్నాయి సుమా! ఈ రుతువులో రాజులు యుద్ధాలు నిలుపుజేస్తారు. యుద్ధ సేనలు స్వస్థలాలకు తిరిగి వొస్తాయి" — అంటూ కొంతసేపు యుద్ధాలగురించి ముచ్చటించాడు.

"లక్ష్మణా! ఆ మేఘ సముదాయం చూడవోయీ!

ఆకాశం ఎంత సుందరంగా సంధ్యారాగ చందనం పూసుకుందో చూడు. స్త్రీల కౌగిళ్ళకోసం అతృత పడుతోన్న కామకుడి లాగు ఆకాశం మందమారుతాలు నిశ్వసిస్తోంది చూడు.... ఈ వర్షరుతువులో స్త్రీల సామీప్యమే పురుషుడికి అమితంగా సుఖం కలిగిసుందోయీ!"

"చిత్రం!"— అని లక్ష్మణుడు కొంచెం సందేహంలో పడ్డాడు — పురుషుడికి గొప్ప సంతోషం కలిగించేది వసంత రుతువేనని అన్న గారు చెప్పినట్టు గుర్తు. ఇప్పుడు వర్షరుతువు అంటున్నారు — ఇదే గొప్పది కావున్ను. — అన్నగారికి అన్నీ తెలుసు.

నాన ఎక్కువవుతోంది.

తురాయి కొమ్మలు రాముడితో ఆటమల్లె అటూ ఇటూ తప్పుకుంటున్నాయి. వొళ్ళంతా తడిసి రాముడు గబగబా లేచాడు.

భూమి జలు జలులుగా పడే నీటిని ఆలింగనం చేసుకుంటూ ఆతృతతో— "వొచ్చావా? వొచ్చావా?" అని లోపలికి తీసుకుంటోంది — "ప్రియా! నీ ఎడబాటు ఎంత దుర్భరమోయీ! ఎన్ని దినాలుగా నిరీక్షిస్తున్నానో గదా నీ కోసం!"— అంటూ వుద్వేగంతో ఆవిరు గక్కుతూ వెచ్చగా నిట్టూరుస్తోంది. — చెట్టూ, చేమా, మొక్కా మోడూ తడిసి పరవశంతో సొమ్మసిలుతున్నాయి. గాలి మబ్బు పరిమళాలు మోసుకుపోయి చుట్టూ పంచిపెడుతోంది. నెమళ్ళు వాసన

తడుస్తూ కూస్తున్నాయి. మేఘాలు నెపుళ్ళ మల్లేనే పరిమి చాటిని ఆట పట్టిస్తున్నాయి. తుమ్మెదలు వర్షానికి జడిసి అందిన, ఆకుల అడుగున దాక్కుంటున్నాయి. అన్ని చెట్లకీ నేరేడుపళ్ళ కాతాయేమిటని అడివి ఆశ్చర్యపోతోంది.

వరదారలతో జగత్తంతా తనను తను అభిషేకం చేసుకుంటోంది. పాలు తాగుతూ తాగుతూ కళ్ళుమూసి నిద్రపోయిన శిశువుమల్లే అడివి పంతా వర్షంలో తడిసి తడిసి నందడి తగ్గి నిశ్శబ్దం అయింది.

ఆకాశం వుధృతంగా అలలు లచిన సముద్రంమల్లే వుంది. ఆ సముద్రమంతా భూమికి దిగుతోన్నట్టు కుమసోంది వర్షం ; — ఆకాశం తడిసి, మెత్తగా కరిగి, జారిపోతోన్నట్టు కుమసోంది వర్షం ; — రుష్యమూకం మీద ఆ గుహ తప్ప — చుట్టూ ప్రపంచమంతా, నీటిలో తునిగిపోయినంత భయంకరంగా వుంది. పెళ్ళున ఆకాశం విరిగి, రాళ్ళు జారి, పర్వతాలమీద పడుతోన్నట్టు చప్పుడు చేస్తోంది వర్షం ;

"అమ్మా ! భయం వేస్తోందే !" — అంటూ తల్లిని కావలించుకుంది పావురం పిల్ల.

"లేదమ్మా ! .... భయంలేదు. తగ్గిపోతుంది. చూడు — అన్న ఎంత ధైర్యంగా వున్నాడో !"

"నాకూ భయంగానే వుందే అమ్మా !" — అని అన్న తల్లి రెక్కల్లో దూరాడు.

"వాన అంటే ఇలాగుంటుందా ? .... ఛీ ! మన కెప్పుడూ వాన వొద్దే అమ్మా !" — అని చెల్లి బిక్కమొహం వేసింది.

"తప్పు. అలా అనకూడదు. వాన లేకపోతే అందరికీ ఎంత కష్టం ! .... లేపు నువ్వే చూస్తావుగా ? ఎన్ని కొత్త చెరువులో, ఎన్ని కొత్త వాగులో — ఎన్ని చేపలో — ఎన్ని పురుగులో .... ఆరుద్ర పురుగులంటే నీ కెంతో ఇష్టంగా ! లేపు పుట్టలు పుట్టలు లేస్తాయి. బోలెడు తెచ్చి పెడతాను. వాన పోయాక రెండు రోజుల్లో ఎంత బాగుంటుందో తెలుసా ? ... ఎటుచూసినా పువ్వులే. రంగు రంగులు. చెట్ల

నిండా గుబుర గుబుర్లుగా ఆకులొస్తాయి. మనకేమి భయం వుండదు. వేటగాళ్ళకు కనబడకుండా దాక్కోవచ్చు."

"ఆకాశం అలా కేకలేస్తోం దెందుకూ ?"

"అది కేకలెయ్యడం కాదు. మేఘాల్లోంచి వాన పడుతోందిగా ; .... అంచేత మేఘాలు పురిటి నొప్పులు పడ్తుతున్నాయి. అంతే."

"అమ్మా ! ఆకాశంలో ఎవరుంటారే ?"

"ఏమోనర్రా ! నే నెప్పుడూ చూడలేదు."

"మనం ఎగిరి .... ఎగిరి .... పైకిపోయి .... దేవుడున్నాడేమో చూద్దామే."

"అమ్మో ! ఎలా వెళ్ళాం ? ... పగలు వెళ్ళాం అంటే ఎంత ఎండో ! .... వెళ్ళలేం. రాత్రి వెళ్తే ఎంత చీకటో ! ... అసలు వెళ్ళలేం."

"పోనీ దేవుడెప్పుడూ కిందికి రాడూ ?"

పక్క గూట్లోంచి — "దేవు డంటున్నా రేమిటర్రా ?" అని చిలక పలకరించింది.

"ఓళ్ళిద్దరూ దేవుణ్ణి చూడాలని సరదా పడుతున్నా రొదినా !" —

"దేవుడంటే జ్ఞాపకం వొచ్చింది .... రుష్యమూకం మీద పెద్ద గుహలో .... ముల్లటాయస లేడూ ? .... ఆయనే దేవుడట.

"ఛ ! వూరుకో .... పాడు మాటలు ...."

"వూరుకో కాదు. ఆయనే దేవుడట ! కావాలంటే రేపు ఆ గుహ దగ్గరికి పోయి చూద్దాంగా ?"

"చూస్తే మాత్రం ఏం తెలుస్తుందిగానీ, ఆ పెద్ద గుహలో పందులుండేవి కాదుటమ్మా ? దేవు డెప్పుడొచ్చాడూ ?

"అబ్బే ! ఆ పందుల గుహకాదు వొదినా ! కిష్కింధపేపు .... తురాయి చెట్టు దగ్గిర గుహ లేదూ ? .... అందులో ఇద్దరు సన్యాసులుండడం లేదూ ? .... వాళ్ళల్లో పెద్ద సన్యాసే దేవుడట."

"ఏదీ ? .... ఆ వాగుపేపు గుహలోనే కాదూ నువ్వనేదీ ? ...."

"ఆ ఏందుకోనే. ఆయన భార్య నెవరో ఎత్తుకు పోయారట. వెతుక్కుంటూ వొచ్చి ఇక్కడుంటున్నాడు.

"ప్రమ్మా! మనకీ సన్నాసి దేవుడొద్దే. మంచి దేవుణ్ణి చూద్దామే" — అని గొడవ చేస్తున్నాయి పిల్లలు.

వాళ్ళమ్మ విసుక్కుని— "ఎవరితోన్నా మాట్లాడుతోంటే అల్లరి చెయ్యకూడదని చెప్పానా?"— అని పిల్లల్ని కోప్పడి మళ్ళీ పక్కింటావిడ వేపు చూసూ— "మరి ఇక్కడే కూచుంటే భార్య ఎలా దొరుకుతుందీ? ఎటన్నా తిరిగి వెతుక్కోడేం?"— అని మాటల్లోకి దిగింది.

"అబ్బే! ఇక ఈయన వెతుక్కోక్కర్లేదట. అదంతా సుగ్రీవుడే చూసుకోవాలి. అలా వొప్పందం చేసుకున్నాక ఈయనకేం పట్టింది వెతుక్కునేదాకా? సుగ్రీవుడే వెతికి పెడతాడు. ఎవడికోసం వెతికి పెడతాడూ? ఈయన మొన్నటిదాకా వెతుక్కుంటూనే వున్నాడట. ఈ వొప్పందం తర్వాతే మానేశాడు గానీ...."

"బాగానేవుంది వొప్పందం.... ఎలా తెలుస్తాయో గానీ ఎక్కడెక్కడి సంగతులూ నికే తెలుసాయి వొదినా!"

"నువ్వీ మధ్య పిల్లలో తేమలక దూరంగా రావడంలేదు గానీ, కిష్కింధవేపు- పోతే- సుగ్రీవుడి మందిరాలవేపు ఎన్ని పాటలో ఈయన్ని గురించి.... చిన్నప్పట్నించీ చాలా గొప్పవాడట...."

"ఏమోనమ్మా: అన్నీ నమ్మకూడదు. వున్నవీ లేనివీ కల్పించి చెబుతారు. ఈయన్ని గురించి ఎవరింట్లో ఏం గునగున లాడుకుంటున్నారో మనకేం తెలుస్తుందిగా పాటలూ కేకలూ వినబడతాయి గానీ...."

"బాగా అన్నావు .. అసలు సంగతి విను మరీ: ఈయనమీద పాడే పాటలన్నీ ఏవిటో తెలుసా?.... ఈయన చిన్నప్పట్నించే ఎవరెవర్నో చంపాడట.... ఇంకా చంపుతాడట కూడానూ."

"ఛీ! మనకి చంపే దేవుడొద్దే అమ్మా!" — అని పిల్లలు అమ్మ చివాట్లు మర్చిపోయి మళ్ళీ పేచీ మొదలెట్టాయి.

వాళ్ళమ్మ వినిపించుకోకుండా— "చంపడం అంటే గుర్తొచ్చింది. వాలిని చంపడం నా కళ్లారా చూశానుగా, ఆ పాడు బాణాలంటే నా

కెంత భయమో ! .... వాటి గురించి మన కేనాడన్నా తెలుసునా ? చచ్చునా : అందుకేనమ్మా నేను రుష్యమూకం వేపు వెళ్ళనే వెళ్ళను," — అని పిల్లల్ని దగ్గిరికి తీసుకుంది.

"మన్లో జోలికి రాములే వొదినా : ఈ మధ్య పంపల్లో చేలమీద పడ్డాము. రుష్యమూకం నించి పాములొస్తాయని అసలా గుహ వొదిలి బయటికి రావడం లేదు."

"అమ్మా ! మనకి గుహలో దేవుడొచ్చే. ఆకాశంలో దేవుణ్ణి చూద్దామే," — అని పిల్లలు గోల పెడుతోనే వున్నాయి.

వాళ్ళమ్మ పిల్లల్ని ముద్దెట్టుకుంటూ — "అలాగే వెళ్దాం మీరు పెద్దయ్యాక ఏం ?.... మీరే దారిలో.... ఎత్తుకోమని యేడవ కూడదు .... ఇక పడుకోండి. రేపు తొందరగా లేచి బోలెడు పురుగులు తినొచ్చు."

"ఎర్ర పురుగులేనా ?...."

"అమ్మా ! నాకు చెద పురుగులు కావాలే ...." — అంటూనే పిల్లలు నిద్రకి పడ్డాయి.

ఆకాశం బూచాడిలాగే జడిపిస్తోనే వుంది. తళుక్కున మెరిసి గుహ వొక్కసారి వెలిగి చీకట్లు కమ్మింది.

రాముడి మనస్సులో.... సీత.... రావణుడి బాహువుల్లో సీత .... తళుక్కున మెరిసి.... మనసంతా కామ చీకట్లు కమ్మింది.

గాలి పూర్తిగా వానలో తడిసి — చెట్లలోంచి, కొండలోంచి — గుహలో తల దాచుకోడాని కొస్తోంది. వొచ్చినప్పుడల్లా — గజ్జెల మోతలూ — మృదంగాల దరువులూ — వెంట తెస్తోంది — మాటిమాటికీ రాముడితో — "సుగ్రీవుడు నాట్యాలు చూస్తున్నాడు. పాటలు వింటున్నాడు. తెలుసా నీకు ?" — అని గుసగుస లాడుతోంది.

"అవును. వింటున్నాను. రోజూ వింటున్నాను," — అంటూ నిట్టూరుస్తున్నాడు రాముడు.

సుగ్రీవు డెంత అదృష్టవంతుడు :.... నిత్యం సుఖ భోగాలలో మునిగి తేలుతున్నాడు. రాజ్యం దొరికింది. భార్య దొరికింది .... తనూ అలాగే .... అయోధ్యలో పట్టాభిషేకం చేసుకుని సీతతో .... సీత తోనా ? .... సీత శీలం ? .... ఇంతకాలం పర పురుషుడి గృహంలో వున్న భార్యని స్వీకరించ వొచ్చునా ? .... లోకం మెచ్చుతుందా ? ....

పర పురుషుడితో భోగించిన స్త్రీని సుగ్రీవుడు నిస్సందేహంగా స్వీకరించాడు. అతడు ఆటవికుడు. వనచరుడు. మృగ తుల్యుడు. తన వంటి వ్యక్తియూ, జ్ఞానవంతుడూ అంత నీచకార్యం చెయ్యకూడదు. విద్యాధికులూ — పండితులూ — ఋషులూ — నిర్దేశించిన శాస్త్ర ధర్మాలు శీలవతిగాని స్త్రీని భర్త స్వీకరించడాని కెంతమాత్రం అంగీకరించవు.

ఏమిటీ ఆలోచనలు ? .... సీతని త్యజించడమా ? .... మహా పతివ్రత సీత..

పర పురుషుడికి లొంగుతుందా ? .... ఎన్నటికీ జరగదు. ఎంతో వుత్తమురాలు సీత ! .... సీత తల్లి కూడా మహా పతివ్రతే ! .... సీత చిన్నమ్మకూడా గొప్ప పతివ్రతని చెబుతారు ... సీత చెల్లెళ్ళు మాత్రం ? .... అందరూ పతివ్రతలే .... అసలు సీత పుట్టిన వంశమే పతివ్రతల వంశం. అంత గొప్ప వంశంలో పుట్టి సీత —రావణుణ్ణి కన్నెత్తయినా చూస్తుందా ? .... చూడదు. సందేహం లేదు.

ఆ దుర్మార్గుడితో యుద్ధం గురించే ఆలోచించాలి. అంతా సుగ్రీవుడి మీదే ఆధారం. రావణుణ్ణి చంపడం, వాలిని చంపినట్లు సామాన్యమైన పని కాదు. రాక్షస రాజుతో యుద్ధం ! గొప్ప సైన్యం కావాలి. బొక్కసం కావాలి. సుగ్రీవుడేం చేస్తాడో ! ఏం జరుగుతుందో ! జయాపజయాలెవరివో ! రావణుణ్ణికూడా చంపి, ఆ రాజ్యం కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధీనంలో వుంచుకో గలిగితే .... అంతలో ఈ వనవాసం ముగుస్తుంది. అయోధ్యకు పోయే శుభ క్షణాలు రానే వొస్తాయి .... అనుకున్నదంతా అనుకున్నట్లు జరుగుతుందా ? తానొకటి తలిస్తే దైవ మొకటి తలుస్తాడు.

— దీర్ఘంగా నిట్టూర్చాడు రాముడు — "లక్ష్మణా : నా వంటి దురదృష్టవంతుడు ఉంటాడా ఎక్కడైనా ? .... రాజ్యం పోవిలింది మొదలూ ఎన్ని కష్టాలు ; ఈ వనవాసం చక్కగా ముగిసి — పునం సుఖంగా అయోధ్యకు తిరిగిపోతే ఎంత బాగుండును !.... ఆ దుర్మార్గుడు ... వొంటరిగా వున్న 'సీత'ని .... ఆమె తప్పేముంది ; .... స్త్రీలు అబలలు. నిస్సహాయులు. నా ధర్మపత్నితో ఈ ఎడబాటు ఇంకెంతకాలమో గదా ? ఈ వసంతువు . ఈ చల్లగాలులు .... ఈ పువ్వులు .... ఈ పక్షులు .... రాత్రింబవళ్ళూ ఈ ఎడబాటు .... అయ్యో !.... నన్ను చంపెస్తోందే !" —

"అన్నగారూ : ... దుఃఖించవొద్దు. ధైర్యం వహించండి." —

"ఏమి ధైర్యమోయీ : ఈ విరహాగ్ని కాలుస్తోంది. రావణుడితో యుద్ధం గురించి తల్చుకుంటూ వుంటే ధైర్యం పూర్తిగా నశిస్తోంది ...."

"ఎంతమాట అన్నగారూ ! .... మీరు పూర్తిగా దుఃఖ సాగరంలో మునిగి అధైర్యపడుతున్నారేగానీ .... మీ రెంతటి పరాక్రమవంతులో మీ రెరుగరు. ధైర్యం వహించండి. ఇక ఎంతోకాలం పట్టదు. ఈ వసంతకాలం గడిచిపోతే శత్రువుని చంపడానికి అన్ని ప్రయత్నాలూ చేసుకొని, యుద్ధానికి పోవచ్చును. వొదినగార్ని తప్పకుండా ఆ దుర్మార్గుడి చెర నుంచి విడిపించ వొచ్చును. ఏ కార్యం ఎలా నిర్వర్తించుకోవాలో తెలిసిన మహానుభావులు మీరు. ధర్మాత్ములు. దైవనిష్ఠాపరులు. ఆస్తికులు. జ్ఞానులు. మీరు తలుచుకుంటే సముద్రాల్నీ, కొండల్నీ, అరణ్యాల్నీ, సూర్య చంద్రుల్నీ, అనలు భూమండలాన్నే తల్లకిందులు చేసెయ్యగలరు. ఇక రావణుడెంత ?" —

లక్ష్మణుడి నోట్లోంచి — వానాకాలం ప్రవాహంమల్లే దూకుతున్నాయి మాటలు. ఏన్నో సంవత్సరాలనించీ అలవాటైపోయింది అన్నగార్ని పొగడడం. — రాముడికి కూడా అలవాటైపోయింది పొగిడించుకోవడం. లక్ష్మణుడు తన్ని శ్లాఘించి, ధైర్యం చెప్పని పూట మనసంతా

నిరత్సాహంతో నిండిపోతుంది. రావణుణ్ణి జయించడం ఎన్నటికీ సాధ్యం కాదనే ఆధైర్యం కలుగుతుంది. *

---

* కిష్కింధాకాండలో _ 27 వ సర్గలో _ 34 నుంచీ 40 వరకూ. 28 వ వర్గలో ___ 17, 18, 19 శ్లోకాలు.

రాముడు _ సుగ్రీవుడి గురించీ, తన గురించీ, రావణుడి గురించీ ఏ విధంగా ఆలోచిస్తున్నాడో చూడండి.

___"శత్రువును జయించి, భార్యతో గూడి, గొప్ప రాజ్యములో నుండి.... సుగ్రీవుడు గొప్ప సుఖము ననుభవించుచున్నాడు. ___ నేను రాజ్యమును విడిచివచ్చి, భార్యను పోగొట్టుకుని, నది వొడ్డు కూలినటుల దుఃఖించుచున్నాను.

నా శోకము గొప్పదిగ నున్నది. వానాకాలము సెలవుకు తగని దిగ నున్నది. రావణుడు మహా శత్రువుగ నున్నాడు. వీటిని జయించుట సాధ్యము కాదని తోచుచున్నది." (రావణుడితో యుద్ధం గురించి రాముడు చాలా భయపడుతున్నాడు. దుఃఖ పడుతున్నాడు.)

లక్ష్మణుడి ఓదార్పు___ "రామా : లోకములో నీవు కార్యశీలుడవుగను, దైవ నిష్ఠా పరుడవుగను, ఆ స్తికుడవుగను, వున్నావు. సముద్రములతో, కొండలతో గల భూమిని తల్లక్రిందు జేయుటకు నీకు శక్తి గలదు. ఇక రావణుడెంత మాత్రము?" (రాముడు దైవ నిష్ఠా పరుడు _ ఆ స్తికుడు __ అంటే రాముడు దైవాన్ని విశ్వసిస్తాడు. నిష్ఠతో పూజిస్తాడు.)

"రావణుడు బలిష్ఠమైన రాజు" అనే విషయం కవికూడా వొప్పుకోవలసిందే గాబట్టి _ తాడూ, బొంగరం లేని రాముడు _రావణుడితో యుద్ధం చెయ్యాలంటే ఎంత కష్టసాధ్యంగా కనబడుతుందో చెప్పి ___ మళ్ళీ రాముడు భయపడడం బాగుండదు కాబట్టి, లక్ష్మణుడి చేత క్షణాని కోసారి రాముడి పరాక్రమం గురించి దండోరా వేయిస్తూ వుంటాడు.

లక్ష్మణుడు చాలా కీర్తించి చివరికి "రామా : నిద్రించు నీ పరాక్రమమును నేను నిదుర లేపుచున్నాను," ___అంటున్నాడు. "రాముడికి

ఎప్పటికప్పుడు లక్ష్మణుడు చెప్పే ధైర్య వచనాలే రాముడికి శ్రీరామరక్ష : కొండంత బలం : రాముడు నిట్టూర్చి — "లక్ష్మణా : నా క్షేమంగోరి నువ్వింతగా చెబుతోంటే నేనొక విచారించె లాభమే ముంది ?.... ధైర్యం వహించక తప్పుతుందా?" — అని గంభీరంగా తల పంకించాడు.

తురాయిచెట్టు గాలితో విసిగి పోతోంది. పందిరి మీవకు వాలి నీర సంగా పడుకుంది. లక్ష్మణుడు గుమ్మంవేపు చూసి — "చెట్టు విరిగేట్టు పుందే !" — అని గబగవా బయటికి వొచ్చాడు.

తురాయిచెట్టు వొళ్ళంతా తడిసి వొణుకుతూ లక్ష్మణుణ్ణి చూడ గానే సంతోషంతో — "ఎంత వానో ! ... చూశావా చిన్న సన్యాసీ?.... పందిరి విరగదీస్తా ననుకుంటున్నావా ?.... కాస్సేపు గాల్కి తప్పుకుని ఇట్టు వొరిగాను. —అంతే. మీ అన్న చాలా గొప్పవాడని రోజూ కీర్తి స్తావు. నేను వింటోనే వున్నాను. ఇందాక కూడా .... ఏవిటో .... సూర్యుణ్ణీ .... చంద్రుణ్ణీ .... భూ మండలాన్నీ .... ఏవిటో చేసేస్తా డంటున్నావు. సరిగా పినబవలేదు. ఈ వాగు హోరు వొకటీ....కొంచెం మీ అన్నకి చెప్పి.... ఈ వాన తగ్గిస్తాడేమో అడుగుతావూ ? .... పోనీ .... ఈ గాలి రాకుండా ఆపినా చాలు.... నా పరిస్థితి కొంచెం గ్రహిం చవూ ? .... ఈ కష్టంలో నన్నెవరు ఆదుకుంటారు పెద్ద సన్యాసి తప్ప .. ?" — అని అడుగుతూ లక్ష్మణుడి వేపు వొంగించి.

లక్ష్మణుడు చెట్టువేపు చూసి పందిరికేమీ ప్రమాదం లేవని గ్రహించి గుహలో కెళ్ళిపోయాడు.

అతని వెనకాలే గాలి జోరబడి — "అబ్బ! నా కసలు కిష్కింధ

(ఫుట్‌నోట్ : 276 వ పేజీ తరువాయి)

పరాక్రమం వుంది సుమా !" —అని చెప్పటం. వుంది గానీ అది నిద్ర పోతూ వుంటుంది. — "భయం" మాత్రం ఎప్పుడూ మెలుకువగగా వుంటుంది. దానికి నిద్రరాదు మరి.

నుంచి రా బుద్ధి వెయ్యడంలేదు. సుగ్రీవుడు ఎంత చక్కని నాట్యకత్తెల మధ్య కూర్చున్నాడో తెలుసా ?...." —అంటోంది.

రాముడి ఆలోచనలన్నీ సుగ్రీవుడి చుట్టూ తిరుగుతున్నాయి .... పట్టాభిషేకం చేసుకున్నది మొదలూ వొకటే : లాసాలు : .... మధ్య పానం.... స్త్రీలతో భోగం.... ఇంతగా విలాసాలలో మునిగి తేలేవాడు ఇక తనకి సహాయం ఏం చేస్తాడు ?.... నమ్మడానికి వీల్లేదు. ... రాజ్యాధికారం దక్కింది.... ఇంకేం స్నేహం ? — వుపకారానికి ప్రత్యుపకారం చేసే వాడెంతటి వుత్తముడో !.... అందరూ అంత వుత్తములవుతారా ?— "లక్ష్మణా ! సుగ్రీవుడు నిత్యం కామ సుఖాలలో మునిగి తేలుతూ వున్నాడు. నాకు చేసిన వాగ్దానం గుర్తు పెట్టుకుంటాడంటావా ? అన్నమాట ప్రకారం సహాయం చేస్తాడంటావా ?"

"ఎంత మాట అన్నగారూ ! మీ ఆజ్ఞ ధిక్కరించే సాహసమా వానర రాజుకి ?" *

---

* 28 వ సర్గ — 62 నుంచీ — 66 వరకూ.

సుగ్రీవుడికి పట్టాభిషేకం అయిపోయిన తర్వాత రాముడు రుష్యమూకంమీద నివాసం ప్రారంభించింది మొదలూ — సుగ్రీవుడు తనకు సహాయం చేస్తాడో లేదోనని రాముడు శంకిస్తోనే వున్నాడు. కొన్నాళ్ళు పూర్తి విశ్వాసంతో వుండి, అప్పుడు శంకించడం కూడా కాదు. — తన శంకలు అణచుకోవడానికి ప్రయత్నిస్తూ, — "సుగ్రీవుడు మంచివాడే. మాట తప్పడు." — అని తనకు తను నచ్చజెప్పుకుంటున్నాడు.

—"సంకేతకాలము సమీపించుట సుగ్రీవుడే గ్రహించుకొని, ప్రత్యుపకారము చేయుటకు యత్నించును. సందేహము లేదు. (సందేహం వుందన్నమాట.) — ఉపకారము బొందియుండు వీరుడు ప్రత్యుపకారము తప్పక చేయును. (చెయ్యడేమోనని భయం.) — ఉపకారమును మరచి ప్రత్యుపకారము సేయని వానిని సత్పురుషులు నిందించెదరు. — (లోక నించకు జడిసి అయినా చేస్తాడని ధైర్యం.") —

రాముడి మనసు కొంత తేలిక పడింది. మేఘాలు కొండ శిఖరాలమీద ఆగి విశ్రమించి తేలికపడి లేస్తున్నాయి.

వాన పుధృతం తగ్గుతోంది.

గాలి మాత్రం చలికి జడిసి పరుగులు మానుకుంది. వరం తగ్గుతోంటే — రుష్యమూకం — చుట్టూ నీటితో సముద్రంలోంచి లేస్తోన్న చంద్రవంక మిల్లే వుంది. పర్వతంనిండా నీటి పాయలు బండల్ని క్షాళించుకుంటూ చకపక నవ్వుల్తో కిందకి దూకుతున్నాయి.

ఆకాశం కురిసి, కురిసి. అలిసి, ఎర్రబడింది.

కొండల మీద వరం వెలిసింది.

నీటి పాయలు దూకి దూకి వూరుకున్నాయి. వాగు పట్టలేని సంతోషంతో, ఆర్భాటంతో, ప్రయాణం చేస్తోంది. వొడ్డుమీద చెట్లూ, తీగలూ, వాగుని చూస్తూ — "ఎప్పుడూ చక్కగా, నిదానంగా మాట్లాడుతూ వెళ్ళేదానివి. నిలబడకుండానే పోతున్నావే?" — అని మాటి మాటికి అడుగుతున్నాయి.

వాగు నవ్వి— " . ఆ రోజులు వేరు. ఇప్పుడెలా కుదురుతుంది చెప్రా?.... వెళ్ళాలి.... అంతే ... ఏం చెయ్యను? ... మిమ్మల్ని పర్చి పోనుగా? ..." — అంటూ చెట్ల పాదాలు ముట్టుకుంటూ వొట్లు పెడుతూ పరుగులు తీస్తోంది.

"అత్తారింటికి పోతున్నావు. అవీ నీ తొందర. మాకూ తెలుసులే." — అని హాస్యాలాడుతున్నాయి చెట్లు.

లక్ష్మణుడు లేచి ఆరిపోతోన్న నిప్పుల్లో రెండు దుంగలు అంటించి నెగడు రాజేశాడు.

"పందిరి కొంచెం వొరిగినట్టే వుంది. రేపు చీకట్నే లేచి గుంజలు

(ఫుట్‌నోట్ : 278 పేజీ తరువాయి)

అన్నగారికి లక్ష్మణుడి ఓదార్పు— "నీ కోరిక లన్నియు తొందరలోనే వానర రాజు పూర్తిజేయును. శరత్కాలము సమీపించు వరకూ దృఢచిత్తముతో నుండుము."

గటిగా పాతాని. .... అసలే వానాకాలం .... వొకటే ముసుళ్ళు .... పందిరి పడిపోయిందంటే నిప్పు రాజెయ్యడానికి పిలే వుండదు." — అనుకుంటూ అన్నగారికి నిద్ర పట్టించని గ్రహించి తనుకూడా పడుకోవానికి సిద్ధపడుతూ కత్తి పగ్గన పెట్టుకుని— "ఈ రాత్రి ఎలా జొరబడతాడో నేనూ చూస్తాను. ఒక్క దెబ్బతో నరికి ముక్కలు చేస్తాను." — అనుకుంటూ గుమ్మంలో నడుం వాల్చాడు.

చల్లగాలి లక్ష్మణుడి వీపూ, భుజాలూ నిమురుతూ — "పగలంతా చాకిరితో సొలసిపోతావు ఇప్పుడన్నా సుఖంగా పడుకో.నిద్రపో." — అంటూ జో కొడుతోంది.

దుబ్బులు చాలా పరకు పడిపోయాయి. ఆకాశం వాగులో మునిగి వేచినట్టు కాంతిగా, నిర్మలంగా వుంది. వాన తగ్గిందో లేదో చూడాలని గారి అడివంతా తిరుగుతోంది.

వాన కురిసినంతసేపూ చంద్రుడు ఎక్కడో దాక్కుని వాన వెలవనిచ్చి కొండ లెక్కుతున్నాడు. లక్ష్మణుడికి అప్పుడే పగ్గన్నుగా వన్నూ అంటుతోంది.

"....హా ! .... లక్ష్మణా !.... వైచలేను. వైచలేను. ఈ దుర్మార్గుడు.... బాణాలు.... బాణాలు.... అయ్యో ! .... లక్ష్మణా !...."

తుళ్ళిపడుతూ లేచాడు లక్ష్మణుడు. — "ఎవరు? .... ఎవరు? .... అన్నగారూ? ... ఎక్కడ ? .... ఎక్కడ? ... ఎక్కడా దుర్మార్గుడు...." — అంటూ కంగారుగా కత్తి అందుకున్నాడు.

"లక్ష్మణా !.... అయ్యో !.... ఈ కాముడు.... విరిశరాలు ... గుప్పిస్తున్నాడే !"

"విరిశరాలా ? ... కాముడా ? ... కాముడెవరు ? చంపేస్తాను వాణ్ణి...." — లక్ష్మణుడి కళ్ళు బైటకు పోతున్నాయి. కత్తి ఎత్తి గుహలో గిరగిర తిప్పుతున్నాడు కాముడి కోసం.

రాముడు మెత్తని గడ్డిపరుపు మీద మెలికలు తిరుగుతున్నాడు — "....చక మన్మధుడు.... పూల బాణాలతో.... అయ్యో !.... మిక్కిలి

బాధిస్తున్నాడే : తాళలేను.... ఈ ఎడబాటు.... ఈ వర్ష రుతువు ఈ మద నుడి కారిన్యం "

"మన్మథుడా ? మళ్ళీ వొచ్చాడా ?...." — లక్ష్మణుడికి ఎంత నిర్వికల్పంలోనూ కోపం వొచ్చింది. — ఈ మన్మథుణ్ణి శిక్షించే మార్గం లేదా ?.... ప్రతి రాత్రీ ఈ తగాదా ఏమిటి ?

"అయ్యో!..లక్ష్మణా! ఈమదనుడు ...ఇంత నిస్పృహంగా ..."

"మన్నించండి అన్నగారూ ! .... నేను గుమ్మంలోనే పడు పున్నాను. మదనుడు రావడానికి వీలులేదే !"

"అయ్యో ! మదనుడు అనంగుడోయీ ! శరీరం లేనివాడు...."

"శరీరం లేనివాడు బాణా లెలా పట్టుకుంటాడు అన్నగారూ ?"— అనబోయి బిలవంతంగా ఆపుకున్నాడు.

"ఆ బాణాలకుకూడా శరీరం లేదోయీ!" అంటారేమో అన్నగారు.

"మరి ఆ బాణాలు మన శరీరాని కెలా తగులాయి అన్నగారూ !" అని అడగబుద్ధేస్తుందేమో తనకి. అన్నగారు అసలే బాధపడుతోంటే .... ఈ అర్ధరాత్రి ఎందుకొచ్చిన పరచ్చలు ? .... ఇంకెప్పుడైనా అడిగి తెలుసుకోవొచ్చును.

"హా సీతా ! .... ప్రియురాలా ! .... నీ ఎడబాటు నేనిక భరించ లేను సుమా ! .... ఈ వర్ష రుతువు .... ఈ చల్లగాలులు .... పరిమ ళాలు .... అన్నీ నన్ను బాధిస్తున్నాయే ! .... అయ్యయ్యో ! .... ఈ వాడి పూలబాణాలు ....

"అన్నగారూ : కొంచెం శాంతించండి. అవి పూలబాణాలు కాపనుకుంటాను అన్నగారూ ! పూలబాణాలైతే అంత వాడిగా తగలవు సుమండీ ! ఈ చుట్టుపట్ల అడవి దోమలు ఎక్కువగా వున్నాయి. తేనె టీగ లంతంత వున్నాయి. ఈపూలు వర్షానికి బాగా లేచాయి. నేను సుఖంగా పిసురుతాను. హాయిగా నిద్రించండి అన్నగారూ !" — అని చీకట్లో గుహ అంతా పాకి .... అటూ ఇటూ తడిమి ఆకులి విసనకర్ర పట్టు కున్నాడు.

"హయ్యో! చోమలు కాదోయీ లక్ష్మణా! పదనుడి కౌగిలింపే ఇది. పున్నాధ వాణాలు రాము బాణాలకన్నా వాడియైనవోయీ! ఎఱ వర పుతువు మిదనుడికి తోడు పలుకుతోంది. మేఘ జలం తాగి .... చాతక పక్షులు .... పొదల్లో జంటలు జంటలుగా కూస్తున్నాయి. పను. సీతా: ... ప్రేయసీ! — నీ ఎడబాటు వల్లనే .... పుదనుపు .... ఇంత నిరయగా ...."

లక్ష్మణుడికి సందేహంగానే వుంది — అన్నగారికి తాటిపళ్ళ వన్నా పడక కడుపు నొప్పి పుడుతోందేమోగానీ — పున్నాధుడి దుస్థార్గం కాదేమోనని. పాపం మాటలు. ఆ పున్నాధు డెప్పుడూ తనమీద వొక్క బాణమన్నా వెయ్యలేదే! ఏమో! .... చెప్పలేం .... ఏం కారణమో! .... అన్నగారిమీద బాణాలు పడకపోతే ఆయన మాత్రం ఎందుకు గోల చేస్తాడూ?

గాలి రుష్యమూకం అంతా తిరుగుతూ — "రాముడి కేకలు పంటున్నావా? ఈయన జితేంద్రియుడని ఎంతెంత గొప్ప పాటలు పాడతా రనుకున్నావూ అయోధ్యలో....? .... ఈ మధ్య కిష్కింధలో కూడా మొదలు పెట్టారుగా?" అంటోంది రుష్యమూకంతో.

"జితేంద్రియుడంటే కేకలు బాగా వేస్తాడని గాపుస్నా."

"ఛ:..జితేంద్రియుడంటే ఇంద్రియాలు జయించినవాడన్నమాట."

"ఇంద్రియాలంటే?"

"కళ్ళు, చెవులూ, మూతీ పుకుళ్ళూనూ."

"వాటిని జయించడం ఏవిటీ శత్రువుల్ని జయించినటూ? .... ఇంద్రియా లేవన్నా శత్రువులా? .... ఇంతకీ వాటిని జయించేదెవరూ? పనసా? ...."

"అబ్బే: ఆత్మ. ఆత్మకి ఇంద్రియాలన్నీ శత్రువులేనట. ఇంద్రియాలు సుఖాలు పంచి, ఆత్మకి మోక్షం రాపుండా చేస్తాయిట. పందుకే ఇంద్రియాలకి లొంగకూడదు. దేనిమీదా మోహమూ వుండకూడదు. ద్వేషమూ వుండకూడదు. దేనిమీదా ఆశా వుండ కూడదు. నిరాశా వుండకూడదు. కష్టం, సుఖం వొక్కలాగే భరిం

చాలి. పుటి, బంగారం పొక్కాలే అనుకోవాలి. అలా వుంటే జితేం
ద్రియు డవ్వుతాడన్నమాట."

"ఏడిసినట్టే వుంది. జితేంద్రియు డవ్వడం, ఆశ లేకపోతే నిరాశ
పుంటుంది. నిరాశ లేకపోతే ఆశ పుంటుంది. వెలుతురు గాకపోతే
చీకటి — చీకటి గాకపోతే వెలుతురూ. — చావు గాకపోతే బితుకూ
— బితుకు గాకపోతే చావూనూ.

ఒకదానికొకటి వ్యతిరేకం అయిన వాటిని పట్టుకుని రెండూ
వొకటే అనుకుంటే ఎంత తప్పు : .... నత్యం విరుద్ధం కాదూ ? అసలు
అలా అనుకోడం పిచ్చివాళ్ళకే కుదురుతుంది మతి పోయినవాళ్ళు కాబట్టి.
జితేంద్రియులంటే పిచ్చివాళ్ళే గావున్ను అయితే. లేకపోతే, వొక్క
శరీరంలోనే ఇంద్రియాలకీ, మనస్సుకీ శత్రుత్వం ఏమిటి ?"

—"మనసు కాదు .... ఆత్మ ...."

"పోనీ. ఆత్మే ...."

తురాయిచెట్టు వొణుకుతోంది— "రాత్రుళ్ళు ఆత్మల సంగతెందు
కర్రా ? భయం వేస్తోంది. తెల్లారిం తర్వాత మాట్లాడుకోరాదూ ?"

"సరేలే. మానేస్తాంలే" — అని తురాయికి ధైర్యం చెప్పి
రుష్యమూకం గాలితో "నువ్వు గాలి జన్మ, నేను కొండ జన్మ,
ఎత్తాం గాబట్టి .... ప్రకృతి ధర్మాల చొప్పున బితుకుతున్నాం గానీ—
ఖర్మగాలి .... మనంకూడా మానవజన్మ ఎత్తామంటే — "ముక్కులు
జయించండి. మూతులు జయించండి" — అని వాళ్ళ వేదాంతంతో
చంపేసేవాళ్ళు. తెలుసా ?" — అని జడిపించింది గాలిని.

రాముడు కంఠం తగించి మూలుగుతోనే వున్నాడు. లక్ష్మణుడికి
మన్మథుడిమీద చాలా కోపంగా వుంది. ప్రతీ రాత్రీ నిద్రపోయేవాడిమీద
బాణాలు గుప్పించడం ఏమిటి ? ధైర్యం వుంటే ఎదటబడి పోట్లాడాలి
గానీ .... చాటుగా మాటుగా ఇదేం పని ? .... తుంటరి పని: ....

లక్ష్మణుడు ఏసురుతూ .... ఏసురుతూ .... ఏసురుతూనే ....
ఏసనక్రర చన్నుడిమీద పడేసి నిద్రకి పడ్డాడు.

• • •

ర్ష్యమూకం చుట్టూ పళువులు కాలికొద్దీ తిరిగి గడ్డి మేస్తున్నాయి. పళువుల్ని తోలుకొచ్చిన పిల్లలు పెరుగు ముంతలు చెట్లకి వేళాడగటి ఆటలకి దిగారు. *

వాళ్ళ ఆటలు చూస్తోంటే రాముడికి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది ఎప్పుడూ. — ఎంతో నేర్పుగా కోతులమల్లె గబగబా చెట్లెక్కేస్తారు. కొమ్మలు పట్టుకుని ఎలుగ్గొడమల్లె వేళ్ళాడతారు. ఎంత ఎత్తునుంచైనా సరే .... పిట్టలమల్లె సునాయాసంగా దూకుతారు. చెట్ల చుట్టూ వోకటే పరుగులూ దొంగాటలూ.

అడివంతా వాళ్ళతో కలిసి ఆడుతుంది. కొండలన్నీ వాళ్ళతో కలిసి నవ్వుతాయి. వాళ్ళు పిల్లంగోవులు వాయిస్తూవుంటే గాలి మురిసిపోతూ వాళ్ళ వెనకాలే తిరుగుతుంది. అడివంతా తిరుగుతూ, ఎక్కడెక్కడి పువ్వులూ కోసి బారెడు బారెడు దండలు కట్టి వాళ్ళ గేదెలకీ, ఆవులకీ వేస్తారు. వాళ్ళ మెడలనిండా వేసుకుంటారు.

ఆడుతూ పాడుతూ, చెట్లూ, పుట్టలూ తిరిగి, దొరికిన పళ్ళన్నీ

---

* 30 వ సర్గలో — 48, 51.

ర్ష్యమూకం చుట్టూ పళువుల్ని తోలుకొచ్చే పిల్లలు తిరగడం "వాల్మీకి విరుద్ధం" కాదు. వైతుల సంగతీ, గోపాలుర సంగతీ కవి ప్రస్తావించిందే. రాముడు శరవృతువును వర్ణించే సందర్భంలో పంట పొలాల గురించీ, వేణు గానాల గురించీ కూడా వర్ణిస్తాడు. — "పండి పక్వమైన శాలి ధాన్యము భుజించి, ముక్కులతో వెన్నులను ద్రుంచి, తీసుకొని పోవుచుండు రమ్యమయిన కొంగల గుంపు హారమువలె ఆకాశములో తోపుచున్నది.

గోపాలురు సేయు వేణుగానముచే ప్రకాశించుచుండు తూర్య ధ్వనితో గూడి, ప్రాతఃకాలము గాలితో వృద్ధిపొందిన, వ్యాపించియుండు దధి భాండములు, గోవులు, వృషభముల ధ్వని ఒకటొంటినీ వృద్ధిచేయు నటులున్నది." —

కోసుకుంటారు. దుంపలు తవ్వి, కాల్చుకుంటారు. అన్నీ తిని పెరుగు ముంతలన్నీ ఖాళీ చేస్తారు.

సాయంత్రం ఎలా అవుతుందో వాళ్ళకి తెలీదు. పొద్దు వాలుతోందే గొడ్లన్నిట్నీ వాగులోకి తోలుకొస్తారు.

రాముడు తురాయిచెట్టుకింద కూర్చుని వాగులో వాళ్ళ ఆటలు చూస్తోనే వుంటాడు. వాళ్ళు గేదెల తోకలు పట్టుకుని వాగులోకి దిగు తోంటే, గేదెలు ఓదలమల్లె రయ్యిన ప్రవాహంలోకి లాక్కుపోతూంటే వాళ్ళ నవ్వులూ .... అరుపులూ ... ఎంత ఆనందమో! వింతగా వుంటుంది రాముడికి. .... ఎంతసేపో నీళ్ళల్లో ఈతలు కొడతారు. చేపల్లాగ ... నీళ్ళ ఆడుగున దాక్కుంటారు. ఇక్కడ పుట్టగా ఎక్కడో తేలతారు. నీటి పిట్టలమల్లె సగం తేలి ఈదుతారు. ఎంతసేపో ఈది .. ఈది ఆడి .... ఆడి .. నేరేడుపళ్ళమల్లె మెరుస్తూ నల్లరాళ్ళ లాగ మెరిసే గేదెలెక్కి .... పిల్ల యములమల్లె కిష్కింధపేపు బియలు దేరతారు.

వాళ్ళ ఆటలు చూస్తోంటే రాముడికి అప్పుడప్పుడూ .... తన చిన్నతనం గుర్తొస్తూ వుంటుంది. ఎప్పుడూ బంతులతోటో, ధనుస్సుల తోటో కత్తులతోటో .... ఆడే ఆటలు. వొంటినిండా ఆభరణాలతో .... పట్టుబట్టలతో.... గుర్రాలమీద స్వారీ చేయిస్తూ తిప్పేవారు. వస్తాదు లొచ్చి రెండు పూటలా వ్యాయామం చేయించేవారు. దాసీలు చుట్టూ జేరి తల మర్దనాలు చేసి, స్నానాలు చేయించేవారు. సాయంత్రం చేళ్ళలో చక్కచక్కని రథాలో వ్యాహ్యాళి తిప్పేవారు .. ఏది చేసినా .... దాసీలో, పరిచారకులో .... గురుపులో చేయించడమేగానీ ... ఏ వాన రుల పిల్లల మల్లె ఎన్నడూ స్వతంత్రించి ఆడలేదు.

— "ఒక్కసారి గేదె మీద ఎక్కితే ఎలాగుంటుందో!" — ఆలోచనల్లో మునిగిన రాముడు కంగారుపడిపోతూ చుట్టూ చూశాడు.

అలాంటి ఆలోచనలొస్తే రాముడు చాలా కంగారు పడతాడుగానీ, అవి రాకా మానవు. కంగారు పెడకా మానదు. ఎంత గంభీరంగా వుండ బోయినా, ఎన్నడూ ఎరగని ఆలోచన లొచ్చేస్తాయి హఠాత్తుగా.

"ఎంత క్షుద్రమైన ఆటలు ! — అల్పులూ .... పామరులూ ఆడే ఆటలు ! — తనవంటి రాజకుమారులు ఇటువంటి క్షుద్ర క్రీడల జోలికి పోరు. గురువులు అంగీకరించరు" — అని మొహం చిట్లించుకుంటాడు. లక్ష్మణుణ్ణి పిలిచి, వేదాంత చర్చలోకి దిగుతాడు.

లక్ష్మణుడు పంపలో చేపలకో, ఎండుకప్పలకో, సీళ్ళకో, దుంపలకో పోతే — రాముడు చుట్టూ అడవి చూస్తూ కూర్చుంటాడు. కొండల్లో పగుళ్ళూ, లోయలూ, బిలాలూ చూసి — "దేవత లెంత నేర్పుగా తయారు చేశారో !" — అనుకుంటాడు. లక్ష్మణుడు దుంపలు కాలుస్తూనో, గుహ చుట్టూ పరిసరాలు శుభ్రం చేస్తూనో — సమీపంలోనే ప్రవహించే రాముడు గంభీరంగా — లక్ష్మణుడికి — దేవత లెలా జన్మించారో, ఎన్ని లోకాలలో నివసిస్తారో, ఎంతెంత మహిమలు గలవారో, వారి అనుగ్రహం ఎలా పొందవొచ్చునో — అన్నీ చెబుతాడు.

సీళ్ళకోసం మందలు మందలుగా పోయే ఏనుగుల్ని చూసి రాముడు — "ఏనుగులు సరస్సుల్లో దిగి, ఈదులాడి బురద చేస్తాయి," — అని విసుక్కుంటాడు. — "ఏనుగులు అడవుల్లో ఎంత వ్యర్థంగా తిరుగుతున్నాయో, రాజులు ఏనుగుల్ని వేటాడి, వాటి దంతాలూ, అస్థికలూ ఏలా సేకరించాలో, ఏనుగుల సైన్యం వృద్ధి చేసుకునే రాజుకి ఎంత బలం కలుగుతుందో — చక్కగా చెబుతాడు.

రాముడు గుహలోకిపోయి విశ్రాంతి తీసుకునేప్పుడు తప్ప — బయట చెట్లకింద కూర్చున్నప్పుడు మాత్రం — దూరంగా పొలాల్లో రైతుల కేకల్లో — జానపదుల పాటలో — గొడ్లని మేపుకునే పిల్లల నవ్వుల్లో వినక తప్పదు.

పశువుల పిల్లలు వెదురు బద్దలతో బాణాలు తయారుచేసుకున్నాయి. రోజూ గురి నేర్చుకుంటున్నారు. బాణాలు విసరడంలో పందేలు వేసుకుంటున్నారు. అన్ని ఆటలూ మర్చిపోయి, పూర్తిగా బాణాల ఆటలో పొద్దుబుచ్చుతున్నారు. బాణాలు దూరంగా కొట్టడంలో ఎప్పుడూ స్పూర్తిని నెగ్గిస్తూ వుంటాయి.

"రాముడు వాలి చంపే ఆట ఆడదామా ?"— అన్నాడు ఒక నాడు సూరడు హఠాత్తుగా.

"ఆడదాం. ఆడదాం" — అంటూ పిల్లలందరూ సూరడి చుటూ చేరారు. కొత్త ఆట అనేప్పటికి అందరికీ చెప్పలేనంత వుత్సాహం వొచ్చింది.

"పెద్ద రాజూ, చిన్న రాజూ దెబ్బలాడుకుంటూ వున్నప్పుడు రాముడు చెట్టుచాటునించి బాణం ఏసి పెద్దరాజుని చంపేశాడుగా ? .... మనం అదంతా ఆడదాం" అన్నాడు సూరడు.

పిల్లలు గోల గోల చేస్తోంటే రాముడు గుహలోంచి తురాయి చెట్టు కిందకు వొచ్చాడు.

"వాలి ఎవరుంటారు ?" — అన్నాడు సూరడు.

"నేను ...."

"నేనుంటాను."

"నేనే వుంటాను."

"నేనూ వుంటాను."

"అల్లా పోట్లాడుకోకండెహే ! .... ఎవళ్ళో వొకళ్ళుండాలి గాని .... అందరూ వాలే వుంటే ఎలా కుదురుద్ది ? .... అసలు రాము డెవరుంటారో చెప్పండి."

"....."

"పోట్లాడరేంటి ? .... సుగ్రీవుడా చంద్రుడా ?"

"ఏ ! నేను రాముడుంటను. వాలే వుంటాను.

"సుగ్రీవుడా కుసుముడా ?"

"నేనూ వుండను .... వాలైతేనే వుంటాను"

"పోనీ ఎవరుంటారు రాముడు ?"

"ఎవ్వడూ వుండడు. రాముడెవడుంటాడు ?"

"చంద్రుడూ : .... పోనీ సుగ్రీవుడుండు."

"ఛీ ఛీ : నేను వాలే వుంటాను."

"సూరకికి వొళ్ళు మండింది — "అయితే చంకలు నాకండి. .... అంచరూ వాలే వుంటే ఇంక ఆట ఎలాగాడతాం ?"

"రావలిస్తే నువ్వుండు రాముడు. పుష్కలున్నండపుంటున్నావుగా"-

"నేనా ? ...." — అని మొహం చిట్లించాడు సూరకు. వెంటనే తేరుకుని — "సరే ! నే నుంటా లెండి. ఆటేగా ? .... ఆటలోవుంటే తప్పేం లేదు. ఎవరూ వుండకపోతే ఆటెలా సాగుద్ది ?.... మరి నువ్వు సుగ్రీవు డుంటావా కుసుముడూ ?"

కుసుముడు తల అడ్డంగా తిప్పేశాడు — "కావాలంటే నేను లక్ష్మణు డుంటాను. సుగ్రీవుడూ వుండను. రాముడూ వుండను."

"అలాగయితే నువ్వసలు ఆట మానెయ్."

"ఆఁ ... మానేస్తాలే. నాకేం అక్కర్లేదు ఎదవాట" — అని కుసుముడు కోపంగా, మూకంగా పోయాడు.

పిల్లలంపరూ వాడిచుటూజేరి బతిమిలాట ప్రారంభించారు. సూరకు సూడా వాడి వగపుకి పోయి — "... ఆడాడదామని మీరం పరూ వొప్పుకున్నాపుగా ? ... మరి సుగ్రీవుడూ, రాముడూ కావాలా ? అక్కర్లేదా ? .... నేను రాము డుంటం లేదూ ? .... అలాగే ఇంకెవ రన్నా సుగ్రీవుడుంటే గమ్మున ఆట మొదలెట్టొచ్చు" — అని నచ్చ జెప్పేట్టు చూశాడు.

కుసుముడు మొరాయించి చలించకుండా నించున్నాడు.

తేరుకు సాహసంగా ముందుకొచ్చి — "సరే ! నేను సుగ్రీవు డుంటాను. కుసుముణ్ణి వాలి వుండమన్దాం" — అని వ్యవహారం వొక కొలిక్కి తెచ్చాడు.

"అవును. కుసుముడు వాలి వుంటే చాలా బాగుంటుంది" — అన్నా రందరూ.

కుసుముడికి పదో ఏడేగానీ .... లావుగా, ఎత్తుగా ఎలుగ్గొడ్డుమల్లే వుంటాడు. వాళ్ళమ్మ వాడికి ఎనిమిదేళ్ళవరకూ పాలిచ్చింది. ఇంకో ఇవ్వాలని చూసిందిగానీ, వాడే ఆపుల్లోబిడి మానేశాడు.

తాపసు హఠాత్తుగా గుర్తొచ్చి— "ఇవ్వాళ వొక్కరోజే నేను సుగ్రీవుడుంటాను. రేపు నేనే వాలి తెలుసా?...." —అన్నాడు.

"అవును. నిజమే. రోజు కొకళ్ళుండాలి." — అన్నారు అందరూ.

"ఇంక ఆట మొదలెట్టేద్దాం." — అన్నాడు సూరడు — "అందరూ చూసింగా నుంచోండి. ముందు వాలీ, సుగ్రీవుడూ కొట్టుకుంటూ వుండాలి. నేనేమో చెట్టు చాటునుంచి బాణం కొడతాను. వాలి కింద పడిపోవాలి. అప్పుడు నేను దగ్గిరకొస్తాను...."

తురాయి చెట్టుకింద రాముడు కళ్ళు చిట్లించి చూస్తున్నాడు. చెవులు రిక్కించి వింటున్నాడు. మాటలన్నీ సరిగ్గా వినపడటం లేదు. గాని పిళ్ళ ఆట చూడాలని ఇటే పరిగెత్తుకొస్తోంది.

కుసుమిడూ తేరుడూ చితక బాదుకుంటున్నారు. చుట్టూ నిలబడ్డ వాళ్ళు కుసుమిడ్ని ప్రోత్సాహం చేస్తున్నారు.

తేరుడికి కోపం వొచ్చి— "ఇల్లాగయితే నే నాడనంతే." — అని హారంగా పోయి నించున్నాడు. చెట్టు చాటునించి సూరడు పరిగెత్తుకొచ్చి— "మీ రంచరూ ఏమీ అనకూడదు. చూస్తూ నించోవాలంతే." — అని అందర్నీ కేకలేసి మళ్ళీ చెట్టుచాటుకి పరిగెత్తాడు.

మళ్ళీ వాలీ సుగ్రీవుడూ దెబ్బలాట మొదలెట్టారు. కుసుమిడు తేరుణ్ణి చావుగుద్దులు గుద్దుతున్నాడు. తేరుడు బిక్కమొహం పెట్టి చుట్టూ చూస్తున్నాడు.

రయ్యిన చెట్టు చాటునించి బాణం వొచ్చి సుగ్రీవుడికి తగిలింది. అనలే ఏడుపు మొహంతో వున్న తేరుడు భుజంమీద దెబ్బ తగిలి బావురు మని ఏడుపు లంకించుకున్నాడు.

రాముడు గబగబా చెట్టు చాటునుంచి బయటికి వొచ్చాడు.

కుసుమిడికి చాలా అవమానం జరిగినట్టు కోపం వొచ్చింది

సూరడి మీది— "వాలి నేనా ?.... ఆడా ?.... ఆణ్ణి కొట్టావేం ?"— అని పోట్లాటకి దిగాడు.

సూరడు కుసుమణ్ణి బతిమాలుతూ— "నే ననలు నిన్నే కొడదా మనుకున్నాను. ఆడు అట్టం వొచ్చేశాడు. ఈసారి నువ్వు చెట్టువేపు నించో. ఏం ?.... ఇంత దూరం కాదు. ఇంకా దగ్గిరిగా వొచ్చి కొట్టుకోండి. నిన్నే కొడతాను," — అని వాడి కోపం పోగొట్టాడు.

ఈలోగా పిల్లలందరూ తేరుడి చుట్టూ జేరి — "పాపం సూరడు మాత్రం ఏం చేస్తాడు? తప్పు అయిపోయింది. ఆటల్లో ఏడవకూడదు..." — అని నచ్చజెప్పి ఓదార్చారు.

సూరడు బాణం తీసుకుని చెట్టుచాటుకి పరిగెత్తాడు. మళ్ళీ వాలి సుగ్రీవుల యుద్ధం ప్రారంభమైంది. తరతరాలనించీ శత్రుత్వం వున్నట్టు దాడుకుంటున్నారు.

రయ్యిన బాణం వొచ్చి కుసుముడి పీపులో గుచ్చుకుంది. — కెవ్వున కేక పెట్టాడు కుసుముడు. బాణం అంటే అంత దెబ్బ తగులు తుందని వాడనుకోలేదు. ఇందాక తేరుడెందు కేడిశాడో ఇప్పుడు అర్థమైంది. కోపం పట్టలేక — "ఎంత సూదిగా చెక్కుకున్నాడో చూడండి బాణం. ఎంత గట్టిగా కొట్టాడో చూడండి," అని బాణం మొన అందరికీ చూపించి "ఆడి పని పడతా నుండు," — అని చెట్టువేపు పరిగెత్తాడు.

చెట్టు చాటునించి బయటికి వొస్తోన్న సూరడు బిత్తరపోయి పెనక్కి పరుగు లంకించుకున్నాడు. పిల్లలందరూ వాళ్ళ వెనక పరిగెత్తారు.

అందరూ కలిసి వాలిని పట్టుకున్నారు. — "ఆటల్లో కోపాలు తెచ్చుకుంటే ఎలాగేంటి : .. బాణం కొట్టాలి గాబట్టి కొట్టాడు. పాపం సూరడేం చేస్తాడు ?"—అని వాలితో పోట్లాడారు.

"ఆ మాత్రం ఎంత గట్టిగా కొట్టాడో తెలుసా : .... వుంటుంది. ఈసారి నేనే రాముడుండి నీ ఈపు బద్దలు కొడతాను." — అని ఎగిరాడు కుసుముడు సూరడి మీద.

"నరేష్. అలాగే చేద్దువుగానిలే. మరి ఇప్పుడు నువ్వు కిందపడి పోవాలి. లేకపోతే ఆటంతా చెడిపోయినట్టే."— అన్నారు అందరూ.

వాలి నేలమీద రాయి రప్పా చూసుకుని — కాళ్ళతో రాళ్ళు అటూ ఇటూ తోసి నెమ్మదిగా కింద పడుకున్నాడు.

పిల్లలు బాణం తెచ్చి వాలి చంకలో నించోబెట్టి చెయ్యి దగ్గిరికి పెట్టారు.

వాలి మూలుగు ప్రారంభించాడు.

రాముడు బిత్తుక్కు బిత్తుక్కు మంటూ చగ్గిరి కొచ్చాడు.

వాలి మూలుగు ఆపేసి చేచి కలబిడేట్టు చూస్తున్నాడు.

రంభుడు వాలి మీదకి వొంగి — "నువ్వు రాముడుతో మాట్లాడాలి. ఎందుకు కొట్టావని అడగాలి,"— అని గునగుస లాడాడు.

"అడుగుతాలే. నాకు తెలుసులే."— అని వాలి విసుక్కున్నాడు. సూర్ణి కోపంగా చూస్తూ—

"నన్నెందుకు చంపావ్‌రా ? నేనేం తప్పు చేశాను ?" — అని అరిచాడు నగం లేచి— పిల్లలు నొక్కిపెట్టారు వాలిని.

"చెప్పవేం ? నన్నెందుకు చంపావ్ ?" — అని అరిచాడు వాలి.

రాముడు గుటకలు మింగుతూ — "మరి .... నువ్వు .... మీ తమ్ముణ్ణి— వూళ్ళోంచి గెంజేశా వెందుకూ ?...." — అన్నాడు.

"గెంజేస్తే గెంజేస్తాను. అది నా ఇష్టం. నీ కెందుకురా ? ... నువ్వెక్కణ్ణించొచ్చావ్ ?" —అని అరిచాడు వాలి.

రాముడు రెండడుగులు వెనక్కి నడిచి— "నేనా ?.... నేను.... నేనేమో.... నేను...." —అంటూ అటూ ఇటూ చూశాడు.

రంభుడు రాముడి చెవిలో ఏదో గునగుస లాడాడు.

"ఆ నేనే పెద్ద రాజుని. నీకన్నా పెద్ద రాజుని. తెలుసా ?.... తప్పుచేసే వాళ్ళందర్నీ నేనే చంపేస్తాను. మరి నువ్వు తప్పుచేశా వెందుకూ ?" —అని కోపంగా చూశాడు సూర్ణి.

"నేను తప్పు చేశానా ? మళ్ళీ అను, పళ్ళు రాలగొడతా నంతే. మా తమ్ముడే తప్పు చేశాడు.

ఆడే నన్ను చంపెయ్యాలని చూశాడు. ఆణ్ణి చంపక నన్ను చంపావెందుకూ ?"

రాముడి కేం చెప్పాలో తోచలేదు. రంభుడి కేసి చూశాడు. రంభుడికీ తోచడం లేదు. గింభుడి కేసి చూస్తున్నాడు.

"చెప్పవేం ?.... నన్నసలు చెట్టు చాటునుండి చంపావెందుకో చెప్పు ముందు," — అని గర్జిస్తున్నాడు వాలి.

రంభుడు చటుక్కున వాలిమీద బడి— "ఎందుకు కొట్టావూ ? అనాలి, చంపా వనకూడదు. నువ్వింకా చచ్చిపోలేదు తెలుసా ?" — అని కేకలేశాడు.

కుసుముడు కోపంగా— "మన పెద్ద రాజు చచ్చిపోయాడుగా ? ... చంపేశావంటే యేం ?.... నే నలాగే అంటాను," — అని మళ్ళీ రాముణ్ణి చూస్తూ "చెప్పకుండా నుంచున్నావేం చింత మొద్దులాగ ? .... నన్ను చాటునుంచీ ఎందుకు కొట్టావో చెప్పసలు." — అని అరిచాడు.

రాముడు తత్తర పడుతూ దిక్కులు చూస్తూ — "మరి ఎదురుగా అయితే.... నువ్వు చూసేస్తావుగా ?" — అని నసిగాడు.

పిల్లలందరూ ఘొల్లున నవ్వారు.

"ఆఁ.... ఎదురుగా అయితేనా ?.. దొక్కి చంపి దోలు'కచ్చేవోణ్ణి. కావాలంటే నాతో దెబ్బలాడు," — అంటూ వాలి లేవబోయాడు.

అందరూ వాలిని నొక్కిపెట్టి— "అబ్బ !.... నువ్వు చచ్చిపోవాలి." — అని విసుక్కున్నాడు.

రాముడు కొంచెం మాట సర్దుకుని — "అది కాదు, ఇందాక తప్పు చెప్పాను. నిన్నెందుకు చంపానంటే .... సుగ్రీవుడికి వొట్టే కానుగా ?...." — అని ధైర్యంగా చూశాడు.

"ఎందుకేశావు ?" — అన్నాడు వాలి.

"ఏళాగా మరి ?" — అన్నాడు రాముడు.

"అదే.... ఎందుకేళావు ?...."

"ఎందుకేంటి ?.... ఏళానంతే, నా ఇష్టం."

వాలి చటుక్కున లేచాడు. — "నీ ఇష్టవంట్రా ?" అంటూ రాముణ్ణి వాపేసుకోబోయాడు.

రాముడు కేకలేస్తూ చెట్టవెంట పరుగు లంకించుకున్నాడు. రాముడి వెనక బూతులు తిడుతూ వాలి. వాలి వెనక కేకలేస్తూ మిగిలినవాళ్ళు. అందరూ ఆడివంతా పరిగెత్తారు. చివరికి వాలి రాముణ్ణి పట్టేసుకుని చావ గొట్టిం తర్వాత, రాముడి ఏడుపుల్తో ఆట ముగిసింద్.

కుసుమడు — వాలి పూనకం వొదిలిం తర్వాత సూరణ్ణి చితక దన్నినందుకు చాలా ఇదయ్యాడు. బిక్కమొహం పెట్టాడు.

"ఈసారి కొట్టను .... అస్సలు కొట్టను" — అని చాలాసా ర్లన్నాడు. వొట్టుకూడా వేశాడు.

సూరడు ఏడుస్తూ — "నే నసలు రాము డుండను. నువ్వే వుండు" — అని పోట్లాడాడు.

చాలారోజులు మహోత్సాహంతో ఆ ఆట ఆడారు. ఆటలోకి నెమ్మ నెమ్మదిగా తారా, హనుమంతుడూ, అంగదుడూ, లక్ష్మణుడూ అందరూ వొచ్చారు.

ఇప్పుడు వాలి వుండటాని కెవ్వరూ వొప్పుకోటం లేదు. అందరూ రాముడే వుంటామంటున్నారు. అది ఆటే లని అందరికీ తెలిసిందిగానీ, రాముడి బాణానికి మాత్రం తెలియటంలేదు. అది నిజం బాణం మళ్లేసే వొచ్చి వాలికి తగులుతోంది మరి.

రుష్యమూకంమీద రాముడు .... ఈ మధ్య తురాయి చెట్టుకింద కూర్చోవటంలేదు.

• • •

వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. మేఘాలు లోకానికి జలభిక్ష పెట్టామనే సంతోషంతో తేలికపడి, దూదిపింజలమల్లే తేలిపోతున్నాయి. ఆకాశం నిర్మలంగా చిరుసవ్వ్వులతో శాంతి దేవతమల్లే వుంది. ఎటు చూసినా భూమి అంతా పచ్చ పట్టు కంబళాలతో నిండిపోయింది. కొత్త మొక్కలు ; కొత్త పువ్వులు ;

మోళ్ళన్నీ గుబుర్లయ్యాయి. కొండలన్నీ పొదలతో కప్పబడ్డాయి. వాగు వొడ్డనిండా రెల్లు దుబ్బులు నక్షత్రాల పూలతో నిండాయి. క్రొంచ చరియలనిండా అశోకాలూ, సర్జలూ, వేగిసలూ, సప్త పర్ణాలూ, కోవిదారలూ, ప్రేంకణాలూ నిత్యం విరగబూస్తున్నాయి. కాశీ పూలకి అంతు లేదు. బండలనిండా కుప్పతెవ్వలుగా రాలుతున్నాయి.

ఉదయా సమయాలలో రుష్యమూకం పక్షుల రాజ్యం అయిపోతోంది. ఎన్నెన్నో రంగుల పక్షులు పూల గుత్తులమల్లే, హాల చండల మలే సీరెండలో వాటి సీడలు పడింతలై, కొండలనిండా సీడలు వరుచు కుంటూ, రెక్కలతో పర్వతాలు కప్పేస్తూ ఎగిరిపోతాయి.

గాలి పంవకీ, రుష్యమూకానికీ అడేపనిగా తిరుగుతోంది. రక రకాల పరిమళాలు సంపాదించుకుని, నంపన్నులమల్లే విర్రవీగుతోంది.

శరద్రాత్రులు వెన్నెల పూతలు పూసుకుంటున్నాయి.

శ్రీరాముడు రుష్యమూకంమీద తురాయి చెట్టు కిందో — మోదుగు చెట్టుకిందో కూర్చుని, అనేక కష్టాలతో వనవాసం చేస్తోంటే— దూరంగా పొలాలో రైతులు చాలా సుఖంగా భూమి దున్ని, విత్తనాలు జల్లి — కోతలు కోసే — వ్యవసాయం చేస్తున్నారు.

మహాజ్ఞాని అయిన రాముడు సంధ్యావందనాలతో, వేదాంత చర్చలతో వుత్తమ జీవనం గడుపుతోంటే - చుట్టుపట్ల మూర్ఖ జానపదులు అజ్ఞానంలో వడిపోయి, సంసార బంధనాలలో ఇరుక్కుపోయి తట్టలూ, బుట్టలూ అల్లుకుంటున్నారు. కుండలు చేసుకుంటున్నారు, నాగళ్ళు

చెక్కుకుంటున్నారు. దుంగలు నరుక్కుంటున్నారు. క్రిమి కీటకాల మ్రింగే క్షుద్ర జీవితాలలోబడి కొట్టుకుంటున్నారు.

ధర్మపత్ని ఎడబాటు సహించలేక — రాముడు భార్యా వియో గంతో, దుఃఖంతో కృంగిపోతోంటే — వంచలకొద్దీ, వేలకొద్దీ సైనికులు సంతోషంగా భార్యా బిడ్డల్ని త్యజించి, యుద్ధాలకు పోతున్నారు. యుద్ధాలలో వీర మరణం చెందుతున్నారు.

గాలి మొగలి వాసనలు పూసుకొచ్చింది రుష్యమూకానికి. — "అబ్బ! .... పంప చుట్టూ ఎంతెంత మొగలి దొంకలో! .... వాటిలో జొరబడాలంటే నాకే భయం వేస్తోంది.... కతులమల్లె ఎంతెంత మొగలి పొత్తులో!—కావాలంటే లక్ష్మణు ణ్ణడుగు ..."— అంది రాముడితో.

"అవును. అవును. ఇది శరదృతువు...."— అని రాముడు గంభీరంగా తల పంకించాడు.

గాలి నవ్వి వాగువేపు పరిగెత్తింది.

రాముడికి శరదృతువు వర్ణనలన్నీ గుర్తొస్తున్నాయి.— ఈ ఋతువులో మిథ్మధుడు మరింత సాధనసంపత్తి చేకూర్చుకుంటాడు. కోయిలలు నెమళ్ళు, హంసలు, చక్రవాకాలు, తుమ్మెదలు .... పువ్వులు....అన్నీ ఎంతో పక్షిమాతాయి.

సీత అసలే తనకు దూరంగా వుంది. ఈ శరద్రాత్రులు.... ఏ విధమయిన నిర్బంధం ....

రాముడి మనస్సంతా పోటెత్తిన సముద్రం మల్లె అల్లకల్లోలంగా వుంది.

రాత్రి భయంకరమైన స్వప్నం! సీత రకరకాల ఆభరణాలతో .. అలంకారాలతో .... చిరునవ్వులు చిందిస్తూ సుఖంగా వుంది. చేళ్ళతో, పిట్టలతో ఆడుకుంటోంది. — రుష్యమూకంమీద ఇలాంటి కలవొస్తే జరగకుండా వుంటుందా? .... ఈ కొండ ఎక్కిన దగ్గిరించీ ఎన్నెన్ని స్వప్నాలు వొస్తాయోనని భయపడుతోనే వున్నాడు తను.

సీత సుఖంగానే వుందన్నమాట ! .... తనకు చూడామణినా సంతోషంగానే వుందన్నమాట. సమస్త సుఖ భోగాలలో తేలుతూ వుంటుంది. బహు సుందరమైన మందిరాలలో విహరిస్తూ వుంటుంది .. ఇంకెక్కడీ సీత ? .. ఆ దుష్టుడి అంతు చూసేది ఎప్పుడో ! .... వాడి జాతినంతా సమూలంగా తుడిచిపెట్టేది ఎప్పుడో ! — రాక్షసుల్ని సంహరించమని దుష్టులతా ఎప్పుడో కోరాడు. అలాగే సంహరిస్తానని వాగ్దానం చేశాడు. పదమూడు సంవత్సరాలు దాటిపోయింది. ఆ శూర్పణఖ కారణంగా తిరిగే చందమది అయింది గానీ .... రాక్షసరాజుతో యుద్ధం సాధ్యమౌతుందా ? ఎక్కడున్నాడో కూడా తెలియని శత్రువుతో యుద్ధం!

ఆత్మ నెమ్మదిగా చేతులు నలుపుకుంటూ వినయంగా — "తల్చుకుంటోంటే చాలా సిగ్గుగా వుంది. సీత పోయి ఎనిమిది నెలలు దాటిపోయింది. ఇంతవరకూ ఎక్కడుందో....ఏవిటో....కనుక్కోలేక ...."

రాముడు మొహం చిట్లించి — "కనుక్కుంటాం మరీ. రాక్షసుడితో వ్యవహారం .... మాటలా మరీ ? .... ఈ వర్షరుతువు అడ్డురాబట్టి గానీ ...."

"అబ్బే ! అదే ! నేనూ అదే అంటున్నాను. దేవుడిమల్లే సుగ్రీవుడు అండగా వుండనే వున్నాడు .... రేపో మాపో ఎలాగూ కనుక్కుంటాం. నెలలూ, రుతువులూ గడిచిపోతున్నాయే అని .. అంతే...."

రాముడు గంభీరంగా నిట్టూర్చి — "అవును. కాలం గతించిపోతోనే వుంది"— అనుకుంటూ చెట్టుకి జేరబడి కళ్ళుమూసుకున్నాడు.

లక్ష్మణుడు ఎండు కట్టెల మోపుతో కొండ ఎక్కుతూ, చూచించి అన్నగార్ని చూశాడు. గబగబా మోపు గుహాముందు పడేసి దిగాలుపడి వచ్చున్న అన్నగారి దగ్గరికి వొచ్చి వినయంగా నుంచున్నాడు.

— "అన్నగారూ !"

— "లక్ష్మణా ! .... వొచ్చావా ?"

"అన్నగారూ ! దిగులించవొద్దు. ధైర్యం వహించండి."

"లక్ష్మణా ! సీతా వియోగం భరించ లేకుండా వున్నానోయీ !

ఈ శరదృతువుకో కాముడు మాతనోత్తేజంతో నావలే ప్రియురాలింగనాలకి చూచాడైన పురుషుల్ని ...."

లక్ష్మణుడు మొహం తిప్పి నెగడుకేసి చూశాడు నిష్ప్రయోజనంగా, ఆరిపోయిందోనని. చటుక్కున వెళ్ళి రెండు కర్రలు అంటించి వొచ్చాడు.

".... ఈ రుతువు చిక్కులి దుఃఖం కలిగిస్తోందోయీ !" — అంటున్నాడు రాముడు.

ఇదిపరకెత్తే.... వస రుతువో వసంత రుతువో .. చిక్కులి దుఃఖం కలిగిస్తుందని చెప్పినట్టు గురు. ఇదే అన్నిటికన్నా దుర్మార్గపు రుతువు గావుస్తున్న. —అన్నగారికి అన్నీ తెలుసు.

నెగడులోంచి నెమ్మదిగా పొగ రేస్తోంది. లక్ష్మణుడు అన్నగార్ని వినయంగా చూస్తూ— "అన్నగారూ ! .. మీకు చెప్పగలవాడిని కాను. మీవంటి పరాక్రమవంతులు .... కామ వాంఛకు లొంగి .... నిత్యం కామాన్నే తలుస్తూ దుఃఖించడం ఆత్మగౌరవం కాదు. మనస్సుని సమాధాన పరచుకోవాలి. శరీరాన్ని నిగ్రహించుకోవాలి.... నీవంటి వుత్త...."

"లక్ష్మణా !.... ఈ దుఃఖమంతా నా కోసం కాదోయీ !" ... ఎంతో కాలంగా నాకు దూరమైపోయిన సీత ...నా అర్ధాంగి.... సుఖంగా జీవించి వుంటుందంటావా ?.... ఆ దుర్మార్గుడు.... ఆమెను...."

అన్నగారి దుఃఖమంతా భార్య శీల సంపత్తి గురించేనని లక్ష్మణుడికి తెలుసు.

"అన్నగారూ ! — మీ సంశయం విస్మరించి నిర్భయంగా వుండండీ. మీవంటి పరాక్రమవంతుని భార్యని ఆ రావణు డెన్నటికీ పొందలేడు. మీవంటి మహా వీరునితో ఎవరు మాత్రం వైరం పెట్టుకోగలరు ?"

రాముడి మొహం కొంచెం తేటబడుతోంది. లోపల .... ఏవో కదలికలు.... ప్రశ్నలు.... భయాలు.... నిజమే. తను గొప్ప పరా

క్రమపంతుడే. పీడదే : మరి.... సీత అంత పరాక్రమవంతురాలు కాదు గదా ? అబల.... లతాంగి .... పుష్పాంగి .... సుందరాంగి. ఎక్కడో వున్న తన పరాక్రమానికి భయపడి.... ఆ కామకుపు.... నీచుడు .... ఆమెను విడిచిపెట్టడు గదా ? తనతో ఇప్పుడు కొత్తగా వైరం పెట్టుకునేది మాత్రం ఏముంది ? సీతను ఎత్తుకు పోయిననాడే వైరానికి సిద్ధమైనాడు గదా ?

"అన్నగారూ :.... మీ రింతగా దుఃఖించకూడదు. ఇంత నిరుత్సాహ పడకూడదు. మీ పరాక్రమం మీ రెరగరు. నివురు గప్పిన నిప్పు వంటి పరాక్రమం మీది.

ఎల్లవేళలా మనస్సు ధైర్యంగా వుంచుకోవాలి మీరు. మీ ప్రయత్నాలు మీరు వుత్సాహంతో చెయ్యాలి. నేను మీకు అండగా వుంటాను. సుగ్రీవుడెలాగూ సహాయం చేస్తాడు. — ఇంకా మీ కార్యం నెరవేర దని సందేహించవొద్దు .... మన్నించండి అన్నగారూ :.... మీ పంటి మనిషి థాపులకు .... నేను.... చెప్పదగ్గవాణ్ణి కాను...." *

---

* 30 వ సర్గలో — 14 నించీ — 18 వరకూ.

లక్ష్మణుడు అన్నగారికి సేవ జెయ్యటం, ఎప్పటి కప్పుడు ఓదార్చడం, చూడండి.

—"లక్ష్మణుడు పండ్లు దెచ్చుటకై పర్వతము పక్కలలో దిరుగుచూ ... పచ్చి.... లోకమునే మూర్ఛపోయి ... ఏకాకిగనుండు శ్రీరాముని జూచి . ఇటులనెను" — "పూజ్యుడా ! ఎల్లకాలమూ కామమునే స్మరించుట, నీ పరాక్రమము నపహసించుట తగదు. అపజయపుడు చిత్తమును సమాధాన పరచుకొని యుండవలయును.

ధీరుడా : నీ ప్రయత్నమూ, మనో నిశ్చలతా, ధైర్యోపాయాలూ, సుగ్రీవాదుల సహాయ సంపత్తి, — ఇవి అన్నియు నీ కార్యము సిద్ధించుటకు కారణములని తెలుసుకొనుము." —

ఇక, సీత విషయంలో రాముడి ఉపదేశం ఏమిటో లక్ష్మణుడికి స్పష్టంగానే తెలుసు. (సీత దొరుకుతుందో లేదోనని కాదు రాముడి

రాముడి మనసంతా ఆ క్షణంలో గొప్ప వుత్సాహంతో నించింది. — అవును. తను గొప్ప పరాక్రమశాలి. వీరాధి వీరుడు. తన పెంట .... లక్ష్మణుడు.... సుగ్రీవుడు....

సుగ్రీవుడి సంగతి గుర్తు రాగానే అంత గొప్ప వుత్సాహమూ సీరై పోయింది. సుగ్రీవుడి వ్యవహారం ఏమిటో రాముడికి అంతు పట్టకుండా వుంది. పట్టాభిషేకం చేసుకున్న తర్వాత మళ్ళీ ఒక్కసారి కూడా తన దగ్గిరికి రాలేదు. తనంటే ఎంతో గౌరవంతో, వినయంతో, భయభక్తులతో నిత్యం తనకు సేవ చేసుకుంటూ కాలం గడుపుతా దాసుకుంటే.... అసలు తన సంగతే గుర్తు వుంచుకున్నట్టు లేదు. తన విలాసాలేమో.... తన సుఖ భోగాలేమో.... తనేమో! సుగ్రీవుడే తనకు సహాయం చెయ్యకపోతే ఈ దుఖ సముద్రంలోంచి గట్టెక్కే మార్గ మేముంది?.... సుగ్రీవుడు ఆడిన మాట తప్పడు గదా? — ఇలా జరుగుతుందని మొదటినించీ శంకిస్తోనే వున్నాడతను.

రాముడి సర్వావయవాలూ కంపిస్తున్నాయి. —"లక్ష్మణా! సుగ్రీవు డేమైనా యుద్ధ ప్రయత్నాలు చేస్తూ వున్నట్టు విన్నావా?"

లక్ష్మణుడు వొక్క క్షణం తటపటాయించాడు.

"మన్నించండి అన్నగారూ! వినలేదు. వొకవేళ రేపో .... మాపో ..."

"హా! ... ఇంకేమి చేస్తాడోయీ? తను మహారాజు అయ్యాడు. ఇక నా వంటి మిత్రుణ్ణి ఎందుకు గుర్తు వుంచుకుంటాడు? నా మీద అతనికి కనికరం ఎందుకు వుంటుంది? ఎంత అదృష్టవంతుడో! నిత్యం సుఖ భోగాలలో మునిగి తేలుతూ వున్నాడు. నేనో?.... వొట్టి కూలిన

(ఫుట్ నోట్ : 298 వ పేజీ తరువాయి)

భయం. చెడిపోతుం దేమోనని.) — ఆ భయం లేకుంటా చెయ్యాలని లక్ష్మణుడు ఏమంటున్నాడో చూడండి— "నిన్ను నాధునిగ బడసియుంచు జానకిని పర పురుషు డెన్నటికినీ పొందలేడు. మండుచుండు అగ్ని జ్వాలలో బడి దహింపబడని వాడుండునా?"—

నదిలాగు దుఃఖ సముద్రంలో ఈదులాడుతున్నాను. నా కర్మ నన్ని విధంగా బాధిస్తోంది. రాజ్యం పోయింది. భార్య పోయింది. స్నేహితుడూ ఆడిన మాట తప్పాడు. తననే శరణు కోరానన్న జాలి అయినా లేకుండా నా సంగతే పూర్తిగా నిర్లక్ష్యం చేశాడు...." — అంటూ నిట్టూర్చాడు రాముడు.

లక్ష్మణుడు కోపంతో వూగుతున్నాడు — "అవును అన్నగారూ : సుగ్రీవుడు ఆడిన మాట తప్పాడు. మీరు చేసిన మేలు పూర్తిగా మరిచిపోయాడు. కృతఘ్నుడు : అటువంటి దుర్మార్గుణ్ణి దయ దలచకూడదు. శిక్షించ వలసిందే."

రాముడికి క్రమ్మరవ్యం తోచింది — ఆలోచనలో మునిగాడు — సుగ్రీవుడి ధైర్య సాహసాలు తనకి తెలియనివి కావు. మిక్కిలి భయస్తుడు. మూర్ఖుడు. ఎంత రాజు అయినా, సైన్యబలం వున్నవాడైనా తనను ధిక్కరించే సాహసం చెయ్యలేడు. చేశాడో, సర్వనాశనం చెయ్యగలనని బెదిరించాలి. జంకకపోడు.

సుగ్రీవుడు మాట తప్పడు, తను దండించే అవకాశం కలగడం — సుగ్రీవుడు తనను క్షమాపణ కోరి వినయ విధేయతలతో లొంగి వుండడం ఆలోచిస్తోంటే రాముడికి ఇదే చక్కగా వున్నట్టు తోచింది. ఆటవికుడికి ఎప్పుడే కార్యం నిర్వర్తించుకోవాలో గ్రహించేంతటి జ్ఞానమా ?.... "ఉత్తమత్వం" లో వానరరాజు తనకు సాటి కాగలడా ? .... ఎన్నటికీ కాలేడు. అందుచేతనే, కృతఘ్నుడుగా ప్రవర్తించాడు. ఈ అపవాదంవల్ల అతడు తనపట్ల పూర్వంకంటే ఎక్కువ భక్తితో మసులుకుంటాడు. — రాముడి మనసు ఎంతో తృప్తి పడుతోంది.

—"లక్ష్మణా ! మిత్రుణ్ణి దండించడం ధర్మం కాదని ఆలోచిస్తున్నానే గానీ, మిత్రుడు శత్రువైతే దండించక విడిచి పెడతానా ? — తన అవసరం తను తీర్చుకున్నాడు. చక్కగా రాజై కూర్చున్నాడు. నిత్యం నీచమైన కామ సుఖాలలో మునిగి తేలుతూ వున్నాడు. మద్యపానాలతో .... విలాసాలతో .... మంచి చెడ్డలు మరిచిపోయి కాలం గడుపుతూ

వున్నాడు. వసరుతువు దాటిపోయిన తర్వాత సీతను వెదికించాలని ఎర గడా ?.... దుర్మహంకారం గాకపోతే నా కిచ్చిన వాగ్దానం తప్పుతాడా ? నమ్మించి తన అవసరం తీర్చుకున్నాడే ! చెయ్యవలసిన కర్తవ్యం మాత్రం పాటించడా ? .... శ్రీరాముడంటే ఎవరను కున్నాడో ! .... "రాజ్యం లేనివాడు ... సైన్యం లేనివాడు.... నన్నేమి చెయ్యగలడులే" — అని నిర్భయంగా వున్నట్టున్నాడు. లక్ష్మణా !.... నువ్వు వెంటనే కిష్కింధకు బయలుదేరి వెళ్ళు. ఆ దుర్మార్గుడి వ్యవహారం ఏమిటో తేల్చుకుని వెంటనే రా !

తనకు చేసిన వుపకారం మరిచిపోయిన వాడికంటే అల్పు డుండ డన్నానని చెప్పు. రాత్రీ, పగలూ తెలియకుండా స్త్రీలతో భోగించడం కన్నా క్షుద్రత్వం లేదన్నానని చెప్పు. రామబాణం చెబ్బ చవిచూడాలని కోరికగా వుందేమో అడుగు. వాలినైతే వొక్కడినే చంపానుగానీ, తన నైతే బంధు మిత్రులతో సహా సర్వనాశనం చేస్తానన్నానని చెప్పు. కామ భోగాలలో మునిగి తేలడం కాదు. రామ బాణాలలో ముంచెతుతానని చెప్పు. దుర్మార్గుడు తిన్నగా వెళ్ళి అన్నని కలుసుకుంటాడు .... ఇప్పుడు చెప్పినవన్నీ విన్నావుగా ? అన్నీ గుర్తు పెట్టుకుని — నాకు ఎంత ఆగ్రహం కలిగిందో .... బాగా అర్థమయ్యేట్టు చెప్పు. ఈపూటే బయలుదేరు. ఇంకా ఆలశ్యం ఎందుకు ?"

"చిత్తం ! .... చిత్తం! అన్నగారూ! మీరు భోజనం చేసింతర్వాత .... ఈ పూటే బయలుదేరుతాను. మీరు చెప్పిన కార్యం చెప్పినట్లు చేసుకువస్తాను. ఎంత దుర్మార్గుడు గాకపోతే .... మీ కిచ్చిన మాట నిర్లక్ష్యం చేస్తాడు ! .... మీ దయవల్లనే గదా కిష్కింధా రాజ్యం సంపాదించుకో గలిగాడు. మీ కార్యమే విస్మరించినప్పుడు .... సుగ్రీ వుణ్ణి ఇక రాజుగా వుండనివ్వకూడదు. రాజభోగాలన్నీ ఆ దుర్మార్గు డనుభవించడం ఎందుకు ? .... మీరు తలచుకుంటే వొక్క ఘడియలో సుగ్రీవుణ్ణి రాజ్యభ్రష్టుణ్ణి చెయ్యగలరు ఆ కృతఘ్నుణ్ణి తల్చుకుంటూ వుంటే నాకు కోపం ఆగడంలేదు. మీకు శ్రమ లేకుండా నేనే అతన్ని

ఒక్క దెబ్బతో యమ లోకానికి పంపించేస్తాను. అంగదుణ్ణే రాజుని చెయ్యవొచ్చును. ఆతడే వాలినగార్ని వెతికి పెడతాడు .... సుగ్రీవుణ్ణి మాత్రం బతకనివ్వను"— తన మాటలు అన్నగారికి చాలా సంతోషం కలిగిస్తాయని లక్ష్మణుడు సుగ్రీవుడిమీద రౌద్రంతో మండిపడిపోతున్నాడు.

లక్ష్మణుడి ఆవేశం చూసి రాముడు గంభీరంగా మొహం చిట్లించాడు — తనేదో సుగ్రీవుణ్ణి బెదరించా లనుకుంటే .... ఇతను నిజంగానే చంపుతా నంటాడేమిటి ? .... వాలిని చంపినందుకు సుగ్రీవుడు అండగా వున్నాడు గాబట్టి సరిపోయిందిగానీ, సుగ్రీవుణ్ణి కూడా చంపితే .... కిష్కింధనుంచి బతికి బయటపడే మార్గం వుంటుందా ? .... సుగ్రీవుడికీ, అంగదుడికీ శత్రుత్వం వున్నమాట నిజమే అయినా ప్రస్తుతం రాజ్యంలో అంగదుడికన్నా సుగ్రీవుడికే బలం ఎక్కువ. అలాంటి వాడితో వైరం పెట్టుకుంటే అంగదుడు తనతో కలుస్తాడనే నమ్మకం ఏమిటి ? .... తండ్రినీ, పినతండ్రినీ కూడా చంపితే, అంగదుడు తన నెంత మాత్రం విశ్వసించడు..... రావణుడితో యుద్ధం ఇంకెలా జరుగుతుంది ? నయాన్నో, భయాన్నో తెలివిగా కార్యాలు సాధించుకోవాలి గానీ ఇతని కోపం చూస్తూ వుంటే తొందరపాటుతో వ్యవహారం అంతా చెడగొట్టేట్టు వున్నాడే !

లక్ష్మణుణ్ణి మందలించే ధోరణితో రాముడు గంభీరంగా — "నేను చెప్పినదంతా విడిచిపెట్టి, నువ్వు నీ స్వబుద్ధితో, స్వతంత్రించి కార్యాలు చేసేట్టు వున్నావే లక్ష్మణా ! ఏదో కొంచెం పొరపాటు జరిగినంత మాత్రాన స్నేహితుల్ని చంపుకుంటామా ఎక్కడైనా ? తొందరపడి ఇటువంటి పాపపు మాటలు మాట్లాడడం ధర్మం కాదోయీ ! కోపం నిగ్రహించుకునే వాడే ఉత్తమ పురుషుడు" — అని వాత్సల్యంతో

జ్ఞానబోధ చేశాడు. *

* 30 వ సర్గలో — 66 నుంచీ, 85 వరకూ.
31 వ సర్గలో 8 శ్లోకాల వరకూ.

— సుగ్రీవుడు సహాయం చెయ్యలేదని రాముడి దుఃఖం, సుగ్రీవుణ్ణి తిట్టడం, ఆపై లక్ష్మణుడంతే అతన్ని బుజ్జగించడం చూడండి.

రాముడి దుఃఖం — "రాజ్యమునుండి వెడలగొట్టబడి, భార్య నెడబాసి, దుఃఖించుచుండు నా విషయములో రాజగు సుగ్రీవుడు దయ యుంచకున్నాడు. — ఈ రాముడు రాజ్యభ్రష్టుడు. దిక్కులేనివాడు. రావణునిచే పరాభవించబడి, దీనుడై యున్నాడు. ఇల్లు విడిచి బహుదూరము వచ్చి కాముకుడై నన్నే శరణు జొచ్చెను" — అని తలచి, దురాత్ముడైన సుగ్రీవుడు నన్ను లక్ష్యపెట్టకున్నాడు. సీతను వెతుకుటకు నాలుగు నెలలు గడువుపెట్టి, అతని కార్యమును దీర్చుకుని, దురాత్ముడయి, సంకేత సమయమును దెలుసుకొనకున్నాడు — (సీతను వెదకటం అనే మాటేగానీ, యుద్ధానికి సహాయం అనే మాట ఎక్కువగా ఎత్తడు రాముడు. యుద్ధానికి సహాయం చెయ్యమని అప్రయత్నంగా అంటే బాగుండదని.) —. "సుగ్రీవుడు దురాత్ముడై నీచములు సుఖములలో నాసక్తి గలిగి, అంతఃపుర స్త్రీలతో విహరించుచు, మంత్రులతోనూ, బంధువులతోనూ గుడి మొదలైన కార్యములు జేయడు, — నాపైన దయయుంచ లేదు. (రాముడంపిన దూతతో కొంత ద్రవ్యం మిష్యమూకం మీదకి పంపించినా పంపించలేదు సుగ్రీవుడు.) — ఈ ఏకంగా రాముడు సుగ్రీవుడి దుర్మార్గాన్ని నీచత్వాన్ని దుయ్యబట్టి — "లక్ష్మణా! నీవు కిష్కింధకుపోయి దుష్టుడయిన సుగ్రీవునితో నా మాటగా జెప్పుము" — అంటున్నాడు.

ఆ చెప్పమన్నది దేనుకంటే — "నేను వాలిని జంపుట సీతను వెతికిపెలయు ననుటకేను. (వాలి తప్పు చెయ్యటం, ధర్మ స్థాపనా ఏ గింగిలో కలిశాయో! అసలు గుట్టు సుగ్రీవుడికి తెలిసిందే కాబట్టి అదే గుర్తు చేస్తున్నాడు రాముడు.) — సుగ్రీవుడా! నీ అన్న పోయియుండు పరలోకమే నశించి పోలేదు. వాలి పోయిన మార్గములోనే నీవూ పోయె

లక్ష్మణుడు కొంచెం ఆశ్చర్యంతో, సిగ్గుపడుతూ నించున్నాడు. ఇంగితానికి విస్మయంతో నోట మాట పోయింది.

రాముడు గంభీరంగా తల పంకిస్తోనే ఉన్నాడు. ".... మిత్రుడే గదా అని అంత సామరస్యంగానూ ప్రసంగించవొద్దు. అంత కఠినం గానూ చూషించవొద్దు నేను చెప్పమన్న మాటలన్నీ చెప్పు. తప్పకుండా జంకి దారికి వొస్తాడు. అంతేగానీ, ఆవేశంతో వైరం పెట్టుకుని కార్యం

(ఫుట్‌నోట్ : 303 వ పేజీ తరువాయి)

చవు. వాలి నొకనినే జంపితిని. సత్యమును విడిచియుండు నిన్ను బంధు మిత్రులతోగూడ చంపెదను" (హనుమంతుణ్ణికూడా కలిపి). — ఈ విధంగా కొంత చెప్పి మళ్ళీ వొకచోట — "సమయ మతిక్రమించి నందువలన నేను చంపివేయుదునని సుగ్రీవుడు భయపడవలసినది లేద నుము." (మరి కొంతసేపు చంపుతాననడం ఎందుకు? — వూరికే బెదరించడాని కన్నమాట; సుగ్రీవుడితో వైరం పెట్టుకోవడం సాధ్యం కాదని రాముడికి తెలుసు. సుగ్రీవుడి చాటున దాక్కుని, వాలిని చంపి బయట పడ్డాడుగానీ .... అలాగే సుగ్రీవుణ్ణి చంపడం అయితే రాముడి వశంకాదు. సుగ్రీవుణ్ణి చంపక పోవడం దయదలిచి కాదు. వీలుగాకనే.)

సుగ్రీవుపమీద లక్ష్మణుడి కోపం — "సుగ్రీవుడు కృతఘ్నుడై వున్నాడు. అటి గుణ హీనునికి రాజ్యము నీయరాదు. ధర్మమును విడిచి యుండు సుగ్రీవుని నిపుడే జంపెదను. వాలి పుత్రుడగు అంగదుడు సీతను వెతికి కనిపెట్టును"

ఈ మాటలన్నీ రామాయణన్నవేనా? ఏవన్నా కొత్తమాట లున్నాయా? — కానీ రాముడి కెంత కోపం వొచ్చిందో చూడండి — "లోకములో నీవంటివాడు మిత్రుని జంపుటకు యత్నించు పాపమును జేయరాదు. నీవు మిత్రుని జంపుటకు యత్నించు పాపమును దలచనే రాదు. (నేను మాత్రమే దలచవొచ్చును.)"

ఎంతసేపూ ఇతరుల తప్పులు ఎంచడం, ఇతరులకు నీతులు చెప్పడం, తను చాలా జ్ఞానినీ, ఉత్తముణ్ణీ అనుకోవడం,— ఈ లక్షణా లన్నీ "ఫ్యూడల్ మనస్తత్వం."

చెడగొట్టకు. అసలు .... ఆనాడే నా ఆజ్ఞ నువ్వు ధిక్కరించకుండా ఉంటే .... ఆశ్రమం విడిచి రాకుండా ఉంటే ..."

లక్ష్మణుడు మొహం చిన్నబోయి తలవొంచుకున్నాడు.

లక్ష్మణుడి మౌనం చూసి రాముడు కొంచెం ఇబ్బంది పడ్డాడు. ఇతడేమైనా మనసు కష్టపెట్టుకున్నాడా ? మౌనం వహించాడే ! ఎప్పుడూ తనపట్ల వినయం చూపేవాడు ..

నిట్టూర్చాడు రాముడు — ".... ఇదంతా నా దురదృష్టమో యా! దైవం నన్నిలా దుఃఖపెడుతున్నాడు...." — అంటూ దుఃఖ సాగరంలో మునిగిపోయాడు.

తుఫాయి చెట్టుమీదనుంచి రెండు చిన్ని పిట్టలు పంప వేసి తుర్రు మన్నాయి.

"అమ్మా ! .... అమ్మా ! .... సన్నాసి దేవు డేడుస్తున్నాడే !"

"సన్నాసి దేవు డెవరర్రా ?"

"అదేనే. గుహలో లేడూ ? .... పేద .... గడంతో బూడిది లాగున్నాడే !"

"అమ్మో ! రాముడా ? .... ఆయన దగ్గిర బాణాలు లేవూ ?"

"మేం కనబడకుండా దాక్కున్నాంగా ?"

"ఏమోనర్రా ! .... మీరు వొద్దన్నపనే చేస్తారు అమ్మ చెప్పి ది కదాని వొక్కసారన్నా విన్నారా ? .... రాముడు మిమ్మల్ని చూశాడా ?"

"అసలు తల పైకి ఎత్తందే ! ఏడుస్తున్నాడు."

"ఎందుకూ ?"

"పాపం వాళ్ళ భార్యని ఎవ్వరూ వెతికి పెట్టడం లేదనీ...."

"తనే వెతుక్కోరాదూ ? .... వర్షాకాలం పోయిందిగా ?"

"వొప్పందం ఉందిగా వొదినా !" — పక్క గూట్లోంచి.

"చాలెద్దూ మాయదారి ఒప్పందం. వొప్పందం....వొప్పందం.... అని కూచుంటే అవతల ఆపద కేదన్నా ప్రమాదం ముంచుకొస్తే ?"

"నీకు తెలీదా ఏమిటీ ? .... ఆవిడికి ప్రమాదాలవీ రావుట."

"ఎంచేత ?"

"ఆవిడ మహా పతివ్రతమ్మా ! రాముడు తప్ప ఆవిణ్ణెవరూ ముట్టుకోలేరుట...."

"అయితే ఇక ఏడ్చి, మొత్తుకుని వెతకడం ఎందుకూ ? .... ఎప్పుడో అప్పుడు ఆవిడే వొస్తుంది."

"అమ్మా ! ... పతివ్రతంటే ఏవిటే అమ్మా ?"

"పతివ్రతంటే.... భర్తని దేవుడనుకోవాలి.

"మరి ఎవర్ని భర్త అనుకోవాలి ?"

"దేవుణ్ణి భర్త అనుకోవాలిరా అన్నయ్యా !"— పిట్ట చెల్లి.

"అబ్బే ! అలాకాదు. దేవుణ్ణి దేవుడే అనుకోవాలి. భర్తని దేవుడే అనుకోవాలి."

"ఇద్దరు దేవుళ్ళెందుకే అమ్మా ?"

"ఏమోనర్రా ! మనుషుల గోల నాకేం తెలుస్తుంది ? ... పోయి రాముణ్ణి అడగండి."

"రాముడు భుజాలు వొంచి కుములుతో వున్నాడు— "... దుర దృష్టం గాకపోతే నాకు రావలసిన రాజ్యం ఎందుకు పోవాలీ ?.... జంట పక్షులాగ నా వెంట వొచ్చిన భార్య ఎందుకు దూరం కావాలీ" ? .. చివరికి స్నేహితుడు కూడా వాగ్దానం తప్పి .. నన్నింత శోకంలో... "

లక్ష్మణుడు కంగారు పడుతూ తేరుకున్నాడు.

అన్నగారు ఎంత సేపటినించీ శోకిస్తూ వున్నారో ! తను పరధ్యానంలో పడిపోయాడు.

—"మన్నించండి అన్నగారూ ! సుగ్రీవుడి విషయంలో నేను సామరస్యంగానే ప్రవర్తించి కార్యం నెరవేర్చి కొస్తాను. మీరు దుఖించవొద్దు. లేచి భోజనం చెయ్యండి. నేను వెళ్ళి వొస్తాను," — అంటూ గబగబా పిశతతో నీళ్ళు తెచ్చాడు. కాల్చిన గడ్డలూ, దుంపలూ, కుసుండాతి కొయ్యల కూరా పెట్టి తెచ్చాడు. — "అన్నగారూ ! ఈ

పూట వొక్కాయలు వేసి రొయ్యలు వొండాను. చాలా రుచిగా కుదిరింది. కడుపునిండా భుజించండి." —

రుచిగా కుదిరిందా ? తను తినకముందే తిన్నాడా ఏవిటి ? — రాముడు చేతులు కడుక్కుంటూ కూర వేపు క్రీకంట చూశాడు.

లక్ష్మణుడు తన మాట తనకే ఎబ్బెట్టుగా తోచి మాట సర్దుకుంటూ — "కూర వుడుకుతోంటే .... కమ్మని పరిమళాలు చూసి .... రుచిగానే కుదిరిందని...."

.... నెమ్మదిగా విసురుతూ నడుం వొంచి నించున్నాడు.

"ఓహో ! పరిమళం చూశాడా ?" — రాముడు కూర తింటూ ఆలోచనలో మునిగాడు— పరిమళం అయినా తను చూడకముందే లక్ష్మణుడు చూడవొచ్చునా ? తప్పు లేదా ? ... అంతగా లేదనుకుంటాను. తినడం, పరిమళం పీల్చడం తప్పు కాదనుకుంటాను. అవును. దోషం లెదు. నోటితో తింటే తప్పు గానీ .... ముక్కుతో పీల్చితే దోషమేముంది ?.... శాస్త్రాలు తప్పుపట్టవు. అవును. శాస్త్ర విరుద్ధం కాదు. కూర.... బహు రుచిగా వుంది ... రొయ్యలు చేపల్ని మరిపిస్తున్నాయి.

అన్నగారి భోజనం అయిన తర్వాత లక్ష్మణుడు విసనకర్ర కిందపెట్టి గుహలో పక్క సిద్ధం చేశాడు. — "అన్నగారూ! విశ్రమించండి. నేను కార్యం కాగానే తిరిగి వొస్తాను."

"వెంటనే రావాలి సుమా లక్ష్మణా ! చీకటి పడితే ... "

"సూర్యాస్తమయం లోగానే వొస్తాను. వెలవిప్పించండి." —

• • •

లక్ష్మణుడు ఆలోచనల్లో పడి రాళ్ళూ, రప్పలూ తన్నుకుంటూ పోతున్నాడు. ఇంగితం నిర్భయంగా ఏవిటేవిటో అడగుతోంది — ".... అంత జ్ఞాని కదా ; నీ హృదయం ఎన్నడూ గ్రహించలేని ...." — అంటోంది.

లక్ష్మణుడు ఇంగితంవేపు దృష్టి పోనివ్వకుండా ఆలోచనలు సుగ్రీవుడి వేపు మళ్ళించుకుంటున్నాడు.

తను వెళ్ళగానే సుగ్రీవుణ్ణి నిలదీసి అడగాలి — "ఏం చేశావోయీ నీ వాగ్దానం? .... నీ అవసరం తీరిపోయిందని గదా? .... ఇక మా అన్నగారి సంగతి మరిచిపోయి విలాసాల్లో మునిగి తేలుతున్నావు," — అనాలి మొట్టమొదట.

ఏమంటాడో దుర్మార్గుడు ... ఇంకే మనగలడు? — "అదుగో .... ఇదుగో" — అంటాడు. ఏదో నసుగుతాడు.

"అది సరేలే. మీ అన్న సంగతి చెప్పు ముందు. ఎప్పుడూ నిన్ను తప్పు పట్టాలని చూస్తాడెందుకూ?" — అంటోంది ఇంగితం.

లక్ష్మణుడు మొహం చిట్లించి — "సుగ్రీవుడి మాటలకు కరిగిపోయి దయదల్చ కూడదు. అగ్నిసాక్షిగా స్నేహం చేసుకున్నాడే :.... స్నేహితుణ్ణి గౌరవించాలనే జ్ఞానం లేదా?.... వూరుకోకూడదు." — అంటూ కోపంగా అంగలు వేస్తున్నాడు:

"సుగ్రీవుణ్ణి దండించాలని పోతున్నావు గానీ.... ఇంత పౌరుషం .... ఎప్పుడన్నా.... అన్నగారి మీద...."

"ఇదుగో.... నువ్వు స్వమానూ ఇలా సాధించకు. నా జన్మంతా మా అన్నగారి పాదసేవకే అంకితం చేసేశాను. ఆయన తిట్టినా .... కొట్టినా.... చంపినా.... అంతా ఆయన దయే. ఎప్పుడైనా కష్టం తోస్తే .... వొక్క క్షణం దిగులు పడతాను గానీ.... తర్వాత ఎంత సిగ్గుపడి పోతానో నీకేం తెలుసు? — ఇదే ఆఖరిసారి చెప్పడం నీకు. మళ్ళీ ఎప్పుడన్నా నా జోలికి వొస్తే వూరుకోను."

"సిగ్గులేకుండా నువ్వే నాతో చెప్పుకుంటావు," — అని వూరుకుంది ఇంగితం.

లక్ష్మణుడు రుసరుస లాడుతూ నడుస్తున్నాడు. "రాజై పోయానని ఎంత గర్వం సుగ్రీవుడికి! అన్నగారు తల్చుకుంటే .... వొక్క ఘడి

యలో పగ తీర్చుకోగలరు. ఆ సంగతే చెప్పాలి. అన్నగారి పరాక్రమ మంతా వర్ణించాలి. అప్పుడైనా బుద్ధి తెచ్చుకుంటాడు దుర్మార్గుడు."

కిష్కింధ చేరాడు లక్ష్మణుడు. కత్తి పిడిమీద చెయ్యి సిద్ధంగా వుంచుకుని ... విల్లు సర్దుకుంటూ గంభీరంగా నడుస్తున్నాడు.

రాజ వీధిల్లో ప్రజలు .... లక్ష్మణుణ్ణి ఆశ్చర్యంగా చూసి .... గుర్తు పట్టినవాళ్ళు .... కొత్తవాళ్ళతో గుసగుస లాడుతున్నారు.

"రుష్యమూకం మీద వుండడం లేదూ ? .... చిన్న నన్నాసి ఈయన .. "

"రాముడేనా ? .. "

"అబ్బే !.... రాముడు ఈయన అన్న .... పెద నన్నాసి ... వాలిని చంపేసిన్నాడు నువ్వు వూళ్ళో లేవుగానీ...."

"ఏవిటో ... కోపంగా వున్నట్టున్నాడే ... అటు చూడు "

"కాస్సేపు పోతే అదే తెలుస్తుంది...."

వూళ్ళోకి లక్ష్మణుడు వొచ్చాడనే విషయం అంచెలంచెలుగా .... సుగ్రీవుడి చెవులదాకా చేరింది గానీ.... తలలోకి దూరలేకపోయింది.

సుగ్రీవుడు మద్యం తాగిన మత్తులో— "లక్ష్మణు డెవరో నాకేం తెలుసు ? పొమ్మను.... మళ్ళీ వొచ్చావంటే నీ తల తీయించేస్తాను," — అని వార్త తెచ్చిన వాడిమీద మండిపడి ఇంకో వేపు తిరిగి పడుకున్నాడు.

లక్ష్మణుడు రాజ వీధుల్లో ఇళ్ళూ.... అంగళ్ళూ .... కల్లు దుకాణాలూ . దేవాలయాలూ చూసుకుంటూ నడుస్తున్నాడు. కోపం మరిచిపోయి ఆశ్చర్య పడుతున్నాడు. ఇంత కాలానికి అడవులోంచి పట్టణంలోకి.... ప్రజల్లోకి వొస్తే .. అందర్నీ పరికించి చూడాలని బుద్ధి పుడుతోంది.

అన్నగారి ఆజ్ఞ గుర్తొచ్చి కుతూహలం అణచుకుని కోపం నిలబెట్టుకుంటూ కోట ద్వారం దగ్గిరికి చేరాడు.

లక్ష్మణుణ్ణి గురించి విని అంగదుడు బయటికి వొచ్చాడు.

అంగదుణ్ణి చూడగానే లక్ష్మణుడు గంభీరంగా —"అంగదా!.... నేను వొచ్చానని నీ పినతండ్రికి తెలియపరచు. శ్రీరామచంద్రుడి దుఃఖం చూడలేక .... నేను నీ పినతండ్రిమీద కక్ష సాధించడానికే వొచ్చాను సుమా! .. వెంటనే వెళ్ళి చెప్పు" — అని అంగదుడి ముఖ కవళికలు పరిశీలనగా చూశాడు.

అంగదుడు — "తప్పకుండా తెలియ జేస్తాను" — అని లోపలికి వెళ్ళిపోయాడు.

సుగ్రీవుడి మందిరంలోకి వెళ్ళడానికి అంగదుడు తనతోపాటు ఇద్దరు మంత్రుల్ని కూడా జత తీసుకు వెళ్ళాడు.

ముగ్గురూ కూడబలుక్కుని — ధైర్యం కూడగట్టుకుని — సుగ్రీవుడి చుట్టూ జేరారు.

—"మహారాజా! .... లక్ష్మణు డొచ్చాడు."

"లక్ష్మణు డొచ్చాడు మహారాజా!"

"గుమ్మంలో వున్నాడు ...."

"గుమ్మంలో .... కోపంగా వున్నాడు మహారాజా!"

"....లక్ష్మణు డొచ్చాడు మహారాజా!"

మహారాజు విసుక్కుంటూ — ".... మళ్ళీ వొచ్చాడా? పొమ్మనండి .. మీ రందరూ పొండి" — అని వొత్తిగిలి పడుకున్నాడు.

"మళ్ళీ కాదు మహారాజా! .... వొక్కసారే వొచ్చాడు .... రాముడు పంపించాడంట ..."

"రాముడెవరు? అబ్బ!....చంపుతున్నాడే! పొమ్మనండిముందు."

మంత్రులు మొహమొహాలు చూసుకున్నారు. సుగ్రీవుడి మొహం చూశారు.

మహారాజు వూర్తిగా మత్తులో మునిగివున్నాడు.

మంత్రులు చెవులు కొరుక్కున్నారు.

రాజ వైద్యుల చెవులు కొరికారు.

మత్తు విరిచే షానీయాలూ, ఔషధాలూ మహారాజు పొట్టలో జొర బడ్డాయి.

మహారాజు పొట్టలో గడబిడకి చిరాకు పడిపోతూ లేచి — "మీ రంతా ఇక్కడ ఉన్నారేంటి ? .... నరే ! ఉంటే ఉన్నారు. తొందరగా .... పద్యం తెప్పించండి .... వూఁ .... దబ్బున ...."

"స్వీకరించండి మహారాజా !" — అంటూ వైద్యులు ఇంకో గిన్నెడు ఔషధం అందించారు.

మహారాజు గిన్నెడూ తాగి, మొహం చిట్లిస్తూ — "... ఎక్కడ తెప్పించారిది ? .... ఈ అంగడివాణ్ణి పిలిపించి వెంటనే మరణ శిక్ష వేసెయ్యండి ...." — అంటూ గిన్నె కోపంగా వైద్యులమీదకి గిరాటు పెట్టాడు.

మంత్రులు గిన్నె దెబ్బ తప్పించుకుని, ధైర్యంచేసి — "మహా రాజా ! ... లక్ష్మణు డొచ్చాడు. మండిపడిపోతున్నాడు. తర్వాత నీ ఇష్టం" — అని వూరుకున్నారు.

మహారాజు ఎగిరి పడ్డాడు — "లక్ష్మణుడా ? .... మండిపడిపో తున్నాడా ? .... ఎందుకూ ? .... ఏవైందీ ?"

"ఏమో మరి .... రాముడు పంపించాడంట .... కోపంతో రుద్రుడ్ని ఉన్నాడంట రాముడు ...."

"రాముడా ? .... కోపంతో రుద్రుడా ? ... "

సుగ్రీవ మహారాజు బిత్తరపోతూ — దిక్కులు చూశాడు — "ఎందుకూ ? నేనేం తప్పు చేశాను ? . అసలు ఎంత మంచి వాణ్ణి నేను ! రాముడికి నామీద కోపం ఎందుకొచ్చిందబ్బా ? .... నే నంటే గిట్టని వాళ్లెవరన్నా రుష్యమూకం పోయి రాముడికి నామీద నూరి పోశారేమో ! .... అసలు వాళ్లెవరో ముందీ వెతికించి మరణశిక్ష వేసె య్యండి . ".

"వేసేస్తాం మహారాజా ! .... అదెంత పని ? .... ఆ దుర్మా ర్గులు ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటాం. ఇంతకీ ... లక్ష్మణుడి సంగ తేమిటి ? .... మండిపడిపోతున్నాడే !...."

సుగ్రీవుడు మళ్ళీ అదిరిపడ్డాడు — "లక్ష్మణుడి సంగతా ? .... బాణం ఉందా దగ్గిర ?"

"ఆ .... బాణాలు ఉన్నాయి. కత్తులూ ఉన్నాయి."

సుగ్రీవుడు కాళ్ళు ముడుచుకుని పట్టుదిళ్ళమధ్య వొదిగి కూర్చున్నాడు. — "ఎందుకు మండిపడిపోతున్నాడబ్బా? .... ఇదేంటి? నే నాలోచిస్తున్నా నేవిటి? ఏ రందరూ ఆలోచించకుండా కూర్చున్నారేం? .... ఇంకా మంత్రు లందర్నీ పిలవండి. అసలు లక్ష్మణుడికి కోపం ఎందుకొచ్చిందో ఆలోచించండి. ఊ .... దబ్బున .... చప్పున .... ఆలోచించండి. నేను మంత్రుల్నయితే నేనే ఆలోచించే వాణ్ణి."

హనుమంతుడుకూడా వొచ్చి మంత్రుల్లో కలిశాడు. మంత్రు లంతా వొక మూల గుమిగూడి ఆలోచించడం మొదలుపెట్టబోతున్నారు. ఒక మంత్రి ఇంకో మంత్రి చెవిలో — "లక్ష్మణుడికి కోపం ఎందు కొచ్చిందో మనం ఆలోచించడం ఎందుకూ? ... అయన్నే అడిగితే సరిపోతుందిగా?" — అని వొక ఆలోచన విసిరాడు.

"వొద్దు. ఆయన్ని నమ్మకూడదు. అబద్ధం చెపితే ....? మనమే ఆలోచిద్దాం — పట్టు."

సందేహం మంత్రి పట్టకుండా వూరుకున్నాడు.

సుగ్రీవుడు హారాలు సర్దుకుంటూ — గోడకి కాళ్ళు తన్నిపెట్టి కూర్చుని — "రాముడంటే నా కేవిటో భయం అనుకునేరు. అబ్బే! .... అదేం కాదు. వూరికేనే .. స్నేహితుడికి అన్యాయంగా కోపం వొస్తే ఏం బాగుటుందనిగానీ .... అయిందా?—ఆలోచించేశారా....?" — అని కంగారు పడ్డాడు.

"అవుతోంది మహారాజా! .... ఇంకెంతోసేపు పటదు .... మధ్యలో కొచ్చేశాం."

"ఇంకా మధ్యలోనే మిడుకుతున్నారా? .... స్నేహం బాగానే సంపాదించ వొచ్చునయ్యా! పెద్ద కష్టమేం కాదు! .... నాలుగు కర్ర లంటించి, నిప్పు రాజేసి దానిచుట్టూ తిరిగితే సరిపోతుంది. అసలు స్నేహం నిలబెట్టుకోవటంలోనే ఉంది యాతనంతా. బుద్ధి చంచలమైంది.

నిలకడ వుండివావదు దానికి. అందుకే స్నేహాలు చెడిపోతాయి. — ఇంకా పథ్యంలోంచి కదిలారా లేదా? వూఁ కానివ్వండి తొందరగా "

"చిన్న సందేహం మహారాజా! 'బుద్ధి చంచలం' అన్నావు. "అందువల్లే స్నేహాలు చెడిపోతాయి" అన్నావు. ఎవరి బుద్ధో వివరించి చెప్పలేదు. రాముడి బుద్ధి చంచలమో, నీ బుద్ధి చంచలమో, సరిగ్గా చెప్పకపోతే . ఎవరివల్ల స్నేహం చెడిపోయిందో.... మేమెలా తెల్సుగలం మహారాజా? ... రాముడి బుద్ధి చంచలం" — అనుకోమంటావా?"

"ఉబ్బే: .... రాముడు వుత్తమపురుషుడయ్యా!"

"చితం! .... పోనీ నీ బుద్ధే చంచలం అనుకోమంటావా?"

సుగ్రీవుడు గుటకలుమింగి ఇబ్బందిలో పడ్డాడు. హారాలు సరుకున్నాడు. కాళ్ళు ముడుచుకున్నాడు. — "ఏదో మొదలకండి. మొదే ఆలోచించండి. మంత్రులు గడా నన్నుపుగుతారేం?" అని విసుక్కున్నాడు.

మంత్రులందరూ మళ్ళీ మూలకిచేరి గుడగుళ్ళాడి ఆలోచించారు.

"అయింది మహారాజా! ఆలోచించాం."

"అప్పుడే అయిపోయిందీ? సరే! ఏం తేల్చారో చెప్పండి."

"నువ్వు తప్పే చేశావు మహారాజా! రాముడు నీకు వుపకారం చేస్తే .... నువ్వు మళ్ళీ చెయ్యడం మర్చేపోచూవు."

"ఇది మరీ బాగుంది. ఎక్కడ మర్చిపోయానూ? రాముడి భార్యని వెతకడానికేగా సైనికులందరూ రావాలని కబురు పంపించానూ? తెలవనట్టు మాట్లాడతారేం? .... ఏం నీలుడూ! ఆ గోలంతా నిన్ను చూడమన్నానుగా? ఏం చేస్తున్నావు? మళ్ళీ నిద్రకి పడ్డావా ఏంటి?"

"చితం! లేదు మహారాజా! .... రిష్యమూకం మీద నిద్ర పోయి తప్పు చేసిం దగ్గిర్నుంచీ మళ్ళీ కన్ను మయ్యలేదు మహారాజా! .... నీ ఆజ్ఞ ప్రకారం అందరికీ కబురు పంపించాను."

"పది పదిహేను రోజుల్లో రానివాళ్ళందరికీ మరణశిక్ష వేసెయ్యమని చెప్పానుగా?...."

"చిత్తం! వానివాళ్ళందర్నీ చంపించేస్తాను మహారాజా!"

"ఇన్ని ఏర్పాట్లు చేయించాను. ఇంక నా తప్పేం వుంది?"— అన్నాడు సుగ్రీవుడు కోపంగా.

"చిత్తం! ఏర్పాట్లు చేశావుగానీ .... పుళ్ళీ నీ విలాసాల్లో నువ్వు పునిగిపోయావు మహారాజా!"

"ఏడిసినట్టే వుంది. వాళ్లొచ్చేదాకా నేనేం చెయ్యనూ?"

"....."

"నే నొక్కణ్ణే మునిగానా వి....లా....సా....ల్లో? మీరూ నాట్యాలూ గీట్యాలూ చూసి లొట్టలేస్తోనే వున్నారుగా? హనుమంతుడు మొన్న నాతోపాటు తెల్లవార్లూ కూర్చుని తెగ తాగలేదూ? .... ఏం? మాట్లాడ్డేం?"

"చిత్తం! .... తాగాం మహారాజా! .... మా గొప్ప రుచి! ఎన్ని జన్మలెత్తినా మరిచిపోను."

"సరేలే! రాముడి కోపం నంగతి చూడు."

"అబ్బే! .... కోపం ఎందుకొస్తుంది మహారాజా? ఏదో కొంచెం నిన్ను నిష్కూరా లాడాలని అలక చూపిస్తున్నాడేమో గానీ ..."

"నీ మొహం లాగానే వుంది అలక! .... లక్ష్మణుడు కత్తులూ, బాణాలూ పట్టుకొచ్చా డన్నారుగా? .... కోపంతో మండి ...."

హనుమంతుడు బుగ్గలు వుబ్బించి ఆలోచనల్లో పడ్డాడు. ఆలోచించి .... ఆలోచించి .... గుడ్లెర్రజేశాడు ... —"ఆ మండి పడితే మండిపడతాడు. తీరుకోవలసిందే! తప్పు నీదేనయ్యా! శ్రీరామచంద్రుడంటే మాట లనుకున్నావా? ఆ విల్లు చేత్తో పట్టుకున్నాడంటే .... ఎందుకులే .... వాలి ఎలా నేల కూలాడో కళ్ళారా చూశాంగా? .... ఆయుధబలం గలవాడితో శత్రుత్వం సాగుతుందా నీకు? రాముడు తల్చుకున్నాడంటేనా ... అన్ని లోకాలూ ఆక్రమించేసుకో గలడు. నీ మేలు కోరేవాళ్ళం కాబట్టి ఇన్ని మాటలు చెప్తున్నాం. భార్య, భర్త

ఆధీనంలో ఎంత వినయంగా వుండాలో — అలాగ నువ్వు రాముడి ఆధీనంలో ఉండాలి. ఆయన ఏది కోరితే అది చేసిపెట్టాలి...."

సుగ్రీవుడు తలవొంచి ఆలోచిస్తూ మొహం చిట్లించాడు — "... ఏది కోరితే అది చెయ్యాలి మరి .... రావణుడితో యుద్ధం ! .... ఎక్కడున్నాడో ఏంటో పాడు రావణుడు.... దొరికితే మరణశిక్ష వేయించెయ్యాలి .... సీతనే ఎత్తుకు పోవాలా ? .... బోలెడుమంది ఆడవాళ్ళు లేరూ ? .... ఇప్పుడు .... పెద్దపెట్టున .... యుద్ధం అంటే ...."

"మహారాజా ! శ్రద్ధగా విను. రాజయినవాడు పదికాలాలపాటు సిరంగా రాజ్యం చెయ్యాలంటే, తనొక్కడూ క్షేమంగా ఉంటే చాలదు సుమా ! ధనాగారం వృద్ధి చేసుకోవాలి. సైన్యాన్ని అదుపులో ఉంచుకోవాలి. తనకు అనుకూలించే మిత్రుల్నికూడా కాపాడుకోవాలి. బొక్కసం ... సైన్యం .... మిత్రులూ .... బలంగా ఉంటేనే రాజు నిర్భయంగా రాజ్యం చేసుకోగలడు. వెంటనే లక్ష్మణుణ్ణి పిలిపించి, ఆయన్ని బతిమాలుకో. రాముడి పని చేసిపెట్టడానికి .... నువ్వు మనసులో కూడా .... ఏమీ .... అయిష్టంగా .... ఆలోచించకూడదు సుమా !"

"అబ్బే ! నే నెప్పుడు ఆలోచించానూ ?" — అని కంగారు పడ్డాడు సుగ్రీవ మహారాజు.

"సరే ! మీరందరూ పొండి. లక్ష్మణుణ్ణి తీసుకురండి" — అని గంభీరంగా ఆజ్ఞాపించాడు.

మంత్రుల్ని వెళ్ళనిచ్చి — సుగ్రీవ మహారాజు లక్ష్మణుడు రాగానే తనేం చెయ్యాలో, నించోవాలో, కూర్చోవాలో, దాక్కోవాలో ఆలోచిస్తున్నాడు.

టంగు టంగు మంటూ ధనుస్సు మోగిస్తోన్న చప్పుళ్ళు వినవచ్చాయి. అంగదుడు లోపలికి వొచ్చి — "లక్ష్మణుడు వొచ్చాడు" — అన్నాడు.

"వొచ్చాడూ ? ఎలాగున్నాడు ?"

"బలిసి ఎద్దులాగున్నాడు."

"అబ్బ! .... అదికాదు. కోపం ఏవన్నా తగ్గిందా?"

"ఇంకా ఎక్కువయ్యింది."

సుగ్రీవుడు వొణుకుతూ లేచాడు — "ఉండు, ఉందు అప్పుడే తీసుకురాకు .... నువ్వెళ్ళు .... వుండు ...." అంటూ అటూ ఇటూ తచ్చాడి తార దగ్గిరికి పరిగెత్తాడు— "తారా! లక్ష్మణుడు చాలా కోపంగా ఉన్నాడంటున్నాడు అంగదుడు. అంత కోపం ఎందుకొచ్చిందంటావూ నామీద? గబగబా ఆలోచించు. నువ్వు చక్కగా ఆలోచించగలవని ఎప్పుడో మా అన్న కూడా అన్నాడు. మరి ఆలోచించు చక్కగా. డో .... దబ్బున ...."

"మంత్రులంతరూ ఆలోచించి చెప్పారుగదా మహారాజా!"

"ఏం జెప్పారు? వాళ్ళ మొహం! నాదే తప్పన్నారు. వాళ్ళ మొహం తప్పు. నేనసలు ఎంత మంచివాణ్ణో! కొంచెం నువ్వు వెళ్ళి లక్ష్మణుడితో మాట్లాడు ముందు ఎలాగో నచ్చజెప్పు. తర్వాత నేనే మాట్లాడతాను. నాకేం భయం లేదనుకో. ఎంత కోపంలో వున్నవాళ్ళయినా ఆడవాళ్ళ నేమి అనరు. దబ్బున వెళ్ళు మరి ...." —

వొంటినిండా ఆభరణాల చిరుచప్పుళ్ళతో తార నెమ్మదిగా అలోచిస్తూ బయలుదేరింది — సుగ్రీవుడు భయస్తుడు. వాలి వంటి సాహసవంతుడు కాడు. మహారాజైవున్నా, సైన్య బలం అండగా వున్నా, ఆ వాగ్ధానానికి లోబడి, ఒంటరిగా వున్న రాముడికి జంకుతున్నాడు. అతణ్ణి ఆదుకోకుండా విడిచిపెట్టడం మంచిది కాదు. రాముడిపట్ల భయంతో సుగ్రీవుడు మరింత లొంగి, పరదేశపురాజు ఇచ్చానుసారం ప్రవర్తించడం కిష్కింధకు క్షేమం కాదు. లక్ష్మణుడి కోప కారణం గ్రహించి, సమయానుకూలంగా వ్యవహరించాలి.

తార రావడం చూసి లక్ష్మణుడు కొంచెం సిగ్గుపడి — గంభీరంగా కూర్చున్నాడు.

తార అనునయంగా సంభాషణ కుపక్రమిస్తూ — "ఆర్యపుత్రా: నీకు కోపం వచ్చిన సంగతి విని మేమందరం ఎంతో విచారపడుతున్నాం.

నీ కోపానికి కారణం ఏమిటో తెలియక .... మహారాజు చాలా దుఃఖపడుతున్నాడు. చెప్పు నాయనా : మావల్ల ఏమి పొరపాటు జరిగింది ? .... మీ ఆజ్ఞ మీరింది ఎవ్వరు ?" — అని పలకరించింది.

లక్ష్మణుడు కోపంగా — "నా కోపానికి కారణం ఏమిటో నేనే చెప్పాలా ? మా అన్నగారి విషయంలో నీ భర్త ఎంత అలక్ష్యంగా వున్నాడో నీకు తెలియదా ? నాలుగు మాసాలలో మా అన్నకు సహాయం చేసానని వాగ్దానంచేసి, అన్నీ మరిచిపోయి రాజ సుఖాలలో మునిగి పోయాడే !.... కోపం తెచ్చుకోక మా అన్నగారి నేం చెయ్యమంటావు?"

తార శాంతంగా — "సుగ్రీవుడు సుఖలాలసుడై ఉన్నమాట యథార్థమే. కానీ, మీ కిచ్చిన వాగ్దానం విస్మరించలేదు సుమా ! అందు కోసం ఏర్పాట్లు చేస్తోనే వున్నాడు" — అంది.

లక్ష్మణుడు మౌనం వహించాడు.

"సుగ్రీవుడివల్ల అపరాధం ఉన్నప్పటికీ మీ రింతగా కోపించడం విస్మయం కలిగిస్తోంది — అతడు మీ మిత్రుడే కదా ? .... మీ సోదరుడే కదా ? ...."

" ..... "

"తపో సంపన్నులయిన మహా ఋషులే కామ సుఖాలకు లొంగి వేలకొదీ సంవత్సరాలు తపోభంగం కావించుకున్నారని ఎన్నెన్నో కథలు విన్నావే ! ఇక సుగ్రీవు డెంత ? నీవంటివాడు తెలుసుకోలేనిదేముంది చెప్పు ? .... సౌఖ్యాల కోసమే గదా అతడు రాజ జీవనం కోరుకున్నాడు :"

" ..... "

"మర్యాదలన్నీ తెలిసినవాడివి కాబట్టి ఇక్కడే ఆగావు అంతఃపురంలోకి రా నాయనా ! నీవంటి వుత్తముడు మంచి మనసుతో పరస్త్రీలను చూడడంలో తప్పేమీ లేదు. నా వెంట వొస్తే మహారాజు దగ్గరికి తీసుకు వెళ్తాను" అంటూ మర్యాదగా ఆహ్వానించింది.

లక్ష్మణుడు గంభీరంగా లేచాడు.

మందిరాలు దాటుకుంటూ సుగ్రీవుడి మందిరంలోకి వెళ్ళేసరికి — సుగ్రీవుడు విశాలమైన ఆసనంలో పట్టుదిళ్ళమధ్య కూరుకుపోయి .... ఆడవాళ్ళని చుట్టూ పెట్టుకుని కూర్చుని చాటు చాటుగా చూస్తున్నాడు.

ఇంత లోపల్లికి .... వూ రిగా సుగ్రీవుడి అధీనంలోకి ప్రవేశించి — సుగ్రీవుడితో వైరం పెట్టుకోవడం తెలివైనపని కాదేమోనని నందే హిస్తున్నాడు లక్ష్మణుడు. తన దగ్గిర ఆయుధాలున్నప్పటికీ — కోట నిండా కాపలావా రున్నారు. సందేహిస్తూ నడుస్తోన్న లక్ష్మణుడు సుగ్రీవుడి బెదురుచూపులు చూడగానే ఉత్సాహంతో కోపం తెచ్చుకుని, కళ్ళెర్ర జేసి రుద్రుడయ్యాడు.

సుగ్రీవుడు ఆభరణాలు గలగల్లాడించుకుంటూ వొణుకుతూ లేచి నించున్నాడు.

లక్ష్మణుడు సుగ్రీవుణ్ణి కాల్చేసేట్టు చూస్తూ — "దుర్మార్గుడా ! నీ మిత్రుడు కష్టాల్లో కృంగిపోతూ వుంటే నువ్వు సుఖాల్లో కులుకుతున్నావా ? నీ నైజం గ్రహించలేక మా అన్న ఎంతో దయతో నీకు వానర రాజ్యం పట్టం గట్టాడు. లోకంలో ఏ పాపానికైనా ప్రాయశ్చిత్తం వుందిగానీ — చేసిన మేలు మరిచిపోయే పాపానికి మాత్రం ప్రాయశ్చిత్తం లేదు. నీవంటి కృతఘ్నుణ్ణి చంపడం వొక్కటే ధర్మం. రాపు బాణాల రుచి నీ అన్నే కాదు, నువ్వూ చూడక తప్పదు" — అంటూ మండిపడి, తర్వాతేం చెయ్యాలో తోచక గోడలు, గుమ్మాలూ, అనానాలూ పరికిస్తూ నించున్నాడు.

తార చిరునవ్వుతో — "లక్ష్మణా ! చాలా కఠినంగా మాట్లాడుతున్నావు. నీ కోపం నువ్వు వెలిబుచ్చుకున్నావు. మంచిదే. సుగ్రీవుడు మీతో స్నేహం విడిచిపెట్టుకోలేదని మాత్రం గ్రహించు" — అని ఊరుకుంది.

లక్ష్మణుడు గంభీరంగా సుగ్రీవుడివేపు చూపు తిప్పాడు.

సుగ్రీవుడు వొణుకు అరికట్టి, రెండడుగులు ముందుకొచ్చి, లక్ష్మణుడి చేతులు దొరకబుచ్చుకొని — "నేను రామయ్యను మరిచిపోలేదు సుమా ! ఈ సిరి సంపదలన్నీ నాకు రామయ్యే ప్రసాదించాడు.

అబ్బే ! .... నే నెందుకు మరిచిపోతానూ ? కొంచెం మత్తుగా నిదర పట్టేసి, పదిరోజు లాలశ్యంగా లేచానంతే. నా తప్పులన్నీ కడుపులో పెట్టుకోవాలి నువ్వు. రామయ్యని తప్పకుండా సేవించు కుంటాను ... నా పొరపాట్లు మన్నించాలి నువ్వు" — అంటూ ప్రాధేయపడ్డాడు.

వొచ్చినపని ఇంత సవ్యంగా ... ఇంత సునాయాసంగా ముగిసి నందుకు లక్ష్మణుడు విజయగర్వంతో పొంగిపోయాడు. తార మాటలతోటే చాలావరకు కోపం తగ్గింది. ఇక సుగ్రీవుడి క్షమాపణతో సంతోషం కూడా వేసింది — "సుగ్రీవుడా ! అన్నగారి దుఖం చూడలేక కొంచెం కఠినంగా మాట్లాడాను. ఏమీ అనుకోకు. మనసులో పెట్టుకోకు."

"ఎంత మాట ! .... ఎంత మాట !...."

"నీ వినయ విధేయతలూ .... నీ నడుణ్ణాలూ .... నీ మంచితనం అంతా చూస్తూ వుంటే వానర రాజ్యం పాలించడానికి నువ్వే అర్హుడవని ఆర్డమెంది. ఏమో అనుకున్నాను గానీ .... మా అన్నగారికి తగిన మిత్రుడివి నువ్వు.... మీ ఇద్దర్నీ దేవతలే కలిపారు. నీ సహాయమే వుంటే మా అన్నగారు శత్రువుల్ని జయించడం ఎంత పని !"

"నీ ప్రేమకొద్దీ అంటున్నావు గానీ....శ్రీరాముడికి నా సహాయం కావాలా ? ... ఆయన శత్రువుని ఆయనే జయించుకో గలడు .... నేను సేవ చేసుకుంటూ వెనకాల వుంటే చాలు. .... అంత మహావీరుడికి ఇతర్లు సహాయం చెయ్యటం ఏమిటి ?"

"సుగ్రీవుడా ! అన్నగారు పూర్తిగా దుఖ సాగరంలో మునిగి వున్నారు. నువ్వు కూడా నాతో పాటు వొచ్చి, ఆయన్ని ఓదార్చి ధైర్యం చెప్పాలి. నిన్ను వెంట బెట్టుకుని వెళ్లానంటే అన్నగారు చాలా సంతోషిస్తారు.... ఇందాక నేను దూషించిందేమీ మనసులో పెట్టుకోవద్దు సుమా !"

పండిపడే లక్ష్మణుడు పూర్తిగా చల్లబడ్డాక సుగ్రీవుడి దడ కట్టింది. ముసిముసి నవ్వుల్తో — "అలాగే వొస్తాను .... తప్పకుండా వొస్తాను.... ఇప్పుడే వొస్తాను...." — అంటూ చుట్టూ చూశాడు.

మంత్రులంతా కెక్కలు కట్టుకు వాలాయ. సుగ్రీవుడు గంభీరంగా మంత్రు లందర్నీ చూశాడు. —"…. ఆ మధ్య ఎప్పుడో నే నాజ్ఞాపించానే సైనికు లందర్నీ రమ్మని. వొచ్చేశారా ?"

నీలుడు ముందుకొచ్చి— "చిత్రం! …. కొందరు వొచ్చారు గానీ…. కొందరింకా రాలేదు మహారాజా!" —అంటూ విన్నవించాడు. సుగ్రీవుడు కోపంగా మొహం చిట్లించాడు.

—"సరే! ఆ రాని వాళ్ళందరికీ వెంటనే మరణశిక్ష వేయించి ఇదుగో హనుమంతుడా! …. పునం శ్రీరాముడి కోసం రావణుడి మీదికి యుద్ధానికి బయల్దేరాలి…. ఇప్పుడు మనకి…. బోలెడు మంది జనం కావాలి. ప్రజలంతా గమ్మున యుద్ధంలోకి వొచ్చెయ్యాలని దేశం నిండా దండోరాలు వేయించండి…. ఏం? తెలిసిందా?"

"తెలిసింది మహారాజా! .. అలాగే వేయించేసాను గానీ ప్రజలు దండోరాలు వినేసి . ఎవరి దార్ని వాళ్ళు పోతారు గానీ…. యుద్ధంలో కొస్తారంటావా మహారాజా?"

"రాని వాళ్ళందర్నీ లాక్కు రావటానికి వేలకొద్దీ వుద్యోగుల్ని పంపించండి. ప్రజలు యుద్ధంలోకి రావటానికి ఇష్టపడకపోతే, మంచి మాటలతో లొంగకపోతే —దండించి అయినా సరే లాక్కు వొచ్చే వుద్యోగుల్ని పురమాయించండి. కొందరు మూర్ఖులు కామ భోగాలతో …. విలాసాలతో…. ఎప్పుడూ సుఖపడుతూ వుంటారు. అలాంటి వాళ్ళందర్నీ నా దగ్గిరికి లాక్కురండి. — నా ఆజ్ఞ ప్రకారం పది రోజుల్లో ప్రజలు రాకపోతే మరణ శిక్షలు అమలు చేసెయ్యండి . మీ రందరూ కలిసి యుద్ధానికి ఏర్పాట్లన్నీ చెయ్యాలి. హనుమంతుడు మాత్రం మీ అందరి మీదా పెద్ద అధికారి. అతని మాట చొప్పున నడుచుకోండి." — అని, లక్ష్మణుడి వేపు గంభీరంగా చూశాడు. *

---

* 37 వ సర్గ — 9 నించీ 13 వరకూ.

సుగ్రీవుడు హనుమంతుడితో చెబుతున్నాడు — "కోట్ల కొద్దీ వానరులను బిలుచుకొని వచ్చుటకు అనేకులగు వానరులను బంపుము.

సుగ్రీవుడు చేపే ఏర్పాట్లన్నీ చూస్తూ లక్ష్మణుడు చాలా సంతోషించాడు — "మరి.... మనం.... అన్నగారి దర్శనానికి...."

"ఇప్పుడే బయల్దేరదాం !.... ఇదుగో ! పల్లకీ తెప్పించండి. నేను శ్రీరాముణ్ణి చూసి రావాలి. ఊఁ ... దబ్బున...."

(ఫుట్‌నోట్ : 320 వ పేజీ తరువాయి)

కొందరు వానరులు కామాసక్తులై కాలముగడుపుచుండుదురు. సామ దానాది ఉపాయములచే శీఘ్రముగ వానరులను బిలుచుకొని వచ్చుటకు దూతలను బంపుము. (సామ దానాది అంటే సామ, దాన, భేద, దండోపాయాలు అనే అర్థం. ఆ దండోపాయం ఏమిటో చూడండి) — "నా ఆజ్ఞ ప్రకారము పది దినములలోగా రాకుండు దురాత్ములై, రాజు ఆజ్ఞను లక్ష్యపెట్టని వానరులకు మరణ దండన విధించవలయును."

లక్ష్మణుడు కిష్కింధకు రాకపూర్వమే సుగ్రీవుడు ఒకసారి నిద్ర మత్తులోంచి తలెత్తి సైన్యాన్ని సమీకరించమని ఆజ్ఞాపించి మళ్ళీ పడుకున్నాడు.

29 వ సర్గలో — 30 నించీ — 34 వరకూ.

"సుగ్రీవుడు సీతాన్వేషణ అన్ని దిక్కులలోగల సేన నంతయు జేర్చుటకు ఆజ్ఞాపించెను."

"పదునైదు దినములలో వచ్చి చేరని వానరునకు మరణ దండన విధించ వలయును. ఈ విషయములో నాలోచన అక్కరలేదు."

— అంటే సుగ్రీవుడు సైన్యాన్ని సమీకరించడానికి మరణ దండనలు వెయ్యవలసిన అవసరం వొచ్చిందంటే — ఆ యుద్ధంలోకి రావడం అనేది ప్రజలకు ఎంతమాత్రం ఇష్టంలేని పని అన్నమాట. మరణ దండన భయం లేకపోతే వొక్కడుకూడా రాడన్నమాట ! — ఈ సంగతి సుగ్రీవుడికి బాగానే తెలుసు.

మంత్రులు కంగారెత్తి పరుగులు తీశారు.

* * *

ఋష్యమూకం అంతా భేరీల దరువు లేస్తోంది. శంఖ రవాలూ, సన్నాయి తీగలూ, తాళాలూ, మద్దెక్కా భేరీల అడుగున మటుమాయమై పోతున్నాయి.

గాలి వాగుమీదనుంచి తురాయి కొమ్మల్లోంచి, గుహలో జొర బడి — రాముడితో — "ఎవరొస్తున్నారో చూద్దాం రా!.... పెళ్ళి వూరేగింపేమో చూద్దాం రా! రా మరీ!" — అని పదుకోనివ్వకుండా విసిగిస్తోంది.

రాముడు గుహ బయటికొచ్చి కొండ చివర, చూస్తూ నిలబడ్డాడు.

జనం గుంపులు గుంపులుగా ఋష్యమూకం వేపు వొస్తున్నారు. భేరీ వాయిద్యాలతో కొండలు బద్దలవు తున్నాయి.

సూర్యుడిమల్లే ధగధగా మెరుస్తూ పల్లకీ కొండ లెక్కుతోంది.

"సుగ్రీవు దొస్తున్నాడు...." అనుకున్నాడు రాముడు. — మనసు చాలా చిన్న బుచ్చుకుంది. సుగ్రీవుడు మహారాజ దర్పంతో పల్లకీ ఎక్కి వొస్తున్నాడు. మహోపకారం చేసిన తన దగ్గరకు వినయ విధేయతలతో పాదచారిగా రావొచ్చునే!

బోయీల వూపుతో పల్లకీ కొండలు దాటుతోంది.

పల్లకీలో లక్ష్మణుడు చాలా సార్లు సుగ్రీవుడి మీద పడ్డాడు. ఇద్దరూ కలిసి క్రింద పడవలసిన ప్రమాదాలు చాలా తప్పాయి.

సుగ్రీవుడు కోపంగా హనుమంతుణ్ణి పిలిచి — "ఈ బోయీలకి పుర శిక్షలు వేయించెయ్యి.... పల్లకీ దింపిం తర్వాత ...." — అని విసుక్కున్నాడు.

"చిత్తం ! అలాగే వేయించేసాను. నేను మొదటే అనుకున్నాను," — అని హనుమంతుడు వోప్పుకున్నాడు.

బోయాలు — వాళ్ళ కేకల్లో మునిగి చెమటలు కక్కుతూ కొండలపైకి ఎక్కుతున్నారు.

రాముడు కొంచెంసేపు నిలబడి జనం దగ్గిర పడుతోంటే .... తురాయి చెట్టు కిందకు పోయి పద్మాసనం వేసుకు కూర్చున్నాడు.

భేరీమేళాలు గుహ ముందుకు జేరాయి. జనం బిలబిల్లాడుతూ కొండలన్నీ ఆక్రమించారు. పల్లకీ వొచ్చి రాముడి ముందు ఆగింది.

లక్ష్మణుడూ సుగ్రీవుడూ దిగారు.

లక్ష్మణుడు రాముడి దగ్గిరికి వొచ్చి వినయంగా — "అన్నగారూ! మీరు ఆజ్ఞాపించిన కార్యం నెరవేర్చుకు వొచ్చాను. సుగ్రీవుడు మీ దర్శనానికి వొచ్చాడు," — అంటూ నమస్కరించాడు.

రాముడు గంభీరంగా కళ్ళు తెరిచాడు.

సుగ్రీవుడు తల వొంచి నమస్కారం చేసి కొంచెం సిగ్గుపడుతూ నించున్నాడు.

సుగ్రీవుణ్ణి చూస్తూ రాముడు చాలా ఆశ్చర్యంలో మునిగాడు.

పట్టాభిషేకం అయిన తర్వాత సుగ్రీవుణ్ణి చూడడం ఇదే మొదటి సారి.

వొంటినిండా గొప్ప గొప్ప ఆభరణాలతో, పట్టుబట్టలతో మెరిసిపోతున్నాడు సుగ్రీవుడు. ఆ కిరీటంతో మొహంలో రాజకళ ఉట్టిపడుతోంది. చుట్టూ ఎన్నో వందలమంది పరిచారకులూ, మంత్రులూ, సైనికులూ .... ఎంత అంగబలం !

సుగ్రీవుడి చుట్టూ పరిచారకులు నిలబడి విజ్ఞాపనలు వేస్తున్నారు. గాలి విజ్ఞాపనలు ఎగంగొట్టాలని ప్రయత్నాలు చేస్తోంది. కొందరు పరిచారకులు చెట్టుకింద సుగ్రీవుడి చుట్టూ పట్టు గొడుగులు పట్టారు. గాలి వాటి పనీ పట్టిస్తోంది. తురాయిచెట్టు దూరంగా జనం మీదకు విరగబడి పూలు రాలుస్తోంది.

రాముడు ఇంకా ఆలోచనల్లో మునిగి వున్నాడు.

ఈ బండల్లో .... క్షణ క్షణం ప్రాణ భయంతో తిరిగిన సుగ్రీవుడికి ఎంత భోగం ! .... ఎన్ని సౌఖ్యాలు ! .... ఎంత గొప్ప రాజరికం ! ... తనూ .... అయోధ్యలో .... ఇంతకు మించిన సిరి సంపదలతో .... భోగాలతో ....

సుగ్రీవుడి కీ భిక్షంతా తను పెట్టిందే ! గురు వుంచుకున్నాడా ? సుగ్రీవుడు రాగానే చాలా కఠినంగా మందలించా లనుకున్నాడు గానీ .... ఇంత గొప్ప స్థితిలో ఉన్నవాడిని ....

రాముడు తల పంకిస్తూ — "కూర్చో నాయనా !" అన్నాడు గంభీరంగా.

రాముడి ఆజ్ఞ అయిన తర్వాత సుగ్రీవుడు ఎదురుగా కూర్చున్నాడు. వింజామరలమీదనుంచి వొట్టివేళ్ళ పరిమళాలు రాముణ్ణి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి

"నాయనా ! పట్టాభిషేకం చేసుకున్నది మొదలూ నువ్వు రాత్రిం బవళ్ళూ కామ సుఖాలలో మునిగితేలుతూ వున్నావు. నేను గ్రహిస్తోనే వున్నాను. ధనార్జనా, ధర్మార్జనా చేసుకుంటూ కామసుఖాలు అనుభవించ డంలో తప్పు లేదు. దేని సమయం దానికి ఉంది నాయనా ! ధర్మార్థాలు విడిచి ఎల్ల వేళలా కామ సుఖాలే అనుభవించే వాడు, కొమ్మ చివర నిద్ర పోయినవాడు కింద పడిపోయినట్టు పతనమై పోతాడు. ఎప్పటి కప్పుడు శత్రువు లందర్నీ సంహరిస్తూ, మిత్రుల్ని పటిష్టం చేసుకుంటూ, సమ యానుకూలంగా సుఖాలు అనుభవించేవాడే ధర్మాత్ముడు."

సుగ్రీవుడు తల వొంచి వింటున్నాడు.

"నువ్వు నా కిచ్చిన వాగ్దానం సంగతి మరిచిపోయి వుండవు. నా భార్యను వెదికి, రావణుడితో యుద్ధం చెయ్యాలి మరి. రాజు లందరూ యుద్ధాలకు పోయే కాలం ఇది. నీ మంత్రులతో ఏం ఆలోచించావో, ఏం చేస్తావో మరి నీ ఇష్టం" — అని చటుక్కున కళ్ళనీళ్ళు పెట్టు కుంటూ — "నా భార్య ఆ పర పురుషుడి గృహంలో ఎన్ని ఇడుములు పడుతూ వుందో గదా ! .... నేను జీవించి వుండికూడా లేనివాడినై పో యాను" — అంటూ తల వొంచుకున్నాడు.

రాముడు ఇంకెంత నిష్ఠూరంగా మాట్లాడతాడోనని జంకుతోన్న సుగ్రీవుడికి రాముడు మందలింపులు తొందరగానే ముగించడంతో చాలా ధైర్యం వొచ్చింది —

చేతులు జోడించి వినయంగా — "రామా ! నీ దయవల్లే నేను మహారాజు నయ్యానను. చేసిన మేలు మరిచిపోయేవాడు అల్పుడని నే నెరుగుదును సుమా ! .... నీ మేలు నే నెప్పుడూ మరిచిపోను. నీ కార్యం కోసమే నా దేశంలో ప్రజ లందర్నీ యుద్ధంలోకి రావాలని ఆజ్ఞాపించాను. ఇప్పటికే అనేక కోట్లమంది వొచ్చారు. ఇంకా కోట్లి కొద్దీ వొస్తారు. ఇంక నువ్వు యుద్ధానికి బయలుదేరడమే ఆలశ్యం. మే మందరం నీ వెనక నడవకతప్పదు గదా ?"

సుగ్రీవుడు కోట్లకొద్దీ వీరుల్ని సమీకరిస్తున్నాడనే చల్లని వార్తతో రాముడి మనసు శరత్కాలపు మేఘం మల్లే ఎంతో తేలిక పడింది. — సుగ్రీవుడి సైన్యమే యుద్ధ భారం అంతా నిర్వహిస్తుంది. సందేహం లేదు.

వికసించిన మొహంతో, చిరునవ్వు చిందించాడు రాముడు — "నాకు తెలుసు సుగ్రీవా ! నువ్వు మిక్కిలి ఉత్తముడవని నాకు మొదటినుంచీ తెలుసు. సూర్యుడు లోకాలకు వెలుగునిచ్చినా, చంద్రుడు వెన్నెల కురిపించినా వింతఏముంది ? నువ్వు మిత్రుడికి ప్రత్యుపకారం చేయడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. నువ్వు నా ప్రాణ స్నేహితుడవని నేను ఎరుగుదును. అందుకే నా మంచి చెడ్డలన్నీ నీ మీద పెట్టి, నిన్నే నమ్మి, నేను నిశ్చింతగా ఉన్నాను సుమా ! ఆ రావణుడు తన మృత్యువు కోసమే నా భార్యను అపహరించాడు. నీ అండ వుంటే శత్రువుల్ని జయించడం ఎంత సేపు ?

.... ఇక ఎంతో కాలం పట్టదు .... అన్నను .... నాకు తెలుసు...." *
— రాముడు ఆనందాతిరేకంతో తల పంకిస్తున్నాడు.

* * *

---

* 38 వ సర్గలో — 16 నించీ 24 వరకూ.
39 వ సర్గలో — 7 వరకూ.

సుగ్రీవుడు రాజై పోయాడు గాబట్టి. రాజుల్ని రాళ్ళల్లో, రప్పల్లో నిలిపించడం కవి కిష్టం లేదు. (శ్రీరామచంద్రుడి దర్శనానికి వొచ్చేప్పుడు ఎలాగా సరే. — ఇక్కడ శ్రీరాముడికన్నా సుగ్రీవుడే గొప్ప. — గొప్ప పదవిలో, సిరి సంపదల్లో వున్నాడు కాబట్టి.)

— "శ్రీరాముడు వసించుచుండు శ్రేష్ఠమగు ప్రదేశము జేరి, గొప్ప తేజస్సుగల సుగ్రీవుడు (ఏ రంగు దాసుకున్నాడో ; పూర్వం ఈ తేజస్సు లేదు.) లక్ష్మణునితోడ పల్లకీ దిగెను." —

ఆ రకంగా పల్లకీదిగి కూర్చున్నవాణ్ణి పట్టుకుని, కుశల ప్రశ్న లేవీ లేకుండా రాముడు జ్ఞానబోధ ప్రారంభించాడు చూడండి — "వానర రాజా ; ఆయా కాలములకు ఎగనటుల ధర్మార్థ కామములను విభజించి అనుష్ఠించువాడే రాజు. ధర్మమునూ, అర్థమునూ విడిచి కామమునే గోరియుండువాడు .... చెట్టు కొనలో నిద్రించి కిందబడి, మేలుకొనిన వానివలె నుండును. శత్రువులను జంపి, మిత్రులను జేర్చుకొని, ఆయా కాలములలో ధర్మార్థ కామములను అనుభవించువాడే ధర్మాత్ముడు. (రావణుణ్ణి చంపేసి, రాముణ్ణి రక్షించి, తర్వాతేం జేసుకున్నా ఫర్వాలేదు.) సీతను కనిపెట్టి, రావణునితో యుద్ధము చేయవలసిన సమయము వచ్చినది. మంత్రులతో నాలోచించ వలయును. (ఈ ధర్మ బోధకు అనలు సారాంశం ఇదీ)"

సుగ్రీవుడి జవాబు — "నీ కటాక్షము చేతనే శాశ్వతమగు వానర రాజ్యము నేను బడసితిని. రావణుని బంధువులతోడ జంపి

కిష్కింధలో ప్రజలు — ఇళ్ళల్లో — పొలాల్లో — తోటల్లో — కొండల్లో ఎక్కడి కక్కడ గుంపులు గుంపులుగా రహస్యంగా తర్జన భర్జనలు పడుతున్నారు.

"మన మందరం యుద్ధంలోకి పోవాలంట .... లేకపోతే మరణ శిక్ష వేస్తాడంట రాజు."

"ఏదో సామెత చెప్పినట్టుంది. యుద్ధంలోకి పోయినా చావే: పోకపోయినా చావే! .... అనలు ఇంకో దేశపు రాజు కోసం మనం ప్రాణాలివ్వటం ఎందుకంట?" —

"యుద్ధం కూడా చేసిపెడతానని మన రాజు వొప్పందం చేసుకున్నాడంట."

"ఆఁ చేసుకుంటాడు. ఎందుకు చేసుకోడూ? తనేం యుద్ధం

(ఫుట్‌నోట్ : 326 పేజీ తరువాయి)

సీతను దెచ్చునట్టి, కోట్లకొలది వానరులు నీ సమీపమునకు వచ్చు చున్నారు." —

"సీతను వెదుకుటలో సుగ్రీవుని·యత్నము జూచి రాముడు సంతోషముతో వికసించిన నీలోత్పలమువంటి ముఖము గలవాడై యుండెను."

రాముడు సుగ్రీవుణ్ణి ఎలా కీర్తిస్తున్నాడో చూడండి— "సూర్యుడు ఆకాశములో చీకటిని పోగొట్టుట, చంద్రుడతని కిరణములచే భూమిని చల్లగ జేయుట, నీవు మిత్రులకు ప్రత్యుపకారము జేయుట, (శ్రీరాముడు మాట మార్చుటా) ఎపుడును ఆశ్చర్యము గాదు .... నీవు సౌమ్యుడవు. వీరుడవు .... నీవే నాకు మంచి మనసుగల స్నేహితుడవు. (సుగ్రీవుడికన్నా మంచి స్నేహితుణ్ణి సంపాదించలేకపోయాడు రాముడు అన్నేళ్ళా తిరిగి.) నీవే సహాయము చేయుటకు తగినవాడవు. (అదీ అనలు విషయం.) నీవు సదా ప్రియమైన మాటలు చెప్పువాడవని నే నెరుగుదును."

(ఎరగుదునుగానీ ఇందాక సభదాకి తిట్టాను.)

చెయ్యాలా ? పెట్టాలా ? మందిరాల్లో దూరి కూర్చుంటాడు. తనకేం బాధ ?" —

"నెమ్మదిగా మాట్లాడు. పీకల మీదకి తెచ్చేట్టున్నావ్ !"

"అలాగే గానీ .... అసలు రాముడే వన్నాడు —వాలిని చంపి నప్పుడు ? తమ్ముడి ఆజ్ఞవలనే ధర్మం స్థాపిస్తూ తిరుగుతున్నా నన్నాడా ? .... రావణుడు పర స్త్రీ నెత్తుకుపోవటం అధర్మమే గదా ?.... అధర్మం అరికట్టి, ధర్మం స్థాపించమని ఆజ్ఞాపించిన భరతుడు .... రావణుణ్ణి దండించి, ధర్మం స్థాపించటానికి కావలసిన ఏర్పాట్లెందుకు చెయ్యడు ? —కిష్కింధవాళ్ళ సైన్యం, బొక్కసం, వుపయోగించుకుని .. కోసల రాజు ధర్మం స్థాపిస్తా డన్నమాట !.... ఆహా ! ... ఏం ధర్మస్థాపనయ్యా ! .... సిగ్గులేని ధర్మ స్థాపన ...."

"పిచ్చి గానీ . వాళ్ళ దేశానికి నష్టం వొచ్చేట్టు ఎందుకు చేసు కుంటాడయ్యా ? ... ఇంకో దేశం వాళ్ళ సైన్యంతో .... బొక్కసంతో పని జరిపించుకుంటాడు గానీ...."

"నాకు తెలవ కడుగుతానూ ... అసలు సుగ్రీవుడు రాముడికి సహాయం చెయ్యక్కర్లే దనుకో. వాలికీ, సుగ్రీవుడికీ వైరమే లేద నుకో. వాళ్ళిద్దరూ పూర్వం వున్నట్టు కలిసే వున్నారనుకో. —అప్పుడు రాముడేం చేసేవాడు ? ఎవరి సైన్యంమీద ఆశ పెట్టుకునేవాడు ?"

"వాలికీ, సుగ్రీవుడికీ వైరంలేకపోతే, వైరం పుట్టిస్తాడయ్యా !.... లేకపోతే ఆ అన్నదమ్ము లిద్దరికీ సంధి చేసేపాటి సామర్థ్యం లేనివాడా రాముడు ? . తన తమ్ముళ్ళు తనని భక్తిగా కొలుస్తున్నారే ! దాస్యం చేస్తున్నారే ! సుగ్రీవుడు కూడా వాలిని భక్తితో చూసుకోవాలని తెలియని వాడా రాముడు ? ... అబ్బే !.... మరి వీళ్ళిద్దర్నీ ఎందుకు కలప లేదం టావు ? — వీళ్ళు వైరం పెట్టుకుంటేనే తనకు కలిసొస్తుంది కాబట్టి."

"మా బాగా చెప్పావు. "ధర్మంకోసం", "ధర్మంకోసం" — అన్నాడా ? వాలి మరదలితో వుంటే అధర్మం అని చంపేశాడా ? ....

ఇప్పుడు సుగ్రీవుడు అన్న భార్యతో వుంటున్నాడే! కిక్కురు మనడేం? "నువ్వూ ధర్మం తప్పావు" — అని చావగొట్టడేం? పైగా — ధర్మాత్ముడివి.... పుణ్యాత్ముడివి" — అని మెచ్చుకుంటున్నాడు సుగ్రీవుణి."

"ఎవరో వొస్తున్నారు. కాస్పేపు వూరుకోండి."

"ఎవరో కాదు. మన సుషుఖుడిలాగే వున్నాడు.

"సుషుఖం కాదు. దుష్కృఖం వాడిది. పాడు మొహం వాడూను. నమ్మకూడదు. వున్నవీ లేనివీ కల్పించి మంత్రులికి మోస్తాడు. వాడు సుగ్రీవుడి మనిషే."

"ఇంక ఏవనుకున్నా ప్రయోజనం లేదు. రాజు ఆజ్ఞంటే యముడి ఆజ్ఞే. ఇక్కడ చావటంకన్నా ఆ యుద్ధంలోకి పోతేనే మంచిది. అదృష్టం వుంటే బతికి బయట పడొచ్చు..." *

"నరే! కానివ్వండి. ఏం చేస్తాం?.... తప్పుతుందా?"

"ధర్మ స్థాపనకోసం మరి"

"రాముడికీ నాకూ ధర్మం కూడానా?"

★

---

* 37 వ సరలో — 19 వ శ్లోకం.

వానరులు రామ కార్యంకోసం బయలుదేరడంలో అసలు రహస్యం చూడండి—

— "కాల మృత్యువుతో సమానుడగు రారాజగు సుగ్రీవుని ఆజ్ఞను విని వానరులు మిక్కిలి భయపడినవారై వచ్చి చేరిరి.

ఎనిమిందో కథ తర్వాత - తొమ్మిదో కథ వరకూ

(సుగ్రీవుడు యుద్ధానికి ఏర్పాట్లు ప్రారంభించడంతో — ఎనిమిదో కథ ముగిసింది. తర్వాత — హనుమంతుడు లంకకు వెళ్ళి సీతను చూడడంతో తొమ్మిదోకథ ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య వున్న కథాభాగం ఇది.

ఇందులో ఎక్కువగా కల్పన చూస్తాం. ఆ కల్పనల మధ్య — ఎళ్ళ చెట్లని శత్రువులనించి రక్షించుకోవడం, చెట్ల తోపుల్లో, పొదల్లో ప్రేమించడం, గుహల్లో బిడ్డల్ని కనడం, జంతు చర్మాల దాక్కూ, గవదలూ వంటి వస్తువులు ఎండడం — మొదలైన అనేక విషయాలతో ఆటవిక జీవిత విధానం చూస్తాం.)

సుగ్రీవాజ్ఞ అంటే యముడి ఆజ్ఞే. కిష్కింధనుంచి బయల్దేరిన వానర వీరులు రాజ్యం అంతా తిరిగి వానరుల్ని తీసుకు వొచ్చారు.

పూర్వం హిమాలయాల్లో రుద్రుడు యాగం చేసినప్పుడు నేతులూ, పూజా ద్రవ్యాలూ కిందపడి ఆ ప్రదేశమంతా, చెట్లూ, తీగలూ, మొలిచాయి. వాటికి కాసే పళ్ళూ, కాయలూ వొకసారి తింటే నెల్లాళ్ళ వరకూ ఆకలి వెయ్యదు. (నెల్లాళ్ళేనా ? ఏ పదివేల సంవత్సరాలో అయితే ....) అలాంటి పళ్ళూ, పువ్వులూ తెచ్చి వానరులు సుగ్రీవుడి కిచ్చారు. (రాజుగారికి అలాంటి పళ్ళెందుకూ ? రోజుకి యాభై సార్లు ఆకలేసే వళ్ళు కావాలి గానీ)

ఎక్కడెక్కడో, మారుమూల ప్రదేశాల్లో వున్న వానరులందరూ రాజాజ్ఞకు భయపడుతూ కోట్లకొద్దీ వొచ్చారు. తార తండ్రి, సుషేణుడు, అనేక కోట్లమందిని తీసుకువొచ్చాడు. దూస తండ్రి తారుడు, వెయ్యికోట్ల మంచినీ, హనుమంతుడి తండ్రి కేసరి వేలకొద్దీ కోట్లమందినీ తీసుకు వొచ్చారు.

శతవలి, గవాక్షుడూ, నీలుడూ, నలుడూ, చరిముఖుడూ, చద్మిముఖుడూ, మిర్మ్యఖుడూ, జాంబవంతుడూ, గంధమాదనుడూ, పంచుడూ, హ్రీమంతుడూ, పనసుడూ, మైందుడూ, ద్వివిధుడూ, అంగదుడూ, ఇంద్రజానువూ, వహ్ని— మొదలైన వేలకొద్దీ వానర వీరులు, కోట్లకొద్దీ వానరుల్ని సమీకరించుకుని తీసుకు వొచ్చారు.

అందరూ వొచ్చాక సుగ్రీవుడు రాముడితో— "రామా! నీ సేవ జేయడానికి నా ప్రజలందరూ సిద్ధంగా వున్నారు. ఇదంతా — నీ సైన్యమే. నీకే అప్పగిస్తున్నాను. ఆజ్ఞాపించు." — అన్నాడు వినయంగా.

రాముడు, సుగ్రీవుణ్ణి ఆలింగనం చేసుకుని గంభీరంగా — "అసలు సీత జీవించి వుందో లేదో తెలుసుకోవాలి. రావణుడి నివాసం ఎక్కడో కూడా తెలుసుకోవాలి. ముందీ విషయాలు తెలిస్తే తర్వాత ఏం చెయ్యాలో ఆలోచించ వొచ్చును. నీ సైన్యాన్ని నువ్వే ఆజ్ఞాపించు. అంతా నీకే తెలుసు. మహాజ్ఞానివి నువ్వు. నాకు ప్రభువువీ, ప్రాణస్నేహితుడివీ నువ్వు. నా హితం కోరేవాడివి నువ్వు. సైన్యం గురించీ, బొక్కసం గురించీ, సర్వం తెలిసిన వాడివి నువ్వు. నా కార్యం ఏమిటో గ్రహించి నువ్వే చెయ్యి," — అని తల పంకించి, మౌనం వహించాడు. •

• కిష్కింధాకాండలో — 40 వ సర్గ. 10— 15 శ్లోకాలు.

వానరు లందరూ వొచ్చిం తరువాత సుగ్రీవుడు రాముడితో — "పురుషోత్తముడా! ఇది అంతయు నీ సైన్యమేను. నీ యాధీనముతో నున్నది. అందరు, నీ యాజ్ఞలోనుండి, నీకు హితము సేయుటలో

(ఫుట్ నోట్ : 331 పేజీ తరువాయి)

నాన కి కలిగి, నీ ఇష ప్రకారము సేయుటకు సిద్ధముగ నున్నారు. — ఈ సేనలు సేయవలసిన కార్యమును నేను బాగుగ నెరుంగుదును. అయినను, నీవే యాజ్ఞాపించవలెను." — అని చెప్పి, తన సైన్యాన్నీ, రాజ్యాంగాన్నీ, తన అధికారాన్నీ, రాముడి ఆధీనం చేసి, రాముడి ఆజ్ఞకు లొంగి వుండడానికి ఇషపడ్డాడు. (ఈ రకంగా సుగ్రీవుడు ఎప్పుడూ రాముడి ఆధీనంలో వినయంగా లొంగి వుండాలని కవి అభిప్రాయం.)

సుగ్రీవుడు అలా చెప్పింతర్వాత రాముడు— "సీత జీవించి యుండునో, లేదో తెలిసికొన వలయును. రావణుడు నివసించు దేశమును కనిపెట్ట వలయును," — అని, ప్రస్తుతం తనకేం పనులు జరగాలో స్పష్టంగా చెప్పనే చెప్పాడు. అంతే గాదు — "అటు తరువాత, కాలానుగుణముగ సీతోద ఏని చేసెదను." — అంటున్నాడు. (అంటే "ముందు సీత సంగతీ, రావణుడి సంగతీ తెలిసిం తర్వాత ఏం చెయ్యాలో సీతో సంప్రదించే చేస్తాను." అంటున్నాడు — అంటే, నిర్ణయించేవంతా రాముడే.)

ఇంత స్పష్టంగా చెప్పాడా ?— మళ్ళీ అంటాడూ— "ఈ కార్యమునకు నేనూ, లక్ష్మణుడూ యజమానులము కాము. (లక్ష్మణు డెలాగూ కాడులే) నా కార్య మిట్టిదని నీకే తెలియును. నీవే వారిని ఆజ్ఞాపింపుము. నీవే దానిని నెరవేర్చవలసిన వాడవు. నీవే ప్రభుడవు. ప్రాజ్ఞుడవు. నాకు హితము సేయుటలో నానకి గలవాడవు. మంచి కార్యములు చేసియున్నావు. అర్థ శాస్త్రము చక్కగా తెలిసిన వాడవు." —అంటూ కీ రన సాగించాడు.

"ఇదుగో ! నాకీ రెండు పనులూ జరగాలి. ముందు అవి చేసుకొస్తే, తర్వాత సంగతి ఆలోచిస్తాను." —అని సుబ్బరంగా చెప్పి— "నేను చెప్పను. చెప్పకూడదు. తప్పు. నాకేం కావాలో నీకే తెలుసు. నువ్వే ఆజ్ఞాపించు," — అంటున్నాడు. తను చాలా వుత్తముడుగా

(ఫుట్‌నోట్ : 332 పేజీ తరువాయి)

ప్రవర్తిస్తోన్నట్టూ, ఇతరుల విషయాలలో తను జోక్యం కలిగించుకోకుండా వున్నట్టూ — మాట్లాడుతున్నాడు.

తన పనులు ఎలాగూ సుగ్రీవుడు చేయిస్తాడిని తెలుసు. —

రాముడు తనకు తానుగా వానర సైన్యాన్ని ఆజ్ఞాపించడం లేదు. అంటే, కిష్కింధా రాజ్యంమీద ప్రత్యక్షంగా పెత్తనం చెయ్యడం లేదు. సామ్రాజ్యాధిపతులు కొన్ని సామంత రాజ్యాలమీద ప్రత్యక్షంగా పెత్తనం చెయ్యరు. సామంతరాజుల్ని మాత్రం తమ గుప్పెట్లో పెట్టుకుని, వారి ద్వారా పరోక్షంగా పెత్తనం చేస్తారు.

"సీతని వెతకాలి" — అనేది రాముడి ఆజ్ఞే. కానీ, తనే వానర సైన్యాన్ని పిలిచి — "మీరు సీతని వెతకండి" — అని చెప్పడు. అలా చేస్తే "కిష్కింధ రాజ్యాన్ని రాముడే పరిపాలిస్తున్నాడు" — అని అందరికీ స్పష్టంగా తెలిసిపోతుంది. అప్పుడు వానర సైన్యం, ఇంకో దేశపు రాజు అధికారం కింద వుండడానికి ఇష్టపడరు. (అలా పెత్తనం చేసే రాజ్యాలు కూడా వుంటాయి. కానీ, ప్రస్తుతం కిష్కింధ పూర్తి సామంత రాజ్యంగా లేదు.)

"సీతని వెతకాలి" — అనే రాముడి ఆజ్ఞ, సుగ్రీవుడి ద్వారా అమలు జరుగుతోంది. — "రావణుడితో యుద్ధం చెయ్యాలి." — అనేది కూడా రాముడి ఆజ్ఞే. జరగడం మాత్రం సుగ్రీవుడి ఆజ్ఞగా అమలు జరుగుతుంది.

కిష్కింధ రాముడి ఆధీనంలో వుండకుండా వుంటే, అక్కడి ప్రజలమీద సుగ్రీవుడి పెత్తనం మాత్రమే వుంటుంది. వారు, సామ్రాజ్యాధిపతుల ప్రయోజనాల కోసం యుద్ధాలు చేసి, తమ సౌఖ్యాలూ, జీవితాలూ త్యాగం చెయ్యవలసిన అవసరం వుండదు. వాళ్ళ కష్టాలు తక్కువ పరిమితిలో వుంటాయి.

వాలి ఆధీనంలో స్వతంత్ర రాజ్యంగా ఉన్న కిష్కింధని — రాముడు తనకు పరోక్ష సామంత రాజ్యంగా చేసుకున్నాడు. కిష్కింధ

సుగ్రీవుడు వెంటనే వినతుడనే సేనాపతిని పిలిచి — "నువ్వు లక్షమంది వానరుల్ని తీసుకుని తూర్పు దిక్కుగా వెళ్ళు" — అని ఆజ్ఞాపించాడు. — "ఆ మార్గం గురించి అంతా చెబుతాను. మీరందరూ శ్రద్ధగా సీతనీ, రావణుణ్ణీ వెతకాలి. (ఇద్దరూ వొక్కచోటే దొరుకుతారే) దారి పొడుగునా పర్వతాలూ, అరణ్యాలూ, పల్లెలూ, పట్నాలూ, నదులూ సరస్సులూ అన్నీ వెతకండి. (సీత కోసం నదులూ .... సరస్సులూ!) కొంత దూరం పోతే మందర పర్వతం తగులుతుంది. దానిమీద. వివ సించేవారికి చెవులుండవు. కొందరికి పెదాలే చెవులుగా ఉంటాయి. కొందరికి ఒక్కొక్క కాలే ఉంటుంది. — అక్కడ వెతికిం తర్వాత

(ఫుట్ నోట్ : 333 పేజీ తరువాయి)

మళ్ళీ స్వతంత్ర రాజ్యం అవ్వాలంటే, పరోక్షంగా కూడా, రాముడి అధీనంలో వుండడం ఇష్టం లేకపోతే — కిష్కింధ ప్రజలు రాముడితో (అయోధ్య సైన్యంతో) యుద్ధంచేసి, నెగ్గ గలగాలి.

పూర్వం "సామంత రాజ్యం" అనేదాన్ని, ఇప్పుడు ఒక రకంగా "వలన రాజ్యం" తో పోల్చవొచ్చును. ఆనాటి పరిస్థితులకీ, ఈనాటి పరిస్థితులకీ ఆర్థికంగానూ, సాంఘికంగానూ, రాజకీయంగానూ అనేక మార్పులున్నప్పటికీ — మహారాజులు, సామంత రాజ్యాల్ని తమ అధీనంలో పెట్టుకోవడంలోనూ, ఈనాటి సామ్రాజ్య వాదులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో "వలసలు" ఏర్పాటు చేసుకోవడంలోనూ రెండు పక్షాలకూ (మహా రాజులూ × సామంత రాజులు : సామ్రాజ్య వాదులూ × వలస రాజ్యాలు) — జరిగే లాభ నష్టాలు, ఆనాడూ ఈనాడూ వొకటే.

సామంత రాజ్యంవల్ల మహారాజు కెలాంటి ప్రయోజనమో, వలన రాజ్యంవల్ల సామ్రాజ్య వాదులకు అలాంటి ప్రయోజనమే. — పరోక్ష వలస రాజ్యాలకు "రక్షిత రాజ్యాలు" — అనే ఇంకో ముద్దు పేరు ఉంది. అంటే పెద్ద రాజ్యాలకింద రక్షించబడుతూ ఉండే రాజ్యాలని అర్థం. — అసలు అర్థం భక్షించబడడమే.

కిరాత దీవిపం వొస్తుంది. అక్కడివాళ్ళు ఎప్పుడూ నీళ్ళలోనే జీవిస్తూ ఉంటారు. ఆ నదుల్లో పూర్తిగా గాలించండి. (ఇంతకీ సీత కోసమా ? చేపల కోసమా ?) అక్కడ కొందరు, సగం మనిషి రూపంగానూ, సగం పులి రూపంగానూ ఉంటారు. వాళ్ళ ఇళ్ళూ, వాకిళ్ళూ తిన్నీ వెతకండి. తర్వాత యవద్వీపంలో వెండి గనులూ, బంగారు గనులూ వెతకండి. శిశిర పర్వతం, శోణానదీ కూడా వెతకండి. ఎక్కడైనా దట్టమైన పొదల్లోనో, గుహల్లోనే సీతా రావణుడూ వుండవొచ్చు. చాలా శ్రద్ధగా వెతకండి. (రాముడి పై ప్రాణాలు పైనేపోయి వుంటాయి. వెతకండి.)

తర్వాత సముద్ర ద్వీపాలు చూడండి. అక్కడ భయంకరమైన రాక్షసులుంటారు. ఎవరైనా కళ్ళబడితే ముందు వాళ్ళ నీడలు పట్టుకు లాగేస్తారు. దాంతో ఆ ప్రాణులు రాక్షసులకు వశమైపోతాయి. అక్కడంతా వెతకండి. (వీళ్ళ నీడలు లాగేస్తే ?) — తర్వాత ఎర్ర సముద్రంలో వెతకండి. అక్కడ రాక్షసులు, బ్రాహ్మలు విడిచే అర్ఘ్యోదకాలు తగిలి సముద్రంలో పడిపోయి, కొంత సేపటికి లేస్తూ వుంటారు. (బ్రాహ్మల అర్ఘ్యోదకాలకి .... ఇంకేం శక్తి వుంటుందిట.) — తర్వాత క్షీరసాగరంలో రుషభం అనే పర్వతం వుంది. దానిమీద సుదర్శనం అనే సరస్సు వుంది — అదంతా వెతకండి. తర్వాత జలోదం అనే సముద్రం వుంటుంది. అందులో జంతువులు బకబాగ్ని చూసి వీడుస్తూ వుంటాయి. ఆ సముద్రం లోపల పర్వతాల్లో వెతకండి. దాన్ని దాటితే బంగారపు పర్వతం వొస్తుంది. దానిమీద వెయ్యి తలల ఆదిశేషుడు భూమిని మోస్తూ వుంటాడు. (ఆయన భూమినీ — భూమి ఆయన్నీ మోసుకుంటూ వుంటారు.) ఆయన నీలం వస్త్రాలు కట్టుకుని వుంటాడు — దాని తర్వాత ఉదయ పర్వతం వొస్తుంది. అదంతా బంగారం మయమే. దానినించి తామ్ర చెట్లూ, గోగు చెట్లూ, మది చెట్లూ అన్నీ బంగారమే. శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తిని అణగదొక్కినప్పుడు ఉదయగిరిమీద ఒక పాదం, మేరు పర్వతంమీద ఇంకోపాదం మోపాడు. — ఆ పర్వతాలు బాగా వెతకండి. సూర్యుడు లోకంలోకి ప్రవేశించగా

నికి ఆ పనియుగలే మొదటి ద్వారం. ఇక వాన్ని దాటి పోవాలి. అక్కడ దేవతలు సంచరిస్తూ ఉంటారు. కటిక చీకటి. ఉదయగిరివరకూ వెళ్ళి నెల దాటకుండా వొచ్చేయ్యండి. దానివాళ్ళందర్నీ చంపించేస్తాను. ఉత్సాహంగా, సంతోషంగా వెళ్ళండి. నా ఆజ్ఞ: రామ కార్యం ఇది!"

వినతుడు వెంటనే సైన్యం తీసుకుని వెళ్ళిపోయాడు. (అవును మరి. ఆలశ్యం ఎందుకూ? ఒక్క నిమిషం కలిసొచ్చినా కలిసి రావ టమే.)

* * *

తర్వాత సుగ్రీవుడు దక్షిణానికి వెళ్ళమని ఆజ్ఞాపించినవారిలో — అంగదుడూ, తారుడూ, హనుమంతుడూ, సుషేణుడూ, నీలుడూ, జాంబవంతుడూ ఉన్నారు.

దక్షిణం దిక్కు గురించి ఎలా సుగ్రీవుడు అన్ని వివరాలూ చెప్పాడు. (సుగ్రీవుడు ఈ దిక్కులన్నీ చూసినప్పుడు హనుమంతుడూ, తారుడూ, నీలుడూ అతనితోపాటు ఉన్నవాళ్ళే.)

— "అడవులూ, కొండలూ, నదులూ, సముద్రాలూ, సముద్రాల్లో అడవులూ, అడవుల్లో సముద్రాలూ అన్నీ వెతుక్కుంటూ వెళ్ళండి. ఒక చోట వింధ్య పర్వతం తగులుతుంది. తర్వాత నర్మదా నదీ, గోదావరీ నదీ, కృష్ణానదీ అన్నీ వెతకండి. తర్వాత ఆంధ్ర దేశం, చోళ దేశం, పాండ్య దేశం, కేరళ దేశం చూడండి. *

సహ్యపర్వతం మీద చందన వనం వుంటుంది. ప్రతి చెట్టూ వెత కండి. (సీత చెట్లెక్కుతుందేమో!)

---

* 41 ఎ సర్గ — 12, 13 శ్లోకాలు.

ఈ పేరు కూడా రాసినవే.

— "దండకారణ్యమున్నందు గోదావరీ అంధములోనూ, అటులనే, ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ దేశములలోనూ సీతను వెతక వలయును."

కావేరీ నది ప్రాంతంలో అప్సరసలు విహరిస్తూ వుంటారు. ఆ ప్రాంతమంతా చూడండి. మలయ పర్వతం మీద అగస్త్య మహర్షి సూక్ష్మంగా వెలిగిపోతూ వుంటాడు. ఆయన దర్శనం చేసుకోండి. (సీత సంగతి అడిగి ఆయన వరువు తియ్యకండి. చెప్పలేదు.) తర్వాత పాండ్య నగరం దాటితే మహేంద్ర పర్వతం వొస్తుంది. అదంతా బంగారం ముద్దే. అగస్త్యుడే ఆ పర్వతాన్ని సముద్రంలో వుంచాడు. అక్కడ ఎప్పుడూ దేవతలు విహరిస్తూ వుంటారు. పర్వ దినాలలో ఇంద్రుడు కూడా అక్కడికి వొస్తూ వుంటాడు. ఇంకా కొంతదూరం పోతే సముద్రం మధ్యలో వొక ద్వీపం కనబడుతుంది. అదే రావణుడి నివాసం. రావణుడు రాక్షసులకు రాజు. * ఆ ద్వీపం అంతా శ్రద్ధగా వెతకండి. దక్షిణ సముద్రంలో అంగారక అనే రాక్షసి వుంది. అది నీడలు పట్టుకుని ప్రాణుల్ని లాగేస్తుంది. ఆ ప్రాంతం అంతా వెతకండి. —లంకా ద్వీపానికి చాలా దూరంలో పుష్పితకం అనే పర్వతం వుంది. దాని శిఖరాలలో ఒకదాని మీద సూర్యుడూ, ఒకదాని మీద చంద్రుడూ విహరిస్తూ వుంటారు. కానీ, ఆ పర్వతం కృతఘ్నులకూ, పాపాత్ములకూ, నాస్తికులకూ కనపడదు. (ఎంతదృష్టం!)

---

41 వ సర్గ — 21, 26 శ్లోకాలు.

ఇంతకాలమూ రావణు డెక్కడున్నాడో తెలిసే కదా ఈ గోలంతా "రావణుడి నివాసం ఎక్కడో తెలుసుకుని రండి." — అనే కదా పంపించేది.

ఇప్పుడు సుగ్రీవుడు రావణుని గురించి చక్కగా చెప్పేస్తున్నాడు —"(దక్షిణ) సముద్రములో, నూరు యోజనములు వెడల్పు గల దియు, మనుష్యులు పోవుటకు సాధ్యపడనిదియు నగు నొక ద్వీపము గలదు. దురాత్ముడును, పాపియును, ఇంద్రునివంటి కాంతి గల వాడును, రాక్షసులకు రాజును, వధించుటకు దగిన వాడును నగు రావణు నకు అది నివాస స్థానముగ నున్నది." —

(ఫుట్ నోట్ : 337 వ పేజీ తరువాయి)

ఈ సుగ్రీవుడే, మొదట్లో, రాముడితో స్నేహం చేసుకున్నప్పు డేమన్నాడో చూడండి.

కిష్కింధకాండలో — 7 వ సర్గలో — 2 వ శ్లోకం.

— "దుష్ట వంశములో బుట్టిన వాడును, పాపియును నగు ఆ రాక్షసుడు, వసించుచోటు, అతని సామర్థ్యము, పరాక్రమము, కులము, నాకు దెలియవు," — అన్నాడు.

ఇప్పుడు సుగ్రీవుడు, రావణుడి గురించి చెప్పిన తర్వాత అయినా — "మరి ఇంతకాలమూ నీకు తెలియదన్నావేం ?" — అని రాముడు అడగలేదు. రాముడు అలా అడగడం, సుగ్రీవుడు ఏదో వొక జవాబు చెప్పడం జరగలేదు. కానీ, పండితులు సుగ్రీవుణ్ణి వెనకేసుకొచ్చి — "రావణుడి సంగతి ముందే చెప్పేస్తే రాముడు తనకు సహాయం చెయ్యడేమో, అని సుగ్రీవుడు సందేహించాడు." —అంటున్నారు.

రావణు డెక్కడుంటాడో తెలిస్తే సరిపోతుందా రాముడికి ? — యుద్ధం చెయ్యాలి కదా ?— దానికోసం సుగ్రీవుడి సహాయం తప్ప కుండా కావాలి గదా ? — తన సహాయం లేకుండా రాముడు, రావ ణుడితో యుద్ధం చేసెయ్యగలడని సుగ్రీవు డెంత మాత్రం అనుకోడు. రాముడి దుఃఖమూ, ఆందోళనా అంతా సుగ్రీవుడు చూస్తోనే వున్నాడు. "నా సైన్యంతో సీతని వెతికిస్తాను. రావణుణ్ణి చంపిస్తాను," — అని ఓదార్చాడు కూడాను.

"అందుచేత, రావణుడి గురించి ముందే చెప్పేస్తే, తర్వాత రాముడు తనకి సహాయం చెయ్యడేమో అని సుగ్రీవుడు జడిశాడు," — అనడానికి వీల్లేదు.

"అయితే మరి సుగ్రీవుడు అప్పుడే ఎందుకు చెప్పలేదు రావణుడి గురించి ?" — అనే ప్రశ్నకి ఇంకో వాదం వుంది "అసలు రావ ణుడి గురించి సుగ్రీవుడికి తెలీనే తెలీదు. ఎప్పుడూ తెలీదు. ఆ తెలి

(ఫుట్‌నోట్ : 338 వ పేజీ తరువాయి)

నని చెప్పిన శ్లోకం ప్రక్షిప్తమే. వాల్మీకి రాసింది కాదు." — అనే వాదం. — అప్పుడు ఇంకో ప్రశ్న వొస్తుంది.

"సుగ్రీవుడు భూమండలం అంతా చూశాడు గదా ; చిన్న చిన్న విషయాలు కూడా చెబుతున్నాడు గదా ; రాక్షస రాజు అంత పెద్ద రాజ్యంలో వుంటే, — ఆ లంకా ద్వీపం ఎందుకు చూడలేదు ;" — అనే ప్రశ్న.

అది ప్రక్షిప్తం అనే వాళ్ళు దీనికి జవాబు చెప్పాలి.

"నరే ; అది ప్రక్షిప్తం కాదు. రావణుడి గురించి సుగ్రీవుడికి తెలిసిందే. తెలిసే రాముడికి మొదట్లో చెప్పలేదు. అలా చెప్పక పోవటానికి ఇంకేదో కారణం వుండాలి." — అంటా రనుకోండి. — అప్పుడు కూడా ఇంకో ఇబ్బంది వొచ్చి పడుతుంది.

సుగ్రీవుడు. రావణుడి నివాసం గురించి చెప్పనే చెప్పాడా ; — వానరులు రావణుడి గురించి దారిలో ఎవరు కనసడితే వాళ్ళని అడుగుతున్నారు. అంటే "సుగ్రీవుడు వానరుల కేమీ చెప్పలేదు రావణుడి గురించి" — అనే అర్థం వొస్తుంది.

ఈ రకంగా — అసలు రావణుడి గురించి సుగ్రీవుడికి తెలుసనుకోవాలా ; తెలీదనుకోవాలా ; వానరులకు చెప్పడను కోవాలా ; చెప్పలేదను కోవాలా ; — అనే ప్రశ్నలు ఎన్ని వేల సంవత్సరాలు చర్చించినా తేలవు.

నా అభిప్రాయం అయితే, ఇదంతా కవిగారి అవక తవక వ్యవహారం. ఆయన గుడ్డెదు చేలో పడటు పోతూ వుంటాడు. వెనక సంఘటనకీ, ముందు సంఘటనకీ సంబంధం వుందో లేదో చూసుకోడు. ఎవ్వటికేది తోస్తే అది రాసేస్తూ వుంటాడు. ఈ విషయం కొన్ని వందల సందర్భాల్లో రుజువవుతోనే వుంటుంది.

సీత కనపడుతుందేమో ఆ శిఖరాలలో కూడా వెతకండి. — అక్కడ కుంజరం అనే ఇంకో పర్వతం కూడా వుంది. దాని మీద విశ్వకర్మ, అగస్త్యమహర్షి కోసం ఓక భవనం నిర్మించాడు. (అగస్త్య మహర్షి మలయ పర్వతం మీదనుంచి, కుంజర పర్వతం మీదకి మారతారు గావున్న — ఇల్లు హూ రయ్యాక) కుంజరం మీద రత్నాలు రాసులు రాసులుగా వుంటాయి. (అందుకన్నమాట మారడం.) — అక్కడ భోగవతీ పట్టణం వుంది. సర్పాల కన్నిటికీ నివాసం అది. సర్పరాజు వాసుకి వుండేది అక్కడే. అక్కడ కూడా సీతా, రావణుడూ వున్నారేమో వెతకండి. (రావణుడి నివాసం తెలిసిం తర్వాత ఇక దిక్కులన్నీ వెతకడం ఎందుకూ పనిలేక!) —

తర్వాత రుషభ పర్వతం తగులుతుంది. అక్కడ కూడా రత్నాలు రాసులు రాసులుగా వుంటాయి. (రత్నాలేనా? సంచులు కూడానా?) ఆ పర్వతం నిండా పళ్ళ చెట్లూ, చందనం వృక్షాలూ వుంటాయి. వాటిని ముట్టుకో గూడదు సుమా! వాటిని గంధర్వులు కాపలాకాస్తూ వుంటారు. (చాలాకాలం గంధర్వుల్ని ముట్టుకోండి.) పుణ్యం చేసుకున్నవారు చచ్చిపోయిన తర్వాత, సూర్యుడిలాగా, చంద్రుడిలాగా రూపాలు ధరించి ఆ పర్వతం మీదే నివశిస్తారు. (మీరంతా యుద్ధంలో చచ్చి పోయి ఇక్కడికే వొస్తారు. ఎవరి చోటు వాళ్ళు చూసుకోండి.)

ఇక అది దాటి వెళ్ళకండి. అవతల అంతా పితృలోకం. యముని రాజ్యం. కటిక చీకటి. పెద్ద గొయ్యి. పడిపోతారు. నెలలోగా వొచ్చి సీతని చూశానని ఎవరు చెప్పగలరో వాళ్ళు ఎన్ని తప్పులు చేసినా తప్పు లేదు. — మీరంతా గొప్ప వీరులు! మంచి వంశాల్లో పుట్టినవారు! ఆచార సంపన్నులు! ఎల్లాగయినా సీతనీ, రావణుణ్ణీ కనిపెట్టండి."

* * *

తర్వాత సుగ్రీవుడు, తార తండ్రి అయిన సుషేణుణ్ణి రెండు లక్షల మందిని తీసుకుని పడమటి దిక్కుకి వెళ్ళమన్నాడు. (సుషేణుణ్ణి

ఇంతకు ముందే దక్షిణానికి వెళ్ళమన్నారు కవిగారూ ; పడమర కూడానా ; — పాపం ఎలా వెళ్ళగలడూ ; — సరే లెండి. ఆయన ఇష్టం. మీ ఇష్టం.)

సుగ్రీవుడు పడమర దిక్కు వివరాలన్నీ చెప్పాడు — "సౌరాష్ట్ర దేశం, బాహ్లిక దేశం వెతకండి. అక్కడ నదులూ, అడవులూ, కొండలూ సరస్సులూ, ముని ఆశ్రమాలూ అన్నీ వెతకండి. (మునుల్ని మాత్రం ఏం నమ్మగలం ?) తర్వాత ఎడారుల్లో, కలుగుల్లో, పర్వతాల్లో, గుహల్లో వున్నారేమో వెతకండి. సింధు నదీ సముద్రంలో కలిసేచోట హేమగిరి అనే పర్వతం ఉంది. దానినిండా రెక్కల సింహాలుంటాయి. అవి చెట్ల మీద గూళ్ళు కట్టుకుంటాయి. తిమింగలాల్నీ, ఏనుగుల్నీ తన్నుకుపోయి గూళ్ళల్లో పెట్టుకుంటాయి. (సీత ఈ గూళ్ళల్లో దొరకవచ్చును. ఆమెకి సింహాలంటే సరదా. — పైగా రెక్కల సింహాలు ; ఇక రాముడి దగ్గిరికేం వొస్తుంది ?) హేమగిరి శిఖరాల్లో ఒక శిఖరం బంగారం ముద్ద. (దాని జాతకం అదీ !) — తర్వాత కొంతదూరం పోతే పడమర సముద్రంలో పారియాత్ర పర్వతం కనబడుతుంది. అదంతా బంగారం ముద్దే. (ఇంతకీ బంగారం అంటే రాయి అని అర్థం గావున్ను. మట్టినీ, బంగారాన్ని ఒక్కలాగే చూడాలి గాబట్టి, కవిగారు బంగారాన్ని మట్టిలాగ చూడలేక, మట్టినీ, రాళ్ళనీ బంగారంలాగ చూస్తున్నారు.) — ఆ బంగారపు పర్వతంమీద ఇవై నాలుగు కోట్లమంది గంధర్వులున్నారు. వారు పళ్ళచెట్లకి కాపలా కాస్తూ వుంటారు. ఆ పళ్ళూ, దుంపలూ, పువ్వులూ ఏవీ ముట్టుకోకండి. గంధర్వులు యుద్ధాని కొస్తారు. అక్కడే వజ్రం అనే పర్వతం వుంది. దాన్నిండా రత్నాలే. (కవిగారు రత్నాల మొలతాడు చేయించుకోలేక పోయిన దిగులంతా కనబడుతోంది మాటి మాటికీ.) — పడమర సముద్రంలోనే చక్రవంతమనే కొండ ఒకటి ఉంది. అక్కడే శ్రీమహావిష్ణువు గొప్ప పరాక్రమంతో హయగ్రీవుడనే రాక్షసుణ్ణి చంపి, అతని చక్రాయుధాన్నీ, పంచజనుడనే రాక్షసుణ్ణి చంపి పాంచ

జన్యమనే శంఖాన్ని సంపాదించాడు. * ఆ ప్రదేశంలో ఏ పొదల్లోనైనా సీతా, రావణుడూ కనపడతారేమో అణువణువూ వెతకండి.

అక్కడ వరాహం అనే ఇంకో వర్ష్యతం కూడా ఉంది. అదీ బంగారం ముద్దే. దానిమీద ప్రాగ్జ్యోతిషం అనే పట్టణం వుంది. అక్కడే నరకాసురుడు నివసిస్తున్నాడు. ఇంకా ముందుకుపోతే వందలకొద్దీ గుహలున్న పర్వతాలు కనబడతాయి. ఆ గుహలనిండా బంగారమే. ఇంకా ముందుకుపోతే అరవై వేల పర్వతాలు తగులుతాయి. అన్నీ బంగారం మయమే. వాటి మధ్యలో వుంది మేరు పర్వతం. మేరు పర్వతంమీద మేరుసావర్ణి అనే రుషిపుంగవుడున్నాడు. ఆయన్ని పూజించి, సీత సంగతి అడగండి. (దండగ. ఏం చెప్పలేడు) — సూర్యుడు మేరు పర్వతం దాటి అస్తగిరికి పోతాడు. ఆ అస్తగిరిమీద విశ్వకర్మ ఎన్నెన్నో మేడలు కలిపి గొప్ప గృహం తయారుచేసి వుంచాడు. సూర్యుడు రోజూ అందులో ఉంటాడు.

ఇక అస్తగిరి దాటిం తర్వాత అంతా అంధకారమే. ముందుకి వెళ్ళలేరు. నెల రోజుల్లో వొచ్చెయ్యండి రానివాళ్ళందర్నీ చంపించేస్తాను" — అని సుగ్రీవుడు తార తండ్రికి గౌరవంగా నమస్కారం చేశాడు.

---

* 42 వ సర్గ — 27; 28 శ్లోకాలు.

"లవణ సముద్రములో చక్రవంతమను కొండ గలదు .... ఆ చక్రవంతములో పురుషోత్తముడగు విష్ణువు, చక్రమును రక్షించుచుండు హయగ్రీవుడను రాక్షసుని జంపి చక్రమునూ, పంచజనుడను రాక్షసుని జంపి, అతని దెనటువంటి పాంచజన్యమను శంఖమును సంపాదించెను." —

* రెండు ఆయుధాలూ ఇతరులవి. విష్ణువు వాటిని సంపాదించుకోగలిగాడు. పరులకు సంబంధించిన దేదైనా (ఆయుధాలు గానీ, స్త్రీలు గానీ, రాజ్యాలు గానీ) తన శక్తితో ఆక్రమించుకోగలగడమే "పరాక్రమం." — అలా ఆక్రమించుకుంటే అది గొప్ప కీర్తి కార్యం.

నమస్కారం వూర్తి గాకముందే ఆయన బయల్దేరి వెళ్ళిపోయాడు.

* * *

తర్వాత సుగ్రీవుడు శతవలిని ఉత్తరం వేపు వెళ్ళమన్నాడు. — "నువ్వు లక్ష మందితో ఉత్తరానికి వెళ్ళు. శ్రీరాముడు శత్రు పురాలు జయించగల పరాక్రమ వంతుడు. — అటువంటి శ్రీరాముడికే మనమీద దయ గలిగింది. మనకు చాలా ఉపకారం చేశాడు. (నాకు సింహాసనం, మీకు ఉరికంబాలూ ప్రసాదించాడు.) — మనం రాముడికి ప్రత్యుపకారం చేస్తే మన జన్మలు ధన్యం అవుతాయి. (యుద్ధంలో శరీరాలు కూడా ధన్య మౌతాయి.) — అందుచేత మీ రంతా చాలా శ్రద్ధగా కార్యం సాధించుకు రావాలి. — మేచ్ఛ దేశమూ, పులింద దేశమూ, ప్రజ్ఞాల దేశమూ, అరట్టక దేశమూ, టంకణ దేశమూ, దరద దేశమూ, చీనా దేశమూ. పరమ చీనా దేశమూ అన్నీ వెతకండి. (ఇప్పుడైతే జన చీనాలో వెతికితే లాభం లేదు. అక్కడ పతివ్రత సీత లుండదు.) — రావణుడు సీతతో కలిసి, లొద్దుగు వనాల్లోనో, దేవదారు వనాల్లోనో, వుంచవచ్చును. (రాముడు ఇప్పటికి ఎన్నిసార్లు మూర్ఛపోయి వుండవచ్చును?) — తర్వాత, సోమాశ్రమం, కాశీపర్వతం, సుదర్శన పర్వతం, తగులుతాయి. అంతా బంగారమే. మూలమూలా వెతకండి. తర్వాత దేవసభనే పర్వతం వొస్తుంది. దాన్నిండా చెట్లుంటాయి. చెట్లనిండా పిట్టలుంటాయి ఇంకా ముందుకు పోతే కైలాసపర్వతం కనబడుతుంది. అక్కడే కుబేరు డుంటాడు. అతని వనం అంతా వెతకండి. తర్వాత క్రౌంచపర్వతం వుంది. దాని లోపల పెద్ద బిలంవుంది. అందులో గొప్ప గొప్ప రుషులు వుంటారు. (గబ్బిలాల రూపాల్లోగావున్ను) ఆ రుషుల బిలం వెతకండి. తర్వాత కామ పర్వతం చూస్తారు. దానిమీద వొక్క చెట్టయినా వుండదు. అక్కడికి దేవతలు కూడా వెళ్ళలేరు. అదంతా వెతకండి. — తర్వాత మైనాకపర్వతం దాటితే సిద్ధాశ్రమం తగులుతుంది. అక్కడ గొప్ప గొప్ప రుషులున్నారు. (ఇంతకీ ఎక్కడి రుషులు గొప్ప

గొప్పో?) వారు తపస్సులవల్ల సమస్త కల్మషాలూ పోయినవారు (మతులుకూడా). — ప్రతిచోటా సరస్సులో బంగారు కమలాలుంటాయి. (వాటిని చూస్తూ కూచోకండి.) — అక్కడ సార్వభౌమం అనే ఏనుగు ఎందరో ప్రియురాళ్ళతో విహరిస్తూ వుంటుంది. (ఏనుగిక్కడ కూడా ఎందరో ప్రియురాళ్ళని పెడితేనేగానీ, తృప్తిలేదు కవిగారికి.) — ఆ సరస్సు దాటి వెళ్తే, సూర్యచంద్రులుండరు. నక్షత్రాలుండవు. కాంతే వుండదు. మేఘాలుండవు. శబ్దాలుండవు. — అక్కడ కొందరు గొప్ప గొప్ప ఋషులు ధగధగా వెలుగుతూ వుంటారు. ఆ కాంతివల్ల ఆ ప్రదేశం అంతా వెలిగి పోతూ వుంటుంది. — అక్కడ శైలోద అనే నది వుంది. దాని గట్టుమీద వెదుళ్ళున్నాయి. అవి ఒక వేడుమీదనుంచి ఒక వేపు మీదకి వాలి వుంటాయి. ఋషులు ఆ వెదుళ్ళ మీదినుంచి శైలోద నదిని దాటుతారు. (ఏం? ధగధగల్తో దాటలేరూ? — వెదుళ్ళు కావాలి?)

తర్వాత వుత్తర కురు భూములో, నదుల్లో బంగారం కమలాలకు వజ్రాల రేకులుంటాయి. అక్కడ నదులనిండా ఇసకకు బదులుగా, ముత్యాలూ రత్నాలూ, మణులూ, పగడాలూ వుంటాయి. అక్కడ చెట్లు కోరికలన్నీ తీరుస్తాయి. కొన్నిచెట్లు జలదారు అంచులుగల పట్టువస్త్రాలు కాస్తాయి. కొన్ని చెట్లు స్త్రీలకూ, పురుషులకూ అనువైన, రత్నాభరణాలు కాస్తాయి. — కొన్ని చెట్లు, చక్కని అలంకారాలతో పరుపులూ, తలగడ్డాలూ, దుప్పట్లూ వేసి, చిత్రవిచిత్రంగా, ఎంతో సౌకర్యంగా అమర్చిన బంగారం మంచాలు కాస్తాయి. (ఈ చెట్ల విత్తనాలు దొరికితే బాగుణ్ణు) — కొన్ని చెట్లు సౌందర్యరాసులైన స్త్రీలని కాస్తాయి. (పురుషుల్ని కాయవుగా? — ఎవడికొచ్చింది ఏక పాతం చెట్లు?) — ఆ చెట్ల ప్రాంతం అంతా బాగా వెతకండి. (ఈరకం వెతుకుడైతే సీత దొరికినట్టే.) — ఉత్తర కురుదేశం దాటిపోతే ఉత్తర లవణసముద్రం వొస్తుంది. దానిమధ్య సోమగిరి అనే బంగారం పర్వతం వుంది. దానిమీద బ్రహ్మా, విష్ణువూ, రుద్రుడూ

వుంటారు. అక్కడికి పోవడం ఎవరికీ సాధ్యంకాదు. అక్కడ సీతని వెతకండి.

ఇక ముందుకు పోవొద్దు. మీరందరూ, మహావీరులు ; విశ్వాస పాత్రులు ; రామకార్యం నెరవేర్చుకువొస్తే, నాచయ పొంది సకల సుఖాలలో ముంచితేలుతారు. (లేకపోతే వురికంబాలకు వేళ్లాడతారు.)

• • •

[అన్ని దిక్కులవాళ్ళు వెళ్ళిపోయినా, దక్షిణం దిక్కు వాళ్ళింకా కదల్లేదు. ఎందుచేతో ?]

సుగ్రీవుడు హనుమంతుడికి ప్రత్యేక శ్రద్ధతో చెప్పాడు — "నువ్వు వీరాధివీరుడివి. భూమిలో, నీటిలో, గాలిలో, అన్నిమార్గాలలోనూ వెళ్ళగలవు. దేవతల లోకాలన్నీ ఎరుగుదువు, గొప్ప తేజశ్శాలివి, సీతని వెతికే కార్యం అంతా నువ్వే సాధించాలి," — అన్నాడు.

సుగ్రీవుడు హనుమంతుడితో అంత ప్రత్యేకాభిమానంతో మాట్లాడి, అంతటిమీద అంత గొప్ప విశ్వాసం ప్రకటించడంచేత, రాముడు, తన కార్యం నెరవేర్చుకు రాగలవాడు హనుమంతుడొక్కడే నని గ్రహించాడు. (మరి అన్ని లక్షలమందిని చావగొట్టడం ఎందుకో ? వానరులంతా రాముణ్ణీ, సుగ్రీవుణ్ణీ, పట్టుకుతంతే బాగుణ్ణు)

రాముడు తన పేరు చెక్కిన వుంగరం హనుమంతుడికిచ్చి — (అదెక్కడిదీ ? — ఇంకా ఎన్ని తెచ్చుకున్నాడో చాటుగా !) — "హనుమంతుడా ! ఈ వుంగరం చూపిస్తే, సీత నిన్ను నమ్ముతుంది. నాదగ్గరినుంచి వొచ్చావని గ్రహిస్తుంది. నువ్వు మహావీరుడివి. సుగ్రీవుడెలాగూ కఠినమైన ఆజ్ఞ వేశాడు. (ఆ భయంతోనన్నా నువ్వు పనిచేసుకొస్తావు.) కార్యం సిద్ధిస్తుందనే నాకు తోస్తోంది." — అన్నాడు.

హనుమంతుడు వుంగరం పుచ్చుకుని బయల్దేరాడు.

వానరులంతా నాలుగు దిక్కులకూ వెళ్ళిపోయాక రాముడు — "సుగ్రీవుడా! నువ్వు భూమండలం అంతా ఎప్పుడు చూశావోయీ?" — అని అడిగాడు. (అంతేగానీ, రావణుడి పంగతి నీకు తెలియచన్నావేం? అని అడగలేదు.)

సుగ్రీవుడు పాతకథే మళ్ళీ ప్రారంభించి చెప్పాడు. వాలి బిలంలో వుండిపోవడం — సుగ్రీవుడు రాజ్యానికొచ్చి పట్టాభిషేకం చేసుకోవడం (తారనిచూడా భార్యని చేసుకుని, వాలి, తమ్ముడి భార్యతో వుండడంకన్న ముందే, సుగ్రీవుడు అన్న భార్యతో వున్నాడు) — వాలి బయటకు వొచ్చి సుగ్రీవుణ్ణి వెళ్ళగొట్టడం — అంతా గురుచేసి — "నేనూ, నా మంత్రులూ భయంతో, నాలుగుదిక్కులకూ పరిగెత్తాము. వాలి మమ్మల్ని మహా వేగంగా వెంటాడుతోనే వున్నాడు. అప్పుడే తిరిగా-భూమండలం అంతా చూశాము. నాలుగుదిక్కులూ అయిపోయాక, హనుమంతుడికి రుష్యమూకం మీదికి వాలి రాడనే సంగతి జ్ఞాపకం వొచ్చింది. (అబ్బ! ఎంత మతిమరుపో! ఆ వుంగరం ఎక్కడ పారేస్తాడో!) — తర్వాత సంగతి నీకు తెలిసిందే." — అని తన భూమండల జ్ఞానానికి కారణం చెప్పాడు. — రాముడు సంతోషించాడు.

* * *

పరే: దక్షిణం దిక్కువాళ్లు తప్ప, మిగతా దిక్కులవాళ్ళు నెల తిరక్కుండానే వచ్చేశారు. చక్కగా "సీత దొరకలేద"ని చెప్పేశారు. పైగా ఏమన్నారంటే — "హనుమంతుడు మహానుభావుడూ! రావణు డే దిక్కుగా పోయాడో, హనుమంతుడూ ఆ దిక్కుగానే పోయాడు కాబట్టి, ఆ మహానుభావుడే, ఆ మహానుభావురాల్ని, కనిపెట్టి రాగలడూ. అందుకు సందేహంలేదు" — అన్నారు. (అంచేత పీళ్ళసలు పెట్టికేవుండరు. ఎంత గడుసువాళ్ళు!)

* * *

ఇక దక్షిణం దిక్కుకి వెళ్ళినవాళ్ళసంగతి — అన్నీ వెతుక్కుంటూ పోతున్నారు.

కండుమహర్షి ఆశ్రమం తగిలింది. ఆ ఆశ్రమం చుట్టుపట్ల అడివంతా చెట్లు మోళ్ళైపోయి వున్నాయి. కాయలూ, పువ్వులూ లేవు సరిగదా ఆకులు కూడా లేవు. ఒక్క జంతువు లేదు. ఒక్క పిట్ట లేదు. — కారణం ఏమిటంటే — కండు మహర్షి కొడుకు హఠాత్తుగా చచ్చిపోయాడు. మహర్షికి అంచరిమీద కోపం వొచ్చి, జీవులన్నీ నశించిపోవాలని శపించేశాడు. అంత వుత్తముడాయన. — ఆ చుట్టుపట్ల సీతకనపడలేదు. — వెతికి వెతికి చాలా అలిసిపోయారు. తినడానికీ, తాగడానికీ ఏమీ దొరకలేదు. (రుషిగారేం తింటాడో!)

వెతికి, వెతికి వొకచోట పెద్ద బిలం చూశారు. దాని పేరు రుక్ష బిలం. అది పొదలతో, చెట్లతో మూసుకుపోయి వుంది. దాంట్లోంచి ఎన్నెన్నో పరిమళాలు వొస్తున్నాయి. తడి రెక్కలతో పక్షులు వొస్తున్నాయి. — అందరూ బిలబిలా బిలంలో ప్రవేశించారు. కొంత దూరం కారు చీకటి. తర్వాత బంగారం చెట్లు. వాటి మొదళ్ళు చుట్టూ వజ్రాలతో, వైఢూర్యాలతో కట్టిన గట్లు. — అక్కడ చాలా మేడలున్నాయి. కొన్ని బంగారమూ — కొన్ని వెండీ. (ఛ! వెండా! అన్నీ బంగారమే అంటే నమ్మరేమోనని సందేహిస్తున్నారా కవిగారూ? అబ్బే! అదేం లేదు. ఎలాగూ ఘంటంతో కట్టే మేడలే గదా! — వెండెందుకు వెచ్చి. అన్నీ బంగారంతోటే కట్టండి.)

అక్కడ అన్నీ బంగారపు నగస్సులే. వాటిల్లో బంగారపు కలువపూల మీద, బంగారపు తుమ్మెదలు వాలి, బంగారపు తేనె తాగుతున్నాయి.

ఆ బిలంలో ఎక్కడ చూసినా రత్నాలూ, వజ్రాలూ తాపడం చేసిన బంగారపు శయ్యలున్నాయి. బంగారపు ఆసనాలున్నాయి. లోకంలో వుండే నమస్తమైన వస్తువులూ వున్నాయి. అన్నీ బంగారంవే.

బంగారం వస్తులతో ఎన్నెన్నో భోజన పదార్థాలూ, పానీయాలూ, మద్యాలూ వున్నాయి. — కొంత దూరాన ఒక యోగిని కనపడింది.

. హనుమంతుడు ఆమెని— "నువ్వెవరు? — అని అడిగాడు. (హనుమంతుడు మనింటికొస్తే 'మీ రెవరు?' అని అడుగుతాడు.)

ఆమె చెప్పింది— "మయుడనే రాక్షసుడుండేవాడు. అతడు తపస్సు చేసి, బ్రహ్మవల్ల శుక్రవాస్తు శాస్త్రం అంతా వరంగా పొందాడు. ఆ మయుడే (మండోదరి తండ్రి) ఈ బిలంలో మేడలూ, సరస్సులూ నిర్మించాడు. ఆతడు హేమ అనే అప్సరసను ప్రేమించాడు. ఆ సంగతి తెలిసి ఇంద్రుడు మయుణ్ణి చంపేసి ఈ సంపద అంతా హేమ కిచ్చాడు. ఆమె నాకు ప్రాణ స్నేహితురాలు. ఈ బిలం, నన్ను కాపాడమని నాకు అప్పగించింది. నేను మేరుసావర్ణి కుమార్తెని. స్వయంప్రభ నా పేరు. మీరు చాలా అలసి వున్నారు. చక్కగా తినండి. తాగండి. సుఖంగా వుండండి" —అని చెప్పింది. (ఆడవాళ్ళు తపస్సులు చేసినా మంచివాళ్ళ లాగానే వుంటారన్నమాట. అదే ఏ విశ్వామిత్రుడో అయితే "అసలు నా బిలంలో కెందు కొచ్చారు? బిల్లులైపోండి." అని కసిరేవాడే.)

వానరులంతా సంతోషంతో అన్నీ తిన్నారు. తాగారు. విశ్రాంతిగా కొంతకాలం గడిపారు.

స్వయంప్రభ వానరుల్ని —"మీ కార్యం ఏమిటి?" అని అడిగింది. —

హనుమంతుడు అంతా చెప్పుకొచ్చాడు. — "రాముడనే వొక రాజున్నాడు. (రాముణ్ణి రాజుగానే గానీ, రుషిగా లెక్కగట్టడం లేదు.) — ఆయన సర్వ లోకాలు ఏలచగ్గవాడు. (తన రాజ్యం తప్ప.)" అని మొదలుపెట్టి రామాయణం అంతా విప్పాడు. చివరికి— "సీతని వెతకాలి. గడువు దాటిపోయింది. మమ్మల్ని ఈ బిలంలోంచి బయట పడెయ్యి." — అన్నాడు.

"కళ్ళు మూసుకోండి." —అంది స్వయంప్రభ.

కళ్ళు మూసుకున్నారు. అందరూ బయట వున్నారు. వింధ్య నమీపాన, సముద్ర పొడ్డున వున్నారు. చుట్టూ పర్వతాల నిండా చెట్లన్నీ విరగబూసి వున్నాయి. 'వసంత రుతువు వొచ్చేసిందని గ్రహించారు. (సంవత్సరాని కెన్నిసార్లు వొస్తుంది కవిగారూ వసంత రుతువు?) — కిష్కింధకు పోవలసిన గడువు దాటిపోయింది. అందరూ వొక హూల చెట్టుకింద కూర్చుని చర్చించసాగారు.

అంగదుడు అసలు కిష్కింధకు పోనే పోవొద్దన్నాడు.

"మనం ఆశ్వయుజ మాసంలో బయల్దేరాం. (కార్తీకం వరకూ వరరుచు వన్నాడు రాముడు. తర్వాత కూడా కొంతకాలం గడిచి పోయింది. అంటే — వానరులు బయల్దేరిండి— ఆశ్వయుజంలో కాదు. కార్తీకంలో కాదు. బహుశా మార్గశిరంలో) వొచ్చినపని జరగలేదు. గడువు దాటిపోయింది. ఇప్పుడు తిరిగివెళితే రాజు మనల్ని చంపించేస్తాడు. అసలు సుగ్రీవుడికి నేనంటే చాలా పగ. నాకు యువరాజ పదవి ఇవ్వడంకూడా అతడు ఇష్టంతో ఇవ్వలేదు. రాముడు చెప్పాడు కాబట్టి నన్ను యువరాజాని చేశాడు. ఈనేరంతో నన్నుతప్పకుండా చంపించాలని చూస్తాడు. అక్కడ నా మరణం చూసి నా స్నేహితులు దుఖించడం ఎందుకు? ఇక్కడే ప్రాయోపవేశం చేసి చచ్చిపోవడం మంచిది" — అన్నాడు. (ప్రాయోపవేశం అంటే ఆహారం మానేసి చచ్చిపోవడం.)

"అవును. సుగ్రీవుడు మొదటినుంచీ దుర్మార్గుడే. కిష్కింధకు పోతే చావు తప్పదు" — అన్నారు అందరూ. — హనుమంతుడు తప్ప.

తారుడు కూడా అల్లుడి దుర్మార్గం తలుచుకుని భయపడి — "మనం స్వయంప్రభ బిలంలోనే ఉండిపోదాం. రాముడే గాదు, ఇంద్రుడైనా ఏమీ చెయ్యలేడు" — అన్నాడు. (మా బాగా అన్నావు తారుడు తాతా!)

వానరులంతా సంతోషంతో — "అవును. అలాగే చేద్దాం. అక్కడే ఉందాం" — అని వొప్పుకున్నారు.

ఇదేమీ హనుమంతుడికి నచ్చలేదు. అంగదుడు వానరు లందరికీ సుగ్రీవుడికి వ్యతిరేకంగా శతృభావం కలిగించి, తనకు అండగా ఉంచుకో బోతున్నాడనే సంగతి హనుమంతుడు గ్రహించాడు. — ఎంతమాత్రం అలా జరగనివ్వకూడ దనుకున్నాడు. అంగదుడు తండ్రి లాగానే గొప్ప పీరుడు. బుద్ధిబలం గలవాడు. ఉత్తమ గుణాలు గలవాడు. శాస్త్రాలు చదివినవాడు. పౌర్ణమి చంద్రుడిలాగ బల పరాక్రమాలలో అరితేరుతూ ఉన్నవాడు. అటువంటివాడు విరోధిగా వుండడం సుగ్రీవుడికి క్షేమం కాదు.

హనుమంతుడు అంతా ఆలోచించి, అంగదుణ్ణి సుగ్రీవుడికి అనుకూలంగా ఉండేట్టు చెయ్యడానికి పూనుకున్నాడు. — ముందు అంగదుడికీ, సైనికులకీ విరోధం కల్పించి, తర్వాత అంగదుణ్ణి మందలించాలను కున్నాడు. గొప్ప వాత్సల్యంతో ప్రారంభించాడు — "అంగదా! యువరాజా! ఈ వానరులంతా నీ మాటకు కట్టుబడి ఉంటారని భ్రమపడుతు తున్నావు. ఎంతోకాలం ఉండరు సుమా! (పుహా చక్కగా ఉంటారు. వాళ్ళకీ ప్రాణభయమే కిష్కింధకు పోవడానికి.)—ఈ జాంబవంతుడూ, సిలుడూ, సుహోత్రుడూ వీళ్ళంతా నీ మాట ప్రకారం నడుచుకోరు. వాళ్ళే కాదు. నేనూ ఉండను. నన్నెవ్వరూ సుగ్రీవుడికి దూరం చెయ్యలేరు. (సుగ్రీవుడికి కాదులే. మంత్రి పదవికి.) బలవంతుడు బలహీనుడితో వైరం పెట్టుకోవచ్చు. అది రాజనీతే. (ఎంత మంచి నీతో!) — బలహీనుడు మాత్రం బలవంతుడితో వైరం పెట్టుకోగూడదు. — అందుచేత నువ్వు నీ క్షేమం కోసమే సుగ్రీవుడికి లొంగి ఉండాలి. స్వయంప్రభ బిలంలో ఉండిపోతే ఏమీ ప్రమాదం రాదనుకుంటున్నా వేమో! — ఒక్క బాణం వేసి ఆ బిలాన్ని ఆకుదొన్నె చీల్చినట్టు చీల్చెయ్యడానికి రాముడిదాకా ఎందుకు? లక్ష్మణుడు చాలు. .... నా మాట విని ఇక్కడే ఉండాలనే అభిప్రాయం మార్చుకో .... సుగ్రీవుడు అంత కఠినాత్ముడు కాడు. నిన్నెప్పుడూ చంపించడు. నీ తల్లి మీద అత నికి చాలా మోహం. నువ్వుతప్ప అతనికిమాత్రం కొడుకులెవరున్నారు?

సుగ్రీవుడి చదుపాజ్ఞల్లో నమ్మకంగా ఉన్నాపంటే తన తదనంతరం రాజ్యం నీకే ఇస్తాడు. నీ పినతండ్రి ఎంతో ధర్మాత్ముడు. ఉత్తముడు. దయగలవాడు. (తనకి మరణశిక్ష పడదని హనుమంతుడికి బాగా తెలుసు.)—ఇంక నా మాట వినక నువ్వు ఇక్కడే ఉన్నావా, అప్పుడు మాత్రం నీకు చావు తప్పదు. సుగ్రీవుడు నిన్నువిడిచిపెడతాడని మాత్రం అనుకోకు"— అని తన శక్తికొద్దీ భయపెట్టాడు.

అంగదుడు హనుమంతుడి మాటలేవీ చెవిన పెట్టలేదు. — "నువ్వు కీర్తిస్తోన్నట్టు సుగ్రీవుడికి వొక్క సుగుణమైనా లేదు. అతడికి ధర్మం లేదు. హృదయం లేదు. చిత్తశుద్ధి లేదు. పశ్చాత్తాపం లేదు. దయ లేదు. పరాక్రమం లేదు. ధైర్యం లేదు. అన్నను చంపినవాడు ఏ తప్పు చెయ్యకుండా ? అన్న జీవించి వుండగానే (వాలి బిలంలో వున్నప్పుడు) — తల్లివంటి వదినగార్ని నిర్బంధించిన వాడు ధర్మాత్ముడవుతాడా ? ("తల్లివంటి" —అనే మాట కని వాడిండే.) సుగ్రీవుడు సీతని వెతికించే ఏర్పాట్లు చేశాడంటే రాముడికి భయపడి గానీ, తన వాగ్దానానికి కట్టుబడి గాదు. అంత దుర్మార్గుణ్ణి ఎవరు నమ్ముతారు ? నా కేనాటికీ రాజ్యం ఇవ్వడు. తనకు పుట్టబోయే కొడుకులకే ఇచ్చుకుంటాడు నే నిప్పుడు కిష్కింధకు వెళ్తే, నేను తనని తిట్టిన సంగతి ఏవరిద్వారానైనా విని, నన్ను రహస్యంగా, నా తల్లికి కూడా తెలియకుండా చంపించేస్తాడు. నేను మాత్రం అక్కడికి రాను. నాతో ఎవ్వరూ వుండవొద్దు. అందరూ వెళ్ళిపోండి. నా తల్లి ఎంతో దయగలది. ఆమెకు నేనంటే పంచప్రాణాలు. ఆమెను మాత్రం ఓదార్చండి." — అని అంగదుడు, వృద్ధ లంచరికీ నమస్కారాలు చేసి, ఏడుస్తూ నేల మీద పడుకున్నాడు. వానరులంతా అతని చుట్టూ జేరి బొటబొట కన్నీళ్ళు గారుస్తూ సుగ్రీవుణ్ణి తిట్టి, వాలిని కీర్తిస్తూ — "మనందరం

ఇక్కడే చచ్చిపోదాం." — అని నిశ్చయించుకున్నారు. (హనుమం తుడి మొహం చూడాలి.) *

---

* 53 వ సర్గలో — 27 వ శ్లోకంనించి చివరి వరకూ. 54, 55 సర్గలు పూర్తిగా.

—అంగదుడికి పినతండ్రి మీద ఎలాంటి అభిప్రాయం వుందో చూడండి. — "సుగ్రీవుడు పుట్టుక చేతనే క్రూరుడు. పూర్వము నా యడల బద్ధ ద్వేషము గలవాడును, నన్ను చండించ వలయునని కోరి యుండు వాడును నగు సుగ్రీవుడు, నాకు కఠినమైన శిక్ష విధించును. అతని చేతిలో జిక్కి చిత్రవధ బడయుటకంటే ఇచటనే ప్రాణములు విడుచుట మనకు శ్రేయము."—

అంగదుడికి సుగ్రీవుడి మీద కోపం వున్నట్టే, రాముడి మీద కూడా వుండాలి కదా ?— అంతకన్నా ఎక్కువే వుండాలి. కానీ, కవిగారు, అంగదుడితో సుగ్రీవుణ్ణి తిట్టించారే గానీ, రాముణ్ణి మాత్రం వొక్కమాట అననివ్వలేదు. పైగా పొగిడించారు. అంగదుడు రాముణ్ణి చక్కగా పొగుడుచున్నాడు—

—"సుగ్రీవుడు నాకీ యువరాజ్య పట్టాభిషేకము సేయనే లేదు. శుద్ధమైన ప్రవర్తన గలవాడును, మానవోత్తముడును నగు శ్రీరాముడే నాకు ఈ పట్టాభిషేకము జేసెను." —

ఈ రకంగా మాట్లాడుతోన్న అంగదుణ్ణి చూసి— "అంగదునకు రాజ్యము పరిపాలించు సామర్థ్యము గలదనీ హనుమంతుడు తెలిసి కొనెను."

తెలుసుకొని ఏం జేశాడంటే— "సామ, దాన, భేద దండో పాయములలో భేదోపాయమును జెప్పుచు, వానరుల కందరికిని భేదము గల్పించెను. వానరు లందరును, పరస్పరము భేదించి యుండగా, దండోపాయముతో గూడిన భయంకరమగు, అనేక మాటలచే అంగ దునికి హనుమంతుడు భయము కలిగించెను."—

(పుట్‌నోట్ : 352 వ పేజీ తరువాయి)

హనుమంతుడు చెప్పిన మాటలు — "సుగ్రీవునితో విరోధము గల్పించుకొని నీవు బిలములో నుండినచో వానరు లందరూ నిన్ను విడిచి పోదురు .... స్నేహితులూ, హితులూ లేనివాడవై తృణ ప్రాయుడవగుదువు. నీవు వినయముతో కిష్కింధలో ప్రవేశించినచో, సుగ్రీవుడు నిన్ను క్రమముగ, రాజ్యములో స్థాపించును." — అంగదుడు కొంత సైన్యంతో, సుగ్రీవుని మీద కత్తి దూసినట్లు వేరుగా వుండడం — ఎప్పటికైనా సుగ్రీవునికి చాలా ప్రమాదం కదా? — అటువంటి పరిస్థితిలో, అంగదుణ్ణి నయానో, భయానో సుగ్రీవునికి అనుకూలంగా పులడేట్లు చెయ్యడం, సుగ్రీవునికీ, రాముడికీ కూడా చాలా మంచిది కదా? — ఇది సుగ్రీవుడికీ, రాముడికీ మేలు కలిగించే కార్యం కాబట్టి, హనుమంతుడు అంగదుణ్ణి భయపెట్టి, మందలించడం చాలా గొప్ప కార్యం అనీ, హనుమంతుడు వృత్తిమంతుడనీ, బుద్ధిమంతుడనీ, —కవి శ్లాఘిస్తూ రాస్తున్నాడు.

హనుమంతుడి మందలింపులకు అంగదుడి జవాబు — "స్థిరమైన బుద్ధీ, ఆత్మబుద్ధి, చయ, ఋజుస్వభావమూ, పరాక్రమమూ, గాంభీర్యము, సుగ్రీవుని యెడల లేవు. — అన్న జీవించి యుండగనే, అతని భార్యను, తల్లితో సమానముగ నుండు అన్న భార్యను, ధర్మమని స్వీకరించిన వాడు లోక నిందితుడు, — అన్న గుహలో ప్రవేశించి యుండగా, బిల ద్వారమును మూసిన వానికి ధర్మమెట్లు తెలియును? —లోలోపల అప్రియము జేయువాడును, కఠిన చిత్తుడును, నీచుడును నగు సుగ్రీవుడు, రాజ్యముమీద ఆశ గలవాడై నన్ను రహస్యముగ బంధించి, దండించును," — అని అంగదుడు రోదించెను.

("కవి సుగ్రీవుని పక్షం కదా? — అతన్ని ఎందుకు తిట్టించాడు? అతని దుర్గుణాలు ఎందుకు బయట పెట్టాడు?" — అనే ప్రశ్న

వాసరు లందరూ ఏడుస్తూ — తమ చావుకి కారణం అయిన సంగతులన్నీ తలపోసుకుంటున్నారు.

అంతలో, సంపాతి అనే ఒక పెద్ద రెక్కలు లేని పక్షి, కొండల మీద నడుస్తూ వొచ్చాడు.

"ఆహా ! ఎంత ఆహారమో ! చక్కగా తింటాను," — అని సంతోషించాడు.

సంపాతికి వానరుల మాటల మధ్య జటాయువు సంగతి చెవిన బడింది. — "వానరులారా ! జటాయువు నా తమ్ముడే. అతణ్ణి రావణుడు చంపేశాడని చెప్పుకుంటున్నారు మీరు. ఆ సంగతేవిటో అంతా నాకు వివరంగా చెప్పండి. చాలా కాలంనించి, నా తమ్ముడెక్కడున్నాడో నాకు తెలియలేదు. నా రెక్కలు సూర్యుడి వేడికి కాలి

(ఫుట్‌నోట్ : 353 వ పేజీ తరువాయి)

పోయింది — ఈ కవికి ఎక్కడ ఏ తర్కం పనికొస్తే, అక్కడ దాన్ని ఉపయోగించెయ్యడం ఇష్టం. — సుగ్రీవుడి తప్పులు కొన్ని స్పష్టంగానే కనబడుతున్నాయి. — అందుచేత ఈ రకంగా అడిగించాలని ఉత్సాహపడ్డాడు. — సుగ్రీవుడి మీద కవికి ప్రత్యేక గౌరవం ఏమీ లేదు. ఆ పాత్రని తిట్టించడంలో ఆయనకు అయిష్టమైన దేమీ లేదు. రాముణ్ణి మాత్రం, ఎక్కడా, ఎవ్వరిచేతా, అంగదుడు సుగ్రీవుణ్ణి తిటినట్టు, తిట్టించలేదు. — రాముడి ప్రవర్తనని ఎక్కడా విమర్శించలేదు.)

సరే ! ఆ రకంగా అంగదుడు ఏడుస్తూ పడుకున్న తర్వాత — "అంగదుని జూచి వానరోత్తములు ఏడ్చుచు, సుగ్రీవుని దూషించుచు, బాలిని శ్లాఘించుచు, వానరులందరు అంగదుని జుట్టుకొని, ప్రాయోపవేశము జేయుటకు సిద్ధముగ నుండిరి."

(రాముడి మీద మాత్రం కోపం లేదు వానరులకు. పైగా భక్తి. శ్రీరాముడి గుణాలన్నీ గానం చేస్తూ కూర్చున్నారు.)

పోయాయి. నన్ను ఈ కొండ మీదనుంచి కిందకు దించండి," — అని అడిగాడు.

అంగదుడు సంపాతిని కిందకుదించి, కథంతా చెప్పుకొచ్చాడు. — "సీతని పెతికే గడువు దాటిపోయింది. అందుచేత మేం చచ్చి పోవా లనుకుంటున్నాం. రావణుడు ఎక్కడుంటాడో, ఏవిటో నీకేమన్నా తెలుసా ?" — అని అడిగాడు. (సుగ్రీవుడు చెప్పాడుగా కపి గారూ ! లాభం లేదు. రామకార్య భారంతో మీకు మతి చలించినట్టే వుంది.)

సంపాతి కథంతా విని — "రావణుడు సీతని ఎతుకుపోవటం నేను కూడా చూశాను. సీత ఏడుస్తూ, నగలు పారేస్తూ వుంది. రావణుడు కుబేరుడి తమ్ముడు. లంకలో వుంటాడు. లంక ఇక్కడికి నూరు యోజనాల దూరం అదుగో ! సీత ఇక్కడినించే కనబడుతోంది నాకు. కాకులూ, డేగలూ అంత దూరం చూడలేవు గానీ, మా జాతి పక్షులం నూరు యోజనాల వరకూ చూడగలం. (మీ తమ్ముడెందుకు కనపడ లేదు నాయనా ?) మీరు రావణుణ్ణి సంహరిస్తే నా కక్ష కూడా తీరుతుంది. అనలు రామకార్యం నావల్లనే జరగాలి గానీ, నేను వృద్ధుణ్ణయి పోయాను. ఇక నేనేమీ చెయ్యలేను. నన్ను సముద్రం దగ్గిరికి తీసుకు వెళ్ళండి. నా తమ్ముడికి తర్పణాలు విడుస్తాను." — అన్నాడు.

వానరులు సంపాతిని సముద్రం దగ్గిరికి మోసుకుపోయి మళ్ళీ తెచ్చి పడేశారు.

జాంబవంతుడు సంపాతి దగ్గిరికి వెళ్ళి — "పక్షిరాజా ! సీత ఎక్కడుంది ? ఆమెను ఎవరు అపహరించుకు పోయారు ? ఆ సంగతులన్నీ చెప్పి మమ్మల్ని రక్షించు," — అని అడిగాడు. (పాపం ఈయ

నకి పూర్తిగా మతి పోయింది. చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడు తోంటే అంతే మరి.) •

సంపాతి — "సీత సంగతి నా కెలా తెలిసిందో, ఎవరిద్వారా విన్నానో చెబుతా — వినండి. (ఇందాక తనే చూశాననన్నాడు) నేను రెక్కలు కాలిపోయి చాలా కాలంనించీ పర్వతాల మీద వుంటున్నాను. నా కొడుకే నాకు ఆహారం తెచ్చి పెడుతున్నాడు. ఒకనాడు ఆహారం తేకుండా వొచ్చాడు — కారణం ఏమిటని అడిగితే అంతా చెప్పుకొచ్చాడు — "తండ్రీ! నేను జంతువుల కోసం సముద్రం మీద వెతుకుతూ తలకిందులుగా నించున్నాను. అంతలో ఒక పురుషుడు ఒక స్త్రీని తీసుకువెళ్తూ — "దారి ఇయ్యి" — అని అడిగాడు. దారి ఇచ్చాను. తర్వాత సిద్ధులు, అతడు రావణుడనీ, సీతను ఎత్తుకు పోతున్నాడనీ, సీత ఏడ్చిందనీ చెప్పారు. ఇలా జరగడం వల్ల ఆహారం తేలేకపోయాను," — అని చెప్పాడు. రావణుడి మీద నాకు చాలా కోపం వొచ్చినా, రెక్కలు లేకపోవడం వల్ల నేనేమీ చెయ్యలేక పోయాను. (రెక్కలు వుంటే వుద్ధరించే వాణ్ణి)

---

* 59 వ సర్గ — 6 శ్లోకాల వరకూ.

సీత లంకలో వుందనీ, తనకు కనపడుతోందనీ కూడా సంపాతి చెప్పడం అయిపోయింది. అయినా జాంబవంతుడు మళ్ళీ — "సీత ఎక్కడుంది; ఎవరు ఎత్తుకు పోయారు;" — అని అడిగాడు. — "ఇది ప్రక్షిప్తమే. లేకపోతే జాంబవంతుడు మళ్ళీ అడిగినట్టు కవి ఎందుకు రాస్తాడు;" — అని వొక వాదం.

అయితే, — అసలు రావణుడి నివాసం గురించి సుగ్రీవుడు చెప్పనే చెప్పాడు గదా; — అంగదుడు మాత్రం సంపాతిని ఎందుకడిగాడు; — అంగదుడు అడిగిన సంగతి అసలు కవే రాసినప్పుడు, అలాగే జాంబవంతుడు కూడా మళ్ళీ అడిగిన సంగతి కవి రాసింది కాకూడదా; ఎందుచేత;

నాకు రెక్కలు ఎలా పోయాయో కూడా చెపుతాను వినండి. (నరేః కానియ్యి. తప్పుతుందా ?) వెనకటికి నేనూ, జటాయువూ పందేలు వేసుకుని సూర్యుడి దగ్గిరికి బయలుదేరాం. కొంతదూరంల వెళ్ళేప్పటికి వేడి భరించలేక నా తమ్ముడు స్పృహ తప్పి కిందపడి పోతున్నాడు. వెంటనే, నా తమ్ముడి మీద నా రెక్కలు కప్పాను. వేడికి నా రెక్కలు కాలిపోయి నేను వింధ్యపర్వతం మీద పడిపోయాను. తెలివి వొచ్చిం తర్వాత నెమ్మదిగా పాకుతూ నిశాకర మహర్షి ఆశ్రమానికి వెళ్లాను. నేను వెళ్ళేప్పటికి మహర్షి అడవిలోకి వెళ్ళి వొస్తున్నాడు. వెనకాల పెద్దపులులూ, సింహాలూ, ఏనుగులూ మహాసర్పాలూ, ఆశ్రమం వరకూ వొచ్చి, ఆయన్ని గౌరవంగా సాగనంపి వెళ్ళిపోయాయి. (ఈయన సరకసుల వాళ్ళకి పనికొస్తాడు.) — నేను రెక్కలు కాలి పోయిన సంగతంతా చెప్పి దుఃఖిస్తోంటే, ఆ ఋషి నన్ను ఓదార్చి — "నీకు ఇప్పుడు రెక్కలు ఇవ్వగలను. కానీ ఇవ్వను. ఎందుకంటే — భవిష్యత్తులో వొక గొప్ప కార్యం జరుగుతుందని పురాణ కథల్లో విన్నాను. ఆ సంగతి నిజమేనని నా తపస్సువల్ల కూడా గ్రహించాను. దశరథ మహారాజుకి, కొన్ని వేల సంవత్సరాల తర్వాత రాముడనే కొడుకు పుడతాడు. (రాముడి పేరు సుబ్బడని పెడితే ఏమయ్యేదో : "దశరథ మహారాజుకి సుబ్బడనే కొడుకు పుడతాడు." — అని చెప్పుకుంటారు గావున్ను ఋషులు.) — ఆ రాముడు అడవులకు వొస్తాడు. రావణుడు సీత నెత్తుకు పోతాడు. సీత పతి వియోగంతో ఆహారం ముట్టదు. ఇంద్రుడు ఆమెకు పరమాన్నం పంపిస్తాడు. (ఏదో ఎత్తు). సీత తీసుకుంటుంది. అందులోంచి కొంత అన్నం తీసి పేరే వుంచి — "ఇది నా భర్త కోసం. ఆయన జీవించివున్నా, మరణించినా ఇది ఆయనకు చెందాలి," — అని మిగిలింది తను తింటుంది. (అప్పుడే

పిండం వేస్తుందన్న మాట. *) సీతని వెతుక్కుంటూ వానరులు ఇటే వొస్తారు. సీత లంకలో వుందనే సంగతి నువ్వు వానరులకు చెప్పాలి. అంతవరకూ నీకు రెక్కలు ఇవ్వను. (నిన్ను నమ్మలేం.) సీత వార్త వానరులకు చెప్పగానే నీకు రెక్కలు వొచ్చేస్తాయి. నేనిక స్వర్గానికి వెళ్ళిపోతాను. శ్రీరాముణ్ణి చూడాలని వుంది గానీ, అంతవరకూ ఆగలేను. (ఎవడుంటాడు?)" — అని చెప్పి ఆ ఋషి స్వర్గానికి వెళ్ళిపోయాడు. ఇది జరిగి వంద సంవత్సరాలైంది. (ఒకసారి 8 వేల సంవత్సరాలూ — ఒకసారి వంద సంవత్సరాలూ! ఏం చేస్తాం?) — రెక్కలు లేక చాలా దుఃఖపడుతూ జీవిస్తున్నాను. రెక్కలు వొస్తాయనే ఆశతో మీ కోసమే ఎదురు చూస్తూ కాలం గడుపుతున్నాను." (మరి వానరుల్ని చూడగానే, చంపేస్తానన్నా వెందుకూ? రామాయణ కథ నీకు తెలిసిందేగా? తెలియనట్టు అడిగావు వెందుకూ?)

అలా చెపుతూ వుండగానే సంపాతికి, చక్కటి ఎర్రటి రెక్కలు వొచ్చేశాయి. యౌవ్వనంలో వున్నంత బలం వొచ్చేసింది. సంపాతి పులకరించిపోతూ— "రావణుణ్ణి చంపే వ్యవహారం మీరు చూసుకోండి." — అని చెయ్యిన ఎగిరిపోయాడు. (రామకార్యం ఎగరగొట్టి, అందుకే మరి ఆ ఋషి రెక్కలివ్వ నన్నాడు.)

---

* 62 వ సర్గ — 7, 10 శ్లోకాలు.

ఇది నిశాకర మహర్షి సంపాతికి చెప్పిన సంగతి.

సంపాతి ఇప్పుడు వానరులకు చెపుతున్నాడు.

— "పతివ్రత యగు సీత దుఃఖములో మునిగి, భుజించక యుండును. సీత భుజించ కుండుట యేరింగి, ఇంద్రుడు ఆమెకు దివ్యాన్నము పంపును. దేవతలకు లభించని, యా యన్నమును ఇంద్రుడు పంపెనని తెలిసికొని, సీత, దాని పరిగ్రహించి మొదటి భాగమును శ్రీరాముని వుద్దేశించి, — "ప్రభువగు నా భర్త లక్ష్మణుని తోడ జీవించి యుండిననూ, లేక దేవత్వము పొంది యుండిననూ, వారికి ఈ యన్నము తృప్తిని కలిగించు గాక," — అని భూమి మీద యుంచును.

సంపాతి ఎగిరిపోయాక వానరు లందరూ సముద్రం దగ్గిరికి చేరారు. ఇక సముద్రం దాటి లంకకు పోవాలి.

అంగదుడు — "సముద్రం ఎవరు దాటగలరు? ఎవరు ఎంతెంత దూరం దాటగలరో చెప్పండి," — అని అడిగాడు.

ఎవరి శక్తి సామర్థ్యాలు వాళ్ళు చెప్పారు.

సుషేణుడు ఎనభై యోజనాలు దూకగల నన్నాడు. జాంబవంతుడు — "నేను, పూర్వం విష్ణుమూర్తి బలిని భూమిలోకి అణగ దొక్కడానికి త్రివిక్రమావతారం ఎత్తి లోకాలన్నీ ఆక్రమించినప్పుడు ఆయనకు వెయ్యిసార్లు ప్రదక్షిణం చెయ్యగలిగాను. (ఈయన మాటలు నమ్మడానికి వీల్లేదు. సీత సంగతే, ఇలా విని, అలా మరిచిపోయి, మళ్ళీ అడిగాడు. పూర్వం సంగతులేం గుర్తుంటాయీ?) ఇప్పుడు మాత్రం తొంభై యోజనాలు దాటగలను." — అన్నాడు.

అంగదుడు — "నేను నూరు యోజనాలు దాటగలను గానీ, మళ్ళీ తిరిగి రాగలనో లేదో!" అన్నాడు. (రావణుడితో స్నేహం చేసుకుని, విభీషణం మీద వాలి, సుగ్రీవుడి మీద దండెత్తవోయీ:)

జాంబవంతుడు అంగదుడితో — "నువ్వు నూరు కాదు. వెయ్యి యోజనాలైనా దాటగలవు గానీ, అసలు దాటనే వొద్దు. నువ్వు మా స్వామివి. పైన్యం ప్రభువు రక్షించుకోవాలి. లంకకు పోయే పని దెవరో వేను ఆలోచిస్తాను," — అని హనుమంతుడి దగ్గిరికి వెళ్ళలేదాడు.

హనుమంతుడు దూరంగా పోయి వొంటరిగా కూచ్చుని వున్నాడు — (పని ఏగ్గొట్ట డానికేమో.)

జాంబవంతుడు హనుమంతుడి దగ్గిరికి వెళ్ళి — "హనుమంతుడా! మీ అందరిలో నువ్వే గొప్ప వీరుడివి. గరుత్మంతుడితో సమానమైన బలం గలవాడివి," — అంటూ "కీర్తన" ప్రారంభించాడు.

(హనుమంతుడు జాంబవంతుణ్ణి చూడగానే — "అబ్బే! నేను పెళ్ళలేను సుమా!" అని మొహం చిట్లించి వుంటాడు."

అంత ముఖ్యమైన వ్యవహారం జరుగుతోంటే దూరంగా పోయి

పంపోచడమే దానికి వివరణం. అందుకేనేమో హనుమంతుడికి అంత నచ్చజెప్పి కీర్తించవలసి వొస్తోంది) — "నాయనా ! నీ తల్లి అంజన, పూర్వజన్మలో అప్సరస. నీ తండ్రి కేసరి వృత్తముడు (పూర్వ జన్మలో) — ఒకసారి నీ తల్లి మానవరూపం దాల్చి, చక్కగా అలంకరించుకుని, పర్వతంమీద విహరిస్తోంటే, వాయుదేవుడు కామ మోహితుడై ఆమె వస్త్రాలు తొలగించి, ఆలింగనం చేసుకున్నాడు, మహా పతివ్రత అయిన నీ తల్లికి కోపం వొచ్చి— "నా పాతివ్రత్యం భగ్నం చేసే ప్రయత్నం చేస్తున్న దెవరు ?" — అని అడిగింది."

అప్పుడు వాయుదేవుడు — "నిన్ను నేను హింసించను. మన సుతో మోహిస్తున్నాను. నాలాగే గొప్ప వీరుడయిన కొడుకు పుడతాడు నీకు. అతడు ఎంత దూరమైనా దూకగలడు. దాటగలడు" — అని చెప్పాడు. తర్వాత నీ తల్లి మందర పర్వతం గుహలో నిన్ను ప్రసవించింది. ఆ విధంగా నువ్వో కేసరికి క్షేత్రజ పుత్రుడివీ, వాయుదేవుడికి ఔరస పుత్రుడివీ అయ్యావు. *

నువ్వు పుట్టగానే సూర్యుణ్ణి పండనుకుని ఆకాశంలోకి ఎగురుతూ పోయావు. మూడువందల యోజనాలు వెళ్లావు. ఇంద్రుడికి కోపంవొచ్చి నిన్ను వజ్రాయుధంతో కొట్టాడు — (వాడు ఇంద్రుడు కాడు. దుండి

---

* క్షేత్రజ పుత్రుడు అంటే—తనభార్యకు ఇంకో పురుషుడివల్ల పుట్టిన కొడుకు.

ఔరస పుత్రుడు అంటే — తనకు తన భార్యవల్లగాక, ఇంకో స్త్రీవల్ల పుట్టిన కొడుకు.

ఈ విధ పొడుగునా వొచ్చే పాత్రలు, చాలామంది వివాహం చేసుకున్న భార్యా భర్తలకు పుట్టిన కొడుకులు కాదు. అయినప్పటికీ, సమాజంలో అది ఒక ధర్మంగా వుందనే విషయం గమనించాలి. — కొడుకులు, తన తల్లిని వివాహం చేసుకున్న తండ్రినిగాక, తన జన్మకు కారకుడైన తండ్రినే — తన తండ్రిగా గర్వపడుతూ చెప్పుకోవడం కూడా గమనించండి. (హనుమంతుడు వాయుదేవుడికి పవిత్రంగా పుట్టడంలో అనబడు రహస్యం తర్వాత కథలో తెలుస్తుంది.)

గుహ.) ఆ దెబ్బకు నువ్వు కింద పడిపోయావు. చెంప పగిలింది. నీ తండ్రికి కోపం వొచ్చి వీచడం మానేశాడు. ముల్లోకాలూ తలడిల్లి పోయాయి. బ్రహ్మ, ఇంద్రుడూ వొచ్చి నీకు వరాలిచ్చారు. నిన్ను ఆయుధాలేమి చెయ్యలేవు. నువ్వు కోరుకుంటేనే నీకు మరణం కలుగుతుంది. ఆ వరాలకు నీ తండ్రి సంతోషించి, యథాప్రకారం వీచాడు. అందుచేత నీ గమన శక్తి అపారమైనది. నువ్వే సముద్రందాటి సీతను వెతికి రావాలి" — అన్నాడు.

హనుమంతుడు (వుబ్బిపోయి) తన శక్తి తెలుసుకుని, శరీరం పెంచడం ప్రారంభించాడు. పెంచి, పెంచి వాగ్గాటి ప్రారంభించాడు.— "మహా వీరుణ్ణి నేను. వాయుపుత్రుణ్ణి నేను. ఈ భూమండలం తీసుకుపోయి సముద్రంలో ముంచెయ్యగలను. (బలవంతుడెతే చేసేపని అదన్నమాట.) నేను ఎగురుతూ, నా వేగంతో సముద్రం నా వెంటబడేట్టు చెయ్యగలను. సూర్యుడితోపాటే బయల్దేరి, అతడికంటే ముందే అస్తగిరి చేరి, సూర్యుడింకా మధ్యకైనా రాకముందే ఎదురు రాగలను. సీతవున్నశ్రీలంకనే ఇక్కడికి తెచ్చెయ్యగలను" — అంటూ పొంగిపోయాడు.

పొంగి, పొంగి, మహేంద్ర పర్వతం ఎక్కాడు. ఆ పర్వతం మెత్తని వొత్తిలాగ భూమిలోకి నొక్కుకుపోయి, పాతాళంకోంచి జలధారలు పైకిచిమ్మాయి. సమస్తమైన ప్రాణులూ పర్వతంలోపడి నలిగిపోతూ భయంకరంగా ఏడ్చాయి. పాములు బిండలమధ్య బుస్సున పడగలెత్తి పర్వతంనిండా జండాల్లాగ నిలబడ్డాయి.

రుషులూ, గంధర్వులూ, తమ ఆశ్రమాలూ, పానశాలలూ, (కల్లు పాకలు) మాంసాలూ, కల్లు పాత్రలూ, చర్మాలతో తయారుచేసిన డాళ్ళూ, చక్రాని పిడిగల కత్తులూ, గదలూ, విడిచిపెట్టి, భార్యలతో ఆకాశంలో కెగిరి, హనుమంతుడి వీరకార్యం గురించి చెప్పుకుంటూ నిలబడ్డారు.

(— ఇక్కడితో కిష్కింధాకాండ సమాప్తం. తర్వాత సుందరకాండ ప్రారంభం.)

* * *

(ఇక్ష్వాకు మహేంద్ర పర్వతం వర్ణనా, హనుమంతుడు శరీరం పెంచడమూ, సుందరకాండ ప్రారంభంలో కూడా కొంత సేపు జరిగి— అప్పుడు హనుమంతుడు ఎగురుతాడు) —

ఆవిధంగా హనుమంతుడు శరీరం పెంచి, పెంచి, వొక్క ఎగురు ఎగిరాడు.

నీలమేఘంమల్లే రెక్కల పర్వతంమల్లే సముద్రంమీద ఎగురుతూ పోతున్నాడు.

సముద్రుడు హనుమంతుణ్ణి చూసి — "ఇతడు రామకార్యం కోసం పోతూ ఉన్నాడు. నేనుకూడా రామకార్యానికి సహాయం చెయ్యాలి. రఘు వంశస్థుడైన సగర చక్రవర్తి పుత్రుల వల్లనే వృద్ధి అయ్యాను నేను" — అనుకున్నాడు.

సీళ్ళలోవున్న ఒక పర్వతాన్ని పిలిచి — "మైనాకుడా! పాతాళం లోంచి రాక్షసులు పైకి రాకుండా నిన్ను దేవేంద్రుడు ఇక్కడ కాపలా ఉంచాడు. నువ్వు ఎటు అవసరమైతే అటు పెరగ గలవు. రామకార్యం మీద హనుమంతుడు నన్ను దాటుతున్నాడు. నాలో ఉన్నావు కాబట్టి నువ్వు హనుమంతుడికి ఆతిథ్యం ఇవ్వాలి. ఎత్తుగా పైకి పెరుగు. అడుగో! హనుమంతుడు వొచ్చేస్తున్నాడు. నీమీద విశ్రమించి వెళతాడు" — అని తొందర చేశాడు.

అలాగేనని మైనాకుడు దయ్యాల ఆకాశం వరకూ పెరిగిపోయాడు.

హనుమంతుడు ఎదురుగా అడ్డం వొచ్చిన పర్వతాన్ని చూసి తన కార్యానికి అవాంతరం జరుగుతోందని విచారించాడు. కోపంతో పర్వతాన్ని ఒక్క తోపు తోశాడు.

ఆ వీరత్వానికి మైనాకుడు సంతోషించి, మానవరూపం ధరించి (అన్ని మహిమలూ మానవరూపంలోకి రావలసిందే.) — పర్వతంమీద నించుని — "హనుమంతుడా! నీకు నేను శత్రువుని కాను. సముద్రుడు నీకు సహాయం చెయ్యమని కోరాడు. కొంతసేపు నామీద విశ్రమించి, కడుపునిండా పళ్ళు తిని నీ దారిన నువ్వు వెళ్ళు. — నా చరిత్ర చెపు

తాను విను. (ఆగు మరీ ఏవిటా మాకుడూ :) నా పేరు మైనాకుడు. పూర్వం పర్వతాలకు రెక్కలుండేవి. అవి ఎప్పుడూ ఆకాశంలో రయ్యిన ఎగురుతూ వుండేవి. (పిచికలమల్లే) అవి మీద పడిపోతాయే మోనని ఋషులూ, దేవతలూ భయపడిపోతూ వుండేవారు. (పాడు బుద్ధి. వాళ్ళూ ఎగురుతారుగా ?) — ఇంద్రుడికి పర్వతాలమీద కోపం వొచ్చి వాటి రెక్కలు తెగ నరకటం ప్రారంభించాడు. నా రెక్కలుకూడా నరకాలని నా దగ్గిరికి వొచ్చాడుగానీ, నీ తండ్రి వాయుదేవుడు నన్ను సముద్రంలో దాచేశాడు. అప్పట్నించీ ఇక్కడ ఉంటున్నాను. (ఇందాక సముద్రుడేమన్నాడూ ? పాతాళలోంచి రాక్షసులు రాకుండానో, ఏదో అన్నాడా ? అలా అన్నప్పుడు ఈయనకూడా ఊరుకున్నాడా ? ఇప్పుడేమో....అబ్బ! ఎవరు నోరు తెరిచినా అబద్ధాలే) నీ తండ్రి నన్ను రక్షించాడు కాబట్టి, నీకు ఆతిథ్యం ఇచ్చి ఋణం తీర్చుకుంటాను. (లేకపోతే నీ గోల నా కెందుగ్గానీ) నామీద విశ్రమించు" — అని అడిగాడు మైనాకుడు.

హనుమంతుడు సంతోషించి, ఆమాటే చెప్పి — "నే నెక్కడా ఆగనని శపథం పట్టాను. (ఫర్వాలేదు నించుందూ, ఎవరు చూడొచ్చారు?) — ఏమీ అనుకోకు. తొందర కార్యంమీద పోతున్నాను. ఆలశ్యం అయితే చీకటి పడిపోతుంది"—అని మైనాకుణ్ణి చేతితో తాకి, ముందుకు దూసుకుపోయాడు.

దేవతలంతా ఆకాశంలోంచి చాలా కీర్తించారు హనుమంతుణ్ణి.

ఇంద్రుడు మైనాకుణ్ణి మెచ్చుకుని — "మంచిపని చేశావు. ఇక నువ్వు పూర్వం వున్నట్టే స్వేచ్ఛగా ఉండు"—అని అభయం ఇచ్చాడు.

హనుమంతుడు మహా వేగంతో ఆకాశాన్ని ఈదుకు పోతోన్నట్టు దూసుకుపోతున్నాడు.

దేవతలకూ, ఋషులకూ, హనుమంతుణ్ణి పరీక్ష చెయ్యాలనే సరదా కలిగింది — (పనేం వుంది ? తిని తిరగడమేగదా ?) — నాగమాత అయిన సురసను పిలిచి — "సురసా ! నువ్వు భయంకరమైన రాక్షస వేషంతో హనుమంతుడికి అడ్డం వెళ్ళు. ఏం చేస్తాడో చూడాలి" — అన్నారు.

సరస అలాగే భీకర రూపంతో వెళ్ళి — "నిన్ను తినేస్తాను" అంది హనుమంతుడితో.

హనుమంతుడు ఆ భీకర రూపానికి నమస్కారం పెట్టి — దశరథ మహారాజుగారి ఘనకార్యాలతో ప్రారంభించి .... కైక దుర్మార్గం .... రామ వనవాసం ... ఘోరమైన కష్టాలూ .... బంగారు లేడి — సీతాపహరణం . జటాయువు మరణం — వాలి వధల మీదుగా దూకుతూ చివరికొచ్చి — "అదీ విషయం. సీతని వెదకాలి. ఇదంతా రామరాజ్యమే. నువ్వూ రామరాజ్యంలోనే వున్నావు. అందుచేత శ్రీరాముడికి విధేయతగా వుండాలి. నన్ను పోనియ్యి. కాదూ కూడదంటావా.... (రామణి నమ్మనంటావా) ... పోనీ సీతని చూసి, ఆ కబురు రాముడికి చెప్పి వొస్తాను. అప్పుడు తప్పకుండా తిందువు గాని. వొట్టు. మరి వెళ్ళనియ్యి." –అన్నాడు. (ఉత్తది సురసా ! నమ్మకు. మళ్ళీ రాడు. అక్కడ మంత్రి పదవో? ఇప్పుడే తినెయ్యి.) —హనుమంతుడి వొట్టు సురస వొప్పుకోనంది – "కుదరదు. నీ కొక వరం వుంది. నువ్వు నన్ను దాటిపో కూడదు. నా నోట్లోకి రా," – అని నోరు తెరిచింది. (బతిమాలి నోట్లోకి పిలిచే వరం.)

హనుమంతుడు సురస నోటికన్నా పెద్ద శరీరం పెంచాడు. సురస నోరు ఇంకా పెంచింది. హనుమంతుడు కూడా ఇంకా. ఆ విధంగా హనుమంతుడు నూరు యోజనాల వెడల్పు పెరిగాడు. (కిష్కింధకూ, లంకకూ మధ్య దూరం నూరు యోజనాలు) — అలా పెరిగి పెరిగి హనుమంతుడు చటుక్కున బొటన వేలంత అయిపోయి సురస నోట్లో దూరి ఇవతలకు వొచ్చేశాడు.

—"నీ వరం అయిపోయింది. ఇక వెళ్తున్నాను." — అని బయల్దేరాడు.

సురస — సురస రూపం ధరించి — "వెళ్ళు నాయనా ! రామ కార్యం సాధించు." — అంది.

దేవతలంతా సంతోషించారు.

హనుమంతుడు ఆకాశ మార్గాన పోతూ వున్నాడు.
మేఘాలు జలధారలు కురిసే దేశం అది.
గంధర్వులు గానం చేస్తూ తిరిగే లోకం అది.
మనోహరమైన ఇంద్రధనుస్సు నిలిచే స్థావరం అది.
పక్షి వాహనాల మీదా, పులుల వాహనాల మీదా, దేవతలు విహరించే ప్రదేశం అది. స్వర్గవాసులైన మహానుభావు లందరికీ నివాసం అది.

అటువంటి మార్గంలో పోతున్నాడు హనుమంతుడు. సింహిక అనే రాక్షసి హనుమంతుణ్ణి చూసి సంతోషించి, అతని నీడ పట్టుకుంది. ఎదురు గాలికి ఆగిపోతోన్న ఓడమల్లే, హనుమంతుడు ముందుకు కదల లేక పోయాడు. — నీడలు లాగేసే రాక్షసిని గురించి సుగ్రీవుడు చెప్పిన విషయం గుర్తు వొచ్చింది.

(సుగ్రీవుడు చెప్పిన పేరు అంగారక. ఇప్పుడు సింహిక. పైగా దక్షిణ సముద్రంలో ఇలాంటి రాక్షసి వొక్కర్తే వుంది.

— అబ్బే :.... రాసుకోండి కవిగారూ !.... మీకు మాత్రం ఏం గుర్తు వుంటాయి ? — ఎన్ని కోట్ల సంగతులు కల్పించా'లో రామ కార్యం కోసం !)

హనుమంతుడు శరీరం పెంచి, పెంచి హఠాత్తుగా చిన్నదిచేసి, సింహిక నోట్లో జొరబడి, తిన్నగా కడుపులోకి వెళ్ళిపోయి, పేగులు లాగేసి, ఇంకో నోరు ముయ్యకముందే బయటికి వొచ్చేసి, సింహికని తన్ని, సముద్రంలోకి తోసేసి, తన దారిన తను బయలేరాడు.

ఆకాశంలో దేవత లందరూ సంతోషించి, హనుమంతుణ్ణి కీరించారు. (వాళ్ళు కూడా హనుమంతుడితో పాటు లంకకు పోతారేమో.)

హనుమంతుడు ముందుకు సాగిపోయాడు. సముద్రానికి అవతలి తీరం మీద వుద్యానవనాలు కనబడ్డాయి. నూరు యోజనాలూ దాటేశాడు. (లాంగ్ జంప్) — శరీరం తగ్గించుకుని లంబ పర్వతంమీద దిగి లంకా పట్టణం చూశాడు.

• • •

త్రికూట పర్వత శిఖరంమీద వుంది లంకా పట్టణం. దాని చుటూ అగాధమైన అగడ్త (కందకం) వుంది. దానికి రాక్షస వీరులు ఆయుధాలతో కాపలా కాస్తున్నారు. దాని రక్షణ ఏర్పాటు చూసి హనుమంతుడు నిరుత్సాహ పడిపోయాడు. "రావుడు వొస్తే మాత్రం ఈ లంక నెలా జయించగలడు?"— అనుకున్నాడు. (అవును మరి. ఏ మాట కా మాటే అనుకోవాలి.) అసలు ఇక్కడికి అంగదుడూ, నీలుడూ, సుగ్రీవుడూ, నేనూ తప్ప ఇంకెవ్వరూ రానేలేరు మరి, కార్యం ఎలా నెరవేరుతుందో!"—అని కొంచెంసేపు దిగులు పడ్డాడు. —"సరే! ముందు సీతకోసం వెతుకుతాను. అసలు కార్యం పాడు చెయ్యను. మూర్ఖులవంటి దూతలు కొందరు కార్యాలు సర్వనాశనం చేస్తారు. నే నలా చెయ్యను. లంకలో రాత్రివేళ ప్రవేశిస్తాను." —అని దూరంనించి పట్టణం చూస్తూ లంబి పర్వతం మీద తిరుగుతూ కాలం గడిపాడు.

రాత్రి అయింది. హనుమంతుడు పిల్లి అంత అయిపోయి లంక వీధుల్లో పడ్డాడు. — విశాలమైన రాజ మార్గాలు (లేకపోతే రాక్షసులు పట్టరు కదా!) — ఎంతో ఎత్తయిన మేడలు. ఏడంతస్తులవీ, ఎనిమి దంతస్తులవీ కూడా వున్నాయి. అన్నీ బంగారమే. — (కవిగారికి బొత్తిగా పక్షపాతం లేదు. శత్రువుల ఇళ్ళు కూడా బంగారంతోటే కడుతున్నారు.) — ఇళ్ళ ముందు అరుగులూ, దారులూ అంతా బంగారమే. — (ఆ సమానూ చెప్పను. ఇల్లో, అరుగో, చెట్టో, గోడో ఏంవొచ్చినా బంగారందే అనుకోండి. బంగారం వొక్కటే కాదు. దానిమీద వజ్రాలు, తాపడం చేసి వుండాలి. వొక్కోసారి రత్నాలు. మీ ఇష్టం. మీ కేది కావాలంటే అదే తాపడం చేసుకోండి.) — లంక నిండా ఇళ్ళకు ముత్యాల దండలూ, బంగారం తోరణాలూ కట్టారు. (చూశారా? ఇలాగే అన్నమాట.)

హనుమంతుడు శ్రీరాముడి పరాక్రమం గుర్తు తెచ్చుకుని లంక ఆక్రమించ గలడని సంతోషించాడు. — "కుముదుడూ, అంగదుడూ,

మైందుడూ, ద్వివిధుడూ, రుక్షుడూ, కుశపర్వుడూ, కేతుమాలుడూ, సుగ్రీవుడూ, నేనూ మాత్రమే ఈ లంకలో ప్రవేశించగలం," అనుకున్నాడు. *

చంద్రోదయం అయింది. — తెల్లగా, రాజహంసలా, ముద్దుగా వున్నాడు చంద్రుడు.

లంకా పట్నం ఒక దేవత రూపం దాల్చి వీధుల్లో తిరుగుతోన్న హనుమంతుణ్ణి చూసింది.

"ఎవడు నువ్వు ?"— అని గర్జించింది.

"నువ్వెవరు ?" —అన్నాడు హనుమంతుడు.

---

* సుందరకాండ — 2 వ సర్గ 31 వ శ్లోకం.

లంకకు ఎవరెవరు వెళ్ళగలరో హనుమంతుడు అనుకుంటున్నాడు చూడండి —

—"పరాక్రమ కాలులగు వానరులలో, నాలి స్వక్రమముగు అంగదుడూ, నీలుడూ, వీరుడంతటగు సుగ్రీవుడూ, నేనూ, — ఈ నలుగురము మాత్రమే లంకకు వచ్చుటకు శక్తిగల వారము."

3 వ సర్గలో — 15, 16 శ్లోకాలు.

ఈసారి లంకకు ఎంతమంది పోతున్నారో చూడండి. ఇది కూడా హనుమంతుడు అనుకునేదే —"కుముదుడూ, అంగదుడూ, మైందుడూ, ద్వివిధుడూ, సుషేణుడూ, సుగ్రీవుడూ, కుశపర్వుడూ, రుక్షుడూ, కేతుమాలుడూ, నేనూ, ఇతరులకు శక్యంగాని ఈ లంకలో ప్రవేశించి చూడగలము."—

చూశారా ? మొత్తం 10 మంది. — ఇందులో సుషేణుడు 60 యోజనాలు మాత్రమే దూకగలనని చెప్పాడు—అంగదుడు అడిగినప్పుడు. ఇక, మొదటి లిస్టులో వున్న "నీలుడు" — ఈ రెండో లిస్టులో లేనే లేడు. — కవిగారు ఈ శ్లోకం రాయడానికి మొదలుపెట్టినప్పుడు ఏవో పేర్లు జ్ఞాపకం వొస్తే వాళ్ళంతా లంకకు పోగలుగుతారు. మిగతా వాళ్ళెవ్వరూ పోలేరు. అదిన్నమాట లంకకు పోయే రహస్యం.

"లంక దేవతని" — అంది లంక దేవత. (అంత గర్జింపూ ఏమైందో తనే ముందు చెప్పేసింది.

"సరే : ఒడిగావు కాబటి నిజం చెపుతాను. లంక చూడాలని వొచ్చాను. అంతే. చూసి వెళ్ళిపోతాను." - అన్నాడు హనుమంతుడు.

లంక దేవత కిళ్ళెర్రజేసి— "ఏల్లేదు. నన్ను జయించకుండా లంక చూడ్డానికి వీల్లేదు," అని హనుమంతుణ్ణి ఒక్క చరుపు చరిచింది.

హనుమంతుడు లంక దేవతని వొక్క పోటు పొడిచాడు. లంక దేవత కింద బడిపోయి — "రక్షించు వానరుడా : నన్ను చంపకు. స్త్రీని. నీ ఇష్టం వొచ్చినట్టు సంచరించు. నాకు పూర్వం బ్రహ్మ చెప్పనే చెప్పాడు— "ఒక వానరుడొచ్చి నిన్ను జయించినప్పుడు లంకకు కీడు మూడిందని గ్రహించు," —అన్నాడు. అలాగే జరిగింది. లంకకి నందికేశ్వరుడు శాపం పెట్టాడు. (రావణుడు ఆయన పెళ్లాన్ని కూడా ఎత్తుకొచ్చాడు గావున్ను.) దుర్మార్గుడైన రావణుడి మూలంగా రాక్షసజాతి అంతా నశించి పోతుంది. నీ ఇష్టం వొచ్చినట్టు తిరుగు. సీతని వెతుక్కో," —అని నమస్కారం పెట్టింది.

హనుమంతుడు గుమ్మంలోంచి గాకుండా, శత్రువులు ప్రవేశించే విధంగా ప్రాకారం దూకి, ఇంకా లోపల ప్రవేశించాడు. ముందు ఎడం కాలు పెట్టాడు.

రాజమార్గాలన్నీ రత్నాలతో, ముత్యాలతో అలంకరించి వున్నాయి.

హనుమంతుడు ఇళ్ళ మీదనుంచి దాటుతూ పోతున్నాడు. మేడలోంచి, మంగళ వాద్యాలు వినబడుతున్నాయి. స్త్రీలు పాడుతున్నారు. అందెలూ, వడ్డాణాలూ గాజులూ గలగల లాడుతోన్న చప్పుళ్ళు, కొందరు వేదపఠనం చేస్తున్నారు. కొందరు రావణ స్తోత్రాలు చదువుతున్నారు. కొందరు పూజలు చేస్తున్నారు. కొందరికి వొక్కొక్క కన్నే. కొందరికి వొక్కొక్క చెవే. కొందరికి వొక్కొక్క కాలే. (రావణుడు చేయించిన యుద్ధాలలో కాళ్ళూ, చేతులూ, కళ్ళూ, ముక్కులూ, పోయి బతికి బయిటపడ్డ ప్రజలేమో :) — కొందరు రాక్షసులు

అందంగా వున్నారు. మధుపానం చేసి కులాసాగా కాలక్షేపం చేసు న్నారు స్త్రీ పురుషులు. కొందరు స్త్రీలు మెరిసిపోతూ చంద్రవంకలే మల్లే వున్నారు. కొందరు స్త్రీలు పూలరేకుల మల్లే, కొందరు స్త్రీలు నగ్నంగా. కొందరు వివశంగా, కొందరు పరవశంగా. కొందరు స్త్రీలు ప్రియులకోసం పోతూ వున్నారు. కొందరు తమ గృహాలలోనే ప్రియులతో విలాసంగా వున్నారు.

హనుమంతుడు, సీత కోసం విభీషణుడి మేడా, కుంభకర్ణుడి మేడా, ఇంద్రజిత్తు మేడా— ఇంకా అనేక వేల మేడలు చూశాడు. ఎక్కడా సీత లేదు.

(హనుమంతుడికి దృష్టిలోపం వుందేమో అన్న సందేహం వొస్తుందని — "ఎంత చిన్న వొస్తువునైనను, ఎంత దూరమునుంచి యైనసూ చక్కగా చూడగల దృష్టి, తేజస్సు గల హనుమంతునకు సీత గనపడలేదు" — అంటున్నాడు కవి. — అంచేత ఆ సందేహానికి తావు లేదు.)

అన్ని గృహాలూ చూసి రావణ మందిరాని కొచ్చాడు హనుమం తుడు. (ఇంతకు ముందు కూడా ఒకసారి ఇక్కడికి వొచ్చి, మళ్ళీ హఠాత్తుగా ఇంకో ఇంటిమీదకి దూకారు కవిగారు హనుమంతు ణ్ణేసుకుని.)

రావణుడి మందిరం ఒక పర్వత శిఖరాన వుంది. దాని చుట్టూ అగడ్త. అగడ్త తర్వాత ఎత్తయిన ప్రాకారాలు. ప్రాకారాలన్నీ బంగా రమే. ప్రాకారాల చుట్టూ ఎందరో సేనాపతులు కాపలా కాస్తున్నారు. బంగారపు రథాల మీద. వారి కెన్నడూ శ్రమ తెలియదు. బాధ తెలి యదు. — (అవును. రాజుగారికి కాపలా కాయకుండా ఇంటివగిర విశ్రాంతిగా వుంటేనే చాలా బాధ కలుగుతుంది.)

ఆ సేనాపతుల కార్య కలాపాలు కనిపెట్టడానికి ఎందరో గూఢ చారులు కూడా వున్నారు. (వాళ్ళ మొహం గూఢచారులు. శత్రువొచ్చి అలా తెగ తిరుగుతోంటే కనిపెట్టలేని పాపచారులు.)

రావణుడి భవనం చుట్టూ వేలకొద్దీ గుర్రాలూ, ఏనుగులూ, రథాలూ వున్నాయి. ఏనుగుల్లో నాలుగేసి దంతాలు గల ఏనుగులు కూడా వున్నాయి. ఎటు చూసినా దంతపు విమానాలే. ఎటు చూసినా బంగారపు ఆసనాలే. ఎటు చూసినా రత్న సోపానాలే.

రావణుడి భవనంలో అనేక మందిరా లున్నాయి. క్రీడా శాలలు మధ్యపాన శాలలు ; ఉదయం వేళల్లో నివసించే గృహాలు ; .... మధ్యాన్నం వేళల్లో నివసించే గృహాలు ; .... సాయంత్రం గృహాలు ; రాత్రి గృహాలు ; అర్ధరాత్రి గృహాలు ; —

(రోజంతా ఇళ్ళు తిరగడంతో సరిపోతుంది రాజుగారి పని. ఒక ఇంట్లోకి పోయి కూర్చోగానే— "లేవండి మహారాజా! మధ్యాన్నం అయింది." — అంటారు దాసీలు. మళ్ళీ ఇంకో ఇల్లు— "లేవండి మహారాజా ; ....")

చిత్రశాలలన్నీ చూశాడు హనుమంతుడు. ఆయుధ శాలలు చూశాడు. ధన కనక రత్నరాసులున్న చంద్రశాలలు చూశాడు. సమస్త లోకాల ఐశ్వర్యం అంతా రావణుడి చగ్గిరే వుంది.

పుష్పక విమానం ఎక్కాడు హనుమంతుడు. అంతా బంగారం ముద్దే. (సరే ; తెలుసులే.) ఆ విమానంలో వున్న ఐశ్వర్యం, గొప్ప తనం ఇంతా అంతా కాదు. మణులు తాపడం చెయ్యని చోటు ఎక్కడా లేదు. ఎన్నెన్నో కాంతులు, చిత్రాలు, ఆకాశం, నక్షత్రాలు, సముద్రాలు, భూమండలం అంతా చెక్కారు.

తామర పువ్వులో బ్రహ్మ కూర్చున్న చిత్రం చెక్కారు. (బ్రహ్మ జారి నీళ్ళల్లో పడ్డ చిత్రం!) —ఋషుల చిత్రాలు, దేవతల చిత్రాలు. పుష్పక విమానంలో ఎక్కినవారు ఎలా వెళ్ళమంటే అలా వెళ్తుందది.

(ఇద్దరెక్కి చెరో వేపూ వెళ్ళమంటే!) —ఆ విమానం అక్కడ పుంటే, దాని అందంతో, వైభవంతో, స్వర్గ పట్టణం వొకటి భూమి మీద దిగినట్టుగా వుంది.

హనుమంతుడు విమానం అంతా వెతికాడు. సీత లేదు.

రావణుడు భార్యలతో కలిసి నిద్రిస్తోన్న అంతఃపురం మనోహరంగా వుంది. కన్నుల పండువుగా వుంది. రావణుడి భార్యలు వేలకొద్దీ వున్నారు. (శత్రువులు ఎంతమందిని ఎత్తుకుపోయినా ఫరవాలేదు. ఇంకా బోలెడుమంది వుంటారు.)

అందులో కొందరు రావణుడు పెళ్ళిచేసుకున్న భార్యలే. కొందరు స్త్రీలని, వారిపై మోహం వుండి గాక, వారి బంధువులతో శత్రుత్వం వుండి ఎత్తుకు వొచ్చాడు రావణుడు.

రత్న కంబళ్ళమీద వేలకొద్దీ సుందరాంగనలు నిద్ర పోతున్నారు. అందరూ పద్యం సేవించి, ఆడిపాడి, అలిసి, సరస్సులో పువ్వులమల్లే వున్నారు. వారి ఆభరణాలూ, వస్త్రాలూ, పూల మాలలూ, చెల్లా చెదురుగా పడివున్నాయి. బటలు లేని వారి తొడలూ, నడుములూ స్తనాలూ నదులలో కనిపించే ఇసక తిన్నెలలా వున్నాయి. స్త్రీలంతా వొకరిచేతుల మీద వొకరు చేతు లేసుకుని, వొకర్ని వొకరు అలుకుని పూలచండలా వున్నారు. (ఒక్క పురుషుడి కోసం వేలకొద్దీ స్త్రీలు! — వాళ్ళ జీవితల్లో ఎంత సౌందర్యం చూస్తున్నాడో కవి!)

వారిలో రాక్షస స్త్రీ లున్నారు. (రాక్షసులు కూడా అందంగానే వుంటారన్న మాట. కవిగారి కెందుకో మరి శూర్పణఖే చాలా కురూపిగా కనపడింది.)

మానవ స్త్రీ లున్నారు. గంధర్వ స్త్రీ లున్నారు. (సీత కూడా వుంటే ఒక మూల పడుకుని వుండేది.) ఈ స్త్రీలలో వొక్కర్ని కూడా రావణుడు బలాత్కరించి తేలేదు. (అప్పుడే పరగడుపు) అందరూ రావణుడి సౌందర్యాన్ని మెచ్చి వొచ్చినవారే. (కవి దృష్టిలో రావణుడు దుష్టపాత్ర అయినప్పటికీ, స్త్రీల విషయం వొచ్చేసరికి మాత్రం, కవి. రావణుణ్ణి స్త్రీలకన్నా మహోన్నతుణ్ణి చేస్తున్నాడు.) — ఆ స్త్రీలలో వొక్కరూ తక్కువ వంశస్థులు కారు. వొక్కరూ కురూపులు కారు. ఎవ్వరూ భర్తకు శుశ్రూష చెయ్యని వారు లేరు. అందరూ పతివ్రతలే. అందరూ అందగత్తెలే. అందరూ యవ్వన వతులే. (వున్నత వంశం,

అందం, యౌవ్వనం, పాతివ్రత్యం— ఇవే స్త్రీల కుండవలసిన లక్షణాలు.)—

ఆ స్త్రీ లెవ్వరూ నీతి తప్పరు. భర్తను తప్ప ఇతర పురుషుల్ని ప్రేమించరు. (భర్త మాత్రం వేలకొద్దీ స్త్రీలని కామిస్తాడు — భార్యని తప్ప. అదే గొప్ప నీతి.) రావణుడు తీసుకొచ్చిన స్త్రీలలో సీత తప్ప పెళ్ళయిన వారెవ్వరూ లేరు. (సీతని కూడా పెళ్ళికి ముందే తీసుకొస్తే, రావణుడితో నిక్షేపంలా వుండేది. రాముడి గొప్పేమీ లేదు.)

రావణుడు ఒక సుందరమైన శయ్యమీద పడుకుని నిద్రపోతున్నాడు. ఆ మంచానికి చుట్టూ బయటవేపు దంతం. లోపల బంగారం. (బంగారమే బయటకి వుండాలి కవిగారూ : అందరూ చూస్తారు.) ఆ మంచం ఎక్కడానికి బంగారం మెట్లు .... మంచంమీద పట్టుతో, జలతారుతో చేపిన పందిరి. మంచం దగ్గిరే కుర్చీలు. (అది దిగడానికి బోలెడు శ్రమ. మంచం దిగి విశ్రాంతి తీసుకోవాలి మరి)

దాని మీద రావణుడు, ఆభరణాలు మెరుస్తూ, నీలాకాశం మళ్లే వున్నాడు. పూల చెట్లతో నిండిన మందర పర్వతం మళ్లే వున్నాడు. సెలఏట్లో ఈదులాడే మదపుటేనుగు మళ్లె వున్నాడు.

అతని భుజాలు యుద్ధాలలో తిన్న దెబ్బలతో కాయలు గాచి వున్నాయి. అతని చేతులు ఐదు తలల సర్పాల్లా వున్నాయి. అతడు గుహలో నిద్రించే మహా సర్పంలా బుస కొడుతున్నాడు. (అదే! గుర్రు) — తల మీద కిరీటం కొంచెం వొరిగి వుంది. (పది తలలు కవిగారూ: కొంచెం గుర్తు తెచ్చుకోండి. ఇంకా తొమ్మిది కిరీటా లుండాలి.) — ఆభరణాలు చెదిరి వున్నాయి. భార్య లందరూ కాళ్ళ దిక్కున ఉన్నారు. (కాళ్ళ దిక్కున :) హనుమంతుడు రావణుని భార్యల్ని చూసి "ఇన్నివేలమంది స్త్రీలు భర్తతో సుఖభోగా లనుభవిస్తున్నారు. శ్రీరా

ముడి భార్య కూడా భర్తతో ఇలాగే సుఖంగా ఉంటే ఎంత బాగుండేది!" — అనుకున్నాడు. *

---

* 9వ సర్గ — 72 వ శ్లోకం.

ఇక్కడ హనుమంతుడు అనుకున్న విషయం గురించి కొన్ని భేదాభిప్రాయా లున్నాయి.

"సీత కూడా రావణుడితో సుఖంగా వుంటే బాగుండేది."— అని హనుమంతుడు అనుకున్నట్టు కొందరూ, — "సీత పెళ్ళికిముందే, రావణుణ్ణి పెళ్ళి చేసుకుని వుంటే బాగుండేది,"— అని హనుమంతుడు అనుకున్నాడని కొందరూ అభిప్రాయ పడ్డారు.

సరిగ్గా ఈ శ్లోకానికి అర్థం ఏమిటంటే —

—"రాఘవ ధర్మపత్ని కూడా, రావణుని భార్యల వంటిదే కాబట్టి, వారిలాగానే ఈమె కూడా అయితే బాగుండెడిదని సాధుబుద్ధి గల హనుమంతునకు ఆలోచన కలిగెను,"— అని.

ఇక్కడ— "ఈమె కూడా వారిలాగానే అయితే" – అనడంలో —"వారు ఎలాగైతే సుఖంగా వున్నారో, ఈమె కూడా అలాగే సుఖంగా వుంటే" – అని అర్థం. అయితే, ఆ సుఖంగా వుండడం "రావణుడితో" అని అర్థం తియ్యడానికి ఆస్కారం లేదు. "రాఘవ ధర్మపత్ని" — అనే మాట వాడిన తర్వాత – "రాఘవ ధర్మపత్ని రావణుడితో సుఖంగా వుండాలని" — అనుకోవడంలో అర్థం లేదు. పైగా హనుమంతుడు సాధుబుద్ధి గలవాడనే ఇంకో విశేషం కూడా వుంది.

సాధుబుద్ధి గలిగిన హనుమంతుడు, రాఘవ ధర్మపత్నిని "రావణుడితో వుంటే బాగుండేది," అని అనుకొన్నాడని అర్థం తియ్యడం చాలా పొరపాటు అవుతుంది.

అందుచేత –"ఈమె కూడా రావణుని భార్యల లాగానే అయితే" – అనడంలో న్యాయమైన అర్థం – "రావణుని భార్యలు సుఖపడుతోన్నట్టే, ఈమె కూడా తన భర్తతో సుఖపడితే" – అన్నదే అవుతుంది. అంతే గాక, ఈ శ్లోకానికి తర్వాత వున్న శ్లోకంలో – "రావ

దూరంగా ఇంకొక శయ్యమీద ఒక అందమైన స్త్రీని చూశాడు. ఆమె మండోదరి. సీతే అనుకుని చాలా సంతోషపడ్డాడు. మళ్ళీ సందేహంలో పడ్డాడు — "సీత మహా పతివ్రత. ననాతనంగా పాతివ్రత్యం ఆచరించే వంశంలో పుట్టింది. తన భర్తతో తప్ప పర పురుషుడితో శయనించదు"—అనుకున్నాడు.—"నేనిలా స్త్రీలను చూడవొచ్చునా?" — అని విచారించాడు. మళ్ళీ — "నా దోషం లేదు. నా మనసు నిర్మలమే. ఒక స్త్రీ కోసం, స్త్రీలమధ్య వెతకక తప్పదు కదా!" — అని విచారం పోగొట్టుకున్నాడు.

ఎంత వెతికినా సీత కనపడలేదు. లంకలో నాలు గంగుళాల సలం కూడా వెతకకుండా విడిచింది లేదు.

సీత కనపడలేదని హనుమంతుడు ఆలోచనలో పడ్డాడు. — "సీత మరణించే ఉంటుంది. లేకపోతే రావణుడు కోపంతో చంపేసి ఉంటాడు. సీత కనబడలేదని చెపితే రాముడు జీవిస్తాడా? తప్పకుండా కన్ను మూస్తాడు. (మూసినా, మళ్ళీ బాగానే తెరుస్తాడు. చాలాసార్లు మూర్ఛపోయేటట్టుగానీ, చప్పున తేరుకున్నాడు.) — రాముడు కన్ను మూస్తే లక్ష్మణుడూ కన్ను మూస్తాడు. తర్వాత భరతుడూ మూస్తాడు. తర్వాత శత్రుఘ్నుడు. తర్వాత వెంటి తల్లులందరూ. తర్వాత అయోధ్యలో ప్రజలందరూ.

ఇక కిష్కింధలో — సుగ్రీవుడు కన్ను మూస్తాడు. రుమా, తారా, అంగదుడూ కన్ను మూస్తారు. నేనూ కన్నుమయ్యాక తప్పదు. కిష్కింధలో ప్రజలందరూ రాజుకోసం చచ్చిపోతారు. — పర్వతాల

(ఫుట్‌నోట్ : 373 వ పేజీ తరువాయి)

ణుడు, మహా పతివ్రత అయిన సీతను తీసుకువొచ్చి నీచులు చేసే పని చేశాడు," – అనుకున్నాడు హనుమంతుడు.

దానివల్ల కూడా– "సీత రాముడితో సుఖపడాలని" హనుమంతుడు అనుకున్నాడు" – అనే విషయం సందేహం లేకుండా రుజువవుతుంది.

మీద నుంచి ఉరికి కొందరూ, ఉరిబోసుకుని కొందరూ, కత్తులతో పొడుచుకుని కొందరూ, విషం తాగి కొందరూ, తలలు బద్దలు గొట్టుకొని కొందరూ — అందరూ నశించిపోతారు. ఈ విధంగా రాముడి కోసం అందరూ ప్రాణాలు విడుస్తారు. *

ఒకవేళ వారు మరణించకపోయినా రాముడే వానరు లందర్నీ

---

* 13 వ సర్గ — 13 నించి 38 వరకూ.

హనుమంతుడు రాముడి దగ్గరికిపోయి సీత కనపడలేదని చెపితే ఏం జరుగుతుందో చూడండి.

"అప్రియమైన మాటను నేను జెప్పినటులైతే రాముడు ప్రాణము విడుచునేగాని, జీవించి యుండడు. రాముని జూచి బుద్ధిమంతుడగు లక్ష్మణుడు జీవింపడు. రామ లక్ష్మణుల మరణమును విని భరతుడు జీవింపడు. భరతుని మరణమును జూచి శత్రుఘ్నుడు జీవింపడు" — ఈ రకంగా అయోధ్యలో మరణ ప్రకరణం కొంతసేపు సాగింది. తర్వాత కిష్కింధలో —

"దురవస్థను బొందిన రాముని జూచి, సత్యసంధుడగు సుగ్రీవుడు ప్రాణము విడుచును. (చుట్టపొగ విడిచినట్టే నన్నమాట ప్రాణం విడవడం.) రుమ పెనిమిటి మరణమునకు ప్రాణము విడుచును. తార శోకాక్రాంతురాలై ప్రాణము విడుచును. ఇక అంగదు డెట్లు ప్రాణము పెట్టుకొని యుండును? — వానరు లందరూ రాజు పోయిన దుఃఖము గలవారై, పర్వత శిఖరములనుండి గుంపుగూడి క్రిందపడి ప్రాణములు విడిచెదరు. అరచేతులతోనూ, పిడికిళులతోనూ, తలలు పగులకొట్టుకొందరు. విషము తిని, ఉరి బోసుకుని, అగ్ని ప్రవేశము జేసి, ఆహారమును వదలి, కత్తులపై బడి ప్రాణములు విడిచెదరు." — అదండీ సంగతి: — అయోధ్య, కిష్కింధా కూడా సర్వనాశనం అయిపోతాయట రాముడు లేకపోతే:

ఒకసారి రాముడు చచ్చిపోతే బాగుండును. అలా జరుగుతుందో లేదో చూసేవాళ్ళం.

చంపేస్తాడు. (హమ్మయ్య ! రాముడు చచ్చిపోడన్నమాట.) అందుచేత నే నసలు కిష్కింధకు పోనే పోను .... అదుగో ! అశోకవనంలా కన బడుతోంది. అదీ చూస్తాను. (ఇందాక నాలు గంగుణాల చోటన్నా వెత కక్కుండా ఒదల్లేదన్నారే కవిగారూ ? — పోనీ "చాలా చోట్ల వెతికాడు. సీత కనపడలేదు" — అంటే బాగుండేది కదా ! దశరథుడికి సత్య వ్రతం ఉన్నట్టు మీకు అసత్య వ్రతం ఉందా ఏమిటి ? — సరే. చెప్పండి.)

హనుమంతుడు అశోకవనం ప్రాకారా లెక్కాడు.

ఆ వనంలో ఎన్నెన్నో ఉపవనా లున్నాయి. పర్వతా లున్నాయి. సరస్సు లున్నాయి. మేడ లున్నాయి. (సరే ! మేడలన్నీ బంగారమే.) — చెట్లూ బంగారమే. ముందు హనుమంతుడు సీతని వెతకడానికి చెట్లనిండా పక్షుల్ని లేవగొట్టాడు. (సీత గూళ్ళల్లో ఉంటుందా ?) పక్షులు నిద్రకళ్ళతో లేచి గోలగోల చేస్తూ ఎగిరాయి. (ఎంత తెలివైన దూతో !) పక్షుల ఎగురుళ్ళతో పూలన్నీ రాలిపడి హనుమంతుడు వసంతుడయ్యాడు. (హనుమంతుణ్ణి వసంతుణ్ణి చెయ్యాలంటే పక్షుల్ని లేపక్కర్లేదు. గాలిని వీచించినా సరిపోతుంది) — ఆ వనంలో నేలనిండా బంగారం రేకులు తాపడం చేశారు. (జ్రరున జారిపడ్డానికి.) వనంలో ఎన్నో దిగుడుబావులు — రత్నాలమెట్లతో. సెలయేళ్ళలోకి చెట్లకొమ్మలు వాలి, ప్రవాహాన్ని ఆపుతూ, భర్తను విడిచిపోయే భార్యను ఆగమని బంధువులంతా బతిమాలుతోన్నట్టున్నాయి. ఎక్కడి కక్కడ బంగారు వేదికలున్నాయి. వాటిమీద గొడుగులు. లతలు .... కల్ప వృక్షాలతో అశోకవనం ఇంద్రుడి నందన వనంలాగా, కుబేరుడి చైత్రరథంలాగా, గంధమాధన పర్వతంలాగా వుంది. (చక్కగా, అంత బాగుంటే అక్కణ్ణించి రావడం ఎందుకమ్మా ?)

హనుమంతుడు వొక శింశుపా వృక్షం మీద ఎక్కి చుట్టూ చూశాడు. (శింశుపా వృక్షం అంటే ఇరుగుడు చెట్టు అని నిఘంటువు చెప్పే అర్థం.) — దూరంగా ఒక మేడ కనపడింది. (సరే ! దాని

అరుగులూ.... కిటికీలూ.... అబ్బ! బంగారం అంటే కడుపులో తిప్పుతోంది.)

ఆ మేడలో ఒక సౌందర్యరాశి కూర్చుని వుంది. ఆమె చాలా కృశించి వుంది. (అయ్యో! కృశించి వుండా? పురి రాసు దొప్పు కుంటూడా? బిసి వుండాలే ఆయనకి.) అయినా చంద్రరేఖ మళ్లే అందంగా వుంది. (ఓహో! అందంగానే వుంది కదా?) — స్నానం, అలంకారం లేక మలినంగా వుంది. అయినా బురద అంటిన పద్మం మళ్లే కాంతిగా వుంది.

(పతివ్రత కాబట్టి భర్త లేనప్పుడు స్నానం చేసి సుఖంగా వుండ కూడదు. మళ్ళీ అందంగా మాత్రం వుండాలి.)

ఆ స్త్రీ తల వొంచుకుని దుఃఖిస్తోంది. ధ్వనిస్తోంది.

ఆమె సీత అనుకున్నాడు హనుమంతుడు. ఋష్యమూకం మీద వున్నప్పుడు రావణుడు తీసుకు పోతోండగా చూసిన రూపం గుర్తు కొస్తోంది. అప్పుడు చూసిన పసుపు పచ్చని చీరె ఇప్పుడు ఆమె ధరించి వుంది. కొన్ని కొన్ని నగలు లేక ఆమె బోసిగా వుంది.

ఆమె చుట్టూ రాక్షస స్త్రీలు ఆయుధాలతో కాపలా కాస్తున్నారు. వారు మహా వికృతంగా వున్నారు. కొందరికి చప్పిడి ముక్కులు, కొందరికి బొర్ర ముక్కులు, కొందరికి ముక్కులే లేవు. — కొందరికి చేటు చెవులు. కొందరికి చెవులే లేవు. కొందరికి ఏనుగు పాదాలు, కొందరికి పాదాలే లేవు. కొందరు పొట్టీ, లావూ, కొందరు పొడుగూ — సన్నం. కొందరికి బోడిగుళ్ళు. కొందరికి కంప జుట్టు. కొందరు ఒంటెలా వుంటే, కొందరు గూనితో మనుగుజ్జులు. కొందరివి చేటు లంతంత మొహాలు. కొందరివి కుక్క మొహాలు. కొందరివి నక్క మొహాలు. కొందరివి ఏనుగు మొహాలు. — కొందరివి సింహం మొహాలు. (కవిగారు తమ కొచ్చిన వ్యతిరేక పదాల వ్యాకరణ పాఠం అంతా ఈ ఘట్టంలో ఛందోబద్ధంగా వుపయోగించారు.)

అటువంటి రాక్షస స్త్రీల మధ్య వున్న సీత భూమికి జారిన నక్షత్రం మళ్లే మెరిసిపోతోంది.

(సీత, సమస్త అవయవాలూ చూశాడు హనుమంతుడు. గుండ్రని స్తనాలూ, సున్నని తొడలూ, రమ్యమైన అరికాళ్ళూ — కూడా చూశాడు. — ఏం చేస్తాం మరి:)

"సీత సౌందర్యరాశి. మహా పతివ్రత. పతి దర్శనానికే నిరీక్షిస్తోంది. నరకుల బిరువుతో ఓడ, సముద్రంలో మునిగి పోయినట్లు, పతి వియోగంతో సీత దుఃఖ సముద్రంలో మునిగిపోయి వుంది.

"అయ్యో! ఇటువంటి భార్యను విడిచి ఇంతకాలం రాముడు ఎలా వుండగలిగాడో గదా! (మాకూ అదే సందేహం.)

రాముడికి రాజ్యం ఎలా పరిపాలించాలో, ఏనుగుల్ని, గుర్రాల్ని ఎలా లొంగదియ్యాలో చక్కగా తెలుసు గానీ, భార్య నెలా ప్రేమించాలో ఏమీ తెలిసినట్లు లేదే! అందుకే నిశ్చింతగా జీవించి వున్నాడు.

"ఈ సీత ఎక్కువా? త్రిలోక రాజ్యాధిపత్యం ఎక్కువా?" అంటే సీత ఎక్కువ. సీత ముందు త్రిలోక రాజ్యాధిపత్యం పదహారో వంతుకైనా సరితూగదు. — ఎంత గొప్పవారికైనా విధి విధానం తప్పదు గదా! * —శ్రీరాముడు మహాశక్తి సంపన్నుడు. తన దుఃఖ

---

* 15 వ సర్గ — 58 వ శ్లోకం.

"శ్రీరాముడు గజాశ్వములను శిక్షించుటలోనూ, రాజ్య పరిపాలన సేయుటలోనూ సమర్థుడే గాని, భార్య మీద ప్రేమాతిశయ మున్నదని అతనికి విశద పడలేదు." —

15 వ సర్గ — 14 వ శ్లోకం.

"మూడు లోకములలోనూ రాజ్యము సేయుట మేలా? సీత మేలా? యనుటలో మూడు లోకముల ప్రభుత్వము సీత ఎదుట పదహారవ భాగమైనను కానేరదు." — ఇలా అనుకున్న హనుమంతుడు — రాముడి విషయంలో అపార్థంతో వున్నాడని అర్థం చేసుకో కూడదు.

మంత్రా నహించి, అతిక్రమించ గలిగిన పరాక్రమ వంతుడు. రాజ్య భ్రష్టుడైన రాజు మళ్ళీ రాజ్యం పొందినట్టు, సీతను చూడగానే మిక్కిలి సంతోషిస్తాడు." — అని సంతోషించాడు హనుమంతుడు.

నెమ్మదిగా తూరుపు ఎర్రబారుతోంది.

చీకట్లు విరిగి తెల్లవారుతోంది.

★

సీతా రావణులు

(ఈ కథ చదివేముందు ఒక ముఖ్య విషయం. రావణుడి దగ్గిర సీత చాలాకాలం వుంది. రావణుడు సీతని బలాత్కరించాడా? లేదా? అనే ప్రశ్న వొకటి వొస్తుంది.

వాల్మీకి రామాయణంలో — సీతని రావణుడు బలాత్కరించ లేదు. —సీత మహా పతివ్రత కాబట్టి, ఆమె సౌశీల్యవతిగానే వుండాలి కాబట్టి, కవి రావణుడికి శాపం వొకటి తయారుచేశాడు. యుద్ధకాండలో — 19 వ సర్గలోనూ, ఉత్తరకాండలో 26 వ సర్గలోనూ, — ఈ శాపం సంగతి వుంది.

రావణుణ్ణి సీత అంగీకరించడం లేదని విని, మహాపార్శ్వుడనే రావణుడి మంత్రి, రావణుడికి — "కోడిపుంజు న్యాయంతో (కుక్కుట న్యాయం.) సీతని బలాత్కరించు. సందేహించకు." —అని చెపుతాడు. అప్పుడు రావణుడు — "నాకు ఒక శాపం వుంది. ఇది రహస్యం." — అని అసలు సంగతి బయట పెడతాడు.

పుంజికస్థల అనే అప్సరసని ఒకసారి రావణుడు బలాత్కరించాడు. ఆమె బ్రహ్మ దగ్గరికి పోయి చెప్పింది. బ్రహ్మ రావణుణ్ణి — "నిన్ను కోరని స్త్రీని బలాత్కరిస్తే నీ తల వెయ్యిముక్కలై పోతుంది." —అని శపించాడు.

ఉత్తర కాండలో— రావణుడి చరిత్ర అంతా రుషులు రాముడికి చెపుతూ— "రావణుడు రంభని బలాత్కరించినప్పుడు నలకూబరుడు శపించాడు" — అని చెపుతారు. మొత్తంగా సారాంశం ఒకటే — రావణుడికి శాపం ఒకటి కల్పించి, కవి సీత పాతివ్రత్యం రక్షించాడు.

ఈ కథని వాస్తవదృష్టితో పరిశీలించినప్పుడు రావణుడి శాపాన్ని లక్ష్యపెట్టవలసిన అవసరం లేదు. స్త్రీ లోలుడైన ఒక పురుషుడు, పర స్త్రీని ఎత్తుకుపోయి, ఆ స్త్రీ విషయంలో ఎలా ప్రవర్తిస్తాడో, రావణుడు కూడా సీతతో అలాగే ప్రవర్తిస్తాడు.

అనలు, బలాత్కారం అనేది స్త్రీ-పురుష సంబంధానికి సంబంధించింది మాత్రమే కాదు. ఒక స్త్రీ ఇష్టానికి వ్యతిరేకంగా ఎత్తుకు పోవడం కూడా బలాత్కారమే. అపహరణే బలాత్కారం. ఎత్తుకు పోయినప్పుడు ఆమె తప్పు లేనట్టే, ఆమెతో ఎలా ప్రవర్తించినా ఆమె తప్పు లేదు. అందుచేత, రావణుడు సీతని బలాత్కరించాడా? లేదా? అనే విషయాన్ని ప్రత్యేకంగా తేల్చుకోవాలి— అనుకోకూడదు.

విషవృక్షం కథ వాల్మీకి ప్రకారమే సాగుతుంది. వాల్మీకి కథా వొస్తువుని మార్చడం దీని వుద్దేశ్యం కాదు. అందుచేత, ఇందులో కూడా రావణుడికీ, సీతకీ, ఎత్తుకురావటం మినహా ఇతర శారీరక సంబంధం ఏదీ వుండదు.

రావణుడు సీతని అంగీకరించమని కోరుతున్నాడు— అనే విషయాన్నే ఈ కథ చెపుతుంది.)

ధ్యానంతో నిశ్చలంగా — తపోనిష్ఠలో వున్న అప్సరస మల్లే వుంది సీత.

దుఃఖంతో సొమ్మసిలి— నేల రాలిన కాశీ పుష్పం మల్లే వుంది సీత.

అలంకారాలు లేక, ఆభరణాలు లేక పద్మాలు లేని సరోవరం మల్లే, పూలన్ని రాలిన జాజితీగ మల్లే వుంది సీత.

యోచించి, యోచించి, నిరీక్షించి, అలిసి, మౌనం వహించి — కరడుగట్టిన శిల్పంమల్లే, విగ్రహం మల్లే వుంది సీత.

నిరాశతో, నిస్పృహతో — పేటగాడికి ప్రాణాలతో పట్టుబడి పోయిన పక్షికూన మల్లే వుంది సీత.

మహాక్షామంలో తలిదండ్రులు గతించి, బంధువులు నిర్దయగా అడవుల్లో విడిచిన బాలమల్లే వుంది సీత.

దుఃఖించి, దుఃఖించి కన్నీరు కూడా ఇంకి— చల్లారిపోయిన అగ్ని పర్వతం మల్లే వుంది సీత.

నీలపు జలంలో, తెల్లని హంస ఈదులాడుతూ గట్టు చేరినట్టు — ఆకాశంలో చంద్రుడు మేఘాల చాటున మాయమయ్యాడు.

చలగాలులో, పూలజల్లులో, పక్షుల కలకలంతో, అశోక వనంలో సూర్యోదయం మనోహరంగా వుంది.

కోరికలే గుర్రాలుగా, మనసే రథంగా — సీత భర్త దగ్గిరికి ప్రయాణాలు చేస్తోంది.

గత స్మృతుల బరువుతో నిట్టూరుస్తోంది. దీనమైన చూపులతో భూదేవిని ఆలింగనం చేసుకుంటోంది.

చిత్రకూటంలో, పంచవటిలో, గంగాతీరంలో, ఉదయా స్తమ సౌందర్యాల తలపులు, గత జన్మలంత దూరం అయిపోయాయి. ఏనాడో యుగాల వెనక, కల్పాంతాల వెనక, పతి దర్శనం అయినట్టు తోస్తోంది. ....ఇక జన్మ జన్మలకీ ఈ నరక కూపంనించి విముక్తి లేదు. వ్యూహ తెలిసీ తెలియని పసితనంనుంచీ అపారమైన భక్తి శ్రద్ధలతో చేసిన పూజలూ, నోచిన నోములూ చిల్లిగవ్వకైనా కొరగాకుండా పోయాయి. పుట్టలోంచి పాములు లేచినట్టు, ఆత్మలోంచి వేలకొద్దీ సంశయాలు తల లెత్తుతున్నాయి. సీతలో సీత సీతని, నిర్వ్యయంగా —విస్మయంగా — క్షణం....క్షణం.... మళ్ళీ....మళ్ళీ ... మళ్ళీ.... ప్రశ్నించి.... ప్రశ్నించి .... ప్రశ్నించి.... కలవర పెడుతోంది.

ఎన్నడైనా, ఏ పర పురుషుడైనా, తనను కన్నెత్తి చూసిన మరు క్షణంలో భగభగ మండి భస్మం అయిపోతా దనుకుంది సీత. తన

పాతివ్రత్య మహిమ కవచం మల్లే తనని కాపాడుతూ, చుట్టూ అగ్ని జ్వాలలు రేపి పరిసరాలన్నీ దగ్ధం చేస్తుందనుకుంది సీత. కానీ .... ఎందుకో అంత లోకభీకర కార్యం జరుగుతో వుంటే సమస్త భూతాలూ చూస్తూ వూరుకున్నాయి. దేవత లందరూ మౌనం వహించారు. సూర్య చంద్రులు గతులు తప్పకుండా వున్నారు. ఏ దైవమూ తనకు అడ్డుపడ లేదు. ఏ మహోన్నత శక్తీ తనని రక్షించలేదు. చివరికి తన పాతివ్రత్యం కూడా రావణుడి దుర్మార్గం ముందు శక్తిహీనం అయిపోయింది. క్షుద్ర స్త్రీలలాగ విలపించడం తప్ప తను ఏమీ చెయ్యలేకపోయింది.

పూర్వకాలం నించీ, పతివ్రతలు ఎన్నెన్నో ఘనకార్యాలు చేశారని విన్నది తను. మహిమలతో నిండిన కథలెన్నో ఎరుగును తను. — సావిత్రి తన పాతివ్రత్య మహిమతోనే భర్తని బతికించుకున్నది. అనసూయ తను సంపాదించిన పుణ్యంతోనే పుత్తమ కార్యాలెన్నో చేసింది. దమయంతి మహా పతివ్రత గనకే నల మహారాజుని దక్కించుకోగలిగింది. అయ్యో! తను మాత్రం ఆ పుణ్యస్త్రీల వంటి పతివ్రత కాదా? తను పతి సేవలో ఏనాడైనా లోటు చేసిందా?— తన మాటకీ, కన్నీటికీ, తన కోపానికీ, శాపానికీ— ఏ శక్తీ లేకపోయిందే! పర పురుషుడు బలాత్కారంగా ఈడ్చి తెస్తోవుంటే కంటికీ మంటికీ ఏకధారగా ఏడవడం తప్ప, తనను తను రక్షించుకోలేక పోయిందే:

"నా భర్త ఆజ్ఞలేక నిన్ను శపించకుండా విడిచానని" ఆ దుర్మార్గుణ్ణి బెదిరించడానికి అన్నాడే గానీ, తనకు గడిపోచనైనా కదిలించే శక్తి లేదనే సందేహం కలుగుతోంది. ఎందరో రుషులు ఎన్ని వరాలు ఇచ్చారో · ఎంతెంత మహిమలతో ఆశీర్వదించారో! రుషుల వాక్కూ యినా ఫలించలేదే:

తన భర్తకి కూడా ఇటువంటిదేనా? ఇన్ని మాసాలకైనా ఎర్తపత్నిని రక్షించుకునే ప్రయత్నాలు చెయ్యనే లేదే: ఈ దుర్మార్గుణ్ణి దక్కించే కార్యం ఆయనకు కూడా అసాధ్యమేనా? శ్రీరాముడు కూడా సామాన్య పురుషుడేనా?

ఆ మహా ... ఎన్నడూ భరించలేదు సీత. తనను తను భరించ

లేనంత అసహ్యం కలుగుతుంది—ఆమెకు తన భర్త సామాన్యుడు కాడు. పురుషోత్తముడు. మహా పరాక్రమవంతుడు, శత్రు భయంకరుడు. — ఇంతకాలం తనని రక్షించలేదంటే — ఇదంతా తన కర్మ ఫలం. పూర్వజన్మ సుకృతం. ఏనాడో చేసుకున్న మహా పాపం.

ఆనాడు ఎన్ని దుర్భాషలాడించి తను లక్ష్మణుణ్ణి !.... అనరాని మాటలన్నది !.... ఈ నాటికీ ఆశ్చర్యమే! లక్ష్మణుడి మీద అంత శంక ఎలా కలిగిందో అంతు పట్టదు. ఏనాడైనా లక్ష్మణుణ్ణి అతని అన్నగారు మందలించినా విలవిల్లాడేది తన ప్రాణం.... తనే ... ఆ అమాయకుణ్ణి అనగూడని మాటలనిదుఃఖపెట్టింది. శనిదేవతే తన నోట్లో ప్రవేశించింది. ఈ కర్మకోసమే ఆనాడా బుద్ధి పుట్టింది.

జలజలా కన్నీళ్ళు కారుస్తూ గతం తలపోస్తోంది సీత.... మళ్ళీ .... మళ్ళీ.... మళ్ళీ.... తన జాడ తెలియక అన్నదమ్ములెంత దుఃఖిస్తున్నారో !

జరిగిందంతా జటాయువు చెప్పి వుంటాడా ? చెప్పక పూర్వమే ప్రాణాలు విడిచి వుంటాడా ? .... ఆశ్రమంలో తను కనపడక ఎంత ఆందోళన పడ్డారో ! ... ఎంత శంకించారో ! ... ఆ లేడికోసం పోయిన తన భర్త సుఖంగా ఆశ్రమం చేరి వుండవచ్చునా ? ... ఈ దుర్మార్గుడు తనను అపహరించాలనే దుర్బుద్ధితో శ్రీరాముడి కేమీ హాని కలిగించ లేదు కదా ?....

మహా పరాక్రమవంతుడు శ్రీరాముడైనవరు ధిక్కరించ గలరు ? .... సుఖంగా వనవాసం ముగించి ఆయోధ్యకు పోయి ..ప్రియురాళ్ళతో సుఖభోగాలలో మునిగి తేలుతున్నాడేమో !.... ఇంత కాలం తన భర్త ఏకపత్నీ వ్రతుడనే ఆనందంతో ఎన్ని కష్టాలకైనా ఓర్చగలిగింది తను. భర్తే తనని తిరస్కరించినప్పుడు ఈ జీవితం ఎందుకు ?.... నెలల తర బడీ ఈ నిరీక్షణ ఎందుకు ? *

---

* సుందరకాండలో— 28 వ సర్గ— 12 నించి 15 వరకూ. అశోకవనంలో సీత రాముణ్ణి గురించి ఎమనుకుంటోందో చూడండి.

(మిగతా తరువాత పేజీలో)

(ఫుట్‌నోట్ : 384 వ పేజీ తరువాయి)

— "శ్రీరాముడే దైవమని భావించి యుండుట, శ్రీరాముడే రక్షించు వాడనుకొనుట, వుపవాసములు పేయుట, భూమిమీద పరుండుట, పతియే దైవమని నమ్ముట, — ఇవి అన్నియు వ్యర్థమైనవి. — రామా : నేను కృశించి, కాంతిహీననై, సీతో సమాగమము కలుగునను నాశలేని దాననై యున్నాను. నేను జేసిన పుణ్యము వ్యర్థము. రాముని ఏకపత్నీవ్రతు డనుకొనినది కల్లయైనది. రామా : నీవు పీ తండ్రి ఆజ్ఞ ప్రకారము, వనవాసము ముగించి, అయోధ్య చేరి, భయము లేక (ఈసారి రాజ్యం పోతుందనే భయము లేక) కృతార్థుడవై, సుందరులైన స్త్రీలతో సుఖించుచున్నావు.

దుఃఖించుచుండు నేను విషము తిని, కత్తితో గొంతు కోసికొని అయిననూ ప్రాణములు త్వరలో విడిచెదను.

"ఇచ్చట విషమును, కత్తి నిచ్చు వారెవ్వరును లేరు. ఏమి సేతును." — ఈ రకంగా వుంది సీత ఆలోచనా విధానం. సీతకు భర్తమీద చలించని విశ్వాసం లేదు. భర్తను శంకిస్తోనే వుంది. తనని మరిచిపోయి, అయోధ్యకు పోయి, స్త్రీలతో సుఖంగా వుంటాడని అభిప్రాయ పడుతోంది.

ఇక్కడ సీత ఇలా వుంటే, అక్కడ రాముడు కూడా ఇలాగే — "సీత శీలవతిగా వుంటుందా ? లేదా ?" — అని శంకిస్తోనే వున్నాడు. సమాజంలో — అన్ని దాంపత్యాల సొగసూ ఎలా వుంటుందో, అలాగే వుంది సీతా — రాముల దాంపత్యం సొగసు కూడా.

కవి, ఇది ఆదర్శ దాంపత్యమని చెపుతూ కూడా సామాన్య దాంపత్యాల ధోరణే చూపించాడు ఎందుచేత ? — కవి చూసేది తన చుట్టూ సమాజాన్నే. దాని వాతావరణంలో వున్న ధర్మాలనే. దాన్ని మించి, దానికి అతీతంగా వున్న ఆదర్శం ఆయనకు తెలియదు. — అసలు సమాజంలో లేని ఆదర్శ దాంపత్యాన్ని చూడడం కవికి కూడా

ఆయష్షు వుండగా మరణం సంభవించ దంటారే పెద్దలు ; పెద్దల వాక్కు సత్యం కాకపోతే, తను ఇంతకాలము భర్తకు దూరమై జీవిం

(ఫుట్‌నోట్ : 185 వ పేజీ తరువాయి)

సాధ్యం కాదు. కవి సమాజం పరిధిలోనే, హద్దుల్లోనే ఆలోచిస్తాడు. అందుచేత, కవి "ఆదర్శ దాంపత్యం" గురించి ఎంత వూదర గొట్టినా, అడుగడుగునా సమాజంలో వున్న వాస్తవత్వం, కవికి తెలియకుండానే, ఆయన రాతలో బయటబడి తీరుతుంది.

సీతా– రాముల దాంపత్యంలో ఆదర్శం ఏమీ లేదు. వారు కూడా సమాజంలో, ఇతర దంపతుల వంటి వారే. దంపతుల మధ్య వుండే – హెచ్చుతగ్గులూ, మర్యాదలూ, కోపాలూ, కామాలూ, శంకలూ– అన్నీ వారికి వున్నాయి.

సీత భర్తని అస్సలు శంకించ లేదనో, అంత కాలం రక్షించక పోయినా దుఖించ లేదనో రాస్తే, చాలా అసహజంగా వుంటుంది గనక — కవి, సీత దుఖం గురించి ఎక్కడి కక్కడ బాగానే రాశాడు. కానీ, చివరికి సీత ఏమని నిర్ణయించుకుంటూ వుంటుందో చూడండి.

"రామా ! నేను బహుకాలము నీ మీద ఆశయుంచి, వ్రతములు, తపములు చేసియు — నాకు జన్మాంతర సుకృతము లేక, అదృష్ట హీనురాలనే యుండుట చేత, నీవు నన్ను రక్షించక యున్నావు. ఇది నా పాపమేను. సందేహము లేదు."—

అదండీ సంగతి. —అంతేగాని, రాముడి అసమర్థత ఏమీ లేదు. తను ఎప్పటి కప్పుడు రామున్ని రక్షించడానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటూనే వుంటాడు. ఇక్కడ 'కర్మవాదం' — సీత శంకలనుంచి, రామున్ని రక్షిస్తోంది. (రాముడి పాపం పండేవరకూ ఈ కర్మవాదం వల్లిల్లుతోనే వుంటుంది.)

సీత తన పాతివ్రత్య మహిమ మీదా, భర్త మీదా అనేక శంకలు కలిగి కూడా, వాటిని అణచుకుంటోంది. ఇంకో విధంగా తనకు తను నచ్చచెప్పుకోవాలని ప్రయత్నిస్తోంది. అదే వంచన ! ఆత్మవంచన !

చేదా ? ఈ శరీరం విడిచిపెట్టాలని ఎంత కోరిక వున్నా ఏమి లాభం ? .... ఆ కార్యమే అసాధ్యంగా వుంది. భర్తకు దూరమై వొక్క క్షణం కూడా జీవించ లేననుకుంది పూర్వం. కానీ, ఇన్ని మాసాలు శరీరం సురక్షితంగానే వుంది. ఆకలి దప్పులు కలుగుతున్నాయి. తింటోంది. నిద్రిస్తోంది. మన్మధ వికారం కూడా పొందుతోంది. శరీర ధర్మాలు శరీరానివిగానే వుంటున్నాయి. క్షుద్ర వాంఛలకైనా దేహాన్ని నిగ్రహించే మనోశక్తి లేదే !

పాతివ్రత్యాన్ని ధిక్కరించే ఈ శరీర ధర్మం అమితంగా సిగ్గు కలిగిస్తోంది.

సీత ఆత్మ భయంకరమైన వాస్తవాలు గ్రహించినట్టు కంపిస్తుంది. సందేహాలతో కొట్టుకుంటుంది. సీతకు తన పాతివ్రత్య మహిమ మీద కొంతైనా విశ్వాసం సడలింది. ఆలోచనలతో విసిగి, విసిగి, విధి విలాసాన్ని తలపోస్తూ, తన దౌర్భాగ్యాన్ని దూషిస్తూ, కళ్ళనీళ్ళు కారుస్తుంది.

"మహారాజు !.... మహారాజు !"— అంటూ సీత చుట్టూ పరిచారికలు కలవర పడుతున్నారు. దాసీలు అశోకవనం నిండా పరుగులెత్తుతున్నారు. రావణుడు వొస్తోన్న సందడి వినవొస్తోంది. మహారాజు వెంట వొచ్చే స్త్రీల ఆభరణాల చప్పుళ్ళూ, రకరకాల కంఠాల్లూ, నవ్వులూ, ...దారి పొడుగునా హెచ్చరికలూ....

తుఫానులో గూడు దొరకని పిట్ట మళ్లే వొణుకుతోంది సీత. — తన పాతివ్రత్యం భంగ పడుతుందా ? తన జీవితం కళంక మౌతుందా ? భీతితో జలజలా కన్నీళ్ళు రాలుస్తోంది.

చుట్టూ భార్యల గుంపుతో రావణుడు సీత దగ్గిరికి వొచ్చాడు.

చెట్టుమీద దాక్కున్న హనుమంతుడు వూపిరి బిగబట్టి రావణుణ్ణి చూడాలని ఆకుల్లోకి జరిగాడు.

రావణుడు ఎర్రటి దుస్తులతో, ఎర్రటి చందనం పూతలతో ఎర్రటి శిల్పంమల్లే వున్నాడు. వొంటినిండా ఆభరణాలు .... ధగధగ

మెరిసే కుండలాలు.... కాంతులీనుతూ రత్నఖచితమైన కిరీటం .... గరుడపక్షి రెక్కలవంటి భుజకీర్తులు.... నడుము చుట్టూ సర్పాకారంలో నీలమణులు తాపిన మొలతాడు.... పరిమళ తైలాలతో నిగనిగలాడే మీసాలు.... భుజాల చుట్టూ ఎర్రటి వస్త్రం కప్పుకున్నాడు.

చుట్టూ పరిచారికలు వింజామరలు వేస్తున్నారు. ఛత్రాలు పడుతున్నారు. కొందరు దాసీలు బంగారు పాత్రల్లో రకరకాల మద్యాలు పట్టుకుని అందుబాటులో నించున్నారు.

కొందరు దాసీలు కొండంత ఆసనం మోసుకొచ్చి రావణుడి దగ్గిర పెట్టారు.

రావణుడి భార్యలు, సీరెండలో ఆభరణాలతో ధగధగా మెరిసిపోతున్నాడు.

రావణుడి భుజాల చుట్టూ వస్త్రం అటూ ఇటూ జరుపుతూ, సీతని తదేకంగా చూస్తున్నాడు.

సీత కంపిస్తోంది. ముడుచుకుంటోంది. తనకే శక్తి వుంటే ఆ క్షణంలో మాయం అయిపోవాలని కోరుకుంటోంది. *

---

* 19 వ సర్గ — 3 వ శ్లోకం; 20 వ సర్గ — 2 వ శ్లోకం.

"అతన్ని జూచి వుత్తమురాలగు సీతాదేవి కడుపును తొడలచేతనూ స్తనములను భుజముల చేతనూ, మూసికొని దుఃఖించుచు కూర్చుని యుండెను." —అలా కూర్చున్న సీతని చూసి రావణుడు — "ఏనుగు తొండము వంటి తొడలు గలదానా! నీవు నన్ను జూచి స్తనములను, గర్భమును మూసికొని భయపడి, నీ దేహమును జూపకున్నావు," — అంటున్నాడు.

రావణుడు ఇలా అన్నా, ఇంకెలా అన్నా, రామ దాసులకి కోపం రానక్కర్లేదు. కవిగారే సీత స్తనాలు చూడకుండా వుండలేక పోతున్నారు.

సీతని అంత దుఃఖంలో వర్ణిస్తూ కూడా — "సీత, పెద్దవియగు

"సుందరీ ! భయపడకు. నీ సౌందర్యం దాచుకోకు. గుండ్రని నీ స్తనాలూ.... నున్నని నీ తొడలూ.... విశాలమైన నీ కటి భాగమూ .... నీ అంగాంగాలూ చూసి నన్ను ఆనంద పడనియ్యి. నీ నమస్తాం గాలూ సౌందర్య నిలయాలే. పద్మాలవంటి నీ కళ్ళూ, ముత్యపు చిప్పల వంటి కనుదెప్పలూ, పలాచని చెక్కిళ్ళూ .... నున్నని నడుమూ .... చక్కని పిరుదులూ.... ఆహా ! నీ అవయవాల వేపు ఎటుచూస్తే అటే నిలిచిపోతోంది నా దృష్టి. నీవంటి సౌందర్యరాశిని పురుషుడైనవాడు కామించకుండా విడిచి పెట్టగలడా ? బ్రహ్మ నిన్ను సృష్టించి ఎలా విడి చాడో ఆశ్చర్యంగా వుంది. నీవంటి లోకోత్తర సౌందర్యవతిని నే నెన్నడూ చూడలేదు సుమా !"—

రావణుడు ఎప్పుడు వొచ్చినా సీత సౌందర్యాన్ని అమితంగా కీర్తి

(ఫుట్‌నోట్ : 388 వ పేజీ తరువాయి)

కుచములను కన్నీటిచే దడుపుచు, భర్తను ధ్యానించుచు విశేషముగ దుఃఖించుచుండెను. —సీతయొక్క పెద్దవియగు, గుండ్రముగను, వొక దానినొకటి ఒరిసికొనినవిగను యుండు స్తనములు వొణుకుచు సీత భయపడుచుండెను." — సీత భయాన్నంతా స్తనాలలో చూస్తున్నాడు కవి. శ్లోకంలో సీతని సంబోధించడం కోసం సుశ్రోణీ, సుమధ్యే, అనడం అయినా కాదు. అసలు శ్లోకాల్లో విషయమే ప్రత్యేకంగా "సీత స్తనాల" మీద నడుస్తుంది. స్త్రీల అవయవాలు వర్ణించే వుత్సాహం వుక్కిరి బిక్కిరి చేసేసూ వుంటుంది కవిని. — సీత అయినా వొకటే. మహాలక్ష్మి అయినా వొకటే. ఆ రాసే ఘట్టం ఆనందఘట్టం అయితే ఆ స్త్రీ స్తనాలు ఆనందంతో కదులుతాయి. దుఃఖం అయితే దుఃఖంతో కదులుతాయి. — (కవి బుద్ధి నిలకడగా వుంటే, అవీ నిలకడగా వుండాలే గానీ . ఆ నిలకడ ఈ సమాజంలో కుదరదు.)

(రాముడు, రావణుడి మీద యుద్ధానికి పోతాడు గానీ, కవి మీద తిరగబడాలి అనలు.)

స్తాడు. సౌందర్యం గురించి చేసే పొగడ్తలు స్త్రీలను సంతోష పరుస్తాయని అత డెరుగును.

రావణుడు సీత సౌందర్యాన్ని పొగుడుతూ వుంటే, అతని భార్యలు పరిహాసంగా వొకరి మొహం వొకరు చూసుకుంటారు. గుస గుస లాడుతూంటారు.

"ఎవరికన్నా అందంగా వుంచక్కా సీత?"

"లోకంలో స్త్రీ లందరికన్నా అందంగా వుందమ్మా మహారాజు కళ్ళకి. —మన అందరి అందాలూ పాతబడి పోలేదూ? .... అలాగే ఆమె అందమూ పాతబడుతుంది."

"కానీ, సీత వొప్పుకోదుగా?"

"అవును. వొప్పుకుంటుం దనుకోను. అందుకే మరీ అందంగా కనబడుతోంది."

సీతకి రావణుడి ప్రవర్తన రోజు రోజుకీ ఆశ్చర్యం కలిగిస్తోంది. — తన కాంక్ష అంతా వెళ్ళబోస్తాడు. అంగీకరించమని ప్రార్థిస్తాడు. కీ రిస్తాడు. మందలిస్తాడు. బెదిరిస్తాడు .... అంతా నోటి మాటలతో మాత్రమే. అంతకుమించి దుష్టత్వం చూపించడు దయవలన మంటాడే గానీ, దౌర్జన్యానికి పూనుకోడు.

ఎన్ని జన్మల సంస్కారమో! లేక ఏ మహాత్ముల శాపఫలమో! — అతడే తనను పరాభవించ దలిస్తే తనను తను రక్షించుకో గలగడం కలలో మాట.

రావణుడు సీతని అశోకవనంలో వుంచిన నాడే — "నిన్ను నేను బలాత్కరించను. నీకు ఇష్టం లేకుండా ముట్టను. నీకు కూడా నామీద మోహం కలిగి నన్ను నువ్వు కోరాలి," — అన్నాడు.

సీత నమ్మలేకపోయింది.

కానీ, ఈ నాటికీ రావణుడు ఆ మాట ప్రకారమే ప్రవర్తిస్తున్నాడు. ఇక ఎంతోకాలం తన పట్ల సహనం చూపడు. ఎప్పుడైనా తనని పరాభవించక మానడు. ఈ దుర్మార్గుడి చెరనుంచి ఏనాటికైనా విముక్తి వుందో లేదో!

"సీతా ! నా మాట విను. నా భార్యలలో పట్టపురాణివిగా వుండు. ఎందరో అందగత్తెల్ని నా పరాక్రమంతో ఎత్తుకు వొచ్చాను. వారం దరూ నీకు సేవలు చేస్తారు. నువ్వు కోరినంత ధనం ఇస్తాను. కోరి నంత భూమి ఇస్తాను.

నీ ఇష్టప్రకారమే దాన ధర్మాలు చేసుకో. నీ ఇష్ట ప్రకారమే పూజలూ, వ్రతాలూ చేసుకో. నీ బంధువు లందరికీ గొప్ప గొప్ప బహు మానాలిచ్చి సంతోష పెడతాను. వాళందరూ నిన్ను చూడడానికి వచ్చి పోతూ వుంటారు. నువ్వు కోరితే ఎన్ని నగరాలైనా జయించి నీ తండ్రి ఆధీనంలో వుంచుతాను. నీకు కావలసినవన్నీ కోరి నాకు ప్రీతి కలి గించు. నా రాజ్యానికి నువ్వు సర్వాధికారిణిగా వుండు. నీ స్తనాలు చక్కగా వున్నాయి."

రావణుడి భార్యలలో కనుసైగలూ, గుసగుసలూ, నిట్టూర్పులూ జరుగుతున్నాయి. ఒకామె ఇంకొకామె భుజం మీద తల పెట్టుకుని — —"సరిగ్గా నాకు ఇలాగే చెప్పారక్కా !" — అని కళ్ళనీళ్ళు పెట్టు కుంటోంది.

"నాకూ ఇలాగే చెప్పాడమ్మా !.... మహారాజుకి మన మీద దయ లేదు. దుఃఖపడకు."

"నేను లేకపోతే వొక్క క్షణం కూడా జీవించలేనన్నారు. నిజం అనుకున్నాను.... మనవల్ల మహారాజు కేమి సంతోషం లేదా అక్కా ? ....మహారాజు ప్రేమ అంతా సీత మీదేనా ?"

"పిచ్చిదానా !.... పురుషుడికి స్త్రీ మీద ప్రేమ ఏమిటి ? ఉన్న దంతా కామమే."

రావణుడు తన పీరత్వం చాటుతున్నాడు సీత ముందు. తన పరాక్రమం వర్ణిస్తున్నాడు. ఎందరు స్త్రీలు తనకు లోబడి జీవిస్తున్నారో, లెక్కలు చెప్తున్నాడు. తను చెప్పింది పూర్తిగా వింటే, సీత తప్ప కుండా అంగీకరిస్తుందని, రావణుడు ప్రతిసారీ తన భోగ భాగ్యాలన్నీ ఏకరువు పెడతాడు.

"సీతా! ఎన్నో వందలమంది రాజుల్ని యుద్ధాలలో జయించాను. ఎందరినో హింసించి, ఎన్నో శత్రు పట్టణాలు దోచుకుని, అమూల్యమైన సిరిసంపదలు కూడబెట్టాను. నా భోగ భాగ్యాలకు అధికారిణివి నువ్వే. వీరత్వంలో నాతో సమానమైన వాడు లేడు. నా కీర్తి చూడు. నా పరాక్రమం చూడు. నా ఐశ్వర్యం చూడు. తెలివైన దానివైతే నాతో సుఖించు. నా భోగ భాగ్యాలన్నీ అనుభవించు. రామున్ణి మరిచిపో. ఆ అల్పుడు నీకు భర్తగా తగడు.

రావణుడి మాటలు సీతకు కొత్త కాదు. అయినా పౌరుషపడి ధిక్కారంగా చూడబోయింది.

సీతలో సీత సీతతో — "సీతా! తొందర పడకు సుమా! అతనికి కోపం తెప్పించకు. మూర్ఖుడు. తెలివిగా ప్రవర్తించు. అతన్ని ప్రార్థించు. అతని దయ సంపాదించు.... ఎందుకైనా మంచిది. రాముడి పరాక్రమం గురించి అతిగా కీర్తించకు."— రావణుడు పక్కకు తిరిగి పాత్ర అందుకుని మద్యం తాగి, వుత్తరీయంతో మీసాలు తుడుచుకున్నాడు.

"ప్రియురాలా! ఎంతకాలం వ్యర్థంగా దుఖిస్తావు? అలంకారాలు చేసుకోవు. నేల మీద పడుకుంటావు. ఈ మాసిన చీర విప్పనంటావు. ఈ వుపవాసాలు.... జాగారాలు.... ఇవంతా ఎంత కాలం? — నా మాట విను. ఎందరో సుందరాంగనలు నీకు అలంకారాలు చేస్తారు. పట్టువస్త్రాలు, అమూల్యమైన రత్నాభరణాలూ, అగరు చందనాలు, పానీయాలు, శయనాలు, ఆసనాలు, నాట్యగానాలు, వనవిహారాలు, — అన్నీ అనుభవించుతూ క్షణం క్షణం మైమరచి బ్రతుకు. నువ్వు చక్కగా అలంకరించుకుని, చిరునవ్వులతో, రత్న మందిరాలలో తిరుగుతూ వుంటే చూడాలి నేను. నీ తొడలు ఏనుగు తొండాల్ని పోలి వున్నాయి.

దుఖంతో కృశించి పూర్వం కన్నా అందంగా వున్నావు. నీ సన్నని నడుము ఇంకా సన్నబడి ఎంత ఆశ కలిగిస్తోందో నాకు! దినం దినం నీ యౌవ్వనం వ్యర్థంగా పోతోంది. ఏటి ప్రవాహం ఎన్నడూ

వెనక్కి రాదు కదా ? ... నా మాట విను. నాతో సుఖించు. ఆ రాముడి మీద మనసు మార్చుకో. రాముడు పరమ చరిత్రుడు. ఐశ్వర్యం లేని వాడు. తపస్సులో, బలంలో, పరాక్రమంలో, సంపదలో, దేనిలోనూ రాముడు నిన్ను మించలేడు. నాతో సమానుడైనా కాలేడు. ఆ రుషి జీవనంలో నిన్నేం సుఖపెట్ట గలడు ? — అసలు రాముడు జీవించి వున్నాడో లేదో సందేహమే. జీవించి వుండినా ఏమి లాభం ? .... ఇక్కడికి రాగలడా ?.... ఈ లంకని భేదించ గలడా ? ఎంత కాలం వ్యర్థమైన ఆశలు పెట్టుకుంటావు ? రాముడు నిన్ను రక్షించలేడు. — అసమర్థుడు."

రావణుడి మాటలు వింటోన్నకొద్దీ సీతకు భరించలేని దుఃఖం కలుగుతోంది.

సీతలో సీత సీతతో — "నిజమేనేమో సీతా : శ్రీరాముడీ లంకకు రాలేడేమో ! ....రాగలిగినా రాదలచ లెదేమో ! పర పురుషుడు అపహరించిన స్త్రీని తను స్వీకరించనని మౌనం వహించాడేమో!" —అంటూ సందేహాలు వెలిబుచ్చింది.

సీత దుఃఖం పట్టలేక జలజలా కన్నీళ్ళు రాల్చింది. రావణుణ్ణి ఆమె అనేకసార్లు ప్రార్థించింది. తనను తన భర్త దగ్గిరికి చేర్చమని ప్రాధేయపడింది. పరస్త్రీలని బంధించడం ధర్మం కాదని మందలించింది. తనను తన భర్తకు అప్పగించకపోతే శ్రీరాముడు లంకని సర్వనాశనం చేస్తాడని భయపెట్టింది.

"నా భర్త దయామయుడు. ఆపద్బాంధవుడు. శరణాగత వత్సలుడు. నిన్ను మన్నించి విడిచి పెడతాడు," —అని ధైర్యం చెప్పింది.

నయానో, భయానో, ఏ విధాన్న లొంగుతాడో, ఏ విధాన్న తన తప్పు గ్రహించి, మనసు తిప్పుకుంటాడోనని — సర్వ విధాలా ప్రయత్నించింది.

దేనికీ రావణుడు చలించలేదు.

పైగా— "ఇంతకాలం ఆ మహాత్ముడు నిన్ను రక్షించలేదెం ?"

— అని ఎప్పుడూ పరిహసిస్తాడు. ఏమని చెప్పడానికీ సమాధానం లేదు. ఆత్మబలం లేదు.

"సుందరీ ! ఆ రాముణ్ణి మర్చిపో : ఏ జన్మలో పాపం చేసుకున్నావో వనవాస శిక్ష అనుభవించావు. నీ పాపం గతించిపోయింది. ఇక సుఖించడమే మిగిలింది ... నీ చెక్కిళ్ళు ఎంత చక్కనివి ! నీ కోసం నేను మన్మథ తాపంతో వేగిపోతూ వున్నాను."

సీత ధిక్కారంగా తల ఇంకో పక్కకు తిప్పింది— "రావణా! నీకు అనేక పర్యాయాలు స్పష్టం చేశాను. నీ కోరిక తీరేది కాదు. పతివ్రతలు ఒకే భర్తతో జీవిస్తారు. నేను ధర్మం మీరను. మా వంశ మర్యాదలు నువ్వెరుగవు."

"సుందరీ ! మా కులాచారం కూడా నువ్వెరుగవు. పరస్త్రీ గమనం మా జాతిలో దోషం కాదు. స్త్రీలను బలాత్కారంగా అపహరించి తెచ్చుకోవడం మా జాతి ఆచారం. * నీకూ, నాకూ జరిగేది ధర్మబద్ధ వివాహమే. రాక్షస వివాహం."

"అది నీకు వివాహం. నాకు కాదు. నాకు వొక్కసారే వివాహం. ఒక్క పురుషుడే నా భర్త. నువ్వు నన్ను ఎంత కాలం బంధించినా ఈ మాటే చెపుతాను: నీ భార్యలతో నువ్వు ప్రీతిగా వుండు. నన్ను

---

* 20 వ సర్గ — 5 వ శ్లోకం.

"పరస్త్రీ గమనము సేయుట, పర స్త్రీలను బలాత్కారముగ నపహరించి తెచ్చుట రాక్షసుల కుల ధర్మము."—

పెళ్ళి కాని పిల్లల్ని ఎత్తుకెళ్ళడం అయితే, గత చరిత్రలో కొన్ని జాతుల ధర్మంగా కనబడే సంఘటనలు వున్నాయి. పురాణాల్లో కూడా వున్నాయి. కృష్ణుడు రుక్మిణిని ఎత్తుకు పోవడం.

భీష్ముడు — అంబనీ, అంబికనీ, అంబాలికనీ వారి అభిప్రాయాలూ, ఇష్టా ఇష్టాలూ తెలియకుండానే ఎత్తుకుపోవడం అందరికీ బాగా తెలిసిందే.

మోహించవొద్దు. ధర్మ పత్నీవ్రతాన్ని నడుచుకో. నీ భార్యల్ని నువ్వు రక్షించుకునే విధంగానే, ఇతరుల భార్యల్ని కూడా రక్షించాలి నువ్వు ..."

రావణుడు నవ్వాడు — "ఇతరుల భార్యల్ని ఇతరులే రక్షించుకుంటారు."

"నీకు సిరిసంపదలున్నాయి. బల పరాక్రమాలున్నాయి. సన్మార్గం లేదు. సత్ప్రవర్తన లేదు. అది కూడా వుంటే వుత్తముడివే."

నా భర్త నీవంటి స్త్రీ లోలుడు కాదు. పురుషోత్తముడు. ఏక పత్నీ వ్రతుడు. నన్ను తప్ప ఏ స్త్రీని కన్నెత్తి అయినా చూడలేడు. అటువంటి పుణ్యాత్ముడు నా భర్త. నా భర్తకు నేను దూరమైనా, ఎప్పుడూ ఆయనతో వున్నదానినే. నా ఆత్మనించి నా భర్త దూరం కాలేదు. ఎన్ని ఆపదలు సంభవించినా సువర్చలాదేవి సూర్యుణ్ణి విడిచిందా? శచీదేవి ఇంద్రుణ్ణి విడిచిందా? — రోహిణీదేవి చంద్రుణ్ణి, అరుంధతీదేవి వశిష్ఠుణ్ణి, లోపాముద్ర అగస్త్యుణ్ణి, సావిత్రి సత్యవంతుణ్ణి, సుకన్య చ్యవన మహర్షినీ, శ్రీమతీదేవి కపిలుణ్ణి, దమయంతి నలమహారాజునీ, మదయంతి సౌదామరాజునీ, కేశిని సగర చక్రవర్తినీ, అనసూయ అత్రిమహామునినీ — అనుసరించే వున్నారు. ఎన్ని కష్టాలైనా భర్తల పాదాలు విడిచి పెట్టలేదు. — ఆ విధంగానే నా భర్తమీద నా భక్తి ఏమీ సన్నగిలలేదు. సీతాదేవి శ్రీరామచంద్రుణ్ణి అనుసరించి మాత్రమే వుంటుంది. నీ అంతఃపురంలో అధికారము ఇచ్చి నన్ను మభ్యపెట్టలేవు. నీ సిరిసంపదలన్నీ నా వశం చేసి నన్ను వశపరుచుకోలేవు.

నా భర్త నీడలో సుఖంగా వున్న నన్ను వేరుచేశావు. నా భర్త ధనుస్సు పట్టినప్పుడు అగ్నికి వాయువు తోడైనట్లు విజృంభిస్తాడు. వామన మూర్తి రాక్షసుల ఐశ్వర్యం అంతా స్వాధీనం చేసుకున్నట్లు, నా భర్త నిన్ను జయించి నన్ను స్వాధీనం చేసుకుంటాడు. రుషులు యోగవిద్యా నైపుణ్యంతో వదలరో, నా భర్త నన్ను అట్లా వదలడు. ఆ మహానుభావుడికి కోపం రావాలే గానీ.... నిన్ను సంహరించి.... నన్ను రక్షించడానికి.... ఒక్క క్షణం...."

సీతలో సీత —హెచ్చరికలు చేస్తోంది —

"వొక్క క్షణంలో చెయ్యగలిగే వాడేనా ఇన్ని మాసాలు అలక్ష్యం చేసిందీ?.... అంత ప్రగల్భంగా మాట్లాడకు. తర్వాత సిగ్గు పడవలసి వొస్తుంది," —అంటోంది.

సీత ఆవేశం తగ్గక— "నిన్ను సంహరించడానికి నా మరిది చాలు...." — అని తలతిప్పింది —

— "ఇప్పటికైనా నన్ను నా భర్త దగ్గిరికి చేర్చి, శరణు కోరుకో. నీకు జయం కలుగుతుంది. నా భర్తని రుషులు కూడా పూజిస్తారు."

సీత మాటలు రావణుడికి కొత్త కాదు. నిర్లక్ష్యంగా నవ్వాడు. —"నువ్వు కరుణించడమే నాకు జయం. నిన్ను వొదులుకోవడం నాకు జయం కాదు. రాముణ్ణి ఇంకా నీ భర్త అంటున్నావు. నేను సహించను. ఇక నీ భర్త రాముడు కాడు. నేనే! ఇప్పుడు సీత రావణ వత్ని."

"రామా రామా!" —అంటూ సీత చెవులు మూసుకుంది. — క్రోధంతో కళ్ళెర్ర జేసింది— "సీచుడా! నా భర్త నీ నోరు వెయ్యి చెక్కలు చేసినప్పుడు సీత ఎవరి వత్నో నువ్వే గ్రహిస్తావు. దశరథ మహారాజు కోడలిననే సందేహమైనా లేకుండా కారుకూతలు కూస్తున్నావు. శ్రీరామచంద్రుడి పరాక్రమం గ్రహించలేక మూర్ఖుడివలె ప్రవర్తిస్తున్నావు. దేవతల వరాన్న పుట్టి, ఎన్నెన్నో సాహసకృత్యాలు చేసినవాడు నా భర్త...."

"సీతా! నేనూ వరాన్నే పుట్టాను. * ఎందరో వీరాధి వీరులతో యుద్ధాలు చేశాను. రాముడు కూడా వొక వీరుడే అని నువ్వు మురుస్తున్నావు."

---

*"వరాన్న పుట్టడం" అన్న మాటని ఈనాటి మొక్కులతో వ్రతాలతో పోల్చుకోవాలి. ఒక వ్రతం చేసిన తర్వాతో, ఒక మొక్కు మొక్కిన తర్వాతో, ఒక స్త్రీ గర్భవతి కావడం జరిగితే, ఆ బిడ్డ ఆ దేవుడి దయవల్ల పుట్టినట్టే నమ్మకం నమ్ముతుంది. అదే వరాన్న పుట్టడం.

"రాముణ్ణి మించిన పరాక్రమ వంతుడివే అయితే .... పిరికి పందవై మారువేషంతో, వొంటరిగా వున్న అబలని మోసగించి ఎత్తు కొచ్చావు. అదేనా నీ పరాక్రమం ?"

"మరి ఆ శ్రీరాముడు చేసిన వీరకార్యాలు ఏమిటో కూడా చెప్పు. ఒంటరిగా చిక్కిన అబలను బంధించి ముక్కూ చెవులూ కోసి పంపడమేనా ఆ మహానుభావుడి వీరత్వం? నేను పిరికిపందనై నిన్ను అపహరించలేదు. నా చాతుర్యం ప్రయోగించి, ఆ సీచుడికి తగ్గ శాస్తి చేశాను. *

సీతా: రాముడు నన్ను జయించగలడనే భ్రమ విడిచిపెట్టు. ఆ అల్పుణ్ణి నమ్ముకుని, నిన్ను కోరే లంకాధిపతిని తిరస్కరిస్తున్నావు. ఇకనైనా వివేకంతో ఆలోచించు. మన్మథుడు పూలబాణాలతో నన్ను సిద్ధపు తరుముతున్నాడు. నీ సౌందర్యం నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది."

"మూర్ఖుడా! ఎంత చెప్పినా శ్రీరాముడి పరాక్రమం గ్రహించలేని నువ్వు వున్నాదివే. నీ ప్రేలాపన నాకు దుర్భరంగా వుంది. నేను స్వతంత్రను కాను గనక, నిన్ను శపించడానికి నా భర్త అనుజ్ఞలేక వూరుకుంటున్నాను గానీ...." •

---

* ఒకరి పక్షంలో స్త్రీలని ఒకరు పరాభవించడాన్ని గమనించాలి.
రావణుడి పక్షంలో స్త్రీని రాముడూ;
రాముడి పక్షంలో స్త్రీని రావణుడూ;

• 22 వ సర్గ — 20 వ శ్లోకం.

"సీతకు రావణుణ్ణి నిగ్రహించే శక్తి లేదా? పతివ్రతలకు మహిమ వుంటుందంటారే!" — అనే ప్రశ్నలు వొస్తాయి కదా?.... అందుచేత, కవిగారు కిందా, మీదా పడి తర్కించాలని ఆరాట పడుతున్నారు.

"సీతకి శక్తివుంది కానీ — భర్త ఆజ్ఞలేక ఏమీచెయ్యలేదు — అంతేగాక, సీత తన శక్తితో రావణుణ్ణి శపించేస్తే, ఆ శక్తి ఖర్చయి పోతుంది. తర్వాత పాతివ్రత్యం రక్షించుకోడానికి ఇక శక్తేమివుండదు" ఇదీ కవిగారి తర్కం. చూశారండి — సీత అంటోంది — "భస్మమై

(ఫుట్‌నోట్ : 397 వ పేజీ తరువాయి)

పోదగిన వాడా! అపరాధము చేసిన వానిని శపించుటకు రాముని ఆజ్ఞ నాకు లేనందునను, పాతివ్రత్యము సంరక్షించు కొనవలసి యుండుట చేతనూ, — నా మహిమచే నిన్ను భస్మము చేయలేదు." — అవన్న మాట కారణం.

పతివ్రత దగ్గిరికి సింహం వొస్తుం దనుకోండి. "ఏవండోయ్! ... దీన్ని నేను చంపగలను గానీ.... చంపమంటారా? వొద్దంటారా? .... మీరే వొచ్చి దీన్ని చంపి నన్ను రక్షిస్తారా?" — అని అడిగి ఆ భర్త ఆజ్ఞ పొందాలి. — భర్త వూళ్లో లేడనుకోండి. సింహం తినేస్తే వూరు కోడమే. ఎందుకంటే, తన శక్తితో సింహాన్ని చంపేస్తే, ఆ శక్తి అయిపోతే, తర్వాత మళ్ళీ ఏ పులన్నా వొస్తే?.... ఆ పులిని చంపాలి కదా?.... (అనలు ఇప్పుడు బతికి బయటపడితే కదా? ఆ పులిని చంపటం?) ఇప్పుడు సింహాన్ని వొదిలిపెడితే ఇదే ప్రమాదం కదా?.... అబ్బే! పర్వాలేదు. ఇది తినదు. — ఇది తినకపోతే అదీ తినదు కదా! .... ఈ రకం ప్రశ్నలతో మన తలకాయలు గిర్రున తిరిగిపోతాయి.— పాతివ్రత్యం వల్ల మహిమ వొస్తుంది" —అనే ఒక అబద్ధాన్ని కాపాడ టానికి దాని వెంట ఎన్ని అబద్ధాలో! .... అబద్ధాల గొలుసులు!

ఇందులో ఇంకో విషయం— ఆ "శక్తి ఖర్చయి పోవడం"— లో రహస్యం ఏమిటి?

తపస్సు చేసి చాలా పుణ్యం కూడబెట్టడం, వొక్కోసారి కొంత పుణ్యం తీసి ఇంకొకరి కివ్వడం ఈ వూహల కన్నిటికీ మూలం — ధనానికి సంబంధించిన దృష్టే. సమాజంలో ధనానికి గొప్ప శక్తి వుంది. దాంతో గొప్ప అధికారం సంపాదించ వొచ్చును. గొప్ప గౌరవాలు పొందవొచ్చును. ధనం ఇవ్వవొచ్చును. తీసుకోవొచ్చును. అది వొక్కో సారి ఖర్చయి పోతుంది. వొక్కోసారి మిగులుతుంది. — ఈ ధనానికి సంబంధించిన దూషణే — ఆధ్యాత్మికమైన ఆలోచనల్లో అయితే తపస్సు.

రావణుడు పరిహాసంగా నవ్వుతున్నాడు — "నీ భర్త అనుజ్ఞ మాత్రమేనా? మామగారి అనుజ్ఞ కూడా కావాలా?"

"నీచుడా! పతివ్రతను పరిహసిస్తున్నావు. సూర్యుడు జలం పీల్చే పేట్టు, నా భర్త నీ అహంకారం పీల్చేస్తాడు.

పర స్త్రీ అపహరించిన పాపం నిన్ను కట్టి కుడపక మానదు. నా భర్త రోషంతో నిన్ను కన్నెత్తి చూస్తే చాలు .... అగ్నిజ్వాలల్లో పడి భస్మమై పోతావు. ఛండాలుడు మోక్షం చేరలేనట్టు, నువ్వు నన్ను ఎన్నటికీ పొందలేవు. —" —రావణుణ్ణి నిందిస్తో వుంటే సీతకు నిత్య నూతనమైన ఆద్భుతమైన ఆవేశం కలుగుతుంది. జగత్తులో పతివ్రత లందరూ ఆమెలో ఆవేశిస్తారు. తన సౌశీల్యాన్ని దేవతలు చాటుగా పరీక్ష చేస్తున్నారనే గాఢ విశ్వాసం కలుగుతుంది. పతివ్రత పర పురుషుణ్ణి ఎన్ని విధాల దూషించగలదో అన్ని విధాలా దూషిస్తుంది. పర పురుషుణ్ణి తిరస్కరిస్తోన్న ఆ కార్యంలో —తను మహా పతివ్రతననే ఆత్మానందంతో, దేహంలో అణువణువూ పులకరించి, దివ్యానుభూతి పొందుతుంది సీత. *

(ఫుట్‌నోట్ : 398 వ పేజీ తరువాయి)

తపస్సు వల్ల గొప్ప శక్తి (మహిమ) వొస్తుంది. అది మిగలడం, ఖర్చయిపోవడం, ఇతరులకి ఇవ్వడం, —అన్నీ ధనంలాగే వుంటాయి.

ఇంతకీ, సింహాన్ని చంపడానికి భర్త ఆజ్ఞ అడిగే సీతలాగా, సీత భర్తలాగా వుండాలంటే సిగ్గెయ్యదూ మనకి?

* 22 వ సర్గ — 10, 11, 12.

"రావణునిచే బెదిరించబడు సీతను జూచి దేవ గంధర్వ కన్యలు దుఃఖించిరి. కొందరు స్త్రీలు పెదవుల నన్నుల చేతను, కొందరు ముల ముల చేతను, కన్నుల చేతను సీతను సమాధాన పరిచిరి. ఇట్లు వారిచే సమాధాన పరచబడిన సీత, తన పాతివ్రత్య బలముచే గర్వించినదై యుండెను." —

రావణుడు తనని బలాత్కరించక పోవడానికి కారణం — తన పాతివ్రత్య మహిమేనని గాఢమైన విశ్వాసం కలుగుతుంది. తనలో సత్యం చూసి దేవతలే తనని కాపాడుతున్నారనే ధైర్యం కలుగుతుంది. — తనకు శక్తి లేకపోవడం ఏమిటి? — మహా శక్తి సంపన్నురాలు తను! — తన పాతివ్రత్య మహిమే ఈ దుర్మార్గుణ్ణి అంత దూరాన నిలబెడుతోంది. తన శరీరం తాకే అరుదా ఈ నీచుడు? —

"రావణా! ఇప్పటికైనా గ్రహించు. శ్రీరాముడి చేతిలో కోరి మరణం తెచ్చుకోకు. నా భర్త పరాక్రమము నువ్వెరుగవు. సూర్య చంద్రుల్ని పడగొట్టేస్తాడు. భూ మండలం తలకిందులు చేసేస్తాడు .... సముద్రా...." — అని చప్పున ఆగింది సీత.

సీతలో సీత సందేహిస్తోంది. జంకుతోంది. —

"పూర్వం కథల్లో విన్న సంగతులన్నీ మాట్లాడడం ఏం ధర్మం? సూర్య చంద్రుల్ని పడగొట్టడం ఏమిటి? భూమిని తల్లకిందులు చెయ్యడం ఏమిటి? ... మానవుడు అటువంటి కార్యాలెట్లా చెయ్యగలడూ? కొంచెం ఆలోచిస్తూ...."

"నీకు తెలీదు. నా భర్త మానవుడు కాడు. మానవ రూపంలో వున్నాడే గానీ ... భగవంతుడెప్పుడూ మానవ రూపంలోనే వుంటాడు .... ఆయనే తల్చుకుంటే...." —

ఆవేశంతో తన్మయత్వం చెందుతోంది సీత.

సీత మౌనం చూసి — రావణుడు నవ్వు మొహంతో — "ఊఁ ఇంకా ఏం చేస్తాడు నీ భర్త?" — అన్నాడు.

సీత కోపంగా అయినా తనతో మాట్లాడుతోంటే రావణుడికి వుత్సాహంగా వుంది. ఇంకా పరస్త్రీగా వున్న సీత తిట్లూ, శాపాలూ,

---

(ఫుట్‌నోట్ : 399 వ పేజీ తరువాయి)

దేవ గంధర్వ కన్యకలు ఆకాశంలో వున్నారని అర్థమా? .... రావణుని భార్యలలో, దేవ, గంధర్వ జాతుల స్త్రీలు అనుకోవొచ్చునా? .... అనే విషయంలో స్పష్టత లేదు.

అతనికి ముచ్చటగా వున్నాయి. పాత భార్యల అందాల ముందు సీత అందం వెయ్యి విధాల నూతనంగా, మనోహరంగా కనిపిస్తోంది. సీత కోపం ప్రణయకోపంగా మాత్రమే గోచరిస్తోంది.

రావణుడు సీతని– మీసాలు మెలిదిప్పుతూ గాంభీర్యంగా చూస్తున్నాడు.

సీత రావణుణ్ణి తీక్షణంగా చూస్తోంది. "నీకు నీతిబోధ చేసేవారెవరూ లేనే లేరా? నీవంటి దుర్మార్గుడికి ఆపదలు సంభవిస్తేనే అందరూ సంతోషిస్తారు. నీ పాపానికి నిన్ను యముడైనా విడిచిపెడతాడేమోగానీ, రాముడు మాత్రం విడిచిపెట్టడు, నా భర్త పరాక్రమం ముందు నీ సైన్యమంతా గరుడపక్షిని చూసిన సర్పాల మల్లే చెల్లాచెదురై పోతారు. నువ్వు ఎన్ని యుద్ధాలైనా చేయవొచ్చును. నిన్ను శత్రువు లెవరూ జయించలేక పోవొచ్చును. నా భర్త చేతిలో మాత్రం — యూప స్తంభానికి కట్టిన యజ్ఞ పశువుమల్లే నీకు చావు తప్పదు. పిడుగు పాటుకి కూలిపోయే మహావృక్షం మల్లే రామబాణంతో నువ్వు కూలిపోతావు. నా భర్త నీ లంకనంతా పీనుగుల మయం చేస్తాడు. నీ రాజ్యం స్మశానాల పొగతో, గద్దల గుంపుతో నిండిపోతుంది. నీ సర్వనాశనానికే నీకీ బుద్ధి పుట్టింది."—

సీత మాటలు వినోదంగా వింటోన్న రావణుడికి, క్రమంగా వినోదం తగ్గి, తోక తొక్కిన తాచుమల్లే కోపం పొంగింది.

—"మూర్ఖురాలా! సత్యాసత్యాలు విస్మరించి, జ్ఞానహీనురాలివై రాముడి అల్పత్వం గ్రహించలేక, భర్త జపం చేస్తున్నావు. అంతటి పరాక్రమవంతుడై కూడా, నీ భర్త నిన్నింత కాలం రక్షించలేక పోయాడెందుచేత?"

"అది నీ భాగ్యం! నీ కింకా మూడలేదు. నీ పాపం పండలేదు. ఆ రోజు ఇంకా తోసుకు రాలేదు."

"నీచురాలా! నీ పరుషోక్తులకే నిన్ను ఖండించాలి. ఆ రాముడి పేరు ఎత్తినందుకే నిన్ను దండించాలి. నా వంటి రాజాధిరాజు నిన్ను

యాచించడమా? పురుషుడు స్త్రీ పట్ల ఎంత ప్రీతి చూపితే అంత తిర స్కారం పొందుతాడు.

నీ మీద నా కోరికే నా కోపాన్ని చంపుతోంది. నీకు ఇంకా రెండు మాసాలు గడువు ఇస్తాను. అప్పుడైనా నువ్వు నా శయ్యమీదకు చేరవలసిన దానివే," —అని మీసాలు తిప్పాడు రావణ మహారాజు.

సీత పటుదల రావణ పత్నులకు విస్మయం కలిగిస్తోంది. వారిలో అనేకమంది రావణుడి విషయంలో ఎంతో వ్యతిరేకత చూపినవారే మొదట. తొందరలోనే అతనికి లోబడి అతన్నే భర్తగా అంగీకరించక తప్పలేదు. కానీ.... ఈ సీత....! *

---

* ఉత్తరకాండలో — 24 వ సర్గ.

(ఉత్తరకాండకు గట్టుపల్లి శేషాచార్యులుగారి అనువాదం లేక పోవడంచేత, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి అనువాదం నుంచి అవ సరమైన భాగాలు ఇస్తున్నాను.)

రావణుడు దేవతల్ని జయించి లంకకు పోతూ, స్త్రీలను ఏ విధంగా తీసుకు పోయాడో, వారి పరిస్థితి ఏమిటో చూడండి—

"దురాత్ముడైన రావణుడు ఇంటికి వెడుతూ దారిలో దేవ కన్యక లనూ, రాజ కన్యకలనూ, ముని కన్యకలనూ, దానవ కన్యకలనూ, మానవ కన్యకలనూ అనేక మందిని పట్టుకుని విమానంలో ఎక్కించు కున్నాడు. అందగత్తె కనబడితే చాలు. అది కన్యక అయినా, వివా హిత అయినా సరే. దాని బంధువులను చంపి దాన్ని విమానంలో ఎక్కించుకుంటూ వొచ్చాడు.

వారిలో వొకతె— "నేను లేకపోతే నా పసివాడేమయి పోతాడో"— అని ఏడ్చింది.

"నా కోసం నా తల్లిదండ్రులు ఎంతగా ఏడుస్తున్నారో!"

"నాకు నా భర్తే దైవం కదా? ఇక నాకేమి గతి?"

"పూర్వజన్మలో నేనేమి పాపం జేసుకున్నానో!"

"ఛీ! మనుష్య లోకంలో ధర్మాత్ముడైన వాడే లేడు."

"వాసే ధ్యానమాలినీ ! .... మహారాజు సీతని ప్రాధేయపడతా డెందుకే ? .... మన విషయంలో ఇలా ప్రవర్తించాడా ?" ....

"అదే నాకూ ఆశ్చర్యంగా వుంది .... ఇష్టపడని స్త్రీని బలాత్కరించడం జయం కాదని .... మనసు మార్చుకున్నాడేమో ! ఏమైనా .... సీత కన్నీరు కార్చడం మనకు క్షేమం కాదు. మహారాజు నిర్దయగా వున్నాడు."

దాసీలు కూడా సీతపట్ల భక్తి చూపుతున్నారు. మహారాజు పరస్త్రీలను బంధించడం వారికి కొత్త కాకపోయినా, సీత దుఃఖం చూసి మాత్రం వారు చాలా దయతో ప్రవర్తిస్తారు.

మహారాజు సీత చుట్టూ దాసీలమీద గర్జిస్తున్నాడు – "ఇంతకాలం మీరేమీ ప్రయత్నించినట్టు లేదే !"

"చిత్తం ! మా ప్రయత్నాలు మేము చేస్తోనే వున్నాము ప్రభూ!"

"మళ్ళీ మళ్ళీ ప్రయత్నించండి. ఈమె నాకు స్వాధీనురాలయ్యేట్టు చెయ్యండి. మీరు కోరిన బహుమతు లిస్తాను."

..... ధాన్యమాలిని .... చిరునవ్వుతో రావణుడి హస్తం పట్టుకుంది. — "శాంతించు మహారాజా ! ఈ మూర్ఖురాలి తిరస్కారంతో మనసు కలవర పరుచుకోకు. నీవంటి పురుషుడితో సుఖానుభవించడానికి ఈమె పెట్టిపుట్టలేదు. నీ భోగ భాగ్యాలు అనుభవించే భాగ్యం— ఈమెకు లేదు. — ఈమె మన జాతి కాదు. మన కులం కాదు. మా వంశాచారమో అని గోల పెడుతోంది. పాతివ్రత్యమో అని ఏడుస్తోంది .... పోసి కనికరించి విడిచిపెట్టు. ఇంకా ఈమె మీద మోహం పెంచుకుని ప్రయోజనం లేదు. నిన్ను కోరని స్త్రీని ఇంతగా ప్రార్థించడం నీకు

(ఫుట్‌నోట్ : 402 వ పేజీ తరువాయి)

— ఈ రకంగా అందరూ తల్లులనూ, తండ్రులనూ భర్తలనూ, బిడ్డలనూ తలుచుకుంటూ ఏడ్చారు."—

రావణుడి భార్యలంతా, రావణుణ్ణి ఇష్టపడి వొచ్చినవారేనని కవిగారే అన్నారు గతంలో.

అవమానం కాదా? నీమీద కోరికలేని స్త్రీతో ఏం ఆనంద పడగలవు? ... నిన్ను కోరే ప్రియురాళ్ళం మే మందరం లేమా? నువ్వు ఏరికోరి తెచ్చుకున్న సౌందర్యరాశు లెందరో లేరా? .... మహారాజా! సీతని విడిచిపెట్టు. మా ప్రేమతో ఆనందించు."

"అవును ప్రభూ! .... మే మందరం నీ పాదసేవ కోసమే పుట్టినవాళ్ళం. నీకు మే మెన్నడూ తిరస్కారం చూపలేదే!" — రావణుడి భార్య లందరూ అతనిజుట్టూ జేరారు.

రావణుడు సీతవేపు ధిక్కారంగా చూస్తూ — "చూడు. ఎందరు స్త్రీలు నా ప్రేమకోసం, నా కరుణకోసం అర్రులుచాస్తూ వున్నారో! నీకు రెండు మాసాలు మాత్రమే గడువు ఇచ్చాను. తర్వాత నా కౌగిట్లోకి రావలసిన దానివే" — అని దాసీ లందర్నీ హెచ్చరికగా చూసి కదిలాడు.

అతని భార్య లందరూ సీతని భక్తిగా, విస్మయంగా చూస్తూ మహారాజుని అనుసరించారు.

హనుమంతుడు చెట్టు దూకి రావణుడిమీద కలబడాలని చాలాసార్లు వుత్సాహపడి .... రావణుడి భీకరత్వం చూసి .... అన్నిసార్లూ నీరసపడ్డాడు.

సీత దుఃఖం ఆపుకోలేక తలదించి వలవలా ఏడుస్తోంది.

దాసీలు ఏకజటా, హరిజటా, త్రిజటా, వికటా, దుర్ముఖీ, అజాముఖీ, శూర్పణఖీ .... అందరూ సీత చుట్టూ చేరారు. మహారాజు ఇచ్చే బహుమానాలమీద అందరికీ చాలా ఆశగా వుంది.

హరిజట సీత జుట్టు నిమురుతూ — "ఎందుకమ్మా వ్యర్థంగా దుఃఖిస్తావు? .... పురుషుడు కోరినప్పుడు అంగీకరించడం స్త్రీకి ఎంత మర్యాద!" — అంటూ బుజ్జగించింది.

"ఆ పురుషుడేమైనా సామాన్యుడా? సాక్షాత్తూ రావణ బ్రహ్మ! .... ఎందరు స్త్రీలు ఆయన భార్య లయ్యారో నువ్వే చూశావుగా?" — అని ఏకజట అందుకుంది.

"ఆయన భార్యలందరూ ఒకరికంటే ఒకరు భర్త దయ నంపాదించాలని తహతహలాడుతూ ఉంటారు. అలాంటి పురుషుడు నిన్ను

ప్రార్థిస్తోంటే లక్ష్యపెట్టకుండా ఉన్నావు. ఏం తెలివి సీది!" — అని ఒక దాసీ విస్తుపోయింది.

"మహారాజు నిన్ను బలాత్కరించలేక దూరుకున్నాడనుకున్నావా? .... నీమీద ప్రేమకొద్దీ నిన్ను కష్టపెట్టలేక సహనం వహిస్తున్నాడు సుమా! .... మా మహారాజు ఇంత దీనంగా ఒక స్త్రీని ప్రార్థించడం మే మెన్నడూ చూడలేదు .... ఆయన స్థితి చూస్తే మా మనసులు ద్రవిస్తున్నాయి."

సీత రోషంగా తలఎత్తి వారి మొహాలు చూస్తూ — "నే నెవరి ననుకుంటున్నారు? దశరథ మహారాజు కోడలిని. శ్రీరామచంద్రుడి భార్యని. రఘు వంశస్థురాలిని గురించి అనరాని మాట లంటున్నారు మీరు" — అని కళ్ళెర్రజేసింది.

"రఘు వంశం, రఘు వంశం అంటావు. పుల స్త్యబ్రహ్మ వంశం కన్నా గొప్పదా నీ భర్త రఘు వంశం? ఆరుగురు ప్రజాపతుల్లో నాలుగవవాడు పులస్త్యుడు. ఆయన మనవడే రావణుడు. ఈ లంక పూర్వం రావణుడి తల్లివేపు పూర్వులదైతే, దాన్ని శత్రువులు ఆక్రమించేశారు. రావణుడు పుట్టి పెరిగిం తర్వాత, లంకలో శత్రువుల్ని వెళ్ళగొట్టి, లంక స్వాధీనం చేసుకుని కీర్తి పొందాడు. అటువంటి మహా వీరుడు నీకు పనికిరాకుండా పోయాడా?" — అని బుగ్గలు నొక్కుకుంది ఏకజట. *

---

* ఉత్తరకాండలో మొదటినించీ 15 సర్గల వరకూ.

రాక్షసుల పుట్టు పూర్వోత్తరాలలో — రావణుడికి సంబంధించిన విషయాల తాలూకు సారాంశం ఇది —

సుమాలి ఒక రాక్షసుడు. అతడు తన అన్నదమ్ములతో కలిసి లంక నిర్మించుకొని, కొంతకాలం ఉన్నాడు. శత్రువులు — అంటే రాక్షసులు కానివారు — లంక స్వాధీనం చేసుకున్నారు. రాక్షసులంతా వారి దేశం విడిచిపోయి అక్కడక్కడా తలలు దాచుకుంటూ ఉన్నారు.

విశ్రవసు (విప్రవసు) — రాక్షసుడు కాడు, భార్య దేవవర్ణిని. కొడుకు కుబేరుడు.

"నా భర్త అంతటివాడు, ఇంతటివాడు" — అంటావు. ఎంతటి వాడయితే మాత్రం మా మహారాజుని జయించి నిన్ను తీసుకుపోగలడా? ఇంకా ఎందుకా అడియాసలు? నీవంటి స్త్రీకి రావణుడే భర్తగా ఉండాలి. ఏమే ప్రహసా! మన మహారాజుకీ, సీతాదేవికీ చక్కని ఈడూ జోడూ కాదూ?"

"అయ్యో! ఎందుకుకాదే! సీతా చక్కనిదే. రావణుడూ చక్కని వాడే. ఇద్దరూ భార్యా భర్తలైతే, రతీ-మన్మథులు సిగ్గుపడవలసిందే."

(ఫుట్‌నోట్ : 405 వ పేజీ తరువాయి)

రాక్షసులు లంక వొదిలేసిం తర్వాత విశ్రవసు తన కొడుకుని (కుబేరుణ్ణి) లంకలో ఉంచాడు. అంటే విశ్రవసు రాక్షసులకు శత్రు పక్షంలోవాడన్నమాట.

సుమాలికి కైకసి అనే కూతురు ఉంది. కైకసి, మహావీరుడైన కుబేరుడివంటి కొడుకుని కనాలని విశ్రవసుని పెళ్ళి చేసుకుంది. (కుబేరుణ్ణి చేసుకోవచ్చుగా! .... ముసలాయనైతే వొప్పుకుంటాడనేమో!) — కైకసికి రావణుడు పుట్టాడు. రావణుడూ, కుబేరుడూ అన్నదమ్ములే. తల్లులు వేరువేరు. —

కానీ రావణుడు రాక్షసుడయ్యాడు. ఎందుచేత? తన తల్లి రాక్షస జాతి గనక. — కుబేరుడు రాక్షసుడు కాలేదు. (మళ్ళీ రావణుడి వంశం తండ్రి వంశమే.)

రావణుడు పెద్దవాడయ్యాక, సుమాలి (తల్లి తండ్రి) మనవడితో "లంక మనదే. నువ్వు ఆక్రమించు" — అని చెప్పాడు.— రావణుడు కుబేరుడికి—"లంక నా తల్లి వేపు పూర్వులది. నాకు వొదిలేసి వెళ్ళిపో" — అని కబురు పంపించాడు. విశ్రవసు కూడా కుబేరుడితో — "రావణుడు మూర్ఖుడు. బలవంతుడు. వొదిలెయ్యి" — అని చెప్పాడు. కుబేరుడు లంక వొదిలేసి వెళ్ళిపోయాడు. అప్పటినించీ లంక మళ్ళీ రాక్షసులకు నివాసం అయింది.

రావణుడు సీతని ఎత్తుకుపోయేనాటికి, రావణుడి కొడుకులుకూడా వివాహాలైనవారే.

"ఇంతమంది స్త్రీలని చూశాంగానీ, సీత అంత సౌందర్యరాశిని ఎక్కడా చూడలేదే !"

"అందుకే కాదూ మహారాజు అంత కోరి తెచ్చుకున్నాడూ ? — సీత దయ చూపదుకానీ ...."

"సీతా ! మా మాట విను. నువ్వు దుఃఖించడం మాకు సంతోషం కాదు సుమా ! ... నువ్వు సుఖంగా నవ్వుతూ. తుళ్ళుతూ తిరుగుతోంటే నిన్ను చూసి సంతోష పడతాం. నువ్వు అంగీకరించాలేగానీ రావణుడు నిన్ను భోగ భాగ్యాలలో తేలుస్తాడు."

సీత తిరస్కారంగా — "నా భర్తకోసం ఈ భోగ భాగ్యాలన్నీ త్యజించి వొచ్చావని మీ రెరుగరు" — అని గంభీరంగా చూసింది.

"అసలు నీ భర్తకున్న భోగ భాగ్యా లేవిటీ నువ్వు త్యజించడానికీ ? — నీ సంగతులన్నీ మాకు తెలుసు. మా దగ్గిర గొప్పలు చెప్పకు. నీ భర్త అడవులకు పోయింతర్వాత, నువ్వు అంతఃపురాల్లో ఉంటే మాత్రం నిన్నెవరు గొప్ప చేస్తారూ ?"

"నీ భర్తకి చిల్లిగవ్వ ఆస్తి లేదటగా ? అసలు రాజ్యాధికారమే లేదటగా ? అలాంటి సంబంధం ఎలా కుదిర్చాడూ నీ తండ్రి ? .... ఆడపిల్ల నిచ్చేప్పుడు కొంచెం మంచి చెడ్డలు చూసుకోవద్దూ ?"

సీత పౌరుషపడి — "ఈ సంబంధం నా తండ్రి కుదర్చలేదు. బ్రహ్మ కుదిర్చాడు. నా భర్త గొప్ప వీరత్వంతో ధనుస్సు పోటీలో నన్ను గెల్చుకున్నాడు" — అని అతిశయంగా చూసింది.

"మరి రావణ చక్రవర్తి వీరత్వంతోకే నిన్ను తెచ్చుకున్నాడుగా?"

"అది వీరత్వం కాదు. అతడి నీచత్వం. నా భర్తలేని సమయంలో బలాత్కారంగా తీసుకువొచ్చాడు."

"పోనీ నీ భర్తతో యుద్ధంచేసి, నిన్ను గెల్చుకుంటే అప్పుడు ఇష్టం కలుగుతుందా ?"

"పతివ్రతలు వొక్క భర్తతోకే...." అని మొహం త్రిప్పేసింది సీత.

అందరూ నీరసపడి మొహాలు చూసుకున్నారు. "లాభంలేదు...." —అని కనుసైగలు చేసుకున్నారు.

"ఎవరి కర్మ కెవరు కర్తలు? .... రావణ చక్రవర్తి భార్య అయ్యే అదృష్టం లేదు. ఆ రాముడేవిటో దేవుడను కుంటోంది," — అని చేతులు తిప్పింది వినీత.

అజుముఖి నవ్వుమొహంతో సీతకు దగ్గరగా పోయి కూర్చుంది. —"అమ్మా! వొక్కసారి నా వేపు చూడు. నువ్వు ఇంతకాలం నీ భర్త వొస్తాడనీ, తీసుకు పోతాడనీ ఎదురు చూశావు. వుత్తమ స్త్రీలు చేసే పని చేశావు. ఇంకా ఎంతకాలం వైరాగ్యం అనుభవిస్తూ జీవితం నాశనం చేసుకుంటావు? నీ సుగుణాలు చూస్తూ వున్నవాళ్ళం కాబట్టి, నీ క్షేమం కోసమే ఇంతగా చెపుతున్నాం. నువ్వు నీ భర్త ఆధీనంలో వున్నంతకాలం మీ జాతి కట్టుబాట్లు పాటించావు. ఇప్పుడిక పాటించవలసిన అగత్యమేమీ లేదు. మా మహారాజుని వివాహం చేసుకుని ఆయనకే పాతివ్రత్యం పాటించు. ఆయన ముచ్చటా తీరుతుంది. నీ ముచ్చటా తీరుతుంది. మహారాజు నీ కోసం మందోదరిని కూడా వొదిలి పెట్టేస్తాడు. సరేనా? నువ్వు అవునంటే నే నిప్పుడే మహారాజుకి చెప్పి వొస్తాను. ఆయన ఎంత సంతోష పడతాడో నువ్వెరగవు."

"సీతాదేవీ! మే మందరం నీకు పన్నీటితో స్నానాలు చేయిస్తాం. నువ్వు కోరుకున్న ఆభరణాలతో అలంకారాలు చేస్తాం. నీ సవతులందరూ నీకు వూడిగం చేస్తారు...."

"మీ రెన్నడూ పతివ్రతల గురించి వినలేదా?" — అని రోషంగా చూసింది సీత.

"ఇంకా వినడం ఎందుకు? చూస్తున్నాంగా నిన్నూ?"

"పతివ్రతలు భర్తనే సర్వస్వంగా నమ్ముతుని, భర్తతోటే స్వర్గానికి...."

"ఆ స్వర్గసుఖాలన్నీ మా మహారాజు ఇక్కడే చూపిస్తాడుగా? .... స్వర్గంలో తాగే అమృతాలూ .... స్వర్గంలో తిరిగే వుద్యాన వనాలూ...."

"ఇది స్వర్గం కాదు. మహా నరకం నాకు."

"ఎంత చెప్పినా నీ పట్టుదలే నీది చెప్పేది చెవిన బెట్టవు. సిరీ సంపదా లేనివాడు నీ భర్త. ఏం బాముకుంటావు?"

"సిరినంపదలు క్షోరను. నా భర్త పాదసేవే నాకు మహా భాగ్యం:"

"అరణ్యాల్లో పడి తిరుగుతావు. ఏం సుఖపడతావు?"

"నా భర్త తిరిగే అరణ్యాలే నాకు నందనాలు."

"ఏం ఆడదమ్మా ఇది! ఆ దేశంలో ఇలాంటి కొయ్యరకం అడవాళ్ళుంటారో . ఏమో! .. "—

పరిచారిక లందరూ బుగ్గలు నొక్కుకున్నారు.

"నీ భర్త ఎప్పుడొస్తాడమ్మా నీ కోసం?"

"పాపం భార్య జాడలు తెలీక రాలేకపోయాడే. ఆకాశవాణి జాడలు చెప్పగానే తప్పకుండా వొస్తాడు."

"ఇంతకాలం ఎందుకు చెప్పలేదో!"

"ఆకాశవాణికి మాత్రం తెలియవొద్దా?"

ఆ వెటకారాలు భరించలేక సీత కళ్ళనీళ్ళు పెట్టుకుంది —

"మూర్ఖులే మీరు నన్ను పరిహాసాలు చేస్తున్నారు. నా భర్త నన్ను రక్షించడానికి తప్పకుండా వొస్తాడు నా మరిదితో కలిసి. ఆ అన్నదమ్ములు ఎన్నటికీ ఈ పరాభవం సహించరు. నన్ను దుఃఖపెడుతోన్న మీ రందరూ ఎంతోకాలం సుఖంగా వుండరు. మీ లంక సర్వనాశనం అయ్యే ఘడియ లింకా దగ్గరకు రాలేదు. మీ రందరూ భర్తలు పోయి, విధవలై దుఃఖిస్తో వుంటే, నేను చూడకపోను."

"ఒకవేళ నీ భర్తే మరణిస్తేనో?"

"హరి హరీ!"— అని చెవులు మూసుకుంది సీత.

"ఎందుకమ్మా! అటువంటి పాపపు మాటలు వుచ్చరిస్తావూ? మీ రందరూ నన్ను చంపెయ్యండి నేను మాత్రం మీరు చెప్పినట్టు చెయ్యను. బ్రాహ్మణుడు శూద్రుడి కెలా మంత్రం వుపదేశించడో, అలాగే నా శరీరం రావణుడి కివ్వను."— అని తల వొంచుకుంది.

"సీతా! కన్నీళ్ళు కార్చకు. మా మహారాజు పరితపిస్తాడు. తెలివిగా ఆలోచించు. రావణుడి మీద ప్రీతి కలిగించుకో. తర్వాత ఎంత ఆనందంగా జీవించగలవో చూడు. స్త్రీల యౌవ్వనం అస్థిరం అని ఎరగవా? .... అంత మహారాజుని నిర్దయగా ఎంతమాట లన్నావు! .... ఆయన నీ మీద దయచేతా, ప్రేమచేతా సహించాడు గానీ ఇంకో స్త్రీకైతే మరణదండన విధించక పోయాడా?"

"వాసే చండోదరీ! రాజు మరణదండన విధించేదాకా ఎందుకే? ఎనమే సీతనిచంపేద్దాం రాజు మనల్ని ఏమీ అనడు. మంచిపని చేశారని మెచ్చుకుంటాడు. — అంతేగానీ, అంత నెమ్మదిగా బతిమాలాడేం!.... మహారాజు పిచ్చిగానీ, ఈవిడకన్నా అందగత్తెలు లేకపోయారా? కాముకుడి కళ్ళకు కోతి కూడా రంభ లాగానే కనిపిస్తుంది, లేకపోతే భార్య లందర్నీ వొదిలి ఈవిణ్ణి అందలం ఎక్కిస్తానంటాడా?"

"ముద్దుగా చెపితే వినకుండావున్నావు సీతా! చివరికి నీకు మరణశిక్షే రాసిపెటివుంది."

సీత శరీరం జలదరించింది.

మరణ దండన అనే మాట సీతకు అర్థం కాని జుగుప్స కలిగిస్తుంది. మహా పతివ్రతకు మరణ దండనా? .... ఎన్నడూ ఏ కథలోనూ వినలేదే! చివరికి పతివ్రతలే జయించారు గానీ....

సీత ఆవేశంకొద్దీ —"నన్ను చంపండి .... నరకండి." — అంటుందే గానీ ... నిజంగా చంపుతారనే వూహ వొచ్చినప్పుడు పతివ్రతల ఆవేశం సన్నగిలి, క్షుద్ర స్త్రీలకు కలిగే భయం కలుగుతుంది.

సీత దిక్కులు చూస్తోంది. హఠాత్తుగా ఏదైనా అద్భుతం జరుగుతుందేమో! ఎవరైనా, ఎలాగైనా వొచ్చి తనని రక్షిస్తారేమో! — అని ఆశ పడుతోంది. నిట్టూరుస్తోంది. — "ఏ జన్మలో ఏం మహాపాపం చేశానో! ఏ పూజలో ఏం లోపం చేశానో! ఏ వ్రతంలో, ఏం దానం తక్కువ చేశానో! .... నా పుణ్యం అంతా చెలిపోయిందేమో! — అందుకే ఈ దుర్మార్గుల చేతుల్లో పడ్డాను. ఇక ఎవరు విడిపిస్తారు నన్ను? — బొటబొటా కన్నీళ్ళు కారుస్తోంది.

అప్పుడే వొచ్చిన త్రిజట సీత దగ్గిర కూర్చుని — "దుఃఖించకు తల్లీ ! ఏం జరగాలని రాసిపెడితే అదే జరుగుతుంది. వూరుకో. రాత్రి నాల్గోక కల వొచ్చింది. అది వింటే చాలా సంతోషిస్తావు" — అని సీతని ఓదార్చింది.

"ఏమిటే అదీ ?" — అని అందరూ త్రిజట చుట్టూ చేరారు.

"దంతంతో చేసిన తెల్లని పల్లకీ, హంసలు మోస్తున్నాయి. అందులో తెల్లటి వస్త్రాలతో, పూలదండలతో శ్రీరాముడూ, లక్ష్మణుడూ లంకకు వచ్చారు. — సీత నవ్వు మొహంతో పల్లకీ ఎక్కి కూర్చుంది. — తర్వాత మళ్ళీ రాముడు ఏనుగుమీద ఎగురుతూ కనపడ్డాడు. తర్వాత సీత కూడా ఆ ఏనుగెక్కింది ఏనుగు ఆకాశంలోకి ఎగిరింది సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ చేతులతో పట్టుకుంది సీత. మళ్ళీ రాముడు, లక్ష్మణుడితో ఎద్దుల బండిమీద ఇక్కడికి వొచ్చాడు. సీతని తీసుకుని పుష్పకవిమానం మీద ఎగిరి వెళ్ళిపోయాడు.

మరి రావణుణ్ణి ఎలా చూశానో చెప్పనా ? .... అబ్బ ! తలుచుకుంటే ఎంత భయంకలుగుతోందే ! నల్లటి బట్టలు, బోడితల, గన్నేరు పూల దండలు, నూనె తాగుతున్నాడు. ఒక స్త్రీ రావణుణ్ణి విమానంలోంచి బయటికి గెంటేసింది. భూమిమీద పడిపోయాడు. మళ్ళీ ఎర్రటి బట్టలు. గాడిదల రథంమీద పోతున్నాడు. పోతూ పోతూ కింద పడిపోయాడు. కింద పడగానే దిగంబరంగా లేచాడు. నూనె పూసుకుంటున్నాడు. జుట్టు విరబోసుకున్నాడు. నవ్వుతున్నాడు. అరుస్తున్నాడు. దుర్గంధంతో నిండిన బురదలో, నరక కూపంలో మునిగిపోయాడు. మళ్ళీ రావణుణ్ణి వొక స్త్రీ కంఠానికి తాడుకట్టి ఈడ్చుకుంటూ తీసుకుపోయింది. — కుంభకర్ణుణ్ణి కూడా అలాగే చూశాను. రావణుడి కొడుకులందర్నీ అలాగే చూశాను. పందులమీదా, ఒంటెలమీదా కనపడ్డారు.

విభీషణుడు మాత్రం తెల్లటి వస్త్రాలతో, పూల హారాలతో ఏనుగు ఎక్కి, మంగళ వాయిద్యాలతో ఆకాశానికి ఎగిరాడు.

లంకలో ప్రజలందరూ మద్యపానంతో మైమరచి తెలకలాడుతున్నాడు.

లంకలో ఇళ్ళన్నీ కూలిపోయి వున్నాయి. గుర్రాలూ, ఏనుగులూ చచ్చి పడివున్నాయి. ఒక వానరుడు వొచ్చి లంకనంతా కాల్చేశాడు.

ప్రజలందరూ బూడిద పూసుకుంటున్నారు. వీరాధి వీరు లందరూ పేద గుంటలో పడివున్నారు. లంక ... చచ్చిన జంతువులతో, విరిగిన రథాలతో, కూలిపోయిన గృహాలతో .... శిధిలమై సముద్రంలో మునిగి పోయింది."

— త్రిజట మాటలు వింటూ సీత పట్టలేని ఆనందంతో దుఃఖం మరిచిపోయింది.

పరిచారిక లందరూ చాలా భయపడి కొయ్యబారిపోయారు.

"సీత మహా పతివ్రత. ఆమెనేమీ బాధించవద్దు. మన తప్పుల కన్నిటికీ శరణు కోరుకోవాలి. సీతని విడిచిపెట్టి దూరంగా పోదాం. ఆమెని సుఖంగా వుండనివ్వండి," — అని లేచింది త్రిజట. — అందరూ లేచారు. భక్తిగా చూస్తూ వెళ్ళారు. *

సీత చెట్టుకింద తిరుగుతూ ఆలోచనల్లో మునిగింది — త్రిజట కల వింటోన్నప్పుడు కలిగిన సంతోషం అంతా నెమ్మ నెమ్మదిగా హరించి పోయింది. ఈ పరిచారికలు తనని మభ్యపెట్టి, తన దయ సంపాదించ డానికి ఎన్నో విధాల ప్రయత్నాలు చేస్తోనే ఉన్నారు. ఈరోజు ఈ కల చెప్పి, రేపు ఇంకో కల చెపుతారు.

త్రిజట తనమీద ఎంతో భక్తితో, దయతో వుంది. అయినప్పటికీ రావణుడి పరిచారికే. ఈ దుష్టుల మాటలూ, చేతలూ నమ్మే పనిలేదు. — అంతటి శుభ శకునం తనకే కనపడరాదా? స్వప్నాలకు కూడా తనమీద విరోధమేనా?

---

* సుందరకాండలో — 27 వ సర్గ అంతా.

(ఉత్తరకాండ అని చెప్పకపోతే మాత్రం — సుందరకాండ లోదే.)

త్రిజట రావణుడికి దాసీగా ఉన్నప్పటికీ, విభీషణుడి వంశాన వున్న వ్యక్తి అనుకోవొచ్చు.

వొంటరిగా మిగిలిన సీతకు, సముద్ర కెరటాలమ్మల్లే దుఃఖం పొంగింది. ఈ శత్రువులమధ్య ఎంతకాలం జీవించినా ఏం లాభం?....

శ్రీరాముడు తనని మరిచిపోయాడా? పర పురుషుడు అపహరించిన స్త్రీని తను కోరనని త్యజించాడా? .... అయోధ్యకు పోయి .... ఎందరో సుందరాంగనలతో సుఖంగా వున్నాడా? కంటి కెదురుగా ఉన్నినాడు మెరమెచ్చుల మాటలేగానీ ఆపదలో చిక్కుకున్ననాడు కరుణించలేడా? అసలు శ్రీరాముడు రావణుణ్ణి వొంటరిగా జయించగలడా?

అయ్యో!.... నా మనసు ఇంతగా శంకింస్తోందేం? ఆయన ఎటువంటి దుఃఖంలో వున్నాడో గదా? నావల్ల నా భర్తకు కష్టాలేగానీ సుఖంలేదు.*

ఈ దుర్మార్గుల స్వాధీనంలో వుండి, ఎంతకాలం పాతివ్రత్యం నిలుపుకోగలను? ఇక శ్రీరాముడు వొస్తాడనే ఆశ నశిస్తోంది.

ఆత్మహత్య మహా పాపం అంటారు పెద్దలు. ప్రాణం విడిచే శక్తి అయినా లేదు ఈ శరీరానికి. మహా పతివ్రతలు కోరినప్పుడు మరణంకూడా తెచ్చుకోలేరా? — ఈ పతిభక్తీ, వ్రతాలూ, పూజలూ అన్నీ వ్యర్థమేనా? ఇంతకాలం భరకు దూరంగా పర పురుషుడి గృహంలో వున్నాను. నేను పతివ్రతనేనా?.... ఛీ! ఇంక ఈ దేహం ఎందుకు? .... వురి పోసుకోవడానికైనా మార్గం తోచదే!.... అయ్యో!

---

* 36 వ సర్గ — 40వ శ్లోకం, 26 వ సర్గ — 18 వ శ్లోకం.

"నేను దేశాంతరములో నుండుటవల్ల శ్రీరాముడు నామీద ప్రీతి విడిచియున్నాడా?"

"దృఢమైన పరాక్రమముగల శ్రీరాముడు భార్యను రక్షించలేడు. దీని కేమి కారణమో! రామునకు నే నిచట నుండుట తెలియదని శంకించు చున్నాను. తెలిసి యుండినచో తేజస్సుగల రాముడు వూర కుండునా? కుపితుడై బాణములచే నీ లోకమునందు రాక్షస పురుగు లేక పోవునట్లు చేయును. లంకా నగరము ధ్వంసము చేయును. సముద్రము నింకి పోవునట్లు చేయును.

.... ఇంత దుఃఖంలో కూడా నా హృదయం బద్దలు కాకుండా వుందే!
.... నా జన్మ ఎందుకు? ...."

"అమ్మా! .... సీతాదేవీ! .... దుఃఖించకు తల్లీ!"

సీత ఆశ్చర్యపడుతూ చుట్టూ చూసింది.

"భయంలేదు తల్లీ! నేను శత్రువుని కాను. నీ పెనివిటి నన్ను పంపించాడు. రాత్రినించీ ఈ చెట్టుమీద దాక్కున్నాను." *

సీత విసుక్కోతూ తల ఎత్తి చూసింది. భయంతో కొత్రుపడింది. దూరంగా పోతోయింది.

"నన్ను నమ్మ తల్లీ! నీ భర్తే నన్ను పంపించాడు. నీ సంగతులన్నీ నాకు తెలుసు. జనక మహారాజు నీ తండ్రి. దశరథ మహారాజు నీ మామ. కౌసల్య నీ అత్త. శ్రీరామచంద్రుడు నీ భర్త. — నీ భర్త తండ్రిమాట కాదనలేక అడవుల్లో కొచ్చాడు. మీరు దండకారణ్యంలో

---

* 30 వ సర్గ — 12 వ శ్లోకం, 31 వ సర్గ—2వ శ్లోకం.

హనుమంతుడు రాత్రి వొచ్చి చెట్టెక్కి కూర్చున్నాడు గదా!.... తెల్ల వారింతర్వాత రావణుడు వొచ్చాడు గదా! — కానీ, ఇంకా ఆ రాత్రే గడుస్తూ వున్నట్టు — "సూర్యోదయమునకు ముందే సీతతో సంభాషించి, సమాధానము చేయకపోయినటులైతే, ఆమె ప్రాణత్యాగము చేయును" — అనుకొంటున్నాడు హనుమంతుడు. అంతేగాదు — "రాక్షస స్త్రీలు నిద్రించునప్పుడు సీతతో మాటలాడుటకు సమయము గలిగిన వాడాయెను." — రెండో రాత్రి వరకూ వుండి మాట్లాడాదేమో అనుకోవచ్చు. కానీ, ఫ్యూడల్ సాహిత్యంలో కవులు మహా అవకాశవాదులుగా వుంటారు.

హనుమంతుడు అశోకవనం వెదకాలి కాబట్టి — అది రాత్రి.
రావణుడు సీత దగ్గిరికి రావాలి కాబట్టి — అది పగలు.
హనుమంతుడు సీతతో మాట్లాడాలంటే దాసీలంతా నిద్రపోవాలి కాబట్టి మళ్ళీ వెంటనే అది రాత్రి.
అవసరం అయితే అదే మిట్ట మధ్యాహ్నం.

వున్నప్పుడు ఈ దుర్మార్గుడు నిన్ను వొంటరిగా వుండటం చూసి, ఎత్తు కొచ్చాడు. నా కంతా తెలుసమ్మా!....అందుకే నీకోసం వెతుక్కుంటూ వెతుక్కుంటూ వొచ్చాను."

సీత విస్మయంలో మునిగిపోయింది. ఏం చూస్తున్నాను?.... ఏం వింటున్నాను? .... కలగంటున్నానా? .... భ్రమపడు తున్నానా? .... ఉన్మాది నయ్యానా? నిత్యమూ అదే ధ్యానతో తపిస్తూ .... అదే ఆలో చిస్తూ .... అదే చూస్తున్నానా? .... వుపవాసాలతో .... నిస్సత్తువతో .... పైత్య రోగంతో .... నాకై నేను కల్పించుకుంటున్నానా? .... భ్రమకు రూపం లేదే! వూహలు రూపు దాల్చలేవే!....ఇంత స్పష్టంగా మనిషిని చూస్తున్నాను. ఇంత స్పష్టంగా మాటలు వింటున్నాను. నా జ్ఞానేంద్రియాలతో వాస్తవంగ అనుభవిస్తున్నాను. — ఆశ్చర్యంగా వుందే! .... *

---

* 32 వ సర్గ — 11 వ శ్లోకం.

సీత హనుమంతుణ్ణి చూసి నమ్మలేక, ఎంతో తార్కికంగా ఆలో చిస్తోంది. —

"ఎప్పుడూ రామ రామ అని తలుస్తూ వుంటాను గదా! అందుచేత అతన్ని గురించి వింటున్నానేమో," — అనుకుంటోంది. చూడండి — "రామ రామ యని సర్వకాల సర్వావస్థలలోనూ ధ్యానించుచూ, రామ నామము జపించు చున్నాను. ఈ రామ సంకీర్తనమున కనురూపముగ నుండు కథను వినుచున్నాను. దానినే చూతగలను. నేను ఇపుడు నా సర్వ భావములనూ రాముసియందు నిలిపి, అతనినే ఎల్లప్పుడునూ ధ్యానించుచు, అతనిని చూచుచున్నాను." (ఇంతకీ చూసేది రాముణ్ణి కాదు.)

"అదే ధ్యానలో వుండడంవల్ల ఆ రూపాన్నే చూడవొచ్చును"— అనే అభిప్రాయం ఇది. మరి దేవుళ్ళని చూసే భక్తులందరూ ఇలాంటి వారే నేమో!

(తరువాత పేజీలో)

ఆశ్చర్యం మాత్రం ఏముంది ? .... ఇక్కడ కారలా స్త్రీలూ, పురుషులూ ఏదోరకంగా హనుమంతుడు అప్పటికే చెట్టు దిగి సీత ముందు వినయంగా నించున్నాడు.

"అమ్మా ! నీ భర్త నీ కోసం పరితపిస్తున్నాడు."

సీత తన చెవుల్ని తను నమ్మలేకపోయింది. "నా భర్త నాకోసం పరితపిస్తున్నాడా ?" — అని సంభ్రమంతో చూసింది.

(ఫుట్‌నోట్ : 415 వ పేజీ తరువాయి)

మళ్ళీ సీత సందేహం — "మనోరథమునకు రూపము లేదు గదా ?" — ఇది ఎంత శాస్త్రీయమైన విషయం ! హేతువాదానికి సంబంధించిన విషయం ! కవి ఇంత హేతువాదానికి ఎందుకు దిగుతున్నాడు ? ఇక్కడ అవసరం గనక. సీత హనుమంతుణ్ణి నిజమైన వ్యక్తిగానే నమ్మాలి గనక.

"హనుమంతుడి రూపం నాకు కనపడడం నా భ్రమే" — అని వూరుకుంటే పని జరగదు. అందుచేత సీత "నా భ్రమని నేనెలా చూడగలను ? .... నేను చూస్తున్నది భ్రమ కాదు. వాస్తవమే" — అనుకోవాలి.

ఇంకో విషయం చూడండి — "నా కిది వుపవాసములచే కలిగిన వాతరోగ సంబంధమైన భ్రమయా ?" — అనుకుంటోంది. — ఉపవాసాలవల్ల వాతరోగం వొస్తుందని కవిగారు వొప్పుకుంటున్నారు. ఈ మాట ఇంకెప్పుడైనా అయితే వొప్పుకుంటారా ? .... ఏ రుషి గురించి అయినా చెప్పినప్పుడు — "ఈయన పది సంవత్సరాలు నిద్రాహారాలు విసర్జించాడు. గొప్ప మహిమ వొచ్చింది" — అంటాడు. వాతరోగం తెల్లజొహం వేస్తుంది — రుషిగార్ని పట్టుకోలేనందుకు.

—"ఎవరు నువ్వు? .... నా భర్త గురించి మాట్లాడుతున్నావు? ఎక్కడున్నాడు నా భర్త?" —అని ఆత్రతగా దిక్కులు చూసింది.

"నా పేరు హనుమంతుడు తల్లీ! .... మేము వానరులం. మాది కిష్కింద దేశం. నేను సుగ్రీవ మహారాజు దగ్గిర మంత్రి పని చేస్తున్నాను. మా మహారాజు నీ భర్తకు మంచి స్నేహితుడు. నా మాటలు పూర్తిగా విను తల్లీ! దుఃఖపడకు! ఈ దుర్మార్గులకు తగిన శాస్తి జరుగుతుంది. .... నీ భర్త ఇక్కడికి రాలేదు. మా రాజ్యంలో వున్నాడు. నేను తిరిగి పోయి నీ కబురు చెప్పగానే తప్పకుండా వొస్తాడు. గొప్ప సైన్యంతో వొచ్చి ఈ దుర్మార్గుల మీద యుద్ధం చేస్తాడు."

"సైన్యంతోనా? .... సైన్యం ఎక్కడిదీ? నమ్మవొచ్చునా నీ మాటలు? ..."

"అయ్యో! నన్ను నమ్ము తల్లీ!.... నీ భర్త కిష్కింధ నమీపాని కొచ్చి మా రాజుతో సఖ్యం చేసుకున్నాడు. మా రాజు చాలా వుత్తముడు. నీ భర్తకు సైన్యం యిచ్చి సహాయం చేస్తాడు. శ్రీరాముడు తప్పకుండా ఇక్కడికి వొచ్చి యుద్ధం చేసి, ఈ దుర్మార్గులందర్నీ చంపి, నిన్ను తీసుకు పోతాడు."

"నీ మాటలు వింటోంటే నా ప్రాణాలు లేచి వొస్తున్నాయి .... కానీ...." *

"సందేహించకు తల్లీ! .... నేను నీ కోసమే వెతుక్కుంటూ వొస్తున్నాను. నీ భర్త నీ ఆనవాళ్ళన్నీ చెప్పాడు. నిన్ను చూడగానే శ్రీరాముడి భార్యవని పోల్చుకున్నాను."

"నువ్వు చూస్తే ఆటవికుడివి. నా భర్తకూ—మీ రాజుకూ సఖ్యం కలసిం దన్నావు. నా భర్త మీ రాజ్యంలో వున్నాడంటున్నావు."

"చెపుతాను తల్లీ! అంతా చెపుతాను. నీ భర్తా, నీ మరిదీ నీ కోసం వెతుకుతూ, వెతుకుతూ చెట్టూ పుట్టలూ పట్టుకు తిరిగి తిరిగి

---

* ఆ వుంగరం చూపించరాదూ?.... అదెక్కడ పారేశాడో!

మా దేశం పక్కనే ఋష్యమూక పర్వతం వేపు వొచ్చారు. అప్పుడు మా రాజు, అన్నగారితో తగువుపడి ఆ పర్వతం మీద వుంటున్నాడు. మా రాజు అన్న వేపు వాలి చర్రీ! పరమ దుర్మార్గుడు. తోడబుట్టిన వాణ్ణి నానా బాధలూ పెట్టాడు."

"సరే! అప్పుడేం జరిగింది ?.... తొందరగా చెప్పు నాయనా!"

"నీ భర్తని చూసి మహారాజు కొంచెం జంకాడు. నన్ను పిల్చి ఎవరో ఏవిటో కనుక్కు రమ్మన్నాడు. నేను నీ భర్త దగ్గిరికి వెళ్ళి సంగతంతా తెలుసుకుని వాళ్ళిద్దర్నీ మా రాజు దగ్గిరికి వేంటబెట్టుకు తీసుకొచ్చాను. మా రాజూ, నీ భర్తా మంచీ చెడ్డా మాట్లాడుకున్నారు. సరే అంటే, సరే అనుకున్నారు. వొకరి కొకరు సహాయం చేసుకోవాలని అగ్నిసాక్షిగా వొప్పందం చేసుకున్నారు.

నువ్వు దారిలో పారేసిన నగలమూట అప్పుడేనమ్మా నీ భర్తకు చూపించాం. నీ నగలన్నీ చెక్కు చెదరకుండా వున్నాయి. మన సొమ్ము యితే మనకే దక్కుతుంది తల్లీ!"

"తొందరగా చెప్పు నాయనా! .... నా భర్త మీ రాజుతో వొప్పందం చేసుకున్న తర్వాత ఏం జరిగింది?"

"నీ భర్త ధర్మమూ అని మా రాజుకి మళ్ళీ రాజ్యం దక్కింది. .... మా రాజు అన్న పరమ దుర్మార్గుడని చెప్పానా? — తమ్ముడి భార్యతో కులుకుతూ, తమ్ముణ్ణి దేశంలోంచి వెళ్ళగొట్టాడు. ఆ కబురు విని నీ భర్త ఎక్కడా అన్యాయం జరగనివ్వనని వాలిని బాణంతో చంపేసి మా రాజుకి మళ్ళీ రాజ్యాన్నీ, భార్యనీ అప్పగించాడు."

"ఆహా! ఎంత ధర్మాత్ముడు!" — సీత మనసు ఆనందంతో నిండిపోయింది.

"నీ భర్త అంత వుపకారం చేశాడాయె! మరి మా రాజు వూరు వూరంతా? .... ఈ దుర్మార్గుడితో యుద్ధానికి ఏర్పాట్లన్నీ మా రాజే చేస్తున్నాడు. .... అసలు నువ్వెక్కడున్నావో, ఏవిటో చూసి రమ్మని .... చాలా మంది సైనికుల్ని అన్ని రాజ్యాలకీ పంపించాడు.... నీ జాడ

ఎంతకీ అంతు చిక్కనే లేదు. చివరికి సంపాతి అనే ఆయన .... నీ గురించి ఎలా విన్నాడో ఏమో ... లంకలో వున్నావని చెప్పాడు. ఒక రాజు పరస్త్రీని ఎత్తుకొచ్చిన తర్వాత, ఆ సంగతి ఆ నోటా, ఆ నోటా పదిమందికీ తెలియకుండా వుండిపోతుందా ? — నువ్వు నా కళ్ళ పడటం నా అదృష్టం తల్లీ !.... ఈ కబురు చెప్పానంటే నీ భర్త రెక్కలు కట్టుకు వొచ్చి వాలతాడు."

హనుమంతుడి మాటలన్నీ నమ్మదగ్గవిగానే వున్నాయి సీతకి. అయినా సందేహం వొదలడం లేదు— "హనుమంతుడా ! నా భర్తని చూశానంటున్నావు. ఆయన రూపురేఖ లెలా వుంటాయో చెప్పు. ఆయన నలుపో, తెలుపో చెప్పు. గుణగణా లేవిటో చెప్పు. విని సంతోషిస్తాను." — అని అడిగింది.

"అయ్యో ! నీ భర్త కేం తల్లీ ? .... ముక్కూ మొహం చూసిన కొద్దీ చూడబుద్దేస్తాయి .. మీ అత్తగారు చాలా అందమైందను కుంటాను...." —అంటూ హనుమంతుడు చోటు సరిగా చూసుకుని చతికిలబడి కూర్చున్నాడు.

సీతకి దాసీల సంగతి గురు వొచ్చి భయంగా "నిన్నెవరన్నా చూస్తారేమో ! ఆ పొద చాటున కూర్చుని మాట్లాడితే బాగుంటుందేమో !" — అని చుట్టూ పరికించింది.

హనుమంతుడు కదలకుండా— "చూస్తే చూడనియ్యి తల్లీ ! .... ఏం ఫరవాలేదు. వొక్కొక్కదాన్ని పట్టుకు బాది వొదిలిపెడతాను. వాళ్ళ దిక్కున్నచోట చెప్పుకుంటారు. వొచ్చిన పని చెడిపోతుందని తటవటాయించాను గానీ, ఇందాక నీ చుట్టూ మూగిన వాళ్ళందర్నీ చావచితక గొడదా మనుకున్నాను..." — అని కోపంగా చుట్టూ చూసి సద్దుకుని కూర్చున్నాడు.

సీత ఇంకా భయపడుతూ — "నా మాట వినవోయీ ! .... ఎందుకైనా మంచిది. నిన్ను వాళ్ళు కనిపెడితే చాలా ప్రమాదం. ఆ గురివింద పొద చాటున కూర్చో నేనిక్కడ తిరుగుతూ నీతో మాట్లాడుతున్నాను," — అని ప్రాధేయ పడింది.

హనుమంతుడికి లేవక తప్పలేదు.

"నా గురించేం భయపడకు తల్లీ! .... ఈ కొండలూ కోనలూ మాకు కొట్టిన పిండే. ఎవరైనా చూస్తే ... కను రెప్పపాటులో తప్పుకు పోతాను," — అంటూ పొదల మధ్య జొరబడి కూర్చున్నాడు.

పీత అక్కడే మోదుగుచెట్టు కింద కొమ్మ పట్టుకు నిలబడింది.

— "హనుమంతుడా! నీ మాటలు వినాలని నా మనసెంతో తొందర పడుతోంది. అన్ని సంగతులూ వొక్కసారే చెప్పెయ్యి. నా భర్త ఏం చేస్తున్నాడు? .... నా మరిది ఏం చేస్తున్నాడు? ఎక్కడుంటున్నాడు? .... ఎలా జీవిస్తున్నారు? .... వారిని నిజంగా నువ్వు చూసే వొచ్చావు కదూ?"

"నీ భర్త కూడా ఇలాగే తల్లడిల్లుతున్నాడమ్మా! సీతా సీతా అన్న నోటికి మూత లేదు. చెట్టంత మనిషి కంట తడి పెడుతూ వుంటే .... ఏం చెయ్యగలం? చూసే వాళ్ళ కడుపులు తరుక్కుపోతాయి. ఎలాగో నచ్చచెపుతాం. ధైర్యం చిక్కబట్టుకుని రోజులు గడుపుకుంటున్నాడు, అందాని కేంటి, గుణాని కేంటి మా దొడ్డ మనిషి.

తనని ఆశ్రయించిన వాళ్ళకోసం ఎంత సాయవన్నా చేసి పెడతాడు. నిష్ఠా నియమం అంటే మహా పట్టుదల. గిట్టని వాళ్ళని మసి చేసే దాకా నిద్రపోడు. తాచుపాము పగే. వర్ణసంకరం అంటే బొత్తిగా గిట్టదు. "ఏనాడు పెద్దలు పెట్టారో — ఆ మంచి చెడ్డలన్నీ అలాగే వుండా" లంటాడు. ఆడవాళ్ళ పిచ్చి రవ్వంతన్నా లేదు సుమా!" — ఎందుకొచ్చిన మాటలు.... ఏ ఆడదాన్నీ కన్నెత్తి చూడడు. నన్నాసులన్నా బైరాగులన్నా ప్రాణం పెడతాడు. బ్రాహ్మలంటే ఎంత భక్తో! .... వాళ్ళ పాదాలు కళ్ళకద్దుకోకుండా వొదిలి పెట్టడు. నోరు తెరిస్తే, ఏదో వొక ధర్మశాస్త్రంలో ముక్కలు చెప్పకుండా వుండలేడు గదా! అదో! .... ఆయన పొట్టనిండా చదువే. బాగా సంపాదించా లంటాడు. బాగా దానం చెయ్యాలంటాడు. ఏ పూటకి ఏ పూజ చేసుకోవాలో ఏ వేళ ఏ వ్రతం చేసుకోవాలో చక్కగా తెలుసు. ముప్పూటలా స్నానాది

చేస్తాడు. పూజలు చేస్తాడు. ఇక రాచకార్యాలు మాట్లాడితేనా ? ఎవరన్నా నోరెత్తగలరా ? .... తండ్రి మాటకి కట్టుబడి అలా వున్నాడు గానీ .... లోకవంతా తనొక్కడే ఏలగలడు.— విల్లు పట్టుకున్నాడంటే చూడాలి. ఆవఁడ దూరాన వున్న నల్ల పూసని కూడా సూటిగా కొట్టి, పది చెక్కలు చేస్తాడు. వేటాడటం అంటే మహా సరదా. మొదలు పెట్టాడంటే మాత్రం మనిషికాడు. ఆయాసం వొచ్చేదాకా కాకినో, గద్దనో కొడుతూనే వుంటాడు. అదొక్కటే కాస్త .... అయినా మీ రాజుల్లో ఉన్నదే లేమ్మా !

నీ పెనివిటికి వొక్క దుర్వ్యసనవన్నా లేదు. చుట్టన్నా కాల్చడు. మహా బుద్ధి మంతుడు. ఎప్పుడన్నా మర్చిపోయి చుట్ట చుట్టుకుంటూ కూర్చుంటే: మొహం చిట్లించి — "దూరంగా జరగవోయీ !" — అని విసుక్కుంటాడు ...."

సీత మనసు ఆనంద డోల అవుతోంది. తనను తను మరిచిపోయి చిరునవ్వుతో వింటోంది — "రూపు రేఖలు కూడా చెప్పవోయీ !"— అంది.

"చెప్పానుగా అమ్మా : .... మా చక్కని రూపం. ఆయన కాయనే సాటి. నీకు నువ్వే సాటి .... నాకేం వర్ణించటం వొచ్చునా ? చచ్చునా ?.... మా డొక్కో పంతులయ్య అయితే ఉన్నదున్నట్టు, బొమ్మ కళ్ళకట్టినట్టు .... నీ పెనివిటిని నీకు చూపించేవాడు .... చారెడేసి కళ్ళు .... ఆ ముక్కు .... ఆ మొహం .... ఏనాడూ కష్టం ఎరిగిన వాడు కాదమ్మా : కాళ్ళమీదా, చేతులమీదా వొక్క నరం అయినా తేలి కనపడదు. ఎన్నడూ వొంటికి చెవట పట్టదు. వొళ్ళు నున్నగా నిగనిగ లాడుతూ, ముట్టుకుంటే పాలు కారేట్టు వుంటుంది. ఈగ వాలితే, కాళ్ళకి పట్టు దొరక్క జర్రున జారిపోతుంది. ఎప్పుడూ గడ్డం, మీసం వుంచుకోడు. వొంటిమీద కూడా వెంట్రుక లుండవు. అరిచేతులు ఎర్రగా పువ్వుల్లా వుంటాయి. గోళ్ళు కూడా తెల్లగా మల్లె రేకల్లా వుంటాయి. వెన్నుపట్టు చక్కగా, విశాలంగా బిల్లకట్టులా వుంటుంది. భుజాల దగ్గిరేంటి, గుండెల మీదేంటి .... ఎక్కడా వొక్క ఎముక కనపడదు.

పెదాలు బండగా వుంటాయి. ముక్కు కాస పెద్దది. పొట్టి కొంచెం ఎత్తు ...." — హనుమంతుడు చెపుతోనే వున్నాడు.

సీతకు పూర్తిగా నమ్మకం కలిగింది. పట్టలేని ఆనందంతో వింటోంది.

"ఇక నీ మరిది సంగతా ? .... అన్న గురించి చెపితే, తమ్ముణ్ణి చెప్పక్కర్లేదు. వొకటే ముక్కులు .... వొకటే మొహాలు .... కాస చేతులు మోటు. పొట్ట లేదు. ఇన్ని మాట లెందుకుగానీ .... నీ పెనివిటికి, నీ పెనివిటి సాటి తల్లీ !" — *

---

* 35 వ సర్గ — 9 నుంచి 22 వరకూ

హనుమంతుడు సీత ముందు రాముణ్ణి వర్ణించే సందర్భంలో అసాధారణమైన వరన చేశాడు.

ఈ వర్ణనలో చాలా విషయాలు కవి స్పష్టంగా తేల్చి చెప్పలేదు — మూడు స్థిరమైనవి గలవాడు, మూడు ఎర్రటివి గలవాడు, మూడు పొడవైనవి గలవాడు, షడ్నాలుగు సమమైనవి గలవాడు ...." — ఈ రకంగా కొన్ని శ్లోకాలలో చెప్పాడు. మూడు ఎర్రటివి అంటే ఏఏ అవయవాలు ? (అరిచేతులు, అరికాళ్ళు, కను కొలుకులు) మూడు స్థిరమైనవి అంటే ? — (వక్షస్థలం, మణికట్టు, పిడికిలి) — ఈ రకంగా, కవి స్పష్టంగా చెప్పిన విషయాన్ని అనువాదకులు విపులీకరించారు. ఇలా విపులీకరించడంలో అనువాదకులు చాలా విషయాలకు ఒక రకంగానే అభిప్రాయ పడ్డారు.

"రాముడు నాలుగు రకాల నడక గలవాడు" — అని కవి చెప్పి ఊరుకుంటే — ఆ నాలుగు రకాలు ఏమిటో అనువాదకులు వొక్కలాగే అభిప్రాయ పడ్డారు. సింహం నడక, పులి నడక, ఏనుగు నడక, ఎద్దు నడక.

"సప్త రుషులు", "నవ గ్రహాలు", "ఏకాదశ రుద్రులు" — వంటి పదాల గురించి పండితు లందరికీ, దాదాపు వొకేరకం అభిప్రాయా

హనుమంతుడికి తన భ క్తిమీద అమితమైన భ క్తి భావం ఉన్నట్టు గ్రహించింది సీత. హనుమంతుడు తనకు చాలా ఆప్తుడనే సంతోషం కలిగింది. "హనుమంతుడా ! నీ మాటలు వింటూ వుంటే, ఎండి బీటలు వారిన భూమినిండా వరపు జలులు కురిసినయు వుందోయీ ! ఇంత కాలానికి ఎంత చల్లని వార్త విన్పించేను ! నా ప్రాణం రక్షించావు. నీ తలి కడుపు చల్లగా వెయ్యేళ్ళు సుఖంగా వుండు.... నిన్ను చూడగానే ఏమో అనుకున్నానుగానీ .... నువ్వు సామాన్యుడివి కావు. గొప్ప సాహస వంతుడివి. ఈ అశోకవనంలోకి రావడం అంటే, పులి నోట్లో తల పెట్టినట్టే. నీ ధైర్య సాహసాలు నా భ ర గ్రహించబట్టే నిన్నీ కార్యానికి నియోగించాడు .... నీ తల్లిదండ్రు లెవరో .... నీ కులగోత్రా లేవిటో అంతా చెప్పు నాయనా !"

సీత తనని పొగుడుతోంటే హనుమంతుడు కొంచెం సిగ్గు పడ్డాడు —

తన పుట్టు పూర్వోత్తరాలన్నీ చెప్పాడు —

(ఫుట్‌నోట్ : 422 వ పేజీ తరువాయి)

లున్నాయి కదా ! .... అలాగే కవి రాముడి గురించి వర్ణించిన వాన్ని అర్థం చేసుకుని విభ్రీకరించగలిగారు.

ఆ రకంగా విభ్రీకరించిన వర్ణనలో కొన్ని విషయాలు ఇలా ఉన్నాయి :

ఒకదానితో నొకటి సమముగానుండు వెండ్రుక కొసలూ, మోకాళులూ, వృషణములు — గలవాడు.

స్వేదము, నఖములు లేని పాదములు గలవాడు.

ఒక రోమ కూపములో, నొకే రోమము గలవాడు.

తలలో మూడు సుడులు గలవాడు,

ఒక్కొక్క పక్క నాలుగేసి కోరపళ్ళు,

ఎనిమిది అడుగుల పొడవు, — అతి దీర్ఘముగాని లింగము —

ఈ రకంగా వుంది వర్ణన.

"నా తండ్రి దేశాంతరం పోయినప్పుడు వాయువనే ఆయనకి నేను పుట్టానమ్మా!" — అని * చటుక్కున ఏదో జ్ఞాపకం వొచ్చి— బొడ్లోంచి వుంగరం తీసి — "అయ్యో! ఇంతసేపూ మరిచేపోయాను. ఇదుగో! ... నీ భర్త నీకు చూపించమని ఇచ్చాడు. ఇది చూస్తే తప్ప కుండా నమ్ముతావన్నాడు. నా మతి పుండ! .... మరిచేపోయాను" — అంటూ పొదలోంచి వొంగి వుంగరం సీత చేతిలో పెట్టాడు.

సీత వుంగరం చూసి పోల్చింది. తన భర్తదే. చప్పున కళ్ళ నీళ్ళు పెట్టుకుంది — "ఇంత కాలం నా భర్త నన్ను మరిచేపోయాడా? .... ఇప్పటికి గుర్తు వొచ్చానా నేను? వొక్కరోజు కాదు. రెండు రోజులు కాదు. ఈ దుర్మార్గుడి చెరబట్టి పది మాసాలు గడిచింది. ఏం కష్టాలు పడుతున్నానో అనే ఆలోచన కూడా లేదా శ్రీరాముడికి? వివాహం అయింది మొదలూ ఎన్నడయినా భర్తను విడిచి వున్నానా? పన్నెండు సంవత్సరాలు రాజభోగా లనుభవిస్తూ అయోధ్యలో కాపరం

---

* 65 వ సర్గ — 89 వ శ్లోకం.

హనుమంతుడు వాయుదేవుడికి ఏ కారణంచేత పుట్టాడో చూడండి — "దేవర్షుల యాజ్ఞవల్ల నా తండ్రియగు కేసరి యుద్ధములో శంబ నాదసుడను రాక్షసుని జంపి దేశాంతరమునకు పోయినప్పుడు వాయు దేవుని ప్రసాదము వలన నేను పుట్టితిని."

• హనుమంతుడు సీతని చూడగానే వుంగరం ఇవ్వకపోవడానికి కారణం — కవిగారు వుంగరం సంగతి మర్చిపోవడం కాదు. — ముందే వుంగరం ఇచ్చేస్తే, సీత హనుమంతుణ్ణి నమ్మేస్తే, సీతాదేవి భయ సందేహాలూ, హనుమంతుడు శ్రీరామచంద్రుణ్ణి వర్ణించే సుందర ఘట్టాలూ నర్గల తరబడీ చెప్పవలసిన అవకాశం పోతుందిగదా! — కానీ వుంగరం ఇచ్చినా సీత తన భర్త గురించి చెప్పమని కోరవచ్చును.

ఇంతకీ — "ఈ వుంగరం ఎక్కడిదీ! రాముడు ఆభరణాలన్నీ విడిచి వొచ్చాడే!" — అనే అనుమానం మనకు వొచ్చినట్టు సీతకు రాలేదు. పతివ్రతలు భర్తల వుంగారాల్ని శంకించకూడదు.

చేశాను. తర్వాత వనవాసం కూడా గొప్ప ఆనందమే అనుకుని భర్తతో గడిపాను. అలాంటి భార్యని, నన్ను నా భర్త పురిచే పోయాడా?"— అంటూ వాపోయింది.

"అంత మాటనకు తల్లీ!.... నీ భర్త నిన్ను తలుచుకుని అల్లాడని రోజు లేదు.... నిన్న మొన్నటిదాకా వర్షాకాలమే నాయే! మా రాజు కొంచెం అశ్రద్ధ మనిషి. అదుగో .... ఇదుగో అని .... రోజులన్నీ గడిపేశాడు. అందుకే నీ భర్తకు కోపం వొచ్చి—"అసలు నా భార్యని వెతికించుతావో లేదో చెప్పు ముందు." — అని నిలదీస్తే .... మా రాజు సిగ్గుపడి.... తప్పు తెలుసుకుని మమ్మల్నందర్నీ రాజ్యాల వెంట పంపించాడు.

పాపం నీ భర్త వొక్కడూ ఏం చెయ్యగలడమ్మా? అలివిగాని పనయ్యే! అంగబలం వుండాలి."

సీత అసంతృప్తిగా తల వాల్చింది. ఇతరుల సహాయం లేకుండా తన భర్త తనను రక్షించలేడా? అంత పరాక్రమ వంతుడికీ ఇతరుల సహాయం వుండవలసిందేనా? సుగ్రీవుడితో సఖ్యమే కాకపోతే ఏం జరిగేది?.... తన జీవితం ఈ లంకలో తెల్లార వలసిందేనా?"

"దుఃఖపడకు తల్లీ!.... ఇక ఎంతో కాలం పట్టదు. నేను పోయి ఈ కబురు చెప్పగానే.... నీ భర్త వానర సైన్యంతో వొచ్చి, రావణుడి మీద యుద్ధం చేసి...."

"యుద్ధమా?.... రావణుడితోనా?.... అయ్యో! జయాపజయాలు దైవాధీనాలు. చివరికి ఏం జరుగుతుందో గదా?"

"జయాపజయాలు దైవాధీనాలే గానీ.... ఆ దైవం మన ఆధీనమే తల్లీ! .... న్యాయం మనదే.... పర స్త్రీని ఎత్తుకొచ్చిన దుర్మార్గుడు నాశనం అయిపోక తప్పదు."

నిజమే ననిపించింది సీతకు కూడా. కొంచెం వూరట కలిగింది. —"అవునోయీ! దుర్మార్గుడు నశించిపోక తప్పదు. రావణుడి తమ్ముడు

విభీషణుడు మహా పుత్రవుడు. నన్ను తీసుకుపోయి భర్తకు అప్పగించ మని చాలాసార్లు అన్నాని ప్రార్థించాడని విన్నాను. విభీషణుడి కూతురు అనల అప్పుడప్పుడూ నా దగ్గిరికి వొచ్చి రహస్యంగా తండ్రి గురించి చెపుతూ వుంటుంది. విభీషణుడి భార్య కూతుర్ని నా దగ్గిరికి పంపుతూ వుంటుంది. —ఈ దుర్మార్గుడికి ఎవరు ధర్మబోధ చేసినా జ్ఞానం లేదు. మృత్యువు వొక్కటే బుద్ధి చెప్పగలదు."

"అవును తల్లీ : అలాగే జరుగుతుంది.

సీత నిట్టూర్చింది— "నా భర్త సుఖంగా వున్నాడా హనుమం తుడా ?.... నా కోసం దుఃఖం భరించలేక చిక్కి శల్యం కాలేదు గదా?"

"నీ నగలు చూసినప్పుడు బావురు మన్నాడమ్మా : ఎప్పుడూ నిన్ను తలుస్తూ కంటతడి పెడతాడు. మొగాయన అంతకన్నా ఏం బయట పడతాడు చెప్పు? దుఃఖవంతా కడుపులో దాచుకుంటున్నాడు. — అడ వుల్లో బతుకయ్యే : ఏం సుఖం ? — నీ ధ్యాసలో మునిగిపోయి పురుగూ పుట్రా పాకినా పట్టించుకోడు." *

"అవునోయీ !.... నా భర్తకు నేనంటే పంచప్రాణాలు. తన తల్లికన్నా, తండ్రికన్నా నన్నే ఎక్కువ ప్రేమిస్తాడు. దేవుడు ఇంత క్రూరంగా మమ్మల్ని విడదీశాడు. నా భర్త నాకోసం దుఃఖిస్తున్నాడంటే నా మనసుకెంతో ఆనందంగా వుంది గానీ.... ఆయన దుఃఖంతో కాలం

---

* 36 వ సర్గ — 42 వ శ్లోకం.

రాముడు సీత శోకంలో మునిగిపోయి వొంటిమీద పాములు పాకినా పట్టించుకోడం లేదట.

"శ్రీరాముడు నీ మీదనే మనసు నిలిపి అడవి ఈగలు, దోమలు, పురుగులు, పాములు బాధించినను వాటిని తన దేహము మీదనుండి నివర్తించుట లేదు."

— ఇది ఒక రకం మన్మధావస్థ అట.

మన్మధావస్థో : ఉన్మధావస్థో :

గడపడం నేను సహించలేను. మళ్ళీ మే మెప్పటికి కలిసి సుఖపడ తామో, విధి విధానం ఎలా వుందో గ్రహించలేము." — అని నిట్టూర్చింది సీత.

హనుమంతుడికి కూడా దిగులు ముంచుకొచ్చింది.

కొంతసేపటికి తేరుకుని — "నీ భర్త మాటకేం గాని .... నీ మరిది మాత్రం చాలా దిగులు పడుతున్నాడు తల్లీ, నీ జాడ తెలియక. ఆ మహానుభావుడికి నీ గురించీ దుఖమే, అన్నగారి గురించీ దుఖమే," — అని విచారించాడు.

"అవునోయీ! నా మరిది బహు వుత్తముడు. అన్నగారికి సేవే అతడికి పరమ ధర్మం. దేవతలు కూడా కీర్తించ దగ్గవాడు," —అని కంటతడి పెట్టింది సీత.

"ఆ అన్నదమ్ములిద్దర్ని చూస్తే చేసుకున్న పాపాలన్నీ పోతాయి తల్లీ! రాత్రీ పగలూ అన్నగారికి సేవ చేసినవాడు చేసినట్టే వుంటాడు నీ మరిది. చంటిబిడ్డని సాకినట్టు సాకుతున్నాడనుకో అన్నగారిని."

సీత నిట్టూర్చింది — "మా వల్ల అతడికీ కష్టాలు తప్పలేదు. అన్నగారి మీద భక్తితో సర్వసుఖాలూ విడిచి, ఎందరో ప్రియురాళ్ళని విడిచి, అడవుల కొచ్చాడు. అన్నగారి ఆజ్ఞే వేదవాక్కుగా ఆచరిస్తాడు. లక్ష్మణుడైనా నన్ను రక్షించలేడేమో అని కుములుతూ వుంటాను."

"అయ్యో! ... నిన్ను రక్షించడానికే సర్వ ప్రయత్నాలూ జరుగు తున్నాయి. దుఖించకు తల్లీ! .... ఇక నువ్వు నిర్భయంగా వుండ వొచ్చును."

సీత కొంతసేపు ఆగి — "కోసల సంగతులేమైనా తెలిస్తున్నా యటనా హనుమంతుడా? మా అత్తగారూ, మా పిన్నత్తగారూ, భర

తుడూ క్షేమంగా వున్నారా? ఈ దుర్మార్గుడితో యుద్ధం చెయ్యడానికి భరతుడు సైన్యాలు పంపుతాడా?"— అని అడిగింది. *

"ఆ వార్తలేవీ నా చెవిన పడలేదు తల్లీ! యుద్ధానికి మాత్రం వానర సైన్యాలు దండిగానే వున్నాయి. ఎన్నివేల మందినైనా మా రాజు యుద్ధంలోకి పంపుతాడు. దానికేమీ సందేహం లేదు."

"నాకు రావణుడు సంవత్సరం గడువు ఇచ్చాడు మొదట. ఇక రెండు నెలలు మిగిలింది. ఈ లోగా యుద్ధం ముగుస్తుందా? .... నా భర్త వొచ్చి నన్ను రక్షిస్తాడా?"

హనుమంతుడు ఆలోచనలో పడ్డాడు. రెండు నెలల్లో యుద్ధం అయిపోతుందా? రావణుడు చచ్చిపోతాడా? .... అయినా, ఈ దుర్మార్గుడు రెండు నెలల వరకూ అయినా ఇచ్చిన మాటమీద నిలబడతాడా? .... నమ్మదగ్గ సంగతి కాదు —

—"అమ్మా! నిన్నీ దుర్మార్గుల మధ్య వొదిలిపెట్టి పోవటం మంచిది కాదని తోస్తోంది.... ఎలాగో వొచ్చాను. నాతో పాటు జాగ్రత్తగా తీసుకు పోతాను. రాత్రిదాకా మళ్ళీ చెప్పొక్కి దాక్కుంటాను.

---

* 36 వ సర్గ — 22, 24.

"కౌసల్య, సుమిత్ర, భరతుడు— వీరి క్షేమమును నా భర్త పలుమారు తెలుసుకొనుచున్నాడా?" — కెకని అడగదు ఎక్కడా. నరే! శత్రుఘ్నుడి సంగతి కూడా ఎత్తదు. ఎప్పుడూ భరతుడి పేరే. లక్ష్మణుణ్ణి అయినా చాకిరీ చేస్తాడనే.

శత్రుఘ్నుడి మీద చూపని ప్రత్యేక శ్రద్ధ భరతుడి మీద చూపడానికి కారణం ఏమిటి?.... అతడి చేతిలో రాజ్యం వుంది గనక. ఇదీ అన్నదమ్ముల ఆదర్శం.

"అన్నమీద ప్రీతి గల భరతుడు అక్షౌహిణీ సంఖ్యగల సేనను నా నిమిత్తము పంపునా?" — అని అడుగుతోంది సీత. —పంపునో, లేదో యుద్ధం జరిగేప్పుడు చూద్దాం.

అందరూ నిద్రపోయాక, ఇటువేపు కొండలో పడి పోదాం. ముందు కొంతదూరం తప్పుకు పోతే.... తర్వాత ఏలాగైనా తప్పుకోవొచ్చు. ఏమంటావు ?" — అన్నాడు.

సీతకి వెంటనే బయల్దేరా లనిపించింది. సంతోషం కలిగింది. — "అవును. హనుమంతుడితో కలిసి వెళ్ళిపోతే బాగుంటుంది," — అంది సీతలో సీత.

సీత ఆలోచనలో మునిగింది. "హనుమంతుడితో కలిసి వెళ్ళడం ధర్మమేనా ? పతివ్రతల్ని భర్తలే రక్షించి తీసుకు వెళ్ళారు చాలా కథల్లో. శచీదేవిని ఇంద్రుడే రక్షించాడు. భార్యని రక్షించి పాలించే కర్తవ్యం భర్తదే. పతివ్రత అయిన భార్య, భర్తని తప్ప పర పురుషుణ్ణి రక్షించమని కోరకూడదు. శ్రీరాముడు సైన్యాలతో వొచ్చి, శత్రువుని చంపి, నన్ను రథం మీద తీసుకుపోతే ఎంత కీర్తి ! మహా వీరుడని లోకం నా భర్తని మెచ్చుతుంది. మహా పతివ్రతనని నన్ను మెచ్చుతుంది.... అంతే గానీ...."

"అవుననుకో.... మరి ఈ దుర్మార్గుడు ?...."

"మరీ దుర్మార్గుడు కాడుగా ?.... భర్తే రక్షిస్తే ఎంత కీర్తి !"

"సరే ! నీ ఇష్టం ! ...."

"ఏంతల్లీ !" —

"హనుమంతుడా ! నేను నీతో రావటం భావ్యం కాదు. తప్పించుకునే శక్తి లేక రావణుడికి వశమయ్యాను గానీ, నేను పర పురుషుడి వెంట రాను. నా భర్తే వొచ్చి నన్ను రక్షించి తీసుకు పోవడం లోక మర్యాద."

సీత మాటలు హనుమంతుడికి కొంచెం వింతగా తోచాయి. — "అది కాదు తల్లీ ! .... ఈ దుర్మార్గుడిచేతిలో .... ఎప్పుడేం అఘాయిత్యం జరుగుతుందో.... ముందు పీడి దగిర్నించి తప్పుకుపోతే .... తర్వాత నీ భర్త వొచ్చి పీడి పని పట్టిస్తాడులే. ఎందుకు విడిచి పెడతాడూ ?"

సీత అయిష్టంగా తల తిప్పింది — "రావణుడు నన్ను కొంచెం

దయగానే చూస్తున్నాడు. చంప దలుచుకుంటే ఈ పాటికి చంపేవాడే ! .... నేను సీతతో రావటం .... ఏ విధంగా చూసినా మంచిది కాదు. ఎక్కడి కక్కడే కాపలా కాస్తూ వున్నారు. పట్టుబడి పోయామంటే ఇద్దర్నీ చంపేస్తారు. లేకపోతే నీన్ను చంపి నన్ను మళ్ళీ రావణుడికి అప్పగిస్తారు. .... అప్పుడు నన్ను తీసుకుపోయి ఇంకెక్కడో దాస్తారు. .... ఆలోచిస్తే, అన్నీ అవాంతరాలే తోస్తున్నాయి. నువ్వు తొందరగా వెళ్ళి నా భర్తవొచ్చే ఏర్పాట్లు చేయడం శ్రేయస్కరం. ఇన్ని మాటలెందుకు ? .... పర పురుషుడి వెంట వెళ్ళడం నాకు మర్యాద కాదు." *

---

* 37 వ సర్గ — 29 వ శ్లోకం.

వాల్మీకి రామాయణంలో హనుమంతుడు కోతిగదా? .... సీతని తన వీపుమీద ఎక్కించుకుని తీసుకుపోతా నంటాడు. సీత — "బహు దూరము నన్ను నీవెట్లు మోసికొని పోగలవు ? ఇది నీ కోతిబుద్ధి యను కొనెదను," — అని పరిహాసం చేస్తుంది.

ఆ కోతిచేతే సహాయం పొందడం, దానితో కార్యాలు చేయించుకోవడం — దాన్ని పరిహసించడం — అంతంత వీరకృత్యాలు చేసే వానరుడికి కోతి బుద్ధి ఎలా వుంటుందీ ? సేవలు చేసే పరిచారకుల్ని, అలక్ష్యంగా, తక్కువ తనంగా చూసే సమాజ లక్షణం ఇది. ఈ లక్షణం ముందు ముందు కూడా కొన్నిసార్లు చూడవొచ్చును.

(అలా పరిహాసం చేసిన సీతకోసం అశోకవనంలో హనుమంతుడు శరీరం పెంచేసి బ్రహ్మాండమైన రూపం చూపిస్తాడు. — ఎంత సాహసమో కవిగారికి.)

"రామ లక్ష్మణులు లంకకు ఎలా వొస్తారు ?" — అని అడుగుతుంది సీత. — హనుమంతుడు —"నా వీపుమీద కూర్చోండి, పురుష శ్రేష్ఠులగు రామ లక్ష్మణులు నీ సమీపమునకు వొచ్చెదరు." — అన్నాడు.

"ఎలా తీసుకొస్తావు ? ... నీ కోతిబుద్ధి గానీ".... — అనలేదు సీత — వాళ్ళు రావటం చాలా అవసరం కదా ? (లేకపోతే, పడితే వాళ్ళే పడతార్లే సముద్రంలో — అనేమో)

"మంచిది తల్లీ ! .... నువ్వన్నమాట నిజమే. లోకులు కాకులు .... ఎన్ని అపనింద లయినా వేస్తారు .... నీ అంత వుత్తమ స్త్రీని నే నెక్కడా చూడలేదు. నువ్వు తప్ప.... ఇంత బుద్ధిమంతురాలు లోకంలో వుండదు. మహా పతివ్రతవి. నీకే ఈ కష్టాలన్నీ వొచ్చి పడ్డాయమ్మా!"

సీత తన్మయత్వంలో మునిగింది — రేపు తన భర్త రక్షించి తీసుకు పోయిన తర్వాత .... ఇంకెంతమంది ఎన్ని రకాల కీర్తిస్తారో ! .... బ్రాహ్మలు.... రుషులు ... పండితులు.... వృద్ధులు.... పురోహితులు.... అనలు రావణుడు ఎత్తుకు రావడమే గొప్ప కీర్తి ! పర పురుషుణ్ణి కోరలేదనే సత్యం తన భర్తకూ తెలుస్తుంది. లోకమూ మెచ్చుతుంది.

"అమ్మా ! .... నీ మాటలన్నీ నీ భర్తకు చెపుతాను. ఇంకేమైనా చెప్పమంటావేమో చెప్పు."

"అయ్యో ! .... అప్పుడే వెళతావా ?"

"వెళ్ళనులే తల్లీ ! .... నీ ఆజ్ఞ అయినప్పుడే వెళ్తాను. నీ భర్తకేం చెప్పమంటావో అన్నీ చెపితే ...."

"నేనేం చెప్పను. అంతా నువ్వే చూశావు.— నా దుస్థితి అంతా వివరించు. శ్రీరాముడి కోసమే ప్రాణాలు నిలుపుకున్నానని చెప్పు .... మేము చిత్రకూటంలో వున్నప్పుడు ఒకసారి నా భర్త తొడ మీద తల ఉంచుకొని పడుకున్నాను. అప్పుడొక అడవి కాకి వొచ్చి నన్ను పొడిచింది. దాన్ని తరమడానికి వడ్డాణం తియ్యబోయాను. నా భర్తకు కాకిమీద చాలా కోపంవొచ్చి వెంటనే బాణం వేశాడు. ఆ విషయం గురుచెయ్యి. కాకినే దండించినవాడు ఇంత దుర్మార్గుణ్ణి విడిచిపెట్టాడేమో అని ఎప్పుడూ దుఃఖపడుతూ వుంటానని చెప్పు." *

---

* 38 వ సర్గ — 15 నించీ 40 శ్లోకాల వరకూ.

సీత రాముడికి చెప్పమని హనుమంతుడికి చెప్పిన కాకాసురుడి వృదంతం ఇది.

"వనముకో — రాముడి తొడపై విశ్రమించితిని. అపుడు ఒక

"ఈ దుర్మార్గుడు కాకి కాదుగా తల్లీ : పీడి చుట్టూ మంచీ మార్పులం, సైన్యం ...."

(ఫుట్ నోట్ : 431 వ పేజీ తరువాయి)

కాకి మాంసము నపేక్షించి నా స్తనముల మధ్యలో పొడిచెను. (ఎక్కడండి కవిగారూ ? .... స్తనముల మధ్యలోనా ? .... అవున్లెండి. అదే మీకు కనపడ చోటు.) నేను దానిని మట్టి బెడ్డకో గొట్టితిని. అది విడువక నా స్తనములను బొడుచుచు దాగియుండెను. అపుడు వడ్డాణము తీయబోతిని. పేట జారినది. రాముడు నవ్వెను. నేను సిగ్గుపడి అలక వహించితిని. మరల శ్రీరాముని తొడమీద పండుకొని అలక వహించితిని.

తరువాత శ్రీరాముడు నా తొడమీద నిద్రించెను. ఆ కాకి మరల నా స్తనములమధ్య పొడిచెను. పైకెగరి మరల మరల పొడిచెను. (కవిగారే ఆ కాకి రూపం దాల్చి, సీతకు స్తనాలు వొచలడం లేదని నా గాఢ నమ్మకం.) నా స్తనములనుండి రక్త బిందువులు పడి రాముని దేహము తడిసెను. కాకివల్ల కలిగిన హింసచే శ్రీరాముని నిద్ర లేపితిని. శ్రీరాముడు లేచి కుపితుడై — "ఏనుగు తొండమువంటి తొడలు గలదానా ! (ఈ మాటే రావణుడంటే తప్పొచ్చిందా !) ఏ దురాత్ముడు స్తనముల మధ్యలో నిన్ను బొడిచెను" — అని బుస గొట్టెను. గోళ్ళకు రక్తముతో నిలిచిన కాకిని జూచి మిక్కిలి కోపముతో ఒక దర్భను తీసి, మంత్రించి, బ్రహ్మాస్త్రము విడిచెను. అది కాకి వెంటబడి ముల్లోకములు తరిమినది. కాకి తొమ్మిది పర్యాయములు ముల్లోకములు తిరిగి, తనను రక్షించువారిని గానక, రాముని పాదములపై బడెను. రాముని దయతో బ్రహ్మాస్త్రము కాకి కుడికంటిని మాత్రము నాశనముజేసి ప్రాణములు నిలిపెను."

— ఈ మధురన్మతి గురు చెయ్యమంది సీత భర్తకి. పిచ్చుక మీద కాదు. కాకిమీద బ్రహ్మాస్త్రం। అలాగే రావణుడిమీద వెయ్యలేదూ ?

"ఒకసారి నా బొట్టు చెరిగిపోతే .... మణిశిల అరగదీసి నా మొహాన్న బొట్టు వుంచాడు నా భర్త. ఆ సంగతి కూడా గురుచెయ్యి. తిలకం పెట్టినప్పుడు నా ప్రాణాలు కూడా నిలబెడతాడో, లేదో అడుగు."

"వెనకటి రోజులన్నీ తలుచుకుంటూ వుంటే శ్రీరాముడేనా నన్నింత వుపేక్షించిందీ అని విస్మయం కలుగుతోంది హనుమంతుడా! "ఆపదలో వున్నవారిని రక్షించాలి" అనే వాడే! దూరం అయిపోయిన ఈ భార్యమీద ఇంకా ప్రీతి వుంటుందా? నామీద పగపే వుంటే నన్ను రక్షించలేడా? నా భర్త పరాక్రమం నే నెరుగుదును. ఎన్ని కష్టాలకైనా చలించడు. ఎన్నడూ నిరుత్సాహ పడడు. మహా శక్తిమంతుడే వుండి కూడా నామీద దయ లేకుండా ఉన్నాడు .... ఇకనయినా ఇక్కడికివొచ్చి నన్నీ చెరనుంచి తప్పిస్తాడా?" — జలజల కన్నీళ్ళు రాల్చింది.

"నువ్వింలా మెనసు కష్టపెట్టుకోకు తల్లీ! నీ భర్త నిన్ను రక్షించడానికేనమ్మా యుద్ధానికి సిద్ధపడుతున్నాడూ. నీ భర్త నిద్రలోకూడా నిన్ను మరిచిపోడు. ఆయన దుఃఖించడం .... నీ మరిది ఓదార్చడం .... నేను చూస్తూనే వున్నాను తల్లీ! నా మాట నమ్ము .... నువ్విక కంటతడి పెట్టకూడదు. ఇంక ఎంతోకాలం పట్టదు."

"ఎంత చల్లగా మాట్లాడుతున్నావు హనుమంతుడా!....నా దుఃఖం పూర్తిగా నువ్వే పోగొట్టాలి. నన్ను నా భర్త పాదాల దగ్గిరికి నువ్వే చేర్చాలి నాయనా!"

"నా భర్తకు ఎలా చెపుతావో, నన్నీ శోక సముద్రంనించి ఎలా గట్టెక్కిస్తావో అంతా నీదే భారం. లోకమంతా ఏలగల సమర్థుడు నా భర్త. శత్రువుని రూపుమాపి, ధర్మ పత్నిని రక్షించడం ఆయన ధర్మమని గుర్తు చెయ్యాలి సుమా నువ్వు. ఇక్కడ ఈ దుర్మార్గులు నన్ను ఎంత హింసిస్తున్నారో, ఎంత పరిహసిస్తున్నారో, అంతా నా భర్తకు చెప్పు. ఈ రోజునుంచి వొక్క నెలరోజులు మాత్రమే జీవిస్తాను. నా భర్త స్వయంగా వచ్చి లంకంతా బీభత్సంచేసి నన్ను తీసుకు వెళ్లాలి.

హనుమంతుడా : నీ మాటలవల్లే నా భర్తకు నన్ను తిరిగి సాధించాలనే పౌరుషం కలగాలి. *

"అలాగే తల్లీ : తప్పకుండా చెపుతాను. చూసిందంతా చూసినట్టు చెపుతాను. నా మాటల్లో ఏమీ లోపం చెయ్యను. నువ్వు మాత్రం ధైర్యంగా వుండాలి సుమా :" —

సీత చెంగుకు కట్టి వుంచిన ఆభరణం తీసింది.— "ఈ చూడామణి నా భర్తకు అందజేయ్యి నాయనా : నన్ను కలుసుకున్నావని తప్పకుండా నమ్ముతాడు. సంతోషిస్తాడు. మరిచిపోకు సుమా : వెళ్ళగానే ఇయ్యి ...."

"అలాగే తల్లీ : ఈసారి వెళ్ళగానే ఇస్తాను" — అని హనుమంతుడు ఆ సొగ అందుకున్నాడు.

సీత కళ్ళు నిండుకొచ్చాయి— "ఈ రాత్రి మాత్రం ఇక్కడే వుండు నాయనా : నువ్వు వున్నావనే వూహ నా కెంతో ధైర్యం కలిగిస్తుంది. ఇంతసేపూ ఎంత వూరట పడ్డాను : నువ్వు వెళ్ళిన క్షణం నుంచీ, మళ్ళీ నా దగ్గిరకు వొచ్చే క్షణం వరకూ ఎన్ని కళ్ళతో ఎదురు చూస్తానో : నా ప్రాణం నిలుస్తుందో లేదో : నా భర్త మహా పరాక్రమవంతుడే వుండి కూడా నన్ను రక్షించకుండా వుండడం నా దురదృష్టమే. నా పాపం పూర్తిగా అనుభవించనిదే నా భర్తకు నన్ను రక్షించాలనే దయ కలగదు."

---

* 39 వ సర్గ — 9 నించి 12 వరకూ.

సీత, తన నెలాగయినా ఈ కష్టాల్లోంచి గట్టెక్కించేట్టు రాముడికి మరీ మరీ — హనుమంతుడి బతిమాలుతోంది. — "హనుమంతుడా : శ్రీరాముడు నన్ను జీవించి యుండునటుల ఎట్లు చేయునో, అటుల నీవు చెప్పవలయును. నీ మాటల సహాయముజేసి పుణ్యము గట్టుకొనవలెను.

రాముడు నీ మాటలు విని, వుత్సాహమును, పౌరుషమును వృద్ధి జేసుకొనును. రాముడు నీ మాటలు వినియే శత్రువులమీద పరాక్రమమును బాగుగ జూపును." —

"వొద్దు తల్లీ: నువ్వు యింతగా దుఖపడుతూ వుంటే నిన్ను విడిచి నేనూ వెళ్ళలేను. నా మాట నమ్ము. నీ భర్త పరాక్రమవంతుడు. నిన్ను తప్పకుండా ఈ చెరనుంచి రక్షిస్తాడు. నన్ను వెళ్ళమని అనుమతించు. సంతోషంగా వెళ్ళి నీ భర్తకి కబురు అందజేస్తాను."

"అలాగే వెళ్ళు నాయనా: ... నా భర్త పాదాలకు నేను నమస్కరించినట్లుగా నువ్వే నమస్కరించు. నా మరిదీ క్షేమం అడిగానని చెప్పు. సుగ్రీవ మహారాజునీ, పుత్రులందర్నీ అడిగానని చెప్పు...."

దూరంగా దాసీల మాటలు వినపడ్డాయి.

సీత చప్పున ఇంకో చెట్టువేపు నడిచింది.

"ఒక్క నెల మాత్రమే జీవిస్తానని చెప్పు ...."

తొమ్మిదో కథ తర్వాత పదో కథ వరకూ—

(హనుమంతుడు సీతతో మాట్లాడి, అశోకవనం నుంచి బయల్దేరడంతో తొమ్మిదో కథ ముగిసింది. హనుమంతుడు రుష్యమూకం వెళ్ళి రాముడితో సీత గురించి చెప్పడంతో పదవ కథ ప్రారంభమవుతుంది. ఈ రెండు కథలకూ మధ్య కథాభాగం ఇది.)

— హనుమంతుడు లంకకు వొచ్చిన పని సవ్యంగా ముగిసింది. — "ఈ రాక్షసుని బలా బలాలేమిటో తెలుసుకుని వెళ్తాను." — అనుకున్నాడు. "ఎలాగైనా వీరిని కవ్విస్తాను. యుద్ధ పొసిగేట్టు చూస్తాను. నా వంటి ఓరుడి మీదకు ఎంత సైన్యం వొచ్చినా సర్వనాశనం అయిపోతారు." — అనుకున్నాడు. *

---

* 30 వ సర్గ — 20 నుంచి 40 వరకూ.

హనుమంతుడు సీతను చూశాడు. మాట్లాడాడు. వొచ్చిన పని అయిపోయింది. లంకలో యుద్ధం చెయ్యాలని ఆలోచిస్తున్నాడు. ఈ ఆలోచనకు ముందు అతని ఆలోచనలేమిటో మనం చూడాలి.

అశోకవనంలోకి వొచ్చి, చెట్టుమీద చాక్కుని, ఇంకా సీతతో మాట్లాడకముందు .... లంకలో తను ఎలా ప్రవర్తించాలో, ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో, ఎలాంటి ప్రమాదాలు రాకుండా చేసుకోవాలో, మొదలైన విషయాల గురించి ఎలా ఆలోచించాడో చూడండి — "ఈ రాక్షస

(పుట్‌నోట్ : 436 వ పేజీ తరువాయి)

త్రీలు నన్ను జూచినచో పట్టి .... బంధింతురు .... లేదా చంపుదురు. రాక్షసులమధ్య తగులుకొని, యుద్ధము జేయవలసి యుండినచో, ఆ శ్రమవల్ల నేను తిరిగి సముద్రము దాటలేను. సీత సమాచారము శ్రీరామునకు తెలియకపోవును .... రాక్షసులు సీతను జంపుదురు .... నన్ను పీరు చంపిననూ, బంధించిననూ, సముద్రమునుదాటి శ్రీరాముని కార్యము జేయగలవా డింకొకడు లేడు. నేను మరణించినటులైతే, ఈ సముద్రము దాటగల వానరుడు యెంత యోచించినను నా కగుపడలేదు ... యుద్ధము నందు జయాపజయములు అస్థిరములు. బుద్ధిమంతుడు సందేహాస్పదమైన కార్యములు జేయడు. అహంకారముగల దూతలు మంచి కార్యములు పాడు చేయుదురు."

— తర్వాత — "నిన్ను పీపుమీద పెట్టుకుని తీసుకుపోతాను" — అని హనుమంతు డన్న సందర్భంలో సీత ఏమన్నదో చూడండి."

37 వ సర్గ — 47 నుంచీ — 57 వరకూ.

తన సంగతిగానీ, హనుమంతుడి సంగతిగానీ బయటపడితే ఏం ప్రమాదాలు సంభవిస్తాయో సీత చెపుతోంది— "నన్ను జూచి రాక్షసులు మన వెంటబడుదురు. నన్ను రక్షించుచుండు నీకే యాపద గలుగును. సందేహము లేదు. రాక్షసులు నన్ను గొనిపోయి రావణునకు సమర్పింతురు. లేక నన్ను నరికివేయుదురు ... లేదా .... నన్ను దీసుకొనిపోయి — వానరులకును, రామ లక్ష్మణులకును తెలియకసుండు రహస్యమైన చోట ఉంచెదరు. అప్పుడు శ్రీరాముడు జేయు ప్రయత్నము లన్నియు వ్యర్థ మగును. జయాపజయములు సంశయములు. జయాపజయములను ముందే నిర్ధారణ జేయుటకు సాధ్యముగాదు." —

ఈ రెండు సందర్భాలలో ఇలా తర్కించిన కవి, ఇప్పుడు .... రాక్షసులతో యుద్ధం చేసి, లంక తగలబెట్టడం కోసం ఏమని తర్కిస్తున్నాడో చూడండి.

(తరువాత పేజీలో)

అశోకవనంలో చెట్లన్నీ పీకెయ్యడం ప్రారంభించాడు. మహా వృక్షాలు పెళ్ళగిస్తున్నాడు. కొండలు పిండి చేస్తున్నాడు. బావులూ, తటాకాలూ విరగదీస్తున్నాడు. మేడలన్నీ కూలదోస్తున్నాడు.

పక్షులు ఆకాశంనిండా కప్పి ఆక్రందనలు చేస్తున్నాయి. గుహలోంచి పెద్ద పులులు పరుగులెత్తుతున్నాయి. అశోకవనం నుంచి వినపడే ఫెళ ఫెళలకు లంకలో ప్రజలంతా భయంతో వొణికారు.

(ఫుట్‌నోట్ : 437 వ పేజీ తరువాయి)

41 వ సర్గ — 13 వ శ్లోకం వరకూ.

"ఒక పనికి పంపబడిన దూత పెక్కు పనులను చేయుటకు యత్నించినపుడు, మొదటి పనికి భంగము కలుగకుండునట్లు వుండవలయును. అట్లు జేసినవాడే సమర్థుడు. — (మొదటి పనికి భంగం కలగదనీ, తనమీద కోపంతో రావణుడు సీతని చంపడనీ ఏమైనా నిర్ధారణ వుందా ?) — ఎవడెతే అనేక వుపాయములచే కార్యమును సాధించగలడో వాడే నమర్థుడు .... ఈ రాక్షసుల బలాబలములను తెలుసుకొను విషయములో దండోపాయమే సాధనము. యుద్ధములో కొందరు వీరులు హతులైనచో, మిగిలినవారు లొంగుదురు ... కనుక మంత్రులతోనూ, సేనలతోనూ గూడియుండు రావణుని యుద్ధములో గలిసి, అతని బలమును తెలుసుకొని, ఇచటనుండి సుముఖముగ ప్రయాణము చేసెదను. అసాధ్యమగు పరాక్రమముగల నేను, భయంకరమగు పరాక్రమముగల రాక్షసులను యుద్ధములో గలిసికొని .... నేనను జంపి .... సుఖముగ కిష్కింధకు పోయెదను."—

యుద్ధం చేస్తే, తిరిగిపోయే శక్తి రాదన్నాడే మొదట !

సీతని చంపడమో .... ఇంకోచోట దాయడమో .... హనుమంతుడే ఓడిపోవడమో . ఇవన్నీ ఏ గంగలో కలిశాయి ? ఇంకా ముందు ముందు చూడండి. సీతకు ప్రమాదం వొచ్చే పనులు ఎన్ని చేశాడో !

ఏ పుట్టం దగ్గిర ఆ తర్కం ! అప్పుడదీ ! ఇప్పుడిదీ ! — కవి ఏ యెండ కా గొడుగు పట్టగలడు.

హనుమంతుడు సీత వున్న చోటు మాత్రం వొదిలిపెట్టి, మిగిలిన దంతా ధ్వంసం చేసేసి, ప్రాకారానికున్న పెద్ద ద్వారంమీద ఎక్కి కూర్చున్నాడు.

సీత చగ్గిర నిద్రపోయిన రాక్షస స్త్రీలు లేచారు. (ఎంత బంద నిద్రో!) — సర్వనాశనం అయిపోయిన అశోకవనం చూశారు. ద్వారం మీద భీకరంగా కూర్చునివున్న కోతిని చూశారు — సీత చుట్టూ చేరి — "ఆ వానరు డెవరు? అతనితో నువ్వెందుకు మాట్లాడావు?" — అని అడిగారు.

"నాకేం తెలుసు? నేనూ మీలాగే భయపడుతున్నాను. మీ రాక్షసుల సంగతులు మీకే తెలుస్తాయి" — అంది సీత.

కొందరు దాసీలు రావణుడి దగ్గిరికి వెళ్ళారు — "ఎవడో ఒక వానరుడు సీతతో మాట్లాడి ఇంకా అక్కడే వున్నాడు. సీత వున్నచోటు విడిచిపెట్టి వనమంతా నాశనం చేసేశాడు. వాడి గురించి సీత నడిగాం గానీ చెప్పడంలేదు" — అని చెప్పారు.

రావణుడు మండిపడి, 80 వేలమంది వీరుల్ని పంపాడు. వారంతా ఇనప రోకళ్ళూ, పట్టసాలూ, శూలాలూ, గదలూ, బాణాలూ తీసుకుని హనుమంతుణ్ణి చుట్టుముట్టి, ఆయుధాలు విసరడం ప్రారంభించారు.

హనుమంతుడు శరీరం పెంచేసి — "శ్రీరామ లక్ష్మణులకు జయం! సుగ్రీవ మహారాజుకి జయం! నేను హనుమంతుణ్ణి! వాయు పుత్రుణ్ణి! లంక సర్వనాశనం చేసేస్తాను. సీతాదేవి దగ్గిర శెలవు పుచ్చుకొని క్షేమంగా తిరిగి పోతాను" — అంటూ భయంకరంగా గర్జించాడు. ఎగిరే పిట్టలన్నీ ఆ అరుపులకే గుండె లవిసి, పువ్వులమ్మల్లే కింద రాలి పడ్డాయి.

హనుమంతుడు వాకిలి తలుపుకున్న ఇనప గడియ వూడదీసి పట్టుకుని ఆకాశంలో కెగిరాడు. (ఎంత మహిమ గలవాడయినా ఉత్త చేతులతో ఏమీ చెయ్యలేడు. ఆయుధం వుండాల్సిందే.)

హనుమంతుడికీ, 80 వేలమంది సైనికులకీ ఘోరమైన యుద్ధం జరిగింది.

హనుమంతుడు 80 వేల మందినీ చంపేశాడు. (లక్షమంది అయితే బాగుండేదిగా కవిగారూ? కొంచెం తక్కువ చేశారేం?) — హనుమంతుడు అందర్నీ చంపేసి, మళ్ళీ గుమ్మం ఎక్కి కూర్చున్నాడు.

సైన్యం పోయిన వార్త విని రావణుడు మండిపడి, ప్రహస్తుడనే మంత్రి కొడుకు జంబుమాలిని యుద్ధానికి వెళ్ళమన్నాడు.

ఇంతలో హనుమంతుడికి చైత్య ప్రాసాదం సంగతి జ్ఞాపకం వొచ్చింది. • "అది పాడు చెయ్యకుండా విడిచానే!" — అని లేచి ద్వారంమీదనుంచి ఆ మందిరం మీదకు వొక్క అంగ వేశాడు. దాని శిఖరాలు వూపి వూపి మొత్తం మందిరం అంతా కూలగొట్టి, గొప్ప గర్వంతో — "శ్రీరామ చంద్రుడికి జయం! సుగ్రీవుడికి జయం! వెయ్యిమంది రావణుల్నయినా పిండి చేస్తాను" — అంటూ అరిచాడు. •

• "చైత్య ప్రాసాదం" అంటే "దేవాలయం" — అని గట్టుపల్లి శేషాచార్యులుగారు అనువాదం చేశారు.

చైత్య ప్రాసాదం అంటే ఒక మందిరం అనీ, "చైత్ర ప్రసాదం" అంటే దేవాలయం అనీ కొందరు పండితులన్నారు.

• అసలు హనుమంతుడు గూఢచారిగా వచ్చాడు. గూఢంగా సంచరించి, వొచ్చిన పని ముగిసిం తర్వాత, ఇంకేమైనా చెయ్యదల్చిస్తే గూఢంగా వుండే చెయ్యాలి.

గూఢచారి కాకుండా మాత అయితే, వొచ్చినపని అయ్యాక తిన్నగా రావణుణ్ణి కలుసుకోవాలి. ఈ రెంటిలో దేనికీ చెందడంలేదు. తను రామదూతనని చెప్పుకుంటున్నాడు. సీతతో మాట్లాడానని రహస్యం లేకుండా చెప్పేస్తున్నాడు. మరి హనుమంతుడి విషయం సీత ఎందుకు పదుగు పరిచింది? అది రహస్యంగా వుంచాలనీ, బయట పడవలసిన విషయం కాదనీ ఆమె అభిప్రాయ పడ్డట్టేగదా?

కవికి — దూతలు ఎలా ప్రవర్తించాలో తెలియదనడానికి వీల్లేదు. ఎందుకంటే — రావణుడి వద్దగ్గర్నించి సుగ్రీవుడి దగ్గరికి వొక దూత వొస్తాడు యుద్ధానికి ముందు. ఆ మాత, దూత లక్షణాలతోటే ప్రవర్తించాడు. మరి హనుమంతుడు కూడా అలా ఎందుకు ప్రవర్తించడం లేదు?

కాపలా కాసేవారు నూరుమంది హనుమంతుడి మీదికి ఆయుధాలు విసిరారు. హనుమంతుడు అక్కడ వూడి పడివున్న స్తంభం వొకటి పట్టుకుని, ఆ నూరు మందినీ కొట్టి చంపేసి, చేతిలో స్తంభం గిరగిర తిప్పుతూ తిరిగాడు. స్తంభం రాళ్ళకు తగిలి నిప్పు పుట్టింది. ఆ నిప్పు పడి చైత్యప్రాసాదం పూర్తిగా కాలిపోయింది.

అప్పటికి జంబుమాలి గాడిదల రథంతో, ఆయుధాలతో, యుద్ధానికి కొచ్చాడు. రాగానే హనుమంతుడి మీద బాణ వర్షం కురిపించాడు.

హనుమంతుడు పెద్ద రాయి ఎత్తి జంబుమాలి మీదకు విసిరాడు. జంబుమాలి బాణాలతో దాన్ని పిండి పిండి చేసేశాడు.

హనుమంతుడు పెద్ద మద్దిచెట్టు, వేళ్ళతో వూడబీకి గిరగిర తిప్పి జంబుమాలి మీద కొట్టాడు. జంబుమాలి దాన్ని కూడా తునాతునకలు చేసేశాడు.

హనుమంతుడు తలుపు గడియ పట్టుకుని దాన్ని పెట్టి రథం మీద మోదాడు.

రథం, సారథీ, గాడిదలూ, జంబుమాలీ కంటికి కనపడకుండా అదృశ్యం అయిపోయారు.

హనుమంతుడు మళ్ళీ గుమ్మం ఎక్కి కూర్చున్నాడు.

* * *

మళ్ళీ రావణుడి ఆజ్ఞ ప్రకారం, వీడుగురు మంత్రుల కొడుకులు, ధనుస్సుల్తో, సేనల్తో బయల్దేరారు. కొడుకులు యుద్ధానికి పోతోంటే, వారి తల్లులు వలవలా ఏడ్చారు.

(పుట్‌నోట్ : 440 వ పేజీ తరువాయి)

ఇంతకీ హనుమంతుడు ఏమిటి ? మూలా ? గూఢచారా ? — (పెద్ద గూండా ? — రామ గూండా ?)

హనుమంతుడితో యుద్ధం ప్రారంభమైంది. మంత్రుల కొడుకులూ, సైనికులూ హనుమంతుడి మీదకి రకరకాల ఆయుధాలూ, బాణాలూ గుప్పించారు.

హనుమంతుడు కొండమలే శరీరం పెంచి సేన మీద పడ్డాడు. కొందర్ని పిడికిళ్ళతో గుద్ది చంపేశాడు. కొందర్ని నేలకి తొక్కి చంపేశాడు. కొందర్ని గోళ్ళతో చీల్చి చంపేశాడు. కొందర్ని మోకాళ్ళతో తుమ్మి చంపేశాడు. కొందర్ని పిడుగుల్లాంటి అరుపులతో హడలగొట్టి చంపేశాడు. ఏనుగుల్ని, గుర్రాల్ని, పాదాలతో నొక్కి చంపేశాడు.

సైనికుల కేకలతో, జంతువుల కూతలతో, రణరంగం బీభత్సం అయిపోయింది. రక్తం పాయలు పాయలుగా ప్రవహించింది.

లంక రోదనలతో నిండిపోయింది.

హనుమంతుడు మళ్ళీ గుమ్మం ఎక్కి కూర్చున్నాడు.

• • •

రావణుడు ఆలోచనలో పడ్డాడు. (ఎవర్ని పంపాలా అని. — సీతని ఇచ్చెయ్యాలని కాదు.)

ఐదుగురు సేనాపతుల్ని పిలిచాడు.— "ఈ సారి మీరు వెళ్ళండి. జాగ్రత్తగా ప్రవర్తించాలి సుమా; నేర్పు కావాలి మరి. అతడు వానరుడికి ఇంత బలం ఎక్కడిది? పూర్వం నేను వాలినీ వాళ్ళనీ చూశాను. వాళ్ళకు ఇంత బలం లేదు. ఇంత భయంకరంగా లేరు. * వీడు ఏదో భూతం అయివుండాలి. మనం పూర్వం దేవత

---

* 46 వ సర్గ — 9 నుంచి 12 వరకూ.

హనుమంతుడు ఎంత బలవంతుడో చెపుతున్నాడు రావణుడు — "నేను పూర్వము వాలిని, గొప్ప బలము గల జాంబవంతుని, నీలుని,

లందర్నీ జయించాం. వారే మనమీద కోపంతో ఈ భూతాన్ని సృష్టించి పంపి వుంటారు. (నేను ఫలానా, నా పని ఫలానా అని చెప్పుతోనే వున్నాడా పెద్దమనిషి.) — ఆ భూతాన్ని చంపకండి. అవమానించకండి. (ముద్దెట్టుకోండి.) జాగ్రత్తగా పట్టుకోండి. మీరు మహా వీరులు; నాకు తెలుసు. మల్లోకాలూ ధ్వంసం చేసెయ్యగలరు. (యుద్ధానికి గెంటే పొగడ్తలు.) యుద్ధంలో జయమే కలుగుతుందని గర్వపడకూడదు. మిమ్మల్ని మీరు రక్షించుకుంటూ యుద్ధం చెయ్యాలి," — అని హెచ్చరికలతో సాగనంపాడు.

సేనాపతులు ఆయుధాలతో, సేనలతో బయల్దేరారు.

మళ్ళీ యుద్ధం :

హనుమంతుడు కొండలా శరీరం పెంచి, ఆకాశంలో కెగిరి పిడుగు పడ్డట్టు ఒక సేనాపతి రథం మీద కురికాడు. ఆ రథం గుర్రాలతో సహా భూమికి నొక్కుకు పోయింది.

మిగిలిన సేనాపతులు కోపంతో విజృంభించారు. హనుమంతుడు అందులో ఇద్దర్నీ పెద్ద చెట్టుతో మోది చంపేశాడు.

మిగిలిన ఇద్దరూ శూలాలూ, పట్టసాలూ విసిరారు. హనుమంతుడు పెద్ద పర్వత శిఖరం వొకటి వారిమీదకు విసిరి వారిద్దర్నీ చంపేశాడు.

సేనాపతు లందరూ పోయాక హనుమంతుడు సేన నంతటినీ నాశనం చేశాడు. ఏనుగుతో ఏనుగును కొట్టి ఏనుగులన్నిటినీ చంపేశాడు.

(ఫుట్‌నోట్ : 442 వ పేజీ తరువాయి)

ద్వివిదుని, మొదలగు వానరులను జూచియున్నాను. వారి తేజస్సు, పరాక్రమము నిట్టివి గావు."

వారికన్నా బలవంతుడట హనుమంతుడు ; మరి, హనుమంతుడు కూడా వాలిని జయించలేక, సుగ్రీవుడికి సహాయం చేసేవాళ్ళ కోసం ఎదురు చూస్తూ, ఋష్యమూకం మీద పడి యాడవటం ఎందుకు కవి గారూ ?

గుర్రంతో గుర్రాన్ని కొట్టి గుర్రా లన్నిటినీ చంపేశాడు. సైనికుడితో సైనికుణ్ణి కొట్టి సైనికు లందర్నీ చంపేశాడు. (కవిత్వం సోగసు !)

యుద్ధరంగం, శవాల కుప్పలతో, విరిగిన రథాలతో, తెగిపడ్డ తలలతో, మొండేలతో నిండిపోయింది.

హనుమంతుడు మళ్ళీ ద్వారం ఎక్కి కూర్చున్నాడు.

* * *

రావణుడు కొంచెం విచారించాడు. అక్షకుమారుడి వేపు చూశాడు — "వెళ్తావా ?" — అన్నట్టు.

అక్షుడు రావణుడి కొడుకే. వయసులో చాలా చిన్నవాడు. మహా వీరుడు. ఉత్సాహవంతుడు.

అక్షుడు తండ్రి కంటిసైగ చేతనే, అతని ఆజ్ఞ గ్రహించి, యుద్ధానికి సిద్ధమయ్యాడు.

ఆయుధాలతో రథం సిద్ధంగా వుంది. సేన సిద్ధంగా వుంది. — బయల్దేరాడు.

హనుమంతుణ్ణి చూసి — "ఇతడు చాలా గొప్పవీరుడే. నాకు తగినవాడే దొరికాడు." — అని సంతోషించాడు.

ఇద్దరికీ గొప్ప యుద్ధం ప్రారంభమైంది. భూమి గడగడ వొణికింది. పర్వతాలు దొర్లిపడ్డాయి. సముద్రం అల్ల కల్లోలమైంది. సూర్యుడు భయపడి కాంతి తగ్గాడు.

పర్వతంమీద వాన కురిసినట్టుగా హనుమంతుడి మీద బాణవర్షం కురిసింది.

హనుమంతుడు గాలి మళ్లే బాణాలకు అందకుండా తిరిగాడు.

హనుమంతుడికి, అక్షకుమారుడి వీరత్వం నచ్చింది. — "వీడు చాలా చిన్నవాడు. ఎలా చంపను?" — అని జాలిపడ్డాడు.

మళ్ళీ, — "వీడు మహా పరాక్రమవంతుడు. వీణ్ణి వుపేక్షిస్తే నేనే వోడిపోవలసి వొస్తుంది. రాజుకునే అగ్నికణాన్ని వుపేక్షిస్తే, మహా జ్వాల అయిపోతుంది. వీణ్ణి చంపడమే మంచిది,"— అనుకున్నాడు.

అక్షకుమారుడు రథంతో ఆకాశాని కెగిరి హనుమంతుణ్ణి వెంటాడి బాణవర్షంతో ముంచెత్తుతున్నాడు.

హనుమంతుడు అక్షకుమారుడి రథాన్ని అరిచేతితో వొక్క చరుపు చరిచాడు. ఆ రథం ఎనిమిది గుర్రాలతో, సారథితో, ఆకాశం నుంచి భూమిమీద పడిపోయింది. అక్షకుమారుడు మాత్రం ధనుస్సుతో ఆకాశంలో కెగిరాడు.

హనుమంతుడు అక్షుడి కాళ్ళు దొరక బుచ్చుకుని గిరగిర తిప్పి బండలకేసి కొట్టి చంపేశాడు.

దేవతలూ, గంధర్వులూ, యక్షులూ, రుషులూ, సిద్ధులూ మిక్కిలి సంతోషించి, హనుమంతుణ్ణి మెచ్చుకున్నారు. హనుమంతుడు మళ్ళీ గుమ్మం ఎక్కి కూర్చున్నాడు.

* * *

రావణుడు కోపం పట్టలేక వెంటనే యుద్ధానికి వెళ్ళమని ఇంకో కొడుకుని ఇంద్రజిత్తుని ఆజ్ఞాపించాడు. — "నువ్వు మహా వీరుడివి. పూర్వం ఇంద్రుణ్ణే జయించావు. బ్రహ్మ వరాలతో అనేక అస్త్రాలు సంపాదించావు. నువ్వు మహా శక్తి శాలివి కాబట్టి నిన్ను పంపటానికి నాకు సందేహం లేదు. ఇంతకుముందు పంపిన వాళ్ళమీద నా కింత నమ్మకం లేదు. ఈ కార్యం నువ్వే సాధించగలవు — (ఈ ఏడుపు మొదటే ఏడిస్తే బాగుండేదిగా!) ఆయుధాలవల్లా, సేనవల్లా, ఏమీ లాభం లేదు. మంత్రశక్తితో సాధించు. బ్రహ్మాస్త్రం ప్రయోగించు. జయంమీదే దృష్టి వుంచు."— *

---

* ఎంతమంది కొడుకుల్నయినా, సైనికుల్నయినా, ప్రజల్నయినా బలి ఇస్తాడు గానీ, స్త్రీని మాత్రం వొదలడు.

ఇంద్రజిత్తు, తండ్రికి ప్రదక్షిణం చేసి, సింహాల రథంమీద గొప్ప సేనతో బయల్దేరాడు.

యుద్ధం చూడాలని దేవతలు ఆకాశంనిండా కూడారు.

ఇంద్రజిత్తు బాణాలు కొడుతున్నాడు.

హనుమంతుడు ఒక్కొక్కసారి గుర్తి తప్పించుకుని చెట్లూ, పర్వతాలూ విసురుతున్నాడు.

ఒకరిదెబ్బలు వొకరు భరించలేక పోతున్నారు.

ఇంద్రజిత్తు ఆలోచించి బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు.

హనుమంతుడు చేష్టలుడిగి కొయ్యబారి భూమి మీద పడిపోయాడు. (హమ్మయ్య) తన మీద బ్రహ్మాస్త్ర ప్రయోగం జరిగిందని గ్రహించాడు.

హనుమంతుడికి బ్రహ్మ, పూర్వం — "నీ మీద బ్రహ్మాస్త్రం క్షణంసేపు మాత్రమే పనిచేస్తుంది."— అని ఒక వరం ఇచ్చాడు.

సైనికు లందరూ హనుమంతుడి మీదపడి పట్టుకున్నారు. నార గుడ్డలతో, పగ్గాలతో బిగించి కట్టేశారు.

బ్రహ్మాస్త్ర బంధంలో వున్నవారిని, ఇతర బంధాలతో, తాళ్ళతో కడితే బ్రహ్మాస్త్రం శక్తి పోతుంది. (తాళ్ళముందు నిలబడే సత్తా లేక.)

హనుమంతుణ్ణి సైనికులంతా తాళ్ళతో కట్టడం చూసి ఇంద్రజిత్తు — "అయ్యో! బ్రహ్మాస్త్రం వొదిలేసిందే! కార్యం చెడిపోయిందే"— అని విచారించాడు. (మరి సైనికులికి మొదటే చెప్పి మిడకొద్దూ?)— బ్రహ్మాస్త్రం వేసిం తర్వాత ఇతర అస్త్రాలేవీ పనిచెయ్యవు. పోనీ, మళ్ళీ బ్రహ్మాస్త్రం వెయ్యటానికైనా అది వొక్కసారే పనిచేస్తుంది. మళ్ళీ పని చెయ్యదు. (అబ్బ! ఏం తిరకాసు అస్త్రం!)

కానీ, బ్రహ్మాస్త్రం శక్తి తనమీద లేకుండా పోయిందని హనుమంతుడికి తెలియలేదు — (ఏం కవిగారూ? — హనుమంతుణ్ణి ఇంత చిన్నబుచ్చారూ?)

— "ఇదీ మంచిదే. రావణుడితో మాట్లాడాలి కదా?" — అనుకున్నాడు హనుమంతుడు.

సైనికులంతా హనుమంతుణ్ణి రాజవీధుల్లోంచి వుత్సాహంతో ఈడ్చుకు పోతున్నారు. తన్నుతున్నారు. గుద్దుతున్నారు. తిడుతున్నారు.

"ఎవడు వీడు? చరిత్రుడు? ఎక్కణ్ణించి దాపరించాడు? ఏం పని వీడి కిక్కడ?" — అని ప్రజలు వొకర్ని వొకరు అడుగుతున్నారు.

"పొడవండి. చంపెయ్యండి. నిప్పంటించండి. (నరకండి కుక్కల కొడుకుని)" — అని కేకలేస్తున్నారు జనం వీధులనిండా.

"పదరా! నడువ్."

"నడుస్తాడా? గెంటండి. కోతి మొహం వీడూనూ." — *

ప్రజలందరూ హనుమంతుణ్ణి రావణుడి దగ్గరికి ఈడ్చుకు పోయారు.

రావణుడు హనుమంతుణ్ణి చాలా ఆశ్చర్యంగా చూశాడు — "గొప్ప వీరుడే! నందీశ్వరుడో, బాణాసురుడో అయి వుంటాడు" — అని విసుక్కోయాడు.

హనుమంతుడు రావణుణ్ణి దిగ్భ్రమతో చూస్తున్నాడు. రావణుడి శరీరం నిండా, మనసుచేత చేశారా అన్నంత చిత్ర విచిత్రంగా వున్న ఆభరణాలు చూస్తున్నాడు. రావణుడి వక్షస్థలంమీద మణి హారాలు, మేఘాలమధ్య ఎగిరే కొంగల్లా వున్నాయి .... వొంటినిండా చందనం పూతలు .... పరిమళాలు ... పది తలలు .... ముత్యాల కిరీటం .... (ఎన్నో తలకి?) .... స్ఫటికాలూ, రత్నాలూ తాపిన బంగారు సింహాసనం .... దానిమీద పట్టు దిళ్ళున్నాయి. అంచగత్తెలయిన యువతులు

---

* 48 వ సర్గ — 56, 57.

"పీడెవడు? ఎవని మనిషి? ఎచటినుండి వచ్చెను? వీనికి లంకలో నేమి పని? ఇతని కాశ్రయ మెద్ది?" — అని అచటనుండిన రాక్షస వీరులు పరస్పరము ప్రశ్న వేసికొనిరి.

అచట మిగుల కోపముగల కొందరు రాక్షసులు — "వీని జంపుడు. కాల్చివేయుడు. భక్షింపుడు" — అని పరస్పరము జెప్పుకొనిరి.

చుట్టూ వింజామరలు వీస్తున్నారు. (అందం లేనివాళ్ళూ, యువతులు కానివాళ్ళూ విసిరితే "గాలి" రాదు గావున్ను.) రావణుడు — చుట్టూ అనేకమంది మంత్రులతో, సేనాపతులతో కోలువుదీరి కూర్చున్నాడు.

రావణుణ్ణి చూసి హనుమంతుడు — "రావణుడు గొప్ప రాజ లక్షణాలు గల తేజశ్శాలి. ఏం ప్రయోజనం? పరమ దుర్మార్గుడు. కోపం వస్తే లోకాలన్ని భస్మంచేసి సముద్రంలో ముంచేస్తాడు. లేకపోతే ఇంద్రుడంత గొప్పవాడయ్యేవాడే!" — అనుకున్నాడు. *

రావణుడు మీసాలు తిప్పుతూ మంత్రుల్ని చూసి — "పీడి వ్యపహారం ఏమిటో తేల్చండి" — అని ఆజ్ఞాపించాడు.

ప్రహస్తుడనే మంత్రి హనుమంతుణ్ణి చూసి — "ఎవరు నువ్వు? .... ఎందుకొచ్చావు వికృడికి? .... నిజం చెప్పు" — అని అడిగాడు. •

---

* హనుమంతుడు రావణుణ్ణి అశోక వనంలోనే చూశాడు. అప్పుడు ఇంత ఆశ్చర్యపడి పోలేదు.

హనుమంతుడు రావణుణ్ణి ఒకసారి చూశాడన్న సంగతి మర్చిపోయాడు కవి. ఇదే మొదటిసారి అన్నట్టు వర్ణిస్తున్నాడు. లేకపోతే, సింహాసనంమీద కూర్చున్నప్పుడు చూసినందువల్ల ఇంత తేజస్సుతో కనిపిస్తున్నాడా హనుమంతుడి కళ్ళకి? అంతే అవ్వాలి. రావణుడి తేజస్సంతా ఆ సింహాసనంమీద కూర్చోవడంవల్ల (ఆ అధికారం వల్ల) వొచ్చిందే. దానిమీద ఎవ రెక్కితే వాళ్ళ అంత తేజస్సుతో వెలిగిపోతూ కనపడతారు. — రావణుణ్ణో కవి ఎక్కడి కక్కడ బాగానే పొగుడుతాడు. గొప్ప పరాక్రమవంతుడనే అంటాడు. ఎందుకంటే — ఇంత గొప్పవాడూ రాముడి చేతిలో ఓడిపోయి, చచ్చిపోయాడని చెప్పడానికే. వాలినీ ఇలాగే పొగిడాడు.

• 50 వ నవ్వ — 6, 7, 8.

"ఈ దుర్మార్గుడు ఎచటనుండి .... ఎందు నిమిత్తము వొచ్చెనో .... అడుగుము" — అన్నాడు రావణుడు. (తరువాత పేజీలో)

హనుమంతుడు సమస్తం ఏకరువు పెట్టాడు. — "నేను శ్రీరాముడి దూతని. సుగ్రీవుడి మంత్రిని. హనుమంతుడు నా పేరు. రావణుడితో మాట్లాడే అవకాశం కోసం ఆశోకవనం పాడు చేశాను. మీ సైనికులు యుద్ధానికి వొస్తే, నా ఆత్మ రక్షణకోసం యుద్ధం చేశాను. నేను ఏ అస్త్రాలకూ లొంగను. రావణుణ్ణి చూడాలనే బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డాను" — అని రావణుణ్ణి చూస్తూ — "రావణుడా! సుగ్రీవుడు నీకు సోదరుడి వంటివాడు. (అటు రాముడికీ సోదరుడే. ఇటు రావణుడికీ సోదరుడే) సుగ్రీవుడు నీ క్షేమం అడిగాడు. సుగ్రీవుడే నన్ను పంపించాడు. (మరి రామ దూత అంటాడేం? సుగ్రీవ దూత అనాలి గానీ) రావణా! నీకు హితం చెపుతాను విను.

— మహా పుణ్యాత్ముడైన దశరథ మహారాజు పెద్దకొడుకు, మహా పుణ్యాత్ముడయిన శ్రీరాముడు. శ్రీరాముడు తండ్రి ఆజ్ఞ చొప్పున అడవుల కొచ్చాడు. భార్య కనపడక అరణ్యాల్లో వెతుకుతూ మా దేశం వచ్చి, సుగ్రీవుడితో స్నేహం చేసుకున్నాడు. శ్రీరాముడు సామాన్యుడు కాడు. వాలిని చంపిన మహావీరుడు. ఆయనముందు ఎవ్వరూ నిలబడలేరు. నిన్ను చంపే వారెవరూ లేరని విర్రవీగవొద్దు. నిన్ను చంపడానికి సుగ్రీవుడు చాలు. అతని బారినుంచి నిన్నెవరూ రక్షించలేరు.

(ఫుట్ నోట్ : 448 పేజీ తరువాయి)

ప్రహస్తుడనే మంత్రి ఎలా అడిగినట్టు కవి రాస్తున్నాడో చూడండి — "ఓ వానరా! దూరదిల్లుము. నీకు మంగళ మగు గాక! భయపడవలదు. నిన్ను ఇంద్రుడు పంపియుండినటులైతే, ఆ విషయమును నిజముగ తెలుపుము. విడిచి పెట్టెదను."

— హనుమంతుణ్ణి అంత బుజ్జగించడం ఏమిటి? నిన్ను విడిచి పెడతాననో, విడిచి పెడతామనో రాజు ప్రమేయం లేకుండానే మంత్రి అనడం ఏమిటి?

నువ్వు చాలా పుణ్య కార్యాలు చేసి వుంటావొచ్చును. ఇంతకాలం సుఖంగా వున్నందుకే నీ పుణ్యం అంతా ఖర్చయిపోయింది. ఇక నువ్వు పాప ఫలం అనుభవించ పలసిందే.

జనస్థానంలో నీ బలగం అంతా సర్వనాశనం చేశాడు రాముడు. వాలిని చంపాడు. సుగ్రీవుడితో ఏక మయ్యాడు. ఇక నికు చావు తప్పదు. నేనే నిన్ను సంహరించగలను గానీ .... శ్రీరాముడే నిన్ను చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు.

సీతాదేవి సామాన్యురాలను కుంటున్నావేమో ! నీ పాలిట యమ పాశం ! కాలరాత్రి ! పర స్త్రీని బంధించడం నీ వంటి బుద్ధిమంతుడికి తగదు.

(సీతని తీసుకురాక ముందు రావణుడు బుద్ధిమంతుడే నన్న మాట.) సీతని శ్రీరాముడికి సమర్పించి శరణు కోరుకో. లేకపోతే, మృత్యువు నీ పక్కలోనే వుంటుంది. శ్రీరాముడి ముందు ఇంద్రుడే నిలబడలేదు. ఇక నువ్వెంత ?...."— అన్నాడు.

"ఓణ్ణి వెంటనే చంపెయ్యండి," — అని రావణుడు రౌద్రంగా అరిచాడు.

• • •

విభీషణుడు అనుకున్నట్టుగానే అయింది. వినయంగా లేచి — — "మహారాజా! శాంతించు. కరుణించి నా విన్నపం ఆలకించు. సన్మార్గులైన రాజులు ఒకరి మాటలు ఒకరికి అందజేసే దూతకు మరణ దండన విధించకూడదు. దూతను చంపడం రాజనీతికి విరుద్ధం సుమా!" — అన్నాడు.

రావణుడు రుద్రుడై — "వీడు దుర్మార్గుడు. వీణ్ణి చంపడంలో

తప్పు లేదు. —దూతలు ఇంత దుర్మార్గానికి తలపడ వొచ్చునా :"— అని గర్జించాడు. *

---

* 52 వ సర్గ — 12 వ శ్లోకం.

రావణుడికి హనుమంతుడి మీద కోపం రాలేదని రాయడానికి ఏల్లేదు కదా ? ... ఆ కోపం చూపించక తప్పదు. కాబట్టి — రావణుడు చంపుతా నన్నాడని రాయక తప్పదు. కానీ అలా అనడం ఎంత తప్పని కవి అంటున్నాడో చూడండి.

— "అధర్మమునకు మూలముగను, మిక్కిలి దోషముతో కూడినదిగను, నీచులు విని సంతోషించ దగినదిగను, నుండు రావణుని మాటను— బుద్ధిమంతులలో శ్రేష్ఠుడగు విభీషణుడు విని, మేలైన అర్థతత్వముతో మాటలాడెను." —

"దూత అయితే ఇలా చేయవొచ్చునా?"— అనడం — అధర్మం: దోషం : అనార్యం : మొత్తం లంకలో విభీషణు డొక్కడూ మాత్రం చాలా బుద్ధిమంతుడుగా కనబడుతున్నాడు కవికి. త్రిజట కలలోనూ.... లంకలో వీరులందరూ .. నరకానికి పోతే, విభీషణు డొక్కడూ ఏను గుల మీద ఎగురుతూ స్వర్గానికి పోయాడు. — అసలు రావణుడూ, కుంభకర్ణుడూ, శూర్పణఖా, పుట్టినప్పుడు మహా వికారంగా వున్నారు గానీ, విభీషణుడు అలా లేడు—

ఉత్తరకాండ — 9, 10 సర్గల్లో—

"కైకసి కడసారపు కొడుకు విభీషణుడు. వాడు ధర్మాత్ముడు. వాడు పుట్టినప్పుడు పుష్పవర్షం కురిసింది. ఆకాశాన దేవ దుందుభులు మోగాయి."

బ్రహ్మ— "నీకేం కావాలి ?" — అని అడిగినప్పుడు కూడా విభీషణుడు చెడ్డ కోరికలు కోరుకోలేదు. — "నా బుద్ధి ఎప్పుడూ ధర్మం విడిచిపెట్టకుండా వుండాలి." — అని కోరుకున్నాడు.

ఈయన ధర్మం ఏమిటో, — ఈయన్ని బుద్ధిమంతుడని కవి ఎందుచేత కీర్తిస్తున్నాడో, —ఇంకా చూడవలసి వుంది.

విభీషణుడు మరీ వినయంగా వొంగి— "మన్నించు మహారాజా! ఈ దూత మనకు అమితమైన హాని కలిగించిన మాట నిజమే. అయినా, దూతకు మరణ దండన విధించకూడదు. ఇతర శిక్ష ఏదైనా విధించ వొచ్చును. అంగాలు ఛేదించ వొచ్చును. తల బోడి చేయవొచ్చును. కొరడా దెబ్బలు కొట్టించ వొచ్చును. వాతలు పెట్టించ వొచ్చును .... వధ తప్ప ఏ విధంగానైనా దండించ వొచ్చును. సమస్త దేశాల్లోనూ, సమస్త జాతుల్లోనూ, దూతను చంపకూడదనే నీతి పాటిస్తారు. — నీ వంటి జ్ఞానికి నేను చెప్పదగ్గ వాడిని కాను. నీ వంటి వుత్తముడి కి కార్యం తగదు. మంచి చెడ్డలన్నీ నీకు తెలుసు. లోకంలో ధర్మమంతా ఎరిగిన వాడివి నువ్వు. కోపం కొద్దీ అంటున్నావు గానీ .... కోపానికి లొంగితే శాస్త్ర పాండిత్యమంతా వ్యర్థమై పోతుంది, (ఆ ముక్క కూడా శాస్త్రాల్లో లేదూ?) — ఇతని నేరాలు విచారించి దండించ వలసిందే. ప్రాణ హాని మాత్రం కలగనివ్వ కూడదు. —

ఈ మాతని వొదిలిపెట్టి ఇతని స్వామిని దండించాలి. ఇతన్ని విడిచిపెడితేనే — పోయి ఇక్కడి సంగతులన్నీ తన యజమానికి చెప్పుకుంటాడు. నీకూ, రాముడికీ యుద్ధం పొసుగుతుంది. నీ వీరత్వం జగద్విఖ్యాతం అవుతుంది. యుద్ధమంటే నీ కేమీ లక్ష్యం లేదు. నీ మేలు కోరి పోరే శూరులూ, విశ్వాసపాత్రులూ, నీ పోషణలో వున్న సేనికులూ కొల్లలుగా వున్నారు. నువ్వు కోరితే ఈ క్షణంలోనే యుద్ధానికి పోవొచ్చును. యుద్ధలాభం పోగొట్టుకోవడం తెలివైన పని కాదు. — నువ్వు మహా వీరుడివే కాదు. మహా జ్ఞానివి. మహా పండితుడివి. మహా ధర్మాత్ముడివి. శాస్త్రాలన్నీ ఎరిగిన వాడివి. ఉత్తమోత్తముడివి. నీకు సమానుడీ లోకంలో లేడు. — నా మాట మన్నించి దూతను విడిచి పెట్టు."—

రావణుడు ఆలోచనలో పడ్డాడు. (కాదులే. పొగడ్తల్లో పడ్డాడు.)

"సరే! ఏదో గట్టి శిక్ష వెయ్యండి. ఆ తోక కాల్చి పారెయ్యండి. వెళ్ళి, తన వాళ్ళకి మొహం ఎలా చూపిస్తాడో! తోకకు నిప్పు పెట్టి వీధులన్నీ తిప్పండి." —అని ఆజ్ఞాపించాడు మహారాజు.

సైనికులు హనుమంతుడితో క నిండా గుడ్డలు చుట్టి నూనె పోసి నిప్పంటించారు. అరుపులతో, దప్పులతో, కేకలతో, నవ్వులతో వూరేగింపు బయల్దేరింది.

తనని తన్నితూ, గుద్దుతూ వీధుల్లోతిప్పుతోంటే హనుమంతుడు —"రాత్రి వీధులన్నీ సరిగ్గా చూడలేదు. పగ్గలు బాగా చూడవొచ్చును," — అని సంతోషించాడు.

పెద్ద గోలతో వూరేగింపు సాగుతోంది. స్త్రీలూ, వృద్ధులూ, పిల్లలూ, అందరూ ఇళ్ళల్లోంచి బయటికి వొచ్చి హనుమంతుణ్ణి తిట్టి సంతోషిస్తున్నారు.

"ఏం దూతవిరా నువ్వు, దరిద్రుడా! (నీ మొహం మండా!)" — అని ప్రజలంతా వుత్సాహంతో తిట్టారు.

(లంకలో ప్రజలంతా రాజకీయ చైతన్యం గలవాళ్ళుగా తోస్తున్నారు.)

— హనుమంతుడు కొత్త కొత్త విమానాలూ, రహస్య భూగృహాలూ కూడా చూశాడు.

అశోకవనంలో దాసీలు సీత దగ్గిరికి పోయి సంతోషంగా — — నీకోసం వొచ్చిన ఆ కోతి మొహం వాడి పని అయిందిలే. తోకకి నిప్పు పెట్టి వూరేగిస్తున్నార్లే!" — అని చెప్పారు.

సీత చాలా దుఃఖించి అగ్నిదేవుణ్ణి — "అగ్నిదేవుడా! పతివ్రతలకు కలిగే ఫలం నాకు కలుగునట్లు అయితే — హనుమంతుణ్ణి

• 53 వ సర్గ — 23, 24.

రాక్షసులు ముంగిళ్ళలోనూ, మంటపములలోనూ, రాజమార్గముల లోనూ, గూఢ ఈ కపియే దూతయని కేకలు వేసిరి.

మండుచుండు తోక గల హనుమంతుని జూడగోరి స్త్రీలు, బాలురు, వృద్ధులు సంతోషముతో ఇండ్లనుండి గుంపులు గుంపులుగా వీధులలోకి వచ్చిరి. —కృూరచిత్తులగు రాక్షసుడా, పాపిష్ఠులగు రాక్షసులు హనుమంతుని గొట్టి.... తిట్టిరి.

కాల్చకు. చల్లబడు. నాకు, నా భర్తని కలిసి జీవించే అదృష్టం వుండి నట్లు అయితే... హనుమంతుణ్ణి కాల్చకు. చల్లబడు. సుగ్రీవుడు నన్ని దుస్తరసముద్రం నుంచి దాటించగలవాడు అయితే .... హనుమంతుడికి చల్లబడు. నేను సచ్చరిత్ర గలదానినైతే హనుమంతుడికి చల్లబడు." — అని ప్రార్థించింది.

హనుమంతుడికి తోక మండుతోన్న బాధ లేకుండా చల్లగా అయింది. హనుమంతుడు శ్రీరాముణ్ణి తలుచుకుని— "ఇది శ్రీరాముడి దయే. సముద్రం దాటుతూ వున్నప్పుడు కూడా ఇలాగే మైనాకుణ్ణి పంపించాడు. అంతా రాముడి దయే. అగ్ని కూడా శ్రీరామ కార్యానికి సహాయం చేయాలనే చలబడింది," — అనుకున్నాడు. శరీరం పెంచి, కట్టు తెంపుకుని, మండే తోకతో .... చుట్టూ జనాన్ని బాది రయ్యిన పైకెగిరాడు.

వెంటనే మళ్ళీ ఒక గుమ్మానికున్న ఇనప గడియ వూడదీసి, కావలి వాళ్ళందర్నీ కొట్టాడు. ఇంకా కోపం తీరక, — "లంకంతా కాల్చేస్తాను.... శత్రువుకు ఇంకా హాని కలిగిస్తాను."— అనుకున్నాడు.

మండే తోకతో, నిర్భయంగా, ఆకాశంలో మెరుపు మల్లే ఇళ్ళ మీద ఎగురుతున్నాడు.

ప్రహస్తుడి ఇల్లూ, మహాపార్శ్వుడి ఇల్లూ, ఇంద్రజిత్తు ఇల్లూ, జంబుమాలీ, సుమాలీ, కుంభకర్ణుడూ, ... మొత్తం అందరి ఇళ్ళూ అంటించాడు.... విభీషణుడి ఇల్లు తప్ప. — అగ్నికి గాలి సహకరించింది.... కొన్ని ఇళ్ళు వాటికవే అంటుకున్నాయి. (విభీషణుడి ఇంటికి మాత్రం ఈ సూత్రం వర్తించలేదు)

హనుమంతుడు వుత్సాహంతో ఎగురుతూ పోయి రావణుడి మేడ లన్నీ అంటించేశాడు.

సుందరమైన గృహాలన్నీ మసిబారి పెద్ద పెద్ద మేలుళ్ళతో భగ భగ మండుతున్నాయి. కాలి, పెళ్ళలు పెళ్ళలు విరిగి కూలుతున్నాయి.

లంకంతా ప్రజల రోదనతో, కేకలతో, ఆర్తనాదాలతో నిండి

పోయింది. —"నాథుడా! తమ్ముడా! పుత్రుడా! .... స్నేహితుడా! .... బిడ్డడా! .... అయ్యో నాయనా!...." — అనే పిలుపులు మిన్ను ముట్టాయి. ప్రజలు ప్రాణభయంతో మండుతోన్న గృహాల మధ్యనుంచి పరుగులెత్తుతున్నారు. స్త్రీలు ఏడుపులతో, పిల్లలు ఏడుపులతో కాలుతోన్న గుమ్మాలలోంచి బయటపడే దారి లేక — "రక్షించండి, రక్షించండి." — అని ఆర్తనాదాలు చేస్తున్నారు.

పసిబిడ్డల్ని గుండెల కదుముకున్న తల్లులు.... మేడలు దిగే దారి లేక అటూ ఇటూ పరుగులెత్తి, తొట్రుపడి, కిందపడి పోతున్నారు.

బళ్ళూ, రథాలూ, ఇళ్ళ కప్పులూ, ఫెళఫెళ పేలుతున్నాయి.

ఎన్ని శవాలు చచ్చి కిందపడినా భూమి తృప్తి పడలేదు. ఎన్ని కట్టెలు కాల్చినా అగ్ని తృప్తి పడలేదు. లంకంతా బూడిదైపోయినా హనుమంతుడు తృప్తి పడలేదు.

(కాలుతోన్న లంక కవికి ఎంత సుందరంగా కనపడుతోందో చూడండి.) –అగ్నిజ్వాలలు రకరకాల పూల మల్లే ప్రకాశిస్తున్నాయి.– కొన్నిచోట్ల ఎర్రగా కుంకుమ పూలమల్లే....కొన్నిచోట్ల తెలగా బూరుగు పూలమల్లే .... కొన్నిచోట్ల .... మోదుగు పూలమల్లే. మంటలోంచి పొగతోలేచి మేఘాలు నల్ల కలువల మల్లే తోస్తున్నాయి. వృత్తము లైన రాక్షసులు కొందరు — గుంపుగా జేరి — "ఆహా! ఈ హనుమంతుడు సామాన్య వానరుడు కాడు. రాక్షసుల్ని నాశనం చెయ్యడానికి అద్వితీయమైన విష్ణు తేజస్సే, ఈ రూపంలో వొచ్చి వుంటుంది. (వీరూ రాక్షసులే. వీళ్ళ ఇళ్ళూ అవతల కాలుతూ వున్నాయి — అని గమనిం చండి.) —రాక్షసుల మీద బ్రహ్మకు వున్న కోపమంతా ఈ వానర రూపు దాల్చిందేమో! లేక, దేవతల ప్రభువైన ఇంద్రుడేమో! చంద్రుడేమో! .... ఇతని తేజస్సు ఎంత గొప్పది! యముడో సూర్యుడో అయివుంటాడు." — అని చెప్పుకున్నారు.

(కవి పిలక్కీ, పంచెకీ నిప్పంటించి విడిచిపెడితే గంతులేసే ప్పుడు నోట్లోంచి ఏం మాటలు వొస్తాయో తెలుసుకునేవాడు — "ఆహా!

ఎంత గొప్పగా జ్వాలలు తీరి వెలుగుతోంది నా పిలక ! ఆహా! ఎంత కాంతిగా నాలికలు చాచి మండుతోంది నా పంచె! .... నాకీలా నిప్పంటించిన వారు దేవతలై వుంటారు. కిన్నరులో, కింపురుషులో అయి వుంటారు. — సూర్యులో, చంద్రులో అయివుంటారు" అని కీర్తిస్తాడో !.... లేక, ప్రాణభయంతో గంతులేస్తూ బూతుల పంచాంగం విప్పుతాడో !)

హనుమంతుడు శ్రీరామచంద్రుణ్ణి ధ్యానం చేస్తూ తను చేసిన ఘనకార్యాలన్నీ తలుచుకుని సంతోషించాడు.

ఆకాశంలో దేవత లంతా హనుమంతుణ్ణి కీర్తించారు. లంకకు చాలా హాని కలిగినందుకు ఎంతో సంతోషించారు. *

---

* 54 వ సర్గ — 18 నుంచి 44 వరకూ.

లంకా దహన వర్ణనలు చూడండి.

"కోటి సూర్యులతో సమానుడగు అగ్ని, పిడుగులు పడినటుల, నానా విధములగు భయంకరమైన శబ్దములచే, బ్రహ్మాండమును జీల్చి దానివలె, లంక నంతయును చుట్టుకొని వెలింగెను."

"ఓ తండ్రీ ! ఓ బిడ్డా ! ఓ కాంతుడా !.... ఓ జీవితమా ! .... అన్నియు నాశనమైనవి గదా !" — అని చెప్పుకొనుచు రాక్షసులు కొందరు బహు విధముల ధ్వనులు చేసిరి.

"కొందరు స్త్రీలు తలలు విరియ బోసుకొని, చంటిబిడ్డల నెత్తుకొని, కాలుచుండు మిద్దెల మీదనుండి, త్వరగ కిందబడుచు ఆకాశములో మెరుపుల వలె ప్రకాశించిరి."

"అగ్ని కలెల చేతనూ, కసపు చేతనూ తృప్తి గాంచలేదు. రాక్షసుల శవములతో భూమి తృప్తి పొందలేదు. వానర శ్రేష్ఠుడగు హనుమంతుడు నిప్పు పెట్టి తృప్తి పొందలేదు."

"అగ్ని జ్వాలలు కొన్ని ప్రదేశములలో మోదుగుపూల వలెను, కొన్నిచోట్ల బూరుగుపూల వలెను, కొన్ని చోట్ల కుంకుమపూల వలెను ప్రకాశించినవి."

(తరువాయి పేజీలో)

హనుమంతుడు తోక సముద్రంలో ముంచి, చల్లార్చుకున్నాడు. సీత సంగతి గుర్తొచ్చింది. — "అయ్యో! సీతాదేవి కూడా కాలిపోయే వుంటుంది. ఎంత తప్పుపని చేశాను. స్వామికార్యం పాడు చేశానే! ... నేను చేసిన మంచి పనులన్నీ వ్యర్థమై పోయాయే! అందుకే కోపం నాశన హేతువన్నారు. కోపిష్ఠులు గురువుల్ని కూడా చంపుతారు. నేను శ్రీరాముడి భార్యను చంపానే. అయ్యో! సీత క్షేమం ఆలోచించలేక పోయానే! .... సీత మరణించి వుంటే నేనిక కిష్కింధకుపోయి ఏం లాభం? .... సీత మరణవార్త విని రామ లక్ష్మణులు మరణిస్తారు.

ప్రియ మిత్రుడి మరణంచూసి సుగ్రీవుడు మరణిస్తాడు. అయోధ్యలో భరతుడూ, శత్రుఘ్నుడూ మరణిస్తారు. (చావుల్లో మాత్రం శత్రు

(ఫుట్‌నోట్ : 456 వ పేజీ తరువాయి)

"కొన్నిచోట్ల అగ్ని చల్లారిపోవు సమయములో పొగ వ్యాప్తమై చేరిన మేఘములు నల్ల కలువల వలె ప్రకాశించినవి."

"లంకలో నుండి వుత్తములగు రాక్షసు లందరును గూడి ఈ ప్రకారము జెప్పుకొనిరి."

"సమస్తమైన దేవతలూ, ఋషి శ్రేష్ఠులూ, గంధర్వులూ, విద్యాధరులూ చెప్పుటకు సాధ్యముగాని సంతోషమును బొందిరి."

ఈ విధంగా ... పసిబిడ్డల ఆక్రందనలతో, ప్రజల రోదనతో — ప్రాణభయంతో చేసే హాహాకారాలతో — నిండిన లంకా దహన సౌందర్యమే సుందరకాండ! ఈ సుందరకాండ పారాయణం చేస్తే వర్షాలు కురుస్తాయి. కరువులు పోతాయి. శుభం కలుగుతుంది.

ఏ పరదేశపు రాజో మనదేశం మీద దండెత్తితే, పుర సిరి సంపదలు దోచుకుంటే, పుర దేవాలయాలు ధ్వంసం చేస్తే, మనకు ప్రాణనష్టం, మానభంగం కలిగిస్తే ... పుర చరిత్ర ఆ రాజు దుర్మార్గాలతో నిండిపోతుంది. గూండా రామదూత లంకలో చేసింది అదే!

పుణ్యాన్ని కూడా కలుపుతారు.) రఘు వంశం నశించిపోతే ప్రజలంతా పోయినట్లే ఏడుస్తారు. — ఛీ! ఇవంతా నా కోతి బుద్ధివల్ల జరిగింది. * నేను కిష్కింధకు పోనేపోను. ఇక్కడే ప్రాణ త్యాగం చేస్తాను .... నేనీ విధంగా శంకిస్తున్నాను గానీ ... శ్రీరాముని భార్యని అగ్ని ముడుతుందా? నన్నే దహించలేదే:" — అని అలోచనల్లో మునిగి చింతిస్తున్నాడు హనుమంతుడు.

ఆకాశంలో దేవతలు చెప్పుకునే మాటలు వినపడ్డాయి.—"ఆహా! లంక అంతా కాలిందిగానీ .... సీతాదేవి వున్న ప్రదేశం సురక్షితంగానే వుందే! లంక ప్రజలంతా రోదిస్తున్నారుగానీ, సీతాదేవి క్షేమంగానే వుందే! హనుమంతుడు గొప్ప కీర్తిగల కార్యం చేశాడు" — అని చెప్పుకుంటున్నారు.

హనుమంతుడు సీత క్షేమం తెలిసి, సంతోషించాడు. — "నేనే వెళ్ళి స్వయంగా చూస్తాను" అనుకుని, అశోకవనంలోకి వెళ్ళి, సీత ముందు వాలాడు. "తల్లీ! నువ్వు దైవయోగం చేత జీవించి వున్నావు. నిన్ను మళ్ళీ నేను చూడగలిగాను."

సీత హనుమంతుడు చేసిన పనికి మిక్కిలి సంతోషించి, కీర్తించి — "నువ్వు శత్రు సంహారకుడవు. నీ బలమే నీకు కీర్తి కల్గిస్తుంది. నువ్వే వీరి నందరినీ చంపగల సమర్థుడవు. వానర సేన నంతా ఇక్కడకు తీసుకురాగల ఖ్యాతి కూడా నీకే కలుగుతుంది. శ్రీరాముడొచ్చి లంక ఇంకా ధ్వంసం చేసి, సర్వ నాశనం చేసి, నన్ను తీసుకు

---

* కోపం నాశన హేతువు" అనేది ఒక నీతి.

ఇది రావణుడి దండన నుంచి హనుమంతుణ్ణి రక్షించడానికి ఉపయోగపడింది.

హనుమంతుడు ఈ నీతిని ఎరిగికూడా దాన్ని పాటించలేదు. ఇక్కడ రాముణ్ణీ, రావణుణ్ణీ రెండు పక్షాలుగా చూస్తే, ఈ నీతి రాముడికే ఉపయోగపడింది. అలాగే ప్రతి నీతీ, పైచెయ్యిగా వున్న పక్షానికే వుపయోగపడుతుంది. ఇద్దరికీ వుపయోగపడదు.

వెళ్ళినప్పుడే ఆయనకు కీర్తి. శ్రీరాముణ్ణి ప్రోత్సహించవలసిన వాడవు నువ్వే." —

హనుమంతుడు సీతకు నమస్కరిస్తూ — "శ్రీరాముడు తొందర లోనే, అపారమైన వానర సేనలతో, ఎలుగుల సేనలతో వొచ్చి, లంక ధ్వసం చేస్తాడు తల్లీ : నిశ్చింతగా వుండు" — అని చెప్పి, అక్కడి నించి ఎగిరి వెళ్ళి సముద్రప్రొడ్డున అరిష్ట పర్వతంమీద వాలాడు.

సముద్రం దాటడానికి శరీరం పెంచుతూ, పెంచుతూ పెదపెద్ద పర్వత శిఖరాలన్నీ గులకరాళ్ళ గుట్టలుగా చేశాడు. హనుమంతుడి పాదాలకింద పర్వత గుహలు పిచ్చికగూళ్ళమల్లే చితికిపోయి, ఆ గుహల్లో సింహాలు భయంకరంగా గర్జనలు చేశాయి. పర్వతం నిండా నివాసం వున్న విద్యాధర స్త్రీలు పైటలు జారుతూ, (స్త్రీల పైటలు జార్చే విషయంలో పవిత్ర కవిగా రెన్నెడూ అపఖ్యాతిగా వుండరు.) — కంఠాలలో నగలు చిక్కులు పడుతూ ఆకాశాని కెగిరారు. మహా సర్పాలు హనుమంతుడి పాదాలకింద తొట్రుపడ్డాయి. అరిష్ట పర్వతం హనుమంతుడి పాదాలకింద నలిగి నలిగి తూమట్టానికి దిగిపోయింది.

హనుమంతుడు ఆకాశంలో కెగిరాడు.

హనుమంతుడు చంద్రుడిమల్లే, గరుడుడిమల్లే మేఘాల్లో మునిగి తేలుతూ పోతున్నాడు. సూర్య చంద్రుల్నీ, నక్షత్రాల్నీ తనతో ఈడ్చుకు పోతోన్నట్టు పోతున్నాడు. పర్వత గుహలలో గాలి శబ్దాలు చేస్తోన్నట్టు .... విజయోత్సాహంతో గరిస్తూ పోతున్నాడు. — హనుమంతుడి గర్జనలు, ఆకాశం ఫెళ ఫెళ విరుగుతోన్నట్టు మహేంద్ర పర్వతంమీద ప్రతిధ్వనిస్తున్నాయి.

మహేంద్ర పర్వతంనిండా వున్న వానరులు హనుమంతుడు వొస్తున్నాడనే వుత్సాహంతో గంతులేశారు. — జాంబవంతుడు — "కార్యం ముగించుకుని వొస్తున్నాడు. లేకపోతే అలా సింహనాదాలు చెయ్యడు" — అని సేనకు లందర్నీ సంతోష పెట్టాడు. సేనలంతా పెద్ద పెద్ద చెట్లమీద చిటారు కొమ్మల కెక్కి పూల కొమ్మలు ఆడించారు.

హనుమంతుడు రెక్కలు తెగిన పర్వతంవల్లే జారాడు మహేంద్ర పర్వతం మీద.

అందరూ సంతోషంతో చుట్టూ చేరారు.

కొందరు పళ్ళూ, దుంపలూ తెచ్చిపెట్టారు.

"సీతను చూశాను" — అన్నాడు హనుమంతుడు.

"చెప్పు. చెప్పు వివరంగా చెప్పు" — అన్నారు అందరూ, సంతోషంగా. — (సీత కనపడితే మరణశిక్ష లుండవని, సుఖంగా ఇంటికి పోవొచ్చని.)

హనుమంతుడు గంభీరంగా — "నేనీ పర్వతంమీదనుంచి బయలేరాను కదా!.... సముద్రంమీద ఓడమల్లే పోతూ వున్నాను... అప్పుడు మైనాకుడనే పర్వతరాజు ...." — అంటూ ప్రారంభించి, తను మైనాకుడి ఆతిధ్యం తిరస్కరించడం, సురస నోట్లో దూరి బయటపడడం ... సింహికని చంపడం .... అవతలి గట్టు చేరి .... రాత్రి లంక దేవతతో పోట్లాడడం .... లంకంతా గాలించడం ... చివరికి అశోకవనంలో సీతని చూడ్డడం .... అక్కడికి రావణుడు భార్యలతో రావడం ... సీతని బెదిరించడం .... సీత రావణుణ్ణి తిరస్కరించడం ... త్రిజట కలా .... తను సీతతో మాట్లాడడం .... సీత తనతో రాననడం .... చూడామణి ఇవ్వడం .... తర్వాత తను అశోకవనం పాడుచెయ్యడం .... లంకలో యుద్ధం .... చివరికి లంక కాల్చడం .... అన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు. (కొన్ని కల్పించికూడా. రావణుడు సీతని కొట్టబోయాడనీ, మండోదరి రావణుణ్ణి నముదాయించిందనీ, సీత రెండు నెలలు మాత్రమే జీవిస్తానన్నదనీ .... ఇంకా అనేకానేకం....) హనుమంతుడు లంకలో విషయాలన్నీ చెప్పి — "చక్కని పిరుదులుగల సీత పతివ్రతగానే వుంది. తీరా ఈ ప్రయత్నాలన్నీ చేసినందుకు వ్యర్థం కాలేదు. రావణుడు కూడా తపస్సంపన్నుడు. అందుకే సీతని ముట్టుకున్నా, నాశనం కాలేదు. సీతకున్న శక్తి అగ్నికి కూడా లేదు. సీతకు పూర్తిగా కోపం వొస్తే ఆమె చెయ్యలేని కార్యం లేదు.

మనం కిష్కింధకు పోవొద్దు. మళ్ళీ లంకకు పోదాం. రావణుణ్ణి చంపేసి, సీతను తీసుకుని, అప్పుడే కిష్కింధకు పోదాం. (ఆ సీత రాను మొర్రో అన్నా నరే) జాంబవంతుడూ, అంగదుడూ, పనసుడూ, నీలుడూ అందరూ వెళితే లంక విధ్వంసం చెయ్యడానికి వొక్క క్షణం పట్టదు. (లంకకు వెళ్ళగల వీరులు మరి కొందరు తయ్యారయ్యారు.) బలిసిన స్తనాలుగల సీత, నిద్రాహారాలు విడిచి కృశించివుంది. సుందరమైన పిరుదులు గల సీత ... పతి వియోగంతో జాలి కలిగించేటు ప్పనంగా వుంది. సీత పాతివ్రత్య మహిమతో రావణుణ్ణి చంపలేదంటే కారణం రావణుడి మహత్యమే. (కవిగారికి కొత్త పాయింటు జ్ఞాపకం వొచ్చిందన్నమాట.)

సీతని రక్షించి తీసుకుపోదాం. మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి" — అన్నాడు హనుమంతుడు.

అంగదుడు — "అవును. నువ్వు చెప్పింది బాగుంది. సీతని చూశాం గానీ, తీసుకురాలేదని శ్రీరాముడి కెలా చెప్పగలం? .... పరాక్రమంలో మనల్ని దేవతలుకూడా జయించలేరుగదా? లంకకు పోదాం" — అన్నాడు.

కానీ జాంబవంతుడు "శ్రీరాముని అభిమతం తెలియకుండా మనం ఏమీ చెయ్యకూడదు" — అన్నాడు.

* * *

అందరూ సంతోషంగా కిష్కింధవేపు బయల్దేరారు.

కిష్కింధ దరిదాపుల్లో కొచ్చారు. అక్కడ మధువనం అనే ఒక వనం వుంది. అది సుగ్రీవుడికి చాలా ఇష్టమైన వనం. దాన్ని సుగ్రీవుడి మేనమామ దధిముఖుడు కొంత పరివారంతో రక్షిస్తున్నాడు.

వానరులందరూ అందులో ప్రవేశించారు. మధుపానం చెయ్యడానికి అనుమతి ఇవ్వమని అంగదుణ్ణి అడిగారు.

అంగదుడు వొప్పుకున్నాడు.

సైనికు లందరూ నవ్వుల్తో, కేకలతో వనంలో జొరబడ్డారు. చెట్లూ, లతలూ నాశనం చెయ్యడం మొదలు పెట్టారు వనం నిండా కుండలతో నింపి వుంచిన మధురసం అంతా తాగి, పుత్తెక్కి వన పాలకుల్ని పట్టుకు కొట్టారు.

హనుమంతుడు అందరికీ అభయమిస్తూ — "మీ ఇష్టం వొచ్చినట్టు తాగండి. ఇష్టం వొచ్చినట్టు ప్రవర్తించండి. ఎవరైనా అడ్డగిస్తే వాడి పని నేను పడతాను" — అని రంకె లేశాడు. (ఇంకా లంకలో ఉన్నా ననుకుంటున్నాడు.)

"హనుమంతుడు గొప్ప కార్యం చేసుకు వొచ్చాడు. అతను చెప్పినట్టే వినండి" — అన్నాడు అంగదుడు.

వానరుల ఆగడం ఇంకా ఎక్కువైంది.

వన పాలకులు వెళ్ళి దధిముఖునికి చెప్పుకు ఏడ్చారు. దధిముఖుడు కోపం పట్టలేక, ఒక చెట్టు పట్టుకుని సైనికుల్ని కొట్టడానికి బయల్దేరాడు.

అంగదుడు దధిముఖుణ్ణి నేలమీద పడగొట్టి, మోకాళ్ళతో కుమ్మి, స్పృహ తప్పేట్టు కొట్టాడు.

దధిముఖుడు కొంతసేపు మూర్ఛపోయి, లేచి — "మహారాజుకి చెపుతాను. తప్పకుండా అంగదుణ్ణి బెత్తాలతో కొట్టిస్తాడు" — అని రయ్యిన ఎగిరి సుగ్రీవుడి దగ్గరికి వెళ్ళాడు. సుగ్రీవుడు రామ లక్ష్మణుల దగ్గిర వున్నాడు. (దధిముఖుడు ముందు రాజ భవనానికి వెళితే, అక్కడ సుగ్రీవుడు లేకపోతే, మళ్ళీ రయ్యిన రుష్య మూకానికి వొచ్చి ఉంటాడు. ఎగురుడేగా ?)

దధిముఖుడు సుగ్రీవుడితో — "అంగదుడు సైన్యంతో వొచ్చి మధువనం సర్వ నాశనం చేశాడు. నేను వారించబోతే, నా వొళ్ళంతా రక్తాలు కారేట్టు కొట్టాడు, వనపాలకుల్ని కూడా కొట్టారు" — అని చెప్పాడు.

లక్ష్మణుడు, సుగ్రీవుణ్ణి — "ఈ వన పాలకుడేం చెపుతున్నాడు? .... ఎందుకు దుఖిస్తున్నాడు?" — అని అడిగాడు. (భాష తెలీదు గావున్ను.)

సుగ్రీవుడు విషయం చెప్పి — "దక్షిణ దిక్కుకి పోయినవాళ్ళం దరూ అంత వుత్సాహంగా వున్నారంటే, కార్యం సాధించుకు వొచ్చా రన్నమాట. సీత కనపడే వుంటుంది. ఆ పని హనుమంతుడే సాధించి ఉంటాడు. ఇంకెవ్వరూ చెయ్యలేరు. హనుమంతుడు పరాక్రమవంతుడు. బుద్ధిమంతుడు. అలోచనా పరుడు" — అని మెచ్చుకుని — దధి ముఖుడితో — "వారు సీతాదేవిని చూసి వొచ్చి, ఆ నంతోషంతో మధు పానం చేసి వుంటారు. సీతాదేవిని చూడకపోతే అంగదుడు తిరిగి రానే రాడు .... వారు చేసిన దానికి నేను చాలా సంతోషించాను. వారి తప్పేం లేదు. నేను తొందరగా వారిని చూడాలి" — అని తొందర పడ్డాడు.

దధిముఖుడు కూడా సంతోషించి రయ్యన ఎగిరి, మధువనంలో అంగదుడిముందు వాలాడు. — "యువరాజా! .... నన్ను క్షమించు. మీరు నెరవేర్చుకు వొచ్చిన కార్యం సంగతి తెలియక మిమ్మల్ని అడ్డ గించాము. మహారాజు మీ రాక కోసం ఆత్రత పడుతున్నాడు" — అనీ చెప్పాడు.

అంగదుడు వానరులతో — "మనం సుఖంగా మధుపానం చేశాం. విశ్రాంతి తీసుకున్నాం. మహారాజు దగ్గరికి పోదామా? మీ అభి ప్రాయం చెప్పండి" — అన్నాడు.

"నువ్వే చెప్పు. నువ్వు బుద్ధిమంతుడివి. సిరి సంపదల గర్వం లేని వాడివి. నువ్వు చెప్పినట్టే చేస్తాం" — అన్నారు అందరూ.

"అయితే పోదాం రండి" — అని పైకి ఎగిరాడు.

అందరూ ఎగిరారు.

ఋష్యమూకం మీద వాలారు.

హనుమంతుడు శ్రీరాముని ముందుకుపోయి, నమస్కరించి — "సీతాదేవి పాతివ్రత్యంతో క్షేమంగా వుంది" — అని సంతోషవార్త అందజేశాడు. *

శ్రీరాముడూ, లక్ష్మణుడూ, సుగ్రీవుడూ చాలా సంతోషించారు.

★

---

* 64 వ సర్గ — 38 శ్లోకం.

"వానరులు మిగుల సంతోషము గలవారై శ్రీరాముని సమీపమున దిగిరి. పిమ్మట — గొప్ప భుజములుగల హనుమంతుడు, శిరమువంచి నమస్కరించి — సీతాదేవి పాతివ్రత్య వ్రతము గలిగి క్షేమముగ నుండు నటుల శ్రీరామునికి తెలిపెను."

"సీత క్షేమంగా వుంది" — అంటే చాలదు.

"సీత పతివ్రతగా వుండి, క్షేమంగా వుంది" — అని చెప్పాలి.

అదే అసలు క్షేమ సమాచారం.

కాణీ ఖర్చులేని బహుమానం

రంగస్థలమూకం జనంతో కిటకిట లాడుతోంది.

కిష్కింధలో సగం జను అక్కడే వున్నారు. దగ్గిర దగ్గిర వూళ్ళకు పోయే జనం, అదేటో చూసిపోదామని అక్కడే జేరారు. సీతకోసం పోయినవాళ్ళందరూ ఆలశ్యంగా అయినా తిరిగి వొచ్చారని అందరికీ సంతోషంగా వుంది.

తురాయి చెట్టుకింద, రాముడు చూడామణి చేత్తో పట్టుకుని తల వొంచి దుఖిస్తున్నాడు.

మొదట చూడామణి అందుకోగానే చాలాసేపు మూర్ఛపోయి అప్పుడే లేచాడు.

లక్ష్మణుడు అన్నగారి పక్కనే వినయంగా నిలబడి కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నాడు.

హనుమంతుడూ, సుగ్రీవుడూ .. అంగదుడూ .... జాంబవంతుడూ .... పెద్ద పెద్ద లందరూ .... రాముడిముందు కూర్చున్నారు.

ధనవంతులూ, పండితులూ, పురోహితులూ, కవులూ .... మహా రాజు వెనకవేపు కూర్చున్నారు. సామాన్య జనం .... పిల్లా, మేకా, అంతా రాళ్ళమీదా, చెట్లమీదా .... ఎక్కడ చోటు దొరికితే అక్కడ కబుర్లు చెప్పుకుంటూ, గుంపులు గుంపులుగా చేరుస్తున్నారు. గొడ్లుకాసే పిల్లలు కొందరు కొండమీదకి వొచ్చారుగానీ, ఇంకా కొందరు ఆటల్లో, పాటల్లో, ఈతల్లో మునిగివున్నారు. మధ్య మధ్య ఆటలూ, పాటలూ

ఆపి, ముంచు నవ్వోపని ముగించి, మళ్ళీ ఆటల్లోకి దిగుతున్నారు. ఒక్కో-సారి నేర్పుగా పాడే పనీ, నవ్వే పనీ కలిసి చేస్తున్నారు.

దూరంనించి నవ్వులు వినపడి రాముడి దుఃఖం మరీ ఎక్కువవుతోంది. అయ్యో! ఇంత విషాదంలోకూడా లోకంలో నవ్వులు వినపడుతున్నాయే! క్షుద్ర మానవులు నవ్వు లెంత దోషమో గ్రహించలేకుండా వున్నారే! —

రాముడు పీపూ, భుజాలూ కదిలేట్టు కుములుతున్నాడు. కుమిలి కుమిలి — "....స్సీతా!" — అని బావురుమన్నాడు.

కొందరు రాముణ్ణి చూడలేక మొహాలు వొంచుకున్నారు.

కొందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

దూరం వాళ్ళందరూ ఒక్క-సారి మాటలు ఆపి వూరుకున్నారు. ఇదే సమయం అని నిశ్శబ్దం రాజ్యం చెయ్యాలని చూసిందిగానీ, మళ్ళీ జనం గుసగుసలూ, మాటలూ ఎంతోసేపు దాని పరిపాలన సాగనివ్వ లేదు.

సుగ్రీవుడు పెద్దరికంచేసి హనుమంతుణ్ణి చూస్తూ అసలువిషయం ఎత్తాడు — "చూడు. శ్రీరాము డెలా విలవిల లాడుతున్నాడో! సీతా దేవి గురించి శుభవార్తలన్నీ నీ నోటితో నువ్వే స్వయంగా చెప్పు. కళ్ళకు కట్టినట్టు చెప్పు .... అప్పుడన్నా కొంచెం శాంత పడతాడు" — అన్నాడు వుత్సాహంగా.

హనుమంతుడు సిగ్గుపడుతూ కాస్సేపు నేలచూపులు చూసి, కంఠం నరాయించుకుని, విచారంగా నిట్టూర్చి, రాముడికి వినయంగా నమస్కారం చేస్తూ — "ఆ దుర్మార్గుణ్ణి చంపకుండానే వొచ్చానే అని చాలా సిగ్గుగా వుంది రామయ్యా! సీతా మహాతల్లిని రక్షించి తీసుకు రాలేకపోయాను. ఛీ! నా బతుకెందుకు కాల్చనా?" — అని తల వాల్చేశాడు.

జాంబవంతుడు కలగజేసుకుని — "హనుమంతా! ఊరుకో. శ్రీరామ పాదాల ఆజ్ఞ లేకుండా నువ్వు మాత్రం ఏం చెయ్యగలవు?" — అని హనుమంతుణ్ణి ఓదార్చాడు.

లక్ష్మణుడు కళ్ళనీళ్ళు నిగ్రహించుకుంటూ — "హనుమా ! మా వదినగారు క్షేమంగా వున్నారు గదా ? ముందా చల్లనివార్త చెప్పు" — అని ఆతృత పడ్డాడు.

హనుమంతుడు మళ్ళీ తల నేలకు వాల్చి విచారపడుతూ — "ఏం క్షేమంలే స్వామీ ! భర్తకు దూరమైంది మొదలూ ఆ మహాతల్లి తిండి తిన్నదా ? కన్ను మూసిందా ? పూచిక పుల్లలాగ చిక్కిపోయి, చిక్కిపోయి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని ఎలాగో బతికివుందిలే.... పాపిష్టి వాణ్ణి ... దుర్మార్గుణ్ణి .... ఆ మహా సాధ్విని రక్షించకుండా, నా దారిన నేను వొచ్చేశాను" — అని వొకసారి తలెత్తి, మళ్ళీ వాల్చేశాడు.

సీత తనకోసం నిద్రాహారాలులేక కృంగి, కృశించి పోతోందంటే రాముడికి పట్టలేనంత సంతోషంగా వుంది. — "అయ్యో ! సీతా !" — అంటూ మొహం పక్కకి తిప్పుకున్నాడు.

హనుమంతుడు అసలు సంగతులేవీ చెప్పకుండా అంత జాప్యం చేస్తోన్నందుకు లక్ష్మణుడికి చాలా కోపం వొస్తోంది. — "హనుమంతుడా ! అన్నగారు మిక్కిలి దుఃఖిస్తున్నారోయ్ ! చూస్తోనే వుంటివి కదా ? .... నువ్వు చూసించంతా .... తొందరగా విన్నవించి అన్నగారికి సంతోషం కలిగించు. మా వొదినగారు ప్రాణాలతో జీవించే వున్నారు గదా ?" —

"ఎంత మాట ! సీతాదేవే ప్రాణాలతో లేకపోతే లంకలో ఇంకెవరు ప్రాణాలతో వుంటారు ?" అని కోపంగా బుగ్గలు పొంగించాడు హనుమంతుడు.

హనుమంతుడి చూపులనిండా — ఆ కొండల్లో, కోనల్లో పడి, నదులు ఈదుకుని, గొప్ప గొప్ప అవాంతరాలు దాటుకుని, లంకారాజ్యం పోయి, అసలు కార్యం సాధించుకు వొచ్చిన పీరత్వం పొంగుతోంది.

సుగ్రీవుడు అటూ ఇటూ చూసి — "శాంతించు హనుమంతుడా" ! — అంటూ కొంచెం వెనక్కి జరిగాడు. హనుమంతుడికి కోపం వొస్తే, పిచ్చ కోపం వొస్తుందని సుగ్రీవుడికి బాగా తెలుసు.

గాలిలో .... పాటలూ .... నవ్వులూ .... దగ్గిరికొచ్చి .... దూరంగాపోయి .... దగ్గిరి కొస్తున్నాయి.

రాముడు మాటిమాటికీ చూడామణి చూసి తల భూమిలోకి వొంచి కుములుతున్నాడు.

లక్ష్మణుడు వొదినగారి గురించి ఆలోచిస్తూ, అన్నగారి సంగతి మరిచిపోయి, తిన్నగా నించుని మెడ పైకెత్తాడు.

హనుమంతుడు బుగ్గలో కోపం తగ్గించుకుని రాముణ్ణి వినయంగా చూస్తూ — "శ్రీరామా ! నువ్వు ఇక దుఃఖించే పనిలేదు. నీ భార్య మహా గుణవంతురాలు. పాతివ్రత్యం కాపాడుకుంటూ క్షేమంగా వుంది" — అని అసలు విషయం బయట పెట్టాడు.

"పాతివ్రత్యం కాపాడుకుంటూ ...." — అనే మాటలు రాముడి చెవులకు వేద మంత్రోచ్చారణమల్లే వినపడ్డాయి. సంతోషం పట్టలేక పోవురుమన్నాడు — "నా సీత .... క్షేమంగా వుందా నాయనా ? .... ఆ పర పురుషుడి దగ్గిర .... ఆ దుర్మార్గుడు .... ఏదీ .... ఆ పలుకులు .... మళ్ళీ వొక్కసారి చెప్పు నాయనా !" — అని తల వాల్చాడు.

"ఆహా ! ఏం అనురాగం ! .... ఏం అనురాగం !" — అని సుగ్రీవుడు ముక్కుమీద వేలేసుకున్నాడు. — ముక్కుమీద వేలెప్పుడేసుకోవాలో బొత్తిగా తెలీక.

"అయ్యో ! శ్రీరామచంద్రుడి అత్మ ఎంత తపిస్తోందో గదా భార్యకోసం !" — అని వొక పండితుడు నిట్టూర్చాడు.

"అయ్యా ! ఆత్మ అంటే ఏవిటండీ ?" — అని ఆ పక్కనే కూర్చున్న యువకు డొకడు పండితుడి చెవిని పలకరించాడు. ఆత్మ అంటే ఏవిటో తెలుసుకోవాలని ఆ కుర్రవాడికి ఎంతోకాలంనించీ కోరికగా వుంది. ఎందిర్నో అడిగాడు. అందరూ తలోరకంగా చెప్పారు. ఆ ప్రకారం అయితే, వొక్కో ధర్మాత్ముడికి వందలకొద్దీ ఆత్మ లుండాలని తేలింది. వందలకొద్దీ దుర్మార్గులికి వొక్కొక్క ఆత్మయినా వుండకూడదనీ తేల్చింది, ఆ యువకుడు ఇంకా ఆత్మ రహస్యం — పరిశో

దిస్తోనే వున్నాడు. ఎవరన్నా "ఆఁ...." — అని నోరు తెరిస్తే — "ఆత్మ ...." — అంటారేమో, అదేవిటని అడగాలని ఎదురు చూస్తూ వుంటాడు.

సమయం వొచ్చిందిగదాని చాలా సంతోషపడుతూ, ఈ పండి తుణ్ణి పట్టుకున్నాడు.

"ఆత్మ అంటే పరమాత్మే నాయనా !"

"పరమాత్మ అంటే .... ?" —

"ఆత్మే అని తెలుసుకోలేవూ ?"

"ఆత్మ అంటే.... ?" —అనటోయి, —"ఇదేవిటి ? ఇలాంటి చిక్కులో పెట్టాడీయన ?" — అని ఆలోచనల్లో మునిగిపోయాడు.

అప్పటికి— హనుమంతుడు ... శ్రీరాముడికి .... ఆ శుభవార్త .... ఆ చలనివార్త.... మూడోసారి.... ఏడోసారి.... పదోసారి కూడా చెప్పాడు. —"అయ్యా ! నీ భార్య పతివ్రతగా వుంది. క్షేమంగా వుంది. పర పురుషుణ్ణి కన్నెత్తి చూడదు. పతివ్రతగా వుంది.... పర పురుషుణ్ణి గడి పరకలా భావించింది.... పతివ్రతగా వుంది. .... చిక్కి శల్యమై పోయింది.... అయినా ఆ దుర్మార్గుడికి లొంగదు. పతివ్రతగానే వుంది .... సందేహం లేదు. పతివ్రతగా వుంది."—

వింటోన్నకొద్దీ రాముడి కేదో అనుమానం ప్రారంభమైంది. — అసలు సీత పతివ్రతగా లేదేమో !.... తన నెలాగైనా నమ్మించాలని .... వొప్పించాలని ... మోసం చేసేసి మభ్యపెట్టాలని .... హనుమంతుడే ... అబద్దాలు కల్పించి .. ఎలాగైనా.... నమ్మించాలని.... వొప్పించాలని.... మభ్యపెట్టేసి.... రాముడి తల గిర్రున తిరుగుతోంది. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. చెవులు దిబ్బళ్ళు పడ్డాయి. తల వాల్చి....కళ్ళు మూసి.... వొరిగి.... మూర్ఛపోయాడు.

ఎవ్వరూ కంగారు పడలేదు.

పెదపెద్ద లందరికీ రోజూ అది అలవాటే. అది అనురాగ మూర్ఛే గానీ, రోగ మూర్ఛ గాదని, వారికి తెలుసు.

కొత్తగా ప్రేమలోపడ్డ యువకులూ, భార్యలు పుట్టిళ్ళకు పోయిన యువకులూ, — రాముడి మూర్ఛల సంగతి విని, అలాంటి మూర్ఛలు నేర్చుకోవాలని చాలా ప్రయత్నాలు చేశారు. ఆ మూర్ఛ పోయే విధానం వొక్కసారన్నా పట్టుబడలేదు. కళ్ళు మూసి నేల కొరిగినా, ఏ పొలం పోయే పనో, ఏ కట్టెలు కొట్టే పనో, ఏ సీళ్ళు తెచ్చే పనో, చప్పున గుర్తొచ్చి, మూర్ఛ మాయమయ్యేది. ఆ పని కాస్తా పూర్తిచేసి సమయం చూసుకుని మళ్ళీ మూర్ఛపోబోతే, ఏ స్నేహితుడో వొచ్చిపడి — "ఏడిస్తే ఏం లాభం? పద. ఏం చెయ్యాలో చూసుకో."—అని చివాట్లు పెట్టి లాక్కుపోయేవాడు. ఆ స్నేహితుడు రాకపోతే ఇంట్లో మేళం అయితే ఆ మాత్రవైనా పట్టించుకునే దారి లేదు. పిల్లాడు మూర్ఛపోయాడని గ్రహించి విసిరే వాళ్ళన్నా లేరు సరికదా— "వేళగాని వేళ పడుకున్నావేంరా అబ్బిగా?"— అని ముసిలాళ్ళందరూ వొకటే కేకలు. ఎప్పుడూ, ఇబ్బందులతో ఆటంకాలతో వొక్కరికైనా సంతోషంగా మూర్ఛపోడానికే వీలుకాలేదు. —

"శ్రీరాముడితో మనకు వొంతా?.... కార్యభారం అంతా ఇతర మీద పెట్టి.... అంత చక్కగా, విశ్రాంతిగా.... మాటిమాటికీ అనురాగ మూర్ఛలు పోయే శక్తి-సామర్థ్యాలు ఆయన సొత్తే," — అని యువకులంతా నిరాశ చేసుకుని వూరుకున్నారు.

అన్నగారు మూర్ఛ పోయినప్పటినుంచీ, లక్ష్మణుడు వినయంగా వొంగ, ఆకుల రెమ్మతో విసురుతూనే వున్నాడు.

అప్పుడప్పుడూ ఆకులు మొహానికి తగిలి — చెంపలు దురద పెట్టి— రాముడు నెమ్మదిగా కళ్ళు తేరిచి లేచాడు. పంచెతో కళ్ళు వొత్తుకుని, చెంపలు గోక్కున్నాడు.

మాట్లాడుకుంటోన్న వారందరూ కంఠాలు తగ్గించారు.

రాముడు హనుమంతుడి వేపు పరీక్షగా చూస్తున్నాడు — సీత గురించి నిజం చెపుతున్నాడా అని.

హనుమంతుడు కొంచెం కదిలి— "దుఃఖపడకు స్వామీ! ధైర్యంగా

వుండు. నీ భార్యని నువ్వు తొందరగానే కలుసుకుంటావు. నా మాట విను.... నీ దుఃఖం నేను చూడలేను...." — అంటూ చేతులు జోడించాడు. —"నేను చెప్పించంతా వింటే నువ్వు చాలా ఆనందపడతావు .... ఆ కొండలో.... కోనలో.... దారి పొడుగునా .... ఎందరెందరో మంచి వాళ్ళనీ చూశాను. చెడ్డవాళ్ళనీ చూశాను. మాట వరసకి చెపుతాను. మైనాకుడనే ఆయనతో.... పెద్ద పొట్టాట పడిందనే అనుకున్నాను .... ఆయన్ని చూస్తే దెబ్బలాటకోరు మనిషిలాగ కనిపించాడు .... "ఇదేవిటి? శ్రీరాముడి పనిమీద పోతున్నాను, మళ్ళీ క్షేమంగా వెనక్కి పోవాలి. దారిలో ఈ పోట్టాటలేవిటి? ... రాముడికి దయ లేదా? .... ఇటువంటి దుర్మార్గుణ్ణి అడ్డు పంపటం ఏవిటని" చాలా విచారించాను ....

రాముడు ఆశ్చర్య పడుతున్నాడు ... మైనాకు డేవిటి? .... తను అడ్డుపంపటం ఏవిటి? కంగారుపడి .... "ఆ మైనాకు డెవరో నాకే పాపమూ తెలీదు నాయనా!" — అందామనుకుంటూ వుండగానే హనుమంతుడు వుత్సాహంతో చెప్పుకు పోతున్నాడు — "నీ దయ నన్ను వెన్నంటి కాపాడుతోనే వుందిలే రామయ్యా? నువ్వే ఆ మైనాకుడి కా బుద్ధి పుట్టించావు. ఆయన నన్ను ఎంత ఆదరించాడనీ! వాళ్ళింట్లో నాలుగు మెతుకులు తిని, కాస్సేపు నడుం వాల్చి వెళ్ళమని .... మరీ మరీ పట్టుబట్టాడు ... నువ్వు పుట్టించిన బుద్ధే గాకపోతే ..."

ఆ మైనాకుడికి అంత మంచి గుణాలు తనే ఇచ్చినట్టు రాముడు గంభీరంగా కూర్చున్నాడు—

మైనాకు డెవరో తనకు తెలీదని తొందరపడి మాట జారితే ఏపు యేదోనని నిర్ఘాంత పడుతున్నాడు.

హనుమంతుడు తన ప్రయాణం సంగతులు వర్ణిస్తూ, పొంగుతూ, వుత్సాహం పొంగులో— తనతో దెబ్బలాటేసుకున్న సింహిక దగ్గిర తేలాడు.

రాముడు ఆలోచనలలోంచి తేరుకుని మందహాసంతో గంభీరంగా — "అవును. ఆమెకు కూడా నేనే ..." అనటోయి, హనుమంతుడి ధోరణి చూసి చప్పున మాట ఆపుకున్నాడు.

హనుమంతుడు సింహిక మీద కోపంతో వూగుతున్నాడు —"నా దారిన నేను పోతోంటే, అన్యాయంగా పిలిచి కయ్యం పెట్టింది. నాకు వొళ్ళు మండి, నాలుగు బాది, నీకు దిక్కున్నచోట చెప్పుకోమన్నాను" అని దెబ్బలాట ఎందుకో ఏమిటో వర్ణిస్తున్నాడు.

హనుమంతుడు, ఎక్కడో, ఎవర్నో పట్టుకు బాదినందుకు — కొందరు చాలా ఆనందించారు. రాముడు గాఢంగా నిట్టూర్చాడు — సింహిక ప్రమాదంలోంచి కూడా తప్పుకున్నందుకు. —"దేనికి తొందర పడి మాట జారకూడదు. చిరునవ్వు నవ్వుతూ విషయం పూర్తిగా వినాలి. దాన్ని బట్టి ఎటు అనుకూలమైతే అటు మాట్లాడాలి. చిన్నతనంలోనే తనకీ సద్గతి, రాజనీతులు నేర్పే గురువులు చాలా సార్లు బోధించారు. తను ఇంతకాలం చక్కగానే గుర్తు పెట్టుకుని, ఆ విధంగానే ఆచరిస్తూ వున్నాడు .. ఇప్పుడే.... ఎందుచేతనో....

"అయ్యా ! .... ఆ రకంగా ఎలాగో లంకా నగరం చేరానా ? .... చీకటి పడేవరకూ వూరికి దూరంగా కొండల్లో దాక్కుని, రాత్రి కాగానే వూళ్ళోకి బయల్దేరాను. ఎలాగో అక్కడక్కడా కాపలా వాళ్ళని ఏమార్చి, చీకటి సందుల్లోంచీ, వీధుల్లోంచీ తిరిగాను. కిటికీలలోంచి తొంగిచూశాను. గోడలెక్కి వాకిళ్ళలో చూశాను .... చివరికి రావణుడి అంతఃపురంలో జొరబడ్డాను."

ఆ సంగతులన్నీ అంతకు ముందే విన్నవాళ్ళు కొందరు, కొత్త వాళ్ళతో— "ఇక్కడ చెప్పేది చాలా బాగుంటుంది. లంకలో ఆడవాళ్ళు భలేగా వున్నారు." —అని వూరించేట్టు చెపుతున్నాడు.

దూరంగా వున్నవాళ్ళు కొందరు గబగబా దగ్గిరికి జరిగారు. సుగ్రీవుడు కూడా ముందుకు జరక్క తప్పలేదు. వెనకనుంచి గెంటు కొచ్చారు.

హనుమంతుడు చెపుతూ, చెపుతూ కొంచెం ఇబ్బంది పడి — "ఆ ఇళ్ళల్లో చూసిన సంగతులన్నీ ఎవరికి వారు చూడవలసిందే గానీ, చెప్పటానికి వల్లకాదు." — అని సిగ్గుపడ్డాడు — తీరా అందరూ ముందుకొచ్చాక.

కొందరు చాలా నిరాశపడ్డారు.

కొందరు అతి వుత్సాహంతో— "చెప్పు.... చెప్పు.... చెప్పవల సిందే...." —అని కేకలేశారు.

సుగ్రీవుడి చెవిలో ఎవరో ఏదో వూదారు. సుగ్రీవుడు మునిముని నవ్వులు నవ్వుతూ— "చెప్పు మరీ! చెప్పకపోతే మా కెలా తెలుస్తుంది మరీ?" — అని బలవంత పెట్టాడు.

రాముడు తల పంకిస్తూ— "చెప్పు నాయనా. ఆ దృశ్యాలేమిటో చక్కగా వర్ణించి చెప్పు. వినక తప్పదు గదా?" — అని విరక్తిగా నిట్టూర్చాడు.

హనుమంతుడు సిగ్గుపడుతోనే ప్రారంభించాడు.

"కొన్ని ఇళ్ళల్లో.... ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ.... ముచ్చట్లాడుకుంటూ.... కావిలించుకుని.... నవ్వుకుని ... సంతోషంగా .... వాళ్ళందర్నీ చూసి ... తర్వాత...."

"అదుగో! దాచేసేశావు కుదరదు." — అని విసుక్కుని కేకలేశారెవరో.

ఆ విసుగులో చాలా సబబు కనిపించింది చాలామందికి.

హనుమంతుడు ఇంకేమీ చెయ్యలేక సిగ్గుపడకుండా "శ్రీరామా! ఆడవాళ్ళూ, మొగవాళ్ళూ చక్కగా సరస సల్లాపాలాడుకుంటూ వుండడం చూశాను. బట్టలు లేకండా భర్తల్ని కావిలించుకున్న ఆడవాళ్ళని చూశాను. భర్తల్ని కావిలించుకోవడంలో మోహంలో నగలన్నీ తెగి పడిపోయిన అందగత్తెల్ని చూశాను. అబ్బ! .... ఏం అందం వొక్కొక్కరూ!.... ఆ అందగత్తెలు...."

"ఎంతదృష్టం! ఎంతదృష్టం!—అని అసూయగా చూస్తున్నాడు సుగ్రీవుడు.

లక్ష్మణుడు కోపంగా మొహం వాగువేపుకు తిప్పుకున్నాడు.

జనం గుసగుసలాడుకుని, కిలుక్కుమని నవ్వుకుంటున్నారు.

వాతావరణం పెళ్ళికి బయల్దేరుతున్నట్టు తయారయ్యింది.

రాముడు హఠాత్తుగా నుదుచిట్టించి గంభీరంగా చుట్టూ చూశాడు — మరుక్షణంలో నిశ్శబ్దానికి రాజ్యం అప్పగించాడు.

హనుమంతుడు రావణుడి అంతఃపురాన్ని కూడా వర్ణించి చెప్పుకు పోతున్నాడు— "....అంత చక్కగావున్న.... గదుల్లో .... అక్కడ .... వొక శయ్యమీద.... వొక అందగత్తెని చూశాను...."

"ఆవిడే సీత...." —అంటాడేమోనని రాముడు కంపిస్తూ వింటున్నాడు.

"ఆవిడ మండోదరి. సీత ఎక్కడా కనపడలేదు...."

రాముడు తేలిగ్గా నిట్టూర్చి కళ్ళుమూశాడు. "ఆవిడ మండోదరి అని హనుమంతుడి కేలా తెలిసిందీ?" — అన్నాడొకాయన పక్కవాళ్ళతో.

"ఎందుకు తెలీదూ? కాపలావాళ్ళ నడిగితే వాళ్ళే చెపుతారు."

"హేవిటీ?...." — అని విస్తుబోయాడు ప్రశ్నాయన జవాబాయన కొంచెం తప్పు గ్రహించుకుని— "ఓహో, అదా? .... అయితే .... అసలు.... ఇది మండోదరి మంచం"— అని మంచంమీదే రాసి వుండదూ? .... ఏదో చెప్పేస్తున్నాడు హనుమంతుడు.... వినుముందు. వెధవ సందేహాలూ నువ్వూనూ...." — అని విసుక్కుని మొహం తిప్పేశాడు.

అప్పటికి హనుమంతుడు అశోకవనంలో చెట్టెక్కేసి దాక్కున్నాడు.

"అక్కడ.... వొక స్త్రీ.... శోక దేవతలా కూర్చుని వుంది ..." — అంటున్నాడు.

లంకలో— స్త్రీల సౌందర్యం వర్ణించడం మానేసి అప్పుడే సీత సంగతి ఎత్తుకున్నందుకు కొందరికి చాలా నిరుత్సాహం కలిగింది. — ...."రాముడు తొందర పడుతున్నాడని ... అప్పుడే .... సీత సంగతులోకి విగాడు గానీ .... దారిలో మాకు చెప్పినప్పుడైతే ఎంత బాగా చెప్పాడో!...." —అన్నాడొకాయన చుట్టుపక్కల వాళ్ళతో.

"ఏం చెప్పాడో మాకు చెప్పరాదూ !"

"ఇప్పుడు కాదు. తర్వాత చెపుతాన్లెండి."

హనుమంతుడు సీత పరిస్థితంతా చెపుతున్నాడు. "నిద్రాహారాలు లేవు. స్నానం పానంలేదు. చిక్కి శల్యమైపోయింది. కంటికీ మంటికీ ఏకధారగా దుఖిస్తోంది. రావణుడు ఎత్తుకు పోయిన్నాడు ఏ చీర కట్టుకుందో ఆ చీరే. ఆ చీర మాసివుంది. సీతాదేవి కూడా మట్టిగొట్టుకున్న పువ్వులాగవుంది." —

రాముడి మొహం మబ్బులు విడుతోన్న ఆకాశం మల్లే తేట పడుతోంది.

"అబ్బ ! అన్నాళ్ళు సీళ్ళు పోసుకోకుండానా ? ఎందుకూ ? అలా వుండడం ?" — చాలాచోట్ల గుసగుసలు. నిశ్శబ్దం అనేక చోట్ల రాజ్యాలు పోగొట్టుకుంటోంది.

"పతివ్రతలు అలాగే వుండాలి. భర్త లేకపోతే స్నానాలూ అవీ చెయ్యకూడదు...."

"మరి వాళ్ళంతా దురదలు పుడితే....? ..."

"దురదలు పుట్టినా అంతే ! గజ్జిపుట్టినా అంతే—"

"పోనీ గోక్కోవొచ్చునా ?.... అది కూడా తప్పేనా ?"

"గోక్కుంటే సుఖం వొస్తుందా ? రాదా ? .... భర్త లేనప్పుడు అలా గోక్కుని సుఖపడితే... తప్పేనేమో ! ...."

"మరి రాముడు చక్కగా రోజూ స్నానాలు చేస్తాడెందుకూ ?.... లక్ష్మణుడితో వాళ్ళంతా తోముంచుకుని మరీ స్నానాలు చేస్తాడే !"

"అబ్బే ! మగవాళ్ళకి తప్పులేదు. వాళ్ళకి వ్రతాలేమీ వుండవుగా ?" —

"రాముడికి ఏకపత్నీ వ్రతం వుంది. తెలుసా ? రాముడు కూడా సీళ్ళు పోసుకోకూడదు .... రోజూ చక్కగా స్నానాలు చేసి రాముడు ఆరోగ్యంగా వుంటాడనుకో. పాపం సీతకి వొంటినిండా గజ్జిపట్టి .... జబ్బుచేసి ఆరోగ్యం, అందం అన్నీ పోతాయ్యనుకో. అప్పుడు రాముడ్ను సీతని నువ్వు నాకు వొద్దంటే....?"

"అయ్యో!.... అసలు పతివ్రతలకి గర్జిపట్టడం ఏమిటీ ?"

"అలా అంటే నే నొప్పుకోను సుమా ! సీత తలా వొళ్ళూ మాసిపోయి మురిగ్గా వుందని హనుమంతుడు చెప్పలేదూ? ..."

హనుమంతుడు సీత దుస్థితి వర్ణిస్తోంటే ఎవ్వరూ వినడంలేదు.

"సీత — "రామా! లక్ష్మణా!" అని అలమటిస్తోంది.

"అయ్యో! నా భర్త నెప్పుడు చేరతానో" అని పలవరిస్తోంది."

"కన్నీళ్ళతో నేలంతా తడిసి, నాని, బురద అయిపోయేట్టు దుఃఖిస్తోంది."

వొక్కొక్కమాటా, వొక్కొక్క వరంలాగ వినపడుతున్నాయి రాముడికి.

జనంలో కబుర్లు మరీ ఎక్కువయ్యాయి. "సీత అలా వుండక ఇంకెలా వుంటుందిలే నవ్వుతూ ... తుళ్ళుతూ .... గంతులేస్తూ వుంటుందా ఏవిటిగానీ .... చెప్పటం మరిచేపోయాను. మీ ఆవు ఈనింది మావా ! "

"ఈనిందీ?.... నే ననుకుంటూనే వున్నాను. మహేంద్ర పర్వతం దగ్గిరే అనుకున్నాను ఈ పాటికి ఈనే వుంటుందని పెయ్య నేసిందా?"

"అబ్బే! దూడే .. అయితే యేంలే. చాలా బాగుంది. మొహం మీద మచ్చ.... అదీ "

"దానిదుంప తెగ!.... మళ్ళీ మాడేనా? లాభం లేదు. ఈ సారి చూలుతో వున్నప్పుడు అమ్మేస్తాను."

"అప్పుడు పెయ్యనే స్తే... ?"

వెనకనించి ఎవరో పీపులో పొడిచారు — "వెధవ గోల. వూరుకోండి. రావణు డొస్తున్నాడు... "

అప్పటికే వొచ్చేశాడు రావణుడు చుట్టూ భార్యలతో — పరిచారికలతో — మద్యపాత్రలతో — ఆసనాలతో. —

హనుమంతుడు వుత్సాహంతో పొంగుతూ వర్ణిస్తున్నాడు రావణుణ్ణి. —ధగధగలాడే ఆ ఆభరణాలూ — ఆ పచ్చల కిరీటం — ఆ నీలాల మొలతాడూ — ఆ ఎర్రటి వళ్ళెవాటూ — ఆ....

రాముడు దుఃఖంతో తల వాల్చేశాడు— నా సీత కబురు చెప్పు నాయనా !"—

"రావణుణ్ణి చూసి ... ఆ తల్లి.... వర్షంలో తడిసిన పిట్టలాగ వొణికింది. రొమ్ములూ .. పొత్తికడుపూ .... తొడలూ .... ముడుచుకుని...."

రాముడు పడిపోయాడు.

లక్ష్మణుడు వెంటనే విసరడం ప్రారంభించాడు. దగ్గిర దగ్గిర కూర్చున్నవాళ్ళు కొంచెం కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

"భార్యాభర్తల్ని విడదియ్యడం మహా పాపం సుమా!"—

"మరి నీ భార్య ఎప్పుడూ పుట్టింట్లోనే వుంటుందే. నువ్వెప్పుడూ పొరుగూళ్ళల్లోనే వుంటావేం?"

"అది మన ఇష్టం. మన ఇష్టం చొప్పున చేసుకుంటే పాపం లేదు. తప్పూ లేదు. ఎవరన్నా విడదీస్తేనే ...."

—"మన ఇష్టం అంటున్నావే గానీ ... మొన్న మీ ఆవిడ మా ఆవిడికి చెప్పి ఏడ్చిందట.... ఎప్పుడూ ఇంటిపట్టునే వుండవని...."

"మీ ఆవిడా ఏడుస్తుందే మో ఎప్పుడూ ఇంటిపట్టునే వుంటావని.... ఎవడికి తెలుసు?.... ఇంటిపట్టు నుండనట....ఇంటిపట్టున యేం? నేనుండకపోతే? .... ఆడది ఇల్లు కనిపెట్టుకుని గొడ్డూ, గోదా, మొక్కా మోడూ చూసుకోరాదూ?"

"ఊరుకోండి. ఊరుకోండి, రాముడు లేస్తున్నాడు."

రాముడు నెమ్మదిగా లేచాడు. —"అటు తర్వాత ఏం జరిగిందో తొందరగా చెప్పు నాయనా!"

"ఆ విధంగా.... సీతాదేవి.... అరిటిబోదెల్లాంటి తొడలూ .... చక్కటి రొమ్ములూ ..."

"ఆగు .... ఆగు .... చెబుదువు గాని .... రాముడు పడిపోతున్నాడు ." —అంటూవుండగానే రాముడు మళ్ళీ పడిపోయాడు.

హనుమంతుడు చాలా చిన్నబుచ్చుకున్నాడు— సీతాదేవి శోక్ష

చెప్పి, రాముడికి దుఃఖం కలిగిస్తున్నానే అని సిగ్గుపడ్డాడు. —"ఈ సారి ఏమైనా సరే సీత సంతోషంగా వుండని .... కల్పించయినా సరే చెపుతాను...." —అనుకున్నాడు.

"ఏ నాడేం పాపం చేసుకున్నాడో .... ఈ వనవాసం ఏవిటి?.... భార్య పోవడం ఏమిటి? ఆ మహానుభావుడి ఆత్మ ఎంత తల్లడిల్లి పోతోందో!" — అన్నాడొక మహా పండితుడు గట్టిగానే.

మరుక్షణంలోనే.... ఆత్మాన్వేషి ఆయన్ని పట్టుకున్నాడు.

"అయ్యా! ఆత్మ అంటే ఏవిటండీ?.... నేను చాలా మందిని అడిగాను గానీ...."

"అయ్యో! నన్నే అడిగితే నీ సందేహాలన్నీ ఎప్పుడో తీర్చేవాణ్ణి కదా నాయనా!"

"చిత్తం! ఇప్పటికైనా మీ పరిచయ భాగ్యం కల్గింది నాకు .... చెప్పండి .... ఆత్మ అంటే ..."

"శరీరం వుందా నాయనా?"

"ఆఁ! వుందండీ!"

"అందులో.... అందులో.... వొక.... ప్రాణం.... కాదు....విచిత్రం వుంది చూశావూ?" అదే ఆత్మ ..."

"అంటే...."

"అడ్డురాకు నాయనా! పూర్తిగా విను. ఆత్మ నశించదు. ఎప్పుడూ వుంటుంది."

"శరీరం చచ్చిపోతే ..."

"ఆత్మ చెట్లమీద వుంటుంది. లేకపోతే ."

"ఏ చెట్లమీద?"

"ఎవరికే చెట్టు ఇష్టమైతే ఆ చెట్టు మీద. నీకు రేగుపళ్ళు ఇష్టం అనుకో.... నీ ఆత్మ రేగుచెట్టు మీద వుంటుంది."

"ఎందుకూ?"

"ఎందుకేవిటయ్యా! రేగుపళ్ళు తింటుందీ."

"ఆత్మకి శరీరం లేదుగా, ఎలా తింటుందీ?"

"చాలా మంచిప్రశ్న లేశావు. రోజూ మా యింటికి వొస్తూ వుండు నాయనా; కొన్ని సంవత్సరాలకు నీకే ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీ ఇంట్లో ఏవన్నా పాదులున్నాయా?...."

"లేవులెండి. చెప్పండి. ఆత్మ రేగుపళ్ళాలా తినగలదు?"

"రేగుపళ్ళు కూడా రాలి కింద పడిపోతాయా? వాటి ఆత్మలు కూడా లేచి చెట్ల మీదకు పోతాయా? అప్పుడు పట్టుకు తినలేదూ?"

"రేగుపళ్ళ ఆత్మలు ఇంకోచెట్టు మీదకి పోతే....?"

"ఈ ఆత్మ, ఆ ఆత్మల వెంటపడి పట్టుకుంటుంది. సరేనా? వూరుకో ఇక. చాదస్తుళ్లా వున్నావే! ఏం చెప్పినా అర్థం కాదు. వొకటే అనుమానాలు...."

ఆత్మాన్వేషి .... ఎప్పుడో మాయం అయిపోయాడు. అప్పుడే కొండలు దిగి పోతున్నాడు.

ఈసారి రాముడు లేవడానికి చాలాసేపే పట్టింది.

రాముడు లేచీ లేవగానే — హనుమంతుడు వినయంగా నమస్కారం చేశాడు — "ప్రభూ! నా అపరాధం మన్నించు .. సీతాదేవి ధైర్యంగా వుంది. సంతోషంగా వుంది, నువ్వు తొందరగానే వొచ్చి రక్షిస్తావని "

రాముడు ... నిర్ఘాంతపడి ... మళ్ళీ పక్కకు వొరుగుతూ .. ఆ చివరిమాటలు విని ఆగాడు. హనుమంతుడికి ఎలా చెప్పాలో తోచడం లేదు.

సీతాదేవి దుఖిస్తోందన్నా రామచంద్రుడికి మూర్ఛ వొస్తోంది. సంతోషిస్తోందన్నా మూర్ఛ వొస్తోంది, — "సరే; జరిగింది జరిగినట్టు చెపుతాను. ఆ మహానుభావుడే గ్రహించుకో గలడు," — అనుకున్నాడు.

రాముడి పరిస్థితి చూసి కొందరు పెద్దలు — "ఏమిటో ఇవ్వాళ మూర్ఛలు చాలా ఎక్కువగా వున్నాయి," అనుకుంటున్నారు.

హనుమంతుడు కొంచెం భయపడుతూనే ప్రారంభించాడు.

"రామా! ఆ మహాతల్లి భయపడుతూ కూర్చుంది.... రావణుడు ఎగ్గిరికి వొచ్చి నించున్నాడు...."

"ఎంత దగ్గిరికీ? ...." అని అడగాలని రాముడి మనసు చాలా వూగింది. కానీ వూరుకున్నాడు.

"సుందరీ! నన్ను చూసి భయపడతా వెందుకు? నీ అందం దాచుకోకు.... నీలాంటి అందగత్తెను చూసి ఏ పురుషుడైనా కామించకుండా ఎలా వుండగలడూ? —" అన్నాడు ప్రభూ రావణుడు "

"అవును మరీ...." — అన్నాడెవరో పరాకుగా.

రాముడు క్రీకంట తీక్షణంగా అటు చూశాడు. అటు నిశ్శబ్దం ఆక్రమించింది.

హనుమంతుడు వుత్సాహంగా చెప్పుకు పోతున్నాడు—"చక్కగా అలంకరించుకో. నా సిరి సంపదలన్నీ అనుభవించు. నా పెద్ద భార్యగా వుండు ...." — అంటూ బతిమాలడం మొదలు పెట్టాడు రామా! రావణుడు ...."

"సీత ఏమన్నది నాయనా ?" — అన్నాడు రాముడు ఆ ప్రశ్న ఆపుకోలేక.

"సీతమ్మ తల్లి తల పైకెత్తనే లేదు. వింటూ వూరుకుంది."

"ఊఁ...."

"ఆ దుష్టుడు నిన్ను దూషించడం మొదలుపెట్టాడు రామయ్యా!"

రాముడు వులిక్కిపడ్డాడు— "ఏవిటీ ?.... నన్నా? ...."

"అవును ప్రభూ! నిన్నే ... "ఆ రాముడు భ్రష్టుడు. నా ముందు ఎందుకూ పనికిరాడు. తపస్సులో — ఐశ్వర్యంలో — పరాక్రమంలో — ఇంకెందులోనూ నాకు సరిపోడు. పూర్వజన్మలో ఏం పాపంచేశావో ఇంతకాలం వనవాసం చేశావు. ఇక ఇప్పట్నించీ రాజ భోగాలన్నీ అనుభవించు"— అన్నాడు ప్రభూ !...."—

రావణుడి తర్కజ్ఞానం అక్కడి తర్కపండితుల కందరికీ చాలా ముచ్చట కలిగించింది.

"అవును మరి. రావణుడన్నమాట నిజమే. రాముడు రావణుడి కన్నా తపస్సులో తక్కువే. ఐశ్వర్యంలోనూ తక్కువే .... మరి పరా

క్రమంలోనా? ఏమో మరి, చూడాలి. ఆయనా ధనుర్విద్యలో గొప్పవాడే నంటున్నాడుగా హనుమంతుడూ?

ఇక పాపపుణ్యాల మాటా? .... ఆ మాట రోజూ అనుకుంటున్నదే. శ్రీరాముడు పడుతోన్న బాధలు చూడలేక.... ఏం మహా పాపం చేశాడో.... రాజ్యం పోయి .. వనవాసం చేస్తున్నాడని .... శ్రీరాముణ్ణి గురించి రోజూ విచారిస్తోన్నదే. మళ్ళీ రాజభోగాలు లభించడం అంటే అదృష్టమేగా? శ్రీరాముడు ఏదురు చూసేది వాటికోసమేగా? ఆ మాటే రావణుడన్నాడు మరి. ఏ విధంగా చూసినా అతడి మాటలు కొట్టి పారెయ్యడానికి వీలున్నట్టు లేదు."— అనుకుంటున్నారు ఎవరికి వారే.

"అప్పుడు కూడా సీత ఏమీ మాట్లాడలేదా హనుమంతుడా?"— అన్నాడు రాముడు కోపంతో శాంతంగా.

"అయ్యో! ఎందుకు మాట్లాడలేదు స్వామీ? మొదట కొంత సేపు మౌనం వహించింది గానీ, తర్వాత మాత్రం మాటకు మాట బదులు చెప్పింది. ఆ దుష్టుణ్ణి ఎంతగానో నిందించింది. — నీ భార్యల్నే ప్రేమించు. నన్ను కోరకు. నేను నా భర్తని తప్ప పర పురుషుణ్ణి కన్నెత్తి చూడను.... నన్ను తీసుకుపోయి నా భర్తకు అప్పగించు. లేకపోతే నా భర్త నిన్ను సర్వనాశనం చేస్తాడు." — అని శత విధాలా చెప్పింది. ఆ దుర్మార్గుడు జంకడే:....మనసు మార్చుకోడే!...."

"మరి ఏ వన్నాడేంటి?" — ఎవరో కుతూహలంగా.

"అదే చెపుతున్నా. తన మాట తనదే—"నువ్వెంతో అందంగా వున్నావు. నీ అందం నా మతి పోగొట్టి పిచ్చివాణ్ణి చేస్తోంది. మన్మధుడు పూల బాణాలతో నన్ను నీ వేపు తరుముతున్నాడు. దయదల్చి. కనికరించు." — అని గోలపెట్టాడు. —

శృంగార కవిత్వాలు రాసే పండితులు— "ఆహా! .... ఆహా!" —అని తల లూపుతున్నారు. —ఆహా! .... ఎంత సరసంగా అడుగుతున్నాడయ్యా! "నీ అందం నా మతి పోగొడుతోంది" అన్నాడంటే— ఎంత దయనీయంగా అన్నాడూ!.... స్త్రీ సౌందర్యం పురుషుణ్ణి ...."

అనలు ఇంకో చమత్కారం చూశారూ ? "మన్మధుడు నన్ను నీ వేపు తరుముతున్నాడు" —అనడంలో ఆ అందం చూశారూ? —రావణుడికి ఎందరు భార్యలుంటేనేం ? ఎందరు స్త్రీలు అందుబాటులో వుంటేనేం? మనసంతా ఈ స్త్రీ మీదకే లాగుతోందయ్యే ! .... ఇంకో స్త్రీని కోరకేడయ్యే! అలాంటి శృంగారావస్థని....ఆహా! ఎంత రమ్యంగా చెప్పాడండీ! ...." మన్మధుడు నన్ను నీ వేపు తరుముతున్నా డన్నాడు. అంతేగా మరీ ! .. అది తరమడమేగా ?.... మన్మధుడు చిలిపి చేష్టేగా అదీ! ... ఏవంటారు మీరు?"

"అయ్యో! కాదుటండీ?.... అదే తలుచుకుని, తలుచుకుని ముగ్ధవుతున్నాను. రావణుడు గొప్ప రసికుడండీ! గొప్ప శృంగార చక్రవర్తి ; ... ఆహా! ఎంత స్వారస్యంగా చెప్పాడండీ !"—

కవులు కళ్ళు మూసుకుని ఆన ద పారవశ్యంలో మునిగారు.

రాముడు మన్మధుడి దుర్మార్గం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు- సీత మీద మోహం పుట్టిస్తూ, ఇటు తనమీదా బాణాలు గుప్పిస్తున్నాడు. అటు రావణుడి మీదా గుప్పిస్తున్నాడా!.... ఏం తుంటరితనం ఇది? .... నియమనిష్ఠలతో కామోపభోగాలు అనుభవించే తనే మన్మధుణ్ణి నిగ్రహించలేకుండా వున్నాడే ! ఇక నిత్యం సుందరాంగనలతో, సౌఖ్యాలలో మునిగితేలే ఆ రావణుడెలా నిగ్రహించగలడు ? ఇదంతా మన్మధుడి కుతంత్రంలా వుందే ! మన్మధుడీ దుష్టత్వానికి తలపడకపోతే.... ...

మన్మధుడి పూల బాణాలమీద దూరం జనంలో కూడా చర్చ జరుగుతోంది.

"మన్మధుడు రావణుడి మీద పూలబాణా లెయ్యటం ఎందుకూ ?" — అన్నారెవరో మొదట.

"సీత చాలా అందంగా వుంటుందిగా. రావణుణ్ణి మోహించమని ...."

"అంత అందంగా వుంటే తనే మోహించాలి గానీ .... ఇంకొకరికి చెప్పటం ఎందుకూ?"

"ఛీ! వూరుకో. నీకేం తెలీదు. వుత్త అడివి మాలోకానివి, మన్మధుడికి అందరికంటే అందమైన భార్య వుంది. తెలుసా? — ఆయన, అందర్నీ ప్రేమించుకోమని పాపం సాయం చేస్తాడంతే ..."

"మరి రావణుణ్ణి ప్రేమించమని సీతమీద కూడా బాణాలు వేస్తాడా ?...."

"ఛ! అలా ఎందుకేస్తాడూ?.... భర్త దగ్గిర లేకపోతే స్త్రీలమీద వెయ్యడు. పురుషుల మీదైతే ఎప్పుడైనా గుప్పించేస్తాడు."

"ఇదెక్కడి గోలయ్యా? .... రావణుడి మీద తెగ బాణాలు గుప్పించేసి, సీత మీద వొక్కటన్నా వెయ్యకపోతే.... ఇక వాళ్ళిద్దరికీ ఎలా కుదిరేడుస్తుందీ ?"

"కుదిరేదవ గూడదుగా? ...."

"సరే! బాగానే వుంది. మరి రావణుడిమీద కూడా మానెయ్యరాదూ ? .... ముందా మన్మధుణ్ణి పట్టుకు బాదితే వ్యవహారమంతా చక్కబడే లాగుంది."

వెనకవాళ్ళూ, ముందువాళ్ళూ అందరూ వొక్కసారే విసుక్కున్నారు — "ఎప్పుడూ మాటలే మీకు. వెధవగోల. పోండి ఇక్కణ్ణించి. బుద్ధి లేదు." —అని కేకలేశారు.

మాటలవాళ్ళు గునగుసల్లోకి దిగారు—

"పోదామా?.... కాస్సేపలా తిరిగొద్దాం."

"ఇప్పుడు కాదు. ఈసారి రాముడు మూర్ఛ పోయినప్పుడు వెళ్దాంలే.... ఇక మాట్లాడకు...."

"అదికాదు.... వొక్క మాట....మళ్ళీ మర్చిపోతానేమో. మన్మధుడు అందరూ ప్రేమించుకోటానికి సాయం చేస్తాడన్నావు కదా ? .... వాళ్ళావిణ్ణి రావణు డెత్తుకు పోతాడనుకో. అప్పుడు కూడా రావణుడి మీద బాణాలేస్తాడా ?"

"ఏమో మరి.... పండితుల్నెవర్నన్నా అడుగుదాం, వూర్కో."

హనుమంతుడు చెప్పుడు పోతున్నాడు.

రావణుడు సీత అవయవాలన్నీ ఎలా వర్ణించాడో చెప్పుకు పోతున్నాడు. సీత కళ్ళూ, చెంపలూ మెచ్చుకున్నాడు రావణుడు. జుట్టు బాగుందన్నాడు. గడ్డం బాగుందన్నాడు. తొడలు బాగున్నా యన్నాడు....

రాముడు ఇంకా మన్మథుడి దుర్మార్గంలోంచి తేరుకోలేదు.

రావణుడు సీత స్తనాలు చాలా మెచ్చుకుంటున్నాడు. — సుందరీ! .... నీ స్తనాలు.... చక్కగా... "

రాముడు కొంచెం తేరుకుని అదిరిపడి— "స్తనాలా? .... స్తనాలేమిటి ?.... సనాలెట్లా చూశాడు ? .. " —అని మండిపడ్డాడు. అంతలోనే తప్పు గ్రహించుకుని శాంతంగా— సీతాదేవి.... ఎప్పుడూ .... చక్కగా .... పైట కప్పుకుంటుందోయీ ! — అని కొంచెం కనుబొమ్మలు ముడిచాడు.

హనుమంతుడు రాముడి కోపానికీ జంకి వినయంగా చేతులు జోడించాడు —"సీతాదేవి దోషమేమీ లేదు స్వామీ!.... నగలు మూట కట్టినప్పుడు.... ఆ కంగారులో... బారెడుగుడ్డో, రెండుబారల గుడ్డో ఇక్కడే చింపేసింది కదా ?

ఆ మిగిలిన చీరైనా అక్కడక్కడా చిరిగి .... వొంటినిండా చాలక చాలా ఇబ్బంది పడిపోతోంది ఆ దుర్మార్గుడు అంతకు ముందే తొడలు చూశాడని.... చీరంతా పాదాల కిందకి లాక్కుంది. ఈసారి భుజాల చుట్టూ కప్పుకోడానికి వీల్లేక ...."

సుగ్రీవుడు కోపంగా— "ఆ దుర్మార్గుడు చీరలన్నా ఇవ్వలేదా?" — అన్నాడు.

"అయ్యో! .... పాపం మాటలు.... ఎందుకివ్వలేదూ?.... సీతాదేవి కట్టుకో నన్నదిగా ?"

"ఓహో ! అదా !...." — అని శాంతించాడు సుగ్రీవుడు — పక్కకి తిరిగి నీలుడితో— "కట్టుకుంటేనే బాగుండేదేమో ! ఏమంటావు ?" —అన్నాడు.

"కట్టుకుంటే ఏం బాగుంటుందిలే మహారాజా! .... పతివ్రత కదా?" —అని చప్పరించాడు నీలుడు.

ఆ విషయంమీదే జనంలో వాదోపవాదాలు జరుగుతున్నాయి.

కొందరు— "కట్టుకుంటేనే మంచిది."— అన్నారు.

"ఏం మంచిది?.... ఎంత లోకువ పర పురుషుడికి ?" — అన్నారు మరికొందరు.

"మరి ఆ వొక్క కోకతో.... వొళ్ళంతా...."

"ఆఁ .... పిచ్చిగానీ .. వొళ్ళు కప్పుకుంటే మాత్రం వాడు వొర్చకుండా వుంటాడా? వాడి బుద్ధి ఆదీ....! .... ఏదేదో వూహించి మర్రీ వాగుతాడు. లేకపోతే సీతాదేవి వాడికి పొత్తికడుపూ, తొడలూ చూపి చించా ఏవిటి ? "

"నువ్వన్నదీ నిజమేలే. పట్టుదలంటే పట్టుదలే .... పోనీ వొళ్లు చూసే చూసాడు. అంతే గానీ.... వాడిచ్చే గుడ్డలు కట్టుకోటం ఏమిటి? .... మా ఆవిడైతే మాత్రం ... వెనకా ముందూ చూడకుండా మహా చక్కగా కట్టుకునేది. రోజుకు పది కోకలన్నా విప్పేది .."

"అవును మరి. నువ్వేనాడన్నా ఆవిడ మొహానికో గుడ్డముక్క కొంటేనా ?"

ఏడాదికీ జతగుడ్డలు కొంటాను. ఇంకెన్ని కావాలి? చెల్లెలు వరసని వెనకేసుకొస్తున్నావు గానీ, మా ఆవిణ్ణి ఏ రావణుడో ఎత్తుకు పోతేనే గానీ, ఆ కోకలపిచ్చి ఆ నగలపిచ్చి వొదలవులే."

హనుమంతుడు రావణుణ్ణి వొదలడం లేదు.

రావణుడు సీతని వొదలడం లేదు.

సీత పాతివ్రత్యం వొదలడం లేదు.

రావణుడు సీత నడుంమీదనుంచి చూపులు తిప్పలేక పోతున్నాడు — "దుఃఖంతో చిక్కిపోయి నీ నడుం మరింత సన్నబడి — చాలా అందంగా చంద్రలేఖలా వున్నావు." —అంటున్నాడు.

వొక మూలనించి ఎవరో రావణుణ్ణి మెచ్చుకుంటున్నారు. — "అవును, ఆ మాట నిజమే, "చక్కనమ్మ చిక్కినా అందమే," —

అనేవాడు మా తాత కూడా. పెద్దాళ్ళు వూరికే అంటారా?" అని పెద్ద వాళ్ళందర్నీ కూడా మెచ్చుకుంటున్నారు.

రాముడి కంతా అయోమయంగా వుంది. సీత తనకోసం దుఃఖంతో కృంగి కృశించి పోయినందుకు సంతోషించాలో — కృశించి మరీ అందంగా అయినందుకు విచారించాలో — పర పురుషుడిచ్చే చీరలు కట్టనందుకు సంతోషించాలో — పర పురుషుడికి వొళ్ళంతా చూపిస్తో న్నందుకు విచారించాలో ఎటూ, ఏమీ తోచడ లేదు.

అసలు ఆ చీర చింపడం ఎందుకూ? నగలు ఏ పచ్చగడ్డి మీదో పడేస్తే సరిపోదూ? .... అసలు లక్ష్మణుణ్ణి ఆశ్రమంలో వుండనివ్వ కుండా పంపడం ఎందుకూ? .. ఇంకా అసలు . తని రావొద్దన్నా వినకుండా అడవుల్లోకి రావడం ఎందుకూ? ....అంతఃపురాల్లో వుంచే .... స్త్రీకి ఎంత రక్షణ! ఎంత మర్యాద — ఈ కష్టాలన్నీ దాపురించేవా! ఆలోచిస్తోన్న కొద్దీ సీతమీద కోపంతో రాముడి తల భారం అయిపోతోంది. మూర్ఛ పోబుద్ధేస్తోంది. హనుమంతుడేదో అంటున్నాడని కొంచెం తలెత్తాడు.

"ధైర్యం తెచ్చుకో రామా! ఆ పాపిష్టి వాణ్ణి, సీతాదేవి నిర్భయంగానే నించించింది. మాట వినిపించుకుంటేనా? — "నా కీర్తి చూడు. నా ఐశ్వర్యం చూడు." రాముడి పేరెత్తితే వూరుకోను. ఇక నువ్వు రావణ పత్నివే. తెలివైన దానివైతే నాతో సుఖపడు." — అన్నాడా దుర్మార్గుడు. — అని హనుమంతుడు ఆ మాటలు తన నోటితో చెప్పి తప్పు చేసినట్టు తల వొంచుకున్నాడు.

"సీత తెలివైందేనా?" — అని గుసగుసలు బయల్దేరాయి.

"తెలివైందేనేమో! ఎందుకొక్కడూ?"

"అయితే రావణుడితో సుఖపడుతుందా?"

"ఛ! అవేం మాటలు?"

"మరి సుఖపడకపోతే తెలివి తక్కువదై పోదూ?" పురోహితులు కొందరు పెదాలు చిట్లిస్తూ చాలా విస్తుపోతున్నారు — "వివాహం

గాకుండానే రావణ పత్ని అనడం ఏవిటండీ? వాడి అఘాయిత్యం పాడు గానూ, ఇక వైవాహిక కర్మాకాండకు విలువెక్కడుందీ?" — అని చాలా నొచ్చుకుంటున్నారు.

"సీతాదేవి అప్పుడేవందీ?" — కుతూహలంగా అడిగాడు సుగ్రీవుడు.

హనుమంతుడు ఫత్సాహంగా — "సిగ్గొచ్చేలాగే చెప్పింది — "రావణా! నీకు సిరి సంపదలున్నాయి. గానీ సన్మార్గం లేదు. అదికూడా వుంటే నువ్వు వుత్తముడివే .... నా భర్త ...."

"వాడా వుత్తముడయ్యేది?" — క్రీగంట కోపంగా చూశాడు రాముడు హనుమంతుణ్ణి.

"నా భర్త నీవంటి దుర్మార్గుడు కాడు. సర్వ సద్గుణవంతుడు.... గొప్ప వరాన్న పుట్టాడు... అలాంటి ఉత్తముణ్ణి విడిచిపెడతానా ఏవిటి?" అని మాటగా చెప్పిందా తల్లి .... అయితే యేం? మనలో మన మాట .... ఆయనా వరాన్నే పుట్టాడంట — "నేనూ వరాన్నే పుట్టాను" — అన్నాడు"—అని ఆగి హనుమంతుడు అందరూ ఆశ్చర్య పోతున్నారా లేదా అని అందరి మొహాలూ చూస్తున్నాడు.

"రావణుడూ వరాన్నే పుట్టాడా?"— సంశయిస్తున్నాడు రాముడు.

"అంత దుర్మార్గుడికి వరం ఇచ్చిన దేవుడెవరబ్బా?" అని జనం తర్జన భర్జన పడుతున్నారు.

"వరం ఇచ్చేప్పటికి అసలు పుట్టనే లేదుగా? మంచివాడవుతాడేమోనని ఇచ్చేశాడు. పాపం దేవుడికేం తెలుసూ?"

"అవును. నిజమే. దేవుడు రావణుడి తల్లితండ్రులికి వరం ఇచ్చాడన్నమాట."

"నేనూ వరాన్నే పుట్టానంట...." అంటున్నాడొకాయన కొంచెం సిగ్గుపడుతూ.

"నువ్వేకాదు. నేనూ వరాన్నే పుట్టాను. అసలు నేను చాలాకాలం

పుట్టనేలేదనీ, మా అమ్మమ్మ నాగేంద్రుడికి మొక్కుకుంటే....ఓకరోజు .... నాగేంద్రుడు మా తాతకి పొలం గట్టున కనపడీ ...."

"అదేవిటి ? .... మీ అమ్మమ్మ మొక్కుకుంటే, మీ తాతకి కనపడ్డం ఏవిటి ?"

"ఏమో మరి. ఆయన ఇష్టవా ? మన ఇష్టవా ? .... ఏం ? .... అలా పొలం గట్టున కనపడి మాయం అయిపోయాడంట. కొన్నాళ్ళు పోయాక మళ్ళీ కల్లో కనపడీ .... "మీకు చాలా మంచి మనవడు పుడతాడూ. చాలా గొప్ప మనవ డవుతాడూ" — అని చెప్పాడంట. ఆ తర్వాత పదేళ్ళకి నేను పుట్టానన్నమాట ..."

వినే ఆయనకి ఎడం పక్కాయన, గణపతి వరాన్నే పుట్టుకొచ్చిన కథ ఇంకా చక్కగా చెపుతున్నాడు.

వెనక వాళ్ళెవరో పార్వతీదేవి వరాన్న పుడుతున్నారు. చాలా మంది ఈశ్వరుడి వరాన్న పుట్టారు.

"ఈశ్వరుడి వరం అంత మంచిదేం కాదు. అంత శక్తి ఉండదు."

"ఎందు కుండదూ ? ఆ మాటకొస్తే .... పార్వతి వరానికే శక్తి వుండదు .... రేపేవన్నా కష్టాలొస్తే ఆడదెలా రక్షిస్తుంది ? .... అదే మొగ దేవుడైతే ...."

మొత్తంగా జనంలో దాదాపు అందరూ వరాలవల్ల పుట్టినవాళ్ళేనని తేలింది

తల్లి దండ్రులవల్ల పుట్టినవాళ్ళు వొక్కరూ లేరు.

సుగ్రీవుడు నవ్వు మొహంతో నీలుణ్ణి చూస్తూ — "నేను కూడా వరాన్నే "

"చిత్తం ! .... నేనూ కొండదేవత వరాన్న ...."

"అలాగా ?....సరేలే...." — అని తల తిప్పేశాడు సుగ్రీవుడు.

"కొందరగా చెప్పు నాయనా ! అప్పుడు సీత ఏమన్నది ?" —

"సీతాదేవి చాలా కోపం తెచ్చుకుని, కళ్ళెర్రజేసి — "రావణా ! .... గొప్ప పరాక్రమవంతుణ్ణి అంటున్నావు. నా భర్త లేని సమయంలో

పిరికిపందలాగ వొచ్చి నన్ను రహస్యంగా ఎందుకు తీసుకు వొచ్చావు?" — అని చక్కగా అడిగింది" — అని వువ్వు మొహంతో అందర్నీ చూశాడు హనుమంతుడు.

"అడిగిందీ!" — అని చాలామంది సంతోషించారు. ముఖ్యంగా తర్కపండితులు.

— "సీతాదేవి చాలా తెలివైనవయ్యా!.... అప్పుడు రావణ మహారాజేమన్నాడోయీ?"

"ఏం? నీ భర్త చేసిన ఘనకార్యం మాత్రం ఏవిటి? నా చెల్లెల్ని వొంటరిగా పట్టుకుని ముక్కు, చెవులూ కోయించలేదా?" — అని మహా చక్కగా అడిగాడు ...." — అనేసి హనుమంతుడు చప్పున తప్పు గ్రహించుకుని తల పక్కకి తిప్పుకున్నాడు.

రాముడు మొహం చిట్లించాడు — "అబ్బ! ఈ లక్ష్మణుడికి కోపం వస్తే మంచీ చెడ్డా తెలీదు. ఆ ముక్కూ, చెవులూ కోసుకోడం ఎందుకూ? చితకదన్ని పంపిస్తే సరిపోయేదానికి .... చూడు. ఇవ్వాళ ఎలా అడిగించుకోవలసి వచ్చిందో!...."

రాముడి మనసంతా గందరగోళంగా వుంది. మూర్ఛ పోబుద్ధే జ్ఞోంది.

"పాపం చాలా అన్యాయమే. ఆడదాన్ని పట్టుకుని ముక్కు కొయ్యడం ఏవిటీ? .... కట్టుకున్నవాడు ఏలుకోవాలా? అక్కర్లేదా?"

"మరే! ముక్కు కోసి వూరుకున్నాడా? చెవులు కూడా కొయ్యడం ఏవిటీ?"

"అసలు చెవులు కోసినా కొంత నయం. ముక్కు కొయ్యడం ఏవిటంట? .... పోయేకాలం గాకపోతే ...."

"ముక్కో ముక్కో అంటావు?.... చెవులేనా? అక్కర్లేంది?"

"అబ్బే! చెవులూ ఉండాల్సిగానీ ... ముక్కు ఇంకా ఉండాలి."

"ధర్మాత్ములం.... ధర్మాత్ములం అంటారుగానీ అసలీ అన్నదమ్ము

లిచ్చినకీ .... ఎవర్నో ఒకర్ని పీడించడమే బుద్ధి గావున్ను.... పాడుబుద్ధి! మా బాగా చేశాళ్ళే రావణుడు."

"ష! వూరుకోండి. మీ దుంపతెగ! వసపిట్టలాగ ఒకటే వాగుడు .... రావణుడు చక్కగా మాట్లాడుతున్నాడు. ఒక్కటీ వినపడనిచ్చి చావరు ...."

రావణుడు సీతని పరిహాసం చేస్తున్నాడు. — "నా భర్త ఇంతటివాడు ... అంతటివాడు అంటావు. ఇంతకాలం నిన్ను ఎందుకు రక్షించలేక పోయాడు?" — అని మీసం తిప్పుతూ అడుగుతున్నాడు.

రాముడు నెమ్మదిగా నేలకొరిగి మూర్ఛపోయాడు.

"పదండి. మళ్ళీ ఆయన లేచేప్పటికి వొద్దాం"—అంటూ కొంతమంది లేచారు.

వాళ్ళని చూసి ఇంకా కొంతమంది లేచారు.

కూర్చున్నవాళ్ళు బాగా కంఠాలు తగ్గించి — "రావణు డడిగిన మాట సబబుగానే వుంది ... భార్యమీద అనురాగంతో ఘడియకోసారి మూర్ఛ పడిపోతున్నాడు గదా .... ఇంతకాలం ఎందుకు తెచ్చుకోలేదు మరి?"

"ఎలా తెచ్చుకుంటాడు? .... మాట లేవిటి యుద్ధవంటే? .... ఆయనకి చేతనైంది మూర్ఛ తెచ్చుకోడం వొక్కటే ..."

"గట్టిగా అనకు. బాగుండదు...."

లేచినవాళ్ళు కొందరు చెట్లవెంట తిరుగుతున్నారు. కొందరు వాగులో నీళ్ళు తాగటానికి పోయారు. కొందరు ఇళ్ళదగ్గిర గొడవలు చెప్పుకుంటున్నారు.

"రండి. రండి...." — అని కూర్చున్నవాళ్ళు దూరం వాళ్ళని పిలిచారు. "రాముడు లేచాడు .... రండి."

అందరూ చేరేసరికి హనుమంతుడు చాలా చెప్పేశాడు. రాముడు తలూపుతూ వింటున్నాడు.

రావణుడు వెక్కిరించినందుకు సీత ఏపుందీ?" అని అప్పుడే వొచ్చినవాళ్ళు ముందు వచ్చినవాళ్ళని అడుగుతున్నారు.

"సీకింకా మూడలేదంది. పాపం పండొద్దూ ఎవరికైనా..."

"మరి రాము డేవన్నాడూ, పాపం పండక్కనే వూరుకున్నాడటనా?"

సీత రావణుణ్ణో ఎంత చక్కగా నిందించిందో వింటోన్న కొద్దీ రాఘుడి మనసు చాలా తేలిక పడుతోంది.

— "నాయనా, ఆ దుర్మార్గుడు....సీతాదేవికి.... ఎంత దూరంలో సించున్నాడు నాయనా ?.:. ఆమెనేమీ దండించలేదు కదా?" —

"అబ్బే, పాపమాట లెందుకు గానీ ... ఏమీ దండించలేదు. ముద్దుగా పెంపుడు చిలకని చూసుకున్నట్టు చూసుకుంటున్నాడు. అసలు సీతాదేవి ఎన్ని తిట్టినా కోపం తెచ్చుకోడే, ఆవిడ నోట్లోంచి మాట వొస్తే చాలన్నట్టు ....వొకవేపు తిడుతోంటే, వొక వేపు ముసిముసి నవ్వులు నవ్వుతాడు...."

రాముడికి సీత మీద అంచెలంచెలుగా కోపం పెరుగుతోంది. — అంతర్ముఖు డయ్యాడు— "పర పురుషుడితో అన్ని మాట లెందుకూ ? ఒక్క మాట చెప్పేసి ఇక వూరుకో కూడదూ?" —

"నాయనా, ... ఇంతకీ ఎంత దూ...."

"అదే చెపుతున్నా రామయ్యా !" — హనుమంతుడు ఇటూ అటూ చూసి— "అదిగో, ఆ మైదుకు కూర్చున్నంత దూరం.... అబ్బే, అంత దూరం కాదు గానీ.... ఆ....తారుడు కూర్చున్నంత దగ్గిర్లో ....నించున్నాడు ... అవును ... అంతే " — అన్నాడు.

రాముడికి తారుడి మీద తగని కోపం వొచ్చింది— అంత దగ్గిరిగా కూర్చున్నందుకు.

"ఊఁ చెప్పు .... తర్వాతేమైంది?" — అన్నాడు సుగ్రీవుడు అప్పుడే గుసగుసల్లోంచి బయటపడి.

"ఇంకేమవుతుందిలే మహారాజా, ... ఆయన మాట ఆయనా వొదలడు. ఈవిడ పట్టు ఈవిడా వొదలదు. — "ఎంతకాలం నీ భర్త కోసం ఎదురు చూస్తావు? .... నీ వయసంతా వృధాగా గడిచిపోతోంది సుమా, వీటి ప్రవాహం వెనక్కి వొస్తుందా ?.... నా మాట విను ..." —అంటూ బతిమిలాడి చూశాడు చాలా పేపు.

తర్క పండితులకు రావణుడి తర్కంలో చాలా నబిబు కనిపించింది. — "అవును మరీ. అంతే మరీ. — రోజులు గడిచిపోతే మళ్ళీ వెనక్కి వొస్తాయా? .... అబ్బే! వొక్క క్షణం రమ్మన్నా రాదు ...." —అని తలలు తాటిస్తున్నారు.

కవులకైతే మరీ సంతోషంగా వుంది.

"అందులో సొగసు మీరు గ్రహించారూ?" — అని వొకరి మొహాలు వొకరు చూసుకుంటున్నారు.

"వయసంతా వ్యర్థంగా పోతుందన్నాడా? వయసంటే యవ్వనమేగా? .... ఓహో! యవ్వనాన్ని నీటి ప్రవాహంతో పోల్చాడా? .... చాలా చక్కటి పోలిక సుమండీ! ....ఏవంటారు మీరూ?...."

"రావణుడు శాస్త్రాలన్నీ చదివిన వాడేనండీ! వాడేం సామాన్యుడా?.... అటు వ్యాకరణ శాస్త్ర నిబంధనలూ .... ఇటు కవిత్వం సొగసులూ అన్నీ తెలిసిన వాడే .... యవ్వనాన్ని ఏటి ప్రవాహంతో పోల్చిన తర్వాత ఇక ఎవ్వరైనా నోరెత్తడానికి వీలుందా? ....వొప్పుకోవలసిందే." —

కవులూ, పండితులూ రావణుడి పాండిత్యంతో ముగ్ధులై పోతున్నారు.

జనంలో వొకాయనకి అంతవరకూ రాని అనుమానం వొకటి వొచ్చింది. — "అసలు రావణుడు అంతగా బతిమాలటం ఏవిటీ?.... మొగాడు ఆడదాన్ని బతిమాలతాడా ఎక్కడన్నా?"

"నీ మొహం నీకేం తెలుసులే. ముద్దూ ముచ్చటా వుండవూ?"

"ఏం ముద్దూ ముచ్చట? మరీ అన్ని నెలలా? మా ఇంటా వంటా ఎరగం. మా తండ్రుల్నాడూ, తాతల్నాడూ కూడా ఆడదాన్ని బతిమాలి ఎరగరు. ఆ రావణుడి వంశం వాళ్ళకి ఎంత సిగ్గులేదో గానీ...."

రావణుడికి కోపం వొచ్చేస్తోంది. ఎన్ని విధాల బతిమాలినా, బెదిరించినా సీత వినను పొమ్మనేసరికి రావణుడు వుగ్రుడై పోయాడు,

"సరే! రెండు నెలలు గడువిస్తాను."

"అవ్వ! .... ఇంకా రెండు నెలలా ? .... ఇంతకాలం వినలేదు గానీ అప్పుడు మాత్రం వింటుందా ?.... అటలాగుండే ! వొదిలెయ్యరాదూ !"

"అప్పటికీ వినకపోతే— మరణశిక్ష వేయించేస్తాను—"

తుళ్ళిపడ్డాడు రాముడు— "మరణశిక్షా ?.... సీతకా?"

అదిరిపడ్డాడు లక్ష్మణుడు— "మరణశిక్షా? వొదిన గారికా? ...'

అందరూ తెల్లబోయారు. —"మరణశిక్షే !"

"అంత మోహం వున్న స్త్రీని ఏ పురుషుడూ చంపించడే !"— అని ఆశ్చర్యపడ్డారు పండితులు.

"వూరికే బెదిరించడానికి అని వుంటాడా?...."

శృంగార కవుల్లో కొందరికి వింతగా వుంది. —

"అంతకాలం కష్టపెట్టకుండా, ముట్టుకోకుండా బతిమిలాడడం ఏమిటీ ?.... తీరా అంత ముద్దుగా చూసుకున్నవాడు చంపించేస్తానన్నడం ఏమిటీ ? — ఇది శృంగార చరిత్రలోనే గొప్ప విశేషంగా తోస్తోంది సుమండీ."

"అనలు శృంగారంనుంచే వైరాగ్యం పుడుతుందండీ !.... ప్రేమలోనే కక్ష మిళితమై వుంటుంది. ఏవంటారు ?"

"అవును. అల్లాగే తోస్తోంది."

రాముడు కన్నీళ్ళు కారుస్తూ మోహం దించేసుకున్నాడు.

సుగ్రీవుడు రాముడి చేతులు పట్టుకుని— "శ్రీరామా ! విచారపడకు. రెండు నెలల గడువులో మనం సీతాదేవిని రక్షించలేమా? .... ఆ దుర్మార్గుడికి ఆయుష్షు రెండు నెలలే వుంది. అందుకే రెండు నెలలే గడువిచ్చాడు. నా మాట విను. యుద్ధాలలో ఆరితేరిన వీరాధివీరులెందరో వున్నారు మనకి. మంచి చెడ్డలు చూసుకుని మనం ఇక యుద్ధానికి బయలెదరడమే ...."

ఆ నాలుగు మాటలూ రాముడికి వెయ్యేనుగుల బలం ఇచ్చాయి. — దీర్ఘంగా నిట్టూర్చాడు—.

"తర్వాతేం జరిగిందో చెప్పు నాయనా !"

హనుమంతుడు కూడా విచారంలోంచి తేరుకున్నాడు.

"సీత మనసెలాగైనా మార్చమని దాసీ లందర్నీ హెచ్చరించి —రావణుడు అక్కణ్ణించి వెళ్ళిపోయాడు ప్రభూ !"

"వెళ్ళిపోయాడా ?"

"వెళ్ళిపోయాడు ప్రభూ !"

"వెళ్ళిపోయాడా ?"

"ఆఁ వెళ్లేపోయాడు ప్రభూ !"

"మళ్ళీ వెనక్కి తిరిగి వొచ్చాడా ?.... పూర్తిగా వెళ్లే .. "

"అబ్బే, ఇక రాలేదు. పూర్తిగా వెళ్లేపోయాడు...."

రాముడు మళ్ళీ దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఆ దుర్మార్గుడు వెళ్ళిపోతే ఏమైందిలే. సీత చుట్టూ ఈ దుర్మార్గులు చేరారు."

"మళ్ళీ ఏ దుర్మార్గులు ....?"

"అదే ! .... దాసీలు లేరూ ? .... వాళ్ళందరూ రావణుడు చెప్పిన మాటలే మళ్ళీ చెప్పడం మొదలు పెట్టారు. — "రావణుడు మహారాజు కదా ? అలాంటి వాణ్ణి వొద్దంటా వెందుకూ? ... రాముడికేం వుంది? గుడిగవ్వ ఆస్తి లేదు.... అసలు నీ తండ్రి ఇలాంటి సంబంధం ఎందుకు చేశాడూ ?" — అని వెక్కిరించడం మొదలు పెట్టారు ...."

లక్ష్మణుడు కోపంతో వూగుతూ — "దాసీలకు కూడా అంత కండ కావరమా ? హనుమా ! మనం లంకకు పోయినప్పుడు వాళ్ళందర్నీ నాకు చూపించు. పట్టుకుని పుక్కిలూ, చెవులూ, తెగ్గోస్తాను." — అని వురిమాడు.

రాముడు శాంతంగా— "ఊరుకో లక్ష్మణా ! ఆ దాసీలు, వారి ధర్మం వారు నిర్వర్తిస్తున్నారు. రావణుడికి విశ్వాసపాత్రులైన భృత్యులే వున్నట్టు తోస్తున్నారు." —అని మెచ్చుకున్నాడు.

"ఆ విధంగా దాసీలు ఎంత చెప్పినా సీతాదేవి నసీమిరా

వొప్పుకోనంది. నన్ను చంపేసినా నరే మీరు చెప్పినట్టు మాత్రం చెయ్యనంది."

రాముడి మనసు నిండా వొక్కసారి వరద మల్లే సీత మీద ప్రేమ పొంగింది.

"అంతలో.... త్రిజట అనే వొక దాసీ వొచ్చి మా చక్కటి కల చెప్పింది రామయ్యా!"

"కలా? అబ్బే! నమ్మకూడదు" — అని పెదవి విరిచాడు సుగ్రీవుడు.

వాలే సింహాసనంమీద కూర్చున్నట్టు సుగ్రీవుడికి చాలాసార్లు కలలు వొస్తాయి.

హనుమంతుడు వుత్సాహంగా త్రిజట కల అంతా చెప్పుకొచ్చాడు. — "రామయ్యా! .... గొప్ప రథంలో నువ్వూ, లక్ష్మణుడూ లంకకు పోయారంట. సీతాదేవి రథం ఎక్కిందంట. మళ్ళీ మీరు ఏనుగెక్కి వెళ్ళారట. సీతాదేవి ఏనుగెక్కిందంట. మళ్ళీ మీరు దేనిమీదో .... ఆఁ ఎడ్లబండి మీద వెళ్ళారు.

రావణుడూ, అతని బంధువులూ, తమ్ముళ్ళూ అందరూ గాడిద లెక్కి, పంది లెక్కి నరకానికి పోయారంట. విభీషణుడనే తమ్ముడు మాత్రం ఏనుగెక్కి స్వర్గానికి పోయాడంట ..."

"ఏం? ఎందుచేతా? ... విభీషణు వొక్కడే స్వర్గాని కెందుకు పోయాడూ?" — అని అడిగాడు సుగ్రీవుడు.

"ఆయన ధర్మాత్ముడులే మహారాజా! అంతా వరసగా చెప్పుకొస్తాగా?"

రాముడు లోలోపల ఆశ్చర్య పడుతున్నాడు. రాక్షస స్త్రీకి అటువంటి కల రావడం ఏమిటి? అయితే యుద్ధంలో చివరికి తనే గెలుస్తాడన్నమాట! .... అంతా దైవార్ణయంలాగే ఉంది.

దూరంగా కూర్చున్న వాళ్ళు కలల గురించి ముచ్చటించుకుంటున్నారు.

"తెల్లారగట్ల వొచ్చే కలలయితే తప్పకుండా నిజమవుతాయి. ఒకసారి మా ఆనప్పాదు పిండి లేసిందని కలొచ్చింది నాకు. నాలుగు రోజుల్లో నిజంగానే పిండి వేసింది."

"నేను చచ్చినా నమ్మను."

"ఏవిటి ? మా ఆనప్పాదు పిండిలేసిందంటేనా ?"

"అది కాదు."

"నాకు కలొచ్చిందంటేనా ?"

"అబ్బ ! .... అదికాదు. వొకసారి నాకు చాకలి బానంత బంగారం ముద్ద దొరికినట్టు కలొచ్చింది. తెల్లారగట్టే వొచ్చింది. ఇంతవరకూ దొరకలేదు. నల్ల పూసంతన్నా దొరకలేదు."

"తెల్లారగట్ట అనుకున్నావుగానీ .... తెల్లారగట్ట కాదేమో. లేకపోతే ఎందుకు దొరకదూ ? ... మా ఆనప్పాదు ...."

బంగారం కలాయన సందేహంలో పడ్డాడు.

హనుమంతుడు సీతతో మాట్లాడుతున్నాడు.

సీత హనుమంతుణ్ణి నమ్మటంలేదు.

రావణుడేమో అనుకుంటోంది.

రాముడు వులిక్కిపడి — "రావణుడు వెళ్ళిపోయా డన్నావుగా?" — అని కోపంగా చూశాడు.

"మారువేషంలో వొచ్చాడేమోననీ .... సీతాదేవి...."

"అలా ఎప్పుడన్నా వొచ్చేవాడా ?"

"అబ్బో ! .... బోలెడు సార్లు...."

"మరి నా వేషం వేసుకుని కూడా ఎప్పుడన్నా...."

హనుమంతుడు చాలా సేపు అలోచించాడు — "నే నడగలేదు రామయ్యా ; వొచ్చేవుంటాడు దుర్మార్గుడు."

రాముడికి వొళ్ళు మండిపోయింది.

"అంచేత అక్కడివాళ్ళే ఎవరో మోసం చెయ్యటానికి వొచ్చారనుకుని ... ఆ తల్లి నన్ను నమ్మలేక పోయింది మొదట .... ఎంత చెప్పినా సందేహిస్తోనే వుంది ...." — జనం ఇక తర్వాత జరిగిన

ఘనకార్యాలన్నీ వింటారు గదా అని హనుమంతుడు చుసిచుసి నవ్వులు నవ్వుతున్నాడు.

"మరి వెళ్ళగానే ఆ వుంగరం చూపించలేకపోయావంటయ్యా !" — అని ఎవరో కేక పెట్టారు.

లక్ష్మణుడు కూడా కోపంగా ఆమాటే అడిగాడు. — "అన్నగారిచ్చిన ఉంగరం చూపించలేదూ ?" — అన్నాడు.

హనుమంతుడు తత్తరపడి, ఇకిలింపు కట్టిపెట్టి — "అదే .... సీతాదేవిని చూసిన సంతోషంతో ఆ సంగతే మరిచేపోయాను. తర్వాత చూపించాననుకో. చాలా సంతోషించింది. కళ్ళనీళ్ళు పెట్టుకుంది. అందరి క్షేమ సమాచారాలూ అడిగింది. "నా భర్త క్షేమంగా వున్నాడా ? .... నా మరిది సుఖంగా వున్నాడా ? .... కోసలకవుర్లు తెలుస్తున్నాయా ? నా భర్త నన్నింతకాలం వుపేక్షించా డెందుకూ ? నన్ను తీసుకుపోవాలని తొందరే వుంటే ఇంత జాప్యం చేస్తాడా ?.... నన్ను రక్షించకుండా ఇంతకాలం మౌనం వహించా డెందుకూ ?"— అని వలవలా దుఖిస్తూ చాలా నిష్ఠూరంగా అడిగింది రామా !"

రాముడికి మళ్ళీ మూర్ఛ రాబోయింది. తల వాల్చి వూరుకున్నాడు— — "తర్కం మాత్రం బాగా నేర్చింది. ప్రశ్నలు వెయ్యడానికైతే తనతర్వాతే .... అబ్బ ! .... ఈ హనుమంతు డేమిటి ? .... ఏమాట పైకి చెప్పాలో .... ఏ మాట చెప్పకూడదో ఏమీ ఆలోచించడే ...."—

జనం కొంచెం సందేహంలో పడ్డారు.

"ఆ మాటే రావణు డడిగినప్పుడు నీకింకా మూడకే నా భర్త నుకుకున్నా డందిగా ? మళ్ళీ తనకేవీ తెలీనట్టు నా భర్త నన్ను రక్షించలేదే వంటుం డెందుకూ ? .... అయితే రాముడింకా భార్యని రక్షించకపోవడం రావణుడికి మూడక కాదన్నమాట ! .... మరి ఎందుకంటావూ ? ఏదో రహస్యం వుంది...."

"ఎందుకేవిటి ? .... నిన్న మొన్నటిదాకా వానాకాలమేనయ్యే !"

"ఏవిటే ? పదినెలలూ వానకాలమే ! వానాకాలం పోయి పాదులన్నీ ఎప్పుడో వుడిగిపోతేనూ. నీ కసలు మాసాలూ, రుతువులూ తెలుసాని ...."

"నీకు తెలుసులే మహా...." — చర్చ ప్రారంభంలోనే పోట్లాటతో అంతమెపోయింది.

రాముడు భార్య నెందుకు రక్షించలేదో హనుమంతుడు చాలా భక్తిగా చెప్పతున్నాడు సీతకి — "అమ్మా ! నీ భర్త నీ కోసమే విచారంలో మునిగిపోయి నిన్ను రక్షించే సంగతే మరిచిపోయాడు. — నీ కోసమే శోక సముద్రంలో మునిగిపోయి దీనుడై తనని తనే మరిచిపోయాడు" — అని చెప్పాను రామయ్యా !"

హనుమంతుణ్ణి అమాంతంగా కావలించుకోబుద్దేసింది రాముడికి — "నా పరువు కాపాడావు నాయనా !" — అనబోయి నిగ్రహించుకుని పరువు కాపాడుకున్నాడు.

సీతాదేవి ఎలా దుఖించిందో హనుమంతుడు చెప్పుకొచ్చాకు — ఆవిడ దుఖించి, దుఖించి చివరికి — "ఇదంతా నా ఖర్మే ! ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు ?" — అని నిట్టూర్చింది.

రాముడు ఇంతకాలం భార్యని ఎందుకు రక్షించలేదా అని ఆశ్చర్యపోతోన్న వాళ్ళందరికీ కనువిప్పు కలిగినట్టయింది.

"చూశావా ? సీత ఖర్మన్నమాట....రాముడు మాత్రం ఏంచెయ్యగలడూ ? .... ఎంత గొప్పవాడైనా ఖర్మ బలానికి లొంగిపోవలసిందే" — అంటున్నాడు ఇందాక పోట్లాడినాయన — తన శత్రువుకి వినపడేట్టు పక్కాయనతో.

ఆ శత్రువు ఈ మాటలన్నీ, విన్నాడుగానీ.... ఖర్మని కాదనలేక, కిక్కురుమనలేక పోయాడు.

సీత తన ఖర్మ తనే వొప్పుకున్న తర్వాత రాముడి మనసు చాలా తేలికపడింది.

"నా సీత ఇంకా ఏమన్నది నాయనా ?"

"భరతుడు సైన్యాలు పంపుతాడా ? అని అడిగింది రామయ్యా!"

రాముడు ముందు తెల్ల బోయాడుగానీ .... తర్వాత చాలా కోపం వొచ్చింది — ఆడదానికి ఆ గొడవలన్నీ ఎందుకు ? .... భరతుడు సైన్యాలు పంపుతాడా అని హనుమంతుణ్ణి అడిగితే .... అతనికేం తెలుస్తుంది, అంతా వెల్లడిగానీ .... విన్నవాడు నిన్నటు వూరుకున్నాడా ? పదిమంది ముందూ చెప్పేశాడు. రేపు సుగ్రీవు డేమంటాడు ? .... భరతుణ్ణి కూడా క్రొంత సైన్యం పంపమని కబురంపు. కొంత నేనిస్తానంటే . ? అందుకే స్త్రీలు పెద్దపెద్ద విషయాల్లో కలగజేసుకోకూడదు.

"చెప్పు నాయనా ! .... ఇంకా సీత ... ఏమందో అన్నీ చెప్పు. ఎన్ని కష్టాలు పడుతోందో కదా ? .... ఆ దుర్మార్గులమధ్య నిత్యం...."

"దుర్మార్గులంటే గుర్తొచ్చింది. అక్కడకూడా సీతాదేవిని భక్తిగా చూసుకుంటోన్న వాళ్ళున్నారు రామా ! .... విభీషణుడి కూతురు సీతా దేవి దగ్గిరి కొచ్చి రహస్యంగా మాట్లాడి వెళ్తుందట. సీతతో మాట్లాడి రమ్మని విభీషణుడి భార్యే పంపిస్తుందంట కూతుర్ని. రావణుడు ఇంత దుర్మార్గం చెయ్యటం విభీషణుడి కేమీ ఇష్టం లేదంట. "సీతాదేవిని వొదిలి పెట్టేయమని" అన్నగారికి నిత్యం చెపుతూనే వున్నాడంట ...."

రాముడు ఆశ్చర్యపోతూ వింటున్నాడు కళ్ళింతంత చేసుకుని హనుమంతుణ్ణే చూస్తున్నాడు. మనసు చురుగ్గా ఆలోచిస్తోంది. రావణుడి తమ్ముడు రావణుడికి వ్యతిరేకంగా వున్నాడా ?.... విభీషణుడూ, విభీషణుడి భార్య సీత విషయంలో అంత శ్రద్ధ చూపడం ఏవిటీ ? .. ఎందుచేతా? ఎందుచేత వుంటుందీ? .... ఎందుచేతను కోవాలి? వుత మంచితనమేనా? .... ఇందులో ఏమన్నా రాజకీయం వుందా? రావణుడి చేష్టలు విభీషణుడు ఇష్టపడటం లేదా? .... ఇవ్వాళ కొత్తగా ఇష్టపడక పోవడాని కేముందీ? .... ఎప్పుడూ జరుగుతోన్న వ్యవహారమేగా ? .... ఎప్పుడూ వ్యతిరేకిస్తోనే వున్నాడా? .... లేకపోతే, సుగ్రీవుడి లాగానే, రాజ్యాధికారం కోసం చూస్తున్నాడా? .. ఆశ్చర్యంగానే వుంది ఇది, అంతా ఇంకే గానీ ఏదీ నిర్ణయించుకోకూడదు....

"ఊఁ చెప్పు నాయనా ! .... ఆ దుర్మార్గుల్లో కూడా అంత ధర్మాత్ము లున్నారా?"

"అయ్యో! ... విభీషణు డెంత ధర్మాత్ముడో ముందు ముందు మీరే గ్రహిస్తారుగా! ...."

—ఆ విధంగా సీతమ్మ తల్లితో— కష్టం సుఖం మాట్లాడుతూ కూర్చున్నాను—

"అమ్మా ! నీ పెనిమిటి కేం చెప్పమంటావు?" అని అడిగాను.

ఆ తల్లి వలవలా ఏడ్చి— కాకి సంగతి చెప్పింది.

"కాకి సంగతేవిటి?" — రాముడికి విభీషణుడి సంగతి తెలుసు కోవాలని తొందరగా వుంది.

"ఒకసారి మీ భార్యాభర్త లిద్దరూ — చిత్రకూటంలో— చెట్టు కింద పడుకుంటే — సీతాదేవిని కాకి పొడిచిందంట కదా?....ఆ సంగ తంతా ముచ్చటగా చెప్పింది .. "

రాముడు కొంచెం మొహం చిట్లించాడు— ఆ విభీషణుడి సంగ తేవిటో ! ఆ బాలిక వొచ్చి ఏం మాట్లాడేదో, అన్నీ వివరంగా చెప్పి పంపక కాకి సంగతీ, పిచిక సంగతీ ఎందుకంట ?....కాకి పొడవడానికి లెక్కేవిటి? .... తననెన్ని సార్లు తన్నిందో నెత్తిమీద. ఎవరికి గుర్తుం టాయి అన్నీ! ... "

శృంగార కవులు - కాకి వుదంతానికి చాలా కించ పడుతున్నారు.

"అంత సుందరాంగి అంత యవ్వనవతి....బహుకాల వియో గంలో పగ్గుతోన్న జవరాలు భర్తకు .... మధుర స్మృతులు జ్ఞాపకం చెయ్యవలసిన సందర్భంలో ఏ చిలక చెంపమీద కొరికిన సంఘ టనో, ఏ పావురం వొళ్లో వాలిన సంఘటనో గుర్తుచెయ్యాలి గానీ .... కాకి కూతలూ గాడిద తన్నులూనా గుర్తు చెయ్యాల్సింది...." —

"సీతాదేవికి శృంగారశాస్త్రం ఏమీ తెలిసినట్టు లేదు...."

"బాగా అన్నారు.... అట్లాగే తోస్తోంది."

జనం— ఎవరెవర్ని కాకి పొడిచిందో, ఎవరెవర్ని తన్నిందో చెప్పుకుంటున్నారు.

"ఒకసారి నేను గోరుచుటుకి కట్టు కట్టుకుంటే .... మాయదారి కాకి ఆ కట్టు తన్నుకు పోయిందీ. చిన్నపిల్లలాగ ఎంత ఏడ్చానో!"— అని వొకాయన ఏడుపు మొహం పెట్టాడు.

కాకులు ఎంతెంత దుర్మార్గాలైనా చేస్తాయని అందరూ వొప్పుకున్నారు.

హనుమంతుడు సీతాదేవి దగ్గిర శెలవు తీసుకుని బయల్దేరుతున్నాడు.

"ఇక అశోకవనం ఎలా దాటాలా అని ఆలోచిస్తున్నాను. .... ఎలా చూసేశారో కాపలా వాళ్ళు చూసేసి వెంటపడ్డారు. గుండ్రాయిల్లాంటి రాళ్ళు తీసి గిరాటెట్టాను. ఇద్దరో, ముగ్గురో చచ్చారు."

"చావడమే!" — కంగారు పడ్డాడు సుగ్రీవుడు.

"ఆఁ .... కణతలికి తగిలి చచ్చారు."

"మరి నిన్ను పట్టుకోలేదూ ?"

"ఎందుకు పట్టుకోలేదూ?.... రావణుడి దగ్గిరికి లాక్కుపోయారు. నా పని అయిపోయిందే అనుకున్నాను. ఎవరు నువ్వు? ఎందుకొచ్చావు? ఏంటి సంగతీ అదీ" అని రావణుడి మంత్రి అడిగాడు.

"ఊ? .... చెప్పేశావా ఏంటి కొంప దీసి....!"

"ఏం చెప్పకా?.... అంతా చెప్పేశాను. "ఇప్పటికన్నా బుద్ధి తెచ్చుకో. సీతాదేవిని విడిచి పెట్టెయ్యి. లేకపోతే రాముడూ, సుగ్రీవుడూ వొచ్చి నిన్ను హతమార్చి సీతాదేవిని తీసుకు పోతారు. లంకంతా నాశనం చేసుకోకు." — అని రావణుడికి బుద్ధి కూడా చెప్పాను ...."

జనంలో, పండితులో పామరులో గడబిడ బయలేరింది.

"ఈ పాటికి సీతని చంపేసే వుంటారు."— అన్నారు కొందరు.

"చంపరు గానీ . రావణుడే రాముడి మీదకి యుద్ధానికి రావాలని ఏర్పాట్లు చేస్తూ వుంటాడేమో" —

"అయినా.... నాకు తెలవ కడుగుతానూ ... కాపలా మనుషులు పట్టుకోటానికి వొచ్చారే అనుకో, వాళ్ళని చావగొట్టటం ఎందుకంట? ..

ఇదుగో ! నేనీ పనిమీద వొచ్చానని చెపితే కాదూ ? .... ఎలాగూ చెప్పేయ్యాలను కుంటున్నాడుగా? సీత వాళ్ళ చేతుల్లో వున్నప్పుడు .... ఆవిడికి ప్రమాదం వొచ్చేలాగ చేసిరావటం ఏవిటీ?"

"అంత దూరం కష్టపడి వెళ్ళాడు. ఏం లాభం ? .... ఈనగాచి నక్కలపాలు జేశాడు...."

"ఇంతకీ అసలు ఎలా బయటపడ్డా డంటావూ ?"

లక్ష్మణుడికి హనుమంతుడి మీద చాలా కోపం వొచ్చింది. — సీతని తీసుకుపోవటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిసిపోతే, రావణుడు వూరుకుంటాడా ?.... వొచిన గారికి ఎంత ప్రమాదం వొచ్చి పడుతుందో! హనుమంతుణ్ణి వొంగదీసి చావ బాదాలనిపించింది.

సుగ్రీవుడు కూడా మండి పడుతున్నాడు. నీలుడి చెవిలో — నేనసలు మంచీ చెడ్డా చూసి రమ్మన్నాను గానీ ..."

రాముడొక్కడే దీర్ఘాలోచనలో మునిగి వున్నాడు. — హనుమంతుడు క్షేమంగానే వొచ్చాడు గదా : అక్కడ ఏదో అనుకూలంగానే జరిగి వుంటుంది. అంతా పూర్తిగా వినకుండా....

హనుమంతుడు బిత్తర పోతున్నాడు. జనం తనని మెచ్చుకోడానికి బదులు .... తప్పు చేసినవాణ్ణి చూసినట్టు చూస్తున్నా రేవిటని ఆశ్చర్య పడుతున్నాడు.

"చెప్పవోయీ హనుమా !.... రావణుడి సభలో ఏం జరిగింది?" — అని శాంతంగా అడిగాడు రాముడు.

రాముడి శాంతం చూస్తే హనుమంతుడికి పుట్టెడు బలం వొచ్చింది. — "రావణుడు నన్ను చంపెయ్యమని.... ఆజ్ఞాపించాడు...." — అన్నాడు వుత్సాహంగా.

"మరి చంపేశారా నిన్ను ?" — అని వొకరిద్దరు కంగారుగా అరిచారు

"అప్పుడు.... విభీషణుడు.... ఆ పుణ్యాత్ముడు ... దూతని చంపకూడదని అన్నగార్ని ప్రార్థించాడు, మొదట రావణుడు వినలేదు

గానీ.... విభీషణుడు చాలా విధాల ప్రార్థించగానే .... ఇక వొప్పుకోక తప్పలేదు.... "సరే ! ఏదో శిక్షవేసి వొదిలి పెట్టెయ్యండి."— అన్నాడు.

"మరి ఏం శిక్ష వేశారూ? చెరసాల్లో పెట్టేశారా?"

హనుమంతుడు చెప్పలేదు. సిగ్గుపడ్డాడు. కొంచెం నవ్వి వూరుకున్నాడు.

"కొరడా దెబ్బలు కొట్టి వుంటారు."

"కాదులే. పిర్రలనిండా వాతలేశారేమో ! అదుగో ! .... సరిగా కూర్చోలేక పోతున్నాడు.... ఏవిటా అనుకుంటున్నాను ఇందాకట్నించీ."

"ఒకసారి మా తాతగారి వూళ్లో ఇలాగే .... వొక దొంగని పట్టుకునీ ...."

తర్క పండితులికి విభీషణుడి తర్కం చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. — "దూత అయినవాడు దూతలాగ ప్రవర్తించాడా? భూతంలాగ మీదపడి నిష్కారణంగా తమ సేవకుల్ని చంపితే ఎవడా ఇంకా దూతే అని వాదించి విడిచి పెట్టించాడే :.... అబ్బే ! ఇదేం బాగులేదు."

"దయ చూపించవొచ్చును గానీ, ఇంత తర్క విరుద్ధమైన దయ పనికిరాదు."

"రావణుడి సభలో తర్క పండితులు లేనట్టున్నారే !" శృంగార కవు లందరూ— ఇది మనం చర్చించే విషయం కాదని పట్టనట్టు వూరుకున్నారు.

రాముడి ఆలోచనలన్నీ వొక కొలిక్కి వొస్తున్నాయి. మనసంతా ఆనంద సముద్రం అయిపోతోంది.

తమకు హాని కలిగించిన దోషి మీద కూడా విభీషణుడికి కోపం రాలేదు. దూతలాగ ప్రవర్తించని వాణ్ణి కూడా, దూతని రక్షించే నీతులు చెప్పి రక్షించాడు. అంటే.... హనుమంతుణ్ణి రక్షించడంలో విభీషణుడేదో లాభం ఆశిస్తున్నాడు. పైగా.... తన అన్ననిశతృవుతో యుద్ధం చెయ్యమనే ప్రోత్సహిస్తున్నాడు. — ఇదంతా చూస్తోంటే, విభీషణుడు పూర్తిగా రావణుడికి వ్యతిరేకంగా వున్నాడని తోస్తోంది. అన్నగారికి

ఎంతమాత్రం విశ్వాస పాత్రుడిగా లేడన్న మాట ! అందుకే విభీషణుడి భార్య సీత విషయంలో అంత శ్రద్ధ చూపుతోంది.

సీత గురించి ఎలాగైనా యుద్ధం పొసుగుతుంది కాబట్టి, ఈ అవకాశం వుపయోగించు కోవాలని చూస్తోన్నట్టున్నాడు విభీషణుడు. రేపు యుద్ధం జరిగినప్పుడు.... విభీషణుడు తప్పకుండా తన పక్షాన్నే వుంటాడని నమ్మకం కలుగుతోంది. అన్నగారి పక్షాన లేడన్నది మాత్రం చాలా స్పష్టం ! మళ్ళీ .... వాలి సుగ్రీవుల వ్యవహారమే ఇది కూడా. రాజ్యాధికారం కోసం అన్నదమ్ముల కలహం !

రావణుడు తమ్ముణ్ణి ఏమీ సందేహించకుండా బాగానే నమ్మినట్టున్నాడు. సిరి సంపదల విషయంలో అన్ననైనా, తమ్ముణ్ణయినా వొక కంట కనిపెట్టి వుండాలనే సంగతి రావణుడికి తెలీదన్నమాట. * అసలు హనుమంతుణ్ణే వొదిలిపెట్టేశా డంటేనే ఎంత తెలివైన రాజో తెలుస్తోంది. — లేకపోతే, అదీ తెలివి తక్కువ కాదేమో ! తన నెవ్వరూ ఏమీ చెయ్యలేరని అహంకారమేమో !

అసలు త్రిజట కలకి అసలైన అర్థం ఇప్పుడే కనపడుతోంది. రావణుడు నరకానికి పోతే ... విభీషణుడు స్వర్గానికి పోయాడు. — అంటే ఇద్దరికీ శత్రుత్వం వుందన్నమాట. .... అసలు త్రిజట ... విభీషణుడికే నమ్మకస్తురాలేమో ! .... ఆ పరిచారికుల బారినుంచి సీతని రక్షించాలని, వాళ్ళని భయపెట్టడానికి అలా కల వొకటి కల్పించి చెప్పిందేమో ! .. అయితే ... ఆ కల అసత్యం అయితే.... యుద్ధంలో తను గెలవడం రావణుడు ఓడడం ... అంతా కూడా.... అయితే యేంలే .... వాస్తవ విషయాలన్ని చాలా అనుకూలంగా వున్నాయి కదా ! .. కల కల్పించిందయితే మాత్రం నష్టమేముంది ?

రాముడి మొహం మీద చిరునవ్వు మెరుస్తోంది.

---

* రాముడు — ఆసిపాస్తుల విషయంలో భరతుణ్ణి కూడా శంకించి, ఎంత శ్రద్ధగా కనిపెట్టి వుంటాడో ముందు ముందు మనమే చూస్తాం.

అందరూ తెల్లబోతున్నారు.

హనుమంతుణ్ణి చేసుకొచ్చిన నిర్వాకంవల్ల సీతకేం ప్రమాదం ముంచుకొస్తుందోనని అందరూ ఆరాట పడుతోంటే.... రాముడు అంత సేపూ తల వొంచి ఆలోచిస్తూ, మందహాసాలు చేస్తున్నాడు.

"పాపం.... మతి చలించిందేమో!"

"అవును. ఆయన మాత్రం ఎన్ని కష్టాలు పడతాడు?"

"చాలుగాని వూరుకోండి ... నిన్నగాక మొన్న వాలిని చంపితే .... అంతా మర్చిపోయి జాలిపడి పోతున్నారు. సిగ్గుల్లేవు."

"అవును సుమా! మర్చేపోయాం .... ఇప్పుడు మన ప్రాణాల మీదకి యుద్ధం కూడా తెచ్చిపెట్టాడు .... ఈసారి చాలా జాగ్రత్తగా వుండాం. జాలి పడొద్దు."

ఎంత దాచుకోవాలన్నా దాగని మందహాసం చిందుతోంది రాముడి మొహం మీద.

హనుమంతుడు, "అన్నీ చెప్పానా? లేదా?" — అని విషయా లన్నీ వొకసారి జ్ఞాపకం చేసుకున్నాడు. "అన్నట్టు రామయ్యా! వొక సంగతి మరిచే పోయాను. సీతాదేవి దుఃఖం చూడలేక నాతో తీసుకొచ్చేద్దా మనుకున్నాను.... కానీ ...."

తుళ్ళిపడ్డాడు రాముడు.

హనుమంతుణ్ణి తీక్షణంగా చూశాడు. — లంక మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు తను. విభీషణుడి సంగతి తెలిసిం తర్వాత, తన ఆశలన్నీ ఫలిస్తాయని గాఢంగా నమ్మకం కలుగుతోంది. రావణుణ్ణి సర్వ నాశనం చేసి లంకని సాధించాలని వువ్విళ్ళూరుతున్నాడు. అసలు రావ ణుడు సీతని తీసుకు పోవడం.... మంచికే జరిగిందని సంతోషిస్తున్నాడు. — సీతని తీసుకొచ్చేస్తే.... ఇంకేమున్నా వుందా?.... అంతా తారుమా రయ్యేది. ఇక యుద్ధం ఏమిటి? .... జయించడం ఏమిటి? .... ఇంకా నయం.... తీసుకొచ్చేశాడు కాదు....

రాముడికి వొళ్ళు మండిపోతోంది – హనుమంతుణ్ణి చూస్తోంటే. తీసుకొచ్చేశా దంటేనా,.... తను కఠినంగా, నిర్లక్ష్యంగా చెప్పేసేవాడే,— "వీల్లేదు. మళ్ళీ తీసికెళ్ళి అక్కడే పెట్టిరా, నేనే తెచ్చుకుంటాను. నేను నీకు చెప్పిందేవిటి, ... నువ్వు చేసిందేవిటి, ... కుదరదు.... లేసుకెళ్ళి రావణుడికి అప్పగించిరా, — వాణ్ణి చంపి నేనే తెచ్చుకుంటాను. నువ్వెవడివి నా భార్యని లేసుకు రావడానికి, ... నా పరువు ప్రతిష్ఠ లేంగాను, నేనే స్వయంగా తెచ్చుకుంటాను .... తీసుకు పో తొందరగా," — అని ఆజ్ఞాపించేవాడే.

సీతని తీసుకు వొచ్చేసిన్నా, మళ్ళీ పంపెయ్యడానికి వీలుంది గదా అన్న ఆలోచన వొచ్చిం తర్వాత రాముడికి కొంచెం శాంతంగా వుంది. *

రాముడు తనని మెచ్చుకుంటాడని హనుమంతుడు ముసిముసి నవ్వుల్తో చూస్తున్నాడు.

రాముడు తల వొంచుకుని— "తీసుకురాక పోయావా నాయనా! .... నా సీతనీ–ననూ్నా కలపకపోయావా నాయనా!" — అని కళ్ళనీళ్ళ పెట్టుకునే ప్రయత్నం చేశాడు.

హనుమంతుడు భక్తిగా — "తప్పకుండా తీసుకొచ్చేవాణ్ణే స్వామీ!.... ఆ మహాతల్లి రావటానికి వొప్పుకోలేదు గానీ...."

"ఏవిటీ! .... ఇక్కడికి రావడానికి వొప్పుకోలేదూ? ...." — తెల్లబోతున్నాడు రాముడు.

"అది కాదు.... పర పురుషుడితో రానంది. రావణుడు బలాత్కారంగా తీసుకుపోతే ఏమీ చెయ్యలేకపోయాను గానీ .. నా ఇష్టంతో మాత్రం నేను పర పురుషుడి వెంట రాను. నా భర్తే వొచ్చి, లంకంతా

---

* ఒకవేళ హనుమంతుడు లంకనించి సీతని తీసుకు వొచ్చేస్తే .... రాముడి ఆలోచనలు ఎలా వుంటాయి? .... సీత మీద కోపం వొస్తుందా? రాదా? హనుమంతుడి మీద కోపం వొస్తుందా? రాదా? ఆలోచించండి.

నాశనం చేసి, నన్ను తీసుకెళ్లాలి. నా భర్తే స్వయంగా నన్ను తీసుకు వెళ్ళడం.... ఆయనకూ కీర్తి.... నాకూ కీర్తి...." — అంది.

రాముడికి సీత మీద చెప్పలేనంత ప్రేమ కలిగింది, తొందరపడి రానందుకు.

ఈ తర్కం – తర్కపండితులికి నచ్చినట్టే వుంది, తల లూపుకుంటున్నారు.

శృంగార కవులు ఆలోచనలో పడ్డారు. "ఇంత దీర్ఘ వియోగంలో కూడా, ఇంకా వియోగమే కోరడం ఏ రకం అవస్థకి చెందుతుందంటారూ ?" — అని మొహాలు చూసుకుంటున్నారు.

"అబ్బే ! .... ఇది శృంగార శాస్త్రంలో ఎంత మాత్రం లేదండీ ! ఇంకే శాస్త్రానికైనా చెందుతుందేమో గానీ...."

"మీరు సరిగ్గా వినలేదేవిటి ? .... నా భర్తే నన్ను తీసుకు వెళ్ళడం.... ఆయనకీ కీర్తి.... నాకూ కీర్తి.... అన్నదిగా ? .... దాన్ని బట్టి చూస్తే ..."

"మరిహనేం ? .... అయితే "కీర్తి కందూతి శాస్త్రం" లోకి వొస్తుంది."

"పాపం పామర జనానికి శషభిషలన్నీ అర్థమవుతాయంటారూ? ....శ్రద్ధగానే వింటున్నారు."

ఆ పామర జనానికి నిజంగానే సీత విషయం అయోమయంగా వుంది.

"మా ఆవిడైతేనా ? .... బావురుమని హనుమంతుడి వెంట పడేదే !"

"మా ఆవిడా అంతే .... పర పురుషుడూ లేదు .... వల్లకాడూ లేదు .... మొన్న వాళ్ళ మేనత్త కొడుకుతో కలిసి జాతరకి పోయింది ....పట్టుకు చావ బాదుదా మనుకున్నానుగానీ.... ఆలిగి పుట్టింటికి పోతుందని ఖాయకున్నాను.

"మన ఆడవాళ్ళెక్కడా ? .... సీతాదేవి ఎక్కడా ? మహాత్ములు...."

హనుమంతుడు ఇంకా ఏమన్నా మర్చిపోయానా అని-అన్నీ గుర్తు తెచ్చుకుని....సుగ్రీవుణ్ణి చూస్తూ — "మహారాజా ! .... నీ పేరు చెప్పి రావణుణ్ణి బాగా జడిపించానుకో. నిన్ను చంపడానికి సుగ్రీవు డొక్కడు చాలన్నాను. సుగ్రీవుడొచ్చి నీ అంతు తేలుస్తా డన్నాను. హడిలిపోయా డనుకో" — అని నవ్వు మొహంతో అందర్నీ చూశాడు.

రావణు డేమోగాని సుగ్రీవుడు హడిలిపోయి వెనక్కి జరిగాడు.

వెనకాల నిద్రపోతోన్న నీలుడు — "అబ్బ ! .... మీద పడతా రేంటీ ? ...." — అని విసుక్కున్నాడు.

సుగ్రీవుడు కోపం పట్టలేక — "నీ నిద్ర మండా ! నిన్ను వురి దీస్తే తప్ప . నిద్ర మానేట్టు లేవు" — అని మండిపడి, జాంబవం తుడి చెవి పేపు వొంగి — "నే నొక్కణ్ణీ రావణుణ్ణి చంపడం ఏవిటీ ? చూశావా ? .... ఇదేవన్నా బాగుందా ?....వెళ్ళినవాడు వెళ్ళినట్టు రావాలి గానీ ... ఆ కూత లేవిటీ ? .... రావణుడికి నామీద కోపం రాదూ ? ... ఏవిటో అంతా గందరగోళం చేసుకొచ్చాడు" — అని చాలా విసు క్కున్నాడు.

హనుమంతుడు లంకలో తను చూసిన సంగతులన్నీ వొకసారి గుర్తు తెచ్చుకుని — "లంకలో కూడా బ్రాహ్మలున్నారు సుమా !" — అని ఆశ్చర్యం ప్రకటించాడు.

"బ్రాహ్మలే !" — అని కొందరు పండితులు ముందుకు జరి గారు — "ఏం చేస్తున్నారూ ?"

"వేదాలు చదువుకుంటున్నారు."

"ఆహా ! అలాగా ! ఎంత చక్కని మాట చెప్పావూ ! అందుకే లంక ఇంకా నిలిచివుంది."

రాముడు వుత్సాహం దాచుకోలేక — "వేదాలు చదువుతున్నారా ? .... శిక్ష .... వ్యాకరణం....ఛందస్సూ .... నియుక్తం.... జ్యోతిష్యం

.... కల్పం .... అన్నీ శ్రద్ధగా చదువుతున్నారా నాయనా ?" అని తల పంకిస్తూ అడిగాడు.

వేదాలు చదివే బ్రాహ్మలై తే రావణుడి పక్షాన గాక, తన పక్షాన్నే జేరతారని రాముడి కెందుకో బాగా నమ్మకంగా వుంది.

హనుమంతుడు చాలా వుత్సాహంగా వూగుతున్నాడు — "అసలు రావణుణ్ణి నేనే చంపేద్దా మనుకున్నానుగానీ.... రామా ! .... ఆ పనేదో నువ్వే చేస్తే బాగుంటుందిలే .... అని ఊరుకున్నాను."

రాముడు విసుక్కోయాడు — ఏవిటీ ? హనుమంతుడే రావణుణ్ణి చంపేసి, లంక ఆక్రమించేసి, తననికూడా ఆధీనంలో పెట్టుకుంటాడా ? .... ఇంత శక్తి సామర్థ్యాలుగల మంత్రుల్నీ, సేనాపతుల్నీ నమ్మి ఎప్పుడూ వూరుకోకూడదు. ఈ హనుమంతుణ్ణి వొక కంట ....

హనుమంతుడికి ఇక ఎంత ఆలోచించినా ఇంకేమీ జ్ఞాపకం రాలేదు.

"శ్రీరామా ! అన్నీ విన్నవించుకున్నాను. ఇన్ని మాట లెందుకు ? .... నీ భార్య మహా పతివ్రత. నువ్వు లేకపోతే ఎలా వుండాలో అలా వుంది. తొందరగా తీసుకు పొమ్మని నీకు మరీ మరీ చెప్పమని నన్ను బతిమాలింది.

వొక్క నెల మాత్రమే బతికి వుంటానని సుగ్రీవుడు కూడా వింటూ వుండగా చెప్పమంది."

"వొక్క నెలా ? ... ఇందాక రెండునెల లన్నావుగా ?" — అని గంభీరంగా చూశాడు రాముడు.

"అబ్బే ! రావణు డిచ్చిన గడువు రెండు నెలలు. సీతాదేవి మాత్రం వొక్క నెలే ఎదురుచూసి అప్పటికి రాకపోతే ఎలాగైనా చచ్చిపోతానంది. సుగ్రీవుడు కూడా వినేట్టు చెప్పమంది ..."

సుందరకాండలో — 65 వ సర్గ — 24 వ శ్లోకం.

"నేను ఒక నెలకు పైన బ్రతికియుండను. సుగ్రీవుడు వినుచుండు నప్పుడే ఈ మాటలు చెప్పి, ... ఈ చూడామణిని రామునకు సమర్పిం

రాముడు సుగ్రీవుడి వేపు — "మరి ఏమంటావు? చూడు. ఎంత లశ్యం చేశావో !...." — అన్నట్టు నిష్ఠూరంగా చూశాడు.

సుగ్రీవుడు చటుక్కున తల వొంచుకుని నీలుడి వేపు చూశాడు, — నీలుడు ఇంకా ...

సుగ్రీవుడికి నీలుడి మీదకన్నా సీత మీదే కోపం ఎక్కువగా వుంది. —

(ఫుట్‌నోట్ : 509 వ పేజీ తరువాయి)

పుము" — అని సీతాదేవి చెప్పెను" — అని హనుమంతుడు రాముడితో చెపుతున్నాడు.

కానీ, సీత అశోకవనంలో హనుమంతుడితో మాట్లాడినప్పుడు మాత్రం — "సుగ్రీవుడు వింటూ వుండగా చెప్పు" — అన్న మాట చెప్పలేదు.

అసలు సీత మాట్లాడిన ఘట్టంలో రాయని విషయం — ఇక్కడ హనుమంతుడు, రాముడి ముందూ సుగ్రీవుడి ముందూ మాట్లాడేప్పుడు ఎందుకు రాయాలి కవి? ....

"సీత నెల్లాళ్ళకన్నా ఎక్కువ బ్రతకదు" — అన్న విషయం ప్రత్యేకంగా సుగ్రీవుడికి తెలియజేయడంలో అర్థం ఏమిటి? — సీతని రక్షించవలసిన బాధ్యత తనదేనని సుగ్రీవుడు భావించాలని. పూర్వంలాగ అశ్రద్ధ చెయ్యకుండా యుద్ధానికి ఉయల్దేరతాడని. సుగ్రీవుడి సైన్యం లేకపోతే రాముడివల్ల పని జరగదు కాబట్టి — సుగ్రీవుడు తప్పకుండా సహాయం చేస్తాడని. హనుమంతుడు రాముడి ముందూ, సుగ్రీవుడిముందూ మాట్లాడే ఘట్టం రాసేప్పుడు కవి వరిస్థితి అంతా దృష్టిలో పెట్టుకుని, రాముడికి అనుకూలంగా వుండేట్టు చాలా సహజంగా తీసుకున్న జాగ్రత్త ఇది.

(హనుమంతుడు లంక నించి తిరిగి వొచ్చేప్పుడు సముద్రం దాటి, వొచ్చి వానరుల కందరికీ చెప్పినప్పుడు "సీత రెండు నెలలు బతుకుతావుంది" అన్నాడు. ఆ ఘట్టంలో రెండు నెళ్ళలు, — ఈ ఘట్టంలో ఒక నెల.)

నెమ్మదిగా జాంబవంతుడి వేపు జరిగి — "ఆవిడ నా ముక్కూ మొహవన్నా ఎరగదు. నేను వినేటట్టు చెప్పమనటం ఎందుకూ ? .... కావాలంటే తన పెనివిటికి కవురంపుకోవాలి గానీ .... రేపు ఎటుపోయి ఎటొచ్చినా నన్ను నిష్ఠూరాలాడాలని గానీ...." — అని విసుక్కున్నాడు.

జాంబవంతుడు శాంతంగా — "అబ్బే ! అది కాదులే .... సాయం చేసేవాడివి నువ్వే కదా ? .... నీకు దయ కలుగుతుందని అలా అన్నదేమోలే ... అయినా కష్టాల్లోపడి దుఖిస్తోంది .... ఎలాగో మనవే ఆవిణ్ణి వొడ్డున పడెయ్యాలి.. రాముడి వొక్కడివల్లా ఏమవుతుందీ ?...."

"అవునను కో. నేను మాత్రం కాదన్నానా ? .... రాముడు అస్తమానూ "ఎవడికోసం చేస్తావు" అన్నట్టు చూస్తాడు. అందుకే నాకు ఒళ్ళు మండుతుంది."

"పోనీలే. వూరుకో. మనసు కష్టపెట్టుకోకు. ఏదో అన్నమాట .... నెరవేర్చుకుని, ఆయన దార్ని ఆయన్ని పంపించేస్తే ...."

సుగ్రీవుడు అటు తిరిగి రాముణ్ణి చూసేసరికి మూర్ఛపోయి వున్నాడు.

"ఒక్క నెలలో యుద్ధానికి పోవాలన్నమాట !" జనంలో నిరుత్సాహంగా మాటలు సాగుతున్నాయి.

"రావణుడే నయం. రెండు నెలలు గడువిచ్చాడు. సీతాదేవి అయితే ...."

"ఇన్నాళ్ళూ అశ్రద్ధ చేసినట్టే ఆ రెండు నెలలు చేస్తాడేమోనని .... ఎందుకైనా మంచిదని నెల్లాళ్ళు గడువిచ్చినట్టుంది...."

"నెలైతే ఏవిటి ? .... రెండు నెలలయితే ఏవిటి ? మనం అందరం చావవలసిన వాళ్ళమే ...."

"నిక్షేపంలా వాలే వుంటే...."

రాముడు మూర్ఛ లేచి దుఖిస్తున్నాడు —

"నాయనా ! హనుమంతుడా ! .... నన్ను నా సీత దగ్గిరికి తీసుకుపో నాయనా ! .... నన్ను నా ప్రియురాలి దగ్గిరికి చేర్చు నాయనా ! ... నా ధర్మపత్ని నాకు మారం అయిపోయింది .... విధి నన్ను చిన్న

చూపు చూస్తోంది. దైవం నన్ను కనికరించకుండా వున్నాడు. నా వంటి భర్త వుండికూడా నా భార్య దిక్కులేనిదై పోయింది.... రాజ్యం పోయి, భార్య పోయి .... అష్టకష్టాలూ పడి....”

“ప్రభూ ! నువ్వింతగా దుఃఖించడం ధర్మం కాదు. సీతాదేవిని నేను అనేక ఓధాల ఓదార్చే వొచ్చాను ఆ తల్లి నీకోసం పుట్టెడాశతో ధైర్యంగానే వుంది” — అని హనుమంతుడు రాముడికి ధైర్యం చెప్పాడు. *

సుగ్రీవుడు రాముణ్ణి ఓదారుస్తూ — “శ్రీరామా ? నువ్వు దుఃఖిస్తే నేను చూడలేను. నా మాట విను. అంతా సవ్యంగా జరుగుతుంది. మనం వెంటనే యుద్ధానికి బయల్దేరదాం. ఆ దుర్మార్గుణ్ణి చంపి .... సీతాదేవిని .... రక్షించి తీసుకువద్దాం .... నా మాట విను .... నేను మళ్ళీ వొట్టు పెట్టుకుని చెపుతున్నాను సుమా ! ....” — అంటూ ఓదార్చాడు.

రాముడు కుమిలి కుమిలి నెమ్మదిగా శాంతించాడు — “నాయనా! హనుమంతుడా ! లోకంలో ఎవ్వరూ చెయ్యలేని ఘనకార్యం చేశావు. చెప్పినపని చెప్పినట్టు సాధించుకు వొచ్చావు. నాకు చాలా సంతోషం కలిగిందోయీ !” — అని హనుమంతుణ్ణి మెచ్చుకుంటూ చూశాడు.

హనుమంతుడు కొంచెం సిగ్గుపడి వినయంగా తలవొంచుకున్నాడు.

రాముడు గంభీరంగా సభాసదుల్ని చూస్తూ తల పంకిస్తూ చెపుతున్నాడు.

— “సేవకులలో కూడా తరతమ భేదాలున్నాయి. యజమాని చెప్పిన కార్యం ఎంత కష్టమైనది అయినా సరే, శ్రమ అనుకోకుండా,

---

* హనుమంతుడు లంకలో జరిగిన సంగతులన్నీ చెప్పి — “సీతకు ధైర్యం కలిగించి వొచ్చాను” — అని పూర్తి చెయ్యడంతో “సుందరకాండ” పూర్తి అయింది.

తర్వాతనుంచీ యుద్ధకాండ ప్రారంభం. యుద్ధకాండలో — మొదటి సర్గలో కొంత విషయం ఈ కథకోసం తీసుకున్నాను.

చక్కగా ఆ పని సాధించి, యజమానికి ఉపయోగించే ఇతర పనులు కూడా శ్రద్ధగా, వుత్సాహంగా, చేసుకురాగలవాడు, ఉత్తమ సేవకుడు.

యజమాని చెప్పిన పని మాత్రమే చేసి, యజమానికి లాభించేదని తెలిసికూడా వచ్చుపని చెయ్యకుండా వొచ్చేవాడు మధ్యమ సేవకుడు.

ఇక చెయ్యగల సమర్థత వుండికూడా, స్వామికార్యం నిర్వర్తించుకు రానివాడు అధమ సేవకుడు. *

---

* యుద్ధకాండలో — 1 వ సర్గలో — 8, 9, 10.

సేవకుల్ని ఎన్ని రకాలుగా విభజించాలో కవి చెపుతున్నాడు — "తన యజమానిచే ఆజ్ఞాపించబడిన దుష్కరమైన కార్యమును చక్కజేసిన భృత్యుడే ఉత్తముడనబడును

యజమాని చెప్పిన పనిని జేసి, చెప్పని పనిని గూడ అది యజమాని కిష్టమైన యెడల, — తాను సమర్థుడయ్యును, ఉత్సాహయుక్తుడై చేయని భృత్యుడు మధ్యముడనబడును.

యజమాని ఏ కార్యమును జెప్పినను, తాను కార్యమును చక్కజేయ సమర్థుడై, కార్యమును సాధించని యెడల, అట్టివాడు అధమ భృత్యుడనబడును."

— ఈ విధంగా సేవకుల్లో రకాలు: వారికి ఎక్కువ తక్కువలు. ఒక సేవకుడికి "ఉత్తమ సేవకుడని" బిరుదు వొస్తే అతనికి ఒరిగేదేమి లేదు. అతని జీవితం ఆ సేవనుంచి ఎప్పుడూ విముక్తి చెందదు. — కానీ, దానివల్ల యజమానికి చాలా లాభం. కుక్కలాగే విశ్వాసంగా పడి వుండి, ఎప్పుడూ గొడ్డులాగ బండచాకిరీ చేసే సేవకుడు దొరుకుతాడు.

సేవకుల్ని ఎప్పుడూ దండించి, భయంలోవుంచి, లొంగదీసి పని చేయించుకోవడం సాధ్యంకాదు గాబట్టి, ఆ సేవకులే ఇష్టంతో చాకిరీచేసే విధానం వుండాలి. వుత్తమ సేవకులం అనిపించుకోవటానికి ఆ సేవకులే ఇష్టంతో ఎప్పుడూ ఎక్కువ చాకిరీ చేసేట్టు — చేసే ధర్మం ఇది. ఇదే "సేవకుల వుత్తమత్వంలో రహస్యం. (తరువాయి పేజీలో)

అందుచేత, హనుమంతుడు సుగ్రీవుడికి బహా ఉత్తమ సేవకుడు. ఎంతో తెలివిగా, శ్రద్ధగా అనేక కార్యాలు చేసుకు వొచ్చాడు...."

హనుమంతుడు తెగ సిగ్గుపడి పోతున్నాడు.

"హనుమంతుడు సీతని చూసివచ్చి చల్లని వార్త చెప్పి నా ప్రాణాలు రక్షించాడు. లేకపోతే నేను ప్రాణాలు విడిచే వాడినే. నేను ప్రాణాలు విడిస్తే లక్ష్మణుడు కూడా ప్రాణాలు విడిచేవాడే; రఘువంశం అంతా సర్వనాశనమై పోయేదే. .... హనుమంతుడి వల్ల మా వంశం ధర్మం నిలిచింది. ...."

యుద్ధం గురించి ఆలోచిస్తోన్నప్పట్నించీ జానకికి రాముడి మీద చాలా కోపంగా వుంది. "ఎవరి వంశం ధర్మం వాళ్ళు నిలబెట్టుకుంటే గొప్ప గానీ...."

"బాగా అన్నావు. ఇతర సాయంతో నిలబడుతూ వుంటుంది కామాలు వీళ్ళ వంశం గొప్ప."

"వాళ్ళ కులం, గోత్రం కానివాళ్ళ సాయంతో .. "

రాముడు విచారిస్తూ —"..... ఇంత వుపకారం చేసిన వాడికి ... నేనేం ప్రత్యుపకారం చెయ్యగలను ? ఈ చింతతో నాకు సీత క్షేమ

(ఫుట్‌నోట్ : 513 వ పేజీ తరువాయి)

శ్రీరాముడు హనుమంతుణ్ణి "నువ్వు వుత్తమ సేవకుడివి .... నీలాగ యజమానికి విశ్వాసంతో, ఎక్కువ సేవచేసేవారే వుత్తములు"- అని పొగిడిన విషయం — ఏ పురాణ కాలక్షేపంలోనైనా నీరుపేదలు ఏంటే .... తప్పకుండా తమ యజమానులికి మరింత విశ్వాసంగా సేవ చెయ్యాలనే అభిప్రాయం ఏర్పర్చుకుంటారు. అంటే ఆ దోపిడీ ధర్మం — దాని ప్రయోజనం అది నెరవేర్చినట్టే.

సేవకులు చెయ్యవలసిన సేవ గురించేగానీ, వారికి యజమానులు ఇవ్వవలసిన ప్రతిఫలం గురించేమీ మాట్లాడలేదు కవిగారు. యజమానుల్లో మాత్రం వుత్తమత్వం, అధమత్వం లేవు. యజమాను లందరూ ఎప్పుడూ వుత్తములే.

సమాచారం విన్నానన్న సంతోషం కూడా లేకుండా వుంది...." — అని తల వాల్చాడు.

"అబ్బే ! నాకేమీ .. "

"హనుమంతుడికి ఆనందం కలిగించకపోతే నా మనసుకి తృప్తి వుండదు. .... అతడికి ఇప్పుడొక బహుమానం ఇస్తాను." – అన్నాడు రాముడు గంభీరంగా మందహాసంతో.

పండితులూ, పామరులూ అందరూ ఆశ్చర్యంగా, ఆతృతగా, కుతూహలంగా చూస్తున్నారు.

"ఏమిస్తా డంటావూ ?...."

"ఏమో మరి.... ఏవన్నా డబ్బుందేమో గుహలో...."

"ఆ సీత నగలున్నాయిగా.... అవే ఇచ్చేస్తాడు...."

వెనక వాళ్ళందరూ గుంపులు గుంపులుగా ముందుకు తోసుకొస్తున్నారు రాముడిచ్చే బహుమానం సరిగ్గా కనపడుతుందో లేదోనని.

నిద్రపోతోన్న వాళ్ళందరూ కొయ్యా చేతులూ పచ్చడై లబలబ లాడుతూ లేచారు.

రాముడిచ్చే బహుమతి ఏవిటో లక్ష్మణుడి కొక్కడికే తెలుసు. పంచవటిలో ఇల్లు కట్టినప్పుడు ఆ బహుమానం లక్ష్మణుడికి లభించింది.

రాముడు మందహాసంతో లేచి నిలబడి హనుమంతుడి వేపు చూశాడు. ఎందుకో, ఏవిటో తెలీకుండానే హనుమంతుడు తెల్లబోతూ లేచాడు.

రాముడు హనుమంతుడి చుట్టూ చేతులుచుట్టి వొకసారి కావిలించుకుని చప్పున చేతులు తీసేసి కూర్చున్నాడు.

"నా ఆలింగనం ఇస్తే, సర్వస్వం ఇచ్చినట్టే కదా హనుమంతుడా !" — అని గంభీరంగా చూశాడు.

హనుమంతుడు ఇంకా తెల్లబోతూనే వున్నాడు. నిరుత్సాహంగా నవ్వి వాగుపేపు చూస్తూ బుగ్గలు వుబ్బించాడు.

"ఆలింగనంలో సర్వస్వం వున్నట్టేనా ?" అని తర్క పండితులు ఆలోచనలో పడ్డారు.

"స్త్రీ - పురుషుల ఆలింగనం అయితే...." శృంగార పండితులు గొప్ప ఆశాభంగంలో పడ్డారు.

జనం తలగుడ్డలు దులుపుకుంటూ లేచారు.

"చాల్లే సంబడం. లేవండి ఇళ్ళకుపోదాం. ఇచ్చాళ్ళే మా గొప్ప బహుమానం...."

"సరేలే. ఇంకేవిస్తాడు ? .... మన్ను ...."

★

[త్వరలో "రామాయణ విషవృక్షం" ఆఖరి భాగం విడుదలవుతుంది.]

514

RSKO-B138

518

రామాయణ విషవృక్షం - 2

"వాల్మీకి భక్తులందరూ, వాల్మీకి విరజిమ్మిన 'కవితా సౌరభాలే' గాని, వాటిలో ఇమిత మైవున్న సామాజిక పక్షపాత నీతిదుర్గంధాలు గ్రహించలేరు. వారికి వాల్మీకి సృష్టించిన కవితా సరస్సులో తామర పువ్వులే గానీ, వాటి చుట్టూ పరుచుకున్న నాచుతెప్పలూ, నత్తగుల్లలూ కనపడవు."

* * *

"ప్రక్షిప్తాలు వున్న రామాయణానికీ, ప్రక్షిప్తాలు లేని రామాయణానికీ మూలకథలోగానీ, కథాస్వభావంలోగానీ తేడా ఏమీలేదు. ప్రక్షిప్తాలు వున్న రామాయణంకన్నా, ప్రక్షిప్తాలు లేని రామాయణం ఏ విధంగానూ, ఏ కోణంలోనూ విలువైంది కాదు.

* * *

"మానవ సమాజంలో సాహిత్యంలో వాస్తవ విరుద్ధమైన కల్పన ఎందుకు సృష్టి అయింది? కల్పనలో వాస్తవికతని ఎలా అర్థం చేసుకోవచ్చును."

* * *

"మార్క్సిస్టు విమర్శకుడు 'సంఘటనల్ని' తన దృక్పథంనించి చూడకుండా దేవుళ్ళని నమ్మే పండితుల దృక్పథంనించి, తపస్సులు చేసే మహర్షుల దృక్పథంనించీ చూస్తే, ఆ వ్యక్తి మార్క్సిస్టుగా 'ఫినిష్'అయిపోతాడు."

* * *

"విషవృక్షమే కాదు, ఇంకే వృక్షమైనా, ఏ గ్రంథమైనా, సమాజంలో ఒక వర్గానికే ప్రయోజనకరంగా వుండి, రెండోవర్గానికి వ్యతిరేకం అవుతుంది"

"రెండు వర్గాల శ్రేయస్సూ ఆశించే పుస్తకం ఏదీ వుండదా?" -- అంటే -- వుండదు. వర్గ భేదాలున్న సమాజంలో ఏదీ వుండదు"

Wrapper Printed at Swatantra Art Printers, Vijayawada-520004.

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RSKo 1 E138
పుస్తకం పేరు	తుమ్మలపల్లి కళావేదిక-2
తారీఖు	20/06/2023
ముందు అట్ట	ఉంది
వెనుక అట్ట	ఉంది
మొత్తం పేజీలు	207
పెద్ద సైజు పేజీలు	లేవు
ఖాళీ పేజీలు	1, 57, 180, 10, 42
లేని పేజీలు	లేవు
తయారు చేసినది	Lakshmi
పేజీలు విడదీసినది	Chaithanya
స్కాన్ చేసినది	JYOTHI
పరిక్ష చేసినది	అయింది
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	
పరిస్థితి	